# తెలుగు భాషా సాహిత్య సంస్కృతుల చరిత్ర

BRAOU

DR. B.R AMBEDKAR OPEN UNIVERSITY
UNIVERSITY - LIBRARY
CM0437

డా|| బి. ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం
హైదరాబాదు

**1994-95**

# ఐచ్ఛికాంశాలు : తెలుగు (మూడవ పాఠ్యాంశం)

CM-0437
31-3-97

## పాఠ్య నిర్మాతలు

డా. బూదరాజు రాధాకృష్ణ (సంపాదకులు)
డా. ఎన్. గోపి
ఆచార్య జి. నాగయ్య
డా.బి. భాస్కర చౌదరి
ఆచార్య కె.కె. రంగనాథాచార్యులు
ఆచార్య వి. రామకృష్ణ
డా. ఎన్.వి.ఎస్. రామారావు
ఆచార్య కేతు విశ్వనాథ రెడ్డి
డా. రావికంటి వసునందన్
డా. కె.ఎస్. రమణ

Dr. B.R.A.O.U. LIBRARY
Acc. No. CM-0437
Date 31-3-97
Call No 894.827
తెలుగు

ముఖచిత్రం
చంద్ర

BRAOU

బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం
హైదరాబాదు

పరిష్కృత ముద్రణ 1995
కాపీరైటు 1991 ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విశ్వవిద్యాలయం
అన్ని హక్కులూ విశ్వవిద్యాలయానివి. ఈ పుస్తకంలోని ఏ భాగం అయినా
ఉపయోగించుకుంటే, విశ్వవిద్యాలయం అనుమతి పొందాలి.
ఈ పాఠాలు సార్వత్రిక విశ్వవిద్యాలయం పాఠ్యప్రణాళికలో ఒక భాగం.
ఇతర వివరాలకు : డైరెక్టరు, డా॥ బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం
రోడ్ నెం. 46,
జూబ్లిహిల్స్, హైదరాబాదు – 500 033

ముద్రణ : చిత్రలిపి ప్రింటర్స్, హైదరాబాద్. ఫోన్ : 631001

# పరిచయం

భాషా సాహిత్యాల చరిత్ర సంస్కృతి చరిత్రలో భాగమే. ఈ మూటినీ సమన్వయించి వివరిస్తే తెలుగు జాతి చరిత్రను సమగ్ర దృష్టితో తెలుసుకోవటం సులభమవుతుంది. చాలా మంది సంస్కృతి, నాగరికతలను పర్యాయ పదాలుగా పరిగణిస్తుంటారు గాని వాటి మధ్య భేదముంది. తెలుగు సంస్కృతి అంతకన్నా విపులమైన సంకీర్ణమయిన భారతీయ సంస్కృతిలో అంతర్భాగమే. తెలుగువారి విలక్షణతలు ఇతర భారతీయులనూ, భారతీయ సంస్కృతి తెలుగు సంస్కృతినీ ప్రభావితం చేస్తుంటాయి. వర్తక వాణిజ్యాలు, తీర్థయాత్రలు, ఉద్యోగ విద్యలకోసం అన్యప్రాంతాలకు ప్రయాణించటం, జాతీయ వార్తా ప్రసారాలు మొదలైన అనేక కారణాల వల్ల జాతులు పరస్పర ప్రభావితాలవుతాయి. ఫలితంలో భాషల్లో, సాహిత్యాల్లో, సంస్కృతుల్లో సంకీర్ణత తప్పదు. భిన్న సంస్కృతుల సంసర్గంవల్ల మిశ్ర సంస్కృతి ఏర్పడుతుంది. అంతర్భాగాలెన్ని ఉన్నా, భేదభావాలూ లక్షణాలు ఉన్నా మిశ్ర సంస్కృతి సంకీర్ణమవుతుంది గాని శిథిలం కాదు. ఈ పరస్పర ప్రభావాలను స్థూలంగానయినా పరిచయం చేయటానికే ఈ పాఠ్యాంశంలో మొదట భారతీయ భాషలను గురించి, సాహిత్యాలను గురించి, సంకీర్ణ సంస్కృతిని గురించి బహుభాషితను గురించి ప్రస్తావించాం.

నగరాల్లో ఉన్న వాళ్ళే నాగరకులనేది కేవలం వ్యుత్పత్తి కోసం చెప్పేమాట. ఆటవికులకూ, గ్రామీణులకూ నాగరకత లేదనుకోవటం, సంస్కృతి లేదనుకోవటం భ్రమ. గిరిజనుల భాషలకు లిపి లేఖనాలు లేనంతమాత్రాన వారి సంస్కృతి వికసించలేదనుకోవటం భ్రాంతి. ఇప్పుడు మనం 'జానపదు'లని వ్యవహరించే వాళ్ళు ఒక నాటి నాగరకులే. 'జనపదం' అంటే చాలా మంది ప్రజలు నివసించే ప్రదేశమనే అర్థం. ఈ కాలానికి ఆ అర్థం మారి విద్యావంతులు కాని గ్రామీణులకే అర్థం వచ్చినా, అది దృష్టిభేదం వల్ల వచ్చిన అభిప్రాయమే గాని మరొకటి కాదు. ఇప్పటి గిరిజన భాషల నుంచే ఉన్నతోన్నతమయిన సంస్కృతం వంటి గొప్ప భాషలు ఎన్నో నేర్చుకున్నాయి. ఇప్పటి కిరాతులనుంచీ, నిషాదుల నుంచీ ద్రావిడులూ ఆర్యులూ ఎంతో నాగరకతను సంపాదించుకున్నారు. జాతులను, భాషలను గురించి సంతులిత దృక్పథం కలిగించాలనే భావంతోనే భిన్న భాషా కుటుంబాలనూ, వాటి ఈ గడ్డ మీద వాడుక చేసిన విభిన్న జాతులనూ పరిచయం చేశాం.

భాష వాగ్రూపం నుంచి లిఖిత రూపానికి వచ్చిన తరవాత సాహిత్య భాషగా అభివృద్ధమవుతుంది. విజ్ఞాన వికాసాల ఫలితంగా శాస్త్రభాషగా పర్యవసిస్తుంది. అయితే ఈ రూప పరిణామం, దశాభేదం అన్ని జాతుల్లో దేశాల్లో భాషల్లో ఒకే తీరునగాని ఒకే సమయంలో గాని జరగవు. చరిత్ర గతిలో భౌగోళిక ప్రభావం వల్ల, సమాజ లక్షణాల వల్ల, ఉత్పత్తి సాధనాల వల్ల, ఆర్థిక ప్రయోజనాలను పురస్కరించుకొని ఆయా సమయాల్లో మార్పులు వస్తుంటాయి. రాజకీయ సిద్ధాంతాల ప్రాబల్యమూ, సమాజంలోని అంతర్వైరుధ్యాల ప్రతిస్పందనా భాషనూ, సాహిత్యానీన, సంస్కృతినీ రూపొందిస్తాయి. ఈ మూడూ దేనికది విడివిడిగా ఉండలేదు. అలా వాటికి అస్తిత్వం ఏదు - ఉండదు. విభిన్న శక్తుల పరస్పర సంఘర్షణ ఫలితంగా సమాజం పురోగమిస్తుంది. నిన్నటి అనుభవాల నుంచి నేటి ఆలోచనలుద్భవిస్తాయి. నేటి ప్రయత్నాలు భవిష్యత్తుకు రూపమిస్తాయి. ఆయా రాజకీయ కుల, మత, ఆర్థిక, సామాజిక కారణాల పరస్పర ప్రభావాలతో చరిత్ర పుడుతుంది. ఏ కాలంలో ఏయే కారణాల వల్ల తెలుగుజాతి నివాస భూమి విస్తృతిలో, భాషలో, సాహిత్యంలో, సంస్కృతిలో ఏయే పరిణామాలు వచ్చాయో నిరూపించటమే ఈ పాఠ్యాంశంలో సాధించిన విషయం.

భాషా చరిత్రకారుల యుగవిభజన ప్రణాళిక ఒక విధంగా ఉంటే, సాహిత్య చరిత్ర రచయితలు మరో విధమైన యుగవిభజన పద్ధతిని పాటిస్తున్నారు. రాజవంశాల చరిత్రనే రాజకీయ చరిత్రగా పరిగణించిన వాళ్ళు చాలా మంది ఉన్నారు. సాంఘిక చరిత్ర రచనకు కావలసిన ముడి సరుకు దొరకలేదని విచారించిన వాళ్ళున్నారు. సంగీతం, నాట్యం, శిల్పం, చిత్రలేఖనం వంటి లలితకళలను గురించి విడివిడిగా చర్చించిన

BRAOU

వాళ్ళున్నారు. భిన్నాభిప్రాయాలను పరిశీలించి, సమన్వయ దృష్టితో చూసినప్పుడు భాషా సాహిత్య సంస్కృతుల వికాసాన్ని 'స్థూలంగా' మూడు దశలుగా (యుగాలుగా) విభజించాలని భావించాం : పూర్వయుగం (క్రీస్తు శకం 1000 దాకా), మధ్య యుగం (క్రీ.శ. 1800 దాకా), ఆధునిక యుగం (1800 నుంచి నేటి దాకా). ఈ విభజన ప్రణాళిక సర్వోత్తమమని కాక, ఈ పాఠ్యాంశ ప్రయోజన సాధనకు ఉపకరిస్తుందని అనుసరించాం. చివరి దశను తప్ప స్పష్టత కోసం మిగతా రెండు దశలనూ ప్రథమ, ద్వితీయ విభాగాలుగా ప్రస్తరించాం. విషయక్రమాన్ని పరిశీలించండి.

ఆయా విషయాల్లో ప్రత్యేక కృషి చేసి, బహుగ్రంథ రచన చేసిన పండితులను ఎంపిక చేసి పాఠ్యాంశ రచన చేయించాం. ఒక్కో వ్యక్తికి ఒక్కో శైలి ఉంటుంది. ఒక్కో రచనా పద్ధతి ఉంటుంది. ఎవరి భాషా విశేషం వారిది. మహత్తరమైన మన సంస్కృతిలో భేదాలున్నా, అంతర్విరుధ్యాలున్నా అది ఏకంగా సంకీర్ణంగా ఉన్నట్లే. ఈ పాఠ్య గ్రంథంలో పూసల్లో దారం లాగా ఏకత్వమున్నా, సంకీర్ణత ఉన్నా వైవిధ్యం కూడా ఉంది; ఉండాలని అపేక్షించాం. భిన్న ప్రాంతాలకు చెందిన భిన్న వ్యక్తులు, భిన్న విధ నైపుణ్యాలతో అభిరుచులతో భాషా రూపభేదాలతో రచించటంలో అబ్బురం లేదు - వైవిధ్యం చూపకపోతేనే ఆశ్చర్యపడాలి. బహు పండిత కృతమైన సంకలన గ్రంథం అలాగే ఉంటుంది. అధ్యాయులు గుర్తించగలరు.

చరిత్ర గ్రంథాల్లో గతాన్ని వివరించి భవిష్యత్తును సూచించేవి చాలా తక్కువ. శతాబ్దాల కాలగమనంలో భాషా సాహిత్య సంస్కృతుల్లో వచ్చిన క్రమం పరిణామాన్ని వివరించిన తరవాత, వాటిని ఇతోధికంగా అభివృద్ధికి తేవాలంటే నవీకరించాలి కాబట్టి, నవీకరణం అంటే ఏమిటో, అదెల సాధ్యమో, అందుకు చేసే ప్రయత్నాలు ఎదుర్కోవలసిన సమస్యలూ ఏమిటో సూచించాం. గమనించండి.

సంపాదకుడు.

BRAOU

## ఖండాల క్రమం


| | | | |
|---|---|---|---|
| ఖండం | 1 | భారతీయ భాషా సాహిత్య సంస్కృతుల పరిచయం | • |
| ఖండం | 2 | తెలుగు భాషా సాహిత్య సంస్కృతుల అధ్యయన నేపథ్యం | • |
| ఖండం | 3 | తెలుగు భాషా చరిత్ర | • |
| ఖండం | 4 | తెలుగు సాహిత్య చరిత్ర | • |
| ఖండం | 5 | తెలుగు సంస్కృతి చరిత్ర | • |
| ఖండం | 6 | తెలుగు భాషా సాహిత్య సంస్కృతులు – ప్రధాన పరిణామాలు | • |


BRAOU

# విషయ క్రమం


**ఖండం 1 : భారతీయ భాషా సాహిత్య సంస్కృతుల పరిచయం** 1 – 42

భాగం 1 : భాష, చరిత్ర, సంస్కృతి 3

భాగం 2 : భారతీయ సమాజంలోని సంకీర్ణత – భాషలు, భాషా కుటుంబాలు 11

భాగం 3 : భారతీయ సమాజంలోని సంకీర్ణత – సాహిత్య సంప్రదాయాలు 25

భాగం 4 : భారతీయ సమాజంలోని సంకీర్ణత – సంస్కృతి 33

**ఖండం 2 : తెలుగు భాషా సాహిత్య సంస్కృతుల అధ్యయనం నేపథ్యం** 43 – 85

భాగం 5 : తెలుగు జాతికీ, భాషకూ, దేశానికీ ఉన్న పేర్ల చరిత్ర 45

భాగం 6 : ఆంధ్రప్రదేశ్ భౌగోళిక స్వరూప చరిత్ర 52

భాగం 7 : ఆంధ్రప్రదేశ్ భాషల వ్యాప్తి 65

భాగం 8 : అధ్యయానికి ఆధారాలు 71

భాగం 9 : దశల విభజన 81

**ఖండం 3 : తెలుగు భాషా చరిత్ర** 87 – 145

భాగం 10 : తెలుగు భాష – పూర్వ దశ I (క్రీ.పూ. 200-క్రీ.శ. 600) 89

భాగం 11 : తెలుగు భాష – పూర్వ దశ II (క్రీ.పూ. 600-క్రీ.శ. 1000) 99

భాగం 12 : తెలుగు భాష – మధ్యకాలీన దశ I (క్రీ.పూ. 1000-క్రీ.శ. 1600) 107

భాగం 13 : తెలుగు భాష – మధ్యకాలీన దశ II (క్రీ.పూ. 1600-క్రీ.శ. 1800) 113

భాగం 14 : తెలుగు భాష – ఆధునిక దశ (క్రీ.శ. 1800 నుండి నేటి దాక) 121

భాగం 15 : తెలుగు నవీకరణ ప్రయత్నాలు 137

**ఖండం 4 : తెలుగు సాహిత్య చరిత్ర** 147 – 229

భాగం 16 : తెలుగు సాహిత్యం – పూర్వ దశ I (క్రీ.పూ. 200-క్రీ.శ. 600) 149

భాగం 17 : తెలుగు సాహిత్యం – పూర్వ దశ II (క్రీ.పూ. 600-క్రీ.శ. 1000) 155

భాగం 18 : తెలుగు సాహిత్యం – మధ్యకాలీన దశ I (క్రీ.పూ. 1000-క్రీ.శ. 1600) 163

భాగం 19 : తెలుగు సాహిత్యం – మధ్యకాలీన దశ II (క్రీ.పూ. 1600-క్రీ.శ. 1800) 177

భాగం 20 : తెలుగు సాహిత్యం – ఆధునిక దశ (క్రీ.శ. 1800 నుండి నేటి దాక) 191


BRAOU

**ఖండం 5 : తెలుగు సంస్కృతి చరిత్ర** 231 – 333

భాగం 21 : తెలుగు సంస్కృతి – పూర్వ దశ I (క్రీ.పూ. 200–క్రీ.శ. 600) 233

భాగం 22 : తెలుగు సంస్కృతి – పూర్వ దశ II (క్రీ.పూ. 600–క్రీ.శ. 1000) 245

భాగం 23 : తెలుగు సంస్కృతి – మధ్యకాలీన దశ I (క్రీ.పూ. 1000–క్రీ.శ. 1600) 261

భాగం 24 : తెలుగు సంస్కృతి – మధ్యకాలీన దశ II (క్రీ.పూ. 1600–క్రీ.శ. 1800) 281

భాగం 25 : తెలుగు సంస్కృతి – ఆధునిక దశ (క్రీ.శ. 1800 నుండి నేటి దాక) 293

**ఖండం 6 : తెలుగు భాషా సాహిత్య సంస్కృతులు సమన్వయ చరిత్ర** 335 – 341

భాగం 26 : ప్రధాన పరిణామాలు 337


BRAOU

# ఖండం 1 భారతీయ భాషా సాహిత్య సంస్కృతుల పరిచయం

వైశాల్యాన్ని బట్టీ, జాతి మత భాషాభేదాలను బట్టీ భారతదేశాన్ని ఒక ఉపఖండంగా పరిగణించవచ్చు. రష్యాను మినహాయిస్తే, యూరప్ ఖండమంత విశాలమైంది భారతదేశం. భాషా సాహిత్య సంస్కృతుల ప్రాచీనతలో భారతదేశం యూరప్, ఆస్ట్రేలియా, ఆఫ్రికా ఖండాల కంటే ముందుంది.

మనకు చరిత్ర తెలిసినప్పటి నుండి అంటే కనీసం నాలుగువేల సంవత్సరాల నుండి భారతదేశం భిన్న జాతులు, బహుభాషలు, విభిన్న మతాలు, వివిధ కులాలతో కూడుకున్న సమాజంగా కన్పిస్తుంది. ఈ భిన్నత్వం వల్లనే భారతీయ సమాజాన్ని సంకీర్ణ సమాజమని అంటారు. నీగ్రాయిడ్, ఆస్ట్రలాయిడ్, ద్రవిడియన్, మంగోలాయిడ్, ఇండో ఆర్యజాతుల వారు మన దేశంలో ఉన్నారు. ఈ జాతుల ప్రజలు 1652 మాతృ భాషలను మాట్లాడుతున్నారు. ఈ 1652 మాతృభాషల్లో అక్షర భాషల కంటే నిరక్షర భాషలు ఎక్కువ. హింది,తెలుగు, తమిళం వంటి భాషలకు లిపి ఉండటం వల్లా, ఆ కారణంగా వీటిలో కొన్ని శతాబ్దులుగా గ్రంథరచన అంటే లిఖిత సాహిత్యం ఉండటం వల్ల వీటిని అక్షర భాషలంటారు. కొలామీ, కొండ, గోండీ, గదబ, సవర, సంతాలీ వంటి దాదాపు 400 పైగా భాషలకు లిపి లేకపోవటం వల్లా, వీటిలో లిఖిత సాహిత్యం లేకపోవటం వల్లా వీటిని నిరక్షర భాషలంటారు. మనదేశంలో అక్షర భాషలకంటే నిరక్షరభాషలు ఎక్కువ. అయితే అక్షర భాషలను మాట్లాడే ప్రజలు దేశ జనాభాలో 97 శాతమైతే నిరక్షర భాషలు మాట్లాడే వారి శాతం 3 మాత్రమే. ఈ 3 శాతం నిరక్షరభాషలు మాట్లాడే ప్రజలు గిరిజనులు. 97 శాతం గిరిజనేతర ప్రజలు మాట్లాడే ప్రధాన భాషలు 30. వీటిలో 16 భాషలను రాజ్యాంగం 8వ షెడ్యూలులో పేర్కొన్నారు. ఈ 16 భాషల్లో తెలుగు ఒకటి. తెలుగు భాషా సాహిత్య సంస్కృతులకు దాదాపు రెండు వేల ఏళ్ళ చరిత్ర ఉంది.

జాతులు, భాషలు మాదిరే మనదేశంలో భిన్న మతాలు, విభిన్న కులాలు కన్పిస్తాయి. అంతేకాదు భిన్న జాతి ప్రజల సంస్కృతిలో కూడా ఎంతో వైవిధ్యం కన్పిస్తుంది. ప్రాంతీయ భేదాలు కన్పిస్తాయి. పరస్పర ప్రభావాలు కనిపిస్తాయి. అయినా ఈ విభిన్నతలో ఏకత్వం ఉండటం వల్ల, భారతీయ సంస్కృతి తన ఏకత్వాన్ని ఒకవైపు నిలుపుకుంటూనే, మరోవైపు అనేక ప్రాంతీయ భిన్న సంస్కృతులకు దోహదం చేస్తూ వచ్చింది. చారిత్రక క్రమంలో పెరుగుతూ వచ్చింది.

సకల మానవ సంస్కృతిలో, భారతీయ సంస్కృతి ఒక అంతర్భాగమైనట్లే భారతీయ సంస్కృతిలో ఒక ప్రాంతీయ సంస్కృతి అయిన తెలుగు కూడా ఒక అంతర్భాగం; విడదీయరాని అంతర్భాగం.

తెలుగు ప్రజల భాషా చరిత్రనూ, వారి సాహిత్యచరిత్రనూ, సంస్కృతి చరిత్రనూ మనం ఈ దృష్టితో పరిశీలించవలసివచ్చినప్పుడు, స్థూలంగా నైనా ఈ ప్రాంతీయ చరిత్రను పరిపుష్టం చేసిన భారతీయ భాషా సాహిత్య సంస్కృతులను అధ్యయనం చేయవలసి ఉంటుంది.

ఈ మొదటి ఖండాన్ని ఈ దృక్పథంతోనే మీకు పరిచయం చేస్తున్నాం. ఈ ఖండంలో నాలుగు భాగాలున్నాయి. అవి: 1. భాష, చరిత్ర, సంస్కృతి. 2. భారతీయ సమాజంలోని సంకీర్ణత, భాషలు, భాషా కుటుంబాలు. 3. భారతీయ సమాజంలోని సంకీర్ణత; సాహిత్య సంప్రదాయాలు. 4. భారతీయ సమాజంలోని సంకీర్ణత, సంస్కృతి. మొదటి భాగంలో భాషకూ, చరిత్రకూ, సంస్కృతికీ నిర్వచనాలు సమకూర్చటమే కాకుండ వాటి లక్షణాలను, వాటి అధ్యయన ప్రయోజనాలనూ వివరించాము. రెండవ భాగంలో భారతీయ సమాజంలోని వివిధ భాషలనూ, వంశ లక్షణాలనుబట్టి అవి చేరే భాషా కుటుంబాలనూ, ఆయా కుటుంబాలలోని భాషలనూ పరిచయం చేశాము. మూడవ భాగంలో భారతీయ లిఖిత సాహిత్య సంప్రదాయాలను విశ్లేషించాము. నాల్గవ భాగంలో భారతీయ సంస్కృతి వైవిధ్య భరితమనీ ఆ వైవిధ్యంలో ఒక ఏకసూత్రత ఉందనీ, అదే భిన్నత్వంలో ఏకత్వమనీ నిరూపించాము.

ఈ నాలుగు భాగాలూ, మీరు ముమ్ముందు చదవబోతున్న ఖండాలకు నేపథ్యంగా పనికి వస్తాయి. అంతేకాదు తెలుగు భాషా చరిత్ర సంస్కృతుల పరిణామానికి దారి తీసిన సంకీర్ణ పరిస్థితులను మీరు అర్థం చేసుకోవటానికి ఈ ఖండంలోని భాగాలన్నీ సహకరిస్తాయి.



BRAOU

# భాగం–1 భాష, చరిత్ర సంస్కృతి

## విషయ క్రమం

1.0 లక్ష్యాలు
1.1 పరిచయం
1.2 భాష ప్రయోజనం
**అవగాహన ప్రశ్న – 1**
1.3 చరిత్ర నిర్వచనం, పఠన ప్రయోజనం
**అవగాహన ప్రశ్న – 2**
1.4 సంస్కృతి నిర్వచనం, స్వభావం, వైశిష్ట్యం
**అవగాహన ప్రశ్న – 3**
1.5 భాష, చరిత్ర, సంస్కృతి – వీటి పరస్పర సంబంధం
**అవగాహన ప్రశ్న – 4**
1.6 సారాంశం
అవగాహన ప్రశ్నలకు జవాబులు
చదవదగిన పుస్తకాలు
మాదిరి పరీక్షా ప్రశ్నలు

## 1.0 లక్ష్యాలు

ఈ భాగం చదివి, అవగాహన చేసుకున్న తర్వాత మీరు ఈ కింది అంశాలను విశ్లేషించగలుగుతారు.

- భాష నిర్వచనం, స్వభావం మానవ సమాజానికి గల భాష ఆవశ్యకత.
- చరిత్ర లక్షణాలు, చరిత్ర నిర్మాతలు, చరిత్ర పఠన ప్రయోజనం
- సంస్కృతి నిర్వచనం స్వభావం, దాని వైశిష్ట్యం, ప్రాముఖ్యం
- భాషా చరిత్ర సంస్కృతుల మధ్య పరస్పర సంబంధం, అవి మానవ సమాజాన్ని అభివృద్ధి పరచే విధం

BRAOU

## 1.1 పరిచయం

భాష భావప్రకటన సాధనమని మనకు తెలుసుకదా. భాష ద్వారానే సంస్కృతికి పట్టుగొమ్మలైన సమస్త సాహిత్యమూ, కళలూ, శాస్త్రవిజ్ఞానమూ వెల్లడయ్యాయి. అవి భావితరాలకు మౌఖిక భాష ద్వారానో, లిఖిత భాష ద్వారానో అందుతున్నాయి. భాషకు చరిత్ర ఉన్నట్లే, భాష ద్వారా తెలిసే సాహిత్యానికి, సంస్కృతికి చరిత్ర లుంటాయి. ఈ మూడింటిలో దేని చరిత్ర దానికి అధ్యయన సౌలభ్యంకోసం ఉండవచ్చు. కాని ఈ మూడింటి మధ్య పరస్పర సంబంధాలు, అన్యోన్య ప్రభావాలు తప్పని సరిగా ఉంటాయి. ఈ విషయాలను వివరంగా తెలుసుకుందాం.

## 1.2 భాష ప్రయోజనం

మానవుడు కనుగొన్న అతి ముఖ్యమైన అంశాలలో భాష ఒకటి. మానవ సమాజ పరిణామ క్రమంలో మొదట భాష లేదని మనకు తెలుసు. సంజ్ఞలద్వారా, శబ్దాల ద్వారా తమ అభిప్రాయాలను, భావాలను వ్యక్తం చేసుకొనే వారు. ఆ తర్వాత శబ్దాలకూ, ధ్వనులకూ వాటి అర్థాలకూ సంబంధం నియతంగా కల్పించుకొన్నారు. అదే భాష. అంటే వాగ్రూపమే భాష. ఈ వాగ్రూపమైన భాష, ఆహారాన్ని ఉత్పత్తి చేసుకొంటూ, నియంత్రించుకుంటూ, క్రమేపి ఆలోచించగలిగిన జంతువుగా మానవుడు మారుతున్న దశలో పుట్టింది. మానవజాతి భాషను ఏర్పరచుకోడానికి – వివిధ ప్రాంతాల్లో, వేర్వేరు భాషల నిర్మాణానికి ఎన్ని వందలవేల సంవత్సరాలు పట్టిందో చెప్పలేము. మొదట్లో భాష మౌఖికం. అంటే లిపి లేదన్న మాట. భాషకు లిపిని ఏర్పరచుకోడానికి మరికొన్ని వందలవేల సంవత్సరాలు గడిచి ఉంటాయి.

భాషా నిర్మాణం, లిపి నిర్మాణం – ఈ రెండూ సమాజం పెంపొందుతున్న కొద్దీ మానవ సమాజ అవసరాలకు, ప్రయోజనాలకు అనుగుణంగా రూపొందుతూ వచ్చాయి. భాష ప్రయోజనం భావ ప్రకటన. సమాజంలో వస్తూత్పత్తి పెరిగి, ఇతరులతో ఆ ఉత్పత్తిని మారకం చేసుకొంటున్నప్పుడు, నిత్య జీవితంలో ఒకరితో ఒకరు ఈ ఉత్పత్తి, మారక సంబంధాల గూర్చి మాట్లాడుకోడానికి భాష అవసరమై, దాని పుట్టుకకు దారి తీసి ఉంటుంది. ఆహారాన్ని ఉత్పత్తిచేసుకోవడం, దానిని నియంత్రించుకోవడంవల్ల మానవుడు క్రమేపీ ఆలోచించగల జంతువుగా మారుతున్న దశలోనే భాష పుట్టింది. ఆదిమ సమాజాల్లో భాషకున్న ప్రయోజనం చాలా తక్కువ అనే చెప్పాలి. నిత్య జీవితంలో ఎదురయ్యే సమస్యలు, అవసరాలు తీర్చుకోడం కోసమే మానవుడు భాషను ఉపయోగించుకొంటాడు. ఆ దశలో మానవ సమాజపు అవసరాలూ, ఉత్పత్తీ – రెండూ తక్కువగానే ఉండేవి. వ్యవసాయం నేర్చుకొని స్థిర నివాసం ఏర్పరచుకొన్నాక, మనిషికి కొంత తీరికా, వెసులు బాటూ కలిగి సృజనాత్మకంగా ఆలోచించడం, ఆ ఆలోచనలకు తగిన వాగ్రూపం ఇవ్వడంలో భాష స్థాయి పెరిగింది. ప్రయోజనమూ మారింది. ప్రకృతిని చూసి తన్మయత్వం చెందటమూ, ప్రకృతి శక్తులను అర్థం చేసుకొనే జ్ఞానంలేక వాటిని ఆరాధించడమూ, వాటికి మానవాతీత శక్తులు ఆపాదించడమూ, వాటిని కీర్తించడమూ జరిగింది. అంటే మానవుడికి సమాజంలో లభించిన తీరుబాటు ఈ విధమైన సృజనాత్మకతకు దోహదం చేసిందన్నమాట. ఇందులో నుండే మామూలు జీవనం కోసం పాటుపడుతూ వాడుకొనే భాషకాక, మరింత కళాత్మకంగా దాన్ని పెంపొందించుకొని ఉంటాడు. అందువల్లనే, తన తరంలో పొందుపరచుకొన్న విజ్ఞానాన్నీ, కళలనూ, వారసత్వాన్నీ రాబోయే తరాలవారికి అందించడం, మౌఖికంగా సాధ్యమైనా, అది శాశ్వతంకానేరదు. అందుకనే మౌఖికభాషాదశ నుండి మానవుడు లిపి ద్వారా లిఖితభాష దశను చేరుకున్నాడు. భాష పరిణామంలో ఇదిఒక పెద్ద అంగం. శబ్దాలకు అనువైన గుర్తులను రాతలో ఏర్పరచుకోడంలో లిపి సాధ్యమయింది. మౌఖికభాష నుండి లిఖిత భాషకు మారుతున్నప్పుడు సహజంగానే కొన్ని మార్పులు భాషలో వస్తాయి. అయితే ఈ మార్పులు కొద్దిగా ఉన్నపుడు, రెంటి మధ్యా తేడా ఎక్కువగా లేనపుడు, భాషా ప్రయోజనం సమాజంలో ఎక్కువ మందికి కలుగుతుంది. సమాజ పరిణామంలో ఈతేడా ఒక దశలో మరింత పెరిగి, లిఖిత భాషపై యాజమాన్యం, సంఘంలో కొద్ది మందికే పరిమితమైనపుడు భాష ప్రయోజనం కూడ మొత్తం సమాజానికి కాక, కొందరికే పరిమితమైంది.

BRAOU

**అవగాహన ప్రశ్న – 1**

భాషను నిర్వచించి, దాని ప్రయోజనాన్ని 10 వాక్యాల్లో తెల్పండి.

## 1.3 చరిత్ర నిర్వచనం, పఠన ప్రయోజనం

చరిత్రను ఎన్నో విధాల నిర్వచించారు. గతకాలపు మానవాభ్యుదయాన్ని వివరించేది చరిత్రగా కొందరి అభిప్రాయమైతే, మరికొందరు మానవ సమాజం అనేక దశల్లో ఎలా నిర్మించబడిందీ, ఆయా దశల్లో ఏ విధంగా మారుతూ వచ్చింది తెలియచేసేది అన్నారు. ఏమైనా గతంలో జరిగిన రాజకీయ ఘటనలను, రాజవంశాల చరిత్రను తెలిపేది మాత్రమే చరిత్ర కాదన్న విషయం నేడు అందరూ అంగీకరించిన అంశం. గత కాలపు చారిత్రక ఘటనల సమాహారం ఒక్కటే చరిత్ర కాదు. కాలక్రమానుగతంగా, సమాజంలో వస్తున్న ఉత్పత్తి సాధకాలలోని మార్పులను,ఉత్పత్తి శక్తుల మధ్య సంబంధాలను వివరించేది చరిత్రగా డి.డి. కోశాంబి నిర్వచించారు. అంటే సామాజిక అంతర్గత సంబంధాలను వివరించేది చరిత్ర. రాజుల పేర్లు, రాజవంశాల పేర్లు, వాటికి సంబంధించిన

వివరాలు తెలియకున్నా. ఉత్పత్తి సాధనాలు, ఉత్పత్తి శక్తుల సంబంధాలు గూర్చి తెలుసుకొంటే, ఆ సమాజ చరిత్ర, ఆ దేశ చరిత్ర స్పష్టంగా తెలుస్తాయి. దీన్ని బట్టి సమాజపు ఆర్థిక నిర్మాణం, అది పునాదిగా ఉన్న సమాజం – అందులో భాగాలైన రాజ్యం, ప్రభుత్వం, సాహిత్యం, కళలు, తత్వశాస్త్రం మొదలైన అంశాలను అవగతం చేసుకోవచ్చు. సమాజ స్వభావం తెలుసుకోవచ్చు. ఆ మానవ సమాజం ఒక ఉత్పత్తి దశ నుండి, మరో దశకు ఎలా చేరుకుంటుందీ, ఈ విధమైన విశ్లేషణ వల్ల తెలుసుకోవచ్చు. చరిత్ర గమనాన్ని శాస్త్రీయంగా అర్థం చేసుకోవాలంటే ఇదే మార్గమనిపిస్తుంది.

ఆదిమసమాజంలో ఆహారాన్ని సేకరించే దశనుండి, ఆహారాన్ని ఉత్పత్తి చేసే దశకు మానవుడు చేరుకోడంలో, ఉత్పత్తి సాధనాల్లో వచ్చిన మార్పుల వల్ల, భూమి సాగుచేసుకోడానికి, భూమిపై యాజమాన్యాన్ని పొందడానికి చేసిన ప్రయత్నాలు సమాజాన్ని చిన్న చిన్న రాజ్యాల అవతరణ దశకు చేర్చాయి. ఈ విధంగా పరిశీలిస్తూపోతే, శాస్త్ర, సాంకేతిక విజ్ఞానం పెరిగి, ఉత్పత్తి క్రమంలో గణనీయమైన మార్పులు సంభవించి, డబ్బు ప్రధానమైన చెలామణీగా రూపొంది, సమాజంలో వ్యాపార, వాణిజ్యవర్గాల ప్రాబల్యం పెరిగి, అంతకు ముందున్న భూస్వామ్య శక్తుల అధికారం, బలం క్షీణించి, కొత్త సామాజిక వ్యవస్థకు –పెట్టుబడిదారీ వ్యవస్థకు సమాజం రూపాంతరం చెందడం గమనించగలం. అదే క్రమంలో పెట్టుబడిదారీ వ్యవస్థలోనే వైరుధ్యాలవల్ల అది క్షీణించి, సామ్యవాద వ్యవస్థవైపు సమాజం పురోగమించడం కూడా సమకాలీన ప్రపంచ చరిత్రలో జరుగుతున్నదే. అయితే కేవలం ఆర్థిక శక్తులు సమాజాన్ని పూర్తిగా మారుస్తాయన్న సిద్ధాంతాన్ని అర్థం చేసుకోడంలో, అన్వయించుకోడంలో జాగ్రత్త వహించాలి. యాంత్రికమైన సిద్ధాంతాల అన్వయం సరికాదు. సాంఘికశక్తులు, ఆర్థిక పరిస్థితులవల్ల యాంత్రికంగా నిర్ధారింపబడతాయని పూర్తిగా గీతగీచినట్లు చెప్పడం కష్టం. చరిత్ర చోదక శక్తులన్నింటినీ దృష్టిలో ఉంచుకోవాలి. ఇది ముఖ్యంగా భారతదేశ చరిత్ర విషయంలో గమనించవలసిన అంశం. భారతదేశంలాంటి విశాల భూభాగంలో నెలకొని ఉన్న భౌగోళిక పరిస్థితులు, వాతావరణ స్థితి గతులు, ప్రజలపై మత, కుల వ్యవస్థల పట్టు మొదలైనవి విస్మరించదగిన అంశాలు కావు. సమాజం ఒక ఉత్పత్తి దశ నుండి మరొక దశకు మారుతున్న తరుణంలో, పాతవ్యవస్థ తాలూకు సామాజిక అంశాలు – మతం, సంప్రదాయం మొదలైన భావజాలం, ఇంకా తన ప్రభావాన్ని కోల్పోనపుడు, సమాజంలో మార్పు కుంటుపడుతుంది. స్తబ్దత ఏర్పడుతుంది. క్షీణతకు దారి తీస్తుంది. అందుకని సమాజ పరిణామం అన్ని వేళల్లోనూ సరళరేఖలా సాగిపోదు. వర్తులాకారంలో అంతకంటే సాగదు. మామూలు మాటల్లో చెప్పాలంటే ఒక ఎగుడుదిగుడు పద్ధతిలో సాగుతుంది.

చరిత్రకారుడు చేయాల్సింది గతాన్ని గుడ్డిగా ప్రేమించడమూ కాదు, గతాన్నుంచి విముక్తి చెందడమూ కాదు. గతాన్ని క్షుణ్ణంగా అర్థం చేసుకోవాలి. ఆ అవగాహన ద్వారా వర్తమానాన్ని అధ్యయనం చేయాలి. వర్తమాన సమస్యల లోతుపాతులను సరిగ్గా అర్థం చేసుకొంటే, గతాన్ని సమ్యక్ దృష్టితో పరిశీలించడానికి వీలవుతుంది. అప్పుడు సరైన చరిత్ర రచన సాధ్యమవుతుంది.

గతం, వర్తమానం – ఈ రెంటి మధ్యగల పరస్పర సంబంధాన్ని అర్థం చేసుకునే క్రమం ద్వారా, గత, వర్తమానాల గూర్చి చరిత్రకారుడు ఖచ్చితమైన అభిప్రాయాలు వెల్లడించాల్సి ఉంటుంది. ఇదే చరిత్ర పఠన ప్రయోజనం కూడ. చరిత్ర భవిష్యత్ సమాజ పరిణామానికి పునాదికావాలి. పరస్పరం సంఘర్షించిన శక్తులలో చరిత్ర పుడితే, ఆ సంఘర్షించిన శక్తులేమిటో తెలుసుకోవాలి. సంఘర్షణ కారణాలు గ్రహించాలి. దాన్ని బట్టి భవిష్యత్ చరిత్రకు బంగారు బాటలు వేసుకోవాలి.

చరిత్ర విశాలమైన పరిధి కలది. సంస్కృతిని, భాషను, సాహిత్యాన్ని, రాజ్యం–దానిలోని భాగాల్ని అన్నిటినీ తన విస్తృత పరిధిలో ఇముడ్చుకుంటుంది. అన్ని శాస్త్రాలూ, తాత్వికభావనలూ, కళలూ – ఒకటేమిటి – సమస్త మానవ శ్రమనూ, ప్రయత్నాలనూ ప్రతిబింబిస్తుంది.

చరిత్రను ప్రజలే నిర్మిస్తారు. ఉత్పత్తి క్రమంలో మానవుడిదే పైచేయి. చరిత్ర పూర్వయుగం నుండి, ప్రాథమిక పరికరాలను కనిపెట్టినప్పటినుండి, ప్రకృతిలో నిరంతరం విశ్రాంతిలేని పోరాటం నడుపుతూ, ప్రకృతి శక్తులను జయించి లోబరచుకుంటూ, తనకూ, తన చుట్టూ ఉన్న సమాజానికీ సుఖ జీవితంకోసం మానవుడు పాటు పడుతూనే ఉన్నాడు. పాలకులు ఎవరైనా, పాలన ఎలా ఉన్నా వాటికి కావలసిన హంగుల్ని చేకూర్చింది మానవుడే. అతడి ఆశలూ, బాధలూ, కన్నీళ్ళూ, సాఫల్యాలూ చరిత్రకు ఊపిరి పోశాయి. యుద్ధాలు చేసింది మానవుడే. శాంతి కాముకత్వంతో మానవ కళ్యాణాన్ని సాధించిందీ మానవుడే. అప్పుడప్పుడూ అప్పటి చారిత్రక శక్తుల ప్రభావం వల్ల కొన్ని తప్పటడుగులు వేసినా, వాటిని సరిదిద్దుకుంటూ సమాజాన్ని ముందుకు నడిపిన వాడూ మానవుడే. అందుకే 'మానవుడే ఇల మహానుభావుడు' అని అన్నారు.



BRAOU

## అవగాహన ప్రశ్న – 2

చరిత్ర అంటే ఏమిటో తెలిపి, దాని పఠన ప్రయోజనాన్ని 10 వాక్యాల్లో వెల్లడించండి.

_______________________________________________

_______________________________________________

_______________________________________________

_______________________________________________

_______________________________________________

_______________________________________________

_______________________________________________

## 1.4 సంస్కృతి నిర్వచనం, స్వభావం, వైశిష్ట్యం

చరిత్రలో అంతర్భాగమైన సంస్కృతిని గురించి కొద్దిగా తెలుసుకుందాం. ఈ పాఠ్యాంశంలోని నాల్గవ భాగంలో సంస్కృతిని గురించిన చర్చను మీరు మరింత వివరంగా పరిశీలించవచ్చు. సంస్కృతిని గురించిన ప్రాథమికాంశాలు మాత్రమే ఈ భాగంలో ప్రస్తుతానికి తెలుసుకొందాం.

నేడు సామాన్య వ్యవహారంలో నాగరకత, సంస్కృతి అనేవి ఒకటేనన్నంతగా కనబడుతున్నా, రెంటికీ మౌలికమైన, సూక్ష్మమైన తేడా ఉంది. సంస్కృతి అంటే జీవన రీతి లేదా జీవన విధానం. నాగరికత సంస్కృతిలో ఒక భాగం. మానవ సమాజం తన పురోగమనంలో సాంకేతికాభివృద్ధిని సాధించుకుంటూ, జీవన స్థాయిని పెంచుకొంటూ పోవడం నాగరకత. సమాజ పరిణామ క్రమంలో మనిషి రాయడం, చదవడం నేర్చుకొని, ఒక్కొక్క వృత్తికి ప్రత్యేక ప్రతిపత్తి కలగడంతో నాగరికత ఆరంభమైంది. కొందరు, సంస్కృతిని కేవలం మేధాపరమైన, ఆధ్యాత్మికమైన విలువలకు పరిమితంగావే పరిగణిస్తారు. అంటే మతం, తత్వశాస్త్రం, చట్టరీతులు, సాహిత్యం, కళ, సంగీతం మొదలైన అంశాలను స్పృశించేదిగా సంస్కృతిని వర్ణిస్తారు. ఇది సరియైందికాదు. వీటన్నిటికంటే మానవుడు సృష్టించిన భౌతిక సంస్కృతి ఎంతో ముఖ్యమైంది. సమాజంలో ఉత్పత్తిదారుల అవసరాలకు సరిపడా సంపద మిగిలితే, అది సంస్కృతి నిర్మాణానికి, పెంపుదలకూ మూలమవుతుంది. ఆయా కాలాల్లో అలాంటి మిగులు ఉత్పత్తి అధికంగా ఉండబట్టే చైనాలోని పెద్ద అడ్డుగోడ, ఈజిప్టులోని పిరమిడ్ల నిర్మాణం సాధ్యమయ్యాయి. ఈ మిగులు ఉత్పత్తి – కేవలం తిండి గింజల విషయంలోనే కాకుండా, మొత్తం సంపదలో, ఉత్పత్తి క్రమంలో ఉపయోగించిన పద్ధతులవల్ల, పనిముట్ల వల్ల సాధ్యమవుతుంది. ఈ మిగులు ఉత్పత్తి ఎవరికి దక్కుతుందో దాని బట్టి ఆ సమాజ స్వభావం, స్వరూపం నిర్ణయిస్తాము. అందుకనే ఈ ఉత్పత్తిక్రమం, ఉత్పత్తి సంబంధాలు – సమాజ స్వరూపాన్ని నిర్ణయించి, దానికి తగినట్లుగా అప్పటి సంస్కృతిని కూడ నిర్ణయిస్తాయి. అలాంటి సమాజంలో ప్రబలంగా కనిపించేది ఉత్పత్తి శక్తులపై ప్రభుత్వం వహించిన అప్పటి పాలకుల సంస్కృతి మాత్రమే. కాగా, ఆ సమాజంలో అధిక సంఖ్యాకులుగా ఉన్న పాలితుల సంస్కృతి కూడ మరొక వైపు కొనసాగుతూ వస్తుంది. తాత్కాలికంగా ఇది మరుగున పడినట్లు పైపైకి కన్పించవచ్చు. కానీ అది ప్రజల మధ్య సజీవంగా ఉంటుంది.

సంస్కృతికి ఎల్లలు లేవు. అన్ని దేశాల్లోనూ, అన్ని జాతులవారూ తమ తమ ప్రాంతాల్లో సంస్కృతిని సంపన్నం చేసుకొంటారు. అది సకల మానవ సంస్కృతిగా, అందరి ఉమ్మడి శ్రమ ఫలితంగా పరిగణించ బడుతుంది. మన దేశ సంస్కృతి అనేక దేశాల సంస్కృతి కంటే ఎక్కువగా సంస్కృతీ ప్రభావాలను గ్రహిస్తూ ఉంటుంది. పరస్పరం కలిసిపోతుంది. మరింత సంపన్నమవుతుంది. భారతదేశ సంస్కృతి అనేక దేశాల సంస్కృతికంటే ఎంతో ప్రాచీనమైనది. ఈ సంస్కృతిలో ఎంతో భిన్నత్వం సహజంగానే ఉంది. దానికి తోడు ఇతర దేశాల సంస్కృతీ ప్రభావాలను గ్రహిస్తూ, వాటిని తనలో ఇముడ్చుకుంటూ, స్తబ్దంగా ఉండక, ఎప్పటికప్పుడూ, మరింత సంకీర్ణతతో వికసించింది. భారతీయ సంస్కృతిలోని వైశిష్ట్యం ఇదే.

BRAOU

### అవగాహన ప్రశ్న - 3

నాగరికత, సంస్కృతి అనే పదాలను నిర్వచించి వాటి మధ్య గల స్థూల సూక్ష్మ భేదాలను 10 వాక్యాల్లో తెల్పండి.

## 1.5 భాష, చరిత్ర, సంస్కృతి - వీటి పరస్పర సంబంధం

చరిత్రలో భాగమే సంస్కృతి; సంస్కృతిలో అంతర్భాగమే భాష. చరిత్రలేని జాతికి సంస్కృతి ఉండడానికి వీల్లేదు. అయితే సంస్కృతి చరిత్రను సంపన్నంచేస్తుంది. రాజకీయ, ఆర్థిక సామాజిక పరిస్థితులన్నీ కలిసి సంస్కృతిని నిర్మిస్తాయి. చరిత్రకూ, సంస్కృతికీ ఉన్న సంబంధం పువ్వుకూ, తావికీ ఉన్న సంబంధం లాంటిది. తావిలేని పూవులుండవచ్చు కాని సంస్కృతి పూజ్యమైన చరిత్ర ఉండదు. ప్రజల ఆచారాలూ, కట్టుబాట్లూ - వారి జీవనవిధానం మొత్తం కలిసి సంస్కృతిగా రూపొంది, ఇవి చరిత్రతో విడదీయరానంతగా పెనవేసుకపోతాయి. అందుకనే చరిత్ర వెంట సంస్కృతి, నీడలా వెన్నంటి ఉంటుంది. చరిత్ర సంస్కృతికి జీవగర్ర కాగా సంస్కృతి, చరిత్రను జీవింప చేస్తుంది. సంస్కృతిలేని చరిత్ర ఒట్టిపిప్పిలాంటిది. చరిత్ర ఆరంభం నుండి, సంస్కృతి అందులో ఒక భాగంగా ఉంటూనే చరిత్రతో పాటు పెంపొందుతూ వచ్చింది. ఈ రెండూ ఒకటేమో నన్నంతగా ఒకటికొకటి ఆశ్రయించుకొంటూ పెంపొందాయి. ఆదిమ మానవ సమాజాన్ని చరిత్రగా చిత్రీకరిస్తున్నపుడు, ఆదిమ మానవుడి సంస్కృతీ జీవనాన్ని కూడ అందులో భాగంగా కలిసి ఉంటుంది. సమాజపు అన్ని దశలకూ ఈ సూత్రం వర్తిస్తుంది.

ఇక భాషా విషయం పరిశీలిస్తే, ముందే నిర్వచన విభాగంలో చెప్పుకున్నట్లుగా, ఒకానొక చారిత్రిక దశలో మానవుడు భాష అవసరాన్ని గుర్తించి, భాషను ఏర్పరచుకున్నాడు. ముందు అది మౌఖికంగా ఉండి, ఆ తర్వాత సమాజ అవసరాలు పెరిగేకొద్దీ, మానవుని సృజనాత్మకత వికసించేకొద్దీ, లిఖిత భాషను కూడ కనుగొన్నాడు. అభిప్రాయ ప్రకటనకు భాష కావాలి. దాన్ని స్థిరీకరించడానికి, దానికి శాశ్వతత్వం చేకూర్చడానికి గ్రంథస్థం చేయాలనుకున్నాడు. ఆలోచన పెరిగేకొద్దీ భావాలు సంక్లిష్టమై, కళాత్మకత పొందినపుడు, మానవుడు ఆ భావాలకు భాషాపరంగా రూపం కల్పించడం తప్పని సరి అయింది. భాష రెంటినీ అంటే చరిత్రనూ, సంస్కృతినీ సంపన్నం చేసింది. భాష లేనపుడు చరిత్ర, సంస్కృతి వ్యక్తం కావని కాదు. నాగరిక సమాజానికి లిఖిత భాష అంకురార్పణ చేసిందని గార్డన్ చైల్డ్ అభిప్రాయపడ్డాడు. ఒకజాతి సంస్కృతి భాష ద్వారా స్పష్టంగా, నిర్దుష్టంగా వ్యక్తమవుతుంది. అదే విధంగా చరిత్ర కూడ. లిఖితాధారాలు లేని కాలం నాటి చరిత్ర, సంస్కృతులు తెలుసుకోవడం కష్టసాధ్యమయిన పని. అందుకనే భాషానంతర సమాజ చరిత్రను నిర్మించినంత తేలికగా, ప్రామాణికంగా, అంతకు ముందున్న చరిత్రను గూర్చి చెప్పడం కష్టం.

భాష భావప్రకటనకు సాధనమని చెప్పుకొన్నాం కదా! భాష ద్వారావే సంస్కృతికి పట్టుగొమ్మలైన సమస్త సాహిత్యమూ, కళలూ, శాస్త్రవిజ్ఞానమూ వెల్లడయ్యాయి. భావితరాలకు అందుతున్నాయి. వేదవాఙ్మయంతో ప్రారంభించి, ప్రాచీన యుగాల సంస్కృత సాహిత్యం, దేశీయ భాషలలోని సాహిత్య సృష్టి, మధ్య యుగాలనాటి మహోద్యమాల భావజాలం, ఆధునిక యుగపు లౌకిక సాహిత్య సంపదతోపాటు శాస్త్ర విజ్ఞానం మనకీనాడు లభ్యమవుతున్నది. భాషను ఆయా సామాజిక దశల్లో సాహిత్యకారులూ, మతాచార్యులూ తమ భావ ప్రసారానికి పనిముట్టుగా వాడుకున్నారు. ప్రజాభాషగా పేరొందిన ప్రాకృతం ద్వారా బౌద్ధం తన సిద్ధాంతాలను ప్రజల్లో వ్యాపింపచేసింది. మధ్యయుగాలనాటి సమాజ కవులు, ఆనాటి మతాన్ని నిరసిస్తూ చేసిన రచనలు, బోధనలు

BRAOU

ప్రజలు మాట్లాడుకునే భాషలోనే ఉన్నాయి. రాజకీయ పెత్తనానికి, ఆర్థిక దోపిడికి కూడా భాష సాధనంగా ఉపయోగపడింది. ఆంగ్లేయులు భారతదేశ ఆక్రమణ కొనసాగిస్తున్నపుడు, ఇక్కడి భాషను నేర్చుకోడం ద్వారా, ప్రజల ఆచార వ్యవహారాల్ని, వారి గతాన్ని గూర్చి తెలుసుకొని, వారిని పరిపాలించడం సులభమనుకొన్నారు. అందుకే అప్పటి ఆంగ్లేయ అధికార్లు తప్పనిసరిగా భారతీయ భాషలు అభ్యసించారు. అందుకోసం తెలుగు, తమిళం, బెంగాలీలాంటి భాషల్లో వ్యాకరణాలు ఇతర గ్రంథాలు అచ్చువేశారు. తమ ఉద్యోగుల కోసం ప్రత్యేకంగా కలకత్తాలోని ఫోర్ విలియంలోనూ, మదరాసులోని ఫోర్ సెంట్ జార్జిలోనూ విద్యాలయాలు స్థాపించి, భాషా శిక్షణ ఇచ్చారు.

భారతీయ సమాజంలో ఉక్కుచట్రమని చెప్పదగిన కులవ్యవస్థ, దాని కట్టుబాట్లు నియమాల వల్ల విద్య కొందరికే పరిమితం కావడంతో, లిఖిత భాషపైకూడా కులవ్యవస్థలోని పై శ్రేణులదే గుత్తాధిపత్యం అయింది. వీరిది అగ్రవర్ణాలకు చెందిన పురోహిత వర్గం. రాజులు ఈ వర్గంపై ఆధారపడి ఉండడంతో, లిఖిత భాష వీరి సొంతమై పోయింది. ఇది పాలక వర్గ సంస్కృతిగా రూపొందింది. దీనివల్ల సమాజం సాంస్కృతికంగా వెనుకబాటుతనానికి గురయింది. నిజమైన ప్రజా సంస్కృతి ఆనాటి సమాజంలో ఉన్నా అది వెలుగులోకి రాలేక పోయింది. మౌఖిక సంప్రదాయంగా ఉండిపోయి, జానపద సంస్కృతిగా నిలిచిపోయింది. ఈ జానపద సంస్కృతి ప్రజల భాషలో, వారి జీవితాన్ని ప్రతిబింబించేటట్లుగా ఉంటుంది. ఇటీవలి వరకూ, ఈ సంస్కృతిలో భాగాలైన జానపద సాహిత్యం కానీ, జానపద కళలు కాని సరియైన గుర్తింపు పొందనే లేదు.

భాష ఎల్లప్పుడూ ఒక విధంగా ఉండదు. ఉండకూడదు కూడ. భావప్రకటనకు, విజ్ఞాన ప్రసారానికి, ప్రజల నిత్య జీవితావసరాల నిర్వహణకు ఇది సాధనమనుకున్నపుడు, మారుతున్న ప్రజల జీవితాలకు, సంస్కృతికి పనికొచ్చే పనిముట్టుగా దీన్ని మార్చాల్సిన అవసరం ఉంది. దాదాపు పందొమ్మిదవ శతాబ్ది ఆఖరు వరకూ రచనల్లో ప్రాచీన సాహిత్య భాషనే వాడుతూ వచ్చారు. మధ్యయుగాల సమాజ నిర్మాణం, అప్పటి ప్రగతి విరోధక భావాలు భాషను ప్రజాస్వామ్యీకరించి, ప్రజల భాషగా రూపొందించడానికి, వారికి చేరువగా తీసుకెళ్ళడానికి అడ్డుపడ్డాయి. పూర్వభాషా నియమాలకు కాలదోషం పట్టినపుడు, ప్రజలు మాట్లాడుకొనే వాడుక భాషలో ఆధునిక రచనలు చేయవలసి వచ్చింది. ఇది నిజమైన ప్రజాస్వామిక సంస్కృతి నిర్మాణానికి దోహదం చేస్తుంది. ఈ విధంగా భాషకూ, సంస్కృతికీ గల అన్యోన్య సంబంధం సార్థకమవుతుంది.

BRAOU

### అవగాహన ప్రశ్న – 4

భాష, చరిత్ర, సంస్కృతి మధ్యగల సంబంధ బాంధవ్యాలను 10 వాక్యాల్లో తెల్పండి.

________________________________________

________________________________________

________________________________________

________________________________________

________________________________________

________________________________________

## 1.6 సారాంశం

- భాషకు చరిత్ర ఉన్నట్లే, భాష ద్వారా తెలిసే సాహిత్యానికీ, సంస్కృతికీ చరిత్రలుంటాయి. భాష, సాహిత్యం, సంస్కృతి వీటి మధ్య పరస్పర సంబంధాలు, అన్యోన్య ప్రభావాలు ఉంటాయి.
- సామాజిక అంతర్గత సంబంధాలను వివరించేదే చరిత్ర. చరిత్ర సమస్త మానవ శ్రమనూ, ప్రయత్నాలనూ, ప్రతిబింబిస్తుంది.
- సమాజ స్వరూపమే సంస్కృతిని నిర్ణయిస్తుంది.

## అవగాహన ప్రశ్నలకు జవాబులు

1. మనిషి తన భావాలను ప్రకటించే వాగ్రూప సాధనమే భాష. జాతి సంస్కృతికి మూలాధారాలైన సమస్త సాహిత్యమూ, కళలూ, శాస్త్ర విజ్ఞానమూ భాషద్వారానే వ్యక్తమవుతున్నాయి. వృద్ధి అవుతున్నాయి. భావి తరాలకు అందుతున్నాయి. ఈ భావ ప్రకటన లిఖిత భాష, మౌఖిక భాష అనే రెండు వాహికల ద్వారా జరుగుతున్నది. మానవాళి తన తరంలో సొందుపరచుకున్న విజ్ఞానాన్నీ, కళలనూ భావితరాలకు అందించడం భాష చేసే ముఖ్యమైన పని. సమాజ పరిణామాన్ని చరిత్రబద్ధం చేసే కార్యక్రమం కూడా భాషదే.

2. చరిత్రను చాలా మంది విజ్ఞులు అనేక రకాలుగా నిర్వచించారు. "గతకాలపు మానవాభ్యుదయాన్ని నిర్వచించేదే చరిత్ర" అని కొందరన్నారు. "మానవసమాజం ఏఏ దశల్లో ఎలా నిర్మాణం చెందుతూ వచ్చిందీ, ఆయా దశల్లో ఏ విధంగా పరిణమిస్తూ వచ్చిందీ తెలియజేసేది చరిత్ర" అని మరి కొందరి అభిప్రాయం. ఏది ఏమైనా గతకాలపు రాజకీయ ఘటనలనూ, రాజవంశాల చరిత్రనూ మాత్రమే తెలిపేది చరిత్రకాదని అందరూ అంగీకరించారు. "కాలక్రమానుగతంగా, సమాజంలో వస్తున్న ఉత్పత్తి సాధకాలలోని మార్పును, ఉత్పత్తిశక్తుల మధ్య సంబంధాలనూ వివరించేదే చరిత్ర" అని డి.డి. కొశాంబి నిర్వచనం. సమాజపు ఆర్థిక నిర్మాణం, అది పునాదిగా ఉన్న సామాజిక విభాగాలైన రాజ్యం, ప్రభుత్వం, సాహిత్యం, కళలు, తత్వశాస్త్రం వంటి విషయాలను చరిత్ర పఠనం ద్వారా అవగతం చేసుకోవచ్చు.

3. సంస్కృతి అంటే జీవన రీతి, లేదా జీవన విధానం. ఆ జీవన స్థాయిని సాంకేతిక, వైజ్ఞానిక, సామాజిక రంగాల అభివృద్ధిలో పెంచుకుంటూ పోవడం నాగరికత. కాబట్టి నాగరికత సంస్కృతిలోని ఒక భాగం మాత్రమే. సంస్కృతికి ఎల్లలు లేవు. అన్ని జాతుల వారూ, అన్ని దేశాలవారూ సుసంపన్నం చేసుకున్న సంస్కృతి విశ్వమానవ సంస్కృతిగా మారే అవకాశాలున్నాయి. నాగరికత అలాంటిది కాదు. దానికి దేశ, కాల, పాత్రతలున్నాయి. సమాజ పరిణామక్రమంలో మనిషి రాయడం, చదవడం నేర్చుకొని ప్రత్యేక ప్రతిపత్తిగల వృత్తులను నిర్వహించడంతో నాగరికత ఏర్పడుతుంది. ఈ ఉత్పత్తి దారుల శ్రమ ఫలితంగా ఆవిర్భవించే ధనశక్తి సంస్కృతి నిర్మాణానికి తోడ్పడుతుంది.

4. చరిత్రలో భాగమే సంస్కృతి, సంస్కృతిలోని ఒక అంతర్భాగం మాత్రమే భాష. కాబట్టి ఈ మూడూ వేరువేరుగా కనిపిస్తున్నా సమాజ నిర్మాణంలో, మానవాభ్యుదయంలో పరస్పరం కలిసి పోయి పని చేస్తున్నాయి. చరిత్రలేని జాతికి సంస్కృతి ఉండే వీలేదు. ఎందుకంటే సంస్కృతే చరిత్ర పునాదులు వేస్తుంది కాబట్టి. ఈ రెంటినీ అభివ్యక్తం చేసి, వాటిని భావితరాల అభ్యుదయానికి వారసత్వంగా అందించేది భాష. భాషలేకపోతే సంస్కృతి అంతర్భాగాలైన సాహిత్యం, కళలు, వైజ్ఞానికాభివృద్ధి వంటి అంశాలు ఇతరులకు తెలియవు. తరతరాల సామాజిక సంఘటనలూ, ఆర్థిక, సాంఘిక పరిస్థితులూ లిపిబద్ధం కాకపోతే దేశానికి చరిత్రే లభించదు. అందుచేత భాష, సంస్కృతి, చరిత్ర ఒక దానికొకటి పరస్పరం పూరకాలు. ఆ పరస్పర సంబంధం చేత ఒక దాన్నొకటి ప్రభావవంతంగా రూపొందించే సామాజికాంశాలు.

BRAOU

### చదవదగిన పుస్తకాలు


1. D.D. Kosambi – The Culture and civilisation of Ancient India.
2. A.L. Basham ed. – A culture History of India
3. Romila Thapar – History of India, Vol-I (Penguins)
4. K.M. Panikkar – A Survey of Indian History
5. Bhagawat Saran – Feeders of Indian Culture
6. Raymond Williams – Culture and Society
7. Raymond Williams – The Long Revolution
8. E.H. Carr – What is History?

## మాదిరి పరీక్షా ప్రశ్నలు

I. కింది ప్రశ్నలకు 30 పంక్తులలో సమాధానం రాయండి.

1. భాష, చరిత్ర, సంస్కృతి - వీటిని నిర్వచించి, ఆ నిర్వచనాలను విశదీకరించండి.
2. భాష, చరిత్ర, సంస్కృతుల మధ్యగల పరస్పర సంబంధాలను చర్చించండి.

II కింది ప్రశ్నలకు 10 పంక్తులకు మించకుండా సమాధానాలు రాయండి.

1. భాష సమాజంలో ఎప్పుడు, ఎలా పుట్టింది?
2. చరిత్ర ప్రయోజనం ఏమిటి.
3. సంస్కృతికి, నాగరికతకు గల తేడా ఏమిటి?
4. ప్రజల భాష అంటే ఏమిటి? దాని ప్రయోజనం వివరించండి.

BRAOU

# భాగం – 2 భారతీయ సమాజంలోని భాషలు, భాషా కుటుంబాలు

## విషయక్రమం


2.0 లక్ష్యాలు
2.1 పరిచయం
2.2 భారతదేశంలోని జాతులు, భాషల సంకీర్ణత
**అవగాహన ప్రశ్న – 1**
2.3. భాషా కుటుంబాల విభజన పద్ధతి
 2.3.1 ఆస్ట్రో ఏషియాటిక్ భాషా కుటుంబం
 2.3.2 ద్రావిడ భాషా కుటుంబం
 2.3.4 టిబెటు బర్మన్ భాషా కుటుంబం
**అవగాహనప్రశ్న – 2**
2.4. భాషల పరస్పర సంబంధాలు
 2.4.1 సమైక్యత కారణాలు
 2.4.2 బహుభాషా జ్ఞానం, ఆవశ్యకత
**అవగాహనప్రశ్న – 3**
2.5 సారాంశం
 అవగాహన ప్రశ్నలకు జవాబులు
 చదవదగిన పుస్తకాలు
 మాదిరి పరీక్షా ప్రశ్నలు


## 2.0 లక్ష్యాలు

BRAOU

మీరీ భాగాన్ని చదవటం పూర్తి చేశాక, కింది విషయాలను వివరించగలుగుతారు :

- భారతీయ సమాజంలో జాతులకు, భాషలకు, భాషా కుటుంబాలకు ఉండే ప్రత్యేకత
- భాషల మధ్య పరస్పర సంబంధాలు, ప్రభావాలు
- భారత సమైక్యతకు మూలాలు

## 2.1 పరిచయం

భాషకూ, చరిత్రకీ, సంస్కృతికీ అన్యోన్య సంబంధం ఉందని మీరు ఒకటో భాగంలో తెలుసుకున్నారు. ఈ దృష్టితో భారతదేశంలోని వివిధ జాతులు, భాషలు, భాషా కుటుంబాలకు సంబంధించిన విశేషాలను ఈ భాగంలో పరిచయం చేస్తున్నాము. భారతదేశంలో అయిదు రకాల జాతుల ప్రజలు నివసిస్తున్నారు. 1652 భాషలున్నాయని మీరు ఈ ఖండం పరిచయంలో తెలుసుకున్నారు. ఈ భాషల మధ్య సమాన లక్షణాలను, దగ్గరి సంబంధాలనూ భాషా శాస్త్రజ్ఞులు గుర్తించి వీటిని నాలుగు ప్రధాన భాషా కుటుంబాలుగా వర్గీకరించారు. ఈ ప్రధాన భాషాకుటుంబాలలోని ఉపకుటుంబాలు, శాఖలు భాషాకుటుంబాలకు సంబంధించిన చర్చలో మీరు గుర్తిస్తారు. భిన్న జాతులు, భిన్న భాషలు మనదేశంలో నాలుగు వేల సంవత్సరాల నుండి ఉంటూ రావటం వల్ల జాతుల మధ్యా, భాషల మధ్యా పరస్పర సంబంధాలు ఏర్పడ్డాయి. ఇవి పరస్పర ప్రభావాలకు లోనయ్యాయి. ఇది సంకీర్ణ సమాజ లక్షణం అని మనం అందుకే భావిస్తాము. ఈ లక్షణాలను మీరు 1.4.0లోనూ, 1.4.1 లోనూ విశదంగా తెలుసుకోవటంవల్ల భారత సమైక్యతకు గల మూలకారణాలను గ్రహించగలుగుతారు. అంతేకాదు బహుభాషా జ్ఞాన ఆవశ్యకతను గుర్తించగలుగుతారు.

## 2.2 భారతదేశంలోని జాతులు, భాషల సంకీర్ణత

వైశాల్యం, జాతి మత భాషాభేదాలు ఒక ఉపఖండంగా పరిగణించడానికి కారణాలు. రష్యా మినహా యూరప్ ఖండం ఎంత విశాలమో భారతదేశమూ అంతే. నాగరకతా సంస్కృతుల ప్రాచీనతలో భారతదేశం యూరప్.

ఆఫ్రికా, ఆస్ట్రేలియా ఖండాలకన్నా ముందున్నది. ఈ దేశానికి మొట్టమొదట వలస వచ్చినవాళ్ళు 'నీగ్రాయిడ్/నీగ్రిటో' జాతులవాళ్ళు. వాళ్ళ భాషల అవశేషాలు ఇప్పటికీ అండమాన్, నికోబార్ దీవుల్లో నివసిస్తున్న ఆదిమ జాతుల వాడుకలో ఉన్నాయి. ఆ తరవాత 'ఆస్ట్రలాయిడ్' జాతులవాళ్లు ఈ గడ్డలో ప్రవేశించారు. 'కొలేరియన్/ముండేరియన్' భాషా కుటుంబాలకు చెందినవాళ్ళ భాషలను నేటికీ సంతాలీలూ సవరలూ మాతృభాషలుగా వాడుతున్నారు. వాళ్ళనే పూర్వులు 'నిషాదు'లని వ్యవహరించారు. దేశ జనసంఖ్యలో రమారమి 1.5 శాతం మంది మాత్రమే ఈ జాతులవాళ్ళు. రమారమి అయిదువేల అయిదువందల సంవత్సరాల క్రితం మెడిటెరేనియన్ సముద్ర ప్రాంతాలనుంచి వలసవచ్చిన 'ద్రావిడు'లు ఆ తరవాత వచ్చినవాళ్ళు. తెలుగు, తమిళం, కన్నడం, మలయాళం వగైరా భాషలు మాట్లాడే ప్రజలు ఆ జాతికి చెందినవాళ్ళు. పాకిస్తాన్‌లోని బెలూచి రాష్ట్రంలోనూ, అస్సాంలోని గారోకాశీ కొండల చుట్టుపక్కలా, మధ్య భారతదేశంలోనూ, దక్షిణాదిని చాలా భాగంలోనూ నివసిస్తున్నవాళ్ళు మొత్తం దేశ జనసంఖ్యలో రమారమి 21 శాతం పైగా ఉన్నారు. ఆ మీదట మన దేశానికి వలస వచ్చిన జాతి 'మంగొలాయిడ్' జాతి. వాళ్ళను పూర్వులు 'కిరాతు'లని పిలిచేవాళ్ళు. వాళ్ళు మాట్లాడిన భాషల నేటి రూపాలు 'సైనో - టిబెటన్' భాషా కుటుంబానికి చెందినవి. హిమాలయ పర్వత ప్రాంతాల్లో, బ్రహ్మపుత్రా నది లోయల్లో ఈ భాషలు మాట్లాడేవాళ్ళు ఇప్పటికీ నివసిస్తున్నారు. మొత్తం జనాభాలో వాళ్ళ సంఖ్య ఒక్క శాతంకూడా లేదు. రమారమి క్రీస్తుపూర్వం 1500 సంవత్సరాల క్రితం 'ఆర్య' జాతులవాళ్ళు కూడా భారత దేశంలో పాదంమోపారు. ఈనాడు వాళ్ళ సంఖ్య దేశ జనసంఖ్యలో 73 శాతం. ఉత్తర హిందూస్తానంలోని హిందీ, గుజరాతీ, బెంగాలీ, అస్సామీ, పంజాబీ మొదలైన భాషలూ, దక్షిణ భారతదేశంలోని మహారాష్ట్ర, ఒరియా భాషలూ ఈ భాషాకుటుంబానికి చెందినవే. మూడువేల సంవత్సరాల పైకాలం భారతీయ సంస్కృతికి ప్రధానాధారంగా ఉన్న సంస్కృతం, ప్రాకృతం, పాలీ, అపభ్రంశ భాషలన్నీ నేటి ఆర్యభాషల పూర్వరూపాలే.

ఆర్యుల తరవాత ఆజాతికే చెందిన ఇతర మతాలవాళ్ళు, భాషల వాళ్ళు భారతదేశం మీద దండెత్తారు గాని పెద్దయెత్తు వలసలు జరగలేదు. ముందువచ్చిన వాళ్ళను తరువాత వచ్చినవాళ్ళు అడవుల్లోకీ కొండల్లోకీ తరిమివేశారు. ఎంత తరిమినా ఒకరి భాషా సంస్కృతులు మరొకరిని ప్రభావితంచేస్తూనే వచ్చాయి. మూడువేల సంవత్సరాలుగా అప్పుడప్పుడూ ఘర్షణలకూ యుద్ధాలకూ దిగిన ఈగడ్డ మీదనే జీవించకతప్పలేదు. తొలిసారి వలసవచ్చిన నిషాదులే ఈ దేశంలోని అద్భుతమైన నాగరకతను సృష్టించారు. తొలిదశలో వాళ్ళు నదుల ఒడ్డున నివసించేవారు. ప్రాథమిక వ్యవసాయ పద్ధతులను వాళ్ళే ప్రవేశపెట్టారు. గంగా పరివాహ ప్రాంతంలో పచ్చికబీళ్ళు పెంచారు. కూరగాయలు పండించారు. దుంపలు పండించారు. అల్లం, మిరియం, పసుపువంటి ద్రవ్యాలను పండించారు. అంచెలంచెలుగా కొండలమీద వరిసాగుచేసారు. చేపల పెంపకం, కోళ్ళ పెంపకం సాధించారు. పత్తి పండించి దారంతీసి గుడ్డలల్లారు. చెట్లకూ చేమలకూ పశుపక్ష్యాదులకూ పేర్లు పెట్టారు. గ్రామీణ వ్యవస్థను నెలకొల్పారు. వారి రాకముందు ఈదేశంలో ఎవరుండేవాళ్ళో తెలియదుగాని, వాళ్ళే వ్యవసాయ దేశంగా భారత దేశాన్ని తీర్చిదిద్దారు. ఆతరువాత ద్రావిడులు నగర నాగరికతను అభివృద్ధిచేశారు. మొహెంజొదారో, హరప్పా నాగరకతలు ద్రావిడ నాగరకతలంటారు చాలా మంది. పౌరవ్యవస్థనూ రక్షణవిధానాలనూ ద్రావిడులు అభివృద్ధికి తెస్తే, వారి తరువాత వలసవచ్చిన ఆర్యులు క్రమంగా ఉత్తరదేశమంతా వ్యాపించి నాగరకతను విస్తరింపజేసారు. తొలిదశలో దేశదిమ్మరులుగా, పశుపోషకులుగా వ్యవహరించిన ఆర్యులు ద్రావిడుల ప్రభావంవల్ల వ్యవసాయ వృత్తులను వర్ధిల్లజేశారు. భాషా సంస్కృతులను వ్యాప్తికి తెచ్చారు. ఆయుధ విద్యలనూ, కళలనూ అభివృద్ధికి తెచ్చారు. మొట్టమొదట భిన్నజాతుల మధ్య సంఘర్షణ కూడా జరిగింది. ఒకరి భాషను మరొకరు నేర్చుకోవటం, ఒకరి ఆచార వ్యవహారాలను మరొకరు గుర్తించటం, ఒకరితో మరొకరు వర్తక వాణిజ్యాలు జరపటం తప్పలేదు. ఈ ఇచ్చి పుచ్చుకోవటాలవల్ల భారతజాతి ఏర్పడింది. భారతీయ సంస్కృతి పుట్టింది. తమతమ పూర్వజాతి లక్షణాలు వర్ణసాంకర్యంవల్ల కలగాపులగమై పోగా, భాషలు పరస్పర భావవినిమయంవల్ల కొన్ని పాత లక్షణాలను పోగొట్టుకొని కొన్ని సాధారణ లక్షణాలను కల్పించుకున్నాయి. ఆర్యభాషల్లో ముందు లేని 'ట, డ, ణ, ళ' వంటి మూర్ధన్యధ్వనులు ద్రావిడా భాషా ప్రభావంవల్ల కొత్తగా ఏర్పడ్డాయి. సమస్త క్రియాపదాలు అన్ని భాషా కుటుంబాల్లోనూ మొలకెత్తాయి. నామవాచకాలను అనుబంధాలతో ప్రస్తరించటం మొదలయింది. సమాస ధ్వన్యనుకరణ శబ్దాలు సిద్ధమైనాయి. కాలక్రమాన సమాజ శాస్త్రజ్ఞుల విశ్వాసం ఒకటి వమ్మయిపోయింది. ఒకే భాష, ఒకేమతం లేకపోతే ఒకేజాతి ఏర్పడదనే వాదం నిలవలేదు. అఖండ భారతజాతి ఏర్పడింది.

BRAOU

## అవగాహనప్రశ్న – 1

భారతదేశానికి వలస వచ్చిన జాతులేవి? అఖండ భారతజాతి ఎట్లా ఏర్పడింది? పది వాక్యాల్లో జవాబు రాయండి.

## 2.3.0. భాషా కుటుంబాల విభజన పద్ధతి

వ్యక్తులను కుటుంబాలుగా వర్గీకరించి వారికి ఇంటిపేర్లు పెట్టినట్లే, భాషలను కూడా కుటుంబాలుగా క్రోడీకరించి పేర్లు పెట్టారు. భిన్నభాషల మధ్య ఉండే సమాన లక్షణాలనూ దగ్గరి సంబంధాలనూ గుర్తించి వాటిని కుటుంబాలుగా, ఉపకుటుంబాలుగా, శాఖలుగా, ఉపశాఖలుగా భాషావేత్తలు వర్గీకరిస్తారు. వర్గీకరణలో పాటించే ప్రధాన లక్షణాలు పరిశీలిద్దాము.

శరీరభాగాల పేర్లు, సర్వనామ పదాలు, సంఖ్యావాచకాలు, సాధారణ క్రియలు, పరిసరాల్లో ఉండే మామూలు వస్తువులు, బంధుత్వం బోధించే మాటలూ మొదలైనవి ప్రాథమిక పదాలు. ఏ రెండు భాషల్లోని ఈ ప్రాథమిక పదాలు ఒకేరకంగాగాని, ఉచ్చారణలో ఒకదానికొకటి చాలా దగ్గరగా ఉంటే అవి ఒకే కుటుంబానికి చెందిన భాషలని చెప్పవచ్చును. ప్రతిభాషకూ వాక్యరచనలో తనదైన ప్రత్యేకత ఉంటుంది. వాక్య నిర్మాణంలో నామవాచకాలను, విశేషణాలను, క్రియాపదాలను భాషలన్నీ ఏదో ఒక క్రమం ప్రకారమే కూరుస్తాయి. ఈ నిర్మాణ పద్ధతిలో దగ్గరి పోలికలున్న భాషలను ఒకే కుటుంబానికి చెందిన భాషలుగా పరిగణిస్తారు. ఇప్పటి వాడుకలో దూరపు చుట్టాల్లాగ దగ్గరి పోలికలులేనట్లే భాషలు వినిపించినా కనిపించినా, పాతకాలపు సాహిత్యాన్ని బట్టిగాని, ధ్వనుల్లో వచ్చే నియతమైన మార్పులనుబట్టిగాని, చరిత్రచెప్పే పూర్వ సంబంధాలనుబట్టిగాని అవి ఒకప్పుడు ఒకే కుదురునుంచి పుట్టిన భాషలని గుర్తించవచ్చు. కొద్దిపాటి మార్పులున్నా అవి ఒకనాడు ఒకేభాషగా ఉండేవని నిరూపించవచ్చు. ఈ ప్రమాణం ప్రకారమే ఒకే కుటుంబానికి చెందిన భాషలని చెప్పినవాటిల్లో కూడా ఓ పెద్ద భేదం కనిపించవచ్చు. అది ప్రాథమికేతర పదజాలంలో వేరువేరు భాషలనిపించేటట్లు కనిపించటం వినిపించటం. అంటే భాషలను కుటుంబాలుగా వర్గీకరించటంలో ప్రాథమిక పదాలకు తప్ప ఇతర పదాలకు ప్రాధాన్యం లేదన్నమాట. అందువల్లనే మనం హిందీ, ఉర్దూలు ప్రత్యేక భాషలు కావన్నాం. ఉర్దూ వాక్యంలోని పెర్షో – అరబిక్ పదాల స్థానంలో సంస్కృత పదాలను నిలిపితే అది హిందీ అనిపిస్తుంది. అర్థంచేసుకోవటంలో పెద్ద ఇబ్బంది రాదు. కాని వాక్యనిర్మాణ క్రమాన్ని మార్చలేం. మారిస్తే అది ఉర్దూ కాదు; హిందీకూడా కాదు! హిందీ వాక్యాల్లోని సంస్కృత పదాలను తొలగించి వాటి స్థానంలో పర్షియన్ పదాలు వాడినా భాషా స్వరూపంలో మౌలికమైన మార్పురాదు. ఉదాహరణకు మూడు ఒకేరకమైన వాక్యాలు తీసుకొని వాటిలోని పదాలు మార్చి చూద్దాం. అవన్నీ తెలుగువే. (1) ఈ యేడు వానలు లేక పంట దెబ్బతిన్నది. (2) ఈ year లో rains లేక crop fail అయింది. (3) ఈ సంవత్సరం వర్షాలులేక సస్యం ఫలించలేదు. ఈ మూడు వాక్యాల్లోనూ మాటలు మారాయి. వాక్య నిర్మాణ క్రమం మారలేదు. సర్వనామం .... నామం .... క్రియాపదం .... నామవాచకం .... సంపూర్ణక్రియా పదాలు మారినా ఇవి మూడు తెలుగు వాక్యాలేనని, కాకపోతే శైలి మారిందనీ ఏ తెలుగువాడయినా ఒప్పుకుంటాడు. మొదటి వాక్యం సగటు మనిషిది; రెండోది ఇంగ్లీషు నేర్చిన తెలుగువాడిది; మూడోది సంస్కృతం చదివిన తెలుగు పండితుడిది. ఇవన్నీ తెలుగువాక్యాలే. పంట దెబ్బతిన్నారంటే తెలుగు కాదు. పదజాలాన్నిబట్టి భాషలను వర్గీకరించం. పదాలు వేషధారణవంటివయితే వాక్యాలు శరీరం వంటివి. వేషం మారినంత మాత్రాన శరీరం మారదు. శరీర స్వభావమూ మారదు. ఇది ప్రధాన సూత్రం. ఈ సూత్రాన్ని



BRAOU

అనుసరించే భాషా శాస్త్రజ్ఞులు భారతదేశంలోని భాషలను నాలుగు కుటుంబాలుగా విభజించారు అవి : 1. ఆస్ట్రో ఏషియాటిక్ భాషాకుటుంబం. 2. ద్రావిడభాషా కుటుంబం 3. ఆర్యభాషా కుటుంబం 4. టిబెటు బర్మన్ భాషా కుటుంబం. ఈ నాలుగు కుటుంబాలను గురించి, వాటిలోని ఉపకుటుంబాలు, శాఖలు గురించి స్థూలంగా తెలుసుకుందాం.

### అవగాహన ప్రశ్న - 2

భాషలను కుటుంబాలుగా వర్గీకరించటంలో పాటించే ప్రధాన లక్షణాలను పది వాక్యాల్లో తెల్పండి.

______________________________________________

______________________________________________

______________________________________________

______________________________________________

______________________________________________

### 2.3.1 ఆస్ట్రో ఏషియాటిక్ భాషా కుటుంబం

మొట్టమొదట నీగ్రాయిడ్ జాతులు భారతదేశానికి తెచ్చిన 'ఆస్ట్రో - ఏషియాటిక్ భాషా కుటుంబానికి చెందిన 'ఆస్ట్రిక్ ఉప కుటుంబ భాషలను ప్రస్తావిద్దాం. ఇది భౌగోళిక విభజన ప్రణాళిక ప్రకారం పెట్టిన పేరు. ఆసియా, ఆస్ట్రేలియా ఖండాల్లోని ఆదిమవాసుల భాషలని దీని అర్థం. ఈ కుటుంబ భాషల్లో మూడు ఉప కుటుంబ భాషలు ప్రధానమైనవి. (1) 'కోల్/కోలేరియన్/ముండా' ఉపకుటుంబం (2) 'నికోబార్ ఉపకుటుంబం. వీటిలో మొదటి ఉపకుటుంబానికి చెందిన భాషల్లో 'సంతాలీ' భాష సుప్రసిద్ధం. బీహార్ రాష్ట్రంలోని ఛోటా నాగపూర్ జిల్లాలో, సంతాల్ పరగణాలో ఈ భాషవాళ్లు అత్యధిక సంఖ్యలో నివసిస్తున్నారు. ఒరిస్సాలో, అస్సాంలో కూడా సంతాలీలున్నారు. 'ముండారీ' భాష దక్షిణ బీహార్‌లోనూ, అస్సాంలోనూ వినిపిస్తుంది. 'హెూ' భాష దక్షిణ బీహార్‌లోని సింగ్భూం జిల్లాలో వాడుకలో ఉంది. అక్కడే 'ఖరియా, భూమిజ్ భాషలు కూడా వ్యాప్తిలో ఉన్నాయి. మధ్యప్రదేశ్‌లోని బేరార్లో 'కొర్కు' భాష మాట్లాడే వారున్నారు. ఒరిస్సాలో 'గదబ' భాష, ఒరిస్సా ఆంధ్రప్రదేశ్ ఉత్తర ప్రాంతాల్లో 'సోఅర/సవర' భాష మాట్లాడే ప్రజలున్నారు. అనాది సిద్ధంగా వ్యవసాయం, వేట ప్రధాన వృత్తులుగా ఉన్న ఈ ప్రజల భాషల్లో మూర్తవస్తువులకు (concrete objects) ముఖ్యంగా జంతు వృక్షజాలానికి, సంబంధించిన పదాలు అసంఖ్యాకంగా ఉన్నాయి. అమూర్త భావనలను (abstract ideas) వివరించే పదాలు తక్కువ. మౌఖిక సాహిత్యం అపారంగా ఉంది. క్రీ.శ. 19వ శతాబ్దంలో బ్రిటిష్ మిషనరీలు రోమన్ లిపిలో బైబిల్ అనువాదాలనూ, ఆ ప్రజల పాటలనూ కథలనూ ప్రచురించి ఆ భాషలను లిపిబద్ధం చేశారు. గిడుగు వేంకట రామమూర్తి సవర (సంస్కృతంలో 'శబర') భాషకు అపూర్వమైన వ్యాకరణం రాశారు. నిఘంటువులు నిర్మించారు. ఆ భాషలో సాహిత్యం సృష్టించారు. సంస్కృతంలోని 'లాంగలమ్', తెలుగులోని 'నాగలి' శబ్దాలవంటివి ఈ భాషల నుంచి ఎరువు తెచ్చుకున్నవే. 'ఏరు, వాగు' అనే అర్థంలో కళింగ ప్రాంతంలో వాడుకలో ఉన్నమాట 'గడ్డ' ఈ భాషల్లో నుంచి వచ్చిందే. ఒకనాటి నాగరకత కాలగర్భంలో కలిసిపోగా ఇప్పుడు ఈ భాషలవారు 'ఆదిమజాతు'లై పూర్వ లక్షణాలు కోల్పోలేక, కొత్తవాటిని సంపాదించలేక సతమతమై పోతున్నారు.

నికోబార్ దీవుల్లోని ఆదిమవాసుల భాష 'నికోబారీస్'. ఇది పండితులు పెట్టినపేరు. ఇటీవలనే ఈ భాషా లక్షణాలను తెలుసుకున్నారు. మూడో ఉపకుటుంబానికి చెందిన భాష 'ఖాసీ'. అస్సాంలోని ఖాసీ కొండల ప్రాంతాల్లో ఇది వ్యవహారంలో ఉంది. దూర ప్రాచ్యదేశాల్లో వ్యవహారంలో ఉన్న 'మాన్‌ఖ్మేర్ కుటుంబ భాషలకూ నికోబార్, ఖాసీ భాషలకు చాలా దగ్గరి చుట్టరికముందని ఇటీవల కనుక్కున్నారు. సమూహం మీద వీరందరినీ 'నిషాదు' అని పూర్వకాలంలో పిలిచేవాళ్ళు.

BRAOU

## 2.3.2 ద్రావిడ భాషా కుటుంబం

నిషాదుల తరువాత వలస వచ్చిన ద్రావిడుల భాషలనే ద్రావిడ భాషలంటారు. క్రీస్తు పూర్వం సుమారు 3,500 సంవత్సరాల క్రితం ద్రావిడులు వాయవ్య మార్గంలో భారత దేశానికి వచ్చారని చెప్పవచ్చు. ఈ కుటుంబానికి చెందిన 'బ్రాహుయీ' భాష ప్రస్తుత పాకిస్తాన్‌లో భాగమయిన బెలూచి రాష్ట్రంలో నేటికీ వాడుకలో ఉంది. మరో రెండు భాషలు కూడా ఉత్తర భారతదేశంలోనే ఉన్నాయి. 'కురుక్' భాష ఛోటా నాగపూర్ పరిసరాల్లోనూ, 'మాల్తో' భాష రాజ్‌మహల్ పర్వత ప్రాంతాల్లోనూ ఒరిస్సాలోని సంతాల్ పరిగణాల్లోనూ వినిపిస్తున్నాయి. ఈ మూటినీ కలిపి ఉత్తర ద్రావిడ భాషలోని ఒక ఉపకుటుంబంగా పరిగణిస్తున్నారు.

భారతదేశం మధ్యభాగంలో మరికొన్ని ద్రావిడ భాషలు వ్యవహారంలో ఉన్నాయి. అవి : 'తెలుగు, గోండీ, కొండ, పెంగో, మండ, కుయీ, కువీ, కోయ, కొలామీ, నాయకీ, పర్జీ, గదబ, ఒల్లారి' భాషలు. క్రీస్తు పూర్వం 9-12వ శతాబ్దాల మధ్యకాలంలో మూలద్రావిడ భాషనుంచి విడిపోయి ప్రత్యేక భాషగా పరిణమించిన 'తెలుగు'లో దక్షిణ ద్రావిడ భాషల లక్షణాలుకూడా చాల ఉన్నప్పటికీ అది మధ్య ద్రావిడ భాషలకే మరింత సన్నిహితంగా ఉందని చెప్పవచ్చు. తెలుగు తప్ప తక్కిన భాషల్లో లిఖితసాహిత్యంలేదని చెప్పవచ్చు. అయితే 'గోండి' ఒకప్పటి నాగరక భాష. కాలక్రమాన అది అలిఖిత భాషా స్థితినుంచి ఇటీవలి కాలంలో లిఖిత భాషాస్థాయికి ఎదుగుతున్నది. ఆంధ్ర ప్రదేశ్‌లోని అదిలాబాద్ జిల్లా, మధ్యప్రదేశ్‌లోని బస్తర్, చాందా, నాగపూర్, వార్ధా ప్రాంతాల్లో, మహారాష్ట్రలోని యోట్మల్ జిల్లాలోను గోండులు నివసిస్తున్నారు. అలిఖిత ద్రావిడ భాషల్లో గోండీనే ఎక్కువమంది పండితులు అధ్యయనం చేసారు. 19వ శతాబ్దంలో క్రైస్తవ మిషనరీలు రోమన్‌లిపిలో గోండీ వ్యాకరణాలు రచించారు. దేవనాగరి, మరాఠి లిపుల్లో వాచకాలు రాసి గోండీ బోధించారు. ఇప్పుడు తెలుగులిపిలో గోండీ నేర్పుతున్నారు. సాంస్కృతికంగా గోండులు ఒకప్పుడు ఉచ్చస్థితిలో ఉండేవారు. స్వాతంత్ర్యప్రియులు కాబట్టి నైజాం నవాబు మీద వాళ్ళు తిరుగుబాటుకూడా చేసారు. 'కొండ' భాషకు మరో పేరు 'కూబి'. ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్టణం ఏజన్సీ ప్రాంతాల్లోను, ఒరిస్సాలోని కోరాపుట్ జిల్లాలోను కొండవారు నివసిస్తున్నారు. ఒరిస్సా రాష్ట్రంలోని కోరాపుట్ లోనూ ఆంధ్రప్రదేశ్ సరిహద్దుల్లోనూ వినిపిస్తున్న మరో మధ్య ద్రావిడభాష 'పెంగో' ఇటీవలనే బయటపడ్డ మరో మధ్య ద్రావిడభాష 'ముండ' 'కుయీ' భాష ఒరిస్సాలోని పుల్బణి, గంజాం జిల్లాల్లో వినిపిస్తుంది. 'కువీ' భాషవారికి 'ఖోండ్, సామంత, జాతాపు, కోదు' వాళ్ళనే పేర్లున్నాయి. ఒరిస్సాలోని గంజాం, కలహంది, కోరాపుట్ జిల్లాల్లోనూ మన రాష్ట్రంలోని విశాఖపట్టణం జిల్లాలోను వాళ్ళు నివసిస్తున్నారు. 'కోయ' భాష 'గోండీ' మాండలికమని కొందరన్నారుగాని సరికాదు. ఈ ప్రత్యేకభాష ఆంధ్రప్రదేశ్‌లోని వరంగల్, ఖమ్మం, ఉభయ గోదావరి జిల్లాలోనూ ఒరిస్సాలోని కోరాపుట్ జిల్లాలోనూ వినవస్తుంది. 'కొలామీ' భాష మహారాష్ట్రలోని అదిలాబాద్ జిల్లాలో, మహారాష్ట్రలోని యోట్మల్, జిల్లాలో, మధ్యప్రదేశ్‌లోని వార్ధా జిల్లాలో వాడుకలో ఉంది. మహారాష్ట్రంలోని కరీంనగర్, అదిలాబాద్ జిల్లాల్లో 'నాయకీ' భాష వ్యవహారంలో ఉంది. మధ్యప్రదేశ్‌లోని బస్తర్ ప్రాంతంలో వినిపించే మరో భాష 'పర్జీ'. దానికే 'పరోజ' అనే మరో పేరుంది. శ్రీకాకుళం జిల్లాలోని సాలూర్ తాలూకాలో వినిపించే మరో మధ్య ద్రావిడభాష 'గదబ'. దీన్నే 'కొండెకోర్ గదబ' అని కూడా వ్యవహరిస్తారు. 'ఒల్లారి' భాష కోరాపుట్ జిల్లాలో వ్యవహారంలో ఉంది. క్రీస్తు శకారంభ సమయంనుంచీ తెలుగుభాష అస్తిత్వాన్ని శాసనాల ద్వారా గుర్తించగలం. తెలుగు సాహిత్యభాష. తక్కిన మధ్య ద్రావిడభాషలన్నీ అలిఖిత భాషలు. భాషా శాస్త్రజ్ఞులు ఆయా భాషలకు వ్యాకరణాలు రాస్తున్నారు. ఆయా ప్రజల వాడుకలో ఉన్న పాటలనూ కథలనూ గ్రంథస్థం చేస్తున్నారు.

ద్రావిడ భాషాకుటుంబానికి చెందిన మూడో ఉపకుటుంబం దక్షిణ ద్రావిడం. ఈ ఉప కుటుంబంలోనే తమిళం, కన్నడం, మలయాళం అనే మూడు సుప్రసిద్ధ సారస్వత భాషలున్నాయి. ఇవిగాక 'తుళు, తోద, కోట, కొడుగు' అనే మరి నాలుగు భాషలున్నాయి. 'ఎరుకల, దొర్లి, కురుబ, ఎరవ, కైకడి, ఇరుల, కొరవ, బుర్గుండి, బదగ' అనేవి పై సారస్వత భాషలకు మాండలికాలనీ, ప్రత్యేకభాషలేననీ వాదోపవాదాలున్నాయి. కాని అవికూడా మొత్తంమీద దక్షిణ ద్రావిడ భాషలే అనటంలో విప్రతిపత్తి లేదు. కేరళ రాష్ట్రంలోని కాసర్గోడ్ ప్రాంతంలో, కర్నాటక రాష్ట్రంలోని మంగళూరు, ఉడిపి, దక్షిణకెనరా జిల్లాల్లో తుళుభాష వినిపిస్తుంది. క్రైస్తవ మిషనరీలు కన్నడ లిపిలో వ్యాకరణ గ్రంథాలు, వాచకాలు, కొంత సాహిత్యం ఈ భాషలో ప్రచురించారు. క్రమంగా సాహిత్య భాషగా పరిణమిస్తున్నదీభాష. కర్నాటక పశ్చిమ ప్రాంతాలోని కూర్గు పరిసరాల్లో వినిపించే దక్షిణ ద్రావిడభాష 'కొడగు' దానినే 'కొడగి, కూర్గి' అనికూడా పిలుస్తారు. తమిళనాడులోని నీలగిరి కొండల చుట్టుపక్కల వినిపించేవి

Dr. BRAOU LIBRARY Acc. No: CM-0437
Class No: 894.827
తెలుగు

'తొద, కోట' అనేవి రెండు. దక్షిణ ద్రావిడభాషలు క్రీస్తుపూర్వం 1500-1100 మధ్యకాలంలో మూలభాష నుంచి వేరు పడ్డాయని ఊహిస్తున్నారు.

ద్రావిడ భాషలవారు మొహంజొదారో హరప్పా సంస్కృతిని పెంచి పోషించిన వాళ్లనీ అక్కడి శిథిలాల్లో దొరుకుతున్న 'చిత్రలిపి'లో మూల ద్రావిడ భాష కనిపిస్తుందనీ చాలామంది విశ్వాసం. ఇటీవల రష్యన్లు కంప్యూటర్ల ద్వారా ఆ లిపిని సరిగా అర్థం చేసుకోవాలని ప్రయత్నించారుగాని పూర్తిగా కృతకృత్యులు కాలేక పోయారు. ప్రముఖ పురాతత్వ శాస్త్రవేత్త ఎస్.ఆర్. రావు ఇండో యూరోపియన్ కుటుంబంలో ప్రాచీన ఇండో ఆర్య శాఖకు చెందిన భాషగా నిర్ధారించటానికి ప్రయత్నించారు. మొదటి భాగంలో చెప్పినట్లు దీని విషయమై ఇదమిత్థంగా చెప్పలేము. స్పష్టంగా తెలిసినంతలో సాహిత్యభాషలైన నాలుగు ద్రావిడభాషల్లోనూ లిపి రమారమి క్రీస్తుపూర్వం అయిదో శతాబ్దంలో వెలసిందని, దానికి మూలం 'బ్రాహ్మీలిపి' అని పండితులు విశ్వసిస్తున్నారు. దక్షిణ భారతంలో వాడుకలోకి వచ్చిన బ్రాహ్మీలిపిలో కొన్ని మార్పులు కనిపిస్తాయి. దాన్ని 'ద్రావిడీ, డామిలీ' లిపులనీ 'భట్టిప్రోలు లిపి' అనీ వ్యవహరిస్తుంటారు. ఈ లిపి భేదం నుంచే ఈ భాషల లిపులన్నీ ఉద్భవించాయని చెప్తారు. తెలుగు కన్నడ భాషలకు క్రీ.శ. 1300 దాకా ఒకే సాధారణ లిపి ఉండేది. అది క్రీ.శ. 1030 నుంచే వేరు పడటం మొదలయినా, నేటికీ ఈ రెండు లిపుల్లోనూ చాలా పోలికలు కనిపిస్తాయి. తమిళ భాషీయులు రెండు లిపిభేదాలు వాడారు. వారిప్పుడు సాధారణంగా వాడే "వట్టెఝుత్తు" అనే లిపిలో సరళాలకు గ, జ, డ, ద, బ లకు గుర్తులులేవు. ఒత్తక్షరాలు లేవు. సంస్కృత గ్రంథాలను తమిళంలో రాసేందుకు వాళ్ళు మరో లిపిభేదం వాడారు. దాని పేరు 'గ్రంథాక్షరి' సంస్కృత గ్రంథాలను 'దేవనాగరి'లో కాక ఆయా భాషలవాళ్లు తమ సొంతలిపుల్లో రాసుకునే ఆచారం ఉంది. సంస్కృత ప్రాకృత భాషలు మాత్రమే లిపిబద్ధంగా ఉండేవిగాని, ప్రస్తుతం వాడుకలో ఉన్న ఆధునికార్యభాషల్లో ఏ ఒక్కటీ శాసనాలకెక్కలేదు ! కానీ సాహిత్య భాషలయిన ద్రావిడ భాషలు నాలుగూ చాలా ప్రాచీనకాలంనుంచే లిపిబద్ధమై రాతిస్తంభాలమీద, రాగి రేకులమీద శాసనాలుగా ప్రత్యక్షమవుతున్నాయి. ప్రధాన ద్రావిడ భాషలన్నిటిలో తమిళానికి ప్రాచీనతా గౌరవముంది. తమిళ శాసనాలు క్రీస్తుశకారంభంనుంచీ దొరుకుతున్నాయి. సాహిత్యం క్రీస్తుపూర్వం 6వ శతాబ్దంనుంచీ ఉందని తమిళ పండితులు వాదిస్తారు. కన్నడ శాసనాలు క్రీస్తుశకం 450 నుంచి, సాహిత్యం 800 నుంచీ లభిస్తున్నాయి. తెలుగు శాసనాలు క్రీస్తుశకం 575 నుంచీ, చీలిపోయి ప్రత్యేకభాషగా పరిణమించింది. క్రీస్తుశకం 10వ శతాబ్దంలో, ఆ భాషా సాహిత్యం క్రీస్తుశకం 13వ శతాబ్దంనుంచీ దొరుకుతున్నది. ఈ భాషలు నాటినుంచి వీటిమీద సంస్కృత ప్రాకృత భాషల, సాహిత్యాల ప్రభావం అపారంగా ఉంది. భారత భాగవత రామాయణాది సంస్కృత మహాకావ్యాల, పురాణాల ప్రభావం నేటి ఆర్య భాషల మీద కన్నా చాలా ముందుకాలంలోనే ఈ భాషలమీద ప్రసరించింది; శాస్త్రసాహిత్యం, వచన సాహిత్యం ఈ ద్రావిడ భాషల్లోనే ముందుగా పుట్టాయి. ద్రావిడభాషల ఇప్పటి రూపాల నుంచి పూర్వపూర్వ రూపాలను ఊహించవలసి వస్తున్నది. వీటికి మాతృక అని మనం భావించే 'మూలద్రావిడ భాష' మనకు లభించలేదు. కానీ నేటి ఆర్యభాషల మూలభాష సంస్కృతం మూల ద్రావిడంకన్నా చాలా ప్రాచీనమని నిదర్శనపూర్వకంగా చెప్పవచ్చు. సంస్కృత సాహిత్య విషయంకూడా అంతే. ద్రావిడ భాషీయులు మలేషియా, దక్షిణాఫ్రికా, మారిషస్, బర్మాల్లోనూ, పసిఫిక్ మహాసముద్ర మధ్యంలోని ఫిజీద్వీపాల్లోనూ, ఇటీవలి కాలంలో అరబ్ దేశాల్లోనూ వ్యాపిస్తున్నారు. వలసపోయేవారిలో తమిళులు ఎక్కువ, తరువాత మలయాళీలు, ఆమీదట తెలుగువాళ్లు, వలస పోయే కన్నడిగుల సంఖ్య చాలా తక్కువ.

### 2.3.3 ఆర్య భాషా కుటుంబం

ఆర్య భాషల విషయంలో ప్రాచీన, మధ్యకాలిక, ఆధునిక విభజన సులభసాధ్యం. ద్రావిడ భాషల విషయంలో అది ఊహాజనితం. క్రీస్తు పూర్వం 10వ శతాబ్దంలోనే ఆర్యులు భారతదేశంలో అడుగుపెట్టారు. క్రీస్తు పూర్వం 6-5 శతాబ్దాల మధ్య వారి మొదటి భాషలో చాలా మార్పులు వచ్చాయి. తొలిదశలోని వారి భాషను 'వైదిక సంస్కృత' మని, మలిదశలోని భాషను 'లౌకిక సంస్కృత' మని వ్యవహరిస్తారు. నాలుగు వేదాలూ, అరణ్యకాలూ, ఉపనిషత్తులూ మొదలైనవి వైదిక సంస్కృత గ్రంథాలయితే, కాళిదాసాదులు రచనలూ అంతకు ముందున్న భారత రామాయణాదులూ ఆ భాషలను సంస్కరించగా 'సంస్కృత' భాష ఏర్పడిందని అది విద్యావంతుల భాష మాత్రమేననీ, దానికి పూర్వరూపంగా దేశంలోని నానా ప్రాంతాల్లో 'ప్రాకృత' భాషలుండేవనీ, కొందరి అభిప్రాయం. సంస్కృతమే కాలక్రమాన ప్రాకృత భాషలుగా పరిణమించిందనీ మరికొందరి విశ్వాసం. ఆర్య భాషల్లోని తూర్పుశాఖను 'ఇండో-ఇరానియన్' భాషా కుటుంబమంటారు. కొందరు దాన్ని 'హింద్వార్య



BRAOU

భాషా కుటుంబ' మంటారు. సంస్కృతం ఈ కుటుంబానికి చెందిన భాష. వైదిక సంస్కృతానికి 'ఇరానియన్/పర్షియన్' భాషకూ, యూరప్‌లోని ప్రాచీన భాషలైన లాటిన్, గ్రీకులకూ చాలా దగ్గరి పోలికలున్నాయి. ద్రావిడ నిషాద భాషల ప్రభావంవల్ల సంస్కృతంలో చాలా మార్పులు వచ్చాయి. విశాలమైన దేశంలో వాడుకలో ఉన్న భాష కాబట్టి సహజంగా అనేక మాండలిక భేదాలతో ప్రాకృత భాషలుగా పరిణమించిందనీ, క్రీస్తు పూర్వం 3వ శతాబ్దంలో 'పాలీ' భాషగా ఒక మాండలికం చెలామణి అయిందనీ కొందరంటారు. తక్కిన మాండలికాలు అవి వాడుకలో ఉన్న ప్రాంతాల పేర్లనే తమ పేర్లుగా పెట్టుకొని 'మహారాష్ట్రి, సౌరసేనీ, మాగధీ' మొదలుగా వ్యవహృతమయినా యంటారు. సంస్కృతాన్ని, ప్రాచీనార్య భాష' అనీ, పాలీ ప్రాకృతాలను 'మధ్యార్య భాష' అనీ పిలుస్తారు. భరతముని వంటివాళ్లు ఈ మధ్యార్య భాషలను 'విభాష' అని పిలిచారు. క్రీస్తు శకం 600 నాటికి ఈ మధ్యార్య భాషలకు 'అపభ్రంశ భాష' అనే పేరు వచ్చింది. 'అర్ధమాగధి' వంటి పేర్లున్న ఈ అపభ్రంశ భాషల నుంచే ఇప్పటి 'ఆధునికార్య భాష' లు ఉద్భవించాయి. వీటిని 'బాస' లంటారు. రమారమి క్రీస్తుశకం 1000 నాటికి ఈ మార్పు జరిగిందని చెప్పవచ్చు. ఇప్పటి ఆర్య భాషల విషయంలో ఓ విశేషముంది. పశ్చిమ సరిహద్దులోని రాజస్థాన్ నుంచి తూర్పు సరిహద్దు రాష్ట్రమయిన పశ్చిమ బెంగాల్ దాకా ఉత్తర భారతదేశంలో వ్యవహారంలో ఉన్న 'భాష'లకు చాలా పేర్లున్నా అవన్నీ 'హిందీ మాండలికాలు' గానే చెలామణీ అవుతున్నాయి. వాటిలో కొన్ని శతాబ్దాల క్రితం సాహిత్య భాషలుగా ఉన్న ప్రస్తుతం వాటి ప్రత్యేక ప్రతిపత్తి తగ్గిపోతున్నది. ఆ కారణాలు కొన్నింటిని పూర్వ భాగంలో చదివి ఉన్నారు. భౌగోళిక పరిస్థితిబట్టి ఆధునికార్య భాషలను ఆరు వర్గాలుగా విభజించవచ్చు.

1. వాయువ్య వర్గం : ఇందులో "హిందీ, లహందా/పశ్చిమ పంజాబీ, కచ్ఛీ" భాషలున్నాయి.

2. దక్షిణ వర్గం : ఇందులో 'మరాఠీ' భాష ఉంది. గోవాలోనూ, మహారాష్ట్ర సముద్ర తీరాల్లోనూ వాడుకలో ఉన్న 'కొంకణీ' భాషను కూడా కొందరు ఈ వర్గంలో చేరుస్తారు.

3. ప్రాగ్వర్గం : ఒరియా, అస్సామీ, బెంగాలీ, బీహార్(మైథిలీ, మాగహీ, భోజ్‌పురి) హల్బీ' భాషలు ఈ వర్గంలోవి. వీటిలోని మొదటి మూడు భాషలూ 'మాగధీ ప్రాకృతం'లో నుంచి పుట్టినవి. 'మైథిలీ' లో క్రీ.శ. 14వ శతాబ్దినాటి విద్యావతి రచించిన భక్తి సాహిత్యం చాలా ఉంది. ఛోటానాగపూర్ ప్రాంతంలో వాడుకలో ఉన్న 'భోజ్‌పూరీ' లోనే క్రీ.శ. 15వ శతాబ్దినాటి కబీర్ సాహిత్యం వచ్చింది. 'అవధీ/కోసలీ' అనే పేరు గల ప్రాకృతాపభ్రంశంలోనే తులసీదాస్ క్రీ.శ. 12వ శతాబ్దంలోని రామాయణ మహాకావ్యం రచితమయింది. బెస్తర్ ప్రాంతాల్లో 'హల్బీ' వాడుకలో ఉంది.

4. ప్రాఙ్మధ్యమ వర్గం : 'పహాహీ, ఖడీబోలీ, బ్రజ్, కనౌజి, బుందేలీ, డోగ్రీ, గుజరాతీ, రాజస్థానీ (మాలవీ, మార్వారీ, జయపురీ, మేవారీ, బీలీ) మాండలీకాలూ భాషలూ ఈ వర్గానికి చెందినవి. వీటిలో గుజరాతీ భాషకు ప్రత్యేక సాహితి భాషా ప్రతిపత్తి ఉంది. ఇది గుజరాతీ భాషా శౌరసేనీ అపభ్రంశం నుంచి (క్రీ.శ. 600-1300) మధ్యకాలంలో పుట్టాయంటారు. 'శౌరసేనీ' క్రీస్తుపూర్వం 3వ శతాబ్దానికి మధ్యకాలంలో బౌద్ధులు అభిమానించి సాహిత్యం సృష్టించిన 'పాలీ' భాష నుంచి పుట్టిందంటారు. క్రీ.శ. 15వ శతాబ్దంలోని మీరా కీర్తనలు అంతకుముందే సుప్రసిద్ధమైన 'డింగల్ సాహిత్య'మూ రాజస్థానీలో వచ్చాయి. కాని ప్రస్తుతం 'రాజస్థానీ' ప్రత్యేక భాషాత్వం కోల్పోయి 'హిందీ'కి మాండలికంగా మారిపోయింది. తక్కినవన్నీ మాండలికాలే. 'ఖడీబోలీ' ఢిల్లీ ప్రాంతంలో పుట్టి ప్రస్తుతం 'సర్కారీ భాష' గా మారింది.

5. ఉత్తర వర్గం : దీనికే 'మహారీవర్గం' అనే మరో పేరుంది. 'పహారీ, గోర్ఖాలీ, గర్వాలీ, కుమాయూనీ' మాండలికాలు ఈ వర్గంలోవి. ప్రాంతాల పేర్లనే వీటికి పండితులు పెట్టారు.

6. విదేశ వర్గం : శ్రీలంకలోని 'సింహలిస్' భాష మాల్దీవుల్లో మాట్లాడే 'మాల్దీవియన్' భాష, యూరప్ ఖండమంతటా దేశదిమ్మరులుగా తిరిగే జిప్సీలు వాడే 'రోమానీ' భాష ఈ వర్గానికి చెందినవి.

పై వర్గాల్లో చేరని మరో ఆర్య భాష 'దర్దిక్' ఉపకుటుంబానికి చెందిన 'కాశ్మీరీ' భాష. క్రీ.శ. 13వ శతాబ్ది నుంచీ సాహిత్య భాష అయిన కాశ్మీర్ లోయలో వాడుకలో ఉంది. ఇదిగాక ఆ రాష్ట్రంలోనే 'పష్టో, బలూచీ బురుషాకీ' వంటి ఆర్య భాషా విశేషాలు వ్యవహారంలో ఉన్నాయి. దేశవ్యాప్తంగా (ఉత్తర దక్షిణ భారత ప్రాంతాలన్ని



BRAOU

టిలో) వ్యాపార రంగంలో విస్తృతంగా సాహిత్యరంగంలో పరిమితంగానూ వ్యాప్తిలో ఉన్న మరో ఆర్య భాషా విశేషం 'ఉర్దూ'. ఇది అరబిక్ లిపిలో రాసే పెర్షో-అరబిక్ పదజాలం ఎక్కువగా వాడే, 'హిందీ' భాషా రూపమేననీ, సాంఘిక రాజకీయ కారణాలవల్ల ప్రత్యేక భాషగా రాజ్యాంగం గుర్తింపుపొందిందనీ పూర్వ భాగంలో తెలుసుకున్నారు. ముస్లిం ప్రభువుల పాలనలో ప్రత్యేకంగా సైనిక శిబిరాల్లో ఉద్భవించిన ఈ భాషా విశేషానికి సాహిత్య స్థాయి కలిగింది. క్రీ.శ. 15వ శతాబ్దిలో మొదటిసారిగా దక్షిణ భారతంలోనే ఈ రూపాన్ని 'దఖినీ' అని పిలుస్తారు. ఉత్తర ప్రాంతంలో ఉర్దూలో క్రీ.శ. 18వ శతాబ్దంలో సాహిత్య మేర్పడింది. బ్రిటిష్ పరిపాలన కాలంలో హిందీ బోధనకన్నా ఉర్దూ బోధనకే అధిక ప్రాముఖ్యమిచ్చారు. ఈ రెండు రూపాలను కలిపి 'హిందుస్తానీ' అని వ్యవహరిస్తారు. రాజ్యాంగంలో హిందుస్తానీ శబ్దాన్ని ఒకేసారి వాడినా 8వ షెడ్యూల్లో దాని ప్రస్తావన రాలేదు!

ఆర్య భాషల్లో వేదసాహిత్యం నుంచి ఆధునిక సాహిత్యం దాకా లభిస్తుంది. సంస్కృతం ఎంతో ప్రాచీన భాష అయినా అది వేల సంవత్సరాలపాటు నోటిమాటగానే వాడుకలో ఉందనాలి. క్రీస్తు పూర్వం ఆరో శతాబ్దిలో లహందా భాష మాండలికమైన 'గాంధారి' మాతృ భాషగాగల పాణిని సంస్కృత భాషకు పరమాద్భుతమైన వ్యాకరణ గ్రంథం రాశాడు. బహుశా ఆ నాటికే సంస్కృతం లిపిబద్ధమయిందని చెప్పవచ్చు. ఆయన 'లిపి/డిపి' శబ్దం ప్రయోగించాడు. అంతదాకా సంస్కృత భాషాధ్యయనం శ్రుతమార్గం' (Oral Methods) లోనే సాగిందని చెప్పవచ్చు. వాయవ్యప్రాంతంలో క్రీ.పూ. 800 ప్రాంతాల్లో 'ఖరోష్ఠి' అనే లిపి కొద్దికాలం పాటు వ్యాప్తిలో ఉంది. అప్పటి అరబిక్ లిపిలాగా ఆ లిపిని కుడినుంచి ఎడమకు రాసేవారు. ఆ తరవాతనే 'బ్రహ్మిలిపి' అవతరించింది. ఈ లిపి సుమేరియన్ల నుంచి సంక్రమించిదంటారు. ఇదే ప్రస్తుత భారతీయ లిపులన్నిటికీ మూల రూపమంటారు. క్రీ.పూ. 300 నాటి అశోకుడి 'ధమ్మలిపి' బ్రాహ్మిలిపి నుంచే పుట్టింది. అంతకుముందు కాలంలోనే 'ద్రావిడీ/డామిలీ' అనే పేరిట ఆ లిపి దక్షిణ భారతదేశంలో వ్యాపించింది. దానికే 'భట్టిప్రోలు లిపి' అని మరో పేరుంది. ఈ లిపి భేదం నుంచే ద్రావిడ భాషల లిపి విశేషాలేర్పడ్డాయని ఇంతకుముందే గ్రహించాము. ఇదే ప్రాచ్య దేశాలకూ బౌద్ధులతో పాటు వ్యాపించింది. ప్రస్తుతం 'హిందీ'ని రాసే 'నాగరీ/దేవనాగరీ' లిపి బ్రాహ్మి లిపికి ఉత్తరాది రూపం. రాష్ట్రభాషగా ఉన్న హిందీని దేవనాగరీలిపిలోనే రాయాలని, అరబిక్ అంకెలనే వాడాలని భారత రాజ్యాంగం నిర్దేశిస్తున్నది. ఔత్తరాహులు పూర్వం భూర్జ పత్రాల మీద మోదుగరసంతో రాసేవాళ్ళు. దాక్షిణాత్యులు తాటాకులమీద గంటంతో రాసేవారు. ఈ వస్తు భేదం వల్లనే బ్రాహ్మిలిపి భిన్నరూపాలు ధరించింది. నేటి బెంగాలీ, అస్సామీ లిపుల మధ్య పెద్ద భేదంలేదు. పంజాబీ ముస్లిములు అరబిక్ లిపిలోనూ హిందువులు నాగరీలిపిలోనూ రాసినా శిక్కులు నాగరి భేదమయిన 'గురుముఖి' లోనే రాయాలని పట్టుబడ్డున్నారు. పడమటి తీరభాషల్లో సుమారు క్రీ.శ. 14వ శతాబ్దం నుంచి 'మోడీలిపి' అనే గొలుసుకట్టు రాత మరొకటి వాడుకలోకి వచ్చి వ్యాపార రంగంలో స్థిరపడింది. క్రమంగా దాని వాడుక తగ్గిపోతున్నది. లిపి ఉన్నాలేకపోయినా వేదకాలం నుంచీ సంస్కృత సాహిత్యం అవిచ్ఛిన్నంగా ఉంది. నేటికీ రాజ్యాంగం ఆ భాషను జాతీయ భాషల్లో ఒకటిగా గుర్తించింది. విద్యావంతుల భాషగా నాటికీ నేటికీ సంస్కృతానికి గౌరవముంది. రాజస్థానీలో వచ్చిన చాంద్ బర్దాయ్ రాసిన 'పృథ్వీరాజ్ రాసో' అనేదే బహుశా నేటి ఆర్యభాషల్లో వెలసిన తొలి గ్రంథం. ప్రాకృతదశలో ఉండగా మహారాష్ట్రి ప్రాకృతమే ప్రకృష్టమైన భాషగా ప్రసిద్ధికెక్కింది. క్రీ.శ. 13-14 శతాబ్దాల నుంచి మాత్రమే నేటి ఆర్య భాషల్లో సాహిత్యం నిరంతరంగా పుట్టింది. బ్రిటిష్ మహాయుగంలోనే ఆ భాషల్లో ఉత్తమ సాహిత్యం, రాశిలో కూడా జన్మించింది. సాహిత్య భాషలుగా ద్రావిడ భాషా కుటుంబానికి చెందిన తమిళం, కన్నడం, తెలుగు, మలయాళీలు నేటి ఆర్య భాషలకన్నా ఎంతో ప్రాచీనమయింది. ప్రాచీనార్య భాషల ప్రభావం ద్రావిడ భాషల మీద అపారంగా ఉన్నా, ద్రావిడ భాషలవల్ల సంస్కృతం నుంచి నేటి బెంగాలీ దాకా ఆర్య భాషలు ప్రభావితమైనాయి.

### 2.3.4 టిబెటో – బర్మన్ భాషా కుటుంబం

మనదేశానికి వలసవచ్చిన మంగొలాయిడ్ తెగలవాళ్ళు హిమాలయ పర్వత ప్రాంతాల్లోనూ ఈశాన్య ప్రాంతాల్లోనూ స్థిరపడి 'టిబెట్-బర్మన్' ఉపకుటుంబానికి చెందిన "సైనో-టిబెటన్" భాషలను వాడుకలోకి తెచ్చారు. ఈ భాషలు ప్రధానంగా రెండు రకాలు : సార్వనామిక భాషలని, అసార్వనామికాలని (Pronominalized and non-Pronominalized Languages) ఈ రెండు రకాలనూ కలిపి 'హిమాలయన్ వర్గభాష' లంటారు. పశ్చిమ బెంగాల్ ఉత్తర సరిహద్దుల్లోని డార్జిలింగ్ నగర పరిసరాల్లో సార్వనామిక భాష అయిన 'లేప్చా' భాష వాడుకలో ఉంది. దానికి సొంత లిపి కూడా ఉంది. నేపాల్ సరిహద్దుల్లో వాడుకలో ఉన్న 'నేవారీ' భాష అసార్వనామిక భాషల్లో ప్రఖ్యాతమయింది. ఈ భాషకూ్కడా ప్రత్యేక లిపి ఉంది. క్రీ.శ. 19వ శతాబ్దం నుంచీ సాహిత్యముంది. ఇది

BRAOU

సంస్కృత పదభూయిష్టమైన భాష. ఇందులో పురాణసాహిత్యం చాలా కలిసింది. బౌద్ధమత సాహిత్యం బాగా వచ్చింది. రాజకీయ ప్రోత్సాహంకూడా బాగా లభిస్తున్నందున నేవారీ సాహిత్యం దినదినాభివృద్ధి పొందుతున్నది. ఈశాన్య భారతంలో వాడుకలో ఉన్న టిబెటో - బర్మన్ భాషలను నాలుగు వర్గాలుగా విభజించవచ్చు. అవి :

1. ఉత్తర అస్సాం వర్గం : 'ఆక, అబోర్ - మిరి, మిష్మి' భాషలు

2. అస్సాం - బర్మీస్ వర్గం : 'బోడో-నాగ, కఛారీ, టిప్రాస్/మ్రుంగ్స్' భాషలు. 'బోడో' భాష బ్రహ్మపుత్ర లోయలోను, 'కఛారీ' అస్సాంలోని కఛారీ పర్వత ప్రాంతాల్లోను వాడుకలో ఉన్నాయి. నాగా రాష్ట్రంలో వాడుకలోవున్న 'నాగ భాష'లో అనేక మాండలికాలున్నాయి. వాటిలో 'అంగామీ, సీమా, రేగ్మా, ఆవో'వంటివి ప్రసిద్ధాలు.

3. కూకి-చిన్ వర్గం : ఈ వర్గానికి చెందిన భాషల్లో 'మెయ్‌థెయ్/మణిపురీ' భాష ప్రసిద్ధమయింది. మణిపూర్ రాష్ట్రంలో ఈ భాష వినిపిస్తుంది. దీనికి ప్రత్యేకమైన లిపి క్రీ.శ. 16వ శతాబ్దం నుంచీ వాడుకలో ఉంది. అఖండమైన మౌఖిక సాహిత్యమున్న ఈ భాషలో క్రీ.శ. 18వ శతాబ్దంనుంచి ముఖ్యంగా వైష్ణవ సాహిత్యం వెలుస్తున్నది. బర్మా సరిహద్దులో వ్యవహృతమైన "లూషాయ్ మికిర్" భాష ఈ వర్గానికి చెందిందే. ఇందులో జానపద సాహిత్యం అపారంగా ఉంది.

4. టిబెటన్ వర్గం : టిబెట్ సరిహద్దుల్లోని లడఖ్‌లో వ్యవహారంలో ఉన్న 'లడఖీ' భాషను, సిక్కింలో వాడుకలో ఉన్న 'దెన్జాంగ్-కె' భాషను, భూటాన్లో వాడుకలో ఉన్న 'ల్హో-కె' భాషను ఈ వర్గంలో చేరుస్తారు. వీటిమీద ఆర్యభాషా ప్రభావంకన్నా టిబెటన్ భాషా ప్రభావమే ఎక్కువ. ప్రత్యేక లిపిగాని సాహిత్యంగాని ఈ భాషలకు ఏర్పడలేదు.

### అవగాహనప్రశ్న – 3

భాషా కుటుంబాలను పేర్కొని, వాటి ఉపకుటుంబాలనూ, శాఖలనూ 30 వాక్యాల్లో పరిచయం చేయండి.

BRAOU

## 2.4.0 భాషల పరస్పర సంబంధాలు

ప్రాచీన భారతదేశంలో భిన్న భాషలు మాట్లాడేవారిని గౌరవించేవారు. సంస్కృత నాటకాల్లో సమాజంలో ఆయా ప్రాంతాలకున్న స్థానాన్నిబట్టి భాష మారేది. రాజులూ, ఋషులూ సంస్కృతంలో ప్రసంగిస్తే, స్త్రీలూ, సేవకులూ ప్రాకృత భాషల్లో మాట్లాడేవారు. జైన బౌద్ధమతాలు ఉద్భవించి ప్రజాభాషలోనే రాశారు. అయినా శాస్త్రచర్చల్లో వైదిక పండితులతో సంస్కృతంలో వాదించేవారు. సంస్కృత పండితులు తమ రచనల్లో 'అర్ధమాగధి, శౌరసేని, మహారాష్ట్రి) ప్రాకృతభాష'లను సునాయాసంగా వాడేవారు. భరతముని ఎన్నో 'దేశ భాష'లను గురించి ప్రస్తావించాడు. హేమచంద్రుడివంటి పండితులు సంస్కృత ప్రాకృత పండితులు వాడే దేశ భాషాపదాలకు అర్థాలు వివరిస్తూ 'దేశీ నామమాల' వంటి నిఘంటువులు రాసారు. ఈ మాతృభాషలనుగాక ఇతర భాషను నేర్చిన వాళ్ళను గౌరవించారు. శ్రీనాథుడివంటి మన తెలుగు కవులు తనకెన్నో భాషలు వచ్చని గర్వంగా చెప్పుకున్నారు. చారిత్రక యుగంలో దక్షిణ భారతదేశంలో కూడా చాలాకాలం సంస్కృత ప్రాకృతాలే రాజభాషలుగా ఉండేవి. మతగ్రంథాల, శాస్త్రరచనల భాష కూడా చాలావరకు అవే. అయితే సంస్కృత

ప్రాకృతాల తర్వాత ప్రాచీన సాహిత్యమున్న తమిళంలో, క్రీస్తుశకం 9వ శతాబ్దం నుంచి సాహిత్యమున్న కన్నడంలో, క్రీస్తుశకం 11వ శతాబ్దంలోనే మహాకావ్యం వెలువడిన తెలుగులో ఆయా భాషా సాహిత్యాలు అవిచ్ఛిన్నంగా వర్ధిల్లుతున్నా, శాతవాహనుల కాలం నుంచి పల్లవులకాలందాకా ప్రాకృతం, ఆ తరవాత 16వ శతాబ్దందాకా సంస్కృతం ప్రాకృతాల ఆధిక్యం తిరుగులేకుండా నిలిచింది. ఇంగ్లీషువాళ్ళు వచ్చిన తరువాత రెండు శతాబ్దాలదాకా సంస్కృత సాహిత్యం యథావిధి గౌరవం పొందింది. దేశభాషల్లో ఏ గ్రంథం స్వతంత్రంగా వచ్చినా దానికి సంస్కృతంలో మూలం ఉండి ఉంటుందన్న విశ్వాసం నాటుకపోయింది. మత వ్యవహారాల్లో వీర వైష్ణవం తమిళాన్ని, వీరశైవం కన్నడాన్నీ అభిమానించి గౌరవించిన కాలంలో కూడా సంస్కృతానికి 'దేశభాష'గా గుర్తింపు ఉండేది. సంస్కృతంలో వెలసిన భారత భాగవత రామాయణాలకు సాహితీభాషలైన తమిళం, కన్నడం, తెలుగుల్లో చాలా ప్రాచీనకాలంలోనే అనువాదాలు వచ్చాయి. సంస్కృతంలాగా ఆర్యభాషలైన ఉత్తరభారత భాషల్లో కన్నా చాలా ముందుకాలంలోనే దక్షిణభారతంలోని ద్రావిడభాషల్లో పురాణాలు, చారిత్రక గ్రంథాలు, శాస్త్రగ్రంథాలు, వచనసాహిత్యం ఆవిర్భవించాయి. మచ్చుకు భారతం తమిళ కన్నడాల్లో క్రీ.శ. 10వ శతాబ్దంలోను, తెలుగులో 11వ శతాబ్దంలోనూ పుట్టగా, మరాఠీలో 13వ శతాబ్దంలోను, ఒరియాలో 14వ శతాబ్దంలోను, బెంగాలీలో 15వ శతాబ్దంలోను, అస్సామీలో 16వ శతాబ్దంలోను వెలసింది.

తక్కిన ఉత్తరాది భాషల్లో 18వ శతాబ్ది చివరిదాకా భారతం ప్రత్యేక గ్రంథంగా అవతరించలేదు. శాస్త్ర రచనల విషయంలో ఈ పరిస్థితి ఇంకా దయనీయంగా ఉంది ఆధునికార్య భాషల్లో అయినా భాషాసాహిత్య సంస్కృతులమీద సంస్కృత ప్రభావం నేటికీ నిరాఘాటంగా సాగుతూనే ఉంది. ఇందువల్ల కలిగిన మేలు ఏక జాతీయతా భావన.

### 2.4.1 సమైక్య కారణాలు

మధ్యయుగాల్లో భిన్నభాషా లక్షణాలను కలిపి మిశ్రభాషను వాడినా ఎవరూ తప్పుపట్టలేదు. తెలుగులో మలయాళంలో 'మణిప్రవాళశైలి'లో రాసిన మహాకవులున్నారు. అంటే దేశ్యశబ్దాలతో సంస్కృత పదాలను విభక్త్యంతాలతో సహా కలిపి రాసేవారన్నమాట. కబీర్ రాసిన 'దోహా' లోగాని, శిక్కుల ఆదికావ్యం 'గురుగ్రంథ సాహెబ్'లో గాని ఏ ఒక్క భాషనూ అన్యభాషామిశ్రణం లేకుండా వాడలేదు. అయినా ఆ గ్రంథాల గౌరవానికి లోపం రాలేదు. మరోవైపు అచ్చతెలుగు, జానుతెనుగు, 'అచ్చగన్నడం' వంటి సంస్కృతపదాలులేని స్వచ్ఛమైన దేశ భాషలో రాసిన గ్రంథాలకు ప్రజాదరణ లభించలేదు. అంటే నాటి సమాజం భాషావిషయకంగా, సంస్కృతి పరంగా ఎంతో అన్యోన్యభావాన్ని సహనాన్నీ ప్రదర్శించిందని అర్థం. అంతేకాదు. భాషా దృష్టితో చూస్తే వేర్పాటు వాదాన్ని అంగీకరించలేదని కూడా చెప్పవచ్చు. భిన్నమతస్థులయిన ముస్లిముల పాలనలోకి వచ్చిన భారత దేశంలో మతసహనం లోపించిన సందర్భాల్లోకూడా భాషాసహనం నిలదొక్కుకుంది. పర్షియన్, అరబిక్ పదాలనూ సాహిత్యాన్నీ భారతీయులు ద్వేషించకపోగా అభిమానించి ఆదరించారు. బహుకాల సహజీవన ఫలితంగా 'ఉర్దూ/హిందుస్థానీ' అనే కొత్త మిశ్రభాషనూ, సాహిత్యాన్నీ సృష్టించారుకూడా. అలాగే పోర్చుగీసువాళ్ళు, డచ్చివాళ్ళు, ఫ్రెంచివాళ్ళు వచ్చి భారతదేశంలో తమ తమ వలసలను స్థాపించుకున్నా, తరవాత ఆంగ్ల సామ్రాజ్యం మూడువందల సంవత్సరాలకు పైగా తమను దాస్యంలో ఉంచినా, భారతీయులు రాజకీయంగా తిరుగుబాటు చేసి కూడా భాషా సాహిత్యపరంగా ఆకర్షితులై అభిమానించారు. రాజకీయదాస్యంలో భాషా సాహిత్యాభివృద్ధినేకాక దేశ వ్యాప్తంగా ఏకత్వాన్ని అఖండతను సాధించారు. అంటే బహుభాషాభిమానం, బహుభాషలు నేర్వటం భారతీయులకు వెన్నతో పెట్టిన విద్య అయిందన్నమాట. పూర్వార్ధగోళంలో ఈ విశేషలక్షణం పర్యాప్తంగా ప్రస్ఫుటంగా కనిపిస్తుంది. దేశం మొత్తంమీద సంస్కృతపదాలు అన్నిభాషలవారి వాడుకలోనూ ఉన్నా, ఆయా ప్రాంతాల్లో భిన్నార్థాలతో భిన్నవిధోచ్చారణతో ఉన్నా, భారతదేశ అఖండతకు చిహ్నంగా నిలిచాయి - నిలుస్తున్నాయి. ఇటీవలి కాలంలో తమిళనాడులో సంస్కృత పదప్రయోగంలేని అచ్చమైన అరవబాషనే మాట్లాడాలి రాయాలి అనే మహోద్యమం వచ్చినా సామాన్య ప్రజలవాడుకలో 'జలం, సంసారం' వంటి మాటలు బలపడిపోతూనే ఉన్నాయి. అందువల్లనే నిన్న మొన్నటిదాకా - నిజానికి భాషారాష్ట్రవాదం వెర్రితలలువేసి స్వభాషాభిమానం పరభాషా ద్వేషానికి దారితీసేదాకా - తన మాతృభాష తప్ప మరోభాషరాని ముసలమ్మ కూడా ఆసేతుశీతాచలం ఏ ఇబ్బందీ లేకుండా తీర్థయాత్రలు చేయటం సాధ్యమయింది. పుణ్యక్షేత్రాల్లో బహుభాషలు నేర్చిన వాళ్ళున్నారు. స్వతంత్ర భారతదేశంలో హిందీని 'రాష్ట్రభాష'గా రాజ్యాంగం ద్వారా నిర్ణయించిన తరవాత, కాలక్రమాన హిందీమీది కోపం సంస్కృతంమీద ప్రసరించిన తరవాత, ఉత్తరభారతీయులు ఇంగ్లీషు వ్యతిరేకోద్యమం తీవ్రతరం చేసిన తరవాత, పరిస్థితిలో పెద్ద మార్పే వస్తున్నది. 'హిందూస్తానీ' ముక్కలు నాలుగు

BRAOU

నేర్చిన వ్యక్తి కూడా నిన్న మొన్నటిదాకా ఏ యిబ్బంది లేకుండా దేశపర్యటన చేయగలిగేవాడు. రానురాను ఇది సాధ్యపడటంలేదు. అయితే మధ్యయుగాల్లో సంస్కృతంలాగా, కొద్దికాలంక్రితం వరకు హిందుస్తానీలాగా, ఇప్పుడు ఇంగ్లీషు దేశసమైక్యానికి దారితీస్తున్నది. ఈ పరిస్థితి సమీప భవిష్యత్తుల్లో మారే యోచనలేదు. భారత రాజ్యాంగపరిషత్తు 1950 లో అధికార/జాతీయభాషను నిర్ణయించవలసి వచ్చిన సందర్భంలో, ఇంగ్లీషు స్థానే హిందీనా? సంస్కృతాన్నా; దేన్ని ఆమోదించాలన్న వాదం వచ్చింది. సభాధ్యక్షుడు వేసిన 'కాస్టింగ్‌వోటు'తో సంస్కృతం వీగిపోయి హిందీ గెలిచింది. ఫలితంలో రాజ్యాంగం అమల్లోకి వచ్చిన 15 సంవత్సరాల తరవాత అధికారభాషా గౌరవం పోగొట్టుకోవలసిన ఇంగ్లీషు పూర్వ గౌరవంతో మరికొన్ని దశాబ్దాలయినా ఉండే పరిస్థితి తప్పనిసరి అయింది. ఈ ఏర్పాటువల్ల దేశం మొత్తంమీద ఇంగ్లీషు, హిందీ, ఆయా ప్రాంతీయభాష - కనీసం మూడు భాషలు నేర్చుకోక తప్పదని తేలిపోయింది. అంటే ఈ దేశంలో బహుభాషా పరిస్థితి శాశ్వతంగానే ఉంటుందన్నమాట.

### 2.4.2 బహుభాషా జ్ఞానం ఆవశ్యకత

ప్రస్తుత ప్రపంచం శాస్త్రవిజ్ఞానం కారణంగా, రవాణాసౌకర్యాల వర్తక వాణిజ్యాల అభివృద్ధి కారణంగా నానాటికీ కుంచించుకపోతున్నది. అంతర్జాతీయశాస్త్ర, సాంకేతిక విజ్ఞానరంగంలో పాతనేతల స్థానంలో కొత్త దేశాలు తలెత్తుతున్నాయి. కాలక్రమాన స్పానిష్, జర్మన్, ఫ్రెంచి భాషల ప్రాబల్యం తగ్గి రష్యన్, జపనీస్, చైనీస్ భాషల ఆధిపత్యం వస్తుంది. అందువల్ల ఆధునిక ప్రపంచ దేశాల్లోని విద్యావంతులు స్వదేశ భాషలతోపాటు విదేశ అంతర్జాతీయ భాషలే ఒకటి రెండు నేర్చుకుంటున్నారు. రెండువందల సంవత్సరాల కేంద్రీకృతాధిపత్య పరిపాలనల కారణంగా భారతదేశాన్ని ఏకంచేసే అధికారభాషగా, వాణిజ్యభాషగా, సాంస్కృతికభాషగా ఆంగ్లేయులు ఇంగ్లీషును మనకు సంక్రమింపజేసారు. అందువల్ల భారతీయుల సాంస్కృతిక భాష సంస్కృతమైనా, ప్రస్తుత 'రాష్ట్రభాష' హిందీ అయినా, ఆ రెంటినీ స్వభాష మాతృభాషతోబాటు భారతీయులు అభ్యసించవలసి వస్తున్నది. విద్యావంతుల్లో బహుభాషా పరిజ్ఞానం ఆవశ్య సంపాదనీయమవుతున్నది. అక్షరాస్యత పెరిగేకొద్దీ జాతీయస్థాయిలో విద్యావిజ్ఞాన సముపార్జన తీవ్రతరమయ్యేకొద్దీ, సగటు భారతీయులు బహుభాషలు నేర్చే, మాట్లాడే, చదివే నేర్పు సంపాదించటం ఎక్కువవుతుంది. అంటే బహుభాషాస్థితి భారతదేశంలో శాశ్వత ప్రాతిపదికమీదే నెలకొన్నదని గుర్తించకతప్పదు.

రాజ్యాంగంలో జాతీయ భాషలుగా గుర్తింపు పొందినవి పదిహేనున్నా వాటిలోని సంస్కృతం ఈ రోజున జనవ్యవహారంలో ఉన్న భాషకాదు. ఉర్దూ హిందీలు వేర్వేరు భాషలా కాదా అన్నవివాదం రాజకీయ మత విభేదాలకు దారితీస్తుంది. నిజానికి భాషాశాస్త్ర దృష్టితో చూస్తే దేవనాగరి లిపిలో రాసిన ఉర్దూకు పెర్షో అరబిక్ లిపిలో రాసిన హిందీకి వాక్యనిర్మాణంలోకాని సర్వనామాల్లోగాని, ప్రాథమిక పదజాలంలోగాని, సామాన్య క్రియా రూపాల్లోగాని భేదమేలేదు. ఎటొచ్చీ ఉర్దూలో పెర్షో అరబిక్ పదాలు ఎక్కువయితే, హిందీలో సంస్కృత పదజాలం అధికం. మతపరమైన ప్రయోజనాలు దృష్టిలో పెట్టుకొన్నవాళ్లు మత రాజకీయ దృష్టితో ఇవి రెండూ ప్రత్యేక భాషలని వాదించి రాజ్యాంగం 8వ షెడ్యూల్లో భిన్నస్థానాలు సంపాదించారుగాని ఈ రెంటినీ ఒకటిగానే భావించి ఉమ్మడిమీద వాటికి 'హిందూస్థానీ' అనే పేరుబెట్టి, అదే రాష్ట్రభాష కావాలని వాదించిన గాంధీజీ రాజనీతిజ్ఞుడేకాక భాషావేత్తకూడా. సింధీని ప్రత్యేకభాషగా గుర్తించారు. 12 లక్షల పై చిల్లర ప్రజలు మాట్లాడే ఈ భాషకు జాతీయస్థాయిలో ఎటువంటి ప్రభావమూలేదు. ఒకనాడు మహాసాహిత్య భాషలుగా చెలామణి అయిన రాజస్థానీ, బీహారీ భాషలు జాతీయ భాషలనిపించు కోలేదుగాని భాషాప్రయుక్త రాష్ట్రవిభజన సూత్రం ప్రకారం ప్రత్యేక రాష్ట్ర ప్రతిపత్తి సంపాదించగలిగాయి. రాజ్యాంగరీత్యా, అది రాష్ట్రభాష అధికారభాష. అంటే దేశం మొత్తానికి ఇంగ్లీషుతోపాటు సహాధికారం చెలాయిస్తున్న ఈరూపంలో హిందీ రాజస్థాన్నుంచి పశ్చిమ బెంగాలు దాకా, హిమాలయ పర్వతపాదాలనుంచి ఆంధ్రప్రదేశ్ సరిహద్దుదాకా వ్యాప్తిలో ఉన్నది. అందులో అనేకానేక మాండలికాలున్నాయి. కొన్ని మాండలికాలు మాతృభాషగా హిందీ నేర్చినవాళ్ళకే అర్థంకానంత విలక్షణంగా ప్రత్యేకంగా ఉంటాయి. ఒక విధంగా హిందీవాళ్లే బహుభాషలు మాట్లాడుతున్నారని చెప్పవచ్చు. జాతి సమైక్య దృష్టిలో ఉత్తరభారత పౌరులు ఏదో ఒక దక్షిణాది ద్రావిడభాషనుకూడా నేర్చుకుంటే, అలా నేర్చుకోవాలనే ప్రభుత్వ నిర్ణయానికి త్రిభాషాసూత్రమని పేరు. అందువల్ల తక్షణ ప్రయోజనంలేకపోయినా జాతిసమైక్యం సాధ్యమవుతుంది. హరియానా తప్ప మరే ఉత్తర భారత రాష్ట్రమూ ఈ సూత్రాన్ని పాటించటంలేదు. అయినా

BRAOU

అన్యభాషలూ, ముఖ్యంగా ఇంగ్లీషు నేర్చుకోక తప్పటంలేదు. ప్రగాఢంగా కాకపోయినా ప్రవృత్తిరీత్యా కాకపోయినా భారతీయులకు బహుభాషా పరిజ్ఞానం తప్పదనటానికి ఇదో నిదర్శన.

## 2.5 సారాంశం

ఈ భాగంలో కింది ప్రధాన విషయాలను మీరు తెలుసుకున్నారు :

- భాషలమధ్య సమాన లక్షణాలను, దగ్గరి సంబంధాలను దృష్టిలో ఉంచుకొని భాషా శాస్త్రజ్ఞులు భారతదేశములోని భాషలను నాలుగు కుటుంబాలుగా విభజించారు. అవి.: 1. ఆస్ట్రో ఏషియాటిక్ భాషా కుటుంబం 2. ద్రావిడ భాషా కుటుంబం 3. ఆర్యభాషా కుటుంబం 4. టిబెటు - బర్మన్ భాషా కుటుంబం ఈ నాలుగు భాషా కుటుంబాలలో ఉపకుటుంబాలు, శాఖలు కూడా కన్పిస్తాయి.
- భారతదేశంలోని భాషల మధ్య పరస్పర సంబంధాలు, ప్రభావాలు దాదాపు నాలుగువేల ఏండ్ల క్రితం నుంచే కన్పిస్తాయి. బహుభాషా స్థితి వల్ల వివిధ భాషలను నేర్చుకోవలసిన అగత్యం ఉంటుంది. ఇది సమైక్యతకు కారణమవుతుంది.

## అవగాహన ప్రశ్నలకు జవాబులు

1. భారతదేశానికి మొట్టమొదట వలసవచ్చినవారు నీగ్రాయిడ్/నీగ్రిటో జాతివాళ్లు. ఆ తర్వాత కొలేరియన్/ముండేరియన్ భాషా కుటుంబాలకు చెందిన ఆస్ట్రోలాయిడ్ జాతివారు. వీరినే నిషాదులని అంటారు. తర్వాత వచ్చినవారు కిరాతులని పిలువబడే మంగోలాయిడ్ జాతి వారు. వీరుకాక 5000 సంవత్సరాల క్రితం మెడిటరేనియన్ సముద్రప్రాంతాలనుండి వలస వచ్చిన జాతిద్రావిడ జాతి. అందరికంటే చివర సుమారు 1500 సం॥ల క్రింద వచ్చిన జాతి ఆర్య జాతి. తొలిసారి వచ్చిన నిషాదులే భారతంలో అద్భుతమైన వ్యవసాయనాగరికత సృష్టించారు. ద్రావిడులూ, ఆర్యులూ నగర నాగరికతను పెంపొందించారు. ఐతే మొదటి మూడువేల సంవత్సరాల తర్వాత వచ్చిన జాతులు, మొదటి జాతులపై దండయాత్రచేసి పారద్రోలుతూ వచ్చాయి. ఈ ఘర్షణలో పోరుతోపాటు ఒకరి భాషా పదాలు మరొకరికీ, ఒకరి సంస్కృతీ చిహ్నాలు వేరొకరికి సంక్రమిస్తూ వచ్చి, ఆయా భిన్న జాతుల మధ్య సంకీర్ణ నాగరికత సృష్టిస్తూ వచ్చి భారతదేశంలో అఖండ జాతీయతను ఏర్పరచాయి.
2. శరీరభాగాలపేర్లు, సర్వనామపదాలు, సంఖ్యావాచకాలు, సాధారణక్రియలు, పరిసరాల్లో ఉండే సాధారణ వస్తువుపేర్లు, బంధుత్వ సూచక పదాలూవంటివి అన్ని భాషల్లోనూ ప్రాథమిక పదాలు. వాక్య నిర్మాణాన్నిచేసే విశేషణాలూ క్రియాపదాలూ, నామవాచకాలవంటివి ప్రత్యేక పదాలు. ఈ పదాలలోని క్రమం లేదా ఉచ్చారణ విధానం దాదాపు దగ్గరిగా, ఒకే రకంగా ఉండే భాషలను ఒకే కుటుంబంగా భాషా శాస్త్రజ్ఞులు పరిగణిస్తారు. భాషా కుటుంబ నిర్ణయంలో ప్రత్యేక పదాలకన్నా, ప్రాథమిక పదాలకే ప్రాముఖ్యం ఎక్కువ.
3. భాషాశాస్త్రజ్ఞులు భారతదేశంలోని భాషలను నాలుగు ప్రధాన కుటుంబాలుగా విభజించారు. అవి : 1. ఆస్ట్రో ఏషియాటిక్ భాషా కుటుంబం. 2. ద్రావిడ భాషా కుటుంబం 3. ఆర్యభాషా కుటుంబం. 4. టిబెట్ బర్మన్ భాషా కుటుంబం అనేవి. ఆస్ట్రోయేషియాటిక్ భాషా కుటుంబంలో 1. కొలో కోలియన్/ముండా 2. నికోబారిస్ 3. ఖాసి అనే మూడు ఉప కుటుంబాలున్నాయి. ఈ భాషలు దేశంనిండా మొట్టమొదటి సారిగా వ్యాపించాయి. సమూహం మీద ఈ భాషా కుటుంబాల వారందరినీ నిషాదులని వ్యవహరించేవారు.

   నిషాదుల తర్వాత మన దేశానికి క్రీ. పూ. 3,500 సంవత్సరాల క్రితం వచ్చిన ద్రావిడ భాషా కుటుంబంలోని బ్రాహుయీ, కురుక్ మాల్తో భాషలను కలిపి ఉత్తర ద్రావిడభాషా ఉపకుటుంబంగా వ్యవహరిస్తారు. తెలుగు, గోండీ, కొండ, పెంగో, మండ, కుయీ, కువీ, కోయ, కొలామీ, నాయకి, పర్జీ, గదబ, ఒల్లారి భాషలలో కలిసిన ద్రావిడ కుటుంబాన్ని మధ్య ద్రావిడ భాషా కుటుంబంగా వ్యవహరిస్తారు. వీటిలోని తెలుగు, కన్నడం, మలయాళం అనే మూడు భాషలూ; తుళు, తొద, కోత, కొడుగు అనే నాలుగు భాషలూ; దక్షిణ ద్రావిడ భాషా ఉపకుటుంబానికి చెందినా మూడు ఉపకుటుంబాలు దేశంలోని

BRAOU

ఉత్తర, మధ్య, దక్షిణ ప్రాంతంలో వ్యాప్తిలో ఉన్నాయి. ఆర్య భాషా కుటుంబంలోని సంస్కృతభాష ప్రాచీన, మధ్యకాలిక, ఆధునిక భేదాలతో విభజన పొందింది. దీన్ని తిరిగి వైదిక, లౌకిక సంస్కృతాలుగా విభజించారు. నాలుగు వేదాలూ, అరణ్యకాలూ, ఉపనిషత్తులూ వంటివి వైదిక విభాగంలోకి వస్తాయి. రామాయణ భారతాలూ, కాళిదాసాదుల కృతులూ లౌకిక సంస్కృత గ్రంథాలు. సంస్కృత ప్రాకృత పాళీభాషలు ఒకదానికొకటి రూపాంతరాలనే వాదాన్ని అనుసరించి, కేవల సంస్కృతాన్ని ప్రాచీనార్య భాష అనీ, పాళీ ప్రాకృతాలను మధ్యార్య భాషలనీ తిరిగి విభజించడం జరిగింది. చివరివర్గమైన ఆధునికార్య భాషలను దేశంలోని భౌగోళిక స్థితిననుసరించి ఆరువిధాలుగా విభజించారు. అవి :

1. వాయవ్యవర్గం 2. దక్షిణవర్గం 3. ప్రాగ్వర్గం 4ప్రాఙ్మధ్యమవర్గం 5. ఉత్తర వర్గం 6. విదేశ వర్గం. సింహలిస్ భాష మాల్దీవియన్ భాష, యూరప్ జిప్సీల రొమానీ భాష విదేశీ వర్గంలోకి వస్తాయి. చివరిదైన టిబెటోబర్మన్ భాషా కుటుంబం ఉత్తర అస్సాం వర్గం, అస్సాం బర్మీస్ వర్గం, కూకిచిన్ వర్గం, టిబెటన్ వర్గం అని నాలుగు విధాల విభజన పొందింది.

## చదవదగిన పుస్తకాలు

Suniti Kumar Chatterji - Indian Languages and Literature A. K. Biswas (ed.) Profiles in Indian Languages. Indian Languages Society, Indian Institute of Technology. Kanpur, 1985.

## మాదిరి పరీక్షా ప్రశ్నలు

I. కింది ప్రశ్నలకు 30 పంక్తులలో సమాధానాలు రాయండి.

1. భాష[illegible]గా వర్గీకరించే పద్ధతులు వివరించండి.
2. ఆస్ట్రిక్ ఉపకుటుంబ భాషలను పేర్కొని వాటి ప్రత్యేకతను విశదీకరించండి.
3. మధ్యద్రావిడ భాషలేవి ? వాటి వ్యాప్తినీ వాటిలోని సారస్వత లక్షణాలనూ పేర్కొనండి.
4. భారతీయ లిపి వికాసాన్ని చర్చించండి.
5. టిబెట్-బర్మన్ భాషాకుటుంబాల వ్యాప్తిని వివరించండి.

II. కింది ప్రశ్నలకు 10 పంక్తులకు మించకుండా సమాధానాలు రాయండి.

1. ద్రావిడ భాషలను పేర్కొనండి.
2. ఆర్య భాషలను పేర్కొనండి.
3. టిబెటో బర్మన్ భాషలను పేర్కొనండి.
4. ఆస్ట్రో-ఏసియాటిక్ భాషలను పేర్కొనండి.

BRAOU

# భాగం-3 భారతీయ సమాజంలోని సాహిత్య సంప్రదాయాలు

## విషయ క్రమం

3.0 లక్ష్యాలు
3.1 పరిచయం
3.2 భారతీయ భాషల్లో సాహిత్య సృష్టి
**అవగాహన ప్రశ్న – 1**
3.3 చరిత్ర నిర్వచనం, పఠన ప్రయోజనం
**అవగాహన ప్రశ్న – 2**
3.4 ఆధునిక యుగ సాహిత్య ధోరణులు
    3.4.1 సంస్కరణోద్యమాల ప్రభావం
    3.4.2 జాతీయోద్యమ ప్రభావం
    3.4.3. సామ్యవాద ప్రభావం
**అవగాహన ప్రశ్న – 3**
3.5 సారాంశం
    అవగాహన ప్రశ్నలు
    చదవదగిన పుస్తకాలు
    మాదిరి పరీక్షా ప్రశ్నలు

## 3.0 లక్ష్యాలు

ఈ భాగం చదివి మీరు కింది అంశాలను నిర్వచించగలుగుతారు.

- భారతీయ భాషల్లో మౌఖిక లిఖిత సాహిత్యరీతుల ఆవిర్భావం
- ప్రాచీన మధ్య ఆధునిక యుగాలలోని ప్రధాన సాహిత్య ధోరణులు

BRAOU

## 3.1 పరిచయం

భాషకూ, సాహిత్యానికీ పరస్పర సంబంధం ఉంది. సాహిత్య సృష్టి భాష ద్వారా జరగాల్సిందే కదా! భాష లేనిది సాహిత్యం రావడానికి వీల్లేదు. మౌఖిక సాహిత్యం విషయం వేరు. అది సంప్రదాయికంగా, సమాజంలో ప్రజల మధ్య, ఒక తరాన్నుండి మరొక తరానికి అందుతూ ఉంటుంది. ఇది ముఖ్యంగా జానపద సాహిత్యం కోవ లోనికి చెందినది. కాలానుగుణంగా సమాజంలో వస్తున్న మార్పుల దృష్ట్యా, సాహిత్య రూపాలు మారుతూ ఉంటాయి. సాహిత్య ప్రయోజనం కూడా మార్పు చెందుతూ ఉంటుంది. ఈ మార్పుల కనుగుణంగానే భాషా స్వరూప స్వభావాలు కూడా మార్పు చెందుతాయి. భాష సజీవమైనది.

ప్రాచీన మధ్య ఆధునిక యుగాల్లోని భారతీయ సాహిత్యాల్లో కొన్ని సమాన ధర్మాలు కన్పిస్తాయి. అవి : 1. లిపిలేని మౌఖిక సాహిత్యం 2. స్థూలంగా 11, 12 శతాబ్దుల్లో లిఖిత సాహిత్య వికాసం 3. మధ్య యుగాలలోని భక్తితత్వ, సామాజిక నిరసన సాహిత్యం 4. ఆధునిక యుగంలో దేశంలో వచ్చిన రాజకీయ, ఆర్థిక, సామాజిక మార్పు లకు అనుగుణంగా ఆయా భాషల్లో వెలువడిన సంస్కరణోద్యమ, జాతీయోద్యమ, సామ్యవాద సాహిత్య ధోరణులు.

వీనిని ఈ భాగంలో విశదంగా చర్చించుకుందాం.

## 3.2 భారతీయ భాషల్లో సాహిత్య సృష్టి

భారతీయ భాషలన్నింటిలో పెంపొందిన సాహిత్యాన్ని పరిశీలించినప్పుడు వీటిలో వచ్చిన సాహిత్యంలో మొదటి నుండి కొన్ని సమానధర్మాలు కన్పిస్తాయి. ఆర్యభాషలు కానీ ద్రావిడ భాషలుకానీ, వాటి మూల భాషా కుటుంబాల నుండి వేరుపడి స్వతంత్ర ప్రతిపత్తిని ఏర్పరచుకున్న తర్వాత వచ్చిన సాహిత్యం జానపద గేయాల

రూపంలోనూ, వీరగాథలుగానూ, వ్యంగ్యరచనలు (ప్రహసనాలు) గానూ ఉండేది. అయితే లిపిలేని దశలో ఇది మౌఖిక సాహిత్యంగానే ఉండిపోయింది. అంటే మౌఖిక సాహిత్య దశ నుండీ మనకు అన్ని భాషా సాహిత్యాల్లోనూ సమాన ధర్మాలు కన్పిస్తున్నాయి. ఆ తర్వాత వీటిని మౌఖిక సంప్రదాయం నుండి తప్పించి గ్రంథస్థం చేసినందు వల్ల అప్పటి సాహిత్యాంశాలు మనకు లభ్యమైనాయి. ఈ విధమైన సాహిత్యం ఒరియా, గుజరాతీ భాషల్లోనూ, దక్షిణాది ద్రవిడభాషలైన కన్నడ, తమిళాలలోనూ ఉన్నట్లు వి.కె. గోకక్ లాంటి సాహిత్యవేత్తలు చెప్పుతున్నారు. ఇక్కడ తమిళ సాహిత్యాన్ని గురించి ఒక మాట. క్రీస్తుశకం ఆరంభం నాటికే తమిళంలో సాహిత్య సృష్టి జరిగిందని, అది సంగం యుగ సాహిత్యంగా పేరెన్నిక పొందిందని మనం ముందే చెప్పుకున్నాం. క్రీ.శ. 10, 11 శతాబ్దాలలో భారతీయ భాషలన్నింటిలోనూ సాహిత్య సృష్టి జరిగినప్పటినుండీ, భారతీయ సాహిత్యంలో సమాన ధర్మాలు కొట్టొచ్చినట్టు కన్పిస్తాయి. అంతకు ముందున్న సాహిత్యంలో, ముఖ్యంగా అస్సామీ, బెంగాలీ, పంజాబీ భాషల్లో ప్రధానంగా వాడిన సాహిత్య ప్రక్రియ 'పాట' రూపంలో ఉండేది. భక్తి పరమైన భావాలను, మానవుని ఆలోచనా తరంగాలను వెలువరించడానికి 'పాట' అనే ప్రక్రియను ఉపయోగించుకొన్నారు. ఈ దశలోని తమిళ, కన్నడ భాషల్లో 'చంపూ' అనే సాహిత్య ప్రక్రియను బహుళంగా ఉపయోగించి, పద్య వచనాలు రెంటిలోనూ సాహిత్య సృష్టి చేశారు. వీటిలోని వస్తువు వాల్మీకి, వ్యాసుల మహా కావ్యాలనుండి సంగ్రహించినా, అవి ఒక్కోసారి సమకాలీన రాజకీయ సంఘటనలను, వ్యక్తులను ప్రతిబింబిస్తూ ఉండేవని సాహితీవేత్తల అభిప్రాయం.

క్రీ. శ. 10, 11 శతాబ్దాల్లో భారతీయ సాహిత్యం అన్ని భాషల్లో వెలువడ సాగింది. సంస్కృత, ప్రాకృత భాషల ప్రభావంతో ఇతిహాసాలైన భారత, భాగవత, రామాయణాలూ, ఆ తర్వాత కావ్యాలూ వచ్చాయి. ఇందులో చాల వరకు అనువాద సాహిత్యమే అయినా, కొన్ని స్వతంత్ర రచనలు కూడ చోటు చేసుకొన్నాయి. అనువాద రచనలు కూడా, అనువాదాలు కాదన్నంతగా స్వతంత్ర, సృజనాత్మక రీతిలో నడిచాయి. భారతీయ సాహిత్యం ఎంతగానో విస్తృతమైంది ఈ కాలంలోనే. మత ప్రభావం గల రచనలు అసంఖ్యాకంగా వెలువడ్డాయి. అనువాద సాహిత్యానికి పూర్వమే, హిందీలో నవనాథులు, చౌరాసీ సిద్ధులు, మొదలగువారి అపభ్రంశ భాషా సమ్మిళితమైన రచనలు, బెంగాలీలో 'చర్యాపదాలు', అస్సామీలో డాక్ కవి రచనలైన 'డాకేర్‌బచన్', ఒరియాలో బౌద్ధ గీతాలు, కాశ్మీరీలో శితికంఠుని 'మహాన్యాయ ప్రకాశ్', మరాఠీలో ముకుంద్ దాసు రచించిన 'వివేకసింధు', పంజాబీలో 'నాథ సాహిత్యం' తెలుగులో 'శైవ సాహిత్యం' మొదలయినవి మతాభినివేశంతో చేసిన రచనలు. ఇక అనువాద సాహిత్యంలో ఇతిహాసాలు ప్రముఖంగా చోటుచేసుకొన్నాయి. బెంగాలీభాషలో కాశీరామ్‌దాసు మహాభారతం, ఒరియాలో సరళా దాసు మహాభారతం, తెలుగులో కవిత్రయ మహాభారతం, బెంగాలీలో బలరామ దాసు, సరళాదాసులు వేర్వేరుగా రచించిన రామాయణాలు, హిందీలో తులసీదాసు 'రామచరితమానస్' తెలుగులో రంగనాథ, భాస్కర రామాయణాలు; తెలుగుభాషలో పోతన, హిందీలో సూరదాసు, ఒరియాలో జగన్నాథదాసు మొదలగువారి భాగవత రచనలు, చండీదాసు (బెంగాలీ), నరసీమెహతా (గుజరాతీ) మొదలగువారి ఆధ్యాత్మిక సంబంధమైన రచనలు -ఈ యుగంలోనివే.

**అవగాహన ప్రశ్న – 1**

భారతీయ భాషల్లో లిపిలేని దశలో ఏ రకం సాహిత్యం ఏ రూపంలో ఉందో 5 వాక్యాల్లో తెల్పండి.

## 3.3 మధ్యయుగ సాహిత్య ధోరణులు

మధ్యయుగాలలో భారతీయ సాహిత్యంలో రెండు విభిన్న ధోరణులు కన్పిస్తాయి. ఒకటి : భక్తితత్వం; రెండు : సామాజిక నిరసన. ఇస్లాం మతం దేశంలో ప్రవేశించింది. హిందూ ఇస్లాం మతాల భావ సమన్వయం

BRAOU

సూఫీ, భక్తి తత్వాలకు దోహదం చేసింది. మతమూ, దాని పేరట సాగే కర్మకాండ, పూజా పునస్కారాలతో విసిగి వేసారిన ప్రజలు నిర్గుణ, నిరాకారుడయిన భగవంతునిపట్ల గురి పెంచుకొన్నారు. ఇస్లాం-హిందూ మత విభేదాలకు, సంఘర్షణలకు అతీతమయిన భక్తి భావం ఒక ఉద్యమంగా, దేశంలోని అన్ని ప్రాంతాల్లో పెంపొంది చక్కని సాహిత్య సృష్టికి దారితీసింది. భక్తి తత్వం దక్షిణ భారతదేశంలో, తమిళనాడులో మొదట ప్రారంభమైంది. దీనిపై బౌద్ధ, జైనమతాల ప్రభావం ఉంది. ఆళ్వార్లతో, నాయనార్లతో ఆరంభమైన భక్తి ఉద్యమం, ఉత్తర భారతానికి వ్యాపించింది. మహారాష్ట్రలో నామ్‌దేవ్, తుకారామ్, జ్ఞానేశ్వర్, రామదాసు మొదలగువారు భక్తి ఉద్యమానికి చెందినవారే. వీరు ప్రధానంగా తమ రచనల ద్వారా ప్రజలను మేల్కొల్పారు. మహారాష్ట్రీలందరూ ఏకం కావడానికి, వారిని ఒకే తాటిపైకి తెచ్చేందుకు వీరి రచనలు తోడ్పడ్డాయి. గుజరాత్‌లో మీరాబాయి కృష్ణభక్తి ప్రచారం కావించింది. హిందీలో కబీర్, నానక్, మాలిక్ మహమ్మద్ (సూఫీ కవి), సూరదాసు, తులసీదాసు భక్తి మార్గాన్ని ప్రజల్లో ప్రచారం చేసారు. బెంగాలీలో చండీదాసు, ఒరియాలో దీనకృష్ణ, అస్సామీలో శంకరదేవ్ వైష్ణవ భక్తి ప్రచారం చేసిన వారిలో ముఖ్యులు.

భక్తికవులలోనే ఒక భాగంగా సామాజిక నిరసనను తమ రచనల్లో ఎలుగెత్తి చాటిన నిరసన కవులు కూడా ఇదే కాలంలో వచ్చారు. తెలుగులో వేమన, వీరబ్రహ్మం, కన్నడంలో బసవన్న, హిందీలో (కొంతవరకు) కబీర్ ఈ కోవకు చెందిన కవులు. భక్తి కవుల రచనల ద్వారా సంఘంలో ఐక్యత, సమన్వయం సాధ్యమయింది. భక్తి తత్వ కవులు, మతాన్ని కులాన్ని నిరసించారు. మతాల కట్టుబాట్లను ఖండించారు. వీరిలో ఎక్కువమంది 'తక్కువ' కులాల వారినుండి వచ్చారు. మరో విశేషం - ఈ కవులందరూ ప్రజలందరికీ అర్థమయ్యే తేలిక భాషలో రాయడం, ప్రజలు పాడుకొనే రీతిలో వీరి రచనల రూపం ఉండడంతో ఇది విశేషంగా వ్యాప్తిచెందింది.

మధ్యయుగ సాహిత్యంలో వచన రచనకు ఎక్కువ ప్రాధ్యనం లేదు. అయితే అస్సామీలో, బ్రజ్ భాషలో క్రీ.శ. 17వ శతాబ్దంలో వచన రచనలు ఉన్నాయని తెలుస్తున్నది. గుజరాత్‌లో జైనులు చక్కని వచన రచన చేసినట్లు దాఖలాలున్నాయి. పంజాబీ భాషలో సిక్కుల జీవిత కథలు వచన రూపంలో వచ్చాయి. బెంగాల్లో కూడా వచన రచన క్రీ.శ. 18వ శతాబ్దిలోనే ప్రారంభమైంది.

మధ్యయుగాల చివరి భాగంలో శృంగార భూయిష్ఠమైన సాహిత్య సృష్టి సాగింది. తెలుగులో దీన్నే కొంత వరకు ప్రబంధయుగమనీ, ఆ తర్వాత క్షీణయుగమనీ పిలిచారు. ఈ రచనల్లో విలాస, శృంగార జీవితాలు చోటు చేసుకున్నాయి. ప్రభువుల్ని ఆశ్రయించి, వారిని ఆనందపరచడమే పరమావధిగా పెట్టుకొన్న కవులు ఇలాంటి కావ్య రచనలు చేసి వారి ఆదరణకు పాత్రులయ్యారు.

BRAOU

**అవగాహన ప్రశ్న - 2**

మధ్యయుగ భారతీయ సాహిత్యంలోని భక్తి కవులు, సామాజిక నిరసన కవులు సాధించనదేమిటో 10 వాక్యాల్లో వెల్లడించండి.

______________________________

______________________________

______________________________

______________________________

______________________________

______________________________

## 3.4.0. ఆధునిక యుగ సాహిత్య ధోరణులు

ఆధునిక యుగంలో యూరోపియన్ల రాకతో, వారి సంపర్కంతో, ఆర్థిక జీవనంలో సంభవిస్తున్న మార్పుల ప్రభావంతో భారతీయ సాహిత్యంలో గణనీయమైన మార్పు లొచ్చాయి. పాశ్చాత్య భావజాలంతో, విజ్ఞానంతో భారతీయ భాషా సాహిత్యాలు పరిచయం చేసుకొన్నాయి. ఆంగ్లేయులు మొదట బెంగాల్ రాష్ట్రాన్ని

ఆక్రమించడం ద్వారా, భారతదేశంలో రాజకీయ పెత్తనానికి నాంది పలికారు. దేశాన్ని దశలవారీగా, ఒక క్రమ పద్ధతిలో జయించారు. దేశాన్ని పరిపాలించడానికి కావలసిన తక్కువ స్థాయిలోని ఉద్యోగ బృందాన్ని తయారు చేసుకోవడానికి, సమాజాన్ని నవీకరించి (Modernize) తద్వారా తమ వస్తువులకు మంచి గిరాకీ యేర్పరచు కోవడానికి, తమ పరిపాలనను సమర్థించే ఒక వత్తాసు వర్గాన్ని సృష్టించడానికి, కొత్త విద్యా విధానాన్ని ప్రవేశ పెట్టారు. అందులో భాగంగానే ఆంగ్ల భాషను ప్రవేశ పెట్టారు. ఆంగ్ల భాష ద్వారా పాశ్చాత్య విజ్ఞాన శాస్త్రాలలోని అంశాలు పాశ్చాత్య సాహిత్యంలోని లోతుపాతులు, పాశ్చాత్య ప్రపంచంలో వచ్చిన రాజకీయ భావజాలమూ - స్వాతంత్ర్యం, సమభావం, సౌహార్దం, ఉదారవాదం, వ్యష్టివాదం, సామ్యవాదం మొదలైన భావాలు - భారతీయ సమాజంలోకి ప్రవేశించాయి. వీటి ప్రభావంతో భారతీయ సమాజంలో నూతనోద్వేగం, ఉత్తేజం వచ్చాయి. భారతీయ సమాజం, సాహిత్యం పునరుజ్జీవనం పొందినంతగా కొత్త రూపు ధరించాయి. దేశంలో విద్యాధిక మధ్య తరగతి వర్గం (Educated Middle Class) తలెత్తింది. క్రమంగా కుల వ్యవస్థలో సామాజికమైన పట్టు సడలింది. రవాణా, వార్తాసౌకర్యాలు ప్రబలి, దేశమంతా రాజకీయంగా, భౌగోళికంగా ఒక 'యూనిట్'గా రూపొందింది. దీనికి తోడుగా వలసవాద పాలన ఫలితంగా, దేశం అనేక ఆర్థిక సంస్కరణలకు గురైంది. ఈ దశలో మధ్య తరగతి వర్గానికి చెందిన మేధావులు కొత్త సాహిత్యాన్ని సృష్టించారు. బెంగాల్లో ప్రారంభమైన ఈ సాహిత్యం దేశంలోని అన్ని ప్రాంతాల్లో, భాషల్లో వ్యాపించింది. కొత్త సాహిత్య ప్రక్రియలు వచ్చాయి. వచనానికి ప్రాముఖ్యం హెచ్చింది. వచన ప్రాముఖ్యంతో పాటుగా, నవల, కథానిక, నాటకం, నాటిక, జీవిత చరిత్ర, స్వీయ చరిత్ర, వ్యాసం, కవిత్వంలో గేయం, వచన కవిత్వం అనే రూపాలు ప్రాచుర్యంలోకి వచ్చాయి. వీటికి అనుగుణంగా సాహిత్యంలోని వస్తువులో గూడా మార్పు వచ్చింది. సామాన్య జీవనంలోని సమస్యలు రచనల్లో చోటు చేసుకొన్నాయి. డాక్టర్ సునీత్‌కుమార్ ఛటర్జీ మాటల్లో "Contact with the European spirit through English literature ushered in the Indian Renaissance and gave a new course to the literature in modern Indian Languages (V.K. Gokak ed. *Literatures in Modern Indian Langauges*. p. 44)

### 3.4.1 సంస్కరణోద్యమాల ప్రభావం

ఆధునిక యుగమని చెప్పబడుతున్న ఈ కాలంలో బెంగాలీ భాషా, సాహిత్యాల్లో రాజా రామ్‌మోహన్ రాయ్, ఈశ్వర చంద్ర విద్యాసాగర్, బంకించంద్ర చటర్జీ, మైకేల్ మధుసూదన దత్, స్వామి వివేకానంద, రవీంద్రనాథ్ ఠాకూర్, శరత్ చంద్ర ఛటర్జీ మొదలైనవారు తమ రచనల ద్వారా శక్తిమంతమైన విలక్షణమైన సాహిత్య సృష్టి చేసారు. వేర్వేరు సాహిత్య ప్రక్రియల్లో సాగిన వీరి రచనలు దేశం మొత్తానికి తలమానికంగా, మార్గదర్శకంగా నిలిచాయి. సాహిత్యంలో కొత్త విజ్ఞానం, వాస్తవికతను, విమర్శను ప్రవేశ పెట్టారు. వీరి మార్గంలోని క్రీ.శ. 19, 20 శతాబ్దాల్లో దేశంలోని వివిధ భాషల్లో ప్రాంతాల్లో నవ్యధోరణులు ప్రబలాయి.

ఒరియాలో రాధానాథ్, హిందీలో భారతేందు హరిశ్చంద్ర, మరాఠీభాషలో విష్ణుశాస్త్రి చిప్లంకర్, గుజరాతీలో నర్మదాశంకర్, తెలుగులో కందుకూరి వీరేశలింగం పంతులు కొత్త సాహిత్య ప్రక్రియలకు శ్రీకారం చుట్టారు. ముందే చెప్పుకొన్నట్లుగా గద్య రచనకు ప్రాముఖ్యం హెచ్చింది. కొత్త భావాలను ప్రజలకు అందించ డానికి గద్యమే సరియైన సాధనమన్న భావం బలపడింది. అందులోనూ సరళమైన గద్యం - ప్రజల నిత్య జీవితానికి సన్నిహితమైన భాషలోనే రచనలు చేయాలన్న వాదనకు బలం చేకూరింది. అంటే, సాహిత్య ప్రయోజనం సమాజ పురోగతి అన్న భావం మొత్తం మీద సర్వత్రా వ్యాపించింది.

19వ శతాబ్దంలో వచ్చిన సంఘ సంస్కరణోద్యమాలు - బెంగాల్, మహారాష్ట్ర, పంజాబు రాష్ట్రాల్లోనూ, మద్రాసు రాష్ట్రంలోని ఆంధ్రప్రాంతంలోనూ సంస్కరణ భావాలను ప్రజల్లో వ్యాప్తిచేయడంలో గొప్పగా తోడ్పడ్డాయి. ఇదే సందర్భంలో, బెంగాలీ, మరాఠీ, పంజాబీ, గుజరాతీ, తెలుగు భాషల్లో సంస్కరణ సాహిత్యం వెలువడింది. సంస్కర్తలు కొత్తగా ప్రవేశించిన అన్ని సాహిత్య ప్రక్రియల ద్వారా, సులభమైన భాషలో రచనలు చేసారు. సంస్కరణోద్యమ అవసరాలకు భాషను సులభీకరించి సామాన్య ప్రజలకు అర్థమయ్యే రీతిలో సాహిత్య రచన కొనసాగించారు.

ఆధునిక కాలంలో భారతదేశంలోని ఆంగ్లోద్యోగులు, మిషనరీలు, భారతీయ భాషలకు ఎనలేని సేవ చేశారు. పాఠశాలలో బోధించే పాఠ్యపుస్తకాలు, నిఘంటువులు, వ్యాకరణాలు పండితులచేత రాయించడమేకాక స్వయంగా కొన్ని రచనలు చేశారు. భారతీయ పండితుల సహాయంతో మరుగున పడిన ప్రాచీన సాహిత్యాని



BRAOU

గ్రంథాలను సేకరించి రాతప్రతులు సిద్ధం చేసి పెట్టారు. బైబిల్‌ను అన్ని భారతీయ భాషల్లోకి అనువదింపజేశారు. తద్వారా గద్య రచనకు స్ఫూర్తిని కలిగించారు. అచ్చు యంత్రాన్ని ప్రవేశ పెట్టడం ద్వారా ముద్రణ సౌకర్యాలు కల్పించారు. పత్రికారచన ప్రారంభమైంది. గ్రంథ ప్రచురణ మొదలైంది. ఇవన్నీ విజ్ఞాన ప్రచారానికి, సాహిత్యం ప్రజలకు చేరువ కావడానికీ దోహదం చేశాయి.

### 3.4.2 జాతీయోద్యమ ప్రభావం

భారతదేశ చరిత్రలో జాతీయోద్యమం అతి ముఖ్యమైన అధ్యాయం. శతాబ్దాల వలస దోపిడికి గురయిన భారతజాతి తన స్వేచ్ఛ, స్వాతంత్ర్యాల కోసం అనన్యంగా సాగించిన పోరాటం ఇది. జాతీయోద్యమ కాలంలో దేశం పిలుపునందుకొని, దేశ విముక్తిని కోరుతూ అనేక ప్రాంతాల్లోని కవులు, సాహితీవేత్తలు జాతీయోద్యమ సాహిత్యాన్ని సృష్టించారు. ఉద్యమాలు - రాజకీయంగానీ, సాంఘికంగానీ లేదా ఆర్థిక పరమైనవి కానీ ఏ విధంగా సాహిత్య సృష్టికి దోహదం చేస్తాయో ఇది నిరూపిస్తుంది. జాతీయోద్యమంలో భాగంగానే మహాత్మగాంధీ సిద్ధాంతాల ప్రభావంలో దేశంలోని పలుభాషా సాహిత్యాల్లో అసంఖ్యాకమైన రచనలు వచ్చాయి. ఉదాహరణకు అస్పృశ్యతా సమస్య, ఖద్దరుధారణ, సహాయ నిరాకరణ, స్త్రీజనోద్ధరణ, మద్యపాన నిషేధం, హిందూ- ముస్లిం ఐక్యత మొదలైన నిర్మాణాత్మక కార్యక్రమాలపై అన్ని భాషల్లోను సాహిత్యం పుంఖానుపుంఖంగా వెలువడింది. 'దేశభక్తి' భావంపై వచ్చిన రచనలు అసంఖ్యాకంగా ఉన్నాయి. వీటిలో చెప్పుకోదగ్గవి సుప్రసిద్ధ బెంగాలీ కవి కాజీనజ్రుల్ ఇస్లామ్, తమిళంలో మహాకవి సుబ్రహ్మణ్య భారతి, తెలుగులో మహాకవి గురజాడలు రాసిన పాటలు, గేయాలు. ఇదే కాలంలో హిందీలో భారతేందు హరిశ్చంద్ర, సుభద్ర కుమారి చౌహాన్ రచనలను పేర్కొనాల్సి ఉంటుంది. అదే విధంగా ఉర్దూలో హాలీ, ఇక్బాల్, పంజాబీ భాషలో పురాణ్‌సింగ్, భాయివీర్‌సింగ్, అస్సామీలో లక్ష్మీనాథ్ బజ్‌బూరా, కమలకాంత్ భట్టాచార్య, కన్నడంలో బెంద్రే, మలయాళంలో వల్లథోల్ మొదలగువారు చేసిన రచనలు ప్రసిద్ధాలు.

### 3.4.3 సామ్యవాద ప్రభావం

జాతీయోద్యమంలో భాగంగానే సామ్యవాద సిద్ధాంత ప్రభావాలతో కూడిన భావజాలం భారతీయ సమాజంలో ప్రవేశించింది. రష్యాలో బోల్షివిక్ విప్లవం తర్వాత సామ్యవాద భావాలు ప్రపంచంలోని అన్ని దేశాల్లోనూ ప్రజల దృష్టిని ఆకట్టుకున్నాయి. ఆర్థిక సమానత్వం రాజకీయ, సాంఘిక సమానత్వాలకు మూలం అన్న శాస్త్రీయ భావన ప్రపంచంలో వ్యాప్తిలోకి వచ్చింది. ఆర్థిక అసమానతలు లేని, దోపిడి రూపుమాసిన సమాజం కోసం, ఆకలి, అన్యాయం, అక్రమం అంతరించిన సామాజిక వ్యవస్థకోసం, ఈ శతాబ్దపు మూడో దశకంలో (1930లలో) అభ్యుదయ సాహిత్యోద్యమం పేరుతో కొత్త సాహిత్య ధోరణి సాహిత్య ప్రపంచంలో మొదలైంది. దేశంలోని అన్ని భాషల్లో ప్రధానంగా అభ్యుదయ కవులు (ఉత్తర భారతదేశంలోని 'ప్రగతివాద' కవులు) గళం విప్పి కలం చేబూని, 'కొత్త ప్రపంచాన్ని' ఆహ్వానిస్తూ మహాప్రస్థాన యాత్ర ప్రారంభించారు. ఇది అభ్యుదయ సాహిత్య ఉద్యమంగా భారతదేశమంతటా పేరొందింది. అన్ని భాషల్లోనూ సామ్యవాద సిద్ధాంతాలచే ప్రభావితమయిన అభ్యుదయ సాహిత్యం వచ్చింది. సమాజంలోని సామాన్య జనుల కష్టసుఖాలకు, కన్నీళ్ళకు అభ్యుదయ కవిత అద్దం పట్టింది. అభ్యుదయ కవిత్వ ఉద్యమం అన్ని సాహిత్య ప్రక్రియల్లోనూ చేయి తిరిగిన సాహిత్య కారులను సృష్టించింది. హిందీలో ప్రేమ్ చంద్ భారతదేశపు మాక్సింగోర్కీగా ప్రస్తుతింపబడ్డాడు. బెంగాలీలో మానిక్ బందోపాధ్యాయ, మళయాళంలో వల్లదోల్, తెలుగులో శ్రీ శ్రీ, ఉర్దూలో సజ్జాద్ జహీర్ మగ్దుం ముఖ్యులు.

భారతీయ సాహిత్యాన్ని ఆధునిక కాలంలో ప్రతిభావంతం చేసిన మరొక ముఖ్యాంశం ఫ్రాయిడ్ రచనలు. ఫ్రాయిడ్ రచనల ప్రభావంతో రచనల్లో మనోవిశ్లేషణ చోటు చేసుకొంది. నిజానికి భారతీయ సాహిత్యాలను ఆధునిక యుగంలో ఎక్కువగా ప్రభావితం చేసిన గాంధీ, మార్క్స్, ఫ్రాయిడ్ వీరు ముగ్గురూ సాహితీవేత్తలు కాదు; సృజనాత్మక రచనలు చేసినవారు కాదు. అయినా వీరి రచనల ప్రభావంలో పడిన యువ రచయితల సాహిత్య సృష్టి సామాన్యమైంది కాదు. సాహితీపరులైన వారు వీరి ముగ్గురి రచనలచే ప్రేరేపితులై, సాహిత్య ప్రక్రియ లన్నింటిలోనూ శాశ్వత స్థానాన్ని ఆక్రమించే రచనలు చేసారు.

భారతీయ సాహిత్యాల్లో ఆధునిక యుగంలో వచ్చిన మార్పులు, వాటిపై ఉన్న వివిధ సిద్ధాంతాల ప్రభావాల గూర్చి మనం పైన తెలుసుకొన్నాం. ఇదే కాలంలో, భారతీయ భాషలన్నింటిలోనూ నవలా ప్రక్రియ



BRAOU

గణనీయంగా అభివృద్ధి చెందింది. బెంగాలీలో శరత్, బంకిం, ఠాగోర్ ఆధునిక నవలకు ఒక స్వరూపాన్ని, ప్రయోజనాన్ని చేకూర్చారు. ఆ తర్వాత అన్ని భాషల్లోనూ, వీరికి ఏ మాత్రమూ తీసిపోని పైగా కొన్ని సార్లు మించిపోయిన, నవలాకారులు రావడం గమనార్హం. ఈ నవలలన్నీ ఒకే సిద్ధాంత ప్రభావంలో వచ్చినవి కావు వీటిపై కాల్పనికత, వాస్తవికతాభావాల ప్రభావం ఉంది. అలాగే ఇందులో కొన్ని చారిత్రక నవలలు, మరికొన్ని మనస్తత్వ విశ్లేషణలో కూడినవీనూ. కొన్ని నవలలు గాంధేయవాద సిద్ధాంతాలతో ప్రభావితంకాగా, మరికొన్ని కార్ల్‌మార్క్సు భావాలతో ఉద్దీపనాన్ని పొందినవి. ఏమయినా ఈ నవలా సాహిత్యంలో కొట్టొచ్చినట్లు కనపడేది మానవతా వాద దృక్పథం. అంతేకాదు సమాజంలోని అదృష్టహీనులు, పతితులు, భ్రష్టులు, బాధాసర్పదష్టులు ఈ నవలల్లో చోటుచేసుకున్నారు. నవలా సాహిత్యంలో మరో సామాన్య ధర్మం ఇవి అనువాదాలు కాకపోడం. సమాజ పరిశీలనతో, నవలాకారులు ప్రభావితులై, సమాజంలోని అనేకానేక సమస్యలను తమ నవలల్లో వాస్తవికంగా, రచనాశిల్పాన్ని జోడించి, చక్కని రచనలు చేశారు. వీరిలో చెప్పుకోదగ్గవారు – బెంగాలీలో బిభూతి భూషణ్ బెనర్జీ, తారాశంకర్ బెనర్జీ, మానిక్ బందోపాధ్యాయ, అబిత్యాసేన్ గుప్తా, అస్సామీ భాషలో బీరెన్ భట్టాచార్య, అబ్దుల్ మాలిక్, గుజరాతీలో పన్నాలాల్ పటేల్, దర్శక్, హిందీలో జైనేంద్రకుమార్, యశ్‌పాల్, కన్నడంలో మాస్తి వెంకటేశ అయ్యంగార్, కరంత్, మళయాళంలో తకజీ శివశంకర పిళ్ళై, బషీర్, తెలుగులో ఉన్నవ లక్ష్మి నారాయణ, అడివి బాపిరాజు, కొడవటిగంటి కుటుంబరావు, పాలగుమ్మి పద్మరాజు మొదలగువారు, మరాఠీలో ఖండేకర్, గాడ్గిల్, ఒరియాభాషలో మహంతీ సోదరులు, పంజాబీలో నానక్‌సింగ్, దుగ్గల్, కాశ్మీరీ భాషలో అస్తర్ మొహియొద్దీన్, సూఫీగులాం మహమ్మద్, తమిళంలో సోమసుందరం, కానా సుబ్రహ్మణ్యం, అఖిలాండన్ ముఖ్యులు. స్వాతంత్ర్యానంతర భారతీయ సాహిత్యంలో ప్రపంచ శాంతి, దేశాలమధ్య సహజీవనం, సామ్యవాద ధోరణిలో సమాజ పునర్నిర్మాణం, కులవ్యవస్థ నిరసన, ఆర్థికపరమైన దోపిడికి వ్యతిరేకత మొదలయిన అంశాలపై రచనలు చేస్తున్నారు. భాషలో, భావాలలో ప్రయోగాలు చేస్తున్నారు. 'మినీ కవిత' 'మినీకథ' వంటి కొత్త రీతులు పుడుతున్నాయి. రాను, రాను సామాజిక స్పృహ కలిగిన రచనలు అసంఖ్యాకంగా వెలువడుతున్నాయి. అయినా దేశంలోని సామాజిక వ్యవస్థను కూలంకషంగా మార్చేస్తేనే తప్ప, ఆర్థికంగా అసమానతలున్న సమాజాన్ని కూకటివేళ్ళతో పెకలిస్తే తప్ప సమాజంలోని అధికులైన పీడిత, తాడితులకు సరియైన న్యాయం చేకూరదన్న వాదనతో, దేశంలో అనేక భాషల్లో సమాన ధర్మాలున్న సాహిత్యం వస్తున్నది. ఈ కోవకి చెందినవే బెంగాల్‌లోని 'భూఖిపీడి' హిందీలోని నయీకవిత, 'అకవితలు', తెలుగు సాహిత్యంలో 'దిగంబర, విప్లవ' కవితా ధోరణులు.

భారతీయ భాషల్లో వైవిధ్యమున్న సహజంగానే సాహిత్యాల్లో ఇది ప్రతిబింబించి తీరాలి. అయితే ఆయా సాహిత్యాలు తమ వ్యక్తిత్వాన్ని ఒకవైపు నిలుపుకొంటూ, సంపన్నం చేసుకొంటూనే, మరోవైపు కొత్త భావాలకు, ఉద్యమాలకు సమానంగా ప్రతిఫలిస్తూ, మారుతూ, అభివృద్ధి చెందుతూ వచ్చాయి. ఇవి వేరువేరు పుష్పాలయినా, భారతీయ భాషా సాహిత్య వ్యవహారంలో వీటినన్నిటినీ కలిపి ఏకంచేసి కనపడే, కనపడని సూత్రం ఉంది. అదే భారతీయ సాహిత్యాల సమాన ధర్మం.

## అవగాహన ప్రశ్న – 3

యూరోపియన్ల రాకతో భారతీయ సమాజ సాహిత్యాల్లో వచ్చిన మార్పులను గురించి పది వాక్యాల్లో వివరించండి.

BRAOU

## 3.5 సారాంశం

ఈ భాగంలో కింది ప్రధానాంశాలను మీరు తెలుసుకున్నారు.

- ప్రాచీన మధ్య ఆధునిక కాలాల్లో భారతీయ సాహిత్యాల్లో కొన్ని సమాన ధర్మాలు కన్పిస్తాయి. అవి :
- మౌఖిక సాహిత్య స్థితి
- 11, 12 శతాబ్దుల్లో లిఖిత సాహిత్య వికాసం
- మధ్య యుగాలలోని భక్తితత్త్వ, సామాజిక నిరసన కవిత్వ ధోరణులు
- ఆధునిక కాలంలో సంభవించిన సామాజిక పరిణామాల మూలంగా, అంతర్జాతీయ ప్రభావాల మూలంగా వివిధ భారతీయ భాషల్లో వెలువడిన సంస్కరణోద్యమ, జాతీయోద్యమ, సామ్యవాద సాహిత్య ధోరణులు.

### అవగాహన ప్రశ్నలకు జవాబులు

1. లిపిలేని దశలో భారతీయ సాహిత్యం మౌఖిక సాహిత్యంగానే ఉండేది. ఈ సాహిత్యం జానపద గేయాలుగా, వీరగాథలుగా, ప్రహసనాలుగా ఒరియా, గుజరాతీ భాషల్లోనూ దక్షిణ ద్రావిడ భాషలైన కన్నడ తమిళ భాషల్లోనూ ఉన్నట్టు వి.కె. గోకాక్ లాంటి సాహిత్యవేత్తలు చెపుతున్నారు. ఆ తర్వాతికాలంలో ఈ రచనలను మౌఖిక సాహిత్య సంప్రదాయంనుండి తప్పించి, గ్రంథస్థం చేసినందువల్ల, మౌఖిక సాహిత్య దశలోని అన్ని భాషా సాహిత్యాల్లోనూ పై సమానధర్మాలు నేడు మనకు గోచరిస్తున్నాయి.

2. మధ్యయుగాలలో భారతీయ సాహిత్యంలో వికసించిన రెండు సాహిత్య ధోరణులు భక్తితత్వం, సామాజిక నిరసన దృక్పథాల్లో కొనసాగాయి. మతమూ, దాని పేరిట జరిగే కర్మకాండా యజ్ఞయాగాదులూ, పూజాపురస్కారాలతో విసిగి వేసారిన ప్రజలు నిర్గుణ, నిరాకారుడైన భగవంతుని పట్ల భక్తిభావాన్ని పెంపొందించుకున్నారు. ఇస్లాం హిందూ మత విభేదాలకూ, సంఘర్షణలకూ అతీతమైన భక్తితత్వాన్ని ఆశ్రయించి భక్తకవులు దేశంలోని అన్ని భాషల్లోనూ చక్కని సాహిత్య సృష్టి చేశారు. సామాజిక దురాచారాలనూ, మూఢ విశ్వాసాలనూ నిరసిస్తూ వేమన వీరబ్రహ్మం వంటివారు తెలుగులో, కన్నడంలో బసవేశ్వరుడు, హిందీలో కబీర్ వంటి సామాజిక నిరసన కవులు సర్వమానవ సమానత్వ దృక్పథంతో చక్కని సాహిత్య సృష్టి చేశారు.

3. ఆధునికయుగంలో యూరోపియన్ల రాకతో, వారి సంస్కృతీ చిహ్నాల ప్రభావంతో, ఆర్థిక మార్పులతో భారతీయ సమాజ సాహిత్యాల్లో గణనీయమైన మార్పులు వచ్చాయి. పాశ్చాత్య విజ్ఞానంతో భావ జాలంతో భారతీయ భాషాసాహిత్యాలు అభినివేశాన్ని పెంపొందించుకున్నాయి. స్వాతంత్ర్యం, సమభావం, సౌహార్దం, ఉదారవాదం, వ్యష్టివాదం, సామ్యవాదం వంటి భావాలు సమాజంలో, సాహిత్యంలో బలపడ్డాయి. సమాజం పునరుజ్జీవనం చెంది, మధ్య తరగతి, నిమ్న తరగతి వర్గాల్లో విద్యాధిక్యత పెంపొందింది. కులవ్యవస్థలో పట్టు సడలింది. వార్తా సౌకర్యాలు, రవాణా సౌకర్యాలు పెంపొంది దేశమంతా భౌగోళికంగా ఒకే యూనిట్‌గా మారింది. వలసవాద పాలన ఫలితంగా ఆర్థిక సంస్కరణలు వచ్చాయి. నవల, కథానిక, నాటకం, నాటిక, జీవిత చరిత్ర, స్వీయచరిత్ర, వ్యాసం, కవిత్వంలో గేయకవిత్వం, వచన కవిత్వం, భావ అభ్యుదయ కవిత్వాల వంటి కొత్త సాహిత్య ప్రక్రియలు పాటమరించాయి.

### చదవదగిన పుస్తకాలు


| | | |
|---|---|---|
| V.K. Gokak, ed. | - | Literatures in Modern Indian Languages |
| Motilal Jotwani, ed. | – | Contemporary Indian Literature and Society |
| A.L. Basham, ed. | – | Cultural History of India |
| Sahitya Academi New Delhi | – | Contemporary Indian Literature |


BRAOU

| | | |
|---|---|---|
| డా॥ భీమ్‌సేన్ నిర్మల్ ఇరివెంటి కృష్ణమూర్తి | - | తెలుగు-ఉత్తర భారత సాహిత్యాలు |
| ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి, హైదరాబాదు | - | ఉత్తర భారత సాహిత్యములు |
| ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి, హైదరాబాదు | - | దక్షిణ భారత సాహిత్యములు |
| కె.కె. రంగనాథాచార్యులు (సం.) | - | తెలుగు సాహిత్యం - మరోచూపు |
| బూదరాజు రాధాకృష్ణ | - | భారతీయ భాషల చరిత్ర - సమస్యలు (అముద్రిత వ్యాసం) |

## మాదిరి పరీక్షా ప్రశ్నలు

I. కింది ప్రశ్నలకు 30 పంక్తులకు మించని సమాధానాలు రాయండి.

1. ఆధునిక భారతీయ భాషల క్రమవికాసం వివరించి, సామాన్య ధర్మాలు విశ్లేషించండి.
2. భారతీయ సాహిత్యంలో మధ్య యుగాలవరకు కన్పించే సాధారణ ధర్మాలను వివరించండి.
3. ఆధునిక భారతీయ సాహిత్యానికి దోహదంచేసిన ప్రభావాలు రాసి, అందులోని సామాన్య ధర్మాలను వివరించండి.

II. కింది ప్రశ్నలకు 10 పంక్తులకు మించని సమాధానాలు రాయండి.

1. భాషకు, సాహిత్యానికి గల సంబంధమేమిటి ?
2. భారతీయ సాహిత్యంలో సమాన ధర్మాలు కన్పించే అంశాలు ఏవి ?
3. ఆధునిక కాలంలో పాశ్చాత్య విజ్ఞాన, సాహిత్య ప్రభావం భారతీయ సాహిత్యంలో ఎలాంటి మార్పులు తెచ్చింది?
4. జాతీయోద్యమ ఫలితంగా భారతీయ సాహిత్యంలో వచ్చిన మార్పులు ఏమిటి ?

BRAOU

# భాగం - 4 భారతీయ సంస్కృతిలోని సంకీర్ణత

## విషయక్రమం


4.0 లక్ష్యాలు

4.1 పరిచయం

4.2 నాగరకత, సంస్కృతి

అవగాహన ప్రశ్న - 1

4.3. భారతీయ సంస్కృతిలోని భిన్నత్వం, వైవిధ్యం, ఏకత్వం

4.3.1 వేదపూర్వ సంస్కృతి

4.3.2 ఆర్యసంస్కృతి

4.3.3 మతోద్యమ సంస్కృతి

4.3.4 దండయాత్రల ఫలితాలు

4.3.5 ఇస్లాం మత ప్రవేశ ఫలితాలు

4.3.6 యూరోపియన్ సంస్కృతి ప్రభావం

4.3.7 భిన్నత్వంలో ఏకత్వం

అవగాహనప్రశ్న - 2

2.4. సారాంశం

అవగాహన ప్రశ్నలకు జవాబులు

చదవదగిన పుస్తకాలు

మాదిరి పరీక్షా ప్రశ్నలు


BRAOU

## 4.0 లక్ష్యాలు

ఈ భాగం అవగాహన చేసుకున్న తర్వాత మీరు ఈ కింది అంశాలను విశదీకరించగలుగుతారు :

- నాగరకత సంస్కృతుల పరస్పర ఆశ్రయత, పరస్పర పోషకత్వం
- భారతీయ సంస్కృతి క్రమాభివృద్ధి
- భారతీయ సంస్కృతి భిన్నత్వంలో ఏకత్వం

## 4.1 పరిచయం

సంస్కృతి అనేది మొత్తం మానవజాతి వేర్వేరు ప్రాంతాల్లో, భిన్న పరిస్థితుల్లో సృష్టించినది. ఈ మానవ సంస్కృతిలో భాగమే భారతీయ సంస్కృతి. భారతదేశంలో విభిన్నత ఉంది. వైవిధ్యం ఉంది. ఎన్నో మతాలు, ప్రాంతీయభేదాలు ఉన్నాయి. అయినా ఈ విభిన్నతలో ఏకత్వం ఉంది. భారతీయ సంస్కృతి తన ఏకత్వాన్ని ఒక వైపు నిలుపుకొంటూనే, మరోవైపు అనేక ప్రాంతీయ భిన్న సంస్కృతులకు దోహదం చేస్తూ, చారిత్రక క్రమంలో పెరుగుతూ వచ్చింది. భారతీయ సంస్కృతి అఖండం కాదు. అది సంకీర్ణ సంస్కృతి, ఇందులో ఎన్నో జాతుల, దేశాల విశిష్టతలు చోటుచేసుకొన్నాయి. కొత్త భావాలను, పుంతలను తనలో ఇముడ్చుకొంటూ, ఎప్పటికప్పుడు సంపన్నమవుతూ, భిన్నత్వంలో ఏకత్వాన్ని రూపొందించుకొంది. ఈ సంస్కృతీ క్రమాన్ని ఈ భాగంలో వివరించాము.

## 4.2 నాగరకత, సంస్కృతి

1.4 లో సంస్కృతిని గురించి కొన్ని ప్రాథమికాంశాలను తెలుసుకున్నారు. ఇక్కడ నాగరకత, సంస్కృతి అనే రెండు పదాలు అంటే మనం నిత్య జీవితంలో తరచుగా వాడే పదాలను గురించి కొంత వివరంగా తెలుసుకుందాం. ఈ రెండూ ఒకటేనన్న భావం కూడ మనలో చాలామందికి కలుగుతూ ఉంటుంది. సాధారణ దృష్టికి ఇది ఒకటే అనిపించినా, సూక్ష్మదృష్టితో పరిశీలించినపుడు రెంటికీ తేడా కన్పిస్తుంది. కానీ ఈ రెండూ పరస్పర ఆశ్రయాలు, పరస్పర పోషకాలు. ప్రముఖ చరిత్రకారుడు డి. డి. కొశాంబీ ఉద్దేశంలో సంస్కృతి అంటే ప్రజలందరి జీవిత విధానం. వారి జీవన రీతిలోని ముఖ్యాంశాలను తెలియజేయడం. నాగరకతకూడ ఒక విధమైన సంస్కృతి. అందులో అంతర్భాగమే. Encyclopaedia లో చెప్పినట్లు నాగరకత అనేది ప్రధానంగా ప్రజలు చదవడం, రాయడం తెలుసుకొని, మానవ సమాజ పరిణామ క్రమంలో రాజకీయ భావాలు పెంపొంది, రాజ్య నిర్మాణం పెరిగి, సమాజ ఉత్పత్తి క్రమంలో ఆయావృత్తులకు ప్రత్యేక ప్రతిపత్తి సాధించటం. అంటే **మానవ సమాజం తన పురోగమనంలో సాంకేతికాభివృద్ధిని సాధించుకొంటూ, జీవన స్థాయిని పెంచుకొంటూ పోవడమే నాగరకత.** మనిషి తన అనుభవం ద్వారా గ్రహించినదీ, నేర్చుకొన్నదీ, సాధించినదీ నాగరకతలో భాగమే. మరింత వివరంగా చెప్పాలంటే, **మానవుడు సాధించిన మానసిక పరిణతి, అతడి తాత్విక భావనలు, ఆశయాలు, నమ్మకాలు, ఆకర్షణలు, సామాజిక విలువలు మొదలైనవన్నీ సంస్కృతిలో అంతర్భాగాలు.** అంతేకాక మానవులందరూ సాగించిన సమిష్టి జీవనం ద్వారా సాధించిన ప్రగతి కూడ సంస్కృతిలో ఒక భాగమే. కొందరు చరిత్రకారుల అభిప్రాయంలో సంస్కృతి మొత్తం ఒకటే. సంస్కృతి విశ్వజనీనమైనది. విడదీయరానిది. నిరంతర కృషితో మానవుడు వివిధ దేశాల్లో, ప్రాంతాల్లో అభివృద్ధి చేస్తున్నది. సమస్త మానవాళి ఉమ్మడి సృష్టి సంస్కృతి. వివిధ దేశాల్లో రూపొందుతున్న సంస్కృతులు ఒక్కటై ఒక విశాలమైన విశ్వసంస్కృతిగా రూపొందుతాయన్న భావాన్ని భగవత్ శరణ్ ఉపాధ్యాయలాంటి చరిత్రకారులు వెల్లడిస్తున్నారు కాబట్టి నాగరకత, సంస్కృతి మానవుని నిరంతర కృషికి ఫలరూపాలు. మానవుడు సమాజంలో ఒక భాగం కాబట్టి సమాజం, సంస్కృతి – ఈ రెండు పరస్పర ఆధారభూతాలు. గార్డెన్ చైల్డ్ (Garden Childe) అభిప్రాయంలో 'లిపి' ని మానవుడు కనుగొనడంతో నాగరకత ఆరంభమైందంటాడు. ఎందుకంటే 'లిపి' అనే ముఖ్య సాధనం మానవ సమాజం ఆయా కాలాల్లో సాధించిన పురోగతిని, అనుభవాన్ని తర్వాత రాబోయే తరాల వారికి అందించడానికి ఉపయోగపడింది.

ఈ విధంగా సంస్కృతి, అందరి మానవులలో, ఒకరికొకరు ఇచ్చి పుచ్చుకోడంతో, అనేక విభిన్నతలతో పెంపొందుతుంది. అందుకనే సంస్కృతి సంకీర్ణమైనది. భిన్న సంస్కృతులు ఒకదానితో మరొకటి మేళవిస్తాయి. కలిసిపోతాయి. అయితే, ఒక సంస్కృతి వేరొక సంస్కృతిలోని ముఖ్యాంశాలను స్వీకరించి, మేళవించే ముందు కొంత ఘర్షణ, భిన్న సంస్కృతిని అంత సులభంగా దగ్గర చేరనీయదు. అయితే క్రమేపి మొదట్లో ఉన్న వ్యతిరేకతను విడనాడి, భిన్న సంస్కృతిలోని లక్షణాలను తనలో కలుపుకొని, తనకున్న ప్రత్యేకతను నిలుపుకొని, ఒక విశిష్ట సంస్కృతిగా రూపొందుతుంది. అందుకనే సంస్కృతి సంకీర్ణమై ఉంటుందని ముందే చెప్పుకొన్నాం. ఇదే భావాన్ని మరో విధంగా కూడా చెప్పుకోవచ్చు. సంస్కృతి గమనం, చలనశీలమై ప్రపంచ వ్యాప్తంగా ఉంటుంది. చరిత్రలాగే ఏదో ఒక ప్రాంతానికో, దేశానికో జాతికో పరిమితం కాదు. గాలి లాగ భావాలు భిన్నవాతావరణాలను, సముద్రాలను, దేశాల సరిహద్దులను దాటి వ్యాపిస్తాయి. ఉదాహరణకు చరిత్ర పూర్వయుగంలో ఈజిప్టు తనకు కావల్సిన ఇనుము సుమేరియా మార్కెట్లలో కొనుగోలు చేసేది. అలాగే అతి ప్రాచీన కాలం నుండీ భారతదేశంలోని కేరళ తీరంలో పండే మిరియాలు, మిగతా సుగంధ ద్రవ్యాలు, రోము సామ్రాజ్యానికి ఎగుమతై, అక్కడినుండి బంగారం మనదేశానికి వచ్చేది. భారతదేశంలో నియమసంహిత నుండి, ఆధునిక ఐరోపా ఖండపు చరిత్రలో నెపోలియన్ రూపొందించిన 'కోడ్ నెపోలియన్ (న్యాయ శాసనాలు), క్రీస్తుపూర్వం వేల సంవత్సరాలనాడు హమ్మురాబి (Hammurabi) జారీచేసిన శాసనాల కొనసాగింపే! నేడు ప్రపంచంలో ఖ్యాతివహించిన ఒలింపిక్ గేమ్స్, ఒకనాటి గ్రీకు సంస్కృతిలోని అంతర్భాగమే. ఈ విధంగా చెప్పుకొంటూపోతే, భారతదేశం నుండి అరబ్బులు తాము గ్రహించిన ఎన్నో శాస్త్రి, సాంకేతిక విషయాలను ఐరోపా ఖండానికి అందించారు. ఇట్లా పరిశీలించినపుడు ప్రపంచ సంస్కృతిలోని సంకీర్ణత మనం గమనించవచ్చు. వేర్వేరు దేశాల సంస్కృతులు ఒకదానితో ఒకటి కలిసిపోయి ఒకే మానవ సంస్కృతిగా రూపొందడం దీనివల్ల స్పష్టమవుతుంది.

BRAOU

అవగాహన ప్రశ్న – 1

సంస్కృతి ఎందువల్ల సంకీర్ణమైందో పది వాక్యాల్లో తెల్పండి.

## 4.3.0 భారతీయ సంస్కృతిలోని భిన్నత్వం, వైవిధ్యం

ప్రపంచంలోని అతి ప్రాచీన నాగరకతా సంస్కృతులలో భారతదేశ నాగరకతకూ, సంస్కృతికీ విశిష్ట స్థానం ఉంది. ఈజిప్టు, మెసొపొటేమియా, చైనా నాగరకతలతో పాటు భారతీయ నాగరకత, సంస్కృతి ప్రపంచంలోని సమస్త మానవాళి సాంస్కృతిక వికాసానికి దోహదం చెయ్యడమేగాక సంపన్నపరిచిందికూడ. క్రీస్తుపూర్వం సుమారు నాలుగువేల సంవత్సరాలకు ముందు ప్రపంచంలో పైన పేర్కొన్న దేశాల్లో నదీలోయల్లో పెరిగిన సంస్కృత వృక్షం తనశాఖలను ప్రపంచ వ్యాప్తంగా విస్తరించింది. అయితే ఈ సంస్కృతీ బీజం మాత్రం అప్పటికే కొన్ని లక్షల సంవత్సరాలకు ముందే – అంటే చరిత్ర పూర్వ యుగంలోనే మొలకెత్తింది.

సకల మానవ సంస్కృతిలో, భారతదేశ సంస్కృతి ఒక అంతర్భాగం. ప్రపంచంలోని విభిన్న దేశాల, ప్రాంతాల సంస్కృతులు పరస్పర ప్రేరణతో, ఇచ్చి పుచ్చుకోడంతో అభివృద్ధి చెందాయి. ఈ మానవ సంస్కృతీవికాస కథ సుదీర్ఘమైనదే గాక, సంక్లిష్టమైనది కూడ. మానవసంస్కృతీ వికాసంలో అంతర్భాగంగానే భారతీయ సంస్కృతి వికసించింది. వివిధ చారిత్రక విభాత సన్నివేశాల్లో, ప్రకృతి శక్తులు పరస్పరం సంఘర్షించిన పరిస్థితులలో ఈ సంస్కృతీ వికాసం క్రమానుగతంగా అభివృద్ధి చెందుతూ వచ్చింది. వేల సంవత్సరాల సుదీర్ఘ చరిత్రగమనంలో, భారతదేశంలోని వివిధ ప్రాంతాల్లోని జాతులు, తెగలు, చిన్న చిన్న జనపదాలు, ఆ తర్వాత కొద్దిపాటి రాజ్యాలు, ఆపైన విశాలమైన సామ్రాజ్యాలు అవతరించాక, ఆయాకాలాల్లో, భారతీయ సంస్కృతి అభివృద్ధి చెందింది.

భారతదేశం అనాదిగా బహుజాతుల, భాషల, మతాల, కులాలతో కూడిన సమాజం. మెడిటరేనియన్, నీగ్రిటో, మంగోలాయిడ్, ప్రోటో – ఆస్ట్రిలాయిడ్ మొదలగు జాతులవారు మనదేశంలో ఉన్నారు. దాదాపు 30 వరకూ ప్రధాన భాషలు, ఇవికాక దేశంలో అనేక ప్రాంతాల్లో, మారుమూలల్లో, గిరిజనులు, ఇతరులు మాట్లాడుకొనే అనేక వందల భాషలున్నాయి. లిపిలేకుండా, మాట్లాడుకోడానికి మాత్రమే ఉపయోగించే భాషలు ఎన్నో ఉన్నాయి. ప్రధాన మతాలుగా పరిగణించబడే హిందూ, ముస్లిం, క్రైస్తవం, సిక్కు, బౌద్ధ, జైనాలున్నాయి. కొండ ప్రాంతాల్లో జీవించే ప్రజల జీవన విధానం – వారి కట్టు, బొట్టు, వ్యవసాయం, తిండీ – ఇతరుల కంటె భిన్నంగా, విశిష్టంగా ఉంది. సమాజంలో కులవ్యవస్థకు ఎంతో ప్రాధాన్యం ఉంది. ఈ వ్యవస్థలో భాగంగా అనేక వందల చిన్న, చిన్న ఉపకులాలున్నాయి. దేశంలోని ప్రజల్లో ఎక్కువ మంది గ్రామాల్లో జీవిస్తున్నారు. ఇంతటి వైవిధ్యం కలిగిన భారతీయ సంస్కృతిపైన చెప్పిన అన్ని వర్గాల ప్రజలు కలిసి సుసంపన్నం చేసినదే. ఈ వైవిధ్యంలో, ఈ భిన్నత్వంలో మనం ఒక విలక్షణమైన ఏకత్వాన్ని చూడగలుగుతున్నాం. దీనికి ప్రధాన కారణం భారతీయ సంస్కృతికి పునాదిగా చెప్పదగిన సహనశీలత. ముందే చెప్పుకొన్నట్లుగా ప్రతి జాతి సంస్కృతిలోనూ సహనశీలత ఉండి తీరుతుంది. అందుకనే అది ఇతర సంస్కృతులలోని వైశిష్ట్యాన్ని గ్రహించగలుగుతుంది. భారతీయ సమాజంలోని ప్రతి విభాగమూ, తన సంస్కృతిని, తన జీవన విధానాన్ని పెంపొందించుకొంటూ, మరొకవైపు ఇతర ప్రాంతాల, అక్కడి ప్రజల సంస్కృతీ రీతులను మన్నిస్తూ, వాటినుంచి నచ్చినవాటిని గ్రహిస్తూ, తద్వారా మొత్తం దేశ సంస్కృతిని సంపన్నం చేసుకొంటూ, అభివృద్ధి చెందాయి. ఈ భిన్న సంస్కృతుల మధ్య



BRAOU

ఈ సంకీర్ణ సంస్కృతి లక్షణాల మధ్య శాశ్వత ద్వేషం లేదు. కార్పణ్యంలేదు. అసహనం లేదు. అదే భారతీయ సంస్కృతీ విశిష్టత. చారిత్రక దృష్టితో చూసినప్పుడు ఐరోపా, ఆసియా ఖండంలోని ఇతర ప్రాంతాల నుండి భారతదేశానికి వచ్చిన వివిధ రకాల ప్రజలు, ఇక్కడ స్థిరపడి, ఇక్కడి ప్రజలతో కలిసి జీవించడంవల్ల అటు వారి సంస్కృతిలోనూ, ఇటు భారతీయ సంస్కృతిలోనూ ఎన్నో మార్పులు వచ్చినాయి. అందుకనే వివిధ సంస్కృతుల మేలుకలయికయే భారతీయ సంస్కృతి అని మనం చెప్పుకొంటున్నాం.

### 4.3.1 వేదపూర్వ సంస్కృతి

ఆర్యుల రాకకు పూర్వం భారతదేశంలో ఉండిన సంస్కృతి స్థూలంగా ద్రావిడ సంస్కృతిగా చెప్పుకున్నా, అంతకు ముందుకూడ భారతదేశంలో సంస్కృతి నెలకొని ఉంది. ఆనాటి భారతీయ సమాజంలోని ప్రజలు నిర్మించిన సంస్కృతీచ్ఛాయలు, చరిత్ర పూర్వయుగంలోని అవశేషాల ద్వారా, కొండగుహల్లో లభించిన బొమ్మలద్వారా, రాతి పనిముట్లద్వారా తెలుసుకోగలుగుతున్నాం. వేదకాలపు సంస్కృతికి పూర్వం విలసిల్లిన హరప్పా సంస్కృతి (ఇటీవలి వరకూ దీన్నే సింధు నాగరకతగా పిలిచారు) ప్రధానంగా పట్టణ సంస్కృతిగా పేరొందింది. వ్యావసాయిక సమాజంలో సాధించిన మిగులు ఉత్పత్తి (Surplus Produce) పట్టణ ప్రజలకు సరిపోయే విధంగా ఉండి, సాంకేతిక పరమైన విజ్ఞానం సాధించినందువల్ల, లోహకారులు, చేతివృత్తుల నిపుణులు, అప్పుడే పెంపొందుతున్న వర్తక వాణిజ్య వర్గాలవాళ్లు, పట్టణాలలో నివసించసాగారు. లోహాలను ఉపయోగించడంలో రాగిని వాడే దశనుండి భారతీయ సమాజం కంచును నిత్యజీవితంలో వాడే దశలోకి ప్రవేశించింది. ఈ నేపథ్యంలో చూచినప్పుడు ప్రపంచంలోని పలుప్రాంతాల్లో పట్టణ జీవితాన్ని ప్రతిబింబిస్తూ వచ్చిన సంస్కృతులలో ప్రముఖమైనవి మెసపొటేమియా, పర్షియా, ఈజిప్టు, భారతదేశాలు. ఈ భిన్న నాగరకతల మధ్య సన్నిహిత సంబంధాలుండేవని, వర్తక, వ్యాపారాలు కొనసాగి పరస్పరం సంపన్నమయ్యాయని చరిత్రకారులు నిర్ధారించారు. భారతదేశం, మెసపొటేమియా సంస్కృతుల మధ్య పోలికలు ఎక్కువ ఉన్నాయని, ఇది వాటి మధ్య నెలకొన్న సన్నిహిత సంబంధాన్ని తెలియచేస్తుందని వీరి అభిప్రాయం. హరప్పా, మొహంజదారోలలో విస్తరించిన సంస్కృతి భావితరాలకు అందించిన అంశాలలో పట్టణ నాగరకతేగాక, మత పరంగా కొన్ని జంతువుల పవిత్రమైన భావం. శక్తిపూజలాంటి సంప్రదాయాలు వ్యక్తిపరమైన పరిశుభ్రతలాంటి అలవాట్లు ఈనాటికీ సమాజంలో నిలిచి ఉన్నాయి.

### 4.3.2 ఆర్య సంస్కృతి

సంస్కృతిపరంగా భిన్నమైన రీతిలో ఆర్య సంస్కృతి, వేదకాలపు సంస్కృతి ఆ తర్వాత భారతదేశంలో రూపొందింది. దీని ప్రభావంవల్ల వేదవాఙ్మయం, వృత్తిపరంగా సమాజ విభజన (ఆ తర్వాత మలి వేదకాలంలో ఇదే కులవ్యవస్థగా మారి స్థిరపడిపోయింది), ప్రకృతి ఆరాధన, పితృస్వామిక కుటుంబ వ్యవస్థ వచ్చాయి. అంతేకాకుండా హిందూ మతంలో అనేకానేక యజ్ఞయాగాదులు, కర్మలూ క్రతువులూ ప్రవేశించాయి. మతం సంస్థాగతం కావచ్చింది. గణ జీవితం సన్నగిల్లడం ఆరంభమైంది. కుటుంబవ్యవస్థ గట్టిపడసాగింది. సమాజ జీవితంలో వివిధ రకాలైన వృత్తులు ఏర్పడ్డాయి. వ్యవసాయాభివృద్ధితోపాటు వ్యాపారం కూడా అభివృద్ధి కాసాగింది. ఋగ్వేదంలో పశ్చిమ ఆసియా, పర్షియా సింధుశాఖ గూర్చిన ప్రస్తావనలు ఉండడంతో, బహుశ ఈ ప్రాంతాలతో ఆనాడు వ్యాపార సంబంధాలు ఉండి ఉండవచ్చు. అలాగే రాజకీయంగా కూడా. వేదకాలపు సంస్కృతిలో గణావసరాలు పెరిగేకొద్దీ, గణాధిపతికి ప్రాధాన్యం పెరిగి క్రమేపి అధికారాలు కేంద్రీకృతం కావటంతో రాచరికానికి పునాదులు పడ్డాయి. ప్రాచీన భారతీయ సంస్కృతిలో ఉజ్వల శకంగా భావించబడిన వేదకాలంలో భారతీయ జీవనంలో ఎన్నో అంశాలు – సంస్కృత భాషావికాసం మతపరమైన ఆచార, వ్యవహారాలు, ఉపనిషత్ తత్వసారం – ఇప్పటికీ కొనసాగుతూ ఉండడం భారతీయ సంస్కృతిలోని సంకీర్ణతకు ఉదాహరణగా చెప్పుకోవచ్చు.

### 4.3.3 మతోద్యమ సంస్కృతి

ఆ తర్వాత మూడువందల సంవత్సరాల కాలగమనంలో, సమాజం గట్టిపడి, కులవ్యవస్థ బిగుసుకుపోయి, మతాచారాలు పెచ్చుపెరిగి, బ్రాహ్మణాధిక్యం పెరిగి, రాజాధిక్యంగ అవతరించి, నిత్య ఆర్థిక సంబంధాలలో నాణేల చెలామణీ పెరిగి, ఆనాటి మతంపై తిరుగుబాట్లు జరిగి నూతన మతోద్యమాలు – జైనం, బౌద్ధం, చార్వాకం మొదలైనవి – తలెత్తాయి. బ్రాహ్మణాధికారంవల్ల పెచ్చు పెరిగిన సమాజపు కట్టుబాట్లను, జన్మనుబట్టి కులాన్ని



BRAOU

నిర్ణయించే కులవ్యవస్థను, యజ్ఞ యాగాదులను, కర్మకాండను, జంతుబలిని నిరసిస్తూ, ఈ కొత్త మత, తాత్త్వికధోరణులు ముందుకొచ్చాయి. భారతీయ సంస్కృతిలోని సంకీర్ణతలో భాగమే ఈ భిన్నమతాల ఆవిర్భావం. క్రీస్తుపూర్వం 6వ శతాబ్దంలో భారతీయ సమాజం అనేక మత భావాల ఆటుపోట్లకు గురైంది. సమాజంలోని ప్రజలు కొత్త మార్గాలవైపు, సంస్కృతివైపు అర్రులుచాచారు. మతం ఒక తంతుగా మారి మనిషికి సంకెల అయినందున, అతడిని విముక్తిచేసే ఉద్దేశంతో పుట్టుకొచ్చిన మతోద్యమాలు భారతీయ సంస్కృతిని, తాత్త్విక చింతనను సంపన్నంచేశాయి. మతపరమైన ఉద్యమాలేగాక, భారతీయ సంస్కృతిలో 'లోకాయత' సంప్రదాయానికి ప్రాతినిధ్యం వహించే 'చార్వాకులు', 'ఆజీవకులు' ఈ కాలంవారే! ఆనాటి హిందూ మతంపై ఒక మూఢవిశ్వాసం పుట్టగా మారినపుడు, దానినుండి మానవుణ్ణి ఏవిధంగా రక్షించాలి అనే ముఖ్య ఆశయంతో తిరుగుబాటు జరిపిన మతోద్యమాలు, ముఖ్యంగా బౌద్ధం, మానవుడు అనుభవిస్తున్న నిరంతర దుఃఖం, ఎనలేని బాధలను సంపుపరంగా విశ్లేషించింది. బుద్ధుడు మానవతావాది. సమాజంలోని దుఃఖాన్ని గుర్తించి, మానవ జీవితంలోని బాధను నిర్మూలింప ప్రయత్నించడమే బుద్ధుని మానవత్వానికి నిదర్శనం. అందరూ సమానమేనన్న భావాన్ని ప్రబోధించాడు. వేదాధిక్యతను అంగీకరించలేదు. ప్రకృతి పరిణామశీలమైందనీ, అది నిత్యం మారుతూ ఉంటుందన్న సూత్రీకరణ చేయడంవల్ల సమాజ పురోగతి అనే ఒక విశాల సిద్ధాంతానికి ఎంతో బలం చేకూరింది. అంటే, సమాజ పరిణామ క్రమంలో ఒక చారిత్రక దశలో ఉన్న సమాజంకంటే అంతకన్న అభివృద్ధితో కూడిన ఉన్నత సమాజాన్ని సాధించడం సాధ్యమన్న విషయం నిర్ధారితమయింది. భారతీయ సంస్కృతిలోని ఈ పురోగామి స్వభావం తర్వాతి కాలపు సమాజ పరిణామ సిద్ధాంతాలకు మార్గదర్శకంగా నిలిచింది. ఈ మతోద్యమాలు సంస్కృతికి చేసిన మరొక మహత్తర సేవ, వాటి బోధలు అందరికీ అర్థమయేలా ప్రాకృత భాషలో బోధించడం. ఇదే సంప్రదాయాన్ని తర్వాతి కాలంలో తలెత్తిన మత నిరసనోద్యమాలు పాటించడం గమనించాలి. ఒకవైపు వైదిక మతం సంస్కృత భాషను స్వీకరించి, దాన్ని 'దేవభాష' గా పరిగణించి ఆ భాషద్వారా సమాజంలోని ఉన్నత వర్గాలకు మాత్రమే పరిమితమయిన మతబోధలు చేస్తూఉంటే మరోవైపు దానికి భిన్నంగా ప్రాకృతభాషను స్వీకరించి, భారతీయ సంస్కృతిలో సంకీర్ణతకు క్రీ.పూ. 6వ శతాబ్దిలోని మతోద్యమాలు దోహదం చేసాయి. భారతీయ సమాజం ఒక దశ నుండి వేరొక దశకు (బానిస విధానం నుండి అంతకంటే మెరుగైన అర్థ బానిస వ్యవస్థకు) - మారుతున్న దశలో పాత వ్యవస్థ దానికి అడ్డుతగలగా, అడ్డును తాత్త్వికంగా తొలగించాలని చేసిన ప్రయత్నమే ఈ మతోద్యమాలు.

### 4.3.4 దండయాత్రల ఫలితాలు

భారతీయ సంస్కృతిలోని సంకీర్ణ లక్షణాలకు దోహదం చేసిన అంశాలలో చెప్పుకోదగినవి మౌర్య సామ్రాజ్య అవతరణకు ముందు జరిగిన పర్షియన్ గ్రీకు దండయాత్రలూ, వాటి ఫలితాలు. రాజకీయంగా, ఒక సువిశాల సామ్రాజ్యాన్ని ఏర్పాటుచేయాలన్న భావాన్ని, భారతదేశపు రాజులలో కలిగించడమేగాక, భారతీయ శిల్పాన్ని సంపన్నంచేసిన గాంధారీ శిల్పరీతి ఈ కాలంలో రూపొందించారు. 'ఖరోష్టి' లిపి భారతీయులు వీరినుండి గ్రహించిందే. అశోకుని కాలం నుండి రాళ్ళపై శాసనాలు చెక్కడం, స్తంభశాసనాలు వేయించడం పర్షియన్, గ్రీకులనుండి మనం నేర్చుకొన్నదే. గ్రీకులతో, ఏర్పడిన సంసర్గంవల్ల, పాశ్చాత్య ప్రపంచంతో, ముఖ్యంగా రోమన్ సామ్రాజ్యంతో గణనీయంగా సంబంధాలు పెరిగి, భారత రాయబారులు రోమన్ ఆస్థానానికి పోయినట్లు ఎన్నో దాఖలాలున్నాయి. భారతదేశం రోమ్‌నుండే జ్యూయిష్-క్రిష్టియన్ కాలెండర్ (Jewis Christian) ని స్వీకరించింది. మొదటిసారిగా క్రైస్తవ మతంతో భారతదేశానికి సంబంధం ఏర్పడడం ఇప్పుడే జరిగింది. (క్రీ.శ. మొదటి రెండు శతాబ్దాల్లో). ఇక, రోమ్‌తో ఆనాడు జరిగిన వర్తక వ్యాపారాలు, భారతదేశం నుండి ఎగుమతైన ఎన్నో విలాస వస్తువులు, వాటికి ప్రతిఫలంగా పొందిన బంగారు నాణేలు అధికసంఖ్యలో కోరమాండల్ తీరంలో తవ్వకాలలో బయటపడ్డ విషయం మనకు తెలిసిందే.

ఖగోళశాస్త్రి విజ్ఞానం గ్రీకుల ద్వారా భారతదేశంలో ప్రవేశించిందని మనకు తెలుసు. గ్రీకులు బాబిలోనియానుండి ఈ శాస్త్రివిజ్ఞానాన్ని పొందగలిగారు. వరాహమిహురుడు మొదటిసారిగా ఖగోళశాస్త్రింపై శాస్త్రీయమైన గ్రంథాన్ని (పంచ సిద్ధాంతం), రచించాడు. అందులో ముగ్గురు గ్రీకు ఖగోళశాస్త్రిజ్ఞుల - (రోమక, పులిశ, సూర్య) సిద్ధాంతాలను పొందుపరిచి మరో ప్రసిద్ధ గ్రీకు ఖగోళ శాస్త్రిజ్ఞుడైన యవనాచార్యను తన గ్రంథంలో పేర్కొన్నాడు. శకులు మొదటిసారిగా, మాళవరాజ్యాన్ని పాలిస్తున్నప్పుడు ఈ శాస్త్రి విజ్ఞానానికి పోషణ కల్పించారు. ఉజ్జయినీ నగరాన్ని గ్రీకు శాస్త్రివిజ్ఞాన కేంద్రంగా చేసి పెంపొందించారు. భారతీయ

BRAOU

సాహిత్యానికి శకులు చేసిన కృషి అపారమైనది. శకుల రాజైన రుద్రదమనుడు (ఉజ్జయినికి అధిపతి) వ్యాకరణ తర్క, సంగీత శాస్త్రాల్లో ఆరితేరినవాడు. సంస్కృతభాషలో గద్య పద్యాలను రాయడంలో గొప్ప ప్రజ్ఞ చూపాడు. గిర్నార్ కొండల్లో తన దండయాత్రల గూర్చి చక్కని సంస్కృత వచన శైలిలో రాసాడు. 'బ్రాహ్మణాల, అరణ్యకాల' రచన తర్వాత ఇంత చక్కని శైలి లేదని పండితుల అభిప్రాయం. శకులు కుర్తా, సాల్వార్ లాంటి ఇరానియన్ దుస్తులను కొన్నింటిని ప్రవేశపెట్టారు. అయితే అవి మొగలు పరిపాలనా కాలందాకా ప్రాచుర్యానికి రాలేదు. భారతదేశంలో అనాడే ఉండిన సతీసహగమన ఆచారాన్ని సమర్థించారు. ఆ ఆచారం వారిలోనూ ఉండడమే దీనికి కారణం !

ఇదే విధంగా కుషానుల దండయాత్ర ఫలితంగా, కనిష్కుడు అనేక కొత్త అంశాలను భారతీయ సంస్కృతిలో ప్రవేశపెట్టాడు. నిజానికి గాంధార శిల్పరీతి ఇతడి కాలంలోనే ఉన్నత శిఖరాలను అందుకోగలిగింది. గాంధార రీతిలోనేకాక, మొత్తం శిల్పంలోనే ఎన్నో నూతనాంశాలను ప్రవేశపెట్టి, భారతీయ శిల్పాన్ని సంపన్నపరచింది కుషానులే ! అశోక చక్రవర్తిని మినహాయిస్తే, బౌద్ధ సన్యాసి 'సంఘరక్షకుడిని' తన మత సలహాదారునిగా తీసుకొని, అతడి ప్రభావంవల్ల కాశ్మీరులోని శ్రీనగర్‌లో సుప్రసిద్ధమైన బౌద్ధ మత సభలు జరిపాడు. వసుమిత్రుడు ఈ సభలకు అధ్యక్షుడు. అశ్వఘోషుడు అనాటి గొప్ప కవి, తాత్వికుడు. వాల్మీకి తర్వాత అంతటి గొప్ప కవి లేడని విద్వాంసుల అభిప్రాయం. కనిష్కుని ఆస్థానంలో, రాజపోషణకు పాత్రుడై 'బుద్ధచరితము, సౌందర నందనము' లాంటి గొప్ప కావ్యాలను రచించాడు. వీరేగాక నాగార్జునుడు, చరకుడు, కనిష్కుని ఆస్థానంలోనివారే. ప్రసిద్ధ నాటక రచయితలైన భాసుడు, శూద్రకుడు ఇప్పటివారే. వీరిద్దరి నాటకాలలో గ్రీకు చరిత్ర, వారి నాటక రచనా పద్ధతుల ప్రభావం కన్పిస్తాయి. శూద్రకుడు తన 'మృచ్ఛకటికం' నాటకంలో గ్రీకుల మోదాంత నాటక (Comedy) సంప్రదాయాన్ని పాటించి, సంస్కృత సంప్రదాయాల్ని విడనాడి, బ్రాహ్మణున్ని దొంగగా చిత్రించి, భారతీయ సాహిత్యంలోనే గొప్ప సంచలనాన్ని సృష్టించాడు.

మతరీత్యా నాగార్జునుడి మహాయాన సిద్ధాంతాలు, బోధిసత్వభావం, తర్వాతి కాలంలో వైష్ణవ సంప్రదాయాల్ని ప్రభావితం చేశాయి. అదేవిధంగా క్రైస్తవ మతంకూడ బోధిసత్వ భావంతో ఎంతగానో ప్రభావితం అయింది. గ్రీకు ఇంజనీర్లు, భవన నిర్మాణ నిపుణులు భారతదేశానికి రావడం, భారతదేశాన్నుండి ఎందరో శాస్త్రజ్ఞులు, ఇతరులు విదేశాలకి వెళ్లడం (చరకుడు వైద్యశాస్త్ర సభలలో పాల్గొనడానికి బాక్ట్రియా వెళ్ళడం జరిగింది), ఈ విధంగా భావప్రసారం ప్రభావాలతో భారతీయ సంస్కృతి సంకీర్ణతతోపాటు, సంపన్నతనూ కూర్చుకుంది. 'పురుషపుర్ (పెషావర్) లాంటి పట్టణాలు వెలిసి, మధ్య దేశంనుండి బాక్ట్రియా దాకా భౌగోళికంగా ఒకే ప్రాంతంగా రూపొందింది. శకులు, యవనులు భారతదేశంలో వివిధ ప్రాంతాలలో స్థిరపడి, భారతీయ సంస్కృతిలో, జీవన విధానంలో భాగస్వాములైనారు. 'కార్తికేయ, వాసుదేవ కృష్ణ' లాంటి మతశాఖలు ఇప్పటివే. 'చిన్ని కృష్ణుడి' లాంటి మత శాఖపై క్రైస్తవ మత ప్రభావం ఎక్కువగా ఏర్పడింది, ఉండిందీ ఈ కాలంలోనే. ఇదే కాలంలో రబీరులు, ఘూర్జరులు భారతీయ సంస్కృతిపై తమ ప్రభావాన్ని ప్రసరింపచేసి ఘూర్జర ప్రతీహార వంశాల స్థాపనకు దోహదం చేశారు.

గుప్తుల కాలంలోనూ, ఆ తర్వాత పుష్యభూతి వంశ పరిపాలకులలో అగ్రగణ్యుడైన హర్షవర్ధనుడి కాలంలోనూ, ఆతర్వాత, ఇస్లాం మత ప్రవేశంవరకూ భారతీయ సంస్కృతిలో మార్పులు పొడసూపుతునే వచ్చాయి. విదేశీయుల సంపర్కంతో సంపన్నమైన ఖగోళశాస్త్ర విజ్ఞానమేగాక, గణితంలో కూడా ఎంతో అభివృద్ధి సాధించారు. చిత్రలేఖనంలో 'కుడ్యరీతి' కి ప్రసిద్ధిపొందిన అజంతా, ఎల్లోరా గుహలను ఈ కాలంలోనే తొలిచారు. ప్రాచీన గాథలు, పురాణాలు, సంప్రదాయ సిద్ధాంతాలు తిరిగి రాశారు. భారతీయ సమాజం, విదేశీయుల వత్తిడులకు తట్టుకొని నిలబడలేకపోతుందనీ, అందువల్ల తన సామాజిక వ్యవస్థ విచ్ఛిన్న మౌతున్నదేమోనన్న భయంతో కొందరు రాజులు పండితులు సమాజం కట్టుబాట్లను మరింత కట్టుదిట్టం చేయనారంభించారు. శిశువివాహాలు, సమాజంలో స్త్రీచుట్టూ ఎన్నో అడ్డంకులు, ఆంక్షలు ప్రవేశపెట్టారు. 'మనుస్మృతి' ఈ వాతావరణంలో రాసిందే. సమాజంలో ఒకవైపు విదేశీ సంపర్కంతో వస్తున్న మార్పులు, మరోవైపు సమాజాన్ని యథాతథంగా ఉంచాలన్న ప్రయత్నాల్ని మనం గమనిస్తాం. మతరీత్యా భక్తితత్వం ప్రబలి, సామాన్యుల భాషలో, ముఖ్యంగా దక్షిణాది ప్రాంతమైన తమిళనాడులో భక్తికవులు ప్రబలారు. శంకరుడు, రామానుజుడులాంటి గొప్ప హిందూ మత గురువులు, ప్రచారకులు ఆవిర్భవించారు. కంచుతో అందమైన విగ్రహాలు తయారుచేశారు.

BRAOU

### 4.3.5 ఇస్లాం మత ప్రవేశ ఫలితాలు

ఇస్లాం మత ప్రవేశంతో కొత్త సంస్కృతీ ప్రభావాలు మొదలయ్యాయి. భారతీయ సంస్కృతి ఎన్నో గణనీయమైన మార్పులకు గురైంది. మరింత సంకీర్ణతను తనలో పొదుగుకొంది. ఢిల్లీ సుల్తానుల కాలంలో కొత్త శిల్ప, చిత్రలేఖన పద్ధతులు ప్రవేశించాయి. సూఫీ మత గురువులు తమ బోధనలద్వారా, ఉత్తర భారతదేశంలో మతపరంగా అనుకూల వాతావరణాన్ని సృష్టించి, దక్షిణ భారతదేశంలో నుండి బయలుదేరి వచ్చిన భక్తితత్వ బోధల వ్యాప్తికి దోహదం చేశారు. సూఫీభక్తి తత్వవేత్తలు, మధ్యయుగాలలో భారతీయ మత సంప్రదాయాలకు కొత్తరీతులు నేర్పారు. ఈ రెంటి మధ్య పరస్పర ద్వేషంలేక, పడుగుపేకల్లా సమాజంలో తమ భావాలను వ్యక్తంచేశాయి. తాళపత్రాలపై రాసే పద్ధతిపోయి, కాగితంపై రాయడం ఆరంభమైంది. 'ఉర్దూ' భాష పుట్టింది ఈ కాలంలోనే. సంస్కృత భాషలో రాయడం మాని, కవులు ప్రజలందరికి అర్థమయ్యే ఉర్దూలో రచనలు చేయనారంభించారు. భాషాపరంగా, ఉత్తర భారతదేశమంతా ఉర్దూ ప్రాచుర్యాన్ని పొంది, అది ప్రజలు నిత్య వ్యవహారంలో మాట్లాడుకొనే భాషగా రూపొందింది. మొగలుల కాలంలో హిందూ-ముస్లిం ఐక్యత, పరస్పర అవగాహన, రెండుమతాల మధ్య సానుకూలత, సఖ్యత, అక్బర్ పరిపాలనా కాలంలో చరమస్థాయికి చేరుకొంది. శిల్పం, భవన నిర్మాణం కొత్త పుంతలుతొక్కి, తాజమహల్‌లాంటి ఉత్తమ కళాఖండాన్ని ఈ కాలం సృష్టించగలిగింది. సిక్కు మతస్థాపన, భారతీయ సంస్కృతీ గమనంలో ఒక కొత్త మలుపు, హిందూ-ముస్లిం ఐక్యతను పరోక్షంగా సాధించడానికి, రెంటిమధ్య సమన్వయ సాధనగా, మధ్యయుగాల భక్తితత్వపు కొసమెరుపుగా మొదలయిన ఈ మతం ఆ తర్వాతి కాలంలో రాజకీయ పరిస్థితుల ప్రాబల్యంతో, శక్తివంతమైన, క్రియాశీలమైన మతంగా రూపొంది, భారతదేశ రాజకీయాల్లో ప్రముఖపాత్ర వహించింది.

### 4.3.6 యూరోపియన్ సంస్కృతి ప్రభావం

ఐరోపా ఖండవాసులు వాణిజ్యంకోసం భారతదేశానికి రావడంతో, ఆధునిక యుగంలో భారతీయ సంస్కృతి ఊహించలేనంతగా ఎన్నో మార్పులకు గురి అయింది. మరింత సంకీర్ణమైంది. ఇక్కడ మనం ఒక విషయం గుర్తించుకోవాలి. సంకీర్ణత, ముందే చెప్పుకొన్నట్లుగా, సంస్కృతిని మరింత బలపరిచింది. సంస్కృతి పునాదులు బలపడ్డాయి. పోర్చుగీసువారి ద్వారా కొత్త పంటలు (బంగాళాదుంప, పొగాకు, అనాస Pine-apple-, మిరపకాయలు) భారతదేశంలో ప్రవేశించాయి. ఇంగ్లీషువారి తూర్పు ఇండియా కంపెనీ బలం పుంజుకోవడంతో, తాత్కాలికంగా భారతీయ సంస్కృతి ప్రాముఖ్యం కొంత తగ్గినట్టు అనిపించినా నిరంతరం ప్రవహించే సెలయేరులాంటి భారతీయ సంస్కృతీధార మాత్రం ఆగలేదు. ఏ సంస్కృతికూడ, మరొక సంస్కృతీ ప్రభావంతో పూర్తిగా నశించలేదు. నివురుగప్పిన నిప్పులా ఉండి సమాజంలో వస్తున్న మార్పులను గమనిస్తూ ఉంటుంది. [illegible]వ్యంగా, భారతీయ సంస్కృతిలో ఈ [illegible]కాన్ని మనం గమనిస్తాం.

19వ శతాబ్దం ప్రవేశించేసరికి యూరోపియన్ సంస్కృతి ప్రభావం చెప్పలేనంతగా అనేక రంగాలలో భారతీయ సంస్కృతిపై తన గాఢ ముద్రవేసింది. ఇందులో ముఖ్యంగా చెప్పుకోదగ్గవి ఆధునికమైన జాతీయతాభావాన్ని దేశప్రజల్లో కల్గించడం, రాజకీయంగా, భౌగోళికంగా ఐక్యతను సాధించడం, స్వేచ్ఛాపిపాసను రేకెత్తించడంలాంటివి. అంతేగాక మొత్తం రాజకీయాలపై, సామాజిక జీవితంపై సాహిత్య కళారంగాలపై బ్రిటిష్ పరిపాలనా ప్రభావాన్ని మనం చూడగలుగుతాం. శాస్త్రీయ, విజ్ఞానరంగాలలో వారు సాధించిన అభివృద్ధి కారణంగా, భారతీయుల జీవితరేఖలే పూర్తిగా మారాయి. పార్లమెంటరీ ప్రజాస్వామ్యం ద్వారా ప్రభుత్వ నిర్వహణలో ఆధునిక భావాలు చొప్పించారు. చట్టందృష్టిలో అందరూ సమానులేనన్న భావాన్ని, మత, ఆధ్యాత్మిక రంగాలలో లౌకికతత్వాన్ని ప్రవేశపెట్టి, దేశాన్ని ఆధునీకరించి, భారతీయ సంస్కృతికి కొత్త జీవితం ఇవ్వడానికి ప్రయత్నించారు. మన ప్రాచీన సాహిత్యాలను, సంస్కృతిని, గత చరిత్రలో మరుగున పడి దాగిఉన్న చీకటి కోణాలపై వెలుగు ప్రసరింపచేశారు. ఆధునిక చరిత్ర రచనకు దోహదం చేశారు. ఆధునిక విద్యా విధానాన్ని ప్రవేశపెట్టి, కళాశాలలు, విశ్వవిద్యాలయాలు స్థాపించి తద్వారా పాశ్చాత్య ప్రపంచంలోని శాస్త్రీయ, సాంకేతిక, ఆర్థిక, రాజనీతి భావాలను భారతీయులకు అందించారు. ఆంగ్లేయుల పరిపాలన దోషరహితమైన మహోత్కృష్టమైన పరిపాలనగా చెప్పడానికి వీల్లేదు. వలసవాద ఆర్థిక దోపిడికి దేశాన్ని గురిచేసి, భారతీయ చేతి పరిశ్రమలను ధ్వంసంచేసి, రైతు ఆర్థిక స్థితిగతులను దిగజార్చి, దేశాన్ని అన్ని విధాలా పీల్చి పిప్పిచేసింది ఆంగ్ల పరిపాలకులే. అయితే, వారి పరిపాలన భారతదేశంలో ఒక సాంఘిక విప్లవాన్ని తెచ్చిపెట్టింది. పాత సామాజిక వ్యవస్థ ధ్వంసమయి, దానిస్థానే కొత్త వ్యవస్థ రూపుదిద్దుకోడం ఆరంభించింది. జాతీయభావాలు పెంపొంది, దేశ



BRAOU

వ్యాప్తమైన జాతీయోద్యమం మొదలైంది. ఆధునిక భారతదేశ చరిత్రలో ఈ ఘట్టం ఉజ్వలమైంది. ఎంతో ముఖ్యమైంది. స్వాతంత్ర్యానంతర భారతదేశ విధానాలకు, ఆర్థిక, రాజకీయ, సామాజిక, సాంస్కృతికాభివృద్ధికి ఈ పునాదులు ఈ ఉద్యమ కాలంలోనే పడ్డాయి. వాటి ఆధారంగానే స్వతంత్ర భారతావని తన పయనాన్ని నిర్దేశించుకొని, ప్రపంచదేశాలలో ఒక ముఖ్యమైన దేశంగా రూపొందడం జరుగుతున్నది.

### 4.3.7 భిన్నత్వంలో ఏకత్వం

పై విధంగా పరిశీలించినపుడు భారతీయ సంస్కృతి ఏనాడూ మృతప్రాయం కావడంకానీ, సంస్కృతీ సెంపుదల స్తబ్ధంగా ఉండిపోవడంకానీ జరగలేదు. పాఠం ప్రారంభంలో చెప్పుకొన్నట్టు, భారతీయ సంస్కృతి ఎల్లప్పుడూ కొత్త ప్రభావాలనూ, అంశాలనూ, ఇతర సంస్కృతులలోని ధనాంశాలనూ స్వీకరిస్తూ వాటిని తనలో కలుపుకొని, తన సొంతం చేసుకొంటూ ముందుకుసాగింది. అందుకనే అంతటి సంకీర్ణత భారతీయ సంస్కృతిలో చోటుచేసుకొంది. ఇంతటి సంకీర్ణతలోనూ పూసలలోని దారంలాగ భారతీయ సంస్కృతీ ప్రవంతి నిరంతరంగా సాగుతూనేఉంది. నేటి భారతదేశ స్వరూపమే దీనికి ప్రబల తార్కాణం. దేశంలో వివిధ జాతుల ఆశలూ, ఆకాంక్షలూ మరెక్కడా కానరావు. అయినా జాతి విపత్తులో ఉన్నపుడు, దేశ సమైక్యతకూ సమగ్రతకూ భంగం వాటిల్లుతుందేమోనన్న పరిస్థితులు ఏర్పడినపుడు, మొత్తం జాతి ఏకోన్ముఖంగా సమస్యలను ఎదుర్కొనగలగడం సంకీర్ణతలోని ఈ ఏకతాబలంవల్లనే. సహజంగా ఇందులో ఇమిడి ఉన్న జీవశక్తివల్లనే. దేశంలోని వివిధ జాతులు, ప్రాంతాలు, భాషలు, మతాలు వాటి స్వయం ప్రతిపత్తిని నిలుపుకొంటూ, బలపడుతూ, భారతీయ సంస్కృతిలో అంతర్భాగంగా ఉన్నపుడే, భారతజాతి మరింత సంపన్నం కాగలదు. భారతీయ సంస్కృతిలోని సంకీర్ణ లక్షణాలు, సంస్కృతికి పరిపూర్ణతను సంతరింపచేస్తాయే తప్ప బలహీన పరచజాలవు. అందుకనే, మన సంస్కృతీ భిన్నత్వంలో ఏకత్వం ఎంత ఉందో, ఏకత్వంలోనూ అంతే భిన్నత్వం ఉంది.

### అవగాహన ప్రశ్న - 2

భారతీయ సంస్కృతిలోని భిన్నత్వంలో ఏకత్వాన్ని 30 వాక్యాల్లో పరిశీలించండి.

______________________________

______________________________

______________________________

______________________________

______________________________

______________________________

______________________________

______________________________

______________________________

______________________________

______________________________

______________________________

BRAOU

## 4.4 సారాంశం

ఈ భాగం ద్వారా మీరీ విషయాలను గ్రహించారు.

- మానవ సంస్కృతిలో భాగమే భారతీయ సంస్కృతి. భారతీయ సంస్కృతిలో భిన్నత్వం, వైవిధ్యం కన్పిస్తాయి. ఎన్నో భాషలు, మతాలు, కులాలు, ప్రాంతీయ లక్షణాలు ఉన్నా ఈ భిన్నత్వంలో ఏకత్వముంది. ఇది సంకీర్ణ సంస్కృతి లక్షణం.
- మానవ సమాజం తన పురోగమనంలో సాంకేతికాభివృద్ధిని సాధించుకుంటూ జీవన స్థాయిని పెంచుకుంటూ పోవడం నాగరికత. మానవుడు సమష్టి జీవనం ద్వారా సాధించిన మానసిక పరిణితి, తాత్విక భావనలు, ఆశయాలు, నమ్మకాలు, ఆకర్షణలు, సామాజిక విలువలు మొదలైనవి సంస్కృతి అంతర్భాగాలు.
- భారతదేశంలోని ప్రధాన సంస్కృతులు : 1. వేదపూర్వ సంస్కృతి 2. ఆర్యసంస్కృతి 3. మతోద్యమ సంస్కృతి 4. అంతర్జాతీయ సంస్కృతి. వివిధ సంస్కృతుల ప్రభావాలు భారతీయ సంస్కృతిలో అంతర్భాగమై జాతి ఏకోన్ముఖతకు దారితీశాయి.

### అవగాహన ప్రశ్నలకు జవాబులు

1. భిన్న సంస్కృతుల సమ్మేళనాన్ని సంస్కృతీ సంకీర్ణత అంటారు. సంస్కృతిలోని సంకీర్ణతకు మానవుల సంఘజీవనమే కారణం, ఇచ్చిపుచ్చుకోవడం వల్ల, భావజాల వినిమయం వల్ల ఇది ఏర్పడుతుంది. సాంఘికాభివృద్ధిని సాధిస్తుంది. ఒక సంస్కృతి మరొక సంస్కృతిలోని విశేషాలను స్వీకరించే ముందు కొంత ఘర్షణ కలుగుతుంది. క్రమేపీ వ్యతిరేకత తొలగిపోయి భిన్న సంస్కృతుల లక్షణాలను తనలో కలుపుకుంటూ, తన ప్రత్యేకత నిలుపుకుంటూ సంకీర్ణమై సంస్కృతి ఒక విశిష్ట సంస్కృతిగా రూపొందుతుంది. ఉత్తమదశలో గమనశీలం, చలనశీలం కలిగిన సంస్కృతి సంకీర్ణగుణం వల్ల విశ్వమానవ సంస్కృతిగా పరిణమిస్తుంది. విశ్వకళ్యాణాన్ని సాధిస్తుంది.
2. భారతీయ సంస్కృతి మొదటినుండీ అన్ని కాలాల్లోనూ విభిన్న సంస్కృతులలోని కొత్త భావాలనూ, ప్రభావాలనూ, అంశాలనూ, ధనాంశలనూ స్వీకరిస్తూ ముందుకు సాగింది. అందుకే భారతీయ సంస్కృతిలో సువిశాల సంకీర్ణత ఏర్పడింది. ఇటువంటి సంకీర్ణతలోనూ పూసలలోని దారంలాగా భారతీయ సంస్కృతీ ప్రవంతి నిరంతరం కొనసాగుతూనే ఉంది. దీనికినేటి భారతీయ సమాజస్వరూపమే ప్రబల తార్కాణం. దేశంలో నేడున్న వైవిధ్యం, ప్రాంతీయ భేదాలు, భాషాపరమైన భేదాలు, మతపరమైన విభిన్నత, వివిధ జాతులు, ఆశలూ, ఆశయాలూ, ఆకాంక్షలూ మరే దేశంలోనూ కనపడవు. ఐనా దేశసమైక్యతకూ, సమగ్రతకూ భంగం ఏర్పడే పరిస్థితులు ఏర్పడితే మొత్తం జాతి ఏకోన్ముఖంగా ఆ సమస్యలను ఎదుర్కోగలగడం సంకీర్ణతలోని ఈ ఏకతాబలంవల్లనే. దేశంలోని వివిధ జాతులు, భాషలు, ప్రాంతాలు, మతాలు వాటి స్వయంప్రతిపత్తిని నిలుపుకుంటూనే జాతీయ సంస్కృతిలో విలీనంకావడమే భిన్నత్వంలోని ఏకత్వం. భారతీయ సంస్కృతిలోని సంకీర్ణ లక్షణాలు, సంస్కృతికి పరిపూర్ణతనూ, పరిపుష్టినీ సంతరిస్తున్నాయే తప్ప బలహీనపరచడంలేదు. అందుకే మన సంస్కృతిలోని భిన్నత్వంలో ఏకత్వం ఎంత ఉందో ఏకత్వంలో భిన్నత్వంకూడా అంతే ఉండగలుగుతున్నది. అలా ఉండీకూడా సమాజాభ్యుదయాన్నీ, దేశాభ్యుదయాన్నీ సాధించగలుగుతున్నది.

### చదవదగిన పుస్తకాలు


1. Kosambi D. D. – The Culture and Civilization of Ancient India
2. D. D. Kosambi – An Introduction to Indian History
3. A. L. Basham, (ed.) – The Wonder that was India.


BRAOU

4. A. L. Basham, ed. – A Cultural History of India
5. Romila Thapar – History of India – Vol. I (Penguins)
6. Bhagwat Saran Upadhyaya – Feeders of Indian Culture
7. D. N. Mazumdar – Races and Cultures of India.

**మాదిరి పరీక్షా ప్రశ్నలు**

I. కింది ప్రశ్నకు 30 పంక్తులలో సమాధానం రాయండి.

1. భారతీయ సంస్కృతిలోని ముఖ్యమైన సంకీర్ణ లక్షణాలను స్థూలంగా వివరించండి.

II. కింది ప్రశ్నలకు 10 పంక్తులకు మించకుండా సమాధానాలు రాయండి.

1. 'భారతీయ సంస్కృతిలో భిన్నత్వంలో ఏకత్వముంది' – వివరించండి.
2. చరిత్ర ప్రాచీన యుగంలోని భారతదేశ సంస్కృతీ లక్షణాలగూర్చి రాయండి.
3. మధ్యయుగాలలోనూ, ఆధునిక యుగంలోనూ భారతీయ సంస్కృతిలో ప్రవేశించిన భారతీయేతర అంశాలను గూర్చి వివరించండి.
4. భారతీయ సంస్కృతిలోని సంకీర్ణ లక్షణాలు, ఆ సంస్కృతిని సంపన్నం చేస్తున్నాయా ? బలహీన పరుస్తున్నాయా ? చర్చించండి.

BRAOU

# ఖండం 2 తెలుగు భాషా సాహిత్య సంస్కృతుల అధ్యయన నేపథ్యం

పరిచయం

మొదటి ఖండంలో మీరు మన ప్రాంతీయ చరిత్రను పరిపుష్టం చేసిన భారతీయ భాషా సాహిత్య సంస్కృతులను గురించి స్థూలంగా తెలుసుకున్నారు. అంతేకాదు ఖండం ఆరంభ భాగంలోనే (1.1) భాషకూ చరిత్రకూ సంస్కృతికీ గల పరస్పర సంబంధాలను సైతం గుర్తించారు. ఈ ఖండంలో తెలుగుభాషా సాహిత్య సంస్కృతుల పరిణామానికి దారితీసిన వివిధ పరిస్థితుల అధ్యయనానికి సంబంధించిన నేపథ్యాన్ని తెలుసుకుంటారు.

తెలుగు భాష, సాహిత్యం, సంస్కృతి ఆంధ్రదేశపు సుదీర్ఘ చరిత్రలో క్రమానుగతంగా, సమాజ పరిణామంతోపాటు వృద్ధి చెందుతూ, మార్పులకు, లోనవుతూ వచ్చాయి. వివిధ రకాలైన దేశీయ, విదేశీయ భాషాసాహిత్య సంస్కృతులతో సంపర్కం పొంది బలపడుతూ వచ్చాయి. ఈ క్రమం తెలుసుకోటానికి ఎన్నో విధాలైన ఆధారాలుంటాయి. వాటిని పరిశీలించాలి. అంతేకాకుండా వృద్ధి క్రమంలోని దశలను కూడా చర్చించాలి. ఈ ఖండంలో ఆ ప్రయత్నం జరిగింది.

ఈ ఖండంలో అయిదు భాగాలున్నాయి అవి : 1. తెలుగు జాతికి, భాషకూ, దేశానికీ ఉన్న పేర్ల చరిత్ర 2. ఆంధ్రదేశ భౌగోళిక స్వరూప చరిత్ర 3. ఆంధ్రప్రదేశ్‌లోని భాషలు, వాటి వ్యాప్తి 4. అధ్యయనానికి ఆధారాలు 5. దశల విభజన (పాఠ్యాంశ నిర్మాణక్రమంలో వీటిని 5, 6, 7, 8, 9 భాగాలుగా ఇచ్చాము. గమనించండి).

పేర్ల చరిత్రలో మనకు చరిత్ర తెలిసినప్పటినుండి ఆంధ్ర, తెనుగు, తెలుగు అనే పదాలనూ వాటితో సంబంధమున్న ఇతర పదాలనూ పరిచయం చేసి, ఆయా పదాల సాహిత్యాధారాలనూ, వ్యుత్పత్తులనూ పరిచయం చేశాము. మన జాతి, భాష, దేశం – వీటిని గురించి తెలుసుకోటానికి ఈ భాగం తొలిమెట్టు. తర్వాత వివిధ చారిత్రక కాలాల్లో ఆంధ్రదేశ భౌగోళిక స్వరూపం ఏ విధంగా రూపొందుతూ ఈనాటి దశకు చేరుకుందో వివరించాము. తదనంతరం ఇప్పటి ఆంధ్రప్రదేశ్‌లోని భాషలనూ, వాటివ్యాప్తినీ వివరించి ప్రధాన భాష అయిన తెలుగు ప్రాముఖ్యాన్ని స్థూలంగా తెలిపాము. ఆ తర్వాత ఆంధ్రప్రదేశ్‌లోని అత్యధికుల మాతృభాష, అధికారభాష అయిన తెలుగు భాషాసాహిత్య సంస్కృతుల అధ్యయనానికి ఏఏ ఆధారాలున్నాయో విశదీకరించాము. ఈ ఖండం చివరి భాగంలో భాషాచరిత్ర, సాహిత్య చరిత్ర, సంస్కృతి చరిత్రలను ఏఏ దశలుగా పండితులు విభజించారో పరిచయం చేశాము. ఈ పాఠ్యాంశంలో ఏఏ దశలుగా విభజించామో సూచించాము. పాఠ్యాంశ నిర్మాతలు సూచించిన దశాక్రమంలోనే మీరు మూడవ ఖండంలో తెలుగు భాషా చరిత్రనూ, నాల్గవ ఖండంలో తెలుగు సాహిత్య చరిత్రనూ అయిదవ ఖండంలో తెలుగు సంస్కృతీ చరిత్రనూ అధ్యయనం చేస్తారు.

BRAOU

# భాగం – 5 తెలుగు జాతికీ, భాషకూ దేశానికీ ఉన్న పేర్ల చరిత్ర

## విషయక్రమం

5.0 లక్ష్యాలు
5.1 పరిచయం
5.2.0 ఆంధ్ర శబ్ద చరిత్ర
5.2.1 జాతివాచిగా ఆంధ్ర శబ్ద ప్రయోగం
5.2.2 భాషావాచిగా ఆంధ్ర శబ్ద ప్రయోగం
5.2.3 దేశవాచిగా ఆంధ్ర శబ్ద ప్రయోగం
అవగాహన ప్రశ్న – 1
5.3.0 తెనుగు తెలుగు శబ్ద ప్రయోగాలు
5.3.1 తెనుగు శబ్ద వ్యుత్పత్తి
5.3.2 తెలుగు శబ్ద వ్యుత్పత్తి
5.3.3 తెనుగు, తెలుగు శబ్దాల సంబంధం
అవగాహనప్రశ్న – 2
5.4. సారాంశం
అవగాహన ప్రశ్నలకు జవాబులు
చదవదగిన పుస్తకాలు
మాదిరి పరీక్షా ప్రశ్నలు

BRAOU

## 5.0 లక్ష్యాలు

మన భాషకు ఈనాడు ఆంధ్రం, తెనుగు, తెలుగు అని మూడు పేర్లు వాడుకలో ఉన్నాయి. అయితే విరివిగా ఆంధ్రం, తెలుగు అనే పేర్లనే వాడుతున్నాము. ఏకార్థ బోధకాలైన ఈ పదాల చరిత్రనూ, వ్యుత్పత్తులనూ, పరస్పరం సంబంధాన్నీ ఈ భాగం చదివాక, మీరు వివరించగలుగుతారు.

## 5.1 పరిచయం

జాతి, దేశం, భాష అనేవి ఆయా మానవ సమాజాలను గుర్తించే సంకేతాలు, ఏ సమాజానికైనా భాష అనేది ఏర్పడిన తర్వాత, పేర్లు కూడా ఏర్పడతాయి. జాతులకు, భౌగోళిక ప్రాంతాలైన దేశాలకూ, అవి మాట్లాడే భాషలకూ పేర్లు ఉండటం సహజం. ఈ భాగంలో తెలుగు జాతికీ, దేశానికీ భాషకూ గల పేర్ల చరిత్రను మీరు తెలుసుకుంటారు.

## 5.2.0. ఆంధ్ర శబ్ద చరిత్ర

ఆంధ్ర, అంధ, అంధక, ఆంధ్రక అనే పదాలు సంస్కృత గ్రంథాల్లో జాతివాచకంగా కనిపిస్తాయి, ఈ పదాలన్నీ ఒకదానితో ఒకటి సంబంధం కలిగినవి. ఆంధ్ర శబ్దచరిత్ర పరిశీలనలో వీటిని వివరిస్తు న్నాము.

### 5.2.1 జాతివాచిగా ఆంధ్ర శబ్ద ప్రయోగం

ఋగ్వేదంలోని ఐతరేయ బ్రాహ్మణం (క్రీ. పూ. 600) లో విశ్వామిత్ర మహాముని తన ఆజ్ఞోల్లంఘనం చేసిన మొదటి యాభై మంది పుత్రులను అనార్యజాతులైన ఆంధ్ర, పుండ్ర, శబర, పుళింద, మూతిబాదిదస్యులలో కలసిపొండని శపించి బహిష్కరించినట్లు ఒక ఐతిహ్యం ఉంది. దీన్నిబట్టి వేదకాలానికే ఆంధ్రజాతి ఉందని స్పష్టమౌతున్నది. ఆంధ్రులు ఆర్యావర్తానికి సరిహద్దు ప్రాంతాల్లో నివసించే అనార్యులైన ద్రావిడులలో ఒక తెగవారని చెప్పవచ్చు.

వ్యాసభారతం సభాపర్వంలో "పాండ్యోఢ్ర రాజేసహచాంధ్రకేణ" అనే శ్లోకంలో ఆంధ్రుల ప్రశంస కన్పిస్తుంది. విష్ణు భాగవత బ్రహ్మాండ పురాణాదుల్లో కూడ ఆంధ్రుల విషయం ఉన్నది. ఆంధ్రుడైన చాణూరుడనే మల్లుని శ్రీకృష్ణుడు వధించినట్లు భాగవత, హరివంశాల్లో ఉన్నది.

బౌద్ధుల పాళీ వాఙ్మయంలో ఆంధ్రులకు 'అంధకు' అనే వ్యవహారం. "సమంత పాసాదిక" అనే బౌద్ధగ్రంథంలో 'అంధ్రుల'ను మ్లేచ్ఛులుగా పేర్కొన్నారు. ఆంధ్రులు, అంధకులు ఒక్కరే కావచ్చు. బౌద్ధ గ్రంథాల మూలంగా 'అస్స' కులు, 'అళకులు (ముళకులు) ఆంధ్ర రాజులని తెలుస్తుంది.

గ్రీకు రాయబారి మెగస్తనీసు (క్రీ. పూ. 400) ఆంధ్ర జాతిని గూర్చి, వారి బల సంపదలను గూర్చి పేర్కొన్నాడు. అశోకుని కాలపు బట్టిప్రోలు శాసనంలోని 'కుబీరకుడు' ఆంధ్రరాజే. ఆంధ్ర దేశాన్ని పాలించిన శాతవాహనులు (క్రీ. పూ. 230 - క్రీ. శ. 225), ఇక్ష్వాకులు, (క్రీ. శ. 225 - 306), శాలంకాయనులు (క్రీ. శ. 300 - 420), విష్ణుకుండినులు (క్రీ. శ. 420 - 624) మొదలైన వారంతా ఆంధ్రజాతివారే. ఉద్యోతనుడు (క్రీ.శ.892) అనే ప్రాకృత భాషాకవి తన 'కువలయ మాలాకథ' లో "పియమహిళా సంగామే" అనే రచనలో ఆంధ్రుల అందచందాలను, ధైర్యస్థైర్యాలను వర్ణించినాడు.

ఈ విధంగా ఆంధ్ర శబ్దం ఐతరేయ బ్రాహ్మణకాలం నుండీ జాతివాచకంగా గ్రంథస్థమై ఉంది.

"సంస్కృత గ్రంథాల్లో జాతివాచకంగా కనిపించే అంధ్ర, ఆంధ్ర, అంధక, ఆంధ్రక పదాలు ఏకజాతివాచకాలే" (ఆంధ్రం, తెనుగు, తెలుగు - తెలుగు భాషా చరిత్ర, పుట.3) అని ఆచార్య జి.ఎన్. రెడ్డిగారి అభిప్రాయం.

### 5.2.2 భాషావాచిగా ఆంధ్ర శబ్ద ప్రయోగం

నాటకంలో ఉపయోగించదగిన 'విభాషలు' ఏడు విధానాలనీ, అవి "శకార, అభీర, చండాల, శబర, ద్రుమిళ, ఆంధ్ర, వనచరుల" వ్యవహారంలోనివని భరతుని నాట్యశాస్త్రిం సూచించింది. నన్నయ రచించిన నందంపూడి శాసనం (క్రీ. శ. 1053) లో ఆంధ్రశబ్దం భాషావాచిగా మొట్టమొదటిసారిగా కనిపిస్తుంది. నందంపూడి శాసనంలో నారాయణభట్టును "యస్సంస్కృత కర్ణాట ప్రాకృత పైశాచికాంధ్ర భాషాసు కవిరాజశేఖర ఇతి ప్రథితః సుకవిత్వ విభవేన" అని నన్నయ ప్రశంస. దీన్నిబట్టి 'ఆంధ్ర' శబ్దం క్రీ. శ. 11వ శతాబ్దంనాటికే భాషాపరంగా రూఢి అయ్యిందని చెప్పవచ్చు. ఆంధ్ర శబ్ద చింతామణికర్త నన్నయ అని అంగీకరిస్తే ఆంధ్ర శబ్దాన్ని భాషాపరంగా శాసనంలోనే కాకుండా, గ్రంథంలోనూ మొట్టమొదట ప్రయోగించినవాడు నన్నయ్యే అని చెప్పవచ్చు. 'ఆంధ్ర భాషా భూషణ' కర్త ఐన కేతన తన లక్షణ గ్రంథానికి పెట్టిన పేరులోనేకాక, గ్రంథంలోకూడా "తెనుగు, తెలుగు" పదాలతోపాటు 'ఆంధ్ర' శబ్దాన్నీ వాడాడు. తెలుగులో గ్రంథరచన ప్రారంభమైన కాలంనుండీ ఆంధ్ర శబ్దాన్ని భాషాపరంగా కవులూ, లాక్షణికులూ ప్రయోగించారు.

ఈ విధంగా మొదట జాతి వాచకమైన 'ఆంధ్ర' శబ్దం తర్వాత దేశ బోధకంగానూ, ఆ తర్వాత భాషావాచిగానూ వ్యాప్తిలోకి వచ్చిందని నిర్ణయించవచ్చు. ఈనాడు కూడా 'ఆంధ్ర' శబ్దం జాతి, దేశ, భాషలను సూచించడానికి వాడబడుతూ ఉంది.

### 5.2.3 దేశవాచిగా ఆంధ్ర శబ్దప్రయోగం

ఆంధ్ర శబ్దం జాతివాచకంగానే కాక దేశవాచకంగా కూడా ప్రాచీన సంస్కృత గ్రంథాల్లోనూ, శాసనాల్లోనూ కన్పిస్తుంది.

BRAOU

వాల్మీకి రామాయణం కిష్కింధాకాండలో "తథైవాంధ్రాశ్చ పుండ్రాంశ్చ" అనే శ్లోకంలో సుగ్రీవుడు సీతాన్వేషణకై వానరులను దక్షిణ దిశకు పంపుతూ, వారు వెదకవలసిన రాజ్యాలలో ఆంధ్రదేశాన్ని కూడ పేర్కొన్నాడు. సహదేవుడు దక్షిణ జైత్రయాత్రా సమయంలో ఆంధ్రదేశాన్ని కూడా జయించినట్లు వ్యాస భారతాన్నిబట్టి తెలుస్తుంది. బలికుమారులు ఆరుగురిలో ఒకడైన ఆంధ్రుడు తన పేర ఆంధ్ర రాజ్యాన్ని ప్రత్యేకంగా స్థాపించుకొన్నట్లు భాగవత పురాణం ప్రశంసించింది.

బౌద్ధ వాఙ్మయంలోని అంధరట్ట (ఆంధ్ర రాష్ట్రి) అనే పదం ఆంధ్రదేశ సూచకమే. శివస్కంధవర్మ అనే పల్లవ యువరాజు మైదవోలు ప్రాకృత శాసనం (క్రీ. శ. 234) లో మనదేశాన్ని "అంధాపథం" అన్నాడు. దేశపరంగా ఆంధ్ర శబ్దాన్ని వాడిన వారిలో అతడే ప్రథముడు. మల్లి దేవనందవర్మ దానశాసనం (క్రీ.శ. 340) లో, వరాహ మిహిరుని బృహత్సంహిత (క్రీ. శ. 600) లో 'ఆంధ్ర' పదం దేశవాచిగా వాడబడింది. తర్వాత మన దేశాన్ని "ఆంధ్ర మండలం, ఆంధ్ర విషయం, ఆంధ్ర భూతలం, ఆంధ్రదేశం" అని రకరకాలుగా చాలమంది తమ శాసనాల్లో పేర్కొన్నారు. ఇట్లా మొదట జాతి వాచకమైన ఆంధ్రశబ్దం తర్వాత క్రీస్తు శకానికి పూర్వమే దేశవాచకంగా కూడా సంస్కృత గ్రంథాల్లో వ్యాప్తికి వచ్చిందని చెప్పవచ్చు.

**అవగాహన ప్రశ్న – 1**

జాతివాచిగా ఆంధ్ర శబ్ద ప్రయోగాన్ని పదివాక్యాల్లో రాయండి.

## 5.3.0 తెనుఁగు, తెలుఁగు శబ్ద ప్రయోగాలు

తెనుంగు, తెనుఁగు, తెలుంగు, తెలుఁగు అనే రూపాలు నన్నయ భారతకాలం నుంచీ మన సాహిత్యంలో కన్పిస్తాయి. ఈనాడు సున్నా, అరసున్నా లేకుండా "తెనుగు – తెలుగు" అనే మాటలను వాడుతున్నాము. ఈ రెండు పదాల్లో సైతం తెలుగు అనే మాటనే మనం జాతిపరంగా, భాషాపరంగా, దేశపరంగా విరివిగా వాడుతున్నాం. ఈ పదాల చరిత్రను పరిశీలిద్దాం.

### 5.3.1 తెనుఁగు శబ్ద వ్యుత్పత్తి

'తెనుఁగు' శబ్దోత్పత్తిని చాలా విధాలుగా సాధించడానికి పండితులు ప్రయత్నించారు.

'తేనె + అగు' అనే శబ్దాల కూడికవల్ల 'తెనుఁగు' శబ్దం ఏర్పడింది అని ఈ శబ్ద వ్యుత్పత్తిని గ్రియర్సన్ తన భారతీయ భాషల సర్వేలో పేర్కొన్నాడు. దీన్ని ప్రామాణికంగా పరిగణించడానికి వీల్లేదు.

'తెనుగు' తద్భవమనీ, ఇది త్రినగ శబ్ద భవమనీ కొందరి ఊహ (చూ. నారాయణ రావు, చిలుకూరి, ఆంధ్రభాషా చరిత్ర, ప్రథమభాగం, 1936, పుట. 32). ఇది వాస్తవం కాదు.

'తెలుగు' దేశ్యపదమనీ, దిగ్వాచి అనీ గంటి జోగి సోమయాజిగారి అభిప్రాయం (చూ. ఆంధ్ర భాషా వికాసం, 1947, పుట. 29-32) "తెన్" శబ్దం దక్షిణ దిక్కు అనే అర్థం ఉన్న ద్రావిడ పదాంశం. (చూ. Dravidian Etymological Dictionary - p. 2839) సాధారణంగా ఒక సమాజంలో ఒక భాష రూపొందే ప్రాథమిక

దశలో ఆ భాషకు నామకరణం జరుగదు. ఈనాడు కూడా కొన్ని అనాగరిక భాషలకు, ఆ భాషా వ్యవహర్తలలో, ప్రత్యేకమైన పేర్లులేని స్థితి కన్పిస్తుంది. ఒక భాషా సమాజంలోనే ఒక ప్రాంతంవాళ్ళు, మరో ప్రాంతం వాళ్ళని సూచించాల్సి వచ్చినప్పుడు దిక్కుల్నిపట్టి తూర్పు వాళ్ళనీ, పడమటి వాళ్ళనీ, ఉత్తరాది వాళ్ళనీ వ్యవహరించడం సాధారణంగా కనిపిస్తుంది. ప్రాచీన ద్రావిడ భాషా సమాజంలోని వారు దక్షిణ ప్రాంతం వాళ్ళని దక్షిణ దిగ్వాచి ఐన 'తెన్ శబ్దంతో 'తెనుంగు' అని నిర్దేశించి ఉండవచ్చు. తెలుగుభాషలో 'తెన్ శబ్దం ఇప్పటి వ్యవహారం నుంచి వ్యస్తపదంగా తొలగిపోయింది. కాని తెమ్మెర, తెన్నేరు, టెంకాయ, తెంగాయ, తీరూతెన్నూ, దిక్కూ తెన్నూ మొదలైన సమాన రూపాల్లో మాత్రం నిలిచి ఉంది. తెనుగు దిగ్వాచి అని సమర్థిస్తూ ఆచార్య జి.ఎన్. రెడ్డిగారు రాసిన ఈ వాక్యాలు గమనింపదగినవి. 'ద్రావిడ ప్రజలు ప్రాచీన కాలంలో భారతదేశమంతా వ్యాపించి ఉన్నవారే. కాబట్టి ఆనాడు ఉత్తర ద్రావిడ ప్రజలు దక్షిణ దిక్కులోని వారిని 'తెన్ శబ్దంతో నిర్దేశించి ఉండవచ్చు అనడం అసంగతం కాదు. తమిళ దేశానికి ఉత్తరాన ఉన్న తెలుగువారిని "వడుగర్" అని తమిళులు ప్రాచీనకాలం నుండి వ్యవహరిస్తూ ఉండడం పై అభిప్రాయాన్ని బలపరుస్తుంది. ఇటువంటిదే 'కొడగు' పదం కూడా' (తెలుగు భాషా చరిత్ర, పుట. 7).

మారేపల్లి రామచంద్ర శాస్త్రిగారు "తెలుగు తోబుట్టువులు" అనే గ్రంథంలో "తెన్ + ఉన్ + ంగ్ + ఉ" కలిసి తెనుగు ఏర్పడిందని చెప్పుతూ ఇట్లా రాసినారు. "ఈ వ్యుత్పత్తినిబట్టి అర్థమేమందురా? తెన్నున (దారిలో) ఉండువారు, వారి భాష. 'తెన్నున ఉండువారి దేశము తెనుగునాడయ్యె' ఈ తెనుగునాడే ఆర్యుల దక్షిణా పథము. తెనుగు నాటికి 'తెనాలము' అను పేర్లు ఉండినట్లు 'తెనాలి' తెలుపుచున్నది".

'తెనుగు' అనే మాటకు ఆరుద్రగారు ఇంకొక వ్యుత్పత్తిని చెప్పారు. "కోదులు, గోండులు తమను 'కు' అని పిలుచుకొంటారు. ఈ ఆదిమ భాషల నుండి విడిపోయిన వాళ్ళు దక్షిణాదికిపోయి ఉంటారు. వాళ్ళకు, వాళ్ళ భాషకు "తెన్-కు" అనే ప్రత్యేకమైన పేరు ఏర్పడి ఉంటుంది. అదే "తెన్ + ఉన్ + కు" గా తెన్ దిశన ఉండే 'కు' భాష అనే అర్థంలో 'తెనుగు' అయిపోయింది (సమగ్రాంధ్ర సాహిత్యం 1. పుట-29).

BRAOU

### 5.3.2 తెలుగు శబ్ద వ్యుత్పత్తి

భాషాపరంగా 'తెలుగు' శబ్దం సంస్కృత గ్రంథాల్లో కనిపించదు. వాయు పురాణంలో 'తిలింగా' అనే పదం ఒక జనపదదానికి పేరుగా ఉన్నది. శ్రీశైలం, ద్రాక్షారామం, కాళేశ్వరం - వీటిలోని శివలింగాలను బట్టి తెలుగు దేశానికి త్రిలింగదేశమనే పేరు ఏర్పడిందని విద్యానాథుని (క్రీ.శ. 13వ శతాబ్దం) 'ప్రతాపరుద్రీయం' నాటకం (శ్లో. 44) లో ఉంది. ఆంధ్రదేశానికి త్రిలింగ దేశమనే పేరు కావ్యాల్లో ప్రయుక్తమై ఉన్నట్లు, తెలుగు త్రిలింగ శబ్దమైనట్లు విన్నకోట పెద్దన (క్రీ.శ. 14వ శతాబ్ది) కావ్యాలంకార చూడామణి (పుట. 192)లో తెలిపినాడు. రాజశేఖరుని విద్ధసాలభంజిక (క్రీ.శ. 10వ శతాబ్ది)లో "జయతు జయతు త్రిలింగాధిపో దేవః" అని ఒక ప్రయోగం ఉంది.

తెలుంగు శబ్దం త్రికళింగ శబ్ద భవమని కొందరు విద్వాంసులు నిర్వచిస్తున్నారు. ఆంధ్రదేశ తీర ప్రాంతానికి కళింగదేశం అనే వ్యవహారం పూర్వం నుండి ఉంది. కళింగమనే పేరు విశాల భూభాగానికి చెల్లుతున్నది. గంగానది దక్షిణతీరం నుండి గోదావరి ఉత్తరతీరం వరకు ఉన్న దేశం కళింగమని సామాన్య సంజ్ఞ. ఇది మూడు విభాగాలుగా ఉండేది. ఉత్తర కళింగం, మధ్య కళింగం, త్రికళింగం అని వీటి పేర్లు. ఉత్తర కళింగం ఉత్కళమని పిలువడే ఓఢ్ర దేశం. మధ్య కళింగం, త్రికళింగం - ఈ రెండూ ఆంధ్రదేశానికి చెందినవి. ఇవి గోదావరికి ఉత్తరాన ఉన్న భాగాలు. త్రికళింగ శబ్దంలోని 'క' కారం జనుల ఉచ్చారణ వేగంవల్లనో లేదా విదేశీయుల పలుకుబడిలోనో జారిపోయి 'త్రిలింగ' పదంగా నిలిచిందని, అదే కాలక్రమాన 'తెలుగు'గా మారిందని కొందరు ఊహించారు. దీనికి తార్కాణంగా టాలమీ (క్రీ.శ. 150) అనే గ్రీకు దేశపు భూగోళ శాస్త్రజ్ఞుడు మనదేశాన్ని వర్ణిస్తూ దీన్ని 'ట్రిలింగాన్' అని పేర్కొని ఉండడం గమనించదగినది.

కాని 'తెలుగు' త్రిలింగ శబ్ద భవం కాదని, 'తెలుగు'కు సంస్కృతీకృత రూపమే 'త్రిలింగ'మని కొమర్రాజు లక్ష్మణరావు నిరూపించారు (లక్ష్మణరాయ వ్యాసావళి, పుట, 122-126 'తెలుగు' త్రికళింగ శబ్దభవమని,

ధ్వనిపరిణామం వల్ల అది "త్రికళింగ > త్రి ఆలింగ > తెలింగ > తెలుంగు"గా మారిందని కొందరి ఊహ (సోమయాజి, గంటి జోగి. ఆంధ్రా భాషా వికాసము, పుట 24-25). ఈ అభిప్రాయానికి సహేతుకమైన ఆధారాలు లేవు.

మారేపల్లి రామచంద్ర శాస్త్రిగారు "తెలుగు తోబుట్టువులు" అనే గ్రంథంలో తెలుగు శబ్దోత్పత్తిని ఇట్లా చేశారు. "తెల + ఉన్ + ంగ్" కలిపి "తెలుంగ్" అయి ఇప్పటి పలుకుబడిని బట్టి 'ఉ' చేరగా, 'తెలుంగు' అను నుడి ఏర్పడియుండునని తోచె. దానికి తెల్లగా నుండువారు, అట్టివారి భాష, తేటగా ఉండు భాష అని అర్థములు వచ్చును. తేట తెలుగను వాడుక అందరకును తెలిసినదే కదా. ఈ వ్యుత్పత్తి భాషా గుణాన్ని తెలియజేస్తుంది కాబట్టి ఇది అర్వాచీనమని రామచంద్రశాస్త్రిగారే తృప్తిపడలేదు.

ఇటీవలి పరిశోధనలవల్ల తెలుగు శబ్దం ప్రాచీనార్థాన్ని మరింత స్పష్టంగా తెలుసుకోవడానికి వీలవుతున్న దని ఆచార్య ఖండవల్లి లక్ష్మీరంజనంగారు "ఆంధ్ర సాహిత్య చరిత్ర సంగ్రహం" (పుట-5) లో ఇట్లా వివరించారు.

"ప్రాచీన కాలమున ఈ దేశమునందు "తలైంగ్" అను జాతివారు నివసించినట్లు ఊహించబడుచున్నది. వీరు కొంత నాగరికతను సాధించినవారై సాహసికులుగ కన్పట్టుచున్నారు. వీరు సముద్రముదాటి బర్మాదేశపు పశ్చిమ భాగము నాక్రమించి, అక్కడ పరిపాలనచేసి స్థిరనివాసమేర్పరచుకొన్నట్లు తెలియవచ్చుచున్నది. బర్మా దేశమునందు తలైంగుల చరిత్ర 12, 13 శతాబ్దముల వరకును వినవచ్చుచున్నది. తలైంగ్ జాతివారి నివాస భూమి తెలుంగు, తెలుగు దేశముగా వ్యవహరింపబడి యుండును.

### 5.3.3 తెనుగు, తెలుగు శబ్దాల సంబంధం

తెలుగు ధ్వని పరిణామంలో హ్రస్వంమీది పూర్ణబిందువుకు లోపం విభాషగా కావ్యభాషలో కన్పించడం వల్ల తెనుంగు, తెనుగు రూపాలు రెండూ రూపాంతరాలే. అట్లే తెలుంగు, తెలుగు కూడా రూపాంతరాలు.

నన్నయ తన భారతంలో "తెనుంగునన్ మహాభారత సంహితా రచన బంధురుడయ్యె" అని, "తెనుగున రచియింపు మధిక ధీయుక్తి మెయిన్" అని, "తెనుంగు, తెనుగు" రెండు రూపాలనూ భాషాపరంగా వాడినాడు. నన్నెచోడుని 'కుమార సంభవం' లో కూడా 'తెనుంగు' ప్రయోగం కనిపిస్తుంది. నన్నయ, నన్నెచోడులు తెలుంగు, తెలుగు రూపాలను ప్రయోగించలేదు. [illegible]కి సోమనాథుడు, తిక్కన, కేతన మొదలైనవారు తెనుగు, తెలుగు పదాలను భాషాపరంగా ప్రయోగించారు. ప్రథమాంధ్ర కావ్యమైన నన్నయ భారతంలో 'తెనుగు' శబ్దం ప్రయోగించడంవల్ల అది 'తెలుగు' శబ్దం కంటె ప్రాచీనమని కొందరనుకోవచ్చు. కాని క్రీ.శ. 5వ శతాబ్ది నాటిదైన 'అగత్తియం' అనే తమిళ లక్షణ గ్రంథంలో 'తెలుంగం' అని ప్రయోగం ఉంది. తమిళ కర్ణాటక శాసనాల్లో 'తెలుంగ' అనే పదమే మొదట కన్పిస్తుంది. అందువల్ల మన భాషకు మొదట ఆంధ్రం, తర్వాత తెలుగు, ఆటు తర్వాత తెనుగు అనే పదాలు వ్యాప్తిలోకి వచ్చినట్లు చెప్పవచ్చు.

తెనుగు, తెలుగు రూపాలు భిన్న పదాలు కావని, ధ్వనుల మార్పులవల్ల ఏర్పడిన రూపాంతరాలేనని, అవి ప్రాచీనకాలం నుండి తెలుగుదేశంలో వ్యవహారంలో ఉండేవని ఆచార్య జి.ఎన్. రెడ్డిగారు ఇట్లా నిర్ణయించారు. "తెనుగు, తెలుగు రూపాంతరాలేకాని, భిన్న ధాతుజాలుకావు. ద్రావిడ భాషల్లో న/ల వినిమయం; ణ, ళ < న, ల-లు గాను మారిన సందర్భాలున్నాయి. (DED 4524). ఈ మార్పు మూల ద్రావిడంలోనే జరిగినట్లు భద్రిరాజు కృష్ణమూర్తి నిరూపించి ఉన్నారు. (TVB. p. 41). ఈనాడు కూడా కొన్ని ప్రాంతాల గ్రామీణుల వ్యవహారంలో తెలుగులో 'న-ల'ల వినియమం కన్పిస్తుంది. మునగ-ములగ, చెనగు-చెలగు, మునుకోల-ములుకోల, జన్మం-జల్మం, లేదు-నేదు, లాగు-నాగు మొదలైనవి. కాబట్టి తెలుగు త్రిలింగ శబ్దభవం కాదనీ, దేశ్యమైన తెనుగు రూపాంతరమే తెలుగు అనీ, ఈ రెండు రూపాలూ ప్రాచీనకాలం నుండీ తెలుగు దేశంలో వ్యవహారంలో ఉన్నాయనీ నిర్ణయించవచ్చు. (తెలుగు భాషా చరిత్ర, పుట. 8).

నన్నయ కాలం నుండి తెనుగు, ఆంధ్రం అనే పదాలు ఒకదానికొకటి పర్యాయ పదాలయినాయి.



BRAOU

### అవగాహన ప్రశ్న - 2

త్రిలింగ శబ్దం ఏ రకంగా ఏర్పడిందో పది వాక్యాలకు మించకుండా వివరించండి.

## 5.4 సారాంశం

ఈ భాగం ద్వారా మీరు ఈ కింది విషయాలు గ్రహించారు.

- ఆంధ్రులు ఆర్య అనార్య మిశ్రజాతి. వీరు ఉత్తరార్యావర్తం నుండి దక్షిణపథానికి వచ్చి గోదావరీ ప్రాంతంలో రాజ్యాన్ని స్థాపించుకొని అక్కడి ప్రజలతో కలిసిపోయినారు.
- 'ఆంద్ర' శబ్దం ప్రాచీన రూపం. 'ఆంధ్ర' అనేది అర్వాచీన రూపం. ఆంధ్ర శబ్దం మొదట జాతివాచకంగా, తర్వాత దేశవాచకంగా, ఆ తర్వాత భాషాపరంగా రూఢీ కెక్కింది. ఆంధ్ర, తెనుగు, తెలుగు - ఈ మూడూ పర్యాయపదాలు.
- తెనుంగు, తెనుగు, తెలుంగు, తెలుగు, త్రిలింగ అనే పదాలు తెలుగు కావ్యాల్లో భాషాపరంగా ప్రయోగంలో ఉన్నాయి. తెలుగు శబ్దం తెనుగు శబ్దానికి రూపాంతరమే కాని త్రిలింగ శబ్దభవంకాదు.

BRAOU

### అవగాహన ప్రశ్నలకు జవాబులు

1. ఆంధ్ర శబ్దానికి వేద ప్రతిపత్తి ఉన్నది. ఋగ్వేదంలోని ఐతరేయ బ్రాహ్మణం (క్రీ.పూ. 600) లో విశ్వామిత్ర మహాముని తన ఆజ్ఞోల్లంఘనం చేసిన ఏబదిమంది పుత్రులను అనార్యజాతులైన ఆంధ్ర, పుండ్ర, శబర, పుళిందాదులలో కలిసిపొమ్మని శపించినట్టుగా ఉన్న సందర్భంలో మొట్టమొదటిసారిగా ఆంధ్ర శబ్దం జాతి వాచకంగా కనిపిస్తున్నది. వ్యాస భారతంలో సభా పర్వంలో "పాండ్యోఢ్ర రాజేసహచాంధ్రకేణ" అంటూ ఆంధ్ర ప్రశంస కనిపిస్తుంది. విష్ణు, భాగవత, బ్రహ్మండ పురాణాల్లోనూ జాతి వాచికంగా ఆంధ్ర శబ్దప్రయోగం ఉంది. బౌద్ధుల పాళీ వాఙ్మయంలో ఆంధ్రజాతికి పర్యాయంగా 'అంధకులు' అనే ప్రయోగం ఉన్నది. ఈ విధంగా ఐతరేయ బ్రాహ్మణకాలంనుండీ ఆంధ్ర శబ్దం జాతివాచిగా కనిపిస్తుంది.
2. శ్రీశైలం, దక్షారామం, కాళేశ్వరం క్షేత్రాల్లోని మూడు శివలింగాలను బట్టి ఆంధ్రదేశానికి, భాషకూ త్రిలింగశబ్దం ఏర్పడిందని విద్యానాథుడు (క్రీ.శ. 13వ శతాబ్దం) తన 'ప్రతాపరుద్రీయ నాటకం 44వ శ్లోకంలో పేర్కొన్నాడు. తెనుగు శబ్దం త్రిలింగ శబ్దభవమైనట్టు విన్నకోట పెద్దన (క్రీ.శ. 14వ శతాబ్ది) తన కావ్యాలంకార చూడామణి (పుట. 192) లో తెలిపాడు. రాజశేఖరుని విద్ధ సాలభంజిక (క్రీ.శ. 10వ శతాబ్ది) లో "జయతు జయతు త్రిలింగాధిపో దేవః" అని ఒక ప్రయోగం ఉన్నది. త్రికళింగ శబ్దం త్రిలింగ శబ్దంగా మారిందని కొందరి ఊహ. దీనికి పురస్కారకంగా టాలమీ అనే గ్రీక్ భూగోళ శాస్త్రజ్ఞుడు (క్రీ.శ. 150) ట్రిలింగా అని పేర్కొనడం కన్పిస్తుంది. ఇన్ని విధాలుగా త్రిలింగ శబ్దం ఏర్పడిందని అనడానికి దానికి ఆయా ఆధారాలు కనిపిస్తున్నాయి.

## చదవదగిన పుస్తకాలు

| | | |
|---|---|---|
| 1. | ఆరుద్ర | సమగ్రాంధ్ర సాహిత్యం, మొదటి సంపుటం. |
| 2. | నారాయణరావు, చిలుకూరి | ఆంధ్ర భాషా చరిత్ర, ప్రథమ భాగం, 1936. |
| 3. | పెద్దన, విన్నకోట | కావ్యాలంకార చూడామణి, వేదం వేంకట రాయశాస్త్రి & బ్రదర్స్ మద్రాసు, 1968. |
| 4. | రెడ్డి, జి.యస్. | ఆంధ్రం, తెనుగు, తెలుగు – తెలుగు భాషా చరిత్ర, సంపాదకుడు భద్రిరాజు కృష్ణమూర్తి, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి ప్రచురణ. |
| 5. | కొమర్రాజు లక్ష్మణరావు | లక్షణరాయవ్యాసావళి |
| 6. | సోమయాజి, గంటిజోగి | ఆంధ్రభాషా వికాసం, 1947. |

## మాదిరి పరీక్షాప్రశ్నలు

I. కింది వాటికి 30 పంక్తుల్లో సమాధానం రాయండి.

1. ఆంధ్రం, తెనుగు, తెలుగు శబ్దాలను దృష్టాంతాలతో వివరించండి.
2. ఆంధ్ర శబ్దం పొందిన పరిణామాలను సవివరంగా తెల్పండి.
3. తెనుగు, తెలుగు శబ్దాల సంబంధాన్ని గురించి రాయండి.

II. కింది వాటికి 10 పంక్తులకు మించకుండా సమాధానాలు రాయండి.

1. త్రినగ శబ్ద స్వరూపాన్ని చర్చించండి.
2. తెనుగు శబ్దం ఎలా ఏర్పడిందో తెల్పండి.
3. తెలుగు శబ్దాన్ని పరామర్శించండి.

BRAOU

# భాగం – 6 ఆంధ్రదేశ భౌగోళిక స్వరూపం

## విషయక్రమం


6.0 లక్ష్యాలు

6.1 పరిచయం

6.2 చరిత్రపై భౌగోళిక శక్తుల ప్రభావం

6.3. ఆంధ్రదేశ చరిత్ర భౌగోళిక శక్తులు

**అవగాహనప్రశ్న – 1**

6.4.0 వివిధ చారిత్రక దశల్లో ఆంధ్రదేశ భౌగోళిక స్వరూపం

- 6.4.1 మౌర్యులకాలం
- 6.4.2 శాతవాహనుల కాలం
- 6.4.3 ఇక్ష్వాకుల కాలం
- 6.4.4 విష్ణుకుండినులకాలం
- 6.4.5 చాళుక్యులకాలం
- 6.4.6 మాండలిక యుగం
- 6.4.7 కాకతీయుల యుగం
- 6.4.8 రెడ్డిరాజుల యుగం
- 6.4.9 విజయనగర రాజ్యారంభ దశ
- 6.4.10 విజయనగర యుగం
- 6.4.11 గోలకొండ సుల్తానుల కాలం
- 6.4.12 మొగలాయీ – నిజాం పాలనాకాలం
- 6.4.13 ఈస్టిండియా కాలం
- 6.4.14 స్వాతంత్ర్యానంతరకాలం, ఆంధ్రప్రదేశ్ అవతరణ

**అవగాహనప్రశ్న – 2**

6.5 సారాంశం

- అవగాహన ప్రశ్నలకు జవాబులు
- చదవదగిన పుస్తకాలు
- మాదిరి పరీక్షా ప్రశ్నలు


BRAOU

## 6.0 లక్ష్యాలు

ఆంధ్రదేశ భౌగోళిక స్వరూపాన్ని, ఆంధ్రుల చరిత్ర ఆరంభదశనుండి నేటి ఆంధ్రప్రదేశ్ ఏర్పడే వరకూ ఏఏ దశల్లో ఎలా ఉండిందో ఎలా మారుతూ వచ్చిందో ఈ భాగం చదివాక మీరు విశ్లేషించగలుగుతారు.

## 6.1 పరిచయం

ఆంధ్రదేశం మొదట్లో – చరిత్ర ప్రారంభంలో – భౌగోళికంగా ఏ విధంగా ఉండిందో, దాని ఎల్లలనూ, అందులోని ప్రాంతాలనూ వివరించడంతో భాగం ప్రారంభమవుతుంది. తర్వాత ఆంధ్రదేశం ప్రాచీన కాలంనుండి నేటివరకూ అనేక చారిత్రక దశల్లో, ఎన్నో రాజవంశాల పరిపాలన కింద మారుతూవచ్చింది. ఆయా చారిత్రక

దశల్లో, ఒక్కొక్క దశలో, ఆంధ్రదేశ భౌగోళిక స్వరూపం ఎలా మారుతూ వచ్చిందో - 1956లో ఆంధ్రప్రదేశ్ అవతరణ వరకూ ఈ భాగం స్థూలంగా వివరిస్తుంది.

## 6.2 చరిత్రపై భౌగోళిక శక్తుల ప్రభావం

చరిత్రపై భౌగోళిక శక్తులు గొప్ప ప్రభావాన్ని కలిగిస్తాయి. ఒక దేశంలో ఉండే పర్వతాలు, నదులు, పీఠ భూములు, ఎడారులు, శీతోష్ణస్థితి, వర్షపాతం, ఖనిజసంపద, చెట్లు, చేమలు–ఇవన్నీ కలిసి ఆ దేశంలో నివసిస్తున్న ప్రజలపై తమ ప్రభావాన్ని ప్రసరిస్తాయి. భౌగోళిక శక్తుల ప్రభావ ఫలితంగానే ఒక దేశ ప్రజల ఆర్థిక స్థితిగతులు నిర్ధారింపబడతాయి. వీటినిబట్టే మానవ జీవితం సుఖమయంగానో లేక కష్ట భూయిష్టంగానో తయారవుతుంది. అందువల్లనే ఆ దేశ చరిత్రకూడ వీటికనుగుణంగానే పరిణమిస్తుంది. ఉదాహరణకు భారతదేశ చరిత్ర గమనంపై హిమాలయ పర్వతాలు ఎంతో ప్రభావాన్ని కలిగి ఉన్నాయి. జీవనదులైన గంగానది, సింధు, బ్రహ్మపుత్ర నదులకు ఈ పర్వతాలు పుట్టినిల్లయి మొత్తం ఉత్తర భారతదేశాన్ని సారవంతమైన ఒండ్రుమట్టితో నింపి, సతతం ప్రవహించే తమ నీటితో తడుపుతూ సస్యశ్యామలం చేశాయి. ఇంకా చెప్పాలంటే, ఈ పర్వతాలు, పెట్టని గోడగా నిలిచి దేశానికి సహజ రక్షణను, భద్రతను కల్గించాయి. అందుకనే ఒక దేశచరిత్రను ప్రజలే నిర్మిస్తారు కనుక, ఆ ప్రజల జీవితంపై భౌగోళిక శక్తుల ప్రభావం ఎంతగానో ఉంటుంది కనుక చరిత్ర గమనాన్ని భౌగోళిక శక్తులు ఎంతగానో నిర్దేశిస్తున్నాయని చెప్పవచ్చు.

## 6.3 ఆంధ్రదేశ చరిత్ర – భౌగోళిక శక్తులు

పై నేపథ్యంలో చూసినపుడు ఆంధ్రదేశ చరిత్రపై కూడ భౌగోళిక శక్తుల ప్రభావం బలీయంగా ఉంది. నేటి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం 12°4' - 19° 52' ఉత్తర అక్షాంశాలకు, 76°50' - 84°50' తూర్పు రేఖాంశాలకు మధ్య విస్తరించి ఉంది. తూర్పున బంగాళాఖాతం, దక్షిణదిక్కున తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలు, పశ్చిమాన కర్ణాటక, మహారాష్ట్ర రాష్ట్రాలు, ఉత్తరాన మహారాష్ట్ర, ఒరిస్సా రాష్ట్రాలు, ఆంధ్రప్రదేశ్‌కు ఎల్లలు. వీటిమధ్య ఆంధ్రప్రదేశ్ విస్తీర్ణత దాదాపు 295 వేల చదరపు కిలోమీటర్లు.

BRAOU

భారతదేశంలో దక్కన్ పీఠభూమి తూర్పుతీరాన్ని ఆనుకొని ఆంధ్రప్రదేశ్ ఉంది. ప్రాచీన వాఙ్మయంలో 'దక్షిణాపథ' అనే పదాన్ని వింధ్యపర్వతాలకు, కన్యాకుమారికి మధ్య ప్రాంతం అనే అర్థంలో వాడారు. ఇది సరియైనదిగానే తోస్తుంది. ప్రాచీన వాఙ్మయంలోని అంధాపథమే ఇంచుమించుగా నేటి ఆంధ్రప్రదేశ్ అని చెప్పుకోవచ్చు.

ఆంధ్రదేశపు ఉనికి గురించి తెలుసుకొన్నాక దాని ప్రభావం చరిత్రపై ఎలా ప్రసరించిందో క్లుప్తంగా తెలుసుకొందాం. ఆంధ్రదేశం, ఉత్తర, దక్షిణభారత భూభాగాలను కలిపే కూడలిలో ఉంది. ఆంధ్రుల సంస్కృతి వికాసానికి ఇది ఎంతో దోహదం చేసింది. ఆర్యుల సంస్కృతి, సహజమైన ద్రావిడ సంస్కృతి మిళితమై ఆంధ్రుల జాతీయ సంస్కృతి విశిష్టంగా రూపొందింది. అంతేకాక, భారతజాతి సంస్కృతీ క్రమవికాసానికి కూడా ఇది ఎంతో దోహదం చేసింది. ఉత్తర, దక్షిణ భారతీయ సంస్కృతులకు వారధిగా నిలిచి, రెంటిలోనూ ఉన్న ఉత్తమ లక్షణాలను స్వీకరించింది. అయినా, ఆర్య సంస్కృతి ప్రభావమే ఆంధ్రుల సంస్కృతిపై ఎక్కువగా ప్రసరించిదని చరిత్రకారుల అభిప్రాయం. తెలుగుభాషలో సంస్కృత పదజాలం ఎక్కువగా ఉండటం, ఆంధ్ర వాఙ్మయం సంస్కృత వాఙ్మయ రీతులను ఎక్కువగా గ్రహించడం దీనికి ఉదాహరణలుగా చెప్పుకోవచ్చు. దీనికితోడు ఆంధ్ర దేశానికి ఎక్కువ తీరప్రాంతం ఉండటం విదేశీవాణిజ్యానికి దోహదం చేసింది. విదేశీ వాణిజ్యంతోపాటు వచ్చిన విదేశీ సంస్కృతి ప్రభావంతో ఆంధ్రుల ఆలోచనారీతిలో ఉదారబుద్ధీ, సమన్వయ దృష్టీ కలిగాయి. ఈ దృక్పథమే ఆంధ్రుల మత, సాంఘిక, భాషోద్యమాల్లోనూ, శిల్పకళారీతుల్లోనూ కన్పిస్తుంది.

ఆంధ్రదేశంలో కోస్తా ప్రాంతాన్ని మినహాయిస్తే మిగతా ఎక్కువ భూభాగం, కొండప్రాంతం. అందువల్ల కొద్దిసార్లు మాత్రమే దేశం ఐక్యమై, ఒక రాజ్యపరిపాలనలోకి రావడం తటస్థించింది. ఉదాహరణకు శాతవాహనుల, కాకతీయుల కాలంలోనే ఇది జరిగింది. మిగతా కాలాలలో ఇది చిన్న చిన్న రాజ్యాలుగా చీలిపోయి, స్థానిక రాజుల, రాజవంశాల పరిపాలనలో ఉండేది. అందుకనే కొన్నిసార్లు, తమిళులు, కర్ణాటకులు ఆంధ్రదేశంలోని కొన్ని ప్రాంతాలను జయించి, ఆక్రమించుకోగలిగారు. ఆ తర్వాత విజయనగర రాజుల కాలంలో తెలుగువారు

తంజావూరు, మధురలలో నాయక రాజ్యాలను స్థాపించి ఆంధ్ర సంస్కృతిని తమిళ ప్రాంతంలో వ్యాపింపజేశారు. దీని ఫలితంగానే ఇప్పటికీ దాదాపు యాభై లక్షల తెలుగువారు తమిళనాడులో నివసిస్తున్నారు.

తీర ప్రాంతంలోని మైదాన భాగం (కోస్తా) సారవంతమైంది. మంచి పంటలు పండేందుకు అనువైన ప్రాంతం. దానికి ఓడరేవు పట్టణాలుండడంతో విదేశాలతో వాణిజ్యం సాగించి ధనవంతమైంది. ఈ కారణంగానే ఆంధ్రదేశ చరిత్రలో తీరప్రాంతమే రాజకీయ, సాంస్కృతిక విషయాల్లో కేంద్రంగా ఎక్కువ కాలం కొనసాగింది. దక్షిణాపథం (దక్కన్) లోని పశ్చిమ దిక్కున వెలసిన రాజవంశాలు ఈ తీరప్రాంతాన్ని ఆక్రమించడానికి అనేక ప్రయత్నాలు చేశాయి. దీనికి కారణం ఇది సారవంతమైన, ఐశ్వర్యవంతమైన ప్రాంతం కావడమే. దీన్ని ఆక్రమిస్తే మొత్తం దక్కన్ ప్రాంతాన్నే ఆ రాజవంశాలు దక్కించుకోగలుగుతాయి. దానిపై పెత్తనం చేయగలుగుతాయి. ఈ సందర్భంలో గుర్తుంచుకోవలసిన విషయం కృష్ణా తుంగభద్రా నదుల అంతర్వేది (Deab) పై పెత్తనం కోసం ప్రతి రాజ వంశమూ ప్రయత్నించింది. పల్లవులు - చాళుక్యులు, రాష్ట్రకూటులు - చోళులు, కళ్యాణి చాళుక్యులు, విజయనగర బహమనీ రాజ్యాల మధ్య జరిగిన యుద్ధాలు దీని ఫలితమే. ఈ సంఘర్షణల ఫలితంగా ఆంధ్రేతరులు అనేకులు - కన్నడిగులు, తమిళులు, మహారాష్ట్రీలు ఆంధ్రదేశానికి వచ్చి ఇక్కడే స్థిరపడ్డారు. వారిరాక ప్రభావం కూడా ఆంధ్రుల సంస్కృతిపై ప్రసరించింది. భారతీయ సంస్కృతిలోలాగానే ఆంధ్ర సంస్కృతిలో కూడా ఎంతో వైవిధ్యం ఉండడానికి ఇదే కారణం.

ఆంధ్రదేశం ఉత్తర దక్షిణాపథాల కూడలిలో ఉన్నందువల్లనే ఉత్తరాపథం నుండి వచ్చే సైనిక దండయాత్రలను ఎదుర్కొనే బాధ్యతను ఆంధ్రదేశపు రాజవంశాలు చేపట్టాల్సిన పరిస్థితి ఏర్పడింది. శకయవనుల దాడిని అరికట్టడంలో శాతవాహనులు ప్రముఖపాత్ర వహించారు. మధ్యయుగాలలో కాకతీయులు ముస్లిముల దాడి నెదుర్కోడంలో ధైర్యసాహసాలు ప్రదర్శించారు.

ఆంధ్రదేశంలో సగటు వర్షపాతం తక్కువకాని, ఈ లోపాన్ని గోదావరి, కృష్ణ, తుంగభద్ర, మొదలైన ముఖ్య నదులు పూరిస్తున్నాయి. ఈ నదీజలాలచే పుష్కలంగా పంటలు పండించడానికి అవకాశం లభిస్తున్నాయి. ఈ నదుల వల్లనే మధ్య యుగాల్లో దేశం లోపలి అనేక ప్రాంతాలు సహజ సరిహద్దులున్న మండలాలుగా విభజించబడ్డాయి. కళింగ, వేంగి, వెలనాడు, పాకనాడు, రేనాడు మొదలగు 'నాడు' లేర్పడి, ప్రతిచోటా స్వతంత్ర రాజ్యం వెలసి, రాజకీయైక్యానికి ముప్పు సంభవించింది. ఇది రాజకీయాలకే పరిమితం కాలేదు. ప్రతి కులంలోనూ, నాడి భేదాలు ఏర్పడి సమాజంలో అనైక్యతకు దారితీశాయి. తెలంగాణ, రాయలసీమ, కళింగ ప్రాంతాలు ఎంతోకాలం ఆంధ్రేతర రాజవంశాల పరిపాలనలో ఉండిపోయాయి. ఈ విధంగా రాజకీయ అనైక్యతకు ఒక విధంగా నదులు తోడ్పడ్డాయి. అయితే ఇది రాజకీయ అనైక్యతతో ఆగిపోలేదు. భౌతికపరమైన భిన్నత్వంవలన, ఈ ప్రాంతాల మధ్య ఆర్థిక వ్యత్యాసాలు కూడ చారిత్రక క్రమంలో ఏర్పడ్డాయి. సర్కారులు, రాయలసీమ, తెలంగాణాల మధ్య ప్రాంతీయ భావం, ఈ రాజకీయ అనైక్యత, ఆర్థిక వెనుకబాటుతనం వల్లనే పుట్టి ఆ తర్వాత కాలంలో ఆంధ్రదేశపు రాజకీయాలపై తమ ప్రభావాన్ని చూపాయి. అయితే ఆంధ్రదేశంలోని పర్వతాలపై వెలసిన అనేక దివ్య క్షేత్రాలు ముఖ్యంగా తిరుపతి, సింహాచలం, యాదగిరి, శ్రీశైలం ఆంధ్రులలో - హిందూమతానికి చెందిన ప్రజలలో కొంతవరకు భావసమైక్యతకు దోహదం చేశాయి.

**అవగాహన ప్రశ్న –1**

చరిత్రపై భౌగోళిక శక్తుల ప్రభావాన్ని పదివాక్యాల్లో తెల్పండి.

BRAOU

## 6.4.0 వివిధ చారిత్రక దశల్లో, ఆంధ్రదేశ భౌగోళిక స్వరూపం

ఇంతవరకూ మనం చెప్పుకొన్న నేపథ్యంలో, ఆంధ్రదేశం వివిధ చారిత్రక యుగాల్లో, ఎలాంటి భౌగోళిక స్వరూపంతో ఉన్నదో ఇప్పుడు తెలుసుకొందాం. వివిధ చారిత్రక దశలను ఆయా కాలాల్లో ఆంధ్ర దేశాన్ని పరిపాలించిన రాజవంశాల పరంగా, వారి పరిపాలనా కాలాన్ని ప్రమాణంగా తీసుకొని చరిత్రకారులు నిర్ణయించారు. ఉదాహరణకు శాతవాహనులు పరిపాలించిన కాలాన్ని శాతవాహన యుగమనీ, కాకతీయ రాజులు పరిపాలించిన కాలాన్ని కాకతీయయుగమనీ ఆ విధంగానే విజయనగర యుగమనీ, ప్రసిద్ధ చరిత్రకారులైన మల్లంపల్లి సోమశేఖర శర్మగారి లాంటివారు, వివిధ చారిత్రక దశలను విభజించారు. ఇది సరియైన పద్ధతి. ఎందుకంటే ఆంధ్రదేశ భౌగోళిక స్వరూపం, వివిధ రాజ వంశాలు స్థాపించిన రాజ్యాల కాలంలో వారి, వారి శక్తియుక్తులను బట్టి యుద్ధ జయాపజయాలనుబట్టి, ఆ కాలపు పరిస్థితులనుబట్టి మారుతూ వచ్చింది. అందుకని ఈ పద్ధతి ద్వారా భౌగోళిక స్వరూపాన్ని నిర్ణయించడం వీలవుతుంది. వివిధ దశల్లో భౌగోళిక స్వరూపాల వివరణకు ముందుగా, ఆంధ్ర దేశ విభాగాల గూర్చి రెండు మాటలు చెప్పుకుందాం. ఈ విభాగాల పరంగానే, ఆ తర్వాత మనం భౌగోళిక స్వరూపాన్ని వివరించబోతున్నాం కాబట్టి, విభాగ వివరణ దానికి ఉపకరిస్తుంది. దక్కన్ పీఠభూమిలోని తూర్పు భాగమంతా దాదాపు ఆంధ్రదేశంగా చెప్పుకోవచ్చు. తెలంగాణా తప్ప, మిగిలిన ఆంధ్రదేశమంతా పూర్వ అవిభక్త మద్రాసు రాష్ట్రంలో ఉండేది. నైసర్గికంగా, ఆంధ్రదేశాన్ని మూడు విభాగాలుగా విభజించవచ్చు. (1) తెలంగాణా (2) తెలంగాణాకు తూర్పున సముద్రపు ఒడ్డున ఉన్న తెలుగు జిల్లాల ప్రాంతం. దీనినే మధ్యాంధ్ర దేశం అని, పూర్వాంధ్ర దేశం అని పిలిచేవారు. (3) తెలంగాణాకు దక్షిణాన ఉన్న తెలుగు జిల్లాల భూభాగం. దీన్ని పశ్చిమాంధ్ర దేశం అంటారు. ఇప్పుడు ఈ ప్రాంతాన్ని రాయలసీమ అంటున్నారు. తూర్పు కనుమలు అనే కొండలు, తెలంగాణాకు పూర్వాంధ్రదేశానికి మధ్యలో ఉండి ఈ రెండు భాగాలను విడదీస్తున్నాయి. కృష్ణానది, దాని ఉపనది తుంగభద్రా, తెలంగాణా, రాయలసీమ ప్రాంతాలమధ్య ప్రవహించి, ఈ రెండు భాగాలనూ వేరు చేస్తున్నాయి. గోదావరి నదికి ఉత్తరంగా ఉండే ప్రాంతాన్ని, మొదటినుండి కళింగమని పిలుస్తున్నారు. కళింగ దేశం వారికి కాళింగులు అని పేరు.

### 6.4.1 మౌర్యుల కాలం

చరిత్ర పూర్వయుగంలో రాజ్యాల, దేశాల ప్రస్తావన లేనప్పుడు ప్రత్యేకంగా భౌగోళిక స్వరూపమంటూ యేమీ లేదు. దక్కన్ ప్రాంతమంతా ఒక యూనిట్ (unit) గానే పరిగణించాల్సి ఉంటుంది. ఆ తర్వాత చారిత్రక యుగంలో, మౌర్యుల కాలంలో, అంటే, చంద్రగుప్తుని కాలంలోనే ఆంధ్రదేశం మౌర్య సామ్రాజ్యంలో చేరింది. అశోకుని సామ్రాజ్యంలో దక్షిణాన మూడు రాష్ట్రాలుండేవని తెలుస్తున్నది. అందులో దక్షిణ రాష్ట్రానికి 'సువర్ణ గిరి' రాజధాని. అనంతపురం జిల్లాలోని "జొన్నగిరియే ఈ సువర్ణగిరి అని చరిత్రకారులు చెప్తున్నారు. ఈ దక్షిణ ప్రాంతం ఆంధ్రదేశమై ఉండవచ్చు. అయితే మౌర్య సామ్రాజ్యంలో స్వతంత్ర ప్రతిపత్తి ననుభవిస్తున్న అనేక జాతులుండేవి. అందులో ఆంధ్రులు ఒకరై ఉండవచ్చునని కొందరు అభిప్రాయపడుతున్నారు. దీనికి నిదర్శనంగా, చంద్రగుప్తుని ఆస్థానంలో ఉండిన గ్రీకు రాయబారి మెగస్తనీసు ఆంధ్రులకు 30 దుర్గాలుండేవని, ఒక లక్ష కాల్బలం, 3 వేల గుర్రాలు, 2 వేల ఏనుగులతో గొప్ప సైన్యం ముండేదని చెప్పాడు. ఏరియస్ అనే మరో గ్రీకు చరిత్రకారుడు, ఆంధ్రులకు 30 రాజ్యాలుండేవన్నాడు. మెగస్తనీసు చెప్పిన 30 దుర్గాలు, ఏరియస్ వర్ణించిన 30 రాజ్యాలు ఒకటేనా? ఇది ఆలోచించవలసి ఉంటుందని చరిత్రకారుల అభిప్రాయం. ఇటీవల ఆంధ్రదేశంలో, అనేక ప్రాచీన నగరాలు తవ్వకాలలో బయల్పడుతున్నాయి. ఇందులో ముఖ్యంగా చెప్పుకోతగ్గవి "కోటి లింగాలు, కొండాపురం, ఫణిగిరి, గాజులబండ, వీరాపురం, సాతానికోట, భట్టిప్రోలు, ధాన్యకటకం, విజయపురి" మొదలైనవి. బహుశ ఇవి చిన్న, చిన్న గణరాజ్యాలై ఉండవచ్చు. మౌర్య రాజులైన చంద్రగుప్త, అశోకులు ఈ గణరాజ్యాల నుండి కప్పం వసూలుచేసి వాటి స్వాతంత్ర్యాన్ని మన్నించి ఉంటారు. ఈ రాజ్యాలన్నింటిలో, ప్రతిష్ఠానపురం రాజధానిగా 'ములక, అశ్మక' రాజ్యాలను పాలించిన శాతవాహన వంశానికి మూలపురుషుడు శాతవాహనుడని, ఇతడు అశోకునికి సమకాలికుడని, చరిత్రకారుల అభిప్రాయం. ఇతడే ఆంధ్ర సామ్రాజ్యానికి పునాదులు వేసిన మహనీయుడు.

### 6.4.2 శాతవాహనుల కాలం

శాతవాహనుల కాలంలో, ఆంధ్ర దేశమంతా ఇప్పటి తెలంగాణా, రాయలసీమ, సర్కారులు (కోస్తా జిల్లాలు) - ఒకే పరిపాలన కింద ఉండి ఒకే భౌగోళిక ప్రదేశంగా ఉండేది. శాతవాహన వంశపు రాజులు ముప్పయి

BRAOU

మంది మొత్తం, నాలుగు వందల యాభై సంవత్సరాలు పరిపాలించారు. క్రీ.పూ. మూడవ శతాబ్ది మధ్యకాలం నుండి క్రీ.శ. 3వ శతాబ్దారంభానికి కొద్దిగా తర్వాతివరకూ (క్రీ.పూ. 230 నుండి, క్రీ.శ. 225 వరకూ) శాతవాహనుల కాలంగా చెప్పుకుంటున్నాం. శాతవాహన రాజ్యం దక్కన్‌లో చరిత్రకు తెలిసిన మొదటి రాజ్యం. మొదట వీరి రాజధాని కృష్ణానది ఒడ్డున వున్న 'శ్రీకాకుళం'. ఆ తర్వాత 'ధాన్యకటకం'. ఇదే 'ధరణి కోట'. ఇది గుంటూరు జిల్లాలో కృష్ణానది ఒడ్డున, అమరావతికి సమీపంలో ఉంది. శాతవాహనుల రాజ్య విస్తరణ వల్ల, వారి రాజ్యం తూర్పున బంగాళాఖాతం మొదలుకొని, పడమర అరేబియా సముద్రం వరకూ వ్యాపించింది. శాతవాహన రాజుల్లో గొప్ప పరాక్రమవంతుడైన గౌతమీపుత్ర శ్రీ శాతకర్ణి శక, యవన, పహ్లవ సైన్యాలను ఓడించి వారి రాజ్యాలను ఆక్రమించాడు. ఇతడి కాలంలో ఆంధ్రదేశం భౌగోళికంగా ఎంతగానో విస్తరించింది. ఉత్తర కొంకణం, ఉత్తర మహారాష్ట్రం, సురాష్ట్రం, మాళవ దేశం, తూర్పు రాజస్థాన్, మధ్య పరగణాలు, బేరారు, అప్పటి ఆంధ్ర రాజ్యంలో భాగాలే - అంటే తూర్పు, పడమర దిక్కుల సముద్రాలు ఎల్లలు కాగా ఉత్తరాన మధ్యదేశం (మధ్య ప్రదేశ్) వరకూ, దక్షిణాన మైసూరుదాకా వ్యాపించాయి.

### 6.4.3 ఇక్ష్వాకుల కాలం

శాతవాహనులు క్రీస్తుశకం మూడవ శతాబ్ది మొదటి భాగంలో అంతరించాక, ఆంధ్రదేశంలో ఎన్నో చిన్న రాజ్యాలు వెలిశాయి. అందులో చెప్పుకోదగ్గది ఇక్ష్వాకుల రాజ్యం. మనకు లభించిన వీరి శాసనాలు చాల వరకూ వీర పురుషదత్తుని కాలంనాటివి. ఇవి ముఖ్యంగా కృష్ణాజిల్లా జగ్గయ్యపేటలోనూ గుంటూరుజిల్లా నాగార్జున కొండలోనూ దొరికాయి. వీర పురుషదత్తుని రాజధాని విజయపురి. కృష్ణానది తీరాన ఉన్న నాగార్జుని కొండ ప్రదేశంలోనే పూర్వం విజయపురి ఉండేది. అప్పుడది ఒక మహానగరం. వీరి పరిపాలన మొత్తం 52 సంవత్సరాలు జరిగిందని తెలుస్తూ ఉంది. క్రీ.శ. 4వ శతాబ్ది చివరికాలంలో వీరి రాజ్యం అంతమైందని చరిత్రకారులు నిర్ణయిస్తున్నారు. వీరు ఆంధ్ర సామ్రాజ్యానికి ఆయువుపట్టుగా కృష్ణానది ముఖద్వారానికి రెండువైపులా వున్న రాజ్యాన్ని పరిపాలించారు. ఇంకా వివరంగా చెప్పాలంటే వీరి రాజ్యం, నేటి గుంటూరు, ప్రకాశం, కడప, కర్నూలు, నల్లగొండ, తూర్పు గోదావరి జిల్లాలు ఉన్న ప్రాంతాల మొత్తంలో వ్యాపించింది.

### 6.4.4 విష్ణుకుండినుల కాలం

ఇక్ష్వాకుల వంశపు రాజుల తర్వాత ముఖ్యంగా చెప్పుకోదగ్గ రాజవంశంవారు విష్ణుకుండినులు. అయితే ఈ రెండు రాజవంశాల మధ్య సుమారు రెండువందల సంవత్సరాల ఎడం ఉంది. ఈ రెండువందల సంవత్సరాల కాలంలో, ఆంధ్రదేశాన్ని 'బృహత్పలాయనులు, శాలంకాయనులు, కందార రాజులు, పల్లవ వంశపు రాజులు' పరిపాలించారు. పల్లవవంశపు రాజులు కృష్ణానదికి దక్షిణాన ఉన్న పూర్వాంధ్ర దేశాన్ని చాలాకాలం పరిపాలించారు.

శాలంకాయన రాజ్యం పడిపోయిన తర్వాత పూర్వాంధ్రదేశాన్ని పరిపాలించినది విష్ణుకుండినులు. విష్ణు కుండిన పదానికి గుంటూరు జిల్లాలోని 'వినుకొండ' కూ చాలా దగ్గర సంబంధం కనబడుతుంది. వీరు క్రీస్తుశకం 5వ శతాబ్దపు చివరి భాగంనుండి, 7వ శతాబ్ది మొదటి భాగందాకా సుమారు 150 ఏండ్లు పాలించినట్లు తెలుస్తోంది. కృష్ణానదికి దక్షిణతీరాన ఉన్న దేశాన్ని వీరు పరిపాలించారు. తర్వాత కళింగదేశంలో కొంతభాగాన్ని జయించి తమ రాజ్యంలో కలుపుకొన్నారు. వీరిలో మాధవవర్మ మహారాజు ప్రసిద్ధుడు. అతడి కాలంలోనే విష్ణుకుండినుల ప్రాభవం బాగా పెరిగింది. రెండవ పులకేశి, అతని తమ్ముడు యువరాజైన విష్ణువర్ధనుడు, విష్ణుకుండినుల నోడించి పూర్వాంధ్ర దేశాన్ని జయించి తమ రాజ్యాన్ని స్థాపించారు. వీరు చాళుక్యులు.

### 6.4.5 చాళుక్యుల కాలం

చాళుక్య వంశీయులకు బొంబాయి రాజధానిలోని విజాపురం జిల్లాలోని వాతాపి (ఇప్పటి బాదామి నగరం) రాజధాని. ఈ వంశాలలో గొప్ప రాజు రెండవ పులకేశి. హర్షవర్ధన మహారాజుకు సమకాలికుడు. హర్షుడు దక్షిణ దేశం మీదికి దండెత్తిరాగా, అతడిని ఓడించిన ఘనుడు. దక్కన్‌లోని అందరి రాజులనూ ఓడించి, అంతవరకూ అతి చిన్న రాజ్యంగా ఉండిన బాదామిని గొప్ప చాళుక్య రాజ్యంగా విస్తరింపజేశాడు. ఆంధ్రదేశంపై దండెత్తాడు. పూర్వాంధ్ర దేశాన్నేకాక అఖిలాంధ్ర దేశాన్నీ జయించాడు. వేంగి దేశంలో (పూర్వాంధ్రదేశం) చాళుక్య రాజ్యాన్ని స్థాపించినవాడు రెండవ పులకేశి తమ్ముడైన విష్ణువర్ధనుడు. ఇతని సంతతివారిని తూర్పు చాళుక్యులని, పూర్వ చాళుక్యులని, వేంగీ చాళుక్యులని అంటారు. పూర్వాంధ్ర దేశమంతా చాళుక్యరాజుల ఆధీనంలో ఉంటే పొరుగున

ఉన్న కాంచీపుర పల్లవరాజులు బలం పుంజుకొని, పశ్చిమాంధ్ర దేశాలలో కొంత భాగాన్ని ఆక్రమించుకొన్నారు. వేంగీ చాళుక్యులకు పడమటి దిక్కున కొంతకాలం వారి దాయాదులైన బాదామి చాళుక్యులు, ఆ తర్వాత రాష్ట్రకూటులు సమకాలికులు. వేంగీ చాళుక్య రాజులలో నాల్గవ విజయాదిత్యుని కొడుకైన అమ్మరాజు రాజమహేంద్రుడే రాజమహేంద్ర వరాన్ని కట్టించాడు. వేంగీ చాళుక్య వంశానికి చెందినవాడే రాజరాజ నరేంద్రుడు. క్రీ.శ. 1022 లో సింహాసనాన్ని అధిష్ఠించాడు. ఆది మహాకవి నన్నయ ఈ రాజరాజ నరేంద్రుని ఆస్థానకవి.

**6.4.6 మాండలిక యుగం**

చాళుక్య రాజరాజ నరేంద్రుని తర్వాత వేగి రాజకీయాలు మరింత జటిలమైనాయి. రాజరాజ నరేంద్రుని కొడుకు రాజేంద్ర చోళుడికి, మేనమామలతో సంబంధంవల్ల, తమిళదేశంలో పొత్తు పెరిగింది. మేనమామల రాజ్యాన్ని కూడ గట్టి ప్రయత్నం చేసి ఆక్రమించుకొన్నాడు. ఉభయ చాళుక్య-చోళ వంశ ఉద్ధారకుడైనందువల్ల, ఇతని సంతతివారు 'చాళుక్య-చోళు' అని ప్రసిద్ధిచెందారు. అందుకే ఈ కాలాన్ని చాళ్య-చోళ యుగమని సాధారణంగా పిలుస్తారు. ఈ కాలంలో ఆంధ్రదేశ భౌగోళిక స్వరూపాన్ని పరిశీలించినప్పుడు, వేంగీ రాజ్యాన్ని చాళుక్యులు పరిపాలిస్తూ ఉన్నారు. తమిళ దేశంపైకూడ, పైన చెప్పినట్టుగా, వీరి ప్రాబల్యం - వివాహ సంబంధాల వల్ల కలిగిన బంధుత్వాలు దీనికి ముఖ్యకారణంగా ఉండింది. అయితే, ఈ చాళుక్య-చోళ యుగంలో, రాష్ట్రాలను నిర్వహిస్తున్న సామంతరాజ్యాలు ప్రాముఖ్యంలో వచ్చాయి. నెల్లూరు, పొత్తపి, కొణిదెనలలో తెలుగు చోడులు, చందోలు, నాదెండ్లలలో దుర్జయులు, నతవాడిలో చాగి (త్యాగి) వంశీయులు, కోనసీమలో హైహయులు, కోస్తా ఆంధ్రప్రాంతాన్ని పాలించిన మాండలికులలో (సామంతరాజులలో) ముఖ్యులు. హనుమకొండ ప్రాంతాన్ని పశ్చిమ చాళుక్య సామంతులుగా కాకతీయులు పాలించేవారు. వీరు పేరుకు మాత్రమే సామంతులు. తమ, తమ ప్రాంతాలలో సర్వ స్వతంత్రులుగా వ్యవహరించారు. అందుకనే చాళుక్య-చోళ యుగాన్ని 'మాండలిక యుగమని కూడ వ్యవహరిస్తారు.

ఆంధ్రదేశం, ఈ యుగంలో ఖచ్చితమైన ఒక రాజు పటిష్ఠ పరిపాలనలో లేనందువల్ల, భౌగోళికమైన సరిహద్దులలో మార్పులు తరచుగా సంభవిస్తూ ఉండేవి. ఈ మాండలికయుగంలో, పూర్వాంధ్ర దేశాన్ని సమర్థంగా పరిపాలించినది వెలనాటి వంశం. గుంటూరు జిల్లాలో కృష్ణానదికి దక్షిణపు ఒడ్డునే సముద్రం దాకా వ్యాపించిన దేశాన్ని వెలనాడు అంటారు. (ప్రస్తుతం జిల్లా, మండలాల వంటి పరిపాలనా విభాగాన్ని అప్పటి కాలంలో 'నాడు' అనేవారు. 'వేగినాడు, పలనాడు, పాకనాడు' మొదలైన అనేక నాడులు ఉండేవి). వెలనాటి రాజులు దుర్జయ వంశంవారు. వీరికి ధనదవోలు, అంటే చందవోలు (గుంటూరు జిల్లా) రాజధాని. కర్నాటక ప్రాంతాన్ని పరిపాలిస్తూ ఉండిన పశ్చిమ చాళుక్యులు వెలనాటిపై దండెత్తి ఆక్రమించుకుని, అక్కడినుండి మిగతా ప్రాంతాలన్నిటినీ జయించారు. ఆంధ్ర మాండలికులు అందరూ కన్నడరాజ సామంతులయ్యారు. ఆంధ్ర దేశానికి కన్నడ దేశంతో సంపర్కం హెచ్చింది. ఆంధ్రదేశం క్రీ.శ. 1126లో కన్నడ ప్రభువు విక్రమాదిత్య మహా రాజు చనిపోయేవరకూ అతనికి లోబడే ఉంది. అతడి మరణం తరువాత తిరిగి వెలనాటి దుర్జయులు తమ పూర్వపు వేగినాడును ఆక్రమించుకోడమేగాక, తమ రాజ్యాన్ని ఉత్తరాన మహేంద్రగిరి మొదలుకొని దక్షిణాన పాకనాటిదాకా వ్యాపింపజేశారు.

ఇదిలా ఉండగా సమర్థుడైన చాళుక్య - చోళ చక్రవర్తి, రెండవ రాజరాజు, క్రీ.శ. 1175 లో గతించడంతో దేశంలో అరాజకం ప్రబలింది. వెలనాటి చోడులు స్వతంత్రులైనారు. వారికి ఇంతవరకూ లొంగివున్న ఇతర ఆంధ్ర మండలేశ్వరులు కూడ స్వతంత్రులై తమ, తమ రాజ్యాలు పరిపాలించారు. వీరు ఒకరూ ఇద్దరూ కాదు. అనేకులు చాగివంశంవారు 'గుడిమెట్ట, విజయవాడ' రాజధానులుగా పరిపాలించారు. కోట వంశంవారికి 'ధరణి కోట' రాజధాని. పల్నాటిసీమను పలనాము రాజాదులు, కోనసీమను హైహయులు పాలించారు. తెలుగు చోళ రాజులు 'కొణిదెన, నెల్లూరు, పొత్తపి' నగరాలు రాజధానులుగానూ, కొలనివీడు (అంటే కొల్లేరు కోట) రాజధానిగా తెలుగు నాయకులు, కొండవీటికి పడమర ఉన్న కొండ పడమటి దేశాన్ని కమ్మ నాయకులు - ఈ విధంగా ఎందరో చిన్న, చిన్న రాజులు ఆంధ్రదేశాన్ని ఖండ ఖండాలుగా చేసి పరిపాలించారు. దేశం ఖండ ఖండాలుగా చీలి ఈ స్థితిలో ఉన్నప్పుడు, ఓరుగల్లునుండి కాకతీయ వంశపు గణపతిదేవ మహారాజు పూర్వాంధ్ర దేశంమీదికి దండెత్తాడు. ఈ దండయాత్ర ఫలితంగా ఆంధ్ర మాండలికుల స్వతంత్ర పాలన అంతమయింది.

BRAOU

### 6.4.7. కాకతీయుల యుగం

కాకతీయ యుగం ఆరంభమైంది. కాకతి వంశంవారిని కాకతీయులంటారు. వీరి మూలపురుషుడు జేతరాజు. పశ్చిమ చాళుక్యులకు, చాళుక్య - చోళులకు, చోళులకు మధ్య జరిగిన యుద్ధాలలో, పశ్చిమ చాళుక్యులను సమర్థించినందువల్ల, కాకతి ప్రోలరాజుకు హనుమకొండ దేశం ఇచ్చారు. అప్పటినుండి హనుమ కొండ దేశాన్ని పాలిస్తూ వచ్చారు. హనుమకొండ తెలంగాణాలో వరంగల్లుతో కలిసి ఉంది. వేంగీరాజ్యం అంతరించిన కొద్దికాలానికి కాకతి రెండవ ప్రోలరాజు పశ్చిమ చాళుక్యులను ఓడించి స్వతంత్రుడయ్యాడు. ఇరుగు పొరుగు రాజ్యాలను జయించి తమ సామంతులుగా చేసుకొన్నారు. దక్కన్ తూర్పు భాగంలోని తెలంగాణా మొత్తాన్ని ఆక్రమించారు. కాకతీయులలో గొప్ప రాజైన గణపతిదేవుడు క్రీ.శ. 1199 లో రాజ్యానికి రాగానే, రాజధానిని హనుమకొండనుండి వరంగల్లుకు మార్చి (దీనినే ఓరుగల్లు, ఏకశిలా నగరమని కూడ అనేవారు), ఆంధ్రదేశంలో అనేక ప్రాంతాలను జయించి రాజ్యాన్ని విస్తరింపచేసాడు. కాకతీయుల కాలంలో ఆంధ్రదేశం మొత్తాన్ని - తెలుగు మాట్లాడే ఆంధ్రులనందరినీ - ఒక్క రాజ్యంలోకి తీసుకురావాలని ప్రయత్నించాడు. దీనికి కారణం, ఉత్తర హిందుస్థానంలో మహమ్మద్ ఘోరీ నాయకత్వాన ముస్లింల రాజ్యం ఏర్పడింది. వీరు ఎప్పటికైనా ఆంధ్రదేశంపై దండెత్తి వస్తారని గణపతి దేవుడు పసిగట్టాడు. తిక్కన సోమయాజి యితనికి సమకాలికుడు. ఆంధ్రులందరూ ఒకటేనన్న జాతీయతాభావం మొదటిసారిగా తెలుగుదేశంలో అప్పుడే కలిగింది. గణపతి దేవుడు ఆంధ్రదేశపు భౌగోళిక స్వరూపాన్ని బాగా విస్తరింపజేశాడు. ఉత్తరాన కళింగాన్ని, దక్షిణాన చెంగల్పట్టు జిల్లాలోని కాంచీపురాన్ని జయించాడు. ఆంధ్రదేశం యించుమించుగా మొత్తం ఓరుగల్లు కాకతీయుల ఆధీనంలోకి వచ్చింది. కాంచీపురంలో కాకతీయుల ప్రతినిధి రాజ్యం చేశాడు. గణపతిదేవుని కూతురైన రుద్రమదేవి కాలంలో ఆంధ్రదేశం, కాంచీపురాన్ని దాటి, దక్షిణంగా ఉన్న తిరుచునాపల్లి దాకాగల ప్రాంతాలను జయించింది. కొసకు, కాకతీయులు సాధించిన ఐక్యత, రాజ్యవిస్తరణ, ఢిల్లీ సుల్తానుల దండయాత్రలతో అంతమైంది. ఆంధ్రదేశం ఢిల్లీ సుల్తానుల పరిపాలన కిందికి వచ్చింది.

### 6.4.8 రెడ్డిరాజుల యుగం

BRAOU

ఆ తర్వాత కాలంలో చెప్పుకోదగిన చారిత్రకదశ రెడ్డిరాజులయుగం. క్రీ.శ. 1323లో ఆంధ్రదేశం ఢిల్లీ తుగ్లక్ సుల్తానుల వంశమైంది. వారిని ఓడించి, ఆంధ్రదేశాన్ని ఆక్రమించుకోడానికి ఆంధ్రులు ఎంతో గట్టి కృషి చేశారు. దేశంలో సామంతులూ, నాయకులూ ఏకమయ్యారు. వారికి, నాయకుడు ముసునూరి ప్రోలయ నాయకుడు. పూర్వాంధ్ర దేశాన్ని ముస్లిముల నుండి తిరిగి ఆక్రమించుకొన్నాడు. గోదావరి నది ఒడ్డున ఉన్న 'రేకపల్లి' అతని రాజధాని. ఆ తర్వాత, పాపికొండలకు యెగువన ఉన్న తెలంగాణా నుండి కూడా ముస్లిముల ప్రాభవాన్ని తొలగించి ఓరుగల్లు కోటను తిరిగి స్వాధీనం చేసుకొన్నారు. తిరిగి పూర్వాంధ్ర దేశం, తెలంగాణా ఆంధ్ర రాజుల వశమయ్యాయి. ఇంతలో, తుంగభద్రా నదీ ప్రాంతాన్నుండి ముస్లిం అధికారులనూ, సేనలనూ ఓడించి, ఆ దేశాన్ని హరిహర రాయలూ, అతని సోదరులూ క్రీ.శ. 1335-36 నుండి పరిపాలించ నారంభించారు. వారి రాజధాని, తుంగభద్ర ఒడ్డున ఉన్న 'విజయనగరం'. దీంతో ఆంధ్రదేశం స్వతంత్రమైంది. కానీ కాకతీయుల కాలంలోలాగా ఒకరి కిందికే రాలేదు.

### 6.4.9 విజయనగర రాజ్యారంభ దశ

ఇక్కడ మరొక విషయాన్ని ప్రస్తావించడం అవసరం. ఒకవైపు క్రీ.శ. 1335 నుండి విజయనగర రాజ్యం ఆరంభంకాగా, మరొకవైపు క్రీ.శ. 1347 లో బహమనీ రాజ్యం అనే పేరుతో ఒక ముస్లిం రాజ్యాన్ని స్థాపించిన వాడు బహమనీ వంశపు అల్లావుద్దీన్ హసన్ షా. అతని రాజధాని గుల్బర్గా. వింధ్యకు దక్షిణాన ఢిల్లీ సుల్తాన్ తుగ్లక్‌కు రాజ్యమే లేకుండాపోయింది.

ఈ చారిత్రక దశలో, ఆంధ్ర దేశంలో యిద్దరు తెలుగు వీరులు రెండు కొత్త రాజ్యాలు స్థాపించారు. ఒకరు రేచర్ల అనపోతానేడు అనే పద్మ నాయకుడు. తెలంగాణాలోని రాజుకొండలో రాజ్యం స్థాపించాడు. ఆ తర్వాత ఓరుగంటి రాజ్యం ఆక్రమించాడు. అప్పటి నుండి తెలంగాణా ప్రాంతానికంతటికీ రేచర్ల పద్మ నాయకులు అధిపతులైనారు. రెండోవారు వేమారెడ్డి. ఇతడు సముద్రపు ఒడ్డున ఉన్న ఆంధ్రదేశాన్ని ఆక్రమించాడు. రాజధాని గుంటూరు జిల్లాలోని 'అద్దంకి'. వేమారెడ్డి కాలంలో అతడి రాజ్యం తూర్పు సముద్ర తీరాన్నుంచి, సుప్రసిద్ధ శైవ, వైష్ణవ క్షేత్రాలయిన శ్రీశైలం, అహోబిలాల వరకూ వ్యాపించింది.

ఆంధ్రదేశమంతా పై విధంగా, పద్నాల్గవ శతాబ్ది చివరి భాగంలో మూడు ముఖ్య రాజ్యాలుగా చీలిపోయింది. తెలంగాణా రాచకొండ రాజధానిగాగల రేచర్ల వారి ఆధీనంలో; పశ్చిమాంధ్ర దేశం (రాయలసీమ) విజయనగర రాజుల వంశంలో; పూర్వాంధ్ర దేశం రెడ్డిరాజుల ఆధీనంలో ఉండేవి. అద్దంకి నుండి కొండవీటికి రెడ్డిరాజుల రాజధాని మారడంతో వీరిని కొండవీటి రెడ్డిరాజులని పిలవడం జరిగింది. రెడ్డి రాజ్యం అంతఃకలహాలతోనూ, విజయనగరం బహమనీ రాజ్యాల దండయాత్రలతోనూ నలిగి క్షీణించాయి. ముసునూరి వారి ఓరుగంటి రాజ్యం, రేచర్లవారి రాచకొండ రాజ్యం అంతరించాక, తెలంగాణా బహమనీ సుల్తానుల పాలనలోకి వచ్చింది. ఇక మిగిలిన విజయనగర రాజ్యపాలనలోని ఆంధ్ర దేశపు భౌగోళిక స్వరూపాన్ని యిప్పుడే తెలుసుకొందాం.

### 6.4.10 విజయనగర యుగం

విజయనగర రాజ్యస్థాపన గూర్చి ముందే తెలుసుకొన్నాం కదా. సంగమ వంశకాలంలో, వీరి రాజ్యం తూర్పు సముద్రం (బంగాళాఖాతం) నుంచి పడమటి సముద్రం వరకూ (అరేబియా సముద్రం), ఉత్తరాన తుంగభద్రానది నుండి దక్షిణాన కన్యాకుమారి వరకూ వ్యాపించింది. ఆ తర్వాత ప్రౌఢదేవరాయల (సంగమ వంశం) కాలంలో కొండవీటి రెడ్డి రాజ్యాన్ని ఆక్రమించి, తూర్పున రాజమహేంద్రవరం దాకా విస్తరించింది.

పూర్వాంధ్ర దేశాక్రమణ సమయంలో విజయనగర రాజులకు, కటకం (ఒరిస్సా) గజపతులకు మధ్య భయంకర యుద్ధాలు జరిగాయి. ఈ యుద్ధాలలో గజపతులు గెలిచారు. క్రీ.శ. 1500 నాటికి వీరి రాజ్యం ఉత్తరాన ఒరిస్సా నుండి దక్షిణాన నెల్లూరు జిల్లాలోని ఉదయగిరి దాకా వ్యాపించింది. అయితే, తుళువ వంశం విజయనగరాన్ని పరిపాలిస్తున్న కాలంలో, కృష్ణదేవరాయలు సింహాసనం ఎక్కడంతో, మళ్ళీ విజయనగరం మహర్దశ అనుభవించింది. ప్రధాని తిమ్మరుసు సాయంతో ఇతడు, కప్పం చెల్లించడం మానేసి స్వతంత్రులుగా చెలామణీ అవుతున్న సామంతులను అణచి, గజపతుల రాజ్యంపై దండెత్తి, ప్రతాపరుద్ర గజపతిని ఓడించి, కటకం దాకా తరిమికొట్టాడు. ఆంధ్రతీర ప్రాంతంలోని అన్ని ప్రదేశాలను, ముఖ్యమైన కోటలను ఆక్రమించాడు. సింహాచలంలో దిగ్విజయ ప్రకటన చేశాడు. దక్షిణ దేశంలోని తంజావూరు, మధురలలో పరిపాలన కొనసాగించడానికి, తమ ప్రతినిధులను నియమించాడు. ఇదే ఆ తర్వాతి కాలంలో తంజావూరు, మధుర తెలుగు నాయక రాజ్యాలుగా రూపొందాయి. తెలంగాణా ప్రాంతాన్ని బహమనీ సుల్తానులు పరిపాలిస్తున్న విషయం ముందే చెప్పుకొన్నాం కదా! వీరందరూ యేకమై క్రీ.శ. 1565లో విజయనగరం మీదికి దండెత్తి కృష్ణానదీ తీరాన 'రాక్షస-తంగడి' వద్ద ఓడించారు. దీనితో విజయనగర సామ్రాజ్యం పతనమైంది.

విజయనగర రాజ్యకాలంలోనే పోర్చుగీసువారు వ్యాపార నిమిత్తం మన దేశానికి రావడమూ, వారి తర్వాత డచ్చి, ఫ్రెంచి, ఇంగ్లీషు వారు రావడమూ, తూర్పు ఇండియా కంపెనీల పేరుతో వాణిజ్యం సాగిస్తూ, క్రమేపి రాజకీయాధికారం కోసం యెత్తుగడలు పన్నడమూ ఈ కాలంలో ఆరంభమైంది.

### 6.4.11 గోల్కొండ సుల్తానుల కాలం

గోలకొండ సుల్తానుల కాలంలో సుల్తాన్ కులీకుతుబ్‌షా తెలంగాణా నుండి గజపతులను తరిమివేశాడు. ఇతనికాలంలో తెలంగాణాలోని చాలాభాగం గోలకొండ రాజ్యంలో చేరిపోయింది. అయితే దక్కన్ ముస్లింల రాజ్యాల చరిత్ర సమస్తం పరస్పరం పోరాడుకోడం (ఇవి అయిదు రాజ్యాలు : గోలకొండ, బిజాపూర్, అహమ్మద్ నగర్, బేరార్, బీదర్). వీరందరూ విజయనగరాన్ని అంతమొందించడంలో ఏకమై, ఆ తర్వాత మళ్ళా విడిపోయి ఒకరిపై మరొకరు కత్తులు దువ్వుకొన్నారు. విజయనగర పతనంతో, మహమ్మద్ కులీ కుతుబ్‌షా (క్రీ.శ. 1580) కాలంలో సముద్రతీర ఆంధ్రప్రాంతాన్ని, రాయలసీమలోని తూర్పు భాగాన్నీ జయించారు. గోలకొండ రాజ్యం ఒక వెలుగు వెలిగింది. అప్పుడే భాగ్యనగరం (హైదరాబాదు) నిర్మితమయింది. ఆ తర్వాత గోలుకొండ రాజ్యాన్ని ఏలిన అబ్దుల్లా కుతుబ్‌షా కాలంలో ఆంధ్రదేశం మొత్తం గోలకొండ సుల్తానుల ఆధీనంలోకి వచ్చింది. గోలకొండ రాజ్యం ఉత్తర గంజాం జిల్లా దాకా వ్యాపించింది. అయితే, మొఘలుల దండయాత్రల వల్ల క్రీ.శ. 1687లో గోలకొండ కోట ఔరంగజేబు వశమై పతనమయిపోయింది.

### 6.4.12 మొగలాయి – నిజాం పాలనాకాలం

గోలకొండ పతనంతో ఆంధ్రదేశం మొగలాయీ పరిపాలన కిందికి వచ్చింది. ఔరంగజేబు మరణానంతరం (క్రీ.శ. 1707) భారతదేశంలో మొగలాయీ పరిపాలన క్షీణించటం ఆరంభమైంది. దేశం



BRAOU

నలుమూలలా రాజ్యాలు స్వాతంత్ర్యాన్ని ప్రకటించుకొన్నాయి. అనేక తిరుగుబాట్లు జరిగాయి. వీటిలో భాగంగానే 1724లో చిన్‌కిలిక్‌ఖాన్ (ఇతనికే 'అసఫ్ జా అనీ, నిజామ్ ఉల్ ముల్క్' అనీ బిరుదులు ఉన్నాయి) దక్కన్ సుబాను స్వతంత్రంగా పరిపాలించడం ఆరంభించాడు. దీంతో మొగలాయీ పరిపాలనకు రోజులు చెల్లిపోయాయి. మొగలాయిల కింద ఉన్న దక్షిణ ప్రాంతానికంతటికీ, అసఫ్‌జా నిజామ్ ఉల్ ముల్క్ అధిపతి అయి క్రీ.శ. 1748 దాకా పరిపాలించాడు.

### 6.4.13 ఈస్టిండియా కాలం

నిజామ్ ఉల్ ముల్క్ మరణానంతరం, దక్షిణ భారతదేశంలో నెలకొన్న అస్తవ్యస్త పరిస్థితులను, అరాచకాన్ని, అనైక్యతను ఆధారం చేసుకొని, ఇంగ్లీషు ఈస్టిండియా, ఫ్రెంచి ఈస్టిండియా కంపెనీవారు కర్నాటక, హైదరాబాదు రాజ్య వ్యవహారాల్లో తమ స్వార్థ, వాణిజ్య, రాజకీయ ప్రయోజనాల కోసం జోక్యం చేసుకొన్నారు. రాజ్యాధికారం కోసం పెనుగులాడుతున్న వారిలో ఒకరిని మరొకరిపై పురిగొల్పి, వారికి సైనిక సహాయం అందించారు. కుటిల రాజకీయాలతో తమ పబ్బం గడుపుకొన్నారు. క్రీ.శ. 1759లో హైదరాబాద్ నిజాం సలాబత్ జంగ్ ఇంగ్లీషువారితో చేసుకొన్న ఒడంబడిక ఫలితంగా సర్కారు జిల్లాలేగాక, ఆ తర్వాత 1788 లో గుంటూరు జిల్లాకూడ కంపెనీ వారి ఆధీనంలోకి వచ్చింది. ఆ తర్వాత ఆంగ్ల-మైసూరు యుద్ధాలలో క్రీ.శ. 1799లో మైసూరు నవాబు టిప్పుసుల్తాను మరణానంతరం, హైదరాబాద్ నిజాం ఇంగ్లీషువారు చేసిన సాయానికి ప్రతిఫలంగా, బ్రిటిష్ సేనలు తన రాజ్యంలో ఉంచేందుకు (బెంటింక్ సైన్య సహకార పద్ధతి ప్రకారం) అయ్యే ఖర్చుల నిమిత్తం పశ్చిమాంధ్ర మండలాలను (రాయలసీమలోని జిల్లాలను) దత్తంచేశాడు. అందుకనే వాటికి దత్త మండలాలు (ceded districts) అనే పేరు వచ్చింది. ఈ విధంగా పూర్వ పశ్చిమాంధ్ర ప్రాంతాలు (కోస్తా, రాయలసీమ ప్రాంతాలు) ఆంగ్లేయుల (కంపెనీ) పాలనలోకి రాగా, హైదరాబాద్ రాజ్యంలోని తెలంగాణా అసఫ్‌జాహి వంశంవారి పరిపాలనలోనే ఉండిపోయింది.

క్రీ.శ. 1857లో జరిగిన గొప్ప తిరుగుబాటు (దీన్నే 'సిపాయిల తిరుగుబాటు' అని ఆంగ్ల చరిత్రకారులు అభివర్ణించారు) తర్వాత కంపెనీ పరిపాలన నుండి ఆంధ్రదేశం బ్రిటిష్ ప్రభుత్వ (బ్రిటిష్ పార్లమెంటు, విక్టోరియా మహారాణి పరిపాలనలోకి) ప్రత్యక్షపాలన కిందికి వచ్చింది. కానీ తెలంగాణా మాత్రం బ్రిటిష్ వారి అధికారానికి పలుకుబడికి లోబడి అసఫ్‌జాహీల పరిపాలనలోనే కొనసాగింది.

### 6.4.14 స్వాతంత్ర్యాంతర కాలం – ఆంధ్రప్రదేశ్ అవతరణ

పై విధమైన భౌగోళిక విభజనను, ఆంధ్రదేశం, పరిపాలనా పరంగా గురయింది. ఈ ఏర్పాటు క్రీ. శ. 1947 ఆగస్టు 15 దాకా జరిగింది. అంటే భారతదేశం స్వాతంత్ర్యంపొందాక, బ్రిటిష్ పరిపాలనలో ఉండిన ఆంధ్ర రాయలసీమ ప్రాంతాలు నేరుగా భారత యూనియన్‌లో కలిసిపోయాయి. అయినా నైజాం నవాబు స్వతంత్ర భారతదేశంలో చేరక, స్వాతంత్ర్యాన్ని ప్రకటించాడు. దీంతో ప్రజల్లో అసంతృప్తి ప్రబలి "ఇండియన్ యూనియన్"లో చేరాలనే ఉద్యమం ప్రారంభమైంది. హైదరాబాద్ సంస్థానంలో ప్రబలిన అనిశ్చిత పరిస్థితులను గమనించిన భారత ప్రభుత్వం 1948 సెప్టెంబర్ నెలలో 'పోలీసు చర్య' జరిపి హైదరాబాద్ సంస్థానాన్ని స్వతంత్ర భారతదేశంలో చేర్చుకుంది. హైదరాబాద్ రాష్ట్రం కూడా స్వతంత్రమైంది. అయినా 18వ శతాబ్దంలో రెండుగా చీలిపోయిన ఆంధ్రదేశం (కోస్తా రాయలసీమ ప్రాంతాలు ఆంగ్లేయుల పరిపాలనలో, తెలంగాణా అసఫ్ జాహీల ప్రాంతంలో) ఏకం కాలేదు. కోస్తా, రాయలసీమ ప్రాంతాలు మద్రాసు రాష్ట్రంలో భాగంగా ఉండేవి. తెలంగాణా హైదరాబాద్ రాష్ట్రంలో అంతర్భాగం. ఆంధ్రులు ఉద్యమాలు నిర్వహిస్తూ వచ్చారు. భాషా ప్రాతిపదికపై ప్రత్యేక రాష్ట్రాలు నిర్మించాలన్న ఈ ఉద్యమం, స్వాతంత్ర్యోద్యమాల కాలంలో, జాతీయోద్యమంలో భాగంగానే ఉండింది. స్వాతంత్ర్యానంతరం యిది బలం పుంజుకొంది. ఈ ఉద్యమ ఫలితంగా అమరజీవి పొట్టి శ్రీరాములు ఆత్మార్పణ ఫలితంగా 1953 అక్టోబర్ 2 వ తేదీన ప్రత్యేక 'ఆంధ్రరాష్ట్రం' ఏర్పడింది. మదరాసు రాష్ట్రంనుండి కోస్తా, రాయలసీమ ప్రాంతాలు విడిపోయి కర్నూలు రాజధానిగా ఆంధ్రులకు స్వరాష్ట్రం ఏర్పడింది. అయితే యిది ఆంధ్రులను పాక్షికంగానే ఐక్యపరిచింది. తెలంగాణా ప్రాంతం అప్పటికింకా విడిగా, హైదరాబాదు రాష్ట్రంలో భాగంగా ఉండిపోవడంతో, ముక్క చెక్కలైన మూడు కోట్ల ఆంధ్రులు ఏకం కాలేకపోయారు. అందుకనే 'విశాలాంధ్రోద్యమం' ఆంధ్రదేశమంతటా (తెలంగాణాతో సహా) పాకిపోయింది. విశాలాంధ్ర సదస్సులు జరిగాయి. సభలు తీర్మానాలు చేశారు. ఫలితంగా రాష్ట్ర పునర్విభజన పద్ధతులు పరిశీలిస్తున్న ఫజలాలీ కమీషన్ నివేదిక

సమర్పించిన తర్వాత 1956 నవంబర్ ఒకటో తారీఖున 'ఆంధ్రప్రదేశ్ రాష్ట్రావతరణతో', తిరిగి ఆంధ్రులంతా ఏకమైనారు. ఆంధ్రదేశమంతా ఒకే భౌగోళికమైన ప్రాంతంగా ఏర్పడింది.

నేటి ఆంధ్రప్రదేశ్‌లో 23 జిల్లాలున్నాయి. 1991 జనాభా లెక్కల ప్రకారం 66,304,854 మంది ప్రజలున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో హిందూ, ఇస్లాం, క్రైస్తవాలు ప్రధానమతాలు. ప్రజల్లో అధికులు పల్లెప్రాంతాల్లో నివసిస్తున్నారు. అనాదిగా ప్రజల ప్రధానవృత్తి వ్యవసాయమే! దాదాపు 70 శాతం ప్రజలు దీనిని అనుసరిస్తున్నారు.

నేడు తెలుగుదేశాన్ని కోస్తా ఆంధ్ర, రాయలసీమ, తెలంగాణా అని మూడు పేర్లతో నిత్య వ్యవహారంలో పిలుస్తున్నారు. మూడు ప్రాంతాలుగా ఇవి, ఆంధ్రదేశపు చరిత్ర ఆరంభం నుండే వ్యవహరింపబడుతున్నట్టు మనం పాఠ్య క్రమంలో గ్రహించగలిగాం. కొంతవరకు భౌగోళిక కారణాల వల్ల, ఆయా కాలాల్లో పాలించిన రాజ్యాలవల్ల ఈ మూడు ప్రాంతాల ఆర్థికాభివృద్ధి, దాని కనుగుణంగా సామాజిక, సాంస్కృతికాభివృద్ధి సరియైన క్రమంలో, ఒకే రీతిలో జరిగాక, అనేక ప్రాంతీయ అసమానతలకు దారితీశాయి. ఈ మూడు ప్రాంతాల్లో ప్రజలు మాట్లాడుకొనే భాష ఒకటయినా, సరియైన భావ సమైక్యం ఇంకా ఏర్పడలేదు. అన్ని ప్రాంతాల ప్రజల ఆర్థిక సామాజిక అవసరాలను గమనించి, వాటిని సమైక్య దృష్టితో పరిష్కరించిన నాడు ఆంధ్ర దేశం తన భాషను, సంస్కృతిని పరిపుష్టం చేసుకొని ఉన్నత స్థాయికి ఎదగడానికి అవకాశం కలుగుతుంది.

### అవగాహన ప్రశ్న – 2

వివిధ చారిత్రక దశల్లో ఆంధ్రదేశ భౌగోళిక స్వరూపాన్ని ముప్పై వాక్యాల్లో సంగ్రహించండి.

______________________________________________________________

______________________________________________________________

______________________________________________________________

______________________________________________________________

______________________________________________________________

______________________________________________________________

______________________________________________________________

______________________________________________________________

## 6.5 సారాంశం

ఈ భాగంలో మీరీ కింది ప్రధానాంశాలను తెలుసుకున్నారు.

- చరిత్ర ప్రారంభ కాలం నుండి ఆంధ్రదేశ భౌగోళిక స్వరూపం మారుతూ వచ్చి రాష్ట్రావతరణ నాటికి స్థిరపడింది.
- ఆంధ్రదేశం ఉత్తర దక్షిణా పథాల కూడలిలో ఉన్నందువల్ల ఉత్తరాపథం నుండి వచ్చే సైనిక దండయాత్రలను ఎదుర్కొనే బాధ్యతను ఆంధ్రదేశపు రాజవంశాలు చాలా కాలం చేపట్టాయి.
- శాతవాహనులు, ఇక్ష్వాకులు, విష్ణుకుండినులు, శాలంకాయనులు, చాళుక్యులు, మాండలిక రాజులు కాకతీయులు, రెడ్డిరాజులు, విజయనగర రాజులు, గోల్కొండ సుల్తానులు – వీరి పరిపాలనా కాలంలో భౌగోళికమైన సరిహద్దులు మారుతూ వచ్చాయి. తెలంగాణా అసఫ్‌జాహి పరిపాలనలో ఉండేది. మద్రాసు ఉమ్మడి రాష్ట్రంలో ఉన్న ప్రాంతాలు, తెలంగాణ ప్రాంతాలు భౌగోళికంగా 1956 నవంబర్ ఒకటో తారీఖున ఏకమయ్యాయి.

## అవగాహన ప్రశ్నలకు జవాబులు

1. చరిత్రపై భౌగోళిక శక్తులు ఎంతో ప్రభావాన్ని కలిగి ఉంటాయి. దేశంలో ఉండే నదులు, పర్వతాలు, పీఠభూములు, ఎడారులు, శీతోష్ణస్థితి, వర్షపాతం, ఖనిజసంపద, చెట్లు, సస్యాలు, ఇవన్నీ కలిసి ప్రజలపై తమ ప్రభావాన్ని ప్రసరిస్తాయి. ఈ భౌగోళిక శక్తులననుసరించే దేశ ఆర్థిక స్థితి రూపుదిద్దుకుంటుంది. తత్ఫలితంగా ప్రజల కష్టసుఖాలు, సిరిసంపదలు ఏర్పడతాయి. వాటిని బట్టే దేశచరిత్ర ఏర్పడుతుంది. చరిత్రకూ భౌగోళిక పరిస్థితులకూ ఈ విధంగా అవినాభావ సంబంధం కలుగుతుంది. ఉదాహరణకు పెట్టని కోటలాంటి హిమాలయ పర్వతపంక్తి, దేశంలోని జీవనదులైన గంగా, కావేరి, బ్రహ్మపుత్ర, సింధు, గోదావరి వంటి నదులూ, అరణ్యాలూ మన ప్రజల జీవితాలను ప్రభావితం చెయ్యడం గమనించవచ్చు. కాబట్టి భౌగోళిక శక్తులు చరిత్రను నియంత్రిస్తాయని నిష్కర్షగా చెప్పవచ్చు.

2. వివిధ రాజవంశాలు ఆంధ్రదేశాన్ని పరిపాలించిన రాజ్యకాలాల్లో మన రాష్ట్ర భౌగోళిక స్వరూపం అనేక విధాలుగా మారుతూ వచ్చింది. ఈ వివిధ దశలను రాజవంశాల రాజ్యకాలాన్ని బట్టి పరిశీలించడం సులువు. మౌర్యవంశం తీసుకుంటే, అతనికి పూర్వం ఒకే భూఖండంగా ఉన్న దక్షిణ ప్రాంతమంతా చంద్రగుప్త మౌర్యుని సామ్రాజ్యంలో చేరింది. ఆ తర్వాత అశోకునికి సమకాలికుడై "ములక, అశ్మక" రాజ్యాలను పరిపాలించిన శాతవాహనుడు ప్రత్యేకమైన ఆంధ్ర సామ్రాజ్యానికి పునాదులు తీసిన మూలపురుషుడని చరిత్ర చెపుతున్న శాతవాహనులకాలంలో ఇప్పటి తెలంగాణా, రాయలసీమ, సర్కారులు ఒకే భౌగోళిక ప్రాంతంగా ఉండేవి. శాతవాహనుల్లో గొప్పవీరుడైన గౌతమీపుత్ర శ్రీ శాతకర్ణి తూర్పు పడమర సముద్రాల మధ్యగల నేలనంతా, దక్షిణాన మైసూరు వరకూ, ఉత్తరాన మధ్యప్రదేశ్ వరకూ ఆంధ్రసామ్రాజ్యంలో కలిపివేశాడు. క్రీ. శ. మూడవ శతాబ్ది మొదటి భాగం తర్వాత ఆంధ్ర సామ్రాజ్యం తునకలుగా విడిపోయింది. వారి తర్వాత వచ్చిన ఇక్ష్వాకులు నేటి గుంటూరు, ప్రకాశం, కడప, కర్నూలు, నల్లగొండ, తూర్పు గోదావరి, వంటి జిల్లాల ప్రాంతాన్ని కృష్ణానది ముఖద్వారం రెండు వైపులా ఎల్లలుగా పాలించారు. కృష్ణానదికి దక్షిణాన ఉన్న, పూర్వాంధ్ర దేశాన్ని విష్ణుకుండినులు దాదాపు 150 ఏళ్లు పాలించారు. (5 - 7 శతాబ్దుల మధ్య) చాళుక్య రాజైన రెండవ పులకేశికాలంలో అఖిలాంధ్రదేశ ప్రాంతాలు చాళుక్యుల పాలన కిందికి వచ్చాయి. ఆ తర్వాత క్రీ. శ. 11వ శతాబ్దంలోని కాకతీయుల వరకూ ఆంధ్ర దేశం అనేక భౌగోళిక పరిస్థితులకు లోనై చాళుక్య చోళ వంశాల వివిధ రాజుల పాలనలో ఉంది. అందుకే దీన్ని మాండలిక యుగంగా గుర్తించడం జరిగింది. కాకతీయుల్లో ప్రఖ్యాతుడైన గణపతి దేవుడు ఆంధ్రదేశాన్ని మొత్తం స్వాధీనపరచుకొని ఉత్తరాన కళింగం వరకూ, దక్షిణాన చెంగల్పట్టు జిల్లాలోని కాంచీపురం వరకూ సామ్రాజ్యాన్ని విస్తరించాడు. రెడ్డి రాజుల యుగం (క్రీ. శ. 1323) లో పూర్వాంధ్రదేశం, తెలంగాణా ప్రాంతం సీమలు. ఆ తర్వాత విజయనగర రాజ్యారంభదశలో (11, వ.శ. చివర) ఆంధ్రదేశం మూడు భాగాలుగా చీలి, తెలంగాణా (రేచెర్లవంశం), రాయలసీమ (విజయనగర రాజులు) పూర్వాంధ్ర దేశం (రెడ్డిరాజులు) ప్రాంతాలుగా మారింది. విజయనగర రాజులు తూర్పు పడమర సముద్రాల నడుమ, ఉత్తర దక్షిణాల్లో తుంగభద్ర కన్యాకుమారి మధ్య గల విశాల ప్రాంతాన్ని పరిపాలించారు. నేటి ఆంధ్రప్రదేశ్ అవతరణ మధ్యకాలంలో గోల్కొండ సుల్తానులు, నిజాం, ఫ్రెంచ్, ఆంగ్లేయ పాలకులూ వివిధ భౌగోళిక దశల్లో ఆంధ్రదేశాన్ని పరిపాలించారు.

## చదవదగిన పుస్తకాలు


మల్లంపల్లి సోమశేఖర శర్మ - ఆంధ్రదేశ చరిత్ర సంగ్రహము (క్రీ.శ.1857 వరకూ)

కుందూరి ఈశ్వరదత్తు - ప్రాచీనాంధ్రభౌగోళిక స్వరూపం

బి. యస్. ఎల్. హనుమంతరావు - ఆంధ్రుల చరిత్ర (ప్రాచీన, మధ్య యుగాలు)

కంభంపాటి సత్యనారాయణ - ఆంధ్రుల చరిత్ర - సంస్కృతి (1, 2 భాగాలు)

ఆంధ్ర విజ్ఞాన సర్వస్వము - మొదటి సంపుటం

R. G. Bhandarkar - Early History of Deccan.

K. Gopalachari - Early History of Andhra Country.

తెలుగువాణి - ప్రపంచ తెలుగు మహాసభల ప్రత్యేక సంచిక.




BRAOU

## మాదిరి పరీక్షా ప్రశ్నలు

I. కింది ప్రశ్నలకు 30 పంక్తులకు మించని సమాధానాలు రాయండి.

1. ఆంధ్రదేశ చరిత్రపై భౌగోళిక శక్తుల ప్రభావాన్ని వివరించండి.
2. శాతవాహనుల నుండి కాకతీయుల వరకూ, ఆంధ్రదేశంలో మారుతూ వచ్చిన భౌగోళిక స్వరూపాన్ని వివరించండి.
3. ఆంధ్రదేశం ఆంగ్లేయుల పాలనలో ప్రవేశించినప్పటినుండీ, ఆంధ్రప్రదేశ్ అవతరణ వరకూ కలిగిన మార్పులు రాసి, 1956 లో ఆంధ్రప్రదేశ్ అవతరణ జరిగిన తీరును గూర్చి చర్చించండి.

II. కింది ప్రశ్నలకు 10 పంక్తులకు మించని సమాధానాలు రాయండి.

1. ఆంధ్రదేశపు నైసర్గిక స్వరూపాన్ని తెలపండి.
2. ఇక్ష్వాకుల కాలంలోని ఆంధ్రదేశం భౌగోళిక స్వరూపాన్ని తెలియచేయండి.
3. విజయనగర రాజులు ఆంధ్రదేశాన్ని ఐక్యపరచడానికి చేసిన కృషి వివరించండి.
4. 1956 తర్వాతి ఆంధ్రదేశ భౌగోళికాంశాలను చర్చించండి.

BRAOU

# భాగం – 7 ఆంధ్రప్రదేశ్‌లోని భాషలవ్యాప్తి

## విషయక్రమం

7.0 లక్ష్యాలు
7.1 పరిచయం
7.2 ఆంధ్రప్రదేశ్ ప్రధాన భాష – ఇతర భాషలు.
7.3. గిరిజన భాషలు
7.4 భాషా సంకీర్ణత
7.5 తెలుగు భాషా సాహిత్య సంస్కృతుల వ్యాప్తి
**అవగాహన ప్రశ్న**
7.6 సారాంశం
అవగాహన ప్రశ్నకు జవాబు
చదవదగిన పుస్తకాలు
మాదిరి పరీక్షా ప్రశ్నలు

## 7.0 లక్ష్యాలు

ఆంధ్రప్రదేశ్‌లోని భాషల సంకీర్ణతనూ, వ్యాప్తినీ, ప్రధాన భాషనూ ఈ భాగం చదివాక మీరు వివరించ గలుగుతారు.

BRAOU

## 7.1 పరిచయం

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రావతరణలో ఆంధ్రదేశమంతా ఒక భౌగోళిక ప్రాంతంగా ఏర్పడిందని మీరు ఆరవ భాగంలో తెలుసుకున్నారు. భాషా ప్రాతిపదిక మీద ఏర్పడిన ఒక భాషా ప్రయుక్త రాష్ట్రం ఆంధ్రప్రదేశ్. భాషా ప్రాతిపదిక అంటున్నామంటే, అత్యధిక సంఖ్యాకులు ఒకటి రెండు వేల సంవత్సరాలుగా ఒక భౌగోళిక ప్రాంతంలో మాట్లాడే ప్రధాన భాష యొక్క ప్రాతిపదిక మీద అని అర్థం. మొదటి ఖండంలో మీకు వివరించినట్లు భారతీయ సమాజ లక్షణమైన సంకీర్ణత ఆంధ్రప్రదేశ్ వంటి ప్రాంతీయ సమాజాలకు కూడా వర్తిస్తుంది. దీనికి ఒక కారణం ఆంధ్రప్రదేశ్ భౌగోళిక స్థితి కూడా.

భౌగోళికంగా భారతదేశంలో ఆంధ్రప్రదేశ్‌ది కీలక స్థానం. ఉత్తర దక్షిణ భారతాలకు ఆంధ్రప్రదేశ్ వారధి వంటిది. అందువల్లనే ఆంధ్రదేశం అంతర్భాగంగా గల దక్కను ప్రాంతం ఉత్తర దక్షిణ భారత భాషాసాహిత్య సంస్కృతులకు కూడలి కాగలిగింది. 965 కి. మీ. పొడవైన సముద్రతీరం. పశ్చిమకనుమలలో పుట్టి తూర్పు కనుమల్ని ఛేదించి కోస్తాప్రాంతం గుండా పోయిపోయి తూర్పు సముద్రంలో కలుస్తున్న నదులు వర్తక వాణిజ్యాల విషయంలోనేగాక సాంస్కృతిక పరిణామాలలో కూడా ముఖ్య పాత్ర నిర్వహిస్తున్నాయి. ఈ నదుల వెంబడి ఏర్పడిన రాకపోకలకు అనువైన మార్గాలు, కృష్ణా గోదావరివంటి నదీముఖద్వార ప్రాంతాల్లోని రేవుపట్టణాలు శాతవాహనుల కాలం నుండి వివిధ కాలాలలో వివిధజాతుల సంసర్గానికి, ప్రాచ్యదేశాల్లో వర్తకవాణిజ్యాలకు సంబంధించిన లావాదేవీలకు దోహదం చేశాయి. నౌకాయానంలో ఆంధ్రులు నైపుణ్యాన్ని సంపాదించడానికి, తద్వారా ప్రాచ్యదేశాల్లో ఆంధ్ర సంస్కృతి విస్తరించడానికి సుదీర్ఘమైన ఈ సముద్రతీర రేఖ దోహదం చేసింది.19, 20 శతాబ్దుల్లో బ్రిటిష్ వలసల్లో కార్మికులు అవసరమైనందువల్ల ఆర్థికమైన ఒత్తిడుల వల్ల, స్వాతంత్ర్యానంతరం ఉద్యోగ వర్గాల నియామకాలూ, బదిలీలవల్ల ఆంధ్ర తెలుగు భాషాసాహిత్య సంస్కృతులు రాష్ట్రేతర ప్రాంతాల్లో విదేశాల్లో కూడా వ్యాప్తి చెందాయి. భౌగోళిక కారణాలవల్లా, ఇతర చారిత్రక కారణాలవల్ల ఆంధ్రప్రదేశ్‌లో ప్రధాన భాష, అధికార భాష తెలుగు అయినప్పటికీ ఇతర భాషలు మాట్లాడే ప్రజలు

కూడా నివసిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ వెలుపల కూడా తెలుగు ప్రజలు మనదేశంలోనూ, విదేశాల్లోనూ దాదాపు కోటిమందికిపైగా నివసిస్తున్నారు. ఈ అంశాలను ఈ విభాగంలో పరిచయం చేస్తున్నాము.

## 7.2 ఆంధ్రప్రదేశ్ ప్రధానభాష – ఇతర భాషలు

1991 జనాభా లెక్కల ప్రకారం ఆంధ్రప్రదేశ్‌లో 66, 304, 854 మంది ప్రజలున్నారని ఆరో భాగంలో మీరు తెలుసుకున్నారు. ఈ లెక్కల ప్రకారం మన రాష్ట్రంలో వివిధ భాషలు మాట్లాడేవారి సంఖ్య అందుబాటులో లేదు కాబట్టి 1981 దామాషా లెక్కలను ఇక్కడ పొందుపరుస్తున్నాం. దీని ప్రకారం తెలుగు మాట్లాడే వారి సంఖ్య 45.26 మిలియన్లు, ఉర్దూ మాతృభాష వ్యవహర్తలు 4.16 మిలియన్లు. హిందీ భాషావ్యవహర్తలు 1.3 మిలియన్లు. మరాఠీ 0.43, ఒరియా 0.23 మిలియన్లు మాట్లాడే ప్రజలు మన రాష్ట్రంలో ఉన్నారు. ఇరుగు పొరుగు భాషలైన తమిళం 0.64, కన్నడం 0.48 మిలియన్ల భాషా వ్యవహర్తలున్నారు. సంఖ్యా బలంలో ఒక లక్షకు పైబడో, కొన్ని వేలల్లోనో, కొన్ని వందల్లోనో ఉండే ఇతర భారతీయ భాషా వ్యవహర్తలు మన రాష్ట్రంలో ఉన్నారు. ఈ భాషల్లో ముఖ్యమైనవి గిరిజన భాషలు.

పైన పేర్కొన్న భాషల్లో కొన్ని లిఖిత సాహిత్య భాషలు. మరికొన్ని గిరిజన భాసలు. భారతీయ భాషల్లో గిరిజనేతర భాషలన్నీ సాహిత్య భాషలే. వాటికి ప్రత్యేక లిపులున్నాయి. ఇంగ్లీషు విషయం ప్రత్యేకం. అంతర్జాతీయ భాషగా, యావత్ భారతదేశానికే హిందీతోబాటు అధికార భాషగా దానిస్థానం దానికుంది. విద్యావంతుల వ్యవహార భాషగా అది రాష్ట్రవ్యాప్తమయినది. 'ఉర్దూ – హిందీ' రాజధాని నగరంలో చాలమందికి మాతృభాష. తెలంగాణా ప్రాంతంలోని నగరాల్లో వారి సంఖ్య విలక్షణంగా కనిపిస్తుంది. ఉర్దూ, హిందీ పాఠశాలలు కూడ ఉన్నాయి. తక్కిన ఆంధ్ర ప్రాంతంలో ఆ భాషాభాషులు కేంద్రీకృతంగా ఉన్నారు. ఉత్తర భారత భాషలు మాట్లాడే వారంతా హిందీ ఉర్దూలో ప్రసంగించగలవారే. ముస్లిం పరిపాలన ఫలితంగా సమ్మిళిత సంస్కృతిలో భాగంగా ఇది పుట్టింది. రాష్ట్రంలో మూడో ప్రధాన భాష విశాఖపట్టణం, విజయనగరం జిల్లాల్లోని పట్టణాల్లోను శ్రీకాకుళం జిల్లా మొత్తం మీద సరిహద్దుల్లోనూ నివసించే ఒరియా భాష. దీనికి మరి ఇతర ప్రాంతాల్లో వ్యవహారంలేదు. కన్నడం, తమిళం, మరాఠీ భాషలు రాజధానిలోనేగాక సరిహద్దు జిల్లాల్లో కూడ వ్యవహారంలో ఉన్నాయి. అనంతపురం, కర్నూలు, మహబూబ్‌నగర్, రంగారెడ్డి జిల్లాల పశ్చిమ సరిహద్దుల్లో కన్నడం వాడుక ఎక్కువ. నెల్లూరు, చిత్తూరు జిల్లాల్లో తమిళ భాష ఎక్కువ. మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లాల్లో మరాఠీ వాడుక ఎక్కువ. భాషా ప్రయుక్త రాష్ట్ర విభజన జరిగినప్పుడు ఏయే భాషలవారు అత్యధిక సంఖ్యాకులయితే వారిని ఆ భాషారాష్ట్రంలో కలిపారు. విభజన అందరికీ ముఖ్యంగా తెలుగు వారికి సంతృప్తికరంగా జరగకపోయినా కొందరు తెలుగువాళ్లు ఇతర రాష్ట్రాల్లో నివసించవలసి వచ్చినా, కొందరు ఇతర సరిహద్దు భాషలవాళ్ళు మన రాష్ట్రంలో నివసించక తప్పలేదు. అధిక సంఖ్యాకుల భాష ఏదైనా సరిహద్దుల్లోని ప్రజలు ద్విభాషులుగా బహుభాషులుగా ఉండక తప్పదని, ఉంటున్నారని ఇంతకుముందు తెలుసుకున్నారు. చారిత్రక రాజకీయ కారణాలవల్ల ఈ పరిస్థితి తప్పదు. సరిహద్దులో స్వభాషా ప్రాంతాలులేని బెంగాలీలు, గుజరాతీ, మలయాళీలు, సింధీలు, పంజాబీలు వగైరాలు ఉద్యోగరీత్యా, వ్యాపారరీత్యా ఆంధ్రప్రదేశ్‌లో స్థిరపడ్డవాళ్ళు. హైదరాబాదు వంటి నగరాల్లో వీళ్ళు ఎక్కువ సంఖ్యలో నివసిస్తున్నారు. భారీపరిశ్రమల్లో కొంతమంది విదేశీయులు గూడా పనిచేస్తున్నారు. వీరి సంఖ్య దాదాపు 80 వేలు.

## 7.3 గిరిజన భాషలు

ఆంధ్రప్రదేశ్‌లో అనేక షెడ్యూల్ తెగలవారున్నారు. వారిలో చాలమంది పర్వత ప్రాంతాల్లోనూ కొందరు మైదానాల్లోనూ ఉన్నారు. కొన్ని తెగలవారు రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో నివసిస్తుంటే, మరికొన్ని తెగలవారు ఏజెన్సీ ప్రాంతాల్లో పాక్షిక రక్షిత ప్రాంతాల్లో (Partially excluded areas), మరికొందరు షెడ్యూల్డ్ ప్రాంతాల్లో ఉన్నారు. అందరు గిరిజనుల భాషలను గురించి, ఆచార వ్యవహారాలను గురించి పూర్తి వివరాలు నేటికీ తెలియవు. కొన్ని తెగల విషయం బాగా తెలుసు. రమారమి 11,596 చదరపు మైళ్ల వైశాల్యంగల షెడ్యూల్డ్, ఏజెన్సీ, రక్షిత ప్రాంతాల్లో అధిక సంఖ్యాక గిరిజనులు నివసిస్తున్నారు. ఈ ప్రాంతాలు ముఖ్యంగా తూర్పు కనుమలకు రెండు వైపులా ఉన్న పర్వతసీమలూ అన్యరాష్ట్రాల సరిహద్దుల వెంబడివున్న అరణ్యసీమలూ పశ్చిమ గోదావరి మెట్టప్రాంతాల నుంచి శ్రీకాకుళం ఉత్తర సరిహద్దుదాకాను, ఖమ్మం, వరంగల్, ఆదిలాబాదు జిల్లాల్లోను, మహబూబ్‌నగర్ జిల్లాలోని అచ్చంపేట తాలూకాలోను ఎక్కువ మంది నివసిస్తున్నారు. ఒరిస్సా, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర సరిహద్దుల్లో అనేకులు నివసిస్తున్నారు.



BRAOU

ఆదిలాబాద్ జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతాల్లో 'ఆంధ్, భిల్, గోండి, కొలామ్, ప్రధాన్, తోటి, జాతులవారు అధిక సంఖ్యాకులు నివాసముంటున్నారు. ఖమ్మం, వరంగల్ జిల్లాల్లోని ఏజెన్సీ ప్రాంతాలు 'కోయ'ల ప్రధాన నివాస భూమి. ఉభయ గోదావరిజిల్లాల మన్యప్రాంతాల్లో 'కొండరెడ్లు' ఉంటున్నారు. విశాఖపట్నం ఏజెన్సీ 'బగత, బొండో, దిదాయి, దూలియా, ఘోడియా, కోబడి, కోటియా, మూవియా, మావి, మాలకర్, మూకదొర, పరంగి, పెంగూ, రెడ్డిదొర, రొణ, వాల్మీకి, తెగలవారికి ఆటపట్టు. తూర్పు గోదావరి, విశాఖపట్నం జిల్లాల ఏజెన్సీల్లో 'ఓజులు' వ్యాపించి వున్నారు. విశాఖ, శ్రీకాకుళం ఏజెన్సీల్లో 'గదబ, కోడు, జాతంపు, కోదు, కొండదొర, మన్నెదొర' తెగలు అక్కడక్కడ చిన్న చిన్న గూడేల్లో ఉంటున్నారు. 'చెంచు'లు కర్నూలు జిల్లాలో కనిపిస్తారు. గుంటూరు, చిత్తూరు జిల్లాల్లో 'కట్టునాయకన్' తెగలవారున్నారు. 'ఏనాది, ఎరుకల' తెగలవారు కోస్తా, రాయలసీమ జిల్లా అంతటా వ్యాపించివున్నారు. కొన్ని తెగలకు మారు పేర్లున్నాయి. ఈ తెగలను గురించి తెలిసినంతలో క్లుప్తంగా ప్రస్తావిద్దాం.

'ఆంధ్' జాతివారిని గురించి అట్టే తెలియదు. వారి సంఖ్య కూడా 1500 కు మించదు. 'భిల్' తెగలవారిని 'భీల్' అనికూడ పిలుస్తారు. వీరు వందమందయినా లేరు. రాజస్థాన్‌లోని భిల్లులకూ వీరికీ పూర్వమయినా ఏ సంబంధమో ఉందో లేదో స్పష్టంగా తెలియదు. సంఖ్యాబలంలోనూ నాగరికతలోనూ పూర్వ వైభవంలోనూ గోండులు సుప్రసిద్ధులు. గోండిభాషను అనేకులు అధ్యయనం చేసారు. దేవనాగరి, మరాఠీ, రోమన్, తెలుగు లిపుల్లో వారి సాహిత్యం వెలువడింది. కొలామి' భాషలో గూడా ఎం.బి. ఎమెనో అనే అమెరికన్ భాషా శాస్త్రిజ్ఞుడు రోమన్ లిపిలో సాహిత్యం ప్రచురించాడు. వ్యాకరణం రాశాడు. పదివేల ప్రధాన్లను గురించి ఏరకమైన వివరాలూ తెలియవు. అలాగే వందల సంఖ్యలో ఉండే 'తోటి' తెగను గురించి ఎవరూ పట్టించుకున్నట్లు లేదు. గోండుల సంఖ్య 112303. కోయలసంఖ్య 158097. కోయభాషను కొందరు గోండి భాషా మాండలికమని పరిగణించారుగాని అది నిజానికి ప్రత్యేకమైన భాషే. రాష్ట్రంలోని గిరిజనులందరి లోనూ ప్రధాన భాష తెలుగు మాట్లాడే ప్రజలతో కోయల్లాగా కలసిపోయినవాళ్ళు లేరు. కోయభాషలో బైబిలు వెలయించిన క్రైస్తవ మిషనరీలు దాన్ని తెలుగు లిపిలో చాలాకాలం క్రితమే వెలయించారు. ఇప్పుడిప్పుడు తెలుగు లిపిలో గోండీ కోయ భాషల్లో తెలుగు అకాడమివారు వాచకాలు ప్రచురిస్తున్నారు. దాదాపు నలభైవేల జనాభా ఉన్న 'కొండ రెడ్ల'ను గురించి సరైన వివరాలు దొరకటంలేదు. 'బగత' తెగలవారిని 'బక్త, భగద, భగధ, బొగత' అనే పేర్లతో గిరిజన పరిశోధకులు వ్యవహరించారు. విశాఖపట్టణం జిల్లాలోని గోలుకొండను పరిపాలించిన రాజులవద్ద తాము సైనిక వృత్తిలో పనిచేశామని వారు చెప్పుకుంటారు. తాము చూపిన రణ 'భక్తి' వల్లనే తమకు 'భక్తు' అని పేరు వచ్చిందని వారు చెప్పే నిర్వచనం. పాతకాలపు జనాభా లెక్కల ప్రకారం వీరి సంఖ్య అర లక్షకు పైనే ఉందిగాని వీరికో ప్రత్యేక భాష ఉన్నట్లు తెలియదు. 'బొండో' తెగవారికి, 'రెమో' అనే మరోపేరున్నదంటారు. వీరిని పరిశోధకులు 'బాంద, బొండా, పొరజ'లని కూడా పేర్కొన్నారు. వీరికి ప్రత్యేక భాష ఉన్నట్లు స్పష్టంగా తెలియదు. 'దిదాయి, ధూలియా, ఘోడియా, కోబడి, కోటియా, మూలియా, మాలి, మాలకర్' తెగలున్నాయని మాత్రమే తెలుసుగాని మరే వివరాలు తెలియవు. దాదాపు పదివేల జనసంఖ్యగల 'మూక దొర'లను 'ముకదొర, మూగదొర, ముఖదొర'లని కూడ పరిశోధకులు ప్రస్తావించారు. వీరి భాషా విశేషతలు తెలియవు. 'పరంగి' తెగ సంగతి కూడా అటువంటిదే. వీరిని 'పొరాజ'లని కూడా పిలుస్తారు. 'పర్జి' ఒక ద్రావిడ భాష అని మీరు రెండో భాగంలో చదువుకున్నారు. 'పెంగూ' భాష ప్రత్యేకమయింది. దక్షిణ ద్రావిడ భాషల్లో అదొకటి. 'రెడ్డిదొర'లు మూడువేలకు పై చిలుకు మంది ఉన్నారుగాని వారికి ప్రత్యేక భాష ఉన్నట్లు లేదు. "రొణ' తెగలవారిని 'రణ' తెగ అని కూడా పిలుస్తారు. అత్యల్ప సంఖ్యాకులయిన (1961 లో 23 మంది) వీరిని గురించి వివరాలు లేవు. 'వాల్మీకి' తెగ వారు ఇరవైమూడు వేల మంది ఉన్నా వారి సంగతినీ ఎవరూ పట్టించుకోలేదు. 'ఓజు'లు దాదాపు ఇరవై అయిదువేల మంది. వీరిని 'కమ్మర, మెట్టుకంసాలి, మెట్టకంసాలి' అనే పేర్లతో పరిశోధకులు పేర్కొన్నారు. మైదానాల్లోని ప్రజలు వీరిని 'కొండ కమ్మరు' అని పిలుస్తారు. వారి వృత్తి కమ్మరం. వారి భాష ప్రత్యేకం కాదు. 'గదబ' భాష మధ్య ద్రావిడ భాషల్లో ఒకటని ఇంతకు ముందే తెలుసుకున్నారు. వారి సంఖ్య రమారమి ఇరవై రెండు వేలు. 'గౌడు'లు నాలుగువేల మంది దాకా ఉంటారు. వారి భాషా లక్షణాలు తెలియవు. 'జాత' తెగవారినే 'జాతాపు' అని, 'జాతపుర్ దొర'లనీ వ్యవహరిస్తారు. దాదాపు 63 వేలమంది జాతాపుల భాషను అధ్యయనం చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయి గాని స్పష్టమైన విశేషాలు ఇంకా తెలియవు. 'కోదు'లను పరిశీలకులు రకరకాల పేర్లతో పిలిచారు. 'కంధ, ఖోండ్, సామంత, కెయా, వారని. కుయీ మధ్య ద్రావిడ భాషల్లో ఒకటి. భిన్న ప్రాంతాల్లో ఈ తెగవారిని ఇంతకు ముందు పేర్కొన్నట్లు రకరకాల పేర్లతో

BRAOU

పిలుస్తుంటారని నమ్మిన పరిశోధకులున్నారు. నిర్దుష్ట పరిశీలన జరగలేదు. 'కొండ దొర' అనే 'కొండకాపు' అని కూడా వ్యవహరిస్తారు. వీరి జనాభా దాదాపు తొంభైవేలు. అయినా వీరి భాషా సంస్కృతుల వివరాలు తెలియవు. సుమారు 8,500 మంది 'మన్నె దొర'ల విషయమూ అంతే. అత్యల్ప సంఖ్యాకులయిన 'కట్టు నాయకన్లు' పేరును బట్టి తమిళ సంప్రదాయానికి చెందిన వాళ్ళని చెప్పవచ్చు. వారి భాషా విశేషాల మీద పరిశోధనలు జరగలేదు. 'చెంచులు దాదాపు 18 వేల మంది ఉన్నా వారి భాషా లక్షణాలను తెలుసుకోలేదు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 'ఏనాదులు / యానాదులు' 1961 లో రెండు లక్షల మందికి పైగా ఉన్నారని తెలిసింది. అలాగే 'ఎరుకల' తెగవారు లక్షా ముప్పై వేల మంది దాకా ఉన్నారు. యానాదులకు ప్రత్యేక భాష ఉన్నట్లు తెలియదుగాని ఎరుకల భాష వాస్తవంలో తమిళ భాషా మాండలికం.

'సొఅర, సవర' జాతివారు శ్రీకాకుళం ఉత్తర ప్రాంతంలో 47 వేల మంది ఉన్నారు. ఎక్కువమంది ఒరిస్సాలోనే జీవిస్తున్నారు. వారి భాషా సంస్కృతులను గురించి ఇంతకుముందే తెలుసుకున్నారు. ఈ తెగల విషయంలో కొన్ని విలక్షణతలున్నాయి. ఎరుకల వారిని తెలంగాణాలో షెడ్యూల్డ్ తెగగా గుర్తించటంలేదు. వాల్మీకులను ఏజన్సీ ప్రాంతంలో మాత్రమే షెడ్యూల్డ్ తెగగా గుర్తిస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా చెదురుమదురు గానూ, తెలంగాణా ప్రాంతంలో ఎక్కువ సంఖ్యలోనూ తండాలు తండాలుగా పర్యటించే సంచారజాతి వారు కొందరున్నారు. వారిని 'సుగాలీలు, సుకాలీలు, బంజారాలు' అని వేర్వేరు పేర్లతో పిలుస్తారుగాని వారంతా ఒకే తెగకు చెందిన వాళ్ళే. వాళ్ళ భాష రాజస్తానీ మాండలికం. ఇప్పుడిప్పుడు వరంగల్, నల్గొండ, మహబూబ్‌నగర్, రంగారెడ్డి జిల్లాల్లోనూ రాజధానీ నగరంలోనూ భూస్థితి సంపాదించిన లంబాడీలు ఏర్పడ్డారు. బ్రిటిష్‌వారి హయాంలో, నిజాం నవాబు కాలంలో యానా, ఎరుకల, చెంచు, సుగాలీ తెగలవారిని నేరస్త జాతులు (Criminal Tribes) గా పరిగణించారు. స్వతంత్ర భారతంలో ఈ అవమానం తొలగిపోయింది.

## 7.4 భాషా సంకీర్ణత

పై అంశాలను మీరు పరిశీలించినప్పుడు మీకు ఆంధ్రప్రదేశ్‌లోని భాషల వైవిధ్యమూ, భిన్నత్వమూ, సంకీర్ణతా అవగతమవుతాయి. ఈ భాషలన్నీ ఒకే భాషాకుటుంబానికి సంబంధించినవి కావనీ, ద్రావిడ ఆర్య, ఆస్ట్రో ఏషియాటిక్ కుటుంబాలకు చెందిన భాషలనీ పైపై పాటికి స్థూలంగానైనా గ్రహించగలిగి ఉంటారు. సాహిత్య భాషలను గురించి జరిగినంత పరిశోధన గిరిజన భాషల గురించి జరగకపోయినా, ఆంధ్రప్రదేశ్ సంస్కృతిని గిరిజన జాతులు, భాషలు కూడా సుసంపన్నం చేశాయని మనం గుర్తించక తప్పదు.

## 7.5 తెలుగు భాషా సాహిత్య సంస్కృతుల వ్యాప్తి

BRAOU

తరతరాలుగా తెలుగువారు తమ భాషాసాహిత్య సంస్కృతులకు సంబంధించిన ప్రత్యేకతను నిలబెట్టుకుంటూనే భారతీయ సంస్కృతి వికాసానికి పాటుపడ్డారు. ఇందుకు ఆంధ్రప్రదేశ్‌లోని తెలుగువారే కాక భారత దేశంలోని ఇతర రాష్ట్రాల్లోనూ, విదేశాల్లోనూ నివసిస్తున్న దాదాపు 10 మిలియన్లకు పైగా ఉన్న తెలుగు వారు కూడా దోహదం చేశారు. అన్య రాష్ట్రాల్లో నివసించే ఆంధ్రులను రాష్ట్రేతరాంధ్రులనీ, విదేశాల్లో స్థిరపడిన వారిని విదేశాంధ్రులనీ ఇరువురినీ కలిపి ప్రవాసాంధ్రులనీ అంటారు. ఈ ప్రవాసాంధ్రుల్లో అత్యధికులు ఇరుగుపొరుగు రాష్ట్రాల్లో ఉన్నారు. వీరుగాక కొన్ని వేలమంది క్రీ.శ. 6-7 శతాబ్దాల్లో ధుర్భిక్షం కారణంగా, మతకలహాల కారణంగా కళింగ ప్రాంతం నుంచి ఆగ్నేయాసియా దేశాలకు వలస వెళ్లినవాళ్లున్నారు. 19వ శతాబ్ది మధ్య కాలంలో దక్షిణాఫ్రికా, మలేషియా, బర్మా, మారిషస్, ఫిజి, శ్రీలంక వంటి దేశాలకు వెళ్లిన వాళ్లున్నారు. జాతీయ జీవనస్రవంతికి దూరమై విసిరిపారవేసినట్లుగా కాలం గడుపుతున్న తెలుగువారు తామున్న రాష్ట్రాల్లోనూ, విదేశాల్లోనూ భాషాభివృద్ధి సంఘాలను పెట్టుకోవటంద్వారా, పత్రికలను నడపటంద్వారా, తమ భాషను, సంస్కృతినీ పరిరక్షించుకోటానికి ప్రయత్నిస్తున్నారు.

అయితే భాషాధ్యయనానికి వసతులు లేకపోవడం. గ్రంథాలయాలు అందుబాటులో లేకపోవడం, యువతరం వారికి తెలుగుసంస్కృతిని గూర్చిన అవగాహన లేకపోవడం; ఆయారాష్ట్రాల్లో గాని, దేశాల్లోగాని ఉన్న తెలుగువారిని ఒక వేదికపైకి తెచ్చే ప్రయత్నం జరగక పోవడం మొదలైన కారణాలవల్ల ప్రవాసాంధ్రులు ఆంధ్ర సంస్కృతీ స్రవంతికి దూరమవుతున్నారు. ఈ లోపాన్ని గుర్తించిన ప్రవాసాంధ్రులు, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం

ఇటీవలికాలంలో కొన్ని చర్యలు తీసుకోవడం జరిగింది. 1975లో స్థాపితమైన 'అంతర్జాతీయ తెలుగుసంస్థ' తెలుగు దేశానికి, ప్రవాసాంధ్రులకు ఒక వారధిగాఉంది. ప్రవాసాంధ్రులకు ఆంధ్రభాషా సాహిత్య సంస్కృతులకు సంబంధించిన సమాచారాన్ని, పుస్తకాల్ని అందజేస్తున్న అది ఇటీవలే 'Directory of Telugu Associations outside Andhra Pradesh' అనే విలువైన సూచీ గ్రంథాన్ని ప్రకటించింది. 1975 ఏప్రిల్‌లో హైదరాబాద్ జరిగిన ప్రపంచ తెలుగు మహాసభలు; మలేషియా ఆంధ్రసంఘం సహకారంతో 1981 ఏప్రిల్‌లో కౌలాలంపూర్‌లో జరిగిన రెండవ ప్రపంచ తెలుగు మహాసభలు తెలుగువారిని ఒక వేదిక పైకి తెచ్చాయి. ఆ సందర్భంగా ప్రకటితమైన ప్రత్యేక సంచికలు తెలుగు సంస్కృతికి అద్దం పట్టాయి. ఆ సభల్లో జరిగిన చర్చలు, సమావేశాలు ప్రవాసాంధ్రులు ఎదుర్కొంటున్న సమస్యల్ని వెలికి తెచ్చాయి. ఇటీవల స్థాపితమైన 'తెలుగు విజ్ఞాన పీఠం' తెలుగు సంస్కృతీ వికాసానికి ఉద్దేశించబడిందే.

నేడు బ్రిటన్, కెనడా, అమెరికావంటి అభివృద్ధి చెందిన దేశాల్లో స్థిరపడిన తెలుగువారు శాస్త్రి సాంకేతిక వైజ్ఞానిక రంగాల్లో పురోగమించారు. కాని వారు, వారి సంతతి తెలుగు సంస్కృతికి దూరమవుతున్నారు. ఈ కారణం వల్లనే నేడు ప్రవాసాంధ్రుల్లో 'సాంకేతిక విజ్ఞానం, సంస్కృతుల బదిలీ' అనేది చర్చనీయాంశంగా ఉంది. 1965 జులై నెలలో అమెరికాలోని లాస్ ఏంజిల్స్‌లో జరిగిన ఐదవ 'తెలుగు అసోసియేషన్ ఆఫ్ నార్త్ అమెరికా' సభల్లో కూడా ఇది ప్రధాన చర్చనీయాంశమైంది. విదేశాల్లో తెలుగువారు తాముగడించిన సాంకేతిక పరిజ్ఞానాన్ని మాతృదేశానికి, బదిలీ చేయడానికి, దానికి బదులుగా తెలుగుదేశం నుండి తెలుగు సంస్కృతిని గ్రహించడానికి ఉవ్విళ్లూరుతున్నారు. ఈ వినిమయం తెలుగు జాతి ప్రగతికి, తెలుగు సంస్కృతీవికాసానికి దోహదం చేస్తుందని ఆశిద్దాం.

## అవగాహన ప్రశ్న

ఆంధ్రప్రదేశ్‌లోని భాషాసంకీర్ణతను పది వాక్యాల్లో వివరించండి.

BRAOU

## 7.6 సారాంశం

ఈ భాగంలో మీరు కింది ప్రధానాంశాలను తెలుసుకున్నారు.

- భాషాప్రాతిపదికమీద ఏర్పడిన భాషాప్రయుక్త రాష్ట్రం ఆంధ్రప్రదేశ్. ఆంధ్రప్రదేశ్ భౌగోళిక స్థితివల్లా, ఇతర చారిత్రక కారణాలవల్లా భిన్న భాషలు మాట్లాడే ప్రజలు రాష్ట్రంలో కన్పిస్తారు. అయితే ఒకటి రెండువేల సంవత్సరాలుగా అత్యధికులు ఈ భౌగోళిక ప్రాంతంలో మాట్లాడే భాష తెలుగు.
- ఇరుగు పొరుగు భాషలైన తమిళ, కన్నడ భాషలతోపాటు ఉర్దూ, హిందీ, మరాఠీ, ఒరియా భాషా వ్యవహర్తలు కూడా మన రాష్ట్రంలో తగు సంఖ్యలో ఉన్నారు. కొన్ని గిరిజన భాషలు మాట్లాడే ప్రజలు సైతం గిరిజన ప్రాంతాల్లో ఉన్నారు.

## అవగాహన ప్రశ్నకు జవాబు

ఆంధ్రప్రదేశ్‌లో తెలుగు భాష మాట్లాడే వారి సంఖ్య 45.26 మిలియన్లు. ఉర్దూభాష 4.16 మిలియన్లు. హిందీ 1.3 మిలియన్లు. మరాఠీ 0.43, ఒరియా 0.23 మిలియన్లు, ఇరుగు పొరుగు భాషలైన తమిళం మాట్లాడే వారి సంఖ్య 0.64 మిలియన్లు, కన్నడం 0.48, ఇవికాక కోయ, గోండి, సవర, బంజారా, లంబాడీ, సుగాలీ తెగల వంటి గిరిజన భాషలు మాట్లాడేవారి సంఖ్యకూడా అపరిమితంగా ఆంధ్రరాష్ట్రంలో ఉంది. వీటిలో కొన్ని సాహిత్య భాషలు, కొన్ని మౌఖిక భాషలు. దేశంలో భాషా సంకీర్ణత ఏర్పడిన కారణాలవల్లనే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కూడా పై భాషలవల్ల అనివార్యంగా భాషా సంకీర్ణత ఏర్పడి ఆంధ్రభాషా స్వరూపాన్ని పరిపుష్టం, చేసింది. ఈ పరిపుష్టికి ఇంగ్లీష్ వంటి విదేశ భాషలూ తమవంతు దోహదాన్ని చేస్తున్నాడు.

## చదవదగిన పుస్తకాలు

Census of India 1981.

## మాదిరి పరీక్షా ప్రశ్నలు

I. ఈ కింది వాటికి ముప్పై పంక్తుల్లో సమాధానం రాయండి.

1. ఆంధ్రప్రదేశ్‌లోని ప్రధాన భాష మాట్లాడేవారి సంఖ్యను తెలిపి, ఇతర సాహిత్య భాషల వివరాలను ఇవ్వండి.

2. ఆంధ్రప్రదేశ్‌లోని గిరిజన భాషలను గురించి వివరించండి.

II. ఈ కింది ప్రశ్నకు పది పంక్తుల్లో సమాధానం రాయండి.

1. తెలుగు భాషా సంస్కృతుల వ్యాప్తిని గురించి రాయండి.

BRAOU

# భాగం – 8 అధ్యయనానికి ఆధారాలు

## విషయక్రమం

8.0 లక్ష్యాలు
8.1 పరిచయం
8.2 వివిధ ఆధారాలు
8.2.1 పురాతత్వ ఆధారాలు
8.2.2 కైఫీయత్తులు
8.2.3 శాసనాలు
8.2.4 నాణాలు
8.2.5 శిల్ప, చిత్రలేఖన నిర్మాణాలు
8.2.6 సాహిత్య ఆధారాలు
8.2.7 కైఫీయత్తులు
8.2.8 విదేశీయుల రాతలు
8.2.9 భాషా పరిశోధనలు, గ్రంథాలు
అవగాహన ప్రశ్న
8.3. సారాంశం
అవగాహన ప్రశ్నకు జవాబు
చదవదగిన పుస్తకాలు
మాదిరి పరీక్షా ప్రశ్నలు

## 8.0 లక్ష్యాలు

ఈ భాగం చదివాక తెలుగు భాషా సాహిత్య సంస్కృతుల అధ్యయనానికి దోహదం చేసే వివిధ ఆధారాలను మీరు విశ్లేషించగలుగుతారు.

## 8.1 పరిచయం

భాషా చరిత్ర, సాహిత్య చరిత్ర, సంస్కృతీ చరిత్ర నిర్మించటానికి అవసరమైన విషయసామాగ్రినే మనం అధ్యయన ఆధారాలుగా పరిగణిస్తున్నాం. తెలుగు భాషా చరిత్రకు భాషలకు సంబంధించి జరిగిన పరిశోధనలు ఒక ముఖ్యమైన ఆధారమైతే మరొక ముఖ్యమైన ఆధారం భాషలో వెలువడిన పూర్వ శాసనాలూ, సాహిత్యమూ, శాస్త్రగ్రంథాలూ మొదలైనటువంటివి. సాహిత్య, సంస్కృతుల అధ్యయనానికి సాహిత్యగ్రంథాలు ఒక ఆధారమైతే, మరొక ఆధారం పురాతత్వ సామగ్రి, కెయిరనులు, శాసనాలు, నాణాలు, శిల్ప చిత్రలేఖన నిర్మాణాలు, కైఫీయతులు, విదేశీయుల రాతలు మొదలైనవి. ఒక భాషలో లభించే జానపద వాఙ్మయం కూడా భాషా సాహిత్య సంస్కృతుల అధ్యయనానికి ఎంతగానో సహకరిస్తుంది.

## 8.2.0 వివిధ ఆధారాలు

పరిచయంలో చెప్పినట్లు భాషా, సాహిత్య సంస్కృతుల చరిత్ర అధ్యయనానికి రకరకాల ఆధారాలున్నాయి. ఈ ఆధారాలన్నిటిలో ఒక ఏక సూత్రత ఉంటుంది. ఆ ఏకసూత్రతను నిర్ణయించే సామాజిక శక్తులు ఉంటాయి.



BRAOU

ఒక దేశ చరిత్ర, సంస్కృతులను రెండు దశలు - చరిత్ర పూర్వయుగం, చారిత్రక యుగంగా విభజించడం చరిత్రకారులందరు అంగీకరించిన అంశం. ఈ రెండు దశలనూ విభజించే ముఖ్యాంశం భాష, తద్వారా లభించే లిఖిత పూర్వక ఆధారాలు. చరిత్ర పూర్వ యుగంలోని సంస్కృతిని అధ్యయనం చేయడానికి లిఖిత పూర్వకమైన ఆధారాలు దొరకవు. వీటిని గూర్చి తెలుసుకొందాం.

### 8.2.1 పురాతత్త్వ ఆధారాలు

మత విషయకంగా కాని, చారిత్రకంగా కాని ఒకప్పుడు ప్రసిద్ధిపొంది ఇప్పుడు దిబ్బలయిపోయిన ప్రాచీన క్షేత్రాలను, నగరాలను తవ్వి, పరిశోధించి, అట్టి పరిశోధనలో బయలుపడిన పురాతన నిర్మాణ శిథిలాలనుబట్టి, వస్తు సామాగ్రినిబట్టి వాటి కాలాన్ని నిర్ణయించి ఆ కాలంనాటి జనుల సంస్కృతి విశేషాలను తెలుసుకోడానికి పురాతత్వ శాస్త్రజ్ఞులు ప్రయత్నిస్తున్నారు. పురాతన స్థల ఖనన పరిశోధనవల్ల బౌద్ధావశేషాలకు, జైనావశేషాలకు నెలవైన, చరిత్ర ప్రసిద్ధాలైన ప్రదేశాలెన్నో బయలుపడినాయి. వీటి మూలంగా బౌద్ధ జైన మతాల చరిత్ర తెలుసుకోడానికి వీలవుతున్నది. ఖనన పరిశోధనల్లో లభించిన స్థూప ప్రతిబింబాల సాయంతో కర్నల్ కాలిన్ మెకంజీ ముందెన్నడో శిథిలమై భూగర్భస్థమైన మహాచైత్య ఆకృతిని పునర్నిర్మింప కల్గినారు.

### 8.2.2 కెయిరనులు

కెయిరనులంటే పూర్వకాలపు సమాధులు. భూగర్భాన్ని తవ్వడంవల్ల ఇవి బయల్పడుతాయి. కెయిరనులు రాయలసీమలోను తెలంగాణా ప్రాంతంలోను ఎక్కువగా కనిపిస్తాయి. ఒక పెద్ద గుంతతీసి, అందులో రాతి పలకలతో చిన్నచిన్న ఇళ్ళలాగా నిర్మించి, దాంట్లో శవాన్ని ఉంచడం ప్రాచీన ఖనన పద్ధతి. మరణించినవాళ్ళ మత విశ్వాసాలకనుగుణంగా వస్తుసామాగ్రిని సమాధిలో ఉంచి దాన్ని మట్టితో పూడ్చివేస్తారు. సమాధిచుట్టూ వలయాకారంగా పెద్ద పెద్ద బండరాళ్ళను పేర్చుతారు. వీటిని చూచి ప్రజలు ఆశ్చర్యపడి వీటికి "రాక్షసగుళ్ళు" అని పేరు పెట్టినారు. బేగంపేట, మౌలాలి, రాయగిరి, మానుకోట, డోర్నకల్లు, మధిర మొదలైన ప్రాంతాల్లో కెయిరన్లు ఎన్నో కన్పించాయి. వాటిల్లో వివిధ పరిమాణాలున్న కుండలు కన్పించాయి. ఆ కుండలపై కొన్ని సంకేత చిహ్నాలున్నాయి. అలాంటి చిహ్నాలు మెహంజొదారోలోని ప్రాచీన నాణేలమీద కూడ కనపడుతున్నాయి. కెయిరన్లలో తూర్పున గొడ్డలి, పడమట మట్టిపాత్ర, ఉత్తరాన రాగిగిన్నె, దక్షిణాన కుండలు ఉంచేవారు. మౌలాలి కెయిరన్లలో అందమైన కత్తి దొరికింది. అందులోని మృత పురుషుడు వీరుడై ఉండవచ్చు. డోర్నకల్లు సమాధిలో కొడవలి దొరికింది. అతడు కృషీవలుడై ఉంటాడు.

రెండువేల సంవత్సరాలకు పూర్వము రాయలసీమ, తెలంగాణా ప్రాంతాల్లో నాగరకత తెలిసిన ప్రజలుండేవారని కెయిరన్లలనుబట్టి తెలుస్తుంది. అప్పటి మనుష్యులు అయిదున్నర, ఆరడుగుల పొడవుండేవారు. వాళ్ల స్థిరనివాసాలు ఏర్పరచుకొని వ్యవసాయం మొదలైన వృత్తులను అవలంబించినారు. వాళ్లలో నేర్పరులైన కమ్మరులు, కుమ్మరులు కూడ ఉండేవారు. వాళ్లు చక్కని పనిముట్లను చేసేవారు. ఆ కాలపు శిల్పులు పెద్ద పెద్ద బండరాళ్ళను మలిచే నేర్పు కలిగి ఉండేవారు. వారి వాస్తు పరిజ్ఞానం కూడ ఎన్నదగింది. వాళ్ళకు పునర్జన్మపై నమ్మకమున్నట్లు తోస్తుంది. ప్రాచీనాంధ్రుల సంస్కృతి, విశేషాలు గ్రహించడానికి ఈ కెయిరన్లు తోడ్పడతాయి.

### 8.2.3 శాసనాలు

పూర్వకాలంలో పుణ్యహేతువని భావించి పరిపాలకులు దానధర్మాదికాలను చేసేవారు. అలాంటి దానాలను శిలలమీద చెక్కించి, రాగి రేకులమీద రాయించి ప్రకటించేవారు. వాటిని శిలా శాసనాలు, తామ్ర శాసనాలు అని అంటారు. ఆంధ్ర దేశాన్ని మొదట పాలించిన శాతవాహనుల శాసనాలన్నీ ప్రాకృత భాషలోనే ఉన్నాయి. విష్ణుకుండినుల శాసనాలు సంస్కృతంలో ఉన్నాయి. రేనాటి చోళుల, తూర్పు చాళుక్యుల శాసనాలు తెలుగులో కన్పిస్తాయి. అమరావతీ స్తూపంలో కన్పించే శిలాశాసనాలనుబట్టి శాతవాహనుల కాలంలో తెలుగు దేశంలో వ్యాపించిన బౌద్ధధర్మ సంప్రదాయాలకు సంబంధించిన విషయాలు, కొంతవరకు ఆనాటి జనుల ఆచార వ్యవహారాలు తెలుస్తున్నాయి. దేవినాగనిక, గౌతమి బాలశ్రీ, రాణి వాసిష్ఠదేవి మొదలైన ఆంధ్ర మహిళా మణుల పేర్లు మనకు ఈ శాసనాల మూలంగా తెలుస్తున్నాయి. నాగార్జునకొండ శాసనాలనుబట్టి ప్రాచీనాంధ్ర స్త్రీలు గృహానికి, సంఘానికి కూడ అలంకారప్రాయలై పురుషులతో సమానమైన స్వేచ్ఛను అనుభవిస్తూ, స్వతంత్రంగా ధర్మకార్యాలు చేస్తూ కీర్తికెక్కినట్లు గ్రహించవచ్చు. ప్రాచీన పరిపాలన పద్ధతికి సంబంధించిన



BRAOU

విషయాలు తెలుసుకొనడానికి ఈ శాసనాలే మనకు ఆధారాలు. దానాలు, తూకాలు, భూమి కొలతలు, పొలిమేరలు, ఆయాలు మొదలైనవి శాసనాల మూలంగానే తెలుస్తాయి. ప్రాచీనాంధ్ర భాషా వాఙ్మయాల స్వరూపాలను, సంస్కృతి విశేషాలను నిర్ణయించటానికి శాసనాలే ప్రామాణికమైన ఆధారాలు.

ప్రాచీనాంధ్ర భాషా స్వరూపాన్ని చరిత్రను తెలుసుకోవడానికి శాసనాలు తప్ప వేరే ఆధారాలు లేవు. క్రీ.పూ. 200 నుండి క్రీ.శ. 1100 వరకు లభించిన 269 శిలా తామ్ర శాసనాలను బూదరాజు రాధాకృష్ణగారు పరిశీలించి ఈకాలపు భాషాచరిత్రను నిరూపించారు. వీటిలో 217 శిలా శాసనాలు 52 తామ్ర శాసనాలు ఉన్నాయి. లిపినిబట్టి, శాసనకర్తల గూర్చి అందించిన సమాచారాన్నిబట్టి, ఇవి ఏ కాలానివో నిర్ణయించడం జరిగింది. (చూ. ఆచార్య భద్రిరాజు కృష్ణమూర్తి గారి సంపాదకత్వాన వెలువడిన తెలుగుభాషా చరిత్ర, మూడవ ప్రకరణం - పుటలు 52-102) ఈ కాలానికే చెందిన అముద్రిత ప్రాచీన శాసనాలు ఇంకా రెండు, మూడు వందలదాకా ఉన్నాయని తెలుస్తున్నది. క్రీ.శ. 1100 నుండి క్రీ.శ. 1599 వరకు లభించిన తెలుగు శాసనాలు దాదాపు రెండువేలకు పైగా ఉన్నాయి. ఇవి ఆంధ్ర దేశంలోని పలుప్రాంతాలలో లభించినందువల్ల, వీటి ద్వారా భాషా స్వరూప పరిణామాన్నేకాక, ఆకాలపు మాండలికాలను కూడ తెలుసుకోడానికి ఉపయోగపడతాయి. డాక్టర్ ఎం.కందప్ప చెట్టిగారు ఈ అయిదు శతాబ్దాల కాలంలో వచ్చిన శాసనాల గూర్చి (క్రీ.శ. 1100-1599) పరిశోధించి భాషా పరిణామాన్ని సాకల్యంగా వివరించారు. (వివరాలకు చూ. ఆచార్య భద్రిరాజు కృష్ణమూర్తిగారి సంపాదకత్వాన వెలువడిన తెలుగు భాషా చరిత్రలోని 4, 5 ప్రకరణాలు, పుటలు 103-172). క్రీ.శ. 1600-1899 వరకూ వచ్చిన శాసనాలలో పరిశీలించదగిన రెండు వందల శాసనాలను మాత్రమే విశ్లేషించి ఆ కాలంలో వచ్చిన శాసన భాషా పరిణామాన్ని డాక్టర్ కె.కె. రంగనాథా చార్యులుగారు వివరించారు. (చూడండి. పై గ్రంథంలోనే, ప్రకరణం - 6, పుటలు 173-206).

తెలుగులో వచ్చిన శాసనాలను సేకరించి, పరిష్కరించి, పురావస్తు శాఖవారు ప్రచురించారు. తిరుమల-తిరుపతి దేవస్థానంవారు కూడ అనేక శాసనాలను ప్రచురించి భాషాసేవకు తోడ్పడ్డారు. శాసనాలు తెలుగు భాషా పరిణామాన్ని తెలుసుకోడానికి తోడ్పడే ముఖ్యమైన ఆధారాలని చెప్పుకోనక్కరలేదు కదా. అయితే ఇవి ఆనాటి సమాజంలోని భాషను సరిగ్గా ప్రతిబింబిస్తాయా? చెప్పలేము. గ్రాంథిక రూపాలు వ్యవహారిక రూపాలతో కలిసి మిశ్రమంగా శాసనాల్లో కన్పిస్తాయి. అంతేగాక, శాసనాల్లో ప్రయోగించిన భాష ప్రత్యేకించి రాజకీయ కార్య కలాపాలకి చెందింది కనుక దాని స్వరూపం, ప్రయోజనం పరిమితమై ఉంటాయి. నిత్య వ్యవహారాలకు సంబంధించిన అంశాలు శాసనాల్లో ఉంటాయి కనుక వ్యవహారిక భాషా పదాలే వీటిలో మొత్తంమీద ఎక్కువగా కన్పిస్తాయి.

కావ్యభాషా పరిణామాన్ని గురించికూడా కొంతవరకు మనం శాసనాల మూలంగానే తెలుసుకోవచ్చు. ఇది ముఖ్యంగా నన్నయ్యకు పూర్వం ఉన్న కాలానికి వర్తిస్తుంది. నన్నయ్య ఆంధ్ర మహాభారత రచనకు పూనుకోక ముందే తెలుగులో కావ్యశైలి ఏర్పడింది. ఈ విషయం ప్రాఙ్నన్నయయుగంలోని కొన్ని తెలుగు శాసనాల వల్ల తెలుస్తుంది. క్రీ.శ. ఎనిమిదో శతాబ్దం వరకూ శాసనాలు గద్యశైలిలోనే ఉన్నాయి. తొమ్మిదో శతాబ్దంనుండి గద్య శాసనాలతోపాటు పద్యశాసనాలు కూడ లభిస్తున్నాయి. పద్య శాసనాలు ఎక్కువగా తూర్పు చాళుక్యరాజులకు చెందినవి. ఇందులో మొదటిది గుణగ విజయాదిత్యుని సేనాని పండరంగని అద్దంకి శాసనం (గుంటూరు జిల్లాలో ఉండి, ప్రస్తుతం ప్రకాశంజిల్లాలో ఉంది). ఆ తర్వాత యుద్ధమల్లుని బెజవాడ శాసనం - ఈ విధంగా కావ్యభాషా సంప్రదాయం ప్రారంభమైంది. కవిత్రయ యుగంలోనూ, ఆ తర్వాత కాలంలోని అనేకానేక కావ్యాలలోనూ కావ్యభాషా పరిణామ దశలను మనం గుర్తించవచ్చు. అర్థం చేసుకోవచ్చు.

#### 8.2.4 నాణాలు

ప్రాచీనాంధ్ర సంస్కృతి చరిత్ర నిర్మాణానికి నాణేలు కూడా కొంతవరకు ఉపకరిస్తాయి. ఇవికూడా పురావస్తు ఆధారాలే. పురాతత్వ శాఖ జరిపిన, జరుపుతున్న తవ్వకాల్లో గత వైభవాల అవశేషాలు ఎన్నో వెలుగులోకి వచ్చినాయి. తవ్వకాల్లో బయలుపడిన నాణేలనుబట్టి ఆయా రాజులపేర్లు, రాజముద్రికలు తెలుస్తాయి. నాణేల ఉనికినిబట్టి వాటిని వేయించిన రాజుల రాజ్య విస్తీర్ణం విదితమౌతుంది. శాతవాహనుల నాణేలమీద ఒకవైపు గుర్రం, ఏనుగు మొదలైన జంతువులూ, రెండు పడవల బొమ్మలూ ఉంటాయి. రెండోవైపున సంకలనపు గుర్తు కొమ్ములకు (+) చివరిభాగాల్ని అంటి నాల్గువైపుల నాల్గు సున్నలుంటాయి. నావ



BRAOU

చిహ్నమున్న నాణేలు శాతవాహనుల సముద్రాధిపత్యానికి, నౌకా వర్తక వ్యాపారాధిపత్యానికి నిదర్శనాలు. ప్రాచీనకాలపు నాణేల్లో బంగారపువి, వెండివి, రాగివి మాత్రమేకాక సీసపు నాణేలు, మిశ్రమలోహపు నాణేలుకూడ ఉండేవి. తూర్పు చాళుక్యుల నాణేల్లో వరాహముద్ర కన్పిస్తుంది. కాకతీయుల నాణేలనుబట్టి, విజయనగర రాజుల నాణేలనుబట్టి ఆయా కాలాలనాటి ప్రజల సంస్కృతి అవశేషాలు కొన్ని తెలుసుకోవచ్చు.

భాషా విషయంగా పరిశీలిస్తే ఇక్ష్వాకుల శాసనాలు ముఖ్యంగా ప్రాకృతభాషలు బ్రాహ్మీలిపిలో ఉన్నాయి. బ్రాహ్మీలిపి తెలుగు లిపికి మాతృక.

### 8.2.5 శిల్ప, చిత్రలేఖన నిర్మాణాలు

ప్రాచీనాంధ్ర సాంఘిక, సాంస్కృతిక జీవితాల్ని తెలుసుకోవడానికి శిల్ప-చిత్రలేఖన నిర్మాణాలు కొంత వరకు తోడ్పడుతున్నాయి. పూర్వపు రాజులు తమ దైవభక్తిని, కళాభినిరతిని శాశ్వతరూపంలో ప్రదర్శించడానికి అద్భుతమైన శిల్పఖండాలను సృష్టించినారు. శాతవాహనుల కాలంలోని స్తూపాలు, చైత్యాలు, విమానాలు, గుహలు మొదలైన శిల్పనిర్మాణాలన్నీ బౌద్ధమత ప్రేరితాలే. వీటిలోని శిల్పచాతుర్యం అసామాన్యం. అజంతా గుహల్లోని చిత్రలేఖనం మెచ్చదగింది. శాతవాహనుల కాలంనుంచి ఆంధ్రులు ఎలాంటి ఆభరణాలను ధరించేవారో, ఏ విధంగా వస్త్రధారణ చేసేవారో ఈ శిల్పాలు, చిత్రాలు నిరూపిస్తాయి. క్రీస్తుశకారంభంలో ఆంధ్ర స్త్రీలు మట్టిగాజుల్ని ధరించేవారు. చీర, రవిక ప్రధాన వస్త్రాలుగా ఉండేవి. రవిక కట్లు ముందువైపు ఉండేది. పైటవేసుకునే మర్యాద మహారాష్ట్ర స్త్రీలనుంచి ప్రాచీనాంధ్ర స్త్రీలకు అలవడిందని చెబుతారు. అజంతా, అమరావతి చిత్రాల్లో స్త్రీల నడుములకు ఒడ్డాణాలున్నాయి. బిళ్ళలతోకూడిన మెడసరాలను వారు ధరించేవారు. చెవిపోగులు చాలా పెద్దవిగా ఉండి భుజాలమీదికి వేలాడుతుండేవి. చేతులకు, మణికట్లకు బరువైన కంకణాలు, కాళ్ళకు బరువైన కడియాలు ఆనాటి స్త్రీలు ధరించేవారు. స్త్రీల ముఖంలో పచ్చబొట్టు కన్పిస్తుంది. జడలల్లుకొనిగాని, ముడులుగా చుట్టిగానీ పైన నగలు చెక్కుకొన్నట్లు కన్పిస్తారు. ఈ శిల్ప చిత్రాల్లో స్త్రీలు ఏ నిర్బంధమూ లేకుండా స్వేచ్ఛగా కలిసి తిరుగుతున్నట్లు కన్పిస్తారు. ఆ కాలపు స్త్రీలు స్వతంత్రులై, బహిరంగ జీవితానికి అలవాటుపడి ఉన్నట్లు చెప్పవచ్చు. అమరావతి, ఓరుగల్లు, విజయనగరం, లేపాక్షి, తాడిపత్రి మొదలైనచోట్ల వెలసిన శిల్పం, ఆంధ్రుల మహోన్నత సంస్కృతికి దర్పణంగా ఉంది. హంపి క్షేత్రంలోని అనేక దేవాలయ శిథిలాలనుబట్టి, మందిరావశేషాలనుబట్టి విజయనగర రాజుల కాలంనాటి శిల్పకళ, చిత్రలేఖనం ఎంతటి ఉచ్ఛస్థితిలో ఉండేవో గ్రహించవచ్చు. హంపి శిథిలాల్లో పురావస్తు శాఖవారు జరిపిన తవ్వకాల్లో అనేక కుడ్యచిత్రాలు దొరికినవి. ఇవి ఆంధ్రుల కళాతృష్ణకు తార్కాణాలు. ఇవి ఒకరకమైతే కొండపల్లి బొమ్మలలో, గ్రామదేవతల చెక్కడాలలో, ఇంటింటి ముంగిళ్ళలో, లోగిళ్ళలో, ద్వారబంధాలపైన, ఉత్సవ విగ్రహాలలో, లక్క పిడతలలో జానపదుల శిల్పకళాత్మకమైన సంస్కృతికి తార్కాణంగా, శిల్పకళా విలాసంలోని ప్రథమదశకు ఉదాహరణగా నేటికీ నిలిచి ఉంది.

### 8.2.6 సాహిత్య ఆధారాలు

మానవుని సాంస్కృతిక జీవనానికి వాఙ్మయమే గొప్ప ఉపనిషత్తు. సారస్వత రచనల ముఖ్యోద్దేశం భాషా విషయకమైనా, సంస్కృతి పరిశోధకులకు అవి ఉపయోగపడుతున్నాయి.

శాతవాహనుల కాలపు జానపద జీవితాన్ని తెలుసుకోవడానికి గాథాసప్తశతి ఉపయోగపడుతున్నది. గాథ సప్తశతి ఏడువందల శృంగార గాథలున్న ప్రాకృత కావ్యం. దీన్ని హాలచక్రవర్తి సంపుటీకరించినాడు. అందులో గ్రామీణుల కుటుంబ రహస్యాలెన్నో ఉన్నాయి. సమష్టి కుటుంబ పద్ధతి ఆనాడు అమలులో ఉండేది. స్త్రీ పురుషులు పొలాల్లో స్వేచ్ఛగా పనులు చేసుకునేవారు. పురుషులు పెద్ద పెద్ద తలపాగాలు ధరించేవాళ్లు. స్త్రీలకు కోకలంటే మక్కువ ఎక్కువ. ఆనాడు పెండ్లిండ్లు ఐదుదినాలు వేడుకగా జరిగేవి. వివాహానికిముందు వధువును పెండ్లికుమార్తెను చేసి, పెద్ద ముత్తయిదువలు మంగళాచార గీతాలు పాడేవారు. వ్యవసాయం ఆనాడు ప్రధాన వృత్తి. వరి, సెనగ, జనుము, చెరకు, పత్తి మొదలైనవి అప్పటి పంటలు. చెరకు గానుగలు, తైలయంత్రాలు, ఏతాములు ఉండేవి. దొంగతనం చేసినవారికి మరణదండన కూడ విధించేవారు. ఆంధ్ర చక్రవర్తుల ప్రాపకంలో వెలసిన గాథాసప్తశతిలో ఆంధ్రజీవితం, ఆచారాలు, వ్యవహారాలు చక్కగా ప్రతిఫలించాయి.

శాతవాహనకాలపు నాగరక జీవితాన్ని తెలుసుకోవడానికి వాత్స్యాయన కామసూత్రాలు తోడ్పడుతున్నాయి మంచినీటి సదుపాయమున్న చక్కని ఉద్యానవనం వేసుకోడానికి వీలైనచోట ఆ కాలపు ప్రజలు ఇండ్లు కట్టుకునే

BRAOU

వారు. ఇంట్లో అనువైన కుర్చీలు, బల్లలు, సుగంధ ద్రవ్యాలు, తాంబూలద్రవ్యాలు, పుస్తకాలు, ద్యూతఫలకాలు, పక్షులుండే పంజరాలు ఉండేవి. కోడిపందేలు, పొట్టేళ్ళ పోరాటాలు, విద్యాగోష్ఠులు, వేశ్యాభవన సమావేశాలు, మధుపానం, వనవిహారాలు, వెన్నెల జాగరాలు మొదలైనవి ఆనాటి ప్రజల వినోదాలు. నృత్య సంగీతాలు ఆనాటి స్త్రీల వినోదాలు. సమస్త సౌకర్యాలతో, సుఖస్వప్నంగా ఉండే ఇలాంటి నాగరక జీవిత విశేషాలను వాత్సాయన కామసూత్రాలనుబట్టి తెలుసుకోవచ్చు.

సురవరం ప్రతాపరెడ్డి (ఆంధ్రుల సాంఘిక చరిత్ర - పీఠిక పుట. 7) గారన్నట్లు తెలుగులోని కావ్య ప్రబంధాల్లో నూటికి తొంబదిపాళ్లు సాంఘిక చరిత్రకు పనికివచ్చేవి కావు. పురాణాలు, మధ్యకాలపు ప్రబంధాలు మొదలైనవి సంస్కృతి చరిత్రకు పనికివచ్చేవి కావు. తెలుగు కావ్యాలను బట్టి ఆంధ్రుల మత సంప్రదాయాన్ని చారిత్రకంగా సమీక్షించవచ్చు. నాగరకమతాలైన బౌద్ధం, జైనం, శైవం, వైష్ణవం మొదలైనవాటి సంప్రదాయాలను ప్రాచీనాంధ్ర కావ్యాలవల్ల తెలుసుకోవచ్చు. నన్నెచోడుని కాలంలో శిష్టమత సంప్రదాయాలతో పాటు చేతబళ్ళు, రసవిద్యలు మొదలైనవి ఉండేవి. ఆపత్కాలంలో నమ్మిన దేవుడికి ముడుపులుకట్టే ఆచారం ఆనాటికే ఉండేది. క్రీ.శ. 12వ శతాబ్దినాటి మత సాంస్కృతిక విశేషాలు కుమారసంభవం, బసవపురాణం, పండితారాధ్య చరిత్రలనుబట్టి గ్రహించవచ్చు. కాకతీయుల కాలంనాటి సంస్కృతి చరిత్రకు క్రీడాభిరామం అద్దంపడుతుంది. కాకతీయుల కాలంలో జైన, శైవ, వైష్ణవాలు పరస్పర ప్రాబల్యంకోసం పోరాడుతుండేవి. ఈ శిష్టమతాల దేవుళ్ళ కొట్లాటలమధ్య నలిగిన జానపదులు శిష్టదేవతలకంటె, క్షుద్రదేవతలే మేలనుకొన్నట్లున్నది. శిష్టమతానికి చెందినవారు ఎంత అశిష్టంగా ప్రవర్తించారన్న దాన్ని గురించి సురవరం ప్రతాపరెడ్డిగారు ఇలా అభిప్రాయ పడినారు. "శైవులు మతము పేర బసివిరాండ్రను జన్మ విడిచిరి. బసవని పేర స్త్రీలకు పెండ్లిచేయక వదలి, వారిని వ్యభిచారిణులుగా చేసిరి. వైష్ణవులు కూడా ముద్రలువేసి దేవదాసీలను సిద్ధముచేసిరి". (ఆంధ్రుల సాంఘిక చరిత్ర - పుట. 46).

కాకతీయుల కాలంలో 'ఏకవీర' ఒక జనప్రియదేవత. "కాకతమ్మకు సైదోడు ఏకవీర" అంటుంది క్రీడాభిరామం. ఈమె రేణుక అవతారం. మాహురము అనే గ్రామంలో ఉండడంవల్ల 'మాహురమ్మ' అనికూడా అంటారు. ఇపుడామెను 'ఎల్లమ్మ' అంటారు. కాకతీయుల కాలంలో పూజలు పొందుతున్న దేవతాగణంలో భైరవుడు, చండేశ్వరి, వీరభద్రుడు, ముసానమ్మ. కుమారస్వామి, పాండవులు గ్రామదేవతలైన కలని పోతులయ్య, గురిజాల గంగమ్మ మొదలైనవారు ఉన్నారు.

రెడ్డిరాజులనాటి గోగులమ్మ, నూకాంబ, ఘట్టాంబిక, మాశికాదేవి మొదలైన శైవశక్తుల పేరుతో ఉన్న దేవతల్ని శ్రీనాథుడు భీమేశ్వర పురాణంలో పేర్కొన్నాడు. మైలారు దేవుడు ప్రజలశక్తిగా ఆనాడున్నాడు. జానపదులు పూజిస్తుండిన దేవతాశక్తులు కొందరిని కొరవి గోపరాజు సింహాసన ద్వాత్రింశిక (పుట. 103) లో పేర్కొనడం జరిగింది. సింహాసన ద్వాత్రింశిక (పుట. [illegible]) లో "చంపుడుగుళ్ళ"ను గురించిన ఉల్లేఖనం ఉంది. రెడ్డిరాజుల కాలంలో వేషధారణ, ఆభరణాలంకరణ శ్రీనాథుని కావ్యాలవల్ల, చాటువులవల్లి చక్కగా వ్యక్తమౌతున్నాయి.

విజయనగర సామ్రాజ్య కాలంనాటి జనుల ఆచారవ్యవహారాలు, కళలు, మతం, మొదలైనవి కృష్ణదేవ రాయలు 'ఆముక్తమాల్యద', తాళ్ళపాక చిన్నన్న 'పరమయోగి విలాసం' మొదలైన కావ్యాల మూలంగా తెలుస్తు న్నాయి. ఉత్సవాలు, జాతరలు, తెనాలి రామకృష్ణుని 'పాండురంగ మహాత్మ్యము', 'ధూర్జటి కాళహస్తి మహాత్మ్యము' మొదలైన వాటిలో వర్ణించబడ్డాయి. సారంగు తమ్మయ్య 'వైజయంతీ విలాసము', కదరీపతి 'శుక సప్తతి', క్రీ.శ. 17వ శతాబ్దినాటి తెలుగు సంస్కృతి చరిత్రకు ఎక్కువగా ఉపయోగపడుతున్నాయి. తెలుగు శతకాలవల్ల, అయ్యలరాజు నారాయణామాత్యుని 'హంసవింశతి' వల్ల క్రీ.శ. 18, 19 శతాబ్దులనాటి సంస్కృతి చరిత్ర తెలుసుకోవచ్చు. మొత్తానికి ప్రాచీనాంధ్ర కావ్య ప్రబంధాల్లో నాగరిక సంస్కృతే ఎక్కువగా ప్రతిబింబించి ఉంది.

లిఖిత సాహిత్యమేకాకుండా, మౌఖికరూపంలోని సాహిత్యంకూడా భాషా సాహిత్య సంస్కృతుల అధ్యయనానికి ఎంతగానో దోహదం చేస్తుంది. జానపద విజ్ఞానంలో మొదటి విభాగం మౌఖికమయింది. శాబ్దిక కళారూపాలైన గేయాలు, కథాగేయాలు, కథలు, సామెతలు మొదలైనవి తెలుగు సంస్కృతిని ప్రచారంచేసే ఉత్తమ సాధనాలుగా భాష పుట్టిననాటినుంచీ ఉన్నాయి. నలుగు, తలంబ్రాలు, కాశీయాత్ర, వియ్యపురాలి ఎగతాళి



BRAOU
Dr. BRAOU LIBRARY Acc. No: CM-0437
Class No:

పట్టించడం, కుక్క మంగళాలు, బువ్వపు బంతి మొదలైన వివాహ సాంప్రదాయాలన్నీ పెండ్లిపాటల్లో వ్యక్తమౌతాయి. ఇవన్నీ తెలుగువారి సంస్కృతికి అద్దంపడతాయి. స్త్రీలకు సంబంధించిన చిట్టిబొట్టు నోము, కాటుక గౌరీ వ్రతం, నిత్య శృంగార నోము, పువ్వుల తాంబూలంనోము, పండు తాంబులం నోము, పదారుపళ్ళ నోము, పూర్ణాదివారాల నోము, సంపద శుక్రవారంనోము, శ్రావణ మంగళవారం నోము, శుక్రవార వ్రతం, సావిత్రి గౌరీ దేవినోము, నందికేశ్వర వ్రతం, తద్దెపండుగలు, మోచేతి పద్మం నోము, మొగదోసెళ్ళ వ్రతం, సావిత్రీ గౌరీ వ్రతం మొదలైనవాటికి సంబంధించిన జానపద గేయాలెన్నో ఉన్నాయి. తెలుగువారు ఆచరించే పండుగలు, వాటికి సంబంధించిన పాటలు వారి జీవనవిధానానికి దర్పణాలు. జానపద వాఙ్మయంలో స్పష్టంగా కనిపించే పండుగల్లో ముఖ్యమైంది అమ్మవారి జాతర. దీన్ని 'పరస' అని కూడా పిలుస్తారు. జానపదుల పరసవర్ణన ఇలా కనిపిస్తుంది; "పరసలో అన్ని చోట్లనుండీ జనులు 'పావనాలు', 'ముద్రగడలూ' పట్టుకొని వస్తారు. ఎక్కడ చూచినా 'పటలు పందిళ్ళు' వెలసి విరాజిల్లుతుంటవి. పోతురాజజుల ఆటోపం ఎక్కువగా కనిపిస్తుంది. జమిడికెల్ని వాయించే బవనాలు, కొర్రునెక్కి ఆడే కుమారవర్గం, తీనెలవారు, గావులవారు, బారు కటార్లవారు, పగ్గాలవారు, సిడెలెక్కువారు, 'సిగం' పూనినవారు, పుట్టుపాపలు, విచ్చలవిడిగా విజృంభిస్తుంటారు. కుతికరంపాలు, గుండెగాలాలు, నాలుకమడుపు కొర్రులు, నడినెత్తి కొర్రులు దాల్చిన వీరభక్తులు విహరిస్తుంటారు. భేరీ డమామీలు, బిరుదుమద్దెలలు, బూరగొమ్ములు, ఢక్కలు, తప్పెట్లు, సింగినాదాలు, చిరుతవీణెలు, గంటలు, కైపిడిగంటలు, అందెలు మొదలైన వాద్యాలు జోరుకొల్పుతూ, భీకర వాతావరణాన్ని కల్పిస్తుంటవి" (నాయని కృష్ణకుమారి జానపదగేయాలు, సాంఘిక చరిత్ర, పీఠిక, పుట. IXII). పేరంటాళ్ల ఉత్సవాల్లో కూడ బోనపు కావళ్ళు చెల్లించడం, ఏరేని కుండల్ని నిలిపి పూజించడం, చలిమిడి, పానకం మొదలైన 'పంద్యారా'లను చెల్లించడం కనిపిస్తుంది.

జానపద గేయాల్లో స్త్రీ మనస్తత్వ చిత్రణ జరిగినంత నిశితంగా ప్రాచీన నాగరక వాఙ్మయంలో లభించదనడం అతిశయోక్తి కాదు. స్త్రీ జీవన పరిణామ ఘట్టంలో రజస్వల కావడం, పెండ్లి, సీమంతం, బైకాలు, తొలి ప్రసవం, తర్వాత జరిగే బాలసారె మొదలైన ముఖ్యాంశాలన్నీ జానపద సంఘ జీవనచరిత్రలో ముఖ్యమైన స్థానాన్ని పొందినట్లుగా చెప్పవచ్చు. స్త్రీ విద్యకు కాని, సంఘంలో విద్యావతియైన స్త్రీకి ప్రత్యేకత కాని జానపద వాఙ్మయంలో ఉన్నట్లు తోచదు. గ్రామీణ వ్యావసాయక జీవితానికీ, వివిధ వృత్తులకూ జానపద వాఙ్మయంలో ప్రముఖమైన స్థానం ఉంది. వివిధ వ్యక్తులకు సంబంధించిన జానపద గేయాలు కూడా చాలా లభిస్తాయి. అనుభవ వైద్యం, జ్యోతిషం, వాస్తుశాస్త్రం, మంత్రతంత్రాలు మొదలైనవి గేయరూపంలో కనిపిస్తాయి. ఆంధ్ర స్త్రీ పురుషుల వేషభూషణాలంకారాదులను గూర్చి తెలుసుకోవడానికి జానపద గేయాల అధ్యయనం అవసరం.

జానపద గేయగాథల్లో ముఖ్యమయ్యే ఆచారాల్లో, నమ్మకాల్లో, శకునాల్లో, మత పరిణామ క్రమంలో ప్రాచీనతా వైభవం గోచరిస్తుంది. వైవాహికాచారాలు, వివిధ కులాల వివరాలు, శకునాలు మొదలైనవి జానపద గేయ కథల్లో వివరంగా తెలుస్తాయి.

జానపద పూర్వకథలవల్ల, ఐతిహ్యాలవల్ల తెలుగు సంస్కృతికి సంబంధించిన అసంఖ్యాక విషయాలు బయల్పడతాయి. వాటిని విశ్లేషించడం ద్వారా ఆయా సంస్కృతులకు చెందిన ప్రజల మనో విశ్లేషణ, సామాజిక వ్యవస్థ విశ్లేషణ సాధ్యమవుతాయి.

జానపదుల మనస్తత్వాన్ని అర్థం చేసుకోవాలంటే ఈ కథలవంటి మూలధనం మరొకటి లేదు. తెలుగులో జానపద కథలు వందలకొద్దీ, వేలకొద్దీ ఉన్నాయి. మానవ సంస్కృతిని అధ్యయనం చేయడానికి ఈ జానపద కథలు సహాయం చేస్తాయనడంలో సందేహం లేదు. తెలుగువారి సంస్కృతిని అర్థం చేసుకోవాలంటే భారత రామాయణాది శిష్ట కల్పనలకంటె కథలు, సామెతలు మొదలైనవే ఎక్కువగా పనికివస్తాయి.

తెలుగువారి సామెతల్లో జీవితంలోని అనేక విశేషాలు తొంగిచూస్తుంటాయి. గేయాల్లో, కథాగేయాల్లో, గద్యకథనాల్లో సంప్రదాయాలను, ఆచారాలను తెలిపే సామెతలు బోలెడన్ని కనిపిస్తాయి. సామెతలు సంస్కృతికి ప్రతిరూపాలు.

జానపదుల పొడుపుకథలు వినోదంకోసం ఏర్పడ్డవి. సాహిత్యపరమైన పొడుపుకథలు తాత్వికపరమైనవి, మత ప్రాధాన్యం కలవి. పాతకాలపు పొడుపుకథల పరిశీలనవల్ల ఆనాటి ప్రజలజీవితం, అనుభవాలు, ఆలోచనలు మొదలైనవి తెలుస్తాయి.



BRAOU

తెలుగువారి అచ్చమైన జానపద చిత్రకళ, ముఖ్యంగా కలంకారి మొదలైన దేశీయ కళలవల్ల వ్యక్తమవు తుంది. భారతీయుల సంస్కృతిలోని వివిధాంశాలను, జీవితంలోని అనేక ఘట్టాలను ప్రతిబింబించేవిగా ఉంటాయి. తెలుగువారి ముగ్గులు, పచ్చబొడుపు కూడా జానపద చిత్రకళలో ఒక భాగమే.

ఈ విధంగా తెలుగువారివి అని ప్రత్యేకంగా చెప్పదగిన కులవ్యవస్థ, వివాహ పద్ధతులు, మతం, నమ్మకాలు, కళలు మొదలైనవి ప్రాచీనాంధ్ర వాఙ్మయంలోకంటె, జానపద వాఙ్మయంలో ఎక్కువగా వర్ణితమైనాయని చెప్పవచ్చు.

### 8.2.7 కైఫీయతులు

తెలుగు సంస్కృతి అధ్యయనాధారాల్లో స్థానిక చరిత్రలను కూడ స్మరించవలసి ఉంటుంది. వీటికి 'కైఫీయతు'లని పేరు. పూర్వకాలంలో ప్రతి గ్రామ కరణం తన గ్రామం పుట్టు పూర్వోత్తరాలను, ప్రజల ఆస్తి పాస్తులను, పన్ను పర్యాయాలను వివరిస్తూ గుడికట్లు లెక్కలు రాసిపెట్టడం ఆచారంగా ఉండేది. వాటిలో గ్రామంలోని భూమిపై ఎవ్వరెవ్వరికి ఎలాంటి స్వామ్యపు హక్కులు ఉన్నాయో రాసిపెట్టేవారు. కాలక్రమంలో రాజకీయాల్లో కలిగిన మార్పులవల్ల, గ్రామజీవనంలో వచ్చిన మార్పులను అందులో సూచించేవారు. కాబట్టి జనానికి సంబంధించిన రాజకీయార్థిక సాంఘికాది విషయాలు ఈ కైఫీయతులలో కనిపిస్తాయి. జానపద సంస్కృతిని అధ్యయనం చేయాలనుకునే వాళ్ళకు కర్నల్ కాలిన్ మెకంజీ (1754-1821) సేకరణలు అమూల్య ద్రవ్యాలుగా ఉపయోగపడతాయి. మెకంజీ అనే కుంఫిణీ ఉద్యోగి క్రీ.శ. 18వ శతాబ్ది చివరి భాగం నుంచి కావలి వెంకట బొర్రయ్య మొదలైనవారి సాయంతో పురావస్తు పరిశోధనను, చారిత్రక పరిశోధనను చేపట్టినాడు. మద్రాసులో సర్వేయర్ జనరల్‌గా నియమించబడిన మెకంజీ గ్రామగామాలను గురించి సేకరించిన సమాచారం ఎంతో విలువైంది. మెకంజీ గ్రామ చరిత్రలకు నకళ్ళు రాయించినాడు. వీటికి మెకంజీ రికార్డులని పేరు. సి.పి. బ్రౌన్ వీటికి ప్రతులు రాయించినాడు. ఇవి ముఖ్యంగా విజయనగరయుగం నుంచి బ్రిటిష్ యుగం వరకు ఉన్న దేశచరిత్రను రాయడానికి ఎక్కువగా తోడ్పడుతున్నవి. ఈ గ్రామ కైఫీయతులే కాక థర్స్టన్ రాసిన "Castes and Tribes of South India" అనే గ్రంథం కూడా జానపద సంస్కృతి అధ్యయనానికి ఉపయోగపడుతున్నది.

### 8.2.8 విదేశీయులు రాతలు

చిరకాలంనుంచి భారతదేశానికి ఖండాంతర పూర్వపాశ్చాత్య దేశాలతో సంబంధముంది. మత ప్రచారార్థం కొందరు, పుణ్యతీర్థ దర్శనార్థం కొందరు, వ్యాపారంకోసం మరికొందరు, దేశాటనాపేక్షతో కొందరు దేశాంతరాలనుండి మనదేశానికి వస్తుండేవారు. అలా వచ్చినవారిలో చాలామంది భారతదేశంలో తాము కన్న, విన్న విషయాలను తమ పర్యటన గ్రంథాల్లో తెలిపినారు. ఆంధ్రదేశాన్ని సందర్శించిన విదేశీయుల రాతలనుబట్టి ఆంధ్ర సంస్కృతిని కొంత తెలుసుకోవచ్చు.

క్రీ.శ. 1వ శతాబ్దంలోని ప్లినీ రాసిన "నాచురల్ హిస్టరీ" అనే గ్రంథాన్నిబట్టి శాతవాహనుల కాలంనాటి వాణిజ్య వైభవాన్ని తెలుసుకోవచ్చు. యువాన్ చ్వాంగు తీరాంధ్రంలోని అనేక స్థలాలు సందర్శించి, అక్కడి మతాచారాదికాలను, ప్రజల స్థితిగతులను వర్ణించాడు. క్రీ.శ. 7వ శతాబ్దంనాటి ఆంధ్రదేశ పరిస్థితులు తెలుసుకోవడానికి అతని పర్యటన చరిత్ర కొంత తోడ్పడుతున్నది.

మార్కోపోలో అనే ఇటలీ దేశస్థుని రాతలనుబట్టి కాకతీయుల కాలంనాటి ఆంధ్రదేశ పరిస్థితి తెలుస్తున్నది. అబ్దుల్ రజాక్ రాసిన "మత్లఉస స ఆదీన్" బట్టి రెండవ దేవరాయల కాలంనాటి ఆంధ్రప్రజల జీవన విధానం తెలుస్తుంది. దురాతే బర్బోసా, న్యూనిజ్ పేయస్, నికోలోకాంటి మొదలైన విదేశీయుల రాతలవల్ల విజయనగర రాజుల కాలంనాటి దేశ చరిత్ర, సంస్కృతి చరిత్ర బోధపడుతుంది.

పై పరిశీలన ద్వారా తెలుగు జానపద నాగరిక సంస్కృతులను శాసనాలు, నాణేలు, శిల్పనిర్మాణాలు, కైఫీయతులు, వాఙ్మయం, స్థానిక చరిత్రలు, విదేశీయుల రాతలు మొదలైనవాటినిబట్టి అధ్యయనం చేయవచ్చు అని తెలుస్తుంది.

BRAOU

### 8.2.9 భాషా పరిశోధనలు, గ్రంథాలు

ఇక వెలువడిన పరిశోధనలు గూర్చి కొన్ని ప్రధాన గ్రంథాలగూర్చి తెలుసుకొందాం. ఇందులో కొన్ని ప్రామాణికమైన పరిశోధనలు కాగా, మరికొన్ని జరిగిన పరిశోధనలపై మూల ఆధారాల అధ్యయనంతో సాగిన రచనలు. నన్నయ రాశాడనే ఆంధ్రశబ్ద చింతామణి ; చిలుకూరి నారాయణరావుగారి ఆంధ్ర భాషా చరిత్రము (రెండు సంపుటాలు) – కోరాడ రామకృష్ణయ్యగారి 'దక్షిణదేశ భాషా సారస్వతములు', ఇతర వ్యాసాలు, జయంతి రామయ్యగారి ప్రాచీనాంధ్ర శాసన చతుష్కము, తెలికచెర్ల వెంకటరత్నంగారి 'వ్యాస సంగ్రహము', కొమర్రాజు లక్ష్మణరావుగారి 'ఆంధ్ర విజ్ఞాన సర్వస్వము'లోని వ్యాసాలు, 'లక్ష్మణరాయ వ్యాసావళి' ఆంధ్ర విజ్ఞాన సర్వస్వంలోనే పొందుపరచబడిన ఇతర భాషాంశాలు, వెంకట రామమూర్తి పంతులుగారి 'ఆంధ్ర పండిత భిషక్కుల భేషజం', 'బాలకవి శరణ్యం', 'వ్యాసావళి', ముఖ్యంగా ఆధునిక యుగంలో వ్యావహారిక భాషావాదాన్ని సమర్థించి, ప్రచారంచేయడానికి ఉపయుక్తమైన గ్రంథాలు. ఆచార్య దివాకర్ల వెంకటావధానిగారు, 'ప్రాజ్నన్నయ యుగం', పరవస్తు చిన్నయసూరిగారి 'బాలవ్యాకరణం', బహుజనపల్లి సీతారామాచార్యులుగారి 'ప్రౌఢవ్యాకరణం' కూడా భాషాధ్యయనానికి ఆధారాలు. ఆచార్య గంటిజోగి సోమయాజి 'ఆంధ్రభాషా వికాసం', ఆచార్య భద్రిరాజు కృష్ణమూర్తి భాషపై రచించిన అనేక వ్యాసాలు, గ్రంథాలు, అలాగే ఆచార్య చేకూరి రామారావు, డాక్టర్ బూదరాజు రాధాకృష్ణ, ఆచార్య జి.యన్. రెడ్డిగార్లు భాషా చరిత్ర రచనకు ఎంతో దోహదం చేశారు.

ఆంగ్లంలో రచించిన అనేక గ్రంథాలు మనకు ఎంతగానో ఉపకరిస్తాయి. రాబర్ట్ కాల్డ్‌వెల్ (ఇంగ్లీషులో) రాసిన 'ద్రావిడ భాషా తులనాత్మక వ్యాకరణం' శతాబ్దాలుగా భాషా విషయంలో తెలుగు విద్వాంసులకున్న దురభిప్రాయాలను కొంతవరకు తొలగించింది. 1816లో కాంబెల్, 1817లో బ్రౌన్ తెలుగుభాషకు నవీన పద్ధతుల్లో వ్యాకరణాలు రాసారు. బ్రౌన్, తెలుగు-ఇంగ్లీషు, ఇంగ్లీషు-తెలుగు నిఘంటువులు, మిశ్రభాషా నిఘంటువులు రాసి ఎనలేని సేవచేశాడు. ద్రావిడ భాషాశాస్త్రంపై టి. బరో, యం.బి. ఎమెనోలో వెలువరచిన వ్యాసాలు ద్రావిడభాషా నిఘంటువు (Dravidian Etymological Dictionary) వరుసగా గిడుగు, గురజాడలు రాసిన, ఆధునిక తెలుగుభాషపై సమర్పించిన 'మెమోరాండం', 'డిసెంట్ పత్రం', ఆచార్య భద్రిరాజు ఆచార్య చేకూరి రామారావు, ఆచార్య పి.ఎస్. సుబ్రహ్మణ్యం, ఆచార్య సహదేవ శాస్త్రి), డాక్టర్ బూదరాజు మొదలగు భాషా విద్వాంసులు ఆంగ్లంలో వెలువరించిన గ్రంథాలు, రచనలు, మనకు సత్వర పఠనీయాలు. వీరేకాక ఇటీవలి కాలంలో మరెందరో పరిశోధకులు భాషాచరిత్రపై అసంఖ్యాకమైన రచనలుచేస్తూ ఉన్నారు. కొన్ని అముద్రిత పరిశోధక వ్యాసాలుగా విశ్వ విద్యాలయాల గ్రంథాలయాల్లో ఉంటున్నాయి. వ్యాసాలు అప్పుడప్పుడూ 'భారతి' లాంటి సాహిత్య పత్రికల్లో ప్రచురితమౌతూ ఉన్నాయి.

BRAOU

### అవగాహన ప్రశ్న

భాషా సాహిత్య సంస్కృతుల చరిత్ర అధ్యయనానికి దోహదంచేసే వివిధ ఆధారాలను 30 వాక్యాల్లో వివరించండి.

## 8.3 సారాంశం

ఈ భాగంలో మీరీ ప్రధాన విషయాలను తెలుసుకున్నారు :

- భాషా సాహిత్య సంస్కృతుల చరిత్ర అధ్యయనానికి రకరకాల ఆధారాలున్నాయి. చరిత్ర పూర్వ యుగాన్ని, చారిత్రక యుగాన్ని పరిశీలించడానికి తోడ్పడే ఆధారాలు : 1. పురాతత్త్వ ఆధారాలు 2. కెయిరనులు 3. శాసనాలు 4. నాణాలు 5. శిల్ప చిత్రలేఖన నిర్మాణాలు 6. సాహిత్యాధారాలు – మౌఖిక సాహిత్యాధారాలు, లిఖిత సాహిత్యాధారాలు, 7. కైఫియత్తులు. 8. విదేశీయుల రాతలు 9. భాషా పరిశోధనలు, గ్రంథాలు.

### అవగాహన ప్రశ్నకు జవాబు

భాషా సంస్కృతుల చరిత్ర అధ్యయనానికి తొమ్మిది రకాల ఆధారాలు దోహదం చేస్తాయి. అవి : 1. పురాతత్త్వ ఆధారాలు 2. కెయిరనులు 3. శాసనాలు. 4. నాణాలు 5. శిల్ప, చిత్రలేఖన నిర్మాణాలు 6. సాహిత్యం 7. కైఫియత్‌లు 8. విదేశీయుల రాతలు 9. భాషా పరిశోధనలు, గ్రంథాలు. మత విషయకంగా, చారిత్రకంగా ఒకప్పుడు ప్రసిద్ధిపొంది, క్రమంగా కాలగర్భంలో కలిసిపోయి, ఇప్పటి తవ్వకాలవల్ల వెలికివచ్చిన కట్టడాలూ, ప్రాచీన క్షేత్రాలూ, నగరాలూ పురాతత్త్వ ఆధారాలు. వీటివల్లనే ప్రాచీన జైన బౌద్ధ కాలాల విశేషాలెన్నో తెలిసిరావడం మనదేశంలోని ఒక ఉదాహరణ. కెయిరనులంటే పూర్వకాలపు సమాధులు. రెండు వేల సంవత్సరాలకు పూర్వమే తెలంగాణా, రాయలసీమ ప్రాంతాల్లో నాగరకత చక్కగా తెలిసిన ప్రజలుండే వారని, మన రాష్ట్రంలోని బేగంపేట, మౌలాలి (హైదరాబాద్), రాయగిరి, మానుకోట, డోర్నకల్లు, మధిర, వంటి ప్రాంతాల్లో బయల్పడిన కెయిరన్లులోని వస్తువుల సంస్కృతీ విశేషాలనుబట్టి తెలుస్తున్నది. శాసనాల్లో, సంస్కృతీ విశేషాలతోపాటు భాషా, సాహిత్య చరిత్ర విశేషాలు కూడా వెల్లడౌతాయన్నది అందరికీ తెలిసిందే. మన రాష్ట్రంలో శాతవాహనుల శాసనాలు ప్రాకృత భాషలో, విష్ణుకుండినులవి సంస్కృతంలో, చాళుక్య-చోళ శాసనాలు తెలుగులో కనిపిస్తాయి. నాణాలవల్ల ఆయాకాలాల్లోని రాజుల పేర్లు, రాజముద్రికలు, దేశంలో సాగే వ్యవసాయ, వ్యవహార విశేషాలూ తెలుస్తాయి. ప్రాచీనాంధ్రుల సాంఘిక, సాంస్కృతిక, రాజకీయ జీవితాలు తెలుసుకోవడానికి శిల్ప, చిత్రలేఖన నిర్మాణాలు తోడ్పడతాయి. అమరావతి, ఓరుగల్లు, విజయనగరం, లేపాక్షి, శాతవాహనులనాటి స్తూపాలు, చైత్యాలు, గుహలవంటి అద్భుత నిర్మాణాలు ఇందుకు సాక్ష్యాలు. మానవుని సాంస్కృతిక జీవితాన్ని, భాషావాహిక ద్వారా వెలువరించే ఉత్తమ సాధనమే సాహిత్యం. కాబట్టి శాతవాహనులనాటి గాథాసప్తశతి నాటి నుండి, ఈనాటివరకూ ఉన్న, వివిధ ప్రక్రియలతో కూడిన సాహిత్యమంతా భాషా సాహిత్య సంస్కృతుల చరిత్ర అధ్యయనానికి తోడ్పతుంది. ఇందులో మౌఖిక సాహిత్యమూ పాలుపంచుకుంటుంది. స్థానిక చరిత్రలకు కైఫియత్‌లని పేరు. పూర్వకాలంలో గ్రామకరణాలు గ్రామాల పుట్టు పూర్వోత్తరాలు, ప్రజల ఆస్తిపాస్తులు, పన్ను వివరాలు, భూస్వామ్యహక్కుల వంటి విశేషాలను లిపిబద్ధంచేసిన కవిలెకట్టలు ఇవి. విదేశీయులరాతలవల్ల దేశ రాజకీయ, ఆర్థిక, సాంఘిక, సాంస్కృతిక పరిస్థితులు తెలుస్తాయి. భాషా పరిశోధనలు, భాషా చరిత్ర గ్రంథాలవల్ల భాష ఏఏ కాలాల్లో ఏఏ మార్పులను పొందిందో తెలుస్తుంది. ఈ విధంగా తొమ్మిది అంశాలనూ భాషా సాహిత్య సంస్కృతుల అధ్యయనానికి ఆధారాలుగా చెప్పవచ్చు.

BRAOU

### చదవదగిన పుస్తకాలు


| | |
|---|---|
| భద్రిరాజు కృష్ణమూర్తి | భాషావికాసం (వ్యాసం) – తెలుగువాణి – ప్రపంచ తెలుగు మహాసభల ప్రత్యేక సంచిక |
| ఆరుద్ర | సమగ్రాంధ్ర సాహిత్యం – మొదటి భాగం. |
| కుంభంపాటి సత్యనారాయణ | ఆంధ్రుల చరిత్ర – సంస్కృతి (రెండు భాగాలు) |
| బి.యస్.యల్. హనుమంతరావు | ఆంధ్రుల చరిత్ర |
| జి. నాగయ్య | తెలుగు సాహిత్య సమీక్ష (రెండు సంపుటాలు) |
| మల్లంపల్లి సోమశేఖర శర్మ | ఆంధ్రదేశ చరిత్ర సంగ్రహము |
| సురవరం ప్రతాపరెడ్డి | ఆంధ్రుల సాంఘిక చరిత్ర |

| | |
|---|---|
| ఏటుకూరి బలరామమూర్తి | ఆంధ్రుల సమగ్ర చరిత్ర |
| చిలుకూరి నారాయణరావు | ఆంధ్రుల చరిత్రము - పూర్వయుగము, మధ్యయుగము (రెండు సంపుటాలు) |
| G. Yazdani (ed) | The Early History of theDeccan 2 Vols. |
| N. Venkataramanayya | The Eastern Chalukyas of Vengi |
| Bhavaraju Venkata Krishna Rao | A History of the Early Dynaties of Andhra Desa |
| బూదరాజు రాధాకృష్ణ | ప్రాచీనాంధ్ర శాసనాలు |
| బి. రామరాజు, నాయని కృష్ణకుమారి (సం) | జానపదగేయాలు - సాంఘిక చరిత్ర |

## మాదిరి పరీక్షా ప్రశ్నలు

I. కింది ప్రశ్నలకు 30 పంక్తులలో సమాధానాలు రాయండి.

1. తెలుగుభాషా సాహిత్య సంస్కృతుల అధ్యయనానికి లభించే పురాతనాధారాలు ఏవి?
2. సాహిత్యాధారాలను ఉటంకించండి?

II. కిందివాటికి 10 పంక్తులకు మించకుండా జవాబులు రాయండి.

1. కెయిరనులు అంటే ఏమిటో వివరించండి.
2. శాసనాల ప్రాధాన్యాన్ని తెల్పండి.
3. శిల్ప, చిత్రలేఖన నిర్మాణాలను పేర్కొనండి
4. గాథాసప్తశతిని గురించి రాయండి.

BRAOU

# భాగం 9 దశల విభజన

## విషయ క్రమం


9.0 లక్ష్యాలు
9.1 పరిచయం
9.2 తెలుగు భాషా చరిత్ర – దశల విభజన
9.3 తెలుగు సాహిత్య చరిత్ర – దశల విభజన
9.4 తెలుగు సంస్కృతి చరిత్ర – దశల విభజన
9.5 పాఠ్యాంశంలో దశల విభజన
అవగాహన ప్రశ్న
9.6 సారాంశం
అవగాహన ప్రశ్నకు జవాబు
చదవదగిన పుస్తకాలు
మాదిరి పరీక్షా ప్రశ్నలు


## 9.0 లక్ష్యాలు

ఈ భాగం చదివాక తెలుగు భాషా సాహిత్య సంస్కృతుల చరిత్ర దశల విభజన ఆవశ్యకతను మీరు వివరించ గలుగుతారు.

## 9.1 పరిచయం

చరిత్రను అధ్యయనం చేయటానికి దశ విభజన ఎంతో ఉపకరిస్తుంది. విషయపరమైన కొన్ని ప్రత్యేక లక్షణాలను దృష్టిలో ఉంచుకుని, భాషా చరిత్రకారులు సాహిత్య చరిత్రకారులు, సంస్కృతికారులు సర్వ సాధారణంగా ఆయా చరిత్రలకు సంబంధించిన దశలను సూచిస్తూ ఉన్నారు. చరిత్ర గమనంలోని స్థూలమైన మార్పులకు కారణభూతమైన కాలస్థితిని దశగా గుర్తించటం ఒక రివాజు. తెలుగు భాషా సాహిత్య చరిత్రలను రాసిన చరిత్రకారులు చేసిన దశల విభజనలో ఏకాభిప్రాయం ఉందనలేం. వివిధ చరిత్రకారులు చేసిన దశల విభజనలన్నింటిని ఈ భాగంలో మేము పరిచయం చేయటం లేదు. ముఖ్యుల విభజనను పరిచయం చేసి ఆ తర్వాత ఈ భాగంలో పాటించిన దశల విభజనను పరిచయం చేస్తున్నాం. ఈ దశల విభజనవెనుక ఉన్న ఒకటి, రెండు హేతువులను కూడా మీ దృష్టికి తెస్తున్నాం.

BRAOU

## 9.2 తెలుగుభాషా చరిత్ర – దశల విభజన

ఆచార్య భద్రిరాజు కృష్ణమూర్తి తెలుగు భాషా చరిత్రను నాలుగు దశలుగా విభజించారు. అవి (1) క్రీ.పూ. 200 – క్రీ.శ. 500 (2) క్రీ.శ. 500-1100, (3) క్రీ.శ. 1100-1400, (4) క్రీ.శ. 1400-1900.

మొదటిదశలో, పైన చెప్పుకొన్నట్లుగా, ప్రాకృత, సంస్కృత శాసనాలలో ఊళ్ళ పేర్లు వ్యక్తుల పేర్లు కన్పిస్తాయి. క్రీ.శ. 6వ శతాబ్ది వరకు తెలుగులో కావ్య భాష ఉన్న నిదర్శనాలు దొరకలేదని భాషా శాస్త్రవేత్తలు అంటారు. ఆదికవి నన్నయ్యకు పూర్వం శాసనాలలోని భాష కావ్య లక్షణాలు కల్గిదైనా, అది పూర్తి వికాసాన్ని పొందింది రెండవ దశలోనే.

రెండవ దశలో (క్రీ.శ. 500-1100) భాషలో రెండు స్పష్టమైన ధోరణులు పొడసూపాయి. కవులకు, విద్వాంసులకు, పరిమితమైన కావ్యభాష, సామాన్య జనులు మాట్లాడుకొనే వాడుక భాష సమాజంలో ఉండేవి.

మూడవదశలో (క్రీ.శ. 1100-1400), కావ్యభాష ప్రామాణికమైంది. దీనిని సాహిత్యంలో వాడారు. కావ్యభాషలో మార్పులు రావడం తగ్గిపోయింది. అయితే ప్రజలు మాట్లాడుకొనే భాష మాత్రం మార్పులకు లోనవుతూనే ఉంది. ఈ రెంటి మధ్య ఎడం ఎక్కువవుతూ వచ్చింది. కావ్యభాష ప్రజావ్యవహారానికి దూరంగా

ఉండాలన్న నియమాలు మొదలయ్యాయి. అన్య భాషాపదాలు, ముఖ్యంగా అరబ్బీ, పారశీక భాషలలోని పదాలు తెలుగులో ప్రవేశించాయి.

నాల్గవ దశలో (క్రీ.శ. 1400-1900), వాడుకభాషకు కొద్దిగా ప్రాముఖ్యం పెరిగి, శాసనాలలో వాడారు. కావ్యసాహిత్యంలో కూడా వ్యవహార భాషా రూపాలు చోటుచేసుకొన్నాయి. ఈ దశలో (19వ శతాబ్దంలో) తయారైన స్థల చరిత్రలు, కైఫీయతులు ఆనాటి శిష్టుల వాడుకభాషలో మిశ్రశైలిలో ఉండేవి. 19వ శతాబ్దిలో తెలుగును అప్పటి ప్రభుత్వం నిత్య ప్రజా వ్యవహారాల్లో వాడింది. అన్ని యుగాల్లోనూ, సంస్కృత ప్రాకృత పదాలు, 12వ శతాబ్దినుండి అరబ్బీ, పారశీక పదాలు, 16వ శతాబ్దినుండి పోర్చుగీసు, ఆంగ్లపదాలు విరివిగా తెలుగు భాషలో ప్రవేశించాయి.

## 9.3 తెలుగు సాహిత్య చరిత్ర – దశల విభజన

సాహితీ చరిత్రను సక్రమంగా అధ్యయనం చేయడానికి దశల విభజన ఎంతో ఉపకరిస్తుంది. సాహిత్య చరిత్రకారులు అనేకులు అనేక విధాలుగా దశలు విభజన చేశారు. వీటిలో కొన్నిటిని పరిశీలిద్దాం. వీరేశలింగం పంతులుగారు తమ గ్రంథంలో కవుల్ని ప్రాచీన కవులు (క్రీ.శ. 1100-1500), మధ్యయుగపు కవులు (క్రీ.శ. 1500-1650), ఆధునిక కవులు (1650-1900) అని విభజించారు. గ్రంథాలనుబట్టి, సాహిత్య ప్రక్రియలను బట్టి గురజాడ శ్రీరామమూర్తి, వంగూరి సుబ్బారావు భారతకవులని, రామాయణ కవులని, ప్రబంధ కవులని, గేయ కవులని విభజించారు. కానీ, వీరు ముగ్గురూ కవుల చరిత్రలనే ప్రధానంగా రచించినందువల్ల, అవి సమగ్ర ఆంధ్రసాహిత్య చరిత్రలు కానేరవు. కవులు జీవించిన కాలాన్ని బట్టి, వీరేశలింగం పంతులుగారు చేసిన దశల విభజన కొంతవరకు సమంజసంగా తోస్తుంది.

యుగకర్తల పేరుమీద సాహిత్య చరిత్రను విభజించడం సమంజసంగా ఉంటుందని కొందరు సాహిత్య చరిత్రకారుల అభిప్రాయం. ఆయాకాలాల సమాజంలోని పరిస్థితులు, మార్పులు అదే కాలంలోని ఒక గొప్ప కవి రచనలలో ప్రతిఫలిస్తాయి. పైగా ఆ కవి మార్గదర్శకుడై అప్పటి సాహిత్యంలో వస్తున్న మార్పులకు కర్త అవుతాడు. సాహిత్యంలో కొత్త పుంతలు తొక్కిస్తాడు. ఆంధ్రసాహిత్యంలో నన్నయ, తిక్కన, ఎర్రన, శ్రీనాథుడు మొదలగువారిని యుగకర్తలుగా పరిగణించి, తదనుగుణంగా వేర్వేరు దశలుగా పింగళి లక్ష్మీకాంతం విభజించి ఉన్నారు. ఉదాహరణకు, వారు చేసిన విభజనలో ప్రాఙ్నన్నయ యుగమని (క్రీ.పూ. 200 క్రీ.శ. 1000), నన్నయ్య యుగమని, (12వ శతాబ్ది), శివ కవి యుగమని (12వ శతాబ్ది), తిక్కన (13వ శతాబ్ది), ఎర్రన (1300-1350), శ్రీనాథ (1350-1500), కృష్ణరాయ (1500-1600), దక్షిణాంధ్ర (1600-1775), క్షీణ (1775-1875), ఆధునిక (1875 తర్వాత) యుగాలుగా విభజించారు. కవి ఎంతటి మార్గదర్శకుడైనా ఆ కాలంలో గొప్ప కవిత్వం రాసినా, సాహితీ సృష్టి చేసినా, ఒక వ్యక్తిపై ఆధారపడి, ఆ కవి పేరుతో సాహిత్య చరిత్రను దశలుగా విభజించడం సరియైనది కాదేమో ననపిస్తుంది.

BRAOU

కావ్య ప్రక్రియల ఆధారంగా దశల విభజన చేసిన వారిలో దివాకర్ల వేంకటావధానిని పేర్కొనాలి. వారి 'ఆంధ్ర వాఙ్మయ చరిత్ర'లో కింది విధంగా విభజించారు.

1. ప్రాఙ్నన్నయ యుగము (లేక) అజ్ఞాతయుగము
2. పురాణ యుగము (లేక) భాషాంతరీకరణ యుగము
3. కావ్య యుగము
4. ప్రబంధ యుగము
5. గద్య గేయ, యక్షగాన యుగము (లేక) దక్షిణాంధ్ర యుగము
6. ఖండ కావ్య యుగము (లేక) భావ కవితా యుగము (లేక) ఆధునిక యుగము.

మొత్తం ఒక కాలాన్ని ఒకే ప్రక్రియ కింద వర్గీకరించడం సమంజసంగా తోచదు. అనేక కావ్య ప్రక్రియలు అదే కాలంలో, ఏదో ఒక రూపంలో ఉండవచ్చునన్న విషయాన్ని, మనం నేటికీ గమనిస్తూనే ఉన్నాం. విషయ (content) ప్రాధాన్యాన్ని కాక రూప (form) ప్రాధాన్యాన్ని గుర్తించటం సాహిత్యతత్త్వ విచారానికి తోడ్పడదు.

ఖండవల్లి లక్ష్మీరంజనంగారు కొంతవరకు కవుల ఆధారంగా కాలాన్ని దృష్టిలో ఉంచుకొని, కావ్య భేదాలపై ప్రాంతం, దేశం ఆధారంగా సాహిత్య చరిత్రలో దశలను విభజించారు. నన్నయ పూర్వయుగమనీ, నన్నయ తిక్కనల నడిమికాలం, తిక్కన యుగం, ఎఱ్ఱన యుగం, శ్రీనాథ యుగం, కృష్ణరాయ యుగం, అనంతర ప్రబంధ యుగం, తెలంగాణ కవులు, 17, 18 శతాబ్దపు కవులు, ఆంధ్ర కవయిత్రులు, చారిత్రక కావ్యాలు, యక్ష గానాలు, శతకాలు, గేయాలు అన్న వర్గీకరణ చేశారు.

'ఆరుద్ర' సమగ్రాంధ్ర సాహిత్యరచనకు పూనుకొని తెలుగు సాహిత్య చరిత్రను, రాజకీయ చరిత్రను విభజించి, విశ్లేషించే పద్ధతిలో రాజవంశాలను ప్రధానంగా ఆధారం చేసికొని యుగ విభజన చేశారు. ప్రతి యుగానికి కాల నిర్ణయంకూడా చేశారు. కేవలం రాజవంశాల పేర్లతో, అంటే ఒకానొక దశలో ఆంధ్రదేశాన్ని ప్రముఖంగా పరిపాలించిన ఒక వంశం పేరుతో యుగవిభజన చేయడంతో సరిపెట్టుకోకుండా, కాలాన్ని కూడా సూచించారు. కాబట్టి ఇది కొంత వరకు సమంజసంగా తోస్తుంది. పైగా, ఆంధ్రదేశం భౌగోళికంగా ఒక 'యూనిట్' కాబట్టి ఒకే కాలంలో అనేక శక్తివంతమైన చెప్పుకోదగ్గ రాజవంశాలు లేవు కాబట్టి ఆరుద్ర చేసిన దశల విభజన సరియైనదిగా కన్పిస్తుంది. భారతదేశం లాంటి విశాలమైన, వైవిధ్యంతో కూడిన దేశానికి ఇది వర్తించక పోవచ్చునేమో కానీ ఒకే భాషాసాహిత్య చరిత్రకు ఆరుద్ర అనుసరించిన పద్ధతి సరిపోవచ్చు. ఆరుద్ర విభజన కింది విధంగా ఉంది.

1. ఆదిమ – చాళుక్య యుగం (క్రీ.శ. 12వ శతాబ్ది చివరిదాకా)
2. కాకతీయ యుగం (క్రీ.శ 1200–1290)
3. పద్మనాయక యుగం (క్రీ.శ 1337–1399)
4. రెడ్డిరాజుల యుగం (క్రీ.శ. 1400–1450)
5. తొలిరాయల యుగం (క్రీ.శ. 1450–1500)
6. మలిరాయల యుగం (క్రీ.శ. 1500–1550)
7. నవాబుల యుగం (క్రీ.శ. 1550–1600)
8. నాయక రాజుల యుగం (క్రీ.శ. 1600–1670)
9. నాయక రాజుల యుగం (క్రీ.శ. 1670–1750)
10. కుంఫిణీ యుగం (క్రీ.శ. 1750–1850)
11. జమీందారీ యుగం (క్రీ.శ. 1850–1900)
12. ఆధునిక యుగం (క్రీ.శ. 1900–నుండి)

BRAOU

సాహిత్య చరిత్రను యుగ విభజన చేయడం లేదా దశలవారీగా విభజించినందువల్ల అధ్యయనం, బోధన సులువుగా ఉంటాయి. పైన పేర్కొన్న వివిధ రకాలైన విభజనలు యిదే ఉద్దేశంతో చేసినవే. వీటిని తాత్కాలికమే ననుకోవాలి. కొత్త విషయాలను కనుగొనడం, కొత్త పద్ధతులను గ్రహించడం ద్వారా, సాహితీవేత్తలు దీన్ని యింకా మరింత శాస్త్రీయంగా రూపొందించడానికి వీలవుతుంది. ప్రస్తుతానికి, వీటిలో ఏ విభజన ద్వారానైనా సాహిత్య చరిత్రను అధ్యయనం చేయడానికి వీలవుతుంది. ఎందుకంటే తెలుగు సాహిత్య చరిత్రలోని విషయ సంచయమంతా ఒకటే.

## 9.4 తెలుగు సంస్కృతి చరిత్ర – దశల విభజన

చరిత్ర విభజనలో పాటించిన విభజననే మన చరిత్ర-సంస్కృతి చరిత్రకారులు పాటించారు. ఇంకా వివరంగా తెలుసుకోవాలంటే తెలుగు చరిత్ర-సంస్కృతి (తెలుగు అకాడమి, 1986 ప్రచురణ) గ్రంథాన్ని చూడండి.

## 9.5 పాఠ్యాంశంలో దశల విభజన

ఈ పాఠ్యాంశంలో చేసిన దశల విభజన ఇది :

పూర్వ దశ I (క్రీ.పూ. 200–క్రీ.శ. 600 వరకు)

పూర్వ దశ II (క్రీ.శ. 600–1000 వరకు)

మధ్యకాలీన దశ I (క్రీ.శ. 1000–1600 వరకు)

మధ్యకాలీన దశ II (క్రీ.శ. 1600–1800 వరకు)

ఆధునిక దశ (క్రీ.శ. 1800 నుండి)

ఈ దశల వర్గీకరణను సూచించటానికి పాఠ్యాంశ నిర్మాతలు ప్రధానంగా ఈ కింది విషయాలను దృష్టిలో ఉంచుకున్నారు.

1. క్రీ.పూ. 200–600 మధ్యకాలంలో మనకు లభించే ఆధారాలు ప్రధానంగా పురాతత్వ ఆధారాలు, శాసనాలు మాత్రమే. ఈ శాసనాలు కూడా ప్రాకృత సంస్కృత శాసనాలు. తెలుగు ఉనికి శాసనాల వల్ల తెలిసినా దాని స్వరూపం తెలియని దశ ఇది. ఇటువంటి భాషా దశను మొదటిదశగా గుర్తించి భాషా సాహిత్య చరిత్రలను పొందుపరిచారు. వివిధ పాలకుల రాజకీయ చరిత్రతో పాటు సంస్కృతీ చరిత్రను కూడా పొందుపరచారు.

2. పూర్వ దశ II క్రీ.శ, 600–1000 వరకూ : ఇది మన చరిత్రలో కీలకమైన దశ. రాజకీయ చరిత్రకు, భాషా సాహిత్యాల చరిత్రకు, సంస్కృతీ చరిత్రకు మూలమైన తెలుగు శాసనాలు ఈ దశలోనే లభించటం వల్ల దీన్నొక ప్రత్యేక దశగా గుర్తించారు.

3. క్రీ.శ. 1000 నుంచి 1800 వరకూ మధ్య కాలీన దశగా గుర్తించి అందులో రెండు ఉపదశలను సూచించారు. తూర్పు చాళుక్యుల కాలం నుంచి ఈస్టిండియా కంపెనీ రాక వరకూ జరిగిన పరిణామాలను ఈ దశలో వివరించారు. సమాజంలోని పాలనావ్యవస్థలో కూడా సంభవించిన మార్పులను దృష్టిలో ఉంచుకుని ఈ విభజన చేశారు.

4. క్రీ.శ. 1800 నుండి మన సమాజంలో ఆధునిక యుగ లక్షణాల ప్రవేశం జరిగిందని గుర్తించటం వల్ల అప్పటి నుండి నేటిదాకా ఆధునిక దశగా గుర్తించాము.

పాఠ్యాంశ నిర్మాతలు సూచించిన ఈ విభజన కేవలం భాషా చరిత్రకూ సాహిత్య చరిత్రకూ, సంస్కృతీ చరిత్రకూ సమానంగా అన్వయించారు. దీని వల్ల ఈ మూడు రకాల చరిత్రల్లోని సాధారణ లక్షణాలను గుర్తించటమే కాకుండా సమాన ధర్మాలను గూడా గుర్తించగలిగిన అవకాశం ఉంటుంది. భాషకూ, చరిత్రకూ, సంస్కృతికీ గల పరస్పర సంబంధాన్ని గుర్తించటానికి వీలు కలుగుతుంది.

### అవగాహన ప్రశ్న

మీరు ఈ భాగంలో పరిచయం చేసుకున్న వివిధ దశల విభజనలో ఏది సహేతుకమో పది వాక్యాల్లో రాయండి.

BRAOU

## 9.6 సారాంశం

- విషయపరమైన ప్రత్యేక లక్షణాలను బట్టి చరిత్రకారులు సాధారణంగా దశల వర్గీకరణ చేస్తారు.
- తెలుగు భాషా సాహిత్య సంస్కృతుల చరిత్ర రచనలో చరిత్రకారులు భిన్నభిన్నమైన దశలను సూచించారు. వీటిని దృష్టిలో ఉంచుకుని మన సమాజ చరిత్రలోని లక్షణాలను గుర్తించి పాఠ్యాంశ నిర్మాతలు మరొక దశల విభజనను సూచించారు.

### అవగాహన ప్రశ్నకు జవాబు

తెలుగు భాషా చరిత్ర, సాహిత్య చరిత్ర, సంస్కృతి చరిత్రలకు సంబంధించి భాషా చరిత్రకారులు, సాహిత్య చరిత్రకారులు, సంస్కృతి అధ్యయన వేత్తలు వివిధ దశలను ప్రతిపాదించారు. భాషా చరిత్రలో మిగతా రెండు చరిత్రలకు సంబంధం ఉండటం వల్ల, తెలుగు జాతి, భాష, దేశం ఉనికిని తెలుపుతున్న క్రీ.పూ. 200–క్రీ.శ. 600 దశను మనం మొదటిదశగా గుర్తించవచ్చు. రెండోదశలో చారిత్రకాధారాలు శాసనాల వల్ల తెలుస్తున్నాయి కాబట్టి ఆ దశను క్రీ.శ. 600–1000 గా గుర్తించడం సహేతుకం. ఆ తర్వాత శాసనాలు, లిఖిత సాహిత్యం రెండింటి ద్వారా మన చరిత్ర తెలుస్తోంది. మన సామాజిక వ్యవస్థలో వచ్చిన మార్పులను పరిగణనలోనికి తీసుకొని క్రీ.పూ. 1000–1600 వరకు మధ్యకాలీన దశలోని ప్రథమ భాగంగా, క్రీ.శ. 1600–1800 వరకు మధ్యకాలీన దశ ద్వితీయ భాగంగా మనం గుర్తించవచ్చు. బ్రిటిష్ వలస పాలన మొదలైనప్పటినుంచి, అప్పటికి వచ్చిన సమాజంలోని మార్పులను కూడా దృష్టిలో ఉంచుకొని ఆధునిక దశ 1800 నాటికి మొదలైందిగా గుర్తించి తర్వాత కాలాన్ని ఆ దశలో చేర్చటం సహేతుకం. ఈ దృష్టిలో మనం పరిశీలించినప్పుడు మిగతా విభజనలకంటే, ఇప్పటి పాఠ్యాంశంలోని దశల విభజన చరిత్ర అధ్యయనానికి ఎక్కువ దోహదం చేస్తుందని గుర్తించగలం.

### చదవదగిన పుస్తకాలు

8వ భాగం కింద ఇచ్చినవి చూడండి.

### మాదిరి పరీక్షా ప్రశ్నలు

I. కింది ప్రశ్నకు 30 పంక్తులలో సమాధానం రాయండి.

తెలుగు సాహిత్య చరిత్ర దశల విభజనను గురించి రాయండి.

II. కింది ప్రశ్నకు 10 పంక్తులకు మించకుండా సమాధానం రాయండి.

పాఠ్యాంశంలోని దశల విభజనను పరిచయం చేయండి.

BRAOU

# ఖండం 3 తెలుగు భాషా చరిత్ర

ఆంధ్రజాతికి 2,500 ఏండ్లపైబడిన చరిత్ర ఉందని మీరు అయిదవ భాగంలో తెలుసుకున్నారు. అదే భాగంలో ఆంధ్రభాషకు పర్యాయ వాచకమైన తెలుగును గురించి కూడా తెలుసుకున్నారు. తెలుగు ఒక ద్రావిడ భాష అని కూడా మొదటి ఖండంలోనే గుర్తించారు. ఈ ఖండంలో లిఖితమైన ఆధారాలను దృష్టిలో ఉంచుకొని తెలుగుభాషా చరిత్రను మీకు పరిచయం చేస్తున్నాం. లిఖితమైన ఆధారాలు అంటే అవి ఇతర భాషలలో వెలువడిన ఆధారాలు కావచ్చు, పరిచయం చేసే భాషలో వెలువడిన ఆధారాలు కావచ్చు. అవి శిలాశాసనాలో, తామ్రశాసనాలో కావచ్చు, గ్రంథ రూపంలోని సాహిత్యమూ కావచ్చు.

మనం తెలుగు భాషా చరిత్రను పరిశీలించాలంటే క్రీ.పూ. 2వ శతాబ్దిదాకా వెళ్ళవలసి ఉంటుంది. నిజానికి క్రీ.పూ. 200–క్రీ.శ. 600 మధ్య తెలుగులో వెలువడినవి గ్రంథాలుకానీ ఏవీ మనకు లభ్యం కాలేదు. కాకపోతే సంస్కృత, ప్రాకృత శాసనాలు కొన్నింటిలోనూ, గాథాసప్తశతి వంటి ప్రాకృత గ్రంథాల్లో శాసనాలుకానీ కొన్ని తెలుగు మాటలు కనిపిస్తున్నాయి. క్రీ.శ. 600 నుండి 18 శతాబ్దిదాకా వేలాది తెలుగు శాసనాలు కన్పిస్తున్నాయి. 11వ శతాబ్దినుంచి గ్రంథ రూపంలోని రచనలు కన్పిస్తున్నాయి. శాసనాలు కానీ, గ్రంథాలు కానీ అవి లిఖిత రూపంలో లభించేవి. కేవలం మౌఖికంగానే తెలుగు పుట్టినప్పటినుంచీ ఈనాటి వరకూ ఉంటూ వస్తున్న మౌఖిక సాహిత్యంలోని భాషా చరిత్రను మనం పరిశీలించడం సులభం కాదు. పైగా ఆ రకం పరిశీలన మన పాఠ్యాంశ ప్రణాళికలోనిది కాదు. అందువల్ల లిఖితమైన ఆధారాలను మాత్రమే మన భాషా చరిత్రకు ప్రధానమైన ఆధారాలుగా మనం గ్రహిస్తున్నాం.

ఒక భాషకు కొన్ని ఇతర భాషలతో జన్యజనక సంబంధమో, సోదర సంబంధమో ఉంటుంది. అది భౌగోళిక, సామాజిక, సాంస్కృతిక కారణాల వల్ల చరిత్ర క్రమంలో మారుతూ ఉంటుంది కూడా. చరిత్ర గమనంలో మార్పు ఏరకంగా ఉంటుందో చరిత్రలో భాగమైన భాషలో కూడా మార్పు ఉంటుంది. తెలుగు భాషా చరిత్రను మనం పరిశీలిస్తే తెలుగుకు మూల ద్రావిడ భాషతో జన్యసంబంధం ఉందనీ, తమిళ, కన్నడ, మలయాళ భాషలలో సోదర సంబంధం ఉందనీ మనకు తెలుస్తుంది. తెలుగు ఒక ప్రత్యేక భాషగా రూపొందాక సంస్కృత ప్రాకృతాది ఇండో ఆర్య భాషల ప్రభావానికి కూడా గురి అయిందని మనం గుర్తించ గలుగుతాం. తెలుగు శాసన భాష సమకాలిక వాడుక భాషకు ఎక్కువ సన్నిహితంగా ఉంటూ వచ్చిందని, గ్రంథ భాష మొన్న మొన్నటి వరకూ మరొక సంప్రదాయంలో నడిచిందని మనం గుర్తించగలుగుతాం. తెలుగు భాషా చరిత్రలో జరిగిన ఈ సంకీర్ణ క్రియను ఈ ఖండం ద్వారా మీరు తెలుసుకోగలుగుతారు.

ఈ ఖండంలో 6 భాగాలున్నాయి. (ఖండ పాఠ్యాంశంలో వరుసగా పదినుంచి పదిహేను వరకు ఉన్నాయి). 10వ భాగం పూర్వ దశ (క్రీ.పూ. 200–600). సంస్కృత ప్రాకృత శాసనాల్లోని తెలుగు స్వరూపాన్ని వివరించే సందర్భంలో తెలుగు సంస్కృతం నుండి పుట్టినది కాదని అది ద్రావిడ భాషలకు చెందిన ఒక భాష అనీ ఈ భాగంలో నిరూపించాము. ద్రావిడ భాష సమాన లక్షణాలను తెలిపి అవి సంస్కృత భాషా లక్షణాల కంటే భిన్నమని చూపాము. మూల ద్రావిడ భాషలోని శాఖలను తెలిపి తెలుగు మధ్య ద్రావిడ భాషగా గుర్తించి క్రీ.శ. 600 వరకు తెలుగు భాషలో జరిగిన మార్పులను ఉదాహరణలతో వివరించాము. 11వ భాగం పూర్వదశ (క్రీ.శ. 600–1000 వరకు) తెలుగు శాసనాలు ఆధారంగా తెలుగు భాషా పరిణామాన్ని స్థూలంగా వివరించాము. 12వ భాగం మధ్య కాలీన దశ (క్రీ.శ. 1000–1600 వరకు). ఈ భాగంలో తెలుగులోని శాసన భాషా శైలి, కావ్యభాషా శైలి ఏ రకంగా రూపు దిద్దుకున్నాయో వివరించాము. 13వ భాగం మధ్యకాలీన దశ (క్రీ.శ. 1600–1800 వరకు) ఈ భాగంలో క్రీ.శ. 1600 నాటికి స్థిరపడిన ఆధునిక భాషా లక్షణాలను వింగడించి, వచన రచన వాడుక భాషకు సన్నిహితంగా ఎట్లా సాగిందో, కావ్య భాషా శైలిలో వాడుక భాషా రూపాలు ఏ విధంగా చోటు చేసుకున్నాయో, తెలుగు పదజాలంలో అన్యభాషా పదాలు ఏవేవి వచ్చి ఏ పరిస్థితులు చేరాయో తెలిపాము. 14వ భాగం ఆధునిక దశల్లో (క్రీ.శ. 1800 నుండి నేటి దాకా) ఈ భాగంలో క్రీ.శ. 1800 నుండి నేటిదాకా మన భాషారీతుల్లో జరిగిన వివిధ పరిణామాలను పరిచయం చేశాము. 15వ భాగంలో భాషలను నవీకరించటమంటే ఏమిటో వివరించి, తెలుగు భాషను నవీకరించవలసిన ఆవశ్యకతను తెలిపాము. ఆధునిక భావాలకూ భాషకూ ఉండే సంబంధాన్ని తెలిపి పరిభాషా సమస్యకు పరిష్కార మార్గాలను సూచించాము.

ఈ ఖండంలో భాషా చరిత్రే ఉన్నా, సాహిత్య సంస్కృతీ చరిత్రలతో భాషా పరిణామానికున్న సంబంధాన్ని మీరు గుర్తిస్తారు.

BRAOU

# భాగం 10 పూర్వ దశ I (క్రీ.పూ. 200–600)

విషయ క్రమం

10.0 లక్ష్యాలు
10.1 పరిచయం
10.2 ద్రావిడ భాషల సమాన లక్షణాలు
10.2.1 ప్రాథమిక పదజాలం
10.2.2 మూలద్రావిడ భాషలోని వర్ణాలు
10.2.3 ద్రావిడ భాషల్లోని ధాతువులు
10.2.4 ద్రావిడ భాషల్లోని లింగవిభజన
10.2.5 ద్రావిడ భాషల్లోని వచనం
10.2.6 ద్రావిడ భాషల్లోని సర్వనామాలు
10.2.7 ద్రావిడ భాషల్లోని సంఖ్యావాచకాలు
10.2.8 ద్రావిడ భాషల్లోని సమాసాలు
10.2.9 ద్రావిడ భాషల్లోని క్రియలు
10.2.10 ద్రావిడ భాషల్లోని వాక్యనిర్మాణం
అవగాహన ప్రశ్న – 1
10.3 సంస్కృతిపై ద్రావిడ భాషల ప్రభావం
10.4 మూల ద్రావిడభాష – దాని శాఖలు
10.4.1 తెలుగు మధ్య ద్రావిడ భాష
10.5 ప్రాక్తెలుగు దశ – పూర్తి అయిన ధ్వని పరిణామాలు
10.5.1 పూర్వయుగ భాషాలక్షణాలు
అవగాహన ప్రశ్న – 2
10.6 సారాంశం
అవగాహన ప్రశ్నలకు జవాబులు
చదవదగిన పుస్తకాలు
మాదిరి పరీక్షా ప్రశ్నలు

BRAOU

## 10.0 లక్ష్యాలు

ఈ భాగం చదివాక మీరు ఈ కింది అంశాలను వివరించగలుగుతారు.

- ద్రావిడ భాషల సమాన లక్షణాలు, మూలద్రావిడ భాష, దాని శాఖలు, ద్రావిడ భాషల్లో తెలుగు స్థానం.
- సంస్కృతంపై ద్రావిడ భాషల ప్రభావం
- పూర్వయుగ భాషా లక్షణాలు

## 10.1 పరిచయం

భాషల లక్షణాల మధ్య ఉండే పోలికలనూ, తేడాలనూ, అవి చరిత్ర క్రమంలో పొందిన మార్పులనూ ఆధారంగా చేసుకొని భాషా శాస్త్రవేత్తలు సోదర సంబంధం కలిగిన భాషా కుటుంబాలను గుర్తించారు. భారతదేశంలోని అటువంటి భాషా కుటుంబాలలో ద్రావిడ భాషా కుటుంబం ఒకటని మీరు 2.3.2 లో తెలుసుకున్నారు. ద్రావిడ భాషా కుటుంబంలోని ఒక శాఖ మధ్య ద్రావిడభాషా ఉపకుటుంబం నుండి విడివడే నాటికి ఏ రకమైన ధ్వని పరిణామాలు పూర్తి అయ్యాయో, క్రీ.పూ. 200–600 మధ్య సంస్కృత ప్రాకృత శాసనాల్లోని తెలుగు మాటలు ఆధారంగా ఏ విధమైన భాషా లక్షణాలు కన్పిస్తున్నాయో వాటిని ఈ భాగంలో వివరిస్తున్నాము.

అవసరమైన సందర్భాల్లో ఇచ్చిన ఉదాహరణలను జాగ్రత్తగా గమనిస్తూ, వాటిని ఆయా సందరాల్లో ఎందుకిచ్చారో పరిశీలిస్తూ చదవండి.

## 10.2 ద్రావిడ భాషల సమాన లక్షణాలు

నిన్న మొన్నటిదాకా భారతదేశంలోని భాషలన్నిటికీ సంస్కృతమే మూలమని చాలా మంది నమ్మేవారు, అలాగే తెలుగు సంస్కృత, ప్రాకృతాల నుండి వచ్చిందని నమ్ముతుండే వారు. "జనని సంస్కృతంబు సకల భాషలకును" అని తెలుగుకవులు చెప్పారు. గడచిన శతాబ్దం ప్రారంభకాలంనుంచి జరిగిన పరిశోధనలవల్ల తెలుగు ద్రావిడ భాషల్లో ఒకటని తేలింది. ద్రావిడభాషలలో స్థూలంగా కొన్ని సమానలక్షణాలు కనిపిస్తాయి. అవి హిందార్య భాషాలక్షణాల ముఖ్యంగా సంస్కృతభాషా లక్షణాలకంటె భిన్నంగా కనిపిస్తాయి. ఇవే ద్రావిడ భాషలను ఒక ప్రత్యేక కుటుంబానికి చెందినవిగా నిరూపించే లక్షణాలు.

### 10.2.1 ప్రాథమిక పదజాలం

1. ఏ భాషలోనైనా ప్రాథమిక పదజాలం అని చెప్పుకోదగ్గవి సర్వనామాలు, సంఖ్యావాచకాలు, బంధుత్వ వాచకాలు, కొన్ని సర్వసాధారణమైన క్రియాధాతువులు, అవయవవాచకాలు. ఇవి ద్రావిడ భాషలలో కొన్ని ధ్వని పరిణామాలలో స్థూలంలో ఒకే రకంగా కనిపిస్తాయి. ప్రధాన ద్రావిడ భాషల నుంచి ఇందుకు ఉదాహరణలివి :

| తమిళం | మలయాళం | కన్నడం | తెలుగు |
|---|---|---|---|
| అవన్ | అవన్ | అవను | వాడు |
| అదు | అదు | అదు | అది |
| నాన్ | ఞాన్, నాన్ | నాన్ | నేను |
| నీ | నీ | నీన్ | నీవు, నువ్వు |
| ఒరు | ఒరు | ఒర్ | ఒక |
| ఇరణ్డు, రెణ్డు | రణ్డు | ఎరడు | రెండు |
| మూన్డు | మూన్ను | మూఱు | మూడు |
| తంబి | తంపి, తంపాన్ | తమ్మ | తమ్ముడు |
| తందె | తంద | తందె | తండ్రి |
| తలై | తల | తలె | తల |
| కణ్ | కణ్ణు | కణ్ణు | కన్ను |
| కాల్ | కాలు | కాలు | కాలు |

### 10.2.2 మూలద్రావిడ భాషలోని వర్ణాలు

2. తెలుగు దేశ్య విభాగానికి చెందిన వర్ణాలన్నీ మూల ద్రావిడ భాషలోని వర్ణాల నుంచే వచ్చాయని చెప్పటానికి అవకాశాలున్నాయి. మూల ద్రావిడ భాషలో క, చ, ట, త్త (ఈ 'త' దంత మూలీయ తకారం) ప, ఞ, ణ, న, ను, ల, ళ, ర, య, వ, ఴ (ఴ ధ్వని చిహ్నం బండిరాలోని అడ్డుగీత లేనిది) అన్న పదాహారు హల్లులు, అ, ఆ, ఇ, ఈ, ఉ, ఊ, ఎ, ఏ, ఒ, ఓ, అన్న పది అచ్చులు ఉండేవని ద్రావిడ భాషా పరిశోధకులు నిరూపించారు. వీటి నుంచే చాలా ద్రావిడ భాషలలోని వర్ణాలు వచ్చాయి. చాలా భాషలలో కొత్త వర్ణాలు చేరాయి. ఉదాహరణకు తెలుగులో గజడదబ అనేవి కూడా భిన్న వర్ణాలయ్యాయి. *త్త మూల ద్రావిడ భాషలో దంత మూలీయ స్పర్శం. అది అద్విరుక్తంగా ఉన్నప్పుడు తెలుగుతో రేఫతో కలిసిపోయింది. దాన్నే శకటరేఫ (ఱ) అంటున్నాం. ఉదా : *యాత్ > ఏఱు. అది ద్విరుక్తంగా ఉన్నప్పుడు "ట" తో కలిసి పోయింది. ఉదా : యాత్తిల్ > ఏటిలో*. *ణ, *ళ అనే వర్ణాలు న, ల లతో కలిసి పోయింది. ఉదా : *కణ్ > కన్ను, *తేళ్ > తేలు. తెలుగులో 'స' మూల భాషలోని 'చ' నుంచి వచ్చింది. ఉదా : చాయ్‌న్ > సాను. మూర్ధన్య ఊష్మమైన ఴ ద్రావిడ భాషల ప్రత్యేకత. ఇది సాధారణంగా తెలుగులో అచ్చుల మధ్య 'డ' గా మారుతుంది. ఏఴ్ ఏడు పదాది సంయుక్తాక్షరాలలో 'ర' గా మారుతుంది. ఉదా : 'కిఴ్ > క్రింద. మూలద్రావిడంలోని చాలా అచ్చులు చాలా భాషలలో అలాగే ఉంటాయి. తెలుగుతో పాటు చాలా ద్రావిడ భాషలలో మహాప్రాణాలైన ఖ, ఛ, ఠ, థ, ఫ, ఘ, ఝ, ఢ, ధ, భ, ఌ, శ, ష, హ అనేవి సంస్కృత, ప్రాకృత పదజాలంతో పాటు ప్రవేశించాయి.



BRAOU

### 10.2.3 ద్రావిడ భాషలలోని ధాతువులు

ద్రావిడ భాషలలోని ధాతువులన్నీ మౌలికంగా ఒకే అచ్చు కలిగినవి (ఏకాచ్చులు) ఉదా : నిల్, వల్, వా మొదలైనవి.

సంస్కృతంలో ధాతువుకు ఉపసర్గలు చేర్చటం వల్ల అర్థాలు మారుతాయి. 'ప్రహార, ఆహార, సంహార, విహార, పరిహార' వంటివి దీనికి ఉదాహరణలు. ద్రావిడ భాషలలో ఉపసర్గలు లేవు. సంస్కృతంలో ప్రత్యయాలు ఎక్కువ. వాటిని విడిగా ఉపయోగించటానికి వీలులేదు. "సు, ఔ, జస్, అమ్, ఔట్, శస్ మొదలైన ప్రత్యయాలు ఇలాంటివే. ప్రకృతి, ప్రత్యయం కలిసి పోయి ఏది ప్రకృతో ఏది ప్రత్యయమో గుర్తించటానికి వీలుండదు. ఉదా : రామ – రామేణ. ద్రావిడ భాషలలో చాలా వరకు విడి పదాలే ప్రత్యయాలు చేసే పనిని నిర్వహిస్తాయి. ఉదాహరణకు తెలుగులో 'రాముని-చేత' మొదలైనవి.

### 10.2.4 ద్రావిడ భాషలలో లింగ విభజన

ద్రావిడ భాషలలో లింగ విభజన ప్రధానంగా అర్థాన్ని బట్టి ఉంటుంది. సంస్కృతంలో లింగ విభజన శబ్దాన్ని బట్టి, దాని అంతాన్ని బట్టి ఉంటుంది. సంస్కృతంలో దారా (భార్య) పుంలింగం. తెలుగులో అది స్త్రీ వాచకం. వృక్షః (చెట్టు) పుంలింగం. తెలుగులో అది అమహద్వాచకం. లతా (తీగ) శిలా (రాయి) సంస్కృతంలో స్త్రీలింగాలు. తెలుగులో అవి అమహద్వాచకాలు. మిత్రమ్ (మిత్రుడు) నపుంసక లింగం. తెలుగులో అది మహద్వాచకం. ద్రావిడ భాషలలో ప్రధానంగా రెండు రకాల లింగ విభజనే ఉంది. అది మహత్ – అమహద్ భేదం, లేక పురుష-అపురుష భేదం. ఈ విషయంలో కొన్ని ద్రావిడ భాషలలో కొన్ని రకాల మార్పులు కనిపిస్తాయి. తెలుగులో ఏకవచనంలో పురుష-అపురుష భేదమే ఉంది కాని బహువచనంలో మనుష్య-అమనుష్య భేదం కనిపిస్తుంది. ఉదా : ఏకవచనం, వాడు అంటే పురుషుడు. అది అనేమాట 'స్త్రీ తిర్యక్ జడ' వాచకాలను సూచిస్తుంది. దాని బహువచన రూపం వారు పురుష, స్త్రీ వాచకాలను సూచిస్తుంది. అవి అనే మాట తిర్యక్, జడ వాచకాలను సూచిస్తుంది.

### 10.2.5 ద్రావిడభాషలలో వచనం

సంస్కృతంలో ఏక-ద్వి బహువచనాలని మూడు వచనాలున్నాయి. ద్రావిడ భాషలలో రెండే వచనాలు. సంస్కృతంలో విభక్తులకూ, వచనాలకూ ప్రత్యేక ప్రత్యయాలున్నాయి. ఉదాహరణకు :

| | ఏక | ద్వి | బహు |
|---|---|---|---|
| ప్రథమ | సు | ఔ | జస్ |
| ద్వితీయ | అమ్ | ఔట్ | శస్ |
| తృతీయ | టా | భ్యామ్ | భిస్ |

BRAOU

ద్రావిడ భాషలలో ఒకే ప్రత్యయం ఏకవచనంలోను, బహువచనంలోను వస్తుంది. ఉదాహరణకు తెలుగులో ఏకవచనంలో 'చెట్టు-ను', బహువచనంలో 'చెట్ల-ను'.

### 10.2.6 ద్రావిడ భాషలలో సర్వనామాలు

ద్రావిడ భాషలలోని సర్వనామాలలో ఒక ప్రత్యేకత ఉంది. "మనము" వంటి ఉభయార్థక సర్వనామం ద్రావిడ భాషలలో ఉంది. సంస్కృతంలో లేదు. సంస్కృతంలో సంబంధార్థక సర్వనామమైన 'యత్' శబ్దం ఉంది. అటువంటిది ద్రావిడ భాషలలో లేదు.

### 10.2.7 ద్రావిడ భాషలలో సంఖ్యావాచకాలు

ద్రావిడ భాషలలో ఒకటి నుంచి పది దాకా, నూరుసంఖ్యా వాచక పదాలున్నాయి. వేయి సంఖ్యా వాచక పదం తెలుగులో మాత్రం కనిపిస్తుంది. పదకొండు నుంచి సంఖ్యా వాచక పదాలు ద్రావిడ భాషలలో పదులు, ఒకట్ల వరుసలో ఉంటాయి. సంస్కృతంలో ఒకట్లు, పదులు వరుసలలో ఉంటాయి. ఉదా : ఏకాదశ, ద్వాదశ, ద్వాత్రింశత్ మొదలైనవి.

### 10.2.8 ద్రావిడ భాషలలో సమాసాలు

సంస్కృతంలోలాగా సుదీర్ఘ సమాసాలు ద్రావిడ భాషలలో ఉండవు. సాధరణంగా రెండు మూడు పదాల కంటే మించి కలిసి ద్రావిడ భాషలలో సమాసాలేర్పడవు.

### 10.2.9 ద్రావిడ భాషలలో క్రియలు

ద్రావిడ భాషలలో మొదటినుంచీ సమాపక క్రియలలో రెండురకాల కాలాలకు సంబంధించిన క్రియలే ఉన్నాయి. అవి భూతకాలం, భూతేతర (భవిష్యద్వర్తమాన) కాలం. చారిత్రక క్రమంలో చాలా ద్రావిడ భాషలలో భూత, వర్తమాన, భవిష్యత్కాల క్రియలు ఏర్పడ్డాయి. సంస్కృతంలో 'లట్, లిట్' మొదలైన పదిరకాలతో కాలాల విస్తృతమైన ప్రణాళిక కనిపిస్తుంది.

ద్రావిడ భాషలలో వ్యతిరేకార్థక క్రియలు ఏర్పడే విధానం ప్రత్యేకంగా కనిపిస్తుంది. ధాతువుకూ, పురుష వాచక ప్రత్యయానికీ మధ్య వ్యతిరేకార్థక ప్రత్యయం చేరి సమాపక క్రియలలాగే వ్యతిరేక క్రియలేర్పడతాయి. ఉదా : చేయ్-అ-డు, పండ్-అ-దు మొదలైనవి. ఇటువంటి చోట్ల సంస్కృతం మొదలైన ఆర్య భాషలలో సాధారణ సమాపక క్రియలకు ముందు వ్యతిరేకార్థం ఇచ్చే శబ్దం చేరుతుంది. ఉదా : 'న గచ్ఛతి, న వదామి' మొదలైనవి.

### 10.2.10 ద్రావిడ భాషలలో వాక్య నిర్మాణం

ద్రావిడ భాషలలో వాక్య నిర్మాణం కర్త, కర్మ, క్రియ క్రమంలోని మతంగా ఉంటుంది. సంస్కృతంలో పద క్రమం నియతం కాదు. 'గచ్ఛత వనం రామః' రామః గచ్ఛత వనం' మొదలైన విధంగా ఏ క్రమంలోనైనా ఉండవచ్చు. ఆధునిక హింద్వార్య భాషలలో పదక్రమం నియతంగా కర్త, కర్మ, క్రియ క్రమంలోకి కనిపిస్తుంది. దీనికి కారణం ద్రావిడ భాషల ప్రభావం అని అంటారు.

'నా చేత ఇల్లు కట్టబడింది వంటి కర్మణ్యర్థక వాక్యాలు, "ఎవడు వచ్చాడో వాడు రాముడు" వంటి యత్తదర్థక (సంబంధార్థకత) వాక్యాలు ద్రావిడ భాషలలో ప్రచురంగా లేవు. సంస్కృత భాషా ప్రభావం వల్ల కావచ్చు, తెలుగు కావ్య భాషలో మాత్రం అవి ఎక్కువగా కనిపిస్తాయి.

## అవగాహన ప్రశ్న – 1

ద్రావిడ భాషలలోని లింగ విభజనను గూర్చి 10 వాక్యాల్లో వివరించండి.



BRAOU

## 10.3 సంస్కృతంపై ద్రావిడ భాషల ప్రభావం

సాధారణంగా భారతీయ భాషలపైన, అందులో భాగంగా తెలుగుపైగల సంస్కృత భాషా ప్రభావాన్ని గురించి ఎక్కువగా చాలామంది చర్చిస్తూ ఉంటారు. రాజకీయ, సాంస్కృతిక కారణాలవల్ల ఈ భాషలలో సంస్కృత భాషా పదజాలం ఎక్కువగా కనిపించటమే కారణం. కాని మొదట ఆర్యులు భారతదేశానికి వచ్చి స్థానికులైన ద్రావిడులతో సంబంధం ఏర్పరచుకున్నప్పుడు పరస్పర సంబంధాలవల్ల ద్రావిడ భాషాపదాలు చాలా వరకు ఋగ్వేద భాషాకాలం నుండి ఆర్య భాషలలో ప్రవేశించాయి. ఇది ముఖ్యంగా ఆర్యులకు తెలియని వృక్ష, ఫల జంతువాచక పదాలు అయి ఉండటం విశేషం. ఇంకా ఇతర పదాలు కూడా చాలా ఉన్నాయి. ద్రావిడ భాషలు చాలావాటిలో కన్పిస్తూ, సంస్కృతంలో వ్యుత్పత్తి లభించని పదాలను ద్రావిడ భాషా పదాలుగా భాషావేత్తలు గుర్తించారు. మొదట ద్రావిడ భాషలను తులనాత్మకంగా పరిశీలించిన రాబర్ట్‌కాల్డ్వెల్, కిట్టెల్, గుండెర్ట్, టి బరో, ఎమ్.బి. ఎమెనో మొదలైన వారు సుమారు ఏడువందలకు పైగా ఆర్యభాషలలో చేరిన ద్రావిడ భాషా పదాలను గుర్తించారు. "నీర, మీన, చందన, కుంతల, తామర, నగర, పట్టణ, పుష్ప, మయూర" మొదలైన సంస్కృత పదాలుగా భావిస్తున్నా పదాలెన్నిటికో ద్రావిడ వ్యుత్పత్తిని వారు చూపించారు. దీనిని బట్టి ఆర్యులు భారతదేశంలో ప్రవేశించే నాటికే ద్రావిడభాష ఎంత అభివృద్ధిచెంది జన వ్యవహారంలో ఉందో తెలుస్తుంది. క్రీ.శ. ఏడవ శతాబ్దానికి చెందిన కుమారిలభట్టు కూడా మ్లేచ్ఛ భాషా పదాల పేరుతో సంస్కృతంలోని ద్రావిడ భాషా పదాలను గుర్తించి తన 'మీమాంసా/తంత్రవార్తికం'లో పేర్కొన్నాడు. సంస్కృతంలో కనిపించే అనేక ఆర్య భాషేతర లక్షణాలకు ద్రావిడ భాషా ప్రభావమే కారణం. ఆధునిక హిందార్య భాషల పరిణామంపైన, ప్రస్తుతం ఆ భాషల నిర్మాణంపైన ద్రావిడ భాషల ప్రభావం ఎంతగానో కనిపిస్తుంది.

## 10.4.0 మూల ద్రావిడ భాష, దాని శాఖలు

ద్రావిడ భాషా కుటుంబం దక్షిణ ఆసియాలో విస్తృతంగా వ్యాపించి ఉన్న భాషా కుటుంబం. ప్రస్తుతం పాకిస్తాన్‌లో భాగమైన బెలూచిస్తాన్‌లో మాట్లాడే 'బ్రాహుయి', బీహార్ రాష్ట్ర సరిహద్దులలో కొన్ని జాతులలో వ్యవహారంలో ఉన్న 'కూరుఖ్, , మాల్తో', భాషలు మొదలుకొని దక్షిణ భారతం అంతా ద్రావిడ భాషలు వ్యాపించి ఉన్నాయి. క్రీ.పూ. 2000 ఏళ్ళనాటికే సింధు నదీలోయ ప్రాంతంలో వ్యాపించి ఉండిన నాగరికత ద్రావిడ నాగరికత అని, ఇప్పటికి సుమారు 5000 ఏళ్ళ కింద నాటికే ద్రావిడభాషకు మాతృక అయిన మూల ద్రావిడ భాష ఈ ప్రాంతం అంతా వ్యాపించి ఉండేదని చారిత్రకులు భావిస్తున్నారు. క్రీ.పూ. 2000 ఏళ్ళనాటికి మూల ద్రావిడ భాష మూడు శాఖలుగా చీలింది. అవి దక్షిణ, మధ్య, ఉత్తర ద్రావిడ భాషా శాఖలు. మధ్యద్రావిడశాఖ క్రీ.పూ. 1500 నాటికి మరి రెండు ఉపశాఖలుగా చీలింది. ఇందులో మొదటి శాఖ 'తెలుగు-కువి' ఉపకుటుంబం అని పేర్కొనవచ్చు. ఈ ఉపకుటుంబంలో "తెలుగు, గోండి, కువి, కొండ, పెంగో, మండ, కోయ" భాషలున్నాయి.

BRAOU

### 10.4.1 తెలుగు మధ్య ద్రావిడ భాష

క్రీ.పూ. 9-5 శతాబ్దాల మధ్యకాలం నాటికి తెలుగు తెలుగు-కువి ఉపకుటుంబం నుంచి చీలి ఒక ప్రత్యేక భాషగా అస్తిత్వాన్ని సంతరించుకుని ఉండాలి. దీనిని ఈ కింది ప్రమాణాలతో నిరూపించవచ్చు.

1. క్రీ.శ. మొదటి శతాబ్దానికి చెందినదిగా చెప్పున్న హాలుని ప్రాకృత గాథల సంకలనం 'గాథా సప్తశతి' లో, అత్తా, అమ్మ, పాడి (పడ్డ) పొట్టం (పొట్ట), కరణి (విధం) బొణ్డి (పంది), రుంప (రంపం) అద్దాయే (అద్దం), కుసుంబ (కుసుమ) మొదలైన తెలుగు పదాలు కనిపిస్తున్నాయి. ఇతర భాషల రచనలలోకి తెలుగు భాషా పదాలు ప్రవేశించాయి. అంటే ఆనాటికి కొన్ని శతాబ్దాల ముందు నుంచే తెలుగు జనవ్యవహారంలో స్థిరపడి ఉండాలి. క్రీ.శ. 12వ శతాబ్దానికి చెందిన ప్రాకృత వ్యాసకర్త హేమచంద్రుడు "దేశినామమాల"లో ప్రాకృతంలో కనిపించే 'అక్కా, అత్తా, ఊరో, కురులు, పసిండీ, మొగ్గర మొదలైన తెలుగు పదాల నెన్నిటినో దేశ్య పదాలుగా గుర్తించాడు.

2. క్రీ.పూ. 200 నుండి క్రీ.శ. 200 మధ్యకాలంలో నిర్మాణంలో ఉన్న అమరావతిలో స్తూప శాసనాలలో తెలుగు అమహదేకవచన ప్రత్యయంలో 'నాగబు' అన్న పదం కన్పిస్తుంది.

3. క్రీ.పూ. 200 నుండి క్రీ.శ. 600 వరకుగల ప్రాకృత, సంస్కృత శాసనాల్లో తెలుగు గ్రామనామాలూ, వ్యక్తినామాలూ కనిపిస్తాయి. దీనిని బట్టి ఆకాలంలో తెలుగుదేశంలో తెలుగు ప్రజాభాషగా ఉండేదని, అందువల్లనే దేశ్యమైన తెలుగు పదబంధాలతోనే గ్రామనామాలు, వ్యక్తినామాలు స్థిరపడ్డాయిని చెప్పవచ్చు.

## 10.5.0 ప్రాక్తెలుగు దశ – పూర్తి అయిన ధ్వని పరిణామాలు

తెలుగు భాషా చరిత్ర పూర్వయుగాన్ని "ప్రాక్తెలుగు – దశ" అని వ్యవహరించవచ్చు. ప్రాక్తెలుగు కాలానికి తెలుగు ప్రత్యేకభాషగా చీలటానికి, స్థిరపడటానికి కారణమైన అనేక ధ్వని విపరిణామాలు పూర్తి అయ్యాయి. ఆ పరిణామాలలో ముఖ్యమైనవి ఇవి:

1. పదంలో తరువాతి అచ్చు 'అ'కారం అవుతే అంతకుముందుండే 'ఇ, ఉ', అనేవి తెలుగు కన్నడ భాషలలో 'ఎ, ఒ'గా మారతాయి. ఇదే పరిసరంలో తమిళ, మలయాళాలలో 'ఎ, ఒ' అనేవి 'ఇ, ఉ' గా మారతాయి.

ఉదా : త. ఇరై, మ. ఇర, క. ఎరె, త. ముదల్, మ. ముదల్, క. ముదల్, తె. మొదలు.

2. మూలద్రావిడంలోని పదాది 'యా' తెలుగులోని 'ఏ'గా మారుతుంది.

ఉదా : *యాన్ > ఏను, *యాళ్ > ఏలు.

3. కొన్ని పదాల్లో మూలద్రావిడంలోని 'చ'కారం లోపించింది.

ఉదా : త. మ. క. తె. ఉప్పు, తొద ఉప్. ప. చుప్, కోలా. సుప్ (మూ.ద్రా. *చుప్).

4. తాలవ్యాచ్చులకు ముందు (ఇ, ఈ, ఎ, ఏలకు ముందు) మూలద్రావిడంలోని 'క' కారం 'చ'కారంగా మారుతుంది.

ఉదా : *కెయ్ > చేయి
*కెవి >చెవి,
*కిళి > చిలుక

5. మూలద్రావిడంలోని 'ఞ' 'నే/నా' గా మారుతుంది

ఉదా : ఞాన్ > నేను/నా.

6. మూలద్రావిడంలోని 'అయ్' '[illegible]' మారుతుంది.

ఉదా : కయ్, కై > చేయి.
ఆయ్మ్ ఏను > ([illegible]).

7. మూలద్రావిడంలోని దంత మూలీయ స్పర్శం 'త' అచ్చులమధ్య అద్విరుక్తంగా ఉన్నప్పుడు 'ఱ' గా మారుతుంది.

ఉదా : కెత్తయ్ / చెఱువు.

8. మూలద్రావిడంలో పదాదిలో లేని మూర్ధన్య దంతమూలీయ హల్లులు (ట, శ, ణ, ఱ, త్త, ల, ర) వర్ణ వ్యత్యయంవల్ల తెలుగులో పదాదికి చేరాయి.

ఉదా : అట్, అట్ డా > గు (> దాగు)
ఇట్-గ్ > ఇడ్-గ్గ్ >డిగ్గు (> దిగు)
ఉర్-ప్పు > రుబ్బు
ఎల్-అ >లేగు, లేచు మొదలైనవి.

9. వర్ణ వ్యత్యయంవల్లనే మూలద్రావిడంలో పదాదిలో లేని సంయుక్త హల్లులు 'క్ర, ప్ర, త్ర, గ్ర, బ్ర' వంటివి తెలుగులో ఏర్పడ్డాయి.

ఉదా : తట్-వు > త్రవ్వు
కుట్-ఉజ్ > క్రుంగు
కిట్ > క్రి-ంద మొదలైనవి.

BRAOU

10. వర్ణ వ్యత్యయంవల్ల తెలుగులో ఇంకా ఎన్నో మార్పులు వచ్చాయి.

ఉదా : అవన్డు, వాణ్డు >వాడు
అవర్ >వారు
అత్-అన్ -ఇ > దాని

11. మూలద్రావిడ భాషలో పదాదిలో నాదస్పర్శాలు లేవు. మూలద్రావిడంలో శ్వాస, నాదస్వరాలు భిన్న వర్ణాలు కావు. ప్రాక్తెలుగు దశలోనే తెలుగులో పదాది నాదస్పర్శాలేర్పడి "క, చ, ట, త, ప"లతో పాటు "గ, జ,డ, ద, బ"లు కూడా అర్థ భేదకాలయిన ప్రత్యేక వర్ణాలయ్యాయి.

ఉదా : కంప ~ గంప
పాట - బాట

12. ప్రాక్తెలుగు దశలోనే తెలుగుభాషకు ప్రాకృత, సంస్కృతాలతో ఉండే సంబంధంవల్ల ఆ భాషాపదాలతో పాటు ఖ, ఘ, ఛ, ఝ, ఠ, ఢ, థ, ధ, ఫ, భ, శ, ష, హ లు తెలుగులో చేరాయి.

### 10.5.1 పూర్వదశ I భాషా లక్షణాలు

క్రీ.పూ. 200 క్రీ.శ. 200 నుండి క్రీ.శ. 600 వరకు తెలుగు భాషా స్వరూపాన్ని తెలుసుకోవటానికి ఆనాటి ప్రాకృత, సంస్కృత శాసనాల్లోని దేశ్య పదాలైన గ్రామ, వ్యక్తినామవాచకాలే ప్రధానమైన ఆధారాలు. క్రీ.పూ. 200 నుండి క్రీ.శ. 600 వరకు తెలుగు దేశాన్ని శాతవాహనులు, ఇక్ష్వాకులు, పల్లవులు, బృహత్పలాయనలు, ఆనంద గోత్రికులు, శాలంకాయనులు, విష్ణుకుండినులు పరిపాలించారు. ఈ కాలంలో మొదటిదశలో ప్రాకృతంలోను, తరవాతి దశలో సంస్కృతంలోను శాసనాలు ఎక్కువగా కనిపిస్తాయి. ఆయా దశలలో ఆ భాషలు పాలన భాషలు అయి ఉండటమే దీనికి కారణం. బ్రిటిష్‌వారి పాలనాకాలంలో అధికార భాషగాను, ప్రస్తుతం ప్రభుత్వ కార్యాలయాలలో ఎక్కువగాను ఉపయోగించే భాష ఇంగ్లీషు. తెలుగుదేశానికి సంబంధించిన అధికార పత్రాల్లో భాష ఇంగ్లీష్ అయినా ఊళ్ళ పేర్లు, వ్యక్తుల పేర్లు తెలుగువే అయినట్టు ఆ కాలంలోని తెలుగుదేశానికి సంబంధించిన ప్రాకృత, సంస్కృత శాసనాల్లోని ఊళ్ళ పేర్లు, వ్యక్తుల పేర్లు తెలుగువి, తెలుగువారికి అయి ఉండడం సహజం. అవి ప్రాకృత, సంస్కృత వికృతాలుగా ఉండటం కూడా గమనించ వచ్చు. వాటిని బట్టి ఆనాటి తెలుగు భాషా స్వరూపాన్ని కొంత వరకు మాత్రమే ఊహించగలం.

ప్రాకృత శాసనాల్లోని తెలుగు పదాలకు కొన్ని ఉదాహరణలను గమనిద్దాం :

క్రీ.పూ. 200 : 'అరువాహి' (కులప) : ఇది నెల్లూరు జిల్లాకు సంబంధించిన మాలకాండ శాసనంలో ఉంది. కాంచీకి చుట్టుపట్ల ప్రాంతం, ఉత్తరాన నెల్లూరు వరకు ఉన్న ప్రాంతాన్ని ఆ కాలంలో 'అరువా వడతలై' అనేవారు. క్రీ.పూ. 200 నాటికే తెలుగువారు తమిళులను 'అరవలు' అనే వారని దీనిబట్టి ఊహించటానికి వీలుంది.

'కెవురూరే', కుదూర (నివాసన) : ఇదే కాలంలో గుంటూరు జిల్లాలో అమరావతీ స్థూపం పైన ఈ పదాలు కనిపిస్తున్నాయి.

క్రీ.శ. 2వ శతాబ్దం : నాగబు (గామే) వేపురకే

క్రీ.శ. 3వ శతాబ్దం : మహాతలవర - (తలై వర్, తలవరి) - ఒక గ్రామానికో, ప్రాంతానికో ప్రధానమైనవాడని అర్థం.

(గామే) మహాకాండరూరే (కొండూరు)
కమ్మక - రాఠే (కమ్మ రాష్ట్రే)
(గామే) ణడతూరే (నడతూరు)
విటపరమ్ (విప్పర్ల)
దాలూరే (దాలూరు)
కూడూర హారే
పాంటూరమ్ (పాంటూరు)



BRAOU

క్రీ.శ. 4వ శతాబ్ది : వేంగిపుర

సంస్కృత శాసనాల్లోని తెలుగు పదాలకు కొన్ని ఉదాహరణలను గమనిద్దాం :

క్రీ.శ. 4వ శతాబ్ది :

కంగూర (గ్రామేయకః)
కర్మ రాష్ట్రే (కమ్మనాడు)
ఒంగోడు (గ్రామశ్చ)
ఉరవుపల్లియే
కి (కం?) డుకూ (గ్రామస్య)
క (కు) రుపూర (గ్రామే)
కాండ మరుప్ప (డు) గ్రామస్య,
కురువాడ (గ్రామే)
నఱచడు
కడాకుదురు
పెణుక పఱ్ఱు
కుందూరు
ఱగుంబరు (దగ్గుపర్రు)
విఱవఱ్ఱి (నిడవలూరు)
పాగుహూరు (పాగులూరు)
మయూరు - కూటువ
కుణ్డూరు
ముదుటి తటాకః

క్రీ.శ. 5వ శతాబ్దం :

కొహెటూరే, విదెనూరుపల్లికా, ప్రొలూర, అ... లో..., మణ్డూరు, చెఞ్ఛ ఱువు, కంబురాఞ్చేరువే, మూలకుర, తాన్తికాన్ఱ (తాడికొండ), అంతుక...ర, ...ర, కొంపరే చిన్నపురే, తొణ్టాపరే.

క్రీ.శ. 6వ శతాబ్దం :

పుల్లలూరు, పెరువాటక, ...దులూర (దెందులూరు), రావిరేవ (రావిరేవుల), రేగొణ్డమ్ (రేగొండ).

క్రీ.శ. ఆరవ శతాబ్దానికి సం...ంచిన ఒక సంస్కృత శాసనంలో "విజయరాజ్య సంవత్సరంబుళ్" అనే మాట ఉంది. ఈ పదంలో తెలుగు బహువచన ప్రత్యాయాంతమైన పదం ళ్ ప్రవేశించటం ఆనాటికి తెలుగుకున్న వ్యాప్తిని తెలియజేస్తుంది.

పై గ్రామ నామాలన్నీ ప్రస్తుతం తెలుగు దేశంలోని గ్రామ నామాలతో పోలి ఉన్నాయి. 'ఊరు' అన్నది చాలా గ్రామాల చివర కనిపిస్తుంది. 'కుదురు, కొన్ఱ, పఱ్ఱు, చెఱువు, రేవు, పట్టి/వట్టి, వాడ, పల్లి, పఱ, ప్రోలు' మొదలైనవి ఆనాటి గ్రామనామాల చివర కనిపిస్తున్నాయి.

ఈనాటి ప్రాకృత, సంస్కృత శాసనాల్లోని వ్యక్తి నామాల చివర మొదట 'ఇయ' తరువాత "అయ, అణ్ణ" కనిపిస్తాయి.

ఉదా : దోబియ, కాటియ, కుండియ, పేరియ, కొండియ, రాకియ, అగ్గియ, అగ్గయ, కుండయ, రెంమణక, పొగరంణక, వీరంవ, హగంవ, మఞ్చణ్ణ మొదలైనవి.

పైన చెప్పిన పద పట్టికనుబట్టి క్రీ.శ. 600 వరకు తెలుగుభాషా స్వరూపానికి చెందిన లక్షణాలను కింది విధంగా చెప్పవచ్చు. ఈనాటి తెలుగు భాషతో పోలిస్తే ద్రావిడభాషా లక్షణాలెన్నో ఆనాటి భాషలో నిలిచి ఉండటం గమనించవచ్చు.

1. 'ఱ' అన్నవర్ణం ఇంకా భాషలో కొనసాగుతుంది. ఉదా. ఱగుంబరు. సంస్కృతంలో 'ఱ' లేకపోయినా దానికి ప్రత్యేకంగా ద్రావిడ లిపి చిహ్నం కనిపిస్తుంది.



BRAOU

2. తాలవ్యాచ్చుల (ఇ, ఈ, ఎ, ఏ) కు ముందు 'క' కారం 'చ' కారంగా మారటం అనాటికే స్థిరపడింది. ఉదా : చెఱువు (* కెఱె).

3. వర్ణ వ్యత్యయంవల్ల పదాది మూర్ధన్య, దంతమూలీయాలు, పదాది సంయుక్త వర్ణాలు ఏర్పడి అప్పటికే స్థిరపడ్డాయి.

4. 'ఱ, ర' లకు ఆనాటికే భేదం పోయింది. సంస్కృత శాసనాల్లోని తెలుగు పదాల్లో 'ఱ' ఉండవలసిన చోట 'ర' లిపి చిహ్నాన్ని ఉపయోగించటం దీనికి నిదర్శనంగా గ్రహించవచ్చు.

5. (తరువాత కాలంలో 'ణ్డ' సంయుక్తంగా మారిన) "న్ట" ఈ కాలంలో కనిపిస్తుంది. ఉదా. తాన్టికొన్ట (తాటికొండ).

6. కృత్ప్రత్యయంగా ఉవ' కనిపిస్తుంది. ఉదా : కూడు-ఉవ >కూటువ

7. అమహదేకవచన ప్రత్యయంగా "బు", అమహద్ బహువచన ప్రత్యయంగా ళ్ కనిపిస్తున్నాయి.

8. విశ్లేషణ ప్రత్యయాలుగా "ఌ, టి" కనిపిస్తున్నాయి. ఉదా : వేపూరు, ముదుటి తటాకః.

9. వైరి సమాసాలుండేవి. ఉదా : మహాతలవర.

10. పరుష, సరళాలకు ముందు వర్గ పంచమాక్షరాలకు బదులు సంస్కృత సంప్రదాయాన్ని అనుసరించి అనుస్వారం రాయటం ప్రారంభమైంది ఉదా॥ కంబురాఞ్ఱుఱువ.

11. ఈ కాలంలో మొదటి దశలోని శాసనాలు దక్షిణ/భట్టిప్రోలు/ద్రావిడ బ్రాహ్మీ లిపిలో కనిపిస్తాయి. క్రమంగా వేంగీ చాళుక్య, కన్నడ, తెలుగు లిపులుగా పరిణామంచెంది తెలుగు లిపి రూపు దిద్దుకొంది. తాళపత్రాలపైన రాయటంవల్ల మొదట అడ్డంగా ఉన్న లిపి గుండ్రని లిపిగా పదకొండవ శతాబ్దం నుంచి మార్పు చెందింది.

### అవగాహన ప్రశ్న – 2

పూర్వదశ I లోని భాషా లక్షణాల్లో నేటి తెలుగుకు సంబంధించిన లక్షణాలు ఏ రకంగా నిలిచి ఉన్నాయో 10 వాక్యాల్లో తెల్పండి.

BRAOU

## 10.6 సారాంశం

ఈ భాగంలో మీరు గ్రహించిన ప్రధానాంశాలు

- ద్రావిడ భాషల మధ్య సమాన లక్షణాలున్నాయి. ఆ భాషలన్నీ మూలద్రావిడభాష నుండి పుట్టి వివిధ శాఖలుగా చీలాయి. వాటిలో మధ్యద్రావిడ భాష ఒక ఉపకుటుంబం. దానికి చెందిందే తెలుగు.
- సంస్కృతం, ద్రావిడ భాషలు పరస్పర ప్రభావాలకు లోనయ్యాయి. సంస్కృతం మీద ద్రావిడ భాషల ప్రభావం ఋగ్వేదకాలంనుంచీ కన్పిస్తుంది.

- పూర్వయుగం ప్రథమ భాగంలో (క్రీ.పూ. 200 క్రీ.శ. 600) సంస్కృత ప్రాకృత శాసనాలు మాత్రమే లభిస్తున్నాయి. వాటిలో లభించే తెలుగుమాటలవల్ల నాటి తెలుగు స్వరూపం కొంత తెలుస్తోంది. ద్రావిడ భాషా లక్షణాలెన్నో మనం ఆనాటి భాషా పరిశీలనవల్ల తెలుసుకోవచ్చు.

## అవగాహన ప్రశ్నలకు జవాబులు

1. లింగవిభజన విషయంలో సంస్కృతానికీ, ద్రావిడ భాషలకూ మధ్య భేదం ఉంది. సంస్కృతంలో లింగవిభజన శబ్దం చివరనుబట్టి నిర్ణయిస్తారు. ఉదాహరణకు సంస్కృతంలో దారా అనే మాటలో చివర ఆ ఉంది. ఇది ఆ భాషలో పుంలింగం. తెలుగులో ఆమాట అర్థం భార్య. భార్య స్త్రీ) వాచకం. అట్లాగే సంస్కృతంలో వృక్షః అనేది పుంలింగం. తెలుగులో దాని అర్థం చెట్టు. చెట్టు అమహద్వాచకం. మిత్రమ్ అనే మాట సంస్కృతంలో నపుంసకలింగం. తెలుగులో దాని రూపం మిత్రుడు. అది మహద్వాచకం. ద్రావిడభాషలో మహద్వాచకం, అమహద్వాచకం అంటే పురుష, అపురుష వాచక భేదం ప్రధానంగా ఉంది. మరికొన్ని మార్పులు కొన్ని భాషల్లో కన్పిస్తాయి. తెలుగు ఏకవచనంలో పురుష అపురుష భేదం ఉంటే, బహువచనంలో మనుష్య అమనుష్య భేదం కన్పిస్తుంది. ఉదాహరణకు తెలుగులో వాడు అంటే పురుషుడు. అది అనే మాట స్త్రీలను, తిర్యక్కులనూ, జడపదార్థాలనూ సూచించేమాట. బహువచన రూపం వారు పరిశీలిస్తే, ఆమాట పురుష స్త్రీ) వచనాలను సూచిస్తుంది. అవి అనేమాట తిర్యక్ జడవాచకాలను సూచిస్తుంది.

2. తెలుగు భాష పూర్వదశ I (క్రీ.పూ. 200 - క్రీ.శ. 600) లోని తెలుగు భాషా లక్షణాలు ఈనాటి తెలుగుతో పోల్చి చూస్తే, క్రీ.పూ. 200, క్రీ.శ. 2 నుండి 6వ శతాబ్ది వరకూ ఉన్న వివిధ సంస్కృత ప్రాకృత శాసనాల ద్వారా తెలుస్తాయి. అందులోని మూల ద్రావిడ భాషా లక్షణాలు స్పష్టంగా గోచరిస్తాయి. అవి ఇవి : తాలవ్యాచ్చులకు ముందు 'క' కారం 'చ' కారంగా మారి ఉండటం. (చెఱువు > కెఱె). వర్ణవ్యత్యయం వల్ల పదాది మూర్ధన్య దంతమూలీయాలు, పదాది సంయుక్త వర్ణాలు అప్పటికే స్థిరపడ్డాయి. ర - ఱలకు భేదం పోయింది. తదనంతరకాలంలో 'ణ్ణ'గా మారిన 'న్త' కనిపిస్తుంది (తాన్తికొన్త >తాటికొండ). కృత్ప్రత్యయంగా 'ఉవ' కనిపిస్తుంది. (కూడు - ఉవ >కూటువ). వేరె సమాసాలుండేవి (మహాతలవర) విశేషణ ప్రత్యయాలుగా"పు-టి" కనిపిస్తాయి. (వేపూరు, ముదుటి తటాకః).

## చదవదగిన పుస్తకాలు

15వ భాగం చివర చూడండి.

## మాదిరి పరీక్ష ప్రశ్నలు

I. కింది ప్రశ్నలకు 30 వాక్యాలకు మించకుండా సమాధానాలు రాయండి.

1. ద్రావిడభాషలలోని సమాన లక్షణాలను తెల్పండి.
2. క్రీ.శ. 600 వరకు తెలుగు భాషా స్వరూపానికి చెందిన లక్షణాలను వివరించండి.

II. కిందివాటికి 10 వాక్యాలకు మించకుండా జవాబులు రాయండి.

1. పూర్వయుగపు తొలిదశలోని తెలుగు భాషా స్వరూపాన్ని తెలుసుకోటానికి ఏవేవి ఆధారం?
2. సంస్కృతంపై ద్రావిడ భాషల ప్రభావం తెల్పండి?

BRAOU

# భాగం – 11 తెలుగు భాష పూర్వ దశ II (క్రీ.శ. 600 – 1000)

## విషయ క్రమం


11.0 లక్ష్యాలు

11.1 పరిచయం

11.2 శాసనాల్లోని భాషా స్వరూపం

- 11.2.1 వర్ణాలు
- 11.2.2 మారిన రూపాలు, మారని రూపాలు
- 11.2.3 ధ్వని పరిణామాలు
- 11.2.4 విభక్తులు
- 11.2.5 సర్వనామాలు
- 11.2.6 సంఖ్యా వాచకాలు
- 11.2.7 క్రియలు
- 11.2.8 వాక్య నిర్మాణం

11.3 నన్నయ కావ్యశైలికి పూర్వ చరిత్ర

**అవగాహన ప్రశ్న**

11.4 సారాంశం

అవగాహన ప్రశ్నకు జవాబు

- చదవదగిన పుస్తకాలు
- మాదిరి పరీక్షా ప్రశ్నలు


## 11.0 లక్ష్యాలు

నన్నయ ఆంధ్రమహాభారతం తెలుగులో గ్రంథరూపంలో లభించే మొదటి విస్తృత రచన. నన్నయకు ముందు 300 ఏళ్లనాటికే భారత భాషను పోలిన శైలి ఉండి ఉండేదని, గ్రంథ రచన లేకపోయినా శాసనాలను బట్టి భాషా పరిణామం సాగిందని ఈ భాగం చదివాక మీరు విశ్లేషించగలుగుతారు.

BRAOU

## 11.1 పరిచయం

చాలాకాలం కింది వరకు ఆంధ్రమహాభారత కర్త అయిన నన్నయే తెలుగుభాషకు, కావ్యరచనకు ఆద్యుడని భావించటం జరిగేది. అంతకుముందు తెలుగుభాష ఉన్నా అది స్థిరరూపంలో ఉండేదికాదని దాన్ని సంస్కరించి స్థిరపరచిన గౌరవం నన్నయకు దక్కుతుందని చాలామంది నమ్ముతారు. దానికి కారణం మనకు లభించిన తెలుగు తొలిగ్రంథం నన్నయ భారతం కావటం. "మహిమున్ వాగనుశాసనుండు సృజియింపన్" అని ప్రాచీన కవులందరూ నన్నయను ఆదికవిగా స్తుతించటం, కాని నన్నయ భారతంలాంటి రచన ఏభాషా, సాహిత్య చరిత్రలోనైనా హఠాత్తుగా ఊడిపడేది కాదు. దానికి ఒక క్రమ పరిణామం, శతాబ్దాల పూర్వచరిత్ర తప్పనిసరిగా ఉండిఉండాలి. నన్నయకు ముందు తెలుగు శాసనాలను, ఇతర ఆధారాలను పరిశీలించిన పరిశోధకులు క్రీస్తుపూర్వం నుండే నన్నయకు పదిహేనువందల సంవత్సరాలకు ముందునుంచే తెలుగుభాష ప్రజాభాషగా వాడుకలో ఉండేదని నిరూపించారు. ఆకాలం నుండే తెలుగులో ఏదో ఒక రూపంలో మౌఖిక వాఙ్మయం ఉండిఉండాలని కూడా భావించారు. నన్నయకు ముందు మూడువందల సంవత్సరాల నాటికే నన్నయ భారతభాషను పోలిన పండితశైలి, దేశీయచ్ఛందో విశేషాలు పండరంగని అద్దంకి శాసనం, గుణగ విజయాదిత్యుని కందుకూరు శాసనం, చాళుక్యభీముని కొరవిశాసనం మొదలైనవాటిలో కనిపిస్తాయి. దీనినిబట్టి నన్నయ కంటే మూడువందల సంవత్సరాల ముందునాటికే తెలుగు వ్యావహారిక భాషారూపంగా, పండితులుపయోగించిన

కావ్యభాషగా రెండు పాయలుగా చీలిందని, నన్నయ తన కాలానికి పండితులలో స్థిరపడిన కావ్యభాషా శైలిలో భారత రచన చేశాడని చెప్పవచ్చు.

## 11.2.0 శాసనాల్లోని భాషా స్వరూపం

క్రీ. శ. పదకొండవ శతాబ్దం మధ్యభాగం వరకు తెలుగుభాషా స్వరూపాన్ని తెలుసుకోవటానికి శాసనాలే ముఖ్యమైన ఆధారం. సుమారు రెండువందల యాభైకి పైగా శిలాతామ్ర శాసనాలను పరిశీలించి మల్లంపల్లి సోమశేఖరశర్మ, కోరాడ రామకృష్ణయ్య, చిలుకూరి నారాయణరావు, కోరాడ మహదేవశాస్త్రి, బూదరాజు రాధాకృష్ణ మొదలైన పరిశోధకులు ఆనాటి తెలుగుభాషా స్వరూపాన్ని పరిశోధించి నిరూపించారు. ఇంతవరకు పూర్తిగా తెలుగు భాషలో లభించిన మొదటి శాసనం క్రీ. శ. 575 నాటిది. కడపజిల్లా ఎర్రగుడిపాడుకు సంబంధించింది. ఆ శాసన పాఠం ఇది –

స్వస్తిశ్రీ ఎరిక
ల్ ముత్తు రాజుల్ల
కుణ్డికాళ్ల (వి) వఋకా –
ను ఇచ్చిన పన్నస –
దుజయ రాజుల –
ముత్తురాజుల నవ –
ప్రియ ముత్తురాజులు –
పల్లవ దుక రాజులు సక్షి –
కాను ఇచ్చి (న) పన్నస్స –
కొట్టంబున పా –
ఱకు కుణ్డి కాళ్ల –
ళ ఇచ్చిన పన్నస –
ఇరివది యాదినా –
ఱ్కు మఱు న్తుఱ్ఱు నేల –

క్రీ. శ. 848 కి చెందిన పండు రంగని అద్దంకి శాసనంలో మొదటిసారిగా తెలుగు పద్యం కన్పిస్తుంది. ఛందం తరువోజ.

పట్టంబు గట్టిన ప్రథమమ్బునేణ్డు బలగర్వంఁబొప్పగ బైలేచినేన పట్టంబు గట్టిశ్చి ప్రభుంబణ్డరంగు (ం) బ (ణ్చి) న సామ (ం) త్త పదువతో బోయ కొట్టంబుల్ పణ్డెణ్డుంగొణి వేంగి వాణ్డింగొరల్చియ త్రిభువనాంకుశ (భాణ) నిల్పి కట్టెపు (ను) దుగ్గన్ంబునడు జయల్సేసి కణ్డుకుణ్చెన్‌జవాడ గావిశ్చె మెచ్చి పాణ్డురంగు పరమ మహేశ్వరుణ్డు ఆదిత్య బటరనికి ఇచ్చిన భూమిం ఎనుబోది పుట్ల అడ్లు పట్టునేలదమ్మ పురంబున దమ్మువులు (విని) రకిశ్చిన వారికి అస్వమేదం (బు) పపలం (బు) (అ) గు.

ఈ కాలానికి సంబంధించిన శాసనాలలో మొదటిదశలో రేనాటి చోళులకు సంబంధించి కడప జిల్లాలో లభించిన శాసనాలు ఎక్కువగా ఉన్నాయి. రెండవ దశలో తూర్పుచాళుక్యులకు సంబంధించినవి, పద్య శాసనాలు ఎక్కువగా లభించాయి.

### 11.2.1 తెలుగులో వర్ణాలు

క్రీ. పూ. 600 – క్రీ. శ. 1000 మధ్యకాలంలో శాసనాలలోని తెలుగు భాష ఆధారంగా తెలుగులో ఈ కింది వర్ణాలను నిర్ణయించవచ్చు.

అచ్చులు : అ, ఆ, ఇ, ఈ, ఉ, ఊ, ఎ, ఏ, ఒ, ఓ

హల్లులు : క, గ, చ, జ, ట, డ, ణ, త, ద, న, ప, బ, మ, య, ర, (ఱ), ల, ళ, వ, స, హ, (ఴ)



BRAOU

"ఐ ఔ" లు "అయ్, అవ్" లతో సమానం కాబట్టి అవి తెలుగులో ప్రత్యేక వర్ణాలు కావు. "మొదత్స" వంటి పదాలలో "చ" కు బదులుగా "త్స" రాయటం వల్ల "చ", "ఛ" ల భేదం అంటే దంత్య, తాలవ్య భేదం ఉచ్చారణలో ఉండేదని చెప్పవచ్చు. రాతలో కొనసాగుతున్నా "ర, ఱ" ల భేదం ఇంతకు ముందే పోయింది. "ఱ" భిన్న పరిసరాలలో "డ, ర" లుగా మారినా రాతలో మాత్రం కొనసాగింది. మూల ద్రావిడంలోని ఙ, ళ అనేవి "న, ల" లతో కలసిపోయినా మరో రూపంలో "ఙ, ళ" లు భాషలో ప్రవేశించాయి.

పై వర్ణాలు కాక సంస్కృత ప్రాకృత పదాలతో పాటు "ఖ, ఘ, ఛ, ఠ, ఢ, థ, ధ, ఫ, భ, శ, ష" లు తెలుగులో కలసిపోయాయి. అచ్చులలో "ఋ" కనిపిస్తుంది గాని దానికి "రి" ఉచ్చారణ ఉండేది. ఉదాః ప్రిథ్వి "ౠ, ఌ,ౡ" లు కనిపించవు.

ద్రావిడ భాషలలో అనుస్వారం (బిందువు, నిండు సున్న - ం) లేదు. వర్గానునాసికాలైన "ఙ, ఞ, ణ, ఞ, న" లకు బదులుగా అనుస్వారాన్ని రాయటం సంస్కృత, ప్రాకృత శాసనాలలోని తెలుగు పదాలతోనే మొదలైనా, పదవ శతాబ్దానికి గాని ఇది సర్వ సాధారణం కాలేదు. అంతవరకు వర్గానునాసికాలు రాయటమే తెలుగులో ఎక్కువగా కన్పిస్తుంది. ఉదా : పశ్చిన పణ్డరంగు, ప్రథమమ్బు మొదలైనవి, ద్రావిడ భాషలతో పాటు తెలుగులో అనుస్వారం ప్రత్యేక వర్ణంకాదు. వర్ణాక్షరాలైన "క, చ, ట, త, ప, గ, జ, డ, ద, బ" లకు ముందు అది వర్గానునాసికానికి లిపి చిహ్నం మాత్రమే. పదాంతంలో దానికి మకారోచ్చారణ ఉంది. తెలుగు పదాలలో "వాండు, వీండు" వంటి పదాలతో దీర్ఘం పైన అనునాసికం పోయిన తరువాత కూడా అనుస్వారం రాయటం రాతలో కొనసాగింది. ఇది పూర్వాచ్చుకు గల అనునాసికోచ్చారణకు గుర్తుకావచ్చు. దీన్నే అర్థానుస్వారం (అరసున్న ఁ) అంటారు. అర్థానుస్వారానికి అచ్చు వచ్చేదాకా ప్రత్యేకలిపి చిహ్నంలేదు. దీనికి పూర్ణానుస్వార చిహ్నన్నే రాసేవారు. పది పదకొండు శతాబ్దాల నాటికి పూర్ణానుస్వారాన్ని సూచించటానికి తరువాత హల్లును ద్విరుక్తంగా రాయటం, అర్థానుస్వారాన్ని సూచించటానికి అద్విరుక్తంగా రాయటం అనే సంప్రదాయం ప్రారంభమైంది కాని అది నియతంకాదు. ఉదా : వాండు, గుంట, రెండ్డు, రేపు మీద హల్లును ద్విరుక్తంగా రాసే అలవాటు, వలపలగిలక( ౯ )ను వాడే సంప్రదాయం ఏడవ శతాబ్ది నుంచీ కన్పిస్తుంది. ఉదా : కార్త్తి౯య, తూర్ప్పు౯న.

### 11.2.2 మారిన రూపాలు, మారని రూపాలు

క్రీ. శ. 6 - 8 శతాబ్దాల మధ్యకాలంలో మూల ద్రావిడం నుంచి వచ్చిన మార్పులతో కూడిన రూపాలతో పాటు, మారని రూపాలు కూడా శాసనాలలోని రాతలో కన్పిస్తాయి.

1. తాలవ్యీకరణం ప్రాక్తెలుగులోనే జరిగిన తాలవ్యీకరణకు పూర్వరూపాలు 7.8 శతాబ్దాలలో కనిపిస్తాయి. ఉదా : కేచిన, వేసిన, [illegible], [illegible] (చేయుధాతువుకు సంబంధించిన రూపాలివి).

2. పదాది సరళాలేర్పడినా పరుషాలతో కూడిన పూర్వరూపాలు కనిపిస్తాయి. ఉదా : తేని (దేని).

3. తెలుగులో వర్ణ వ్యత్యయం అన్న మార్పువల్ల మూర్ధన్య, దంతమూలీయాలు పదాదికి వచ్చాయి. కాని ఈ వర్ణాలు పదాదిలో లేని పూర్వ రూపాలు కొన్ని కనిపిస్తాయి. ఉదా : ఒళన : ళోన, అటసిన : టచ్చు. అలాగే వర్ణవ్యత్యయం వల్ల పదాది సంయుక్త వర్ణాలేర్పడ్డ రూపాలలో "ఱ" "ర" గా మారుతుంది. కాని ఆ మార్పులేని రూపాలు కూడా ఈ కాలంలో కనిపిస్తాయి.

   ఉదా : క్ఱొచ్చె : క్రొచ్చె

   ఱ్వచ్చిన : వ్రచ్చిన,

   పుఱోలు (ప్ఱోలు) ప్రోలు.

4. "ఏండు" కు పూర్వరూపమైన ఆండు (<* యాణ్డు) "పెద్దలకు" పూర్వరూపమైన వర్ణ సమీకరణం పొందని "పెర్దల్" వంటివి ఈ కాలంలో శాసన లేఖనంలో కనిపిస్తున్నాయి.

### 11.2.3 ధ్వని పరిణామాలు

క్రీ. శ. 7 - 9 శతాబాల మధ్య తెలుగులో చాలా ప్రధానమైన ధ్వని పరిణామాలు కనిపిస్తాయి.



BRAOU

1. అచ్చుల మధ్య వర్ణవ్యత్యయం పదాదికి వచ్చిన "ఱ" కారం "డ" కారంగా మారుతుంది. ఉదా : ఏఱూ > ఏడు, ఱచ్చు > డచ్చు, ఱగుంబరు > డగ్గుంబరు.

2. వర్ణవ్యత్యయం వల్ల పదాది హల్లుతో చేరిన "ఱ" "ర" గా మారుతుంది.

ఉదా : క్ఱొచ్చె > క్రొచ్చె.

3. 7వ శతాబ్ది నాటికే "ఱ" కు బదులుగా "ర" చాలా పదాల్లో కనిపిస్తుంది.

ఉదా : తూఱ్పు > తూర్పు, ఎఱుంగ > ఎరుంగను, ఏనూఱు > ఏనూరు, దీన్ని బట్టి ఉచ్చారణలో "ఱ" "ర"ల భేదం ఈనాటికే పూర్తిగా పోయిందని చెప్పవచ్చు. ఏడవ శతాబ్దిలోనే ఒకచోట ఊరులో "ర" కు బదులుగా "ఱ" రాయటం కూడా కనిపిస్తుంది. ఉదా : పడమఱలూఱి. దీన్నే విలోమలేఖనం అంటారు. ఇది కూడా ఈ కాలపు భాషలో "ఱ" కు ప్రత్యేకత లేదనడానికి నిదర్శనం.

4. అచ్చులు మధ్య మూర్ధన్య "ణ, ళ" లు 7 – 8 శతాబ్దుల నాటికే "న, ల"లతో కలిసిపోయాయి. ఉదా : కాణి > కాని,

పణి > పని,

ఏళన్ > ఏలన్,

-ళ్ > లు (బహువచన ప్రత్యయం)

9వ శతాబ్దం నుంచి "న" కు బదులుగా "ణ" స్థానే విలోమలేఖనం కూడా కనిపిస్తుంది. ఉదా : తణు (= తన) అలాగే "ల" కు బదులు "ళ" రాయటం కనిపిస్తుంది. ఉదా : కళర్ (కలర్)

5. "న్ఱ" సంయుక్తం "ణ్డ" గా మారింది. ఇక్కడి "ఱ" దంత మూలీయమైన "త్ర"

ఉదా : కొన్ఱ > కొణ్డ,

వాన్ఱు > వాణ్డు.

6. పదాది "డ" కారం "ద" కారంగా మారటం తొమ్మిది, పది శతాబ్దాల నాటికే కనిపిస్తుంది. ఉదా : దిగుబల్లు (ఇది ఊరి పేరు ఇందులో "దిగ్గ" - పూర్వ రూపం డిగ్గ). డున్ను > దున్ను.

7. వర్ణవ్యత్యయం వల్ల ఏర్పడ్డ పదాది సంయుక్తాక్షరాలలో రెండవ వర్ణం "ర" లోపించటం తొమ్మిది పది శతాబ్దాల నుంచే కనిపిస్తుంది. ఉదా : గ్రాచ్చి > గాచ్చి మ్రాని > మాని. ఈనాటికీ పండితులు ఇలాంటి రూపాలను అంగీకరించటం లేదు. ఆధునిక భాషా రూపాలని చెప్తున్న వీటికి వేయి సంవత్సరాలకు పైగా చరిత్ర ఉంది.

8. ఆధునిక వ్యావహారిక భాషకు సంబంధించిందిగా చెప్పుకుంటున్న మరో లక్షణం అమహదేకవచన ప్రత్యయంగా – ములోని 'ఉ' లోపించి ఏర్పడిన అనుస్వారం. ఇది ఏడవ శతాబ్దం నుంచే శాసనాల్లో కనిపిస్తుంది.

ఉదా : పురస్సరం, ప్రవర్తమానం.

9. "కుంచాలు, భోగానకు, వర్ణాలు" వంటి ఆధునిక రూపాలు కూడా పదవ శతాబ్ది నుంచే కనిపిస్తున్నాయి.

10. ఉచ్చారణలో "ఇ, ఈ, ఎ, ఏ" లకు ముందు య కారం, "ఉ, ఊ, ఒ, ఓ లకు ముందు వకారం చేరటం ఈకాలంలో ఎక్కువగానే కనిపిస్తుంది. ఉదా : యేలు, వుద్దిని.

11. సంస్కృత పదాలలో కూడా ఉచ్చారణలో కింది మార్పులు ఈ కాలంలో కనిపిస్తాయి.

i. 'థ' కారానికి 'ధ' కారం ఉదా : ప్రిథివి. ఆధునిక కాలంలో ధ ఉచ్చారణే ప్రచురం.



BRAOU

ii. మహాప్రాణ హల్లులు అల్ప ప్రాణాలు కావటం.

ఉదా : లికితం (లిఖితం)

ప్రతమ (ప్రథమ)

స్తితి (స్థితి)

iii. 'శ, ష లు 'స' కావటం.

ఉదా : ఈస్వరుడు (ఈశ్వరుడు)

దోసమ్మునకు (= దోశమ్మునకు).

iv. సంయుక్తాక్షరాల మధ్య అచ్చు చేరి విడిపోవటం.

ఉదా : అరుహుణ్డు (అర్హుణ్డు).

### 11.2.4 విభక్తులు

మహదేక వచన ప్రత్యయంగా మొదట – "న్డు" తరువాత క్రమంగా "ణ్డు" లు కనిపిస్తాయి. ఉదా : ఉత్తమోత్తము – న్డు, వాణ్డు, సోమనాథ – డు. ఇది మొదట తత్సమ శబ్దాలకు చేరి తరువాత ఇతరాలకు చేరింది. అమహదేకవచన ప్రత్యయంగా '–ంబు, –వు–ము/–మ్' లు కనిపిస్తాయి. ఉదా : కొట్టంబు, ప్రాకారవు, దేశము, పురస్సరం, మనుష్యవాచక బహువచనంగా "రు/ర్" కనిపిస్తుంది. ఉదా : వేవురు, మలినుల్. మహదమహత్తులకు సాధారణమైన బహువచనంగా – 'లు' కనిపిస్తుంది. మొదటి దశలో – 'ళ' కూడా కనిపిస్తుంది. ఉదా : కన్న్యళను : అణపోతులు, ప్రమాంకుల, ఈ రూపాలన్నీ ప్రథమా విభక్తిలో వస్తాయి.

ద్వితీయావిభక్తిలోని "ని, ను" ఉదా : దీనిన్, కన్న్యళను, రడ్డిని

తృతీయావిభక్తిలో "న" ఉదా : పరాక్రమంబునన్, చేత, తో, తోడ / కోటి అన్న సంబంధాలు, ఉదా : చోళ – చేత, చోడుళ – చేత, పదువతో, నలరామనిభుతోటిన్

చతుర్థ విభక్తిలో – కి (న్) కు (న్) ఉదా : చేనుకు, ఆనికి "పణ్లై" ఉదా : పరోపకారంబు – పాణ్డై

సప్తమీవిభక్తిలో "అన్, న" ఉదా : అన్వయయంబున్ "అం..., వళన, లోన, లోపలి" అన్న అనుబంధాలు ఉదా : ఊండ్లందు, రాజుల్లాళన, భూమిలోన, కయ్యంబు... మొదలైన ప్రత్యయాలు కనిపిస్తాయి.

పంచమీ విభక్తిలో ప్రత్యయాలు స్పష్టంగా లే... ష... విభక్తికి ప్రత్యేక ప్రత్యయాలు లేవు.

### 11.2.5 సర్వనామాలు

"వాన్డు / వాణ్డు / వాండు, పీన్తి దేని వారు, ఏ, న్, నా, నాకు, నీవు, నొ మొదలైన నిర్దేశాత్మక, పురుష వాచకసర్వనామాలు, "ఎవ్వణ్డ్, ఎవ్వాండ్, ఎవ్వర్, ఎవ్వి" వంటి ప్రశ్నార్థక సర్వనామాలు, "తాన్, తన, తమ్ను, తారు, తమ, తమకు, తమ్మ, తమను" వంటి ఆత్మార్థక సర్వనామాలు ఈ కాలపు శాసనభాషలో కనిపిస్తున్నాయి.

### 11.2.6 సంఖ్యా వాచకాలు

సంఖ్యావాచకాలుగా "ఒకటి / వకొట్టి, ఒక, ఒణ్డు, రెండు, రెంటికి, ఇరువది మూన్డ్, మూను, మూణ్డు, మూడ్, మూణ్టికి, మున్నూఱు; నాల్కు నాలుగు. నల్‌వురు; ఏను (అయిదు), ఆఱు, అఱువది, ఏఱు / ఏడు, ఎణ్బొది, ఎనుబొది, ఎన్మిది; తొమ్బ, తొంభ; పది, ఏబది, నూర, నూఱు, నూఱింటిని, నూట నూర్వ్వురు; వెయి, వేయు, వేల్ మొదలైనవి ఈ కాలపు శాసనభాషలో కన్పిస్తాయి.

### 11.2.7 క్రియలు

... భూతకాలిక, తద్ధర్మ, విధ్యర్థక, ప్రార్థనాద్యర్థక క్రియలు కనిపిస్తాయి. ఉదా : భూత – ఇచ్చిరి, ..., ఇచ్చితిమి, పడియె; నిల్పె మొదలైనవి కొణ్డు, కాన్‌తురు, ఉణ్డుదురు మొ॥ విధ్యర్థకం. నడపునది.



BRAOU

కొమ్ము, మనుము మొ॥ ప్రార్థనాద్యర్థకం' "ఏలుచున్తి, చేయుచున్న, వార్ధిఁబలు చున్ - ఉణ్ణు" వంటివి వర్తమాన క్రియలు. 9 - 10 శతాబ్దుల నుండి మాత్రమే ఇవి కనిపిస్తున్నాయి. పదకొండవ శతాబ్దికి గాని "సెయ్యఁగల ప్రతిపాదింపం గల" వంటి భవిష్యత్క్రియలు కనిపించవు.

### 11.2.8 వాక్య నిర్మాణం

క్రీ. శ. పదవ శతాబ్దివరకు శాసనాలలోని భాష ఆధారంగా చూస్తే క్రియతో అంతమయ్యే వాక్యాలు నామంతో అంతమయ్యే వాక్యాలు రెండూ కనిపిస్తాయి. వాక్యంలోని పదాలు కర్త, కర్మ, క్రియ క్రమంలో ఉంటాయి. ఉదా : కళ్ళుగొర్లు కొట్టిరి, కమ్మరి వినియన వ్రాసె చోళచేత శవణ గొణిరి మొ॥ పద్యశాసనాల్లో ఈ క్రమంలో మార్పులు కనిపిస్తాయి. నామంతో అంతమయ్యే వాక్యాలకు ఉదాహరణకు "ఇన్దోఱు దీనికి సక్షి". ఎవ్వణ్డేని రక్షిశ్చ్చి వానిద ధమ్ముఁవు" వంటి యత్తదర్థక వాక్యాలు, "వైదుంబుళ చేతంబట్లం కట్టబడి యేలి" వంటి కర్మణ్యార్థక వాక్యాలు ఈ కాలంలో చాలా తక్కువగా కనిపిస్తాయి.

## 11.3 నన్నయ కావ్యశైలికి పూర్వ చరిత్ర

క్రీ. శ. 600 - 1000 మధ్య శాసన భాష పరిశీలించినప్పుడు ఈ రోజు ఆధునిక భాషారూపాలని చెప్పుకుంటున్నవి చాలా వరకు ఈ కాలంలోనే స్థిరపడ్డాయని, నన్నయాదుల కావ్య భాషాశైలికి కూడా మూడు నాలుగు వందల సంవత్సరాల పూర్వ చరిత్ర ఉందని తెలుస్తుంది.

### అవగాహన ప్రశ్న

(కింది ప్రశ్నకు పదివాక్యాలలో జవాబు రాయండి)

క్రీ. శ. 600 - 1000 మధ్య కాలం భాషలోని వాక్య నిర్మాణాన్ని గురించి తెల్పండి.

_______________

_______________

_______________

_______________

_______________

_______________

## 11.4 సారాంశం

ఈ భాగంలో మీరు గ్రహించిన ప్రధానాంశాలు :

- క్రీ. శ. 600-1000 మధ్యకాలంలోని శాసనాలు రెండు రకాలు. 1. గద్య శాసనాలు 2. పద్య శాసనాలు
- నన్నయ కావ్యశైలికి మూడు నాలుగు వందల సంవత్సరాల చరిత్ర ఉన్నట్లు శాసనాలలోని భాష రుజువు పరుస్తుంది.

### అవగాహన ప్రశ్నకు జవాబు

క్రీ.శ. 600-1000 మధ్యకాలం శాసనాలలోని భాషను మనం పరిశీలించినప్పుడు వివిధమైన వాక్య నిర్మాణరీతులు కన్పిస్తాయి. వాటిలో ముఖ్యమైనవి :



BRAOU

1. క్రియలో అంతమయ్యే వాక్యాలు

ఉదాహరణకు : కఞ్చుగార్ల కొట్టిరి

2. నామవాచకంతో అంతమయ్యే వాక్యాలు

ఉదాహరణకు : ఇన్దాఱు దీనికి సక్షి

వాక్యంలోని పదాలు కర్త కర్మ క్రియ వరుస క్రమంలో ఉంటాయి.

ఉదాహరణకు : కమ్మరి వినియన వ్రాసె

పద్యశాసనాల్లో సంస్కృత వాక్య నిర్మాణ ప్రభావం వల్ల యత్తదర్థక వాక్యాలు, కర్మ ప్రధాన వాక్యాలు కన్పిస్తాయి.

యత్తదర్థక వాక్యం – ఉదాహరణకు : ఎవ్వణ్డేని రక్షిఞ్చు వానిద దమ్మున్వు.

కర్మప్రధాన వాక్యం – ఉదాహరణకు : వైదుంబుళ చేతం బట్టం కట్ట బడియేలి.

**చదవదగిన పుస్తకాలు**

15వ భాగంలోనివి చూడండి.

**మాదిరి పరీక్షా ప్రశ్నలు**

I. కింది ప్రశ్నలకు 30 వాక్యాలకు మించకుండా సమాధానాలు రాయండి.

1. పూర్వయుగం మలిదశలోని భాషా స్వరూపాన్ని శాసనాలు ఆధారంగా తెలపండి.
2. నన్నయ కావ్యశైలికి గల పూర్వచరిత్రను దృష్టాంతాలతో నిరూపించండి.

II. కిందివాటిని 10 వాక్యాలకు మించకుండా వివరించండి.

1. పూర్వయుగం మలిదశలోని తెలుగు వర్ణాలు
2. పూర్వయుగం మలిదశలోని సంఖ్యావాచకాలు

BRAOU

# భాగం–12 తెలుగు భాష మధ్యకాలీన దశ II (క్రీ.శ.1000–1600)

## విషయ క్రమం


12.0 లక్ష్యాలు

12.1 పరిచయం

12.2 భాషలో రెండు పాయలు

12.3 మధ్యకాలీన భాష ప్రత్యేక ప్రాధాన్యం

- 12.3.1 వర్ణాలు, ధ్వనుల మార్పులు
- 12.3.2 సంధి
- 12.3.3 లింగబోధక ప్రత్యయాలు
- 12.3.4 విభక్తులు
- 12.3.5 సంఖ్యా వాచకాలు
- 12.3.6 క్రియలు
- 12.3.7 తెలుగులో పర్షో అరబిక్ పదాల ప్రవేశం

అవగాహన ప్రశ్న

12.4 సారాంశం

అవగాహన ప్రశ్నకు జవాబు

- చదవదగిన పుస్తకాలు
- మాదిరి పరీక్షా ప్రశ్నలు


## 12.0 లక్ష్యాలు

ఈ భాగం చదివాక కింది అంశాలను మీరు [illegible]కరించగలుగుతారు :

- తెలుగులో ఏర్పడిన రెండు పాయలు కావ్యభాషాశైలి, వాడుకశైలి.
- తెలుగులో అన్యదేశ్యాలు – పర్షోఅరబిక్ పదాల ప్రవేశం.

BRAOU

## 12.1 పరిచయం

పదకొండవ శతాబ్ది ప్రారంభకాలం నాటికి పండిత సాహిత్యానికి ఒరవడి అయిన కావ్యభాష రూపుదిద్దుకుంది. ఆ భాషకు మూడు, నాలుగు వందల సంవత్సరాల పరిణామదశ ఉంది. ఆ కావ్యభాషాశైలిలోనే నన్నయ భారతరచన జరిగింది. తరువాత కవులకు అదే ఆదర్శం అయింది. అందువల్ల కావ్యభాషలో మార్పులు ఎక్కువగా కనిపించవు. నన్నయ భాషా శైలినే ఆదర్శం చేసుకుని ప్రాచీనకవులు రచనలు చేశారు. అయినా వాడుకలో భాష అనేకమైన మార్పులను పొందుతూనే ఉంది. ఈ రూపంలో తెలుగుభాషా పరిణామాన్ని తెలుసుకోవడానికి నన్నయ తరువాత కూడా శాసనాలే ఆధారాలు. శాసనాలైనా సమకాలీన భాషను సమగ్రంగా ప్రతిబింబిస్తుందని చెప్పటం కష్టం. శాసనాలకు పరిమిత ప్రయోజనం ఉంది. ఇందుకు ఉపయోగించే భాషకూడ పరిమిత స్వరూపం కలిగి ఉంటుంది. దానివివరాలు, విజయయాత్రలు, రాజుల, రాజప్రతినిధుల తీర్పులు మొదలైన విషయాలకు మాత్రమే శాసనభాష పరిమితం, ఇవి వచన శాసనాలకు సంబంధించిన విషయం. పద్యశాసనాల్లో కావ్యభాషే కనిపిస్తుంది. వచన శాసనాలలోని భాష రాజకీయ వ్యవహారాల్లో ఉపయోగించే ఒక ప్రత్యేకమైన శైలికి సంబంధించినదిగా పేర్కొనవచ్చు. కాబట్టి కొంతవరకైనా తెలుగుభాషలో ఆయా దశల్లో వచ్చిన మార్పులను తెలుసుకోవటానికి శాసనాలే ఉపయోగిస్తాయి. మధ్యకాలీన దశ II లోని శాసనాలు, కావ్యాలు వీటిలోని భాషాశైలుల పరిణామాన్ని ఈ భాగంలో పరిచయం చేస్తున్నాము..

## 12.2 భాషలో రెండు పాయలు

నన్నయ భారత రచనకు పూర్వమే పండిత సాహిత్యానికి ఒరవడి అయిన కావ్యభాషాశైలి ఒకటి రూపుదిద్దుకుందని, అదే శైలిలో భారతరచన సాగిందని మీరు తెలుసుకున్నారు. తెలుగు భాషలోని ఈ పాయ కావ్యభాషాశైలి. మరొక పాయ క్రీ. శ. 600 నుండి తెలుగు వచన శాసనాల్లో కన్పించే వాడుకశైలి. తెలుగు కావ్యభాషపైన శాసనాలలో కన్పించే సమకాలిక వాడుక భాషా ప్రభావం క్రీ. శ. 15, 16 శతాబ్దులదాకా చాలా తక్కువగానే కనిపిస్తుందని చెప్పాలి. 13వ శతాబ్దానికి చెందిన కేతన తన "ఆంధ్రశబ్ద చింతామణి" లో "తెచ్చుతాడు, వీటిమమ్మూ, పంచాకుము, తోపించాకుము" మొదలైన గ్రామ్యాలను కావ్యాలలో ప్రయోగించకూడదన్నాడు. అంటే కావ్యభాష, వాడుకభాష రెండు పాయలుగా ఆనాటికి స్పష్టంగా స్థిరపడ్డాయన్నమాట. కావ్యభాషకు ప్రజాభాషకు మరీ దూరమైందన్నమాట. అయినా శ్రీనాథాదుల రచనలలో వ్యవహారిక భాషా ప్రయోగాలెన్నో జొరబడ్డాయి.

## 12.3.0 మధ్యకాలీన భాష ప్రత్యేక ప్రాధాన్యం

తెలుగు భాషా వికాసంలో క్రీ. శ. 1000 – 1600 మధ్యకాలానికి ప్రత్యేక ప్రాధాన్యత ఉంది. మొదటిసారిగా పండిత కావ్యభాషాశైలిలో రచించిన మహాకావ్యం నన్నయ భారతం, ఈ కాలం మొదట్లోనే లభించింది. తెలుగుభాషలో అంతకుముందు మొదలైన మార్పులెన్నో పదకొండవ శతాబ్దినాటికి స్థిరపడ్డాయి. ఆధునిక భాషాలక్షణాలని చెప్పదగ్గ మార్పులెన్నో ఈ కాలం మొదటిదశలో ప్రారంభమై చివరిదశలో స్థిరపడ్డాయి. ఈ మార్పులు కొన్ని కావ్యభాషలో కూడా ప్రవేశించాయి. వైష్ణవ, వీరశైవ మతాలతో పాటు సజాతీయభాషలైన తమిళ, కన్నడ పదజాలం తెలుగులో చేరాయి. నన్నయ మార్గపద్ధతికి భిన్నంగా ప్రయోగంలో ఫలించకపోయినా "దేశి" "జానుతెనుగు" ఉద్యమాలు ఈ కాలంలోనే కనిపిస్తాయి. క్రీ. శ. 13, 14 శతాబ్దాల నుండి మహమ్మదీయులతో వ్యాపార, రాజకీయ, పాలనా సంబంధాల వల్ల పెర్షో–అరబిక్ పదాలుకూడా తెలుగులో కలిసిపోయాయి. కావ్యాలలోకికూడా ఎక్కాయి. అన్నమయ్య వంటి సంకీర్తనకారుల భాషలో వ్యావహారికభాష పూర్తిగా చోటు చేసుకొంది. క్రీ. శ. 1600 నాటికి తెలుగు ఆధునికభాషా స్వరూపానికి పూర్తిగా దగ్గర అయింది.

### 12.3.1 వర్ణాలు, ధ్వనుల మార్పులు

ఈ కాలపు తెలుగు పదాలలో "క, గ, చ, జ, ట, డ, త, ద, ణ, న, మ, య, ర, ల,ళ, స" అనే హల్లులు. "అ, ఆ, ఇ, ఈ, ఉ, ఊ, ఎ, ఏ, ఒ, ఓ" అనే అచ్చులు కనిపిస్తాయి. దేశ్యపదాలలో తొంభయ్, ఎనభై, యాభై మొదలైన దేశ్య సంఖ్యావాచకాలలో మాత్రమే మహాప్రాణాలు కనిపిస్తాయి. "ఱ", "ర" లు పూర్వయుగంలోనే కలిసిపోయినా కావ్యభాషలో మాత్రం వీటి భేదాన్ని నిలబెట్టి పాటించే ప్రయత్నం జరిగింది. తిక్కన, శ్రీనాథులు మాత్రం ఈ రెంటికీ ప్రాస కలిపినట్లు కనిపిస్తుంది. "ళ", "ల" లు ఇంతుముందు కాలంలోనే కలిసిపోయినా ద్విరుక్తంగా, సంధికారణంగా, ప్రత్యేకవర్ణంగా "మూళ్ళు, గుళ్ళు" మొదలైన వాటిలో కనిపిస్తుంది. శాసనాలలో "పళ్ళ్యం, పళ్ళం, పళ్ళాలు" మొదలైన విధంగా కనిపించే రాతలోని భేదం ఏ అనే వివృతోచ్చారణను సూచిస్తుంది. "ర" వర్గానునాసికాలకు బదులు అనుస్వారం రాయటం ఈ కాలంలో స్థిరపడింది. "చ", "జ" లకు తాలవ్యాచ్చుల (ఇ, ఈ, ఎ, ఏ) కు ముందు తాలవ్యోచ్చారణ తాలవ్యేతరాచ్చు (అ, ఆ, ఉ, ఊ, ఒ, ఓ) లకు ముందు దంతమూలీయోచ్చారణ ఉండేదనటానికి శాసనాలలో లేఖనప్రమాణాలున్నాయి. ఉదా : పుత్సుకాని, త్సంపిన, అచ్చులమధ్య "మ" కారానికి "వ" అనే ఉచ్చారణ ఉండేదనటానికి కూడా లేఖనంలో ఆధారాలున్నాయి. ఉదా : మామిడి / మావిడి.

సంస్కృత, ప్రాకృతాల ద్వారా తెలుగులో ప్రవేశించిన "ఖ, ఘ, ఛ, ఝ, ఠ, ఢ, థ, ధ, ఫ, భ, శ, ష, హ" అన్న హల్లులు కావ్యశాసనాలలో కనిపిస్తాయి. సంస్కృతంలోని "ఋ" 12వ శతాబ్దివరకు "రి" గా కనిపిస్తుండగా, ఆ తరువాత క్రమంగా "రు" గా కనిపిస్తుంది. ఉదా : రిషభ (ఋషభ), రుతు (ఋతు) నన్నయ "ఋ–రి" లకు యతిమైత్రి పాటించాడు. పాల్కురికి సోమన, తిక్కనలు "ఋ–రి" లకు యతి మైత్రి అంగీకరించారు . "థ" కారానికి "ధ" కారోచ్చారణ ఈ కాలంలో ప్రచురం అయింది. సంస్కృత, ప్రాకృత పదాలతో అనేక సంయుక్త వర్ణాలు కూడా తెలుగులో చేరాయి.

BRAOU

పర్షో-అరబిక్ పదాలతో పాటు క్రీ.శ. 15వ శతాబ్ది నుంచి తెలుగులో f, x, q, r, z ధ్వనులు ప్రవేశించాయి. కాని వీటిని ఈకాలంలో ప్రత్యేక వర్ణాలుగా గుర్తించటానికి ఆధారాలు లేవు. ఈ భాషలను బాగా చదువుకున్నవాళ్ళు వీటిల్లో కొన్ని ధ్వనులనైనా ఉచ్చరించగలిగేవారని శాసనాల్లోని లేఖన భేదాలవల్ల ఊహించవచ్చు. ఈ వర్ణాలను వాటి ఉచ్చారణకు దగ్గరగా ఉండే వర్ణాల లిపి సంకేతాలతో గుర్తించటం జరిగింది. f ను 'ఫ' తోను, 'ప' తోను గుర్తించారు. ఉదా : సఫరు, పకీరు, 'xq' లను ఖ, కలతో గుర్తించారు. ఉదా : ఖబరు, కత్తు, ముఖాపి, 'r' ను ర తోను, 'z' జ తోను గుర్తించారు. ఉదా : నిజాం.

తెలుగులో పదవ శతాబ్ది వరకు వచ్చిన అనేకమైన మార్పులు భాషలో స్థిరపడటం, కొత్త మార్పులు రావటం ఈ కాలంలో జరిగింది. ఈ మార్పులు (1) పదాది డకారం దకారంగా మారటం పదవ శతాబ్దానికే ప్రారంభమై క్రమంగా స్థిరపడింది. నన్నయ భాషలో కూడా రెండు రకాల రూపాలు కనిపిస్తాయి. ఉదా : డప్పి, దప్పి, డాచు, దాచు. (2) పదాది సంయుక్తాక్షరాలైన క్ర, ప్ర మొదలైన వాటిలో రెండవ వర్ణమైన ర లోపించటం క్రీ.శ. 7, 8 శతాబ్దులలోనే ప్రారంభం అయినా నన్నయ మొదలుకొని కావ్యభాషలోను, పండిత ప్రయోగాల లోను ర లోపంలేని రూపాలనే అంగీకరించారు. వ్యావహారిక భాషలో మాత్రం ర లోపించిన రూపాలు 15, 16 శతాబ్దుల నాటికే స్థిరపడ్డాయి. ఉదా : కొత్త, పాత. (3) నన్నయనాటికే ఇకారాంత శబ్దాలు ఎ కారాంతాలుగా మారినట్టు కనిపిస్తాయి. నన్నయ భారతం మొదలుకొని క్రీ.శ. 16వ శతాబ్దం వరకు కావ్యభాషలో ఈ రెండు రకాల రూపాలు పర్యాయంగా కనిపిస్తాయి. ఉదా : గద్దియ, గద్దె, పల్లి, పల్లె, తేనియ, తేనె. వ్యావహారికానికి దగ్గరగా ఉండే శాసనాలలో మాత్రం ఎకారాంతాలే హెచ్చు. (4) పూర్ణాచ్చుకు అనునాసికోచ్చారణను సూచించే అర్ధాను స్వారం వ్యావహారిక భాషలో తన విలువను కోల్పోయిందనటానికి ఒకప్పుడు, అనుస్వార చిహ్నం లేకుండా శాసనాల్లో రాసిన పదాలే నిదర్శనం ఉదా : ఏబై, ఏంబై; ఏటాను, ఏంటాను; తూకాలు, తూంకాలు.

వచన శాసన భాషకు సంబంధించి కావ్యభాషా వ్యాకరణ సంధి సూత్రాలు నియతంగా అన్వయించవు. పాల్కురికి సోమన, తిక్కన వంటి వారి భాషలో కూడా ఇవి నియతంగా వర్తించినట్లు కనిపించవు. క్త్వార్థక ఇకారానికి సంధిలేదని వ్యాకరణాలు ఘోషించినా శాసనభాషలోనూ, సోమనాథ, తిక్కనాదులలోను ఈ సంధి కనిపిస్తుంది. ఉదా : కట్టియ్యడం, కట్టి ఇయ్యడం; పోసిచ్చిరి, పోసి ఇచ్చిరి; కలిగుండు, కలిగి ఉండు; ఇకారానికి లోపం జరిగిన తర్వాత దానిపైన అచ్చు తాలవ్యీకృతం కావటం ఆధునికభాషలో కనిపిస్తుంది. శాసనాలలో అనీతల్లమంగారు, అనితల్లి అమంగారు; కామాక్షమ్మ, కామాక్షి అమ్మ మొదలైన విధంగా కనిపించేవిధంగా లేఖన భేదాన్నిబట్టి 15, 16 శతాబ్దుల నాటికే అలాంటి ఉచ్చారణ ఉండేదని ఊహించవచ్చు.

### 12.3.2 సంధి

సంధికి సంబంధించి ఆధునిక లక్షణాలు కొన్ని 5, 6 శతాబ్దుల నాటికే శాసనాలలో కనిపిస్తాయి. అవి (1) తద్ధర్మార్థక విశేషణమైన '-ఏ' కు 'అట్టు, అందుకు, పరమైనప్పుడు హ్రస్వాచ్చు లోపిస్తుంది. లేదా 'ఏ అ' ల మధ్య 'ట' కారం చేరుతుంది. ఉదా! నడిచేట్టుగాను, అయ్యేటట్టుగాను, (2) రెండు హల్లులకు మధ్య అచ్చు లోపించటం, అంటే మొదటి పదం చివరి అచ్చు రెండవ పదం మొదటి హల్లుకు ముందు లోపించటం 15వ శతాబ్ది నుంచి కనిపిస్తుంది. ఉదా! కోమట్రెడ్డి (కోమటి రెడ్డి) కొంద్రాజు (కొండ రాజు) (3) కావ్య భాషకు సంబంధించినంతవరకు ద్రుత నకారం ఒకటే పదాంత హల్లు. కాబట్టి ద్రుత ప్రకృతిక సంధి కావ్య భాషలలో మాత్రమే కన్పిస్తుంది. కావ్య భాషలో ప్రకృతికాలుగా కనిపించే రూపాలు శాసనభాషలో 9వ శతాబ్ది నుంచే కళలుగానే ప్రవర్తించటం చూడవచ్చు. ఉదా: ఇన్దుప్రత్యంక్షంబై (యుద్ధమల్లుడి శాసనం) వీనిసే కాని, పుష్పాలకు ఇచ్చిన. (4) యకారాంతాలైన ముప్పై మొదలైన పదాలలోని చివరి 'య' కారం అచ్చుకు ముందు ద్విరుక్తం కావటం 16వ శతాబ్ది నుంచే కన్పిస్తుంది. ఉదా : ముప్పై ముప్పయ్యారు. (ద్రుత నకారానికి "కచటతప" లు పరమైనప్పుడు "గజడదబ"లు కావటం కావ్యభాషలోనే ప్రధానంగా కనిపిస్తుంది. శాసనాలలో కూడా కావ్య భాషను ఉపయోగించిన చోటే ఇది కనిపిస్తుంది. ఉదా : కిందనుంబెట్టిన, నరకాలంగూలు వారు. 16వ శతాబ్దం నుంచీ శాసనాలలో సంధి లేకపోవటమే ఎక్కువగా కనిపిస్తుంది. ఉదా : బ్రాహ్మని చంపిన ఏండాదికి పుట్లు.

### 12.3.3 లింగబోధక ప్రత్యయాలు

లింగ బోధక ప్రత్యయాల విషయంలో ఇంతకు ముందు కాలానికి ఎక్కువ భేదం కనిపించదు. కాని బహు వచన రూపాలలో "పాపాలు, కరణాలు, కోమంట్లు, ఏండ్లు, తాళ్ళు, ఊళ్ళు, రాత్రుళ్ళు/రాత్రిళ్ళు, దేవర్లకు,

BRAOU

కొమార్లు" వంటి ఆధునిక రూపాలు 11వ శతాబ్ది నుండే ప్రారంభమై 15, 16 శతాబ్దుల కాలానికి ప్రచురంగా కనిపిస్తాయి. ఇలాంటి రూపాలు శ్రీనాథుని కావ్యాలలో కూడా కనిపిస్తాయి. ఉదా : కళ్యాలన, చుట్టాలు, నాలుగు మూళ్ళు మొదలైనవి. గౌరవార్థకంగా - గారు 15, 16 శతాబ్దుల నాటికి ప్రచురంగా కనిపిస్తుంది. ఉదా : సూరసంగారు. ఆధునికమైన ఔపవిభక్తిక రూపాలు కొన్ని 11, 12వ శతాబ్దుల నుంచి కనిపిస్తాయి. ఉదా : దేవుడికి (13వ శ.), గోపీనాథుంటి (16వ శ.) దేవున్ని (16వ శ.), దీపానికి (13వ శ.), ధర్మాన్ని (12వ శ.), నుతింటికి (11వ శ.) వాటిని (14వ శ). ఔపవిభక్తిక ప్రత్యయం చేరని పడమటి-ను, తిరువీడు-లో మొదలైన ఆధునిక రూపాలు 15, 16 శతాబ్దుల నుండీ శాసన భాషలో కనిపిస్తాయి.

### 12.3.4 విభక్తులు

విభక్తుల విషయంలో ఆధునిక భాషా లక్షణాలెన్నో ఈ కాలంలో కనిపిస్తాయి. తృతీయ పంచమీ విభక్తులలో 'వలనన్/వల్ల" 13, 14 శతాబ్దులనుండీ శాసనభాషలో కనిపిస్తుంది. ఉదా : జీతాల వలనం తృతీయ విభక్తిలో సహార్థంలో "తోడ" తో "పాటు - తోటి" అనే రూపం 15వ శతాబ్ది నుంచీ కనిపిస్తుంది. ఉదా : ఖండికల తోటి మర్యాద. చతుర్థిలో కొఱకు 14వ శతాబ్ది నుంచి మాత్రమే కనిపిస్తుంది. ఉదా: అభీష్టసిద్ధి కొఱకు. పంచమిలో నుండి నన్నయ భారతంలోను, శాసన భాషలోను కనిపిస్తుంది, ఉదా : నీరిలోన నుండి, గంగ కటుత నుండి. పోల్చటానికి కంటెన్ ఉపయోగంలో ఉండేది ఉదా : నాకాధీశ పురంబు కంటె (12వ శ) - పట్టి శ్రీనాథుని కాలంలో కనిపిస్తుంది. ఉదా: సేవింపబట్టి. శాసనాలలో అది 17వ శతాబ్ది నుంచి మాత్రమే కనిపిస్తుంది. కావ్యభాషలో కనిపించే పంచమీ విభక్తి సూచకమైన "-కోలెన్" వ్యవహారిక భాషలో కనిపించదు. ఉయ్యూరు వద్ద (12వ శ.), గుంటవద్దను (16వ శ.), క్షేత్రాల కాడ (15వ శ.) కొండవీటి దనకాను (16వ శ.) మొదలైన భిన్న విభక్త్యర్థాలను సూచించే ఆధునికరూపాలు ఈకాలంలో కనిపిస్తాయి.

### 12.3.5 సంఖ్యావాచకాలు

ఒక్కటి (11వ), ఎనిమిది (12వ), పదునాలుగు (15వ), పదహారు(16వ) పందొమ్మిది (13వ శ.), యిరవై (16వ శ.), ముప్పై (13వ శ.), నల్బయి (13వ శ.), నలుపై (15వ 16వ శ.), ఏభై (15వ శ.), అరవయి (15వ శ.), డెబ్బయి (12వ శ.). డెబ్బై (16వ శ.), ఎనభై (14వ శ.), తొంభయి (13వ శ.) మొదలైన ఆధునిక సంఖ్యావాచక రూపాలు ఈ కాలంలో శాసనభాషలో ప్రచురంగా కనిపిస్తాయి. ఇరువైవంటి రూపాలను శ్రీనాథుడు మొదలైన కవులుకూడా ప్రయోగించారు. ఐదు అన్నది కన్నడం నుంచి తెలుగులోకి వచ్చింది. ఏను అనేదే తెలుగులో ప్రాచీనరూపం. ఏభై మొదలైన వాటిలో ఈ నాటికీ కనిపించేది అదే.

### 12.3.6 క్రియలు

క్రియలలో కూడా ఆధునిక రూపాలెన్నో ఈకాలంలో కనిపిస్తాయి. భూతకాలం : ఇస్తిమి (12వ శ.), ఇస్తిరి (16వ శ.), శ్రీనాథుని చాటువుల్లోకూడా చూస్తిమి, రోస్తిమి వంటి రూపాలు కనిపిస్తాయి. వచ్చినవాడు, వచ్చినవారు మొదలైన భూతకాల క్రియలు శాసనాల్లో 11వ శతాబ్ది నుంచీ కనిపిస్తాయి. 13వ శతాబ్ది నుంచి కావ్య భాషలోకి ఎక్కాయి. వర్తమానకాలం : "చేయుచున్నాడు" వంటి రూపాలు కావ్యభాషలో కనిపిస్తాయి. సేస్తుం న్నాడు, చేయింస్తున్నారువంటి ఆధునిక రూపాలు 15వ శతాబ్ది నుంచి శాసనాల్లో కనిపిస్నాయి. తద్ధర్మకాలంలో ధరించెదము, వచ్చెదవు వంటి వాటి నుంచి వచ్చిన ధరించేము, వచ్చేవు మొదలైన ఆధునిక రూపాలు 16వ శతాబ్దినుంచే శాసనాల్లోనూ, 15వ శతాబ్దిలో తాళ్ళపాక అన్నమయ్య రచనలలోనూ కనిపించినా, 13వ శతాబ్ది నాటికే ఈలం ఇలాంటి రూపాలు జనవ్యవహారంలో ఉన్నట్టు కేతన "పంపేరు, పాడేరు, సూసేరు" మొదలైన వాటిని గ్రామ్యాలని పేర్కొనటాన్ని బట్టి తెలుస్తుంది. భవిష్యత్కాలంలో "కొలువంగ్గలరు, చేయగలడు" మొదలైన క్రియలు కావ్యభాషలోను, శాసనభాషలోను కనిపిస్తాయి. "నేస్తారు, పొందుతారు" వంటి ఆధునిక క్రియారూపాలు శాసనాలలో 16వ శతాబ్ది నుంచీ కనిపించినా కేతన గ్రామ్యాలుగా పేర్కొన్న "తెచ్చుతారు, కందాము, యిందాము" మొదలైన వాటినిబట్టి 13వ శతాబ్దానాటికే అలాంటి క్రియారూపాలు వ్యవహారంలో ఉన్నాయని చెప్పవచ్చు. కొంటూ, మోసేటివారు మొదలైన ఆధునిక రూపాలు కూడా 13వ శతాబ్దినాటివేనని కేతన పేర్కొన్న దానినిబట్టి చెప్పవచ్చు. "సేయండి" వంటి విధ్యర్థక బహువచన రూపాలు కూడా 14, 15వ శతాబ్దాల నుంచి వ్యవహారంలో ఉన్నాయి. "చేసుకొని, వండుకొని" మొదలైన వాటికి అర్వాచీన రూపాలైన



BRAOU

"చేసుక, వండుక" వంటి ఆధునిక రూపాలు కూడా 15వ శతాబ్ది నుంచీ కనిపిస్తున్నాయి. "చేయలేదు" వంటి వ్యతిరేక క్రియలు క్రీ.శ. 1600 నుండి కనిపిస్తున్నాయి.

"అతడును, నీవును" మొదలైన కావ్య భాషా రూపాలలో సముచ్చయార్థకంగా 'ను' కొనసాగినా, ఆధునిక యుగంలోలాగా చివర అచ్చు దీర్ఘం కావటంవల్ల సముచ్చయార్థం వ్యక్తంకావటం పదవ శతాబ్దం నుంచి కనిపిస్తుంది. ఉదా : స్వామికీ, ఏకొదవ. 13వ శతాబ్ది నుంచి కావ్యభాషలో కూడి ఇలాంటి ప్రయోగాలు కన్పిస్తాయి. "నమ్మీనమ్మని" అని తిక్కన ప్రయోగం. శ్రీనాథుడు, ప్రబంధ కవులు ఇటువంటి ప్రయోగాలు చాలా రాశారు. "-ఇనన్/-ఇనాన" ప్రాచీన చేదర్థక ప్రత్యయం. ఉదా : పేర్కొనినన్, అమ్మినాను "-ఇతే/-తే" లు చేదర్థక ప్రత్యయాలుగా 13వ శతాబ్ది నుంచీ కనిపిస్తాయి. ఉదా : పోయితేను, చేస్తే.

### 12.3.7 తెలుగులో పర్షో అరబిక్ పదాల ప్రవేశం

సాంస్కృతిక, రాజకీయ, కారణాలవల్ల తెలుగులో సంస్కృత పదాలెన్నో చరిత్ర పూర్వదశ నుండే చేరుతూ వచ్చాయి. మహమ్మదీయుల పరిపాలనా కాలంలో అరబిక్‌భాషా పదాలు తెలుగువారి రాజకీయ, సాంఘిక, పరిపాలనా రంగాల్లో వ్యవహారంలోకి వచ్చాయి. 13వ శతాబ్దంలో మహమ్మదీయరాజులు తెలుగుదేశం పైన దండయాత్రలు చేయకముందే తెలుగువారికి మహమ్మదీయులతో వ్యాపార సంబంధాలుండేవి. తిక్కన భారతంలో 'త్రాసు' (తరాజు) అన్న పదం రెండు సార్లు కనిపిస్తుంది. ఇదే తెలుగులో కనిపించే మొదటి పర్షో - అరబిక్ పదం. తరువాత కాలంలో మహమ్మదీయులు ఆంధ్రదేశాన్ని ప్రత్యక్షంగా పరిపాలించటంవల్లగాని, తెలుగు రాజ్యం చుట్టుపట్ల ఉండే మహమ్మదీయ రాజ్యాలతో ప్రత్యక్ష సంబంధాలు ఏర్పాటు చేసుకోవటంవల్లగాని రాజోద్యోగులు చాలామంది పర్షియన్ భాషను నేర్చుకొని ఉంటారు. విజయనగర రాజులు అరబ్బుల దగ్గర, పారశీకుల దగ్గర గుర్రాలు కొనేవారు. మహమ్మదీయులను తమ సైన్యంలో చేర్చుకొనేవారు. తెలుగుదేశం ఔరంగజేబు పరిపాలనలో కూడా కొంతకాలం ఉంది. ఈ క్రమంలో పర్షో-అరబిక్ భాషా పదాలు తెలుగులో చేరి ఉంటాయి. శ్రీనాథుడు తన భీమఖండం (క్రీ.శ. 1420) లో వీరభద్రారెడ్డి మంత్రి బెండపూడి అన్నయ అరబిక్, పర్షియన్, టర్కిష్ భాషలతో పరిచయం ఉన్నవాడని పేర్కొన్నాడు. ("అరబీ భాష 'తురుష్కభాష గజ కర్ణాట కాంధ్ర భాషల్ ... ...) న్యాయ, సైనిక, పాలనారంగాలకు సంబంధించిన పర్షో - అరబిక్ పదాలు తెలుగులో ఎక్కువ కనిపిస్తాయి. అవి కావ్యాలలోను, శాసనాలలోను కూడా కనిపిస్తాయి. 15వ శతాబ్ది ఉత్తర భాగం నుంచి పాలనా వ్యవస్థకి సంబంధించినవి, సైనిక వ్యవహారాలలో ఉపయోగించేవి. న్యాయ శాస్త్రానికి సంబంధించినవి సుమారు 200 పర్షో - అరబిక్ పదాలు, కనిపిస్తాయి. 'సుల్తాని పాదుషా, ఫర్మానా, హుజూరు, కితాబు మొదలైన రాజకీయ సంబంధమైన పదాలు, 'సిపాయి, బందుకు, తుపాకి, ఫౌజు, బందోబస్తు' మొదలైన సైనిక వ్యవహార సంబంధమైన పదాలు, న్యాయ వ్యవస్థకు సంబంధించిన 'దివాను, నకలు, నకాబత్తు' మొదలైన పదాలు, 'కౌలు, కుశ్కీ' మొదలైన రెవెన్యూ పదాలు, 'కుర్చీ' మొదలైన వస్తు వాచకాలు ఈ పదాలలో కనిపిస్తాయి. శ్రీనాథుడు, అల్లసాని పెద్దన మొదలైన కవులందరూ స్వేచ్ఛగా పర్షో - అరబిక్ పదాలను వాడారు.

## అవగాహన ప్రశ్న

క్రీ.శ. మధ్యకాలీనదశ I లో తెలుగులో ప్రవేశించిన పర్షో - అరబిక్ పదాలను పది వాక్యాల్లో పరిచయం చేయండి.

BRAOU

## 12.4 సారాంశం

ఈ భాగంలో కింది ప్రధానాంశాలను గ్రహించారు.

- పదకొండవ శతాబ్దానికి ముందే అంటే నన్నయకు ముందే భాషలో రెండు పాయలు కనిపిస్తాయి. ఒక పాయ తెలుగు వచన శాస్త్రాల్లో కన్పించే వాడుకశైలి. మరొకపాయ పద్య శాసనాల్లో కన్పించే పండితుల కావ్యభాషా శైలి. వీటినే వాడుక భాష అనీ, కావ్యభాష అనీ అంటారు.
- ఈ దశలో తెలుగులో ప్రవేశించిన అన్య దేశ్యపదాలు పర్షో అరబిక్ పదాలు. శ్రీనాథుడు, పెద్దన వంటి కవులు కావ్యాల్లో 900 పదాలు వాడారు. ముస్లిం భాష సంస్కృతుల సమ్మేళనానికి ఇది నిదర్శనం.

### అవగాహన ప్రశ్నకు జవాబు

మహమ్మదీయుల పరిపాలనా కాలంలో తెలుగుభాషలో పర్షో - అరబిక్ పదాలు సంకీర్ణతా గుణంవల్ల ప్రవేశించాయి. తిక్కన భారతంలో కనిపించే త్రాసు (తరాజు) తెలుగులో మొట్టమొదటి పర్షో - అరబిక్ పదం. తర్వాత తర్వాత మహమ్మదీయుల దండయాత్రలూ, పాలనే కాకుండా అరబ్బులు, పారశీకులతో వ్యాపార వాణిజ్యాలు దేశంలో కొనసాగడంవల్ల వీటి సంఖ్య తెలుగులో మరింత పెరిగింది. అవి కావ్యాల్లోనూ శాసనాల్లోనూ కనిపిస్తాయి. 15 శతాబ్ది ఉత్తర భాగం నుండి పాలనా వ్యవస్థకూ, సైనిక వ్యవహారానికీ, న్యాయశాస్త్రానికి సంబంధించిన సుమారు 200 పర్షో అరబిక్ పదాలు తెలుగులో స్థిరపడ్డాయి. కావ్యాల్లో 900 కనిపిస్తాయి. "సుల్తాన్, పాదుషా, ఫర్మానా, హుజూరు, కితాబు (రాజకీయపదాలు); సిపాయి, బందుకు, తుపాకీ, ఫౌజు (సైనిక వ్యవహారం); దివాను, నకలు, నకాబత్తు (న్యాయశాస్త్రం); కౌలు, కుర్కీ (రెవెన్యూ పదాలు); కుర్చీ (వస్తు వాచకాలు) వాటిలో కొన్ని.

### చదవదగిన పుస్తకాలు

15వ భాగంలో చూడండి.

### మాదిరి పరీక్షా ప్రశ్నలు

I. కింది ప్రశ్నలకు 30 వాక్యాలకు మించకుండా సమాధానాలు రాయండి.

1. మధ్యకాలీన దశ II లో సంభవించిన తెలుగు భాషా పరిణామ ప్రాధాన్యాన్ని దృష్టాంతాలతో వివరించండి.
2. తెలుగు భాషలోని రెండు పాయలేవో తెల్పి, అవి భాషలో ఎట్లా కొనసాగాయో వివరించండి.

II. కిందివాటికి 10 వాక్యాలకు మించకుండా జవాబులు రాయండి.

1. క్రీ.శ. 1000-1600 మధ్య ధ్వనుల మార్పుల్ని పరిశీలించండి.
2. క్రీ.శ. 1000-1600 మధ్య క్రియలను పరిశీలించండి.

BRAOU

# భాగం-13 తెలుగుభాష-మధ్యకాలీనదశII (క్రీ.శ.1600-1800)

## విషయక్రమం

13.0 లక్ష్యాలు
13.1 పరిచయం
13.2 దశ ప్రాధాన్యం
13.3 క్రీ.శ. 1600 నాటికి స్థిరపడ్డ ఆధునిక భాషా పద్ధతులు
13.4. వచనరచన - వాడుక భాష
13.5 కావ్యభాషలో వాడుక భాషారూపాలు
13.6 తెలుగులో పోర్చుగీసు పదాల ప్రవేశం
అవగాహనప్రశ్న
13.7 సారాంశం
అవగాహన ప్రశ్నకు జవాబు
చదవదగిన పుస్తకాలు
మాదిరి పరీక్షా ప్రశ్నలు

## 13.0 లక్ష్యాలు

BRAOU

ఈ భాగం చదివాక క్రీ.శ. 1600 నాటికి స్థిరపడిన ఆధునిక భాషా లక్షణాలను వింగడించగలుగుతారు. అంతే కాదు, వాడుకభాషకు ఈ దశలో వచ్చిన వచన రచన విస్తృతంగా ఎల్లా సాగిందో, కావ్యభాషాశైలిలో వాడుక భాషారూపాలు ఏరకంగా చోటుచేసుకున్నాయో, కొత్తగా వచ్చి చేరిన పోర్చుగీసు పదాలు కొన్ని ఏవేవో మీరు వివరించగలుగుతారు.

## 13.1 పరిచయం

క్రీ.శ. 1600-1800 మధ్య కాలాన్ని తెలుగుభాష మధ్యకాలీన దశగా మనం ఈ భాగంలో గుర్తిస్తున్నాము. ఆధునిక దశలో జరగబోయే పరిణామాలకు రంగం మన భాషలో, సమాజంలో సిద్ధమైందని ఈ భాగం చదివాక మీరు అవగాహన చేసుకుంటారు.

## 13.2 దశ ప్రాధాన్యం

తెలుగుభాషా వికాసంలో క్రీ.శ. 1600-1800 మధ్యకాలపు చరిత్రకు కూడా ఒక ప్రత్యేక ప్రాధాన్యం ఉంది. క్రీ.శ. 1600 నాటికి తెలుగు ఆధునిక భాషా లక్షణాలను సంతరించుకుంది. సమకాలీన వ్యావహారిక భాషలో "రాయవాచకం" లాంటి చారిత్రక వచన గ్రంథాలు 1600 లకు కొంచెం అటు ఇటుగా ప్రారంభమయ్యాయి. కావ్యభాషాశైలి విషయంలో నన్నయాదుల సంప్రదాయమే కొనసాగినా, వ్యావహారిక భాషారూపాలు కావ్యభాషలో విరివిగా ప్రవేశించాయి. యక్షగానాలవంటి రచనలలో పాత్రోచిత భాషగా వ్యావహారిక భాషను, మాండలికాలను ఉపయోగించటం జరిగింది. క్రీ.శ. 1600 లకు ముందు నుంచే పోర్చుగీస్, డచ్ వారితో ఉన్న వ్యాపార రాజకీయ సంబంధాలవల్ల ఈ భాషాపదాలనేకం తెలుగులో ప్రవేశించాయి.

## 13.3 క్రీ.శ. 1600 నాటికి స్థిరపడ్డ ఆధునిక భాషా పద్ధతులు

క్రీ.శ. 1600 నాటికి స్థిరపడ్డ ఆధునిక భాషా లక్షణాలను సంగ్రహంగా కింది విధంగా పేర్కొనవచ్చు :

1. తెలుగులో తత్సమ, తద్భవ పదజాలంతో పాటు పర్షో - అరబిక్ భాషా పదాలు కూడా కలిసిపోయి స్థిరపడ్డాయి. ఆ పదాలతో పాటు భాషలో చేరిన వర్ణాలు తెలుగువర్ణ సమామ్నాయంలో భాగం అయ్యాయి. అవి అచ్చ తెలుగు కావ్యాలలో కనిపించటం మరీ విశేషం.

2. మూలద్రావిడ భాషాదశ నుండి తెలుగులో వచ్చిన అనేక ధ్వని విపరిణామాలు భాషలో స్థిరపడి మారిన రూపాలే వ్యవహారంలో నిలిచాయి.

3. వ్యవహారంలో ఉన్న అనేక ఉచ్చారణ భేదాలను, శాసనాలలోని లేఖన భేదాలను, రాయవాచకం వంటి వచనగ్రంథాల వల్ల తెలుసుకోవటానికి అవకాశం ఉంది. ఉదాహరణకు : "మ్యారకు, వ్యాళ" వంటి లేఖన సంప్రదాయాలు ఏ కారానికి అకారానికి ముందుగల వికృతోచ్చారణ (ఏ) ను సూచిస్తుంది. "యిది యేనుగు, వుండే" మొదలైన రాతలు "ఇ, ఈ" లకు ముందు యకారాన్ని, "ఉ, ఊ, ఒ, ఓ" లకు ముందు వ కారాన్ని చేర్చి ఉచ్చరించటం సర్వసామాన్యంగా ఉండేదని తెలియచేస్తాయి. అప్పకవి "జిహ్వ, విహ్వ" మొదలైన పదాలలో బిందువులేదని, "సంహతి, నృసింహ" మొదలైన పదాలలో వ కారం లేదని దాన్ని గ్రహించి ప్రాస ప్రయోగించి చెప్పటంవల్ల "జిహ్వ" శబ్దం "జింహ్వ" గాను "సంహతి" శబ్దం "సంహ్వతి" గాను ఉచ్చరించటం జరిగేదని తెలుస్తుంది. అప్పకవి ఇలాంటి ఉచ్చారణ భేదాల నెన్నిటినో పేర్కొని సరి అయిన పదస్వరూపాలను తెలుసుకొని ప్రాస ప్రయోగించాలని చెప్పాడు. దీన్నిబట్టి కూడా ఆనాటి ఉచ్చారణ వైవిధ్యాలెన్నో తెలుస్తాయి.

4. తత్సమాలలో "ఋ" కారం "రు" కారంగాను, "థ కారం ధ" గాను ఉచ్చరించటం పండితులలో కూడా కనిపించేదని చెప్పటానికి లేఖనంలో ఆధారాలున్నాయి. అలాగే మహాప్రాణాలను అల్పప్రాణాలుగాను, "జ్ఞ" అనే పదాన్ని "గ్న" గాను విద్యాగంధం లేనివారు ఉచ్చరించేవారని శాసనాలలోని రాతలనుబట్టి చెప్పవచ్చును. "రాయవాచకం" లాంటి వచన గ్రంథాలలో ఈ ఉచ్చారణ భేదాలు స్పష్టంగా కనిపిస్తాయి.

5. సంధిలో "చేసేట్టుగా, వచ్చేటందుకు, కోమట్రెడ్డి, కొన్నాండ్లు, గుర్రబ్బండి" వంటి ఆధునిక రూపాలు 16వ శతాబ్దినుంచీ ప్రచురంగా వాడుకలోకి వచ్చాయి.

6. క్రియలలో "పోయినారు, వచ్చినారు, వింటిమి, వుంటిమి, అయింది, పాపాలు, కుంచాలు, పేర్లు, రాత్రిళ్ళు, రాళ్ళు, పెండ్లిండ్లు" వంటి బహువచన రూపాలు వ్యవహారంలో స్థిరపడ్డాయి. "వాణ్ణి, పాపాన్ని" వంటి ద్వితీయా విభక్తి రూపాలు, ఔపవిభక్తిక ప్రత్యయం "టి, ట" చేరని "తిరువీడులో, పడమటను" వంటి రూపాలు, "తోటి, పట్టి, నుండి, నుంచి, తో పాటు, ణతో కూడా - దాక, వరకు" వంటి ఆధునిక విభక్త్యర్థకాలు, "వాండ్లు, వీండ్లు, వాళ్ళు, వీళ్ళు, ఆమె, ఆయన ఈయన" మొదలైన ఆధునిక సర్వనామ రూపాలు, "ముప్పై, నలభై, పదహారు, పదిహేను, పన్నెండు" మొదలైన ఆధునిక సంఖ్యావాచక రూపాలు వాడుకలో విస్తరించాయి. పూరణార్థకం "అవ" నుంచి వచ్చిన "ఓ" 12వ శతాబ్ది నుంచి మొదలై "నాలుగో, మూడో" మొదలైన విధంగా క్రీ.శ. 1600 నాటికి వ్యాపించింది. మనుష్య వాచక సంఖ్యా పదాలు "నలుగురు, ఎనిమిదిమంది" వంటివి కూడా వ్యవహారంలోకి వచ్చాయి.

7. క్రియలలో "పోయినారు, వచ్చినారు, వంటిమి, వుంటిమి, అయింది, ఉన్నారు, ఉన్నాము, చేస్తున్నాము, చేస్తున్నారు, చేస్తా" వంటి ఆధునిక రూపాలు ప్రచురం అయ్యాయి. "అంటూ, ఉంటూ" వంటి రూపాలు 13వ శతాబ్దినాటికే ఉన్నట్లు కేతన చెప్పటం వల్ల తెలుస్తుంది. "వచ్చాడు" వంటి ఆధునిక క్రియారూపాలు లిఖిత సామాగ్రిలో ఎక్కడా దొరకటం లేదు. "చేయలేదు, చేయకుండా(ను)" వంటి వ్యతిరేక క్రియలు కూడా వ్యాప్తిలోకి వచ్చాయి. చేదర్థకంగా "ఇతే, తే" లు స్థిరపడ్డాయి. ఉదా : చేస్తే, పోలికను చెప్పటానికి "లాగు" ప్రత్యయాన్ని ఉపయోగించటం 17వ శతాబ్దినుంచే శాసనాలలో కనిపిస్తుంది. ఉదా: యిచ్చేలాగునున్నూ, కిలార్థకంగా "గదా" 10వ శతాబ్ది నుంచి ఉంది. ఉదా: ఉన్నారుగదా.

BRAOU

## 13.4 వచన రచన – వాడుక భాష

వచన రచనలలో మొదటిదని చెప్పదగిన గ్రంథం ఏకామ్రనాథుడి "ప్రతాప చరిత్ర" అని ఒక అభిప్రాయముంది. ఇది క్రీ.శ. 13, 14 శతాబ్దుల నాటిది. ఇందులోని భాషకావ్యభాషకు దగ్గరగా ఉంది. సమకాలీన వ్యావహారిక భాషలో వచ్చిన మొదటి వచనరచన విశ్వనాథనాయకుడి స్థానాపతి రచించిన "రాయ వాచకము". క్రీ.శ. 1600 ప్రాంతంలో ఈ రచన జరిగిందని చారిత్రకులు భావిస్తున్నారు. రాయవాచకం సామాన్య వచన రచనలో కనిపించే వ్యావహారిక భాషకు ప్రతిబింబం తరువాత అటువంటి వచన రచనలు మరొకొన్ని వచ్చాయి. ఈ కాలంలో వచ్చిన లక్షణగ్రంథాలలో తెలిపుడులు, వివరణలు ఉన్నచోట ఇటువంటి వచనాన్నే ఉపయోగించటం జరిగిందని, 19వ శతాబ్ది ఉత్తరార్థంలో వీటిని ప్రచురించేటప్పుడు పండితులు వాటిని మార్చి వేశారని గిడుగు వేంకట రామమూర్తి పంతులుగారు నిరూపించారు.

ఆనాటి వ్యావహారిక భాషకు కింది రాయవాచకంలోని భాగం ఒక మచ్చు.

"విజయపురానకు బోయిపట్టం వెలిపాళ్యములు, కోటకొత్తళములు, దవుతులు, మావుత్తులు, యేనుగ గుఱ్ఱాలు, కాల్బలం, అమరనాయకం వార్లను అందినిన్ని జూచి నగరి వాకిటికి పోయి, దానిమహలు ముందుగా ముందర దివాణంలో ముందర ఆయా వజీర్లు దొరలు దొండోపండితులు మొదలయినవారు నియ్యోగులు వారి వద్ది కుతపనమలక వారి జేబులుముకుంది పండితులు మొదలయినవారును కూర్చుండి ఆలోచన జేశినది :- కర్నాటకం సింహాసనానకు నడవంగా కృష్ణరాయలవారిని అధిష్టాన కర్తల జేసిన దారభ్యం తురకల మీద కార్యంశాయవలెనని ఆలోచనజేసి అందుకైన యత్నములు శేస్తావున్నారు. అన్ని వివరాలకు విజయనగరాన నుండిన్ని కాకితములు వ్రాశి వచ్చెను".

ఆంధ్ర సాహిత్య పరిషత్పత్రికలో మొదటి సారిగా రాయవాచకాన్ని ప్రకటిస్తూ జయంతి రామయ్య పంతులు "భాష తఱచుగా లక్షణ విరుద్ధమయినను జరిత్రాంశములే ప్రధానము చేసియు, దక్షిణ దేశమందానాడు వ్యాపించియున్న వ్యావహారికాంధ్ర భాషా స్వరూపము లోకమునకు తెలియుట మంచిదనియు వాక్యరచన మున్నది యున్నట్లే ప్రకటించుచున్నారము" అని చెప్పారు. రాయవాచకములో కనిపించే భాషా లక్షణాలను సంగ్రహంగా కింది విధంగా పేర్కొనవచ్చు.

1. పూర్ణ బిందువుపైన హల్లును ద్విరుక్తంగా రాయటం.
   ఉదా : కొండ్డయ్య, వెంక్కటేశ్వరులు.

2. అనునాసిక ద్విత్వం ముందు అనుస్వారము రాయటం
   ఉదా : సింమ్మట, తొంమ్మిది.

3. స్వర భక్తి : సంయుక్తాక్షరాల మధ్య అచ్చును చేర్చి విడగొట్టడం.
   ఉదా : దరిశనం (దర్శనం)

4. పద మధ్యంలో అచ్చు లోపించటం.
   ఉదా : కర్ణీకం (కరణీకం), వార్లను (వారలను)

5. 'సింహ' పదాన్ని 'సింహ్మ, సి హ్వ' అని ఉచ్చారణ విధేయంగా రాయటం.

6. తత్సమాలలో చ కారానికి తాలవ్యోచ్చారణను సూచించటానికి అత్వానికి బదులుగా ఎత్వాన్ని రాయటం.
   ఉదా : చెలనం (చలనం)

7. వివృత ఎ (x) ఉచ్చారణను సూచించటానికి "య" ను ఉపయోగించటం.
   ఉదా : నిమిత్త్యం, పల్య, పాళ్యం.

8. "చ" కారానికి "శ, స" లను ఉపయోగించటం, ఉదా : శాయంగా, శేశి.

BRAOU

9. "స" కు తాలవ్యాచ్చులకు ముందు "శ" ను ఉపయోగించటం. ఇది తాలవ్యాచ్చులకు ముందు "స" కు తాలవ్యోచ్చారణను సూచిస్తుంది.
ఉదా : శేవించి, తిశి.

10. "ఇ, ఈ, ఎ, ఏ" లకు ముందు "య" "ఉ, ఊ, ఒ, ఓ" లకు ముందు 'వ' ను చేర్చటం.
ఉదా : యిది : వుచితాసనము

11. ప్రథమైక వచనంలో "ము" కు బదులు అనుస్వారం. ఉదా : భారతం, భాగవతం.

12. సముచ్చయార్థకంగా "న్ను, ంన్ని" ఉదా : ప్రయోజనమును, విశాలాక్షినిన్ని.

13. కొన్ని బహువచన రూపాలు :– దుర్గాలు, విడిదీలు, ఫిరంగాలు, మాళ్ల (మాడలు)

14. "డెబ్బయి, ముప్పై" వంటి సంఖ్యావాచకాలు, "విచ్చేస్తావున్నారు. పెట్టుతూ వున్నారు" వంటి క్రియలు కనిపిస్తాయి.

సమకాలంలో సామాన్య వచన రచనాశైలి ఈ రూపంలోనే ఉండేదని ఊహించవచ్చు. క్రీ.శ. 1700 నాటి పుష్పగిరి తిమ్మన "భాగవత సారము"లో వచన రచనా శైలికి ఒక ఉచ్చారణ : "సూతుండు శౌనకాది మహామునుల జూచి వింటిరా మునులారా నిటువలె నుత్తరపుత్రుండడిగితే ప్రత్యుత్తరంబు శుకయోగి మహానుభావుడు పలికెను … …"

## 13.5 కావ్యభాషలో వాడుక భాషారూపాలు

ఈ నాటి కావ్య భాషలో ప్రవేశించిన వ్యావహారిక భాషా రూపాలను పరిశీలిస్తే జన వ్యవహారంలో ఉండే భాష ప్రభావం ఎలాంటిదో తెలుస్తుంది.

1. "ఎ, ఏ" లకు కల వివృతోచ్చారణను సూచించేవి :
చాటంత (శుకసప్తతి 4 - 124)
కిళ్లాకు (అహల్య సంక్రందనం ఉ 3 - 67)
మెంతాకు (హంస వింశతి 4 - 133)
ఇనుప కడేలు (బిల్హణీయం 2 - 34)
ముత్తేలహారము (రాజగోపాల విలాసం 2 - 33)

2. మాండలిక ప్రయోగాలు :
అతగానికి (శుక సప్తతి 2 - 190)
ముసుకు (శుక సప్తతి 4 - 188)
ఎర్కు, సర్కు (షట్చక్రవర్తి చరిత్ర 2 - 108)
కాణాచికొండ్లు (శుక, సప్తతి 4 - 162)

3. వ్యావహారిక బహువచన రూపాలు :
తోడేళ్ళు … లేళ్ళు (కట్టా వరదరాజు రామాయణం)
బళ్ళలో (విజయరాఘవుని రఘునాథాభ్యుదయం)
కాండ్లకు (హంస వింశతి 5 - 35)
రెణ్ణెల్లకు (ఋగ్వేది … చంపూపురాణం 1 - 14)

4. విభక్తి ప్రయోగాలలో వ్యావహారికత :
రెడ్డి నింట్లోకి పిలిచి (పాంచాలీపరిణయం 4 - 47)
భూముల నుండి (రాఘవాభ్యుదయం 3 - 64)
కల్ల నావల్ల గోరంత గలిగెనేని (సారంగధరచరిత్ర 2)

5. వ్యావహారిక సంధి ప్రయోగాలు :
రెన్నెల్లు (కట్టా వరదరాజు రామాయణం)



BRAOU

రెన్నాళ్ళ తెరువు (పై)
అడుక్కోలు (హంస వింశతి 4 - 84)
బాదం పలుకులు (పై. 1 - 105)
ముప్పది రెండాగ్రములు (షట్చ్రక్రవర్తి చరిత్ర 2 - 131)
బొక్కసమిండ్లు (కట్టా వరదరాజు రామాయణం)
మాయింటాతడు (అహల్యాసంక్రందనం 3 - 58)

6. వైరి సమాసాలు :
శూద్ర బిడ్డ (హంస వింశతి 5 - 124)
బీగముద్రలు (ఉషాపరిణయం 2 - 97)
మూలబొక్కసంబు (అహల్య సంక్రందనం 2 - 52)

7. క్రియాజన్య నామాలు :
దున్నకము (బిజ్జల తిమ్మభూపతి అనర్ఘ రాఘవం 1 - 90)
చేసుట (కట్టా వరదరాజు రామాయణం 2 - 90)

8. ఆధునిక క్రియారూపాలు :
విచారించుకోక (శుకసప్తతి 2 - 128)
ఎటిగేటట్టయితే (హంస వింశతి 2 - 128)
పాడితేనే సరా (అహల్యా సంక్రందనం 3 - 50)
తెలుసు (రాఘవాభ్యుదయం 5 - 22)
వస్తాడు, తెస్తాడు (చంద్రలేఖా విలాసం - 83)
తెల్సునా (సత్యభామా సాంత్వనం 3 - 90)
మొక్కేయ (ఉషా పరిణయం 5 - 12)
చూతాము (షట్చ్రక్రవర్తి చరిత్ర 5 - 107)
వెతుకుదాము (ఉషా పరిణయం 3 - 107)

సమకాలంలోని వ్యావహారిక భాషా వైవిధ్యం దక్షిణాంధ్ర సాహిత్యానికి సంబంధించిన యక్షగానాలలో స్పష్టంగా కనిపిస్తుంది. తాంజావూరాన్నదాన మహానాటకంలోని కింది సంభాషణ మచ్చుకి ఒక ఉదాహరణ మాత్రమే.

తిప్పాభట్టు :- ఓరి మంచిగా ! ఆ కుంటి బ్రాహ్మణ్ణి పిలుస్తున్నాడు ఆ కుంటి బ్రాహ్మణుడు సత్రమధికారికి ఏమిగావలెనురా!

మంచి : వాడె అధికారికి మేన పిన్నమ్మ మనమరాలి మొగుని బావమరిది.

తిప్పా : ఓరి మంచిగా ! అధికారి అల్లి పోట్టి బ్రాహ్మణ్ణి పిలుస్తున్నాడు. ఆ యధికారికి వాడేమికావలెరా?

మంచి : వాడే వారి పినతండ్రికి తోడ బుట్టిన యన్న"

## 13.6 తెలుగుపై పోర్చుగీసు ప్రభావం

మొదట భారతదేశంలో వాణిజ్య సంబంధాలు ఏర్పాటు చేసుకొన్న యూరోపియన్లు పోర్చుగీసువాళ్ళు. 1498లో పోర్చుగీసులు భారతదేశంలో పశ్చిమతీరంలోకి ప్రవేశించటంతో తెలుగువారికి, పోర్చుగీసువారికి సంబంధాలేర్పడ్డాయి. కాబట్టి తెలుగుభాషపై మొదట ప్రభావం చూపిన యూరోపియన్ భాష పోర్చుగీసు భాష. విజయనగర రాజులకు పోర్చుగీసు వారికి వాణిజ్య సంబంధాలుండేవి. విజయనగర సామ్రాజ్యంలోని "నాగ పట్టణం మైలాపూర్, శాంతోం" మొదలైన చోట్ల పోర్చుగీసులకు స్థావరాలుండేవి. 16వ శతాబ్ది నాటికి దక్షిణ భారతంలోని రాజ్యాల రాజకీయ వ్యవహారాలలో పోర్చుగీసులు జోక్యం చేసుకోవటం మొదలు పెట్టారు. అప్పటి నుంచి వాళ్ళతో సంబంధం కలిగి ఉండటం కోసం పరిసర రాజ్యాలలోని రాజకీయోద్యోగులు పోర్చుగీసు భాషను నేర్చుకొనేవారు. క్రీ.శ. 1571 ప్రాంతంలో భారతీయ క్రైస్తవులు చాలామంది దుబాసీలుగా నియమతు



BRAOU

అయ్యారు. అందువల్ల కూడా చాలామంది పోర్చుగీసు భాషను నేర్చుకోవటం ప్రారంభించారు. ఈస్టిండియా కంపెనీ వారు మద్రాసు చేరిన కొత్తలో పోర్చుగీసు భాషనే వాడేవారు. విక్రయపత్రాలు దాన పత్రాలు రాయటానికి తెలుగుతో పాటు పోర్చుగీసు భాషను ఉపయోగించేవారు. అందువల్ల తెలుగు భాషపై పోర్చుగీసు భాషాప్రభావం, ముఖ్యంగా పదజాలంపైన ఎక్కువగా కనిపిస్తుంది. తెలుగులో పోర్చుగీసు భాషాపదాలు సుమారు 150 దాకా ఉన్నట్లు పరిశోధకుల అంచనా.

తెలుగులో ప్రవేశించిన పోర్చుగీసు పదాలను భిన్నరంగాలకు సంబంధించినవిగా వింగడించవచ్చు.

1. పళ్ళను, కూరగాయలను సూచించేవి : అనాస, గొయ్యా (జామ), గోబి (క్యాబేజి), బొప్పాయి, టమాటో. ఇవి పోర్చుగీసువారితోనే తెలుగు దేశాలలోకి వచ్చి ఉంటాయి.
2. వస్తువులను సూచించేవి : కమీజు, బొత్తాము, కాజా, అల్మారా, మేస్త్రి, బాల్చి, ఇస్త్రి, తువ్వాలు (తోవాల్య) మొదలైనవి తాళపు చెవిలో చెవి "శావి" నుంచి వచ్చింది.
3. సైనిక రంగానికి సంబంధించినవి : కపితాను, కమాను, బారకాసు, కోస్తా, పటాలము, సార్జంతు మొదలైనవి.
4. వాణిజ్యవర్తకాలకు సంబంధించినవి : కుంఫిణీ, గిడ్డంగి, గోదాము, బంకు మొదలైనవి.
5. క్రైస్తవ మతానికి సంబంధించినవి : పాదిరి, ఏసోబు, కిరూబు మొదలైనవి.
6. గృహానికి సంబంధించినవి : పీపా, మేజా, సబ్బు, బాల్చీ మొదలైనవి.
7. ఇతరాలు : బిస్కతు, బాతు, తెలుగువారిని "జెంతియొ" - అని తెలుగు భాషకు "జెంతూ భాష" అని పోర్చుగీసు వారి వల్లనే పేరు వచ్చింది.

క్రీ.శ. 1720 నుంచి వ్యావహారిక భాషలో క్రైస్తవ సాహిత్యం రావటం మొదలైంది. 1746లో బెంజిమిన్ షూల్జ్ ద్వారా తెలుగులో పుస్తకాలు అచ్చు కావటం ప్రారంభమైంది. 1790 లలో భారత ప్రభుత్వంలో సర్వేయర్ జనరల్‌గా ఉన్న కర్నల్ కాలిన్ మెకంజీ కావలి వెంకట బొర్రయ్య మొదలైన పండితుల సహాయంతో తెలుగులో కైఫీయతులనే స్థానిక చరిత్రలను సేకరించాడు. అవి ఆనాటి భాషా స్వరూపాన్ని చాటి చెప్తాయి. క్రీ.శ. 1800 నాటికి ఇంగ్లీషు అధికారులు స్థానిక భాష అయిన తెలుగును అధ్యయనం చేయటం ప్రజల నుండి అర్జీలను తెలుగులో స్వీకరించటం, తెలుగుభాషా, సాహిత్యాలను నేర్చుకొని పరిశోధించడం విస్తృతం అయింది. ప్రజలు ప్రభుత్వంతో చేసే రాతకోతలకు సంబంధించిన భాషగా తెలుగు వికసించటం ఈ సమయంలో కనిపిస్తుంది.

## అవగాహన ప్రశ్న

తెలుగులో క్రీ.శ. 1600-1800 మధ్యకాలంలో ప్రవేశించిన పోర్చుగీసు పదాలను పది వాక్యాల్లో చర్చించండి.

BRAOU

## 13.7 సారాంశం

ఈ భాగంలో అధ్యయనం చేసిన ప్రధాన విషయాలు

- తెలుగు భాషా వికాసంలో క్రీ.శ. 1600-1800 మధ్యకాలానికి ప్రత్యేక ప్రాధాన్యం ఉంది. వచన రచనలు ఈదశలో వచ్చాయి. పోర్చుగీసు, డచ్ పదాలు తెలుగులో ప్రవేశించాయి. క్రీ.శ. 1720 నుంచి వ్యావహారిక భాషలో క్రైస్తవ సాహిత్యం రావటం మొదలైంది. పుస్తకాల అచ్చు పని మొదలైంది.
- ఆధునిక దశలో జరగబోతున్న పరిణామాలకు భాసా సామాజిక రంగాలు సిద్ధమయ్యాయి.

### అవగాహన ప్రశ్నకు జవాబు

క్రీ.శ. 1600-1800 మధ్యకాలంలో తెలుగుభాషలో ప్రవేశించిన పోర్చుగీస్ భాషా పదాలు సుమారు 150 దాకా ఉండవచ్చని భాషా పరిశీలకుల అంచనా. ఆ పదాలను ఈ కింది రంగాలకు సంబంధించినవిగా వింగడించవచ్చు :

1. పళ్లను, కూరగాయాలను సూచించేవి : అనాస, గొయ్యా (జామ), గోబి, బొప్పాయి, టమాటో వంటివి. 2. వస్తు సూచకాలు : కమీజు, బొత్తాము, కాజా, అల్మారా, బాల్చీ, తువ్వాలు వంటివి. 3. సైనిక రంగానికి సంబంధించినవి : కపితాను, కమాను, బారకాసు, కోస్తా, పటాలం వంటివి. 4. వర్తక వాణిజ్యాలకు సంబంధించినవి : కుంపిణీ, గోదాము, గిడ్డంగి, బంకు వంటివి. 5. క్రైస్తవ మతానికి సంబంధించినవి : పాదిరి, ఏసోబు, కిరాబు మొదలైనవి. 6. గృహానికి సంబంధించినవి : పీపా, మేజా, సబ్బు, కుర్చీ వంటివి. 7. ఇతరాలు : బిస్కతు, బాతు. వంటివి. ఇవికాక తెలుగుభాషకు "జెంతూ భాష" అనే పేరు పోర్చుగీస్ ప్రభావంవల్లనే ఏర్పడింది.

### చదవదగిన పుస్తకాలు

15వ భాగంలో చూడండి.

### మాదిరి పరీక్షా ప్రశ్నలు

I. కింది ప్రశ్నలకు 30 వాక్యాలకు మించకుండా సమాధానాలు రాయండి.

1. క్రీ.శ. 1660 నాటికి స్థిరపడ్డ ఆధునిక భాషా లక్షణాలను సంగ్రహంగా పేర్కొనండి.
2. మధ్యయుగం మలిదశలో కావ్యభాషలో ప్రవేశించిన వ్యావహారిక భాషా రూపాలను వివరించండి.

II. కిందివాటికి 10 వాక్యాలకు మించకుండా జవాబులు రాయండి.

1. తెలుగులో ప్రవేశించిన పోర్చుగీసు పదాలు - వాటి రంగాలు.

BRAOU

BRAOU

# భాగం – 14 తెలుగుభాష – ఆధునిక దశ (క్రీ.శ. 1800– నేటి దాకా)

విషయ క్రమం

14.0 లక్ష్యాలు
14.1 పరిచయం
14.2 ఆంగ్లేయుల ప్రమేయం
14.3 ముద్రణ సౌకర్యాలు
14.4.0 తెలుగుభాషా సాహిత్యాల్లో కొత్త పుంతలు
14.4.1 పరిశోధన
14.4.2 భాషాచరిత్రకు ఆధారాలు
14.4.3 వ్యాకరణాలు, నిఘంటువులు
14.4.4 వ్యవహారభాషలో తెలుగు గ్రంథాలు
14.4.5 అధికారభాషగా తెలుగు
14.4.6 గ్రాంథిక భాష పునః ప్రవేశం
అవగాహన ప్రశ్న – 1
14.5.0 భాషావాదాలు
14.5.1 సరళ గ్రాంథికం
14.5.2 వ్యావహారిక గ్రాంథిక భాషా వాదాలు
14.5.3 ఆధునిక ప్రామాణిక భాషా పరిణామం
అవగాహన ప్రశ్న – 2
14.6 సృజనాత్మక సాహిత్య వికాసం
14.7.0 భాషా ప్రయుక్త రాష్ట్రాలు
14.7.1 బోధనాభాషగా తెలుగు – తెలుగు అకాడమి
14.7.2 అధికారభాషగా తెలుగు
14.7.3 అన్నిరంగాలలో తెలుగు
అవగాహన ప్రశ్న – 3
14.6 సారాంశం
అవగాహన ప్రశ్నలకు జవాబులు
చదవదగిన పుస్తకాలు
మాదిరి పరీక్షా ప్రశ్నలు

## 14.0 లక్ష్యాలు

క్రీ.శ. 1800 నుండి నేటిదాకా తెలుగు భాషా పరిణామంలో సంభవించిన మార్పులను ఈ భాగం చదివాక మీరు విశ్లేషించగలుగుతారు; ఆధునిక సాహిత్య సంస్కృతుల వికాసానికి దోహదం చేసిన ఆధునిక ప్రామాణిక భాషావాదాన్నీ, భాషా ప్రయుక్త రాష్ట్రంగా ఏర్పడిన ఆంధ్రప్రదేశ్‌లో అన్ని రంగాలలోనూ తెలుగు వాడకాన్నీ మీరు అవగాహన చేసుకొని వివరించగలుగుతారు.

## 14.1 పరిచయం

క్రీ.శ. 1800 నాటికే తెలుగు ఆధునిక భాషా స్వరూపాన్ని పూర్తిగా సంతరించుకుంది. నన్నయ ఒరవడిలో సాగిన కావ్య భాషలో కూడా 14, 15 శతాబ్దాల నుండి వ్యావహారిక భాషా రూపాలు కలిసిపోవటం ప్రారంభించాయి. 17, 18 శతాబ్దాల నాటికి స్థూలంగా నన్నయభాషే సంప్రదాయ కావ్య రచనలో కనిపిస్తున్నా, వ్యావహారిక భాషా రూపాలు మరింతగా అందులో ప్రవేశించాయి. వాడుకభాష ప్రభావం నుండి కావ్య భాష



BRAOU

తప్పించుకోలేక పోవటానికి ఇది ముఖ్యమైన నిదర్శనం. అన్యదేశాలు, మాండలికాలు కూడా కావ్య భాషలో విరివిగా కనిపిస్తాయి. వచన రచనలలో వాడుక భాషా సంప్రదాయం విస్తృతమైంది. లక్షణ గ్రంథాలు పనిగట్టుకొని వ్యావహారిక భాషా ప్రయోగాలను నిషేధించటం కేతన కాలం నుండే మొదలైంది. 17వ శతాబ్దిలో అప్పకవి మొదలుకొని ఇటువంటి నిషేధాలు చేయడం ఎక్కువగా కనిపిస్తుంది. ఇది కూడా సాధారణ వ్యవహార భాషలో వస్తున్న మార్పులను, పండిత భాషపై కూడా వాటికున్న ప్రభావాన్ని సూచిస్తుంది. శాసనాలు నన్నయకు చాలా కాలం ముందు నుంచే భాషలో వస్తున్న మార్పులను సూచిస్తాయి. ఎప్పటికప్పుడు మార్పులు పొందుతూ వచ్చిన భాష రూపాలను శాసనాల ద్వారా తెలుసుకోగలిగాం. మౌఖికంగా ప్రచారంలో ఉండే జానపద సాహిత్యంలో మౌఖికమైన జన సాధారణ భాష ఉండటం సహజం. భారతదేశం ఇంగ్లీషు వాళ్ళ ప్రవేశంతో తెలుగు భాషపైన ఇంగ్లీషు భాషా ప్రభావం ప్రారంభమైంది. క్రీ.శ. 1800 కాలానికి శాసనాల్లోనూ, ఇతర అధికారిక వ్యవహార పత్రాల్లోనూ ఇంగ్లీషు పదాలు ప్రవేశించటం ప్రారంభమైంది. ఆనాటికే తెలుగుదేశంలో ముద్రణ ప్రారంభమైంది. రచనలలో భాషా ప్రయోగం పైన దీని ప్రభావం కూడా కనిపిస్తుంది. 19వ శతాబ్దం పూర్వార్థంలో ఆంగ్లేయ అధికారులు వారి ఉపయోగార్థం ఇంగ్లీషులో తెలుగు భాషకు వ్యాకరణాలను రచించారు. అధికారులకు ప్రజలు పెట్టుకునే అర్జీలన్నీ తెలుగులో వాడుక భాషలో ఉండాలి. క్రీ.శ. 1850 వరకు వచన రచనలన్నీ వ్యావహారిక భాషకు దగ్గరగా ఉంటే భాషలోనే కనిపిస్తాయి. చిన్నయసూరి ప్రవేశంతో వచన రచనలలో ఇతర రచనలలో గ్రాంథిక భాషకు మళ్లీ పట్టం కట్టటం జరిగింది. ఒకవైపు నాటకం, నవల వంటి ఆధునిక సాహిత్య ప్రక్రియలు తెలుగులో ప్రకాశిస్తున్నాయి. మరొక వైపు తెలుగు పాఠ్య గ్రంథాలన్నీ గ్రాంథిక భాషలో ప్రకాశిస్తున్నాయి. మరొక వైపు తెలుగు పాఠ్య గ్రంథాలన్నీ గ్రాంథిక భాషలో రావటం మొదలుపెట్టాయి. ఈ కారణం వల్ల ఈ శతాబ్దం చివరి నాటికి పాఠ్య గ్రంథాలకు; రచనలకు వ్యావహారిక భాషను వాడాలనేది ఒక ఉద్యమంగా రావలసి వచ్చింది.

## 14.2 ఆంగ్లేయుల ప్రమేయం

క్రీ.శ. 1757వ సంవత్సరానికి వ్యాపార సంస్థగా మాత్రమే ఉన్న ఈస్టిండియా కంపెనీ ప్లాసీయుద్ధంతో బెంగాల్‌లో రాజకీయాధికారాన్ని సంపాదించింది. క్రీ.శ. 1759 నాటికి మచిలీపట్టణం కోటను వశపరచుకుని క్రమంగా కోస్తాంధ్రప్రాంతంలో అధికారాన్ని సంపాదించుకుంది. కంపెనీ తెలుగుదేశంలోని చేతివృత్తుల పని వారికి పెట్టుబడి పెట్టి అపారమైన లాభాలను పొందింది. వృత్తికారులు స్వేచ్ఛను కోల్పోయి కంపెనీ కోసం ఉత్పత్తి చేసే కూలీలుగా మారి పోయారు. భారతీయ ఉత్పత్తులను తక్కువ ధరకు కొని ఇతర దేశాలలో ఎక్కువ ధరకు అమ్మటం ద్వారా అపారమైన లాభాలను కంపెనీ గడించింది. స్థానిక ప్రజలతో సంబంధాలు పెట్టుకోవటానికి కంపెనీ అధికారులు స్థానిక భాష అయిన తెలుగును నేర్చుకోవలసి వచ్చింది. మెకాలే ప్రతిపాదనల ఆధారంగా విలియం బెంటింక్ 1835లో భారత దేశంలో ఇంగ్లీషువిద్యా విధానాన్ని ప్రవేశ పెట్టాడు. 1835 నాటికి స్థానిక విద్యాంసులను ప్రోత్సహించటం ప్రాచీన సాహిత్యాన్ని ఉద్ధరించడం, దేశ భాషలను సాధనంగా చేసుకోవటంలో భాగంగా తెలుగులో ముఖ్యంగా వ్యావహారిక భాషలో మత గ్రంథాలను రచించి ముద్రించటం క్రీ.శ. 1800 కి ముందే ప్రారంభమైంది. 1826 నుండి కళాశాలలు కూడా ప్రారంభమైనాయి. ఇదే సందర్భంలో దేశీయ భాషలలో విజ్ఞానం గాని కొత్త సాహిత్యంగాని లేదని, దేశ భాషల ద్వారా ఉన్నత విద్య సాధ్యం కాదని మెకాలే అభిప్రాయపడ్డాడు. భారతీయులకు సంస్కృతం, అరబిక్‌లు నేర్పటం కంటే ఇంగ్లీషు నేర్పటం అవసరమని, ఇంగ్లీషులోనే మేధస్సుకు, విజ్ఞానానికి సంబంధించిన విషయాలున్నాయనీ, అది భారత దేశంలో పరిపాలనా భాషగా, వ్యాపార భాషగా రూపొందే అవకాశం ఉందనీ అలాంటివారు పాలకులకు పాలితులకు మధ్య వారధులుగా ఉపయోగపడతారనీ మెకాలే అభిప్రాయపడ్డాడు. 1854లో ఎడ్యుకేషనల్ డిస్పాచ్ ప్రకటించారు. భాషా పాఠశాలలు స్థాపన, విశ్వ విద్యాలయ స్థాపన, దేశీయ గ్రంథ ప్రచురణ, పరీక్షలు నడపటం, యోగ్యతలు కలవారికి డిగ్రీలు ఇవ్వటం ఇందులోని ముఖ్యాంశాలు. 1857 నాటికి మద్రాసు, కలకత్తా, బొంబాయిలలో విశ్వ విద్యాలయాలు ఏర్పడ్డాయి. 1855లోనే మద్రాసు రాష్ట్రంలో విద్యా శాఖ ఏర్పడింది. 1858లో సిపాయిల తిరుగుబాటు ఫలితంగా కంపెనీ అధికారం పోయి ప్రత్యక్షంగా బ్రిటిషు ప్రభుత్వమే భారతదేశంలోని పాలనాధి కారాన్ని స్వీకరించింది. ఆర్థిక రంగంతో పాటు విద్యా, సాంస్కృతిక, భాషా రంగాలలో కూడా బ్రిటిషు ప్రభుత్వం కొత్త విధానాలను అవలంబించింది. ఒకవైపు ఇంగ్లీషు విద్యను ప్రవేశపెడుతూనే, భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను గౌరవిస్తామని ప్రకటించింది. ఇందులో భాగంగానే భాషా విషయంలో కూడా సంప్రదాయ వాదులను సంతృప్తిపరచటానికి, పాఠ్య గ్రంథాలలో, ఇతరత్రా గ్రాంథిక భాషా వాదులకు మద్దతును ఇచ్చింది.

BRAOU

## 14.3 ముద్రణ సౌకర్యాలు

క్రీ.శ. 1746-47లో బెంజిమన్ షూల్జ్ ఆధ్వర్యంలో తొలి తెలుగు గ్రంథం బైబిలు జర్మన్‌లోని హాలె నగరంలో అచ్చు కావటంతో తెలుగు ముద్రణ ప్రారంభమైంది. 1812లో బళ్ళారిలో, తరువాత తిరుపతి, విశాఖపట్టణాలలో ముద్రణ సౌకర్యాలు ఏర్పడ్డాయి. 1816 నాటికి మద్రాసు కళాశాలలో ముద్రణ సౌకర్యాలు ఏర్పడ్డాయి. ఇంగ్లీషు వారు రాసిన తెలుగు వ్యాకరణాలెన్నో ఇక్కడే అచ్చు అయ్యాయి. ముద్రణ సౌకర్యం ప్రవేశించటంతో తెలుగు భాష ప్రయోగం అనేక రంగాలకు విస్తరించింది. క్రైస్తవ మత ప్రచారకులు తమ మత ప్రచార సాధనంగా తెలుగుభాషను జన సామాన్య భాషగా ఉపయోగించుకున్నారు. పాఠ్యగ్రంథాలుగా వచన రచనలు రావటం ప్రారంభించాయి. అధికార భాషగా కూడా 19వ శతాబ్దం తొలి దశలో తెలుగు ఉపయోగంలోకి వచ్చింది. పత్రికలు సామాజిక జీవనంలో ప్రవేశించాయి. 1931లో తొలి క్రైస్తవ పత్రిక వెలువడింది. తరువాత 'సత్యదూత', 'హితవాది', 'వృత్తాంతిని' మొదలైన పత్రికలు వెలువడ్డాయి. తొలిదశలో ఈ రంగాలన్నిటిలో వాడుక భాషే ప్రయోగంలో ఉండేదన్నది గుర్తింపదగిన అంశం.

## 14.4.0 తెలుగుభాషా సాహిత్యాల్లో కొత్తపుంతలు

క్రీ.శ. 1800 నాటికే ఇంగ్లీషు అధికారుల ఆధ్వర్యంలో భారతీయ భాషా, సాహిత్యాల పరిశోధనతో పాటు తెలుగు భాషా, సాహిత్యాల పరిశోధన కూడా ప్రారంభమైంది. 1786లో ఏసియాటిక్ సొసైటి సమావేశంలో మాట్లాడుతూ సర్ విలియం జోన్స్ సంస్కృతానికి గ్రీక్ లాటిన్ మొదలైన యూరోపియన్ భాషలతో పోలిక లున్నాయనీ, ఈ భాషలు ఒకే మూల భాష నుంచి వచ్చి ఉంటాయని చెప్పాడు. దీనితో తులనాత్మక చారిత్రక భాషా శాస్త్రానికి పునాది పడింది. ఇంగ్లీషు వారికి దేశీయ భాష అధ్యయనం పైన ఆసక్తి పెరిగింది. తమిళం, తెలుగు మొదలైన దక్షిణ భాషల అధ్యయనం కూడా మొదలైంది. 1816లో మద్రాసులో సెయింట్ జార్జి ఫోర్ట్ కళాశాల ప్రారంభమైంది. ఇంగ్లీషువాళ్ళకు తెలుగు నేర్పటం కోసం ఇంగ్లీషులో తెలుగు వ్యాకరణాలు రాయటం, నిఘంటువులను తయారు చేయటం మొదలైంది. 1816లో ఏ.డి. కాంఫ్‌బెల్ తన తెలుగు వ్యాకరణం పీఠికలో తెలుగు, తమిళం, కన్నడం మొదలైన భాషలకు గల సామ్యాన్ని గురించి చెప్పాడు. ఆ పీఠికను ఒక నోట్ రాస్తూ ఫ్రాంసిస్ వైట్ ఎల్లిస్, తెలుగు, తమిళం, కన్నడం, మలయాళం మొదలైన దక్షిణ భాషలు సంస్కృతంలో సంబంధం లేని భిన్న భాషా కుటుంబానికి చెందినవని అభిప్రాయపడ్డాడు. తరువాత 1857లో బిషప్‌రాబర్ట్ కాల్డ్వెల్ 'కంపారటివ్ గ్రామర్ ఆఫ్ ద్రవిడియన్ ఆర్‌సౌత్ ఇండియన్ లాంగ్వేజస్' వెలువరించాడు. దీనితో ద్రావిడ భాషల ప్రత్యేక కుటుంబ వాదం బలపడింది. "జననీ సంస్కృతంబు సకల భాషలకు" అనే విశ్వాసం దెబ్బతింది.

BRAOU

### 14.4.1 భాషా చరిత్రకు ఆధారాలు

భారత ప్రభుత్వంలో సర్వేయర్ జనరల్‌గా ఉన్న కర్నల్ కాలిన్‌మెకంజీ (1735-1821) తెలుగులో స్థానిక చరిత్రలు (కైఫీయతులు), శాసనాలు, నాణాలు సేకరించి తెలుగు వారి మత, సాంఘిక, భాషా సాహిత్య విషయాలవెన్నిటినో వెలికి తీసాడు. తనకు లభించిన స్థానిక చరిత్రలను కొన్ని సంపుటాలుగా ఆయన రికార్డు చేశాడు. ఆనాటి భాషా స్వరూపాన్ని తెలుసుకోవటానికి ఈ స్థానిక చరిత్రలు ఎంతగానో ఉపకరిస్తాయి. వీటిలో సమకాలీన వ్యావహారిక భాష ప్రతిబింబిస్తుంది. కావలి వెంకటి బొర్రయ్య, కావలి వెంకటలక్ష్మయ్య ఆయనకు సహాయ పడ్డారు. కావలి వెంకట రామస్వామి 1829లో 'బిబ్లియాగ్రఫికల్ స్కెచెస్ ఆఫ్ డక్కన్ పోయెట్స్' అనే పేరుతో 108 కవుల చరిత్రలను ఇంగ్లీషు భాషలో ప్రకటించాడు. 1855లో హెచ్. హెచ్. విల్సన్ న్యాయ, రెవిన్యూ విభాగాలకు సంబంధించిన పద పట్టికలను ప్రకటించాడు.

### 14.4.2 వ్యాకరణాలు, నిఘంటువులు

1816లో ఏ.డి. కాంఫ్‌బెల్ 'ఏ గ్రామర్ ఆఫ్ ద తెలుగు లాంగ్వేజ్' వెలువడింది. అంతకుముందే 1807లో విలియం బ్రౌన్ 'ఎ గ్రామర్ ఆఫ్ ద జెంటూ లాంగ్వేజ్', 1814లో విలియం కేరీ 'గ్రామర్ ఆఫ్ ద తెలింగ లాంగ్వేజ్' వచ్చాయి. విలియం బ్రౌన్ 1818లో 'ఎ ఒకేబ్యులర్ ఆఫ్ జెంటూ అండ్ ఇంగ్లీషు ...' వెలువరించాడు. అంతకు ముందే 1812లో కాంప్‌బెల్ 'ఎ డిక్షనరీ ఆఫ్ ద తెలుగు లాంగ్వేజ్' వెలువడింది. తెలుగు భాషా సాహిత్యాలను అధ్యయనం చేసి, పరిశోధన చేసిన ఇంగ్లీషు అధికారులలో ఛార్లెస్ ఫిలిప్ బ్రౌన్ ప్రముఖుడు. పఠన పాఠవాదులకు

దూరమైన ప్రాచీన కావ్యాలను, ప్రబంధాలను పరిష్కరించి వ్యాఖ్యానాలతో ప్రకటించాడు. గ్రంథ పరిష్కరణ రూపంలో తెలుగులో పరిశోధన ప్రారంభం అయింది. తెలుగు భాషా, సాహిత్యాలు క్షీణదశకు వచ్చాయని, వాటికి అర్థం చెప్పేవారు కూడా లేకుండా పోయారని బ్రౌన్ అంటాడు. ఆంధ్ర మహాభారత పరిష్కరణకు బ్రౌన్ అంకురార్పణ చేశాడు. భాగవత పరిష్కృత పాఠాన్ని తయారు చేయించాడు. రెండువేలకు పైగా వేమన పద్యాలను సేకరించి ప్రకటించాడు. రావిపాటి గురుమూర్తిశాస్త్రి, పాటూరి రామస్వామి శాస్త్రి, జూలూరి అప్పయ్య శాస్త్రి, మొదలైన పండితులు బ్రౌన్‌కి సహాయపడ్డారు. బ్రౌన్ 1849లో ఇంగ్లీషువారు తెలుగునేర్చుకోవటానికి ఇంగ్లీషులో తెలుగు వ్యాకరణం రాశాడు. ఛందస్సును గురించి చర్చించాడు. ఇంగ్లీషు-తెలుగు, తెలుగు-ఇంగ్లీషు నిఘంటువులను తయారుచేశాడు. ఇంగ్లీషువారు తెలుగునేర్చుకోవటం కోసం రాసిన ఈ వ్యాకరణాలన్నీ చాలా వరకు వ్యావహారిక భాషను గురించే వున్నాయి. 1834లో పుదూరి సీతారామశాస్త్రి తెలుగులో రాసిన వ్యాకరణం, ఏ.డి.కాంప్‌బెల్‌కి అంకితంగా 1836లో రావిపాటి గురుమూర్తి రాసిన 'గురుమూర్తి వ్యాకరణము' వ్యావహారికభాషకు రాసిన వ్యాకరణాలు. ఇంగ్లీషువారికి తెలుగు నేర్పటానికి రాసే వ్యాకరణాలు ఎట్లా ఉండాలో సి.పి. బ్రౌన్ ఇట్లా సూచించాడు - "ఇంగ్లీషు ఆంధ్రముచదువనారంభించేటప్పుడు కేవల సంస్కారదూరులై ఉన్నారు. కనుక శబ్దపరిచ్ఛేదం. క్రియా పరిచ్ఛేదం మాత్రము తొలుత నేర్చుకోవలసిందే. కాని కళ-ద్రుతం-సంధి-సరళాదేశం-తద్భవం-తత్సమం-దేశ్యం యిత్యాది ప్రమేయములను గురించి 'తలపెట్టరాదు". ఈ కోవలోనే 1873లో ఏ.హెచ్.ఆర్డెన్ "ప్రోగ్రెసివ్ గ్రామర్ ఆఫ్ తెలుగు లాంగ్వేజ్ వచ్చింది. మామిడి వెంకయ్య 1805-6లోనే 'ఆంధ్రదీపిక' అనే పేరుతో తెలుగు-తెలుగు నిఘంటువును ఆధునిక పద్ధతిలో తయారుచేశాడు. ఈ వ్యాకరణాలు, నిఘంటువులు తెలుగుభాషా వికాసానికి, అనేక రంగాలలో తెలుగుభాషా ప్రయోగం వ్యాపించటానికి ఎంతగానో దోహదం చేశాయి. వీటిలో చాలా వరకు మద్రాసులో సెయింట్ జార్జి కోటలోని కళాశాలలో పఠన, పాఠనాదులకు సిద్ధం చేసినవే.

### 14.4.4 వ్యవహారభాషలో తెలుగు గ్రంథాలు

BRAOU

1850కి ముందు వచ్చిన పాఠ్యగ్రంథాల రచనలు చాలా వరకు శిష్టవ్యావహారికంలోనే ఉండేవి. 1720 నుండి క్రైస్తవ మత ప్రచారానికోసం రాసిన సాహిత్యం అంతా వ్యవహారిక భాషలోనే ఉండేది. ఉదాహరణకు 'క్రైస్తవ పురాణ కథా సంక్షేపము' అనే గ్రంథంలోని ఒక వాక్యం చూద్దాం. "పరలోక భూలోకం శ్రిష్టికర్తలైనవారు నిర్మించిన విధం యిజారేత అనేటటువంటి వ్యవహారమందు రాశి వున్నది. సంక్షేపమూ మొదటి ఖాండం శ్రిష్టింపు ..." రావిపాటి గురుమూర్తి శాస్త్రిగారు 1819లో రాసిన విక్రమార్క కథలు, 1834లో రాసిన 'పంచతంత్ర కథలు', ఏనుగులు వీరాస్వామి 1838లో రచించిన 'కాశీయాత్రా చరిత్ర', 1942-47 మధ్య సామినేని ముద్దు నరసింహనాయనింగారు ప్రమేయం అనే పేరుతో 'హితవాది' అనే పత్రికలో రచించిన వ్యాసాలు, 1855లో వచ్చిన తాతాచార్యులవారి 'తాతాచార్యుల కథలు' 1940లో వచ్చిన పాటూరి రామస్వామి శాస్త్రి 'శుకసప్తతి కథలు' వ్యవహారిక భాషలోనే ఉన్నాయి. అట్లాగే 1920లో ప్రారంభమైన, 'మద్రాస్ వెర్నాక్యులర్ అండ్ స్కూల్ బుక్ సొసైటీ' వారు ప్రకటించిన 'గణిత శాస్త్రము' (1848), 'భూగోళ పరిచయము' (1849), 'ప్రపంచ భూగోళము' (1852), 'జంతుస్వభావదీపిక' (1855), వద్యంవాసుదేవ పరబ్రహ్మశాస్త్రి రచించిన 'వ్యవహార దర్పణము' (1851) మొదలైన గ్రంథాలు కూడా వ్యావహారిక భాషలో ఉన్నాయి. రావిపాటి గురుమూర్తి శాస్త్రిగారు 'పంచతంత్ర కథలు' పీఠికలో 'తెలుగు భాష జదువుకొను విద్యార్థులకు లోక వ్యవహారానుసారంగా, జదువనేర్చుటకు ...' రాసిన గ్రంథంగా చెప్పుకొన్నారు. పైన చెప్పిన గ్రంథాలలో వ్యావహార భాషకు ఉదాహరణ ప్రాయంగా కొన్ని వాక్యాలు చూద్దాం.

"విద్వాంసుడును, ధార్మికుడును కాని కొడుకు పుట్టితే ఫలమేమి? ... రూపమున్ను, ధనమున్ను, బలమున్ను కలిగినా శాస్త్రజ్ఞానము లేని కొడుకు ఎందుకు" - (పంచతంత్ర కథలు)

'యీ ప్రకార మార్గురిని మారవేసి ఏడోవాణ్ణి యెత్తుకొని వీడు యెక్కడలేచినా లేచి నా కంటె ముందుగా వచ్చి చేరుతున్నాడు. యీతేప నూరివెలుపల ఉండే గుంటలో వేతామని గభక్కున వేశి వీడు యెట్లులేచి వస్తాడో చూతామని నలుదిక్కులూ కనిపెట్టి యుండెను. - (శుక సప్తతి కథలు)

"౭ తేది ఉదయాన ౫ గంటలకు లేచి ఇక్కడకు నాల్గుకోసుల దూరములో నుండే తిలవారా అనే ఊరు దారిలో నర్మదామహానది దాటి ౯ ఘంటలకు ప్రవేశించినాను ఇక్కడ ౨ వందల మంది యెక్కే పడవ ఒకటిన్ని ౫౦ మంది యెక్కే చిన్న పడవ ఒకటిన్నీ ఉన్నది" - (కాశీయాత్ర చరిత్ర)

"తల్లి గర్భిణి అయివున్నట్టయితే ప్రసవమయ్యేదాక ఆగి కలిగిన సంతానము మొగదో, ఆడదో కనుక్కొని అపయినవే (ఆస్తి) పంచుకోవలసినది." - (వ్యవహార దర్పణము)

"శాస్త్రముల యొక్క గ్రంథములున్ను ఇతరాంశములను గురించిన గ్రంథములున్ను సులభముగా బోధపడేలాగు దేశభాషలలో కావ్య గ్రంథములుగా వ్రాయించి, ప్రింటువేయించి అవే బాలురకు చెప్పించే పక్షమందు బాల్య కాలములోనే శాస్త్రముల యొక్క ఇతర అంశములైన అంశముల యొక్క జ్ఞానము వారికి త్వరగా కలుగడమునకు సందేహమీమియు లేదు". - (సామినేని ముద్దు నరసింహ నాయనింగారి 'విద్యా ప్రమేయము).

### 14.4.5 అధికార భాషగా తెలుగు

19వ శతాబ్ది మధ్యభాగం వరకు తెలుగునే అధికారభాషగా వాడుతుండేవారు. ఉత్తర ప్రత్యుత్తరాలకు, అర్జీలకు స్వేచ్ఛగా వాడుక భాషనే వాడేవారని కింది అర్జీని చూస్తే తెలుస్తుంది,

"మహారాజశ్రీ ఆర్.,యే. రబార్టసన్ ఒస్క్వైల్ కలెక్టరు జిల్లా నెల్లూరిగారి సముఖానకు

జిల్లే మజకూరులో చేరిన గూడూరు తాలూకా యిలాకా పిడూరు సముతు పెద్దకాపు అయిన నారాయణ రెడ్డి వ్రాసుకొన్న అర్జీ దాస్తు ...

సన్ 1855 సంవత్సరం వరకు నేను అమాన భూములు దున్నుతూ వుంటిని. మే నెల 20 తారీఖున నేను తమ పేరిట వ్రాసుకొన్న అర్జీవివరములు జాహీరు అయివుండవచ్చును. అందుకు జవాబు దయ చేయించలేదు. యిప్పుడు మంచి వర్షములు కురిసి సాగుబడి చేసే దినములు అయినందున సాగుబడి వర్ధిచేసి సర్కారువారి దయకు పాత్రుడు కావలెనని ఆ తాలూకా తహసిల్‌దారుణ్ణి ఆ గ్రామమును యిజారాకు యిప్పించవలెనని అడిగితే ఆ గ్రామమునకు భారీ చెరువు వున్నదనిన్ని చెరుకు పయిరు పెట్టితే సర్కారుకు శానానఫా కల్గుతున్న దనిన్ని యెంచి నాకు ఆ గ్రామం యిజారాకు యిప్పించలేదు. నాకున్ను ఆ గ్రామములో చెరుకు పయిరు వేయించడముకు యంత మాత్రమున్ను మెహనతు చేయించలేను. గనుకనన్ను తమ సముఖముకు వచ్చేటట్టు హుకుం అయిన పక్షమందు గ్రామం యావత్తు అహవాలు మనవి చేసుకొంటున్నాను. నేను ఖదీం రయితును, నాకు దయచేయించిన యెడల మోతుబరు జామీను యిప్పించి సర్కారు రూకలు చెల్లించి నేను జీవనము చేసుకుంటున్నాను. యీ యావత్తు సంగతులు విచారించి ముందు నేను నడుచుకోవడముకు చిత్తానుసారం ఆజ్ఞదయ చేయించవలెనని వేడుకుంటున్నాను. 1864 సం॥ ఆగస్టు ది. "నారాయణ రెడ్డి నిశాని".

### 14.4.6 గ్రాంథిక భాష పునఃప్రవేశం

1853లో రావిపాటి గురుమూర్తిశాస్త్రి శిష్యుడు చిన్నయసూరి రచించిన "నీతి చంద్రిక," 1858లో "బాల వ్యాకరణం" అచ్చుకావడంతో గ్రాంథిక భాషావాదం మొలకెత్తింది. నిజానికి బాల వ్యాకరణం ప్రాచీన కావ్య భాషకు వ్యాకరణం. దీనికి లక్ష్యంగా ఆయన నీతి చంద్రిక రాశాడు. ముద్రణ సౌకర్యాలు విస్తరించాయి. పైగా చిన్నయసూరి 1848లో "మద్రాస్ స్కూల్ టెక్స్ట్‌బుక్ అండ్ వెర్నాక్యులర్ సొసైటి"కి అధ్యక్షుడయ్యాడు. పాఠ్య గ్రంథాలు గ్రాంథికంలో రావటం మొదలు పెట్టాయి. వచన రచన కూడా వ్యావహారికానికి దూరమైంది. గ్రంథ పరిష్కరణ పేరుతో ప్రాచీన లక్షణ గ్రంథాలలో వ్యావహారిక భాషలో ఉన్న వివరణలను, వచన రచనలలోని భాషను, కావ్యభాషకనుకూలంగా దిద్ది ప్రచురించటం మొదలైన భాషా పునరుద్ధరణగా పరిణమించింది. పండితులు తాము నిత్యవ్యవహారాలలో ఉపయోగించే భాషనే "గ్రామ్య" భాషగా పేర్కొన్నారు. కొక్కొండ వెంకటరత్నం పంతులు వంటి వారు నిత్య జీవితంలో కూడా గ్రాంథిక భాషను వాడేటంత వరకు వెళ్ళారు. చిన్నయ సూరి "బాలవ్యాకరణము" కావ్య భాషా శైలికి వర్ణనాత్మక వ్యాకరణం. సర్వ రచనలకు, వ్యవహారాలకు, భాషాధ్యయనానికి, పరీక్షలకు బాలవ్యాకరణ లక్ష్యమైన కావ్య భాషా శైలే అనుసరణీయమని పండితులు విశ్వసించారు. సంప్రదాయం మీద గౌరవం, దాన్ని పరిరక్షించుకోవాలన్న ధోరణి భాషా విషయంలో కూడా పని చేసింది.



BRAOU

**అవగాహన ప్రశ్న – 1**

ఆధునిక దశలో వెలువడిన వ్యాకరణాలు నిఘంటువుల గురించి పదివాక్యాల్లో రాయండి.

## 14.5.0 భాషా వాదాలు

క్రీ.శ. 1900 నాటికే తెలుగుభాష వినియోగం వివిధ రంగాలలో వ్యాపించింది. నవల, కథానిక, నాటకం, జీవితచరిత్ర, స్వీయచరిత్ర, వ్యాసం, విమర్శ మొదలైన ఆధునిక సాహిత్య ప్రక్రియలు స్థిరపడి విస్తృతంగా వ్యాపించాయి. సామాజిక రాజకీయ ఉద్యమాల తీవ్రతతోపాటు వార్తాపత్రికలు, దిన, వార, పక్ష, మాస, త్రైమాసిక పత్రికలు అనేకం వెలువడ నారంభించాయి. సాహిత్యంలో కొత్త ఆలోచనా ధోరణులు, రచనా పద్ధతులు బయలుదేరాయి. వీటికి సాహిత్య పత్రికలు వేదికలు అయ్యాయి. దేశ చరిత్ర గ్రంథాలు, సాహిత్య, చరిత్ర గ్రంథాలు వెలువడ్డాయి. అనేక భాషా, సాహిత్య సంస్థలు భాషా, సాహిత్య వికాసానికి దోహదం చేశాయి. విద్యావిధానంలో తెలుగుభాష ప్రాధాన్యం క్రమంగా పెరుగుతూ వచ్చింది. తెలుగును బోధించటానికి పాఠ్యగ్రంథాలు అవసరమయ్యాయి. వచ్చాయి. వివిధ శాస్త్ర విషయాలను తెలుగులో బోధించవలసిన అవసరం ఏర్పడింది. విభిన్న రంగాలలో వినియోగించవలసిన తెలుగుభాషా స్వరూపం ఎట్లుండాలి అనే విషయంలో చర్చలు, వాదోపవాదాలు జరిగాయి. అది గ్రాంథిక వ్యావహారిక భాషావాదంగా పరిణమించింది. సృజనాత్మక రచనలలో రచయితలకున్న స్వేచ్ఛా స్వాతంత్ర్యాలవల్ల క్రమంగా వ్యావహారిక భాషా ప్రయోగమే బలాన్ని పుంజుకుంది. విద్యారంగంలో మాత్రం సంప్రదాయ పండితుల కారణంగా గ్రాంథిక భాషే చాలావరకు పరిపాలన చేసింది. ఈ వైరుధ్యం కారణంగానే వ్యావహారిక గ్రాంథిక భాషా వాదాలు తెలుగులో చెలరేగాయి.

### 14.5.1 సరళ గ్రాంథికం

సంఘ సంస్కరణోద్యమాన్ని నిర్వహించిన కందుకూరి వీరేశలింగం వంటివారు రచనాశైలి సరళంగా ఉండాలని చెప్తూనే అటు కావ్యభాషను, ఇటు వ్యావహారిక భాషను కాకుండా రెండింటి మధ్య రాజీగా "సరళగ్రాంథికాన్ని" రచనలో ప్రవేశపెట్టాడు. ఆధునిక భాషలో ఆలోచించి, ఆధునిక భాషారూపాలకు ప్రాచీన కావ్యభాషా ప్రత్యయాలను తగిలించి దాన్నే సరళగ్రాంథికం అన్నారు. 'ఎగాదిగా చూశారు' అనేదాన్ని 'ఎగన్ జూచిరి' అని 'ఏం కొంపలు కూలిపోతున్నాయా?' అనేదాన్ని 'ఏమి? కొంపలు కూలిపోవుచున్నవా?' అంటే సరళ గ్రాంథికం అవుతుంది. ప్రాచీన కావ్యాభాషాశైలి కాని, ఆధునిక వ్యావహారికశైలికాని, కాని రాజీశైలి సరళ గ్రాంథికశైలి. గ్రాంథిక, వ్యావహారికశైలులమధ్య రాజీగా 19వ శతాబ్ది ఉత్తరార్థం నుంచి ఇటీవలి కాలందాకా కొందరు ఇలాంటి శైలిని ఉపయోగిస్తున్నారు. సంఘసంస్కర్తలు, తెలుగుదేశంలో విజ్ఞానవ్యాప్తికి కృషి చేసినవారు. ఆధునిక చింతనాధోరణికి తోవచూపినవారు, పరిశోధకులు చాలామంది మొదటిదశలోసరళ గ్రాంథికాన్ని తమరచనలలో వాడారు. కొమర్రాజు లక్ష్మణరావు పంతులు, చిలకమర్తి లక్ష్మీనరసింహం, కట్టమంచి రామలింగారెడ్డి, కాశీనాథుని నాగేశ్వరరావు, మల్లంపల్లి సోమశేఖరశర్మ మొదలైనవారు సరళ గ్రాంథికాన్ని తమ రచనలలో ఉపయోగించారు. వీళ్లందరికీ చాలా విషయాలలో సామాజిక ప్రయోజన దృష్టి, అభ్యుదయదృష్టి, శాస్త్రీయమైన ఆలోచనలు ఉన్నా భాషవిషయంలో మాత్రం వైయుక్తికమైన దృష్టినే అవలంబించారు. చరిత్ర పరిశోధనకు, విజ్ఞానవ్యాప్తికి, ప్రజాస్వామ్య భావాలను వ్యాపింపచేయటానికి జీవితం అర్పించిన కొమర్రాజు లక్ష్మణరావు మద్రాసు విశ్వవిద్యాలయంలో వ్యాసరచనకు ఉపయోగించాల్సిన భాషకు సంబంధించిన 'ఏ మెమొరాండమ్ అన్ తెలుగూ

BRAOU

ప్రోజ్' (A memorandum on Telugu prose) లో గ్రాంథికవాదం చేశాడు. వ్యావహారిక భాషకు ఇంకా సరైన వ్యాకరణం ఏర్పడలేదని ఆయన అభిప్రాయ పడ్డాడు. కందుకూరి వీరేశలింగం తన జీవితం చివరి కాలంలో వ్యావహారిక భాషా ప్రాముఖ్యాన్ని గుర్తించాడు. అయితే విజ్ఞానార్జనలో మాతృభాషా ప్రాముఖ్యాన్ని గుర్తించి ప్రచారం చేసినవాడు కొమఱ్ఱాజు లక్ష్మణరావు, "అన్యభాష మొదట నేర్చుకొని పిదప నాభాషయందు శాస్త్రిములం గళల జదువుట ద్రావిడ ప్రాణాయామము వంటిది" అని నమ్మాడు.

సాహిత్య విజ్ఞానాలు ఎక్కువ మందిలోనికి వెళ్లాలంటే అందుకు ఉపయోగించే భాష దేశీయభాష, మాతృభాష అయినంతమాత్రాన, చాలదు. అది ఎక్కువ మందికి అర్థమయ్యేభాష కూడా కావాలని వ్యావహారిక భాషా వాదులు చాటిచెప్పారు. గిడుగు వేంకటరామమూర్తి, గురజాడ వేంకట అప్పారావులు వ్యావహారిక భాషోద్యమాన్ని నడిపారు. గిడుగు రామమూర్తి ఆ ఉద్యమానికే తన జీవితాన్ని ధారపోశాడు. తన వ్యావహారిక భాషావాదాన్ని నిరూపించటానికి ప్రాచీన కావ్యంలోని భాషారూపాలన్నిటినీ పరిశోధించాడు. గ్రాంధికభాష నిజమైన మాతృభాష కాదనీ, వ్యావహారిక భాషే నిజమైన మాతృభాష అనీ గిడుగు, గురజాడలు చాటిచెప్పారు. అనువాదాలు అనుసరణలు కాక స్వతంత్ర పరిశోధనల ద్వారా తెలుగులో స్వతంత్ర గ్రంథాలు రావాలనీ, అప్పుడే వైజ్ఞానికంగా తెలుగుజాతి పురోగమిస్తుందనీ, తెలుగుభాష అభివృద్ధి చెందుతుందనీ ఆయన అభిప్రాయపడ్డాడు. ఆనాటి బ్రిటిష్ ప్రభుత్వం గ్రాంధిక భాషా వాదులకు అనుకూలమైన విధానాలను అవలంబించటం వలన ఒకదశలో విశ్వవిద్యాలయాలలో, ఇతర విద్యాలయాలలో గ్రాంధిక భాషకే స్థానం లభించింది. కాని పత్రికలు, సాహిత్యం, ఇతర సృజనాత్మక కళా రంగాలలో క్రమంగా వ్యావహారికభాష స్థిరపడింది.

చిన్నయసూరి 'బాల వ్యాకరణము' 'నీతిచంద్రిక' ల తర్వాత విద్యారంగంలో గ్రాంథిక భాష పేరిట కావ్య భాషే చాలకాలం పరిపాలన చేసింది. క్రీ. శ. 1900 నాటికి విద్యారంగంలో తెలుగు భాషా ప్రయోగంలో ఉన్న పరిస్థితి ఇది. 1906లో అప్పటి స్కూళ్ల ఇన్‌స్పెక్టర్ విశాఖపట్టణంలో మిసెస్.ఎ.వి.ఎస్. కాలేజీకి సంబంధించిన ఉన్నత పాఠశాలలో ఇన్‌స్పెక్షన్ కోసం వచ్చి తెలుగు పండితుని క్లాసుకి వెళ్ళాడు. అతడు చెప్పే పాఠం విన్నాడు. అది జటిలమైన పద్ధతిలో ఉంది. బోధించే భాష ఆనాటి చదువుకున్నవారి వ్యవహారంలో కూడా లేదు. నిత్య వ్యవహారంలో ఉన్న భాషకు, పాఠశాలల్లో బోధించే తెలుగుభాషకు వ్యత్యాసం కనిపించింది. ఆధునిక కాలంలో అనేక శాస్త్రి విషయాలను నేర్చుకొని, విజ్ఞానాన్ని అభివృద్ధి చేసుకోవలసిన తరుణంలో భాష నేర్చుకోటానికి ఎక్కువ సమయాన్ని ఇవ్వవలసిన పరిస్థితిని చూశాడు. "ఊరిబయట చిన్న చిన్న గుడిసెలే కడజాతివాళ్ళ బడులు. అక్కడేవాళ్ళు అక్షరాలు నేర్చుకోవాలి. వాళ్ళకు గ్రాంథిక రూపాలు నేర్పటంలో ఎంత కాలం వ్యర్థం చేస్తున్నారో గమనించారు. వాళ్ళకు లేని అణాలు తెచ్చుకోడానికి కూడా గ్రాంధిక భాషే నేర్పుతున్నారు. గొప్ప కులాల్లో సైతం చదువుకోని వాళ్ళుకాని చదువుకొన్న వాళ్ళుగానీ ఎన్నడూ వాడని భాష ఆ కడజాతి వాళ్ళకు ఎందుకు నేర్పుతున్నారో నాకు అర్థంకాదు. వాళ్ళకు చెప్పటానికి ఆధునిక వ్యావహారికం పనికిరాదా?" అని స్కూళ్ళ ఇన్‌స్పెక్టర్ ఏట్స్ ఒకచోట అంటాడు. ఆ సమయంలో ఎ.వి.ఎస్. కాలేజీ ప్రిన్స్‌పాల్ బాగా పనిచేస్తున్న పి. వి. శ్రీనివాస్ అయ్యంగార్, పర్లాకిమిడి కాలేజీలో పనిచేస్తున్న గిడుగు రామమూర్తినీ, విజయనగరం సంస్థానంలో పనిచేస్తున్న గురజాడ అప్పారావునూ సంప్రదించమని ఏట్స్‌కిసలహా ఇచ్చాడు. ఈ నలుగురి కలయికతో తెలుగు దేశంలో వ్యావహారిక భాషోద్యమం ప్రారంభమయింది. ఆర్థిక సామాజిక పరిస్థితులలో భాషలో వచ్చిన మార్పులు, తెలుగుభాషను ఉపయోగించవలసిన రంగాల విస్తృతికారణంగా సహజంగానే భాషా ప్రయోగంలో రావలసిన మార్పులకోసం ఒక ఉద్యమమే రావలసి వచ్చింది. శ్రీనివాస అయ్యంగార్ 'తెలుగుటీచింగ్ రిఫార్మ్ సొసైటీ' (Telugu teaching Reform Society) ప్రారంభించాడు. ఏట్స్ దానికి అధ్యక్షుడు. భాషా స్వభావాన్ని గురించి, భాషా పరిణామాన్ని గురించి, శిష్ట వ్యావహారిక ప్రయోగాల్ని గురించి, ప్రాచీన కవులు వాడిన వ్యావహారిక పద ప్రయోగాలను గురించి, విద్యావిధానంలో రావలసిన మార్పుల గురించి గిడుగు రామమూర్తి పరిశోధనా పూర్వకమైన భావాలతో చేసిన ఉపన్యాసాలతో, వ్యాసాలతో వ్యావహారక భాషోద్యమం విస్తరించింది. "దేశ భాష ద్వారా విద్యబోధిస్తేనేకాని ప్రయోజనంలేదు. శిష్టజన వ్యావహారిక భాష లోకంలో సదా వినబడుతూ ఉంటుంది. అది జీవవంతో కళకళలాడుతూ ఉంటుంది. గ్రాంధిక భాష గ్రంథాలలో కనబడేదే గాని వినబడేదికాదు. ప్రతిమవంటి ప్రసంగాలలో గ్రాంధిక భాష ప్రయోగిస్తూ తిట్టుకున్నా, సరసాలాడుకున్నా, ఎంత హాస్యాస్పదంగా ఉంటుందో చూడండి" అని గిడుగు రామమూర్తి ప్రబోధించాడు. తన వాదాన్ని బలపరచడంలో భాగంగా 'ఆంధ్ర పండిత భిషక్కుల భాషా భేషజం' బాలకవి శరణ్యం' మొదలైన గ్రంథాలు రచించాడు. పి. టి. శ్రీనివాస అయ్యంగార్ 'లైఫ్ ఆర్ డెత్ - ఎ ప్లీ ఫర్ వెర్నాకులర్' అనే కరపత్రంలో వర్తమానాంధ్ర భాషలోనే విద్యా బోధన



BRAOU

జరగాలని వాదించాడు. ఈలక్ష్యానికి అనుగుణంగా కొందరు కొన్ని పాఠ్యగ్రంథాలను కూడా రచించాడు. ఈ ధ్యేయాలతోనే విజయనగరంలో 'ఆంధ్ర సాహిత్య సంఘం' ఏర్పడింది. దీనికి విజయనగరం కళాశాలప్రిన్స్‌పాల్ కిళాంబి రామానుజాచార్యులు, అధ్యక్షుడు గిడుగు రామమూర్తి, కార్యదర్శిబుర్రాశేషగిరిరావు, సమకాలీన భాష అయిన శిష్ట వ్యావహారికంలోనే పఠనపాఠనాదులు జరగాలని ఈ సంఘం తీర్మానాలు చేసింది. 1862లోనే సామినేని ముద్దు నరసింహానాయనిగారు బాధను గురించి 'వాడికనున్న' పదాలను వాక్యరచనలో అంగీకరించ దగినవిగా ఉండటాన్ని గురించి చర్చిస్తూ భాషాపరమైన సిద్ధాంత చర్చచేశాడు. అర్ధానుస్వారం, శకటరేఫ సమకాలీనభాషలో లేవనీ, కాబట్టి వాటిని పరిహరించవచ్చనీ, విసంధి పాటించడమే సమకాలీన భాషలో సహజమనీ తన ప్రమేయాల సంకలనం 'హితసూచని' పీఠికలో చెప్పాడు.

వ్యావహారిక భాషావాదంవల్ల సాహిత్య స్థాయి క్షీణిస్తుందనీ, సంప్రదాయసాహిత్య వ్యవస్థ విచ్ఛిన్నమై పోతుందని భావించిన కొందరు పండితులు జయంతి రామయ్యపంతులు అధ్యక్షుడుగా, వేదం వేంకటరాయ శాస్త్రి, కాశీభట్ల బ్రహ్మయ్యశాస్త్రి, వావిలికొలను సుబ్బారావు మొదలైనవారు సభ్యులుగా కాకినాడలో 'ఆంధ్ర సాహిత్య పరిషత్తు' ను స్థాపించారు. భాష విషయంలో తమకున్న అభిప్రాయాలను ప్రచారం చేయటానికి, సంప్రదాయ సాహిత్య అధ్యయనాన్ని ప్రోత్సహించటానికి, "ఆంధ్ర సాహిత్య పరిషత్పత్రికను" ప్రారంభించారు. ఆ సందర్భంలోనే పరిషత్తు మద్రాసు పచ్చయప్ప కళాశాలలో రెండు రోజులు సభలు నిర్వహించారు. ఆ సమావేశాలలో వ్యావహారిక భాషను 'గ్రామ్యం' అని ఖండిస్తూ శతఘంటము వేంకటరంగశాస్త్రి ప్రసంగించాడు. శిష్ట వ్యావహారికమే పఠన పాఠనాదులకు ఉపయోగిస్తుందని నిరూపిస్తూ గిడుగు రామమూర్తి ఆంధ్రభాషా చరిత్ర అనే ప్రసంగ వ్యాసాన్ని చదివాడు. అక్కడ గ్రాంథిక, వ్యావహారిక భాషా వాదాలు నాలుగు విధాలుగా జరిగేదిః (1) విశ్వ విద్యాలయాలకు, విద్యాశాఖకు సంబంధించిన సంఘాలలో (2) బహిరంగ సభలలో, పండిత సమావేశాలలో ఉపన్యాసాల రూపంలో (3) పత్రికలలో చర్చలరూపంలో (4) కరపత్రాల రూపంలో.

### 14.5.2 వ్యావహారిక గ్రాంథిక భాషా వాదాలు

వ్యావహారిక భాషోద్యమం తీవ్రంగా ఉన్నప్పుడు గ్రాంథిక, వ్యావహారిక భాషా వాదాలలోని ముఖ్యమైన అంశాలను తెలుసుకుందాం. ముందుగా గ్రాంధిక భాషావాదుల వాదాన్ని పరిశీలించండి.

1) నన్నయ నుండి కందుకూరి వీరేశలింగం వరకు గ్రాంధిక భాష మారలేదు.

2) ప్రాచీన కవులందరూ ఏమాత్రం భేదంలేని ఒకే భాషలో కావ్యరచన చేశారు. ఆ భాషలో ప్రామాణికత, ఏకరూపత ఉంది.

3) ఆధునిక వ్యావహారిక భాషకు ఏకరూపత లేదు. ఆ భాషలో ఉత్తమ సాహిత్యం లేదు.

4) ఆధునిక భాషకు వ్యాకరణం లేదు.

5) ఆధునిక వ్యావహారిక భాష కొంతకాలం తరువాత ప్రజలకు అర్థం కాదు.

వ్యావహారిక భాషావాదుల వాదం ఇప్పుడు పరిశీలించాలి

1) విద్యా సౌకర్యాలు పూర్వకాలంలో లాగా ప్రస్తుతం ఏ కొద్దిమందికో పరిమితం కాదు. ఎక్కువమందికి సామూహికంగా విద్యను అందించటానికి కావ్యభాష చాలదు, పనికి రాదు.

2) ఆధునిక శాస్త్ర విషయాలను బోధించటానికి ప్రాచీన కావ్యభాష పనికి రాదు. కాబట్టి ఆధునిక శిష్ట వ్యావహారిక భాషే బోధనా మాధ్యమంగా ఉండాలి.

3) విద్యా బోధనలో ప్రత్యక్ష పద్ధతిని అవలంబించటం వల్ల పఠన పాఠనాదులలో సౌకర్యం ఏర్పడుతుంది. దానికి వ్యావహారిక భాషే శరణ్యం.

4) కొక్కొండ వేంకట రత్నం, వేదం వేంకట రాయశాస్త్రి వంటి పండితులే ఎదుటి వారికి గ్రాంధిక భాషా స్వరూపం జీర్ణం కాలేదని పరస్పరం నిందించుకుంటున్నారు. అటువంటప్పుడు సామాన్యులకు గ్రాంధిక భాష కొరుకుడుపడటం మరీ కష్టం.

5) పూర్వం నుంచీ వచన వాఙ్మయంలో వ్యావహారిక భాషా సంప్రదాయం కొనసాగుతోంది. చిన్నయసూరి కారణంగా పూర్వగ్రంథాలను పరిష్కరణ పేరిట కృత్రిమంగా గ్రాంధికం చేయటం జరిగింది.

BRAOU

6) చారిత్రకంగా భాషలో మార్పులు రావటం సహజం. కాబట్టి వేయేళ్ల నాటి కావ్య భాష ఈ రోజు విద్యా బోధనకు, వచనరచనకు పనికిరాదు. అదీ ఈనాటి వ్యవహారానికి దూరం అయింది. అందువల్ల అత్యధిక సంఖ్యాకుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకున్నప్పుడు వ్యావహారిక భాషే అనుసరణీయం.

### 14.5.3 ఆధునిక ప్రామాణిక భాషా పరిణామం

1914వ సంవత్సరంలో మద్రాసు విశ్వవిద్యాలయం "కాంపొజిషన్ కమిటి" (Composition Committee) ని ఏర్పాటు చేసింది. ఇందులో ఆధునిక భాషావాదులైన గిడుగు రామమూర్తి, గురజాడ అప్పారావు, పి. టి. శ్రీనివాస అయ్యంగార్, బుర్రా శేషగిరి రావు, గ్రాంధిక భాషావాదులైన వేదం వేంకట రాయశాస్త్రి, జయంతి రామయ్య పంతులు. కొమర్రాజు లక్ష్మణరావు, జి. వెంకటరంగయ్య, తటస్థులైన ప్రొఫెసర్ కె. రంగాచారి, థామ్సన్ సభ్యులు. ప్రాంతీయ రాజకీయాలు, అధికారుల విధానాలు కారణంగా ఈ సంఘంలో గ్రాంధిక భాషా వాదం నెగ్గింది. అధికార తీర్మానానికి వ్యతిరేకంగా సమర్పించిన "ది మినిట్ ఆఫ్ డిసెంట్ టు ద రిపోర్ట్ ఆఫ్ ది కాంపొజిషన్ సబ్ కమిటి" (The minute of Dissant to the report of the Composition sub-Committee) అనే సుదీర్ఘ వ్యాసంలో గురజాడ తన వాదాన్ని సోపపత్తికంగా, గ్రంథ, శాసన ప్రమాణాలతో నిరూపించారు. ఈ విధంగా విద్యా రంగంలో వ్యావహారిక భాషా వాదం స్థిరపడింది. గిడుగు రామమూర్తి జీవితాంతం భాషోద్యమాన్ని పట్టుదలతో నడిపాడు. కందుకూరి వీరేశలింగం మొదట వ్యావహారిక భాషా వాదాన్ని అంగీకరించకపోయినా చివరికాలంలో "వర్తమాన వ్యావహారికాంధ్ర భాషా ప్రవర్తన సమాజాన్ని" స్థాపించాడు. వ్యావహారిక భాషకు వ్యాకరణం రాస్తానని ప్రకటించాడు. 1947 నాటికి విశ్వవిద్యాలయాలలో విద్యారంగంలో భాష ప్రయోగం విషయంలో ఏమీ మార్పు లేదు. సృజనాత్మక రచనలు, వార్తా పత్రికలు, సినిమాలు, రేడియోలు మాత్రం క్రమంగా సమకాలీన భాషనే అనుసరించాయి. ఆధునిక ప్రామాణిక భాషా పరిణామానికి దోహదం చేశాయి.

## అవగాహన ప్రశ్న – 2

ఆధునిక ప్రామాణిక భాషా పరిణామాన్ని పది పంక్తుల్లో వివరించండి.

BRAOU

## 14.6 సృజనాత్మక సాహిత్య వికాసం

క్రీ. శ. 16, 17 శతాబ్దుల నుంచే వచన రచనలో వ్యావహారిక భాష కనిపిస్తుంది. పందొమ్మిదవ శతాబ్దం పూర్వార్థంలో వచ్చే రచనలు చాలా సమకాలీన శిష్టవ్యావహారిక భాషలోనే వచ్చాయి. సామినేని ముద్దు నరసింహ నాయనింగారు తన రచనలకుపయోగించిన వాడుక భాషా స్వరూపాన్ని గురించిన కొన్ని వివరణలు ఇచ్చారు. కాని సృజనాత్మక సాహిత్యంలో వ్యావహారిక భాషా ప్రయోగానికి గురజాడ అప్పారావు "కన్యాశుల్కం" విప్లవాత్మకమైన పరిణామంగా నిలుస్తుంది. సమకాలంలో వేదంవేంకటరాయశాస్త్రి) "ప్రతాపరుద్రీయము" నాటకంలో పాత్రోచిత భాషరూపంలో కొంత చదువుకొనివారి భాషనుకొన్ని పాత్రలకు ఉపయోగించినా నాటకం ప్రధానంగా గ్రాంధిక భాషలో ఉంది. 'నాది ప్రజల ఉద్యమము. దానిని యెవరిని సంతోషపెట్టడానికైనా వదులుకోలేను.' అని ప్రకటించిన గురజాడ అప్పారావు ప్రజల భాషలోనే తన రచనలు వెలువరించాడు. 1897లో అచ్చైన 'కన్యాశుల్కం' మొదటి ప్రచురణలో గ్రాంధిక, వ్యావహారిక భాషా రూపాలు కలగా పులగమై కనిపిస్తాయి. 1909 లో వచ్చిన రెండవ ప్రచురణలో స్పష్టంగా కళింగ మండలంలోని శిష్ట వ్యావహారిక రచనలలో వ్యావహారిక భాషా ప్రయోగావశ్యకతను గురించి, సౌందర్యాన్ని గురించి గురజాడ అప్పారావు చర్చించాడు. 1900 తరువాత రచనలలో, వ్యవహారిక భాష వికసించింది.

గురజాడ అప్పారావు మొదలుకొని తెలుగు కవిత్వంలో సరళమైన భాష ప్రవేశించినా కవిత్వంలో గ్రాంధిక భాషా వాసనలు చాలా కనిపిస్తాయి. వచన ప్రక్రియలలో పరిస్థితి దీనికి భిన్నంగా కనిపిస్తుంది. తెలుగులో ప్రాచీన సాహిత్యంలో ప్రధాన ప్రక్రియ పద్య కావ్యం. ప్రాచీన కావ్యరచన కొనసాగింపుగా వచ్చిన ఆధునిక కవితా ప్రక్రియలో కావ్య భాష పేరిట స్థిరపడిన ప్రాచీన భాషా ప్రభావం ఆధునిక కవిత్వం ప్రారంభమైన దశలోనే కాదు, ఇటీవలి కాలం వరకు కనిపిస్తుంది. ఆధునిక కవిత్వం ప్రారంభ దశలో భావాల్లో, వస్తువుల్లో నవ్యత కనిపించినా కవులు ఛందస్సును పాటించినంత వరకూ ప్రాచీన కావ్యభాషే ప్రధానంగా కనిపిస్తుంది. మాత్రా ఛందస్సులో వచ్చిన గేయాలలో కూడా కావ్య భాషా ప్రభావం ఎక్కువగా కనిపిస్తుంది. వచనంలో స్వచ్ఛమైన వ్యవహారికాన్ని ఉపయోగించిన వారు కూడా కవిత్వంలో గ్రాంధిక భాషా ప్రభావాన్నుంచి దూరం కాలేదు. భావ కవిత్వంలో ఎక్కువగా పద్య రచనలు, గేయరచనలు, వచ్చాయి. రాయప్రోలు సుబ్బారావు, దేవులపల్లి కృష్ణశాస్త్రి మొదలైన వారు రచించిన పద్యాలలో, గేయాలలో ప్రాచీన కావ్యభాషా రూపాలు ఎక్కువగా కనిపిస్తాయి.

విరిగి పెరిగితి, పెరిగి విరిగితి
కష్ట సుఖముల పారమెరిగితి
పండనున్నవి ఆశలెన్నో
ఎండిరాలగ బొగిలితిన్ (లంగరెత్తుము)

అభ్యుదయ కవి శ్రీశ్రీ మాత్రాఛందస్సులో రాసిన గీతాలలో గ్రాంధిక రూపాలు విరివిగా కనిపిస్తాయి.

చక్రవర్తి అశోకుడెచ్చట
జగద్గురు శంకరుడెచ్చట
ఏవి తల్లీ నిరుడు కురిసిన
హిమ సమూహములు (ఏవి తల్లీ)

తరువాత కాలంలో శ్రీ శ్రీ, ఆరుద్ర, కుందుర్తి ఆంజనేయులు మొదలైన కవులు వచన కవితలో కల్తీలేని, చదువుకున్న వారి వ్యావహారిక భాషను ప్రయోగించారు. నండూరి వెంకటసుబ్బారావు పామరభాషలో 'ఎంకి పాటలు' రాసి ప్రయోగం చేశారు. స్వాతంత్ర్యోద్యమ కాలంలో జానపద బాణీలలో గేయాలు రాసిన కవులు 'దేశ సౌభాగ్యము కష్టజీవులపై నాధారపడి యున్నది... మన దేశమున జన సామాన్యము నిరక్షరాస్యులు. దేశ దైన్యము వారికి సుబోధము గావలెనన్న నిర్భాగ్యమైన భూమి భవము శరణ్యము' అని భావించారు. గరిమెళ్ల సత్యనారాయణ 'మాకొద్దీతెల్లదొరతనము' వంటి గేయాలు ఈ భాషలో వచ్చాయి. 1947కు ముందే హైదరాబాదు సంస్థానంలో ప్రారంభమైన తెలంగాణా రైతాంగ పోరాటం నుండి 'నైజాము సర్కరోడ' వంటి పాటలు ప్రజలకు దగ్గరగా ఉండే భాషలో వచ్చాయి.

వచనసాహిత్యంలో మాత్రం 1900 తర్వాత సజీవమైన వ్యావహారిక భాష పుంజుకుంది. 1921లో వచ్చిన ఉన్నవ లక్ష్మీనారాయణ 'మాలపల్లి' మొత్తం వ్యావహారిక భాషలో వచ్చిన మొదటినవల. ఆ రోజులలో గుంటూరు జిల్లా మొట్టతాలూకా గ్రామాలవారు నిత్యజీవితంలో ఉపయోగిస్తూ ఉండిన భాషనే ఉన్నవ 'మాలపల్లి'లో ఉపయోగించాడు. ఈ గ్రంథం ప్రవేశికలో వ్యావహారిక భాషలోనే మొదటి మారుగా గ్రంథం రాస్తున్నాననీ, నగరాల్లో భాష సంకరమైనందు వల్ల అది అతినిర్మలమైంది కాదనీ, అందుకని అందరికీ అర్థమయ్యేటట్టుగా, సుబోధకమయ్యేట్లుగా పల్లెటూళ్లలోని భాషలోనే పుస్తకం రాస్తున్నానని ఉన్నవ చెప్పుకున్నాడు. ఇందులో మాండలిక పద ప్రయోగాలు కూడా ఎక్కువగానే కనిపిస్తాయి. ఉన్నవ వచనానికి ఉదాహరణగా కింది వాక్యాలు చూద్దాం.

"బండి దేవాలయానికి పోయే మెట్ల దగ్గర ఆగింది కోడలూ, రామానాయుడూ దిగారు. లక్ష్మమ్మ మీరు నొగలు పట్టుకుంటే దిగుతానని మెల్లగా జారింది. పూజారి అప్పయ్య హాజరుగా వున్నాడు. చాలా పొడుగాటి వాడు అరవయ్యో వడిలో వుంటాడు కొంచెం ఆడంగి రేఖల మనిషి. సంసారంలేదు. చిన్నప్పుడే భార్య వెళ్లిపోయింది. పొట్టలోపలికి పోయి అప్పళించే వుంటుంది." అంతకుముందే గురజాడ అప్పారావు తన కథానికలో అనుసరించిన స్వరూపం ఇట్లా ఉంది :

"ఆదివారం మధ్యాన్నం నాలుగుగంటలప్పుడు పువ్వులతోటలో ఒక పరుపుమామిడిచెట్టు క్రింద ఇసకలో మేమంతా పాతికమంది కూర్చున్నాం గావంచాపరచుకొని, మాకు అభిముఖంగా శాస్తుల్లుగారు కూచున్నారు. నేను బల్లచెక్కతెచ్చివెయ్యబోతే 'హొద్దురా' మీరంతా తాంబూలాలంవేస్తూ, శాస్తుల్లుగారు బౌద్ధమతం విషయమై" (ఉపన్యసించారు). తరువాత రచయితలు వచన ప్రక్రియలలో ముఖ్యంగా నవలల్లో, కథానికాల్లో సమకాలీన వ్యావహారిక భాషనుప్రయోగించటమేకాదు, తమదంటూ ప్రత్యేక శైలులను ప్రదర్శించారు. గుడిపాటి వెంకట

BRAOU

చలం తన రచనలలో ఉచ్చారణ విధేయంగా పదరూపాలను రాయటమే కాకుండా, ఊనికను బట్టి, భావతీవ్రతను బట్టి విలక్షణమైన వాక్య నిర్మాణ రీతులను అవలంబించాడు. కొడవటి గంటి కుటుంబరావు నిరాడంబరమైన సరళవాక్యశైలిలో నిరలంకారంగా, సూటిగా భావాన్ని వ్యక్తీకరించే ధోరణిని అనుసరించాడు. ఇంగ్లీషుభాషా ప్రభావం ఏమాత్రంలేని కోనసీమ శుద్ధ వ్యవహారిక భాషను శ్రీ పాద సుబ్రమ్మణ్య శాస్త్రి తన రచనలలో అవలంబించాడు. బుచ్చిబాబు వచన రచనాశైలిలో ఇంగ్లీషు వాక్యవిన్యాస ప్రభావం కనిపిస్తుంది. లోతైన భావాన్ని సూటిగా అందించే శైలి గోపీచంద్‌ది. విశాఖపట్నం మాండలికం యాసలో రచన చేసిన రాచకొండ విశ్వనాథశాస్త్రి రచనలలో విషయాన్ని తిప్పిచెప్పే అలంకారిక శైలి కనిపిస్తుంది. ఇట్లా ఆధునిక వచన ప్రక్రియలలో వ్యావహారిక భాష సృజనాత్మక రచయితల స్వతంత్రశైలి భేదాలతో విస్తరించి స్థిరపడింది. క్రీ. శ. 1900–1947 మధ్య వార్తా పత్రికలను కాలక్రమంలో చదివి చూస్తే పత్రికలలో భాషాప్రయోగంలో వచ్చిన మార్పులు, వ్యావహారిక భాషా క్రమపరిణామం స్పష్టపడుతుంది. 1947 నాటికి సృజనాత్మక రచనలు, వార్తాపత్రికలు, సినిమాలు, రేడియో, ఇతర కమ్యూనికేషన్ సౌకర్యాలు కారణంగా ప్రామాణికీకరణ వైపుగా తెలుగుభాష పయనించింది.

## 14.7.0 భాషాప్రయుక్త రాష్ట్రాలు

1947 ఆగష్టు 15న భారతదేశానికి బ్రిటిష్ పాలన నుండి విముక్తి లభించింది. 1947 నవంబర్ 27వ తేదీ నాడు అప్పటి భారత ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ ఈవిధంగా ప్రకటించాడు. "భాషా సాంస్కృతిక ప్రాతిపదికలపై భాషా రాష్ట్రసూత్రాన్ని భారత ప్రభుత్వం ఆమోదించింది. ఆంధ్రరాష్ట్ర నిర్మాణం అత్యంత సమంజసమైన కోర్కె. దీనిని అంగీకరిస్తున్నాము. నూతన భారత రాజ్యాంగంలో నమోదుచేయవచ్చు". 1950 జనవరి 26నాడు భారత రాజ్యాంగం అమలులోకి వచ్చింది. భారతదేశం రిపబ్లిక్‌గా అవతరించింది. రాజ్యాంగం గుర్తించిన జాతీయ భాషలలో తెలుగు ఒకటి. 1953 అక్టోబరు 1వ రోజు మద్రాసు రాష్ట్రంలో భాగమైన ఆంధ్రప్రాంతం కర్నూలు రాజధానిగా ఉన్న ఆంధ్రరాష్ట్రంగా అవతరించింది. హైదరాబాద్ రాష్ట్రంలో భాగమైన తెలంగాణా ప్రాంతంకూడా కలిసి సమగ్ర తెలుగునాడుగా 1956 నవంబరు 1వ తేదీన 'ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం' ఏర్పడింది. ఆధునికతలో ప్రధానమైన అంశం జాతిభావన. దీనికి ఆధారం భాష. ఒక తెగకు చెందిన ప్రజలమధ్య గుర్తింపుకు మూలకారణం భాష. ఒకే భాష మాట్లాడే వారిలో ఉండే ఏకరూపత, ఐక్యత 'జాతి' గా గుర్తింపును కలుగజేస్తుందన్న భావానికను గుణంగా పశ్చిమదేశాలలో జాతీయ రాజ్యాలేర్పడ్డాయి. సుమారుగా [illegible]కపైనే సమగ్ర భారతదేశంలో భాగంగా భాషాప్రయుక్త రాష్ట్రాలేర్పడ్డాయి. 1947 తరువాత తెలుగుభాషా వికాసం ముఖ్యంగా మూడు రంగాలలో కనిపిస్తుంది. 1) సృజనాత్మక సాహిత్యరంగం, సాంస్కృతిక రంగం, 2) విద్యారంగం, 3) పరిపాలనా రంగం కావ్య భాషాపద్ధతిలో వచ్చిన కవిత్వంలో తప్ప ఇతర రూపాలలో వచ్చిన కవిత్వంలోనూ, నవల, కథానిక, వ్యాసం మొదలైన వచన ప్రక్రియలలోనూ, వార్తా పత్రికలలోనూ, చదువుకున్నవారి వాడుకలోని భాషకు దగ్గరగా ఉండే భాష ప్రయోగంలోకి వచ్చింది. సృజనాత్మక రచయితలు స్వతంత్రమైన, తమదంటూ ప్రత్యేకమైన శైలులలో రచనలు చేశారు.

BRAOU

వచన ప్రక్రియలలో అన్ని ప్రాంతాలలో రచయితలు సమానంగా వాడే భాష ఈ కాలంలో రూపొందింది. రచయితలు మధ్యతరగతికి చెందినవారు కావటం, ఇతివృత్తాలు కూడా మధ్య తరగతికి చెందినవే ఎక్కువగా ఉండటం కారణంగా నగరీకృతమైన శైలి నవల, కథానిక మొదలైన వచన ప్రక్రియలలో కనిపిస్తుంది. ప్రత్యేకంగా ప్రాంతీయ మాండలికాలలో నవలలు, కథానికలు రచించే ప్రయత్నం కొంత జరిగింది. కాని అవి అంతగా ఫలించినట్లు కనిపించదు. పాత్రలనుబట్టి మాండలికాలను ఉపయోగించిన రచనలు ఎక్కువగానే ప్రచారం పొందాయి. ఆధునిక భాషను సమర్థంగా ఉపయోగించిన నాటకాలు, నాటికలు ఈ కాలం తొలి దశలో వచ్చాయి. 1947 తరువాత వివిధ ప్రాంతాలలో, కళాశాలల్లో జరిగిన సాంస్కృతికోత్సవాలు వివిధ ప్రాంతాలలోని చదువు కున్న వారిలో సమానరూపమైన భాష అభివృద్ధి చెందటానికి కొంతదోహదం చేశాయి. హైదరాబాదులోని ఆంధ్ర సారస్వత పరిషత్తు, ఆంధ్రాభ్యుదయోత్సవాలు, తెలంగాణా రచయితల సంఘం, తొలిదశలో ఈ పరిణామానికి కొంత దోహదం చేశాయి. ఆంధ్రప్రదేశ్ ఏర్పడిన తరువాత హైదరాబాదు రాజధాని కావటం, భిన్న ప్రాంతాల వారు కలుసుకునే అవకాశం పెరగటం ప్రామాణికమైన తెలుగు భాష స్వరూపం ఏర్పడటాన్ని మరింత వేగవంతం చేశాయి. ఈ పరిణామాలలో రేడియో, సినిమాలు కూడా ప్రధాన పాత్ర వహించాయి.

### 14.7.1 బోధనా భాషగా తెలుగు, తెలుగు అకాడమి

"పాఠశాలలో తెలుగు శాస్త్రములు చెప్పుడనినపుడు, మీకు తెలుగులో శాస్త్ర గ్రంథములేవి? యని యడ్డము చెప్పుదురు. శాస్త్ర గ్రంథములు వ్రాయుడనగానే 'ఆగ్రంథములనుపయోగించు విళ్ళేవోయీ;' అని

వీరే మరల నడ్డము చెప్పుదురు. వీరి సిద్ధాంతము ననుసరించి పిచ్చికుదిరినగాని పెండ్లికాదు పెండ్లియైనగాని పిచ్చి కుదరదు. వీరివాదమువినుచుండిన పిచ్చియు కుదరదు పెండ్లియుకాదు. కావున పరస్పరాశ్రయ ద్వేషభూయిష్టమైన వీరివాదము చూచి మనము భయపడవలదు," సుమారు అర్ధ సంవత్సరాల క్రితం 'దేశభాషలలో శాస్త్రపఠనం' అనేవ్యాసంలో కొమర్రాజు లక్ష్మణరావు వెలిబుచ్చిన భావాలు పైవి. ఇలాంటి ధోరణులు ఈరోజుకి అక్కడక్కడ కనిపిస్తూనే ఉన్నాయి. కొంత సత్యమూ, ఎక్కువగా ఊహాత్మకమూ అయిన ఇలాంటి ఆలోచనా ధోరణులను అధిగమించిబోధనారంగంలో తెలుగు భాష నిలదొక్కుకుంటున్నది. 1947 నాటికే ఉన్నత పాఠశాలల స్థాయిలో తెలుగు బోధనా భాషగా సత్ఫలితాలను ఇచ్చింది. ప్రభుత్వ సంస్థలతో అంతగా సంబంధంలేకుండానే బీజగణితం, క్షేత్రగణితం, భౌతికశాస్త్రం, రసాయన శాస్త్రం, వృక్షశాస్త్రం, భూగోళం, ఇతర సామాజిక శాస్త్రాలు మొదలైనవిషయాలకు సంబంధించిన పాఠ్యగ్రంథాలు కొందరు వ్యక్తుల కృషి, శ్రమ ఫలితంగా ఉన్నతపాఠశాల స్థాయివరకూ తెలుగులో వచ్చాయి. ఉపాధ్యాయులు ఆ శాస్త్ర విషయాలను తెలుగులో బోధించటానికి అలవాటు పడ్డారు. కళాశాల, విశ్వవిద్యాలయ స్థాయిలో మాత్రం 1947 తరువాత కూడా ఇంగ్లీషు మాధ్యమం కొనసాగింది.

**తెలుగు అకాడమీ**

1968 లో భాషావిధానానికి సంబంధించిన ఒక తీర్మానాన్ని భారత పార్లమెంటు ఆమోదించింది. "భారత రాజ్యాంగంలోని 8వ అనుబంధంలో పేర్కొనబడిన భారతీయ భాషలన్నిటి సంపూర్ణ వికాసానికి నిర్దిష్టమైన చర్యలు తీసుకోవడం. దేశంలో విద్యా, సాంస్కృతికాభివృద్ధికే అవశ్యం కాబట్టి, హిందీతోపాటు ఇతర భారతీయ భాషలు సంపన్నాలై ఆధునిక విజ్ఞాన ప్రసారానికి పటిష్టమైన సాధనాలు అయ్యేట్లుగా వాటి సమగ్ర వికాసానికి భారత ప్రభుత్వం, రాష్ట్రప్రభుత్వాలతో కలిసి ఒక సమగ్ర పథకాన్ని రూపొందించి అమలు జరపాలి". అని ఆ తీర్మానంలో ఉంది. ఈ తీర్మానాన్ని అమలు పరచటానికి, కేంద్ర పబ్లిక్ సర్వీస్ కమీషన్ పరీక్షలకు ఇంగ్లీషు, హిందీలతోపాటు రాజ్యాంగంలో గుర్తించిన ఇతర భారతీయ భాషలను మాధ్యమంగా ప్రవేశ పెట్టటానికి తగిన మార్గాలను సూచించవలసిందిగా డా॥ డి. ఎస్. కొఠారి అధ్యక్షతలో కేంద్ర ప్రభుత్వం ఒక కమిటీని ఏర్పాటు చేసింది. అంతకుముందే ఆంధ్రప్రదేశ ప్రభుత్వం 1966లో అప్పటి విద్యాశాఖ కార్యదర్శి జె.పి.ఎల్. గ్విన్ అధ్యక్షతలో తెలుగు భాష అభివృద్ధికి ప్రభుత్వానికి తగిన సూచనలివ్వటానికి ఒక కమిటీని ఏర్పాటు చేసింది. ఆ కమిటీ సలహా అనుసరించి 1968లో "తెలుగు అకాడమి" ప్రారంభమైంది.

1. బోధనాభాషగా తెలుగును అమలు పరచటానికి అనుగుణంగా తెలుగు భాషను ఆధునీకరించటం 2. తెలుగులో వివిధ విషయాలకు సంబంధించిన పాఠ్యగ్రంథాలను, రిఫరెన్సు పుస్తకాలను, పదకోశాలను తయారుచేయటం 3. విశ్వవిద్యాలయ స్థాయిలో కూడా తెలుగును మాధ్యమంగా ఏర్పరచటానికి సూచనలు చేయటం 4. తెలుగును అధికారభాషగా అమలుపరచటానికి తగిన దోహదాన్ని ప్రభుత్వానికి అందించటం 'తెలుగు అకాడమీ' లక్ష్యాలుగా నిర్దేశించారు. చాలా తక్కువ కాలంలోనే తెలుగు అకాడమీ ఇంటర్మీడియట్, డిగ్రీస్థాయిలకు సంబంధించి, అనేక విషయాలలో తెలుగులో పాఠ్యగ్రంథాలను తయారు చేయించింది. సమగ్రమైన తెలుగు వ్యాకరణం సిద్ధం చేయటానికి అనువుగా జిల్లావారీగా తెలుగు మాండలికాల పరిశీలనను తెలుగు అకాడెమీ చేపట్టింది. సమగ్ర నిఘంటు నిర్మాణానికి కృషి చేస్తోంది. ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ వృత్తి పదకోశాల నిర్మాణాల ద్వారా ప్రజల వాడుకలో ఉండి నిఘంటువుల కెక్కని తెలుగుపదాలను సేకరించటానికి, తెలుగు ఆధునిక భాషగా రూపొందటానికి తగిన దోహదం చేసింది. కొఠారీ కమీషన్ నివేదిక చర్యలోకి రాకముందే కళాశాల స్థాయిలో తెలుగును మాధ్యమంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రవేశపెట్టింది. క్రమంగా పోస్ట్‌గ్రాడ్యుయేట్ స్థాయిలో కూడా తెలుగు మాధ్యమంగా విశ్వవిద్యాలయాలు ప్రవేశ పెడుతున్నాయి. ప్రస్తుతం ఇది కొన్ని విషయాలకు మాత్రమే పరిమితమై ఉంది.

BRAOU

**14.7.2 అధికార భాషగా తెలుగు**

ప్రజాస్వామ్యంలో ప్రజల భాషలో పరిపాలన జరపటం ప్రధాన లక్ష్యంగా భాషా ప్రయుక్త రాష్ట్రాలు ఏర్పడ్డాయి. ఆంధ్రప్రదేశ్‌లో, అంతకు ముందు ఆంధ్రరాష్ట్రం ఏర్పడకముందే 1948 లో ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో భాగమైన తూర్పుగోదావరి జిల్లాలో, 1952 లో హైదరాబాదు రాష్ట్రంలోని ఖమ్మం, వరంగల్, కరీంనగర్, నల్లగొండ జిల్లాలోను తెలుగు అధికార భాషగా అమలు చేయటానికి నిర్ణయాలు జరిగాయి.

ఆంధ్రరాష్ట్రం ఏర్పడిన తరువాత 1955 సెప్టెంబరులో ఆంధ్రరాష్ట్రం శాసనసభలో ప్రభుత్వ వ్యవహారాలన్నిటినీ తెలుగులోనే నిర్వహించాలని వచ్చిన ప్రైవేటుబిల్లును తోసిపుచ్చటం జరిగింది. 1956లో ఆంధ్రప్రదేశ్ ఏర్పడిన తరువాత కూడా అన్ని స్థాయిల్లోనూ తెలుగును అధికార భాషగా అమలు చేయటానికి తగిన చర్యలు వెంటనే తీసుకోవటం జరగలేదు. అప్పుడు ఆంధ్రప్రదేశ శాసన సభాధ్యక్షులు అయ్యదేవర కాళేశ్వరరావుగారి అధ్వర్యంలో శాసనసభ నియమించిన ఉపసంఘం 'తెలుగు పారిభాషిక పదకోశాన్ని' తయారు చేసింది. దానితో తెలుగును అధికార భాషగా చేయటానికి పునాదిపడింది.

ఆంధ్రప్రదేశ్ అధికారభాషా శాసనం 1966 లో శాసనరూపం దాల్చింది. ఈ శాసనంలోని ముఖ్యాంశాలివి :

1. ఆంధ్రప్రదేశ్ అన్ని ప్రాంతాలలోనూ 1966 మే 14వ తేదీ (శాసనం గెజెట్‌లో ప్రకటించిన తేదీ) నుండి తెలుగును అధికార భాషగా నిర్ణయం చేయటం జరిగింది.

2. ఏయే ప్రభుత్వశాఖలలో కార్యకలాపాలకు ఏయే తేదీలనుండి తెలుగును ఉపయోగింపవచ్చునో రాష్ట్రప్రభుత్వం గెజెట్‌ద్వారా ఆదేశించవచ్చు.

3. (అ) శాసన మండలిలోను, ఏ సభలోనైనా ప్రవేశ పెట్టే బిల్లులు.

(ఆ) గవర్నర్ జారీచేసే ఆర్డినెన్సులు.

(ఇ) రాష్ట్ర శాసనం కింద కానీ, పార్లమెంటు శాసనం కింద కానీ రాష్ట్ర ప్రభుత్వం, అధికార వర్గాల నుంచి జారీచేసే ఉత్తర్వులు (జి.ఓ.లు), నియమాలు, రెగ్యులేషన్లు, నిబంధనలు, ఉపనిబంధనలలో ఉపయోగించే భాష ప్రభుత్వం గెజెట్‌లో నిర్ణయించే తేదీ నుంచి తెలుగు భాష అయి ఉండాలి.

ఈ చట్టం ప్రకారం అధికారభాషా శాసనాన్ని ప్రకటించిన అయిదు సంవత్సరాల తరువాత రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వు ప్రకారం అధికారభాషా సంఘాన్ని ఏర్పాటు చేసింది. అందులో ఒక అధ్యక్షుడు, నలుగురు ఇతర సభ్యులు ఉంటారు. ప్రభుత్వకార్యకలాపాలతో తెలుగుభాషను ఉపయోగించటంలో సాధించిన ప్రగతిని ఈ సంఘం సమీక్షిస్తుంది. దీనికి సంబంధించి ప్రభుత్వానికి నివేదికలను సమర్పిస్తుంది. ఇదేసందర్భంలో పబ్లిక్ సర్వీస్ కమీషన్ పరీక్షలలో కూడా తెలుగులో సమాధానాలు రాయవచ్చని 1970 లో ఉత్తర్వులు జారీ అయ్యాయి. దీనికనుగుణంగానే కళాశాల స్థాయివరకు తెలుగును బోధనాభాషగా ప్రవేశపెట్టడం జరిగింది. 1972 లో రాష్ట్రమంత్రివర్గం తెలుగుబోధనాభాషగా చదివిన విద్యార్థులకు ఉద్యోగావకాశాలలో ప్రాధాన్యత ఇచ్చే విషయాన్ని నిర్ణయించి పబ్లిక్ సర్వీస్ కమిషన్‌కి పంపింది. ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘానికి శ్రీ వావిలాల గోపాలకృష్ణయ్యగారు మొదటి అధ్యక్షులుగా ఉన్నారు. తరువాత వరుసగా శ్రీమతి ఎస్. అనసూయమ్మ, శ్రీ వందేమాతరం రామచంద్రరావు, డా॥ సి. నారాయణరెడ్డి, డా॥ కొత్తపల్లి వీరభద్రరావు, శ్రీ నండూరి రామకృష్ణమాచార్యులు, డా॥ పి. యశోదారెడ్డి అధ్యక్షులయ్యారు.

### 14.7.3 అన్ని రంగాల్లో తెలుగు

తెలుగు అన్ని రంగాలలో ఉపయోగించడానికి ఆధునిక భాషగా రూపొందించటానికి మూడు ముఖ్య లక్షణాలుండాలని భాషావేత్తలు అభిప్రాయపడుతున్నారు. 1. మాండలికాలకు అతీతమైన ప్రామాణిక భాష 2. ఆధునిక విజ్ఞానానికి సాధనంగా భాష ఉపయోగించటానికి తగిన పదజాలం, రచనా విధానం. 3. సమగ్రమైన లిపి ఎక్కువ మంది వ్యవహర్తలు అంగీకరించటం, వివిధ రంగాల్లో ఉపయోగించటం, విద్యావంతులుగా గుర్తింప బడటానికి ఆ భాష కారణం కాగలగటం, వచన సాహిత్యం ఆ భాషలోనే రావటం, ఒక భాష మాట్లాడే వారి సంస్కృతీ, సమైక్యతలకు సంకేతం కావటం, ప్రమాణభాషా లక్షణాలు. ఇలాంటి భాష సృజనాత్మక రచనలలోనూ వైజ్ఞానిక, వినోద, ప్రచార సాధనాలలోనూ కనిపిస్తుంది. కొంత మాండలిక భేదాలున్నా అర్థంకావటానికి ఆటంకంలేని పద్ధతిలో ఆ భాష ఉంటుంది. మాండలికాలకు దూరమై కావ్యభాషలాగా మాత్రం ప్రమాణ భాష మారిపోకూడదు. వివిధ రంగాలలో ఉపయోగించే భాష ఏరూపంలో ఉండాలో ప్రభుత్వం సంస్థలుకాని, అకాడమీలు కాని శాసించకూడదు. ఈ విషయంలో ప్రయోక్తలకు స్వేచ్ఛ ఉండాలి. ఒకభాష మాట్లాడే వారి మధ్య సంబంధ బాంధవ్యాల ఆధారంగా మాత్రమే ఎక్కువగా ఏకరూపత కలిగిన ప్రమాణ భాష



BRAOU

ఏర్పడుతుంది. దేశంలోని భాషలన్నిటికీ సమానంగా పారిభాషిక పదజాలాన్ని రూపొందించుకోవటం సులభ సాధ్యంకాదు. పరిపాలనలో న్యాయస్థానాలలో, శాస్త్రవిజ్ఞానరంగాలలో కొత్త పారిభాషిక పదజాలాన్ని మొదట సృష్టించుకున్న తరువాత మాత్రమే తెలుగును అమలుపరచవచ్చు అనే భావంకూడా సరైందికాదు. భావాన్ని అర్థం చేసుకుని దానిని వివరణాత్మకంగా తెలియచెప్పటం ద్వారా కొత్త మాటలు, పారిభాషిక పదాలు భాషల్లో ప్రవేశించేటట్లు చేయవచ్చు. అవసరమైతే మొదటిదశలో ఇంగ్లీషు మొదలైన ఇతర భాషా పదాలను యథాతథంగా వాడవచ్చు. కాలక్రమంలో కొత్త భావాలను సూచించే కొత్త మాటలు కూర్పులు తెలుగులో సహజసిద్ధంగా ఏర్పడుతాయి. తెలుగు లిపి ఉచ్చారణ విధేయంగా ఉంటుంది. తెలుగు లిపికీ, ఉచ్చారణకూ మధ్య ఎక్కువగా భేదం లేదు. అందువల్ల లేఖన క్రమానికి సంబంధించిన సమస్యలు అంతగా లేవు.

తెలుగు ఆధునికభాషగా అభివృద్ధి చెందటానికి భాషావేత్తలు చేసిన సూచనలను కింది విధంగా క్రోడీకరించవచ్చు.

1. వీలయినంతవరకు తెలుగు మాటలలోనే పారిభాషిక పదాలను సృష్టించుకొనే ప్రయత్నం చేయాలి.

2. కొత్తమాటలను కల్పించుకోవటం కన్న భావాలు అవగాహన కావటం ముఖ్యం. అవసరాన్నిబట్టి ఇంగ్లీషు పదాలనో, తెలుగుతో అతికే సంస్కృతపదాలనో ఉపయోగించవచ్చు.

3. తేలిక మాటలతో, సరళమైన వాక్యాలలో అభిప్రాయం ప్రకటించే అలవాటును పెంచాలి.

4. అన్ని మాండలికాలకూ దగ్గరగా ఉండే పద్ధతిలో ప్రమాణభాష ఏర్పడాలి.

5. విజ్ఞాన, సామాజిక శాస్త్రరంగాలలో అనువాదాలను కాక స్వతంత్ర రచనలను ప్రోత్సహించాలి.

6. భిన్న శాస్త్రాలకు సంబంధించి తెలుగుద్వారా పరిశోధనలు చేయటానికి అవకాశాలు కల్పించాలి.

7. పరిపాలనకు సంబంధించిన అన్ని వ్యవహారాల్లోనూ తెలుగులో పదాలు లేకపోయినా, సృష్టించుకోవటం సాధ్యంకాకపోయినా తెలుగు వాక్యాలలోనే ఇంగ్లీషు భాషా పదాలను కలిపి రాయటానికి అవకాశం ఇవ్వాలి.

BRAOU

8. భాషను ఉపయోగించటం విషయంలో అవసరమైన కట్టుబాట్లను పరిహరించాలి.

9. తెలుగు మాధ్యమంగా చదువుకున్న పట్టభద్రులకు ఉద్యోగావకాశాలలో ప్రాధాన్యం ఇవ్వాలి.

10. అన్నిటికంటే ముఖ్యంగా పరిపాలనలో ప్రజలకు భాగస్వామ్యం పెంచే అంశంలో, శాస్త్రి విజ్ఞానాన్ని ఎక్కువ మందికి అందుబాటులోకి తీసుకొని రావాలన్న ఆశయంతో, చిత్తశుద్ధితో కృషి చేయాలి.

## అవగాహన ప్రశ్న – 3

"అధికారభాషగా తెలుగు" అనే అంశాన్ని 30 పంక్తులలో వివరించండి.

## 14.8 సారాంశం

ఈ భాగంలో మీరు నేర్చుకున్న ప్రధాన విషయాలు :

- ఆంగ్లేయుల ప్రమేయంతో భాషా రంగంలో మార్పులు వచ్చాయి.
- తెలుగు భాషా సాహిత్యాలు కొత్త మార్గాల్లో వెళ్లాయి.
- గ్రాంధిక వ్యావహారిక భాషావాదాలు శైలి విషయంగా తల ఎత్తాయి.
- సృజనాత్మక సాహిత్యంలో నవల, కధానిక, నాటకం, నాటిక, వంటి ప్రక్రియలు వికసించాయి. పత్రికా రచన పెంపొందింది. ఆధునిక ప్రమాణ భాష ఒకటి ఏర్పడింది.
- భాషాప్రయుక్త రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ ఏర్పడ్డాక తెలుగు అధికార భాష అయింది. బోధనభాష అయింది. వివిధ రంగాల్లో తెలుగు వాడకం జరుగుతోంది.

## అవగాహన ప్రశ్నలకు జవాబులు

1. ఆధునిక దశలో తెలుగు భాషకు సంబంధించి వివిధ వ్యాకరణాలూ నిఘంటువులూ అవతరించాయి. వాటిలో వ్యాకరణానికి సంబంధించి 1816 లో ఏ.డి.క్యాంప్‌బెల్ రచించిన "ఏ గ్రామర్ ఆఫ్ ద తెలుగు లాంగ్వేజ్" 1807 లో విలియం బ్రౌన్ "ఏ గ్రామర్ ఆఫ్ ద జెంతూ లాంగ్వేజ్" 1814 లో విలియం కేరీ "గ్రామర్ ఆఫ్ ద తెలింగ లాంగ్వేజ్" ప్రముఖమైనవి. 1812 లో కాంప్‌బెల్ "ఏ డిక్షనరీ ఆఫ్ ద తెలుగు లాంగ్వేజ్", 1849లో సి. పి. బ్రౌన్ ఇంగ్లీష్ - తెలుగు, తెలుగు - ఇంగ్లీష్ నిఘంటువులు వెలువరించాడు. ఆంగ్లేయుల కోసం ఇంగ్లీష్‌లో తెలుగు వ్యాకరణాన్ని రచించాడు. 1834 పుదూరి సీతారామశాస్త్రి "తెలుగు వ్యాకరణం", రావిపాటి గురుమూర్తి "గురుమూర్తి వ్యాకరణము", 1806 లో వచ్చిన మామిడి వేంకటార్యులు "ఆంధ్ర దీపిక" (నిఘంటువు) మరికొన్ని ముఖ్య గ్రంధాలు.

2. 1914 లో మద్రాసు విశ్వవిద్యాలయం "కాంపోజిషన్ కమిటీ"ని ఏర్పాటు చేసింది. ఇందులో ఆధునిక భాషావాదులైన గిడుగు రామమూర్తి, గురజాడ అప్పారావు, ఏ. టి. శ్రీనివాస అయ్యంగార్, బుర్రాశేషగిరిరావు ప్రభృతులే కాక గ్రాంధిక భాషా వాదులైన వేదం వేంకటరాయశాస్త్రి, జయంతి రామయ్య పంతులు, కొమఱ్ఱాజు లక్ష్మణరావు వంటివారూ, మరికొందరు తటస్థవాదులూ సభ్యులుగా ఉన్నారు. ఆ కమిటీలో గ్రాంధిక భాషావాద తీర్మానానికి వ్యతిరేకంగా గురజాడ అప్పారావు "ది మినిట్ ఆఫ్ డిసెంట్ టు ద రిపోర్ట్ ఆఫ్ ది కాంపోజిషన్ సబ్ కమిటీ" అనే ఒక సుదీర్ఘ వ్యాసాన్ని సమర్పించి ఆధునిక భాషా పరిణామానికి పునాదులు వేశాడు. గిడుగు రామమూర్తి, వీరేశలింగం పంతులూ వ్యావహారికభాషా వాదానికీ, ప్రామాణిక భాషా వాదానికీ జీవితాంతం కృషి చేశారు. ఆ తర్వాత వచ్చిన కొన్ని సృజనాత్మక రచనలూ, వార్తా పత్రికలూ, సినిమాలు, రేడియోలు క్రమక్రమంగా సమకాలీన భాషావాదాన్నే అనుసరిస్తూ ఆధునిక ప్రామాణిక భాషా పరిణామానికి దోహదం చేశాయి.

3. ప్రజాస్వామ్యంలో ప్రజల భాషలో పరిపాలన జరపటం ప్రధాన లక్ష్యంగా భాషా ప్రయుక్త రాష్ట్రాలు ఏర్పడ్డాయి. ఆంధ్రప్రదేశ్ అధికార భాషా శాసనం 1966 లో ఆవిర్భవించింది. ఈ శాసనంలోని ముఖ్యాంశాలివి :

   1. ఆంధ్రప్రదేశ్ అన్ని ప్రాంతాలలోనూ 1966 మే 14వ తేదీ (శాసనం గెజెట్‌లో ప్రకటించిన తేదీ) నుండి తెలుగును అధికార భాషగా చేయడానికి నిర్ణయం జరిగింది.
   2. ఏయే ప్రభుత్వ శాఖలలో కార్యకలాపాలకు ఏయే తేదీల నుండి తెలుగును ఉపయోగించవచ్చునో రాష్ట్ర ప్రభుత్వం గెజెట్ ద్వారా ఆదేశించవచ్చు.
   3. గవర్నర్ జారీ చేసే ఆర్డినెన్స్‌లు, శాసనమండలిలో ప్రవేశపెట్టే బిల్లులు, రాష్ట్ర శాసనం కింద కానీ, పార్లమెంట్ శాసనం కిందకానీ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసే జి. ఓ. లు, నియమాలు, రెగ్యులేషన్ల నిబంధనలు, ఉపనిబంధనల వంటివి తెలుగు భాషలోనే ఉండాలి. ఈ నిర్ణయాలననుసరించి తెలుగును అధికార భాషగా ప్రవేశపెట్టడానికి శాసనం రూపొందింది.

BRAOU

దీన్ని ప్రకటించిన 5 సంవత్సరాల తర్వాత రాష్ట్ర ప్రభుత్వం శాసనం అమలుకోసం అధికార భాషాసంఘాన్ని ఏర్పాటు చేసింది. అందులో ఒక అధ్యక్షుడు, నలుగురు సభ్యులు ఉంటారు. శాసనం అమలు ప్రగతిని ఈ సంఘం సమీక్షిస్తూ, పర్యవేక్షిస్తుంది. దీనికి సంబంధించిన నివేదికలను ప్రభుత్వానికి సమర్పిస్తుంది. 1970 లో పబ్లిక్ సర్వీస్ కమీషన్ పరీక్షలు కూడా తెలుగులో రాయవచ్చుననే ఆదేశం ప్రభుత్వం నుండి జారీ అయింది. దీనికనుగుణంగా కళాశాల స్థాయివరకూ బోధనాభాషగా తెలుగును ప్రవేశపెట్టడం జరిగింది. 1972లో రాష్ట్ర మంత్రివర్గం తెలుగు బోధనాభాషగా చదివిన విద్యార్థులకు ఉద్యోగ నియామకాల్లో ప్రాధాన్యత ఇవ్వాలని పబ్లిక్ సర్వీస్ కమీషన్‌కు సిఫారసు చేసింది. ఇలా సాగుతున్న అధికార భాషాసంఘానికే మొదటి అధ్యక్షులుగా శ్రీ వావిలాల గోపాల కృష్ణయ్యగారు ఉన్నారు. ఆ తర్వాత వరుసగా – శ్రీమతి టి.ఎస్. అనసూయమ్మ, శ్రీ వందేమాతరం రామచంద్రరావు, డా॥ సి. నారాయణరెడ్డి, డా॥ కొత్తపల్లి వీరభద్రరావు, శ్రీ నండూరి రామకృష్ణమాచార్యులు, డా॥ పి. యశోదారెడ్డి అధ్యక్షులుగా పనిచేశారు.

### చదవదగిన పుస్తకాలు

15వ భాగంలో చూడండి.

### మాదిరి పరీక్షా ప్రశ్నలు

I. కింది ప్రశ్నలకు 30 వాక్యాలకు మించకుండా సమాధానాలు రాయండి.

1. ఆంగ్లేయుల ప్రమేయంతో మన భాషలో వచ్చిన పరిణామాలను చిత్రించండి.
2. భాషావాదాలను పరిచయం చేయండి.

II. ఈ కిందివాటికి 10 వాక్యాలకు మించకుండా జవాబులు రాయండి.

1. బోధనా భాషగా తెలుగు.
2. అన్ని రంగాల్లో తెలుగు.

BRAOU

# భాగం – 15 నవీకరణ ప్రయత్నాలు

## విషయ క్రమం

15.0 లక్ష్యాలు
15.1 పరిచయం
15.2 నవీకరణ నిర్వచనం
15.3 నవ్యతా భేదాలు
15.4 వాస్తవిక సమస్యలు
15.5 పరిభాషా సమస్యలు
15.6 అనువాదకల్పన, ఆధారపద్ధతులు
15.7 నవీకరణ ప్రయత్నాలు
అవగాహన ప్రశ్న– 1
15.8 సారాంశం
అవగాహన ప్రశ్నకు జవాబు
చదవదగిన పుస్తకాలు
మాదిరి పరీక్షా ప్రశ్నలు

## 15.0 లక్ష్యాలు

ఈ భాగం చదివాక భాషను నవీకరించమంటే ఏమిటో మీరు వివరించగలుగుతారు. ఆధునిక భావాలకూ, భాషారూపాలకు మధ్య ఉండే సంబంధాన్ని విశ్లేషించగలగటమే కాకుండా, పరిభాషా సమస్య పరిష్కారాల మార్గాలను సైతం మీరు వివరించగలుగుతారు.

BRAOU

## 15.1 పరిచయం

తెలుగు భాష సాహిత్య భాషగా ఎంత ప్రాచీనమో ఎంత అభివృద్ధి సాధించిందో చదువుకున్నారు. భిన్న చారిత్రక దశల్లో తెలుగుమీద సంస్కృత ప్రాకృతాలవంటి ప్రాచీన భాషలూ హిందీ, ఉర్దూలవంటి ఆధునిక భాషలూ, ఇంగ్లీషువంటి అంతర్జాతీయ భాషలూ తమ ప్రభావం చూపాయి. కొద్దో గొప్పో ఆయా భాషల మీద తెలుగు ప్రభావంకూడా పడ్డది. తెలుగు భాషలో సహజంగాలేని లక్షణాలుకొన్ని అన్యభాషా ప్రభావంవల్ల వచ్చాయి. ఆలా అన్యసాహిత్య సంస్కృతుల ప్రభావంకూడా కనిపిస్తుంది. ఇప్పటి తెలుగు ఆధునిక భాషల్లో ఒకటి. ఈ కాలపు భాషలో కూడా పూర్వ లక్షణాలు కొన్ని మిగిలి ఉంటాయి. మరికొన్ని కొత్తవి చేరుతుంటాయి. మార్పు సహజం. సజీవభాషల్లో మార్పు మరింత వేగంతో వస్తుంది. తనంతటతానే సహజపరిణామ క్రమంలో వాడుకలో ఉన్న భాష కొత్తదనం సంపాదించుకుంటుంది. ఈ కొత్తదనం తెలుగులో ఏ విధంగా ఉందో ఈ భాగంలో మీకు పరిచయం చేస్తున్నాం.

## 15.2 నవీకరణ నిర్వచనం

భాషలో సహజంగా వచ్చే మార్పులు మెల్లిగా జరుగుతాయి. పరిణామం క్రమబద్ధంగా జరుగుతుంది. కాల క్రమంలో మార్పులు, పరిణామం జరుగుతాయి. కాబట్టి చరిత్రగతమైన పరిణామాలను దృష్టిలో ఉంచుకొని సామాజికావసరాలు, ప్రయోజనాల దృష్టిలో ప్రయత్నపూర్వకంగా తొందరగా భాషను ప్రభుత్వాలు ప్రణాళికా బద్ధంగా ఆధునికం చేయటమే నవీకరణ అని మనం స్థూలంగా నిర్వచించుకోవచ్చు. ఈ నిర్వచనాన్ని కొంత వివరంగాతెలుసుకుందాం.

భాష ఒక మూర్తవస్తువు కాదు. పాతయింటికి మరమ్మత్తులు చేసి రంగులద్ది కొత్తయిల్లుగా మార్చినట్లు భాషను మార్చలేం. భాషతో వచ్చే మార్పులు ఆ భాషను మాట్లాడే ప్రజల అవసరాలవల్ల వస్తాయి. ఉపయోగం వల్ల వస్తాయి. తెలుగు ఇంత కాలం సాహిత్య భాషగా ఎదిగింది. ప్రపంచ వ్యాప్తంగా సాహిత్యంలో వచ్చిన కొత్త ప్రక్రియలనూ, పోకడలనూ తెలుగువాళ్ళు తెలుసుకున్నారు. వాటిని తమ సాహిత్యానికి అన్వయించారు. కొన్ని సమయాల్లో తమ భాషలోకి అనువదించుకొన్నారు. అంటే తెలుగును సరికొత్త సాహిత్య పరిణామాలను ధోరణులను వ్యక్తీకరించటంలో ఉపయోగించారన్నమాట. అదే విధంగా ఇంతకు పూర్వం తెలుగుభాష వాడుకలేని రంగాలలో తెలుగును వాడినప్పుడు తెలుగును నవీకరించినట్లవుతుంది. అలా నవీకరించటానికి తీసుకొనే చర్యలే నవీకరణ ప్రయత్నాలు.

## 15.3 నవ్యతా భేదాలు

ఆధునిక ప్రపంచంలో రకరకాల ఉపయోగాలున్నాయి. అనేకరంగాలున్నాయి. అనుక్షణం అవి విస్తరిస్తున్నాయి. అలా రంగాలన్నింటిలోనూ తెలుగుభాషను వాడుక చేసినట్లయితే అది నవ్యభాష అవుతుంది. నవ్యత రెండు మూడు రకాలు. సహజ పరిణామ క్రమంలో 'భాషారూపాల్లో' వచ్చిన మార్పులు దాని నవ్యతకు చిహ్నాలు. తెలుగు భాష ద్వారా సరికొత్త విజ్ఞాన విశేషాలను చెప్పగలిగితే తెలుగు భాషలో నవ్యత వస్తుంది. రూప నవ్యత విషయ నవ్యతలకు మధ్య భావనవ్యత తెలుగుజాతిలో వచ్చి ఉండాలి. ఆలోచనల్లో పాతకాలపు ధోరణులున్నంతకాలం విషయ బోధలో నవ్యతను సాధించలేం. ఆలోచనల్లో కొత్తదనం లేనంతకాలం నవ్య రూపాల వాడుకను అమలుపరచడం - హర్షించం. ఉదాహరణకు 'వస్తున్నాడు' అనే క్రియారూపం 'వచ్చు చున్నాడు' అనేదానికన్నా నవ్యమైనది. మన ఆలోచనలు పాతవాసనలతో ఉంటే 'వస్తున్నా' డనే రూపాన్ని మాట్లాడేటప్పుడు రాసేటప్పుడుపయోగించం. మనమిప్పుడు ఇరవయ్యో శతాబ్దం తొమ్మిదో దశాబ్దంలో బతికి ఉన్నా పదిహేనవ శతాబ్దినాటి 'వచ్చుచున్నాడు' అనే రూపాన్నే వాడేమనుకోండి మనలో భావనవ్యతలేనట్లే. మన పదప్రయోగంలో రూపనవ్యతలేనట్లే. మచ్చుకు "జెట్‌విమానంబెగురుచున్నది" అనే వాక్యం తీసుకుందాం. దాంట్లోని 'జెట్' అనే శబ్ద ప్రయోగం భాషా రూపంలోని ప్రాచీనతను తొలగిస్తున్నది. ఫలితంగా పాతకొత్తల వాడుకలయికకు సాధించిన వాళ్ళమేగాని మే[illegible]క సాధించినవాళ్ళం కాలేకపోతున్నాం. భాషలోని పాతమాటలకు కొత్తరూపాలతోబాటు కొత్త అర్థాలుకూడా వస్తాయి. మచ్చుకు శ్రీకృష్ణదేవరాయల కాలంలో 'కంపు' అనే మాటకు 'సువాసన' అనే అర్థం ఉండేది. ఆయన అంతఃపురంలో 'వట్యారంపు కంపులు' వస్తుండేవి. ఇప్పుడు కూడా 'కంపు' శబ్దం రూపంలో మార్పులేదు. కానీ అర్థంలో వచ్చింది. అంటే రూపనవ్యతతోబాటు అర్థనవ్యతకూడా వచ్చిందన్నమాట. ప్రధానమైనదీ ప్రాథమికమైనదీ భావనవ్యత. దానివల్ల విషయనవ్యతను సాధించగలం. ఈ రెండింటితోనూ నవ్యతకూడా జతపడితే భాష నవ్యతర మవుతుంది. భాషలో నవ్యతలను ప్రయత్న పూర్వంగా సాధించటాన్ని నవీకరణ అంటాం.

తెలుగు సాహిత్యాన్ని గురించి కొంత తెలుసుకున్నారు. పురాణాలు, ప్రబంధాలు, ఖండ కావ్యాలు, నాటకాలు, గేయాలు, వచన పద్యాలు వగైరా ఎన్నో ప్రక్రియలను గురించి పూర్వపాఠాల్లో చదివారు. సాహిత్యం అంటే మనసుకు హత్తుకొనేటట్టు విషయాలనువర్ణించటమొక్కటేకాదు, బుద్ధి వికాసానికి తోడ్పడే, నాగరికతాభి వృద్ధిని సాధించే, శాస్త్రవిషయాలను వివరించే గ్రంథాలను కూడా సాహిత్యమనే పిలుస్తాం. వాటిని స్పష్టతకోసం శాస్త్రసాహిత్య మని పిలుద్దాం. శాస్త్రాల్లో కూడా పాతకొత్తలున్నాయి. జ్యోతిష్యం, రసవాదం, అశ్వశాస్త్రం, రత్నపరీక్ష, న్యాయం, తర్కం, తత్వంవంటి పూర్వశాస్త్రాలనేకమున్నాయి. ఆ శాస్త్రాలను బోధించే గ్రంథాలూ ఉన్నాయి. ఆ శాస్త్రాల్లోనూ కాలక్రమాన చాలా మార్పులు వచ్చాయి. వాటిలో కొన్నిటి రూపురేఖలే తలకిందులుగా మారిపోయాయి. మచ్చుకు రసవాదం (Alchemy) అనే శాస్త్రమే ఇప్పుడు అంతరించిపోయింది. కాలక్రమాన అది రసాయన శాస్త్రంగా (Chemistry) మారిపోయింది. ఇప్పటి శాస్త్రంలో పాతశాస్త్రంలోని భావనలు (Concepts) పూర్తిగా మారిపోయాయి. అందువల్లనేటి రసాయన శాస్త్ర గ్రంథంలో పాతమాటలు వాడటం ప్రమాదకరం. కారణాలు రెండు : 1. ఆ పాత మాటలకు ఇప్పటి అర్థంలేదు. 2. ఇప్పటి అర్థాన్ని సూచించే శక్తి ఆ పాత మాటకులేదు. కొత్త శాస్త్రాలను వివరించటానికి కొత్త మాటలయినా సృష్టించుకోవాలి లేదా పాత మాటలకు కొత్త అర్థాలనయినా కల్పించాలి. మూడో మార్గం మరోటి వుంది. అది కొత్త భావనలను ఏ భాష నుంచి సంపాదించామో దానిలోని మాటను గూడా భావనతోబాటు ఎరువు తెచ్చుకోవటం, పద్ధతు లేవయినా కొత్తదనం కోసం కొంత శ్రమించక తప్పదు.

BRAOU

తెలుగుభాష, సాహిత్యం, సంస్కృతి మారిపోయినట్లే సమాజంకూడా మారిపోయింది. ఇక్ష్వాకులనాటి రాచరికం, భూస్వామ్య వ్యవస్థా ఇప్పుడులేదు. ప్రజాస్వామ్యం అమల్లోకి వచ్చింది. మన పూర్వులు-మధ్య యుగాలనాటి వాళ్లు కనీవినీ ఊహించనీ ఎన్నికల పద్ధతి వచ్చింది. తెలుగు రాజులపాలన పద్ధతులు ముస్లిం నవాబుల కాలంలో కొంత, బ్రిటిష్ సామ్రాజ్యవాదుల హయాంలో మరికొంత మారిపోయాయి. ఆధునిక ప్రభుత్వంలో ఉన్నన్ని శాఖలు, ఉద్యోగాలు, పరిపాలనా పద్ధతులు, శాసనాలు మొదలైనవి అభూతపూర్వం. ఇంత విస్తృతమైన పరిపాలనాయంత్రాంగంగాని, పనితీరుల్లో ఉన్న చిక్కులు మెలికలు పూర్వమెప్పుడూ లేవు. ఇప్పటి న్యాయ పరిపాలన పద్ధతి, కోర్టులు, అవి పనిచేసే విధానాలు మొదలైనవి పూర్వంలేనే లేవు, ఇప్పుడున్న సినిమాలు, టి.వీ.లు, వీడియోలు, విభిన్న పరిశ్రమలు, యంత్రాలు. రవాణా సౌకర్యాలు, వార్తాప్రసార సాధనాలు, వ్యాపార పద్ధతులు, వార్త పత్రికలు' గ్రంథ వైవిధ్యం శాస్త్రవైవిధ్యం ఇంతకుముందెన్నడూ లేవు. చారిత్రక రాజకీయ కారణాలవల్ల ఆధునిక ప్రపంచంలో లిఖిత వ్యవహారంలో, వాగ్ వ్యవహారంలో ఇంగ్లీషుభాష విస్తరించింది. అవే కారణాలవల్లి దాని స్థానంలో తెలుగు ఉపయోగంలోకి రావలసివుంది. ప్రజా పరిపాలన ప్రజలకు తెలిసిన భాషలోనే నిర్వహించాలనేది ప్రజాస్వామ్య మూలసూత్రం. తెలుగువాళ్లు స్వతంత్ర భారతంలో కూడా పోరాడి సొంత రాష్ట్రం సంపాదించుకున్నారు. 1966లో ఈ రాష్ట్రపరిపాలనలో తెలుగును ఉపయోగించాలని నిశ్చయించారు. తెలుగును 'అధికారభాష'గా గుర్తించారు. కేవలం ప్రకటనవల్ల తెలుగుకు స్థాయి పెరగదు. ఆధునిక పరిపాలనా యంత్రాంగం నిర్వహించే సమస్త వ్యవహారాల్లోనూ తెలుగువాడుక చేయవలసి ఉంటుంది, న్యాయస్థానాల్లో తెలుగుభాషను వాడవలసివుంది. వాణిజ్యవ్యాపారాల్లో, సాంఘిక సంబంధాల్లో, వార్తా ప్రసారాల్లో తెలుగు వాడుకను పెంచవలసి ఉంటుంది. పారిశ్రామిక రంగంలో తెలుగు వాడుకను విస్తరించవలసి ఉంటుంది. 1968లో తెలుగును విశ్వవిద్యాలయ స్థాయిలో 'బోధనభాష'గా నిర్ణయించారు. స్థాయినిబట్టి ఆధునికమైన సమస్త శాస్త్రాల్లోనూ పాఠ్యగ్రంథాల నుంచి పరిశోధన గ్రంథాలదాకా మహత్తర సువిస్తృత సాహిత్యాన్ని సృష్టించవలసి ఉంటుంది. ఈ కార్యక్రమం అనుకున్నంత సులభమూకాదు, సులభ సాధ్యమూకాదు.

## 15.4 వాస్తవిక సమస్యలు

ఆంధ్రప్రదేశ్‌లో తెలుగువారి సంఖ్య ఎంత ఎక్కువయినా ఇతర భాషలవారుకూడా ఉన్నారు. తెలంగాణా ప్రాంతంలో శతాబ్దాల పాటు ముస్లిం పరిపాలన సాగింది. కోస్తా రాయలసీమల్లో బ్రిటిష్‌వారి పాలన అలాగే సాగింది. అవిభక్త మద్రాసు రాష్ట్రంలో బహుకాలమున్నందువల్ల తమిళం వంటి ఇతర భాషలు సరిహద్దుల్లో వాడుకలో ఉన్నందువల్ల పరిశ్రమ వాణిజ్యరంగాల్లో ఇతర భాషలవాళ్ల ప్రాబల్యం ఎక్కువగా ఉన్నందువల్ల, ఉద్యోగరంగంలో కేంద్ర ప్రభుత్వ శాఖలూ' అన్య రాష్ట్రాలవాళ్లు విస్తరించినందువల్ల, రానురాను మహానగరాలు బహుభాషా నిలయాలవుతున్నందువల్ల తెలుగును అధికార భాషగా, వాణిజ్య భాషగా, శాస్త్రభాషగా అమలు చేయడంలో వాస్తవికమైన అడ్డంకులూ అభ్యంతరాలు ఉన్నాయి, వస్తున్నాయి. ఉపాధి కల్పనకుగాని, ఉన్నత విద్యాభ్యాసానికిగాని తోడ్పడే ఇంగ్లీషు ప్రపంచవ్యాప్తంగా వాడుకలో ఉంది. కాబట్టి ఆ భాషమీద సహజంగానే సమాజంలో వ్యామోహముంది. దానికితోడు హిందీ ప్రాబల్యం కోసం కేంద్ర ప్రభుత్వం చేసే రాజ్యాంగబద్ధ ప్రయత్నాలనేకమున్నాయి. శాస్త్ర సాంకేతిక రంగాల్లోకాని, పరిశ్రమ వాణిజ్యరంగాల్లోగాని ఉన్నతస్థితిలో ఉన్న తెలుగువాళ్ళంతా నిన్నటిదాకా ఇంగ్లీషులో చదివి ఇంగ్లీషులో రాసి ఆ భాషకు అలవాటుపడ్డవాళ్లు. సిద్ధాన్నం అందుబాటులో ఉండగా స్వయంపాకానికి ప్రయత్నం చేసినట్లు అన్నీ అమర్చిపెట్టినట్లుగా ఇంగ్లీషును వదలిపెట్టి కష్టపడి తెలుగులో శాస్త్రసాహిత్యాన్ని సృష్టించడం ఎందుకనే వాళ్లున్నారు. నిజానికి తమిళదేశంలోలాగా తెలుగు రాష్ట్రంలో స్వభాషా సాహిత్య సంస్కృతుల మీద విపరీతమైన అభిమానం తక్కువే అని చెప్పాలి.

పైన పేర్కొన్న గడ్డు సమస్యలను పట్టించుకోకుండా కేవలం భాషాభిమాన దృష్టితోనే తెలుగును నవీకరించదలచినా కొన్ని గట్టి చిక్కులు తప్పవు. వాటిలో ప్రధానమైన కొన్నిటిని పరిశీలిద్దాం. ఆధునిక భావాలను ప్రకటించడానికి ఆధునిక రూపంలో భాషను వాడాలంటే ఇంకా అధికార ప్రాబల్యాల్లో ఉన్న సనాతన పండితుల వ్యతిరేకతను ఎదుర్కోక తప్పటంలేదు. తెలంగాణా, రాయలసీమ, కోస్తా, కళింగ ప్రాంతాలలో భిన్న మాండలికాలున్నాయి. ఒక చోట ఉర్దూ మిశ్రిత భాషను వాడుతుంటే మరోచోట ఇంగ్లీషుమయమైన భాషను వాడుతున్నారు. భిన్న ప్రాంతాలవారి పదజాలంలో క్రియారూపాల్లో వైవిధ్యముంది కాబట్టి పాత భాషా రూపాలనూ సంస్కృత బహుళమైన పదాల్నీ వాడాలంటారు వీరు. రాను రాను వీరి ప్రాబల్యం తగ్గిపోతున్నది. కాబట్టి ఈ గ్రాంథిక భాషావాదులను విమర్శించి ముందుకు పోదామంటే భాషేతర శాస్త్రాల్లో ఉన్నత విద్యా



BRAOU

వంతులవల్ల కొన్ని ఇబ్బందులు తప్పవు. శాస్త్ర విజ్ఞాన విషయంలో నవ్యాతి నవ్య భావాలున్న కొందరు భాషా విషయంలో ప్రాచీనతనే గౌరవిస్తున్నారు! వారిని కూడా పట్టించుకోకుండా ముందుకు సాగినప్పుడు వచ్చే ప్రధాన సమస్య పరిభాషా సమస్య. అది శ్రద్ధగా ఆలోచించి పరిష్కరించుకోవలసిన విషయం.

## 15.5 పరిభాషా సమస్య

ఒక ఆలోచనను, అభిప్రాయాన్ని, భావనను వివరించటానికి ఎన్నో మాటలువాడి, కొన్ని వాక్యాలు రాసి చెప్పవచ్చు. ఆ వాడిన మాటలన్నీ సులభమైనవి కావచ్చు. అయినా వివరించి చెప్పటానికి చాలా మాటలను తిప్పి తిప్పి చెప్పాల్సి ఉంటుంది. కనీసం భావనలోని ప్రధాన లక్షణాన్ని, ధర్మాన్ని గుణాన్ని ఒక్కమాటలో చెప్తే దాన్ని 'పరిభాష' అంటారు; 'సాంకేతిక పదం' అంటారు; 'పారిభాషికం' అంటాం. కొత్త భావనను విశదీకరించాలంటే కొత్త పరిభాషను కల్పించుకోవాలి. మానవమేధ ఎప్పుడూ ఆలోచిస్తూ ఎన్నో ఊహలు చేస్తుంది. వాటి సంఖ్య అనంతరం. ఇవి నిలకడగా ఉండవచ్చు; మారిపోనూ వచ్చు. ఒక్కోశాస్త్ర విషయాన్ని గురించి ఎన్నో ఆలోచనలు ఎందరికో రావచ్చు. భావనలు సమానమైనప్పుడు వాటిని వివరించే భాష కూడా, పదంకూడా - ఒక్కటిగా లేకపోతే శాస్త్రజ్ఞానం గందరగోళంలో పడుతుంది. భావనలెంత స్పష్టంగా ఉంటే పరిభాషకూడా అంత స్పష్టంగానూ ఉండాలి. లేదా అవ్యవస్థ వస్తుంది. వ్యవహార హాని కలుగుతుంది. తొలిసారి వచ్చిన భావనకు ఏదో పేరు పెట్టినట్లు ఓ పదాన్ని గుర్తుగా వాడామనుకోండి. అలా వాడుకలోకి వచ్చినమాట మన ఆలోచనలూ భావనలూ మరింత త్వరగా మారదు. ఉదాహరణకు, ఓ శాస్త్రజ్ఞుడు ఒక వాయువును కనిపెట్టి దానికి 'హైడ్రోజన్' అనే పేరు పెట్టాడు. అప్పట్లో అతని ఆలోచన ప్రకారం, అనుభవం, భాషా జ్ఞానం ప్రకారం ఆ ద్రవ్యం నీటిని (హైడ్రా) పుట్టిస్తుంది. (జాన్) ఆ పేరు పెట్టాడు. 'ఆక్సిజన్' అనే మరోటి తోడ్పడకుండా ఇదొక్కటే నీటిని పుట్టించదని మనకిప్పుడు తెలుసు. భావన మారినా పదం మారదనడానికి ఇదో నిదర్శనం 'హైడ్రాలిక్, హైడ్రోఫోబియ' వంటి అనేక పదాలలో 'హైడ్రో' అనే పదాంశం వినిపిస్తుంది. వస్తు తత్వం మారినంత త్వరగా పదం మారలేదు. ఇప్పటి పరిజ్ఞానం ప్రకారం ఈ ద్రవ్యానికి మరోపేరు పెట్టాలా? పాత పేరునే తెలుగులోకి అనువదించాలా? అనేదొక ప్రశ్న. అంటే ఇతరభాషల నుంచి కొత్త భావనలను స్వభాష వారికి తెలియజెప్పడంలో 'అనువాదం' చేయటమనేది ఒక పద్ధతన్నమాట. ఆ పద్ధతిని పాటించాలంటే కొంత శ్రమించాలి. ఇలా శ్రమించి పరిభాషను తెలుగులో కల్పించినా, తెలుగు విద్యార్థి ఇతర రాష్ట్రాలలో దేశాలలో ఉన్నత విద్యా సాధనకు వలస పోతే ఈ తెలుగుమాటలు ఉపయోగపడవు కాబట్టి ఇంగ్లీషు మాటలనే వాడితే సరిపోదా? అనే వారు మరో వర్గం. అంటే పరిభాషా కల్పనలో మరో పద్ధతిని సూచిస్తున్నారన్నమాట. ఇది ఆదానం. 'ఎరువు తెచ్చుకోవటం', మాతృభాషలో విద్యార్జన చేస్తున్న విద్యార్థికి పరాయి భాషలలోని మాటలు చెప్తే, ఆ భాషలోని ఆ భాషాపదాల వ్యుత్పత్తులతో మంచి పరిచయం లేనందువల్ల భావనలు స్పష్టంగా తెలియవు కదా? తెలుగు మాటల్లోనే పరిభాషను కల్పించలేకపోతే తెలుగులో శాస్త్రాలు చదివినందువల్ల అవగాహన తగ్గి బుద్ధి వికాసం తగ్గి మాతృభాషలో విద్యాభ్యాసం నిష్ప్రయోజనం కాదా? అని ప్రశ్నించే వారు మరి కొందరు. వీరిలెక్కన సంస్కృతం, ఇంగ్లీషు ఉర్దూ వంటి ఇతర భాషల పదాల బదులు అచ్చ తెలుగు మాటలే వాడవలసి ఉంటుంది. ఆ వాడుక తేట తెలుగులోకి 'అనువాదం' చేసి సాధించవచ్చు; తెలుగు ధాతువులను కొత్తతీరున గుదిగుచ్చి కొత్తమాటలనూ పరిభాషనూ కల్పించవచ్చు. ఈ విధానం "కల్పన పద సృష్టి" అనే మరో పద్ధతిని సూచిస్తుంది. మనమంతా మొదట భారతీయులం, తరువాతనే తెలుగువారమనే సిద్ధాంతం ప్రకారం, దేశం మొత్తానికి సాంస్కృతిక భాషగా ఉన్న సంస్కృతంలో పరిభాషను సృష్టిస్తే అది 'జాతీయ పరిభాష'గా ఉపయోగపడుతుందని కేంద్ర ప్రభుత్వం వారి అభిలాష. ఇది మరొకరకమైన అనువాద పద్ధతి.

పైన పేర్కొన్న 'అనువాద, ఆదాన, కల్పన' పద్ధతుల్లో ఏదో ఒక పద్ధతినిగాని, ఆ మూడిటినీ సమపాళ్ళలోనే రకరకాల కలయికల్లోనే అనుసరించిగాని పరిభాషను సిద్ధంచేయవచ్చు. అప్పుడో ప్రశ్న వస్తుంది, ప్రతి ఒక్క భావనకీ నిర్దిష్టంగా ఒకే పారిభాషిక పదాన్ని సృష్టించడం సాధ్యమా? అనేది. సజీవభాషలన్నింటిలోనూ అంతర్జాతీయ స్థాయి కెదిగి సువిస్తృత భాషగా పేరు మోసిన ఇంగ్లీషులోనే ఆ లక్షణపదాలు లేవు. ఇంగ్లీషులోని 26 అక్షరాలూ రకరకాలకలయికల్లో సాధ్యమైనన్ని కలయికల్లో (in all permitable combinations)సమకూడినా, మొత్తం మాటల సంఖ్య 13, 15 కోట్లు దాటవు; కోటానుకోట్ల భావనలకు విడివిడిగా మాటలను నియతంగా వాడాలంటే సిద్ధాంతరీత్యా సాధ్యంకాదు. సహజభాషలలో అనంత పదజాలం లేకపోయినా, ఒకే పదాన్ని భిన్న సందర్భాలలో కావ్యాల్లోని భిన్న స్థలాల్లో వాడి అనంత వాక్యాలను కల్పించటం సాధ్యమే. పాతమాటలకు కొత్త

BRAOU

అర్థాలను కల్పించి వాడవచ్చు. మాటలలోని భాగాలను – 'పదాంశా' లన్నీ ధాతువులనీ, 'ప్రత్యయా' లని పిలిచే భాగాలకు రకరకాలుగా కలిపి సాగదీసి కొత్త పదాలను సృష్టించవచ్చు. పదాలు సాధ్యంకాకపోతే సమాసాలను (compound words), ప్రబంధాలనూ (Phrases) కల్పించవచ్చు. ఆలోచనలు చేసే మెదడు భాషను వాడే పద్ధతులను ఆలోచించలేనిదికాదు! అందువల్ల ఏదో ఒక పద్ధతిలోనే, రెండు మూడు పద్ధతులకలయికతోనో పరిభాషను కల్పించగలం. అలా కల్పించటం మొదటి మెట్టు మాత్రమే. ఇందువల్ల కొత్త భావనలనూ వాటికి సంబంధించిన కొత్త మాటలనూ (అదేపరిభాష) వాడుకలోకి తేవటం భాషను నవీకరించే ప్రయత్నాల్లో మొదటి దశ మాత్రమే.

పరిభాష సిద్ధమైన తరువాత అనేకానేక శాస్త్రాల్లో సాహిత్యాన్ని సృష్టించాలి. అనేక విధాల్లో కల్పించిన పరిభాష భావనలకు పేరు వివరిస్తూ నిఘంటువులు నిర్మించాలి. అదోవిధం, ఆ పరిభాషను వాడుతూ శాస్త్రాల్లో పాఠ్య గ్రంథాలనూ, విమర్శ గ్రంథాలనూ, విజ్ఞాన స్వరూపాలనూ, పరిశోధన పత్రికలను – అలా రకరకాల పుస్తకాలను రచించి ప్రచురించాలి. ఈ సాహిత్యాన్ని విద్యాబోధనలో ఉపయోగించాలి. ఈ ఉపయోగంవల్లనే, వాడుకవల్లనే విజ్ఞానం ప్రసరిస్తుంది. దానితోబాటు భాష నవీకృతమవుతుంది. ఇలా నవ్య విజ్ఞానం సంపాదించిన వాళ్ల ఆలోచనా పరిధి పెరుగుతుంది. వాళ్ళు మరికొన్ని కొత్త భావనలను కల్పిస్తారు; మరికొంత పరిభాషను సృష్టిస్తారు; విజ్ఞానం మరికొంత విస్తరిస్తుంది; భాష మరింతగా నవ్యమౌతుంది. ఇది ప్రయత్న సాధ్యం కాబట్టి 'నవీకరణ' అవుతుంది. భాష తనంత తానే నూతనత్వం సంపాదిస్తుంది. కాలక్రమేణ అదే 'నవీకరణం'.

## 15.6 అనువాద, కల్పన, ఆదాన పద్ధతులు

పెద్దపెట్టున అనువాద పద్ధతిని చేపట్టినట్లయితే భాషలో ఇంతకుముందులేని అనేక లక్షణాలు వస్తాయి. సంస్కృత ప్రభావంవల్ల తెలుగు సాహిత్య మాండలికంలో వచ్చిన మార్పులు ప్రాచీనమైనవి మచ్చుకు – తెలుగులో సహజమైన వాక్యం 'ఆ వచ్చినవాడు పెద్దమనిషి' అనేది దాన్ని "ఎవడైతే వచ్చాడో వాడు పెద్దమనిషి" అంటే కృత్రిమంగా అనిపిస్తుంది. అయినా ఈ రకం యత్తదర్థక వాక్య రచన తెలుగులో కాలక్రమేణా స్థిరపడి పోయింది. దాని వ్యాప్తి తక్కువ కావచ్చుగాని వాడుక వాస్తవమే, అలాంటిదే మరో వాక్య రచనా పద్ధతి కర్మణి ప్రయోగం (passive construction). ఎల్లయ్య పుల్లయ్యను చంపాడనటానికి బదులు 'ఎల్లయ్యచేత పుల్లయ్య చంపబడ్డా'డనేది ఇటువంటి వాక్యరచనే. ఇది కూడా అసహజమైన అనువాద గ్రంథాల్లో, ముఖ్యంగా న్యాయశాస్త్ర పుస్తకాల్లో రచనలలో వ్యాప్తికి వచ్చింది. 'యొక్క' వాడుక భాషలోకి మధ్య యుగాలలో మొదలైనా, నేటికీ పురాణ ధోరణిలోనూ ఛాందసత్వానికి ప్రతీకగాను అసహజమైనదే కాకపోయినా భాషలో నిలిచిపోయింది. 'ఆ యొక్క గ్రామంలో, మన తెలుగువారి యొక్క ప్రయోజనాలు' మొదలైన ప్రయోగాలను వాడలేం. ఇంగ్లీషు, ఉర్దూల ప్రభావంవల్ల అనువాద ధోరణిలో వచ్చిన లక్షణాలు మరికొన్ని వచ్చాయి. 'పొగాకును మరియు చెరకును పండిస్తున్నా' రనే వాక్యంలోని 'మరియు' తెలుగుభాషకు సహజమైన ప్రయోగం కాదు. 'పొగాకునూ చెరుకునూ, పొగాకే కాక చెరుకును కూడా పొగాకు చెరుకులు రెంటినీ' వగైరాలతో పోలిస్తే ఏది సహజమో తెలుస్తుంది. అటువంటిదే 'ప్రతి పౌరుడూ తన హక్కులను లేక బాధ్యతలను మాత్రమే పరిగణించరా' దనే వాక్యం చూడండి. "హక్కులనో బాధ్యతలనో, హక్కులనుగాని బాధ్యతలనుగాని, హక్కులనయినా బాధ్యతలనయినా, హక్కులూ బాధ్యతల్లో ఏ ఒక్క దాన్నయినా' మక్కీమక్కిగా అనుకరించి 'ఆవు నాలుగు కాళ్ళు కలిగి ఉన్నది' అని రాసిన వాక్యంలో "ఆవుకు నాలుగు కాళ్ళు" అనే వాక్యాన్ని పోల్చండి. ఇటువంటి మార్పులనేకం అనువాద పద్ధతి వల్ల తెలుగుభాషలో వచ్చాయి – వస్తున్నాయి.

BRAOU

కల్పన పదసృష్టిని చేయటంలో కృత్రిమ రూపాలలో కృతక రూపాలలో వికృత రూపాలలో తయారు కావచ్చు. ఉదాహరణకు మోటారు వాహనాల చట్టంలోని రకరకాల వాహనాల కిచ్చిన కల్పిత నామధేయాలు పరిశీలించవచ్చు. vehicle = వాహనం; carriage = బండి; car = శకటం; cab = వాహిక;carier = వాహనం; trailer = అనువాహనం అనే పారిభాషికలను కల్పించారు. ఇవన్నీ బండ్లే; అన్నీ వాహనాలే. కారు, మోటారు (బండి) వంటి వాడుక మాటలను ఎందుకు స్వీకరించలేదో తెలియదు, అలాగే మరో సన్నిహిత సంబంధాలున్న పదాల గుంపును తీసుకుందాం. Announcement = చాటింపు; publication = ప్రకాశనం, advertisement = ప్రకటన; declaraton = ప్రఖ్యానం, broadcasting = ప్రసారం; promulgation = ప్రఖ్యాపనం, proclamation = అధి ప్రఖ్యానం; statement = కథనం; exhibition =ప్రదర్శన; ఈ జట్టులోని మాటల్లో ఎన్ని వాడుకలో ఉన్నవో, ఎన్ని కల్పితాలలో గుర్తించండి. ఈ కల్పనల బాగోగుల సంగతి అటుంచి కల్పనల వల్ల వాడుకలో ఉన్న

మాటలకు మరో అర్థ విశేషమూ, లేని మాటల సృష్టి పరిభాషా కల్పనలో కనిపిస్తాయనీ గుర్తించ వచ్చు. 'అధి ప్రఖ్యానం' వంటి మాట ఏనాటి సంస్కృతంలోనూ ఇటువంటి అర్థంలోగాని రూపంలోగాని పూర్వం లేదు. ఉపసర్గలనూ మాటలనూ జోడించి లేని రూపాలనూ అర్థాలనూ సృష్టించటం జరుగుతుందని గమనిస్తే చాలు.

ఇక ఆదానం సంగతి చూద్దాం. ఉర్దూలోని ధ్వనులన్నీ తెలుగు లిపిలో ఇమడవు. అందుకని గురికి బెత్తెడంగా దగ్గరి ఉచ్చారణలో ఉన్నట్లు రాయటం, మాట్లాడటం జరుగుతుంది. 'తనఖా', 'దరఖాస్తు', 'ఫిర్యాది' వంటి మాటల ఉచ్చారణను తెలుగులిపిలో సూచించలేం. కొన్ని మాటల విషయంలో ప్రాంతీయంగానూ మాండలికంగానూ అర్థ భేదాలు వస్తాయి. ఉదాహరణకు 'ముద్దాయి' అనే పర్షియన్ పదాన్ని తెలంగాణాలో 'వాది' అనే అర్థంలోనూ ఇతర ప్రాంతాలలో 'నిందితుడూ, నేరగాడు, నేరస్తుడు' అనే అర్థాలలోనూ వాడుతున్నాం. తేడా అంటే 'వంపు/వక్రమైన, వంగిన' అని అర్థం. కోస్తాలో ఆ మాటకు 'భేదం వ్యత్యాసం' అనే అర్థం వచ్చింది. న్యాయస్థానాలలో కూడా plaintiff, petitioner అనే రెండు మాటల్లో ఏది వాడటం సబబో తెలియదు. రెంటినీ వాడుతున్నారు. ఇంగ్లీషులోనే వీటిని యధాతథంగా తెలుగులిపిలో రాసినా పరిస్థితిలో మార్పురాదుకదా ః ఇంగ్లీషు పదాలను పెద్ద యెత్తున వాడుక చేయటంతో తెలుగు లిపినే సంస్కరించుకో వలసిన పరిస్థితి ఏర్పడుతున్నది. మచ్చుకు 'copy coffee' అనే రెండు మాటలూ వాడుకలో ఉన్నాయి;వాటిని 'కాపీ, కాఫీ' అని రాస్తున్నాం. నిజానికి ఫకారం ఇంగ్లీషులోని "f" ధ్వనీ రెండూ ఒకటికాదు; "ఫలం" లోని ఫకారం, 'ఫెయిల్' లోని ఫకారం రాతలోనేగాని కూతలో ఒకటి కాదు. ఇంగ్లీషు వాడుకవల్ల మన భాషలో నుంచి వ్యాప్తిలోకి వచ్చిన 'ae' ధ్వనీ అది. ఆ ధ్వనిని తెలుగు లిపిలో చూపలేక రసాయన శాస్త్రంలో కొందరు 'అమైనోఆమ్లా' లనీ, మరొకొందరు 'ఎమనో ఆమ్లా' లనీ రాస్తున్నారు. కొందరు "బ్యాంకు" అని రాస్తే మరికొందరు 'బాంకు' అని రాస్తున్నారు; ఇంకా కొందరు హిందీ పద్ధతిలో "బైంకు" అనికూడా రాస్తున్నారు. ఈ ధ్వని తెలంగాణా రాయలసీమ తెలుగు వాడుకలో లేదుగాని కోస్తాలో తెలుగులో కూడా వాడుకలో ఉంది. 'చెప్పాను, చెప్పేను', అని రెండు రకాలుగా కోస్తా రచయితలు రాస్తే పదంలోని పకారం తరవాతి ధ్వని 'ae' "ఆ" కాదు. 'ఏ' 'చెప్పేను' అని రాస్తే భవిష్యత్తులోననే అర్థం వస్తుందని ఇప్పుడు "ఆ" మాత్రమే రాస్తున్నారు. అంటే కొత్త భవిష్యత్తులోననే అర్థం వస్తుందని ఇప్పుడు ఆ విధంగా "ఆ" మాత్రమే రాస్తున్నారు. అంటే కొత్త ధ్వనులు తెలుగులో ఆదానం కారణంగా పుట్టుకొచ్చాయని అర్థం. వాటికి ప్రత్యేక లిపులు సృష్టించక తప్పని పరిస్థితి వచ్చింది. ఆదానంవల్ల వ్యాకరణార్థాలు కూడా మారిపోతున్నాయి. లింగభేదం మారిపోతున్నది. వచ్చాను 'నోట్లు, నోటు' అనే మాటల అర్థభేదం గమనించండి 'మాస్టార్ వచ్చాడు ః మా టీచర్ వచ్చింది' అనే వాక్యాలను పోల్చి చూడండి. ఇలాంటి మార్పులెన్నెన్నో ఆదానం వల్ల వస్తాయి.

ఎన్నిరకాల మార్పులు భాషలో వచ్చినా సమాజ ప్రయోజనాల దృష్ట్యా పరిభాషను సిద్ధంచేసుకోక తప్పదు. శాస్త్రరచనలు రాయక తప్పదు. కాలక్రమంలో నిత్యవ్యవహారంలో లేని మాటలూ వ్యవహార విరుద్ధ ప్రయోగాలూనిండిన 'శాస్త్రభాష' ఏర్పడుతుంది. ఆయా శాస్త్రాల్లో ప్రసంగించే, వాటిని నేర్చే, వాటిని చదివే వర్గానికి మాత్రమే ఆ పరిభాష, ఆ శాస్త్రభాషపరిమితమైపోతుంది. నిత్య వ్యవహార భాషా వ్యాకరణం అంటే వాక్య రచనా పద్ధతి మాత్రమే శాస్త్రభాషకు కూడా సంక్రమిస్తుంది. శాస్త్రవ్యవహారం పరిమిత ప్రయోజనం. పరిమితి వర్గ ప్రయోజనం మాత్రమే సాధించినా అది మొత్తం భాషలో భాగంగా తెలుగుభాషలో అంతర్గతమైన ఒక 'వర్గ మాండలికం' (Jargon, class dialect) గా స్థిరపడిపోతుంది. కావ్యాలలో వాడే భాషనూ శైలినీ నిత్య వ్యవహారంలో వాడనట్లే, వాడుకలో ఒక తీరుగా రాతలో మరో రీతిగా శాస్త్రప్రసంగాలలో మరోవిధంగా భాష బహుముఖాలుగా విస్తరిస్తుంది. ఈ వ్యవహార విస్తృతినే కాలక్రమంలో జరిగితే, నవీకరణమంటాం.

## 15.7 నవీకరణ ప్రయత్నాలు

తెలుగుభాషను నవీకరించే ప్రయత్నాలు వ్యక్తిగతంగా, సంస్థాపరంగా, ప్రభుత్వపరంగా జరుగుతున్నాయి. తెలుగుభాషలో నూతన శాస్త్రవిషయాలను వ్యాసరూపంలోగాని, పుస్తకరూపంలోగాని, ఉపన్యాసరూపంలోగాని అందించిన వ్యక్తులెందరో ఉన్నారు. అసలీ ప్రయత్నం కందుకూరి వీరేశలింగంగారితో మొదలై కొమర్రాజు లక్ష్మణరావు వంటి విజ్ఞుల సాయంతో కొంత వ్యాప్తమయింది. తెలుగులో విజ్ఞాన సర్వస్వాలు వెలయించిన వ్యక్తులున్నారు. తెలుగు భాషాసమితి వంటి సంస్థానాలున్నాయి. విశ్వవిద్యాలయాలు నిజానికి ఈ పని చేపట్టి ఉండవలసింది. 1926 నాటి ఆంధ్ర విశ్వకళాపరిషత్తు స్థాపన తెలుగులో విద్యాబోధనకూ ప్రచురణకూ



BRAOU

ఉద్దేశించింది. చట్టంలో చెప్పిందొకటి, జరిగిందొకటి. కాశీపట్నం కొండయ్యగారి "విశ్వరూపం" 'త్రికోణమితి' వంటి ఒకటి రెండు గ్రంథాలను మాత్రమే ఆ విశ్వవిద్యాలయం ప్రచురించింది. జనరంజక శాస్త్ర గ్రంథాలు (Popular Science Books) రాకపోలేదు. అవి వ్యక్తులు రచించి ప్రచురించినవే. గోటేటి జోగిరాజు పంతులుగారు వ్యవసాయ శాస్త్రంలో చేసిన కృషిని మరెవ్వరూ చేయలేదు. 'అన్నదాత' వంటి మరికొన్ని పత్రికలు మాత్రమే ప్రచురణరంగంలో నిలదొక్కుకున్నాయి. ప్రసాద భూపాలుడు, కాశీనాథుని నాగేశ్వరరావుగారి వంటి వ్యక్తులు ప్రచురించిన విజ్ఞాన సర్వస్వాలూ, దిగవల్లి వేంకటశివరావు, అయ్యదేవర కాళేశ్వర వ్యక్తులు ప్రచురించిన పారిభాషిక పదకోశాలు, వేమూరి విశ్వనాథశర్మ, రంగా చారియార్ వంటి వ్యక్తులు ప్రచురించిన శాస్త్రగ్రంథాలు వెలుగు చూశాయి. మొత్తము మీద తెలుగులో వెలువడ్డ శాస్త్రవిజ్ఞానం చాలా తక్కువ. చాలా ప్రాథమిక విషయాలకు సంబంధించింది మాత్రమే. తెలుగుభాషా సమితివారి విజ్ఞాన సర్వస్వం పదహారు సంపుటాల మహాగ్రంథమయినా ఇప్పటి వైజ్ఞానిక పత్రిక మూలపడవలసి వచ్చిందంటే తెలుగువారికున్న శాస్త్రాభిరుచి ఎంత తక్కువో తెలుస్తుంది నవీకరణ ప్రయత్నం కొందరు వ్యక్తులుగాని కొన్ని సంస్థలుగాని చేసినా ఫలితం సామాన్యంగానే ఉంటుంది. కారణం అనుక్షణ వర్ధమాన శాస్త్ర సాంకేతిక విజ్ఞానం అందించాలంటే అనేక సంస్థలూ ప్రభుత్వమూ శాయశక్తులా కృషి చేయవలసి ఉంటుంది. బహుముఖంగా చిత్తశుద్ధితో పనిచేయనిదే కార్యసాధన నెరవేరదు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తన వంతు చర్యగా తెలుగును బోధన మాధ్యంగా 1968లో ప్రకటించింది. అప్పట్లో అది ఇంటర్మీడియట్ స్థాయివరకే, విశ్వవిద్యాలయాల ప్రత్యక్ష పర్యవేక్షణలో ఉన్న తన స్థాయిని వేరు పరిచి అదే సంవత్సరం 'బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్' అనే సంస్థను స్థాపించింది. పాఠ్యగ్రంథాలనూ ఇతర గ్రంథాలనూ ప్రచురించే నిమిత్తం 'తెలుగు అకాడమి' అనే సంస్థను స్థాపించింది. ఈ సంస్థ స్థాపనకు, శాస్త్ర సాహిత్య నిర్మాణ ప్రచురణలకు కేంద్ర ప్రభుత్వం కోటి రూపాయల విరాళమిచ్చి మూలధనం సమకూర్చింది. 1971 నుంచి మొదటి డిగ్రీస్థాయిలో కూడా తెలుగును బోధనభాషగా ప్రభుత్వం, రాష్ట్ర విశ్వవిద్యాలయాలూ ఆమోదించాయి నిజానికి 1974 నుంచి స్నాతకోత్తర స్థాయిలో తెలుగు బోధన భాష కావలసి ఉండగా, ఆర్థిక సహాయలోపంవల్ల ఆమోదరాహిత్యం వల్ల అలా జరగలేదు. ఇప్పటికీ అయిదారు శాస్త్రాల్లో అదీన్నీ మానవీయ సామాజిక శాస్త్రాల్లో తెలుగును బోధన భాషగా చేయటానికి అందరూ అంగీకరించారు. కాని విజ్ఞాన శాస్త్రాల్లో ఏ నాటికి ఇలా చేయటం సాధ్యపడుతుందో తెలియదు. వ్యవసాయం, వైద్యం, న్యాయశాస్త్రం ఇతర వృత్తివిద్యల వంటి జనజీవనానికి దగ్గరగా ఉన్న శాస్త్రాల్లో తెలుగుబోధన మాధ్యమంకాలేదంటే విచారించవలసిన విషయమే. ఇప్పుడిప్పుడే శాస్త్ర సాంకేతిక విద్యలో స్నాతకోత్తర స్థాయి దాకా తెలుగులో పరిభాషను కల్పించే ప్రయత్నాలు మొదలైనాయి. న్యాయశాస్త్రంలో అలా చేయటానికి న్యాయశాస్త్ర సంబంధమైన చిక్కులే ఉండటం జాతి దురదృష్టం.

BRAOU

రాష్ట్ర ప్రభుత్వం తెలుగును పరిపాలన భాషగా అభివృద్ధి చేసే నిమిత్తం 'అధికార భాషా సంఘాన్ని నియమించింది. 1966నాటి ఆంధ్రప్రదేశ్ అధికారభాషా చట్టంప్రకారం శాసన సభాసంఘంగా ఉండవలసిన ఈ సంఘాన్ని కొందరు నిపుణులతో నియమించినందువల్ల ఈ సంఘానికి అధికారం మటుకులేదనే విమర్శ వచ్చింది. అయినా ఆయా ప్రభుత్వశాఖల్లో ఉత్తర ప్రత్యుత్తరాలను నిర్వహించటానికి కావలసిన పరిభాషనూ, నకళ్లు తీయటానికి కావలసిన తెలుగు ముద్రా లేఖినులనూ (Typewriters) సమకూర్చడానికి ఈ సంఘంవారు ఎంతో కృషి చేశారు. రాష్ట్రప్రభుత్వం న్యాయశాఖలో చట్టాలను అనువదించటానికొక ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేశారు. ఇంగ్లీషు భాషలో రాసి శాసన సభామోదం పొందిన చట్టాలను తెలుగు చేసినా అవి అధికారిక అనువాదాలు (Official translations) అని ప్రకటించడానికీ, తెలుగులో మొదటసారి ఆమోదం పొందినా వాటి అధికారిక ఇంగ్లీషు అనువాదాలను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు గుర్తించడానికీ, న్యాయస్థానాలు వాటిని ఆమోదించటానికి చట్టపరంగానే ఎన్నో అడ్డంకులున్నాయి. వేల సంఖ్యలో ఉన్న పాత చట్టాలకు అధికారిక పాఠాలను సమకూర్చటానికి ప్రస్తుతమున్న యంత్రాంగం చాలదు. న్యాయస్థానాల్లో తెలుగు జిల్లాకోర్టు స్థాయి వరకే పరిపాలన భాషగా ప్రకటించే అధికారం మాత్రమే రాష్ట్ర ప్రభుత్వానికి ఉంది. హైకోర్టు సుప్రీంకోర్టుల్లో ఇంగ్లీషు స్థానంలో హిందీని ప్రవేశపెట్టాలన్నా, తెలుగువంటి ఇతర భాషలను ప్రవేశ పెట్టాలన్నా భారత రాజ్యాంగాన్ని మరో సారి సవరించక తప్పదు.

సమాజం మొత్తంలో శాస్త్ర విజ్ఞానాభివృద్ధి సాధించాలంటే ప్రభుత్వమొక్కటే అన్నీ చేయలేదు. కేరళలోని శాస్త్రసాహిత్య పరిషత్తు లాంటి స్వచ్ఛంద సంస్థలు మన రాష్ట్రంలోనూ ఏర్పడాలి. సమాజంలో విజ్ఞాన తృష్ణ పెరగాలి. అంటే మొట్టమొదట నిరక్షరాస్యత నిర్మూలంకావాలి. ఆతరవాత శాస్త్రప్రయోజనాలను వివరించే సాహిత్యం సిద్ధంకావాలి. ఆ సాహిత్యాన్ని ప్రజల దగ్గరకు తీసుకపోవాలంటే రేడియో, టీవీ, సినిమాలవంటి ప్రచార సాధనాలతోబాటు పత్రికలుకూడా విరివిగా ప్రచారం చేయాలి. ఆధునిక మానవజీవితంలోని ప్రతి సందర్భంలోను తెలుగును వాడటం అలవాటు కావాలి. అప్పుడుకాని ప్రజల్లోని సృజనాత్మకతవల్ల తెలుగు శాస్త్రభాషగా నవీకృతంకాదు. భిన్న వృత్తుల్లో నేటి పరిశ్రమల్లోని విభిన్న శాఖల్లో పనిచేస్తున్న తెలుగువారు తమ మాతృభాష మీద మమకారం పెంచుకొని స్వభాషలోనే సమస్త వ్యవహారాలూ నిర్వహించాలని సంకల్పించినప్పుడు తెలుగును నవీకరించటం పూర్తిగా సాధ్యమవుతుంది. ఒక భాష దాన్ని వ్యవహరించే ప్రజలకన్నా తక్కువ స్థాయిలో ఉండదు. ఎక్కువ స్థాయిలోనూ ఉండదు. జాతిలో వచ్చిన అభివృద్ధిని, పారిశ్రామిక ప్రగతిని, నాగరికతా ఆశయాన్ని ఆజాతి మాతృభాష ప్రతిఫలిస్తుంది. తెలుగు శాస్త్రభాషగా అభివృద్ధికాలేదంటే శాస్త్రరంగంలో తెలుగువాళ్ళు అభివృద్ధి సాధించలేదనే అర్థం. సమాజంలో కొన్ని సంస్థలూ కొందరు వ్యక్తులూ అభివృద్ధికాముకులైన మొత్తం సమాజం ప్రగతిశీలమయిందని వ్యాఖ్యానించలేం. అచిర భవిష్యత్తులో తెలుగు శాస్త్రభాషగా నవీకృతం కావాలని ఆశిద్దాం.

### అవగాహన ప్రశ్న

తెలుగులో నవీకరణ ప్రయత్నాలను 30 పంక్తుల్లో వివరించండి.

---

---

---

---

---

---

---

---

## 15.8 సారాంశం

ఈ భాగంలో మీరు గ్రహించిన ప్రధానాంశాలు :

- చరిత్రగతమైన పరిణామాలను దృష్టిలో ఉంచుకొని సామాజికావసరాలు ప్రయోజనాల దృష్టిలో ప్రయత్నపూర్వకంగా తొందరగా భాషను ప్రభుత్వాలు ప్రణాళికాబద్ధంగా ఆధునికం చేయటమే నవీకరణ.
- కొత్త భావనలను వివరించటానికి కొత్త మాటలను కల్పించుకోవలసిన అవసరం ప్రతి భాషలోనూ ఏర్పడుతుంది. లేదా పాతమాటలకు కొత్త అర్థాలను కల్పించుకోవాలి.
- తెలుగు వాడుక రంగాలను విస్తృతం చేయాలి.
- అనువాద, ఆదాన, కల్పన పద్ధతులలో ఏదో ఒక దాన్నిగానీ, ఆ మూడిటినీ సమపాళ్ళల్లోగాని, రకరకాల కలయికల్లో అనుసరించిగానీ పరిభాషా సమస్యలను పరిష్కరించుకోవాలి.



BRAOU

## అవగాహన ప్రశ్నకు జవాబు

తెలుగుభాషను నవీకరించే ప్రయత్నాలు వ్యక్తిగతంగా, సంస్థాగతంగా ప్రభుత్వపరంగా విరివిగా జరుగుతున్నాయి. ఈ ప్రయత్నం వీరేశలింగంగారితో ప్రారంభించి, విజ్ఞాన సర్వస్వాలరచనలో వికసించింది. తెలుగు భాషాసమితి, తెలుగు అకాడమి వంటి సంస్థలూ, ప్రభుత్వ పరంగా అధికారభాషా సంఘంవంటి సంస్థలూ నవీకరణ కోసం తమ వంతు కృషిచేస్తున్నాయి. పత్రికలూ, రేడియో, టెలివిజన్ వంటి ప్రజాసంస్థలు దోహదం కల్పిస్తున్నాయి. బోధనమాధ్యమంగా ప్రభుత్వం తెలుగును నిర్దేశించడం మంచి ప్రయోజనకారిగా పరిణమించింది. ఇప్పుడిప్పుడే శాస్త్రసాంకేతిక విద్యలో మానవీయ సామాజిక శాస్త్రాల్లో స్నాతకోత్తరస్థాయి వరకూ తెలుగును బోధనా మాధ్యమం చెయ్యడానికి వీలైన పరిభాషను సృష్టించడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. పారిభాషిక పదకోశాలూ, వృత్తి పదకోశాలూ, వ్యావహారిక భాషా వ్యాకరణాలూ, కొత్తగా వచ్చే నిఘంటువులూ, శాస్త్రగ్రంథాలూ వంటివి ఈ పనిలో ఎంతో తోడ్పడుతున్నాయి. అధికారభాషా సంఘం న్యాయశాస్త్రానికి సంబంధించిన చట్టాలను తెలుగులోకి అనువాదం చెయ్యటానికి ఒక ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేసింది. ఏ భాషనైనా పూర్తి నవీకరణ సాధించాలంటే, నేటి శాస్త్ర విజ్ఞాన సాంకేతికాభివృద్ధి నేపథ్యంలో - శాస్త్ర భాషగా రూపొందినప్పుడే అది సాధ్యమౌతుంది. దానికి మొదటి మెట్టుగా ప్రజలలో అక్షరాస్యతా, మాతృభాషపట్ల అభిమానమూ పెరగాలి. ఇందుకోసం ప్రభుత్వం నిర్వహించే అక్షరాస్యతా కార్యక్రమాలు కొంతవరకు తోడ్పడతాయి. ఏది ఏమైనా, కేవలం సంస్థలూ, ప్రభుత్వపరంగానే కాక, కేరళలో ఉన్న శాస్త్ర సాహిత్య పరిషత్తు లాంటివి మన ప్రజలుకూడా వినిర్మించుకుని, శాస్త్రభాషగా తెలుగును తీర్చుకున్నప్పుడే తెలుగుకు పూర్తి నవీకరణమౌతుంది.

### చదవదగిన పుస్తకాలు

| | |
|---|---|
| తెలుగు భాషా చరిత్ర : | భద్రిరాజు కృష్ణమూర్తి (సం) |
| తెలుగు అకాడమీ : | ప్రయోజనాత్మకమైన తెలుగు (సదస్సు నివేదిక) |
| ప్రపంచ తెలుగు మహాసభల | |
| ప్రత్యేక సంచిక : | తెలుగువాణి 1975 |
| రెండవ ప్రపంచ తెలుగు మహాసభలు: | ప్రత్యేక సంచిక, 1981. |
| డైరక్టరు, సమాచార పౌరసంబంధ శాఖ: | తెలుగు సంస్కృతి, తరంగాలు, హైదరాబాద్. |

BRAOU

### మాదిరి పరీక్షా ప్రశ్నలు

I. కింది వాటికి 30 పంక్తుల్లో సమాధానం రాయండి.

1. భాషను నవీకరించే పద్ధతులను విపులీకరించండి.
2. తెలుగు భాషను నవీకరించటానికి జరుగుతున్న కృషిని వివరించండి.

II. కింది వాటికి 10 పంక్తుల్లో సమాధానం రాయండి.

1. పరిభాషను సృష్టించే పద్ధతులను చర్చించండి.
2. నవ్యతా భేదాలను వివరించండి.

# ఖండం 4 తెలుగు సాహిత్య చరిత్ర

సాహిత్యం అనే మాటను మనం సర్వసాధారణంగా లిపి బద్ధమై గ్రంథ రూపంలో ఉన్న సాహిత్యానికి, మారుగా వాడుతుంటాము. కానీ అదొక్కటే సాహిత్యంకాదనీ లిపి బద్ధం కాని మరొక రకమైన సాహిత్యం నిరక్షరాస్యులైన ప్రజల మధ్య ఉందనీ, అదే మౌఖిక సాహిత్యం అనీ మనం నేడు గుర్తిస్తున్నాం.

సమాజంలోని రెండు రకాల సాహిత్యాల్లో మౌఖిక సాహిత్య చరిత్ర రచన సులభసాధ్యం కాని పని. అందువల్ల సాహిత్యకారులు గ్రంథరూప సాహిత్య చరిత్రను రచిస్తూ ఉంటారు. ఈ ఖండంలోని తెలుగు సాహిత్య రచనలో మౌఖిక సాహిత్య దశను మీకు పరిచయం చేసి, ఆ తర్వాత లిఖిత సాహిత దశలను వివరించాము.

తెలుగు సాహిత్య పూర్వ దశ దాదాపు 800 ఏండ్లు సాగింది. (క్రీ.పూ. 200–క్రీ.శ. 600). అప్పటి నుండి నేటి వరకు జరిగిన సాహిత్య పరిణామాలను మరి నాలుగు దశల్లో పరిచయం చేశాము. అవి : పూర్వదశ II (క్రీ. 600–1000), మధ్యకాలీన దశ I (క్రీ.శ. 1000–1600), మధ్యకాలీన దశ II (క్రీ.శ. 1600–1800), ఆధునిక దశ (క్రీ.శ. 1800 నుండి నేటి దాకా). ఈ అయిదు దశలను వరుసగా 16, 17, 28, 19, 20 భాగాల్లో విశదీకరించాము.

వివిధ దశల్లో తెలుగు సాహిత్యంలో సంభవించిన ప్రధాన పరిణామాలు ఇవి :

1. పూర్వ దశ ప్రథమభాగం (I)లో తెలుగు జన వ్యవహారంలో ఉంది అనటానికి సాక్ష్యాలు : 1. ఈ దశలో లభిస్తున్న సంస్కృత ప్రాకృత శాసనాల్లోని తెలుగు మాటలు, 2. గాథా సప్తశతిలోని తెలుగు మాటలు, పాటలు, ఛందస్సు, 3. జనవ్యవహారంలోని పదగేయరూప కవిత్వం. విద్వద్భాష సంస్కృతం, రాజభాష ప్రాకృతం, దేశ భాష తెలుగు–ఈ పరిస్థితుల్లో విద్యావంతులు సంస్కృత ప్రాకృతాలనే గ్రంథ రచనాదులకు వినియోగించి ఉంటారు. పైగా హిందు, బౌద్ధ, జైన మతాల ప్రాబల్యం సాంస్కృతిక రంగంలో ఉండటం వల్ల వాటి ఆటుపోట్లు సాహిత్యం మీద పడి ఉంటాయి.
2. పూర్వదశ ద్వితీయ భాగం (I) లో అప్పటి రాజులు వేయించిన తెలుగు శాసనాలలో ఒకవైపు వాడుకభాష, మరొక వైపు పద్యరచనకనువైన విద్యావంతుల కావ్య భాష రూపొందుతున్నాయని మనం గ్రహించవచ్చు. తర్వాత దశలో నన్నయ భారత రచనకు అనువైన సామాజిక భాషా రంగాలు సిద్ధమయ్యాయి.
3. మధ్యకాలీన ప్రథమభాగం (I) లో సంస్కృత రచనా సంప్రదాయంలోని మార్గకవిత్వం, దేశి రచనా రీతిలోని దేశకవిత్వం రెండు వచ్చాయి. మార్గకవిత్వంలో ఇతిహాస ప్రబంధ సాహిత్యాలు ప్రాముఖ్యం వహించాయి. వేదాంత దృక్పథాన్నీ రసదృష్టినీ కవులు అనుసరించారు. దేశికవిత్వంలో జీవిత చరిత్రలు, శతకాలు, వచనాలు, పదసాహిత్యమూ, ప్రాముఖ్యం వహించాయి. మత దృష్టినీ, వర్ణ వ్యతిరేక సంస్కరణ దృష్టినీ కవులు అనుసరించారు. ఒకవైపు భక్తి కవిత్వమూ, మరొక వైపు విరసన కవిత్వమూ వచ్చాయి. రాయవాచకం వంటి వచన రచనలు మొదలయ్యాయి. కవిత్వంలో అన్యదేశ్య పద జాలానికి ప్రవేశం లభించింది. ముస్లిం పరిపాలన, సంస్కృతుల ప్రభావం పడటం ఒక కారణం.
4. మధ్యకాలీన దశ ద్వితీయ భాగం (II) లో పాత ప్రక్రియలు క్షీణించాయి. కొత్త ప్రక్రియలు మొదలయ్యాయి. యక్షగానాలు, ద్విపదలు, వచన రచనలు, కీర్తనలు, తత్త్వాలు వచ్చాయి. తిట్టు కవిత్వం, విరసన కవిత్వం నాటి సామాజిక స్థితిగతుల పట్ల వ్యతిరేక రూపంలో రాగా, మితిమీరిన శృంగారం ప్రబంధాల రూపంలో వచ్చింది. తెలుగు జాతి, సాహిత్యం మార్పులకు సిద్ధమవుతున్న కాలం ఇది. సాహిత్యంలో పర్షు అరబిక్ పదాలతో పాటు, ఫ్రెంచి, పోర్చుగీసు, డచ్ పదాలు కూడా ప్రవేశించాయి.
5. ఆధునిక దశ తెలుగు సాహిత్య పరిణామంలో అతికీలకమైంది. వలస పాలన మూలంగా ప్రాంతీయ, జాతీయ అంతర్జాతీయ సామాజిక రాజకీయ సాంస్కృతికి ఉద్యమాల ప్రభావ కారణంగా, దేశంలో వచ్చిన ఇతర పరిణామాలు కారణంగా వివిధ నూతన ప్రక్రియల ఆవిర్భావం జరిగింది. నవల, కథానిక, నాటకం, నాటిక, పత్రికా రచన తెలుగు సాహిత్యంలో చోటు చేసుకున్నాయి. కవిత్వంలో ఖండకావ్య అవతరించింది. సంస్కరణ, భావ, అభ్యుదయ, దిగంబర విప్లవ కవిత్వ ధోరణులు తల ఎత్తాయి. సమాజ సంబంధమైన భావాలకు సాహిత్యంలో ఎన్నడూ లేనంత స్థానం లభించింది.

ఈ నేపథ్యంలో ఇతర ఖండాలలో వివరించిన అంశాలను కూడా చదివి ఈ ఖండంలోని చరిత్రను లోతుగా అవగాహన చేసుకోటానికి ప్రయత్నించండి.

BRAOU

# భాగం–16 తెలుగు సాహిత్యం–పూర్వదశ I (క్రీ.పూ.200–క్రీ.శ.600)

## విషయ క్రమం


16.0 లక్ష్యాలు

16.1 పరిచయం

16.2 పదగేయ రూప కవిత్వం

  16.2.1 గాథాసప్తశతిలో పాటల ప్రసక్తి

  16.2.2 గాథా ఛందస్సు - కందపద్యం

16.3 పూర్వదశ I సాహిత్య స్థితి

అవగాహన ప్రశ్న

16.4 సారాంశం

  అవగాహన ప్రశ్నలకు జవాబులు

  చదవదగిన పుస్తకాలు

  మాదిరి పరీక్షా ప్రశ్నలు


## 16.0 లక్ష్యాలు

పూర్వ సాహిత్య దశ (క్రీ.పూ. 200–క్రీ.శ. 600) లోని తెలుగు సాహిత్య స్థితి గతులను గూర్చి ఈ భాగం చదివాక మీరు వివరించగలుగుతారు.

## 16.1 పరిచయం

BRAOU

క్రీ.శ. 11వ శతాబ్దికి పూర్వం నాటి తెలుగులోని గ్రంథాలు మనకు నేడు లభ్యం కావు. ఉన్నవని చెప్పడానికి ఆధారాలు కూడా లేవు. తెలుగు లిపిలో, తెలుగు పదాలతో లభించిన మొట్టమొదట శాసనం మనకు క్రీ.శ. 575 నాటిది లభించింది. అంతకు పూర్వం శాతవాహనుల కాలం (క్రీ.పూ. 230–క్రీ.శ. 225) నాటికే తెలుగు జనవ్యవహారంలో ఉండేదనీ, అందులో పాటలు వంటివి మాత్రమే వాఙ్మయంగా ప్రచారంలో ఉండేవనీ, అవి దేశవాళీ ఛందస్సులో ఉండి ఉంటాయనీ, ప్రాచీన ప్రాకృత, సంస్కృత శాసనాలను బట్టి, గాథా సప్తశతి అనే ప్రాకృత కావ్యం మూలంగా నిశ్చయంగా ఊహించవచ్చు.

ఆంధ్ర దేశాన్ని తొలుత శాతవాహనులు పాలించినారు. వారికాలం (క్రీ.పూ. 230–క్రీ.శ. 225) లో విద్యద్భాష సంస్కృతం. రాజభాష ప్రాకృతం. విద్యావంతులు, రాజులు మత కర్తలు, ఉద్యోగులు సంస్కృత ప్రాకృత భాషలనే ఆదరించేవారు. మత ప్రచారానికి, సారస్వత ప్రక్రియలకు, రాజకీయ వ్యవహారాలకు సంస్కృత ప్రాకృతాలనే వాడుతూ ఉండే వారు. శాతవాహనుల తర్వాత ఆంధ్రదేశాన్ని పాలించిన ఇక్ష్వాకులు (క్రీ.శ. 225–306) బృహత్పలాయనులు (క్రీ.శ. 270–288), ఆనంద గోత్రికులు (క్రీ.శ. 4వ శతాబ్ది) వేయించిన శాసనాలన్నీ ప్రాకృతంలోనే ఉన్నాయి. విష్ణుకుండినుల శాసనాలన్నీ సంస్కృతంలో ఉన్నాయి. శాలంకాయనుల (క్రీ.శ. 300–420), పల్లవుల (క్రీ.శ. 300–600) శాసనాలు కొన్ని ప్రాకృతంలోనూ మరికొన్ని సంస్కృతంలోనూ కన్పిస్తాయి. తెలుగుదేశాన్ని పాలించిన ఈ ప్రాచీనాంధ్ర రాజులు వేయించిన ప్రాకృత సంస్కృత దానశాసనాల్లో ఊర్ల పేర్లు మాత్రం తెలుగు భాషలోనే ఉన్నాయని మీరు ముందు భాగంలో గమనించారు. ఈనాడు మన దేశంలో వాడుకలో ఉన్న పేర్లు కూడా ఇంచుమించు ఇట్లాగే ఉన్నాయి. ఆనాటి ప్రాకృత, సంస్కృత శాసనాల్లోని తెలుగు పదాలను బట్టి తెలుగు భాష దేశమంతటా జనవ్యవహారంలో ఉండేదని సిద్ధాంతం చేయవచ్చు. ఈ విషయాన్ని గాథాసప్తశతిలోని తెలుగు మాటలు కూడా ధ్రువ పరుస్తున్నాయం (10)

## 16.2 పదగేయరూప కవిత్వం

క్రీ.పూ 200–క్రీ.శ. 600 నాడు తెలుగును వ్యవహరించే జన సామాన్యం ఎట్లాంటి రచనల్లో తమ హావ భావాల్ని వ్యక్తపరుస్తూ రసానుభూతిని పొందేదో ఊహించవలసి ఉంది. నేటి ప్రపంచం అనాగరికులని భావించే ప్రతి ఆటవిక జాతికి వాగ్రూపమైన భాష ఉంది. వారి భాషల్లో లిపి లేకపోయినా వారికి ఆనందోత్సాహాలను

కల్గజేసే గేయ రచన లున్నాయి. సవర, గదబ, గోండు, కోదు మొదలైన భాషల్లో కొన్ని పాటలు ఉన్నాయి. ఆ పాటలు ఆయా జాతి జనులు ఉత్సవాలలోనూ, వివాహాది కార్యాలలోనూ పాడుతూ ఉంటారు. ఈ భాష అయినా కవితా పరిణామంలో గేయమే ప్రథమ దశ అనీ ప్రాథమికమైన గేయంలోనే కవిత్వ బీజాలుంటాయనీ తలచడం వల్ల తెలుగులో కూడా ప్రాచీన కాలంలోనే గేయ కవిత సామాన్య జనుల నోళ్ళలో వెలిసి ఉంటుందని ఊహించవచ్చు.

ఆర్యులు రాక పూర్వ తెలుగు నేలపై నాగజాతి వాళ్ళు నివసించేవారని తెలుస్తున్నది. ప్రాచీన బౌద్ధ గాథలలో ఆంధ్రదేశాన్ని నాగభూమిగా వర్ణించినారు. కోదులు, గోండులు ప్రాచీన నాగుల కోవలోని వారనే చెప్పవచ్చు. గోండు, కోదు భాషలు మాట్లాడేవారికి ప్రాచీనాంధ్రులకు సంబంధాలున్నాయి. ప్రాచీన తెలుగు భాషలో గోండు, కోదు భాషలకు సంబంధముంది. కోదు భాషలో చాల ప్రాచీన కాలం నుంచి పాటలున్నాయి. తమ వేల్పుల కొలువులలో కోదులు "తంతు" అంతా పాటలతోనే జరిపిస్తారని కోదు భాషకు వ్యాకరణం రాసిన లింగం లక్ష్మాజీ పంతులుగారు రాసినారు. ఆదిమ సమాజాలలో పాటలు ముందు, ఆ తర్వాత వచన రచనలు పుట్టడం నైజం. మన తెలుగు భాషలో కూడా ప్రాచీన కాలంలో కోదు భాషలో లాగే పాటు తప్పకుండా ఉండి ఉంటాయి.

శాసన కవులవలె పండితులు కాక సామాన్య జనానికి ప్రీతికలిగించే పాండిత్య నిరపేక్షకాలైన పాటలు, పదాలు మొదలైనవి రచించినవారు కూడా నన్నయకు పూర్వం కొందరుండేవారని చెప్పడానికి ఆధారాలున్నాయి. నన్నయ (క్రీ.శ. 1053) మూల భారతంలో లేకున్నా, తన కాలంలో వ్యాప్తిలో ఉన్న "నాగ గీతముల" (ఆంధ్ర మహాభారతం - ఆదిపర్వం 8-131) అనే రాగయుక్త గేయాలను, అభినయంతో కూడిన "అలతు" లను పేర్కొన్నాడు. శివతత్త్వసారకర్త మల్లికార్జున పండితారాధ్యుడు (క్రీ.శ. 1160) "శంకర గీత భాస్వత్పదావళి, ఆనంద గీతంబు"లనే పదాలనే కాక ప్రాక్తన నూతన భావ్య గీతాలచే శివుని పొగడెనని పాల్కురికి సోమనాథుడు చెప్పినాడు. పాల్కురికి సోమనాథుడు (క్రీ.శ. 1160-1240) పండితారాధ్య చరిత్రలో పండితుని శిష్యులు తుమ్మెద పదాలు, శంకరపదాలు నివాళి పదాలు, ప్రభాత పదాలు, వాలేశు పదాలు, గొబ్బిపదాలు, వెన్నెల పదాలు, సంజవర్ణన, గణ వర్ణన పదాలు పాడుతూ వెలనాటి చోడుని సభకరిగినారని రాసి ఉన్నాడు. (పండితారాధ్య చరిత్ర, వాద ప్రకరణము పుట. 5[illegible]3) శంకర పదాలు శివుని గూర్చినవి. నివాళి పదాలు మంగళ హారతులు కావచ్చు. ప్రభాత పదాలు మేల్కొలుపు పాటలు కావచ్చు. శివ రాత్రి జాగరణ సమయంలో వేడుకలను వర్ణిస్తూ పాల్కురికి సోమనాథుడు దేశి[illegible]నికి చెందిన నాటక ప్రదర్శనలను, ఆటలను, పాటలను సూచించి ఉన్నాడు. ప్రాచీన శివభక్తుల చరిత్రను [illegible]న గీతాలనుబట్టి బసవపురాణాన్ని రచించి ఉన్నట్లు పాల్కురికి సోమనాథుడు చెప్పుకున్నాడు. పండితారాధ్య చరిత్ర మహిమ ప్రకరణ (పుట. 176)లో ఆనందగీతాలు, శంకర గీతాలను కూడా పేర్కొన్నాడు. పాల్కురికి సోమనాథుని నాటికి బహుళ ప్రచారంలో ఉన్న ఈ గీతాలు, పదాలు అతని కాలంలో పుట్టనవే కాక అంతకు చాలా పూర్వంనుంచీ జన వ్యవహారంలో ఉన్నవే అని, అవి అర్వాచీన కాలంలోని పదాలు గీతాల వంటివే అని ఊహించడంలో అసమంజసమేమీ లేదు. ఈ పదాలు అర్వాచీన కాలంలో చాలా వ్యాప్తి చెంది ఉన్నాయి.

### 16.2.1 గాథా సప్తశతిలో పాటల ప్రసక్తి

తెలుగులో శాతవాహనుల కాలం నుండి పాటలు ఉండేవి. హాలుని గాథాసప్తసతిలో సహజ దేశీయమైన ప్రసక్తి కొన్ని చోట్ల కన్పిస్తుంది.

"చక్కగా దంచిన సన్న బియ్యపు వెన్ను లాంటి వెన్నెల, తాను కోరుకున్న దాని కన్నా కొల్లగా పడిన పైరును పల్లె రైతు చూచి ఆనందంతో ఇచ్చవచ్చినట్లు పాడు కొన్నాడు" అని గాథా సప్తశతి ఏడవ వందలోని 89వ గాథలో ఉంది. ఆ రైతు పాడిన పాట అప్పటకప్పుడు కట్టుకొన్నదో అంతకు పూర్వం అతని తాలూకు వాళ్ళు అల్లుకున్నదో కావచ్చు. ఆ పాటలోని తెలుగు మాటలేమిటో?

ఏడవ వందలోని 42వ గాథలో ఇట్లా ఉంది : "పెళ్ళికూతురికి పెళ్ళి కడియాలు తొడిగించి పుణ్య స్త్రీలు మంగళ గీతాలు పాడుకున్నారు. ఆ పాటల్లో తనకు కాబోయే మగని పేరు. అతని వంశం తీరు వర్ణిస్తూ ఉంటే వింటున్న "పెళ్ళికూతురికి ఒళ్ళు పులకరించిందట" ఆ ముద్దరాలికి అంత పారవశ్యాన్ని కలిగించిన ఆ పాటలు ముత్తయిదువలు అప్పటికప్పుడు కట్టిపాడినవేమో? ఆ పాటల్లోని తెలుగు నుడికారమెట్లాంటిదో?



BRAOU

ఒక విరహిణి తనకు దూరమైన ప్రియుణ్ణి తలచుకొంటూ దుఃఖంతో పాడిన ఎడబాటు పాట ప్రసక్తి కూడా గాథాసప్తశతిలో మరొకచోట కన్పిస్తుంది. ఆ ఎడబాటు పాటల్లో కన్నీళ్ళు చిందిన తెలుగు జాలి మాట లేమిటో?

ఎంతో వైవిధ్యముండే ఇట్లాంటి పాటలు అన్నీ పాత తెలుగులో ఉండేవనుకోవచ్చు. విద్యావంతులు, రాజులు సంస్కృత ప్రాకృత భాషలను వాడినా స్త్రీలు సామాన్య ప్రజలు దేశ భాషయైన తెలుగు పాటలతోనే వినోదించి ఉంటారు. ఈ పాత పాటలను ఆదిలో ఎవ్వరూ జాగ్రత్త చేయలేదు. చేసి ఉంటే మనకు కూడా అతి ప్రాచీనమైన సాహిత్యముండేదని సగర్వంగా చెప్పుకొని ఉండేవాళ్ళం. తమిళంలో క్రీ.శ. 4వ శతాబ్దిలో ప్రాచీన గేయాలను సేకరించి, వాటిని సక్రమమైన సంకలన గ్రంథాలుగా వింగడించి అందుబాటులో ఉండే గ్రంథాలుగా రూపొందించాలని నాటి రాజులు గుర్తించినారు. "ఎట్టుత్తొగై, పత్తుప్పాట్టు" మొదలైన గేయ సంకలనాలు ఇట్లా వెలువడిన గ్రంథాలే. ఇది తెలుగుభూమి మీద జరిగిన సంకలనానికి అక్షరాల అనుసరణే. క్రీ.శ. 1వ శతాబ్దిలోనే హాలుడు ఆంధ్రదేశంలో ప్రాకృత గాథలను సేకరించినాడు. అప్పటి తెలుగు పాటలను ఎవరూ సంకలనం చేయ లేదు. సేకరించి ఉంటే తమిళ భాషలో లాగే తెలుగు కూడా శాతవాహనుల కాలం నుండి పాటలు దొరికి ఉండేవి.

### 16.2.2 గాథాచ్ఛందస్సు – కందపద్యం

శాతవాహనుల కాలం నాటి పాటలు, పదాలు లభిస్తే అవి ఎలాంటి ఛందస్సులో ఉంటాయో ఊహించడం కష్టమైనది కాదు. శాతవాహనుల కాలంలో 'గాథ' అనే ప్రాకృత ఛందస్సు విరివిగా ప్రచారంలో ఉండేది. హాలుడు సేకరించిన కవిత్వమంతా ఈ గాథా ఛందస్సులో ఉండబట్టే దానికి 'గాథా సప్తశతి' అనే పేరు పెట్టినారు. ఈ గాథా ఛందస్సు మాత్రా బద్ధమైంది. సంస్కృత ఛందస్సులాగా అక్షర బద్ధం కాదు. మాత్రా ఛందస్సులన్నీ గేయాలే. 'గాథా ఛందస్సు'లలో 'గాహూ' గాహ ఎగ్గావో, ఉగ్గావో, గాహిణీ, సింగిణీ, ఖండ ఆ అనే ఏడు రకాల భేదాలున్నాయి. ప్రతి గాథకు నాల్గు పాదాలుంటాయి. మొత్తం నాలుగు పాదాలకు కలిసి కనీసం 54 మాత్రలు ఉండాలి. ఏ గాథలోనూ 64 మాత్రలకు మించి ఉండకూడదు. ఈ గాథాభేదాలలో కొన్ని సామాన్య నియమాలు ఉన్నాయి :

1. మొదటి పాదంలో 12 మాత్రలు ఉండాలి.
2. ఆరవ గణం ఒక ప్రత్యేక నియమాన్ని అనుసరిస్తుంది.
3. రెండవ, నాల్గవ పాదాల అంత్యాక్షరాలు గురువులుగా ఉంటాయి.
4. బేసిని జగణ మండదు.

పై నియమాలు మన కంద పద్యానికి కూడా సహజంగా వర్తిస్తాయి. 64 మాత్రలున్న పరిపూర్ణ గాథనే ప్రాకృతంలో 'ఖండ ఆ' అని పిలుస్తారు. మన కంద పద్యంలో కూడా 64 మాత్రల పరిపూర్ణత ఉంది. తెలుగు కవిత్వానికి కందమే మూలకందమని చెప్పవచ్చు. ప్రాచీనాంధ్ర కావ్యాలలో కందానికి అపరిమిత ప్రయోజన ముంది. నన్నయ భారతంలో మొత్తానికి సగానికి సంగం (1219) కంద పద్యాలున్నాయి. నన్నె చోడుని కవిత్వం లోని సగానికి సగం అంటే (534) కంది పద్యాలు కనిపిస్తాయి. మల్లికార్జున పండితారాధ్యుని శివతత్త్వసారం కంద పద్యాలలో కూర్చబడింది. కేవలం కంద పద్య శతకాలెన్నో తెలుగులో ఉన్నాయి. తిక్కన భారతంలో కంద పద్యాలను ఎక్కువగా వాడినాడు కంద చెప్పినవాడే కవి అనే నానుడిని ఇట్టే కందం తెలుగు దేశ్యజాతి పద్యం అని చెప్పవచ్చు. సంస్కృతంలో దీన్ని 'ఆర్య' అంటారు. ప్రాకృతగాథా ఛందస్సుకు కందపద్యానికి సంబంధముండడం వల్ల కందపద్యం హాలునికాలంనుంచి నేటిదాకా తెలుగునాట ప్రచారంలో ఉందని చెప్పవచ్చు.

## 16.3 పూర్వదశ సాహిత్య స్థితి

పై పరిశీలనను బట్టి పూర్వదశ I లోని సాహిత్యస్థితిని గురించి మనం ఈ విధంగా ఊహించవచ్చు :

క్రీ.పూ. 200 నుండి క్రీ.శ. 600 వరకు ప్రాథమిక యుగం – తొలిదశ. ఈ దశలో ఆంధ్రదేశంలో ప్రచారంలో ఉన్న భాషలు సంస్కృత ప్రాకృతాలు. సంస్కృతంలో వైదిక వాఙ్మయ, శాస్త్రాలు, కళలు మొదలైన వెన్నో ఉన్నాయి. అగ్ని, వాయు, బ్రహ్మాండాది అష్టాదశపురాణాలు, రామాయణ భారతాలనే ఇతిహాసాలు, కాళిదాసు మొదలైన కవులు రాసిన కావ్యనాటకాలు ఆనాడు సంస్కృతం తెలిసినవారు చదువుకొనే ఉత్తమ గ్రంథాలు. రాజులు కూడా వాటినే ఆదరిస్తూ ఉండేవారు.



BRAOU

ఇవి కాక జాతక కథలు, త్రిపిటకములు అనే పేరుతో ఉన్న బుద్ధోపదేశాల సంగ్రహం, సుత్తములు అనే పేరుతో ఉన్న బౌద్ధ ధర్మాలను తెల్పే గ్రంథాలు, సేతు బంధం మొదలైన కావ్యాలు, కొన్ని నాటకాలు ఆనాటి పెద్దలకు పరిచితాలు. ఈ గ్రంథాలకు ఆధారమైన పాళీ భాషను నాటి బౌద్ధులంతా చదువుతుండేవారు. బౌద్ధుల మత ప్రమాణాలకు ఆధారంగా పాళీభాష. దాన్నే రాజులు బౌద్ధమతస్థులు ఆదరించేవారు.

జైనమతం కూడా ఆ కాలంలో ఆంధ్రదేశంలో కొంత ప్రచారంలో ఉండేది. వాళ్ళ వాఙ్మయమంతా అర్థమాగధి అనే ప్రాకృత భాషలోను, సంస్కృతంలోను ఉంది.

ఇట్లా ఆ మూడు వాఙ్మయాలు నాటి తెలుగుదేశంలో ప్రచారంలో ఉండేవి.

ఇక ఆనాడు తెలుగులో ఉత్తమ గ్రంథాలున్నాయని చెప్పడానికి సాక్ష్యాలు కన్పించవు. తెలుగు, జనసామాన్యం వాడే భాష. అందులో తుమ్మెద పదాలలాంటి పదాలు మాత్రమే వాఙ్మయంగా ప్రచారంలో ఉండేవని నిశ్చయంగా ఊహించవచ్చు.

## అవగాహన ప్రశ్న

పూర్వ దశ సాహిత్య స్థితిని గూర్చి 10 పంక్తుల్లో సమీక్షించండి.

________________________________________

________________________________________

________________________________________

________________________________________

________________________________________

________________________________________

## 16.4 సారాంశం

ఈ భాగంలో మీరు అవగాహన చేసుకొన్న ప్రధానాంశాలు :

- క్రీ.పూ. 200-క్రీ.శ. 600 మధ్య కాలంలో తెలుగు జనవ్యవహారంలో ఉండి ఉందనటానికి ప్రధాన ఆధారాలు : 1. ప్రాకృత సంస్కృత శాసనాల్లోని తెలుగు మాటలు, 2. గాథాసప్తశతిలోని తెలుగుమాటలు, పాటలు, ఛందస్సు, 3. లిఖిత సంప్రదాయానికి సంబంధించిన తదనంతర కవులు ప్రస్తావించిన పదగేయ రూపకవిత్వం.
- ఈ దశలో విద్యాభాష సంస్కృతం, రాజభాష ప్రాకృతం. దేశీయుల భాష తెలుగు. హిందూ బౌద్ధజైన మతాల ప్రచారానికీ, సాహిత్య అధ్యయానికీ సృజనకూ సంస్కృత ప్రాకృతాలనే విద్యావంతులు ప్రధానంగా వినియోగించుకున్నారు. తెలుగు వాడకం పరిపాలనలోనూ, గ్రంథరచనలోనూ ఇంకా వినియోగంలోకి వచ్చినట్లు సాక్ష్యాధారాలు మృగ్యం.

## అవగాహన ప్రశ్నకు జవాబు

క్రీ.పూ. 200 నుండి క్రీ.శ. 600 వరకు సాహిత్యంలో ప్రాథమికదశ. ఆ కాలంలో ఉన్న సాహిత్య భాషలు సంస్కృత ప్రాకృతాలు. వైదిక వాఙ్మయం, బ్రహ్మాండాది అష్టాదశ పురాణాలూ, రామాయణ భారతేతిహాసాలూ, సంస్కృత భాగవతం, కాళిదాసాది కవుల కావ్యనాటకాలూ ఆనాడు సంస్కృత భాషలో వెలసిన సాహిత్య సంపద. ప్రాకృతంలో పాళీ భాషలో బుద్ధోపదేశాలైన త్రిపిటకములు, జాతక కథలు, సేతుబంధం వంటి కొన్ని కావ్యాలూ, నాటకాలూ ప్రచారంలో ఉండేవి. జైన వాఙ్మయమంతా సంస్కృత ప్రాకృతాల్లో (అర్థమాగధి)ఉండేది. తెలుగులో తుమ్మెద పదాలు, వెన్నెల పదాల్లాంటి, జానపద వాఙ్మయం మౌఖిక సాహిత్య రూపంలో ఉండేది.



BRAOU

## చదవదగిన పుస్తకాలు

| | | |
|---|---|---|
| తెలుగు భాషా చరిత్ర | : | భద్రిరాజు కృష్ణమూర్తి (సం) |
| ఆంధ్రసాహిత్య చరిత్ర | : | పింగళి లక్ష్మికాంతం |
| ఆంధ్రవాఙ్మయ చరిత్ర | : | డా. దివాకర్ల వెంకటావధాని |
| ఆంధ్ర వాఙ్మయారంభదశ (1, 2 భాగాలు) | : | డా. దివాకర్ల వెంకటావధాని |

## మాదిరి పరీక్షా ప్రశ్నలు

I. కింది ప్రశ్నలకు 30 వాక్యాలకు మించకుండా సమాధానాలు రాయండి.

1. క్రీ.పూ. 200-క్రీ.శ, 600 మధ్య కాలంలో జనవ్యవహారంలో పాటలు, పదాలు ఉండేవనటానికి ఆధారాలు ఏవి?

2. తొలి దశలోని సాహిత్యస్థితిని గురించి ఊహించండి.

II. ఈ కిందివాటికి 10 వాక్యాలకు మించకుండా జవాబులు రాయండి.

1. గాథాసప్తశతిలోని పాటల ప్రసక్తి గురించి రాయండి.

2. ఆదిమ సమాజాల్లో పాటల ప్రాముఖ్యాన్ని తెల్పండి.

BRAOU

# భాగం–17 తెలుగుసాహిత్యం–పూర్వదశ II (క్రీ.శ. 600–1000)

## విషయ క్రమం


17.0 లక్ష్యాలు

17.1 పరిచయం

17.2 తెలుగు కవిత ఆరంభ స్థితి

17.2.1 శాసన కవిత్వం

17.2.2 పద గేయరూప కవిత్వం

17.2.3 కావ్యరూప కవిత్వం

అవగాహన ప్రశ్న

17.3 సారాంశం

అవగాహన ప్రశ్నలకు జవాబు

చదవదగిన పుస్తకాలు

మాదిరి పరీక్షా ప్రశ్నలు


## 17.0 లక్ష్యాలు

ఈ భాగం చదివాక మీరు పూర్వదశ II (క్రీ.శ. 600-1000) లోని తెలుగు సాహిత్య స్థితిగతులను వివరించగలుగుతారు. పూర్వదశ II (క్రీ.పూ. 200 క్రీ.శ. 600) లోని పూర్వదశ II (క్రీ.శ. 600-1000) లో ఏ రకంగా పరిణమించాయో కూడా వీరు విశ్లేషించగలుగుతారు. రెండు భాగాలలోని తేడాలను మీరు వింగడించ గలుగుతారు.

BRAOU

## 17.1 పరిచయం

ఇంతకు ముందు భాగంలో సంస్కృత ప్రాకృత శాసనాల ద్వారా, ప్రాకృత గ్రంథాల ద్వారా మాత్రమే తెలిసే తెలుగు మాటలను గురించి తెలుసుకున్నారు. పదగేయ రూప కవిత్వం (16.2.0) అప్పుడు ఉండి ఉందనటానికి సాక్ష్యాలను కూడా తెలుసుకున్నారు. తెలుగు భాష జనసామాన్యం వాడుకలో ఉండి ఉండేదని గ్రహించారు. ఈ భాగంలో తెలుగు భాషా స్వరూపాన్ని గురించి లభ్యమవుతున్న తెలుగు శాసనాలనుబట్టి మీరు తెలుసుకుంటారు.

## 17.2 తెలుగు కవిత ఆరంభ స్థితి

క్రీ.శ. 575 నుండి పూర్తిగా తెలుగులోనే ప్రకటింపబడిన శాసనాలు మనకు లభిస్తున్నాయని 14 వ భాగంలో తెలుసుకున్నారు. తెలుగుకవిత మొదట చాళుక్యుల ప్రేరణ ప్రోత్సాహాలతో దేశిరూపంగా ఆరంభ మయింది. గుణగ విజయాదిత్యుని సేనాని, ఆజ్ఞప్తి అయిన పండరంగని అద్దంకి శాసనం (క్రీ.శ. 848) ఈనాటికి ఉపలబ్ధమైన పద్యమయ శాసనాల్లో మొట్టమొదటిది. అద్దంకి శాసనంలో తరువోజ పద్యం ఉంది. గుణగ విజయాదిత్యుని కందుకూరు శాసనం (క్రీ.శ. 848) లో ఒక సీసపద్యం కన్పిస్తుంది. యుద్ధమల్లుని బెజవాడ శాసనంలో అయిదు మధ్యాక్కరలు పూర్తిగా లభ్యమౌతున్నాయి. అద్దంకి, కందుకూరు, బెజవాడ శాసనాలోలని కవిత్వమంతా దేశిమర్గానికి చెందినది. సాతలూరు శాసనం (క్రీ.శ. 848) లో ఒక చంపకమాల, విరియాల కామసాని గూడూరు శాసనంలో మూడు చంపకమాలలు, రెండు ఉత్పలమాలలు ఉన్నాయి. ఇవి సంస్కృత వృత్తాల ఛాయల్ని సంతరించుకొన్న తెలుగు వృత్తాలు. కొఱవి శాసనం (క్రీ.శ. 900) లోని గద్యాన్ని, విరియాల కామసాని గూడూరు శాసనంలోని పద్యాల్ని పరిశీలిస్తే పూర్వయుగంలోనే తెలుగులో గ్రంథరచన జరిగి ఉంటుందని సిద్ధాంతీకరించవచ్చు.

శాసనాల్లోని పద్యాల్లోనేకాక అనియత గణాలతో, యతిప్రాసలతో కూడిన ద్విపదలు, తత్సదృశ్యాలైన రచనలు ఈ కాలంలో వ్యాప్తికి వచ్చినట్లు ఊహించవచ్చు. పండరంగడు, శ్రీపతి పండితుడు, అయ్యనభట్టు మొదలైన శాసన కవులే కాక ఈ కాలంలో కొందరు కావ్య కవులుకూడ ఉన్నట్లు తెలుస్తున్నది. వేటూరి ప్రభాకర శాస్త్రిచే సంపాదితమైన ప్రబంధ రత్నావళిలో పద్మకవి జినేంద్ర పురాణం నుండి ఒక సీసపద్యం, సర్వదేవుని ఆదిపురాణం నుండి ఒక కందం, ఒక మత్తేభం, విరాటపర్వం నుండి ఒక సీసపద్యం ఉదహరింపబడినవి. పద్మకవి, సర్వదేవులే కాక మడికి సింగన సకల నీతిసమ్మతం అనే సంకలన గ్రంథంలో పేర్కొన్న గజాంకుశుడు కూడ నన్నయకు ముందున్నాడనే అని తెలుస్తున్నది. కాని వీరి గ్రంథాలేవీ లభ్యంకావు. శాసన కవిత, కథాగేయ రూపమైన దేశి కవిత, మార్గ పద్ధతికి చెందిన కావ్యకవిత – ఈ మూడు పూర్వయుగం మలిదశలో వ్యాప్తిలో ఉండేవని చెప్పవచ్చు.

### 17.2.1 శాసన కవిత్వం

తూర్పు చాళుక్యుల పాలనకాలంలో మనకు లభించే ఆంధ్ర సాహిత్యమంతా శాసన సంబంధమైందే. ఆనాడు వేయించిన శాసనాలన్నీ సామాన్యంగా శిలాఫలకాల మీదనో దేవాలయ శిలల మీదనో, రాగిరేకుల మీదనో కన్పిస్తాయి. మఠాధిపతికి కానీ విద్వాంసుడైన విప్రునికిగానీ, దానమీయడానికో, వీరుల పరాక్రమ ప్రకటన కోసమో, దేవాలయ ప్రతిష్ఠ కావించిన అంశాన్ని చాటడానికో శాసన రచనావశ్యకత ఆనాడుండేది. దాత, ప్రతిగ్రహీతల పేర్లనుబట్టి శాసనాల్ని ఎవరు వేయించింది, ఎందుకు వేయించింది మనం గ్రహించడానికి వీలుంది.

తూర్పు చాళుక్యులు చక్రవర్తులై ఉన్నప్పుడు రేనాటి చోళులు మాండలికులై చిన్న చిన్న రాజ్యాలను ఏర్పరుచుకొని పరిపాలన సాగించినారు. నాటి రేనాడు, నేటి రాయలసీమలోని కడప, కర్నూలు చిత్తూరు జిల్లాలోని కొంత భాగమని విమర్శకుల అభిప్రాయం. లభ్యమైన రేనాటి చోళుల 33 గద్య శాసనాలలో ధనంజయుని కలమళ్ళ శాసనం (క్రీ.శ. 575) మొట్టమొదటిది. రేనాటి చోళుల తూర్పు చాళుక్యులు, బాణులు, వైదుంబులు, పశ్చిమ చాళుక్యులు తెలుగు భాషలో శాసనాలు వేయించినారు.

క్రీ.శ. 6, 7, 8 శతాబ్దాలలో తెలుగులో గద్యమయ శాసనాలు మాత్రమే ప్రకటింపబడినాయి. ఈ గద్య శాసనాలలో ఛందోబద్ధంగా ఉన్న కొన్ని పంక్తులు కనిపిస్తాయి. పొట్లదుర్తి, మాలెపాడు శాసనం (క్రీ.శ. 610) పైకి గద్యంలాగా కన్పిస్తున్నా దానిలోని పంక్తులలో "ద్రుతగతి రగడ" లక్షణం కొంతవరకు గర్భితమై ఉందని దేవరపల్లి వేంకటకృష్ణారెడ్డిగారు తెల్పినారు. (పరిశోధన పత్రిక, సంపుటి 1, సంచిక 1, 1954). కాని ఈ శాసనమంతా గేయపద్ధతిలోనే రచింపబడిందని టేకుమళ్ళ కామేశ్వరరావుగారు నిరూపించినారు. (మొదటి గేయ శాసనము. పరిశోధన సంపుటి 1 సంచిక 1, 1954) వెంకయ చోడుని దొంగలసాని కనుమ శాసనంలో "మహాక్కర" ఉందని ముట్లూరు వెంకటరమణయ్య ఊహించినారు. (త్రిలింగ రజతోత్సవ సంపుటములో ఈ శాసనాన్ని ప్రకటించినారు). వీటినీ, ప్రాఙ్నన్నయ గద్య శాసనాలలో ఛందోబద్ధమైన భాగాలను పదమూడింటినీ ఆచార్య దివాకర్ల వెంకటావధాని పేర్కొన్నారు. (ప్రాఙ్నన్నయయుగము, పుటలు 354–257) అయితే కొన్నిట్లో యతి ఉంటే ప్రాస ఉండదు. ప్రాస ఉంటే యతిఉండదు. రెండూ ఉంటే గణాలు సరిపోవు. గేయచ్ఛంద వాసనలున్న ఈ గద్యమయ శాసనాలనుబట్టి మొదట గేయాలలోనే శాసనాలు రచిస్తుండే వారమో అని ఊహించవచ్చు.

కావ్యరచనకు గణబద్ధమైన రూపం నియమితమని కొందరి అభిప్రాయం. అంటే వారి ఊహప్రకారం భావ ప్రధానమైన వాక్కు వెడలినప్పుడు అది గణబద్ధంగానే వెలువడింది. ఇది సార్వత్రికం కాకపోయినా బహుళమైన విషయమని చెప్పక తప్పదు. ప్రపంచంలో తొలి వాఙ్మయమని చెప్పదగిన ఋగ్వేదం ఛందోబద్ధంగానే కన్పిస్తుంది, తర్వాత లౌకికమైన సంస్కృత వాఙ్మయం వాల్మీకి శాపరూపమైన శ్లోకంలో వెలువడిందని సంప్రదాయం. ఆదికావ్యమైన రామాయణానికి అదే పునాది. కాబట్టి ప్రధానంగా భావ సంభరితమై ఛందోబద్ధంగా ఉన్న రచనే మనం కావ్యమనుకొంటున్నాము.

పైన పేర్కొన్న తెలుగు గద్యమయ శాసనాలు గణబద్ధం కావు. కాబట్టి వాటిని కావ్యవాఙ్మయమనలేదు. సంపూర్ణంగా సులక్షణమైన ఛందోబద్ధ శాసనాలు మనకు తూర్పు చాళుక్య రాజైన గుణగ విజయాదిత్యుని కాలం (క్రీ.శ. 848–92) నుండి కన్పిస్తాయి. తెలుగుదేశాన్ని గుణగ విజయాదిత్యుని పాలిస్తున్న కాలంలో కన్నడ దేశాన్ని రాష్ట్రకూట చక్రవర్తి అమోఘవర్ష నృపతుంగుడు పాలించేవాడు. అతడు గుణగ విజయాదిత్యుని మేనమామ. ఐనా ఆ రెండు రాజ్యాల వారికి విరోధముంది. నృపతుంగుడు కన్నడంలో "కవిరాజ మార్గమ" నే



BRAOU

లక్షణ గ్రంథాన్ని రాయించినాడు కన్నడ కవిత్వాన్ని చక్కగా పోషించినాడు. మేనమామతో విరోధమున్న గుణగ విజయాదిత్యుడు కూడా తెలుగునేలపై తెలుగు కవిత్వాన్ని పాదుకొలిపినాడు. తూర్పు చాళుక్యులలో గుణగ విజయాదిత్యుని కాలంలోనే మొట్టమొదట తెలుగు పదాలున్న శాసనాలు లభిస్తున్నాయి. గుణగ విజయాదిత్యుని సేనాని, ఆజ్ఞప్తి అయిన పండరంగని అద్దంకి శాసనం (క్రీ.శ. 848) ఈనాటికి ఉపలబ్ధమైన పద్యమయ శాసనాలలో మొట్టమొదటిది. నన్నయ భారతంలో లాగానే ఇది కూడా గద్య పద్యోభయమైన చంపువులో ఉంది. ఇందులో దేశీయమైన తరువోజ పద్యం, తరువాత నాల్గు పంక్తులలో గద్యం ఉంది. పద్యభాగంలో పండ రంగని పరాక్రమోపేతమైన విజయాలు, గద్యభాగంలో 'పరమమహేశ్వరుడైన' అతడు "ఆదిత్య భట్టారకునికి" చేసిన దానాలు తెలుస్తున్నాయి. పండితుడైన పండరంగడే ఈ శాసనాన్ని నిర్మించినాడని కొందరు విమర్శకులు ఊహిస్తున్నారు. అద్దంకి శాసనంలోని తరువోజ పద్యాన్నిబట్టి గుణగ విజయాదిత్యుడే ఆంధ్రభాషా పోషకులలో ఆద్యుడని చెప్పవచ్చు.

అద్దంకి శాసనంలో ప్రస్తుతించబడిన పండరంగడే గుణగ విజయాదిత్యుని కందుకూరు శాసనం (క్రీ.శ. 848) లో కూడా వర్ణితుడు. కందుకూరు శాసనంలో పద్యం చివర లోపించినా, మొత్తం మీద సీస పద్యముందని కొమఱ్ఱాజు లక్ష్మణరావు మొదట గుర్తించినాడు. దీని కావ్యకర్త నామం తెలియడంలేదు. కేవల పద్యమయ శాసనమిది. ఈ శాసనంలోని సీసపద్యం కింద తేటగీతి ఉన్నట్టుగా భావిస్తున్నారు.

గుణగ విజయాదిత్యుని తమ్ముడైన విక్రమాదిత్యుని కుమారుడు చాళుక్య భీమరాజు ధర్మవరం శాసనం (క్రీ.శ. 897) లో పద్యం మొదట కొంత లోపించినా, సీసపద్యం స్వరూపం స్పష్టంగా కనిపిస్తుంది. ఈ శాసనంలోని సీసపద్యం చివర ఆటవెలది ఉన్నది. ఈ సీసపద్యానికి ముందు వెనుకల కొద్దిపాటి వచన భాగాలున్నాయి. ఇది చంపూ పద్ధతిలోని శాసనమని చెప్పవచ్చు. ధర్మవరం శాసనంలోని సీసపద్య రచన చిన్న చిన్న తెలుగు మాటలతో ప్రసాద గుణభూయిష్టంగా ఉంది. ఈ శాసనకర్త ఎవరో తెలియదు.

ధర్మవరం శాసనం తర్వాత పద్యమయంగా లభించే శాసనం యుద్ధమల్లుని బెజవాడ శాసనం. ఇది ఒకే శాసనం కాదని, తాత, మనుమలైన ఇరువురు యుద్ధమల్లులు రాయించిన రెండు శాసనాలని పరిశోధకుల నిర్ణయం (దివాకర్ల వేంకటావధాని, ప్రాజ్ఞన్నయ యుగము, పుట 77). మొదటి యుద్ధమల్లుడు గుణగ విజయాదిత్యుని తమ్ముడు. కాబట్టి మొదటి శాసనం క్రీ.శ. 885 ప్రాంతంలోను రెండవది క్రీ.శ. 930 లోను రాయించబడి ఉంటుందని నిర్ణయించవచ్చు. మొదటి శాసనంలో నాల్గు మధ్యాక్కరలు. తర్వాత ఫలశ్రుతి ఏడు పంక్తుల వచనంలో ఉంది. రెండవ శాసనంలో ఒక మధ్యాక్కర, తర్వాత మొదటి పంక్తిలో నాల్గు గణాలపై ఒక అక్షరం చెక్కబడింది. మొత్తం మీద యుద్ధమల్లుని బెజవాడ శాసనంలో ఐదు మధ్యాక్కరలు పూర్తిగా లభ్యమవుతున్నాయి. ఈ మధ్యాక్కరలు దేశీయ పదబహుళమై, నన్నయ మధ్యాక్కరలనుపోలి ఉన్నాయి.

BRAOU

యుద్ధమల్లుని బెజవాడ శాసన రచయిత శైవ పండితత్రయంలో ప్రథముడైన శ్రీపతి పండితుడని "అల యుద్ధమల్లు పనుపున దెనుగున మధ్యాక్కరలను దెలిపెను తొలిసారిగా నిల శ్రీపతి పండిత కవి లలితగతిన్విజయ నగర రామయలింగా" అనే పద్యాన్నిబట్టి స్పష్టమౌతున్నది. శ్రీపతి పండితుడు బెజవాడ వాస్తవ్యుడని శైవమత ప్రభావం ప్రదర్శించడానికి అనేక మహిమల్ని ప్రకటించాడని పాల్కురికి సోమనాథుడు తన బసవపురాణంలో తెల్పినాడు. "శ్రీపతి పండితకవి శివ దీపిక విరచించి శైవ దీక్షాగరుడై" అనే పద్యాన్నిబట్టి అతడు 'శివదీపిక' అనే గ్రంథాన్ని రచించినట్లు తెలుస్తున్నది.

రెండవ యుద్ధమల్లుని కుమారుడైన మహారాజు (క్రీ.శ. 980) వేయించిన అరుంబాక సంస్కృత తామ్ర శాసనంలో యతిప్రాసల లక్షణాలతో తెలుగు కందపద్యం కనిపిస్తుంది. తెలుగు ఛందమైన కంద పద్యానికి ఈ శాసనకాలం నాటికే అధిక ప్రచారమేర్పడిందని చెప్పవచ్చు. ఈ శాసనకర్త అయ్యనభట్టుకు తెలుగు కవిత్వం కూడ సుపరిచితమని చెప్పవచ్చు.

క్రీ.శ. 9వ శతాబ్దికి చెందిన శాసనాల్లోకి పద్యాలు జాతుల్లో, ఉపజాతుల్లో ఉన్నాయి. వృత్తాలు కావు. క్రీ.శ. 848 కి చెందిన సాతలూరు శాసనంలో ఒక చంపకమాల ఉంది. సంస్కృతభాషలోని ఈ పద్యం నాల్గు పాదల్లోను ప్రాస ఉపయోగించారు. మొదటి రెండు పాదాల్లో మాత్రమే యతి కనిపిస్తుంది. ఈ పద్యంలోని యతిప్రాసల ఉపయోగాన్నిబట్టి ఆ కాలానికే సమజ లక్షణ సమన్వితంగా సంస్కృత వృత్తాలను తెలుగులోకి తెచ్చుకొనే ప్రయత్నం జరుగుతుండేదని భావించవచ్చు. సాతలూరు శాసనానికి ఆజ్ఞప్తిగా ఉన్న పండరంగడే ఆ

శాసనాన్ని రచించి ఉంటాడని నిడవోలు వేంకటరావుగారి ఊహ (తెలుగు కవుల చరిత్ర పు 35). ఇది నిజమైతే పండరంగడు సేనానే కాక తెలుగు సంస్కృత భాషలలో కవి; సంస్కృత వృత్తాలను తెలుగులోనికి తేవడానికి అతడే మార్గదర్శకుడని చెప్పవచ్చు.

నన్నయకు పూర్వం తెలుగులో దేశికవిత్వం సాగిందని చెప్పడానికి అద్దంకి, కందుకూరు, బెజవాడ మొదలైన శాసనాలలోని తరవోజ, సీసం, మధ్యాక్కర మొదలైన తెలుగు పద్యాలే ఆధారం. దేశికవులలో సుప్రసిద్ధ కావ్య రచనలు చేసినవారు లేకపోవడాన్ని ఇట్టి నన్నెచోడుడు తన కుమారసంభవ పీఠికలో వారిని ప్రత్యేకంగా పేర్లతోకాక "చాళుక్య రాజు మొదలుగఁ బలువురో" అని పేర్కొని ఉంటాడు.

నన్నయకు పూర్వమున్న పద్యమయ శాసనాలన్నీ వ్యక్తుల దానాలను మాత్రం వర్ణిస్తాయి. లభించిన పద్యాల సంఖ్య కూడా అధికంకాదు. అవి రాజ చరిత్రల్ని నిరూపించే కేవల విషయ ప్రధానాలైన రచనలే కాని భావ ప్రధానాలైన కావ్య రచనలు కావు. కాబట్టి వాటిలోని కవితా గుణాల్ని వివరించడానికి అవకాశం అంతగా లేదు. కాని చాళుక్య భీముని కొఱవి శాసనం (క్రీ.శ. 909) లోని "కుసుమాయుధు పెద్దకొడుకనేక రిపున్నృపతి మణిమకుట మకరికారేపుణ మశృణితో" అనే గద్యరచన నన్నయ భారతంలోని సంస్కృతాంధ్ర రచనాశైలిని పోలి ఉంది. కొఱవి శాసనం చిన్న చిన్న వాక్యాలలో కూడి సంభాషణాత్మకంగా సులక్షణమైన సరళ వచనశైలితో ఒప్పింది. ఇట్లాంటి చక్కని వచనంలో హృద్యమైన కథలు, గాథలు కొన్ని నన్నయకు పూర్వమే ఉండేవని అవి కాలగర్భంలో కలిసిపోయి ఉంటాయని ఊహించవచ్చు.

క్రీ.శ. 1000 నాటిదని కొందరు పరిశోధకులు భావించే విరియాల కామసాని గూడూరు శాసనం కేవల పద్యమయ శాసనంలో మూడు చంపకమాలలు, రెండు ఉత్పల మాలలు ఉన్నాయి. ఎఱ్ఱభూపతి పత్నియైన కామసాని తన పుత్రుని సాయంతో బేతరాజును శత్రువిముక్తున్ని చేసి కాకతీయ సామ్రాజ్య ప్రతిష్ఠన్ని చేసిందని ఈ శాసనంలో వర్ణితం. ఇందులో శాసనలేఖకుని పేరు ఉంది కాని కర్తృనామం కనిపించదు. చంపకమాలల్లో విరియాల వంశం నృపాలురక్రమం, ఉత్పలమాలల్లో కామసాని చేసిన సహాయం, ఆమె కుమారుని పరాక్రమం వర్ణితం. ఈ వృత్తాలు యతి ప్రాసలలో తత్సమదేశ్యపద మిశ్రితమైన రచనతోకూడి నన్నయ భారతంలోని పద్య శైలిని తలపిస్తున్నాయి. ఈ పద్యంలో "పాండవపథ్యము భీముడోయనవ్గా" మొదలైనచోట్ల ఆలంకారికమైన రచన గోచరిస్తుందని ఆచార్య దివాకర్ల వేంకటావధాని గారు తెల్పినారు (ప్రాఙ్నన్నయ యుగము, పుట. 87).

పైన పేర్కొన్న అద్దంకి, కందుకూరు బెజవాడ మొదలైన శాసనాల్లోని గద్య పద్య రచనల్నిబట్టి, భాషా చ్ఛందో రీతుల్నిబట్టి నన్నయను పూర్వం తెలుగులో గ్రంథరచన జరిగి ఉంటుందని సిద్ధాంతీకరించవచ్చు.

BRAOU

### 17.2.2 పదగేయ రూప కవిత్వం

నన్నయకు పూర్వం శాసన సంబంధమైన కవిత్వమే కాక పదగేయ రూపమైన దేశి కవిత కూడ ప్రబలి ఉన్నట్లు తెలుస్తున్నది. ఈ దేశీయ రచనలు పదాలు, పాటలు అని రెండు రకాలు. తుమ్మెద, ప్రభాత, వెన్నెల నివాళి, గొబ్బి మొదలైనవన్ని పదాలు. లాలి, జోల, ఏల, ఊయల మొదలైనవన్ని పాటలు. ఈ పాటలు ఏకపద, ద్విపద, త్రిపద, చతుష్పదాలుగా జనసామాన్యంలో వాడుకలో ఉన్నట్లు తెలుస్తున్నది. చాళుక్య రాజులు తెలుగు దేశంలో దేశి కవితను నెలకొల్పి, ఆ కవితను అపారమైన ప్రోత్సాహమిచ్చినట్లు నన్నెచోడుడు తన కుమార సంభవ పీఠికలో ఈ విధంగా తెల్పినాడు :

"మును మార్గ కవిత లోకం
బున వెలయఁగ దేశ కవిత బుట్టించి తెనుం
గున నిలిపి రంధ్ర విషయం
బున జన చాళుక్య రాజు మొదలగు పలువురో

పై నన్నెచోడుని పద్యాన్నిబట్టి నన్నయకు పూర్వమే తెలుగు కవిత్వపుటునికి స్థిరపడుచున్నది. క్రీ.శ. 9, 10 శతాబ్దాలలో చాళుక్యరాజులు తెలుగు కవితను ఆదరించి అభిమానించి అభివృద్ధి పరచినట్లు తెలుస్తున్నది. నన్నెచోడుడు చెప్పినట్లు తెలుగు కవితను 'పుట్టించా' లంటే ఛందో గ్రంథం ఒకటి ఉండాలి.

పాల్కురికి సోమనాథుని పండితారాధ్య చరిత్ర కృత్యవతారికలో ద్విపదను గురించి చెబుతూ "అనియత గణైః" "ప్రా సోవ్యా" "యతిర్వా" అని సంస్కృతోక్తులను మూడింటిని ఉదహరించినాడు. మాత్రాగణాలు, యతి ప్రాసలను గురించి చెప్పినవి కాబట్టి ఇవి తెలుగు భాషకు సంబంధించిన ఛందస్సూత్రాలే. ఈ సూత్రాలున్న ఛందో గ్రంథం నన్నయకు సమకాలికమో, పూర్వకమో అయి ఉంటుందని వేటూరి ప్రభాకరశాస్త్రిగారు భావించి యున్నారు. (నన్నయకు పూర్వపు ఛందస్సు, రాజరాజ నరేంద్ర పట్టాభిషేక సంచిక పుట 30) తమిళ భాషలో 11వ శతాబ్దానికి చెందిన "యాప్పరం గల కారికై" అనే సుప్రసిద్ధ ఛందోగ్రంథంలో "వాంచియార్ సెయిద వడుగ చన్దమ్" అని ఉంది దీన్నిబట్టి 'వాంచియార్' అనే కవి క్రీ.శ. 11వ శతాబ్దానికి పూర్వమే ఒక తెలుగు ఛందో గ్రంథాన్ని రచించి ఉన్నట్లు స్పష్టమౌతున్నది. పాల్కురికి సోమనాథుడు ఉదహరించిన సంస్కృతోక్తులు ఈ వాంచియార్ ఛందస్సులోని సూత్రాలై ఉంటాయని కొందరూహిస్తున్నారు. (రావూరి దొరసామి శర్మ, తెలుగు భాషలో ఛందోరీతులు పుట. 11).

క్రీ.శ. 9వ శతాబ్దంలో రచించినట్లు చెప్పుకొనే 'గుణ కాంకియం' అనే ఛందస్సు ఇప్పుడు దొరకడం లేదని కన్నడ సాహితీపరులు అంటున్నారు. ఈ 'గుణకాంకియం' తూర్పు చాళుక్య రాజైన గుణగ విజయాదిత్యునికి అంకితమైన కన్నడ ఛందస్సేమోనని కొందరి ఊహ.

నన్నయకు పూర్వమే తెలుగు లక్షణ గ్రంథం ఒకటి సంస్కృత భాషలో ఉండేదని తెలుస్తున్నది. దానికి లక్ష్యప్రాయమైన రచనలు కూడ ఆ కాలనికే విస్తరంగా మెలసి ఉంటాయని చెప్పవచ్చు. దీన్నిబట్టి నియతంకాని గణాలతో కూడి యతి లేదా ప్రాస కల్గి ఉన్న ద్విపదలు. తత్సదృశాలైన రచనలు నన్నయకు పూర్వమే ఉండేవని తలంచవచ్చు.

నన్నయకు పూర్వమున్న తెలుగు కవిత్వాన్ని రెండు విధాలుగా విభజించడానికి వీలుంది. సామాన్య జనులు గేయపదాలతో వినోదించి ఉంటారు. పండితులైనవారు సంస్కృతాన్ని విడువలేక, దేశి రచనలను కాదనలేక మణిప్రవాళశైలిని సృష్టించి ఉంటారు. మణి ప్రవాళశైలి అంటే మణులను ప్రవాళాలను కూర్చి అల్లిన దండలాగా సంస్కృత ప్రత్యయాలున్న శబ్దాలతో తెలుగు పదాలు కలిపి చేసిన రచనారీతి. తెలుగుశాసనాల్లో క్రీ.శ. 7వ శతాబ్ది నుండి మణిప్రవాళ పద్ధతి వాక్యాలు అక్కడక్కడ కన్పిస్తాయి. ఉదా : క్షేత్రం ఖణ్డుగవడ్లసహితమ్, కొట్టుబోయు తటాక మొదలైనవి. ఈ మణిప్రవాళ పద్ధతి విద్వల్లమ్మతం కాదు. నన్నయ ఈ పద్ధతిని తోసి పుచ్చినాడు.

### 17.2.3 కావ్యరూప కవిత్వం

శాసనసంబంధమైన దేశీయ కవిత్వమేకాక నన్నయకు పూర్వం కొందరు కవులున్నట్లు వారు కావ్యాలు రచించినట్లు తెలుస్తున్నాది. వేటూరి ప్రభాకరశాస్త్రి సంపాదితమైన ప్రబంధరత్నావళిలో పద్మకవి జినేంద్ర పురాణం నుండి ఒక సీసపద్యం, సర్వదేవుని ఆదిపురాణం నుండి ఒక సీసపద్యం ఉదాహరింపబడినాయి. (ప్రబంధ రత్నావళి పుటలు 81, 136, 137). కన్నడ రత్నత్రయంలోని పంపకవే (క్రీ.శ. 94) పద్మకవి అనీ పొన్నకవే (క్రీ.శ. 950) సర్వదేవుడనీ నిడదవోలు వేంకటరావుగారు నిరూపించినారు. (తెలుగు కవుల చరిత్ర పుటలు 84, 92). పంప పొన్నకవులు జన్మరీత్యా ఆంధ్రులు కాబట్టి కన్నడభాషలో కావ్యాలు రాయడానికి పూర్వం తమదేశ భాష తెలుగులో కూడ కవిత్వం చెప్పి ఉంటారని కొందరి భావం. వారు రచించిన కావ్యాలు కూడా జైనమత సంబంధమైన వస్తువుతో కూడుకున్నవే.

"హరి నిలయంబును హరి నిలయంబును విషధరాఢ్యంబును విషధరాఢ్యమును" మొదలుగాగల మందర పర్వత వర్ణనాత్మకమైన సీసపద్యం జినేంద్రపురాణం లోనిదిగా ఉదాహరింపబడినది. ఈ పద్యం సంస్కృత సమాస భూయిష్టమయింది. శ్లేషాలంకార సంయుతమైంది. శ్లేష చిత్రకవిత్వ రీతులుండడంవల్ల ఈ పద్యం "నన్నయకు తరువాత వృద్ధి నందినదని, అట్లాంటి కవిత నన్నయకు పూర్వముండెనా" అని వేటూరి ప్రభాకర శాస్త్రిగారు సందేహించారు. తేటగీతిలోని యతి, ప్రాసల ప్రయోగాన్నిబట్టి కూడ ఈ సీసపద్యం నన్నయకు పూర్వపద్యం కాదని చెప్పవచ్చు.

అట్లాగే సర్వదేవుని ఆదిపురాణం నుండి ఉదాహరించిన పద్యాలు శబ్దాలంకార భూయిష్ఠాలై తరువాతి ప్రబంధాలలోని పద్యాలను తలపిస్తున్నాయి. జినేంద్రపురాణం, ఆదిపురాణ విరాటపర్వాలు లభించలేదు. పంప



BRAOU

పొన్న కవులు జన్మరీత్యా ఆంధ్రులైనా కన్నడరాజుల ఆశ్రయంలో ఉండినవారు కాబట్టి ఆంధ్రకవులుగా ఆంధ్ర దేశంలో వారికి పరిగణన లభించలేదు. పైగా జైన మతాచార్యులలో సర్వదేవనామధారులు నన్నయకు పూర్వం, తరువాత కూడ చాలమంది ఉన్నారు. వీరిలో ఆది పురాణకర్త ఏ సర్వదేవుడో నిర్ణయించి చెప్పలేము.

వైదికమత పునరుద్ధరణ కోసం బద్ధ కంకణులైన చాళుక్య రాజులు మతస్పర్థతో పంపాదులు తెలుగులో రచించిన జైన కావ్యాలను తగులబెట్టించి ఉంటారని కొందరు వాదించడంలో సత్యంలేదు. చాళుక్య రాజులు వైదిక మతాభిమానులే అయినా జైన వసతులకు, జైన సమయాచార్యులకు పెక్కుదానాలు చేసినట్లు మచిలీపట్టణ తామ్ర శాసనం, మలయంపూడి దాన శాసనాలనుబట్టి తెలుస్తున్నది. విమలాదిత్యుడు జీవితాంతంలో శ్రావకుడైనట్లు తెలుస్తుంది. వీటిని బట్టి జైన గ్రంథ దాహం తూర్పు చాళుక్యులకు అంటగట్టడం సమంజసం కాదు. బ్రాహ్మణ మతాన్ని అనుసరించిన చాళుక్యరాజులే కన్నడ దేశాన్ని కూడ పరిపాలించినారు. కన్నడ భాషలోని జైన కావ్యాలను దగ్ధంచేయకుండా తెలుగులోని జైన గ్రంథాలనే వారు నాశనం చేసినారనడం విశ్వస నీయంకాదు.

మడికి సింగన (క్రీ.శ. 1420) సకల నీతి సమ్మతం అనే సంకలన గ్రంథంలో గజాంకుశుడనే కవిని పేర్కొన్నాడు . గజాంకుశుడు అనేది బిరుదమేకాని సహజనామంకాదనీ, అతని పేరు నారాయణుడనీ రాష్ట్రకూట రాజైన మూడవ కృష్ణచక్రవర్తి (క్రీ.శ. 939-965) వద్ద మంత్రిగా ఉన్నాడనీ, నిడుదవోలు వేంకటరావు శాసనా ధారాలతో "తెలుగు కవుల చరిత్ర" అనే గ్రంథంలో నిరూపించినారు. మడికి సింగన పేర్కొన్న గజాంకుశుడు నారాయణుడే అని నమ్మితే, అతడు నన్నయకు పూర్వుడై తెలుగులో కవిత్వం చెప్పినాడని నిశ్చయింపవచ్చు. గజాంకుశుడు కన్నడాంధ్రాలలో రాసిన గ్రంథాలేమో కన్పించవు.

శ్రీపతి పండితుడు (క్రీ.శ. 898) అయ్యనభట్టు (క్రీ.శ. 973-990) మొదలైనవారు నన్నయకు ముందున్న శాసనకవులు. వీరు తెలుగు కవులని అంగీకరించినా, వీరి కావ్యాలు లభించలేదు. తనకు పూర్వం తెలుగులో మహాకవులున్నట్లు కూడ నన్నయ భారతావతారికలో పేర్కొనలేదు నన్నెచోడుడు. నన్నయకు పూర్వుడని మానవల్లి రామకృష్ణ కవి అభిప్రాయం. కాని నన్నెచోడుడు ననన్నయ తిక్కనల మధ్యకాలం వాడని శాసనాధారలతో నిర్ధారించవచ్చు.

పైని పేర్కొన్న వివిధాంశాలను బట్టి తెలుగు కవిత మొదట చాళుక్యరాజుల ప్రేరణ ప్రోత్సాహాలతో దేశి రూపంగా ఆరంభమై తరువాత కన్నడ కవుల ప్రభావంతో మార్గ పద్ధతిని అవలంబించి, నన్నయ భారతంలో సమగ్ర రూప సౌష్ఠవాన్ని పొందినట్లు కన్పిస్తుంది.

BRAOU

## అవగాహన ప్రశ్న

నన్నయకు పూర్వం తెలుగు దేశికవిత్వం సాగిందో లేదో 10 వాక్యాల్లో వివరించండి.

## 17.3 సారాంశం

- తెలుగు కవిత్వం ఆరంభస్థితిలో శాసన కవిత్వంగానే పూర్వదశ - II (క్రీ.శ. 600-1000) లో కన్పిసుతంది. వెన్నెల, తుమ్మెద పదల్లాంటివి మౌఖిక సాహిత్యంగా ఉండేవి.
- తెలుగులో శాసన కవిత్వం గద్యమయ కవిత్వంగా ప్రారంభమైంది. అక్కడక్కడా ఛందోబద్ధంగా ఉన్న పంక్తులు కొన్ని వీటిలో మొదటిదశలో కన్పిస్తాయి.
- శాసనకవిత్వం క్రమంగా సీసం, మధ్యాక్కర, కందం, తరువోజ వంటి జాతి, ఉపజాతి పద్యాల్లోకి క్రమక్రమంగా మారింది.
- ఈ దశలోని పదగేయరూప కవిత్వం; పదాలు పాటల రూపంలో ఉండేది. ఏది ఎప్పుడు ప్రభవించిందన్న కాలనిర్ణయం కచ్చితంగా చేయడానికి సరియైన ఆధారాలు కన్పించవు.
- ఈ దశలో నన్నయకు పూర్వం కొందరు కవులు కావ్యాలు రచించినట్లు సాహిత్యాధారాలు లభిస్తున్నాయి. కాని అవి. నన్నయభారతంలాగా సమగ్ర స్వరూపం సంతరించుకోక పోవడం వల్లనేమో తెలుగులో ఆదికావ్యం భారతమే ఐంది. వేటూరి ప్రభాకరశాస్త్రి ప్రబంధరత్నావళిలో, నిడదవోలు వేంకటరావు కవుల చరిత్రలో, మడికి సింగన సకల నీతి సమ్మతం అనే సంకలన గ్రంథంలో దీనిక ఆధారాలు కన్పిస్తున్నాయి.

### అవగాహన ప్రశ్నకు జవాబు

నన్నయకు పూర్వం శాసన కవిత్వమే కాక పదగేయరూపమైన దేశి కవిత్వం కూడా ఉండేది. ఈ దేశి కవిత పదాలరూపంలో, పాటలరూపంలో ఉండేది. తుమ్మెద, వెన్నెల, ప్రభాత, నివాళి, గొబ్బి పదాల పేర్లతో పదకవిత ఆనాడు ప్రచారంలోఉండేది. లాలి, జోల, ఏల, ఉయ్యాలపాటలు ఉండేవి. ఇవన్నీ మౌఖిక సాహిత్య పద్ధతిలోనివే. ఈ పాటలు - ఏకపద, ద్విపద, త్రిపద, చతుష్పద రీతుల్లో జనసామాన్యంలో ఎక్కువగా ప్రచారంలో ఉండేవి. చాళుక్య ప్రభువులు దేశికవితకు ప్రాధాన్యం ఇచ్చి పోషించినట్లు నన్నెచోడుడు తన కుమార సంభవంలో తెలిపాడు.

BRAOU

### చదవదగిన పుస్తకాలు

| | | |
|---|---|---|
| తెలుగు భాషా చరిత్ర | : | భద్రిరాజు కృష్ణమూర్తి (సం) |
| ఆంధ్రసాహిత్య చరిత్ర | : | పింగళి లక్ష్మీకాంతం |
| ఆంధ్రవాఙ్మయ చరిత్ర | : | డా. దివాకర్ల వెంకటావధాని |
| ఆంధ్ర వాఙ్మయారంభదశ (1, 2 భాగాలు) | : | డా. దివాకర్ల వెంకటావధాని |
| సమగ్రాంధ్ర సాహిత్యం | : | ఆరుద్ర |
| ఆంధ్ర ద్విపదసాహిత్య చరిత్ర | : | డా.టి. సుశీల |
| ద్విపద వాఙ్మయము | : | డా. జి. నాగయ్య |
| దాక్షిణాత్య శిల్ప సమీక్ష | : | డా. జి. నాగయ్య |
| పురాణ వాఙ్మయము | : | డా. జి.వి. సుబ్రహ్మణ్యం |

### మాదిరి పరీక్షా ప్రశ్నలు

I. కింది ప్రశ్నలకు 30 వాక్యాలు మించకుండా జవాబులు రాయండి.

1. పూర్వయుగం మలిదశలోని తెలుగు కవితారంభం గురించి రాయండి.
2. పూర్వయుగం మలిదశలోని శాసన కవితను గురించి వ్యాఖ్యానించండి.
3. నన్నయకు పూర్వం కావ్యాలున్నాయా?

II. కింది ప్రశ్నలకు 10 వాక్యాలు మించకుండా జవాబులు రాయండి.

1. తెలుగు గద్యమయ శాసనాలను కావ్యఙ్మయ మనవచ్చునా?
2. యుద్ధమల్లుని బెజవాడ శాసనం గురించి రాయండి.
3. 9వ శతాబ్ది శాసనాలను గురించి రాయండి.
4. చాళుక్య భీముని కొఱవి శాసనంలోని గద్య రచనపై వ్యాఖ్యానించండి.

BRAOU

# భాగం–18 తెలుగుసాహిత్యం–మధ్యకాలీన దశ I
## (క్రీ. శ. 1000 – 1600)

విషయ క్రమం

18.0 లక్ష్యాలు
18.1 పరిచయం
18.2 మార్గ–దేశి కవితా పద్ధతులు
18.2.1 ఇతిహాసాలూ, పురాణాలూ
18.2.2 కావ్యప్రబంధాలు
18.2.3 క్షేత్ర మాహాత్మ్యాలు
18.2.4 ద్వ్యర్థి కావ్యాలు
18.2.5 అచ్చ తెనుగు కావ్యాలు
18.2.6 కథా కావ్యాలు
18.2.7 శాస్త్రి వాఙ్మయం
18.2.8 ద్విపద కావ్యాలు
18.2.9 శతకాలు
18.2.10 ఉదాహరణలు
18.2.11 రగడలు
18.2.12 యక్షగానాలు
18.2.13 గద్య వచనరచనలు
18.2.14 ఇతర ప్రక్రియలు
అవగాహన ప్రశ్న
18.3 సారాంశం
అవగాహన ప్రశ్నలకు జవాబు
చదవదగిన పుస్తకాలు
మాదిరి పరీక్షా ప్రశ్నలు

BRAOU

## 18.0 లక్ష్యాలు

క్రీ. శ. 1000 నుండి 1600 దాకా తెలుగు సాహిత్యంలో కనిపించే సంస్కృత సాహిత్య అనుసరణాన్ని మార్గ కవిత లక్షణంగా, దేశీయ ప్రజా జీవనానికి సన్నిహితంగా వెలువడిన సాహిత్యాన్ని దేశికవిత్వంగా ఈ భాగం చదివాక మీరు గుర్తించి వాటి స్వరూప స్వభావాలను వివరించగలుగుతారు.

## 18.1 పరిచయం

లభ్యమైన తెలుగు కావ్యాలలో నన్నయ భారత భాగమే మొట్టమొదటిది. కాబట్టి దానితోనే ఆంధ్ర సాహిత్య చరిత్ర ప్రారంభమైంది. తత్సమ పదబాహుళ్యం, సంస్కృత వృత్త సమాదరణ శీలం, చంపూ కావ్యనిర్మాణ పద్ధతి, స్వేచ్ఛానువాదం వీటి సమాహారరూపమైన మార్గ కవితా పద్ధతినే నన్నయ భారత రచనలో పొందుపరచినాడు. సంస్కృత భాషా సాహిత్య లక్షణ ప్రభావాన్ని భాసింప చేసే ప్రౌఢకవితే మార్గ కవిత క్రీ.శ. 13వ వతాబ్ది నుండి నన్నయోజ్జ్వమైన మార్గకవిత పలువురు తెలుగు కవులకు మార్గదర్శకమైనది. మధ్యయుగం

తొలిదశలో మార్గ పద్ధతికి చెందిన భారత రామాయణాలు, పురాణాలు, కావ్య ప్రబంధాలు, కథాకావ్యాలు, శాస్త్రి గ్రంథాలు మొదలైన శాఖలెన్నో తెలుగులో వెలువడినవి. ఈ శాఖలన్నీ తెలుగు కవిత్వాన్ని సంస్కృత స్థాయికి తీసుకరావలనే కవుల ప్రయత్నంలో పుట్టినవి.

దేశీయ ప్రజా జీవితానికి సన్నిహితంగా జనసామాన్యంలో వ్యాప్తికోసం ఉద్దేశించిన కవిత్వమే దేశికవిత్వం. దేశికవిత్వంలో కథావస్తువు, భాష, ఛందస్సు మొదలైన వాటిలో దేశిలక్షణాలు కనిపిస్తాయి. ఒక రకంగా చెప్పాలంటే స్వభాషాభివృద్ధిపట్ల అభిమానంతో సంస్కృత సంప్రదాయానికి భిన్నంగా వెలువడినదే దేశికవిత్వం. క్రీ.శ.12వ శతాబ్దిలో వీరశైవ మతవ్యాప్తి మూలంగా తెలుగులో దేశికవిత్వానికి ప్రాధాన్యం సిద్ధించింది. ఈ కవిత్వం ప్రత్యక్ష సంస్కృత ప్రభావాన్ని తిరస్కరించింది. నన్నెచోడుడు క్రీ. శ. 1130 తన కుమార సంభవంలో ఇతివృత్తం, కావ్య ప్రక్రియ, కవిత్వ విధానం అనే విషయాల్లో నన్నయ మార్గ పద్ధతినే అనుసరించినా, తొలిసారిగా దేశిపద్ధతివైపు మొగ్గుచూపినాడు. కుమార సంభవంలో అక్కడక్కడా దేశి సంప్రదాయాలు కొన్ని నెలకొన్నాయి. పాల్కురికి సోమనాథుడు (క్రీ. శ. 1160 - 1240) వీరశైవ మతాభిమానం, దేశ్యభినివేశం సంగమించిన ప్రజ్ఞాశాలి. నన్నయ అవలంభించిన సంస్కృత సమాస భూయిష్ట రచన "సర్వసామాన్యము" కాదని భావించి పాల్కురికి సోమనాథుడు వీరశైవ మత ప్రచారం కోసం దేశీయమైన భాషాచ్ఛందో రీతులను, రచనా వైఖరులను ప్రవేశ పెట్టినాడు. పాల్కురికి సోమనాథుడు స్థాపించిన ద్విపద, శతకం, ఉదాహరణ, రగడ మొదలైన దేశికవితా శాఖలను శైవేతర కవులు కూడ చేపట్టినారు. వైష్ణవుడైన కృష్ణమాచార్యుడు (క్రీ.శ. 1295-1320) వచన భేదాలైన చూర్ణికలను, సింహగిరి నరహరి వచనాలను తెలుగులో రచించినాడు. వైష్ణవ మత వ్యాప్తి కోసం తాళ్ళపాక కవులు వెలయించిన సాహిత్యమంతా దేశికవితోద్యమాన్నే అనుసరించింది. తాళ్ళపాక కవుల దేశి కవిత్వం సజీవమైనా అది ప్రబంధ వాహిని ముందు నిలువలేకపోయింది. మధ్యయుగం తొలిదశలో దేశికవితా పద్ధతికి చెందిన ద్విపద కావ్యాలు శతకాలు, ఉదాహరణలు, రగడలు, దండకాలు, వచనాలు, యక్షగానాలు మొదలైనవి కూడ రచింపబడినవి. ప్రాచీనాంధ్ర సాహిత్యంలో క్రీ. శ. 1600 దాక చాటుమాటుగా కొంత దేశిరచనా ప్రయత్నం జరిగినా మార్గకవితా శాఖలే ప్రాధాన్యం వహించినవి.

## 18.2.0 మార్గ, దేశి కవితా పద్ధతులు

BRAOU

ఈ దశలో తెలుగులో వెలసిన మార్గ, దేశి కవిత్వ పద్ధతులకు సంబంధించిన వివిధ శాఖలను గురించి మనం తెలుసుకుందాం. గ్రంథ రూపంలోని తెలుగు సాహిత్య చరిత్రను మనం పరిశీలించినప్పుడు గద్య పద్యాత్మకమైన చంపూ కావ్యరచనను మొట్టమొదట నన్నయ ప్రవేశపెట్టినట్లు తెలుస్తూ చంపూ కావ్యరచనలోని పద్యాల్లో వివిధ ఛందస్సులుంటాయి. సర్వసాధారణంగా సంస్కృత ఛందస్సులకే ప్రాధాన్యం ఉంటుంది. అట్లా కాకుండా దేశి ఛందస్సులకు దేశీకవులు తమ కావ్యాల్లో ప్రాధాన్యం ఇచ్చారు. మార్గదేశి కవితా పద్ధతులు పరిచయంలో ఈ తేడాలను మీకు పరిచయం చేస్తున్నాము. మీకు ఈ భాగంలో పరిచయం చేసిన మార్గదేశి పద్ధతులకు సంబంధించిన కవితాశాఖలు ఇవి : 1. ఇతిహాసాలూ, పురాణాలూ 2. కావ్య ప్రబంధాలు 3. క్షేత్ర మహాత్మ్యాలు 4. ద్వ్యర్థికావ్యాలు 5. అచ్చ తెనుగు కావ్యాలు 6. కథాకావ్యాలు 7. శాస్త్రి విజ్ఞ్మయం 8. ద్విపద కావ్యాలు 9. శతకాలు 10. ఉదాహరణలు 11. రగడలు 12. యక్షగానాలు 13. గద్య వచన రచనలు 14. ఇతర ప్రక్రియలు.

### 18.2.1 ఇతిహాసాలూ, పురాణాలూ

సంస్కృతంలో రామాయణ మహాభారతాలు ఇతిహాసాలూ కూడ పరిశీలింపబడుతున్నవి. ఇతిహాస పురాణాలు రెండింటికి 'పురాణము' అనే పేరే నేడు రూఢిలో ఉన్నది. భారత రామాయణాలను పురాణాలలో చేర్చి పరిశీలించవచ్చు. కాని భారత రామాయణాల్లో కావ్య ధర్మాలు విశిష్టంగా ఉన్నాయి. రెండూ కూడా బహుళ ప్రచారం పొందినాయి. కాబట్టి వాటిని పురాణాల్లో చేర్చకుండా ప్రత్యేకంగా పేర్కొని పరిశీలించడం జరిగింది. కవిత్రయ భారతం తెలుగు సాహిత్యానికి మూల స్తంభం. నన్నయ భారత రచనతో తెలుగు సాహిత్య సంప్రదాయంలో సంస్కృత భాషా సంప్రదాయ ప్రాధాన్యం ఏర్పడింది. ఈ మార్గాన్ని నన్నయానంతరం కవులు చాలామంది అనుసరించారు.

"ఉభయ భాషా కావ్య రచనాభిశోభితుడై"న నన్నయ, పంచమవేదమైన భారతాన్ని స్వతంత్ర కావ్యంగా రూపొందించినాడు. వ్యాస భారతంలోని అభిప్రాయాన్ని, దానిలోని "నిరూపితార్థము" ను తెలుగువారికి

తేటతెల్లం చేయడం నన్నయ కర్తవ్యం . నన్నయదృష్టి ప్రధానంగా "ప్రసన్న కథాకలితార్థయుక్తి"పై ఉంది. భారతాన్ని సంహితగానే భావించి నన్నయ రచనకు పూనుకున్నాడు. పదునెనిమిది పర్వాల విస్తృతిగల మహాభారతంలో నన్నయ ఆది, సభాపర్వాలను, అరణ్యపర్వంలో కొంతభాగాన్ని మాత్రం తెనిగించినాడు. కన్నడ మార్గ కవితా పద్ధతులను గురించి సూచనలివ్వడంలో, సంస్కృత భారత ప్రతిని నిర్ణయించడంలో, విద్వత్సభల్లో కలిగిన భాషా వివాదానికి పరిష్కార మార్గాన్ని సూచించడంలో నన్నయకు అతని సహాధ్యాయియైన నారాయణభట్టు "అభిమతస్థితి" తోడ్పడి ఉంటాడు. అందుకే నారాయణభట్టును నన్నయ భారతావతారికలో కృతజ్ఞతాపూర్వకంగా స్తుతించినాడు. వైదిక మతాభిమాని ఐన రాజరాజనరేంద్రుని అనుమతితో, "విద్వజ్జనము" ల అనుగ్రహంతో నన్నయ భారత కావ్యాన్ని రచించినాడు. నన్నయ రాజరాజుల తర్వాత సుమారు రెండు శతాబ్దులదాకా భారతాంధ్రీకరణోద్యమం వెనుకబడింది. దానికి రాజపోషణలేకపోవడం, భిన్నమతకల్లోలాలు ముఖ్య కారణాలు. క్రీ.శ. 13వ శతాబ్దినాటికి మతవైషమ్యాల తీవ్రత అణిగింది. తిక్కన విరాట పర్వం నుండి స్వర్గారోహణ పర్వందాకా 15 పర్వాలను నన్నయ రచనా విధానాన్ని అనుసరించి రచించినాడు. ధర్మేతిహాసమైన వ్యాసభారతాన్ని "బుధ సంతోషంబు నిండారగ", "ఆంధ్రావళి మోదముంబొరయునట్లుగ", "మహాకవిత్వ దీక్షావిధి నొంది" తెలుగు భాషలో రసమయ కావ్యంగా తిక్కన తీర్చిదిద్దినాడు. తిక్కన భారతంలో రాజనీతి, యుద్ధతంత్రాలు, బ్రహ్మవిద్యోపదేశం గోచరిస్తాయి. తిక్కన పలుకుబడిలో, ఊహలో సంభాషణంలో అచ్చమైన దేశితనాన్ని చూపినాడు. తిక్కన రచన నాటకీయమైంది. "రసాభ్యుచిత బంధము", "అర్థగౌరవం" కలిగినట్టిది.

నన్నయ రచనే అన్నట్లు రచిస్తున్నానని చెప్పి, ఎర్రన అరణ్యపర్వశేషాన్ని పూర్తి చేసినాడు. అరణ్యపర్వ శేషరచన వల్లనే ఎర్రనకు "ప్రబంధ పరమేశ్వరుడు" అనే బిరుదు సిద్ధించింది.

భారతాశ్వమేధపర్వ కథ ప్రధానంగా వర్ణితమైన జైమినీ భారతాన్ని పిల్లలమర్రి పినవీరభద్రుడు (క్రీ.శ.1480) సంస్కృతం నుండి తెనిగించినాడు. కుశలవోపాఖ్యానం, చంద్రహాస చరిత్ర, ప్రమీలార్జునీయం, బభ్రువాహనుని చరిత్ర, ఉద్దాలకుని చరిత్ర మొదలైన ఉపాఖ్యానాలెన్నో మహాభారతంలో లేనివి జైమినీ భారతంలో ఉన్నాయి.

కవిత్రయ భారతాన్ని బట్టే పాటితిమ్మయ (1550-1600), ఆత్తుకూరి సోమన (1600), బాలసరస్వతి అనే మరో కవిత్రయం ద్విపదలో రచించింది. తిమ్మయ ఆదిపర్వం మొదలు ద్రోణపర్వాంతం దాక ఉన్న పర్వాల్లో ఒక్క సభాపర్వం తప్ప తక్కిన ఆరింటిని నిర్వహించినాడు. బాలసరస్వతి సభాపర్వాన్ని మాత్రం రాసినాడు. సోమన కర్ణపర్వం మొదలు స్వర్గారోహణ పర్వందాక మొత్తం పదకొండు పర్వాలను రచించినాడు. ద్విపద భారతకర్తలలో తిమ్మయ రచన మేల్తరమైంది

తెలుగులోని సమగ్రమైన అనువాద రామాయణాలన్నిటిలో రంగనాథ రామాయణం మొట్టమొదటిది. దీన్ని గోన బుద్ధారెడ్డి (1240) ద్విపదాల్లో రాసినాడు. బుద్ధారెడ్డి కవితా రీతిలో నన్నయ మార్గాన్నే పాటించి, రంగనాథ రామాయణాన్ని రచించినా తేటతెలుగు పలుకుబళ్ళ పోహళింపులో, ఛందస్సులో పాల్కురికి సోమనాథుని దేశీయవిధానాన్ని అనుకరించినాడు. వాల్మీకి రామాయణంలో లేని జంబుకుమారుని వృత్తాంతం, కాలనేమికథ, ఊర్మిళాదేవి నిద్ర, లక్ష్మణదేవర నవ్వు, సులోచనా వృత్తాంతం మొదలైన కథలు, కథాంశాలు రంగనాథ రామాయణంలో కన్పిస్తాయి. ఇది ప్రౌఢ కవితారసికులకేకాక, పామర జనానికి కూడ సాహిత్యానందాన్ని సమకూర్చి పెట్టింది.

తిక్కన నిర్వచనంగా ఉత్తర రామాయణాన్ని తెనిగించినాడు. ఉత్తర రామాయణ కథ శ్రీరాముని ప్రాశస్త్యాన్ని వెల్లడిస్తుంది. నిర్వచనోత్తర రామాయణ రచనవల్ల తిక్కన కావ్యశిల్పపారగుడైన మహాకవిగా పేరొందినాడు. తిక్కన నిర్వచనంగా రాసిన పద్ధతి "సంప్రదాయం" కాలేదు. గోన బుద్ధారెడ్డి కుమారులైన కాచభూపతి, విట్టలనాథుడు అనే సోదర జంటకవులు రంగనాథోత్తర రామాయణాన్ని ద్విపదలోనే రాసినారు.

ఎర్రన (1300-1350) రామాయణాన్ని తెలుగులో ప్రబంధంగా రాశాడట. కాని అది లభించలేదు. కొరవి సత్యనారయణ (1320-1345) రాసిన రామాయణం కూడ అలభ్యమే.

చంపూకావ్యరూపంలో వెలసిన తెలుగు రామాయణాలలో మొట్టమొదటిది భాస్కర రామాయణం. ఇది బహుకర్తృకం. భాస్కర రామాయణంలోని బాల, కిష్కింధ, సుందరకాండలను భాస్కరుని కుమారుడైన మల్లికార్జున

BRAOU

భట్టు, అయోధ్యాకాండను భాస్కరుని శిష్యుడైన కుమార రుద్రదేవుడు, అరణ్య యుద్ధకాండం మొదటి భాగాలను హుళక్కి భాస్కరుడు, యుద్ధకాండ శేషభాగాన్ని భాస్కరుని మిత్రుడైన అయ్యలార్యుడు అనే నలుగురు కవులు రచించినారు. ఇట్లా నలుగురు కవులు రాసినా భాస్కరుని ఆధ్వర్యంలో గ్రంథ రచన జరిగి ఉండడంవల్ల దీనికి భాస్కర రామాయణం అనే పేరు ప్రసిద్ధమైంది. భాస్కర రామాయణం వాల్మీకి రామాయణానుసరణమే ఐనా రంగనాథ రామాయణంలోని అవాల్మీకమైన అంశాలు కూడా కొన్ని ఇందులో గోచరిస్తాయి. భాస్కర రామాయణంలో ఇతిహాసానికి కావ్యశోభ ఆపాదింపబడింది.

మొల్ల (క్రీ. శ. 16వ శతాబ్ది) తెలుగు కవయిత్రులలో ప్రప్రథమంగా పేర్కొనదగింది. ఆమె రామాయణాన్ని ఆరుకాండల పద్య కావ్యంగా రాసింది. ఇది మొల్ల రామాయణమని పేరుకెక్కింది. మొల్ల రామాయణం ప్రథమాంధ్ర సంగ్రహ రామాయణమని చెప్పవచ్చు. మొల్ల అధ్యాత్మ రామాయణంలోని కొన్ని ఘట్టాలను కూడ అనువదించింది.

అయ్యలరాజు రామభద్రుడు (క్రీ. శ. 1510 - 1580) పూర్వ రామాయణ కథను గ్రహించి 'రామాభ్యుదయం' అనే పేరుతో ప్రబంధంగా, చమత్కృత కృతిగా రచించినాడు. ప్రబంధ ధోరణికి ఆటంకం కలిగించే ఘట్టాలను రామభద్రుడు రామాభ్యుదయంలో తెనిగించలేదు.

వేదాలలోని కథలను పెంపొందించి ఉపాఖ్యానాలతో నీతిబోధకంగా లోకవృత్తం ప్రతిబింబించేటట్లు రచించటం సాధారణంగా పురాణ పద్ధతి. కథా కవిత్వ రూపంలో సాగే పురాణాలలో దేశచరిత్ర, సంఘ చరిత్ర, నీతి, ధర్మం, ఆచార వ్యవహారాలు, క్షేత్ర ప్రాశస్త్యం మొదలైనవి కలగలపి ఉంటాయి. మన ప్రాచీన లాక్షణికులు పురాణం సర్గం, ప్రతిసర్గం, వంశం, మన్వంతరం, వంశాను చరితం అనే కావ్యలక్షణాలతో కూడుకుని ఉంటుందని లక్షణం చెప్పారు.

సంస్కృతంలోని 18 పురాణాలను వ్యాసుడు రచించినాడని ప్రతీతి. సంస్కృతంలో 18 ఉప పురాణాలు కూడ ఉన్నాయి. హిందూమత సంస్కృతులకు పురాణాలు పట్టుగొమ్మలు. గారుడ, ఆగ్నేయ, నారదీయ పురాణాలు ఆనాటి విజ్ఞాన సర్వస్వాలలాంటివి, పద్మ, స్కాంద, భవిష్య, బ్రహ్మాండ పురాణాలలో తీర్థవ్రత మాహాత్మ్యాదులు అధికంగా వర్ణింపబడ్డాయి. బ్రహ్మాండ, వాయు పురాణాలలో చారిత్రకాంశాలు ఎక్కువ. లింగ, వామన, మార్కండేయ పురాణాలు మత ప్రాధాన్యం ఉన్నటువంటివి.

పాల్కురికి సోమనాథుడు వీరశైవ మత ప్రబోధానికై భక్త్యావేశ ప్రధానమైన బసవపురాణాన్ని గాన యోగ్యమైన ద్విపదలో రచించినాడు. బసవపురాణం జైనపురాణ నిర్మాణ పద్ధతికి చెందిన ప్రథమాంధ్ర స్వతంత్ర దేశిపురాణమని డాక్టర్ జి.వి. సుబ్రహ్మణ్యం అభిప్రాయం. (బసవపురాణ నిర్మాణము, జైనపురాణం ప్రభావము - సారస్వత సౌరభము, వ్యాససంపుటి, పుట. 52) బసవపురాణం పంచలక్షణ లక్షితం కాకపోయినా శివాంశసంభూతుడైన బసవ మాహాత్మ్యాదులు వర్ణించబడటంవల్ల అది శైవపురాణంగా ప్రసిద్ధమైంది. పాల్కురికి సోమనాథుని మల్లమదేవి పురాణం (అలభ్యం) పండితారాధ్య చరిత్ర, గౌరన (1245-1445) నవనాథ చరిత్ర, పిడుపర్తి బసవన (1415-1500) బ్రహ్మోత్సవ ఖండము (అలభ్యం), పిడుపర్తి సోమనాథుని (1500-1525) ప్రభులింగలీల మొదలైనవి ద్విపద శైవపురాణములనదగినవే తెలుగులో స్వతంత్ర దేశిపురాణ రచన అట్టే సాగినట్టులేదు.

బసవపురాణం వంటి దేశి ద్విపదపురాణానికి ప్రతిగా మారన మార్కండేయ పురాణాన్ని మార్గ (చంపూ) పద్ధతిలో రాసినాడు. మారన (క్రీ. శ. 13వ శతాబ్ది) మహాపురాణ సంప్రదాయ ప్రవర్తకుడు. మార్కండేయ పురాణం. ప్రథమాంధ్ర మహాపురాణం. మారన మార్గాన్ని అనుసరించి తెలుగులో పురాణాలు రాసిన వారిలో పద్మపురాణోత్తర ఖండకర్త మడికి సింగన (1420) 'నారదీయము' ను రచించిన పిల్లలమర్రి పినవీరభద్రుడు (1480), వరాహ పురాణకర్తలైన నందిమల్లయ, ఘంట సింగనలు (15వ శతాబ్ది) విష్ణుపురాణకర్త వెన్నెలకంటి సూరన (6వ శతాబ్ది) మొదలైనవారు ముఖ్యులు. తెలుగు వారికి పురాణ ప్రీతి మెండు. పురాణ పఠన, శ్రవణం వల్ల "ఇహపరశ్రేయం" కలుగుతుందని వారి విశ్వాసం. కవిత్రయ యుగంలో పురాణ, కావ్యవాఙ్మయాలు రెండూ పరస్పర పోషకంగా పెరిగినాయి. తెలుగు పురాణ రచనపై కవిత్రయం వారు కలిగించిన కావ్యస్పృహ బలమైన ప్రభావాన్ని నెరపింది. ఖిలపురాణమైన హరివంశంలో కూడ ఎర్రన కావ్యశయ్యను మూర్తికట్టించినాడు.

BRAOU

బసవపురాణంలోని భక్తిమార్గం, మార్కండేయ పురాణంలోని జ్ఞానమార్గం, పోతన భాగవత పురాణంలో సమ్మేళనం పొందాయి. భక్తి, పురాణ కవితలను పోతన భాగవతమే ప్రబల నిదర్శనం, పోతన భాగవతం ఆంధ్రుల ఏకైక మహాపురాణం. పోతన సమన్వయ దృక్పథం పురాణానికి సమగ్ర వ్యక్తిత్వాన్ని సంతరించి పెట్టింది.

క్రీ. శ. 13వ శతాబ్ది నుండి క్రీ. శ. 15వ శతాబ్దిదాక ఉన్న కాలంలో పురాణ సాహిత్యం ప్రచురణం ఈ యుగంలో వెలసిన పురాణ వాఙ్మయం సమకాలీన సాంఘిక, మత సాహిత్య ప్రయోజనాలను సాధించింది.

ప్రబంధ యుగంలో కూడ కొన్ని పురాణానువాదాలు వెలువడినాయి. హరిభట్టు (1475-1535) మత్స్య పురాణాన్ని, వరాహపురాణ పూర్వ భాగాన్ని, భాగవతంలోని షష్ఠ, ఏకాదశ, ద్వాదశ స్కంధాలను, నారసింహ పురాణోత్తర భాగాన్ని అనువదించినాడు. కామినేని మల్లారెడ్డి (1550 - 1610) రాసిన పద్మపురాణం, పింగళి సూరన రచితమైన గరుడ పురాణం (అలభ్యం) దోసూరి కోనేరు నాథుని (1547) బాలభాగవతం మొదలైనవి ప్రబంధ కావ్యాలైన ప్రబంధాలకే ఎక్కువ గౌరవం. ప్రాధాన్యం హెచ్చింది.

తుదకు పురాణం వంశచరిత్రలకు ఇతిహాసకథాకావ్యాలకు కూడ ప్రయుక్తమైంది. ఒక రాజవంశానికి, ఒకకులానికి, ఒకజాతికి పౌరాణిక సంబంధాన్ని కల్పించి, చేసిన రచనలు వంశకీర్తనలు. అవి అటు ప్రసిద్ధ పురాణాలు కావు. ఇటు చారిత్రక రచనలు కూడా కావు. లౌకికాలౌకిక సంబంధించిన కథాంశాలతో కూడిన రచనలు. రచనా విషయంలో కావ్య ప్రబంధ పద్ధతికన్నా, పురాణసరళే వీటిలో గోచరిస్తుంది. భద్రకవి లింగన (క్రీ. శ. 16వ శతాబ్ది) రచించిన దేవాంగపురాణం, ఎల్లకర నృసింహకవి (1580) రాసిన మార్కండేయ పురాణం, భాస్కరాచార్యుని వైశ్యపురాణం మొదలైనవి ద్విపద వంశకీర్తన రచనల్లో పేర్కొనదగినవి. పురాణగౌరవాన్ని ఆర్జించి, పురాణాఖ్యను ఉంచుకున్న పురాణాలివి.

### 18.2.2 కావ్యప్రబంధాలు

పురాణాల్లోని ఒక ప్రసిద్ధకథను గ్రహించి వివిధ వర్ణనాలంకారాలతో, పాత్ర చిత్రీకరణతో రసభావప్రధానంగా రచించడం కావ్యపద్ధతి. ఈ కావ్యపద్ధతియొక్క విశిష్టరూపమే తెలుగు సాహిత్యంలో ప్రబంధపద్ధతి అనిపించుకొన్నది.

స్థూలదృష్టికి కావ్యప్రబంధ శబ్దాలు రెండూ సమానార్థకాలే. ఆలంకారికులు, కవులు, వ్యాఖ్యాతలు ప్రబంధ శబ్దాన్ని "కావ్య సామాన్య వాచి" గానే ప్రయోగించినారు. నన్నెచోడుని కుమారసంభవం ప్రథమాంధ్ర మహాకావ్యం. తిక్కన తాను రచించిన 15 పర్వాల భారతాన్ని "ప్రబంధమండలి" అని పేర్కొన్నాడు. తిక్కన నిర్వచనోత్తర రామాయణం, భాస్కర రామాయణం, నాచన సోముని ఉత్తర హరివంశం, శ్రీనాథుని హరవిలాసం మొదలైనవి ఖండానువాద కావ్యాలు. శ్రీనాథయుగాన్ని కావ్యయుగమంటున్నారు. శృంగార నైషధం, పిల్లలమర్రి పినవీరభద్రుని శృంగార శాకుంతలం శృంగార ప్రధానాలైన కావ్యాలు. ఇట్లా ప్రాచీనాంధ్ర కవులందరూ ప్రబంధ పదాన్ని కావ్యపరంగానే ప్రయోగించినారు. తెలుగు సాహిత్య చరిత్రకారులు మాత్రం కావ్యప్రబంధ శబ్దాలకు అర్థభేదాన్ని కల్పించినారు. వారు శ్రీకృష్ణదేవరాయల యుగాన్ని ప్రత్యేకంగా ప్రబంధయుగమని పేర్కొన్నారు. "ప్రబంధమునకు ప్రకృష్టమైన కూర్పు అను విస్తృతమైన అర్థమున్నను పంకజాది శబ్దములు పద్మములందు రూఢమయినట్లే ప్రబంధ శబ్దము రాయలవారి యుగమున వెలసిన మనుచరిత్రాది గ్రంథములకే రూఢముగ ఉపయోగింపబడుచున్నది. ఈ కాలమున వెలసిన కావ్యములు దాదాపు గుణరూప విశేషములందు సమానములై ఒప్పుటచే ఈ కావ్యజాలము నంతటిని ప్రబంధశబ్దముచే వ్యవహరించినారు." (పి. యశోదారెడ్డి, ప్రబంధకవులు తెలుగువాణి, పుట - 174, ప్రపంచ తెలుగు మహాసభల ప్రత్యేక సంచిక, హైదరాబాదు, 1975). ప్రబంధం కూడా కావ్యమే అయినా ప్రబంధంలో వస్త్వైక్యం, ఏకనాయకాశ్రయం, రసాధిక్యత, నాటకీయత, అలంకారిక రచన, అష్టాదశ వర్ణనలు స్వతంత్ర రచన అనే కావ్యకళాధర్మాలకు ప్రాధాన్యముంటుంది. ప్రసిద్ధమైన కథను గ్రహించి కథావస్తు పోషణంలో స్వాతంత్ర్యం, రచనా విషయంలో కొంత ప్రాబంధికత ప్రధానంగా రచించిన వాటిని కావ్యప్రబంధాలని, పేర్కొనవచ్చు. ప్రాచీనాంధ్ర సాహిత్యంలోని గౌరవ హరిశ్చంద్రోపాఖ్యానం వంటి ద్విపద కావ్యాలు, కథాకావ్యాలు మొదలైనవాటి రచనా విధానంలో ప్రబంధ సామ్యాన్ని పొందినటువంటివి. పురాణ ప్రసిద్ధకథలను కొత్త కొత్త కల్పనలతో దేశిలక్షణాలతో రచించిన ద్విపద కావ్యాలు కూడ ఉన్నాయి. నాదెండ్ల గోపన (1520) కృష్ణార్జున సంవాదం, మాదయ కవి (16 శతాబ్ది ప్రారంభం) మైరావణ చరిత్ర మొదలైనవి ఈ జాతికి చెందినవి.

BRAOU

అల్లసాని పెద్దన మనుచరిత్రం, నంది తిమ్మన పారిజాతాపహరణం, కృష్ణదేవరాయల ఆముక్తమాల్యద, రామరాజ భూషణుని వసుచరిత్ర, పింగళి సూరన కళాపూర్ణోదయం, ప్రభావతీ ప్రద్యుమ్నం, కందుకూరి రుద్రకవి నిరంకుశోపాఖ్యానం, మాదయగారి మల్లన రాజశేఖర చరిత్రం, సంకుసాల నృసింహకవి కవికర్ణ రసాయనం, చింతలపూడి ఎల్లనార్యుని రాధామాధవీయం, విష్ణుమాయా నాటకం, ఎడపాటి ఎర్రన మల్హణచరిత్ర మొదలైనవి యథోచితాలైన వర్ణనాలంకారాలతో ప్రౌఢ శైలితో రచింపబడిన స్వతంత్ర రచనలు. వీటిని యదార్థ ప్రబంధాలుగా పరిగణిస్తున్నారు.

బసవపురాణం, పండితారాధ్య చరిత్ర, హరిశ్చంద్రోపాఖ్యానం, పరమయోగి విలాసం, కృష్ణార్జున సంవాదం, మొదలైన ప్రసిద్ధ ద్విపద కావ్యాలు ప్రౌఢంగా లేవని కావచ్చు. పెక్కు మంది ప్రబంధ కవులు వాటిని ప్రబంధీకరించి ఉన్నారు. ద్విపద కావ్యాలను పద్యకావ్యాలుగా పరివర్తనం చేసికొని ఉండడం తెలుగు సాహిత్యంలో ఒక విశిష్ట విధానాన్ని చాటుతున్నది.

### 18.2.3 క్షేత్ర మాహాత్మ్యం

తెలుగులో క్షేత్రమాహాత్మ్యాలు ఒక సాహిత్య ప్రక్రియగా పరిగణింపబడుతున్నవి. పురాణాలనే క్షేత్రమాహాత్మ్యాలంటారు. రసభావ నిర్భరమైన భక్తి, స్వభావోక్తి సుభగాలయిన ఆయా క్షేత్రాలకు సంబంధించిన వర్ణనలూ, ఆయా క్షేత్రాల్లో వెలసిన దైవతీర్థ మాహాత్మ్యాలు వాటికి సంబంధించిన ఉపాఖ్యానాలూ మొదలైనవి క్షేత్రమాహాత్మ్య గ్రంథాలలో విశిష్టంగా గోచరిస్తాయి. స్థలపురాణాలలో ఆయా కవులు భక్తి ప్రపత్తులూ, ఆత్మీయతా ప్రతిబింబితమై ఉంటాయి. క్షేత్రమాహాత్మ్య గ్రంథాలు చాలవరకు బ్రహ్మాండస్కాందాది పురాణాల నుండి పుట్టినాయి. ఇవి కేవలం పురాణాలు కావు. పురాణాలు కథ కోసం పుట్టినట్లుంటాయి. స్థలపురాణాలు కవి కోసం పుట్టినట్టుంటాయి. స్థలపురాణాలలోని ఉపాఖ్యానాలు కథాకథన చాతుర్యంలో శిల్ప వైవిధ్యంతో కథాశ్రవణ ప్రవణమైన జనాభిరుచిని పెంచడం వల్ల ఇవి ప్రబంధాలకన్న మిన్నయైన గౌరవాన్ని పొందినాయి.

ఎర్రన రాసిన నృసింహపురాణం క్షేత్రమాహాత్మ్య గ్రంథాలలో మొదట పేర్కొనదగింది. నృసింహపురాణం శ్రీనాథుని భీమేశ్వరపురాణ కాశీఖండాది పురాణ ఖండానువాదాలకు మార్గదర్శకమయింది. ఎర్రన శ్రీనాథులు ప్రబంధశైలితో నిర్మించిన స్థలపురాణాలే, భైరవకవి (1420 - 1475) శ్రీరంగ మహత్మ్యం ప్రోలుగంటి చిన్నశౌరి (15వ శతాబ్ది ఉత్తరార్థం) నృసింహపురాణం (కావ్యం), ధూర్జటి కాళహస్తి మాహాత్మ్యం, తెనాలి రామకృష్ణ కవి పాండురంగ మాహాత్మ్యం, ఘటికాచల మాహాత్మ్యం మొదలైన వాటికి మార్గదర్శక మయ్యాయి. చదలువాడ మల్లిన (1580) రాసిన రుక్మాంగద చరిత్ర ఏకాదశి వ్రతమాహాత్మ్య ప్రతిపాదకమైంది.

### 18.2.4 ద్వ్యర్థికావ్యాలు

ద్వ్యర్థికావ్యమంటే రెండర్థాలున్న కావ్యం. రెండు కథావస్తువులను జోడించి చెప్పడం ద్వ్యర్థికావ్య లక్షణం, రెండర్థాలే కాక మూడర్థాలు, నాలుగర్థాలు వచ్చేటట్లు నిర్మింపబడిన అనేకార్థక కావ్యాలు కూడ తెలుగులో ఉన్నాయి. ఈ నానార్థక కావ్యాలు ఒకే అర్థం లేదా ఒకే చరిత్రాన్ని ఉపయోగించే ఏకార్థక కావ్యాల కన్న భిన్నమైనవి. తెలుగులో అనేకార్థక కావ్యాలకు కూడ ద్వ్యర్థికావ్యాలనే పేరు రూఢమైంది.

క్రీ. శ. 6వ శతాబ్దిలోనే సంస్కృతంలో ద్వ్యర్థికావ్యరచన ప్రారంభమైనట్లు తెలుస్తున్నది. సంధ్యాకరనంది (క్రీ.శ.11వ శతాబ్ది) రామచరితం. కవిరాజసూరి (క్రీ.శ.1104) రాఘవపాండవీయం మొదలైనవి సంస్కృతంలో వెలసిన ప్రాచీన ద్వ్యర్థికావ్యాలు. సంస్కృతానికి ఛాయగా, అనుసరణగా గ్రంథరచన చేసిన తెలుగుకవులు కూడ ద్వ్యర్థికావ్యాలను రాసినారు.

తెలుగులో తొలి ద్వ్యర్థికావ్యం పింగళి సూరన రచించిన రాఘవ పాండవీయం. ఇందులో రాఘవచరితం, పాండవచరితం జోడుగా సాగాయి. ఇది కల్పనలకు, పాండిత్య ప్రకర్షకు ప్రాధాన్యమున్న ప్రబంధ యుగంలో పుట్టింది. పింగళి సూరన తరవాత ద్వ్యర్థికావ్యాలకు నాయకమణిగా ఉన్నాడు. పింగళి సూరన, రామరాజ భూషణుల ఒరవడిలో ద్వ్యర్థి కావ్యాలు చిత్రకావ్యాలుగా కూడ పరిగణింపబడుతున్నాయి. ఇవి ఉత్తమ కావ్యాల శ్రేణిలో చేరజాలవు వ్యంగార్థ వైభవంమీద దృష్టి నిల్పే అవకాశం వీటిలో ఉండదు. రసదృష్టి మృగ్యం. ఒకవేళ ఉన్నా కవికి దాన్ని పూర్తిగా నిరూపించే తలంపు గానీ, పట్టుదల గానీ ఉండదు. శ్రోతలనూ, పాఠకులనూ



BRAOU

ఆకర్షించేటట్లు రాయడం ఈ రకం కావ్యాల ప్రత్యేకత. భాషాదృష్టితో వీటిని ప్రౌఢమైనవని చెప్పవచ్చు కానీ కవిత్వదృష్టితో మాత్రం కాదు. కాబట్టే ద్వ్యర్థికావ్యాలను కొందరు సాహిత్య విమర్శకులు కృత్రిమ రచనలుగా పరిగణిస్తారు.

### 18.2.5 అచ్చ తెలుగు కావ్యాలు

తెలుగులో ద్వ్యర్థికావ్యాల లాగే అచ్చ తెలుగు కావ్యాలు కూడా చమత్కార రచనలే. పొన్నికంటి తెలగన (1520-1580) రాసిన యయాతి చరిత్ర అచ్చతెలుగు కావ్యాల్లో మొట్టమొదటిది. అది మహమ్మదీయ ప్రభువైన అమీన్‌ఖాన్‌కి అంకిత మీయబడినది. (ఈ కావ్యంలో ఒక భాగాన్ని మీరు రెండవ సంవత్సరం పాఠ్యాంశంగా చదువుకున్నారు కూడా). పొన్నికంటి తెలగన తరువాత పలువురు కవులు అచ్చ తెలుగు కావ్యాలను రచించి ఉన్నారు. వారిలో ప్రబంధయుగంలో ముఖ్యంగా పేర్కొన దగినవాడు మరింగంటి సింగరాచార్యులు (క్రీ.శ.16వ శతాబ్ది). చిలువ పడగ రాజేనికత, శుద్ధాంధ్ర నిరోష్ఠ్య సీతాకల్యాణం అనే రెండు అచ్చ తెలుగు కావ్యాలుకూడా కవుల భాషాపాండిత్య పాటవాలను ప్రకటిస్తాయి. తత్సమ బహుళమూ, దీర్ఘ సమాస భూయిష్టమూ అయిన కావ్యాలకన్న తెలుగు పలుకుబళ్ళతో కూడినవి అచ్చ తెలుగు కావ్యాలు.

### 18.2.6 కథాకావ్యాలు

మానవసమాజానికి ఎప్పుడు తన అంతరంగిక భావాలనూ, అనుభవాలనూ వ్యక్తీకరించుకొనే శక్తి కలిగిందో అప్పుడే కథలుకూడా పుట్టినాయి. మనసు నొవ్వకుండ బోధించటం, విసుగుదల కలుగకుండ ఉపదేశించడం, కర్తవ్యాలను ఉచితరీతిని ప్రవర్తింపజేయడం - ఈ పద్ధతిలో మొదట్లో కథలు చెప్పబడ్డా కాలక్రమాన నాగరకతతో పాటు అవి అన్ని రంగాల్లోను చోటుచేసుకున్నాయి.

ప్రాచీనాంధ్రవాఙ్మయంలో కేతన (1255) రాసిన దశకుమారచరిత్ర అద్భుత రసోపేతమైన మొదటి కథామంజూష. మంచన (1300) కేయూరబాహుచరిత్ర, జక్కన (1380-1400) విక్రమార్క చరిత్ర, అనంతామాత్యుని (1434) భోజరాజీయం, దూబగుంట నారాయణ (1470), దైచరాజ వేంకటనాథ (క్రీ.శ.16వ శతాబ్ది) భానయ (16వ శతాబ్ది) కవుల పంచతంత్ర నామక కావ్యాలు, కొరవి గోపరాజు (15వ శతాబ్ది), సింహాసన ద్వాత్రింశిక, కూచిరాజు ఎర్రన (1450 - 1500) సకలనీతి కథావిదానం, వెన్నెలకంటి అన్నయ (15వ శతాబ్ది) షోడశ కుమారచరిత్ర మొదలైనవి విశేష ప్రాచుర్యం పొందిన పద్యకథా కావ్యాలు. వీటిలో కొన్ని నీతిబోధకాలు, మరికొన్ని అద్భుతరస సమీకరణాలు. వీటి కన్నిటికీ సంస్కృతంలో ఆధారాలున్నాయి.

### 18.2.7 శాస్త్రవాఙ్మయం

తెలుగులోనికి కావ్యవాఙ్మయంలాగే శాస్త్రవాఙ్మయం కూడా సంస్కృతం నుండి ప్రవేశించిందే. తెలుగులోని శాస్త్రవాఙ్మయం కావ్యవాఙ్మయం లాగే గద్యపద్యాత్మకమైన చంపూరూపంలో వెలసింది. శాస్త్రవాఙ్మయంలో విషయబోధే ముఖ్యప్రయోజనం.

పావులూరి మల్లన (1100) రాసిన సారసంగ్రహ గణితం తెలుగులో మొట్టమొదటి శాస్త్రగ్రంథం. పావులూరి గణితం మహావీరాచార్యుని (క్రీ.శ. 9వ శతాబ్ది) సంస్కృత సారసంగ్రహ గణితానికి అనువాదం.

మల్లియ రేచన రాసిన కవిజనాశ్రయం తెలుగులో మొట్టమొదటి ఛందోలక్షణ గ్రంథం, అధర్వణుడు (12వ శతాబ్ది) రాసిన అధర్వణ ఛందస్సు (అలభ్యము) అనంతుని (1434) ఛందోదర్పణం, వెల్లంకి తాతంభట్టు (1480 - 1520) ఛందోదర్పణం, లింగమ గుంట తిమ్మన (1566) సులక్షణసారం, నైషదం తిమ్మమంత్రి (1550) లక్షణమంజరి మొదలైనవి మధ్యయుగం తొలిదశలో వెలసిన ఛందోలక్షణ గ్రంథాల్లో పేర్కొనదగినవి. విన్నకోట పెద్దన (1402) రాసిన కావ్యాలంకార చూడామణి, భట్టుమూర్తి రచించిన కావ్యాలంకార సంగ్రహం, అనంతుని రసాభరణం అలంకార శాస్త్ర గ్రంథాల్లో చెప్పుకోదగ్గవి, భైరవ కవి (15వ శతాబ్ది) కవిగజాంకుశం, చిత్రకవి పెద్దన (1550) లక్షణసార సంగ్రహం, ముద్దరాజు రామన (1580) కవిజన సంజీవని మొదలైన ఈ కాలంలో వెలువడిన లక్షణ గ్రంథాలు. బద్దెన (1261) నీతిశాస్త్ర ముక్తావళి రాజనీతి గ్రంథం. కేతన ఆంధ్రభాషా భూషణం తెలుగులో మొట్టమొదటి ధర్మశాస్త్రగ్రంథం. భైరవకవి రత్నశాస్త్రం రాసినాడు. అప్పనమంత్రి (1350) రాసిన చారుచర్య వైద్యనీతిగ్రంథం, దోనయామాత్యుని (1350) సస్యానందం వర్షశాస్త్ర గ్రంథం, రావిపాటి



BRAOU

త్రిపురాంతకుడు రాసిన మదనవిజయం (అలభ్యము), కూచిరాజు ఎర్రన (1450-1500) రచించిన కొక్కోకం కామశాస్త్రి గ్రంథాలు.

### 18.2.8 ద్విపదకావ్య వాఙ్మయం

ద్విపదకావ్యం దేశికవితా శాఖకు చెందినది. రెండు పాదాలున్న ద్విపదరచనలో ఎన్నివేల ద్విపదులైనా రాయవచ్చు. గ్రంథాశ్వాస విభాగాలున్నా ద్విపదకావ్యమంతా ఒకే ఛందస్సులో ఉంటుంది. పాల్కురికి సోమనాథుడు (1160-1240) వీరశైవ మతప్రచారం కోసం బసవపురాణం, పండితారాధ్య చరిత్రలు, ద్విపదలో రచించినాడు. బసవపురాణ పండితారాధ్య చరిత్రలు అనువాదాలుకావు. స్వతంత్ర రచనలు. వీటికి ద్రవిడ కర్ణాటక భాషల్లోనే కాక సంస్కృతంలో కూడా పరివర్తనాలు వెలువడ్డాయి. వాటివ్యాప్తి, గౌరవం దీనివల్ల నిరూపితమౌతుంది.

ద్విపద వాఙ్మయ పరిణామచరిత్రలో క్రీ.శ. 1160 నుండి క్రీ. శ. 1500 దాకా ఉన్న మధ్యకాలం మొదటి ఘట్టం. పాల్కురికి సోమనాథునితో ప్రారంభమయ్యే ఈ ఘట్టంలో వెలువడిన 24 ద్విపద కావ్యాలలో కోనబుద్ధారెడ్డి రాసిన రంగనాథరామాయణం, గౌరవ హరిశ్చంద్రోపాఖ్యానం వంటి ఏ రెండు మూడో తప్ప మిగిలినవన్నీ శైవమత ప్రబోధకాలు, శైవమహిమ ప్రతిపాదకాలయినవే. కోనబుద్ధారెడ్డి లాంటి ఒకరిద్దరు తప్ప తక్కిన ద్విపద కావ్యకర్తలంతా శైవులే. ద్విపద వాఙ్మయపరిణామ చరిత్రలో క్రీ. శ. 1500 - 1600 గల కాలాన్ని రెండవ ఘట్టమనవచ్చు. వైష్ణవులయిన తాళ్ళపాక కవులతో ప్రారంభమయ్యే ఈ ఘట్టంలో చాల వరకు విష్ణుభక్తి సంబంధాలైన ద్విపద కావ్యాలే వెలువడ్డాయి. తాళ్ళపాక అన్నమాచార్యులు "ప్రవిమల ద్విపద ప్రబంధరూపమున నవముగా" రామాయణాన్ని రచించాడట. (అన్నమాచార్యుని భార్య తిమ్మక్క తొలితెలుగు కవయిత్రి. ఆమె స్త్రీ) జనోపయుక్తంగా మంజీరద్విపదలో సుభద్రాకళ్యాణంరాసింది. అన్నమాచార్యుని మనుమడైన చిన్నన్న రాసినవన్నీ ద్విపదకావ్యాలే. అష్టమహిషీకల్యాణం, పరమయోగి విలాసం, ఉషాకల్యాణం, అన్నమాచార్య చరిత్ర. ఇవి చిన్నన్న ద్విపద కృతులు. ద్విపద లక్షణ విషయంలోనూ, మత విషయంలోనూ తాళ్ళపాక చిన్నన్న పాల్కురికి సోమనాథునికి భిన్నుడు. చిన్నన్న ప్రభావం క్రీ. శ. 16వ శతాబ్ద్యంతం దాక వెలసిన ద్విపద కావ్యాల్లో కన్పిస్తుంది.

తెలుగులో 245 పైగా ద్విపద కావ్యాలు వెలసినట్లు, కథా వస్తుత్వాన్ని రచనావిధానాన్ని, కావ్య ప్రయోజనాన్నిబట్టి వాటిలో వైవిధ్యం గోచరిస్తున్నట్లు డాక్టర్ జి. నాగయ్య తన "ద్విపద వాఙ్మయము" అనే పరిశోధన గ్రంథంలో చక్కగా నిరూపించి ఉన్నాడు. ద్విపద వాఙ్మయంలో బసవపురాణాది శైవపురాణాలు, రామాయణ భారత భాగవతాది పురాణకలు, దేవాంగ పురాణ, మార్కండేయ పురాణాది వంశకీర్తనలు, హరిశ్చంద్రోపాఖ్యానం (గౌరన విరచితము) కృష్ణార్జున సంవాదం వంటి కావ్యప్రబంధాలు, అష్టమహిషీ కల్యాణం, ఉషా కళ్యాణం లాంటి కళ్యాణాత్మకాలు శ్రీరంగ మహాత్మ్యాది క్షేత్రమాహాత్మ్యాలు, రుక్మాంగద చరిత్ర వంటి వ్రత మాహాత్మ్యాలు, పరమయోగి విలాసం వంటి భక్తి ప్రబోధకాలు, స్వరశాస్త్రిం, దీక్షాబోధల వంటి తాత్వికాలు, సిద్ధేశ్వర చరిత్రం, పల్నాటి వీరచరిత్ర లాంటి చారిత్రకాలు, చిత్రాభ్యాసాలు ఎన్నో ఉన్నాయి. వీటి మూలంగా ద్విపద కావ్య ప్రక్రియా తత్త్వం, వైశిష్ట్యం తెలుసుకోవచ్చు.

### 18.2.9 శతకాలు

శతకాలు సంస్కృత ప్రాకృత కన్నడాది భాషలలో వెలువడినప్పటికీ తెలుగులో వాటికి ప్రత్యేకమైన స్థానముంది. విస్తారమైన ప్రచారముంది. తెలుగులో సహస్రాధికంగా శతకాలు వెలువడ్డాయి. సంస్కృత ప్రాకృతాది శతకాల్లో లేని సంఖ్యాస్రాధికంగా శతకాలు వెలువడ్డాయి. సంస్కృత ప్రాకృతాది శతకాల్లో లేని సంఖ్యానియమం, మకుట నియమం, ఛందోనియమం, రసనియమం, ఆత్మాశ్రయ కవితాధర్మం అనే లక్షణాలు తెలుగు శతకాలలో రూపుదిద్దుకొన్నాయి. తెలుగు శతకాలలో సామాన్యంగా నూటికి బదులు నూట ఎనిమిది పద్యాలుంటాయి. పంచరత్నాలు, నవరత్నాలు, తారావళులు మొదలైనవి నూటికి తక్కువగా ఉన్న శతకాలనవచ్చు. సంస్కృత ప్రాకృత భాషలలో త్రిశతులు, పంచశతులు, సప్తశతులు, సహస్రాలు కూడ ఉన్నాయి. ప్రాచీనాంధ్ర సాహిత్యంలో భక్తిశతకాలు, నీతిశతకాలు ఎక్కువగా వెలువడ్డాయి. క్రీ. శ. 16వ శతాబ్దంలో ప్రబంధాల ప్రభావం వల్ల శృంగార శతకాలను కొందరు రచించినారు.

BRAOU

తెలుగులో శతక కవిత్వానికి మల్లికార్జున పండితారాధ్యుడు (1160) రాసిన శివతత్త్వసారాన్ని తొలి ఉదాహరణగా పేర్కొంటారు. కాని శతకానికి ఉండదగిన మకుట నియమం కానీ సంఖ్యానియమం కానీ ఇందులో లేదు. శివతత్త్వసారంలో 489 కంద పద్యాలున్నాయి. అందు "శివా, అజా, రుద్రా, మహేశా" అనే సంభోధనలతో కూడిన కందపద్యాలున్నాయి. 191 పద్యాలకు మకుటాలే కన్పించవు. లభించిన శతక ప్రాయమైన రచనలలో శివతత్త్వసారమే మొదటిది. పాల్కురికి సోమనాథుని శతన వాఙ్మయబ్రహ్మగా చెప్పవచ్చు. వృషాధిప శతకంలో "బసవా బసవా బసవా వృషాధిపా" అనే మకుటముంటుంది. బసవనామ కీర్తనంలో సోమనాథుని హృదయం భక్తి పరవశమై ఆవేశపూరితమై ఉప్పొంగిపోతుంది. వృషాధిప శతకంలో సోమనాథుని భక్త్యావేశం, కవితాధార, బహు భాషా పాండిత్యం గోచరిస్తాయి. పాల్కురికి సోమనాథుడు 'చెన్నమల్లు సీసములు' అనేపేర 22 సీస పద్యాలను శతకరీతిలోనే రచించాడు. సోమనాథుడు మూడువందల పద్యాలలో రాసిన చతుర్వేద సారాన్ని బసవలింగ శతకం అని పేర్కొనవచ్చు. యథావాక్కుల అన్నమయ్య (1243) రచించిన సర్వేశ్వర శతకం కూడ శివభక్తిని ప్రతిపాదించే శతకమే. ఇందులో 142 మత్తేభ శార్దూల వృత్తాలున్నాయి. శైవభక్తి శతకాలలో ధూర్జటి రాసిన కాళహస్తీశ్వర శతకం అగ్రగణ్యమైంది. నిర్వ్యాజభక్తి, ఆత్మ విమర్శనం, ధారాశుద్ధి, భావనాశక్తి. లోకానుభవం అనే గుణాలు కాళహస్తీశ్వర శతకానికి విశిష్టతను చేకూర్చినాయి.

పోతన నారాయణ శతకం, అయ్యలరాజు తిప్పయ్య ఒంటిమిట్ట రఘువీర శతకం, వెన్నెలకంటి జన్నమంత్రి (1372) దేవకీనందన శతకం మొదలైనవి వైష్ణవశక్తి శతకాల్లో పేర్కొనదగినవి.

పూర్వ గ్రంథాలనూ, లోకానుభవాన్నీ ఆధారంగా చేసుకొని, సమాజజీవితాన్ని పురస్కరించుకొని నీతి శతకాలు రచింపబడినాయి. బద్దెన (క్రీ.శ. 13వ శతాబ్ది) రాసినాడని ప్రతీతి ఉన్న సుమతి శతకం నీతిశతకాల్లో అగ్ర గణ్యమైంది. సుమతి శతకంలో రాజనీతి, గృహనీతి, సర్వజన సుబోధకంగా సమయోచితంగా చెప్పబడ్డాయి. భాస్కరశతకం కూడా సుమతి శతకంలాగే విశేష ప్రచారాన్ని పొందింది. దీన్ని మారన వెంకయ్య రాసినాడని చెప్పబడి ఉంటుంది. తాళ్ళపాక పెదతిరుమలయ్య రాసిన వేంకటేశ్వర శతకం భక్తి ప్రధానమే అయినా ప్రసక్తాను ప్రసక్తంగా లౌకికనీతులు రాజనీతి వివరింపబడ్డాయి. శరభాంకలింగ శతకంలో శివభక్తుల ప్రశంసలతోపాటు నీతులుకూడ కన్పిస్తాయి. తాళ్లపాక అన్నమాచార్యుని వేంకటేశ్వర శతకం మధురభక్తి ప్రధానమైంది. తెలుగులో 18, 19 శతాబ్దాల్లో శతకాలకు విశేష ప్రచారం సిద్ధించింది.

### 18.2.10 ఉదాహరణాలు

ఉదాహరణం అనే ఈ ప్రక్రియ తెలుగులో మొదట వెలువడింది. ఆ తరువాత సంస్కృత సాహిత్యంలోనికి కొనిపోబడింది. మార్గ దేశి కవితా సమ్మేళనం పొందిన సాహిత్య ప్రక్రియ ఇది. ఇందులో అక్షర గణబద్ధమైన వృత్త రచనా, మాత్రాగణబద్ధమైన పద్యరచనా ఉంటాయి. ఎనిమిది విభక్తులతో ఎనిమిది వృత్తాలూ, ఎనిమిది కళికలూ, ఎనిమిది ఉత్కళికలూ, చివర సార్వ విభక్తిక పద్యమూ కూర్చి రచింపబడిన స్తోత్రరూపమైన లఘుకృతి 'ఉదాహరణం'. పాల్కురికి సోమనాథుడు మొదట తెలుగులోను, ఆ తరువాత సంస్కృతంలోను బసవోదా హరణాన్ని రాసినాడు. పాల్కురికి సోమనాథుని సంస్కృతాంధ్ర బసవోదాహరణాలు రెండూ ఆయా భాషల్లో ప్రాథమికమైనవి. కాబట్టి ఉదాహరణ రచనకు సోమనాథుడే మార్గదర్శకుడు. ఉదాహరణ కావ్యంలో 25 లేదా 26 పద్యాలుంటాయి. కవికృత నామాంకిత పద్యమనేది ఐచ్ఛికం. ఉదాహరణలోని 26 పద్యాల సంఖ్య సదాశివుని షడ్వింశతి తత్త్వాలకు ద్యోతకం ఉదాహరణ కేవల స్తుతి రూపకమైంది. అందులోని పద్యాలు రాగ ప్రధానాలు కళోత్కళికలు తాళాంగ ప్రధానాలైన రగడ భేదాలు. తెలుగు ఉదాహరణాలవల్ల ప్రాచీనాంధ్ర భాషా విశేషాలనూ, ఛందో విభక్తి సంప్రదాయాలనూ తెలుసుకోవచ్చు.

రావిపాటి త్రిపురాంతకవి (1380) త్రిపురాంతకోదాహరణం, తాళ్ళపాక పెద తిరుమలాచార్యుని (1493 -1553) వేంకటేశ్వరోదాహరణం మొదలైనవి ప్రసిద్ధమైన ఉదాహరణాలు.

### 18.2.11 రగడలు

రగడ అనేది ఒక సాహిత్య ప్రక్రియ. లభించిన రగడలలో పాల్కురికి సోమనాథుని బసవ రగడ మొట్ట మొదటిది. ద్విపదలాగే రగడ కూడ ద్విపాద నియమం కలది. రగడకు అది ప్రాసతోపాటు అంత్య ప్రాస కూడా విశేషంగా ఉంటుంది. బసవ రగడలో 108 పాదాలున్నాయి. ప్రారంభంలో ఉత్సాహవృత్తముంటుంది. ప్రతి



BRAOU

పాదాంతంలో కూడా "శరణు బసవ" అనే మకుటముంటుంది. మామూలు రగడ లక్షణానికి కొంత వైలక్ష్యం ఇందులో గోచరిస్తుంది. బసవ రగడ బసవ స్తుతి పూర్వకమైన లఘురచన, పాల్కురికి సోమనాథుడు గంగోత్పత్తి రగడ, సద్గురు రగడలను కూడ రాసినట్లు పిడుపర్తి సోమన పద్య బసవ పురాణావతారికలో చెప్పినాడు. కాని ఇవి ఏవీ ఇప్పుడు లభించవు. చక్రపాణి రంగన నయన రగడ, నమశ్శివాయ రగడలను రాసినాడు. నయన రగడలో 342 పాదాలున్నాయి. దీనికే శివభక్తి దీపిక అని పేరు. ఇందులో ప్రతిపాదం చివర 'కంటి' అనే మాట ఉంది. నమశ్శివాయ రగడ 108 పాదాల కృతి. దీనిలో ప్రతి పాదం చివర 'నమశ్శివాయ' అని ఉంది. తాళ్ళపాక పెద తిరుమలాచార్యులు సుదర్శన రగడను రచించినాడు.

### 18.2.12 యక్షగానాలు

యక్షగానం తెలుగుతనముట్టిపడే స్వతంత్రమైన ప్రధానమైన సాహిత్య ప్రక్రియ. ఇది తమిళ కన్నడాది సాహిత్యంలోనికి కొనిపోబడింది. యక్షగానం గాన ప్రధానమైంది. ప్రదర్శనంలో నృత్త నృత్యాత్మకమైంది. రూప కోపయుక్తమైన రచనగా పరిణమించింది. యక్షపాత్ర వేషధారణంతో కావించిన గాన ప్రధాన వినోద ప్రక్రియే యక్షగానం.

ఇప్పటికి లభించినంత వరకు తెలుగులో యక్షగానమనే పదాన్ని ప్రయోగించిన వారిలో ప్రథముడు శ్రీనాథుడు. అతడు భీమేశ్వర పురాణంలో "కీర్తింతురెడ్డాని కీర్తి గంధర్వులు గాంధర్వమున యక్షగాన సరణి" అని పేర్కొన్నాడు. దీన్నిబట్టి యక్షగానం గాన రూపస్తోత్ర పాఠమని చెప్పవచ్చు. క్రీడాభిరామంలో "జక్కుల పురంధ్రి పాట"తో పాటు మాలెతలు ఏకవీరను గురించి పాటలు పాడడం, బవనీలు పరశురాముని గురించిన పాటలు పాడడం, ఒక పద్ధతి పల్నాటి వీరకథను పాడడం అనేవి కూడా వర్ణితమయ్యాయి. ఈ గానరూప కథాఖ్యానాలు యక్షగాన చరిత్రలోని మొదటిదశకు చెందుతాయి.

ప్రోలుగంటి చెన్నశౌరి (1485-1509) "లాలిత నవ రసాలంకృతముగ" 'సౌభ్య చరిత' మనే "జక్కుల కథ"ను చెప్పినట్లు హరిభట్టు ఉత్తర నారసింహ పురాణావతారికలో పేర్కొన్నాడు. ఈ సౌభ్యచరిత్ర నేడు లభించ లేదు. సౌభ్య చరిత్రమనే జక్కుల కథను యక్షగానమని భావిస్తే యక్షగాన రచన తెలుగులో క్రీ.శ. 1500 ప్రాంతాలలోనే వ్యాప్తినొందిదని చెప్పవచ్చు. వెల్లంకి తాతంభట్టు (1500) కవిలోక చింతామణిలో ఉదాహరించిన లక్ష్మీ కళ్యాణం యక్షగానమై ఉంటుందని డా. ఎస్వీ జోగారావు ఆంధ్ర యక్షగాన వాఙ్మయ చరిత్ర (ప్రథమ భాగం పుట 107) లో భావించినాడు. ఈ లక్ష్మీకళ్యాణం కూడ లభించలేదు.

లభ్యమైన యక్షగానాలో కందుకూరి రుద్రకవి (క్రీ.శ. 16వ శతాబ్ది) రాసిన సుగ్రీవ విజయమే మొట్ట మొదటిది. చక్రపురి రాఘవాచార్యుల కృతి ఊహింపదగిన విప్రనారాయణ చరిత్ర అనే యక్షగానం సుగ్రీవ విజయం కన్న ప్రాచీనమైనదని డా. జోగారావు ఊహించినారు. కాని కందుకూరి రుద్రకవి సుగ్రీవ విజయానికే బహుళవ్యాప్తి ఉంది. సుగ్రీవ విజయంలో తాళ ప్రభేద విశిష్టమైన రగడ బంధాలే (రేకులు) కాక ద్విపదలూ, అర్ధ చంద్రికలూ, ఏలలూ, ధవళ శోభనాలూ, కొన్ని పద్యాలూ, సంధి వచన ప్రాయాలైన చిన్న చిన్న వచనాలూ కన్పిస్తాయి. సంవాదం పద్య, ద్విపద, గేయాలలో జరిగింది. సంభాషణలు ఎక్కువగా దరువుల్లోనే సాగాయి. సుగ్రీవ విజయం జనార్దనదేవుని వసంతోత్సవ సమయంలో మొదట ప్రదర్శింపబడిందని తెలుస్తున్నది. కొండ్ర వెంకటాద్రి వాసంతికా ప్రణయం, బాలపాపాంబ అక్కమహాదేవి చరిత్ర మొదలైనవి క్రీ.శ. 1600 ప్రాంతంలో రచింపబడిన యక్షగానాల్లో ప్రధానంగా పేర్కొనదగినవి. వీటిలో సుగ్రీవ విజయంలోని రచనా ప్రక్రియ గోచరిస్తున్నది. యక్షగానాలకు దక్షిణదేశ వాఙ్మయంలో ముఖ్యంగా తంజావూరు సంస్థానంలో ప్రాముఖ్యం కలిగింది. తెలుగుభాషలో అయిదువందలకు పైగా యక్షగానాలు లభిస్తున్నాయి. వీటిలో దేశీయాలైన పదాలెన్నో చోటుచేసుకొన్నాయి. బహుముఖ వైవిధ్యం, వైశిష్ట్యం కల్గిన తెలుగు సాహిత్య ప్రక్రియ యక్షగానం.

### 18.2.13 గద్యవచనరచనలు

ఆధునికులు గద్యానికీ వచనానికి భేదాన్ని పాటించడం లేదు. కాని ప్రాచీనుల దృక్పథంలో గద్యం వచన స్థితికి మధ్యలో ఉండే ప్రక్రియ. ఛందోవిరహితమై శ్రుతిలయాన్వితమై ఆలంకారికరీతి భావప్రాధాన్యమున్న వచనాన్ని గద్య అనవచ్చు. సంస్కృతాలాంకారికులు గద్యాన్ని వృత్తగంధి, చూర్ణిక, ఉత్కలికాప్రాయం అని మూడు విధాలుగా విభజించినారు. తెలుగులో గద్య, బిరుదుగద్య, చూర్ణిక, వచనం, విన్నపం అనే వచనరచనా భేదాలు ఏర్పడినవి. ఇవి అన్నీ నియతమైన గణబంధం లేని వచన రచనలే.

వచనాన్ని గద్య అనవచ్చు. సంస్కృతాలంకారికులు గద్యాన్ని వృత్తగంధి, చూర్ణిక, ఉత్కలికాప్రాయం అని మూడు విధాలుగా విభజించినారు. తెలుగులో గద్య, బిరుదుగద్య, చూర్ణిక, వచనం, విన్నపం అనే వచనరచనా భేదాలు ఏర్పడినవి. ఇవి అన్నీ నియతమైన గణబంధం లేని వచన రచనలే.

గద్యం కన్న పద్యమే ఎక్కువ రాణిస్తుందని కాబోలు ప్రాచీనాంధ్రకవులు వచనానికి ప్రత్యేక స్థానమీయ లేదు. అయినా తెలుగు శాసనాల్లో, చంపూకావ్యాల్లో వచన రచన, వాఙ్మయ ప్రథానాచార్యుడు కృష్ణమాచార్యుని విన్నపాలకు సింహగిరి నరహరి వచనాలకు పేరు. వీటిననుసరించి తాళ్ళపాక పెదతిరుమలాచార్యుడు వేంకటేశ్వర వచనాలు అనే గద్యరూప సంకీర్తనలను రాసినాడు. ఇవి వైరాగ్య వచనమాలికా గీతాలు. భవానీమనోహర వచనాలు. గంగాధరయ్య (1600) వచనాలు మొదలైనవి శైవభక్తి ప్రతిపాదకమైన వచన రచనలు.

చారిత్రకాలైన వచన గ్రంథాల్లో మొదట పేర్కొనదగినది. ఏకామ్రనాథుని (16వ శతాబ్ది చివరి భాగం) ప్రతాపచరితం. కాసేసర్వప్ప రాసిన సిద్ధేశ్వరచరిత్ర ద్విపద కావ్యంలో కూడా కావ్యాంతరంలో వచనైన భాగముంది. విశ్వనాథనాయకుని స్థానాపతిచే రచింపబడిన రాయవాచకం (16వ శతాబ్ది ఉత్తరార్థం) కూడా చారిత్రక వచన కావ్యాల్లో ప్రసిద్ధమైనది. స్త్రీ జనోపయుక్తంగా రచింపబడిన భారత సావిత్రి, వేదాంత వ్యవహార సారాన్ని తెలిపే వచన రచనలు కొన్ని క్రీ.శ. 16వ శతాబ్దిలో వెలువడినవి. అయితే క్రీ.శ. 18వ శతాబ్దిలోనే తెలుగులో వచన రచనకు ప్రాముఖ్యమేర్పడినది. ఆ తరువాతనే వచన వాఙ్మయం బహుశాఖలుగా వెల్లివిరిసింది

**18.2.14 ఇతర ప్రక్రియలు**

మధ్యయుగం తొలిదశలో తెలుగులో పైన పేర్కొన్న వివిధ సాహిత్య శాఖలే కాక దండకం, సంకీర్తనం మొదలైన ప్రక్రియలుకూడ వెలువడినవి. తెలుగు కావ్యాల్లోని స్తుత్యాదుల్లోని దండకాలే కాక ప్రత్యేక కావ్యాలుగా కూడ కొందరు దండకాలను రాసినారు. పోతన భోగినీ దండకం లభ్యమైన మొదటి దండకం. తాళ్ళపాక అన్నమాచార్యుడు తెలుగులో తొలిసారిగా సంకీర్తన రచనకు శ్రీకారం చుట్టి, యోగవైరాగ్య శృంగార మార్గాల్లో ముప్పయి రెండు వేల సంకీర్తనలను రచించినాడు. అన్నమాచార్యుడు "పదకవితా పితామహుడు"గా "సంకీర్తనా చార్యుడు" గా ప్రసిద్ధికెక్కినాడు.

ఈ విధంగా మధ్యయుగం తొలిదశలోని తెలుగు సాహిత్యం బహుముఖాలుగా వెల్లివిరిసింది. ఈదశలో వెలసిన తెలుగు సాహిత్యానికి ఉత్తరోత్తర అభివృద్ధి చేకూరింది.

BRAOU

## అవగాహన ప్రశ్న

మధ్యకాలీన దశ I లోని సాహిత్య ప్రక్రియలను 10 పంక్తుల్లో పరిచయం చేయండి.

## 18.3 సారాంశం

ఈ భాగంలో ఈ కింది విషయాలను మీరు తెలుసుకున్నారు.

- మధ్యకాలీనదశ I (క్రీ.శ. 1000-1600) లోని మార్గదేశి కవితా పద్ధతులు.
- వీటిలో మార్గ కవిత్వానికి చెందినవి - ఇతిహాసాలూ, పురాణాలూ, కావ్య ప్రబంధాలూ, క్షేత్ర మహాత్మ్యకావ్యాలూ, ద్వ్యర్థికావ్యాలూ, అచ్చతెనుగు కావ్యాలూ, కథా కావ్యాలూ, శాస్త్ర వాఙ్మయం, వంటివి.
- దేశికవితా పద్ధతికి పునస్కారకంగా ఈదశలో ద్విపదకావ్యాలూ, శతకాలూ, ఉదాహరణలూ, రగడలూ, యక్షగానాలూ వంటివి తెలుగు సాహిత్యంలో వచ్చాయి.
- మార్గదేశి విభాగాలకు పై ప్రక్రియలు ఒక స్థూల నిర్ణయం. ఏకామ్రనాథుని ప్రతాప చరిత్రం, కాసుసర్వప్ప సిద్దేశ్వరచరిత్రం ద్విపదకావ్యంలోని చివరిభాగమూ, విశ్వనాథనాయకుని రాయ వాచకము వంటి చారిత్రక గద్య కావ్యాల్లో, శ్రుతిలయాన్వితమై, ఆలంకారికమైన వచన రచనల్లో, ఛందో నియమంలేకపోయినా, మార్గపద్ధతికి చెందిన చంపూ కావ్యాల్లోని గద్యంతో పోలికలు ఉన్నాయి. సింహగిరి, వేంకటేశ్వర, భవానీమనోహర, గంగాధరయ్య వచనాలూ ఈ దశలో వచ్చాయి. ఇవి ఈ భాంలో గద్యవచన రచనల కింద వివేచన పొందాయి.
- ఈ దశలోని ఇతర ప్రక్రియల్లో దండకం, సంకీర్తన వంటివి కూడా ఉన్నాయి.

### అవగాహన ప్రశ్నకు జవాబు

BRAOU

మధ్యకాలీన దశ - I లో తెలుగు సాహిత్యంలో సాగిన ప్రక్రియలు మార్గదేశికవితా ప్రక్రియలు. గద్య పద్యాత్మకమైన చంపూప్రక్రియల్లో, మార్గపద్ధతిలో వెలసిన మొట్టమొదటి రచన నన్నయ భారతం. అప్పటినుండి ఇతిహాసాలూ పురాణాలూ, కావ్య ప్రబంధాలూ, క్షేత్ర మహాత్మ్య కావ్యాలు, ద్వ్యర్థికావ్యాలు, అచ్చతెనుగు కావ్యాలు, కథా కావ్యాలు, శాస్త్ర వాఙ్మయం మార్గ పద్ధతిలోనే కొనసాగాయి. ద్విపద కావ్యాలు, శతకాలు, ఉదాహరణలు, రగడలు, యక్షగానాలు, గద్యవచన రచనల్లో కొన్ని, తదితరాలూ దేశికవిత్వ పద్ధతిలో వచ్చిన ప్రక్రియలు. మొత్తంమీద మధ్యకాలీన కవిత్వం మార్గ పద్ధతిలోనూ, దేశిపద్ధతి ఐనా సాంప్రదాయిక కావ్యపద్ధతిలోనే ఎక్కువగా వెలువడ్డాయి.

### మాదిరి పరీక్షా ప్రశ్నలు

I. కింది ప్రశ్నలకు 30 వాక్యాలు మించకుండా జవాబులు రాయండి.

1. మధ్యయుగం తొలిదశలో దేశికవితకుగల ప్రాధాన్యాన్ని వివరించండి.
2. క్రీ.శ. 1000 - క్రీ.శ. 1600 మధ్యకాలంలోని మార్గదేశి పద్ధతులకు చెందిన కవితాశాఖలను సంగ్రహంగా పరిచయం చేయండి.

II. కింది ప్రశ్నలకు 10 వాక్యాలు మించకుండా సమాధానాలు రాయండి.

1. మధ్యయుగం తొలిదశలోని భారత రామాయణాలు
2. మధ్యయుగం తొలిదశలోని కావ్యప్రబంధాలు

3. మధ్యయుగం తొలిదశలోని అచ్చతెలుగు కావ్యాలు
4. మధ్యయుగం తొలిదశలోని శాస్త్రవాఙ్మయం
5. మధ్యయుగం తొలిదశలోని ద్విపదవాఙ్మయం
6. మధ్యయుగం తొలిదశలోని శతకాలు
7. మధ్యయుగం తొలిదశలోని వచనవాఙ్మయం

BRAOU

BRAOU

# భాగం 19–తెలుగు సాహిత్యం–మధ్యకాలీన దశ II (క్రీ.శ.1600–1800)

## విషయ క్రమం


19.0 లక్ష్యాలు

19.1 పరిచయం

19.2 వివిధ కవులూ, రచనలూ

19.3 సాహిత్య ధోరణులు

- 19.3.1 కావ్య రచనలు
- 19.3.2 యక్షగానాలు
- 19.3.3 ద్విపదలు
- 19.3.4 వచన రచనలు
- 19.3.5 తిట్టు కవులు
- 19.3.6 నిరసన కవులు
- 19.3.7 పదకవితలు
- 19.3.8 కట్టలు తెగిన శృంగారం

**అవగాహన ప్రశ్న**

19.4 సారాంశం

అవగాహన ప్రశ్నకు జవాబు

చదవదగిన పుస్తకాలు

మాదిరి పరీక్షా ప్రశ్నలు


## 19.0 లక్ష్యాలు

క్రీ.శ.1600–1800 మధ్యకాలంలోని వివిధ సాహిత్య ధోరణులను ఈ భాగం ద్వారా మీరు విశ్లేషించ గలుగుతారు. పాతప్రక్రియల క్షీణ్యం, కొత్త ప్రక్రియల ఆవిర్భావం వెనుకగల కారణాలను సైతం పసిగట్ట గలుగుతారు.

BRAOU

## 19.1 పరిచయం

ఈ భాగంలో మధ్యయుగంలోని మలిదశగా దాదాపు రెండు శతాబ్దాల కాలంలోని తెలుగు సాహిత్య చరిత్రను గురించి స్థూలంగా, వివిధ సాహిత్య ధోరణులు, వాటి పోకడలను గురించి కొంత వివరంగా తెలుసుకొంటారు.

1600–1800 మధ్య కాలంలో ఎందరో రాజులు అనేక ప్రాంతాల్లో ఆంధ్ర సాహిత్య పోషణ చేశారు. రాజులూ, రాజ్యాల సరిహద్దులూ మారినప్పుడల్లా ఆ ప్రభావం కవుల రచనల పైన ఏదో రకంగా పడడం తప్పని సరి కొత్త ప్రక్రియలు పుట్టటానికైనా, పాత ప్రక్రియలు క్షీణించటానికైనా సమకాలీన పరిస్థితులు కొంత కారణమవుతాయి. ఆ కారణాలు ఆ కాలపు సాహిత్యావగాహనకు చక్కగా తోడ్పడతాయి.

ఈ యుగంలో తంజవూరు, మధుర, చెంజి రాజ్యాల్లో జరిగిన వాఙ్మయ పోషణే కాక 19వ శతాబ్దం చివరి దాకా ఆయా సంస్థానాలలో, సుబాల్లో, నాడుల్లో జరిగిన సాహిత్య సేవ కూడా ప్రదర్శితమవుతుంది. రాజాస్థానాలతో ప్రమేయం లేని ప్రజాకవులను గురించి తెలుసుకోవచ్చు. ఈ యుగంలో వందలాది మంది కవులు ఉన్నా దాదాపు యాభైమంది ప్రముఖ కవుల రచనల గురించి కాలక్రమంలోనే కాక ప్రక్రియలపైన ప్రత్యేక దృష్టితో పరిశీలన జరిగింది. దీనివల్ల యుగస్వభావం సుబోధకమవుతుంది.

## 19.2 వివిధ కవులూ, రచనలూ

ఒకటిన్నర శతాబ్దానికి పైగా నడచిన తంజావూరు పరిపాలనలో శతాధికంగానే గ్రంథాలు వెలువడ్డాయి. మధ్యయుగం మలిదశలో మరెవ్వరి పోషణలో కూడా ఇంతటి సాహిత్యసేవ జరగలేదు. ఒక్క రఘునాథ నాయకుడే పదికిపైగా రచనలు చేశాడు. పేర్లు తెలుస్తున్న వాటిలో 'అచ్యుతాభ్యుదయం, గజేంద్రమోక్షం' అనే ద్విపద కావ్యాలు; 'జానకీ పరిణయం', 'రుక్మిణీ కృష్ణ వివాహం' అనే యక్షగానాలు కాలగర్భంలో కలిసి పోయాయి. 'రఘునాథ రామాయణం'లో బాలకాండలో కొంత భాగం మాత్రమే లభ్యమౌతున్నది. 'నల చరిత్ర' మనే ద్విపద కావ్యమూ 'వాల్మీకి చరిత్ర' ప్రబంధమూ లభిస్తున్నాయి. రఘునాథుడు 'పారిజాతాపహరణ ప్రబంధాన్ని' ఆశువుగా చెప్పాడట. ఈ కవిరాజు 'భారత కథా సంగ్రహమ్, రామాయణ కథా సారమ్, సంగీత సుధ' అనే సంస్కృత రచనలు కూడా చేశాడు. రఘునాథుడు చతుర్విధ కవిత్వాలలో దిట్ట. చిన్న వయస్సులోనే పారిజాతాపహరణాన్ని ఆశువుగా చెప్పి తండ్రి అచ్యుతప్ప నాయకుడి చేత కనకాభిషేకం చేయించుకున్నాడు. స్వయంగా కవే కవులకు అతని మెప్పుపొందడం సాధ్యం అయ్యేదికాదని ఈ పద్యం వల్ల తెలుస్తున్నది.

నేరుతునని మాటాడగ
వారిజభవు నంత వాని వశమా తంజా
వూరి రఘునాథ నాయని
గారెరుగగ కుందవరపు కవి చౌడప్పా

రఘునాథుని సాహిత్య పోషణ అనగానే వెంటనే స్ఫురించేవాడు చేమకూర వేంకటకవి. దక్షిణాంధ్రయుగం, క్షీణయుగం అనే పండితుల తీర్పుకు చేమకూర 'విజయ విలాసం' అపవాదంగా నిలుస్తుంది. ఇతడు రఘునాథుని కొలువులో ఉండేవాడు. కొలువులో చేరక ముందు ప్రోత్సాహము లేక కాబోలు "ఏగతి రచియించి రేని సమకాలము వారలు మెచ్చరే కదా" అని వాపోయాడు. రఘునాథుని మీద ఈయనకు "ఇంతింత అనరాని వత్సలత్వం" ఉండేది. ప్రతి పద్యంలో చమత్కృతి ఉండేటట్టు రచిస్తాడని రఘునాథుడు చేమకూర మెచ్చు కున్నాడు :

"ప్రతి పద్యము నందు జమ
త్కృతతి గలుగం జెప్పనేర్తు వెల్లెడ బెళుకె
కృతి వింటి మపారముగా
క్షితిలో నీమార్గమెవరికిన్ రాదు సుమీ" (విజ. పీఠిక, 50)

ఈతడు 'సారంగధర చరిత్రం, విజయ విలాసం" అనే రెండు కావ్యాలు రచించాడు. యక్షగానాలకు ప్రాబల్యం చేకూరుతున్న రఘునాథుని ఆస్థానంలో పాండిత్య ప్రకర్షతో "నైషధ పారిజాతీయం" అనే ద్వ్యర్థికావ్యం (ప్రతి పద్యంలోనూ రెండర్థాలు వచ్చే కావ్యం) రచించినవాడు కృష్ణాధ్వరి. ఇది రఘునాథునికే అంకితం. ఇది కాక ఈ కవి మరో ఐదు సంస్కృత కావ్యాలు రచించినట్టు తెలుస్తున్నది. రఘునాథుని ఆస్థానంలో మధురవాణి, రామ భద్రాంబ అనే కవయిత్రులు కూడ ఉండేవారు. మధురవాణి రఘునాథుని తెనుగు రామాయణాన్ని సంస్కృతీక రించిందట. రామభద్రాంబ "రఘునాథ నాయకాభ్యుదయం" అనే కావ్యాన్ని సంస్కృతంలో రచించింది. ఇది చరిత్రకారులకు పనికి వచ్చే గ్రంథం. ఈమె చెంగల్వకాళ కవి శిష్యురాలు. కవి చౌడప్ప, క్షేత్రయ్యలు రఘునాథుని ఆస్థానం సందర్శించి ఉంటారని ప్రతీతి.

విజయరాఘవుడు 1633లో పట్టాభిషిక్తుడై దాదాపు నలభైయేళ్ళు తంజావూరును పరిపాలించాడు. వాసిని బట్టే కాక రాశిని బట్టి కూడా ఇతని కాలంలో జరిగిన సారస్వత వ్యాసంగం ఎన్న తగ్గది. ఇతడొక్కడే 40 దాకా గ్రంథాలు రచించాడని తెలుస్తున్నది. వాటిలో చౌపదాలు దండకం, వచనాలు, గేయాలు, పాటలు, విడి పదాలు, వేడికోలు విన్నపాలు" మొదలైన కొత్త ప్రక్రియలుండేవి. అయితే విజయ రాఘవుని 40 రచనల్లో 7 మాత్రమే లభిస్తున్నాయి. అందులో ఆరు నాటకాలు, ఒకటి ద్విపద కావ్యం. 1. కాళియ మర్దనం, 2. కృష్ణ విలాసం, 3. విప్రనారాయణ, 4. రఘునాథాభ్యుదయం, 5. పూతన హరణం, 6. ప్రహ్లాద చరిత్ర, 7. రఘునాథ నాయాకాభ్యుదయం. చెంగల్వ కాళయ్య, కామరసు వేంకటపతి సోమయాజి, పురుషోత్తమ దీక్షితులు, కోనేటి దీక్షితుల వంటి విద్వత్కవులూ, కృష్ణాజీ, రంగాజమ్మ వంటి కవయిత్రులూ విజయ రాఘవుని సాహిత్య పోషణలో ఉండేవారు. కాళ కవి 'రాజగోపాల విలాసం' అనే కావ్యం రచించాడు. వేంకటపతి "విజయ రాఘవు చంద్రికా



BRAOU

విహారా"న్ని పదాలుగా రచించాడు. ఇవి క్షేత్రయ్య పదాల వంటివి. "తంజావూరు అన్నదాన మహానాటకం" అనే ప్రహసనం రచించినవాడు పురుషోత్తమ దీక్షితులు. ఇది తెలుగులో ప్రహసనంగా పేరు కెక్కింది. రంగాజమ్మ 1662లో రచించిన "మన్నారు దాస విలాసం" కూడా తొలి తెలుగు నాటకంగా ప్రసిద్ధికెక్కింది. ఈమె ఉషా పరిణయం అనే మరో నాటకం రచించింది. విజయరాఘవుని కొడుకు మన్నారు దేవుడు గద్దెనెక్కి పాలించ కున్నా సాహిత్య రచనలు చేశాడు. సాహిత్య పోషణలో పాల్గొన్నాడు. తంజావూరులో నాయక రాజుల పాలన ముగియడానికి మూడేళ్ళకు ముందు (1670) మన్నారు దేవుడు "హేమాబ్జనాయికా స్వయంవరం" అనే నాటకం రచించాడు. కృష్ణాజీ రచనలు అలభ్యాలు.

మహారాష్ట్రీలు తంజావూరును దాదాపు తొమ్మిది దశాబ్దాలు పాలించారు. ఇది నాయక రాజుల కంటె ఎక్కువ కాలమే (73 యేండ్లు). శాహాజీ గద్దెనెక్కే దాకా తంజావూరులో సాహిత్య పోషణ జరిగినట్టు లేదు. శాహాజీ 20 దాకా తెలుగు గ్రంథాలు రచించాడు. వాటిలో 4 ప్రబంధాలు, 16 నాటకాలు, నాటకాలలో కల్యాణాలు ఎక్కువ (ద్రౌపదీ కళ్యాణం, రతీ కళ్యాణం మొదలైనవి) 'సతీ దాన విలాసం, సతీదాన శూరం' వంటివి ప్రసిద్ధి కెక్కినవి. పంచరత్న ప్రబంధం, త్యాగ వినోద ప్రబంధం, విష్ణు పల్లకీ సేవా ప్రబంధం, శంకర పల్లకీ సేవా ప్రబంధాలు కూడా పేర్కొన దగ్గవే. శాహాజీ కొలువులో వాసుదేవ కవి, నివర్తి శేషా చలం, దర్భా గిరిరాజు, బాల కవి సుబ్బన్న మొదలైన కవులుండేవారు. వాసుదేవకవి 'పార్వతీ పరిణయం' అనే యక్షగానం రచించాడు. శేషాచలం ఆంధ్ర భాషకు సంస్కృతంలో వ్యాకరణం రచించాడు. 'ఆంధ్ర శబ్దాను శాసనం' అని దాని పేరు ఇతనికి ఆంధ్రపాణిని అనే బిరుదు ఉండేది. శేషాచలం 'శాహరాజ విలాసం' అనే నాటకం 'సరస్వతీ కల్యాణం' అనే కృతిని రచించాడు. గిరిరాజు సుబ్బన్నలు కూడా అనేక యక్షగానాలు రచించారు. తుక్కోజీ 'శివ కామ సుందరీ పరిణయం' అనే తెలుగు కావ్యన్నీ, 'సంగీత సారామృతం' అనే సంస్కృత కృతినీ రచించాడు. ఇమ్మడి ఏకోజీ 'రాజ రంజన విద్యావిలాసం' పేర శృంగార పదాలు రాశాడు. 'విఘ్నేశ్వర పరిణయం' అనే నాటకం కూడా రచించాడు. తంజావూరు మహారాష్ట్ర పాలనలో వెలసిన ప్రసిద్ధ కవయిత్రి ముద్దుపళని. ఈమె ప్రతాప సింహుని భోగపత్ని, ఈమె రచించిన 'రాధికా సాంత్వనం' ప్రసిద్ధికెక్కిన శృంగార కావ్యం.

BRAOU

1529లో మధుర రాజ్యస్థాపన జరిగినా ఒక శతాబ్దంపాటు సాహిత్య పోషణ జరిగినట్టులేదు. ముద్దు అళగిరి, విజయరంగ చొక్కనాథులే రచయితలుగా, కవిపోషకులుగా పేరు తెచ్చుకున్నారు. మధురలో ప్రసిద్ధి చెందిన కవులు నల్గురైదుగురి కంటె మించరు. గణపవరపు వేంకటకవి, లింగన మఖి తిరుకామయ్య, సముఖం వేంకట కృష్ణప్పనాయకుడు, శేషం వేంకటపతి మొదలైనవారు. మొదటి ఇద్దరిని ముద్దళగిరి పోషించాడు. వేంకట కవి 'ప్రబంధరాజ వేంకటేశ్వర విజయ విలాస కావ్యాన్ని' "ఆంధ్రకౌముది" అనే వ్యాకరణాన్ని రచించాడు. "వేంక టేశాంధ్రం" అనే నిఘంటువును కూడా రచించాడు. బహుశా ఇది తొలి తెలుగు నిఘంటు రచన. తిరుకామయ్య "సత్యభామా సాంత్వనం" అనే కావ్య రచన చేశాడు. చొక్కనాథుని కొలువులో ఉన్న సముఖంకవి "అలమూల్య సంక్రందనం", "రాధికాసాంత్వనం" అనే పద్య కావ్యాలతో పాటు "జైమనీ భారతం, సారంగధర చరిత్ర"లను వచనంగా రచించడం ప్రత్యేకంగా చెప్పుకోదగిన విషయం. సముఖంకవి వేంకటపతికి సమకాలికుడు. వేంకటపతి "శశాంక విజయం" అనే కావ్యాన్ని రచించాడు.

చెంజిలో బాల శయన వేంకటకవి సంస్కృతంలో "విభుదానంద ప్రబంధం" అనే చంపూ కావ్యం కొశాడు. క్షేత్రయ్య తుపాకుల కృష్ణప్ప మీదనే పదాలు చెప్పాడని ప్రతీతి. "కువలయాశ్వ చరిత్ర" రాసిన నవరం చిన నారాయణ నాయకునికి చెంజితో సంబంధమున్నదని పండితులు ఊహిస్తున్నారు. చెంజి చివరి రాజైన వరదప్ప నాయకుని ఆస్థానంలో తిరువెంగళ కవి ఉండేవాడు. ఆయన రచనలేవో తెలియదు. ఇతని శిష్యుడు వేంకటా చలపతి 'చంపూ రామాయణం' రాశాడు.

కంకంటి పాపరాజు బమ్మెర పోతనంత ఆవేశంతో కవిత్వం చెప్పిన కవి. ఈయన 1610 ప్రాంతంలో నెల్లూరు జిల్లా గూడురు తాలూకా దుగరాజ పట్నంలో ఉండేవాడు. అప్పటికి డచ్చివారు వ్యాపారం కోసం మన దేశం వస్తున్నారు. పాపగిరి తిమ్మనకు మిత్రుడు. ఈయన గణితశాస్త్ర రత్నాకరుడనని చెప్పుకున్నాడు. పాప రాజు 'విష్ణు మాయా విలాసం' అనే యక్షగానం రచించాడు. ఉత్తర రామాయణానికి ఈయన చేసిన అనువాదం ఎంతో వన్నె కెక్కింది. కొన్ని ఘట్టాలలో వాల్మీకి కన్న మిన్నగా రచించాడని మెచ్చుకున్న వాళ్ళున్నారు. పుష్పగిరి తిమ్మనకు మరో సహాధ్యాయి టేకుమళ్ళ రంగశాయి. ఈయన 'జానకీ పరిణయం' అనే యక్షగానంతో పాటు భాగవతాన్ని ద్విపదగా చేశాడు. ఇవేకాక 'వాణీవిలాసవనమాలిక' అనే విజ్ఞాన సర్వస్వం వంటి గ్రంథం

రాశాడు. కంకంటి పాపరాజు తమ్ముడు కంకంటి నరసింహరాజు 'ద్విపద విష్ణు మాయా నాటకం' రచించాడు. 1660 ప్రాంతానికి చెందిన కట్టా వరదరాజు శ్రీరామాయణాన్ని ద్విపదగా రచించాడు. ఇతని సంతతి వారు నెల్లూరును పాలించారు. ద్విపద రామాయణమే కాక వరదరాజు 'పరమ భాగవత చరిత్ర' అనే ప్రబంధం, 'శ్రీరంగమహాత్మయ్యం' అనే పద్య కావ్యం రచించాడు.

1690 ప్రాంతాల్లో రామరాజీయం అనే చారిత్రక గ్రంథాన్ని అందుగుల వెంకయ్య అనే కవి రాశాడు. ఆరవీటి బుక్కరాయల వంశంలోని కోదండ రామరాజు ఇతని పోషకుడు. ఇతడు అళియరామరాయల మనుమడి మనుమడు. రామరాజీయం చరిత్రకారులకు చాలా ఉపయోగపడే గ్రంథం. కోదండరామరాజు కుమారుడు చిన వేంకటరాజు కూడ కవి పోషకుడే. కుమార ధూర్జటి అనే కవిచేత 'కృష్ణరాయ విజయాన్ని' చెప్పించాడు. ఇతడు మొదటి ధూర్జటికి మనుమడై ఉంటాడు. 'కృష్ణరాయ విజయా'న్ని 'రాయవాచకాని'కి పద్యరూపమైన మార్పుగా పరిశోధకులు గుర్తించారు. కుమార ధూర్జటి 'ఇందుమతీ పరిణయం, సావిత్రీ చరిత్ర' అనే కావ్యాలు కూడా రచించాడు. 1627లో నూజివీడును పాలిస్తూ ఉండిన మేకావీర నరసప్పారావు కూడా కుమార ధూర్జటిని ఆదరించాడు. 'ఇందుమతీ పరిణయం' ఇతనికే అంకితం. కుమార ధూర్జటి కొడుకు లింగరాజు. ఇతన్ని కాళహస్తి రాజులు ఆదరించారు. దామెర్ల వేంకటపతిరాయని పోషణలో లింగరాజు 'పెద కాళహస్తి మహాత్మ్యం' అనే పద్య కావ్యం రచించాడు. లింగరాజు కుమారుడు ధూర్జటి వేంకటపతి కూడా 'రత్నావళీ పరిణయం' అనే ప్రౌఢకావ్య రచన చేశాడు. ఈ పరిణాయాన్ని చేకూరి రామస్వామి అనే మంత్రికి అంకితం ఇచ్చారు. వేంకటపతి దండకాలు, శతకాలు కూడా రచించాడు.

గోదావరి మండలంలోని పెద్దాపురం సంస్థాన ప్రభువుల పోషణలో కూడా కొన్ని రచనలు వెలువడ్డాయి. పెద్దాపురం రాజులు అప్పటికి స్వతంత్రులైన నాయకరాజులకు రాయ సింహాసనాలకు అణకువగా ఉండేవాడు. గోలకొండ సుల్తానులతో మైత్రి నెరపే వారు. సంస్థానాన్ని సంపాదించిన తిమ్మరాజు సాహిత్యాన్ని పోషించాడు. ఈయన పోషణలో విశ్వనాథం అనేకవి 'శ్రీరామ విజయం" అనే యక్షగానం, 'గౌరీ వివాహం' అనే ద్విపద కావ్యం రచించాడు. ఇతడు చిత్ర కవితలో కూడా దిట్ట. "హరిశ్చంద్ర చరిత్ర" అనే నిరోష్ఠ్య ప్రబంధం (ప ఫ బ భ మ వ – అనే అక్షరాలు లేకుండా రాసిన కావ్యం) రాశాడు. సంస్కృతంలో 'పారిజాతాపహరణం' రచించాడు. విశ్వనాథం మేనల్లుడు ఏనుగు లక్ష్మణకవి కూడ 'రాజశేఖర చరిత్ర, తుల్యానదీ మహత్మ్యం, ద్రౌపదీ పరిణయం ధ్రువ చరిత్ర' అనే గ్రంథాలు రచించాడు. ఇతని మనుమడే భర్తృహరి సుభాషితాల తెనిగింపుతో ప్రసిద్ధికెక్కిన ఏనుగు లక్ష్మణ కవి. 17వ శతాబ్దం చివరి పాదం దాకా పెద్దాపురంలో సాహిత్య పోషణ జరుగుతూనే ఉన్నది.

ఇప్పటి మహబూబ్‌నగర్ ప్రాంతాన్ని పూర్వ చరికొండ సీమ అనేవారు. చరి కొండసీమలోని కాకునూరి అగ్రహారానికి చెందినవారే అప్పకవి పూర్వులు. అప్పకవి పల్నాటి తాలూకాలోని కామెపల్లిలో మేనమామల ఇంట పెరిగాడు. శ్రీశైలం ప్రాంతానికి భోగి విభూషణుడు అనే అధికారి ఉండేవాడు. అప్పకవి ఇతనికి పట్టపుకవి అయినాడు. అప్పకవి నన్నయ కృతమనే 'ఆంధ్ర శబ్ద చింతామణి' ని తెనిగించి ప్రసిద్ధి కెక్కాడు. అయితే 1656కు పూర్వమే 'అంబికా వాదం' అనే యక్షగానంతో పాటు 'కవికల్పకం' అనే లక్షణ గ్రంథాన్ని కూడ అప్పకవి రచించాడు. ఇప్పటికీ అప్పకవీయాన్ని మించిన ప్రాచీన తెలుగు లక్షణ గ్రంథం లేదు.

కూచిమంచి తిమ్మకవి కూచిమంచి జగ్గకవి, తురగా రామకవి, ఏనుగు లక్ష్మణ కవి వంటి ప్రసిద్ధ కవులను ప్రసాదించిన స్థానం పిఠాపురం. పెద్దాపురం, కాకినాడ, పిఠాపురం, తుని ప్రాంతాలు కలిసి ప్రోలునాడుగా ఏర్పడ్డాయి. తిమ్మకవి 15 కావ్యాలు రచించాడు. వాటిలో 9 పద్య కావ్యాలు, ఒక లక్షణ గ్రంథం, ఒక ద్విపద కావ్యం, ఒక దండకం మూడు శతకాలు ఉన్నాయి. తెలుగు రామాయణాన్ని అచ్చ తెనుగులో రచించడం విశేషం. 'సకల లక్షణ సార సంగ్రహం' రచించడం వల్ల తిమ్మకవికి 'అభినవ వాగను శాసనుడ'నే బిరుదు వచ్చింది. తిమ్మకవి 'కుక్కుటేశ్వర శతకం, రసికజన మనోభిరామం' కూడ ప్రసిద్ధికెక్కాయి. కూచిమంచి తిమ్మకవి రెండో తమ్ముడు జగ్గన్న. జగ్గకవి ప్రలోనాటనే కాక కళింగసీమలో కూడా తన కవిత్వాన్ని ప్రదర్శించాడు. ఇతడు పెద్దాపురాన్ని పాలించిన ముమ్మడి తిమ్మరాజుకాలంలో (1714-1734) 'జానకి పనిణయం' అనే ప్రబంధాన్నీ, 'రాధాకృష్ణ చరిత్ర' అనే ద్విపద కావ్యాన్నీ రచించాడు. 'భక్త మందార శతకం' కూడా రాశాడు. జగ్గకవి తిట్టుకవిగా పేరు పొందాడు. 'చంద్రరేఖా విలాసం' రాసిన చేతితోనే 'చంద్ర రేఖా విలాపం' అనే తిట్టు కావ్యం రాశాడు. కూచిమంచి వారి సమకాలికుడే తురగా రామకవి. ఇతడు కూడ తిట్టుకవిగా పేరు పొందాడు. ఈయన 1714 నుండి 1734 దాకా పెద్దాపురం పాలించిన తిమ్మరాజును తిట్టాడు. రామకవి రచనలు కొన్ని చాటు పద్యాలుగానే లభిస్తున్నాయి.

ఏనుగు లక్ష్మణకవిగా పేరు పొందిన చినలచ్చన్న'రామేశ్వర మహాత్మ్యం, జాహ్నవీ మహాత్మ్యం, రామ విలాసం, విశ్వామిత్ర చరిత్ర' అనే కావ్యాలు రచించినా భర్తృహరి సుభాషితాలకు అనువాదమైన 'సుభాషిత రత్నావళి' మూలంగానే 'కవీశ్వరుడు' అనే బిరుదు పొందాడు. అంతకు ముందు భర్తృహరి సుభాషితాలను ఎనిమిది మంది అనువదించి ఉన్నా లక్ష్మణకవి రచనకు వచ్చిన ప్రశస్తి దేనికీ రాలేదు.

కళువె వీరరాజు 1679 ప్రాంతంలో చిక్క దేవరాజు వద్ద దళవాయిగా ఉండేవాడు. ఇతడు వ్యాస భారతాన్ని వచనంలో రచించాడు. ఆది సభా పర్వాలు లభిస్తున్నాయి. వీర రాజు శిరాసుబాకు చెందినవాడు. అనంతపురం, బళ్ళారి జిల్లాలూ, కోలారు మైసూరు ప్రాంతాలూ శిరాసుబాగా ఏర్పడ్డాయి. వీరరాజు కొన్ని గ్రంథాలు కూడా రచించాడు.

కలింగసీమను గజపతులు పాలించేకాలంలో చెప్పుకోతగిన కవి అడిదంసూర. సూరన 1720 ప్రాంతంలో జన్మించాడు. ఇతనిని శృంగవరపుకోట దివాను పాణుగుపాటి వేంకటరామదాసు ఆదరించాడు. సూరన 'కవిజనరంజనం' అనే కావ్యం, 'కవి సంశయం విచ్ఛేదం' అనే లక్షణ గ్రంథం రాశాడు. 'చంద్రాలోకాన్ని' తెనిగించాడు. 'ఆంధ్ర నామ శేషాన్ని' కూడ సూరన రచించాడు. 'శ్రీరామకథ'ను దండకంలో చెప్పాడు. సూరన 'రామలింగేశ్వర శతకం' చాలా ప్రసిద్ధికెక్కింది. ఇవికాక అడిదం కవి అనేక చాటు పద్యాలు రచించాడు. తిట్టుకవిగా కూడ పేరు తెచ్చుకొన్నాడు.

1710 ప్రాంతంలో వరంగల్లు సీమలో కవిత్వం చెప్పిన ప్రసిద్ధకవి పరశురామ పంతుల లింగమూర్తి. మొదట్లో 'రతీమన్మథ విలాసం' అనే కావ్యం రాసినా 'సీతారామాంజనేయ సంవాద' మనే యోగ శాస్త్రం వల్లనే ఆయన ప్రఖ్యాతుడయినాడు. పై రచనలే కాక లింగమూర్తి 'జీవన్ముక్తి ప్రకరణం, నారద బ్రహ్మ సంవాదం, సాంఖ్య యోగం, తారక యోగం, మానసశతకం, సీతపాట, ఆత్మరామ శతకం, గోవిద శతకం' అనే రచనలు చేశాడు.

ఈ విధంగా రాజులు ఆదరణతో సాహిత్యం వర్ధిల్లుతున్నప్పుడు రాజాస్థానాలతో సంబంధమూ ప్రమేయమూ లేని కవులు కొందరు బయలు దేరారు. వీరు సామాన్య ప్రజలకు అర్థమయ్యే తేలికైన భాషలో ప్రజలు సమస్యలే వస్తువులుగా పద్యాలో, పాటలో రచించి ఊరూరు తిరిగి ప్రచారం చేశారు. అటువంటి బహుళ సంఖ్యాక కవుల్లో వేమన, వీరబ్రహ్మం శిఖర ప్రాయులు.

వేమన జీవిత విశేషాల గురించి విన్నది గాకా తెలిసింది తక్కువ. ఇవాలిటి వరకు తెలిసింది కచ్చితమైన నిర్ణయాలకు చాలదు. రేపటికిగాని స్పష్టంగా చెప్పుకోలేము. పండితుల వాదాలన్నీ క్రోడీకరించుకుంటే వేమన 17వ శతాబ్దంలో (1650 ప్రాంతం) రాయలసీమ ప్రాంతంలో జీవించాడు. దాదాపు మూడు వేల పద్యాలు చెప్పాడని ప్రతీతి.

పోతులూరి వీరబ్రహ్మం దాదాపు వేమన కాలానికి చెందినవాడు. కర్ణాటక ప్రాంతంలో జన్మించి కర్నూలు జిల్లా బనగానపల్లె మొదలుగా గల అనే ప్రాంతాల్లో పర్యటించి కడప జిల్లా బద్వేలు తాలూకాలోని కందిమల్లాయ పల్లెలో జీవసమాధి పొందాడు. వీరబ్రహ్మం 'కాల జ్ఞాన' రచయితగానే ప్రసిద్ధికెక్కాడు గానీ ఈయన అనేక రచనలు చేశాడు. తత్త్వాలు, ద్విపదవచన కాలజ్ఞానాలు, గోవింద పదాలు, హంస కాళికాంబ శతకం, జీవైక్య బోధ, వీరకాళికాంబ పద్యాలు, సిద్ధబోధ, సౌజన్య పత్రికలు మొదలైనవి లభిస్తున్నాయి.

## 19.3.0 సాహిత్య ధోరణులు

ప్రబంధయుగం అనంతరం వచ్చిన తంజావూరు నాయకరాజుల కాలాన్ని సాహిత్య చరిత్రకారులు "క్షీణ యుగం" గా అభివర్ణించారు. దాదాపు నాయకరాజుల కాలంలోని రచనల వంటివే ఇతర ప్రాంతాల్లో 29వ శతాబ్దం చివరిదాకా వెలువడ్డాయి. వేమన, వీర బ్రహ్మం, త్యాగయ్య వంటివారిని అపహరిస్తే అన్ని తెలుగు ప్రాంతాల సాహిత్య ధోరణులూ ఒకే రకమైన కాలధర్మానికి అనుగుణంగా ఉన్నట్టు తోస్తుంది. తంజావూరు కాలంలో గాని లేక మొత్తం ఈ రెండు శతాబ్దాల్లో గానీ సర్వతోముఖంగా సాగిన సాహిత్య వికాసాన్ని పరిశీలిస్తే క్షీణయుగం అని .నిరాశపడనక్కరలేదు. అయితే అప్పటి సాహిత్యంలో నైతిక దృష్టితో చూస్తే కొన్ని క్షీణధోరణులుగా తోచక మానవు. వాటిని గూర్చి భాగం చివర తెలుసుకొంటారు.

సాహిత్యాన్ని ఆదరించి పోషించడంలో తంజావూరు, తదితర రాజులు విజయనగర రాజులకు ఏ మాత్రం తీసిపోరు. రవ్వంత పెద్దపీట వీరికే వెయ్యవలసి ఉంటుందేమో!



BRAOU

"మాటల నేర్పులా, సరస మార్గములా, కొలువు రీతులా, పాటలగంతులా, కళల భాగ్యములా, బహుదాన లీలా నాటక శాలలా ..." అంటూ,

"సమస్త విద్యలు కసడెల్లి బాసి మెరపై వెంబెట్టి సభాంతరంబులన్" అని చేమకూర కవి చెప్పిన మాటలు చరిత్రకు కూడా నిలుస్తాయి.

విజయనగరంలో లాగా కేవలం ప్రబంధరచన కాకుండా ప్రక్రియా వైవిధ్యం మధ్యయుగం మలిదశ ప్రధాన లక్షణం. ఊర్ధ్వముఖంగా సాగే పాండిత్య రచనలతో పాటు ముందు ముందు సామాన్యుల కందుబాటులోకి రాగల దేశీ ప్రక్రియల్ని చేపట్టడం, స్వయంగా రాజులు కూడా ఆ పద్ధతిలో రచనలు చెయ్యడం కనిపిస్తుంది. భారత, భాగవత, రామాయణాలు మూడూ ఈ యుగంలోనే ద్విపద కావ్యాలుగా రూపొందాయి. భాగవతం వచన రూపం పొందింది. యక్షగానాలు, నాటకాలు పదాలు మొదలైన దేశి రచనలు ఇబ్బడిముబ్బడిగా వెలువడ్డాయి. ఒకవైపు జాతివార్తా చమత్కారాలతో రసవంతాలైన కావ్యాలు వెలువడుతుంటే మరోపక్క పాండిత్య ప్రకర్షను ప్రదర్శిస్తూ చిత్రబంధ గర్భ కవిత్వాలు, లక్షణ గ్రంథాలు వెలిశాయి.

**19.3.1 కావ్య రచనలు**

ఈ యుగంలో కావ్యాలు లేదా ప్రబంధాలు కూడా చెప్పుకోదగిన సంఖ్యలో వచ్చాయి. వాసి కూడా తక్కువది కాదు. ఉత్తమ కవిత్వానికి ఉండ వలసిన లక్షణాల పట్ల స్పృహ కూడా కనిపిస్తుంది. రఘునాథుడు 'కవిత్వంలో కేవలం యతిప్రాసలు కలిస్తే చాలదు; రసవంతంగా ఉండాలి' అని చెప్పాడు.

'యతియు బ్రాసంబు దప్పని యంత మాత్ర
మునకె తన్ను ను దా మెచ్చుకొనెడి వాని
బాటి సేతురే! రస పరిపాటి దేట
మాటల గవిత్వము ఘటించు మేటి కవులు" (వాల్మీకి చరిత్ర)

కవిత్వాన్ని గురించి రఘునాథుడు చెప్పిన మరో పద్యం కూడా ఉదాహరింపదగినది.

'చెప్పవలె గప్పురంబులు
కుప్పలుగా బోసినట్లు కుంకుమ పైపై
గప్పిన క్రియ విరి పొట్లము
విప్పిన గతి ఘుమ్మనం గవిత్వము పలుకన్

పై లక్షణాలు రఘునాథుని కావ్యాలకు కూడా కొంతవరకు వర్తిస్తాయి.

కవిత్వం రాసి రఘునాథుని మెప్పించడం అంత సులభం కాదని చేమకూర వేంకటకవి రాశాడు :

'తారసపుష్టమై ప్రతిపదంబున జాతియు వార్తయున్ జమ
త్కారము నర్థగౌరవము గల్గననేక కృతుల్ ప్రసన్నగం
భీరగతిన్ రచించి మహిమించినచో నిక శక్తు లెవ్వర
య్యా! రఘునాథభూప రసికా గ్రణికిన్ జెవిసోక చెప్పగాన్ (విజ. పీఠిక, ప. 31)

రసపుష్టితో పాటు ప్రతిపాదంలో జాతి, వార్త, చమత్కారం ఉండాలని అర్థం. జాతి అంటే నవ్వించే గుణమనీ, వార్త అంటే సామెత అనీ, చమత్కారం అంటే నేర్పు (చేమకూర దృష్టిలో శ్లేష చమత్కారం) అనీ అర్థాలు చెప్పుకోవచ్చు. 'విజయ విలాసం' లో వాడిన సామెతలు కోకొల్లలు విరుపులతేడాతో శ్లేషను సాధించే విద్య చేమకూర సొత్తు.

'అపుడు నృపుడు ప్రపుల్ల నవాంబుజ ప్ర
సన్న ముఖుడయి 'మలయధ్వజ క్షితీశ
కమలహితునకు మామకాగమన వార్త
దెలుపుమనుచు విశారదు బిలిచి పనిచె.' (విజ. 1. 152)

దీనిలో మామక +ఆగమనవార్త అనీ, మామ + కాగ + మన + వార్త అనీ విరుపుల భేదం వల్ల చమత్కారం సిద్ధిస్తుంది.

జాతివార్తా చమత్కారాలను మెచ్చుకునే రఘునాథుని ఆస్థానంలో శ్లేషకావ్యాలు కూడా రావటం విశేషం. కృష్ణాధ్వరి 'నైషధ పారిజాతం' అనే శ్లేష (ద్వ్యర్థి) కావ్యం రాశాడు. అంతకుముందే ఎలకూచి బాలసరస్వతి 'రాఘవ యాదవ పాండవీయం" అనే మూడర్థాల శ్లేష కావ్యం (త్ర్యర్థి) రచించాడు. విశ్వనాథం "హరిశ్చంద్ర చరిత్ర" అనే నిరోష్ఠ్య ప్రబంధం రచించాడు. చతుర్విధ కవిత్వాలు చెప్పేవారు కూడా ఈ యుగంలో రాణించారు.

ఎలకూచి బాలసరస్వతి ఆరుభాషల్లో పాండిత్యాన్ని ప్రదర్శిస్తూ 'షడ్భాషావివరణం' రచించాడు. శేకుమళ్ళ రంగశాయి విజ్ఞాన సర్వస్వం వంటి 'వాణీవిలాస వన మాలిక'ను రచించాడు. ఈ యుగంలో వ్యాకరణ గ్రంథాలకు లోటు లేదు. బాలసరస్వతి ఆంధ్రశబ్ద చింతామణికి వ్యాఖ్యానం రాశాడు. 'ఆంధ్రకౌముది' అనే వ్యాకరణాన్ని గణపవరపు వేకంటకవి వేశాడు. 'కవిసంశయ విచ్ఛేదం' అనే పేరుతో అడిదం సూరకవి కూడా వ్యాకరణం రచించాడు. గణపవరపు వేకంటకవే 'వేంకటేశాంధ్రం' అనే నిఘంటు రచన చేశాడు. పండితులు దీనిని తెలుగులో తొలినిఘంతువుగా భావిస్తున్నారు. కూచిమంచి తిమ్మయ్య 'అచ్చతెనుగు రామాయణా'న్ని రచించడం విశేషం. పరశురామ పంతుల లింగమూర్తి 'సీతారామాంజనేయ సంవాదము' అనే యోగశాస్త్ర రచనను కూడ ఈ యుగ ప్రత్యేకతగా భావించవచ్చు. ఈ విషయంపైన రామమూర్తి మరికొన్ని రచనలు చేశాడు.

### 19.3.2 యక్షగానాలు

సంఖ్యా బాహుళ్యంతో చూసినా ఈ కాలంలో వెలువడినన్ని యక్షగానాలు ఎప్పుడూ రాలేదు. నాయక రాజుల కాలంలో యక్షగానాన్ని నాటకం అని వ్యవహరించేవారు. పాత్ర సంభాషణలు పెంచి నాటక రీతిలో నడిపించడం వల్ల ఆ వాడుక వచ్చి ఉంటుంది. వీటి ప్రదర్శనకు తంజావూరు రాజులు నాటకశాలలు కూడా నిర్మించారు. సంగీత ప్రాధాన్యంగల నాటకమే యక్షగానం. నాటక లక్షణమైన సంభాషణలు, ప్రబంధ లక్షణమైన వర్ణనలు యక్షగానాల్లో ఉంటాయి. రఘునాథరాయలు రెండు యక్షగానాలు రచించాడు గాని అవి ఇప్పుడు లభించవు. లభిస్తున్న విజయ రాఘవుని ఏడు రచనలలో క్రీడ అయిన 'కాళీయ మర్దనం' వస్తువుగా ప్రదర్శనోద్దిష్టంగా రచన సాగింది. గ్రంథమంతా వచనం, దరువులతో సాఫీగా సాగుతుంది. దరువులను వసంత, అహిరి, భైరవి, సావేరి, నాటముఖారి మొదలైన రాగాలలో కూర్చటం జరిగింది. 'ప్రహ్లాద చరిత్రం' కథే అయినా నిర్వహణ విధానం వినూత్నంగా సాగింది. ప్రహ్లాదుని విద్యాభ్యాస ఘట్టంలోని ఒక సంభాషణ. చమత్కారానికి హాస్య రసానికి చక్కని ఉదాహరణ :

గురువు : నమో హిరణ్యాయ అనవోయి

ప్రహ్లాదుడు : నమో హిరణ్యాంబరాయ!

గురువు : ఓయి! అషువల గాదు, అందర శబ్దమేల చెప్పేవు. నమో హిరణ్యాయ అనవోయి.

ప్రహ్లాదుడు : నమో హిరణ్య గర్భజనకాయ!

గురువు : అయితే నీకి శబ్దము రాదు ... నమో దైత్యవరాయ అనవోయి.

ప్రహ్లాదుడు : నమో దైత్యావరాయ!

గురువు : ఓయి ! బాలకా ఈ ప్రతిక్కులహవచనంబులేల? నమో దేవ భయంకరాయ అనవోయి.

ప్రహ్లాదుడు : నమో దేవాభయంకరాయ!

గురువు : భళా భళా మహాలెస్సాయె. నేనొక్కటి చెప్పితే నీ వొకటి చెప్పుచున్నాడవు"

ప్రహ్లాద నాటకంలో దరువుల కన్న వచనమే ఎక్కువ. కథాగమనం దృష్టితో కాకుండా నాటకీయత దృష్టితో ఈ నాటకం ప్రశస్తమైంది. 'విప్రనారాయణ చరిత్రను' ను విజయరాఘవుని రచన అన్నింటిలో మేలైందిగా భావిస్తారు. అతని వైష్ణవ భక్తి దీనిలో ప్రదర్శితమైంది. దీనిలో విజయరాఘవుడు చూర్ణిక అనే వచన భేదాన్ని ప్రత్యేకతతో ప్రయోగించాడు. పాత్ర చిత్రణ ప్రశంసనీయంగా జరిగింది. జన సామాన్యానికి అందుబాటులో ఉండడానికి వాడుక భాషను వాడాడు. సంభాషణల కోసం పాత్రోచిత భాష స్వీకరించాడు. దరువులు, పదాలు, దీర్ఘవచనాలు, ద్విపదలు, పద్యాలు, అష్టకం, ఏలలు, విన్నపం మొదలైనవి ఉన్నాయి. అదే విధంగా 'అభ్యుదయం' అంటే రాజచరిత్ర కావ్యాల్లో 'రఘునాథాభ్యుదయం' పేర్కొనతగింది. 'చారిత్రక పురుషుల జీవిత విశేషాలను ఇతివృత్తంగా తీసుకొని రాసే కావ్యాలను అభ్యుదయ కావ్యాలంటారు). ఈ యక్షగాన విజయ



BRAOU

రాఘవుని సముఖంలోనే ప్రదర్శించారట. దానిలో స్త్రీలే పాత్రలు ధరించారట. రంగాజమ్మ 'మన్నారు దాస విలాస ప్రబంధాన్ని' రచించింది. విజయరాఘవుడే, మన్నారు దాసుడు. మన్నారు గుడిలోని రాజ గోపాల స్వామి భక్తుడు. ఇదే కథతో 'మన్నారు దాస విలా నాటక' మనే పేరుతో ఒక యక్షగానం రాసింది. ఈ నాటకంలో జోస్యుల వేష గాథలు, ఎరుకఘట్టం, గొల్లల ప్రసంగం, ముత్తైదువల ముచ్చట – వీటిని రంగాజమ్మ ప్రశంసనీయంగా చిత్రించింది. తంజావూరు యక్షగానాలలో మన్నారు దాస విలాస నాటకాన్ని ఉత్తమమైందిగా భావిస్తారు. ఈ నాటకంలో ప్రత్యేకత ఈ నాటకం ఆనాటి జన జీవితాన్ని చక్కగా ప్రతిబింబిస్తుంది. అన్నదానం గొప్పదే కాని అపాత్రత వల్ల జరిగే దుష్పరిణామం చక్కగా చిత్రితమైంది. (ఫలితం సోమరి పోతుల పెంపు). పాత్రోచిత భాషగా సత్రాధికారి సంభాషణను తమిళంలో రాశాడు దీక్షితుడు.

శాహజీ రచించిన ఇరవైకి పైగా కృతులలో 16 నాటకాలే. వీటిలో "పంచదానశూరం" ప్రసిద్ధికెక్కింది. దీని ఇతివృత్తం సాంఘికం. మానవ మనస్తత్వ ప్రతిపాదన ఇందులో కనిపిస్తుంది. ఈ నాటకంలో వచనమే ఎక్కువ.

నాయక రాజుల కాలంలోని తేటతెలుగు కవిత్వం శాహజీ కాలం నాటికి సంస్కృత ప్రభావానికి లోనయిందని చెప్పవచ్చు. పాండిత్య ప్రదర్శనం పట్ల స్పృహ పెరిగింది. అదే విధంగా "విష్ణుమాయా విలాసం, జానకీ పరిణయం, శ్రీరామ విజయం, అంబికావాదం" అనే యక్షగానాలు ఇతర ప్రాంతాలలో వెలువడ్డాయి.

### 19.3.3 ద్విపదలు

పద్యం కంటె ద్విపద ప్రజలకు మరింత చేరువవుతుందనడంలో సందేహంలేదు. ఈ దశలో భారత, భాగవత, రామాయణాలు ద్విపద కావ్యాలుగా ఆవిర్భవించాయి. ద్విపద భారతాన్ని కూడా ముగ్గురు కవులు (కవిత్రయం) రచించడం విశేషం. తిరుమల భట్టు (బట్టెపాటి తిమ్మయ్య) ఆది, అరణ్య, విరాట, ఉద్యోగ, భీష్మ, ద్రోణ పర్వాలు రచిస్తే, ఆ తర్వాత ఆత్మకూరు సోమన్న అందుకొని కర్ణపర్వం నుండి స్వర్గారోహణ పర్వం దాకా తుదముట్టా రచించాడు. బాల సరస్వతి సభాపర్వాన్ని రాశాడు. ద్విపద భారతాన్ని ప్రారంభించిన తిమ్మనను ద్విపద రామాయణం రాసిన రంగనాథున్ని తరువాతి కాలంలో ద్విపద భాగవతం రాసిన చేకుమళ్ళ రంగశాయి స్తుతించాడు :

'రామాయణంబు భారతము ద్విపద
లై మీర జేసిన యా రంగ నాథు
ధీరు బట్టెపాటి తిరువల భట్టు
గారి ప్రౌఢోక్తులు గలుగ నుతించి'. (అర్. 765)

కట్టా వరదరాజు ద్విపద రామయణానికి ముందటి రంగనాథ రామాయణం ప్రసిద్ధమే. 1440 ప్రాంతం నాటి అన్నమయ్య రామాయణం నష్టమైంది. వరదరాజు రామయణం తర్వాత వెలువడ్డ భోసల ఏకోజీ రామాయణం ముద్రిం కాలేదు (1795). వరదరాజు తాను సాహితీ భోజుణ్ని అని చెప్పుకున్నాడు. అతడు చతుర్విధ కవిత్వాలు చెప్పగలిగినవాడు శ్రీ రామాయణాన్ని వరదరాజు ఆరు కాండలుగా 23,570 ద్విపదలలో రాశాడు. ఈ ఆది కావ్యాన్ని తేటపుట్టేటట్టు, జల్లిమాటలు, అప శబ్దాల, జబ్బు అల్లికలు మొదలైనవి లేకుండా దోషరహితంగా రచించాడు. ధ్వనులు, వ్యంగ్యాలు, వింతలు, జాతివార్తలు, ఉపమలు గుప్పించాడు. ఈ రామాయణం యథావాల్మీకమే అయినా కవి తన కాలంనాటి సంఘాన్నీ జాతి వార్తాచమత్కారాలూ చూపించాడు.

ద్విపద భాగవతం రచించిన చేకుమళ్ళ రంగశాయి పుష్పగిరి తిమ్మన సహాధ్యాయి. పోతన భాగవతానికి ఇది అనుసరణ. ద్విపద భాగవతం నాలుగు స్కందాలే లభిస్తున్నాయి.

రఘునాథరాయలు 'అచ్యుతాభ్యుదయం నల చరిత్రలను' ద్విపదలుగా రచించాడు గాని అవిప్పుడు నామా విశిష్టాలే. విజయ రాఘవుడు రఘునాథాభ్యుదయాన్ని యక్షగానంగానే గాక ద్విపదగా కూడ రచించాడు. పెద్దా పురం ప్రభువులు పోషించిన విశ్వనాథం గౌరీ విహాహం అనే ద్విపద కావ్యాన్ని కవిజన శ్రవణ సౌఖ్యంగా రచించాడు. కూచిమంచి జగ్గకవి 'రాధాకృష్ణ చరిత్ర' అనే ద్విపద కావ్యాన్ని రచించాడు కాని అది నష్టమైంది.



BRAOU

**19.3.4 వచనరచనలు**

ప్రాచీన కవుల కావ్యాలలో కథా వేగం కోసం మధ్య మధ్య వచనం వాడేవారు. అనంతర కాలంలో సంకీర్తనలు అనేపేరుతో 'సింహగిరి వచనములు, శ్రీ వేంకటేశ్వర వచనము'ల వంటి పూర్తి వచన రచనలు వెలువడ్డాయి. వచన రచన ఒక విశిష్టకళగా వికాసం పొందింది. 17వ శతాబ్దంలోనే ముఖ్యంగా తంజావూరు, మధుర ప్రాంతాలలో వచనానికి ప్రోత్సాహం లభించింది. వచన ప్రక్రియ పొందిన ఆదరం ఒక రకంగా ఆనాటి చారిత్రక అవసరంగా భావించవచ్చు. తంజావూరు, మధుర ప్రాంతాలలో వ్యవహార భాష తమిళం. పాలకులు తెలుగువారు. అక్కడి తెలుగువారు తెలుగును మరచిపోకుండా తెలుగు భాషా సంస్కృతులు తమిళ స్రవంతిలో లీనమై పోకుండా ఇటువంటి వ్యాసంగాలు కాపాడి ఉంటాయి.

తెలుగు వచన వాఙ్మయ వికాసానికి మధుర రాజులు చేసి కృషి ఎక్కువ. విజయరంగ చొక్కనాథుడే స్వయంగా 'మాఘమహాత్మ్యం, శ్రీరంగ మహాత్మ్యం' అనే రెండు పెద్ద వచన కావ్యాలు రచించాడు. చొక్కనాథుని వచన శైలికి మచ్చుకు ఒక ఉదాహరణ చూడండి:

"మృగశృంగ మహాముని మాఘస్నానఫలంబు ధారవోయుటచే ధర్మగుప్తుడు గజరూప విముక్తుడై చెప్పిన మాటలు. బ్రహ్మ తేజోనిధీ! నా యేనుగు జన్మంబు తొలంగె. నిషధ పురంబున విశ్వగుప్తుండను వైశ్యుండు స్వధర్మంబు తప్పక యుండు. నేనతని కుమారుండ వేదంబులు చదివి యాగాది కర్మంబు సేయుచు జాతికిం దగిన జీవనంబున మెలంగుచు ధర్మంబుగ వడ్డీ కిచ్చుటయు, ఆవుల బాలించుటయు పైరులు పుట్టించుటయు మొదలైన వైశ్య కర్మంబులు సేయుదు'.

అంతకు ముందు మద్దళగిరి ఆస్థానంలోని లింగనమఖి కామేశ్వర కవి "ధేను మహాత్మ్యం" అనే వచన కావ్యం రచించాడు.

చొక్కనాథుని ఆస్థానంలో సముఖం వేంకట కృష్ణప్ప నాయకుడు ఆనాటి వచన కావ్య రచయితల్లో ప్రసిద్ధిపొందినవాడు. ఇతడు 'జైమినీ భారతం, సారంగధర చరిత్ర'లను వచనంగా రాశాడు. కృష్ణప్పకు అనుప్రాసలతోకూడిన శైలిపైన మక్కువ. ప్రాంతాలకు సర్వనామాలు ఉపయోగించక పేర్లు మళ్ళీ వాడటం ఇతని ప్రత్యేకత.

'రాయవాచకం' అనే చిన్న కావ్యాన్ని గురించిన కూడా ఈ సందర్భంలో చెప్పుకోవాలి. కృష్ణదేవరాయల ఆస్థానవిశేషాలను వర్ణిస్తూ మధుర రాజ్యస్థాపకుడైన విశ్వనాథనాయకునికి విజయనగరంలో ఉన్న అతని ప్రతినిధి పంపించిన నివేదిక రూపంలో ఉంటుంది రాయవాచకం. ఆనాటి రాజకీయ వ్యవహార భాష కిది నిదర్శనం.

తమిళ దేశంలో తెలుగు వచన రచన వర్ధిల్లుతుండగా మైసూరు తెలుగు రాజులు కూడ తెలుగును పోషించారు. చిక్కదేవరాజు దళవాయిగా ఉన్న కళువె వీరరాజు మహాభారతాన్ని వచనంలో రాశాడు. సభా, భీష్మ పర్వాలు మాత్రమే లభిస్తున్నాయి. ఇవి వ్యాస భారతానికి సరియైన భాషాంతరీకరణలు. వీరరాజుది సులభశైలి. స్పష్టత కోసం విసంధులు చేశాడు. పూర్ణానుస్వారంగల శబ్దరూపాలు మిగతావారిలాగే ఇతని శైలిలోకూడ కనిపిస్తాయి.

'విజయ శీలుండగు విజయుండు ఖాండవ వనంబునం దగ్నిదేవు వలన మయునకు భయంబు లేకుండ నటుల వరంబిచ్చి తదనంతరంబు నెయ్యది యాచరించె'.

**19.3.5 తిట్టుకవులు**

ఈ యుగంలో వ్యక్తిగత అహంకారం, ఆక్రోశం ఆధారంగా వెలువడిన కొన్ని తిట్టు ధోరణులు కనిపిస్తాయి. కూచిమంచి జగ్గకవి అటువంటి వాడు. ఇతనికి రాజు గౌరవంగా పిలిచి అడిగితేకాని అంకితం ఇవ్వ గూడదనే పట్టుదల ఉండేది 'భక్త మందార శతకం' లోని ఒక పద్యం వ (54) అతడు తిట్టడంలో ఎంతటి దిట్టో తెలుస్తుంది.

'కుకవుల్ కూళల కంబె తొత్తుకొడుకుల్ కొండీలు కోనారులుం
దకటై తత్తల వారు పొచకులు జూదంబాడు వారున్ మహిం
బ్రకటంబై సిరిగాంచిరీ కలియుగ ప్రామాణ్య మాశ్చర్యమో
మకరాక్షాసుర గర్వ సంహరణ రామా! భక్తి మందారమా !'

నీలాద్రిరాజు కోసం చంద్రరేఖా విలాసం రచించి ఆయన దానికి ధనమివ్వలేదనే కోపంతో అదే చేత్తో జగ్గకవి 'చంద్రరేఖా విలాపం' అనే బూతు కావ్య రాశాడు జగ్గకవి. ఈ కావ్యంలో సగం దాకా అశ్లీల రచన. బూతుల బంగ, జుగుప్సావహం. ఇది హాస్యరసమని జగ్గన్న ఉద్దేశం. తెలుగులో చంద్రరేఖా విలాపం వంటి కావ్యాలు మరి కొన్ని వచ్చాయి గాని వాటికి ఇంతటి ఖ్యాతి రాలేదు. జగ్గన్న కొందరు తిట్టు కవులను పేర్కొన్నాడు :

'భీమకవి రామలింగని
స్త్రీమన్మథుడై చెలంగు శ్రీనాథకవిన్
రామకవి ముఖ్యులను - బ్రో
ద్దామగతిం జిత్తవీధి దలచి కడంకన్.

సామాజిక జీవితం అల్లకల్లోకంగా ఉండి, జమీందారుల దౌర్జన్యాలు అత్యధికంగా ఉన్న కాలమది. పొట్ట కోసం భాషలో, కవితలో సాముగరిడీలుచేసి కవులుగా, పండితులుగా చెలామణీ అవుతున్నవాళ్ళమీద, వాళ్ళ పోషకులమీద ఇంతో అంతో సరుకుండి ఆత్మగౌరవమున్న కొందరు కవులు విరుచుకుపడ్డారు. ఫలితం, తిట్టు కవిత. ఈ కాలంలో సంస్కృతంలో కూడా 'అన్యాపదేశ' రచనలు వచ్చాయి. చాటువులు వచ్చాయి. స్ఫుట శ్లోకాలు (ఎవరు రాసినవో తెలియనివి) వెలిశాయి. వేమనవంటి వాళ్ళు సమాజ ధర్మాలను వ్యంగ్యంగా దూషించి, తృప్తి లేక తిట్లకు దిగారు. అదే ధోరణి ఈ రచనల్లో ప్రతిబింబించింది. జగ్గన్న ఇచ్చిన పట్టికలోని రామకవి - తురగా రామకవి. ఇతని నోటికి హద్దూ పద్దూ లేదు. రామకవి పెద్దాపురం పాలించిన తిమ్మరాజును ఇలా తిట్టాడు :

'అద్దిర శ్రీ భూ నీలలు
ముద్దియలా హరికి కలరు ముగురందరిలో
బెద్దమ్మ నాట్యమాడును
ది ద్దిమ్మని వత్సవాయి తిమ్మని ఇంటన్. (చాటుపద్య మణిమంజరి, 163)

విజయనగర ప్రాంతంలోని అడిదం సూరకవిక కూడ తిట్టుకవిగా పేరుండేది. ఇతరత్రా ఇతడు మంచి రచనలే చేశాడు.

కొందరు తిట్టుకవులు పద్యంలోని కీలకస్థానాల్లో విషమాక్షరాలు ప్రయోగించి శపిస్తారు. వారిలో బడబానల భట్టు, మేధావిభట్టు, ప్రౌఢకవి మల్లన, రంగరాజు లింగయ్య, ఏలూరి శేషయ్య, పింగళి రామరాజు మొదలైనవారి పేర్లు వినిపిస్తాయి.

తిట్టుకవులందరూ ఉత్తమ రచనలు చేయగల్గినవారే, చేసినవారే. సామాజిక కారణాలకు వ్యక్తిగత కారణాలు తోడ్పడగా తిట్లకు లంకించుకున్నవారు.

### 19.3.6 నిరసన కవులు

విజయనగర సామ్రాజ్యం చివరి రోజుల్లో కేంద్ర రాజ్యం పట్టులేక చిల్లర రాజులు స్వతంత్రులై ప్రజలను బాధపెట్టసాగారు. శవప్రాయాలైన సంప్రదాయాలతో, ఆచారాలతో మతవ్యవస్థ అమాయకులను పీడిస్తోంది. స్వయం సంపూర్ణ గ్రామవ్యవస్థ బీటలువారుతున్నది. వ్యాపార ప్రవేశం మూలంగా వృత్తికారులు దెబ్బతిన్నారు. పరదేశీయుల దండయాత్రలతో, నిరంతర యుద్ధాలతో రాజ్యం సంక్షోభాల పాలయ్యింది. అటువంటి పరిస్థితుల్లో తాత్త్విక సామాజిక దృక్పథాలతో, సరికొత్త చైతన్యంతో కొందరు కవులు వృత్తికులాలనుంచి పుట్టుకొచ్చారు. వారు అన్ని రకాల వ్యవస్థలపైన నిరసన ప్రకటించారు. అయితే ఈ నిరసన తిట్టుకవుల వంటిది కాదు తిట్టుకవులది తీవ్రవాదం, వ్యక్తిగత ఆక్రోశం. నిరసన కవులు ఆనాటి సమాజంలోని కుహనావిలువలను ఎండగట్టారు.

వేమన ఆనాటి రాజులను మతవ్యవస్థలను నిరసించాడు. కులవ్యవస్థను ఖండించాడు. ఆర్థిక అసమానతల పట్ల అసహనం ప్రదర్శించాడు. దురాచారాలను, మూఢనమ్మకాలను ఎగతాళి చేశాడు. ఉత్తమమైన సంఘ విలువలను ప్రతిపాదించాడు. ముఖ్యంగా డబ్బుకు కావ్యాలమ్ముకొనే దరిద్రగొట్టు కవులను తిట్టాడు :

BRAOU

'తోటకూరకైన దొగ్గలికై నను
తవిటికైన తవిటి కుడుముకైన
కావ్యములను చెప్పు గండ్యాలు ఘనమైరి
విశ్వదాభిరామ వినురవేమ'.

పోతులూరి వీర బ్రహ్మం రాజయోగకవి. కుటుంబ వృత్తి అయిన వడ్రంగంచేస్తూనే యోగ సాధన చెయ్యవచ్చునని నిరూపించాడు. ఈయన

'చిల్లర రాళ్ళకు మొక్కుతు ఉంటే
చిత్తము చెడునుర ఒరే ఒరే'

అని విగ్రహారాధనను ఖండించి నిర్గుణ తత్త్వాన్ని బోధించాడు.

'శివుడంటే నేమి – కేశవుడంటే నేమి
శివకేశవుల మీది శిఖరమై వెలిగేటి
చిన్మయ రూపుని చేరగల్గితి మేని'
అంటూ మత సామరస్య ప్రబోధం చేశాడు.

వీరబ్రహ్మం శిష్యుడు దూదేకుల సిద్దప్ప చెప్పిన

'ఏ కులమని నను వివరమడిగితే
ఏమని చెప్పుదు లోకులకు
లోకులకూ పలుగాకులకు
దుర్మార్గులకూ ఈ దుష్టులకూ'

అనే తత్త్వం చాలా ప్రసిద్ధికెక్కింది. ఆనాటికే కులవ్యవస్థ మీద ఇంత అసహ్యభావం కలిగినా, సామాజిక చైతన్య లోపంవల్ల నేటికీ అది కూలిపోలేదు.

మధ్యయుగం ద్వితీయ భాగంలోని ప్రజాసన్నిహిత స్వభావాలు నిరసన కవులు.

BRAOU

**19.3.7 పద కవితలు**

మధుర కవితాశాఖకు చెందిన పదకవిత తంజావూరి నాయక రాజుల కాలంలో చాల వ్యాప్తికి వచ్చింది. పామరజనుల నాలుకల మీది గేయం విద్వజ్జనులను కూడా రజింపజేసింది. విజయరాఘవుడు పదకవితా ప్రవీణుడు. 'ఏలలు విడి పదాల్ హెచ్చు సంకీర్తన లొనరించినాడు'. శృంగార భరితాలు, మృదురసాస్వాద్యాలై రాణించిన పదాలు రచించాడు. విజయరాఘవుడు 'భ్రమరగీతాలు, గోపికాగీత' లు మొదలైన గేయ ప్రబంధాలే కాక 'వాల్చిచి, గజ్జరి విల్వేడు, చౌపదాలు, పదచాళికలు' మొదలైన నాట్య ప్రబంధాలు కూడా రచించాడట. విజయరాఘవుని ఆస్థానంలోని కవులు రచించిన యక్షగానాల్లో 'శృంగార పదాలు, సాంగత్య పదాలు, చెంచు పదాలు, దరువులు, కొరవండి దరువులు, ధవళములు, శోభనములు, సువ్వాలలు' తదితర రకాల పదాలు ఉన్నాయి.

పదకవుల్లో క్షేత్రయ్య శిఖామణి. తంజావూరిలో ఆయన పదాలు పరవళ్ళు తొక్కాయి. క్షేత్రయ్య మొదటి పేరు వరదయ్య. అనేక పుణ్యక్షేత్రాలు సందర్శించడంవల్ల క్షేత్రయ్య అయినాడు. క్షేత్రయ్య కృష్ణా జిల్లాలోని మువ్వగ్రామం వాడయి ఉంటాడు గాని ఈ మువ్వ ఎక్కడుందనే విషయంలో పండితులలో భేదాభిప్రాయాలున్నాయి. క్షేత్రయ్యపైన తాళ్ళపాక కవుల ప్రభావం కనిపిస్తుంది. 'మువ్వగోపాల' అనే అభేద ముద్రతో పదాలు చెప్పాడు. క్షేత్రయ్య చెంజి పాలకుడు తుపాకుల వేంకట కృష్ణయ్య ఆశ్రయం పొందాడని ఒక పదంవల్ల తెలుస్తుంది. రఘూనాథుణ్ని కూడా దర్శించాడు. విజయరాఘవుని ఆదరం లభించింది విజయ రాఘవుడు తన మీద కూడా ఎన్నో పదాలను చెప్పించుకున్నాడు. క్షేత్రయ్య మొత్తం 4 వేలకు పైగా పదాలు చెప్పినట్టున్నాడు. కాని వాటిలో 5 వందలు కూడా లభించడంలేదు. క్షేత్రయ్య పదాలలో కూడా కొన్ని చోట్ల శృంగారం శ్రుతి మించడం కనిపిస్తుంది. నాయకరాజుల అనంతరం శాహాజీ కూడా భక్తి, వైరాగ్య, శృంగార, హాస్య,

నీతి పదాలను శ్రీత్యాగేశాంకితంగా చెప్పాడు. ఆయన, ఆస్థానకవులు గిరిరాజు, సోమకవులు కూడా పదరచన చేశారు. తులజాజీ, మాతృభూతకవి , సభాపతయ్యలు కూడా పద రచయితల జాబితాకెక్కారు.

### 19.3.8 కట్టలు తెగిన శృంగారం

ఉపదేశం, ఆనందం అంటూ లాక్షణికులు చెప్పిన కావ్య ప్రయోజనాలలో ఉపదేశం మందుకైనా లేకుండా పోయి, శుద్ధానందమే రాజ్యమేలిన కాలమిది. ముఖ్యంగా తంజావూరి కవులు ప్రబోధంతో నిమిత్తం లేని 'నాతిని బోలి యానంద మొసగుట' యే కవితా ధ్యేయంగా పెట్టుకున్నారు. వేశ్యలకు, భోగపత్నులకు ప్రాధాన్యం పెరిగిపోయి మిగతా ఆశ్రిత కవులు కూడా ఆ ధోరణిలో కొట్టుకుపోక తప్పనట్టు కనిపిస్తుంది. ఈకాలం నాటి కొన్ని కావ్యాల్లో శృంగారం అన్ని రకాల కట్టుబాట్లను తెంచుకొన్నది. సంఘ ధర్మానికి వ్యతిరేకంగా ఉండే రమణీయ శృంగారాన్ని మోహమని పిలిచేవారు. రాజులు తమ శృంగార జీవితాన్ని సగర్వంగా బయటపెట్టుకొన్నారు. అభ్యుదయ కావ్యాల్లో కొడుకుచే తండ్రుల శృంగార జీవితాన్ని వర్ణించడమనే విపరీతం కనిపిస్తుంది.

తంజావూరులో వెలువడ్డ 'అహల్యా సంక్రందనం, తారాశశాంక విజయం, రాధికా సాంత్వనం' మొదలైన కావ్యాల్లో అతి వేల శృంగార వర్ణన పరాకాష్ఠను చేరుకున్నది.

సముఖం కవి అహల్యా సంక్రదనంలో బ్రహ్మానందం కన్న శృంగారంవల్ల లభించే ఆనందమే గొప్పదంటాడు :

'ఎందును సంచరింనఖిలేంద్రియముల్ సుఖమొందడెందమున్
బొందుగ దన్ను దామరువ బుద్ధి కగోచరమైన యట్టి యా
ఎనందరము బ్రహ్మమంద రది నవ్యవయోనవ మోహనాంగి యో
చందన గంధికిన్ దొరకు జక్కని మక్కువకాడు జిక్కనన్.   (అహల్యా -3-27)

తారాశశాంకకర్త శేషం వేంకటపతి సముఖంకవికి రచనాపద్ధతిలో కూడా మిత్రుడే అనిపిస్తాడు. గురుపత్ని ఆయన తార, చంద్రుడి శృంగార క్రీడలను విశృంఖలంగా వర్ణిస్తాడు వేంకటపతి.

ముద్దు పళని రచించిన రాధికా సాంత్వనంలో శ్రీకృష్ణునికి ఇళాకన్యకు పరిణయమవుతుంది. రాధకృష్ణునికి చిన్ననాటి నుంచి శృంగార మర్మాలను బోధించి పెంచి ఉంటుంది. ఇళతో కృష్ణుడు అత్తవారింటికి వెళ్ళినప్పుడు కృష్ణుడితో తన శృంగార క్రీడలను తలచుకొని విరహానికి గురవుతుంది. కృష్ణుని వద్దకు చిలక రాయబారం పంపుతుంది. కృష్ణుడు వచ్చి ఆమె కోపోపశమనానికి కాళ్ళపై పడి సాంత్వన పరుస్తాడు. ఇదీ ఇతివృత్తం. ఇళ ముగ్ధనాయక, రాధ ప్రౌఢధీరగా వాళ్ళిద్దరి సంభోగ వృత్తాంతం మొదలైనవి పచ్చిపచ్చిగా చేసిన రచనకు తార్కాణాలు. అయితే ఇతర కావ్య విశేషాల దృష్ట్యా ఇది విలక్షణమైన కావ్యమే. స్త్రీ మనో విశ్లేషణలో పళని చూపిన నైపుణ్యం విశిష్టమైనది. ఈ అతివేల శృంగారాన్నిబట్టే దక్షిణాంధ్ర యుగాన్ని క్షీణయుగం అన్నారు. కానీ మిగిలిన విషయాల్లో ఇది సమాజంలోని భిన్నవర్గాలను కుదిపిన యుగం.

BRAOU

## అవగాహన ప్రశ్న

మధ్యకాలీనదశ - IIలోని సాహిత్య ధోరణులను 10 పంక్తుల్లో సమీక్షించండి.

## 19.4 సారాంశం

ఈ భాగంలో ఈ కింది సాహిత్యాంశాలను మీరు తెలుసుకున్నారు.

- మధ్యకాలీనదశ - II (క్రీ.శ. 1600-1800) లో ఆధునిక దశకు దారితీసిన క్షీణయుగం/సంధి యుగం సాహిత్యదశ వికసించింది. ఈ దశలో ముందుకాలానికి దారులువేసిన ప్రక్రియ ముఖ్యంగా పదగేయ కవితా ధోరణి. వేమన, వీరబ్రహ్మం వంటివారల సామాజిక నిరసన దృక్పథం కూడా తర్వాతికాలానికి ఒక పెట్టుబడి.

- ఆ దశలోని వివిధ కవులూ, వారి రచనలూ ప్రసిద్ధాలైన మార్గ - దేశికవితా పద్ధతుల్లో నడిచినా అంతగా ప్రత్యేకతను సంతరించుకోలేక పోవడంచేత క్షీణయుగానికి నాంది పలికాయి.

- ఈ దశలో కొట్టవచ్చినట్టుగా కనిపించే సాహిత్య దృక్పథం అతివేలమైన శృంగార వర్ణన.

- ఈ దశలో కొన్ని కావ్యాలూ, యక్షగానాలూ, ద్విపదలూ, వచన రచనలూ సాహిత్యంలో వెలశాయి. పద కవితలతోపాటు కూచిమంచి జగ్గకవి, అడిదం సూరకవి, తురగారామకవి వంటి కవుల తిట్టుకవితలు వచ్చాయి. ఐడబానల భట్టు, మేధావిభట్టు, ప్రౌఢకవి మల్లన, వేములవాడ భీమకవి వంటి వారు తిట్టు కవిత్వం చెప్పారు. వాటి సామాజిక కారణాలు వ్యక్తిగత కారణాలకు తోడ్పడగా తిట్టు కవిత్వం బయలుదేరిందని సాహిత్య పరిశీలకుల అభిప్రాయం.

- సామాజిక దురాచారాలనూ, సంప్రదాయాలనూ, మూఢ విశ్వాసాలనూ నిరసిస్తూ ఈ దశలో కవిత్వం చెప్పివారిలో ప్రముఖులు వేమన, పోతులూరి వీరబ్రహ్మం.

### అవగాహన ప్రశ్నకు జవాబు

క్రీ.శ. 1600 నుండి - 1800 వరకు మధ్యకాలీన సాహిత్యయుగం మలిదశ. ప్రబంధయుగం తర్వాత వచ్చిన ఈ కాలాన్ని 'క్షీణయుగం' గా చరిత్రకారులు అభివర్ణించారు. వేమన, త్యాగయ్య, వీర బ్రహ్మం వంటి కొందరు భక్త కవులనూ, సామాజిక నిరసన కవులనూ మినహాయిస్తే తక్కిన వారంతా దాదాపుగా అతి వేలమైన శృంగారాన్ని కావ్యప్రబంధాల ద్వారా, యక్షగానాల ద్వారా ఒలకబోసిన వారే. చిత్రబంధ, గర్భ, శ్లేషకవిత్వాల వైచిత్రి, మోజా ఈ కాలంలో నిరాఘాటంగా రాజ్యంచేసింది. ఐతే ఇంత వేలంవెర్రిలోనూ కొన్ని లక్షణగ్రంథాలు రావడం, ద్విపదలో రామాయణ, భారత, భాగవతాదులు ప్రస్తారం చెందడం, భాగవత వచనరచన, తర్వాతి కాలంలో ప్రాచుర్యం పొందిన పదగేయ కవితాధోరణులకు ఈ దశలోని దేశిక కవిత్వ పద్ధతులు దోహదం చెయ్యడం వంటివి ఈ కాలంలోని ప్రధానాంశాలు.

BRAOU

### చదవదగిన పుస్తకాలు


ఆంధ్రసాహిత్య చరిత్ర : పింగళి లక్ష్మీకాంతం

ఆంధ్రవాఙ్మయ చరిత్ర : డా. దివాకర్ల వెంకటావధాని

ఆంధ్ర వాఙ్మయారంభదశ (1, 2 భాగాలు) : డా. దివాకర్ల వెంకటావధాని

ఆంధ్ర ప్రబంధములు - అవతరణ వికాసాలు : డా. కాకర్ల వెంకట రామనరసింహము

సమగ్రాంధ్ర సాహిత్యం : ఆరుద్ర

తంజాపురాంధ్ర సాహిత్య చరిత్ర : డా.కె. సత్యవతి

ఆంధ్ర ద్విపదసాహిత్య చరిత్ర : డా.టి. సుశీల

ద్విపద వాఙ్మయము : డా. జి. నాగయ్య

దాక్షిణాత్య శిల్ప సమీక్ష : డా. జి. నాగయ్య

పురాణ వాఙ్మయము : డా. జి.వి. సుబ్రహ్మణ్యం

## మాదిరి పరీక్షా ప్రశ్నలు

I. కింది ప్రశ్నలకు 30 వాక్యాలు మించకుండా సమాధానాలు రాయండి.

1. క్రీ.శ. 1600-1800 మధ్యకాలంలో ఆంధ్ర సాహిత్య పోషణ కావించిన రాజుల గురించి సంగ్రహంగా రాయండి.
2. మధ్యయుగం మలిదశలోని సాహిత్య ధోరణులను సంగ్రహంగా తెల్పండి.
3. మధ్యయుగం మలిదశలోని నిరసన కవులను గురించి రాయండి.
4. మధ్యయుగం మలిదశలో కట్టులు తెగిన శృంగారం ఎందుకు రచనల్లో చోటు చేసుకున్నట్లు ? దాని స్వరూపం ఏమిటి?
5. మధ్యయుగం మలిదశలోని తిట్టుకవుల గురించి రాయండి.

II. కింది ప్రశ్నలకు 10 వాక్యాలు మించకుండా సమాధానాలు రాయండి.

1. మధ్యయుగం మలిదశలోని వచన రచనల గురించి రాయండి.
2. మధ్యయుగం మలిదశలోని పదకవుల గురించి తెల్పండి.
3. మధ్యయుగం మలిదశలోని యక్షగానాల గురించి రాయండి.

BRAOU

# భాగం – 20 తెలుగుసాహిత్యం – ఆధునికదశ (క్రీ.శ.1800 – నేటిదాకా)

## విషయక్రమం


20.0 లక్ష్యాలు

20.1 పరిచయం

20.2 తొలి నిఘంటువులు

20.3.0 వ్యాకరణ రచన

- 20.3.1 తెలుగు వ్యాకరణం
- 20.3.2 బాలవ్యాకరణం

20.4 సి.పి. బ్రౌన్ సాహిత్యసేవ

20.5 పత్రికా ప్రచురణ

20.6 ఆతన్న వాఙ్మయ నిర్మాతగా కందుకూరి వీరేశలింగం

20.7 సంస్థానాలూ – సాహిత్యసేవ

20.8.0 వివిధ కవితోద్యమాలు

- 20.8.1 దేశభక్తి గీతం – గురజాడ
- 20.8.2 జాతీయోద్యమ, ఆంధ్రోద్యమ కవిత్వం
- 20.8.3 భావకవిత్వం
- 20.8.4 భావకవిత్వం మీద తిరుగుబాటు – అభ్యుదయ కవిత్వం
- 20.8.5 వచనా కవిత్వ వికాసం
- 20.8.6 దిగంబర కవిత్వం
- 20.8.7 విప్లవ కవిత్వం
- 20.8.8 వివిధ కవితారీతులు
- 20.8.9 సంప్రదాయ కవిత్వం

20.9.0 వచన ప్రక్రియల వికాసం

- 20.9.1 నవల
- 20.9.2 కథానిక
- 20.9.3 గద్య నాటకం
- 20.9.4 నాటిక
- 20.9.5 విమర్శ

అవగాహన ప్రశ్న

20.10 సారాంశం

- అవగాహన ప్రశ్నలకు జవాబు
- చదవదగిన పుస్తకాలు
- మాదిరి పరీక్షా ప్రశ్నలు


BRAOU

## 20.0 లక్ష్యాలు

ఈ భాగం చదివాక మీరు ఈ కింది అంశాలను విశ్లేషించగలుగుతారు :

- తెలుగు సాహిత్యంలో ఆధునిక లక్షణాల ప్రవేశం
- వివిధ సాహిత్య ప్రక్రియల ఆవిర్భావం, వికాసం
- సాహిత్యంపై సామాజికోద్యమాల ప్రభావం

## 20.1 పరిచయం

ఈ భాగంలో క్రీ.శ. 1800 నుండి 1980 ప్రాంతాల వరకు సాగిన తెలుగు సాహిత్య పరిణామాన్ని మీకు పరిచయం చేస్తున్నాము. ఈ దశలోని భాషా చరిత్ర సంస్కృతి చరిత్ర (25వ భాగం) ను ముందు చదవండి. ఈ భాగానికి అన్వయించుకోటానికి ప్రయత్నించండి.

తెలుగు సాహిత్య, చరిత్రలో 19వ శతాబ్దం కీలకమైంది. మన జీవితంలోనూ సాహిత్యంలో ఆధునిక లక్షణాలు ప్రవేశించింది ఈ శతాబ్దిలోనే. ముఖ్యంగా 19వ శతాబ్ది చివరి పాదంలో మన సాహిత్యంలో అనేక నూతన ప్రారంభాలు జరిగాయి. కొత్త ప్రక్రియలు ఆవిర్భవించాయి. వీటి వికాసానికి దోహదం ఇరవయ్యో శతాబ్దంలో జరిగింది. తెలుగు సాహిత్య చరిత్ర పరిణామానికి వివిధ రాజకీయార్థిక సాంస్కృతిక శక్తులు దోహదం చేశాయి.

శ్రీరంగ పట్నంలో టిప్పు సుల్తాను ఓటమితో (1799) గోల్కొండ సుబా తప్ప తెలుగు ప్రాంతాలన్నీ ఇంగ్లీషు వారికి సంక్రమించాయి. దత్త మండలాలనే నేటి రాయలసీమ నిజాం ద్వారా వారి స్వాధీనంలోకి వచ్చింది. అంతకు ముందే సముద్రతీర తెలుగు ప్రాంతం ఈస్టిండియా కంపెనీ వారి వశమైంది. ఢిల్లీకి నామ మాత్రపు సామంతుడైన నిజాము గోల్కొండ సుబాను స్వాధికారాలతో పరిపాలిస్తున్నాడు. అప్పటి దాకా సర్కారు జిల్లాలు జమీందార్ల పాలనలో ఉండేవి. బ్రిటిషువారు పర్మనెంటు సెటిల్‌మెంట్ పద్ధతి ప్రవేశపెట్టడంతో జమీందార్లకు వంశపారంపర్య హక్కులు సంక్రమించాయి. కొన్ని హక్కులు తగ్గాయి. దేశాన్ని కంపెనీవారు మండలాలుగా విభజించి పరిపాలనాధికారులుగా కలెక్టర్లను నియమించారు. ఈ రోజుల్లో ప్రజల ఆర్థిక పరిస్థితి దుర్భరంగా ఉండేది. పాలెగాళ్ల పాలనలో కూడా ప్రజలకు భద్రత లేదు. సెటిల్‌మెంటు చట్టంతో జమీందార్లు, పాలెగాళ్లు తమ వద్ద ఉంచుకున్న సాయుధ బలాలను వదలుకోవలసి వచ్చింది. దీనితో వారు తిరుగుబాట్లు లేవదీశారు. బ్రిటిషువారు వాటిని నిర్దాక్షిణ్యంగా అణచివేశారు. కాలక్రమాన బ్రిటిష్‌వారితో పోరాడే ఉత్సాహం సన్నగిల్లి పోయింది. సెటిల్‌మెంట్ పద్ధతివల్ల జమీందార్లు అనే సంస్థ శాశ్వతమై రైతులకు దూరమైంది. శాశ్వత సెటిల్‌మెంట్ రైతులకు నష్టదాయకమని భావించి థామస్ మన్రో రైత్వారీ పద్ధతిని ప్రవేశపెట్టాడు. ఈ విధానం వల్ల శిస్తులు విపరీతంగా పెరిగాయి. 1857లో సిపాయిల తిరుగుబాటు బ్రిటిషువారు కళ్లు తెరచి సంస్థానాధీశుల 'గౌరవాలు' మన్నించారు.

1853లో కృష్ణా ఆనకట్టను కట్టారు. ఉభయ గోదావరి, కృష్ణ, గుంటూరు జిల్లాలు సస్యశ్యామలమైనాయి. ఈ కాలంలోనే కంపెనీవారు మూడు ప్రధానమైన రైలు మార్గాలు నిర్మించారు. కలకత్తాకు పోయే రైలు సర్కారు జిల్లాలనుంచి వెళ్తుంది. కాట్పాడి నుంచి గుంటూరుకు వేసిన రైలుమార్గం చిత్తూరు, నెల్లూరు జిల్లాలకు విస్తరించింది. పాకాల నుండి గుంతకల్లు మీదుగా బొంబాయి వెళ్లే రైలుమార్గం వాడీ వద్ద హైదరాబాదు మార్గాన్ని కలుపుతోంది.

ఈ పరిణామాలు వలస పాలన మూలంగా ఏర్పడ్డాయి. వలస విముక్తి పోరాటం దేశవ్యాప్తంగా జాతీయోద్యమ రూపంలో సాగింది. అంతకుముందే సంఘసంస్కరణోద్యమాలు తెలుగు నేలలో తలెత్తాయి. తర్వాత తర్వాత భాషాసాహిత్యోద్యమాలు, గ్రంథాలయోద్యమాలు, వామపక్ష ఉద్యమాలు విద్యావంతుల్ని ప్రభావితుల్ని చేస్తూవచ్చాయి. వివిధ భాషా సాహిత్యాల సంసర్గం తెలుగు భాషా సాహిత్యాలకు ఒక ఊపు నిచ్చింది. సాహిత్యంలో, ప్రాంతీయ జాతీయ, అంతర్జాతీయ లక్షణాలు చోటు చేసుకొన్నాయి. ఈ కారణంగా ఇతి వృత్తాల్లోనూ, రూపాల్లోనూ, ఎన్నో మార్పులు వచ్చాయి. ఆ మార్పుల కనుగుణమైన పాఠక వర్గాలు కూడా ఏర్పడ్డాయి. ఈ పరిచయ వాక్యాలను దృష్టిలో ఉంచుకుని భాగంలోని అంశాలను చదవండి.

BRAOU

## 20.2 తొలి నిఘంటువులు

కుంఫినీ యుగంలో తెలుగు నిఘంటు నిర్మాణానికి భారీ ఎత్తున ప్రయత్నాలు జరిగాయి. వీటిలో దేశీయ పండితులతోపాటు ఆంగ్లేయులు పాల్గొన్నారు. బ్రౌణ్యం వంటి బృహన్నిఘంటువు రూపొందించడానికి వారు చేసిన తొలి కృషి నేపథ్యంగా తోడ్పడింది. అయితే ఈ నైఘంటుక కృషికి ముందు ఆంధ్ర భాషలో నిఘంటులే లేవా? అంటే ఉన్నాయి. అప్పటికే పద్య గద్యాల్లో ఆంధ్రనామ సంగ్రహం, ఆంధ్రనామ శేషం, ఆంధ్రభాషా వర్ణవం, ఆంధ్ర రత్నాకరం మొదలైన నిఘంటువులను నిర్మించడం జరిగింది. ఇవన్నీ కూడా అర్వాచీన నిఘంటు రచనకు అంతో ఇంతో ఉపకరించాయి. కుంఫినీ యుగంలో వెలువడిన నిఘంటు లక్ష్యాలు విస్తృతమైనవి. బహుళ జనోపయోగ దృష్టిని సంతరించుకొన్నవి. సౌలభ్యానికి అనుగుణంగా ప్రణాళికలు ఏర్పరచుకున్నవి.

ఇండియాలోనే మొట్ట మొదట అచ్చయిన నిఘంటువు తమిళ పోర్చుగీసు డిక్షనరీ దీనిని 1647లో మధుర మిషన్‌లో ప్రవేశించిన ఒక జెసూట్ మిషనరీ రూపొందించాడు. ఇది 1679లో అచ్చయింది. 1809లో కాల్ బ్రూక్ ఆధ్వర్యంలో 12 భాషల్లోనికి పోలిక పదాలను అర్థాలిస్తూ 'అమరకోశం' అనే గ్రంథం తయారయింది. ఆ భాషల్లో తెలుగు కూడా ఉంది. 1811, 1813 ల మధ్య వరదయ్యా పండితుడు (Waradaiah pandit) ఒక తెలుగు నిఘంటువును రూపొందించినట్లు తెలుస్తుంది. దాని గురించి ఇతర వివరాలేవీ తెలియవు.

1818 లో విలియమ్ బ్రౌన్ తెలుగు-ఇంగ్లీషు నిఘంటువును ప్రకటించాడు (A vocabulary of Gentoo and English). అకారాది క్రమంలో జన వ్యవహారంలోని పదాలు అనేకం దీనిలోకి ఎక్కాయి.

మామిడి వెంకయ్య అనే మచిలీపట్నం నివాసి 1806 ఆంధ్రదీపిక అనే తెలుగు - తెలుగు నిఘంటువును తయారు చేశాడు. కాని అది ఆయన మరణానంతరం 1848లో గాని అచ్చుకాలేదు. అచ్చు కాకముందే ఆంధ్రదీపిక అందరి దృష్టిలోకి వచ్చింది. తన నిఘంటువు నిర్మాణ పద్ధతి గురించి వెంకయ్య తన గ్రంథ ప్రారంభంలో ఈ విధంగా చెప్పాడు :

"వ ........, సంస్కృత శబ్దంబును పర్యాయంబులు తెలియుటకై తొల్లి యమర సింహుడొనర్చిన నామ లింగాను త్రికాండంబు వేయునారు నారునారు శ్లోకంబులలో విశేష పర్యాయంబులు నెక్కడెక్కడ భక్కికలు పూర్ణంబులౌటకును నేను రెండు వేలశ్లోకంబులు గూర్చియంతయు మూడువేలు నాఱు నూరు శ్లోకంబులకు విశేష శబ్దచింతామణి యను వ్యాఖ్యానంబు రచించి .... శబ్దార్థ కల్పతరువను గ్రంథంబొనర్చి యున్నంత యస్మన్మిత్రులు, విద్వజ్జనంబులుం గూడి యాంధ్రంబున పెక్కు నిఘంటువులు లేవనియు నాంధ్రనామ సంగ్రహంబు మిక్కిలి క్లుప్తంబనియు - ఆంధ్రంబున సకల శబ్దంబులు సంకేత రూపంబులుగా గూర్చి యేకార్థంబు లేర్పడునట్లుగా నొక గ్రంథంబు నిర్మింపుమని యుపదేశించుటంజేసి వారి యనుమతి యంగీకరించి యుండు నంత (స్వప్నమున గురుపుత్రుని ఆజ్ఞ) నాంధ్ర, శబ్దజాల సంకేత రచనా చాతురీ దురీణంబగు యాంధ్ర దీపికా నామగ్రంథంబు సేయసమకట్టితి".

ఎ.డి. కాంబెల్ మామిడి వెంకయ్య కావ్యాల్లో ఉపయోగించిన పదాలనే స్వీకరించాడు. వ్యవహారిక భాష జోలికి పోలేదని బ్రౌన్ రాశాడు. 1821లో తన "తెలుగు-ఇంగ్లీషు నిఘంటువు ప్రకటించాడు. అక్షర క్రమంలో ఉన్న నిఘంటువుల్లో ఇది మొదటిదని జయంతి రామయ్య పంతులుగారి అభిప్రాయం. కాంబెల్ కన్న ముందు పీర్ మొతెల్ (Peer Mottel) అనే జెసూట్ మిషనరీ తెలుగు-ఫ్రెంచి నిఘంటువును నిర్మించినట్లు తెలుస్తోంది. 1815 నాటికే జె. మ్యాకిరెల్ (JM' Kirrel) అనే కుంఫినీ ఉద్యోగి ఇంగ్లీషు-తెలుగు వకాబ్యులరీని తయారుచేశాడు. కాని అది అచ్చుకాలేదు. క్యాంబెల్ నిఘంటువులో పదాలకు వివిధ అర్థచ్ఛాయలు, వివరణలు ఉన్నాయి. అరబిక్ పర్షియన్ పదాలుచేరాయి. ఎక్కువగా సంస్కృత పదాలతోపాటు 'గ్రామ్య', 'దేశ్య' పదాలు చేరాయి. ఇవి చాలా భాగం రాయలసీమ ప్రాంతానికి చెందినవి.

1832లో నికోలస్ తెలుగు వాకాబ్యులరీని ప్రకటించాడు. నికోలస్ అమరకోశాన్ని అనుసరించాడు.

వీటి తర్వాత చెప్పుకోదగిన నిఘంటువు A Dictionary English and Teloogoo జాన్ కార్నాక్ మోరిస్ (John Cornac Morris) దీనిని రెండు సంపుటాలుగా నిర్మించాడు. మొదటి సంపుటం 1835లో, రెండవ

సంపుటం 1839లో అచ్చయినాయి. సరిగ్గా ఇదే కాలంలో లండన్‌లో తెలుగు పర్యాయ పదాల నిఘంటువు విలియమ కార్ పెంటర్ ప్రకటించాడు.

ఇంగ్లీషు దొరల పద్ధతిని అనుసరించే 1841లో సి. రామకృష్ణ శాస్త్రిలు A vocabulary in English and Telugu ప్రకటించాడు.

మద్రాసు ప్రెసిడెన్సీలో ముద్రణ సౌకర్యాలు అభివృద్ధి చెందంతో 19వ శతాబ్దం అర్థభాగం నాటికి నిఘంటు ప్రయత్నాలు ఉచ్ఛదశను చేర్చుకున్నాయి. ఒక బృహన్నిఘంటువు ఆవిర్భావానికి తగిన పరిస్థితులు ఏర్పడ్డాయి. చార్లెస్ ఫిలిప్ బ్రౌన్ అనే కుంఫినీ ఉద్యోగి 20 ఏళ్ల నిర్విరామ కృషి ఫలితంగా 1852లో తెలుగు ఇంగ్లీషు నిఘంటువు వెలువడింది. ఇది ఏ విధంగా చూసినా అప్పటివరకు వెలువడిన నిఘంటువులన్నింటి కంటె ఉత్తమోత్తమమైంది. కాంబెల్ డిక్షనరీలో కంటే దీనిలో అదనంగా 18వేల పదాలున్నాయి. బ్రౌన్ పదసేకరణ పద్ధతి విలక్షమైనది. జనవ్యవహారం, సమకాలిక పత్రికలు, ఆఫీసు రికార్డులు ఒకటేమిటి, అన్నిటినుండి పదాలను స్వీకరించాడు. కావ్య ప్రయోగాలతోపాటు, జనంవాడుకను, లోక రూఢిని గమనించి అర్థ నిర్ణయాలు చేశాడు. పదాల కూర్పులో వర్గ పద్ధతిని (క, చ, ట, త, ప) అనుసరించాడు. కొందరు దేశీయ పండితులకు ఈ పద్ధతి నచ్చలేదు. 1853లో బ్రౌన్ ఇంగ్లీషు-తెలుగు నిఘంటువును కూడా ప్రకటించాడు. ఇవేకాక జిల్లా నిఘంటువు మిశ్రభాషా నిఘంటువులను లిటిల్ లెక్సికాన్‌ను కూడా నిర్మించాడు బ్రౌన్.

బ్రౌన్ నిఘంటు నిర్మాణంలో ఆయన ఋజు దృష్టి, నిష్కర్ష, తటస్థ వైఖరీ ద్యోతకమవుతాయి.

## 20.3.0 వ్యాకరణ రచన

"మాట పుట్టిన వెనుక వ్యాకరణం, పాటపుట్టిన వెనుక ఛందస్సు" అనేది నానుడి. ఏభాష నేర్చుకోవ డానికైనా నిఘంటువులు, వ్యాకరణాలు చాలా అవసరం. ప్రాచీన మిషనరీలుగాని, ఇతర ఐరోపా పండితులుగాని వీటిపై ప్రత్యేక శ్రద్ధ వహించడానికి కారణమిదే. కుంఫినీ యుగంలోని ఆంగ్లేయులు రచించిన వ్యాకారణాలు తెలుగు నేర్చుకొనదలచిన పాశ్చాత్యులను దృష్టిలో ఉంచుకుని రచించినవే.

కుంఫినీ యుగంలో మొట్టమొదటి తెలుగు వ్యాకరణం 1814లో అచ్చయింది. తెలింగ వ్యాకరణము (Telinga grammar) పేరుతో దీనిని డాక్టర్ విలియమ్ క్యారీ (Dr. William Carey) అనే క్రైస్తవ మత ప్రచారకుడు రచించాడు. [illegible] ఉత్తరాది దక్షిణాది భాషలు రెంటికీ మాతృక ఒకటేననీ, తెలుగు సంస్కృత బాష నుండి పుట్టిందని రాస్తే తరువాతి కాలంలో క్యాంబెల్, విలియమ్ బ్రౌన్‌లు దాన్ని ఖండించారు. క్యారీ వ్యాకరణం వెలువడిన రెండేళ్ళలోనే (1816) ఎ.డి. క్యాంబెల్ రచించిన తెలుగు వ్యాకరణం ప్రకటితమైంది. క్యాంబెల్ తన వ్యాకరణంలో గ్రాంథిక వ్యావహారిక భాషలకు సమ ప్రాధాన్యమిచ్చినట్లు రాశాడు. కాని, నిజానికి గ్రాంథిక భాషకే హెచ్చు ప్రాధాన్యం కనిపిస్తుంది. క్యాంబెల్ వ్యాకరణం తరువాత విలియం బ్రౌన్ "జెంటు భాషా వ్యాకరణము" వెలువడింది. దీని రచన ఎప్పుడో జరిగినా (8 ఏళ్ళ క్రిందట) 1817లోనే వెలుగుచూసింది. ఆంధ్ర దీపికను రాసిన మామిడి వెంకయ్య ఈ వ్యాకరణ రచనలో విలియమ్ బ్రౌన్‌కు సాయపడ్డాడట!

BRAOU

### 20.3.1 తెలుగు వ్యాకరణం

1840లో సి.పి. బ్రౌన్ 'తెలుగు వ్యాకరణం' వెలువడే నాటికే క్యాంబెల్ వ్యాకరణం మంచి ప్రచారంలో ఉండేది. బ్రౌన్ రచన బహుళ వ్యాప్తిని పొందడంతో -క్యాంబెల్ వ్యాకరణం మూలబడింది. బ్రౌన్ వ్యాకరణం 1857లో ద్వితీయ ముద్రణ పొందింది. బ్రౌన్ చిత్తశుద్ధిగల పరిశోధకుడనీ, వ్యాకరణ రచన తెలిసినవాడనీ ఈ గ్రంథంవల్ల గ్రహించవచ్చు. బ్రౌన్ తన వ్యాకరణంలో వ్యావహారిక ఆంధ్రానికే ప్రాధాన్యమిచ్చి ప్రయోజన పరాత్వాన్ని ప్రదర్శించుకున్నాడు. కఠిన విషయాలను గ్రంథాంతానికి నెట్టి ఆరంభంలో సులభ విషయాలను చేర్చాడు. తనకు ముందు వచ్చిన వ్యాకరణాలను బ్రౌన్ పరిశీలించాడు. వాటిలో చాలా మట్టుకు భాషా భేషజం చూపేవే కాని తెలుగు సంస్కృత భాషాజన్యం అనే భావం ప్రచారంలో ఉందనీ, దానిని సంస్కృత పదజాలం పైన తెలుగు ఆధారపడి ఉందన్న అర్థంలో తీసుకోవాలనీ బ్రౌన్ రాశాడు.

బ్రౌన్ తన వ్యాకరణాన్ని పన్నెండు భాగాలుగా విభజించాడు. మొదటి పది భాగాల్లో వ్యాకరణం పూర్తవుతుంది. పదకొండవ భాగంలో ఛందస్సు, పన్నెండో భాగంలో 'ద్రుత ప్రకృతము'లను చేర్చాడు. ద్రుత ప్రకృతికాలను చివర చేర్చడానికి కారణం చెప్పాడు.

ఇంగ్లీషువారు ఆంధ్రము చదవ నారంభించేటప్పుడు కేవలం సంస్కార దూరులై వున్నారు. గనుక శబ్ద పరిచ్ఛేదం, క్రియా పరిచ్ఛేదం మాత్రము తొలుత నేర్చుకోవలసినదే గాని కళ-ద్రుతం-సంధి-సరళాదేశం-తద్భవం-తత్సమం-దేశ్యం-యిత్యాది ప్రమేయములను గురించి ప్రస్తుతము తలపెట్టనే లేదు. యీ హేతువు వల్లనే ఈ ప్రమేయములు ఈవ్యాకరణములో ఆది భాగములో వ్రాయక అంత్య భాగములో వ్రాయడమైనది. పైగా ఆరంభములో పద్యాలు చదవడం అన్ని విధాలా నిష్ఫలము గనుక తొలుత అర్జీ-జాబులు-వాజ్మూలములు-గాక మరి యేదిన్నీ చదవ నగత్యములేదు.

ఈ విధంగా బ్రౌన్ ఎంతో పరిశ్రమతో పాండిత్య స్ఫోరకంగా వ్యాకరణ రచన చేశాడు.

### 20.3.2 బాలవ్యాకరణం

19వ శతాబ్ది ప్రసాదించిన దేశీయ పండితుల్లో అగ్రేసరుడు పరవస్తు చిన్నయ్యసూరి. ఆయన రచించిన నీతిచంద్రిక, బాలవ్యాకరణాలు ఒక శతాబ్దానికి పైగా తెలుగు భాషమీద వేసిన ముద్ర సామాన్యమైనది కాదు.

చిన్నయ్య 1806లో జన్మించాడు పదహారవయేట చదువు మొదలు పెట్టాడు. అసాధారణ ప్రజ్ఞా విశేషాలవల్ల చెన్నపట్నంలో రాజధాని కళాశాలలో పండిత పదవిని చేపట్టాడు.

సి.పి. బ్రౌన్ వ్యాకరణం తర్వాత చిన్నయ బాల వ్యాకరణందాకా చెప్పుకోదగిన తెలుగు వ్యాకరణాలు రాలేదు. అప్పటివరకు ఆంగ్లేయులు వెలువరించిన వ్యాకరణాలన్నీ వ్యావహారికభాషనూ, బహుళ జనోపయోగాన్నీ దృష్టిలో పెట్టుకొని రచించినవి. ఈ ధోరణులు కావ్యభాషకు లేదా గ్రాంథికభాషకు ప్రమాదకారులని సూరి భావించినట్లుంది. 1853లోనే శబ్ద లక్షణ సంగ్రహము అనే వ్యాకరణాన్ని ప్రకటించాడు. దీనిలో 570 సూత్రాలతో 5 పరిచ్ఛేదాలు ఉన్నాయి. దీని తర్వాత తెలుగుభాషను గురించి సంస్కృతభాషలో ఆంధ్రభాషా శాసనం అనే వ్యాకరణం రచించాడు. సూరి పద్యాల్లో పద్యాంధ్ర వ్యాకరణము, శ్లోకాల్లో 'సంస్కృత సూత్రాంధ్ర వ్యాకరణము'లను వెలువరించాడు. తీవ్రమైన ఈ నేపథ్య కృషివల్ల చిన్నయ్యకు బాలవ్యాకరణ రచనకు కావలసిన పరిపక్వత సిద్ధించినట్లు గ్రహించవచ్చు.

బాలవ్యాకరణం వెలువడేనాటికి (1858) తెలుగు పండితులు రాసిన వ్యాకరణాలు కొన్ని ప్రచారంలో ఉండేవి. వేదము పట్టాభిరామ శాస్త్రి 'పట్టాభిరామ పండితీయము" (1816), రావిపాటి గురుమూర్తిశాస్త్రి 'తెలుగు వ్యాకరణము' '1836), ఉదయగిరి శేషయ్య శాస్త్రి వ్యాకరణం (1856), వేదం వెంకటరమణ శాస్త్రి 'నరసాపురం వ్యాకరణం' (1846) మొదలైనవి. ఇవన్నీ తెలుగుభాషా సంప్రదాయానుసారంగా రచించినవి.

ప్రౌఢ పండితులకు కూడా కొరుకుడుపడని ఈ వ్యాకరణానికి సూరి 'బాలవ్యాకరణం' అని పేరుపెట్టాడు. బాలురు కంఠస్థం చేయడానికి వీలుగా సూత్రప్రాయమైంది అని అర్థం చెప్పుకోవచ్చు. సూరి బాలవ్యాకరణం 10 పరిచ్ఛేదాల్లో 465 సూత్రాలు ఉన్నాయి. క్లుప్తతవల్ల ధారణానుకూలత, వ్యర్థపదాలు లేకపోవడం, శాస్త్రీయ వ్యాకరణ పరిభాషలు సమకూర్చడం, తెలుగు సంస్కృతాల సంబంధాన్ని దృష్టిలో ఉంచుకోవడం, సూత్రాల పరస్పర సంబంధాన్ని సాధించడం వంటివి బాలవ్యాకరణ ప్రత్యేకతలుగా చెప్పుకోవచ్చు.

ఇవి కాకుండా చిన్నయసూరి "అక్షర గుచ్ఛము, విభక్తిబోధిని" అనే గ్రంథాలు రచించాడు.

## 20.4 సి.పి. బ్రౌన్ సాహిత్యసేవ

చార్లెస్ ఫిలిప్ బ్రౌన్ అనే కుంఫిణీ ఉద్యోగి తన దృష్టిని ప్రసరింపకుండా ఉంటే ఈనాటి అనేక ప్రసిద్ధ కావ్యాలు వెలుగుచూసి ఉండేవి కావు. కేవలం నామమాత్రా వశిష్టాలయ్యేవేమో! విస్మృతమైన అజ్ఞాతవాసం చేస్తున్న తాళపత్ర గ్రంథరూపంలో ఉన్న కావ్యాలను సేకరించి, సంస్కరించి, వాటికి పత్రికలు రాయించి, పరిష్కరించి, ముద్రించి తెలుగువారిని ఋణగ్రస్తులను చేశాడు బ్రౌన్.



BRAOU

బ్రౌన్ జాతినిబట్టి ఆంగ్లేయుడైనా పుట్టిన స్థలాన్ని బట్టి చెప్పాలంటే భారతీయుడనవచ్చు. ఆయన కలకత్తాలోని హుగ్లీ నదీతీరంలో 1798 నవంబరు 7 వ తేదీన జన్మించాడు. 14 యేళ్ళు వచ్చేదాకా ఇక్కడే పెరిగాడు. 14వ యేట తల్లి, సోదరులతోపాటు ఇంగ్లాండు వెళ్లాడు. అక్కడున్నది ఐదేళ్లు. 1817 లో కుంఫిణీ ఉద్యోగిగా తన 19వ యేట మళ్లీ మద్రాసులో అడుగుపెట్టాడు. మధ్యలో మూడేళ్ల లండన్‌కి సెలవుమీద వెళ్లడం తప్పిస్తే మొత్తం 48 సంవత్సరాలపాటు ఇండియాలోనే గడిపాడు. బ్రౌన్ బాల్యజీవితం, ఉజ్జ్వలమైన యౌవనం, వృద్ధాప్య ఆరంభం అన్నీ ఇక్కడే గడిచాయి. తన యాభై ఏడో ఏట పక్షవాత రోగంతో ఇండియాను శాశ్వతంగా వదిలివెళ్లాడు. బ్రౌన్ లండన్లో 1884 దాక మరో 29 ఏళ్లు బతికాడు. ఆ శేషజీవితంలో కూడా బ్రౌన్ తెలుగు సాహిత్య వ్యాసంగంతోనే గడిపాడు.

అదొక చారిత్రక యుగసంధ్య. రాజుల పోషణలేక భాషాసాహిత్యాలు నాగరికతా సంస్కృతులు హీనస్థితిలో ఉన్నాయి. ఆనాటి పరిస్థితుల్లో మిణుకు మిణుకుమనే తెలుగు సాహిత్య దీపానికి చేతులు అడ్డంపట్టి వత్తిని ఎగసన తోసి రక్షించినవాడు బ్రౌన్. తెలుగు సాహిత్య పునర్వికసన వసంతుడుగా ఖ్యాతిపొందిన బ్రౌన్ తన సొంత డబ్బునూ, జీవితంలో అత్యధిక సమయాన్నీ వెచ్చించి ఎందరో స్థానిక పండితులనూ రాయస గాండ్రనూ పోషించి పునరుద్ధరణ మహాయజ్ఞాన్ని నిర్వర్తించాడు.

ఆంధ్రుల అభిమాన కావ్యాలు మనుచరిత్ర, వసుచరిత్రలు. వాటిని పరిష్కరించి అతడే మొట్టమొదట అచ్చు వేయించాడు (1851). మనుచరిత్రకు జూలూరి అప్పయ్యశాస్త్రి వ్యాఖ్యానం రాశాడు. 1832 నాటికే సిద్ధమైన ఈ గ్రంథం 19 ఏళ్లతర్వాత అచ్చయింది. వసుచరిత్రకు కూడా జూలూరి అప్పయ్యశాస్త్రి వ్యాఖ్యను రచించాడు. బమ్మెరపోతన రచించిన భాగవతాన్ని పరిష్కరణ చేయించి 1827 నాటికి సిద్ధం చేయించాడు. బ్రౌన్ 1848 నాటికి గానీ ఇది అచ్చుకాలేదు. పింగళిసూరన్న కళాపూర్ణోదయాన్ని వ్యాఖ్యాన సహితంగా అచ్చువేయించి ప్రచారానికి తెచ్చాడు. పల్నాటి వీరచరిత్ర బ్రౌన్‌కు అభిమాన గ్రంథం. అమిత శ్రద్ధాసక్తులతో పరిష్కరణ చేయించి శుద్ధప్రతిని సిద్ధం చేయించాడు. తారాశశాంక విజయం, విజయ విలాసం, వైజయంతీ విలాసం మొదలైన కావ్యాలు బ్రౌన్ ప్రోత్సాహం వల్ల వ్యాఖ్యాన సహితంగా సిద్ధమయ్యాయి. బ్రౌన్ ముద్రించిన గ్రంథాలకంటె అచ్చుకు సిద్ధం చేయించిన గ్రంథాలే చాలా ఎక్కువ ఆంధ్రుల అభిమాన ప్రజాకవి వేమన పద్యాలను బ్రౌన్ మొట్టమొదటిసారి 1829 లో ముద్రించాడు. అనేక తాళపత్ర ప్రతుల ఆధారంగా 693 పద్యాలను ఎన్నిక చేసి ఆంగ్లానువాద సహితంగా ప్రకటించాడు. ఇంగ్లీషులోకి అనూదితమైన విస్తృత గ్రంథాల్లో ఇదే మొదటిది. వేమనకు అంతర్జాతీయ కీర్తిని ఆర్జించి పెట్టిన ఘనత బ్రౌన్‌దే. 1839 లో 1164 పద్యాలతో ద్వితీయ ముద్రణ వెలువరించాడు. అనంతర ముద్రణకోసం మరో మూడువేల పద్యాలను సిద్ధం చేసిపెట్టాడు.

బ్రౌన్ గ్రంథ పరిష్కరణలో పాశ్చాత్య పద్ధతిని అనుసరించాడు. గ్రంథాంతంలో పరి భాషా పట్టికలు (Glossarial Index) ప్రథమ పాద వర్ణక్రమ సూచికలు, అధోభాగాల్లో లఘు వ్యాఖ్యలు, పాఠాంతరాల గుర్తింపు మొదలైనవి చేర్చాడు. ముద్రణ విషయంలో కూడా బ్రౌన్ కొన్ని సంస్కరణలు చేశాడు. రావడి అచ్చు కూర్పుకు ఇబ్బందిగా ఉండటాన్ని గమనించి "క్ర" కు బదులుగా "క్ర" లేదా 'క్ర అనే అక్షరాలను పోత పోయించాడట దీనికి బ్రౌన్ రకారం అని పేరు వచ్చింది. అర్థానుసార శకట రేఫలను బ్రౌన్ ఆదరించలేదు.

గ్రంథ పరిష్కరణ ప్రయత్నాలే కాకుండ బ్రౌన్ అనేక లఘు రచనలు వెలువరించాడు. పత్రికల్లో పరిశోధనాత్మకమైన వ్యాసాలు రాశాడు. బ్రౌన్ తెలుగు వారికి ప్రాతఃస్మరణీయుడు.

## 20.5 పత్రికా ప్రచురణ

తెలుగులో పత్రికా ప్రచురణ 1833లో మొదలై ఉండవచ్చునని కొంత అస్పష్టంగా తెలుస్తోంది. అయితే తెలుగులో వెలువడిన మొట్టమొదటి పత్రిక ఏది అంటే ఒక్క మాటలో చెప్పటం కష్టమే సత్యదూత అని పరిశోధకులు భావిస్తున్నారు. 1835లో బళ్లారిలోని క్రైస్తవ మత ప్రచారకులు దీనిని వెలువరించారు. దీని కాపీలు ఎక్కడా లభించలేదు. 1828లో మండిగల వేంకటరామశాస్త్రి సంపాదకత్వంలో "వృత్తాంతి" అనే వార ప్రతిక ప్రారంభమైంది. ఇది మూడేళ్లు నడచి ఆగిపోయింది. (1941), తెలియవస్తున్నంత వరకు తెలుగులో ఇదే మొదటి పత్రిక అని ఆరుద్ర అభిప్రాయ పడుతున్నారు. వృత్తాంతిలో వెలువడిన ఒక లేఖను బ్రౌన్ భద్రపరచి

BRAOU

పెట్టుకున్నాడు. వృత్తాంతి ఆగిపోయిన రోజుల్లోనే 1842 జనవరి 8వ తేదీన వర్తమాన తరంగిణి అనే వారపత్రిక వెలువడింది. ఇది ఆ రోజుల్లోనే చాలా మంది దృష్టిని ఆకర్షించిన ప్రముఖ పత్రిక. స్థాపక సంపాదకుడు ఎవరో తెలియదు. కాని పత్రిక ఆగిపోయేంతవరకూ (1858) పువ్వాడ వెంకట్రావు సంపాదకుడుగా ఉండేవాడు. దీని తర్వాత మచిలీపట్టణం నుంచి 1862లో "హితవాది" అనే మాసపత్రిక ప్రారంభమైంది, 1856లో "దినవర్తమాని" అనే వార పత్రిక వెలువడింది. పీటర్ పెర్సివల్ అనే క్రైస్తవ మిషనరీ దీనికి సంపాదకుడు. ఇది సుమారు పదిహేనేళ్లపాటు నడిచింది. అప్పట్లో ఇది ప్రభు పరాయణ పత్రిక. తర్వాత శ్రీ యక్షిణి, (1863), సుజన రంజని (1864), 'తత్వ బోధిని' (1864), ఆంధ్ర భాషా సంజీవని (1871) అనే పత్రికలు వెలువడ్డాయి.

1874వ సంవత్సరం అక్టోబర్‌లో కందుకూరి వీరేశలింగం పంతులు స్థాపక సంపాదకత్వంలో వివేకవర్ధని అనే పత్రిక అవతరించింది. ఇది నాలుగుపుటల మాసపత్రిక. తరవాత పద్దెనిమిది పుటలకు పెరిగింది. సంఘ దురాచారాలను దుమ్మెత్తిపోస్తూ సంఘసంస్కరణకు పదునైన ఆయుధంగా ఈ పత్రికను వాడుకొన్నాడు వీరేశలింగం. ఈ పత్రికను నడపటంలో ప్రతికూలతను ఎదుర్కొంటూ ఎంతో సాహసాన్ని ప్రదర్శించాడు. దాని గురించి ఆయనే ఓ సంచికలో లంచగొండితనాన్ని విమర్శిస్తే స్థానికోద్యోగులకు కోపమనీ, వేశ్యా గమనాన్ని నిందిస్తే ఊరిలోని విట వర్గానికి బాధ అనీ, అర్థం పర్థం లేని మూఢాచారాలను ఖండిస్తే అజ్ఞానులు, స్వార్థపరులు గొంతు మీదకు వస్తారనీ, నీతిని పాటించకుండా మతాచారాలకు ప్రాధాన్య మివ్వడం కూడదంటే పూజార్లు, పురోహితులు పగబడతారనీ, ఇందులో దశాంశమైనా ఈ పత్రిక ద్వారా సాధించి చూపాలంటే అనేకుల ఆగ్రహావేశాలకు గురికావలసి ఉంటుందనీ రాశాడు.

వివేకవర్ధని 1876 జూలై నాటికి పక్షపత్రికగా మారింది దీనికి అనుబంధంగా హాస్య సంజీవని వెలుపడేది హాస్య సంజీవని కొక్కొండ వెంకట రత్నం హాస్యవర్ధనికి ప్రతిగా అవతరించింది. వివేక వర్ధని వారపత్రికగా మారింది. మొత్తం పదిహేనేండ్లపాటు సతీ సుతబోధిని అనే పత్రికను నడిపాడు. ఇది 1883 నుండి మూడేండ్ల పాటు నడిచింది. 1891 లో సత్య సంవర్ధని, 1905 లో సత్యవాదిని పత్రికలను ప్రారంభించి సంఘ దుర్నీతులపైన సింహ గర్జనలు చేశాడు.

## 20.6 సంస్థానాలు – సాహిత్యసేవ

ఒకవైపు కుంఫిని పాలన కాలంలో నిఘంటు నిర్మాణాలు, వ్యాకరణ రచనలు, ప్రాచీన సాహిత్య పునరుద్ధరణ ప్రయత్నాలు జరుగుతుంటే, ఇంకో వైపు అభిరుచి ఉన్న తెలుగు సంస్థానాధీశులు పాండిత్య ప్రధానమైన సాహిత్యాన్ని ప్రోత్సహించి పోషించారు. సంస్కృత భాషా పండితుల పోషణ, ఆర్ష విజ్ఞాన విస్తరణ, సాహితీ సంస్థల స్థాపన, పత్రికా నిర్వహణ వంటి కార్య కాలాపాలతో తెలుగు జమీందారులు లోకంలో సాహితీజిజ్ఞాసను రేకెత్తించ గలిగారు. ముఖ్యంగా తెలుగు సంస్కృతికి అనుకూల వాతావరణం హైదరాబాదు రాష్ట్రంలో, గద్వాల, వనపర్తి, ఆత్మకూరు సంస్థానాలలో ఏర్పడింది. సంస్థానాలసేవ అప్పటి చారిత్రకావసరంగా పరిణమించింది.

పిఠాపురాన్ని 1862 నుండి 1890 వరకు పాలించిన రావు గంగాధర రామారావు ప్రాచీన సాహిత్యాభిమాని. వేదార్థం చెప్పటంలో విఖ్యాతి పొందిన బులుసు పాపయ్య శాస్త్రులు ఈయన ఆస్థాన విద్వాంసుడుగా ఉండేవాడు. గంగాధర రామారావు కుమారుడు సూర్యారావు బహద్దరు కాలంలో సూర్యరాయాంధ్ర నిఘంటు నిర్మాణం జరిగింది. ఆంధ్ర సాహిత్య పరిషత్తు స్థాపన జరిగింది. వావిలికొలను సుబ్బారావు రామాయణాన్ని వీరే అచ్చువేయించాడు.

తెలంగాణాలోని సంస్థానాలు భారత స్వాతంత్ర్య సిద్ధివరకూ నిలిచాయి. వాటిలో గద్వాల ప్రముఖమైంది. దీనికి 'విద్వద్గద్వాల' అని ఖ్యాతి వచ్చింది. గద్వాల పాలకులు తర్క, వ్యాకరణ, జ్యోతిష, వేదాంత శాస్త్రాల్లో పండితులకు పరీక్షలు పెట్టి సత్కరించే వారు. 1880లో అచ్చు యంత్రాలు పెట్టి ఆత్మకూరు (అమరచింత), వనపర్తి, ఇటిక్యాలపాడు, దోమకొండ సంస్థానాలు, ప్రాచీన సాహిత్యాన్ని పోషించాయి.

ఈ సంస్థానాల పోషణలో వచ్చిన రచనల్లో చాలా వరకు పాండితీ ప్రకర్షతో వెలువడినట్టివి. అనుకరణ పరాయణత ఎక్కువ. శ్లేష కావ్యాలు బహుళంగా వెలువడ్డాయి. మూడర్థాల కావ్యాలుకూడా వచ్చాయి. పాండిత్యం హెచ్చి కవిత్వ కళాదృష్టి తగ్గింది. సమస్యా పూరణాలకు, శతావధానం మొదలయిన ఆశురీతులకు బాగా ప్రోత్సాహం లభించింది. రాశిలో ఈ కాలం రచనలు తక్కువేమీ కాదు. అన్ని రకాల సాహిత్య శాఖల సృజన జరిగింది. క్షేత్ర మహాత్మ్యాలు, చారిత్రక కావ్యాలు, పురాణాలు, ప్రబంధాలు, శతకాలు, యక్షగానాలు, నాటకాలు, అనువాదాలు, వేద వాఙ్మయ, వ్యాకరణాలు మొదలుగా బహుముఖ సాహిత్య వ్యాసంగం కొనసాగింది.

1874 నాటికే తెలుగులో గద్య రచన ఎలా ఉండాలి? అనే మీమాంస బయలుదేరింది. పంచతంత్రంలోని నాల్గవ భాగాన్ని విగ్రహతంత్రాన్ని వీరేశలింగం, కొక్కొండ వేంకట రత్నం ఇద్దరూ ఏక కాలంలో అనువదించారు. కాని వేంకట రత్నం అనువాదమే మొదట అచ్చయింది. దానికన్న తన అనువాదమే మెరుగని భావించిన వీరేశలింగం తన గ్రంథాన్ని ప్రకటించాడు. ఇది పత్రికల్లో వారి స్పర్థకు దారి తీసింది. ఏది ఉత్తమ వచన శైలి? అనే ప్రధాన ప్రశ్నపై పండితుల దృష్టి మరల్చడానికి ఈ వాగ్యుద్ధం తోడ్పడింది. పైరెండు అనువాదాల్లో వీరేశలింగం గ్రంథమే ఉత్తమమైందని దాన్ని పాఠ్య పుస్తకంగా కూడా పెట్టారు.

కొక్కొండ చిన్నయసూరి కోవకు చెందినవాడు. వీరేశలింగం భాషాప్రయోజనం గురించి మధనపడుతున్నవాడు. భాష ఎంత సరళంగా, స్పష్టంగా ఉంటే భావ వ్యక్తీకరణకు అంత సార్థకత సిద్ధిస్తుందనే నమ్మకం బలపడింది. నూతన యుగావసరాలకు అనుగుణంగా భాషలు ఒక సాధనంగా నిర్మించవలసి వచ్చింది. ఈ దారిలో వీరేశలింగం చాల వరకు కృతకృత్యుడయ్యాడు.

వీరేశలింగం శతాధికంగా రచనలు చేశాడు. ఒక 'స్వీయ చరిత్రము' (1911) తప్ప మిగిలిన ప్రధాన రచనలన్నీ 1900 లోపునే వెలువడ్డాయి. తెలుగు నవల, నాటకం, జీవిత చరిత్ర తదితర ప్రక్రియలన్నింటికి వీరేశలింగమే శ్రీకారం చుట్టాడు.

నవలావిర్భావానికి మధ్య తరగతి ప్రజల్లోని అనుకూల పరిస్థితులు కారణం కావచ్చు. 19వ శతాబ్ది ఉత్తరార్థంలో భారతదేశంలో జమీందారీ వ్యవస్థ క్షీణించడం, మధ్యతరగతి ప్రజలు తమ శక్తినీ, ఉనికినీ, చారిత్రక పాత్రనూ గుర్తించడం మొదలైంది. ఇలాంటి పరిస్థితుల్లోనే 1878లో రాజశేఖర చరిత్ర వెలువడింది.

BRAOU

రాజశేఖర చరిత్రకు ప్రేరణ ఆంగ్లము నవల. గోల్డ్‌స్మిత్ రచించిన వికార్ ఆఫ్ వేక్‌ఫీల్డ్ (Vicar of wake field) ను తన నవలకు ఆధారంగా స్వీకరించాడు వీరేశలింగం. గోల్డ్‌స్మిత్ తన నవలలో మధ్య తరగతి ప్రజల స్వాభిమానాన్ని దారిద్రాన్నీ చిత్రించాడు. రాజశేఖర చరిత్ర పైన ఈ నవల ప్రభావం నామ మాత్రమే. కొన్ని సన్నివేశాలు, నలుగురైదుగురి పాత్రలను మాత్రమే మూలం నుండి స్వీకరించి తక్కినదంతా స్వీయ కల్పన చేశాడు వీరేశలింగం. ఇందులో చిత్రించిన కుటుంబం అచ్చమైన ఆంధ్రుల మధ్యతరగతి కుటుంబం; కోనసీమ ప్రాంతానికి చెందిన జీవితం. వీరేశలింగానికి శిల్పదృష్టి కన్న ప్రబోధ దృష్టి ప్రబలం అని ఈ నవలవల్ల గ్రహించవచ్చు. అయితే ఆయన వాస్తవిక వాది. దుర్భరమైన సమకాలీన సామాజిక జీవితానికి ప్రతిబింబంగానే ఈ నవలా రచన జరిగింది. హిందువుల కుటుంబజీవితం. మతాచారాలు, మూఢ విశ్వాసాలు, స్త్రీల పరిస్థితులు, వివాహ నిర్ణయంలో పెద్దల అధికారం లాంటివి నిదర్శన పూర్వకంగా చిత్రితమైనాయి. రాజశేఖర చరిత్ర నవలా రూపంలో ఉన్న సాంఘిక చరిత్ర.

నాటక లక్షణాలతో పరిపుష్టంగా వెలువడిన వీరేశలింగం 'బ్రాహ్మ వివాహం' తెలుగులో తొలి స్వతంత్ర నాటకం. ఇది 1876 లో 'హస్య సంజీవని' లో ధారావాహికంగా ప్రకటితమైంది. 1878లో బ్రహ్మవివాహం పుస్తకంగా వచ్చింది. ఇది హాస్యభరిత సాంఘిక నాటకం మూడవ భార్య చనిపోతే మళ్ళీ మూడేళ్ళ పసికందును పెళ్ళి చేసుకొన్న పెద్దయ్య ఈ నాటకంలో ప్రధానపాత్ర, డబ్బు కక్కుర్తితో వెయ్యి రూపాయలకు బాల వధువును అమ్మిన తల్లిదండ్రులు, స్వార్థంతో పెళ్ళికుదిర్చిన పెళ్ళిళ్ళ పేరయ్యలు, పెద్దయ్యను ముప్పయ్యేండ్ల వయస్సు వాడిగా జాతకాదారాలు చూపిన జోతిష్కుడు ఈ నాటకంలో కొన్ని ముఖ్యపాత్రలు. మిగిలిన పాత్రలు కూడా స్వార్థపరులు, అవినీతిపరులు, మానవత లేనివారు. బ్రాహ్మవివాహం నాటకం ఆకాలంలో చాలా ప్రచారం పొందింది. ప్రేక్షకులీ నాటకాన్ని పెద్దయ్యగారిపెళ్ళి అని పిలిచేవారు.

శత వృద్ధులు పసి బాలికలు పెళ్ళిచేసుకునే ఆచారానికి గొడ్డలిపెట్టుగా పరిణమించింది బ్రాహ్మ వివాహం.

బ్రాహ్మ వివాహం తర్వాత 1879లో వీరేశలింగం 'వ్యవహార ధర్మబోధిని' అనే మరో సాంఘిక నాటకాన్ని రచించాడు. దీనిలో ప్లీడర్ల నైతిక పతనం న్యాయస్థానోద్యోగుల దుండగాలు 'వాది ప్రతివాదులు దుశ్చర్యలు చిత్రితమైనాయి. ప్రేక్షకులీనాటకానికి 'ప్లీడర్ల నాటకం' అని ముద్దుపేరు పెట్టారు.

వీరేశలింగం మూడో నాటకం కూడా సాంఘికమే, కాని అసమగ్రం. వితంతు వివాహం దీనిలోని ఇతివృత్తం. సమాజాన్ని పశువులదొడ్డిగా చిత్రిస్తూ నాటికలు రచించాడు వీరేశలింగం.

వీటి తర్వాత రచించిన నాటకాలకు వీరేశలింగం 'ప్రహసనాలు' అని పేరు పెట్టాడు. మొత్తం 14 ప్రహసనాలు రచించాడు. 46 లఘు నాటికలను హాస్య ప్రధానంగా వెలువరించాడు. వీరేశలింగం హాస్యం సున్నితమూ, సరసమైందీ కాదు. అధిక్షేప ప్రధానమైంది.

వీరేశలింగం నాటకాల్లో గ్రాంథిక భాషను, ప్రహసనాల్లో వ్యావహారిక భాషను వాడాడు. రచనల్లో ఎంతో కొంత వ్యావహారిక భాషను ప్రవేశ పెట్టడంలో కూడ వీరేశలింగమే అద్యుడు.

వీరేశలింగం 'ప్రహ్లాద చరిత్ర', 'దక్షిణ గోగ్రహణము', 'హరిశ్చంద్ర నాటకం' అనే మూడు పౌరాణిక నాటకాలు కూడా రచించాడు. మరెన్నో నాటకాలు అనువదించాడు.

వీరేశలింగం తొలి నాటక కర్తే కాక తొలి నాటక ప్రయోక్త కూడా. 1880 లో కొద్ది మంది సమక్షంలో వ్యవహార ధర్మబోధిని ప్రదర్శితమైంది.

ఆ నాటికి (1887) ఒక విలక్షణమైన పరిశోధన పద్ధతిలో 'తెలుగు కవుల చరిత్ర'ను సమగ్రంగా తొలి సారిగా రచించిన ఘనత కూడ వీరేశలింగానిదే. ఆయన కంటె ముందు గురజాడ శ్రీరామమూర్తి కొందరు ప్రసిద్ధ కవుల చరిత్రను చిన్న చిన్న పుస్తకాలుగా ప్రకటించాడు. అయితే అందులో చారిత్రక సత్యాలపైన కాక పుక్కిటి పురాణాలు, కింవదంపతులు, కట్టు కథలపైనే ఎక్కువగా ఆధారపడ్డాడు.

BRAOU

వీరేశలింగం చారిత్రకాధారాలు, పరిశోధన ప్రమాణాలతో కూడిన కవుల చరిత్ర రచనకు పూనుకొన్నాడు. మదరాసు ప్రాచ్యలిఖిత భాండాగారంలోను, తంజావూరు సరస్వతీ మహల్ లోను, పండితుల ఇండ్లలోను దొరికిన తాళపత్ర గ్రంథాలను సంప్రదించి, తదితర విషయ సేకరణకు దేశాటనం చేసి, మూలాధారాలను శాస్త్రీయంగా గాలించి, సాధ్యమైనంత వరకు వివాదాల నిగ్గుతేల్చి అనేక వ్యయ ప్రయాసల కోర్చి మొదట మూడు సంపుటాలుగా, పిదప ఒక గ్రంథంగా ప్రకటించాడు. దీనిలో ఆదికవి నన్నయ నుండి గోపీనాథ వేంకటకవి వరకు మొత్తం 220 మంది కవుల జీవిత చరిత్రలున్నాయి. ఆయన చేసిన కవుల కాల నిర్ణయాలు అనేకం ఇప్పుడు మారినా అప్పటికది మార్గ దర్శక గ్రంథం. కవుల చరిత్ర వలన ఇరవై ప్రాచీన కావ్యాలు పరిష్కరణకు నోచుకున్నాయి. వాటిలో పద్దెనిమిదింటిని ఆయనే మొదటి సారి అచ్చు వేశారు. అప్పటికి బ్రౌన్ తర్వాత తెలుగు కావ్య పరిష్కరణనూ, ముద్రణనూ ఎక్కువ సంఖ్యలో చేసినవాడు వీరేశలింగమే.

తెలుగు సాహిత్యంలో జీవిత చరిత్ర, స్వీయ చరిత్రలను ప్రవేశ పెట్టిన వాడు కూడా వీరేశలింగమే. మొదట ఏసుక్రీస్తు, విక్టోరియా రాణి జీవిత చరిత్రలను రచించాడు. సంగ్రహజీవిత చరిత్రలు అనేకం రాశాడు. అయితే జీవిత చరిత్ర రచనా శిల్పం కొరవడ్డం వల్ల అవి అంతగా రాణించలేదు.

1911 రచించిన వీరేశలింగం స్వీయ చరిత్ర మాత్రం ఉత్తమోత్తమమైన రచన. తన జీవిత చరిత్రను చెప్పడంలో అతిశయోక్తులను గాని, అతివినేయతను గాని ఎక్కడా ప్రదర్శించలేదు. న్యాయంగా తనకు కావలసిన ఘనతను చెప్పుకొన్నాడు. అశక్తతను, అపజయాలను దాచుకోలేదు. త్రికరణశుద్ధి, యదార్థత, నిర్భీతి మొదలైన స్వీయ చరిత్ర లక్షణాలన్నీ దీనిలో కనిపిస్తాయి.

వీరేశలింగం వ్యంగ్య రచనల్లో కూడా ప్రథముడే గలివర్ ట్రావెల్స్ అనే ఆంగ్ల నవల పద్ధతిలో ఆయన రచించిన సత్యరాజాపూర్వదేశ యాత్రలు అనే గ్రంథం చాలా ప్రసిద్ధి కెక్కింది. 'అభాగ్యోపాఖ్యానం' అనేది

ఈయన రెండో వ్యంగ్య రచన. క్షీణ యుగంలోని అశ్లీల శృంగార ధోరణులను అవహేళన చేస్తూ రచించిన ప్రబంధమిది.

వీరేశలింగం విజ్ఞాన శాస్త్రి గ్రంథాలను కూడా రచించి ప్రచురించాడు. తెలుగులో బాలసాహిత్యానికి కూడా శ్రీకారం చుట్టి నీతి కథామంజరి, నీతి దీపికలను బాలబాలికలకు పాఠ్యపుస్తకాలుగా రచించాడు.

వీరేశలింగం సంగ్రహ వ్యాకరణం, అలంకార సంగ్రహము అనే లక్షణ గ్రంథాలను కూడా రచించడం విశేషం.

వీరేశలింగం బహుముఖ ప్రతిభా, తజ్ఞస్యమైన ఆయన రచనలూ గుణంలో, రాశిలో వైవిధ్యంలో, వ్యాప్తిలో అపూర్వమైనవి, అమూల్యమైనవి. ఆయన సామాజిక, సాహిత్య సేవ చిరస్మరణీయమైంది.

## 20.8.0 వివిధ కవితోద్యమాలు – ధోరణులు

ఆధునిక దశలో తెలుగులో కొన్ని ప్రధానమైన కవితోద్యమాలు ధోరణులు తలెత్తాయి. వాటిలో ప్రధానమైన వాటిని ఈ ఉప విభాగంలో పరిచయం చేస్తున్నాము.

### 20.8.1 దేశభక్తి గీతం గురజాడ

గురజాడ అప్పారావు రాసిన దేశభక్తిగీతం యవ్వనోద్వేగంలో చేసిన కేవల ఆవేశ పూరిత రచనకాదు. 58వ ఏట (1910) నుంచి పరిణతదశలో (పరిణామశీల పర్యవసాయి అయిన) నూతన జీవిత దృక్పథంలోంచి వెలువడిన గీతం అది. అంతకు కిందటి సంవత్సరమే (1909) కన్యాశుల్కం రెండవ ముద్రణ మార్పు, కూర్పులతో వెలువడింది.

తెలుగులో నవ్యరీతులకు నూతన ప్రమాణాలకు ప్రయత్నించిన మొదట కవిని నేనే. నాకావ్యకళ నవీనం; కావ్యయితివృత్తాలు భారతీయం కవితలో ఏను ఉత్తమ ప్రయోజనాలను ఉపలక్షించాను; జీవితాన్ని నూతన దృక్పథంతో దర్శించి, కథా, కవితా రూపంలో అని తత్వాన్ని అన్వయించడానికి ప్రయత్నించాను అని తానే స్వయంగా చెప్పుకోగలిగిన ధీరత్వం ఆయనకప్పటికే ఉండింది. 'అప్పటికే అనడం ఎందుకంటే నవ్యతలో ఆయన తన కాలం కంటే ఒక శతాబ్దం ముందున్నాడు. తన మరణానికి ఐదేళ్లముందు దేశభక్తిగీతం రాస్తే మరణించింతర్వాత పాతికేళ్లకుగాని లోకం ఆయన్ను గుర్తించలేదు. ఈ గుర్తింపు ఆలస్యం కావటానికి అప్పటికే విజృంభిస్తున్న జాతీయోద్యమ, భావకవిత్వాలు కొంత కారణమైనాయి. తన సరికొత్త భావాలను సమకాలికులు మెచ్చరనే స్పృహ ఆయనకున్నది. 'కొయ్యబొమ్మలు మెచ్చుకనులకు కోమలుల సొరెక్కునా' అని ఆత్మ విశ్వాసంతో ఈసడించాడు. భార్యభర్తల సంబంధాన్ని నిర్వచించడంలో గానీ ('మగడువేల్పన పాత మాటది. ప్రాణమిత్రుడునాకు') వర్ణాశ్రమ ధర్మాన్ని నిరాకరించడంలో గానీ (మలినదేహుల మాలలనుచును, మలిన చిత్తుల కధిక కులముల, నెల వొసంగిన వర్ణధర్మ మధర్మ ధర్మంవా), మతాన్ని మీరిన తత్వాన్ని దర్శించడంలో గానీ ("మతములన్నియు మాసిపోవును, జ్ఞానమొక్కటి నిలిచి వెలుగును") గురజాడ అప్పారావు తన కాలంకన్నా ఎంతో ముందున్నాడు.

BRAOU

దేశభక్తి గీతం రాసిన సంవత్సరం అనేకాకుండా 1910ని ఇతర రకాలుగా కూడా గుర్తుంచుకోవచ్చు. గురజాడ నవ్యభావాలను వెల్లడించే రచనలనేకం ఈ సంవత్సరంలోనే ప్రచురించబడ్డాయి. 'దిద్దుబాటు (తొలికథ)', 'మీరేమిటి', అనే కథలూ, 'లోకముక్క, కాసులు, డామన్ పిథియస్, పూటి చోద్యమేమి చెపుదు' అనేగేయాలు 1910 లోనే అచ్చయ్యాయి. ఇవే కాకుండా లవణరాజుకల, కన్యక, పూర్ణమ్మ అనే గేయాలు గురజాడ మహాకవిత్వ సిద్ధికి పుష్టిని చేకూర్చాయి.

'దేశమును ప్రేమించుమన్నా
మంచి అన్నది పెంచుమన్నా'

అంటూ 56 గేయ పంక్తుల్లో సాగిన ఈ మహారచన భారతీయ సాహిత్యంలోనే అపూర్వం అని విమర్శకులు భావించారు. అర్థ భావాలదృష్ట్యా, జాతీయ అంతర్జాతీయ చేతనా వైశాల్యం దృష్ట్యా, ఈ గీతం

బంకించంద్రుని వందేమాతరం, రవీంద్రుని 'జనగణమన', ఇక్బాల్ 'సారేజహాసేఅచ్ఛా' అనే గీతాలను మించిపోయిందని కూడ విమర్శకులు భావించారు. ఈ గీతం స్వదేశీ ఉద్యమానికి కొంచెం ముందుగా ఉన్న సాంఘిక రాజకీయ భాషా విషయక పరిస్థితులన్నింటికీ అద్దంపట్టింది. దేశభక్తి అంటే కేవలం ఒక భౌగోళిక ప్రాంతం, అస్తిత్వంపట్ల మాత్రమే అభిమానంకాదనీ, దేశీయుల అమూల్యమైన మానవీయ జీవితం, గమ్యం చేరుకునే ఆందోళనాచైతన్యం ఇవే నిజమైన దేశభక్తి అనీ గురజాడ భావించాడు. గురజాడ తన గేయ ఛందస్సుకు 'ముత్యాలసరం' అని పేరు పెట్టాడు. గుమ్మడేడే గోపితల్లీ అనే జానపద గేయం కర్ణాటక భాషలోని ఒక షట్పది. పారసీ భాషలోని ఒకగజల్, వృషభగతిరగడ మొదలైన ఛందోప్రక్రియలు ముత్యాల సరానికి మూలం కావచ్చు అని పరిశోధకులు భావించారు. దేశభక్తి గీతాన్ని గురించి రాస్తూ "పావురం లాగా ప్రశాంతంగా రవళిస్తూనే సింహంచేసే క్ష్వేళాధ్వనిని స్ఫురింప చేస్తుంది" అని శ్రీశ్రీ ప్రశంసించాడు.

గురజాడ విశ్వమానవతను ప్రబోధిస్తూనే లవణరాజుకల, కన్యక, పూర్ణమ్మ 'మనిషి' లంగరెత్తుము లాంటి గేయరచనల ద్వారా సంఘ సంస్కరణకు ప్రేరణ కలిగించారు. 'పాతకొత్తల మేలుకలయిక' గా భావంలో భాషలో నవీనరీతులకు ఒరవడి పెట్టాడు గురజాడ. నవ్యరీతులు, నూతన ప్రమాణాల కొరకు కృషిచేసి గురజాడ యుగకర్త అయ్యాడు.

ఈ కాలంలోనే కావ్యరచనలో అనేక కొత్తపోకడలు పోయిన కవి రాయప్రోలు సుబ్బారావు. కొత్త పోకడ లన్నప్పుడు క్రీ. శ. 1900 లో వెలువడిన కట్టమంచి రామలింగారెడ్డి ముసలమ్మ మరణమును ఈ సందర్భంగా స్మరించడం అనే అపూర్వమైన విషయాలు, 1912లో రాయప్రోలు వెలువరించిన 'తృణకంకణం' కావ్యం అన్ని రకాలుగా నవ్యతన ప్రదర్శించింది. ఇద్దరు భగ్న ప్రేమికుల ప్రేమ అమలిన ప్రేమగా కానీ, స్నేహ పర్యవసాయిగా కానీ పరిణమించడం దీన్లోని ఇతివృత్తం. నాయిక రూపవర్ణన కాకుండా, గుణవర్ణన చేయటం లాంటి ప్రత్యేకతలు చాలా ఉన్నాయి. రాయప్రోలు తన కావ్యాల్లో అమలిన శృంగారత్వాన్ని ప్రతిపాదించాడు. ప్లేటోనిక్ లవ్ దీనికి మూలం. కామ ప్రమేయం లేని శుద్ధ ప్రణయభావాల్ని అమలిన శృంగారమనవచ్చు. అంతకుముందు వెలువడిన 'కష్టకమల' అనేకావ్యంలో సోదరీ సోదర భావమున్నచోట కామభావానికి స్థానంలేదని నిరూపించాడు. రాయప్రోలు 1914లో ముద్రితమైన 'స్నేహలత'లో వరకట్న దూరాచారానికి బలైన యువతి ఆత్మాహుతిని వర్ణించాడు. 'రమ్యాలోకము, మాధురీదర్శనము' అనే గ్రంథాల్లో రాయప్రోలు కావ్యలక్షణ సిద్ధాంతాలు చేశాడు. ప్రేయో రసము, వత్సలరసము, అమలిన శృంగార సిద్ధాంతము మొదలైన వాటిని గురించిన చర్చ వీటిలో జరిగింది.

### 20.8.2 జాతీయోద్యమం, ఆంధ్రోద్యమ కవిత్వం

దేశభక్తి ప్రపూరితమైన జాతీయోద్యమం కూడా ఈ శతాబ్ది తొలిదశాబ్దంలోనే ఆరంభమైంది. బంకిం చంద్రఛటర్జీ రాసిన 'వందేమాతరం', రవీంద్రునీ 'గీతాంజలి', ఇక్బాల్, నజ్రుల్ ఇస్లాంగీతాలు. అరవిందుని రచనలు, తెలుగువారిని కూడా ప్రభావితుల్ని చేశాయి. బందరులో జాతీయకళాశాల స్థాపన, గాంధీజీ ప్రభావంతో విదేశ వస్త్రాల విదేశీ విద్యల తిరస్కరణ, స్వాతంత్ర్య సమరాభిరక్తి, కృష్ణాపత్రికలో ముట్నూరు కృష్ణారావు సంపాదకీయాలిచ్చిన భావప్రేరేపణ, గాడిచర్ల హరిసర్వోత్తమరావు, అయ్యంకి వేంకటరమణయ్యల గ్రంథాల యోద్యమం – ఇవన్నీ ఆంధ్రుల్లో జాతీయభావాల పుట్టుకకు తార్కాణాలు. ఈ కాలంలో స్వాతంత్ర్యోద్యమం ఆంధ్రాభిమానం జమిలిగా అల్లుకుపోయిన కవిత్వం వెలువడింది.

గురజాడ దేశభక్తి గీతరచన తర్వాత నాలుగేళ్ళకి (1914) జాతీయ భావాలతో దేశాభిమాన స్ఫూర్తిని కలిగిస్తూ రాయప్రోలు సుబ్బారావు ఏ దేశమేగినా ఎందుకాలిడినా పొగడరా నీతల్లి భూమిభారతిని అంటూ రాసిన గీతం ఎంతో ఉత్తేజాన్ని కలిగించింది. అంతే ఆవేశంతో ఆంధ్రాభిమానాన్ని వ్యక్తం చేస్తూ 'చావలేదు చావలేదు ఆంధ్రుల మాహాత్మ్యాల చరిత్ర' అంటూ 'అమరావతీపట్టణమున బౌద్ధులు విశ్వవిద్యాలయములు స్థాపించునాటి' సంగతులు గుర్తుచేశాడు రాయప్రోలు. తెలుగువారి సమైక్యతను గురించి, తెలుగుభాష ప్రశస్తిని గురించీ అనేక పద్యాలు రచించాడు. నాజాతి, నాభాష అనే 'స్వ' భావాలు పునాదిగా దేశభక్తిని చాటినవారిలో రాయప్రోలు అగ్రగణ్యుడు.

ఆంధ్రాభిమానాన్ని ప్రబోధించే కావ్యాల్లో విశ్వనాథ 'ఆంధ్రప్రశస్తి' పేర్కొనదగింది. ఇది వస్తుపరమైన కావ్యం. ఆంధ్రుల చరిత్రలోని కొన్ని ప్రముఖఘట్టాలను ఎన్నుకొని విశ్వనాథ ఖండకావ్యాలను రాశాడు.



BRAOU

కొడాలి వేంకట సుబ్బారావు హంపీక్షేత్రం, శ్రీనివాస సోదరుల ఓరుగల్లుకోటలు కూడా ఆంధ్రుల చారిత్రక ఉజ్జ్వలతను చాటాయి.

బిపిన్ చంద్రపాల్ ఆంధ్రదేశ పర్యటన చేస్తూ రాజమహేంద్రవరం వచ్చినపుడు చేసిన ఉపన్యాసం విని ఉత్తేజితుడై చిలకమర్తి లక్ష్మీనరసింహం రాసిన తేటగీతిపద్యం చాలా ప్రసిద్ధి పొందింది :

'భరతఖండంబు చక్కని పాడియావు
హిందువులు లేగదూడలై యేడ్చుచుండ
తెల్లవారలు గడుసరి గొల్లవారు
పితుకుచున్నారు మూతులు బిగియగట్టి

జాతీయోద్యమ కవుల్లో మంగిపూడి వెంకటశర్మ పేర్కొనదగినవాడు. ఈయన 1920 లోనే అంటే గాంధీజీ హరిజనోద్ధరణ తలపెట్టకముందే 'గాంధీశతకము' రాశాడు. ఈయన రాసిన 'వితంతు విలాసము', 'నిరుద్ధభారతము' అనే కావ్యాలు సంఘ సంస్కారాభిలాషనూ, హరిజన సమస్యనూ ప్రదర్శించాయి. పాటలద్వారా సామాన్య ప్రజలను సైతం ఉత్తేజ పరచిన ఘనత గరిమెల్ల సత్యనారాయణది. 'మాకొద్దీతెల్లదొరతనము' అనే ఆయన పాట ఊరేగింపుల్లో మార్మోగేది. మంగిపూడివారి మేలుకొనుమీ భారత పుత్రుడ అనే గీతం ప్రసిద్ధమైంది.

స్వాతంత్ర్య కాంక్షను, జాతీయ ఐక్యతను చాటుతూ కొన్ని పెద్ద కావ్యాలు కూడా వెలువడ్డాయి. రాజశేఖర శతావధాని "రాణాప్రతాపసింహ చరిత్ర" గడియారం శేషశాస్త్రి శివభారతము వాటిలో ప్రముఖమైనవి.

వీరే కాకుండా బలిజేపల్లి లక్ష్మీకాంతం, దేవరాజు పుండరీకాక్షుడు, మాధవపెద్ది బుచ్చిసుందర రామశాస్త్రి, తుమ్మల సీతారామమూర్తి, దువ్వూరి రామిరెడ్డి మొదలైన కవులు జాతీయోద్యమానికి స్ఫూర్తిని కలిగించారు.

**20.8.3 భావ కవిత్వం**

భావకవిత్వం అన్న మాటను మొట్టమొదటిసారి గాడిచర్ల హరిసర్వోత్తమ రావు వాడారట. "కవియొక్క ఒక అవిస్పష్టవాంచాంఛాకురము, ఒక అంతర్గూఢ తాపము, ఒక చిన్న కావ్యములో ఊదబడిన" చో అది భావ కవిత్వమని విశ్వనాథ నిర్వచించారు. "భావము యొక్క కవితా స్వభావము భావికవిత్వ" మని కవి కొండల వేంకటరావు పేర్కొన్నాడు. కీట్సు మొదలైన ఇంగ్లీషు కవుల ప్రభావం తెలుగు భావ కవుల మీద ఉండేది. భావ కవుల కవితల్లో వినియోగానికే ఎక్కువ ప్రాధాన్యం లభించింది. తమ దృష్టిలో ఉన్న తరుణి గురించో, ఊహా ప్రేయసిని గురించో కవితలు అల్లేవారు. "అప్రాప్త మనోహరి" గురించి ఆశాభంగంతో విషాద గీతాలాలపించేవారు. భావ కవుల ప్రణయ కావ్యాలు వస్తుసహితలు, వస్తురహితలు అంటూ రెండు రకాలుగా వెలువడ్డాయి. వస్త్వాశ్రియ రీతిలో రాయప్రోలుకు సముచిత స్థానమే ఉంది. అబ్బూరి రామకృష్ణారావు మల్లికాంబ, దువ్వూరి రామిరెడ్డి 'కడపటి వీడ్కోలు', వేంకటపార్వతీశ్వర కవుల 'జలజమాలిక' ఈ కోవలోకి వస్తాయి. స్నేహితురాలికి వచ్చిన ప్రేమలేఖలను తనవద్ద దాచడం వల్ల భర్త అనుమానానికి గురియై మరణించిన మల్లిక కథ 'మల్లికాంబ'. పరిస్థితులు అడ్డురాగా చిన్ననాటి చెలికాండ్రయిన అన్నపూర్ణా చంద్రశేఖరుల వివాహం భగ్నంకావడం, అన్నపూర్ణా ఆత్మహత్యకు దారితియ్యడం జలజమాలికలోని కథ. విచిత్ర మనస్తత్వంగల గౌతముడు శారద వలపును నిరాకరించడం, బలవంతపు కౌగిలింతల పెనుగులాటతో వారిద్దరూ వాగులోపడి మరణించడం కడివటి వీడుకోలు లోని కథ. ఈ మూడు కావ్యాల్లోనూ ప్రణయతత్వ నిరూపణకు ప్రయత్నాలు కలిగాయి.

భావకవులలో దేవులపల్లి కృష్ణశాస్త్రి శిఖరప్రాయుడు, భావకవిత్వ లక్షణాలుగా గుర్తించినవాటికి ఎక్కువ ఉదాహరణలు కృష్ణశాస్త్రి గీతాల్లోనే లభిస్తాయి. భావకవిత్వం మీద విమర్శనలను ముఖాముఖి ఎదుర్కొని, ఆ ప్రక్రియను సమర్థిస్తూ బహిరంగ సభలు నిర్వహించి బరువు మోసిన వాడు నిజానికి కృష్ణశాస్త్రి. భావకవుల ప్రేమ సహజమైనది. అవ్యాజమైనది. దానికి ఆయన ఇట్లా అంటాడు :

సౌరభము లేల చిమ్ము పుష్ప ప్రజంబు ?
చంద్రికలనేల వెదజల్లు చందమామ ?

ఏల సలిలంబు పాఱు? గాడ్పేల విసరు ?
ఏల నాహృదయంబు ప్రేమించు నిన్ను ?

భావకవుల స్వేచ్ఛాప్రియత్వానికి కూడా కృష్ణశాస్త్రి రచించిన స్వేచ్ఛాగానం సరైన ఉదాహరణ. ప్రకృతిలో స్వేచ్ఛగా విహరించే పక్షులను, పిల్లగాలులను, మేఘాలను, మెరపులను, చుక్కలను, చందమామను చూసి తాను కూడా స్వేచ్ఛావిగానంలో

ఏను స్వేచ్ఛా కుమారుడ ఏను గగన
పథ విహార విహంగమ పతిని అంటాడు.
'నవ్వి పోదురుగాక నాకేటి సిగ్గు
నాయిచ్ఛయే గాక నాకేటి వెరపు'

అంటూ స్వేచ్ఛా ప్రియత్వాన్ని నిర్ద్వంద్వంగా వెల్లడిస్తాడు. అయితే ఈ స్వేచ్ఛ సంఘంలోని కృత్రిమమైన కట్టుబాట్ల నుంచైనా కావొచ్చు, ఆనాటి పరాయి పాలన నుంచైనా కావొచ్చు, సాహిత్యపరంగా లాక్షణిక బంధనాలనుంచైనా కావొచ్చు. ఇట్లా ఈ కవితలో వైయక్తిక స్వేచ్ఛ మాత్రమే కాకుండా సమాజానికంతటికీ స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు కావాలనే అభిలాష కూడా కలిసి ఉంటుంది :

'తిమిరలత తారకా కుసుమములు దాల్చ
కర్కశ శిలము నవజీవ కళలదేర
మోడు మోక చివురులొత్తి మురువు చూప
క్రౌర్య కౌటిల్య కల్పిత కఠిన దాస్య
శృంఖలములు తమంత తా చెదరిపోవ
జగము నిండ స్వేచ్ఛాగాన ఝురులు నింతు'

కృష్ణశాస్త్రిది ఆత్మాశ్రయ రీతి. భావకవుల రచనల్లో ఇదొక ప్రధాన లక్షణం. వాస్తవ లోకంలోని అస్తవ్యస్త పరిస్థితుల నుండి తప్పించుకు పోవడం భావ కవుల్లో కనిపిస్తుంది. 'లోకముతో మనకేటికి లోలాక్షి రాపోద' మని బసవరాజు అప్పారావు, 'చేయికి చేయి జేర్చి పెఱ చింతనల్ మరపించురాగముల్దీయుచు, వాసనల్ పరిమళించెడు చోటుల యందు' విహరించడానికి అబ్బూరి రామకృష్ణారావు పిలుపు నిచ్చాడు. భావ కవుల ప్రేయసి వర్ణనల్లో అంగాంగ వర్ణనలు ఉండవు. భావ కవిత్వంలో వియోగ విషాదం పరాకాష్టనందుకున్నది :

'దారుణపు జీవితంపు టెడారిలోన
తీరని పిపాసనే దారి తెన్ను లేక
నేనె నా దుఃఖ భాష్ప శోణిత లహరుల
నే విసుగు వేసడలు లేక త్రావినాను'

అంటూ వేదుల సత్యనారాయణశాస్త్రి తన దుఃఖోద్వేగాన్ని ప్రకటించాడు. ఆత్మాశ్రయ రీతిలో సాగినప్రణయ కావ్యాల్లో నాయని సుబ్బారావు 'సౌభాద్రుని ప్రణయయాత్ర', 'బసవరాజు అప్పారావు గీతాలు', వేదుల 'దీపావళి', దేవులపల్లి కృష్ణపక్షము, మల్లవరపు విశ్వేశ్వరరావు 'మధుకీల' మొదలైన కావ్యాల్లో దేనికదే విశిష్టమైనది.

భావ కవిత్వంలో నాయికా ప్రధానమైన కావ్యాలు వెలువడి, ఆ నాయికల పేర్లు తెలుగు సాహిత్యంలో చిరస్థాయిగా నిలిచిపోయాయి. వారిలో శివశంకరశాస్త్రి 'హృదయేశ్వరి', బాపిరాజు 'శశికళ', విశ్వనాథ 'కిన్నెర', నండూరి 'యెంకి' నాయని 'వత్సల' ప్రసిద్ధి కెక్కారు.

ఇంగ్లీషు కాల్పనికత్వంలో ప్రకృత్యారాధనం అనేది ప్రధాన లక్ష్యం. సమకాలీన సమాజంలోని సమస్యలతో విసిగిపోయి, పలాయన చిత్తవృత్తితో ఉన్న ఆనాటి కవులకు ప్రకృతి గొప్ప ఉపశమనం కలిగించింది. 'ఆకులో ఆకునై, పూవులో పూవునై, కొమ్మలో కొమ్మనై' నునులేద రెమ్మనై ప్రకృతిలో లీనమై పోవాలనుకుంటాడు దిగిరాను దిగిరాను దివి నుండి భువికి అంటూ మొండికి పడ్డాడు. పల్లెలు, పల్లె జీవితం, పట్ల కూడా మనసు నాటి ...

BRAOU

కవులకు పోయింది. 1919 లో దువ్వూరి రామిరెడ్డి రచించిన 'కృషీవలుడు' అనే కావ్యం కర్షక వాఙ్మయంలో అగ్రగణ్యమైనది.

సంఘ సంస్కరణ భావాలు భావ కవులను ప్రభావితం చెయ్యడం వింతేమీ కాదు. ఇటలీలో జరిగిన రినైజాన్సు ఉద్యమం ప్రపంచవ్యాప్తంగా మానవతా దృక్పథానికి పాదులు చేసింది. బెంగాల్లో రామమోహనరాయ్ కలిగించిన సంస్కరణ స్ఫూర్తిని ఆంధ్ర దేశంలో వీరేశలింగం అందుకున్నాడు, బాల్య వివాహాల ఖండన, కన్యాశుల్క నిరసన, వర్ణవ్యవస్థకు వ్యతిరేకత, హరిజన సమస్య మొదలైన నూతన దృక్పథాలు మొలకెత్తాయి.

'బాల వితంతు విలాసము' లో మంగపూడి వెంకటశర్మ 'పైకమిచ్చిన వారికే బాలికలను గట్టి పెట్టుట యిది యేటి కర్మ' మని ఆక్రోశించాడు. వరశుల్కాన్ని ఖండిస్తూ భోగరాజు నారాయణమూర్తి 'పండుగ కట్నము' అనే కావ్యాన్ని రచించాడు. కన్యాశుల్క దురాచారంలోని అమానుషత్వాన్ని చిత్రిస్తూ గురజాడ రచించిన 'పూర్ణమ్మ', రాయప్రోలు 'స్నేహలత' ఎంతో ప్రసిద్ధికెక్కాయి.

స్త్రీని వంటయింటి కుందేలువలె అనగద్రొక్కడాన్ని కూడా ఆనాటి కవులు ఖండించారు. భగవంతుడు ఆలయంలో లేడని భక్తిభావంలోనే ఉన్నాడని విగ్రహారాధనని ఖండిస్తూ కవితలు వెలువడ్డాయి :

'శిథిలాలయమ్ములో శివుడులేడోయి.
ప్రాంగణమ్మున గంట పలుకలేదోయి'

అనే కృష్ణశాస్త్రి కవిత పలువురిని ఆకర్షించింది. అయితే ఈ సాంఘిక చైతన్యం పాలు భావ కవిత్వంలో చాలా తక్కువ.

సాంఘిక చైతన్యంతో వర్ణవ్యవస్థను నిరసించడం ఈ యుగంలోనే మొదలైంది. హెచ్చు తగ్గుల కుల వ్యవస్థకు వ్యతిరేకంగా ఆక్రందనలూ, ధర్మాగ్రహాన్నీ వినిపించిన గొప్ప కావ్యం గుఱ్ఱం జాషువా 'గబ్బిలం', 'సనాతన ధర్మ ధేనువుల్ పిదికినపాలు పేదలకు లభింపవ్' 'నాల్గు పడగల హైందవ నాగరాజు కసరి బుసగొట్టు' నని జాషువా అట్టడుగువారి దుస్థితిని ఎత్తి చూపాడు.

ఈ కాలంలో వెలువడిన భక్తి కవిత్వం భావ కవిత్వంలో ఒక శాఖగా వర్ధిల్లింది. ఈ తరహా కవిత్వంలో, భావవ్యక్తీకరణలో మార్మికత కనిపిస్తుంది. భక్తకవికి సృష్టి అంతా ఒక్కటే, ఈశ్వరుడు ఒక్కడే, పరమాత్మని పూలదండలో తావాక పూవునై వెలసి పోవాలని కోరుకుంటాడు :

'ఎట్లు నిన్నూహసేయుటో యెఱుగలేక
వంగి వంగి శిరము వంచి కృంగిపోదు' నంటాడు.

భగవంతుని చేతలు అర్థంకాక బాధపడతాడు. కన్నీటిని ఆత్మ ప్రక్షాళనానికి సాధనంగా భావిస్తాడు.

'ఎడమెత్తనగుటకై సాదగుందిరా అంత
మదిగల యహమ్మెల్ల మాసిపోవునురా !'

అని బసవరాజు అప్పారావు ఎలుగెత్తి పాడుకున్నాడు.

1922 లో వెలువడిన వేంకట పార్వతీశ్వరుల ఏకాంత సేవ మధుర భక్తికావ్యం. భగవంతుడిని ప్రియునిగా, తనను ప్రేయసిగా భావించుకోవడాన్ని మధురభక్తి అంటారు. కృష్ణశాస్త్రి 'అన్వేషణము'లో గోపిక వినియోగవేదన సంయోగ మాధుర్యం వర్ణితమైనాయి. ఇవిగాక తాత్విక చింతనతో వెలువడిన కవితలను కూడా ఈ శాఖలో చేర్చవచ్చు.

తెలుగులో వెలువడిన స్మృతీకావ్యాల్లో రసభరితాలైనవి ఉన్నాయి. దేశనాయకులు మరణించినప్పుడో, ఆప్తులు మరణించినప్పుడో దుఃఖాతిరేకంతో రచించిన కావ్యాలివి. 'ఆంధ్ర రత్న' దుగ్గిరాల గోపాల కృష్ణయ్య గారు మరణించినప్పుడు



BRAOU

'ఏలపాడేనింక యమునా కళ్యాణినే
లీలామానవుడు గోపాలుడు లేడాయే'

అని బసవరాజు అప్పారావు వాపోయాడు. సతీస్మృతి కావ్యాల్లో విశ్వనాథ రచించిన 'వరలక్ష్మీత్రిశతి' చెప్పుకోదగింది :

ఓ సఖా ! ప్రియ భార్యావియోగ మెఱుగ
నట్టి యో పూర్వసత్కృతీ ! యకట! నీవు
కర్మ శతకంబు చదవకు ! మర్మఘాత
నీ వెఱుగలేవు దానిలోని దగు......"

అంటూ దుఃఖతీవ్రతను ధ్వనించాడు. ఇదే దారిలో వెలువడిన దువ్వూరి రామిరెడ్డి 'భగ్న హృదయము', బాలాంత్రపు వెంకటరావు 'విరహ సంగీతము 'లు హృదయద్రావకాలు. దువ్వూరి రామిరెడ్డి 'శిశు వియోగము' తన పసిబిడ్డ చనిపోయినప్పుడు రాసినది. కూతురు పోయినప్పుడు బసవరాజు అప్పారావు 'నిర్యాణ సుఖము' అని ఒకే గేయం రాశాడు. కొడుకు పోయిన వియోగ దుఃఖాన్ని

'కాపురమొచ్చిన కన్ని పాపాయి
ఇల్లు కాళీచేసి వెళ్ళిపోయాడు.'

అంటూ వ్యక్తపరిచాడు. మాతృ వియోగ దుఃఖాన్ని వర్ణించిన కావ్యాల్లో నాయని సుబ్బారావు 'మాతృగీతాలు' ప్రసిద్ధికెక్కింది.

### 20.8.4 భావకవిత్వం మీద తిరుగుబాటు, అభ్యుదయ కవిత్వం

భావకవిత్వపు వ్యక్తిగత ధోరణికి భిన్నంగా ప్రపంచాన్నీ, ప్రపంచ సమస్యలనూ వస్తువుగా స్వీకరించి కవితా వ్యవసాయం చేసిన వారిలో ప్రముఖ కవి జాషువా. తక్షణ జీవితంలోని సమస్యలనూ, చారిత్రక ప్రేరణనూ కవితలుగా అల్లిన సర్వసమర్థుడు జాషువా. 'గబ్బిలం' 'ఫిరదౌసి' లాంటి ఉత్తమ కావ్యాలే కాక అనేక ఖండకావ్యాలు 9 భాగాలు - రాసి తత్కాలపు బాధలనూ వ్యథలనూ సంప్రదాయ పద్యరీతుల్లో వ్యక్తీకరించిన జాషువా అభ్యుదయ కవితోద్యమానికి నేపథ్యాన్ని ఏర్పరిచినాడని చెప్పవచ్చును. దళితవర్గాల స్పందన కవితారూపాన్నిచ్చిన తొలి తరపు కవుల్లో అవిస్మరణీయుడు జాషువా, జాషువా స్పందనలోని తీవ్రత, వ్యగ్రత వైయక్తిక స్థాయిని మించిపోయిందని గమనించవచ్చును. భావకవిత్వ యుగంలోనే రచనా వ్యాసంగం చేసినప్పటికీ, రాబోయే తిరుగుబాటు తత్వపు ఛాయలు జాషువా కవిత్వంలో కనబడడం యాదృచ్ఛికంకాదు. 1930 నుండి భావ కవిత్వంలో కూడా కృష్ణశాస్త్రి ప్రభృతులకు అంధానుకరణలు, నిజాయితీ, భావావేశం లోపించిన శబ్ద వ్యక్తీకరణలు మొదలయినాయి. శ్రీశ్రీ, శిష్ట్లా ఉమామహేశ్వరరావు, శ్రీరంగం నారాయణబాబు, పఠాభి తదితర కవులు భావకవితా ధోరణిపై తిరుగుబాటు చేస్తూ కవితలు రాశారు. వీరిపైన డాడాయిజం (విధ్వంసవాదం), సర్రియలిజం (అధివాస్తవికత), ఇమేజిజం (భావచిత్రవాదం), సింబాలిజం (ప్రతీకవాదం) మొదలైన పాశ్చాత్య ధోరణుల ప్రభావం పడింది. భావకవిత్వ వ్యతిరేకత వరకే వీరిది సామాన్య లక్ష్యం. మిగిలిన అంశాల్లో ఎవరి ధోరణి వారిది. సరికొత్త ప్రయోగాలతో సంభ్రమం కలిగించాలని కూడా వీరి ఉద్దేశం. శ్రీశ్రీ ఒక స్పష్టమైన తాత్త్విక భూమికను ఏర్పరచుకొని తరవాత యుగకర్తగా ఎదిగాడు.

శిష్ట్లా 'నవమి చిలుక (1938), విష్ణుధనువు (1938)' అనే కావ్య సంపుటులు రచించాడు. మున్నుడిలో తన కవిత్వాన్ని గురించి రాస్తూ 'ఇది పూర్వకవిత్వం గాదు, ఇది నవ్యకవిత్వంగాదు, ఇది భావ కవిత్వం గాదు, ఇది నూతనములో బహునూతన కవిత్వం' అని చెప్పుకొన్నాడు. తన కవిత్వాన్ని ప్రాహ్లాద కవిత్వం' అనిపిలిచాడు. ప్రాహ్లాదకవిత్వం ప్రయోజనం గురించి చెప్తూ 'ప్రాహ్లాదకవిత్వం ఆరిపోయేదీపాన్నీ రగుల్చుతుంది. పరుగెత్తే పామురుణ్ణి నిలేస్తుంది' అన్నాడు.

పఠాభి (పూర్తి పేరు పట్టాభిరామిరెడ్డి), 'ఫిడేలు రాగాల డజన్ (1937). పన్నెండు కవితల సంపుటి. సంప్రదాయ, భావ కవిత్వాల పట్ల పరిహాస దృష్టిని కలిగించటం ఇతని కవితల ఉద్దేశం. తనకు విచిత్రమైన భావాలున్నాయనీ, కన్నుల్లో 'టెలిస్కోపులు, మయిక్రోస్కోపులు' న్నాయని చెప్పుకున్నాడు :



BRAOU

'నా ఈ వచన పద్యాలనే దుడ్డు కర్రల్తో
పద్యాల నడుముల్ విరగదంతాను
చిన్నయసూరి బాల వ్యాకరణాన్ని
చాల దండిస్తాను'

అంటూ ఛందో వ్యాకరణాలపైన తిరుగుబాటు చేశాడు. పఠాభి గేయాల్లో ప్రధాన వస్తువు కామం (సెక్సు). ఇతడు ఇంగ్లీషు మాటలు కలిపి చేసిన సమాసాలు విచిత్రంగా ఉంటాయి. 'దుస్సాధ్య కాంపిటీషను, మేమాన మధ్యాహ్న కాలము, హంగ్రీ కనులు, ప్రభాత రేజరు' మొదలైనవి. కవిత్వంలో నగర జీవిత చిత్రణం చేసిన వారిలో ఇతడే మొదటివాడు.

నారాయణ బాబు ఆదర్శవాదాన్ని కాదని వాస్తవికతను (Realisim) ప్రతిపాదించాడు. తన కవితల్లో యదార్థ జీవిత చిత్రణం చేశాడు :

'రుధిర జ్యోతిర్ జ్వలనా లలనా ప్రియుండ
విప్లవ ఋషిని, విద్రోహ కవిని
ఆహవరంగం నా హృదంతరంగం
పగిలిన ఖలేజాలే నా పాటల జలేజాలు'

అని చెప్పుకున్నాడు. నారాయణబాబు పైన 'ఇమేజిం' ప్రభావం ఎక్కువగా ఉంది. నారాయణబాబు కవితలు తరువాతి కాలంలో 'రుధిర జ్యోతి' (1950) పేరుతో సంపుటిగా వెలువడ్డాయి.

వీరితోపాటు ఈ మార్గంలో కవితా సాధన చేసిన వారిలో పురిపండా, ముద్దు కృష్ణ 'పాప'లు కూడా పేర్కొన దగినవారు. ముద్దు కృష్ణ 1932 లో 'జ్వాల' పత్రికను స్థాపించి భావ కవిత్వ వ్యతిరేకోద్యమానికి నాంది పలికాడు. తొలి సంచికలోని సంపాదకీయ వాక్యాలు ఈ విధంగా ఉన్నాయి :

'మనం కూపస్థంగా ఉండడం వల్లనో, [illegible] గత చేతనో, రక్తంలో నీరసం చేతనో నూతన తేజస్సుకు గుడ్ల గూబల మౌతున్నాము. ఇది [illegible]ము... యువకుల దృష్టికి ఒక కొత్తదారి కనబడుతూ ఉన్నది... మార్పు తప్పదు... దీనికి అడ్డువీళ్లను [illegible]నా ఆగదు. పిరికి వారికి ముక్తిలేదు. అందుచేత నచ్చని పాత బంధాలను తెంపి వేయడానికి ఎంతైనా [illegible]స్తాము'.

పురిపండా అంధ విశ్వాసాలను [illegible]స్తూ కవితలు రాశాడు. 'పాప' కూడా వచన గీతాలను ప్రకటించాడు.

శ్రీ శ్రీ, శిష్ట్లా, పఠాభి, నారాయణబాబు ఈ నలుగురూరూ భావ కవిత్వం మీద తిరుగుబాటు చేశారు. కానీ కొత్త బాట వేసి అభ్యుదయ కవితోద్యమానికి నాంది పలికింది మాత్రం శ్రీ శ్రీయే. తన తరువాతి దంతా 'శ్రీ శ్రీ యుగం' అన్నంత బలమైన ముద్ర శ్రీ శ్రీది. 1934లో వెలువడిన 'మహాప్రస్థానం' గేయంతో అభ్యుదయ ఉద్యమం ప్రారంభమైందని చెప్పవచ్చు. 1950 వరకు అంటే సుమారు 15 యేండ్లకు పైగా అభ్యుదయ కవిత రాజ్య మేలిందని భావించవచ్చు.

కవిత్వానికి శ్రీ శ్రీ కొత్త తాత్త్వికభూమికను సమకూర్చాడు. రచనలో గొప్ప శిల్పాన్ని ప్రదర్శించాడు. తొలి రోజుల్లో శ్రీ శ్రీ భావ కవిత్వ ప్రభావంతో పద్యాల రాశాడు. 'ప్రభవ' అనే కవితా సంపుటిని వెలువరించాడు.

1933 లో 'జయభేరి' అనే గేయంతో శ్రీ శ్రీ సొంత గొంతు లోకానికి వెల్లడైంది :

'... నేను సైతం భువన భవనపు
బావుటానై పైకి లేస్తాను'

అంటూ విశ్వమానవతను చాటాడు.

'మరో ప్రపంచం మరో ప్రపంచం
మరో ప్రపంచం పిలిచింది
పదండి ముందుకు పదండి తోసుకు
పోదాం పోదాం పైపైకి'



BRAOU

అంటూ 1934లో వెలువడిన 'మహా ప్రస్థానం' అనే గేయం ఒక యుగ కవాటాలే తెరించింది. దీనిలో సమకాలీన సమాజం, అంతర్జాతీయ పరిస్థితులు, విప్లవ గమ్యం మొదలైనవి ఉత్తేజపూరితంగా వర్ణితమయినాయి. ఇదే గాక 'బాటసారి (1934). ప్రతిజ్ఞ, అభ్యుదయం, వ్యత్యాసం, నవ కవిత (1937-38), కవితా ఓ కవితా! (1940), జగన్నాథు రథ చక్రాలు (1940)', మొదలైన గొప్ప కవితలు వెలువడ్డాయి. 1933 నుండి 1941 దాకా వెలువడిన శ్రీశ్రీ నలభై గేయాలు 1950 లో మాత్రమే 'మహాప్రస్థానం' పేరుతో పుస్తక రూపంలో వెలువడ్డాయి.

శ్రీశ్రీ మార్క్సిస్టు దృక్పథంలో శ్రామిక వర్గ చైతన్యాన్ని ప్రదర్శించాడు. శ్రమ శక్తిని దోచుకునే పెట్టుబడిదారీ వ్యవస్థను నిరసిస్తూ కవిత్వం చెప్పాడు. యజమానికి వచ్చిన లాభంలో కార్మికుడికి భాగం ఉండాలనీ ఇటువంటి దోపిడికి వ్యతిరేకంగా విప్లవం వస్తుందనీ హెచ్చరించాడు. మహాప్రస్థానంలోని 'ప్రతిజ్ఞ' గేయంలో తన దృక్పథాన్ని స్పష్టంగా ప్రకటించాడు. పునాదిగా జనించబోయే భావి వేదాలను జగత్తు కందిస్తానని ప్రతిజ్ఞ చేశాడు. శ్రీశ్రీ.

మహాప్రస్థాన రచన తర్వాత శ్రీశ్రీ కొన్నాళ్ల అధివాస్తవికతా ప్రభావంతో కవితలు రాశాడు. వాటిలో అర్థం పర్థంలేని ప్రయోగాలు అరాచక ధోరణులు ఉండటం వల్ల తరువాతి కవులను ఆకర్షించలేక పోయాయి.

1943 లో అభ్యుదయ రచయితల సంఘ సంస్థాపన జరిగిన తర్వాత అభ్యుదయ కవిత్వం ఒక మహోద్యమంగా రూపొందింది. అభ్యుదయ, కవితాయుగంలో అచ్చయిన తొలి కావ్యం 'నయగరా' నరసారావుపేట నవ్యకళా పరిషత్ తరఫున బెల్లంకొండ రామదాసు, కుందుర్తి ఆంజనేయులు, ఏల్చూరి సుబ్రహ్మణ్యం, అనిసెట్టి సుబ్బారావు అనే కవులు రచించి ప్రకటించిన గేయ సంపుటి నయాగరా, వీరు తమ కవిత్వ స్వభావాన్ని ఇట్లా వివరించారు : '.... దీనికి తోడు ఎర్రజెండా నాయకత్వాన యీ సమాజ వ్యవస్థ మారాలని మా కవితలో ఉండే సందేశం'. వీరి కవితలో అన్ని రకాల యుద్ధాలు, విప్లవాలు, కార్మిక-కర్షకుల కష్టాలు మొదలైనవన్నీ వస్తువులైనాయి.

దీని తరవాత అని శెట్టి 'అగ్నివీణ' (1949), నారపరెడ్డి 'అ[illegible]' (1950). రెంటాల 'సంఘర్షణ' (1955), రమణారెడ్డి, 'భువనఘోష' (1955), 'గంగినేని' 'ఉదయినీ' (1950) మొదలైన కవితా సంపుటాలు వెలువడ్డాయి.

'నయాగారా'లో కుందుర్తి ఒక వేపున అధికోత్పత్తి మరో వేపు డొక్కల కరువూ కల బూర్జువా సమాజమంతరించాలని కాంక్షిస్తూ, అలకాపురానికి అల్పజనానికి ఇది సంకుల సమరం అని రమణారెడ్డి స్పష్టం చేశారు. గంగినేని 'ఉదయిని'లో గెరిల్లా పోరాటాన్ని చిత్రించాడు. శాంతిని కాంక్షిస్తూ 'జలపాతం' అనే ఖండ కావ్యంలో నారాయణ రెడ్డి యుద్ధం పట్ల వైముఖ్యాన్ని ప్రదర్శిస్తారు.

హైదరాబాదు సంస్థానంలో నిజామ్ నవాబుకు వ్యతిరేకంగా, తెలంగాణా విముక్తి కోసం జరిగిన పోరాటాన్నీ, ప్రజల, కడగండ్లనూ చిత్రించిన కావ్యాలు వెలువడ్డాయి. దాశరథి ఉద్యమంలో ప్రత్యక్షంగా పాల్గొన్న ఉద్యమ కవి. ఆయన ప్రకటించిన 'అగ్నిధార (1969), రుద్రవీణ (1950)' కావ్యాలు నిజాంపైన నిప్పులు కురిశాయి. తెలంగాణా విముక్తి కోసం కాళోజీ, పొట్టపల్లి రామారావు, అయోధ్యరామకవి కవిత్వం రాశారు. తెలంగాణా పోరాటాన్ని చిత్రిస్తూ వెలువడిన కావ్యాల్లో సోమసుందర్ 'వజ్రాయుధం', ఆరుద్రత్వమేవాహమ్ (1949), గంగినేని ఉదయిని (1950), కుందుర్తి (1949), తెలంగాణా (1956) ముఖ్యమైనవి.

1960 తర్వాత అభ్యుదయ కవిత్వపు పునర్వికాస ప్రయత్నాలు జరిగాయి. ఈ కాలంలో గజ్జల మల్లారెడ్డి, సి. విజయలక్ష్మి పేర్కొనదగిన కవులు. గజ్జలమల్లారెడ్డిది విస్పష్టమూ, తీవ్రమూ, వ్యంగ్యాత్మకమూ అయిన కవిత్వం. ఆయన 'మల్లారెడ్డి గేయాలు' 'శంఖారావం' ప్రసిద్ధమైనవి. సి. విజయలక్ష్మి 'విషాద భారతం' 'కారుచీకటిలో కాంతిరేఖ' ప్రముఖమైనవి.

### 20.8.5 వచన కవిత్వ వికాసం

వచ కవిత అనే కవితాకృతి 1930 లోనే ప్రారంభమైనా 1956 తర్వాతగాని ఒక ఉద్యమ ప్రచార స్థాయిని అందుకోలేదు. వచన కవితకు ఆద్యుడు శిష్టాఉమామహేశ్వరరావు. ప్రవర్తకుడు కుందుర్తి ఆంజనేయులు.

BRAOU

శిష్ట్లా తన కవిత్యాన్ని 'ప్రహ్లాద కవిత్వం' అని పేర్కొన్నాడు కాని తర్వాత కాలంలో ఆమాట స్థిరపడలేదు. వచన కవితకు వచనగేయం, వచపద్యం, వచనకవిత, ఫ్రీవర్స్, వర్స్‌లిబర్, ముక్తచ్ఛందం అంటూ కొన్ని పేర్లు వ్యాప్తిలోకి వచ్చాయి. కాని వచనకవిత అనే పేరే స్థిరపడిపోయింది.

తొలి రోజుల్లో వచన కవిత్వాన్ని పండితులు వ్యతిరేకించారు. ఛందోబద్ధంగా రచించలేని అశక్తతవల్లనే వచనకవిత పుట్టిందన్నారు. లేదా ఇది కొత్తదేమీ కాదని పూర్వకాలంలో సింహగిరి నరహరి వచనాలు, తాళ్లపాక వారి 'విన్నపాలు' లాంటివి ఉండనే ఉన్నాయన్నారు. అయితే ఈ ప్రక్రియ ఆకస్మాత్తుగా ఆకాశం నుంచి ఊడి పడ్డదేమీ కాదు. ఆర్థిక సంక్షోభాల రోజుల్లో అన్ని మార్పులలాగే ఛందోరీతుల్లో కూడా మార్పులు అనివార్య మయినాయి. మారుతున్న జీవిత విధానం, విలువలు సాహిత్యపరంగా కొత్త వ్యక్తీకరణ పద్ధతిని ఎన్నుకోవటం చరిత్ర సహజం.

తొలితరం వచనకవుల్లో ముద్దుకృష్ణ, నారాయణబాబు, శ్రీశ్రీ, పురిపండా, పట్టాభి ముఖ్యులు. జరుక్‌శాస్త్రి, తిలక్, సంపత్, సింగరాచార్య తమ రచనలతో ఈ ప్రక్రియను సుసంపన్నం చేశారు. అభ్యుదయ కవిత్వం రోజుల్లో నయాగరా కవులు (ఏల్చూరి సుబ్రహ్మణ్యం, అనిశెట్టి, కుందుర్తి), అజంతా, బైరాగి, కాళోజీ, దాశరథి, ఆరుద్ర, అబ్బూరి వరదరాజేశ్వరరావు, అనిశెట్టి, రమణారెడ్డి, చిరంజీవి మొదలైనవారు చక్కటి వచన కవితలు రచించారు.

ఆంధ్రప్రదేశ్ ఏర్పడ్డాక హైదరాబాద్ కార్యరంగంగా కుందుర్తి 'ఫ్రీవర్స్‌ఫ్రంట్' ను స్థాపించి వచన కవిత్వ ప్రచారానికి వైవిధ్యానికి లక్షణ నిర్దేశానికి దోహదం చేశాడు. ఈ దశలో కుందుర్తి, తిలక్, గోపాల చక్రవర్తి, కేశవ రావు, కమ్మిశెట్టి వేంకటేశ్వరరావు మాదిరాజు రంగారావు, సుప్రసన్న, వరవరరావు, అరిపిరాల విశ్వం, శీలా వీర్రాజు, భోయి భీమన్న, మురళీధర్, యాదవరెడ్డి మొదలైనవారు వచన కవితలు రచించారు.

వచన కవిత్వంలో అన్ని రకాల దృక్పథాలు చోటుచేసుకున్నాయి. అభ్యుదయ కవులు, చేతనావర్తం కవులు, కవి సేనకవులు, అనుభూతి కవులే కాక ప్రణయ, భక్తి, తాత్త్విక చింతనలు కూడా వచన కవిత్వంలో వెలువడ్డాయి.

కుందుర్తి వచన కవితా ప్రక్రియను ఒక ఉద్యమంగా భావించాడు. రూపాన్ని ఉద్యమంగా భావించటాన్ని చాలా మంది అంగీకరించలేదు. వచన కవిత్వంలో కథాకావ్యాలు రావాలని కుందుర్తి ఆశించాడు. శీలావీర్రాజు దానికి లక్ష్యప్రాయమైన కావ్యరచన చేశాడు.

దాదాపు దశాబ్దాలనుండి కవితారంగంలో ప్రాబల్యం వహిస్తూ ఇప్పటికీ కొనసాగుతున్న వచన కవిత్వ లక్షణాల కోసం కొంత చర్చ జరిగింది. వచనకవిత్వంలో భావగణాలు ఉన్నాయని సంపత్కుమార ప్రతిపాదించారు. అరిపిరాల విశ్వం 'భావలయ' ను నిర్దేశించారు. చేకూరి రామారావు ఈ రెండు సిద్ధాంతాలను ఖండించి అందరికీ ఒకేరకమైన వచన కవితా నియమాలే లేవని భావించారు. అయితే వచన కవిత్వంలోని వచనం మామూలు వచనం కన్న విశిష్టమైనది.

### 20.8.6 దిగంబర కవిత్వం

సామాజిక సాహిత్యరంగాల్లో ఏర్పడ్డ స్తబ్ధతను బద్దలుగొట్టే ఉద్దేశంతో దిగంబర కవులు ఆవిర్భవించారు. పాత వ్యవస్థలోని అనేక విలువలను వీరు ప్రశ్నించారు. 1965లో ప్రారంభమై 1968 దాకా మూడేళ్లపాటు చెలరేగిన వీరి తిరుగుబాటు తెలుగు సాహిత్య రంగంలో సంచలనం కలిగించింది.

ఆరుగురు యువకులు ఒకచోట చేరి విచిత్రమైన కలంపేర్లతో దిగంబర కవిత్వాన్ని ఔద్ధత్యంతో వెలువరించారు. వారు నగ్నముని (కేశవరావ్), నిఖిలేశ్వర్, (యాదగిరిరెడ్డి), చెరబండరాజు (బద్దం భాస్కరరెడ్డి), మహాస్వప్న (కమ్మిశెట్టి వేంకటేశ్వరరావు), జ్వాలాముఖి (వీరారాఘవాచార్యులు), భైరవయ్య (మన్‌మోహన్ సహాయ్). "ఈ దేశంలో, యీ భూగోళంలో ఊపిరిపీల్చే ప్రతి మనిషి కోసం తపనపడి, బాధను చూసి వెక్కి వెక్కి ఏడ్చి, పిచ్చెత్తి ప్రవచించిన కవిత" అని తమ కవిత్వ హేతువును గురించి చెప్పుకున్నారు. జీవచ్ఛవాలుగా బతుకుతున్న ప్రజలను కొప్పడి, తిట్టి, భయపెట్టి జుగుప్స కలిగించిన కవిత్వం దిగంబర కవులది. రాసింది వచన



BRAOU

కవితే అయినా వీరు తమ కవితలను ‘దిక్’ అని పిలిచారు. దిగంబర శకం అనే కాలమానాన్ని కూడా ప్రకటించారు. సంవత్సరాలు, ఋతువులు పేర్లు మార్చారు. అయితే మూడు సంపుటాలు మాత్రమే వెలువరించి మూడేళ్ళలోనే దిగంబర శకం ముగిసింది.

నేటి సమాజంలో దుర్భర పరిస్థితులకు కారణమనుకున్న అందరినీ దిగంబరకవులు తిట్టారు. వీరి తిట్లను చాలామంది తట్టుకోలేక పోయారు. అయితే గగ్గోలు పుట్టించడమే వీరి ప్రధాన ధ్యేయమనిపించినా వీరికి కొన్ని ఉద్దేశాలున్నాయి. స్వేచ్ఛామానవుడి కోసం తపిస్తున్నామన్నారు. నేటి సమాజం కుష్ఠువ్యవస్థగా మారిందనీ దీన్ని నాశనం చెయ్యాలనే కాకుండా ‘ఏ అచ్ఛాదనకీ తలవొగ్గని, ఏ భయాలకీ లొంగని నిరంతర సజీవ మానవుని కోసం ఎలుగెత్తి పిలుస్తున్నాం’ అన్నారు.

దిగంబర కవులు మంచి కవితాశక్తిగల కవితలు రాశారు. నగ్నముని రచించిన “తొడవిరిగిన తరం”లో

‘నిజం రేజర్
లాంటిది అది సీజర్ని సైతం క్షమించదు’.

అని హెచ్చరించారు. చెరబండరాజు ‘ఆకాశం వెక్కి వెక్కి ఏడుస్తోంది’ అనే కవితలో

‘పుడమితల్లి చల్లని గుండెను
పాయలు పాయలుగా చీల్చుకొని
కాల్వలై ఎవరిదో
ఏతరం కన్నీరో
గలగలా సుళ్లుతిరిగి
మెల్లమెల్లిగా పారుతుంది’

అని వరదను వర్ణించారు. మహాస్వప్న ‘మేం మనుషులంకాదు ఇంకేదో’ ‘పేరుంది మాకు’ అంటూ ‘బాపూ! మోసపోలేదు కదానువ్వు’ అని గాంధీని సంబోధిస్తూ బాధపడతారు.

‘అన్నా! భయపడకు
కరువుభత్యం పెరుగుతుంది
కొండచిలువ నోట్లోకి ఈగపిల్ల దూకుతుంది’.

అంటూ ప్రభుత్వాన్ని నమ్మి మోసపోవద్దని భైరవయ్య హెచ్చరించారు. దిగంబర కవిత్వాన్ని చాలా మంది ఆక్షేపించారు. రాచమల్లు రామచంద్రారెడ్డి వీరిని ‘అ[illegible]ద్వర్గాల’ తో పోల్చారు. 1970లో విప్లవ రచయితల సంఘం యేర్పడినప్పుడు కొందరు దిగంబర కవులు దానిలో చేరారు. కవులకు ముందు వెలువడిన ‘రాత్రి’ కవితాసంకలనాన్ని కూడా ఈ సందర్భంగా విస్మరించలేము. విరసం స్థాపన తర్వాత “తిరుగబడు, మార్చ్” కవితా సంకలనాలు వెలువడ్డంతో దిగంబర కవిత్వం అంతరించినట్లు భావించవచ్చు.

దిగంబర కవుల ప్రేరణతో పైగంబర కవులు ఏర్పడ్డారు. (సుగమ్‌రావు, కిరణ్‌బాబు, దేవీప్రియ, కమలాకాంత్, ఓల్గా) మానవతావాదాన్ని తమ తత్త్వంగా భావించిన వీరు రెండు కవితాసంపుటులు ప్రకటించారు. విరసం స్థాపన తర్వాత వీరిలో కొందరు దానిలో చేరారు.

### 20.8.7 విప్లవ కవిత్వం

విప్లవ రచయితల సంఘం (విరసం) అనే సాహితీసంస్థ 1970 లోనే యేర్పడినా దానికి దారితీసిన రాజకీయ నేపథ్య పరిస్థితులు అంతకుముందు నుండే లోలోపల మరుగుతున్నట్టు తోస్తున్నది. పశ్చిమ బెంగాల్ లోని నక్సల్ బరీలో రైతాంగ ఉద్యమం, ఆంధ్రలోని శ్రీకాకుళం పోరాటాలు విప్లవకవులకు స్ఫూర్తినిస్తున్నాయి. శ్రీకాకుళం రైతాంగ పోరాటానికి వెంపటాపు సత్యం, ఆదిభట్ల కైలాసం, సుబ్బారావు, పాణిగ్రాహి మొదలైనవారు నాయకత్వం వహించారు. మార్క్సిస్టు లెనినిస్టు – మావోభావాల ప్రచారానికి ఆచరణకూ పూనుకున్నారు.

1970 ఫిబ్రవరి 1, 2 తేదీల్లో మహాకవి శ్రీ శ్రీ షష్టిపూర్తి జరిగింది. ఆ సభలో విశాఖ విద్యార్థుల ‘రచయితలకు సవాల్’ అనే కరపత్రం దుమారం లేపింది. కొడవటిగంటి కుటుంబరావు, రాచకొండ విశ్వనాథ శాస్త్రి,

కాళీపట్నం రామారావు, కె.వి. రమణారెడ్డి, వరవరరావు మొదలైన ప్రసిద్ధులు విరసంలో చేరారు. అప్పటి వరకు 13 సంచికలు తెచ్చి ఆధునిక సాహిత్యవేదికగా ఉంటూ వచ్చిన 'సృజన' అనే సాహిత్యపత్రిక తన వైఖరిని మార్చుకొని విప్లవభావాలను ప్రచారం చేసింది. విరసంపుట్టుకముందు 'తిరగబడు' అనే కవితల సంపుటి విప్లవ భావాలకు దోహదం చేసింది. వరవరరావు, లోచన్, కిషన్, ఎక్స్‌రే, వి. సంజీవరావు, సుధాకర్, సుదర్శన్, యాదగిరిరావుల కవితలతో ఈ సంపుటి వెలువడింది.

'పోరాటం లేకుండా నిజమయిన శాంతిరాదు ... సామ్యవాద సమాజాన్ని నిర్మించాలి' అని తిరగబడు కవులు ఉద్బోధించారు. విప్లవకవులందరూ సాయుధపోరాటాన్ని సమర్థించారు. శ్రీశ్రీ

'సాయుధవిప్లవ బీభత్సుని సారథినై
భారత కురుక్షేత్రంలో
నవయుగ భగవద్గీతా ఝుంఝుని ప్రసరిస్తాను
మంటలచేత మాట్లాడించి
రక్తంచేత రాగాలాపన చేయిస్తాను'

అని తనదీక్షను ప్రకటించారు. విరసంపుట్టిన ఎనిమిది నెలల్లోనే 'ఝుంఝు' అనే కవితా సంకలనం వెలువడింది. విప్లవవీరుడు సుబ్బారావు పాణిగ్రాహికి దీనిని అంకితం చేశారు. దీనిలో పోరాటాల్లో ప్రాణాలు విడిచినవారిని కీర్తించే కవితలు ఎక్కువగా ఉన్నాయి. 'అన్నా! నీ గాయాలపై నుండి వీచి గాలి ఎరుపెక్కింది' అని అశోక్, 'పోరాటం మధ్యలో, అంతులేని కన్నీళ్లకు ఆస్కారంలేదు సుమా?' అంటూ 'శివుడు' ఉత్తేజకర రచనలు చేశారు. 'లే' అనే కవితా సంకలనం ప్రకటనతో విరసం ఉద్యమస్థాయికి చేరుకున్నట్టనిపించింది.

ఈ దశాబ్దంలో (1970-80) శ్రీశ్రీ కొన్ని ఉత్తమ రచనలు చేశారు. 'మరో ప్రస్థానం' సంపుటిలో 'భూమ్యాకాశాలు, తుదిపతనం, తొలివిజయం' వంటివి శక్తివంతమైన కవితలు. విప్లవ వీరుణ్ణి ఉద్దేశించి శ్రీశ్రీ

'శివాజీకి వారసుడా! శ్రీశ్రీ కవిత్వాలాలసుడా!
నీధాటికి అడ్డులేదు, నీ త్యాగం వృథాకాదు'

అని కీర్తించాడు. సుబ్బారావు పాణిగ్రాహి రచించిన

'కష్టజీవులం మేం కమ్యూనిస్టులం
ఔనన్నా కాదన్నా అదే ముమ్మాటికి'

అనే పంక్తులు అనేక సభల్లో పాడగా వివాదాలయినాయి.

శివుడు, శివసాగర్, రెంజిమ్ అనే కలం పేర్లతో రాసిన కె.జి. సత్యమూర్తి ఉత్తమ కవితారచన చేశాడు. 'నాచెల్లి చంద్రమ్మా' అనే వీరి కథాగేయం గురజాడకవి 'పూర్ణమ్మ' స్థాయిలో నిలవదగింది. జానపద ఫక్కీలో, ఈయన రచించిన గీతాలనేకం ప్రజలను ఉత్తేజపరిచాయి. విప్లవవీరుడు చాగంటి భాస్కరరావు గురించిన, ఈయన రచించిన 'నరుడో భాస్కరుడా!' అనే గీతం ఆ రకమైన పాటలకు ఒరవడి పెట్టింది :

'బ్రెంక సెట్టుకింద నరుడో! భాస్కరుడా!
బందూకు పడితివయ్యా నరుడో! భాస్కరుడా!
బందూతు సేతపట్టి నరుడో! భాస్కరుడా!
బంధాలు తెంచితివయ్యా నరుడో! భాస్కరుడా!'

అట్లాగే

"అలలపైనిఘా! అలలపైనిఘా! అలలుకనే కలలపైనిఘా! అలలపైన అనురాగం చూపించేగాలి సితారా సంగీతం పైననిఘా"అనే కవిత కూడా విశిష్టంగా నడుస్తుంది.

విరసంకవుల్లో చెరబండరాజు అత్యంత ప్రతిభావంతుడు. ఈయన 'దిక్సూచి, ముట్టడి, గమ్యం, కాంతి యుద్ధం, గౌరమ్మకలలు, జన్మహక్కు, పల్లవి' అనే కావ్యసంపుటులు వెలువరించాడు. చెరబండరాజు వచన గీతాలు సులభంగా అర్థమయ్యే రీతిలో ఉంటాయి :



BRAOU

'ఇంటింటా చీకటే,
ప్రతికంట కన్నీరె,
రాజ్యమెవరికి వచ్చెనో– రాజన్న
సుఖము లెవరికి దక్కెనో'

'ఏకులమబ్బీ మాదేమతమబ్బీ' అనే చెరబండరాజు పాటలు హృదయాలను కదిలిస్తాయి.

కవితాశిల్ప రహస్యాలను ఆకళింపుకున్న కవిగా నగ్నముని ఉత్తమ కవితారచన చేశాడు. 'పాలు ఎర్ర బడ్డాయి' అనే ఈయన కథాకవిత చదివి చలించని సహృదయుడుండడు. విటుడు కొరికేసిన తల్లి చనుమొనను తెలియని పసివాడు నోట్లోపెట్టుకుంటే నోటినిండా రక్తం నిండుతుంది. 'అప్పుడే తెలుసుకున్నా నావంటి వాళ్ళ అమ్మల పాలు తెల్లగా కాదు ఎర్రగా వుంటాయని' అని ముగిస్తాడు. 1977 నవంబర్లో కోస్తా ఆంధ్రలో వచ్చిన పెనుతుఫాను భీభత్సాన్ని 'కొయ్యగుర్రం' తుఫాను బారిన పడకుండా ప్రజలను రక్షించలేని ప్రభుత్వాన్ని దీనిలో విమర్శించాడు. నగ్నముని విరసంతో విభేదించి రాజీనామా చేశాడు.

విరసంలో లేకుండా విప్లవభావాలతో కవితలు రాస్తున్న ప్రజ్ఞావంతుడు కె. శివారెడ్డి. 'రక్తం సూర్యుడు, చర్య, ఆసుపత్రి గీతం, నేత్రధనుస్సు, భారమితి' అనే ఉత్తమ కావ్యాలను రచించాడు. కవితాశిల్పం దెబ్బతినకుండా తీవ్రంగా చెప్పగల నేర్పరి శివారెడ్డి.

స్వయంగా పాటలుకట్టి, అశేష ప్రజానీకాన్ని ఆకర్షించిన విప్లవ కళాకారుడు గద్దర్. జానపదలయతో, స్పందనతో వినగానే హృదయాన్నిపట్టి ఊపుతాయి గద్దర్ పాటలు. గద్దర్ రచించిన 'వీధిభాగోతం' విస్తృత ప్రచారం పొందింది. ఇది నాటకం. గద్దర్ పాటల్లోని విప్లవ భావాలతో ఏకీభవించని వారు కూడా అతని పాటలను మెచ్చుకోకుండా ఉండలేకపోవడం విశేషం. 'హోలీ హోలీల రంగహోలీ, లాల్‌సలామ్, కూలోల్లపిల్ల, కరువుపాట' మొదలైన గద్దర్ గీతాలు విన్నవారందరినీ ఉత్తేజపరుస్తాయి. ఈయన పాటలు ఎక్కువగా తెలంగాణా మాండలికంలో ఉంటాయి.

తూర్పుయాసతో, శ్రీకాకుళ మాండలికాల్లో పాటలురాసి, పోడి విప్లవభావాలను ప్రచారం చేస్తున్న మరో కవి వంగపండు ప్రసాదరావు.

అత్యవసర పరిస్థితిలో జైలుపాలైయిన కె.వి. రమణారెడ్డి 'జైలుకోకిల' అనే కవితా సంపుటిని వెలువరించారు. అలాగే వరవరరావు 'స్వేచ్ఛ' అనే కవితా సంకలనం వెలువరించాడు.

జ్వాలాముఖి 'ఓటమి తిరుగుబాటు', నిఖిలేశ్వర్ 'మండుతున్నతరం' వారి కవితా పరిణామాన్నిసూచిస్తాయి.

విరసంలో కవితా రచనకే ఎక్కువ ప్రాధాన్యం లభించినట్టు కనిపిస్తున్నది. రెండోస్థానం కథలది. జానపద కళారూపాలను జముకులకథ, (వాగ్గుకథమొదలైనవి) విరసం బాగానే ఉపయోగించుకున్నది. ప్రస్తుతం విరసం కార్య కలాపాల్లో స్తబ్దత ఏర్పడినట్టు కనిపిస్తున్నది. మరో నూతన కవితోద్యమం కోసం ఎదురుచూపుల వాతావరణం నెలకొంటున్నది.

**అభ్యుదయ సాహిత్యం – పునరుద్ధరణ**

1972లో అక్కడక్కడ తలెత్తుతున్న అభ్యుదయ ధోరణులను సమీకృతం చేసే ప్రయత్నాలు మొదలైనాయి. ఈ ప్రయత్నాలు 1973లో జరిగిన గుంటూరు మహాసభలో నిర్మాణ రూపం ధరించాయి. ఫలితంగా అభ్యుదయ రచయితల సంఘం పునఃస్థాపన జరిగింది. మారిన నూతన పరిస్థితులకు అనుగుణంగా ప్రణాళికలను రూపొందించారు. శాస్త్రీయ సామ్యవాదం దిశగా సాగే ప్రయాణంలో సాహిత్యంలో సవిమర్శక వాస్తవికత నుండి సోషలిష్టు వాస్తవికత వరకు సామ్యవాద, ప్రజాస్వామ్య వామపక్ష శక్తులను సమైక్యపరచాలనే మార్పు ఈ ప్రణాళికలో ఉంది. 'ప్రజా నాట్యమండలి'కి ప్రాణప్రతిష్ట జరిగింది. జానపద కళారూపాలు పుంజు కున్నాయి. 'వీచిక, అభ్యుదయ యువజన, మిలిటెంట్ పత్రికలు అభ్యుదయ సాహిత్యాన్నీ ప్రచారాన్ని చేశాయి. రాంభట్ల కృష్ణమూర్తి, నిడుమర్తి ఉమారాజేశ్వరరావు రాసిన అనేక వ్యాసాల్లో అభ్యుదయ, సాహిత్య పునరుజ్జీవనానికి తాత్వికబలం చేకూర్చే ప్రయత్నం జరిగింది.

1972లో వెలువడిన 'అలజడి' కవితా సంపుటి కొత్త ధోరణులకనుగుణంగా వెలువడింది. అదే మార్గంలో 1973, 1974లో 'జ్వాలాగీతం, స్నేహగీతి' సంపుటలు వెలువడ్డాయి. ఏటుకూరి ప్రసాద్ ఈకాలంలో విస్తృత



BRAOU

సంఖ్యలో పాటలు రాశారు. అవి చాలా ప్రచారానికెక్కాయి. ప్రసాద్‌పాటలు 'ఎర్రజండా, ఎర్రబాట, పోరాటం, శివాలయ్య' అనే పేర్లతో సంపుటాలుగా వచ్చాయి. మల్లిక్ 'ఋక్రీలు', ఎస్వీ సత్యనారాయణ 'సరాగాలు'. బిగుళ్ళ "ఊపిరి, బతుకుబాట' అను కూడా ఈ సందర్భంగా పేర్కొనవచ్చు. ఈకాలంలో గజ్జెల మల్లారెడ్డి, రాంభట్ల కృష్ణమూర్తి, బాదు సుబ్బారావు మొదలైనవారు కవితలు రాశారు.

**20.8.8 వివిధ కవితారీతులు – కవులు**

దాదాపు 1955 వరకు అభ్యుదయ కవిత్వ రచన కొనసాగింది. ఆ తరువాత కవుల సాహితీ దృక్పథాల్లో మార్పులు రాసాగాయి. కవులు ఏ ఒక్క పార్టీకి "తాళికులై" పోనవసరం లేదని ఆరుద్ర అభిప్రాయపడ్డారు. "జండాలనునమ్మిపుండాకోరవి కావద్దం"టూ దాశరథి హెచ్చరించారు.

ఈ కాలంలో శ్రీశ్రీ 'సదసత్సంశయం' అనే గేయం, కొన్ని కవితానువాదాలు. ప్రాసక్రీడలు రచించాడు. సదసత్సంశయంలో

'ఈ సృష్టికి ఏమర్థం మానవునికి గమ్యమేమి

ఒక సకలాతీతశక్తి ఉన్నట్టా? లేనట్టా?'

అనే తాత్త్విక ధోరణి కనిపిస్తుంది. అబ్బూరి ఛాయాదేవి సంపాదకత్వంలో 'కవిత' పేరుతో రెండు సంపుటులు వచ్చాయి. వీటిలో అబ్బూరి రామకృష్ణారావు

'మనసులోని యాలాపము మాటలలో మారిపోవు
ఎత్తిన కవితాదీపము వత్తి కుమిలి యారిపోవు'

అంటూ ఆత్మవేదనను వ్యక్తపరిచాడు. శ్రీశ్రీ కాంగ్రెసు ప్రభుత్వానికి ప్రతీకగా "నగరంలో వృషభం" రాశాడు. అజంతా భయపడిన వాడి మనస్తత్త్వాన్ని ప్రదర్శించాడు. కవిత్వాన్ని గురించి ఆరుద్ర, వరద (అబ్బూరి వరద రాజేశ్వరరావు)ల కవితారూపసంభాషణలో

'అనుభవం నినదించడం కవిత్వం'

భవాన్నీ భయాన్నీ వచించి చిందడం కవిత్వంగా అని తేల్చారు. తిలక్ 'వానకురిసిన రాత్రి' లో భావ చిత్రాలను పేర్చాడు. విద్వాన్ విశ్వం 'పెన్నేటియం' సాంఘిక ప్రయోజనంతో రాసిన అభ్యుదయ కావ్యం. ఇందులో సత్త్వరజస్తమో గుణాలను జరిగిన సంఘర్షణలో సత్త్వం గెలుస్తుంది.

ఈ దశాబ్దిలో కుందుర్తి 'తెలంగాణ, యుగే యుగే' లు వెలువడ్డాయి. వచన కవితా ప్రక్రియకున్న శక్తి వీటిలో ప్రదర్శితమైంది. గోపాల చక్రవర్తి 'కలంకలలు' అనే కావ్యంలో నవ్యతను ప్రదర్శించాడు. :

'జీవితం కరిగిపోయే మంచు
ఉన్నదాంట్లోనే నలుగురికి పంచు'

అనే కవితాపంక్తులు చాలా ప్రసిద్ధికెక్కాయి. పోలీసుచర్యకు ముందే నైజాం 'నాజీశక్తుల నగ్నతాండవము' ను నిరసించినకాళోజీ ఈకాలంలో మెత్తని హాస్యంతో అధిక్షేప కవితలు రాశాడు :

'ప్రతిచాదస్తం దేవుడే ఏదో ఒక విధంగా గోకుడే
నశ్యంచూస్తే ఏవగింపు జర్దా రూపంలో గిట్టును కంపు'

అంటూ ఎత్తిపొడిచాడు.

భిన్నభిన్న దృక్పథాల సమన్వయం జరిగిన ప్రయత్నాలు ఈ దశాబ్ది ప్రత్యేకత. సంప్రదాయాన్ని తోసిరాజనకుండానే కొత్త ప్రయోగాలు చేశారీ కాలపు కవులు. 1954కు ముందు అభ్యుదయ కవిత్వం రాసినవాళ్లు ఈ కాలంలో సమన్వయధోరణిని అవలంబించారు. దాశరథి, సోమసుందర్, విశ్వం, నారాయణరెడ్డి, పుట్టపర్తి, దుర్గానంద్ మొదలైనవారు ఈ కోవలోకి వస్తారు.

విశ్వం 'పెన్నేటిపాట 'నేటి రాయలసీమ కన్నీటిపాట' గా వినిపించాడు. ఇది పద్యగేయచ్ఛందస్సుల సమ్మిశ్రణంతో సాగింది. బోయిభీమన్న 'దీపసభ'లో సృష్ట్యాది నుండి దీపాలను ప్రదర్శిస్తూ దీపాలన్నీ ఆ



BRAOU

పరంజోతి అంశలే అని చెప్తారు. దుర్గానంద్ ప్రబంధం" అని పేర్కొన్నారు. యుద్ధ వ్యతిరేకత, శాంతికాంక్ష ఇందులో వ్యక్తమయినాయి. పుట్టపర్తివారు మేఘదూతము' మోటూరివెంకటరావు 'చకోర సందేశం' ఈ కాలంలో వెలువడిన సందేశకావ్యాల్లో కొన్ని. మొదటి దానిలో ధనిక వాదాన్ని నిరసించిన ఓ సామాన్యుడు నిర్బంధితుడు కావడం చిత్రితమైంది. ఒరవడి మేఘసందేశానిదే అయినా సమకాలీన సాంఘిక పరిస్థితుల అన్వయం కొత్త. ఇది ఖండగీతంలో సాగిన కావ్యం. మేఘసందేశాన్నే విలోమ మార్గంలో మలిచిన కావ్యం చకోరసందేశ దీనిలో యక్షుని భార్య తన భర్తకు చకోరంతో సందేశం పంపిస్తుంది. దేశీయగేయరీతులు ఇందలి ప్రక్రియ.

ఈ దశాబ్దిలో నారాయణరెడ్డి మూడు కథాప్రధానమైన గేయకావ్యాలు ప్రకటించారు. అవి "నాగార్జున సాగరం, కర్పూర వసంతరాయలు, విశ్వనాథనాయకుడు" ఇవన్నీ చారిత్రకాంశాలకు కల్పనను మేళవించిన కావ్యాలు. 'కర్పూర వసంతరాయలు'లో ప్రణయత్యాగశీలం, విశ్వనాథనాయకుడులో 'రాజభక్తి' ప్రతిపాదితమైనాయి. 'నాగార్జునసాగరం' గేయ కథాకావ్యాల్లో గానీ వలభైకిపైగా కావ్యాల్లోగానీ ఈ సమన్వయ ధోరణిని ప్రచారం చేశారు.

నెహ్రూ ప్రతిపాదించిన పంచశీల సూత్రాలు, తటస్థ విధానం, ఆంధ్రదేశంలో నాగార్జునసాగర్ ఆనకట్ట నిర్మాణం, 1953లో పొట్టి శ్రీరాములు ఆత్మార్పణతో 1956లో ఏర్పడిన విశాలాంధ్రం ఇవన్నీ ఈ దశాబ్దికవుల హృదయాలను కదిలించాయి.

ఈ దశాబ్ది కవుల్లో దాశరథి ఉత్తమకవితా రచన చేశారు. 'మహాంధ్రోదయం పునర్నవం అమృతాభిషేకం' అనే ఖండకావ్యాల్లో వినూత్నమైన పోకడలు కనిపిస్తాయి. 'శిల్పి, మంజీర' అనే ఖండికల్లోని కొన్ని పద్యాలు నోళ్లకెక్కాయి. 'అచుంబితం' అనే గేయంలో 'మాట్లాడని మల్లెమొగ్గ మాదిరిగా నడచిరా' అనే అపూర్వమైన ఊహ కన్పిస్తుంది.

నార్ల వెంకటేశ్వరరావు 'జగన్నాటకం' అనే ఖండకావ్యంలో వస్తునవ్యతను ప్రదర్శించారు. వేమన్న ధోరణిలో ఆయన రచించిన "నార్లవారిమాట"లో సమకాలీన సమస్యలు విమర్శితమైనాయి. వచన కవిత్వంలో ప్రణయం, తత్త్వజిజ్ఞాస, ప్రగతిభావాల సమ్మేళనంలో కవిత్వం రాసినవారు బోయిభీమన్న. 'అనాదికొసనుండి అనంతత్వంలోకి, త్రిపదలు, రాగవైశాఖి, గుడిసెలు కాలిపోతున్నై, శిథిలాలయం' అనేవి ఆయన ప్రసిద్ధి కావ్యాలు. ఉండేలమాల కొండారెడ్డి 'కాంతిచక్రాలు' లో వైచిత్రిని ప్రదర్శించారు. ఈయన కోడిని ముత్తైదువుగా, రేడియోను వలపులాడిగా, గాజులను కాంతిచక్రాలుగా, రైలును నాగవేణిగా వర్ణించారు. అధిక్షేప ప్రధానంగా శ్రీనివాస సోదరులు 'ఉపహారం' అనే ఖండకావ్య సంపుటిని వెలువరించారు. ఈ కాలంలో సోమసుందర్ ప్రకృతి వర్ణనలు, తాత్త్విక చింతనతో కూడిన రచనలు చేశారు. 'ఊరు మారింది, వెన్నెలలో కోనసీమ, అసలకిరీటం' వంటి రచనలు విలక్షణమైనవి. వానమామలై వరదాచార్యులు 'ఆహ్వానము' అనే సంపుటిలో ఎక్కువగా గాంధీస్మృతి గీతాలను రచించారు. బాపురెడ్డి 'చైతన్యరేఖలు' పేర్వారం జగన్నాథం 'సాగర సంగీతం' చక్కని కవితా సాధనకు నిదర్శనాలైనాయి. ఈ కాలంలో ఎక్కువ వచన కవితా సంపుటులు రచించిన వారు మాదిరాజు రంగారావు 'కిర్మీరం, మేల్కొన్న ఆకాశం, మనోభూమికలు, అద్దంలో నీడలు' అనే సంపుటలు అందరి దృష్టిని ఆకర్షించాయి. 'రేపటి స్వర్గం, నిదురకన్నెలు, కాలంగీసిన గీతలు, మనస్' అనే కావ్యాల్లో అరిపిరాల విశ్వం భావ సౌందర్యాన్ని ప్రదర్శించారు. ఇంకెందరో ఈకాలపు కవిత్వాన్ని సుసంపన్నం చేశారు. వారి పేర్లు ఉదహరించకతప్పనివి. సుప్రసన్న, కేవవరావు, యాదవరెడ్డి, శ్రీదేవి, నారపరెడ్డి, రెంటాల, పల్లాదుర్గయ్య, రమణారెడ్డి, కవిరాజమూర్తి, చిల్లర భావనారాయణ, ఉత్పల సత్యనారాయణా చార్య, బొడ్డు బాపిరాజు, పిలకా గణపతిశాస్త్రి, కొనకళ్ళ, కరుణశ్రీ, శశాంక, అమరేంద్ర, మసూనా, అనూనా, పి.ఎస్.ఆర్. ఆంజనేయశాస్త్రి, ముకురాల రామారెడ్డి, మురళీధర్, సి.వి.కృష్ణారావు, అద్దేపల్లి రామమోహనరావు, నూతలపాటి గంగాధరం, ముదిగొండ శివప్రసాద్, ఎల్లోరా, నాయని కృష్ణకుమారి తదితరులు.

కవిత్వం ఏదో ఒక రాజకీయ సిద్ధాంత ప్రచారానికే అంకితం కారాదనీ, కవి ఏదో ఒక రాజకీయ విశ్వాసానికి నిబద్ధుడు కానక్కరలేదనీ ప్రేమ, ప్రకృతి, భక్తి వంటి వివిధ భావాలతో కవితారచన చేసినారు కొందరు 'అనుభూతి కవులు'.

'అనుభూతివాదం' అనే సిద్ధాంతాన్ని ప్రచారం చేస్తూ ఇంద్రగంటి శ్రీకాంతశర్మ కవిత్వం రాస్తున్నారు. 'జెండాలు, నినాదాలు, సిద్ధాంతాల సంకెళ్లతో నిమిత్తంలేకుండా కేవలం కవిత్వం కోసం కలంపట్టిన సరికొత్తరకం

BRAOU

ప్రతినిధి' గా అజంతా వీరిని గూర్చి అభివర్ణించారు. అనుభూతి లేకుండా కవిత్వం ఉండదు కాని కవిత్వేతర విలువలను తిరస్కరించడానికి ఈ పేరును వాడుతున్నారనుకోవాలి. శ్రీకాంతశర్మ 'అనుభూతిగీతాలు' అనే సంపుటి సహృదయులను ఆకర్షించింది. 'కెలైడోస్కోప్' అనే కవితలో 'జీవితం' జనమయ బాహ్య ప్రపంచంలో సీలింగ్ ఫాన్‌కు పైగా చిట్టి పిచ్చుకలు కట్టేగూడు' అని వర్ణిస్తారు.

పాశ్చాత్య కవితారీతిలో, చెదిరిపోయిన ఒకానొక మానసికావస్థను వర్ణిస్తూ రాసే కవితలు వేగుంట మోహనప్రసాద్‌వి. భావ వ్యక్తీకరణలో ఒక క్రమం లేక పోవడం వల్ల వీరి కవితలు ఓపట్టాన అర్థంకావు. ఏదో నైరాశ్యం, ప్రాక్తన జ్ఞాపకాలు వీరి కవితల్లో నీడల్లా కదులుతున్నట్లు తోస్తుంది. అయితే ప్రసాద్ కవితాభివ్యక్తిలో చక్కటి ఆకర్షణ ఉండటంవల్ల చదివిస్తాయి. అపూర్వ భావచిత్రాలు వీరి కవిత్వంలో ప్రత్యేకత. వీరి "చితిచింత" కవితా సంపుటి ప్రసిద్ధి పొందింది.

ఈ కాలంకవుల్లో ఇస్మాయిల్ గొప్పభావుకుడు. 'చెట్టు ఆదర్శం; మృత్యువృక్షం, చిలుకలు వాలినచెట్టు' అనే ఈయన కవితాసంపుటులు ఉత్తమ కవితాశక్తికి నిదర్శనాలు. కవిత్వం రాజకీయ సిద్ధాంతాల ప్రచారానికి కాదని విశ్వసించే ఇస్మాయిల్ రాయిస్తుగా ఆ వాదాలతో స్పర్ధకు కూడా దిగుతారు. కాలవహొడ్డున షికార్లు వర్షాల్లో కాలేజీ; రాత్రి కారుప్రయాణం, టీకప్పు వంటి సామాన్య సంఘటనలను తీసుకొని కవితలు రాశారు ఇస్మాయిల్. కొత్తపల్లి సత్య శ్రీమన్నారాయణ తన 'వెలుతురు పిట్టలు' సంకలనం ద్వారా పలువురిని ఆకర్షించాడు. మాండలిక భాషలో కవిత్వంరాసి మెప్పించిన కవులుగా రంధి సోమరాజు, దేవరాజు మహారాజులను పేర్కొనవచ్చు.

అభ్యుదయ కవితోద్యమం తర్వాత చేతనావర్త కవులు (1967) పలువురిని ఆకర్షించారు. మనిషి ఆత్మానుభూతి నుంచి సమాజచైతన్యంలోకి ప్రయాణిస్తున్నాడనే స్పృహతో వీరు కవిత్వం రాశారు. దీనిని చేతనావర్తమని పిలిచారు. 'చేతనావర్తం' పేరుతో వెలువడిన సంపుటిలో సుప్రసన్న, పేర్వారం జగన్నాథం, సంపత్కుమార, నరసింహారెడ్డి కవితలున్నాయి.

డెబ్భైల్లో నుండి ఒక ప్రత్యేకత అభినివేశంతో కవిత్వం రాస్తున్న కవి శేషేంద్ర, కవిత్వంలో వస్తువుతోపాటు రీతికూడా మారాలనీ, కవిత్వం రాజకీయ నినాదాల్లో బందీకారాదనీ శేషేంద్ర అభిప్రాయ పడ్డారు. వీరు కవిత్వంలో సౌందర్యానికి ప్రత్యేక ప్రాధాన్యమిస్తారు. 'కవిసేన' కు స్థాపక నాయకులై అకవిత్వానికి వ్యతిరేకంగా ధ్వజమెత్తారు. వీరి 'కవిసేన మేనిఫెస్టో' చర్చలకు, వాదోపవాదాలకు గురయింది. శేషేంద్ర 'శేషజ్యోత్స్న, మండే సూర్యుడు నా దేశం, నా ప్రజలు, సముద్రం నాపేరు, నీరై పారిపోయింది, గొరిల్లా ప్రేమ లేఖలు' అనే కావ్యాలు రచించారు. వీటన్నింటిలో ఆయన కవితాశక్తి వ్యక్తమవుతుంది. కవి ఈ కవితల్లో నూతన వ్యక్తీకరణకోసం తపనపడుతున్నట్లు తోస్తుంది.

కవిసేన తరపున 'కొమ్మలు చీల్చుకుని వీస్తున్న పూలు' అనే సభ్యుల కవితా సంపుటి వెలువడింది. భావప్రకటనా వైచిత్రికి ప్రాధాన్య మిచ్చిన ఈ సంపుటిలో అవధాని, మల్లెల, వనమాలి, మోనా తదితరుల కవితలున్నాయి.

ఈ మధ్య క్లుప్తంగా ఉండే కవితకు 'మినీకత' అనే వ్యవహారం ప్రచారంలోకి వచ్చింది. 'మినీకవితా విప్లవం' అనే సంకలనం కూడా వెలువడింది. రూపం విప్లవం కాజాలదని విమర్శకులు ఖండిస్తున్నారు. అయితే ఈ కాలంలో కవులు ఎక్కువ సంఖ్యలో మినీ కవితలు రాస్తున్నారు. దీనికి కొన్ని ప్రత్యేక లక్షణాలున్నాయని, వాటి నిరూపణకు ప్రయత్నాలు జరుగుతున్నాయి మినీకవిత ప్రత్యేక అస్తిత్వాన్ని గురించి కాలంతీర్పు చెప్పాలి.

ఈకాలంలో కవితా సంపుటులు అసంఖ్యాకంగా వెలువడ్డాయి, సుప్రసన్న 'పాండిచ్చేరిగీతాలు' తాత్త్విక భావాలలో వెలువడింది. ఎమ్వీయల్ 'యులిసిస్‌లో'.... 'అబద్ధాన్ని కవిసమయాల ఒరల్లో దాచి నిజాన్ని కవిత్వంలో చంపకు' మని ఆదేశిస్తారు ఎన్. గోపి రచించిన తంగేడిపూలు, మైలురాయి' సంపుటులు పలువురిని ఆకర్షించాయి. ఇతని "సామాగ్రి" అనే కవిత ప్రసిద్ధికెక్కింది.

కె. యస్వీ రచించిన 'రాత్రి' లో నిగూఢమైన ఆవేశం కనిపిస్తుంది. వణుతల రామచంద్రయ్య 'సీమోల్లంఘన', శ్రీవిహారి 'చలనమ్', దేవీప్రియ 'అమ్మచెట్టు' సమాజానంద స్వామి', నాయని కృష్ణకుమారి 'అగ్ని పుత్రి' శీలాసుభద్రాదేవీ, 'ఆకలి నృత్యం' ఆచార్యతిరుమల 'మాట్లాడేమల్లెలు' ఇట్లా అనేక సంపుటులు వెలువడి తెలుగునాట కవిత్వం పరిఢవిల్లింది.



BRAOU

వర్తమాన యువకుల్లో జింబో, సంధిని సిద్ధారెడ్డి, గుడిహాళం రఘునాథం, సుంకిరెడ్డి నారాయణరెడ్డి, చంద్రసేన్, అలిసెట్టి ప్రభాకర్, కొనకంచి, సౌభాగ్య, సుమనశ్రీ, తదితరులు కొత్త గొంతుకతో కవితలు రాస్తున్నారు.

### 20.8.9 సంప్రదాయ కవిత్వం

నూతన ధోరణులు అనేవి పాతకు పరిణామక్రమంగానో, పాతకు వ్యతిరేకంగానో వస్తూ ఉంటాయి. సాహిత్యంలో కొత్తదనం అవతరిస్తున్నప్పుడు కూడా ప్రాచీన సాహిత్యం కొన్ని సమాజాల్లోఉంటుంది. అయితే ప్రాచీన సాహిత్య వ్యాసంగానికి ఇప్పుడు ఇది వరకు లేని అదనపు లక్షణాలు కొన్ని వచ్చి చేరుతాయి సంప్రదాయం పట్ల ప్రత్యేకాభిమానం పునరుద్ధరణ వ్యాజంలో అంతర్లీనంగా ఉండే ప్రతిఘటన లాంటివి ప్రచారానికి వస్తాయి.

ఇరవయ్యో శతాబ్ది తొలి రెండు దశాబ్దుల్లో ఆస్థానకవులు, పండితులు ఇలాంటి రచనలు చేశారు. పురాణ కథలను తీసుకుని కావ్యాలల్లడం. పల్లెపట్టుల్లోని ఇది వృత్తాలను ఎన్నుకోవడం, అవధాన కవిత్వాలకు ప్రోత్సాహం లభించడం వంటివి ఆకాలంనాటి సంప్రదాయ సాహిత్యం కిందకు వస్తాయి. సంస్థానాల సాహిత్య సేవ ఈ శతాబ్ది తొలిరోజులదాకా సాగింది.

మహామహోపాధ్యాయ అనే బిరుదు వహించిన కొక్కొండ వేంకటరత్న శర్మ (జననం వినుకొండలో, 1842) ఈ కాలంలో గొప్ప పండిత కవి సంప్రదాయ రీతిలో వర్ణనాత్మక కావ్య రచన చేశాడు. 'కొక్కొండ మహాత్మ్యము, పాయనము' అనే పేరు మీద మంగళగిరి క్షేత్ర మహాత్మ్యము 'పాయనము' అనే పేరు మీద 'సత్యనారాణీయము', 'ఘటికాచల మహాత్మ్యము" అనే కావ్యాలు రాశాడు.

శతక రచనలలో ప్రసిద్ధిపొందిన పడ్డాది సుబ్బరాయకవి 1854లో జన్మించాడు. ఈయన 'భక్తచింతామణి, నందనందన' శతకాలు పేరుకెక్కాయి. 'సతీస్మృతి, సుత స్మృతి చాటూక్తి ముక్తావళి" అనే లఘుకావ్యాలు కూడా ప్రశస్తమైనవే.

'వర విక్రయము' అనే నాటక రచనతో తెలుగు సాహిత్యంలో సుస్థిరస్థానం సంపాదించుకున్న కాళ్లకూరి వేంకటనారాయణ రావుకు 'మహాకవి' అని బిరుదుండేది, బుద్ధి రాజుల, రాణి సుందరి, పెద్దలనాటి ముద్దుకథలు' లాంటి చిత్రకావ్యాలుకూడా రచించాడు.

ఒక్క చేతిలో సంపుటాలకొద్దీ 'కాశీమజిలీ కథల' వెలిగించిన మధిరసుబ్బన్న దీక్షితులు కావ్యనిర్మాత కూడా ఈయన 'గౌతమీ మహాత్మ్యము' సప్తసాగర మహాత్మ్యము, భద్రాదిరామచరిత్రము, గౌతమీ పుష్కర మహాత్మ్యము' మొదలైన కావ్యాలు రాశాడు.

ఈ పద్ధతిలోనే రచనలు సాగించి గొప్ప సాహిత్య సేవను చేసిన వారిలో శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రి, జయంతి రామయ్యపంతులు, కాశీ కృష్ణాచార్యులు మొదలైన పండిత కవులు ప్రాతఃస్మరణీయులు. సాంప్రదాయ కావ్యరచనలు చేసిన వారిలో స్త్రీలు కూడాఉన్నారు. వారిలో కొటికలపూడి సీతమ్మ, ఆచ్యూరి అన్న పూర్ణమ్మ, చేబ్రోలు సరస్వతీ దేవి, స్థానాపతిరుక్మిణమ్మ, గుడిపూడి ఇందుమతీదేవి తదితరులు పేర్కొన దగినవారు.

ప్రాచీన సంస్కృతిని పరిరక్షించాలనే తీవ్రమైన అభినివేశంతో ప్రాచీన పురాణ కథలను మళ్లీచెప్పాలనే ఆరాటంతో ఎనలేని కృషి చేసిన వారిలో వావిలికొలను సుబ్బారావు (వాసుదాసు) ప్రముఖుడు. ఈయన 1863లో కడపజిల్లాలో జన్మించాడు. ఈయనకు సాహిత్యం పరభాషా ప్రభావితం కారాదనే అభిప్రాయం ఉండేది. వీరు గ్రాంథిక వాది. 'కవితా విమర్శన మండలి' అనే ఒక సంఘాన్ని స్థాపించాడు. అందులో బసవరాజు అప్పారావు, వింజమూరి రంగాచార్యులు, కురుగండి సీతారామయ్య, పాటిబండ అప్పారావు, తదితరులు సభ్యులు, వారి దృష్టిలో సంఘసంస్కరణ భావాలకు సంఘంలో తావులేదు. పూర్వ, ఆధునిక సంఘ చరిత్రకూ, ఆంగ్ల విమర్శనా పద్ధతులకూ తావులేదు.

వావిలి కొలను వారు 'కుమారాభ్యుదయం' అనే పేరుతో రుక్మిణీ కృష్ణులకు మన్మథుడు ప్రద్యుమ్నుడై జన్మించడాన్ని కావ్యంగా రాశారు. బంధ కవిత, సుదీర్ఘ సమాస కల్పన మీద ఈయనకు మోజు ఎక్కువ, రామాయణాన్ని రాసి ఒంటిమిట్ట కోదండ రామస్వామికి అంకితం చేశాడు వాస్తవంలో ఆయన రామాయణం

BRAOU

కన్నా దానికాయన రాసిన మందర వ్యాఖ్యకే ఎక్కువ ప్రశస్తి వచ్చింది. 'పోతరాజా వాఙ్మయం, కౌసల్యా పరిణయం' అనే వాక్యాలు రచించాడు. శతకాల్లో 'ఘటికాచలవాస కేశవ శతకం', టెంకాయ చిప్ప శతకం' భక్తకల్ప ద్రుమ శతకము' ప్రసిద్ధి కెక్కాయి.

సంప్రదాయ మార్గంలో రచించిన కావ్యాల్లో ఇరవైయేళ్ల క్రితం ప్రారంభించిన విశ్వనాథ సత్యనారాయణ శ్రీమద్రామాయణ కల్పవృక్షం సుందరకాండ వరకు ఈ కాలంలో ప్రచురితమైంది. 'జీవుని వేదన'ను ప్రదర్శించిన ఈ రచన 'సకలోకవైభవసనాథము' గా రచితమైంది. మధునాపంతుల సత్యనారాయణ శాస్త్రి) "ఆంధ్రపురాణము", వానమామలై వరదాచార్యుల 'పోతన' అనే బృహత్కావ్యాలు చారిత్రక, కల్పనలమేళవింపుతో కమనీయంగా వెలువడ్డాయి. ఇదేమారగంలో వెలువడిన కావ్యాల్లో మోటూరి వెంకటరావు 'సింహబలి', ఉప్పాడ రాజారావు 'మధూదయము', వెంకటనారాయణరావు, అశోకచరిత్రము, పేర్కొనదగినవి, ప్రసిద్ధి పురాణ పాత్రలను తీసుకొని.రచించినకావ్యాల్లో చిన వెంకటరెడ్డి 'మేనక, రంభ, 'స్ఫూర్తి శ్రీ అహల్య మహాశ్వేత సుప్రసన్న 'దుఃఖ యోగిని గణనీయమైనవి. పై కావ్యాల్లో వస్తుపరమైన మార్పులు కనిపిస్తాయి. వస్తునవ్యతతో సంప్రదాయ సిద్ధంగా పల్లాదుర్గయ్య రచించిన గంగిరెద్దు, కావ్యంలో "పశుప్రాణులలో గూడ పరీతవిపరీత జ్ఞానముండదన్న రహస్యము" ప్రతిపాదితమైంది. దాశరథి 'మహాబోధి' కావ్యంకూడా సంప్రదాయ ధోరణిలో రచించిందే.

ప్రక్రియాపరంగా సంప్రదాయాన్ని అనుసరిస్తూనే, పురాణ వైరధోరణిని ప్రదర్శిస్తు రచనలు చేసిన వారిలో త్రిపురనేని రామస్వామి చౌదరి ప్రముఖుడు. ఈయన పురాణ కథలను 'ఆర్య ద్రావిడ' దృక్పథంతో చూసి రచనలు చేశాడు. ఈయన రచించిన 'సూత పురాణము'లో ఈ దృష్టి ప్రబలంగా కనిపిస్తుంది. కులవ్యవస్థ నిర్మూలనం చెయ్యాలని కాక, బ్రాహ్మణాధిక్యతను తగ్గించాలనే పట్టుదల త్రిపురనేనిలో కనిపిస్తుంది. ఈయన తిరుపతి వేంకట కవుల శిష్యుడు. 'కవిరాజు' అనే బిరుదు పొందాడు.

**అవధాన ప్రక్రియ**

అవధానాలు అనగానే తిరుపతి వేంకట కవులే (దివాకర్ల తిరుపతిశాస్త్రి) చెళ్లపిళ్ల వేంకటశాస్త్రి)) గుర్తుకొస్తారు. ఈ శతాబ్ది తొలి నాలుగు దశాబ్దుల్లో చాలామంది పండితకవులు తమ పేరు పక్కన శతావధాని, అష్టావధాని అని చేర్చుకునేవారంటే అవధాన ప్రక్రియకు లభించిన గౌరవ ప్రాచుర్యాలకది తార్కాణం.

రచనకూ, వ్యక్తీకరణకూ బుద్ధి ప్రధాన సాహిత్యాన్ని స్థూలంగా ఆశుకవితా లక్షణంగా చెప్పవచ్చు. పాండిత్యంతో పాటు సమయస్ఫూర్తి గలవారు దీనిని సమర్థంగా నిర్వహించడానికి అవకాశముంది.

నంది మల్లయ్య, ఘంట సింగయల తరువాత ప్రశస్తికెక్కిన జంటకవులు తిరుపతి కవులే. శ్రీకాకుళం మొదలు చెన్నపట్టణందాకా అవధాన యాత్రలూ, నానారాజ సందర్శనం చేసి సామాన్య ప్రజలను సైతం కవిత్వంవైపు ఆకర్షించిరు. 'బావా ? ఎప్పుడు వచ్చితీవు ?' 'అలుగుటయే యెరుంగని మహామహితాత్ముడజాత శత్రుడే యలిగిననాడు" వంటి పద్యాలను పశులకాపర్లు సైతం పాడుకునే వారు. మంచినీళ్ల ప్రాయంగా, ధారాళమైన శైలితో, ఎక్కడి కక్కడ విరిగే సంభాషణ రీతిలో ఉండి, తిరుపతి కవుల పద్యాలు, ధారణానుకూలంగా ఉంటాయి. వీరు సంస్కృతాంధ్రాల్లో గొప్ప పండితులు. 'రెండు బాసలకు మేమే కవీంద్రుల' మని చెప్పుకొన్నారు. అనేక సాహిత్య యుద్ధాల్లో పాండిత్య వీరం ప్రదర్శించి 'కిం కవీంద్ర ఘంటాననా పంచాననులు'గా విఖ్యాతి పొందారు. తిరుపతి కవుల పాండవోద్యోగ విజయాది నాటకాల పట్ల నేటికి ఆదరం వెల్లి విరుస్తున్నది. పద్య కవిత్వాన్నీ, తద్వారా భారత కథనూ ఒక ఉద్యమ స్థాయిలో ప్రజలు దగ్గరికి తీసుకువెళ్ళిన ఘనత తిరుపతి వేంకట కవులదే. వీరి సారస్వత సేవను జాతీయోద్యమంలో గానీ, సంప్రదాయ పునరుద్ధరణలో గానీ ఒక పాయగా భావించ వచ్చు. ఆ కాలంలో ఆధునిక కవుల్లో అనేకులు ప్రత్యక్షంగానో పరోక్షంగానో తిరుపతి కవుల శిష్యులైనారు. 'చెళ్లపిళ్ల వేంకట గురువంచు జెప్పికొనగా నది గొప్ప'గా ఉండేది. కవిత్వంలో వ్యాకరణం భాషా విషయాల్లో వీరుకొన్ని అంశాల్లో ఆధునికతకు వ్యతిరేకులు" అని విమర్శకులు భావిస్తున్నారు.

## 20.9.0 వచన ప్రక్రియల వికాసం

క్రి. శ. 1600 - 1800 మధ్యకాలంలోనే వచన ప్రక్రియల వికాసానికి అవసరమైన సామాజిక రంగం సిద్ధమైంది. బ్రిటిష్ వలస పాలన ఫలితంగా, మన సమాజంలోని మార్పులు వ్యావసాయిక దిశనుండి పారిశ్రామిక



BRAOU

దిశగా మళ్లడానికి అవసరమైన పరిస్థితులు ఏర్పడుతూ వచ్చాయి. పైగా మన విద్యావిధానంలో వచ్చిన మార్పుల వల్ల యూరోపియన్ సాహిత్య ప్రక్రియలతో విస్తారమైన పరిచయం మన విద్యావంతులకు ఏర్పడింది. కొత్త పాఠక వర్గాలు, ముఖ్యంగా మధ్యతరగతి పాఠక వర్గం ఏర్పడింది. వచన ప్రక్రియలైన నవల, కథానిక, నాటకం, నాటిక పత్రికా రచన వంటివి తెలుగులో ప్రాముఖ్యం వహించాయి. ఈ ప్రక్రియల పరిణామాన్ని గురించి ఈ ఉపవిభాగంలో తెలుసుకుందాం.

### 20.9.1 నవల

1892 లో న్యాయవాది సుబ్బారావు సంపాదకత్వంలో వెలువడిన 'చింతామణి' పత్రిక నవలను బాగా ప్రోత్సహించింది. నవలలపోటీలు నిర్వహించి నవలా సాహిత్యాన్ని ప్రాచుర్యంలోకి తెచ్చింది. నవలా రచనకు కావలసిన సూత్రాలను నిర్ణయించింది. క్రీ. శ. 1900 లకు పూర్వం వెలువడిన నవలల్లో ఎక్కువగా సంఘసంస్కరణాభిలాష కనిపిస్తుంది.

20వ శతాబ్దం తొలిరోజుల్లో వచ్చిన మార్పులు నవలారచనను ప్రభావితం చేశాయి. జాతీయభావాలు, ఆంగ్ల విద్యావ్యాప్తి, సంస్కరణోద్యమాలు, పత్రికావ్యాప్తి, పుస్తక ప్రచురణ, సంస్థల స్థాపన ఇవన్నీ నవలా వికాసానికి తోడ్పడ్డాయి.

కృష్ణాపత్రిక, దేశమాత, సరస్వతి, హిందూసుందరి, మనోరమ, ఆంధ్ర వారపత్రిక వంటి పత్రికలు సాహిత్య సాంస్కృతిక పునరుజ్జీవనానికి దారులు వేశాయి. విజ్ఞాన చంద్రికా మండలి, ఆంధ్ర ప్రచారిణీ గ్రంథమాల, సరస్వతీ గ్రంథమండలి, వేగుచుక్క గ్రంథమాలవంటి ప్రచురణ సంస్థలు ఎన్నో విలువైన పుస్తకాలను ప్రచురించి పఠనాసక్తిని పెంపొందించాయి.

మొదట చారిత్రక, అపరాధపరిశోధక నవలల అనువాదాలు ఎక్కువగా జరిగాయి. దీనిని అనువాద యుగమని కూడా పేర్కొనవచ్చు. బెంగాలీ నుండి అనూదితమైన చారిత్రక నవలల్లో 'ఆనందమఠం' (అనువాదకుడు ఓ వైదారస్వామయ్య 1907.) 'ప్రఫుల్లముఖి' (కనకవల్లి భాస్కరరావు 1909), 'రాధారాణి' (చాగంటి శేషయ్య) 1910 వంటివి ప్రసిద్ధికెక్కాయి. మళయాళం నుండి కొడ్ల వెంకటరామరెడ్డి అనువదించిన నవల 'కళావతి' వచ్చింది. ఇదేకాలంలో 'ఐవాన్‌హో' (కేతవరపు వేంకటశాస్త్రి 1910) వంటి ఆంగ్ల చారిత్రక నవలలు కూడా వెలువడ్డయి.

BRAOU

ఈ శతాబ్దిరెండో దశకంలో స్వతంత్ర చారిత్రక నవలలు వెలువడ్డాయి. ధరణి ప్రెగ్గడవేంకటశివరావు రచించిన 'కాంచనమాల' (1908), వేంకటపార్వతీశ్వరుల 'వసుమతీ వసంతము' (1911), ఎ.పి. నరసింహ పంతులు వ్రాసిన 'వసంతసేన' (1912). సత్యవోలు అప్పారావు వ్రాసిన 'పున్నాబాయి' (1913) వంటివి ప్రఖ్యాతి చెందాయి.

ఇదే కాలంలో ఆంధ్రరాష్ట్రోద్యమానికి బీజాలుపడి తెలుగు ప్రభువుల వ్యక్తిత్వ చిత్రణాసక్తికి దారితీసింది. దుగ్గిరాల రాఘవ చంద్రయ్య సచ్ఛాస్త్రి 'విజయనగర సామ్రాజ్యము' (1913) కేతవరపు వేంకటశాస్త్రి 'రాయచూరి యుద్ధము' (1914), వేంకట పార్వతీశ్వరులు 'ప్రమదావనము' (1914), శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి "విషభుజంగము" (1917), భోగరాజు నారాయణమూర్తి 'ఆంధ్రరాష్ట్రము' (1918) వంటివి ఈ కోవలోకి వస్తాయి.

చారిత్రక నవలల్లో కాల్పనికత జోడింపు జరిగింది. కాబట్టి వీటిని చారిత్రకాభాసాలు (Psuedo-Historical Novels) అనవలసివస్తుందని డా॥ మొదలి నాగభూషణశర్మ భావించారు.

1900 – 1920 మధ్యకాలంలో సాంఘికేతివృత్తాలతో వెలువడిన నవలల్లో వస్తువైవిధ్యం కనిపిస్తుంది. పాశ్చాత్యప్రభావం, హేతువాదదృష్టి పెరిగి సమాజ సంక్లిష్టతను నవలలు చిత్రించాయి. వితంతువివాహాలు, హరిజనాభ్యుదయం వంటి సంస్కార ప్రతిపాదితాలైన వస్తువులు కనిపిస్తాయి. వేదునూరి గణేశ్వరరావు రచించిన 'సుగుణవతి పరిణయము' (1908) హద్దనూరి గోపాలరావు 'సుందరి' (1912), కొత్తపల్లి సూర్యారావు 'కులపాలిక' (1912) వంటివి ఈరకం నవలల్లో చెప్పుకోదగ్గవి. తల్లాప్రగడ సూర్యనారాయణ రచించిన 'హేలావతి' (1913) తెలుగులో వెలువడిన మొదటి హరిజనాభ్యుదయ నవల.

'రాబోయే నవలా రచనకు మార్గదర్శకత్వం వహించిన రచనలుగా 'మాతృమందిరము, గణపతి, మాలపల్లి' నవలలను చెప్పుకోవచ్చు. వీటిలో సామాజికసమస్యలు చిత్రితమైనాయి. చిలకమర్తివారి గణపతి (1919) ఆ కాలంలోని బ్రహ్మణకుటుంబాల్లో వచ్చిన కల్లోలాలకు అద్దం పట్టిన హాస్యపూరిత నవల. గాంధీజీ 'హరిజనుడు' అన్న మాటను సృష్టించక ముందే హరిజన సమస్యను చిత్రిస్తూ రాసిన నవల ఉన్నవ లక్ష్మినారాయణ మాలపల్లి. దీనిలో వ్యావహారిక భాషవాడటం విశేషం.

1920-47 ల మధ్య తెలుగు నవలకొత్త పోకడలు పోయింది. నవ్యసాహిత్యోద్యమం, వ్యావహారిక భాషావాదం, కాల్పనిక ఉద్యమం మొదలైనవి నవలను కూడా ప్రభావితం చేశాయి. భాషా విప్లవం తీసుకురావాలన్న గాఢమైన తపన ఈతరం రచయితల్లో కనిపిస్తుంది. గుడిపాటి వెంకటచలం, విశ్వనాథ సత్యనారాయణ, అడవి బాపిరాజు ఈ కోవలోకి వస్తారు. స్త్రీ స్వేచ్ఛ, స్వేచ్ఛాప్రణయాలను చలం ప్రతిపాదిస్తే, సమాజం పటిష్ఠం కావలంటే నీతి నియమాలూ కట్టుబాట్లు దృఢతరం కావాలని విశ్వనాథ భావించాడు.

విశ్వనాథ యాభైకిపైగా నవలలు రాశాడు. ఆయన మొదటి నవల 'అంతరాత్మ' (1918). ఆయన నవలల్లో అన్ని రకాలూ ఉన్నాయి. చారిత్రకాలు, సాంఘికాలు, పురాణ పునరుద్ధరణలు వతయిరా 'వేయిపడగలు, చెలియకట్ట, ఏకవీర, బద్దన్న సేనాని, మాబాబు విష్ణుశర్మ, ఇంగ్లీషు చదువు' వంటివి ప్రసిద్ధికెక్కాయి.

చలం మొదటి నవల శశిరేఖ. '(1926) మైదానం, అమీనా, దైవమిచ్చిన భార్య' వంటి నవలలు ఎంతో సంచలనం కలిగించాయి. భాషా కథన విషయకంగా చలం, విశ్వనాథలు గొప్పశిల్పాన్ని ప్రదర్శించాడు.

బాపిరాజు 'గోనగన్నారెడ్డి, నారాయణరావు, కోనంగి తెలుగువీరుల కథలు. ఆయన రచించిన 'హిమబిందు' ఆంధ్ర శాతవాహనుల నాటి కథ. బాపిరాజు నవలల్లో తెలుగు ప్రాచీన చారిత్రక సాంస్కృతిక వైభవాన్ని పునరుజ్జీవింప జేసేప్రయత్నం కనిపిస్తుంది. ఆయనది జాతీయోద్యమ స్ఫూర్తి.

ఇదే కాలంలో మొక్కపాటి నరసింహ శాస్త్రి, మునిమానిక్యం నరసింహారావు, శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి తెలుగు వికాసానికి తోడ్పడిన గొప్ప రచయితలు మొక్కపాటి వారి 'బారిష్టరు పార్వతీశం' (1925) తెలుగు ఉత్తమ హాస్యనవల. మునిమాణిక్యం 'కాంతం' అనే హాస్య ధోరణిగల తెలుగు ఇల్లాలిని సృష్టించిన ధన్యుడు. 'దీక్షితులు, రుక్కుతల్లి తిరుమాళిగ' అనేవి ఆయన రచించిన ఉత్తమ నవలలు. తెలుగుతనం పట్ల గాఢమైన అభినివేశంతో రచనలు చేసినవారు శ్రీ పాద సుబ్రహ్మణ్యశాస్త్రి. 'ఆత్మబలి', రక్షాబంధనము అనేవి ఆయన ప్రసిద్ధ నవలలు.

BRAOU

అనంతర కాలాన్ని తన నిశితమైన సామాజిక దృక్పథంలో శిల్ప సౌష్ఠవంతో ప్రభావితం చేసినప్పటికీ కొడవటిగంటి కుటుంబరావు తొలి రచనలు 1947కు ముందే వచ్చాయి. గోపీచంద్ 'అసమర్థుని జీవయాత్ర. బుచ్చిబాబు 'చివరకు మిగిలేది' కూడా ఈ కాలంలోనే వెలువడ్డాయి. ఇవి మనస్తత్వ విశ్లేషణ ప్రధానంగా కలవి.

1947 తర్వాత ఇతోధికంగా నవలలు వెలువడ్డాయి. రాశిలోగాని, వైవిధ్యంలో గాని, ప్రజాదరణలో గాని ఇది నవలాయుగం అన్నంతగా ప్రాచుర్యం పొందిన ప్రక్రియ నవల.

స్వాతంత్ర్యానంతరం వచ్చిన నవలలను చారిత్రకాలు, సాంఘికాలు అని స్థూలంగా విభజించుకోవచ్చు. సాంఘికాల్లో ఎంతోవైవిధ్యం, భిన్నదృక్పథాలు, వివిధ ధోరణులు కనిపిస్తాయి.

స్వాతంత్ర్యానంతరం విద్యావకాశాలు పెరిగి విద్యావంతులు ఎక్కువ కావటం వల్ల నవలా పాఠకుల సంఖ్య వృద్ధిపొందింది. ముఖ్యంగా ఈ కాలంలో నవల మధ్యతరగతి జీవితాన్ని అన్ని దృక్కోణాల్లో చూపించటానికి ప్రయత్నించింది. తొలిరోజుల్లో నవల బ్రాహ్మణ కుటుంబాల్లోని మధ్యతరగతి జీవితాన్ని ఎక్కువ ప్రతిబింబించింది. క్రమంగా రచయితలు అన్ని వర్గాలలోంచి రావటం వల్ల నవలావస్తువు మధ్య తరగతి పరిధులు దాటి విస్తరించింది.

కొడవగంటి కుటుంబరావు మధ్యతరగతి జీవితాలలోని వైరుధ్యాలను విశ్లేషణాత్మకంగా చిత్రిస్తూ ఆలోచింపజేసే నవలలు రాశారు. 'చదువు, అనుభవం' మొదలైన నవలల్లో సమాజంలోని అస్తవ్యస్తత పాత్రల స్వభావాల్లో ప్రతిబింబించడం కనిపిస్తుంది. 'చివరకు మిగిలేది" నవలా రచయిత బుచ్చిబాబుది ప్రధానంగా

సౌందర్య దృష్టి. అయినా సంఘమనే చట్రంలో ఇమడలేని వ్యక్తి జీవితచిత్రణ దీనిలో కనిపిస్తుంది. చైతన్య స్రవంతి మార్గంలో మనోవిశ్లేషణాత్మకంగా రచించిన నవల గోపీచంద్ 'అసమర్థుని జీవయాత్ర' లో కూడా సంఘానికి వ్యక్తికీ జరిగే సంఘర్షణ మనోవిశ్లేషణాత్మకంగా చిత్రితమైంది. రాచకొండ విశ్వనాథశాస్త్రి 'అల్పజీవి' కూడా అదేమార్గంలో నడిచిన ప్రయోగాత్మక నవల. 'గోవులొస్తున్నాయి జాగ్రత్త, రత్తాలు - రాంబాబు' ఉత్తమ నవలలు. నవీన్ "అంపశయ్య" లో విశ్వవిద్యాలయంలోని విద్యార్థుల జీవితాన్ని చైతన్య స్రవంతి టెక్నిక్‌లో రచించారు. వడ్డెర చండీదాస్ 'అనుక్షణికం', కూడా కాలేజీ జీవితాన్ని చిత్రించిన మంచినవల. ఆయన రచించిన 'హిమజ్వాల' విలక్షణ రచన. రాచకొండ మార్గంలో ఈ వ్యవస్థను వర్గతత్వాన్ని చిత్రించిన నవలాకర్త బీనాదేవి. వీరి 'పుణ్యభూమీ కళ్ళుతెరు" చాలా ప్రసిద్ధికెక్కింది. జి. వి. కృష్ణారావు రచించిన 'కీలుబొమ్మలు' లో నగర లేదా పారిశ్రామిక వ్యవస్థ గ్రామీణ జీవిత పరిణామానికి కారణ మవుతున్న దశ నిరూపితమైంది.

రాజకీయ, సాంఘిక విప్లవాలను వస్తువులుగా తీసుకొని రాసిన నవలల్లో మహీధర రామమోహనరావు 'రథ చక్రాలు, కొల్లాయిగట్టితేనేమి', వట్టికోట ఆళ్వారుస్వామి 'ప్రజల మనిషి', దాశరథి రంగాచార్య 'చిల్లరదేవుళ్ళు, మోదుగుపూలు' మొదలైనవి తెలంగాణా పోరాటకాలంలోని సంక్షుభిత జీవితాన్ని ప్రదర్శించిన ఉత్తమ నవలలు. మహీధర 'కొల్లాయి గట్టితేనేమి'లో స్వాతంత్రోద్యమం నాటి కోనసీమ ప్రాంత జీవితాన్ని ప్రతిబింబించారు. కొమ్మూరి వేణుగోపాలరావు 'పెంకుటిల్లు' లో మధ్యతరగతి కుటుంబం కళ్లకు కట్టినట్టు చిత్రితమైంది. వ్యక్తి, జీవితం, విలువలు వేరుకావనీ జీవించడంలోంచే ఇవన్నీ పుట్టుకొస్తాయనే దృక్పథంతో రచించిన నవలలు శీలావీర్రాజు 'మైనా', ఆర్.ఎస్. సుదర్శనం 'మళ్ళీ వసంతం', వినుకొండ నాగరాజు 'తాగుబోతు'.

స్వాతంత్ర్యానికి పూర్వం నవలా రచయిత్రులు తక్కువే ఇప్పుడు విస్తృత సంఖ్యలో స్త్రీలు రచనలు చేస్తున్నారు. అయితే వారిలో ఎక్కువమంది వాస్తవికతకు సుదూరమైన పగటి కలలను చిత్రిస్తున్నారు. జనాకర్షణ కల ప్రసిద్ధ రచయిత్రి యద్దనపూడి సులోచనారాణి.

పురుష ప్రపంచంలో స్త్రీ బానిస బతుకును చిత్రిస్తూ స్త్రీ తన వ్యక్తిత్వం కొరకు పోరాడాలని ప్రబోధించే రచయిత్రి రంగనాయకమ్మ. ఈమె రచించిన 'బలిపీఠం' లో సాంఘిక చైతన్యం కొరవడిన వారు వర్ణాంతర వివాహం చేసుకుంటే వచ్చే కష్టసుఖాలు చిత్రితమైనాయి. రంగనాయకమ్మ 'పేకమేడలు, స్వీట్ హోమ్, జానకి, విముక్తి' మొదలైనవి ప్రసిద్ధికెక్కాయి. సామాజిక సమస్యలను వస్తువుగా తీసుకొని వాసిరెడ్డి సీతాదేవి రచించిన 'మట్టిమనిషి, ఆడవిమల్లి', ఇల్లిందల సరస్వతీదేవి 'భవతీ భిక్షాందేహి, పరిజరిన ప్రాణులు' నిర్దిష్ట ప్రయోజనంతో రాసిన నవలలు. స్త్రీ సెక్సు జీవితానికి సంఘం విధించిన కట్టుబాట్లను ఎదిరిస్తూ రాసిన రచయిత్రి లత.

BRAOU

### 20.9.2 కథానిక

కథానిక, కథ, చిన్నకథ అనే మాటలుకూడా వ్యవహారంలో ఉన్నాయి. 'కథానిక' అన్న మాటను మొట్ట మొదటిసారి ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రి ప్రయోగించారు. ఈ మాటనే ఇపుడు ఎక్కువమంది వాడుతున్నారు. ఇంగ్లీషులో (Short Story) అనే మాటకు సమానార్థకంగా ఉన్న తెలుగుకథానికలో నేడు మనం గుర్తిస్తున్న ఆధునిక లక్షణాలు ఈ దశ ప్రభావంవల్ల ఏర్పడ్డాయి.

తెలుగులో ఆధునికమని చెప్పుకోదగ్గ మొట్టమొదటి కథపేరు 'దిద్దుబాటు'. దీనిని గురజాడ అప్పారావు రచించినాడు. 1910 లో 'ఆంధ్రభారతి' అనే పత్రికలో ఇది అచ్చయింది.

గురజాడ మొదట దీనిని గ్రాంధికంలో రచించి తర్వాత వ్యావహారికంలో తిరగరాశాడు. వస్తుభాషా రూపాల్లో ఆనాటికది కొత్తదనాన్ని ప్రదర్శించింది. అర్ధాంగిని మరచిపోయి వెడు తిరుగుళ్ళకు మరిగిన భర్తకు సున్నితంగా బుద్ధిచెప్పిన ఓ ఇల్లాలికథ దిద్దుబాటు. ఇది అద్భుతమైన కొసమెరుపుతో ముగుస్తుంది. గురజాడ అయిదారు కథల కన్న ఎక్కువ రాయలేదు. 'మనుషులు చేసిన దేవుళ్ళారా, దేవుడు చేసిన మనుషుల్లారా, మీ పేరేమిటి? సంస్కర్త హృదయం, మెటిల్డా' మొదలైనవి 'దిద్దుబాటు' కన్నా ప్రయోజనవంతమూ, శిల్ప సంపన్నమూ అయిన కథలు. 'పెద్ద మసీదు' అనేది అసంపూర్ణ రచన.

ఆ రోజుల్లో తాల్లావఝుల శివశంకరశాస్త్రి 'సువర్ణరేఖకథలూ, మదరాసు కథలూ వెలువడ్డాయి. మాడపాటి హనుమంతరావు కథలు కూడా రాశాడు. 'మల్లికాగుచ్ఛం' అనే కథలు సంపుటిని వెలువరించారు. 'హృదయశల్యం, ముసలిదాని ఉసురు, అగ్నిగుండం' మొదలైన పన్నెండు కథలు రాశారు.

తెలుగుకథకి జవజీవాలనూ ప్రామాణికతనూ కూర్చిన కథకుల్లో శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి అగ్రగణ్యుడు. 1891లో జన్మించిన శ్రీపాదవారు 1961లో మరణించారు. ఆనాటి బ్రాహ్మణ కుటుంబాల్లోని ఛాందసాలనూ, మౌఢ్యాన్నీ ఆయన తన కథల్లో చిత్రించాడు. అనితర సాధ్యమైన తెలుగుతనం ఆయన సొత్తు. 'వడ్లగింజలు, రాచపీనుగుతోడు లేకుండా వెళ్ళడు, గులాబీ అత్తరు, ఇల్లుపట్టిన వెధవాడపడచు, కలుపు మొక్కలు, కీలెరిగివాత, అరికాళ్ళ కిందమంటలు, మార్గదర్శి' మొదలైనవి ఆయన రాసినవాటిలో కొన్ని గొప్ప కథలు.

బహుభాషా పండితుడైన వేలూరి శివరామశాస్త్రి కథలు, 'కథాషట్కము, కథాసప్తకము' అనే పేర్లతో సంపుటులుగా వెలువడ్డాయి. రెండో ప్రపంచ యుద్ధానంతరం ఏర్పడిన ఆర్థికమాంద్య కాలంలో ఓనిరుద్యోగి సంసారాన్ని తీసుకొని 'డిప్రెషన్ చెంబు' అనే గొప్ప కథ రాశారు.

మొక్కపాటి నరసింహశాస్త్రివి "ప్రతిబింబాలు, విన్నవి కన్నవి" అనే కథా సంపుటాలు వెలువడ్డాయి.

1930 నాటికే ఆంధ్రదేశంలో చలం సంచలనం సృష్టించాడు. ఆయనకొన్ని వందల కథలు రాశాడు. స్త్రీ స్వేచ్ఛనీ, స్త్రీ పట్ల సమాజ దుర్మార్గాన్నీ ఆయన అనితరసాధ్యమైన శైలిలో చిత్రించారు. 'పాపం కళ్యాణి, ఓ పువ్వుపూసింది, కర్మమిట్లాకాలింది, కన్నీటికాలువ, చలంగారి కొన్ని ముఖ్య కథలు. 'స్త్రీషనుపంపు, ఆరాత్రి, ఆత్మార్పణ' అనేవి కథాసంపుటుల పేర్లు.

విశ్వనాథ సత్యనారాయణ కథలు కూడా రాశాడు. ఇవి శిష్టావ్యావహారిక తుల్యమైన గ్రాంధిక భాషలో ఉంటాయి. 'విశ్వనాథసత్యనారాయణ చిన్న కథలు' అనే పేరుతో సంపుటిగా వచ్చాయి. బాపిరాజు కథల్లో 'భోగీరలోయ, వీణ, వసుబాలుడు' అనేవి చెప్పకోదగినవి నిజాం నిరంకుశ పరిపాలనలో తెలంగాణా ప్రజల కడగండ్ల జీవితాన్ని చిత్రిస్తూ సురవరం ప్రతాపరెడ్డి 'నిరీక్షణ, పెండ్లినేరము, చంద్రయ్యభీమా' మొదలైన కథలు రాశాడు. కనపర్తి వరలక్ష్మమ్మ కూడా కొన్ని మంచి కథలు రాశారు. నవలల్లోనే కాక కథల్లోకూడా తన హాస్య మాధుర్యాన్ని చూపించాడు మునిమాణిక్యం నరసింహారావు.

వందకుపైగా కథలు రాసిన మల్లాది రామకృష్ణశాస్త్రి పేరు వినగానే 'మల్లెపూవు' 'మంచిగంధం' గుర్తుకొస్తాయి. 'స్వరమేళ, చెంగల్వ, సర్వమంగళ, [illegible]పాలు, అల్లోనేరేడు' అనేవి మల్లాది కథాసంపుటాలు. చింతచచ్చినా పులుపుచావని తాతలూ, వారకాంతలూ ఆయన కథల్లో కనిపిస్తారు. శ్రీపాద వారికంటే ఈయనది విలక్షణమైన కవితాత్మక. తెలుగుతనం నిండిన శైలి.

'ఖామోష్' అనే కథను ఆయన ఇట్లా ప్రారంభించాడు : 'సిక్కని సిగురుల్లో పొద్దు వాటారింది. సింతల్ల తోపుల్లో సీకటి పాడిచింది. పికిలిపిట్ట వల్లకుంది. సిలకరెక్క ముడుసుకుంది. గువ్వగూడెక్కింది, గుట్టుగుడిసెలో దివ్వె వెలిగింది.' 'ఏడకేఏడకే సినదాన సేతిగాజులు సిటిలె, సెంప కందిపోయే–మొగాన దూమెరుగులేదు– సూపులో సిగారంలేదు– ఎవరేబిడ్డా నీవు!......'

సూరి, సీతి వటీరావు వంటి మరపురాని పాత్రలను సృష్టించిన చింతదీక్షితులు ఎన్నో మంచి కథలు రాశారు. భార్యాభర్తల ప్రణయ కలహాలను సరసంగా చిత్రించిన నోరి నరసింహశాస్త్రి, 'కాంతం' కథలతో మనస్సులను ఎప్పటికీ గిలిగింతలు పెట్టే మునిమాణిక్యం నరసింహారావు, కథల బొమ్మలుకట్టిన అడవిబాపిరాజు, స్త్రీల సమస్యలను ధైర్యంగా చాటిన గుడిపాటి వెంకటచలం, చైతన్యస్రవంతి పద్ధతిలో మనిషి మానసిక సంఘర్షణను చిత్రించిన బుచ్చిబాబు, కథానికకు తాత్త్విక దృక్కోణాన్ని ప్రసాదించిన గోపీచంద్, మధ్యతరగతి జీవితాల్లోని వైరుధ్యాలను మార్క్సిస్టు దృక్పథంతో విశ్లేషించిన కొడవటిగంటి కుటుంబరావు, రాయలసీమ ప్రాంతంలోని బడుగు జీవితాల కడగండ్లను చిత్రించినకె. సభా, కరుణకుమార అదే ప్రాంతంలో మధ్యతరగతి జీవితాల్లోని వ్యక్తి విలువలను ప్రతిబింబించిన మధురాంతకం రాజారాం, 'గాలివాన' కథలో తెలుగు కథానికకు అంతర్జాతీయ ఖ్యాతిని తెచ్చిన పాలగుమ్మి పద్మరాజు మొదలైన వారు తెలుగు కథానికా ప్రక్రియను సుసంపన్నం చేశారు.

రాచకొండ విశ్వనాథశాస్త్రి తన కథలో ఆర్థిక పీడనను సామాజిక స్పృహతో, భావావేశంతో చిత్రించారు. చాసో, పెద్దిబొట్ల సుబ్బరామయ్య రాసిన కథలు ఉత్తమశ్రేణికి చెందినవి.



BRAOU

ఇటీవలి కాలంలో తెలుగు కథానిక పొందినంత వైవిధ్యం మరే ప్రక్రియా పొందలేదంటే అతిశయోక్తిలేదు. కథానికకు ఒక ప్రత్యేక ప్రయోజనాన్ని నిర్దేశించి రాసేవారు ఎక్కువైనారు. కాళీపట్నం రామారావు, మాగోఖలే, తాడిగిరి పోతరాజు, అల్లం శేషగిరిరావు, మధురాంతకం రాజారాం, కె. సభా, కలువకొలను సదానంద, ఇచ్ఛాపురం జగన్నాథరావు, కేతువిశ్వనాథ రెడ్డి, రుద్రాభట్ల నరసింగరావు, మంజుశ్రీ, తిలక్, త్రిపుర, కొలకలూరి ఇనాక్, రంగనాయకమ్మ, పురాణం సుబ్రహ్మణ్యశర్మ, పరిమళా సోమేశ్వర్, స్మైల్, తాళ్లూరి నాగేశ్వరరావు, గొల్లపూడి మారుతీరావు, తురగా జానకీరాణి తదితరులెందరో ఉత్తమ కథానికలను రచించారు.

### 20.9.3 నాటకం

కురవంజి, జక్కులకథ, యక్షగానం, వీధి నాటకం, తోలు బొమ్మలాట, పగటి వేషాల వంటి జానపద కళారీతుల దశలు దాటి నాటకం నిర్దిష్ట లక్షణాలతో రూపొందడానికి సుదీర్ఘ ప్రయాణమే జరిగింది. ఇంగ్లీషు భాషాధ్యయనం కొంత, 1880-84 ప్రాంతాల్లో తెలుగు జిల్లాల్లో ధార్వాడ్, పార్సీ నాటక సమాజాలు కలిగించిన ఉత్తేజం కొంత తెలుగు నాటక రచనోత్సాహానికి దారులు వేశాయి.

కోరాడ రామచంద్రశాస్త్రి 'మంజరీ మధుకరీయం', వావిలాల వాసుదేవశాస్త్రి 'నందకరాజ్యం' అప్పట్లో తెలుగులో వెలువడిన స్వతంత్ర నాటకాలు, 20వ శతాబ్ది మొదలయ్యే నాటికే ఎన్నో ప్రసిద్ధ నాటకాలు వెలిశాయి. వీరేశలింగం 'అభిజ్ఞాన శాకుంతలం' (1883), ధర్మవరం కృష్ణమాచార్యులు 'చిత్రనళీయం' (1887), 'విషాద సారంగధర' (1889), చిలకమర్తి లక్ష్మీనరసింహం 'గయోపాఖ్యానం' (1889), వేదం వెంకటరాయ శాస్త్రి 'ప్రతాపరుద్రీయం' (1887) ప్రధానంగా పేర్కొనదగ్గవి.

గురజాడ 'కన్యాశుల్కం' తెలుగు నాటక రంగంలోనే గొప్ప మలుపు. ఇది మొదట 1892లో ప్రదర్శిత మైంది. మార్పులు చేర్పులతో 1909లో ద్వితీయ ముద్రణ పొందింది. నేడు అందరికీ పరిచితమైనది. రెండో కన్యాశుల్కమే తెలుగు నాటక సాహిత్య చరిత్రలో అనేక నూతన మార్గాలను ఏర్పరచింది. ఇతివృత్తం సాంఘిక సమస్య భాష ప్రజలు నిత్య జీవితంలో వాడే వ్యావహారికం. అదే వాడుక భాష నాటకాన్ని సంఘ సంస్కరణకు సాధనంగా మలుచుకోవడం విశేషం. ఈనాటకంలో గురజాడ ప్రదర్శించిన మానవతా దృష్టికూడ అపూర్వ మైంది. మధురవాణి అనే వేశ్యపాత్ర ఈ నాటకానికి ప్రాణం. గిరీశం, అగ్నిహోత్రావధానులు, లుబ్ధావధాని, రామప్ప పంతులు మీనాక్షి, వేంకటేశం వంటి పాత్రలు సజీవ వ్యక్తులు.

క్రీ.శ. 1900 నుండి 1920 వరకు వచ్చిన నాటకాలు ఎక్కువగా నాటక సమాజాల చేత ప్రదర్శింపబడేవి. పౌరాణిక, చారిత్రక ఇతివృత్తాలను స్వీకరించడం, సంగీతానికి పాటలకీ పద్యాలకీ ప్రాధాన్యత లభించడం కనిపిస్తుంది.

పానుగంటి లక్ష్మీనరసింహరావు 'రాధాకృష్ణ' (1909) అనే పౌరాణిక నాటకం 'కంఠాభరణం' అనే హాస్య నాటకం చాలా ప్రసిద్ధికెక్కాయి. శ్రీపాద కృష్ణమూర్తిశాస్త్రి 'బొబ్బిలి యుద్ధం' విషాదాంత చారిత్రక నాటకం.

బహుళ జనాదరణ పొందిన నాటకాలు తిరుపతి వేంకటకవులవి. 'ముద్రారాక్షసం, మృచ్ఛకటికం' సంస్కృతం నుండి తెనిగించిన నాటకాలు అనువాదమనిపించ నంత సహజ స్వతంత్రాలు. వారి నాటకాల్లో అందరి నోళ్ళకూ ఎక్కినవి పాండవోద్యోగ, విజయ నాటకాలు (1911).

'అదిగో ద్వారక, ఆలమందలవిగో....'

'జెండాపై కపిరాజు.....'

'అలుగుటయే యెఱుంగని మహామహితాత్ముడజాత శత్రువే......'

మొదలైన పద్యాలు నోటికి రానివారు ఆ రోజుల్లో అరుదుగా ఉండేవారు.

పౌరాణిక నాటకాల్లో బలిజేపల్లి లక్ష్మీకాంత కవి 'హరిశ్చంద్ర' (1912) ముత్తరాజు సుబ్బారావు 'శ్రీ కృష్ణ తులాభారం' (1920) చాలా ప్రజాదరణ పొందాయి.



BRAOU

ధర్మవరం గోపాలాచార్యులు 'రామదాసు' నాటకం కూడా ఆ రోజులలో చాలా ప్రసిద్ధి కెక్కింది.

'భద్రాద్రి రాముని భజనకు జనుచుండ
బంధుమిత్రుల యాజ్ఞబడయనేల ?'

అనే ప్రశ్న ఆనాడు తెలుగు రంగస్థలం పైన మారుమోగింది.

జాతీయోద్యమ ప్రభావంతో వెలువడిన నాటకాలలో దామరాజు పుండరీకాక్షుడు రచించిన 'గాంధీ మహోదయం, గాంధీవిజయం' జలియన్‌వాలాబాగ్ దురంతాన్ని గూర్చి వెలువడిన 'పాంచాల పరాభవం' పేర్కొనదగినవి. కొప్పరపు సుబ్బారావు 'రోషనార', పింగళి నాగేంద్రరావు 'నారాజు, వింధ్యరాణి' వంటి మిశ్ర చారిత్రక నాటకాలు కూడా గణనీయాలైనవి.

సంస్కరణోద్యమ ప్రభావంతో వెలువడిన సాంఘిక నాటకాల్లో కాళ్ళకూరి నారాయణరావు 'వరవిక్రయం, చింతామణి' బహుళ ప్రజాదరణ పొందాయి. విశ్వనాథవారి 'వేనరాజు నర్తనశాల' త్రిపురనేని రామస్వామి చౌదరి 'ఖూనీ, శంబుకవధ' లు సాహిత్య గౌరవాన్ని ప్రదర్శించాయి.

1943 ప్రజానాట్య మండలి స్థాపన తర్వాత సుంకర సత్యనారాయణ, వాసిరెడ్డి భాస్కరరావులు కలిసి రచించిన 'ముందడుగు, మాభూమి' నాటకాలు దేశంలో ఎంతో సంచలనం కలిగించాయి. తెలంగాణాలో జమీందారీ వ్యవస్థకు వ్యతిరేకంగా రైతులూ కూలీలూ సాగించిన పోరాటానికి విశిష్టమైన సృజనాత్మక కళారూపాలు ఈ నాటకాలు.

'1900 నుండి 1947 వరకు వచ్చిన తెలుగునాటక సాహిత్యాన్ని పరిశీలిస్తే, అటు "కన్యాశుల్కం" ఇటు 'మాభూమి' ఎల్లలుగా కనిపిస్తాయి అని అడపా రామకృష్ణారావు పేర్కొన్నారు.

1947 అనంతరం వచ్చిన నాటక సాహిత్యాన్ని గురించి మొదలి నాగభూషణశర్మ చక్కటి వ్యాసం రాశారు. ఆ వ్యాసంలోని విషయాలను క్రోడీకరించుకుంటే స్వాతంత్ర్యం తర్వాత వచ్చిన నాటక రచనా ధోరణులు రేఖామాత్రంగా నైనా తెలుస్తాయి.

1941 లో ఆంధ్రనాటక కళాపరిషత్తు తొలిదశ ముగిసి 1946 లో రెండోదశ ప్రారంభమైంది. 1943 లో ఆంధ్ర విశ్వకళాపరిషత్తు నాటక పోటీలు నిర్వహించడంతో పాటు నూతన ప్రయోగాలపై ఆసక్తి చూపించింది. 1945 లో ప్రజానాట్యమండలి తెలుగుశాఖ అవతరించింది. ఈ మూడింటి పుట్టుక తెలుగు నాటకోద్యమంలో ఒక మలుపు. వీటివలన సాంప్రదాయిక నాటకాలు తెరమరుగై ప్రయోగాత్మక నాటకాలకు ప్రాధాన్యం లభించింది. పౌరాణిక, చారిత్రక గద్య నాటకాలకు మారుగా సాంఘిక గద్య నాటకాలకు ప్రాముఖ్యం పెరిగింది. తెలుగు నాటకరంగంలో ఇది కొత్త శకం. సినిమా రంగంతో పోటీపడి నిలిచిన మంచి నాటకాలు ఈ కాలంలో వచ్చాయి. 1947 నాటికేతి వృత్తినాటకాలు అంతరించి కిరాయి నటుల నాటకాలు ప్రబలినాయి. ఆర్థిక కారణాలవల్ల పాండవోద్యోగ విజయాలు, గయోపాఖ్యానం వంటి ఒకటి రెండు తప్ప పౌరాణిక నాటక ప్రదర్శన అరుదై పోయింది.

సాంప్రదాయిక శైలిలో పద్యాలు, పాటలతో కూడిన 'చింతామణి, రంగూన్ రౌడీ, వరవిక్రయం' వంటి సాంఘికనాటకాలు వచ్చాయి. వీటికి విస్తృత ప్రచారం లభించి విజయవంతమైనాయి. రాజమన్నారు, రాఘవ, రంగారామ్ వంటి రచయితలు తమ నాటకాల్లో సంఘంలో స్త్రీకి జరుగుతున్న అన్యాయాన్ని గురించి చర్చించారు. భూస్వాములకు పాలేర్లకు మధ్య తలెత్తిన సంఘర్షణను బోయి భీమన్న 'పాలేరు' (1945), సుంకర, వాసిరెడ్డిల 'ముందడగు' చిత్రించాయి. 1947-55ల మధ్య వచ్చిన సమస్యా నాటకాలన్నీ వర్గ భేదాలకూ, ధనవంతులకూ అణచబడ్డ శ్రామికరైతు వర్గాలకు మధ్య పోరాటాలకూ సంబంధించినవే. ఈ పద్ధతి నాటకాల్లో ఆత్రేయను ప్రముఖంగా చెప్పుకోవచ్చు. నాగభూషణశర్మ మాటల్లో పీడిత మానవుని ఆక్రందనను, దానినుంచి జనించిన ఆసహనాన్ని, క్రోధాన్ని ఆత్రేయ ప్రతిబింబించినంత విస్పష్టంగాను పటిష్టంగాను మరే తెలుగు రచయితా చిత్రించలేదు. అందువల్లనే ఆత్రేయ ఆధునిక నాటక యుగానికి మూలపురుషుడైనాడు. పటిష్టమైన సంభాషణలు, బలమైన సన్నివేశాలు, ప్రజలకు దగ్గరగా ఉండి వారిని ఉత్తేజపరిచే ఇతివృత్తాలు - ఇవి ఆత్రేయ నాటకాలను, నాటికలను ఆంధ్రదేశం నలుమూలలా విజయవంతం చేయడానికి ముఖ్యమైన కారణాలు.



BRAOU

1949 లో ఆత్రేయ "యన్.జి.వొ" ఉత్తమ నాటకంగా ఎన్నికైంది. ఆత్రేయ మార్గంలో మధ్యతరగతి జీవితాన్ని, యువకుల నిస్పృహను చిత్రించిన నాటికల్లో అనిశెట్టి సుబ్బారావు 'గాలిమేడలు', పినిశెట్టి శ్రీరామమూర్తి 'కులంలేనిపిల్ల, పల్లెపడుచు, అన్నా చెల్లెలు' ముఖ్యమైనవి.

ఆత్రేయ తర్వాత నాటకాల్లో సమస్యను సందేశంగా మార్చి, నాటకం చివర ప్రధానపాత్రతో ఉపన్యాసా లిప్పించడం అనే ధోరణి మొదలైంది. బెల్లంకొండ రామదాసు 'మాస్టర్జీ, పునర్జన్మ', అవసరాల సూర్యారావు 'పంజరం' మొదలైనవి ఈ కోవకి చెందుతాయి.

సమాజంలోని కుళ్లును కడిగేసే లక్ష్యంతో కొంత తీవ్రంగా రాజకీయ వ్యవస్థపైన ధ్వజమెత్తే నాటకాలు వచ్చాయి. ఆత్రేయ, రాచకొండ విశ్వనాథశాస్త్రి, కొడాలి గోపాలరావు వీటిని రచించారు. రాచకొండ 'నిజం' నేడు అన్ని రంగాల్లో జరుగుతున్న అన్యాయాన్ని సూటిగా చూపిస్తూ వ్యంగ్యంగా చిత్రించిన రాజకీయ నాటకం, రాష్ట్రంలోని నగర రాజకీయాలను కొడాలి గోపాలరావు 'చైర్మన్'లో చిత్రించారు. కొప్పరపు సుబ్బారావు 'ఇనుప తెరలు' కూడా ఈ కోవకు చెందినవే. పై రెండు నాటకాలు అనువాదాలు కావడం విశేషం. పల్లెటూళ్ళ పునర్ వ్యవస్థీకరణ దృష్టిలో పెట్టుకొని రచించిన నాటకాల్లో బోయి భీమన్న 'పడిపోతున్న అడ్డుగోడలు', కె.యల్. నరసింహారావు 'అడుగుజాడలు, క్రొత్తగడి' ఎన్నదగినవి.

1947 తర్వాత అనువాద, అనుసరణ నాటకాలు కూడా ప్రజాదరణ పొందాయి. డి.వి. నరసరాజు 'ఓడ్‌హౌస్' కు చేసిన అనువాదం నాటకం, గొల్లపూడి మారుతీరావు అనుసరణ నాటకం 'రాగరాగిణి' చాలా ప్రసిద్ధికెక్కాయి. అనువాద, అనుసరణ నాటక కర్తల్లో కొండముది శ్రీరామచంద్రమూర్తి, అంగర సూర్యారావు, మంథా వెంకటరమణ మొదలైనవారు ముఖ్యులు.

డాక్టర్ కొఱ్ఱపాటి గంగాధరరావు దాదాపు తొంభై నాటకాలు, నాటికలు రచించారు. తెలుగులో ఏ రచయితా ఇన్ని నాటకాలు రాయలేదు. ప్రదర్శనకు సులభంగా ఉండే పద్ధతిలో పెద్ద హంగులు అక్కరలేకుండా ఉన్నంతలో నాటకాన్ని ఆడటానికి వీలుగా ఈయన రచనలు చేశారు.

మనిషి అంతరాలల్లోని సంఘర్షణను చిత్రిస్తూ బుచ్చిబాబు 'ఆత్మవంచన' అనే నాటకం రాశారు. ఈ మార్గంలో గొల్లపూడి మారుతీరావు అనేక ప్రయోగాలు చేశారు. నాటకాల్లో మనస్తత్వచిత్రణ చేసిన రచయితల్లో ఆర్.వి.యస్. రామస్వామి, రాఘవ, పాత్రో కూడా పేర్కొనదగినవారు. పాత్రో సంభాషణలకు విశాఖ మాండలికాన్ని వాడి రక్తి కట్టించారు.

విమర్శనాత్మక నాటకాలే కాక హాస్యాత్మకమైన నాటకాలు, నాటికలు కూడా ఈ కాలంలో వచ్చాయి. ఈ రకమైన రచనల్లో భమిడిపాటి రాధాకృష్ణ సిద్ధహస్తుడు. ఈయన 'కీర్తిశేషులు, ఇదేమిటి' వంటి రచనల్లోని హాస్యం విలక్షణమైంది. సన్నివేశగత హాస్యానికి రావికొండలరావు 'నాలుగిళ్ళ చావడి, కుక్కపిల్ల దొరికింది' వంటి నాటక, నాటికలు ఉదాహరణలు, మానవత్వానికి విలువనిస్తూ రచించిన ఎన్.ఆర్. నంది 'అరణి, మరో మొహెంజోదారో' నాటకాలు చాలా ప్రసిద్ధి కెక్కాయి.

1947 తర్వాత వచ్చిన చారిత్రక నాటకాలు ఇతి వృత్తం మీద, పాత్ర పోషణ మీద ఎక్కువ శ్రద్ధ వహించాయి. నండూరి రామకృష్ణమాచార్యులు 'ధర్మచక్రము, ఛత్రపతి శివాజీ ఉరికంబం, శ్రీకృష్ణ దేవరాయలు', ఈ పద్ధతిలో చెప్పుకోదగినవి. పడాల 'అల్లూరి సీతారామరాజు', ఆమంచర్ల 'విశ్వాంతర' అటు సాహిత్య గౌరవాన్నీ, ఇటు ప్రదర్శన సౌలభ్యాన్నీ సాధించాయి. పౌరాణిక నాటకాల్లో శ్రీరాములు సచ్చిదానంద శాస్త్రి 'దివోదాసు, బోయిభీమన్న 'రాగవాసిష్టం' పేర్కొనదగినవి.

**20.9.4 నాటిక**

దశరూపకాల్లోని అంకం, వ్యాయోగం, భాణం, వీధి, ప్రహసనం అనేవి ఏకాంకికలు, ఏకాంకికను మనం ఈనాడు నాటిక అని వ్యవహరిస్తున్నాం. పెద్దది అయినంత మాత్రాన నాటిక నాటకం కాదు. దేని శిల్పం దానిది. నాటికలో ముఖ్యంగా కాలానికి సమన్వయం ఉండాలి.

నాటిక 20వ శతాబ్ది తొలి రోజుల్లో ఆవిర్భవించింది. తొలి నాటికను (1910) రచించిన ఘనత కూడ వీరేశలింగం పంతులుదే. ఆయన దానిని 'ప్రహసనం' అన్నాడు. నాటిక, నాటకాలకు కూడా ఆ రోజుల్లో



BRAOU

బొంబాయి రాష్ట్రం నుండి వచ్చిన నాటక కంపెనీలు స్ఫూర్తినిచ్చాయి. 1900-1947 వరకు మొత్తం అచ్చయిన నాటికల సంఖ్య 131 అని శ్రీరామశాస్త్రి పేర్కొన్నారు. అముద్రితాలు ఎన్నో ఉన్నాయి. ఆ నాటికల్లో ఒక నిర్దిష్టమైన సంఘటనా, భావ స్ఫోరకమైన సన్నివేశం తప్పకుండా ఉండేవి. వీరేశలింగం తొలి ప్రహసనం ఇంగ్లీషులోని (Skit) దగ్గరగా వస్తుంది. దీని రచన గ్రాంథికంలో సాగింది. చలం, భమిడిపాటి కామేశ్వరరావు తప్ప మొదటి నాళ్ళలో అందరూ గ్రాంధిక భాషనే వాడారు.

వీరేశలింగం తర్వాత ప్రహసన రచనలో ప్రముఖంగా వినిపించే పేరు చిలకమర్తి వారిది. 'బధిర చతుష్టయం, బలవంతపు బ్రాహ్మణార్థం, కాసులపేరు' ప్రసిద్ధికెక్కాయి.

తరువాత నాటిక రచనలో సిద్ధహస్తులైన రచయితలు వింజమూరి లక్ష్మీనరసింహరావు, నోరి నరసింహ శాస్త్రి, మారేమండ రామారావు, వింజమూరి శివరామారావు, పి.వి. రాజమన్నారు, తల్లావఝుల శివశంకర శాస్త్రి, బాలాంత్రపు రజనీకాంతారావు, అబ్బూరి వరద రాజేశ్వరరావు, కొప్పరపు సుబ్బారావు మొదలైనవారు.

1947 కు ముందు తెలుగులో కృష్ణశాస్త్రి, రజనీకాంతరావు సంగీత సాహిత్యాలను మేళవించి చక్కటి నృత్యగేయ నాటికలు రాశారు. 1947 తర్వాత గేయ నాటికాకర్త నారాయణరెడ్డి ప్రముఖంగా చెప్పుకోదగినవాడు. ఆయన 'నవ్వనిపువ్వు, రామప్ప' ఎంతో ప్రసిద్ధికెక్కాయి. వచన గేయ నాటికల్లో ఆరుద్ర 'సాలభంజిక, దరఖాస్తుఫారం,' కుందుర్తి, 'శాంతి', అరిపిరాల విశ్వం 'అశ్వఘోషుడు' పేర్కొనదగినవి.

ఈ కాలంలో బాలలకోసం జంధ్యాల పాపయ్యశాస్త్రి. ఇల్లిందల సరస్వతీదేవి, న్యాయపతి రాఘవరావు, మొదలి సుబ్రహ్మణ్య శర్మ మొదలైనవారు నాటికలు రాసి పాఠశాలల్లో, బాలసంఘాల్లో ప్రదర్శింప జేశారు.

రేడియో 'మీడియం'ను అర్థంజేసుకొని దానికి అనుగుణమైన ప్రత్యేక శిల్పంతో చక్కని నాటికలు రాసినవారిలో గోరాశాస్త్రి ముఖ్యుడు. హితశ్రీ, కొడవటిగంటి కుటుంబరావు, ప్రయాగ కోదండరామశాస్త్రి, అమరేంద్ర మొదలైనవారు మంచి రేడియో నాటికలు రచించారు. రేడియోలో హాస్య ప్రధాన నాటకాలు రాసినవారిలో మునిమాణిక్యం, నండూరి సుబ్బారావు ప్రఖ్యాతులు.

### 20.9.5 విమర్శ

ప్రాచీన కావ్యాలకు రాసిన వ్యాఖ్యానాలను తెలుగులో తొలివిమర్శ గ్రంథాలు అనవచ్చు. ఈ వ్యాఖ్యాన సంప్రదాయం మనకు సంస్కృతం నుండి వచ్చింది. తెలుగు కవుల చరిత్రలను కూడా విమర్శ తొలిరూపాలుగా భావించవచ్చు. 1820 లో కావలి రామస్వామి ఇంగ్లీషులో వ్రాసిన 'దక్కను కవుల చరిత్ర', 1986-96 మధ్యకాలంలో వీరేశలింగం రచించిన "కవుల చరిత్ర"లలో కవుల స్థూల పరిచయాలతో పాటు, రేఖామాత్ర సాహిత్య చరిత్ర కూడా లభిస్తుంది.

ఆ రోజుల్లోని సాహిత్య విమర్శల్లో సాహిత్య భాషాచ్ఛందో విషయాల చర్చ దండిగా ఉండి, సామాజిక పరిస్థితుల ప్రమేయం తక్కువగా ఉండేది. ముఖ్యంగా భాషాంశాలు ప్రాచుర్యం వహించేవి. తాళపత్ర గ్రంథాల్లోంచి ఎత్తిరాసి పరిష్కరించేటప్పుడు ఛందోలంకార వ్యాకరణ విషయాలకు ప్రాధాన్యం లభించడం సహజమే. వేదం వేంకటరాయశాస్త్రి, కాశీభట్ట బ్రహ్మయ్యశాస్త్రి వంటి పండితుల రస చర్చలు కూడా నాటి సాహిత్య విమర్శకు తార్కాణాలు.

పాశ్చాత్య భావాలు, సంఘ సంస్కరణోద్యమాలు విమర్శను కూడా ప్రభావితం చేశాయి. కొత్త ధోరణులలో వెలువడిన తొలి విమర్శ గ్రంథం 1914లో కట్టమంచి రామలింగారెడ్డి ప్రచురించిన 'కవిత్వతత్త్వ విచారము' కళాపూర్ణోదయం పైన రాసిన వ్యాసానికి మరిన్ని అభిప్రాయాలు చేరి వివరంగా వెలువడిన గ్రంథమిది. కవిత్వానికి భావనాశక్తి ముఖ్యమనీ, వర్ణనలకు కథతో సంబంధం ఉండాలనీ, సంభాషణలలో నాటకీయ శిల్పం ఉండాలనీ కథలో వస్త్వైక్యం ఉండాలనీ, సామాజిక పరిస్థితులను లెక్కలోకి తీసుకోవాలనీ, సి.ఆర్. రెడ్డి తన గ్రంథంలో ప్రతిపాదించారు. 'కవిత్వతత్త్వ విచారాన్ని' అప్పటి పండితులు వ్యతిరేకించారు. కురుగంటి సీతారామయ్య 'అలంకార తత్త్వ విచారము' అనే గ్రంథాన్ని, కాశూరి వ్యాసమూర్తి 'కవిత్వతత్త్వ విచార ఖండన' అనే గ్రంథాన్నీ ప్రకటించారు. అక్కిరాజు ఉమాకాంతం, నోరి నరసింహశాస్త్రి కూడా వ్యతిరేకించారు. సి.ఆర్. రెడ్డి తన గ్రంథంలో 'సామాన్య జనుల జీవితము కావ్యార్హము' అనీ 'కలియుగాది నుండి ఇంతదాకా జమకు ఖర్చునకు

రాని సాధారణ జనులు నేటికి గదా గణ్యులైరి ఇవే ముందు పూజాలగుదురు గాక! అంటూ నూతన దృక్పథాన్ని ప్రకటించాడు. 'కవిత్వతత్త్వ విచారము చదివితే బహుశా కథనాత్మక విమర్శ కూడా ఈయనతోనే ప్రారంభమైనట్టు తోస్తుంది' అని చేకూరి రామారావుగారు అభిప్రాయ పడ్డారు.

కవిత్వాన్ని సమీక్షించేటప్పుడు కవి జీవితాన్ని కూడా లెక్కలోకి తీసుకోవాలనే ధోరణిని నిడమర్తి సూర్యనారాయణ మూర్తి వ్యక్తం చేశారు (1926).

కొంతవరకు సి.ఆర్.రెడ్డి మార్గంలో విమర్శలు రాసినవారు రాళ్ళపల్లి అనంత కృష్ణశర్మ. ఆయన రాసిన 'నిగమశర్మ అక్క' అనే వ్యాసం పాత్ర పరిశీలనకు వేరు వేరు పరిస్థితుల్లోని ఒక పాత్ర ప్రవర్తనారీతికి తార్కాణంగా నిలుస్తుంది. రాళ్ళపల్లివారు 'రాయలనాటి రసికత' అనే వ్యాసంలో విజయనగరం కాలంనాటి పరిస్థితులను తవ్వి తీసే ప్రయత్నం చేశారు. 1929లో వెలువడిన వారి 'వేమన' అనే ఉపన్యాస గ్రంథంలో కూడా వేమన నాటి రాజకీయ, సాంఘిక, మత పరిస్థితులను బేరీజు వేశారు.

భావకవిత్వం పైన వచ్చిన విమర్శరాశిలో ఎక్కువే. కవి అనుభూతిని భావికవిత్వ విమర్శలు గుర్తించారు. అందాలు చూపించాలనే ధోరణి విమర్శలో ప్రబలింది. భావకవిత్వాన్ని విమర్శిస్తూ 'నేటి కాలపు కవిత్వం' పేర 1938లో అక్కిరాజు ఉమాకాంతం ఒక శక్తివంతమైన విమర్శ గ్రంథాన్ని ప్రకటించారు. భావకవిత్వంలోని విస్తరణ, నిదర్శన పరంపరలు, అయోమయం, 'ఫులమదం' వంటి దోషాలను ఆయన తీవ్రంగా దుయ్యబట్టాడు. ఆయన చేసిన ఆరోపణలకు సమాధానం చెప్పుకోటానికి 1946 దాకా ప్రయత్నాలు జరిగాయి. ఉమాకాంతం విమర్శల్లో నిర్భీతి, స్పష్టత, సారళ్యం, వాదపటిమ కన్పిస్తాయి. భావకవిత్వంరోజుల్లో కవిత్వం పైనే కాక విడివిడిగా కవులపైన కూడా (కృష్ణశాస్త్రి, వేదుల, నండూరి, నాయని, విశ్వనాథ, అబ్బూరి) అనేక వ్యాసాలు వచ్చాయి. అభ్యుదయ కవిత్వ యుగంలో శ్రీ శ్రీ మీద వచ్చినన్ని వ్యాసాలు ఎవరిమీదా రాలేదు.

శ్రీ శ్రీ, పఠాభి, 'ఫిడేల్ రాగాలడజన్' ఇంట్రోలో 'విచిత్రమే సౌందర్యం, సౌందర్యమే విచిత్రం' అనే సిద్ధాంత ప్రాయమైన వ్యాఖ్య చేశాడు. ఆరుద్ర 'త్వమేవాహమ్' లఘుటిప్పణిలో 'టెక్నిక్ లేని కవిత్వాన్ని ఊహించలేను' (1949) అని రాశాడు. ప్యారడీ కవిత్వంపైన మాచిరాజు దేవీప్రసాద్ 'వికట కవిత్వం' అనే చక్కటి వ్యాసం రాశాడు.

ఆధునిక కాలంలో సంప్రదాయ బద్ధమైన విమర్శలను వెలువరించిన వారిలో విశ్వనాథకు ప్రత్యేక స్థానం వుంటుంది. నన్నయ కథా కవితార్థయుక్తి, అల్లసాని అల్లిక జిగిబిగి, నాచన సోముని సంవిధాన శిల్పము, శాకుంతలంలో అభిజ్ఞానతల గూర్చి ఆయన రచించిన వ్యాసాల్లో అపూర్వమైన అంతర్దృష్టితో ఎన్నో శిల్ప రహస్యాలను బయట పెట్టాడు. ఈ మార్గంలోనే పింగళి లక్ష్మీకాంతం సాహిత్య చరిత్ర రచన, ప్రక్రియాని ర్వచనం, అనువాద పద్ధతుల విశ్లేషణ వంటి విషయాల్లో మార్గదర్శకుడయ్యాడు. రస సిద్ధాంత ప్రాతిపదికగా జి.వి. సుబ్రహ్మణ్యం అనేక వ్యాసాలు రాశారు. 20వ శతాబ్దం ప్రథమార్థ భాగంలో విశ్వవిద్యాలయాల్లోను కూడా కొంత మార్గదర్శక కృషి జరిగింది. ఈ దశలో అపారమైన సమాచార సేకరణ జరిగింది. వాటి విశ్లేషణకూ, వ్యాఖ్యానానికీ కొత్త కొత్త పద్ధతుల్లో ప్రమాణాలు రూపు దిద్దుకుంటున్నాయి.

'సమగ్రాంధ్ర సాహిత్య' పేరుతో ఆరుద్ర రచించిన 12 సంపుటాల్లో శాస్త్రీయ పద్ధతిలో చారిత్రక, సామాజిక నేపథ్యం వెలుగులో ఆంధ్ర సాహిత్య పరిశీలన జరిగింది.

1947 తర్వాత మార్క్సిస్టు దృక్పథంతో కవిత్వాన్ని విమర్శించటం మొదలయ్యింది. కె.వి. రమణారెడ్డి, రాచమల్లు రామచంద్రారెడ్డి, చేకూరి రామారావు, త్రిపురనేని మధుసూదనరావు, రాంభట్ల కృష్ణమూర్తి ఈ కోవలోకి వస్తారు. రచనకు సామాజిక స్వభావం, సామాజిక ప్రయోజనం ఉండాలనేది స్థూలంగా మార్క్సిస్టు విమర్శ లక్ష్యం.

కవిత్వ పరిశీలనలో సమన్వయ ధోరణిని ప్రదర్శిస్తూ నారాయణరెడ్డి, 'ఆధునిక ఆంధ్ర కవిత్వము సంప్రదాయము-ప్రయోగము' అనే సిద్ధాంత గ్రంథం రాశారు. టి.ఎల్. కాంతారావు, కడియాల రామమోహనరాయ్ తటస్థవైఖరిని అవలంబిస్తూ కొంత సమీక్షా పద్ధతిలో రచనలు చేశారు. రామమోహన్‌రాయ్ 'తెలుగు కవితా వికాసం' (1947-80) అనే గ్రంథంలో ఆధునిక కవిత్వాన్నంతా ఒకచోట పరిశీలించే ప్రయత్నం జరిగింది. వెల్చేరు నారాయణరావు కవిత్వ పరిశీలనకు కొన్ని కొత్త విశ్లేషణ పద్ధతులు ప్రవేశ పెట్టారు.



BRAOU

తెలుగు విమర్శ పుట్టి నూరేళ్లయినా కవిత్వం పైన జరిగినంత పరిశీలన ఆధునిక ప్రక్రియలైన నవల, కథానిక, నాటకం పైన జరిగినట్టు లేదు. ఆర్.ఎస్. సుదర్శనం పాశ్చాత్య పద్ధతుల్లో తెలుగు కవిత్వాన్నీ ముఖ్యంగా నవలా సాహిత్యాన్నీ విశ్లేషించారు. మనోవిశ్లేషణ పద్ధతిలో నవలలను కోడూరి శ్రీరామమూర్తిగారు విమర్శించారు. నవలా విశ్లేషణలో వల్లంపాటి వెంకట సుబ్బయ్య 'నవలా శిల్పం' పేర్కొనదగిన గ్రంథం. విశ్వవిద్యాలయాల్లో నవలల పైన వివిధ దృక్కోణాల్లో చెప్పుకోదగిన కృషి జరుగుతున్నది.

కథానికల పైన వెలువడిన విమర్శ చాలా తక్కువ. పోరంకి దక్షిణామూర్తి కథానిక స్వరూప స్వభావాలు కథానికా విమర్శలు పేర్కొనదగిన గ్రంథం. కనక్ ప్రవాసి శ్రీపాద వారి కథలపైన, గుమ్మా శంకర్రావు మల్లాది వారి కథలపైన సిద్ధాంత వ్యాసాలు రాశారు. పి.ఎస్.ఆర్. అప్పారావు 'తెలుగు నాటక వికాసము', మిక్కిలినేని రాధాకృష్ణమూర్తి 'ఆంధ్రనాటక రంగ చరిత్ర', సర్దేశాయి తిరుమలరావు 'కన్యాశుల్క నాటకకళ' అట్లాగే దివాకర్ల వేంకటావధాని, ముదిగొండ వీరభద్రశాస్త్రి ధర్మవరం, పానుగంటి రూపకాలను గురించి విమర్శ వ్యాసాలు రచించారు.

మరెన్నో ధోరణులతో విమర్శ రంగంలో కృషి చేస్తున్న వారున్నారు.

**అవగాహన ప్రశ్న**

కందుకూరి వీరేశలింగంగారు వినూత్న వాఙ్మయానికి ఏ విధంగా బాటలువేశాడో 30 పంక్తుల్లో చర్చించండి.

________________________________________________

________________________________________________

________________________________________________

________________________________________________

________________________________________________

________________________________________________

________________________________________________

________________________________________________

________________________________________________

________________________________________________

________________________________________________

________________________________________________

## 20.10 సారాంశం

ఈ భాగంలో మీరు ఈ కింది అంశాలను తెలుసుకున్నారు.

- ఆధునిక దశ అంటే క్రీ.శ. 1800 నుండి నేటిదాకా ఉన్నకాలం.
- ఆంగ్లేయులు, ఫ్రెంచివారి వలసవాదంవల్ల రాజ్యస్థాపన వల్ల ఏర్పడిన సంకీర్ణ సంస్కృతి ఈ దశలో వివిధ సాహిత్య ప్రక్రియలకు దారితీసింది.



BRAOU

- ఈ ప్రక్రియల్లో స్పష్టంగా అవతరించిన కవిత్వ ప్రక్రియలు భావ, అభ్యుదయ, వచన కవిత్వాలు. వచన కవిత్వంలో ముఖ్యవిభాగాలు దిగంబర, విప్లవ కవిత్వాలు. వీటితో పాటుగా సంప్రదాయ కవిత్వ ధోరణికూడా ఈ దశలో కనిపిస్తుంది.
- ఆధునిక దశలో తెలుగు సాహిత్యంలో నిఘంటువులూ, వ్యాకరణాలూ మొదటినుండీ పాటమరించాయి. బ్రౌన్ నిఘంటువు, చిన్నయసూరి బాలవ్యాకరణం ప్రాముఖ్యాన్ని సంతరించు కున్నాయి.
- ఆధునిక దశలో అనేక కొత్త సాహిత్య ప్రక్రియలకు పునాదులు వేసిన మహనీయుడు సి.పి. బ్రౌన్. సమాజ సాహిత్యాలను సమదృష్టితో పరిశీలించి వినూత్న వాఙ్మయ నిర్మాతగా సంస్కరణ దృష్టితో, నవల, వ్యాసం, నాటకం, విమర్శ, స్వీయ చరిత్ర, జీవిత చరిత్ర వంటి అనేక కొత్త ప్రక్రియలు సృష్టించిన సాహిత్య పురుషుడు వీరేశలింగం.
- భావకవిత్వం, దేశభక్తి కవిత్వం నెలకొల్పిన ప్రముఖులు గురజాడ, రాయప్రోలు.
- అభ్యుదయ కవిత్వ దృక్పథానికి ఆద్యుడు శ్రీశ్రీ.
- దిగంబర కవిత్వాన్ని ఆరుగురు కవులూ, విప్లవకవిత్వాన్ని అనేకులూ నడిపించారు.
- ఈ దశలోనే పత్రికా ప్రచురణకూ, వివిధ సంస్థానాల్లో సాహిత్యసేవకూ ఆస్కారం ఏర్పడింది.
- సాహిత్యంపై సామాజికోద్యమాల ప్రభావాన్ని నిరూపించడానికి ఈ దశ ఒక ప్రబల తార్కాణం.

## అవగాహన ప్రశ్నకు జవాబు

తెలుగు సాహిత్య రంగంలోనే కాక సామాజిక రంగంలోనూ అనేక కొత్త పోకడలకు ఆద్యుడైన కందుకూరి వీరేశలింగంలో సమాజ సాహిత్య సంబంధాలు జమిలిగా సాగాయి. 'దక్షిణ దేశ విద్యాసాగరుడుగా' ప్రఖ్యాతి వహించిన ఈ మహనీయుడు 1848వ సం॥ ఏప్రిల్ 16న రాజమహేంద్రవరంలో జన్మించాడు. తెలుగు కవుల చరిత్ర, నవల, నాటకం, వ్యాసం, స్వీయ చరిత్ర, జీవిత చరిత్ర వంటి అన్ని ఆధునిక ప్రక్రియల్లోనూ మొదటి సారిగా రచనలు చేసి శతాధిక గ్రంథాలను వెలువరించాడు. ఆయన నవల 'రాజ శేఖర చరిత్ర'కు నేపథ్యం అచ్చమైన మధ్య తరగతి ఆంధ్రుల కుటుంబం.కోనసీమ ప్రాంతానికి చెందిన జీవితం. హిందువుల కుటుంబ జీవితం, మతాచారాలు, మూఢ విశ్వాసాలు, స్త్రీల పరిస్థితులు, పెళ్ళి వేళ్ళల్లో కుటుంబ పెద్దల నిరంకుశత్వం, మధ్య తరగతి ప్రజల స్వాభిమానం, దరిద్రం నిదర్శన పూర్వకంగా, శిల్ప దృష్టితో కాక ప్రబోధ దృష్టితో చిత్రించిన తొలి తెలుగు నవల ఇది. 'బాహ్మ వివాహం' తెలుగులో తొలి స్వతంత్ర నాటకం. హాస్య భరిత సాంఘిక నాటకం. వ్యవహారం ధర్మ బోధిని అనే నాటకాన్ని, వితంతు వివాహం ఇతి వృత్తంగా మరో నాటకాన్ని, రచించి, ఆ తర్వాతి నాటకాలకు 'ప్రహసనాలు' అని పేరు పెట్టాడు కందుకూరి. 1880లో వ్యవహార ధర్మ బోధిని ప్రదర్శించి తొలినాటక ప్రయోక్తగా కూడా నిలిచాడు. 1887నాటికి ఒక విలక్షణమైన పరిశోధక పద్ధతిలో 'తెలుగు కవుల చరిత్ర'ను సమగ్రంగా రచించాడు. ఆదికవి నన్నయ నుండి గోపీనాథ వెంకట కవి వరకూ 220 మంది కవుల జీవిత చరిత్రలను చారిత్రికాధారాలు, కాల నిర్ణయాలు, పరిశోధన ప్రమాణాలతో మూడుసంపుటాలుగా 'కవుల చరిత్ర'గా తొలిసారి ప్రచురించాడు. ఈ పరిశ్రమలో ఇరవై ప్రాచీన కావ్యాలు పరిష్కరణకు నోచుకున్నాయి. అప్పటికి బ్రౌన్ తర్వాత కావ్య పరిష్కరణ, ముద్రణలను ఇంతటి పరిమితిలో విస్తృతిలో చేసింది కందుకూరే. ఏసుక్రీస్తు, విక్టోరియా రాణి జీవిత చరిత్రలతో ప్రారంభించి సంగ్రహ జీవిత చరిత్రలు అనేకం రాశాడు. 1911లో తన జీవిత చరిత్రను త్రికరణ శుద్ధి, యతార్థత, నిర్భీతి వంటి ఉత్తమ లక్షణాలతో రచించాడు. 'సత్య రాజాపూర్వ దేశ యాత్రలు' అనే వ్యంగ్య రచన, క్షీణ యుగంలోని అశ్లీలతను హేళన చేస్తూ రాసిన 'అభ్యాగ్యోపాఖ్యానం' ఉత్తమ గ్రంథాలు. విజ్ఞాన శాస్త్ర గ్రంథాలూ, నీతి కథా మంజరి, నీతి దీపిక వంటి బాల సాహిత్యం; సంగ్రహ వ్యాకరణం, అలంకార సంగ్రహము అనే లక్షణ గ్రంథాలూ రాశాడు. గుణంలో, రాశిలో, వ్యాప్తిలో, వైవిధ్యంలో అపూర్వమైన రచనలను చేసిన వీరేశలింగంగారిని ఆధునిక యుగంలో వినూత్న వాఙ్మయ నిర్మాతగా కీర్తించవచ్చు.

BRAOU

## చదవదగిన పుస్తకాలు

| | | |
|---|---|---|
| తెలుగుభాషా చరిత్ర | : | భద్రిరాజు కృష్ణమూర్తి (సం) |
| ఆంధ్ర సాహిత్య చరిత్ర | : | పింగళి లక్ష్మీకాంతం |
| ఆంధ్ర వాఙ్మయ చరిత్ర | : | డా. దివాకర్ల వేంకటావధాని |
| ఆంధ్ర వాఙ్మయారంభ దశ (1, 2 భాగాలు) | : | డా. దివాకర్ల వేంకటావధాని |
| ఆంధ్ర ప్రబంధములు - అవతరణ వికాసాలు | : | డా. కాకర్ల వెంకట రామ నరసింహము |
| సమగ్రాంధ్ర సాహిత్యం | : | ఆరుద్ర |
| తంజావూరాంధ్ర సాహిత్య చరిత్ర | : | డా.కె. సత్యవతి |
| ఆంధ్ర ద్విపదసాహిత్య చరిత్ర | : | డా.టి. సుశీల |
| ద్విపద వాఙ్మయము | : | డా. జి. నాగయ్య |
| దాక్షిణాత్య శిల్ప సమీక్ష | : | డా. జి. నాగయ్య |
| పురాణ వాఙ్మయము | : | డా. జి.వి. సుబ్రహ్మణ్యం |
| బ్రౌన్‌లేఖలు | : | బంగోరె (సం) |
| మహోదయం | : | కె.వి. రమణారెడ్డి |
| ఆధునికాంధ్ర కవిత్వము | : | డా.సి. నారాయణ రెడ్డి |
| తెలుగులో కవితా విప్లవాల స్వరూపం | : | డా. వెల్చేరు నారాయణ రావు |
| తెలుగు కవితా వికాసం (1947-1980) | : | డా. కడియాల రామమోహన రావు |
| సాహిత్య విమర్శ - పరామర్శ | : | చేకూరి రామారావు |
| సారస్వత ప్రయోజనం | : | రాచమల్లు రామచంద్రారెడ్డి |
| ఆధునిక తెలుగు సాహిత్యంలో విభిన్న ధోరణులు | : | డా.కె.కె. రంగనాథాచార్యులు (సం) |
| తెలుగులో తొలి సమాజ కవులు | : | డా.కె.కె. రంగనాథాచార్యులు (సం) |
| తెలుగు సాహిత్యం - మరో చూపు | : | డా.కె.కె. రంగనాథాచార్యులు (సం) |
| మహతి | : | యువభారతి సమీక్షా వ్యాస సంకలనం |

## మాదిరి పరీక్షా ప్రశ్నలు

I. కింది ప్రశ్నలకు 30 వాక్యాలకు మించకుండా సమాధానాలు రాయండి.

1. జాతీయోద్యమ ఆంధ్రోద్యమ కవిత్వాన్ని పరిచయం చేయండి.
2. భావ కవిత్వం లక్షణాలను తెలిపి, పరిణామాన్ని వివరించండి.
3. అభ్యుదయ కవిత్వం ఆవిర్భావ వికాసాలను తెల్పండి.
4. వచన కవిత్వం వికాసాన్ని తెల్పండి.
5. తెలుగులో దిగంబర కవిత్వాన్ని పరిచయం చేయండి.
6. విప్లవ కవిత్వంలోని సామాజిక సాహిత్యాంశాలను వివరించండి.
7. తెలుగు వచన ప్రక్రియల వికాసాన్ని విశదీకరించండి.



BRAOU

II. కిందివాటికి 10 వాక్యాలకు మించకుండా జవాబులు రాయండి

1. సి.పి. బ్రౌన్ సాహిత్య సేవ
2. తెలుగులో పత్రికా ప్రచురణ
3. తె లుగులో వ్యాకరణ రచన
4. తెలుగులో తొలి నిఘంటువులు
5. తెలుగులో నవలా వికాసం
6. తెలుగు కథానిక
7. తెలుగులో నాటకాలు, నాటికలు
8. తెలుగు విమర్శ

BRAOU

# ఖండం – 5 తెలుగు సంస్కృతి చరిత్ర

మొదటిఖండంలో భాషకు, సాహిత్యానికి, సంస్కృతికి గల అంతర్గత సంబంధాలను గురించి మీరు అధ్యయనం చేశారు. మన ప్రాంతీయ సంస్కృతి చరిత్రను పరిపుష్టం చేసిన భారతీయ సంస్కృతి స్థూల లక్షణాలను అదే ఖండంలో మీరు చదివారు.

ఒక భాషా సమాజంలోని రాజకీయ, ఆర్థిక, సామాజిక పరిస్థితులన్నీ కలిసి సంస్కృతిని నిర్మిస్తాయని మీకు తెలుసు. మన సమాజంలోని లిఖితాధారాలు లేని కాలంనాటి సంస్కృతి చరిత్ర మొదలుకొని ఆధునిక తెలుగు సంస్కృతి పరిణామం వరకు ఈ ఖండంలో మీకు వివరించాము.

తెలుగు సంస్కృతి పరిణామం స్థూలంగా అవగాహన కావటానికి అవసరమైన ప్రణాళిక ప్రకారం ఖండంలోని భాగాలను సిద్ధం చేశాము. ప్రతి భాగంలోనూ ముందు స్థూలమైన రాజకీయ చరిత్రను, పాలనా వ్యవస్థనూ వివరించాము. ఆ తర్వాత ఉత్పత్తి క్రమం మీద ఆధారపడిన ఆర్థిక పరిస్థితులకు సంబంధించిన వ్యవసాయాన్నీ, పరిశ్రమలనూ, వాణిజ్యాన్నీ విశ్లేషించాము. తదనంతరం సామాజిక జీవనానికి సంబంధించిన వివిధ అంశాలను వింగడించాము. క్రీ.పూ. 200 నుండి నేటిదాకా స్థూలంగా ఈ ప్రణాళికనే అనుసరించాము. దీనివల్ల వివిధ దశల్లోని ఆయా ప్రభుత్వాలు పోషించిన సంస్కృతి తెలియటమే కాకుండా, పైపైకి స్పష్టంగా కన్పించకపోయినా ప్రజల మధ్య సజీవంగా నిలిచిన పాలితుల సంస్కృతి స్వరూపం కూడా కొంతవరకైనా మీకు అవగతమవుతుంది.

ఈ ఖండంలో ఐదు భాగాలున్నాయి. వాటి వరుస 21, 22, 23, 24, 25. అవి 1. తెలుగు సంస్కృతి పూర్వదశ I (క్రీ.పూ. 200 – క్రీ.శ. 600) 2. తెలుగు సంస్కృతి పూర్వదశ II (క్రీ.శ. 600 – 1000) 3. తెలుగు సంస్కృతి మధ్యకాలీన దశ I (క్రీ.శ. 1000 – 1600) 4. తెలుగు సంస్కృతి మధ్యకాలీన దశ II (క్రీ.శ. 1600 – 1800) 5. తెలుగు సంస్కృతి ఆధునిక దశ (క్రీ.శ. 1800 నుండి నేటిదాకా).

తెలుగు సంస్కృతిలో భారతీయ సంస్కృతిలోని సంకీర్ణ లక్షణాలు మీకు తెలియటమే కాకుండా సంస్కృతిగతమైన ప్రభావాలు మీకు అవగతమవుతాయి. సంస్కృతి స్తబ్దంగా ఉండదనీ, ఎప్పటి కప్పుడు భాషలాగే, సాహిత్యంలాగే మారుతూ మరింత సంకీర్ణతతో వికసిస్తుందని మీరు గ్రహిస్తారు.

ఈ ఖండంలోని ప్రతి భాగం వెనుకా విధిగా చదవదగిన పుస్తకాలను ఇవ్వలేదు. ఖండం చివరలో ఇచ్చాము. వాటిని మీ వీలునుబట్టి సంపాదించి చదవటానికి మీరు ప్రయత్నించండి.

BRAOU

# భాగం – 21 తెలుగు సంస్కృతి పూర్వదశ I
# (క్రీ.పూ. 200 – క్రీ.శ. 600)

## విషయక్రమం


21.0 లక్ష్యాలు
21.1 పరిచయం
21.2 పాలనావ్యవస్థ
21.3.0 ఆర్థిక పరిస్థితులు
    21.3.1 వ్యవసాయం
    21.3.2 పరిశ్రమలు
    21.3.3 వాణిజ్యం
21.4.0 సామాజిక జీవనం
    21.4.1 వర్ణవ్యవస్థ
    21.4.2 కుటుంబ వ్యవస్థ
    21.4.3 విద్యలు, కళలు
    21.4.4 మతం
    21.4.5 ఆచార వ్యవహారాలు
అవగాహన ప్రశ్న
21.5.0 సారాంశం
    అవగాహన ప్రశ్నకు జవాబులు
    చదవదగిన పుస్తకాలు
    మాదిరి పరీక్షా ప్రశ్నలు


## 21.0 లక్ష్యాలు

క్రీ.పూ. 200 నుండి క్రీ.శ. 600 వరకు సాగిన ఆంధ్ర సంస్కృతీ చరిత్ర ఈ భాగం చదివాక మీరు విశ్లేషించగలుగుతారు. సంస్కృతీ చరిత్రలో భాగమైన పాలనావ్యవస్థను, ఆర్థిక స్థితిగతులను, సామాజిక జీవనాన్ని వింగడించగలుగుతారు.

## 21.1 పరిచయం

ఐతరేయ బ్రాహ్మణంలోనే ఆంధ్రుల ప్రస్తావన ఉన్నట్లు మీరు అయిదవ భాగంలో చదువుకున్నారు. ఈ భాగంలో క్రీ.పూ. 200 నుండి క్రీ.శ. 600 దాకా అంటే శాతవాహనుల కాలంనుండి విష్ణుకుండినుల దాకా మన సంస్కృతిలోని తీరుతెన్నులను మీకు పరిచయం చేస్తున్నాము.

## 21.2 పాలనావ్యవస్థ

ఆంధ్రరాజ్యాన్ని ప్రప్రథమంగా ఎవరు నెలకొల్పారో చెప్పలేం కానీ తెలుగువారిలో మొట్టమొదట చెప్పకోదగినవారు శాతవాహనులు. వీరు శక, యవన, పహ్లవాదులను అణచారు. మగధరాజ్యంలోని కొంత భాగాన్ని ఆక్రమించారు. దక్షిణాధిపతులనీ, త్రిసముద్రాధిపతులనీ, ఆంధ్రులనీ, ఆంధ్రభృత్యులనీ పురాణాదులు వీరిని పేర్కొంటున్నాయి. వీరి తర్వాత ఇక్ష్వాకులు, పల్లవులు, బృహత్పలాయనులు, ఆనంద గోత్రీకులు, శాలంకాయనులు, విష్ణుకుండినులు, తదితర రాజ వంశీకులు ఈ దశలో పరిపాలించారు. వీరి కాలంలోని సంస్కృతీ విశేషాలను తెలుసుకుందాం.

ఉత్తరాన ఆరావళీపర్వతాల వరకు, దక్షిణాన నీలగిరి కొండల వరకు, తూర్పున బంగాళాఖాతం వరకు, పశ్చిమాన అరేబియా సముద్రం వరకు వ్యాపించిన దక్షిణాపథాన్ని శాతవాహనులు నాలుగున్నర శతాబ్దాలు పరిపాలించారు.



BRAOU

శాతవాహనులు వారసత్వపు రాజరిక వ్యవస్థను గ్రహించారు. ఆ వ్యవస్థలో రాజ్యాధికారం "కుల పురుష పరంపరాగతం". శాతవాహన రాజులలో తల్లి పేరు పెట్టుకొనే ఆచారం ఉండేది. శాతవాహనులు మాతృ స్వామ్య వ్యవస్థకు చెందిన వారని కొందరు తలచారు. కాని శాతవాహనులది మాతృస్వామం కాదనడానికి రాజ్యం కుల పురుష పరంపరాగతమవడమే నిదర్శనం.

శాతవాహన ప్రభువులు రాజు, మహారాజు అను బిరుదాలను గ్రహించినారు. అంతకు ముందే రాజు దైవాంశ సంభూతుడనే విశ్వాసం తెలుగు దేశంలో వ్యాపించింది. గౌతమీపుత్ర శాతకర్ణిని రాముడు, కృష్ణుడు మున్నగు పురాణ వీరులతో పోల్చడం జరిగింది. నాటి శాతవాహన ప్రభువు సర్వాధికారి. సర్వ సైన్యాధ్యక్షుడు. రాజ్య రక్షణతో పాటు వైదిక ధర్మ పరిరక్షణ బాధ్యత తమకున్నదని నాటి శాతవాహన ప్రభువులు తలచినట్లు శాసనాల వలన స్పష్టమౌతున్నది. శాతవాహన సామ్రాజ్యంలో స్వతంత్ర ప్రతిపత్తిగల అనేక సామంత రాజ్యాలుండేవి. కుందవంశం వారికి, మైసూరు ప్రాంతంలోని చూటులకు నాణాలను ముద్రించుకొనే అధికారం ఉండేది. మహారాష్ట్ర ప్రాంతంలో వంశ పారంపర్యంగా మహా భోజులు, మహారథులు అన్న బిరుదులు పెట్టుకొన్న ప్రముఖులుండేవారు. శాతవాహన వంశంలో ప్రథమ ప్రభువైన శ్రీముఖుడు మహారథి త్రనకాయిరో కుమార్తెను తన కోడలిగా చేసుకొన్నాడని నానేఘాట్ గుహలోని చిత్రాల ద్వారా తెలుస్తున్నది. ఈ చిత్రాలలో శ్రీముఖుడు, అతని కుమారుడు శ్రీశాతకర్ణి, శ్రీశాతకర్ణి భార్య నాగనిక, ఆమె తండ్రి మహారథి త్రనకాయిరో, రాజకుమారులు హకుశ్రీ శాతవాహనులు కన్పిస్తారు. మహాభోజుల శాసనాలలో వారి చక్రవర్తులను గూర్చిన ప్రసక్తి కన్పించక పోవడంతో వీరికి స్వతంత్ర ప్రతిపత్తి ఉండినట్లు భావింపవచ్చును.

సామ్రాజ్యంలో అధికభాగం రాజు స్వాధీనంలో ఉండేది. ఈతడు రాజ్యతంత్రాన్ని ఉన్నతాధికారుల సహాయంతో నిర్వహించేవాడు. నాటి శాసనాలలో విశ్వాసామాత్యుడు, రాజామాత్యుడు, మహాతరకుడు, భాండాగారికుడు, పౌరణికుడు, మహాసేనాపతి, ప్రతీహారులు, దూతలు, లేఖకులు, పట్టికా పాలకులు అనే ఉద్యోగుల పేర్లు కన్పిస్తున్నాయి. వీరి పదవీ బాధ్యత లేమిటో స్పష్టంగా తెలియటంలేదు.

శాతవాహన సామ్రాజ్యం 'ఆహారాలు'గా విభక్తం. ఉదాహరణకు సోపారాహార, గోవర్ధనాహార, మామలాహార మొదలైనవి. అవి అమాత్యుల అధికారంలో ఉండేవి. ఆ అధికారం వంశపారంపర్యం కాదు. వారికి స్వతంత్రంగా వ్యవహరించే అధికారం లేదు. ఈ అమాత్యులు రాజు ప్రభువు నిర్దిష్టాదేశాల ననుసరించి చేయవలసించే కాని స్వతంత్రంగా చేయకూడదు. వీరిని ఒక ఆహారం నుంచి మరో ఆహారానికి తరచుగా మార్చేవారు. సరిహద్దు ప్రాంతాలలో సేనాపతులను నియమించేవారు. వీరికి సామంతాధికారాల నిచ్చేవారు. (ఆంధ్రుల చరిత్ర-సంస్కృతి, పుట 76).

ఆహారం కొన్ని గ్రామాలుగా విభజింపబడేది. ఈ గ్రామాధికారికి 'గామిక, గ్రామణి' అని వ్యవహరించినట్లు, గాథాసప్తశతి ద్వారా తెలుస్తున్నది. గ్రామంలోని శాంతి భద్రతలను కాపాడడం వీరి ముఖ్య బాధ్యత.

శాతవాహన రాజ్యంలో భరుకచ్ఛ, ప్రతిష్ఠానం, తగర, గోవర్ధన, సోపార, నాసిక, ధాన్యకటకం, విజయపురి మొదలైన నగరాలుండేవి. ఈ నగరాలలో నిగమ సభలుండేవి ఇవి నగరంలోని వాణిజ్య వ్యవహారాలను చూచేవి. (ఆంధ్రుల చరిత్ర, పుట 78)

శాతవాహన ప్రభువులు రాజ్యవిస్తరణకై దిగ్విజయయాత్రలు జరిపేవారు. కాబట్టి వారికి అపారమైన సైన్యముండినట్లు ఊహించవచ్చు. హాతిగుంఫ శాసనం చతురంగ బలాలనూ, అమరావతిశిల్పం యుద్ధ వ్యూహ రచననూ స్పష్టపరుస్తున్నాయి. నాటి శాసనాలలో 'స్కంధావారం, కటకం' అనే పదాలున్నాయి. స్కంధావారం అంటే తాత్కాలిక సైనిక శిబిరం. కటకం అంటే సైన్యాగారం. ప్రతి రాష్ట్రంలోను ఒక కటకం ఉండేది. సైనికులు జనపదాలలోని వారిని బాధించేవారనటానికి గౌతమీపుత్ర శాతకర్ణి "క్షహరాటవంశ నిరవశేషకర" అని చెప్పుకోవడమే నిదర్శనం.

శాతవాహనుల పిదప ఆంధ్రదేశాన్ని పాలించినవారు ఇక్ష్వాకులు మొదలైనవారు శాతవాహనుల పరిపాలనా విధానాన్ని అనుసరించారు. నాటి ప్రభువులు 'ధర్మమహారాజు, పంచమ లోకపాల' అనే బిరుదులు ధరించినట్లు తెలుస్తుంది. రాజుకు సహాయపడే "మంత్రిమండలి" ఉండేది. నాటి ప్రభువులు పరరాజులను జయించి అశ్వమేధ, రాజసూయాది యాగాలను చేసి తమ సార్వభౌమత్వాన్ని ప్రకటించుకొనేవారు అది వైదికమత ప్రాబల్యానికి నిదర్శనం.

BRAOU

ఆ కాలంలో కొన్ని గ్రామాల కూడికను "రాష్ట్రం, విషయం" అని వ్యవహరించేవారు. కాని బృహత్ఫలాయనులు మాత్రం శాతవాహనుల ఆహార పద్ధతినే అనుసరించారు. పల్లవులు తమ రాజ్యభాగాలను "రాష్ట్రం" అని వ్యవహరించేవారు ఇందుకు ఉదాహరణలు : శాతవాహన రాష్ట్రం, ముండా రాష్ట్రం, కర్మరాష్ట్రం. కొన్ని పల్లవ శాసనాలలో "ఆంధ్ర పథాన్ని" పేర్కొన్న విష్ణుకుండినులు "రాష్ట్రం, విషయం" అనే మాటలను పర్యాయవాచకాలుగ వాడారు. "ప్లికి" రాష్ట్రం, "గుడ్డివాడ విషయం" అనేవి ఉదాహరణలు.

రాష్ట్రం వివిధకాలాలలో వివిన్న ప్రమాణాలలో ఉండేది. ఇక్ష్వాకులు అయిదు గ్రామాలను కలిపి "గ్రామపంచిక" అని వ్యవహరించారు. "మహా గ్రామ" అనేది "మహాగ్రామిక" అధికారంలో ఉండేది.

ఇక్ష్వాకుల కాలంలో 'దండనాయకులు' ఉండేవారు. ఈయన ప్రభుత్వ సైన్యాధ్యక్ష వర్గ నాయకుడు కూడ వారికి రాజకుటుంబాలతో సంబంధ బాంధవ్యాలు ఉండేవని నాగార్జున కొండ శాసనాలవల్ల తెలుస్తున్నది.

శాలంకాయనుల కాలంలో రాష్ట్రాధిపతులను "దేశాధిపతు" లని వ్యవహరించేవారు. మండలాధికారులను "విషయపతు"లనేవారు. వీరుకాక ఆయుక్తకులు, అధ్యాపకులు, నైయోగికులు, అమాత్యులు ఉండేవారు (ఆంధ్రుల సంస్కృతి - చరిత్ర మొదటిభాగం పుట : 125). వీరికి కేంద్ర, స్థానిక పరిపాలనతో సంబంధం ఉండేది. బృహత్ఫలాయనుల కాలంలో "ఆహారా"లకు "వ్యాపృతు" లనే అధికారులుండేవారు (ఆంధ్రుల చరిత్ర, పుట 140).

విష్ణుకుండినుల కాలంలో "విషయపతులు, వల్లభులు, రాజపురుషులు" అనే ఉద్యోగులుండేవారు (ఆంధ్రుల సంస్కృతి - చరిత్ర, మొదటిభాగం, పుట 124).

పల్లవులు తమ రాజ్యాన్ని రాష్ట్రాలుగా, పథాలుగా విభజించారు. వీరికి అధికారులుగా రాజకుమారుల్ని నియమించేవారు. "రథికులు" రాష్ట్రోద్యోగులు. రాజు ప్రత్యేకాధికారి "రహస్యాధికృతుడు."

శాతవాహనుల కాలంలో భూమిపన్నే ప్రభుత్వానికి ముఖ్యమైన ఆదాయం. భూమిపై రెండు మూడు రకాల పన్నులుండేవి. ఇందులో రాజు భాగాన్ని "దేయ" మనీ, "భోగ" మనీ వ్యవహరించేవారు. రాజుకు స్వంతక్షేత్రం ఉండేది. దానినే ఆనాడు "రాజకంఖేటం" అనేవారు. దీనిపై మాత్రమే రాజుకు సర్వాధికారాలుండేవి. రాజులు ఈ భూమినే దానం చేసేవారు. ఇటువంటి భూమి లేకపోతే భూమిని యజమానినుంచి కొని దానమిచ్చేవారు. బ్రాహ్మణులకు, బౌద్ధమతాచార్యులకు, మతసంస్థలకు దానమిచ్చిన భూమిని గ్రామం లోని రైతులే వ్యవసాయంచేసి ఫలసాయంలో కొంతభాగం ఇచ్చేవారు. భూములలో వరి, చెరకు, జనుము పండేవి. నువ్వు పొలాలతోపాటు కొబ్బరితోటలు, ఆకుతోటలుకూడా ఉండేవని గాథాసప్తశతివలన తెలుస్తుంది.

శాతవాహనుల కాలంలో పలురకాల చేతిపరిశ్రమల ప్రసక్తి కన్పిస్తుంది. అటువంటి వారిలో కోలిక (సాలె), కులార (కుమ్మరి), తిలపిసక (తెలకులు), కసకార (కంచరి), కమర (కమ్మరి), సువనక (స్వర్ణకార), మణిక (మణికారులు), వధిక (వడ్రంగి) పేర్కొనదగ్గవారు. ఈ పరిశ్రమలలోని పనివాళ్ళు "శ్రేణులు" ఏర్పరచుకొనేవారు. అవి ధనం నిల్వ ఉంచేవి. ఆ పరిశ్రమలమీద కూడా పన్నులు ఉండేవి.

నాడు దేశీయ విదేశీయ వాణిజ్యం బాగా అభివృద్ధి చెందింది. పైఠాన్, తగర, జున్నార్, నాసిక మొదలైనవి పశ్చిమప్రాంతంలో ఉన్నాయి. విజయపురి, కుడూర, ధాన్య కటకాదులు తూర్పుప్రాంతంలో ఉన్న వాణిజ్యకేంద్రాలని అమరావతీ శాసనంవల్ల తెలుస్తుంది. దేశీయ వాణిజ్య కేంద్రాలనూ, రేవు పట్టణాలనూ కలుపుతూ రహదారులుండేవి. విదేశీ వాణిజ్యాన్ని కూడ నాటి ప్రభువులు ప్రోత్సహించారు. రహదారులమీద సత్రాలను, చలివేంద్రాలను ఏర్పాటు చేశారు. వాణిజ్యపరంగా ప్రభువుకు మంచి ఆదాయం లభించేది. ఈ పన్నులను వస్తురూపంలో గాని, ధనరూపంలోగాని వసూలు చేసేవారు.

శాతవాహనుల అనంతరం కూడా వ్యవసాయం ఆంధ్రదేశంలో ప్రధానవృత్తి. ఉప్పు, పంచదారలమీద కూడా పన్నులు విధించేవారు. ఏళవట్టి శాసనంలో వృత్తిపన్నుల ప్రస్తావన ఉంది. వివాహసమయంలో వధూవరుల పక్షాలవారు పన్నులు చెల్లించాలి. వినోదగృహాలు పన్నులు చెల్లించేవి. ప్రభుత్వోద్యోగులు పాలు, వెన్న, మజ్జిగ, పూలు, పండ్లు, గడ్డి వసూలు చేసేవారు.

పల్లవరాజు రెండో నరసింహవర్మ బిచ్చిరెడ్డిపాలెం శాసనం ఆనాటి వృత్తిపన్నుల వివరాలు తెలుపుతుంది. లోహకారులు, చర్మకారులు, ఆపాన పట్టకారులు (దుకాణాలకు పట్టాలిచ్చువారు), రజ్జు ప్రతీహారులు,



BRAOU

ప్రావారాంచకులు (దుప్పట్లు అమ్మేవారు), ఆపాన జీవకులు (దుప్పట్లు అమ్మేవారు), నాహలాముఖదారులు (దున్నేవారు), కూపదర్శకులు, తంతువాయులు, ద్యూతకరులు మొదలైన వృత్తులవారు పన్నులు చెల్లించి నట్లు తెలుస్తున్నది (ఆంధ్రుల సంస్కృతి చరిత్ర - మొదటిభాగం, పుట 131).

శాతవాహనుల కాలంలో పన్నుల విధింపు తగవుల పరిష్కారానికి ప్రత్యేకంగా న్యాయనిర్వహణాధికారం గల వ్యవస్థ ఉండేది. ఆనాడు జరిమానా, దేశబహిష్కారం, మరణం మొదలైనవి శిక్షలు. శాతవాహనుల అనంతరం తగవులను పరిష్కరించడం పౌరసమితి బాధ్యత. ఇటువంటిదే మరొకటి రెండు గ్రామాల "సంయుక్త సమావేశం." ఆనాడు ధర్మాధర్మాలను, న్యాయాన్యాయాలను ఎట్లా నిర్ణయించేవారో స్పష్టంగా తెలియదు. విష్ణుకుండిన మాధవవర్మ పొలమూరు శాసనంలో "దివ్యపరీక్ష" ప్రసక్తి కన్పిస్తుంది. కాలక్రమంలో ఇవి తొమ్మిది రకాల పరీక్షలైనాయి. వీనినే "దివ్య"లంటారు.

1. తులాదివ్య : నేరం చేసినవాడిని మొట్టమొదట తూకం వేస్తారు. తరువాత న్యాయాధికారి మంత్రాలు పఠిస్తాడు. తరువాత నేరస్థుడిని తూకం వేస్తారు. ఎక్కువ తూకం ఉంటే అతనిని దోషిగా నిర్ణయించేవారు.
2. అగ్నిదివ్య : ఒక నేరస్థుడిని నిప్పులమీద నడిపిస్తారు. పాదాలు కాలితే దోషిగా నిర్ణయించేవారు.
3. జలదివ్య : ఒక సైనికుడు ప్రయోగించిన బాణాలు తెచ్చేవరకు నీటిలో మునిగి జీవిస్తే నిర్దోషిగా నిర్ణయించేవారు.
4. విషదివ్య : ఒక కుండలో తాచుపామును ఉంచుతారు. ఆ కుండలో ఉంగరం పడవేసి నేరస్థుడిని ఆ ఉంగరం తియ్యమంటారు. పాముకాటు పడకుండా తియ్యగలిగితే నిర్దోషిగా నిర్ణయించేవారు.
5. కోశదివ్య : దేవతావిగ్రహాలు కడిగిన నీటిని నేరస్థుడిని తాగమనేవారు. తరువాత 14 రోజులు జీవిస్తే నిర్దోషిగా ప్రకటించేవారు.
6. తండుల దివ్య : మంత్రించిన బియ్యాన్ని నమిలి రావిఆకుమీద ఉమ్మి వేయమనేవారు. ఆ మంత్ర బియ్యానికి తడి లేకపోయినా, రక్తం కనిపించినా దోషిగా నిర్ణయించేవారు.
7. తప్తమస్క దివ్య : మరుగుతున్న నూనెలో నాణాన్ని వేసి, నేరస్థుడిని ఆ నాణాన్ని తీయమనేవారు. చేతులు కాలకపోతే నిర్దోషిగా నిర్ణయించేవారు.
8. ఫలదివ్య : కాలుతున్న బల్లెపు ఆరును చేతితో పట్టుకొని నడవాలి. తరువాత ఆ చేతితో వడ్లను నలపాలి. చేతులు కందితే దోషిగా నిర్ణయించేవారు.
9. ధర్మాధర్మ దివ్య : వెండితో చేసిన ధర్మమూర్తిని, సీసంతో చేసిన అధర్మమూర్తిని ఒక పాత్రలో వేసి, నేరస్థుడిని ఒక దానిని తీయమనేవారు. అతడు తీసిన విగ్రహాన్ని బట్టి ధర్మాధర్మాలను నిర్ణయించేవారు (ఆంధ్రుల చరిత్ర - సంస్కృతి, మొదటి భాగం, పుటలు 126, 127).

BRAOU

## 21.3.0 ఆర్థిక పరిస్థితులు

ఈ ఉపభాగంలో నాటి ఆర్థికపరిస్థితులను - వ్యవసాయం, పరిశ్రమలు, వాణిజ్యం అనే అంశాలను వివరిస్తున్నాం.

### 21.3.1 వ్యవసాయం

శాతవాహనుల కాలంలో ప్రజల ముఖ్య జీవనాధారం వ్యవసాయం. నాడు రాజులకే గాక సామాన్య ప్రజలకు కూడా భూమిపై అధికారం ఉండేది. ఒక్కొక్కప్పుడు భూమిపై ఒక్కరి కంటే ఎక్కువ మందికి అధికారం ఉండేది. భూమి దానం చేయటం క్రీ.పూ. 2వ శతాబ్దంలో దక్షిణ భారతంలో శాతవాహనులతోనే ప్రారంభమయినట్లు కొందరు చారిత్రకులు భావిస్తున్నారు. ఆనాడు వరి, చెరకు, కందులు వంటి పప్పు ధాన్యాలు, జనుము, నువ్వులు పండించేవారు. కొబ్బరితోటలు, ఆకుతోటలు ఉండేవి. ఆ జనుమును పశువుల ఆహారం కోసం పండించేవారు. ప్రతి గ్రామంలోనూ బెల్లం తయారు చేసేవారు. నీటి పారుదల సౌకర్యాలు ఉండడం చేత వ్యవసాయం బాగా జరిగేది. ఈ నీటి పారుదలకు "ఉదకయంత్రాలు" (ఏతాములు) ఉండేవి. వాటిని నడిపేవారు ఒక 'శ్రేణి'గా ఏర్పడినారు. ఈ ఔదయాంత్రికుల శ్రేణిని క్రీ.శ. 3వ శతాబ్దానికి చెందిన నాసిక్ శాసనం ప్రస్తావించింది.

వ్యవసాయాన్ని అభివృద్ధి చేసేందుకు నాటి ప్రభువులు శాసనాలు చేశారు. వ్యవసాయ పరికరాలను అపహరిస్తే కఠినంగా శిక్షించేవారు. చెడి పోయిన విత్తనాలను అమ్మకూడదు. పొలంలో పరిహద్దురాళ్ళను తొలగించరాదు. వీరికి అంగవైకల్యం శిక్ష అని తెలుస్తున్నది.

### 21.3.2 పరిశ్రమలు

శాతవాహనుల కాలంలో అనేక పరిశ్రమలు వృద్ధి చెందాయి. శాతవాహనుల శాసనాలలో కోళికులు (నేతగాళ్ళు), తిలపేషకులు, కాంస్యకారులు (కంచుపనివారు), కమరకులారులు, ఔదయాంత్రికులు, మణికారులు, స్వర్ణకారులు, వడ్రంగులు, మిధికులు (రాళ్ళను నునుపు పెట్టేవారు), గాధికులు (సుగంధ ద్రవ్యకారులు), ఆవేశనులు (గృహకర్మకుశలురు) మున్నగు పనివాళ్ళున్నారని తెలుస్తున్నది.

మృణ్మయ పాత్రలపై నాడు చిత్రాలంకరణ చేసేవారు. మాస్కి, కొండాపురం, అమరావతి, పైఠాన్‌లలో అటువంటి మృణ్మయ పాత్రలు లభించాయి. నాటి వడ్రంగులు కలపతో శయ్యలు, వాహనాలు, కుర్చీలు, పెట్టెలు మొదలైన వాటిని నేర్పుగా తయారుచేసేవారు. బ్రహ్మపురి, అమరావతి, పైఠాన్‌లతో లభించిన కంచు, ఇత్తడి ప్రతిమలు, దీపస్తంభాలు నాటి కమ్మరుల నైపుణ్యానికి నిదర్శనం.

శాతవాహనుల కాలంలో చేతిపని వాళ్ళు "శ్రేణులు"గా ఏర్పడేవారు. ఈ శ్రేణి నాయకుని శ్రేష్ఠి అనేవారు. ఈ శ్రేణి కార్యస్థానాన్ని "నిగమసభ" అనేవారు. ఈ నిగమసభ శ్రేణిలోని సభ్యుల మంచి చెడ్డలను చూసేది. ఈ శ్రేణులలో ధనం నిలువ ఉంచితే, ఆ సొమ్ముపై పన్నెండు శాతం వరకు వడ్డీ యిచ్చేవారు. ఈ శ్రేణులు సాంఘిక సంక్షేమ కార్యక్రమాలను నిర్వహించేందుకు కూడ సహాయపడేవి. ఈ శ్రేణులను గురించి "Guilds were like the goldsmiths of the middle ages in Europe bankers, receiving deposits and lending money" అని డా. గోపాలాచారి అభిప్రాయం. ఈ శ్రేణులు స్వతంత్రంగా వ్యవహరించేవి. ప్రజల వద్ద నుంచి సేకరించిన సొమ్ములో తమ పరిశ్రమకు అవసరమయ్యే ముడిసరుకులు కొని, ఆ వస్తువుల అమ్మకాల వలన నిల్వదారులకు వడ్డీని చెల్లించేవారు. ఈ శ్రేణుల వల్ల ఆర్థిక స్థిరత్వమేర్పడి దేశ భద్రతకు దారితీసింది. ఒకే వృత్తికి ఎన్నైనా శ్రేణులు ఉండవచ్చు. ఒకే శ్రేణి స్వాధీనంలో ఏ వృత్తీ పూర్తిగా ఉండదు. ఈ శ్రేణులు తమ దగ్గర నిల్వ ఉంచేందుకు "కర్షపణాల"ను స్వీకరించేవారు. నాడు ప్రభువులు, సామాన్యులు కూడ ఈ శ్రేణులలో ధనాన్ని నిలువ ఉంచేవారు. క్రీ.శ. 258 నాటి శాసనం విష్ణుదత్త అనే స్త్రీ కుమ్మరుల శ్రేణిలో, ఔదయాంత్రికుల శ్రేణిలో, తేవీల శ్రేణిలో ధనాన్ని పెట్టుబడి పెట్టినట్లు చెప్తున్నది. క్రీ.శ. 199-200 లో ఋషభదత్తుడు గోవర్ధనాహారలోని నేతగాళ్ళ శ్రేణిలో పెట్టుబడి పెట్టినట్లు నాసిక్ శాసనం వల్ల తెలుస్తున్నది. దీనివల్ల ఈ శ్రేణులలోని ధనానికి లోటు రాదని నాటివారు విశ్వసించేవారు.

### 21.3.3 వాణిజ్యం

శాతవాహనుల కాలంలో వాణిజ్యం విరివిగా సాగేది. పైఠాన్, తగర, జున్నార్, నాసిక్, గోవర్ధన, వైజయంతి, కరహాట నగరాలు పశ్చిమ ప్రాంతాన కెవరూర, విజయపురి, కుడూర, ధాన్యకటక నగరాలు తూర్పు ప్రాంతాన ప్రధానవాణిజ్య కేంద్రాలు. ఈ ప్రధాన వాణిజ్య కేంద్రాలను రేవు పట్టణాలతో కలుపుతూ రహదారులుండేవి. "తూర్పుతీరంలో మచిలీపట్టణం సమీపంలో కలసి పశ్చిమ తీర రేవు పట్టణాలను కలిపేవని" ప్లినీ అభిప్రాయం. ఈ కాలంలో వర్తకులు బిడారులుగా ఏర్పడేవారు. నదుల మీదుగా సరుకు రవాణా అయ్యేది. ఈనాటి ముఖ్య ప్రయాణ సాధనం ఎద్దులబండి.

శాతవాహనుల కాలంలో విదేశాలతో వర్తక సంబంధాలుండినట్లు తెలుస్తోంది. నాడు విదేశ వాణిజ్యం చేస్తున్న రేవు పట్టణాలను పెరిప్లస్ గ్రంథం పేర్కొంటుంది. శాతవాహన రాజుల నాణాలపై నౌకా చిహ్నం ముద్రింపబడడంచేత, శాతవాహనులకు నౌకా బలముండినట్లు స్పష్టమవుతున్నది. కాబట్టి వారు విదేశ వాణిజ్యాన్ని ప్రోత్సహించినట్లు భావించవచ్చు. వీరి కాలంలో బరుకచ్ఛ, సోపార, కల్యాణ రేవులు ప్రసిద్ధం. ఈ బరుకచ్ఛమున సారాయం, వెండి బంగారం, వజ్రాలు, మణులు దిగుమతి అయ్యేవి. దంతపు సామానులు, పట్టు వస్త్రాలు, సుగంధ ద్రవ్యాలు ఎగుమతి అయ్యేవి. తూర్పు తీరాన కళింగ పట్టణం, పులికాట్‌ల మధ్య కోడూరు, ఘంటసాల, మైసోలియా, కోరంగి మున్నగు రేవు పట్టణాలు ప్రధానం. వీరి కాలంలో నెల్లూరు, వినుకొండ, చేబ్రోలు, ధాన్యకటకం, నాగార్జునకొండ మొదలైన స్థలాలలో రోమన్ బంగారు నాణాలు లభించాయి. దీని వలన నాటి ఆంధ్రులు రోమ్‌తో వర్తకం చేశారని స్పష్టమవుతుంది.

విదేశీ వర్తకంతోపాటు బర్మా, ఇండోచైనా, ఇండోనేషియా, సింహళదేశాలలో వలసలను కూడా స్థాపించుకోవడం జరిగింది. శాతవాహనుల కాలానికి బర్మాలో తలైంగులు రాజ్యాన్ని స్థాపించారు. వీరికి రాజధాని

"పెగూ." ఈ రాజ్యానికి ఉత్తరాన "శ్రీక్షేత్రం" రాజ్యం ఏర్పడింది. ఈ రాజ్యాన్ని శాన్‌లాంక్రోం అనేరాజు పాలించేవాడు. ఈ పేరు శాలంకాయన పదాన్ని గుర్తుతెస్తుందని చారిత్రకుల అభిప్రాయం. వీరికాలంలోనే బర్మాలో బౌద్ధమతం వ్యాపించింది. నాగార్జునకొండ, అమరావతి ప్రాంతం నుండి బౌద్ధం బర్మాలోనికి ప్రవేశించిందని శ్రీ నీహార రంజన రాయ్ అభిప్రాయం. మలయాలో విదేశీయులను "క్లింగ్" అని వ్యవహరించేవారు. వీరు కళింగం నుండి వలసపోయి ఉండవచ్చు. "రిగర్" ఆలయాలకు ఉండవల్లి గుహలకు సామ్యం ఉంది. ఆచార్య నాగార్జునుడు సందర్శించిన నాగలోకం సింహళమని కొందరి అభిప్రాయం. సింహళ ప్రభువైన "ఓహరతిస్స" ఆర్యదేవుని గౌరవించినట్లు తెలుస్తున్నది. అనూరాధపురంలోని బౌద్ధాలయాలు ఉండవల్లి గుహాలయాలను పోలి ఉన్నాయి. కౌండిన్యసోమ వంశస్థునిచే స్థాపింపబడిన చంపా, కాంభోజరాజ్యాల లోని ప్రజలు ఇండోనేషియా దీవులకు వలస వెళ్ళారు ఈ విధంగా శాతవాహనుల కాలంలో విదేశ వాణిజ్యంతో పాటు మలయా, ఇండోనేషియా మొదలైన దేశాలతో సాంస్కృతిక సంబంధాలేర్పడ్డాయి.

శాతవాహనుల తరువాతి ప్రభువులకు కూడ స్వంత భూములు ఉండేవి. వీరు భూదానం చేసేటప్పుడు మినహాయింపులు ఇచ్చేవారు. వాటిని శాసనాలలో స్పష్టంగా నిర్దేశించేవారు. ఆనాడు దానాలను ప్రభువు ఆయురారోగ్య విభవాభివృద్ధి కొరకు చేసేవారు.

శాతవాహనుల అనంతరం కూడ చేతి పరిశ్రమలు సాగాయి. ఇవి నాడు గ్రామాభ్యుదయాని కెంతగానో ఉపకరించాయి. నాగార్జున కొండ వద్ద దాకలు (కుండలు), మేకులు సీళ్ళు మొదలైనవి ఎన్నో లభించాయి. ఇక్ష్వాకుల రాజధానిలోని ఒక గృహంలో నాటి నగలెన్నో లభించాయి. నాగార్జునకొండ మీద ఉన్న స్థూపాలలో పెట్టెలు, భరిణెలు కన్పించాయి.

ఇక్ష్వాకుల కాలంలో మాత్రమే వృత్తిశ్రేణులు కన్పిస్తాయి. వర్ణిక శ్రేణి, పూసిక శ్రేణి మున్నగువాని ప్రసక్తి ఇక్ష్వాకుల శాసనాలలో కన్పిస్తుంది. తరువాత కాలంలో వీటి ప్రసక్తి కన్పించదు.

ఇక్ష్వాకుల కాలంలో కూడ విదేశ వాణిజ్యం సాగింది. శాతవాహనుల కాలంనాటి వాణిజ్య రహదారులు ఇక్ష్వాకుల కాలంలో కూడ ఉన్నాయి. కళింగపట్నం నుండి పులికాట్ సరస్సు వరకు తీరవాణిజ్యం సాగేది. కృష్ణా, గోదావరి నదులలో తట్టు ప్రాంతాల వరకు నౌకలు వెళ్ళేవి ఈ సౌకర్యం ఏర్పడడంతో విదేశ వాణిజ్యం ఆనాడు మిక్కిలి లాభకరంగా ఉండేది. కాని కాలక్రమంలో వాణిజ్యం తీర ప్రాంతాలకు పరిమితమయినట్లు ఫాహియాన్ రాతల వల్ల తెలుస్తుంది.

రోమన్ చక్రవర్తి ఆగస్టసు బంగారు నాణాన్ని ఇక్ష్వాకులు వాడకంలో ఉంచినట్లు తెలుస్తుంది. రోమన్ నాణాల నిక్షేపాలు ఎన్నో చోట్ల లభించాయి. ఈ నాణాల వలన రోమన్‌లతో గల విదేశ వాణిజ్య సంబంధం తెలుస్తుంది.

ఆనాటి ప్రభువులలో ఇక్ష్వాక విష్ణుకుండిన ప్రభువులు వేసిన నాణాలు లభించాయి. ఇక్ష్వాకుల కాలానికి చెందిన నాణాల నిధి లభించింది. ఈ నాణాలు సీసంతో చేసినవి. రాగి సత్తు కలిపి ముద్రించిన విష్ణుకుండినుల నాణాలు ఏలేశ్వరంలో లభించాయి.[1]

కాలగమనంలో పరిశ్రమలు వాణిజ్యం వెనుకంజ వేశాయి. దీని వలన దేశ ఆర్థిక స్థితి క్షీణించింది. శాతవాహనుల అనంతరం ఏ రాజ కుటుంబానికి చెందిన వెండి, బంగారు నాణాలు లభించక పోవటమే ఈ స్థితికి నిదర్శనం. ఇట్టి మార్పులవల్ల శాతవాహన రాజుల కాలంనాటి నగర జీవన విధానం వెనుకంజ వేయగా గ్రామీణ వాతావరణం, గ్రామీణ జీవనం ముందంజ వేసింది.

## 21.4 సామాజిక జీవనం

ఈ ఉపవిభాగంలో సామాజిక జీవనం తీరుతెన్నులను వర్ణవ్యవస్థ, కుటుంబవ్యవస్థ, విద్యలు కళలూ, మతం, ఆచార వ్యవహారాలు అనే శీర్షికల కింద వివరిస్తున్నాం.

### 21.4.1 వర్ణవ్యవస్థ

శాతవాహనుల కాలం నాటికే వర్ణ వ్యవస్థ దక్షిణ భారతదేశంలో స్థిరపడింది. గౌతమీపుత్ర శాతకర్ణి తాను వర్ణ సాంకర్య మేర్పడకుండా చూచినట్లు చెప్పుకొన్నాడు. వృత్తుల ననుసరించి వర్ణాలలో ఉపశాఖలు కలిగాయి. హాలిక, గోలిక, గాధిక, వధిక, తిలపిసక, కమర మొదలైన ఉపశాఖలు ఈ విధంగానే వ్యవహారంలోకి వచ్చాయి.



BRAOU

పల్లవులు విదేశీయులు అయినప్పటికి వైదిక ధర్మం పట్ల ప్రత్యేకమైన అభిమానాన్ని ప్రదర్శించారు. ఆనాటివారు వీరిని క్షత్రియులుగా పరిగణించినారు (ఆంధ్రుల చరిత్ర - సంస్కృతి మొదటిభాగం, పుట 30).

శకుల, యవనుల రాక, బౌద్ధ, జైన మతాల ప్రభావం హిందూమతం పై ప్రసరించడంవల్ల కూడ చాతుర్వర్ణ్య ధర్మాలు నిర్దిష్టంగా లేవు. యవనులు బౌద్ధ మతాన్ని స్వీకరించినప్పటికీ, శకులలో మాత్రం బౌద్ధ మతస్థులూ వైదిక యతానుయాయులూ ఉన్నారు. వీరు హిందూ పేర్లను గ్రహించారు. హిందూ ధర్మాన్ని ఆచరించారు. స్థానిక రాజ కుటుంబాలతో వివాహసంబంధాలు ఏర్పరచుకొన్నారు (ఆంధ్రుల చరిత్ర - సంస్కృతి, మొదటిభాగం, పుట 123).

## 21.4.2 కుటుంబ వ్యవస్థ

సమిష్టి కుటుంబ వ్యవస్థ ఆనాడు సాధారణమని శాసనాల వల్ల స్పష్టమవుతుంది. తండ్రి తరవాతి స్థానం తల్లిది. దీనివల్ల ఆనాడు పితృస్వామ్య వ్యవస్థ అమలులో ఉన్నట్లు భావించవచ్చును. గృహయజమాని కుటుంబ సభ్యులతో కలిసి తీర్థయాత్రలు చేయడం, అక్కడి దైవాలకు గాని, ఆరామాలకు గాని, దానం చేయడం పరిపాటి. కుటుంబ వ్యవస్థలో తండ్రిది ప్రధాన స్థానం.

అంతఃపుర స్త్రీలు రాజవ్యవహారాల్లో పాల్గొనేవారు. నాగానిక, బాల శ్రీలు రాజవ్యవహారాల్లో పాల్గొనేవారు. భర్తల బిరుదులను, ఉద్యోగ నామాలను స్త్రీలు వాడుకోవటం కూడ వాడుకలో ఉంది. భోజికి, సేనాపతిని, మహారథిని వంటివి నాటి శాసనాలలో కన్పిస్తున్నాయి (ఆంధ్రుల చరిత్ర, పుట 82) స్త్రీలకు స్వంత ఆస్తులుండేవి. కాబట్టే వారు స్వయంగా దేవాలయాలకు ఆరామాలకు దానం చేసేవారు. ఆనాటి సంపన్న స్త్రీలు విద్యావంతులు. సంగీత నాట్యాలలో నేర్పరులు. వీణావాదనాదులచే అతిథులను ఆనందింపచేసేవారు. సభలలో చర్చలలో పాల్గొనేవారు. కొందరు గాథలను రచించిన కవయిత్రులు కూడా ఉన్నారు. అణులచ్ఛి, అసులద్ధి, పహయీ భేజ్జా, మాధవి, రేవా, రోహా, వద్ధావహీ. చోహా, ససిప్పహా మొదలైన స్త్రీలు గాథలను రచించారు. (శాలివాహన గాథాసప్తశతీసారం, రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ అనువాదం) సామాన్య గృహిణులు తమ భర్తలకు దైనందిన కార్యకలాపాలలో సహాయపడేవారు. నాటి ప్రభువులు అనేక మంది భార్యలను కలిగి ఉండేవారు. మాతృనామాన్ని ధరించటం ఈ కారణం చేతనే వ్యాప్తిలోనికి వచ్చి ఉంటుంది (ఆంధ్రుల చరిత్ర, పుట 82). గాథాసప్తశతి వల్ల, అమరావతీ శిల్పాలవల్ల నాటి సామాజిక వ్యవస్థ స్పష్టంగా తెలుస్తుంది.

## 21.4.3 విద్యలు, కళలు

శాతవాహన ప్రభువులు శబ్ద, అర్థ, గణక, న్యాయ, వ్యవహార విధి, లేఖ, రూప, గాంధర్వ విద్యలలో నిపుణులు.

ఆనాడు బ్రాహ్మణ గృహం ఒక గురుకులం. బౌద్ధవిహారమొక విద్యాలయం. ధాన్యకటక శ్రీపర్వతాలలో విశ్వవిద్యాలయాలుండేవి. బౌద్ధులు మత విద్యతోపాటు తర్క, అర్థ, జ్యోతిష, సాముద్రిక శాస్త్రాలను కూడ అధ్యయనం చేసేవారు.

శాతవాహనుల కాలంలో శాసనాలు ప్రాకృతంలోను బ్రాహ్మీలిపిలోను ఉండేవి. ప్రాకృతం రాజభాష. ఆనాటి విద్యావంతులు బౌద్ధమత గ్రంథాలను ఈ భాషలోనే రచించారు. గాథాసప్తశతి వలన పెక్కుమంది కవులు కవయిత్రులు ఉండేవారని తెలుస్తుంది. శాతవాహనుల కాలంలోనే ప్రాకృతభాషకు బదులుగా సంస్కృత భాషను వాడడం ప్రారంభమైంది. నాగార్జునాచార్యుడు, ఆర్యదేవుడు తమ గ్రంథాలను సంస్కృతంలోనే రచించారు. నాగార్జునాచార్యుని "సుహృల్లేఖ" మిక్కిలి జనాదరణ పొందింది. ఈ సంస్కృత ప్రాకృత భాషలతోబాటు "దేశి" కూడ ఉండినట్లు బృహత్కథ వల్ల తెలుస్తుంది.

శాతవాహనుల అనంతరం వచ్చిన రాజులు విద్యాపోషకులు. నాడు వేంగీ, కాంచీనగరాలు విద్యా నిలయాలు. ఆనాటి ప్రభువులు "ఘటిక" లను స్థాపించారు. ఈ ఘటికలలో చతుర్దశ విద్యలు నేర్పేవారు. "ఇందుపూరు ఘటిక" (తుమ్మెయనూరు శాసనం). అనంతపురం జిల్లాలోని హెండేరులోని "నొనందీశ్వరాలయ ఘటిక" మొదలైన వాని ప్రసక్తి నాటి శాసనాలలో కన్పిస్తుంది.

శాతవాహనుల కాలంలో ఆంధ్రదేశం శిల్పకళా నిలయం. గాథాసప్తశతిలో గౌరి, గణపతి, ఇంద్రాది దేవతల ఆలయాల ప్రస్తావన ఉంది. శాతవాహనుల కాలానికి చెందిన శిల్పం కేవలం బౌద్ధ నిర్మాణాలకు చెందిందే. ఈ



BRAOU

బౌద్ధ నిర్మాణాలలో ముఖ్యం స్థూప చైత్యవిహారాలు. బుద్ధుని శరీర అవశేషంపైగాని, ప్రసిద్ధ బౌద్ధాచార్యుని శరీర అవశేషంపైగాని నిర్మించిన స్మారక చిహ్నాన్ని స్థూపం అంటారు. అమరావతి, జగ్గయ్యపేట, భట్టిప్రోలులలో గల స్థూపాలు మిక్కిలి ప్రాచీనం. ఇందులో అమరావతి స్థూపం పేర్కొనదగినది. ఈ స్థూపం వ్యాసం 162 అడుగులు. దానిపైని అడ్డం వ్యాసం 142 అడుగులు. అమరావతి స్తూప శిల్పానికి బుద్ధ జాతక కథలు, సామాన్య జీవిత దృశ్యాలు ఇతివృత్తం. ఈ అమరావతీ శిల్ప నిర్మాణంలో తెలుగుశిల్పి చూపించిన నేర్పరితనం "అమరావతీరీతి" అనే పేరు సంపాదించి పెట్టింది. చైత్యంగాని బుద్ధుని విగ్రహంగాని ఉండి నిత్యార్చనకుపయోగించే ఆలయాన్ని చైత్యాలయం అంటారు. గుంటుపల్లి సంఘారామాలో ఇటువంటివి ఉన్నాయి. వర్షాకాలంలో బౌద్ధ భిక్షువులు నివసించటానికి వీలుగా నిర్మించిన వాటిని "విహారాలు" అంటారు. ఇవి సంఘార గుంటుపల్లిలో ఉన్నాయి.

ఆనాడు చిత్రలేఖనం వ్యాప్తిలో ఉంది. ఆనాటివారు గోడలమీద రామాయణ భాగవతాది పురాణ గాథలను చిత్రించుకొన్నట్లు గాథీసప్తశతివల్ల తెలుస్తుంది.

శాతవాహన సామ్రాజ్యానంతర కాలంలో బౌద్ధ నిర్మాణాలు క్రమంగా తగ్గుముఖం పట్టాయి. ఇక్ష్వాకుల కాలంలో శ్రీపర్వతం, జగ్గయ్యపేట, రామిరెడ్డిపల్లి వంటి బౌద్ధ క్షేత్రాలలో స్తూప విహార మంటపాల నిర్మాణం జరిగింది. మొగల్రాజపురం, బొజ్జన్నకొండ, భైరవకొండ, విజయవాడ ఉండవల్లి గుహాలయాలు ఈ కాలానికి చెందినవే. అమరావతీ శిల్పరీతి నాగార్జున కొండ బౌద్ధ శిల్పాలలో పరిణతి చెందింది. ఉండవల్లి గుహాలయ శిల్పాలలో నాగార్జున కొండ శిల్ప విధానం కన్పిస్తుంది.

ఇక్ష్వాకు ప్రభువైన ఎహువల ఛాంతమూలుని కాలం (క్రీ.శ. 275) నుండి దేవాలయాలు అధికం అయ్యాయి. నాగార్జున కొండలోనే కార్తికేయ, పుష్పభద్ర, హారతి, అష్ట భుజస్వామి, నవగ్రహాలయ శిథిలాలు కన్పించాయి. ఆనాటివారు ఏలేశ్వరం, వేల్పూరు, వేంగీ మొదలైన స్థలాలలో దేవాలయాలను నిర్మించారు.

వైదిక మతంలో వలెనే బౌద్ధమతంలో కూడ కర్మకాండ ఏర్పడింది. బహుదేవతారాధన ఏర్పడింది. బౌద్ధంలో నైతిక విలువలు, నియమాలు లోపించాయి. కాలక్రమంలో బౌద్ధం వైదిక మతంలో భాగం కాసాగింది. దీనితో బౌద్ధుల చైత్యాలయాలు హిందూమత స్థావరాలుగా మార్పుచెందుతాయి (ఆంధ్రుల సంస్కృతి, చరిత్ర, మొదటి భాగం, పుట - 144). చేజెర్లలోని చైత్యాలయం కపోతేశ్వరాలయంగా పరివర్తన చెందింది.

BRAOU

### 21.4.4 మతం

ఆంధ్రదేశంలో శాతవాహనుల కాలంలో జైన, వైదిక మతాలు ప్రచారంలో ఉన్నాయి. వైదికమతంలోని లోపాలను ఆధారం చేసికొని బౌద్ధ, జైన మతాలు ఏర్పడటంతో వైదికమతం తన పూర్వ వైభవాన్ని కోల్పోయింది. అటువంటి సమయంలో వైదిక మతాభిమానులైన శాతవాహనులు ఆ మత సంరక్షణకు పూనుకొన్నారు. శాతవాహనులలో మొదటిరాజు జైన మతాభిమాని కాని తరువాతి కాలంలో వైదికమతాభిమాని అయ్యాడు. ఇట్లే మిగిలిన శాతవాహనరాజులు కూడ వైదిక మతానుయాయులయినప్పటికీ బౌద్ధ మతస్థులకు దానాలు చేసినట్లు తెలుస్తుంది.

క్రీ.పూ. 4వ శతాబ్దానికి ఆంధ్రదేశంలో బౌద్ధం వ్యాపించినట్లు భట్టిప్రోలు స్తూపం వల్ల తెలుస్తుంది. అశోకుడు మహాదేవుడనే భిక్షుకుని మతప్రచారం కోసం ఆంధ్రదేశానికి పంపినట్లు తెలుస్తుంది. ఆనాటినుండి బౌద్ధం ఆంధ్రులకు ఎంతో ఆదరపాత్రమైంది. తరువాతి కాలంలో బౌద్ధంలో హీనయానం, మహాయానం అనే వర్గాలేర్పడ్డాయి. ఆంధ్రదేశంలో మహాయానం లేక మాధ్యమికవాదం వ్యాపించింది. ఆచార్య నాగార్జునుడీ మాధ్యమిక వాదానికి చెందినవాడు (ఆంధ్రుల-సంస్కృతి, చరిత్ర మొదటి సంపుటం, పుట 126). ఈయన వేద విద్యాపారంగతుడు. కాని బౌద్ధధర్మాన్ని స్వీకరించి శ్రీపర్వత సంఘారామంలో తన నివాసాన్ని ఏర్పాటు చేసికొన్నాడు. ఈయన మహాముని, బోధిసత్వుడని బౌద్ధుల భావన. ఈయన వేదాంత, తర్క, రసాయన, వృక్ష, వైద్యశాస్త్రాలు తెలిసినవాడు. ఒక శాతవాహన రాజు సంఘారామాన్ని నిర్మించి ఇచ్చాడు. ఈ శాతవాహనరాజు యజ్ఞశ్రీ శాతకర్ణి అని చారిత్రకుల అభిప్రాయం. ఈ సంఘారామంలో అనేకమంది బౌద్ధ భిక్షుకులు తత్త్వ వివేచనం చేస్తూ ఉండేవారు. ఆనాటి వర్తకులు బుద్ధ సంఘారామాలకు విరివిగా దానాలు చేసినట్లు యజ్ఞశ్రీ శాతకర్ణి కాలంనాటి కన్హేరి శాసనంవల్ల తెలుస్తుంది.

నాగార్జునుని కాలంనుండి బౌద్ధులలో విగ్రహారాధనం, బుద్ధ ప్రతిమలను పూజించడం సర్వసామాన్య విషయమైంది. ఆ కాలంవారు పరివ్రాజకులను పూజించటం, ఆరామాలకు విహారాలకు దానం చేయటం,

ఒకవైపున, మరోవైపున కులదేవతలను పూజించటం, గ్రామదేవతలకు బలులివ్వటం మరోవైపున చేసేవారు. ఇది బౌద్ధ వైదిక ధర్మాలమధ్య తత్త్వ సంఘర్షణ జరుగుతూన్న కాలం. శాతవాహన ప్రభువులు మతసహనంతో ఉండేవారు. సంఘర్షణలు తీవ్రరూపం ధరించకుండా చూచేవారు.

శాతవాహనుల అనంతరం క్రీ.శ. 300 ప్రాంతాలలో బౌద్ధమతం రాజానుగ్రహాన్నీ ప్రజానుగ్రహాన్నీ పొందింది. కాని మహాయానశాఖవల్ల బౌద్ధమతంలో భక్తిమార్గం ఏర్పడింది. ఈ కాలంలో బుద్ధుడొక దైవంగా పరిణతి చెందాడు. అనేకమంది దేవతలు, వారికి భార్యలు ఈ మతంలో వెలసారు. వైదికమతంలోని దేవతలకూ, బౌద్ధమతంలోని దేవతలకూ భేదం సామాన్య ప్రజలకు తెలిసేది కాదు. కాలక్రమంలో బుద్ధుడు దశావతారాలలో ఒక అవతారంగా మార్పు చెందాడు. ఈ కాలంలోనే వజ్రయాన మనే కొత్తవిధానం ఏర్పడింది. తాంత్రికపూజలు, రహస్య క్రియాకలపాలు ఇందులో ఉండేవి. తరువాత మధుమాంస వినియోగం, శక్తిపూజలు మొదలయ్యాయి. బౌద్ధసన్యాసుల నైతిక పతనం బౌద్ధమత పతనానికి దారితీసింది. ఈ మతం తెలుగుదేశంలో నామరూపాలు లేకుండా పోయింది.

శాతవాహనుల కాలంలో వైదిక మతం కూడ వ్యాపించింది. శాతవాహన ప్రబువులు వైదిక మతానురక్తులైనా దానధర్మాలనూ, యజ్ఞయాగాలనూ చేసేవారు. శకయవన పహ్లవులలో కొందరు వైదిక మతానుయాయులు. దీనితో ఈ మతానికి గొప్ప అండ లభించింది.

శాతవాహన రాజుల అనంతర కాలంలో వైదిక మతం మిక్కిలిగా వ్యాపించింది. ఇక్ష్వాకుల కాలంలోనూ, పల్లవుల కాలంలోనూ, బృహత్పలాయనుల కాలంలోనూ వైదిక మతం వృద్ధి చెందింది. బృహత్పలాయన ప్రభువు జయవర్మ మహేశ్వర పాదపరిగ్రహీతుడని కొండముది శాసనం వల్ల తెలుస్తుంది. ఆనందగోత్రిక ప్రభువు కందరుడు కపోతేశ్వరాలయాన్ని పునర్నిర్మించాడు. శాలంకాయనులు పరమ మాహేశ్వరులు, పరమ భాగవతులయినప్పటికీ మత సహనం కలవారు. వేంగిలోని చిత్రరథస్వామి ఆలయం, సాలూరులోని విష్ణుగ్రహస్వామి ఆలయం ఆనాడు ప్రసిద్ధాలు. విష్ణుకుండిన ప్రభువులు శ్రీ మల్లికార్జున భక్తులు. ఈ విష్ణుకుండిన ప్రబువులు బౌద్ధుల ఆరామ నిర్మాణాలను చూసి పర్వతాలలో గుహలను తొలిపించారు. వీనిలో కొన్ని శివాలయాలు, కొన్ని విష్ణ్వాలయాలు. ఇటువంటి ఆలయాలు బెజవాడ వద్ద ఇంద్రకీలాద్రిమీద, మొగల్రాజపురంలోను, ఉండవల్లి, నెల్లూరు జిల్లాలోని భైరవుని కొండవద్ద ఉన్నాయి.

ఈ కాలంలో "బ్రాహ్మణులూ, వారి దేవాలయాలూ అంతకంతకూ ప్రజలకు దగ్గరవుతూ వుంటే, శ్రమణులు, వారి విహారాలూ ఉత్పత్తి రంగానికి దూరమవుతూ అనుభవైకపరులుగా, సమాజంమీద ఉద్దరిగా బతికేసే బదనికలయ్యారు." (ఆంధ్రుల సంస్కృతి-చరిత్ర, మొదటిభాగం, పుట-142) ఈ కాలంలోని దేవాలయాల వాస్తు శిల్పాన్ని చూస్తే అవి బౌద్ధవిహారాల శిల్పాన్ని పోలి ఉన్నాయి. అమరావతి, రామతీర్థం, అనకాపల్లి మొదలైన బౌద్ధవిహారాలు హిందూక్షేత్రాలుగా పరివర్తన చెందాయి. దీనికి కారణం ఆనాడు బౌద్ధ మతానికి వైదిక మతానికి అంతరం తగ్గటం, సంఘర్షణలు ఏర్పడటం.

ఈ మతం విష్ణుకుండినుల కాలం వరకు వ్యాప్తిలో ఉండి, వారి కాలంలోనే తన ప్రాభవాన్ని పోగొట్టుకుంది. జైనవిగ్రహాలీనాటికీ తూర్పుగోదావరి జిల్లాలోని తాటిపాక, నేరుమూరు గ్రామాలలోనూ, తెలంగాణా ప్రాంతంలోని హనుమకొండలోనూ ఉన్నాయి.

కాలగతిలో బౌద్ధ జైనమతాలు ప్రాముఖ్యాన్ని కోల్పోయి నామమాత్రావశేషాలు కాగా, వైదికమతం తెలుగుదేశంలో తన స్థానాన్ని సుస్థిరం చేసికొంది.

### 21.4.5 ఆచార వ్యవహారాలు

ఈ కాలంవారి ఆచార వ్యవహారాలు, వేషధారణ నాటి శిల్పాలలో ప్రతిఫలిస్తుంది. ఆనాడు స్త్రీ పురుషులు చాల తక్కువగా దుస్తులను ధరించేవారు. స్త్రీలు వక్షస్థలాన్ని అనాచ్ఛాదితంగా ఉంచేవారు. స్త్రీ పురుషులు అలంకరణ ప్రియులు. చెవులకు కమ్మలను, కంఠానికి హారాలను, మోచేతుల వరకు కంకణాలను, పాదాలకు అందెలను ధరించేవారు. ముత్యాలను, పగడాలను, రత్నాలను వాడేవారు. కేశాలంకరణలో చాలా శ్రద్ధ తీసుకునే వారు. కొందరు స్త్రీలు జుట్టును చుట్టగా చుట్టుకొని లేదా జడను వేసికొని లేదా ప్రక్కలకు జుట్టును ముడివేసి కొని కొప్పులాగా అలంకరించుకొనేవారు. పురుషులు తలపాగను లేక శిరోభూషణాలను ధరించేవారు. ఆ కాలంలో పూర్తి అలంకృతాలైన తలపాగాలు కూడ ఉండేవి.



BRAOU

స్త్రీలు శరీర సౌందర్యపోషణలో ఎంతో శ్రద్ధ చూపేవారు. స్నాన సమయంలో పసుపును తరుచుగా వాడేవారు. పాదాలకు పారాణిని రాసికొనేవారు. వర్తకులు "అరదళా"న్ని ఉపయోగించేవారు. అద్దాలు, దువ్వెనలు, తలపిన్నులు ఆనాడు వాడుకలో ఉండేవి.

జనపదాలలో, నగరాలలో నాట్యం మిక్కిలి ప్రాచుర్యాన్ని పొందింది. నృత్యం వాద్యయుక్తం, వీణ, వేణువు, మృదంగం, శంఖం అధిక ప్రచారం పొందిన వాద్యాలు. అమరావతి శిల్పాలలో వివిధ నృత్య భంగిమలు కన్పిస్తాయి. ఐశ్వర్యవంతులు చిలుకలను పెంచేవారు. గాథాసప్తశతివల్ల ఆనాటి సంపన్నులు విలాసవంతమైన జీవితాన్ని గడిపేవారని తెలుస్తుంది.

### అవగాహన ప్రశ్న

1. క్రీ.పూ. 200 – క్రీ.శ. 600 మధ్య కాలం నాటి వర్ణ వ్యవస్థను గురించి 10 వాక్యాల్లో తెల్పండి.

## 21.5 సారాంశం

ఈ భాగం ద్వారా మీరు తెలుసుకున్న అంశాలు :

- క్రీ.పూ. 200 – క్రీ.శ. 600 దశలోని పాలకులు తమ రాజ్యాలను పరిపాలన సౌకర్యం కోసం వివిధ భాగాలుగా చేసి, అధికారుల సహాయంతో రాజ్యమేలారు. రాజే సర్వతంత్ర స్వతంత్రుడు.
- వ్యవసాయం మీద ఆధారపడిన భూమి పన్నే ప్రభుత్వాలకు ముఖ్యమైన ఆదాయం వృత్తి పన్నులుండేవి. గ్రామీణ వృత్తిగతమైన చేతిపరిశ్రమలే నాటి పరిశ్రమలు, వర్తక వాణిజ్యాలుండేవి.
- మత వ్యవస్థ, వర్ణ వ్యవస్థ చాలా సంకీర్ణంగా ఉండేది.

### అవగాహన ప్రశ్నకు జవాబు

1. వృత్తులను అనుసరించి వివిధ వర్ణాలు, వాటిలో కులాలు ఉండేవి. వర్ణ సాంకర్యం ఉండేదనటానికి సాక్ష్యం, గౌతమీపుత్ర శాతకర్ణి తాను వర్ణ సాంకర్య మేర్పడకుండా చూసినట్లు చెప్పుకోవటమే. పైగా శకులు, యవనులు స్థానిక ప్రజలతో కలవటంవల్లా, బౌద్ధ, జైన మతాల ప్రభావం హిందూమతంపై ప్రసరించడంవల్లా నాలుగు వర్ణాల వ్యవస్థ, దాని ధర్మాలు నిర్దిష్టంగా లేవు. యవనులు బౌద్ధం పుచ్చుకున్నారు. శకులలో బౌద్ధ మతస్థులూ, హిందూ మతానుయాయులూ కన్పిస్తారు. హిందువుల పేర్లు పెట్టుకొని, వారి ఆచార వ్యవహారాలను పాటించారు. స్థానిక రాజకుటుంబాలతో ఏర్పరచుకున్న వివాహ సంబంధాలవల్ల ఈ సంకీర్ణత పాలకుల్లో కన్పిస్తుంది. ప్రజల్లో కులవ్యవస్థ కన్పిస్తుంది.

### చదవదగిన పుస్తకాలు


తెలుగుభాషా చరిత్ర : భద్రిరాజు కృష్ణమూర్తి (సం)

ఆంధ్ర సాహిత్య చరిత్ర : పింగళి లక్ష్మీకాంతం

ఆంధ్ర వాఙ్మయ చరిత్ర : డా. దివాకర్ల వేంకటావధాని

ఆంధ్ర వాఙ్మయారంభ దశ (1, 2 భాగాలు) : డా. దివాకర్ల వేంకటావధాని




BRAOU

ఆంధ్ర ప్రబంధములు – అవతరణ వికాసాలు : డా. కొర్లపాటి వెంకట రామ నరసింహము
సమగ్రాంధ్ర సాహిత్యం : ఆరుద్ర
తంజావూరాంధ్ర సాహిత్య చరిత్ర : డా.కె. సత్యవతి
ఆంధ్ర ద్విపదసాహిత్య చరిత్ర : డా.టి. సుశీల
ద్విపద వాఙ్మయము : డా. జి. నాగయ్య
దాక్షిణాత్య శిల్ప సమీక్ష : డా. జి. నాగయ్య
పురాణ వాఙ్మయము : డా. జి.వి. సుబ్రహ్మణ్యం
బ్రౌన్‌లేఖలు : బంగోరె (సం)
మహోదయం : కె.వి. రమణారెడ్డి
ఆధునికాంధ్ర కవిత్వము : డా.సి. నారాయణ రెడ్డి
తెలుగులో కవితా విప్లవాల స్వరూపం : డా. వెల్చేరు నారాయణ రావు
తెలుగు కవితా వికాసం (1947–1980) : డా. కడియాల రామమోహన రావు
సాహిత్య విమర్శ – పరామర్శ : చేకూరి రామారావు
సారస్వత ప్రయోజనం : రాచమల్లు రామచంద్రారెడ్డి
ఆధునిక తెలుగు సాహిత్యంలో విభిన్న ధోరణులు : డా.కె.కె. రంగనాథాచార్యులు (సం)
తెలుగులో తొలి సమాజ కవులు : డా.కె.కె. రంగనాథాచార్యులు (సం)
తెలుగు సాహిత్యం – మరో చూపు : డా.కె.కె. రంగనాథాచార్యులు (సం)
మహతి : యువభారతి సమీక్షా వ్యాస సంకలనం

## మాదిరి పరీక్షా ప్రశ్నలు

I. కింది ప్రశ్నలకు 30 వాక్యాలకు మించకుండా సమాధానాలు రాయండి.

1. క్రీ.పూ. 200–600 వరకు గల ఆర్థిక పరిస్థితులను వివరించండి.
2. క్రీ.పూ. 200–600 వరకు గల సామాజిక జీవితాన్ని పరామర్శించండి.

II. కింది ప్రశ్నలకు పది వాక్యాలకు మించకుండా సమాధానాలు రాయండి.

1. క్రీ.పూ.200–600 వరకూ గల మతపరిస్థితులను వివరించండి.
2. క్రీ.పూ. 200–600 వరకూ గల [illegible] వ్యవహారాలను విశ్లేషించండి.

BRAOU

BRAOU

# భాగం–22 తెలుగు సంస్కృతి పూర్వదశ II
## (క్రీ. శ. 600–1000)

విషయక్రమం


22.0 లక్ష్యాలు

22.1 పరిచయం

22.2 రాజకీయ చరిత్ర

22.3 పాలనా వ్యవస్థ

22.4.0 ఆర్థిక పరిస్థితులు

22.4.1 వ్యవసాయం

22.4.2 పరిశ్రమలు

22.4.3 వాణిజ్యం

22.5.0 సామాజిక జీవనం

22.5.1 వర్ణవ్యవస్థ

2.5.2 విద్య, సాహిత్యం

22.5.3 కళలు

22.5.4 వేడుకలు, వినోదాలు

22.5.5 మతం

22.5.6 ఆచార వ్యవహారాలు

అవగాహన ప్రశ్న

22.6 సారాంశం

అవగాహన ప్రశ్నలకు జవాబు

చదవదగిన పుస్తకాలు

మాదిరి పరీక్షా ప్రశ్నలు


## 22.0 లక్ష్యాలు

క్రీ. శ. 600 నుండి క్రీ.శ. 1000 వరకు రాజకీయ చరిత్రలో ప్రాముఖ్యం వహించిన తూర్పు చాళుక్యుల రాజులకాలంలో తెలుగు భారతావతరణం వరకు గల సంస్కృతీ విశేషాలను ఈ భాగం చదివిన తర్వాత అనుశీలించగలుగుతారు.

## 22.1 పరిచయం

ఈ భాగంలో వివరిరంచిన దశలో తూర్పు చాళుక్య వంశపు రాజులు ప్రాముఖ్యం వహించారు. వీరు ఆంధ్ర దేశాన్ని 5 శతాబ్దాలకాలం పరిపాలించారు. వీరు బాదామి చాళుక్య వంశీయులు. చరిత్ర రచనలో ఆంధ్రదేశాన్ని పాలించిన వీరిని తూర్పు చాళుక్యులని వ్యవహరిస్తారు. బాదామి, కల్యాణీ నగరాలనుండి పాలించినవారిని పశ్చిమ చాళుక్యులని వ్యవహరిస్తారు. వీరుగాక ఆంధ్రదేశంలో, వేములవాడ, చాళుక్యులు, ముడిగొండ చాళుక్యులు అనే వారు కూడా ఉన్నారు.

తూర్పు చాళుక్యులు తీరాంధ్ర ప్రాంతాన్ని పాలించారు. ప్రాగ్దక్షిణాంధ్ర ప్రాంతాన్ని అంటే నేటి రాయలసీమ ప్రాంతాన్ని పల్లవ రాజ్యంలోని బాణవైదుంబులు పాలించారు. వారి రాజ్యం తర్వాత చోళ రాజ్యంలో



BRAOU

కలిసిపోయింది. మిగిలిన భాగాన్ని అంటే నేటి తెలంగాణాను పశ్చిమ చాళుక్యులూ, రాష్ట్రకూటులూ వశపరచుకున్నారు. దక్షిణాధిపత్యం కోసం తరచుగా యుద్ధాలు జరిగాయి. తూర్పు చాళుక్యులు నిలదొక్కుకుని తెలుగు భాషను ఆదరించటానికి రూపురేఖలు దిద్దారు. ఈ విశేషాలను ఈ భాగంలో చదవండి.

## 22.2 రాజకీయ చరిత్ర

తూర్పు చాళుక్యుల పరిపాలనను మూడు ప్రధాన ఘట్టాలుగా విభజించవచ్చు. మొదటి ఘట్టం క్రీ.శ. 615 నుండి క్రీ.శ. 753 వరకు. రెండో ఘట్టం క్రీ.శ. 753 నుండి క్రీ.శ. 973 వరకు. మూడో ఘట్టం క్రీ.శ. 973 నుండి 1076 వరకు. మొదటి ఘట్టంలో వేంగీరాజ్యం ప్రశాంతతను అనుభవించింది. రెండో ఘట్టంలో నిరంతర సంగ్రామాల వాడినీ, వేడినీ రుచి చూచింది. మూడో ఘట్టంలో చోళులతో సంబంధ బాంధవ్యాలను ఏర్పరచుకోవటం, ఒకరి  కొకరు సహాయం చేసుకోవటం, చివరకు చాళుక్య చోళరాజ్యాలు కలిసిపోవటం జరిగింది. ఒకే వంశంవారయిన్పటికీ తూర్పు, పశ్చిమ చాళుక్యులు తమ రక్తసంబంధాన్ని కూడా మరచి పరస్పరం కలహించుకోవటం కూడా ఈ ఘట్టంలోనే జరిగింది. పశ్చిమ చాళుక్యులు వేంగిని తమ రాజ్యంలో కలుపుకోవాలనుకోవటం వల్లనే ఉభయులకు వైరం ఏర్పడింది. చివరకు రెండు కుటుంబాల మధ్య రాజకీయ సంబంధం మాత్రమే మిగిలింది.

తూర్పు చాళుక్యవంశ స్థాపకుడు కుబ్జవిష్ణువర్ధనుడు. ఈయనకు విషమసిద్ధి అనే బిరుదు ఉంది. ఈయన భార్య అయ్యణ మహాదేవి, జైనమతాభిమాని. ఈయన పరమభాగవతుడు. తరువాత ఆయన కుమారుడు జయసింహ వల్లభుడు పరిపాలించాడు. ఈయనకు సర్వలోకాశ్రయ, విజయసిద్ధి అనే బిరుదులున్నాయి. సంతానం లేకపోవటంవల్ల సోదరుని పౌత్రుడగు 'మంగి'ని ఈయన యువరాజుగ నియమించుకొన్నాడు. జయసింహవల్లభుని తర్వాత ఇంద్రభట్టారకుడు ఏడురోజులు పరిపాలించినట్లు చారిత్రకుల అభిప్రాయం. ఆ తర్వాత రెండవ విష్ణువర్ధనుడు పాలించాడు. ఈయన పరమమహేశ్వరుడు. పిదప ఈయన కుమారుడు మంగి పాలించాడు. ఈయనకు విజయసిద్ధి అనే బిరుదు ఉంది. ఈయన కుమారుడు రెండో జయసింహుడు పరిపాలించాడు. ఈయన తరువాత సోదరుల మధ్య అంతఃకలహాలు ఏర్పడి కనిష్ఠ సోదరుడు 'కొక్కిలి' సింహాసనాన్ని ఆక్రమించాడు. సోదరుల మధ్య సంఘర్షణ జరగడంతో కొక్కిలి, ఎలమంచిలి ప్రాంతానికి పాలకుడయ్యాడు. ఎలమంచిలి కొక్కిలివంశీయులు మూడు తరాల వరకు మంగిపద్మ, వినయాదిత్యవర్మ, శ్రీ కొక్కిలివర్మ పాలించారు. మూడో విష్ణువర్ధనుడు తరువాత కొద్ది కాలానికే సింహాసనాన్ని ఆక్రమించాడు. ఈయన జైనులను, బ్రాహ్మణులను సమదృష్టితో ఆదరించాడు. పిదప ఈయన కుమారుడు మొదటి విజయాదిత్యుడు పాలించాడు. ఈ కాలంలోనే రాష్ట్రకూటులు దంతిదుర్గుని ఆధ్వర్యంలో బాదామి చాళుక్యులను అంతమొందించారు. తూర్పు చాళుక్యులు, రాష్ట్రకూటులు ఎప్పుడూ యుద్ధాలలో మునిగి ఉండేవారు మొదటి విజయాదిత్యునకు "త్రిభువనాంకుశ" బిరుదం ఉండేది. ఈ బిరుదాన్ని అర్వాచీన చాళుక్య ప్రభువులు వంశపారంపర్యంగా ధరించారు. పిదప ఈయన కుమారుడు నాలుగో విష్ణువర్ధనుడు పాలించాడు. ఈతనికాలంలో రాష్ట్రకూటులతో వైరం కలిగింది. రాష్ట్రకూట ప్రభువు ధ్రువుడు వేంగిపై యుద్ధాన్ని ప్రకటించాడు. ఈ యుద్ధంలో విష్ణువర్ధనుడు ఓడిపోయాడు. రాష్ట్రకూటులు సార్వభౌమత్వాన్ని అంగీకరించాడు. తన కుమార్తె శీలమహాదేవిని ధ్రువునకిచ్చి వివాహం జరిపించాడు. ధ్రువుని మరణానంతరం తిరిగి రాష్ట్రకూటులలో అంతఃకలహాలు కలిగాయి. దీనిని ఆసరాగా తీసికొని నాలుగో విష్ణువర్ధనుడు రాష్ట్రకూటులకు కప్పం కట్టడం మానివేశాడు. ఈయన అనంతరం వేంగిలో అంతఃకలహాలు కలిగాయి. నాలుగో విష్ణువర్ధనుని పెద్ద కుమారుడు విజయాదిత్యుడు పండెండు సంవత్సరాలు యుద్ధంచేసి శత్రువుల నోడించి వేంగీ సింహాసనాన్ని అధిష్ఠించాడు. ఈతడు రాష్ట్రకూటులను కూడా ఓడించాడు. విజయాదిత్యునకు నరేంద్ర మృగరాజు, చాళుక్యార్జునుడు మొదలైన బిరుదులున్నాయి. ఈ రెండో విజయాదిత్యుకు నూట యెనిమిది స్థలాలలో శత్రువులతో యుద్ధాలు చేశాడు. ఆ స్థలాలలో శివాలయాలను నిర్మించాడు. తరువాత ఈయన కుమారుడు ఐదో విష్ణువర్ధనుడు సంవత్సరం మాత్రమే పాలించాడు. ఈయన "కవి విష్ణువర్ధను" డనే ప్రసిద్ధికెక్కాడు. ఈయన అనంతరం మూడో విజయాదిత్యుడు పాలించాడు. ఈయననే గుణగ విజయాదిత్యుడు అంటారు. ఈయనకాలంలో వేంగీ సైన్యశక్తి పెరిగింది. తెలుగురాజుల పరాక్రమం గంగానది నుండి కావేరీనది వరకు పాకింది. ఈయనపాలన చాలవరకు యుద్ధాలలోనే గడిచింది. ఈయనకు పిదప సోదరకుమారుడు మొదటి చాళుక్య భీముడు పాలించాడు. ఈయనకాలంలో తిరిగి రాష్ట్రకూటులతో యుద్ధాలు జరిగాయి. ఈ యుద్ధాలలో

BRAOU

"ఇమర్తిగండ" అనే బిరుదున్న ఈయన కుమారుడు కొల్లభి, గండభాస్కర విజయాదిత్యుడు ఆరుమాసాలు పాలించాడు. ఈయన మరణానంతరం చాళుక్య సింహాసనం కోసం అంతఃకలహాలు కలిగాయి. రెండో యుద్ధ మల్లుడు సింహాసనాన్ని ఆక్రమించాడు. ఈయన రాష్ట్రకూటుల సాయంతో పరిపాలన సాగించాడు. రెండో చాళుక్య భీమరాజు రెండో యుద్ధమల్లుని ఓడించి రాజ్యాన్ని స్వాధీనపర్చుకొన్నాడు. ఈయన కుమారులలో ఒకడు అమ్మరాజు. ఈయన కొంతకాలం పాలించాడు. యుద్ధమల్లుని కుమారుడు తిరుగుబాటు చేసి రాజ్యంలోని కొంతభాగాన్ని ఆక్రమించాడు. అమ్మరాజు వారిని ఓడించి ఆ భాగాన్ని తిరిగి పొందాడు. తరువాత అన్నగారైన దానార్ణవుడు తమ్ముడగు అమ్మరాజును వధించి రాజ్యాన్ని ఆక్రమించాడు. రెండో అమ్మరాజు భార్య వైపు బంధువు జటాచోడ భీముడు. ఈయన దానార్ణవుని సంహరించి వేంగీ సింహాసనాన్ని ఆక్రమించాడు. దానార్ణవుని కుమారులు శక్తివర్మ, విమలాదిత్యులు కళింగకు పారిపోయారు. జటాచోడ భీముడు చోళులతో జరిగిన యుద్ధంలో మరణించిన వేళకు శక్తివర్మ వేంగీరాజ్యాన్ని స్వాధీనపర్చుకొన్నాడు.

తూర్పు చాళుక్యులు తీరాంధ్రాన్ని పాలిస్తే, బాణులు ఆంధ్రదేశపు నైరుతీ భాగంలోని శ్రీశైలం, శ్రీకాళ హస్తి - పాలార్ నదుల మధ్యగల ప్రాంతాన్ని పాలించారు. వీరి రాజధాని "పరివిపురి" వీరి రాజ్యాన్ని 'బాణపాడి' అని వ్యవహరించేవారు. ఈ వంశంలో విజయనంది వర్మ, మల్లదేవబాణుడు, విక్రమాదిత్యబాణుడు. రెండో విజయాదిత్యుడు ప్రసిద్ధులు. రెండో విక్రమాదిత్యుని తరువాత వీరు రాష్ట్రకూటులకు, ఉన్నతోద్యోగ్యులుగా ఉండినట్లు శాసనాలవల్ల తెలుస్తుంది.

దక్షిణదేశంలో ఎనిమిది పది శతాబ్దాలలో సుప్రసిద్ధులు నొలంబులు. వీరిని "నొలంబ పల్లవులు" అని కూడ వ్యవహరిస్తారు. అనంతపురం, చిత్రదుర్గ, తుంకూరు దుర్గాలతో నొలంబవాడి ఏర్పడింది. అనంతపురంలోని 'హెంజేరు' వీరి రాజధాని. సింగిపోత పోలల్చోరనోలంబాధి రాజు, మహేంద్రాది రాజు ఈ వంశంలో పేర్కొనదగిన ప్రభువులు. మహేంద్రుని ప్రపౌత్రుడయిన నన్నినొలంబుని గంగ ప్రభువగు మూడో మూరసింహుడు వధించి 'నొలంబాంతక' బిరుదాన్ని ధరించాడు. నన్నినొలంబుని తరువాత నొలంబులు చోళ సామంతులై గంగులపై ప్రతీకారం తీర్చుకొన్నారు. కాలక్రమంలో నొలంబవాడి పశ్చిమ చాళుక్య రాజ్యంలో కలిసిపోయింది.

తొమ్మిదవ శతాబ్దంలో రేనాడు పాలకులు వైదంబులు. వీరు యుద్ధప్రియులు. వీరు బాణులకు సామంతులుగా నొలంబులతో పశ్చిమ గంగ ప్రభువులతో యుద్ధాలు చేశారు. ఈ వంశంలో గండ త్రినేత్రుడు, మనుజత్రినేత్రుడు ప్రసిద్ధులు. మనుజత్రినేత్రుని కాలంలోనే వైదుంబులపై చోళుల దండయాత్రలు ప్రారంభ మయ్యాయి. వైదుంబులు చోళులతో సంధి చేసుకొన్నారు. తరువాత రాష్ట్రకూటులకు సామంతులై ఉన్నతో ద్యోగాలు నిర్వహించారు. రాష్ట్రకూట సామ్రాజ్య పతనం జరిగాక వైదుంబులు తిరిగి రాజ్యాన్ని స్థాపించారు. కాని అది ఎక్కువ కాలం నిలువలేదు.

వేములవాడ చాళుక్యులు రాష్ట్రకూటుల సామంతులు. బోధన్, వేములవాడలను కేంద్రాలుగా చేసికొని పశ్చిమోత్తర ప్రాంతాన్ని పాలించారు. ఈ వంశస్థాపకుడు 'విక్రమాదిత్య యుద్ధమల్లుడు' ఈయన కుమారుడు అరికేసరి. ఈయన ప్రపౌత్రుడు ఒడ్డెన. ఈయన 'సోలద గండడు'. ఈయన పౌత్రుడు రెండో నరసింహుడు. ఈ శాఖలో చివరి వాడు మూడో అరికేసరి.

ముందిగొండ చాళుక్యులు కొరవిసీమలోని ముదిగొండ రాజధానిగా 'మంచికొండనాడు' పాలించారు. మంచికొండనాడులోని అంతర్భాగం కొరవిసీమ. వీరు తూర్పు చాళుక్యుల పట్ల విశ్వాసం కలవారు. వీరి మూల పురుషుడు రణవర్ధుడు. ఈయన కుమారుడు కుసుమాయుధుడు. ఈయన గుణగవిజయాదిత్య చాళుక్య భీములకు సమకాలికుడు. గుణగ విజయాదిత్యుని మరణానంతరం రాష్ట్రకూటులు కొరవిని ఆక్రమించగా వారిని పారదోలి కొరవిని తిరిగి స్వాధీనపర్చుకొన్నాడు. చాళుక్య భీముని సింహాసనంపై పునఃప్రతిష్ఠతుని చేశాడు. ఈ కుసుమాయుధుని కుమారులు గొణగయ్య, నిరవద్యుడు. నిరవద్యుడు ముదిగొండ సింహాసనాన్ని ఆక్రమించి నట్లు కొరవి శాసనం వల్ల తెలుస్తుంది. ఈయన అనంతరం గొగగయ్య సంతతివారే రాజ్యానికి వచ్చారు. ముది గొండ చాళుక్యుల బలాన్ని తగ్గించాలనే ఉదేద్దశంతో రాష్ట్రకూటులు 'కుర్రవాడి' ని సృష్టించి ఎర్రయ్య రాష్ట్ర కూటుని పాలకునిగా నియమించాడు. దీనితో ఈ రెండు రాజ్యాలకు సంఘర్షణలు జరిగేవి.

ఈ కాలంలో రాజకీయ ఐకమత్యం లేకపోవటంతో తెలుగుదేశంలో అరాచకం ఏర్పడింది.

BRAOU

## 22.3 పాలనా వ్యవస్థ

తూర్పు చాళుక్యుల కాలంనాటి పరిపాలనా వ్యవస్థ బాదామి చాళుక్యులకు సంబంధించిందే అయినప్పటికీ పొరుగున ఉన్న రాష్ట్రకూటుల, చోళుల పరిపాలన ప్రభావం కూడ ప్రసరించింది. స్థానిక అవసరాలకు అనుగుణంగా మార్పులు జరిగాయి. ఈ వ్యవస్థలో రాజు సర్వాధికారులు కలిగినవాడు. సంప్రదాయ సిద్ధమైన సప్తాంగాలతో రాజ్యాధికారం ఉండేది. (రాజు, మంత్రి, రాజ్యం, దుర్గం, కోశం, సైన్యం, మిత్రం అనేవి సప్తాంగాలు). అష్టాదశతీర్థులు రాజుకు పరిపాలనలో సహాయం చేసేవారు. ఈ అష్టాదశతీర్థుల ప్రసక్తి రెండో అమ్మరాజు మంగల్లు శాసనంలో ఉంది. మంత్రి, పురోహిత, సేనాపతి, యువరాజు, దౌవారిక, కర్మాంతిక, దండపాల, దుర్గపాల, అంతపాల - వీరు మంగల్లు శాసనం ప్రస్తావించిన అష్టాదశ తీర్థులు. (ఆంధ్రుల సంస్కృతి - చరిత్ర, మొదటి భాగం, పుట. 174). పరిపాలనా సౌలభ్యం కోసం శాఖలను ఏర్పరచారు. ఈ శాఖలను తీర్థులు నిర్వహించేవారు. రెండో అమ్మరాజు మచిలీపట్నం శాసనంలో ద్వాదశ స్థానాధిపతులు కన్పిస్తారు. వీరు 1. సామంత, 2. అంతఃపుర, 3. మహామాత్ర, 4. పురోహిత, 5. అమాత్య, 6. శ్రేష్ఠి 7. సేనాపతి, 8. శ్రీకరణ, 9. ధర్మాధ్యక్ష, 10. రాష్ట్రకూట ప్రముఖ మొదలైనవారు (ఆంధ్రుల సంస్కృతి - చరిత్ర, మొదటిభాగం, పుట 174). నాటి శాసనాలలో నియోగాధికృతులు రాజ్యపాలనలోనూ, దేవాలయ నిర్వహణలోనూ కన్పిస్తారు. బహుశా రాజ్యపాలన, దేవాలయ నిర్వహణ ఒకే పద్ధతిలో ఉండటంవల్ల ఈ విధంగా కనిపించవచ్చు.

తూర్పు చాళుక్యుల కాలంలో రాజ్యాన్ని "విషయం, కొట్టం" గా విభజించారు. ఈ విషయాన్ని పాలించడంలో అనేక అంతరువులలో ఉన్న నైయోగికులుండేవారని సర్వలోకాశ్రయుని చందలూరు శాసనంవల్ల తెలుస్తుంది. మన్నెయులు అనే మరో రకం రాజోద్యోగుల ప్రసక్తి కొన్ని శాసనాలలో కన్పిస్తుంది. వీరిని జిల్లాలను పాలించటానికి నియమించేవారు. వీరి విధులను గూర్చి వివరంగా తెలియటంలేదు.

రాయలసీమ, తెలంగాణా ప్రాంతాలను పాలించిన బాదామి చాళుక్యులు రాజ్యాన్ని రాష్ట్రాలుగా, విషయాలుగా విభజించారు. రాష్ట్ర పాలకుని రాష్ట్రాధికారి, విషయపతి అని వ్యవహరించేవారు. వీరి పాలనలో గ్రామ్యక, రాజ పురుష, తలవర, దండనాయక, రాష్ట్రిక, కూట, భట, నట, చేటక, పరిచారక, నియుక్త, అధ్యక్ష, ప్రశాస్త్రి, నాయక, సమాహరి అనే ఉద్యోగులుండేవారని రెండో విష్ణువర్ధనుని శాసనంవల్ల తెలుస్తుంది. (ఆంధ్రుల సంస్కృతి - చరిత్ర - మొదటి భాగం - పుట 174).

వేంగీ రాజ్యంలో ముప్పై విషయాలున్నట్లు శాసనాల వల్ల తెలుస్తుంది. ఆనాడు "విషయం, రాష్ట్రం, నాడు" అనేవి వాడుకలో ఉండేవి. ఉదాహరణకు కమ్మ రాష్ట్ర విషయం, అత్తిలినాడు విషయం, పులినాడు మొదలైనవి ఈనాటి గ్రామాలను "గ్రామేయకులు" "రాష్ట్రకూట ప్రముఖులు" నిర్వహించేవారు. ప్రతి గ్రామంలోను ఒక రాజప్రతినిధి రాజ్యవ్యవహారాలను చూచేవాడు. గ్రామపాలకులను 'గ్రామణు'లనేవారు. వీరి ప్రవర్తన సరిగా లేకపోతే మరొకరిని నియమించడం జరిగేది. ఈ విషయం మొదటి అమ్మరాజు శాసనంవల్ల తెలుస్తుంది. గ్రామణి ప్రత్యక్షంగా బాధ్యుడు. ఈయన పన్నులు వసూలుచేసేవాడు.ఆనాడు గ్రామసభలుండేవి. ఇవి గ్రామ కరణాలను నియమిస్తూ ఉండేవని శాసనాలవల్ల స్పష్టమౌతుంది.

రాజు పర్యవేక్షలో ఉన్న కేంద్రాంతోపాటు చిన్న చిన్న సామంత రాజ్యాలు కూడ ఉండేవి. ఎలమంచలి, పిఠాపురం, ముదిగొండ మొదలైన వాటిని పేర్కొనవచ్చు. ఇవికాక రాజు కుటుంబంతో సన్నిహిత సంబంధ బాంధవ్యాలు కల కుటుంబాల స్వాధీనంలో కొన్ని సామంతరాజ్యాలు ఉండేవి. కొలను సారోనాథులు, కోనహైహయులు మొదలైనవారు. రాజ కుటుంబం పట్ల ప్రదర్శించిన విధేయతాపూర్వక సేవకు ప్రతిఫలంగా కొద్ది ప్రాంతాన్ని బహూకరించి ఉన్నతాధికారాన్ని కల్పించడం ఒక పద్ధతి. వెల్నాడు కొండ పద్మాటి మొదలైనవారు ఈ కోవకు చెందినవారే.

నాటి ప్రభువులు యుద్ధరంగంలో తమకు సహాయంచేసిన వీరులను రాజలాంఛనాలతో సన్మానించేవారు. కుబ్జ విష్ణువర్ధనుడు కొండపడమటి రాజవంశ మూలపురుషుడైన బుద్ధవర్మను రాజలాంఛనాలతో గౌరవించినట్లు తెలుస్తుంది. "లాలాపట్టం, భేరీ, శంఖం, కాహళం (తూతూబాకా), అడపం (తమలపాకుల సంచి), అందలం, ఆతపత్రం పడిగ (పీకిదాన), చామరం, హేమదండం - ఇవన్నీ రాజలాంఛనాలు" (ఆంధ్రుల సంస్కృతి - చరిత్ర, మొదటి భాగం, పుట - 165) కొంత మందికి ఆతపత్రం ఇచ్చి గౌరవించేవారు. కొంతమందికి భూమి ఇచ్చేవారు. 'ఉజ్జైని పిశాచి'గ పేరుపొందిన ఒక సేనాపతికి 'ఎరువ విషయా' న్ని ఇచ్చారు.

BRAOU

కులపంచాయతులు, గ్రామ న్యాయస్థానాలతోపాటు రాజుగారి మండలాధిపతులు ఏర్పరచిన న్యాయస్థానాలు న్యాయవిచారణ కావించేవి. సాక్ష్యం లభించకపోతే దివ్యల (Trail by ordeal) ద్వారా న్యాయాన్ని నిర్ణయించేవారు. రాజద్రోహికి మరణశిక్ష విధించటం, ఆస్తిని స్వాధీనపరచుకొనటం జరిగేది. ఇతర నేరాలకు చెరసాల, జరిమానా శిక్షలు.

ప్రభుత్వానికి భూమి పన్ను ఒక ముఖ్య ఆదాయం. పంటనుబట్టే భూమి పన్ను విధించేవారు. ఈ భూమి పన్ను వస్తురూపంలో చెల్లించాలి. పశువుల పన్ను, ఇంటి పన్ను, వివాహాల మీద పన్ను, వ్యవసాయ ఉత్పత్తుల మీద పన్ను - ఎన్నో పన్నులుండేవి. కాలువల నుంచీ, చెరువుల నుంచీ నీరు తీసుకుంటే నీటి పన్నుకట్టాలి. అరి, తగ్గు, తెరె, సిద్ధాయం, దండు, దశాపరాధం - అనే పన్నులు ఎనిమిదో శతాబ్దంలో ఉండేవని శాసనాలవల్ల తెలుస్తుంది. యువరాజును పోషించేదుకు 'దొగరాచ పన్ను' వైదుంబులు వసూలేచేసేవారు. సేనాపతిని, దౌవారుకుని, సంధి విగ్రహిని భరించేటందుకు 'పడెవాల' పన్ను, 'పడియెరి' పన్ను, 'సంధి విగ్రహి' పన్ను వసూలు చేసేవారు.

## 22.4.0 ఆర్థిక పరిస్థితులు

ఈ ఉప విభాగంలో నాటి వ్యవసాయం, పరిశ్రమలు, వాణిజ్యం, తీరుతెన్నులను వివరిస్తున్నాం.

### 22.4.1 వ్యవసాయం

ఆనాడు భూములను మూడు విధాలుగా విభజించారు. (ఆంధ్రుల సంస్కృతి - చరిత్ర మొదటి భాగం పుట 179). 1. తోటలు 2. తరిసాగు 3. మెట్టసాగు. ఇందులో తరిసాగు భూములు సారవంతమైనవి. ఇది నీటి పారుదల సౌకర్యంపై ఆధారపడి ఉండేది. మెట్టసాగు భూములు వర్షాధారాలు. కొందరు కొబ్బరి, పోక, తమలపాకులు, చెరుకు, పత్తి, కాయధాన్యాలు పండించేవారు. ఇవి ఆదాయాన్ని ఇచ్చేవి. ఆనాటి ప్రభువులు నీటి పారుదల విషయంలో శ్రద్ధవహించేవారు. సామంతులు, ధనవంతులు, వర్తకులు తటాకాలు నిర్మించేవారు. దీనిని పుణ్యకార్యంగా భావించేవారు. ప్రజలు విరాళాలు ఇచ్చేవారు. చైత్ర తటాకం, భీమ సముద్రం మొదలైనవి ఇట్లాంటివి. పొలాలోనికి నీళ్ళు మళ్ళించటానికి ఏతాములు, మోటలు ఏర్పాటు చేసి కొత్తగా సాగుచేసే భూములకు పన్ను మినహాయింపు కల్గించి వ్యవసాయాభివృద్ధిని ప్రోత్సహించారు. ఆనాడు వ్యవసాయానికున్నంత ప్రాధాన్యం పశుసంపదకు ఉండేది. ఆవు, గేదె, మేక, గొర్రెల మందలు ప్రతి గ్రామంలోను ఉండేవి. ఈ మందలు వ్యక్తిపరంగాను ఉండేవి. గ్రామపరంగా ఉమ్మడి మందలు కూడా ఉండేవి. ఇవి పొలానికి ఎరువులను ఇచ్చేవి. ఈ పశువుల మందల కోసం గ్రామాలకు మధ్య యుద్ధాలు జరిగేవి. ఈ మందలను రక్షించటంలో గ్రామాలను పోగొట్టుకున్న వీరుల సంస్మరణ కోసం "వీరగల్లులను" వేసేవారు.

భూమి హక్కు నాలుగు రకాలుగా ఉండేది అవి : 1. గ్రామసమితి సమిష్టి స్వాధీనంలో ఉండేది. 2. గ్రామ సమితి అంగీకారం అవసరమవుతూ రైతుల స్వత్వంలో ఉన్న భూమి. 3. దేవాలయ, ధర్మసంస్థల భూమి 4. రాజుల సామంతుల స్వంత ఆస్తులు" (ఆంధ్ర సంస్కృతి - చరిత్ర మొదటి భాగం - పుట 182).

ప్రభువులు, సామంతులు, ఇతరులు తమ భూములను అమ్మేవారు. ఆనాటి వారు భూములను దేవాలయాలకు వ్యక్తులకు దానాలను ఇచ్చేవారు. భూమిని అమ్మినా, దానం చేసిన గ్రామసమితి ఆమోదం పొందాల్సి ఉంటుంది. (ఆంధ్రుల సంస్కృతి - చరిత్ర, మొదటి భాగం, పుట, 181). ఈ గ్రామసమితికి, కూడ కొంత భూమి ఉంటుంది.

బ్రాహ్మణులకు సర్వకర పరిహారంగా అగ్రహారాలనిచ్చేవారు. దేవాలయాలకు ఇచ్చిన భూములకు పన్ను ఉండదు. ఈ భూమి మీదవచ్చే ఆదాయాన్ని భూమి సాగుచేసే వాడు వస్తురూపంగాగాని ధనరూపంగా చెల్లిస్తాడు. దానం ఇచ్చిన భూములకు ఏ విధమైన ఆటంకాలైనా ఏర్పడితే వాటిని పునరుద్ధరించటానికి ఆనాటి ప్రభువులు ప్రయత్నించేవారని ఆనాటి శాసనాలవల్ల తెలుస్తుంది. ఒకే పర్యాయం కొంతసొమ్మును చెల్లిస్తే తరవాత పన్ను చెల్లించనక్కర లేకుండా అగ్రహారాలనిచ్చేవారు. ఆకాలంలో కౌలుదార్లు ఉండేవారు. దేవాదాయ, ధర్మాదాయ భూములను సాగుచేసేవారి స్థితి బాగుండేది.

### 22.4.2 పరిశ్రమలు

ఆనాడు చేతి పరిశ్రమలున్నాయి. వీరికి వృత్తి మాన్యాలుండేవి. కమ్మరి, కుమ్మరి, తెలికి, కంచరి, కంసాలి, మంగలి, చాకలి, మేదరి, చర్మకారులు, కొబ్బరి పోకతోటల వారికి మాన్యాలిచ్చినట్లు తూర్పు చాళుక్యుల

శాసనాలవల్ల తెలుస్తుంది. వృత్తి నిపుణులు, స్వర్ణకారులు, వెండిపనివారు, తాపీపనివారు, వాస్తు శాస్త్రజ్ఞులు మొదలైన వారిని ఎంత మందినో దేవాలయాలు మాన్యాలిచ్చి పోషించేవి.

ప్రతి గ్రామంలోనూ నూనె గానుగలుండేవి. నేత పరిశ్రమ ఉండేది. సన్నని వస్త్రాలు తయారయ్యేవని మర్కోపోలో రాతల వల్ల తెలుస్తుంది.

### 22.4.3 వాణిజ్యం

వృత్తి కళాకారులు, వ్యాపారస్తులు, శ్రేణులుగా ఏర్పడేవారు. ఈ శ్రేణులు చాలా శక్తివంతమైనవి. కొన్ని శ్రేణులు కలిసి సమితిగా వ్యవహరించేవి. ఈ సమితి నిర్ణయాలకు సభ్యులందరూ బద్ధులై ఉండేవారు. రాజ్యంలో ఈ సమితుల పలుకుబడి అధికంగా ఉండేది. వీరు యుద్ధసమయాలలో ప్రభువునకు అండగా నిల్చి మర్యాదలు పొందేవారు. దేవాలయాలు, అన్నసత్రాలు మొదలైన వానికి ఈ శ్రేణుల వారు దానాలు చేసేవారు.

ఆంధ్రదేశంలో వ్యాపారం వైశ్యుల ఆధీనంలో ఉండేది. వీరు గోదావరి, కృష్ణా, గుంటూరు మండలాలలో పద్దెనిమిది నగరాలను కేంద్రాలుగా చేసికొని వ్యాపారం చేసేవారు. ఈ కేంద్రాలలో వేంగి, దెందులూరు, ఘంటసాల, ఆచంట, చందవోలు, నిడుదవోలు, పాలకొల్లు, ద్రాక్షారామం, సామర్లకోట, భీమవరం వంటివి కొన్ని. వీరి ప్రధాన కేంద్రం పెనుగొండ. ప్రతి కేంద్రంలోను ఒక సమితి ఉంటుంది. ఈ కేంద్రంలోని వైశ్యుల వ్యవహారాలను అన్నిటినీ ఈ సమితి చూస్తుంది. ఈ కేంద్ర స్థలాన్ని 'నగరం' అంటారు. దాని అధ్యక్షుని 'నగర స్వామి' అంటారు. వైశ్య కుటుంబాల సమస్యలను పెనుగొండ నగరం తీరుస్తుంది. ఈ సభకు పెనుగొండ నగర స్వామి అధ్యక్షత వహిస్తాడు. వర్తక శ్రేణులకు సుంకాలపై ఆదాయం లభించేది. వారు ఈ ఆదాయాన్ని దేవాలయాలకు దానం చేసినట్లు ఆనాటి శాసనాలవల్ల తెలుస్తుంది.

బలంజాలు అనే వర్తకకులం ఉండేది. వీరిని 'వీర బలంజాలు' అని కూడ అనేవారు. వీరి వ్యాపారం ఆంధ్ర దేశానికి మాత్రమే పరిమితం కాకుండా తమిళ, కర్ణాటక దేశాలకు కూడ వ్యాపించింది. వీరు ఏనుగులు, గుర్రాలు, రత్నాలు, మాణిక్యాలు, ఏలకులు, లవంగాలు, ఎర్ర చందనం, కస్తూరి, కుంకుమపువ్వు మున్నగువాని వ్యాపారం చేసేవారు. వీరు పన్ను వసూలుచేసుకొనే హక్కును ప్రభువు నుండి పొందేవారు.

ఆనాడు 'గద్య' అనే బంగారు నాణెం వాడుకలో ఉండేది. రాజనారాయణగద్య, సురభి గద్య, త్యాగగద్య, బిరుదగద్య మొదలైనవి. (ఆంధ్రుల సంస్కృతి - చరిత్ర, మొదటి భాగం పుట, 186). మాడ అనే నాణెం వాడుకలో ఉండేది. ఈ నాణాన్ని బంగారంతోగానీ వెండితోగానీ చేసేవారు. కాసు అనే నాణాన్ని రాగితో చేసే వారు. నూరు కాసులు ఒక 'పణం'. ఈ నాణాన్ని బంగారంతో చేసేవారు. పదహారు పణాలను 'ద్రమ్మం' అంటారు. ఈ నాణాల ప్రసక్తి శాసనాలలో కన్పిస్తుంది. సోల, మానిక, అడ్డ, కుంచం అనే ద్రవ్యమానం; శేరు, వీశ, మణుగు, పుట్టి అనే తలమానాలు వాడుకలో ఉండేవి.ఆనాడు భూమిని కొలిచే విధానం కూడ తెలుస్తోంది. పండే పంటనుబట్టి కొలతలు వేసేవారు. నివర్తనం, మరుత్తు, ఖండిక, పుట్టి, తూము, కుంచం మొదలైనవి. భూమిని కొలవటానికి రాజమానం, ముమ్మడి భీమకోల, జినకోల, శనివార, సిద్ధి కోలలను ఉపయోగించేవారు (ఆంధ్రుల సంస్కృతి - చరిత్ర, మొదటి భాగం పుట - 186).

ఆనాటి రాజులు పరస్పరం యుద్ధాలలో మునిగి ఉండటంవల్ల విదేశ వాణిజ్యం అంతగా జరగలేదు. ఇంచు మించుగా ఆనాటి వారు సముద్ర ప్రయాణాన్ని నిషేధించారు. ఈ కారణంవల్ల కూడా విదేశీ వాణిజ్యం అంతగా జరగలేదు. వేంగి, మోటుపల్లి, గుంటూరు, ఘంటసాల, రాజమహేంద్రవరం, అమరావతి, పాలకొల్లు మొదలైన ప్రదేశాలు దేశీయ వాణిజ్య కేంద్రాలుగా ప్రసిద్ధి చెందాయి. విదేశ వాణిజ్యంతోపాటు నౌకా నిర్మాణం కూడ తగ్గింది.

BRAOU

## 22.5 సామాజిక జీవనం

ఈ దశలోని వర్ణవ్యవస్థ, ఆచారవ్యవహారాలు, మతం, వేడుకలు, విద్య సాహిత్యం కళలను గురించి ఈ ఉప విభాగంలో వివరించాము. పరిశీలించండి.

### 22.5.1 వర్ణ వ్యవస్థ

తూర్పు చాళుక్య ప్రభువులు, ఇతర రాజవంశాలవారికి వర్ణాశ్రమ ధర్మరక్షణలో విశ్వాసముండేది. వర్ణ శ్రేణిలో బ్రాహ్మణులది అగ్రస్థానం. బ్రాహ్మణులు ఎక్కువగా అధ్యాపన, అధ్యయనాదులు, మతపర కర్మకాండ

లను నిర్వహించటం చేసేవారు. ఆనాటి వారు బ్రాహ్మణులకు ఎక్కువగా దానాలు చేసేవారు. ఈ దానాలకు ఎట్టి భంగం కలగలేకండా చూసేవారు. రాజులు కూడా తమ ధర్మశాసనాలలో దాన వస్తువుకి భంగం కలిగించనవారికి కలిగే పాపాలను గురించి హెచ్చరించేవారు. క్రీ.శ. 600 - 625 నాటి ఇందుకూరు, వెలుదుర్తి, ఉరుటూరు, పొట్లదుర్తి, మాలెపాడు శాసనాలలోను, క్రీ.శ. 725 నాటి మాలెపాడు శాసనంలోను క్రీ.శ. 742 - 798 నాటి ధోరణి కోట శాసనంలోను ఇంకా అర్వాచీన శాసనాలలో దానం భంగపర్చినట్లయితే పంచమహాపాతకాలు కలుగుతాయని చెప్పబడింది. 1. స్వర్ణస్తేయం 2. సురాపానం 3. బ్రహ్మహత్య 4. గురుపత్ని గమనం 5. ఇవి చేసే వారితో స్నేహం - ఇవి పంచమహాపాతకాలు. బ్రాహ్మణులలో కొందరు మంత్రులుగా, సేనాధిపతులుగా, దండ నాయకులుగా ఉన్నారు. పండరంగడు, వినయడి శర్మ మొదలైన వారిని పేర్కొనవచ్చును. మరికొందరు వ్యవసాయ వాణిజ్యాలను వృత్తులుగా చేపట్టేవారు. కాని ఎక్కువమంది అధ్యయన అధ్యాపనాదులలోనే ఉండేవారు.

వైశ్యులు వ్యాపారం చేసేవారు వైశ్యులతోపాటు వీరబలంజలనే వారు కూడ వ్యాపారం చేసేవారు. క్షత్రియుల్లో కొందరు వ్యవసాయాన్ని జీవికగా గ్రహించారు. శూద్రులు ప్రధానంగా వ్యవసాయం చేసేవారు. వీరిలో కొందరు హైహయులు, దాగివారు మొదలైనవారు పరాక్రమంతో ప్రభువులై ఉత్తమ పాలకులుగా పేరు పొందారు. ఆనాడు విశ్వకర్మకులం వారికి మిక్కిలి గౌరవం ఉండేది. వీరు వృత్తిచే శిల్పులు, శాసనలేఖకులుగా వ్యవహరించేవారు. రెండో విజయాదిత్యుని శాసనలేఖకుడు లలితాచార్యుడు.

ఆనాడు దేవదాసి వ్యవస్థ ప్రాముఖ్యంలో ఉంది. దేవదాసీలు రాజులకు ఉంపుడుకత్తెలుగా ఉండేవారు. వీరు లలితకళలలో మిక్కిలి ప్రావీణ్యం సంపాదించారు. గంజాం శాసనంలోని గోవర్ధననాయకుడు "వేశ్యా వంశోద్భవుడు".

### 22.5.2 విద్య, సాహిత్యం

ఈ కాలంలో వేదాధ్యయనానికి ఎక్కువ ఆదరణ లభించేది. ఇందుచేతనే ద్వివేదులు, చతుర్వేదుల వారు నాటి శాసనాలలో కన్పిస్తారు. తూర్పు చాళుక్య ప్రభువు జయసింహవల్లభుడు అనేక శాస్త్రార్థతత్త్వజ్ఞుడు, మందశర్మ అనే ఆయన ఘటికా సామాన్య పదవిని నిర్వహించాడు. ఆనాటి ఘటికాస్థానాలలో చతుర్దశ విద్యలు, ఆయుర్వేదం, గాంధర్వం, అర్థశాస్త్రం మొదలైన వాటిని బోధించేవారు. ఈ ఘటికా స్థానాలను గ్రామవిద్యా పీఠాలనేవారు.

తూర్పు చాళుక్యులు వేదవిద్యలను పోషించారు. వేదవిద్యను పఠన పాఠనాలలోనికి తీసుకొనివచ్చారు. ఈ విధంగా చేయటంవల్ల వైదికమత వ్యాప్తి జరిగింది. పరిపాలన నిమిత్తం వేసిన తెలుగు శాసనాల ద్వారా తెలుగు భాషా సాహిత్యాల వికాసానికి వీరు తోడ్పడ్డారని మీరు 17వ భాగంలో తెలుసుకున్నారు.

### 22.5.3 కళలు

శైవ వైష్ణవ మతాలవారు దేవాలయాలు అధికంగా నిర్మించారు. దీనివల్ల శిల్పం ఎక్కువగా అభివృద్ధి చెందింది. కాబట్టే ఆనాటి ఆలయ నిర్మాణ విధానంలో వైవిధ్యం కన్పిస్తుంది.

నాటి ఆంధ్రదేశంలో సుస్థిరశాంతి కొరవడింది. ఐశ్వర్యం తగ్గింది. కళలు అంతగా అభివృద్ధి చెందలేదు. అయినప్పటికీ తూర్పు చాళుక్య ప్రభువులు కొన్ని దేవాలయాలు నిర్మించారు. వారి సామంతులు దేవాలయాలను నిర్మించటమే కాకుండా జీర్ణదేవాలయోద్ధరణ కార్యక్రమాలను చేపట్టేవారు ఆలయాలకు దానాలిచ్చేవారు.

పశ్చిమ చాళుక్యుల ఆధీనంలో ఉన్న ప్రాంతాలలో నిర్మించిన ఆలయాలు "చాళుక్య శైలి"లో ఉండేవి. అలంపురంలోని నవబ్రహ్మ ఆలయాలు, సంగమేశ్వర్, మహానంది ఆలయాలు ఉదాహరణలు. వేంగీలు ద్రావిడ కర్ణాటక సంప్రదాయ మిశ్రశైలిలో ఆలయాలను నిర్మించేవారు. ద్రాక్షారామంలోని ఆలయంలోను, బిక్కవోలు ఆలయాలలోను స్వతంత్ర శైలి కన్పిస్తుంది. ఈ ఆలయాలు నిర్మాణవిధానం తూర్పు చాళుక్య రీతిని స్పష్టపరుస్తుంది.

నరేంద్ర మృగరాజు నూట యెనమై ఆలయాలను నిర్మించాడు. వీనికి అనేక మార్పులు చేయటంవల్ల ఈ ఆలయాల నిర్మాణపద్ధతిని గూర్చి నిష్కర్షగా చెప్పలేము. ఈ నాటికీ చెక్కుచెదరకుండా ఉన్న ఆలయాలు కూడా



BRAOU

ఉన్నాయి. ఆ ఆలయాలను నరేంద్ర మృగరాజు, విజయాదిత్యుడు, గుణగ విజయాదిత్యుడు, మొదటి చాళుక్య భీముడు, దానార్ణవులు నిర్మించారు.

బిక్కవోలులో ఆరు ఆలయాలున్నాయి. వీనిలో మూడు ఆలయాలు గ్రామంలోను, మూడు ఆలయాలు గ్రామానికి వెలుపల ఉన్నాయి. ఈ ఆలయాలన్నీ సామాన్య నిర్మాణాలు. నగర సంప్రదాయానికి చెందిన ద్వితల విమానంలో పరివేష్టితమైన గర్భగృహం కలవి. గణపతి, కుమార, దేవి, అర్ధనారీశ్వర, నటరాజ, దిక్పాలకులు, భిక్షాటనమూర్తి, చాముండి, కుమారీ మొదలైన విగ్రహాలు కన్పిస్తాయి.

భీమేశ్వరస్వామి అధిష్ఠాన దైవంగా నిర్మించింది ద్రాక్షారామ ఆలయం. ఇది ఆంధ్ర దేశంలోని సుప్రసిద్ధ ఆలయం. ఈ ఆలయంలో కాలభైరవుడు, విష్ణువు, గణపతి, నృత్త గణపతి, శక్తి, మహిషాసురమర్దని మొదలైన దేవతావిగ్రహాలు ఉన్నాయి. భీమేశ్వరాలయం రెండంతస్థుల భవనం. ఇందులో రెండు ఆవరణాలు ఉన్నాయి. లోపలి ఆవరణలో కేంద్రస్థానంలో భీమేశ్వరస్వామి గర్భగృహం ఉంది. గర్భగృహానికి పైన నగర సంప్రదాయానికి చెందిన ద్వితల విమానం ఉంది.

మాండవ్య నారాయణ దేవాలయం, చాళుక్య భీమేశ్వరాలయం ఈ కాలానికి చెందినవే. ఈ రెండు ఆలయాలను చాళుక్య భీముడు నిర్మించాడు. ఇవి నిర్మాణరీతిలో ద్రాక్షారామాలయాన్ని పోలి ఉన్నాయి. పశ్చిమ గోదావరిజిల్లా భీమవరంలోని సోమేశ్వరాలయాన్ని చాళుక్యులే నిర్మించినట్లు కొందరు భావించారు. ఈ విధంగా ఎన్నో దేవాలయాలను తూర్పు చాళుక్య ప్రభువులు, వారి సామంతులు నిర్మించారు. ఈవిధంగా దేవాలయాలు శిల్పకళాభివృద్ధికి ఎంతగానో దోహదం చేసాయి.

ద్రాక్షారామం, భీమవరం మొదలైన ప్రదేశాలలోని దేవాలయాలలో దేవదాసీలు ఉండేవారు. వీరు లలిత కళలను అభ్యసించేవారు. ఆలయాలు, రాజాస్థానాలు సంగీతాన్ని ప్రోత్సహించేవి. గుణగ విజయాదిత్యుడు గాంధర్వ విద్యా విశారద చెల్లవ్వకు అత్తిలి గ్రామంలో మాన్యం ఇచ్చాడు. అమ్మరాజు భార్య చామెకాంబ నటులను పోషించింది. బాడపుడు నటులను, గాయకులను పోషించారు (ఆంధ్రులచరిత్ర, పుట 207). వీణ, పిల్లనగ్రోవి, మృదంగం, తాళాలు వంటి వాద్యాలు నాటి శిల్పాలలో కన్పిస్తున్నాయి. నృత్య వాద్య గోష్ఠులు సాగేవని చేబ్రోలు లోని ఒక శిల్పం ద్వారా తెలుస్తుంది. ఆనాడు నృత్య గీతాలతో కలిసిన కోలాటం ఉండేది. సాహిత్య సంగీత నృత్య శిల్పాలకు రాజాదరణ అధికంగా లభించటంతో కళలు బాగా అభివృద్ధి చెందాయి.

### 22.5.4 వేడుకలు – వినోదాలు

ఆనాటి పండుగలలో ప్రధానమైనది సంక్రాంతి. ఈ పండుగ నేడుకూడ ఆంధ్రులకు ముఖ్యమైన పండుగ. ఈ పండుగ ప్రసక్తి క్రీ.శ. 897 నాటి ధర్మవరం శాసనంలో కన్పిస్తుంది. సూర్యుడు మకరరాశిలో ప్రవేశించే పవిత్ర దినమే మకర సంక్రాంతి. మకర సంక్రాంతి నుండి కార్కటక సంక్రాంతి వరకు గల కాలాన్ని ఉత్తరాయణ పుణ్యకాలమని వ్యవహరిస్తారు.

ఈ సంక్రాంతిని గూర్చి ధర్మవరం శాసనంలో–

2. "జయరాజ్య స(ం)వత్సరంబు .... (యే)నగు – నేణి (రా) యన స(ంక్రా)

3. (న్తి) స్థితి ధమ్మ్రపురము .... " అని ఉంది. (ప్రాచీనాంధ్ర శాసనాలు, పుట 70). ఈ సంక్రాంతి పండుగను మూడు రోజులు జరుపుకుంటారు. భోగి, సంక్రాంతి, కనుమ.

ఆనాటి వారు జాతరలు నిర్వహించేవారు. ఆనాటి జాతర్లలో బెజవాడ జాతర మిక్కిలి ప్రసిద్ధి చెందింది. ఈ బెజవాడ జాతరకు సుదూర ప్రదేశాలైన చేబ్రోలు మొదలైన ప్రదేశాల నుండి యాత్రికులు వచ్చేవారని బెజవాడ శాసనం (క్రీ.శ. 898-924) వల్ల తెలుస్తుంది.

ఈనాటి శాసనాలవల్ల మనకు తెలిసే మరో పండుగ ఏరువాక. దీనిని జ్యేష్ఠ శుద్ధ పూర్ణిమనాడు చేస్తారు. ఇది వ్యవసాయదారులకు ముఖ్యమైన పండుగ. ఈ ఏరువాక "ఏర్వోక" అని అంటారు. దీని ప్రసక్తి కొరవి, చేపూరు, ప్రొద్దుటూరు, మల్లియపూడి శాసనాలలో కన్పిస్తుంది.



BRAOU

ఆనాడు ఆలయాలలో ఉత్సవాలు జరిపేవారు. ద్రాక్షారామ భీమేశ్వరాలయంలో జ్యేష్ఠమాసంలో మూడో రోజున గౌరీవ్రతం, మాఘమాసంలో మూడో రోజున ఒక ఉత్సవం, అశ్వయుజ మాసంలో పూర్వ ఫల్గుణిలో పార్వతీదేవిని పూజించటానికి ఒక ఉత్సవాన్ని, మార్గశీర్ష మాసంలో భీమేశ్వరునకు అర్ధోత్సవాన్ని చేసేవారు. ఈ విధంగా ఆలయాలలో ఎన్నో ఉత్సవాలు జరిగేవి. నాటివారు ఎన్నో పండుగలు చేసికొని ఆనందించేవారు.

**22.5.5 మతం**

తూర్పు చాళుక్యుల కాలంలో మతపరంగా చాలా మార్పులు జరిగాయి. శాతవాహనుల కాలంలో, అనంతరం ఆంధ్రదేశంలో బౌద్ధ జైనాలు విశేషాభిమానం పొందాయి. క్రీ.శ. 5, 6 శతాబ్దాల అనంతరం బౌద్ధం తెలుగుగడ్డ మీద అంతర్ధానమైంది. కాని జైన మతం నిలబడింది. తూర్పు చాళుక్య ప్రభువు కుబ్జ విష్ణువర్ధనుని మహారాణి అయ్యణదేవి బెజవాడలో నిడుంబివసది నిర్మించి, దానికి మనిషికుండి గ్రామాన్ని దానం చేసింది. రెండవ అమ్మరాజు తన భార్య దామెకాంబ కోరికపై జైనులకు కలుచుంబర్రు దానం చేశాడు. గుణగ విజయాదిత్యుని సేనాని పండరంగని ప్రపౌత్రుడు కర్మరాష్ట్ర విషయాధ్యక్షుడైన దుర్గరాజు కోరికపై రెండో అమ్మరాజు కటకాభరణ జినాలయానికి మలియపూండి దానం చేశాడు. తరవాత బెజవాడలోని జినాలయ నిర్మాణానికి పెదగాదెలపర్రును ఇచ్చాడు. తూర్పు చాళుక్యులకు రాష్ట్రకూటులతో వివాహ సంబంధం ఏర్పడ్డ తరువాత ఆంధ్రదేశంలో జైనం కొద్దిగా విజృంభించింది. తూర్పు చాళుక్య ప్రభువు నాలుగో విష్ణువర్ధనుని కుమార్తె శ్రీలమహాదేవిని రాష్ట్రకూట ప్రభువు ధ్రువుడు వివాహం చేసుకొన్నాడు. రాష్ట్రకూటులు జైన మతాభిమానులు. పిఠాపురం, జల్లూరు, బాయనపురి, ఆర్యవటం, పెనుగొండ మొదలైన చోట్ల వసతులు నిర్మించుకొని తీర్థంకర విగ్రహాలను స్థాపించారు.

ఆనాటి రామతీర్థం, బిక్కవోలు, దానవులపాడు, కొనకాండ్ల, అన్మకొండలు జైన క్షేత్రాలు. వేములవాడ చాళుక్యుల రాజధాని. వేములవాడ ఒక ముఖ్య జైన క్షేత్రం. రాష్ట్రకూటులు, వారి సామంతులేకాక కళ్యాణ చాళుక్య ప్రభువులు కూడ జైన మతాన్ని ఆదరించారు. కొలనుపాక, ఉజ్జిలి, వర్ధమానపురం మొదలైన స్థలాలలో ఉన్న జైనులకు ఆరో విక్రమాదిత్యుడు అనేక దానధర్మాలు చేసాడు.

జైన సంఘాలలో యతులు, ఉపాసకులు ఉండేవారు. జైనంలో సంఘ, గణ, గచ్ఛ, బలి, అన్వయ అనే విభాగాలుండేవి. ఆంధ్రదేశంలో మూల, యాపనీయ, గౌడ, ద్రావిడ సంఘాలు, కవురూరి, దేవి, మహురి, బలత్కార గణాలు, నందిగచ్ఛ, పుస్తకగచ్ఛ, వేషపోషణ గచ్ఛాలు ఉండేవి. (ఆంధ్రుల చరిత్ర, పుట 195) బలి అన్వయ అనేవి చిన్న విభాగాలు.

జైనులు ఎక్కడి వారైనప్పటికీ స్థానికంగా లభించే రాతితోనే తీర్థంకర విగ్రహాలను తయారుచేయించే వారు. ఈ పద్ధతిని అనుసరించే తెలుగు చోళులు, చందవోలు, అత్తిరాల, నెల్లూరు, కొణిదెనలలో స్థానికంగా దొరికినరాతినే ఉపయోగించారు. పుష్పగిరిలోని చెన్నకేశవాలయంలోని శిల్పాలను నాపరాయితో చేసారు.

జైనులలో శ్వేతాంబరులు, దిగంబరులు అనే శాఖలు ఏర్పడినా మూలగత మార్పులు ఏమీరాలేదు. జైనులకు మానవుడే ఆరాధ్యుడు. వీరు నిరీశ్వర వాదులు. ఈ మతం వారు ముక్తి పొందటానికి అనుష్ఠానం కలిగిన వారే అర్హులని చెప్పినప్పటికీ ఇతరుల విషయం కూడా ఆలోచించేవారు. జైనయతులు విలాసజీవితం గడపకుండా నైతిక ధర్మాలను అనుసరించేవారు. జైనయతులలో కొంత మంది మోక్ష సాధకులు మరి కొంత మంది రాజుల నుండి దానాలు పొందేవారు. వాటిలో సత్రాలను నిర్వహించేవారు బీదలకు ఆశ్రయం రాజుల నుండి దానాలు పొందేవారు. వాటిలో సత్రాలను నిర్వహించేవారు. బీదలకు ఆశ్రయం కల్పించేవారు. జైన యతులలో కొందరు వైద్యం, జ్యోతిష్యం మొదలైన వానిని నేర్చుకొని ప్రజలకు సహాయపడేవారు. మరి కొందరు అధ్యయన అధ్యాపనాదులను చేయటంతోపాటు కవితాది సృజనాత్మక కృషిచేసేవారు. జైనుల విద్యాభ్యాసం "ఓం నమః సిద్ధం నమః" అని ప్రారంభం అయ్యేది. ఈ విధానం నేటికీ ఆంధ్రదేశంలో అమలులో ఉంది.

జైనులు సల్లేఖనవ్రతాన్ని ఆచరించేవారు. సల్లేఖనవ్రతం అంటే ప్రాయోపవేశం చేసి చనిపోవటం. సల్లేఖన వ్రత కేంద్రస్థానానికి "దానవుల పాడు" అనే పేరు వచ్చింది. ఇది రేనాటి శాసనాలలో కన్పిస్తుంది.

BRAOU

జైనులకు, హిందువులకు ఆచారాలలో సామ్యం ఉండేది. జైనశ్రావకులు "పంచ అతిచారా" లను వదిలి "ద్వాదశ వ్రతా"లను ఆచరించేవారు. కాలగమనంలో జైనుల్లో కూడా వర్ణవ్యవస్థ ఏర్పడింది. మల్లారెడ్డి అనే శ్రావకుడు జిన, బౌద్ధ, శివ, విష్ణు, ఆలయాలను నిర్మించినట్లు "జెక్కల్లు" శాసనంవల్ల తెలుస్తుంది (ఆంధ్రుల చరిత్ర, పుట 196). ఈ విధంగా సామరస్య భావన ఉన్నప్పటికీ, క్రీ.శ. 8, 9 శతాబ్దాలలోని మత సంఘర్షణల వల్ల జైనమతం అడుగంటింది. దీనికితోడు చోళ చాళుక్యులకు జరిగిన యుద్ధాలలో చోళులు ఆంధ్రదేశంలోని జైనక్షేత్రాలను నాశనం చేసినట్లు తెలుస్తుంది. ఈ సమయంలోనే శైవంలో కాలాముఖుల వంటి తీవ్ర మతవాదులు ఏర్పడ్డాయి. జైనమత నిర్మూలన చేసే శైవులనుండి జైనులను రక్షించటానికి ఆనాటి ప్రభువులు పూనుకోలేదు. పశ్చిమ చాళుక్యులతో జైనం క్షీణించింది. జైన ఆలయాలు, జైన విగ్రహాలు ధ్వంసం అయ్యాయి. ఈ విధంగా జైనమతం ఆంధ్రదేశంలో క్షీణించింది.

జైన బౌద్ధమతాలకు ఆదరణ తగ్గిపోవటం, వైదిక మతాభివృద్ధికి కారణమైంది. తూర్పు చాళుక్య ప్రభువులు వైదిక మతాభిమానాలు. వీరిలో పరమ భాగవతులూ, పరమ మహేశ్వరులూ ఉన్నారు. జయసింహుడు నిరవద్యపురం (నిడదవోలు) లో గోలింగేశ్వరాలయాన్ని నిర్మించాడు. రెండో విజయాదిత్యుడు (నరేంద్ర మృగరాజు) నూటయెనిమిది శివాలయాలను నిర్మించాడు. చాళుక్య భీముడనే రాజు శివభక్తుడు. ఈయన అనేక శివాలయాలు నిర్మించాడు. అందులో ద్రాక్షారామ భీమేశ్వరాలయం ప్రసిద్ధమైంది. ఈయన కాలంలోనే పంచారామాలు శైవక్షేత్రాలుగా పరిణామం చెందాయి. చేబ్రోలులోని మహాసేనుని ఆలయం, బెజవాడలోని మల్లేశ్వరాలయం, బిదపురంలోని హుంకారశంకరి నాటి తీర్థక్షేత్రాలు. మహాసేనుడు చాళుక్యుల ఇష్టదైవం. ఆనాడు చేబ్రోలు నుండి బెజవాడ వరకు మహాసేనుని విగ్రహాన్ని ఊరేగించేవారు. ప్రతీ సంవత్సరం జరిగే ఈ జాతర నాటి వారిని ఎక్కువగా ఆకర్షించేది. శ్రీశైలం, శ్రీకాళహస్తి, శివక్షేత్రాలుగా ప్రసిద్ధికెక్కాయి. ప్రభువులతో పాటు రాణులు, సామంతులు, ఉద్యోగులు, వర్తకులు - ఇంకా ఎందరో తమ మతాభిమానాన్ని వ్యక్తీకరించుకొనేందుకు అనేక శివాలయాలను, విష్ణ్వాలయాలను నిర్మించారు. వీటిలో చేసే సేవలకు ధనధాన్యాలు, పొలం ఇచ్చేవారు. దేవాలయాల ఆస్తులకు భంగం కలిగించే వారు కూడ ఉండేవారు. అట్టి వారిని పంచమహాపాతకులుగా ఆనాటి శాసనాలు ప్రస్తావించాయి.

ఆనాటి వారు తమ మతాన్ని విపరీతంగా అభిమానించేవారు. చాళుక్యులు, చోళులు శైవ మతాన్ని అభిమానించేవారు. వెలనాటి చోడులు మొదలైనవారు వైష్ణవ మతాన్ని అభిమానించేవారు.

శైవంలో అనేకశాఖలు ఏర్పడ్డాయి. అందులో పాశుపతం ఒకటి. క్రీ.శ. 7వ శతాబ్ది నుంచి పాశుపతం ఆంధ్ర దేశంలో కన్పిస్తుంది. పాశుపత శైవులు అహింసావ్రతాన్ని కఠోరంగా ఆదరించేవారు. పాశుపతాన్ని "లకులీశ్వరుడు" ఏర్పరచాడు. ఈ లకులీశ్వరుని శిష్యుడు "కాలాననుడు". ఈ కాలాననుని అనుయాయులు "కాలాముఖులు". వీరు తీవ్ర మనస్తత్వం కలవారు. వీరు శైవమత ప్రాబల్యం కోసం జైన బౌద్ధమతాలను నాశనం చేయటానికి హింసను ఉపయోగించేవారు. వీరు అమరావతి, బెజవాడ మొదలైన స్థలాలలో "సింహ పరిషత్తులు" స్థాపించారు. శ్రీశైలం, అలంపురం, ద్రాక్షారామాలు కూడా కాలాముఖశైవుల స్థానాలు. ఈ కాలాముఖులలో వామాచారాన్ని ఆచరించేవారు కాపాలికులు. వీరు పంచముద్రలతో భైరవుని ఆరాధించేవారు. (మద్యం, మాంసం, మత్స్యం, మైథునం, ముద్ర అనే వానిని "పంచముద్ర"లు అంటారు).

ఆ కాలంలో గ్రామదేవతలకు కొలువులు జరపటం అనే ఆచారం ఉండేది.

ఆనాటి దేవాలయాలను కేవలం ఆరాధనా స్థలాలుగానేకాక పురాణశ్రవణం, పంచాంగ శ్రవణం, హరికథా కాలక్షేపంచేసే స్థలాలుగా పరిగణించేవారు. ఈ దేవాలయాలకు అనుబంధంగా సత్రాలు, పాఠశాలలు, చికిత్సాలయాలు ఉండేవి. ఈ దేవాలయాలు ఆనాడు సాంస్కృతిక కేంద్రాలుగా ఉండేవి.

దేవాలయ స్థానాపతి, పూజారి, అర్చకుడు, నాట్యాచార్యుడు, నాట్యాచార్యురాలు, నర్తకి, గాయకుడు, వంశీవాదకుడు, మార్దంగికుడు, చామరగ్రాహి, డోలువారు, దేవాలయవాస్తు శాస్త్రజ్ఞుడు, శంఖం ఊదేవాడు, వంట బ్రాహ్మణుడు, తిరువారాధనచేసే బ్రాహ్మణుడు, దీపారాధనచేసే బ్రాహ్మణుడు, ద్రవిడ వేద పాఠకుడగు బ్రాహ్మణుడు, గోపాలుడు, కుమ్మరి, కంచరి, కర్రపనిచేసేవారు ఈ విధంగా ఎంతమందో దేవాలయ సేవకులు ఉండేవారు. వీరి జీతాలను దేవాలయ ఆదాయంలో నుంచే భూమిరూపంలోగాక, ధనరూపంలోగాని ఇచ్చేవారు. వీరుచేసే దోషాలకు జీతాలను తగ్గించేవారని కొరవిశాసనం (క్రీ.శ. 892-922) వల్ల తెలుస్తుంది. ఆనాడు జీతాన్ని 'జీవితము'ని వ్యవహరించేవారు.



BRAOU

ఆనాడు దేవాలయాల్లో ఆవులు, గేదెలు, మేకలు మొదలైనవి ఉండేవి. వీనిని దేవాలయ గోపాలకునిగాని, గొల్లవానికిగాని అప్పగించేవారు. అతడు పాలుగాని, వెన్నగాని, నెయ్యిగాని దేవాలయంలో ఉపయోగించటానికి ఇవ్వాలి.

ఆనాడు మతానికి కేంద్రస్థానం దేవాలయం. ఈ దేవాలయ నిర్వహణను గ్రామ మహాజనసభ నిర్వహించేది. దేవాలయ భూములలో వ్యవసాయం సరిగా జరిగేటట్లు, ఆ భూములపై వచ్చే ఆదాయం సరిగా వసూలు చేసిందీ లేనిదీ చూడటం ఈ గ్రామ మహాజన సభ పని (ఆంధ్రుల సంస్కృతి చరిత్ర, మొదట సంపుటం, పుట 202). దేవాలయం ఖర్చులకుపోగా మిగిలినదానిని దేవాలయ కోశాగారంలో నిల్వచేసేవారు. ఈ కోశాగార నిర్వహణకు 'భండారి' అనే ఉద్యోగులు ఉండేవారు. వీరు దేవాలయం నిత్య పరిపాలనా వ్యవహారాలను చూచేవారు. దేవాలయం భూములను "దేవస్వములు" అనేవారు. ఈ దేవస్వములను భంగపర్చేవారు, దేవాలయ ఆదాయాన్ని "లంచం" తీసుకొనేవారు ఉండేవారు. అటువంటివారు వారణాసిని పాడుచేసిన పాపాన్ని పొందుతారని నాటి ప్రజలు విశ్వసించేవారు. ఈ విషయం క్రీ.శ.8వ శతాబ్దానికి చెందిన పెద్ద ముడియం శాసనం వల్ల తెలుస్తుంది.

రాజులు ఇచ్చే భూముల వల్ల, ఇతర వ్యక్తులు దానం చేసిన భూములవల్ల దేవాలయాల ఆస్తులకు పన్ను మినహాయింపులు ఇవ్వటం వల్ల, పశుసంపద వల్ల దేవాలయం తోటల మీద వచ్చే ఆదాయం వల్ల దేవాలయానికి స్థిరమైన ఆదాయం లభించేది. ఈ ఆస్తులను చూడటానికి డెబ్బయి రెండు నియోగికులు ఉండేవారు.

ఆ కాలంలోని మరో ముఖ్యలక్షణం భక్తి. భగవంతునకు జరిగే సేవలను చూస్తు భగవద్యానంలో సంతృప్తి పొందుతారనే నమ్మకం ఉండేది. దేవాలయాల్లో జరిగే మేలు కొలువు సేవ దగ్గర నుంచి పవలింపుసేవ వరకు జరిగే సేవలు రాజుకు కూడ జరిగేవి. అంటే రాజు దైవాంశ సంభూతుడని చెప్పటమే. ఈ భక్తి తత్త్వం ప్రచారంలోనికి రావటం వల్లనే దేవాలయాలు, యాత్రలు, ఉత్సవాలు, సంకీర్తనలు మొదలైనవి వ్యాప్తిలోనికి వచ్చాయి. కాలగతిలో ఈ భక్తి కూడ తీవ్రరూపం దాల్చి శైవంలోను వైష్ణవంలోను అతివాదులు ఏర్పడటానికి కారణమైంది. ఈ తీవ్రవాదం వల్ల మతకలహాలకు నాంది జరిగింది. దీనికి తోడు రాజ్య విస్తరణకోసం జరిగే యుద్ధాలు కూడా ఉండేవి. ఈ యుద్ధాలవల్ల కూడ మతవైషమ్యం వృద్ధిచెందింది. ఈ భక్తి తత్త్వంవల్ల సాహిత్యానికి, ఇతర లలితకళలకు చేయూత లభించింది.

## 22.5.6 ఆచార వ్యవహారాలు

దేవ బ్రాహ్మణ గురుభక్తి ఉండేది. కాబట్టి అగ్రహారాలను దానంగా ఇచ్చేవారు. ఈ దానాలను భంగపరచే వారిని పంచమహాపాతకులుగా భావించేవారని క్రీ.శ. 600 - 625 నాటి పొట్లదుర్తి - మాలెపాడు శాసనం వల్ల తెలుస్తుంది. (ప్రాచీనాంధ్ర శాసనాలు. పుట, 5).

ఆనాడు జెట్టులు, మల్లురు ఉండేవారు. జెట్టి అనేది మల్లయుద్ధ ప్రవీణుడు అనే అర్థంలో ప్రస్తావించారు. ఈ విషయం క్రీ. శ. 668 - 669 నాటి శాసనాల వల్ల క్రీ. శ. 8వ శతాబ్ది శాసనాల వల్ల తెలుస్తుంది. (ప్రాచీనాంధ్ర శాసనాలు, పుట - 175).

చెడు కార్యాన్ని ఆచరించేవారు, అనేక విధాలైన పాపాలను పొందుతారని నాటి వారు భావించేవారు. అటువంటి వారు వెయ్యి దేవాలయాల్ని, వెయ్యి చెరువుల్ని పాడుచేసినట్టి పాపాన్ని, వెయ్యి మంది బ్రాహ్మణులను చంపిన పాపాన్ని, వెయ్యి మంది కన్యలను చెరచిన పాపాన్ని పొందుతారని నాటివారు భావించినట్లు క్రీ.శ. 7వ శతాబ్ది నాటి బుడమ నారాయణ పాడు శాసనం వల్ల తెలుస్తుంది. (ప్రాచీనాంధ్ర శాసనాలు, పుట, 22).

దేవాలయాల ఆదాయాన్ని కైంకర్యం చేసేవారికి వారణాసిని నాశనం చేసిన పాపం వస్తుందనటం వారి విశ్వాసం. ఈ విషయం క్రీ. శ. 8వ శతాబ్దికి చెందిన పెద్దముడియం శాసనం వల్ల తెలుస్తుంది. (ప్రాచీనాంధ్ర శాసనాలు, పుట, 46).

యుద్ధంలో మరణించిన వీరుల పేరుమీద ఉత్తములైన పండితులకు దానం చేసినట్లయితే ఆ వీరులకు ఉత్తమగతులు కలుగుతాయని నాటి వారు భావించేవారు. ఈ విషయం క్రీ. శ. 8వ శతాబ్దంనాటి మైలవరం శాసనం వల్ల తెలుస్తుంది (ప్రాచీనాంధ్ర శాసనాలు, పుట, 47).



BRAOU

దొరుల్ని, జారుల్ని శిక్షించటం నాటి సంఘంలో ఉండేది. జీతాలపై సేవకులను నియమించుకొనేవారు. ఈ సేవకులు ఏవైనా తప్పులు చేస్తే జీతాన్ని తగ్గించేవారు. ఈ విషయాలు కీ. శ. 892 - 922 నాటి కొరవి శాసనం వల్ల తెలుస్తుంది. (ప్రాచీనాంధ్ర శాసనాలు, పుట, 66).

"57. ము (క్క?) ప (? పి) టిగినను పటి -
58. చినను, చరియ వెటికిన -
59. నుముటిచ్చిలినను అంకాడి
60. నను ఇరు వాద్యది ఏను -
61. ద్రమ్మలు మాణిసి చేసిన -
62. దోసంబునకు వాని జీవిత -
63. ంబు దణ్డువు పరియారబ" -

ఏదైనా ఒక కార్యాన్ని నిర్వహించటంలో స్థిరంగా ఉంటానని చెప్పటానికి ఒట్టు వేయటం అంటారు. ఒకవేళ ఆపని చేయలేకపోతే కలిగే పాపాన్ని చెప్పేవారు. ఈ విషయం క్రీ. శ. 898 - 924 నాటి బెజవాడ శాసనంలో ఉంది. (ప్రాచీనాంధ్ర శాసనాలు, పుట, 71).

సూర్య చంద్రగ్రహణ సమయాలలో దానం చేస్తే పుణ్యం కలుగుతుందనటం నాటి వారి నమ్మకం. ఆనాటి వారు సూర్యగ్రహణ సమయంలో అనేక దానాలు చేసేవారు. క్రీ. శ. 925 - 950 నాటి ముద్దనూరు శాసనం వల్ల సూర్యగ్రహణ సమయంలో చేసిన దానం గురించి తెలుస్తుంది. చంద్రగ్రహణ సమయంలో చేసిన దానం గురించి క్రీ. శ. 9 - 10 వ శతాబ్దికి చెందిన రంగసముద్రం శాసనంవల్ల తెలుస్తుంది. (ప్రాచీనాంధ్ర శాసనాలు, పుట, 87, 88).

సంఘం నుండి బహిష్కరించటాన్ని వెలివేయటం అంటారు. సంఘంలో నుండి బహిష్కరించిన వ్యక్తికి ఆ కులంలోని మిగిలిన వారితో సంబంధ బాంధవ్యాలు ఉండవు. ఈ వెలివేయటాన్ని గురించి క్రీ. శ. 971 నాటి మాలెపాడు శాసనంలో ఉంది. (ప్రాచీనాంధ్ర శాసనాలు, పుట - 89).

వ్యభిచారిణియైన భార్యను చంపినవారికి శిక్షలేదని అనే విషయం, విధించిన జరిమానాలపై పరీక్ష (appeal) లేదనే విషయ క్రీ.శ. 972 నాటి కలకడ శాసనంవల్ల తెలుస్తుంది. ఈ విషయాన్ని గూర్చి ఈ శాసనంలో (०)

కా 'ఉడిన నం (గం) బున (०) నాటి యాళిని మగని నొక్కడు చమ్మిన దణ్డువు లేదు.

మగదణ్డువు ఆటువాడు నాయం గద్యె (ఘ) గొణువారు దీనికి (०) బర్కీక్ష లేదు" అని ఉంది (ప్రాచీనాంధ్ర శాసనాలు, పుట, 97).

శాసనాలవల్లనే ఇటువంటి ఆచార వ్యవహారాలు వెలుగులోకి వచ్చాయి. ఈ దశలో ఇతర ఆధారాలు మృగ్యం.

## అవగాహన ప్రశ్న

తూర్పు చాళుక్యుల నాటి మత పరిస్థితులను 30 పంక్తులకు మించకుండా పరిశీలించండి.

BRAOU

## 22.6 సారాంశం

ఈ భాగంలో మీరు ఈ కింది ప్రధానాంశాలను తెలుసుకున్నారు :

- క్రీ. శ. 600 - 1000 మధ్య కాలంలో రాజకీయ అస్థిరత ప్రధానం. రాచరిక వ్యవస్థలో రాజులకే సర్వాధికారాలుండేవి.
- ప్రభుత్వానికి భూమిపన్ను ఒక ముఖ్యాదాయం. పంటనుబట్టి పన్ను ఉండేది. అది వస్తురూపంలో ఉండేది. పశువులు, ఇళ్లు, పెళ్లిళ్లు, వ్యవసాయ ఉత్పత్తులు, నీరు తదితర పన్నులతోపాటు యువరాజుపోషణ పన్ను కూడా ఉండేది.
- భూమిహక్కు నాలుగు రకాలుగా ఉండేది. 1. గ్రామసమితి సమష్టి భూమి 2. గ్రామసమితి అంగీకరించిన రైతుస్వత్వం 3. దేవాలయధర్మ సంస్థల భూమి 4. ప్రభువర్గ భూమి.
- చేతి పరిశ్రమలుండేవి. వృత్తికారులకు మాన్యాలుండేవి. వ్యాపారం వైశ్యుల అధీనంలో ఉండేది.
- వర్ణశ్రేణిలో బ్రాహ్మణులది అగ్రస్థానం. వివిధ కులాలతోపాటు దేవదాసీ వ్యవస్థ ఉండేది.
- విద్యల్లో వేదాధ్యయనానికే అధిక ప్రాధాన్యం.

## అవగాహన ప్రశ్నకు జవాబు

ఆంధ్రదేశంలో తూర్పు చాళుక్యుల కాలంలో జైన, బౌద్ధ వైదిక మతాలుండేవి. బౌద్ధంలో అనేకాలైన మార్పులు రావడంచేత ఈ మతం ప్రజాదరణ, రాజాదరణ కోల్పోయి, అయిదారు శతాబ్దాలలో నామమాత్రవ శేషంగా ఉండేది. కాగా జైనమతం కొంతవరకు రాజాదరణ ప్రజాదరణ పొందింది.

రాష్ట్రకూట ప్రభువులు జైన మతస్తులు. తూర్పు చాళుక్యులకు రాష్ట్రకూటులతో వివాహ బాంధవ్యం ఏర్పరచటంతో ఆంధ్రదేశంలో జైనమతానికి విస్తారం ప్రసారం లభించింది. పిఠాపురం, జల్లూరు, బాయనపూడి, ఆర్యవటం, పెనుగొండ మొదలైన స్థలాలలో వసతులు నిర్మించటంతో పాటు తీర్థంకర విగ్రహాలను కూడ స్థాపించారు.

వేములవాడ చాళుక్యుల రాజధాని వేములవాడ ప్రసిద్ధ జైనస్థలం. కళ్యాణ చాళుక్యులు కూడ జైనమతాన్ని ఆదరించారు. కొలనుపాక, వర్థమానపురం, ఉజ్జిలి మొదలైన స్థలాలలోని జైనులకు ఆరో విక్రమాదిత్యుడు అనేక దానాలను చేశాడు.

జైనులు తమ మతాన్ని ప్రజల భాషలో ప్రచారం చేసేవారు, ప్రజల భాషలో గ్రంథాలు రాసేవారు. వైద్యం జ్యోతిషం మొదలైనవి నేర్చుకొని ప్రజలకు సేవచేసేవారు. అయితే జైనులకూ హిందువులకూ మధ్య ఆచార వ్యవహారాలలో సామ్యం ఉండేది. వైదిక మతంలోని వర్ణవ్యవస్థ ఈ మతంలోకి కూడా వ్యాపించింది.

కాలగమనంలో శైవంలో తీవ్రవాదులు కావటం వల్ల చోళుల చేతిలో కళ్యాణ చాళుక్యులు పరాజితులు కావటం వల్ల ఆంధ్రదేశంలో జైనం నశించింది.

జైన, బౌద్ధమతాల స్పర్థ లేకపోవడంవల్ల వైదికమతం అభివృద్ధి చెందింది. తూర్పు చాళుక్య ప్రభువులు దేవాలయాలు నిర్మించారు. వాటి నిర్వహణకు అనేక దానధర్మాలు చేశారు. ఈ కాలంలో బౌద్ధ క్షేత్రాలు, శైవ క్షేత్రాలుగ పరిణతి చెందాయి. దేవాలయాలు మతానికి కేంద్రస్థానాలు. దేవాలయాలను కేవలం ఆరాధనా స్థలాలుగనే కాక విజ్ఞాన విషయ బోధక కేంద్రాలుగా కూడ పరిగణించారు.

జయసింహుడు నిడుదవోలులో గోలింగేశ్వరాలయాన్ని, రెండో విజయాదిత్యుడు నూటయెనుబది శివాలయాలను, చాళుక్యభీముడు ద్రాక్షారామ భీమేశ్వరాలయాన్ని నిర్మించారు. ఇంకా రాణులు, సామంతులు ఎన్నో ఆలయాలు నిర్మించి వాటికి దానాలు చేసి వైదిక మత వ్యాప్తికి దోహదం చేశారు.

BRAOU

ఆనాడు శైవ వైష్ణవ మతాలు ప్రచారంలోకి వచ్చాయి. ఈ శైవంలో పాశుపతం కాలాముఖం అనే విభిన్న శాఖలు వచ్చాయి. వీరు తీవ్రవాదంతో తమ మత ప్రచారానికి పూనుకోవటమేగాక, హింసతో ఇతర మతాలను అణచటానికి ప్రయత్నించారు. వీరివల్లనే జైన బౌద్ధమతాల పట్ల ద్వేషభావం అంకురించింది.

ఆంధ్రదేశంలో రాజుల అంతఃకలహాల వల్ల అరాజకం ఏర్పడితే, ఇరుపక్షాల రాజులు ఏదో ఒక మతాన్ని అభిమానించటంతో మతకలహాలుకూడా ఈ కాలంలోనే ప్రారంభం అయ్యాయి.

ఈ విధంగా నాటి ఆంధ్రజన జీవన స్రవంతిలో మతం ఒక ప్రధాన స్థానాన్ని పొందింది.

**చదవదగిన పుస్తకాలు**


ఆంధ్రుల సంస్కృతి – చరిత్ర : కంబంపాటి సత్యనారాయణ

ఆంధ్రుల చరిత్ర – సంస్కృతి : ఖండవల్లి లక్ష్మీరంజనం, ఖండవల్లి బాలేందు శేఖరం

ఆంధ్రుల చరిత్ర : డా. బి.ఎస్. ఎల్. హనుమంతరావు

ఆంధ్రుల సాంఘిక చరిత్ర : సురవరం ప్రతాపరెడ్డి

ఆంధ్రప్రదేశ్ దర్శిని : విశాలాంధ్ర ప్రచారణాలయం

ప్రాచీనదక్షిణ భారత చరిత్ర : డా. నండూరి రామకృష్ణమాచార్య

ఆంధ్రదేశ చరిత్ర ఆధునికయుగం : జి. వెంకటరామారావు

మన వాస్తుకళ : కొండూరి వీరరాఘవాచార్యులు

విజ్ఞాన సర్వస్వం 1, 2, 3, 4 సంపుటాలు తెలుగు భాషా సమితి

తెలుగు వాణి : ప్రపంచ తెలుగు మహాసభలు

The Age of Satavahanas : Dr. B.S.L. Hannamantha Rao

Chalukyas : K. A. Neelakanta Sastry

The Eastern Chalukyas of Vengi : Dr. N. Ramesan

Hisgory of Reedy Kingdom : Mallampally Somasekhara Sarma

Indian History and culture : K. Basaveshwara Rao

History of Modern Andhra : Dr. P.R. Rao

Book of printing India : Dr. J. Mangamma

ప్రాచీనాంధ్ర శాసనాలు : డా. బూదరాజు రాధాకృష్ణ

ప్రాఙ్నన్నయ యుగము : డా. దివాకర్ల వెంకటావధాని

తెలుగు భాషా చరిత్ర : డా. భద్రిరాజు కృష్ణమూర్తి (సం)

సమగ్రాంధ్ర సాహిత్యం (అన్ని సంపుటాలు) : ఆరుద్ర

ఆంధ్ర కవితరంగిణి : చాగంటి శేషయ్య

తెలుగు సాహిత్య సమీక్ష : డా. జి. నాగయ్య

దాక్షిణాత్య సాహిత్య సమీక్ష : డా. జి. నాగయ్య

ద్విపద వాఙ్మయము : డా. జి. నాగయ్య

పురాణ వాఙ్మయము : డా. జి.వి. సుబ్రహ్మణ్యం

ఆంధ్రవచన వాఙ్మయము : నిడదవోలు వెంకటరావు

ఆంధ్ర శతక సాహిత్య వికాసము : డా. కె. గోపాల కృష్ణారావు

తంజావురాంధ్ర సాహిత్య చరిత్ర : కొక్కొండ సత్యవతి


BRAOU

| | | |
|---|---|---|
| తెలుగు భాషలో ఛందోరీతులు | : | రావూరి దొరస్వామి శర్మ |
| తంజావురాంధ్ర నాయకరాజ చరిత్ర | : | కురుగంటి సీతారామయ్య |
| మహతి | : | యువభారతి ప్రచురణ |
| అభ్యుదయ (విమర్శ విశేష సంచిక) | : | తుమ్మల వెంకట్రామయ్య (సం) |
| బ్రౌన్ లేఖలు | : | బంగోరె (సం) |
| మహోదయం | : | కె.వి. రమణారెడ్డి |
| తెలుగుసాహిత్యం, మరోచూపు | : | కె.కె. రంగనాథాచార్యులు (సం) |
| తెలుగులో తొలి సమాజ కవులు | : | కె.కె. రంగనాథాచార్యులు (సం). |

**మాదిరి పరీక్షా ప్రశ్నలు**

I. ఈ కింది ప్రశ్నలకు 30 వాక్యాలకు మించకుండా సమాధానాలు రాయండి.

1. తూర్పు చాళుక్యుల పాలనా విధానాన్ని పరిశీలించండి.
2. పూర్వయుగం మలిదశలోని వినోదాలను వేడుకలను వివరించండి.
3. పూర్వయుగం మలిదశలోని ఆచార వ్యవహారాలను రాయండి.
4. క్రీ. శ. 600 – 1000 మధ్యకాలంలోని ఆర్థిక పరిస్థితులను వివరించండి.
5. క్రీ. శ. 600 – 1000 మధ్యకాలంలోని సామాజిక జీవితాన్ని విశదీకరించండి.

II. ఈ కింది ప్రశ్నలకు 10 వాక్యాలు మించకుండా సమాధానాలు రాయండి.

1. క్రీ. శ. 600 – 1000 మధ్య వర్ణవ్యవస్థ.
2. క్రీ. శ. 600 – 1000 విద్య, సాహిత్యం, కళలు.

BRAOU

# భాగం–23 తెలుగు సంస్కృతి మధ్యకాలీన దశ I
# (క్రీ. శ. 1000 – 1600)

విషయక్రమం


23.0 లక్ష్యాలు

23.1 పరిచయం

23.2 రాజకీయ చరిత్ర

23.3 పాలనా వ్యవస్థ

23.4.0 ఆర్థిక పరిస్థితులు

23.4.1 వ్యవసాయం

23.4.2 పరిశ్రమలు

23.4.3 వాణిజ్యం

23.5.0 సామాజిక జీవనం

23.5.1 వర్ణవ్యవస్థ

23.5.2 విద్య, సాహిత్యం

23.5.3 వేడుకలు, వినోదాలు

23.5.4 మతం

23.5.5 ఆచార వ్యవహారాలు

అవగాహన ప్రశ్న

23.6 సారాంశం

అవగాహన ప్రశ్నలకు జవాబు

చదవదగిన పుస్తకాలు

మాదిరి పరీక్షా ప్రశ్నలు


BRAOU

## 23.0 లక్ష్యాలు

క్రీ. శ. 1000 నుండి క్రీ.శ. 1600 వరకు సాగిన చారిత్రక కాలంలోని అంటే తూర్పు చాళుక్య రాజు శక్తివర్మ కాలం నుండి, విజయనగర సామ్రాజ్య పతనం వరకు గల కాలంలోని ఆంధ్ర సంస్కృతిని ఈ భాగం చదివాక మీరు వివరించ గలుగుతారు.

## 23.1 పరిచయం

తూర్పు చాళుక్య ప్రభువు శక్తివర్మ మొదలుకొని ఆంధ్రదేశాన్ని వెలనాటి చోళులు, చాగివారు, కోటవారు, హైహయులు, తెలుగు చోడరాజులు, కమ్మనాయకులు, రెడ్డిరాజులు, కాకతీయులు, విజయనగర రాజులు, బహమనీ సుల్తానులు రాజ్యమేలారు. అప్పటి తెలుగు సంస్కృతి చరిత్రను ఈ భాగంద్వారా తెలుసుకొందాం.

## 23.2 రాజకీయ చరిత్ర

తూర్పు చాళుక్య ప్రభువు శక్తివర్మ క్రీ. శ. 1011 వరకు వేంగీ రాజ్యాన్ని పాలించాడు. చోళచక్రవర్తి రాజరాజకేసరివర్మ కుమార్తె కుందవ్వను విమలాదిత్యుడు వివాహమాడటంతో చోళ చాళుక్య సంబంధాలు గట్టిపడ్డాయి. శక్తివర్మ తరువాత అతని సోదరుడు విమలాదిత్యుడు పాలించాడు. ఈతనికి రాజమార్తాండుడు

ముమ్మడి భీముడు అనే బిరుదాలు ఉన్నాయి. ఈయన జీవిత చరమదశలో జైనమతాన్ని స్వీకరించినట్లు రామతీర్థ శాసనం వల్ల తెలుస్తుంది. ఈ విమలాదిత్యునికి రాజరాజనరేంద్రుడు, విజయాదిత్యుడు అనే కుమారులు ఉన్నారు. రాజరాజనరేంద్రునికి విజయాదిత్యునికి సింహాసనం కోసం సుదీర్ఘ పోరాటం జరిగింది. చోళుల సహాయం రాజరాజనరేంద్రునికి పశ్చిమ చాళుక్యుల సహాయం విజయాదిత్యునికి లభించాయి. రాజరాజ నరేంద్రుడు క్రీ. శ. 1022 లో పట్టాభిషిక్తుడై క్రీ. శ. 1061 వరకు రాజ్యం చేశాడు. ఈయన పరిపాలనలో ఎక్కువ కాలం యుద్ధాలతో గడిచిపోయింది. రాజరాజనరేంద్రుని కుమారుడు రాజేంద్రుడు వేంగీ సింహాసనాన్ని అధిష్టించాడు. ఈ రాజేంద్రుడు తన మేనమామ కుమార్తె, చోళరాజ కుమార్తె అయిన మధురాంతకదేవిని వివాహమాడాడు. ఈయన చోళసింహాసనాన్ని అధిష్టించి పినతండ్రి విజయాదిత్యునికి వేంగీ రాజ్యాన్ని ఇచ్చాడు. విజయాదిత్యుని మరణానంతరం చాళుక్య రాజ్యం చోళసామ్రాజ్యంలో అంతర్భాగమైంది. దీనిని రాజ ప్రతినిధులు పాలించారు.

పండ్రెండవ శతాబ్దిలో ప్రాగాంధ్రంలో వెలనాటి చోడరాజులు, పశ్చిమాంధ్రంలో కాకతీయులు శక్తిమంతులయ్యారు. వెలనాటి చోడులు కాంచీపుర చాళుక్య చోళ చక్రవర్తులకు సామంతులు. ఈ వంశానికి మూలపురుషుడు మల్లవర్మ. ఈయన 'ఆరువేలనాడు' అధిపతి. ఈ ఆరువేలనాడు వెలనాటిలో ఉంది. వెలనాటిచోడులలో ప్రసిద్ధికెక్కినవాడు మొదటి గొంకరాజు. ఈయన కులోత్తుంగ చోళచక్రవర్తి సేనాని. ఆయన అనుగ్రహంవల్ల వెలనాటి మీద అధికారం పొందాడు. కులోత్తుంగ చోళునకు పిదప వెలనాటివారే పాలకులయ్యారు మొదటి గొంకరాజు. ఈయన కులోత్తుంగ చోళచక్రవర్తి సేనాని. ఆయన అనుగ్రహంవల్ల వెలనాటి మీద అధికారం పొందాడు. కులోత్తుంగ చోళునకు పిదప వెలనాటివారే పాలకులయ్యారు. మొదటి గొంకరాజు కుమారుడు మొదటి వెలనాటి చోడుడు. ఈయనకు "కులోత్తుంగ చోడుడ"నే నామాంతరం ఉంది. చోళ సార్వభౌముడు కులోత్తుంగ చోళుడు మరణించిన పిదప పశ్చిమ చాళుక్య ప్రభువు ఆరో విక్రమాదిత్యుడు వేంగీ రాజ్యాన్ని జయించినట్లు శాసనాలవల్ల తెలుస్తుంది. కాంచీపుర చోళులు, వెలనాటి చోడులు పశ్చిమ చాలుక్యులను ఓడించటానికి ప్రయత్నించి చివరకు విజయాన్ని పొందారు. మొదటి వెలనాటి చోడుని కుమారుడు రెండవ గొంకరాజు పాలించాడు. ఈయన కాలంలో వెలనాటి వారి పాలన ఉత్తరాన మహేంద్రగిరి నుండి దక్షిణాన పాకనాటి వరకు వ్యాపించింది. ఈయన కుమారుడు రెండవ వెలనాటి చోడరాజు ఆంధ్రుల విషయాధిపతిగా ఉన్నాడు. ఈయన కుమారుడు గొంకరాజు సమర్థుడు కాకపోవటంతో సామంతులు తిరుగుబాటు చేశారు. ఈ సామంతులలో తూర్పుచాళుక్య వంశస్థుడైన విష్ణువర్ధన మల్లపరాజు ఒకడు. ఈతడు వెలనాటివారి నుండి పిఠాపుర ప్రాంతాన్ని స్వాధీనపర్చుకొన్నాడు. కాకతీయులు కూడ ఈ సమయంలోనే దండెత్తారు. కాకతి రుద్రమదేవుని శాసనం ద్రాక్షారామంలో కన్పిస్తుంది. తరువాత వెలనాటి చోళులు తేరుకున్నారు. కాని వెలనాటి చోడులు చందవోలు, గుంటూరు ప్రాంతాన్ని కూడ పోగొట్టుకున్నారు. ఈ వంశంలో చివరి ప్రభువు మూడో గొంకరాజు కుమారుడు పృథ్వీశ్వర రాజు. ఈయన పోయిన భాగాన్ని తిరిగి సంపాదించాలని ప్రయత్నించాడు. కాని ఆ ప్రయత్నంలో వేలూరు చోడతిక్కరాజుతో జరిగిన యుద్ధంలో మరణించాడు. దీనితో వెలనాటి చోడరాజుల స్వతంత్ర పాలన ముగిసింది. క్రీ. శ. 1265 లో కాకతీయ రాజ్యాంతర్భాగమైంది. వీరి తరువాత "చాగి" వారు, "కోట" వారు, "హైహయులు" "తెలుగుచోడ రాజులు", "కమ్మనాయకులు" పరిపాలించారు. ఈ మాండలిక ప్రభువులు తమలో తాము కలహించుకొంటూ దేశంలో అశాంతినీ అరాజకాన్నీ కలిగించారు.

కృష్ణానదికి దక్షిణాన మాండలిక ప్రభువులై పాలించినవారు తెలుగుచోడులు. తెలుగులో మొట్టమొదట శాసనాలు ప్రకటించినవారు రేనాటి చోడులు. ఈ రేనాటి చోడులు కడప మండలాన్ని పాలించేవారు. ఈ రేనాటి చోడుల తరువాత ఈ ప్రాంతాన్ని పాలించిన వారు పొత్తపిచోళులు. వీరి రాజధాని పొత్తపి. కమ్మనాటిని కొణిదెన చోడులు పాలించారు. వీరి రాజధాని కొణిదెన వీరిలో "నన్నూరుచోడు" అనే వారు కలరు. "నెల్లూరుచోడు" అనే శాఖ కూడ ఉంది. ఈ శాఖకు చెందిన వాడే మనుమసిద్ధి.

ఆంధ్రదేశ చరిత్రలో ఒక ప్రముఖ ఘట్టాన్ని సృష్టించినవారు "కాకతీయులు". తెలుగుజాతికి ఒక వ్యక్తిత్వాన్ని కలిగించిన వారు కాకతీయులు. నతవాటి సీమ, కొరవి సీమను పాలించిన "మొదటి బేతరాజు" ఈ వంశంలోని మొదటి ప్రభువు. ఈతని జీవితమంతా పోరాటాలతోనే గడిచిపోయింది. తరవాత "మొదటి ప్రోలరాజు" పాలించాడు. ఈయన "అనుమకొండ" విషయాన్ని పశ్చిమ చాళుక్య చక్రవర్తి నుండి పొందాడు.

పిదప "త్రిభువనమల్ల బేతరాజు"నే "రెండో బేతరాజు" పాలించాడు. ఈయన కాలంలోనే కాకతీయులు పశ్చిమ చాళుక్యుల నుండి "సబ్బి మండలాన్ని "పొందారు. ఈయన కుమారుడు రెండో ప్రోలరాజు కాలంలో కాకతీయ రాజ్యం స్వతంత్రమైంది. పిదప రుద్రదేవుడు పాలించాడు. ఈయన కాలంలో కాకతీయ పాలన ఉత్తరాన గోదావరి వరకు, దక్షిణాన శ్రీశైలం వరకు, పశ్చిమాన కల్యాణి వరకు తూర్పున తూర్పు కనుమల వరకు విస్తరించింది. తరవాత మహాదేవరాజు, పిదప గణపతిదేవుడు పాలించారు. గణపతిదేవుని కాలంలో కాకతీయ రాజ్యం సామ్రాజ్యంగా వృద్ధిచెందింది. ఈయన కుమార్తె కాలం వరకు "అనుమకొండ" రాజధాని. ఈయన కాలంలో "ఓరుగల్లు" రాజధాని. తరవాత ఈయన కుమార్తె రుద్రాంబ పాలించింది. ఈమె ప్రజానురాగాన్ని పొందిన మహారాజ్ఞి. ఈమె అనంతరం దౌహిత్రుడైన ప్రతాపరుద్రుడు పాలించాడు ఈయన వీరుడు. విద్వత్కవి పోషకుడు. ఈయన కాలంలోనే సామ్రాజ్యం ఔన్నత్యాన్ని పొందటం, పతనం చెందటం జరిగింది. ఈయన కాలంలోనే ముస్లిం సేనానులు కాకతీయ రాజ్యంపై దండెత్తారు. అనేక యుద్ధాలలో వారిని ఓడించాడు. చిట్ట చివరకు వారి చేతిలో ఓడిపోయి బందీ అయ్యాడు. కాకతీయ సామ్రాజ్యం ఢిల్లీ సామ్రాజ్యంలో భాగమైంది.

కాకతీయ సామ్రాజ్య పతనానంతరం ఢిల్లీ సుల్తాన్ "ఘియాసుద్దీన్ తుగ్లక్" ఈ రాజ్యాన్ని రెండు భాగాలుగా విభజించాడు. తూర్పు భాగానికి రాజధాని ఓరుగల్లు. పశ్చిమ భాగానికి రాజధాని కంపిలి.

ప్రతాప రుద్రుని సేనాని గజసాహిని అన్నయ డెబ్బయిరెండు మంది సామంత రాజులను సమీకరించి ఆంధ్రదేశం నుంచి ముస్లిం సైన్యాలను తరిమి వేయడానికి ప్రయత్నించాడు. వీరు ముసునూరు ప్రోలయ నాయకుని నాయకుడుగా ఎన్నుకున్నారు. వీరు ప్రోలయ నాయకుని నాయకత్వంలో ముస్లిం సైన్యాలను ఆంధ్రదేశం నుంచి తరిమివేశారు.

ప్రోలయ నాయకుడు తీరాంధ్ర పాలనను కాపయ నాయకునకు అప్పగించాడు. కాపయ నాయకుడు ఆంధ్రదేశానికి నాయకుడై 'ఆంధ్రదేశాధీశ్వర', 'ఆంధ్రసురత్రాణ' అనే బిరుదాలు ధరించాడు. కాలగతిలో సామంతులలో అనైక్యత ఏర్పడింది. దీనివల్ల ముసునూరి నాయకులు ఓరుగల్లులోను, పద్మనాయకులు (వెలమలు) రాచకొండలోను, యాదవులు విజయనగరంలోను, రెడ్లు కొండవీడులోను, మంచికొండ నాయకులు కోరుకొండలోను, కొప్పుల కుటుంబంవారు పిఠాపురంలోను పాలించారు. కళింగం తూర్పు గంగరాజుల పాలనలో ఉండేది.

ఈ అల్లకల్లోల పరిస్థితులలోనే ముస్లిం సేనాధిపతులు కొందరు గుల్బర్గా రాజధానిగా క్రీ. శ. 1347 బహమనీ రాజ్యాన్ని స్థాపించారు. ఈ రాజ్య స్థాపకుడు అల్లాఉద్దీన్ బహమన్‌షా.

కాపయ నాయకుడు తన రాజ్యాన్ని సుస్థిరం చేసికోవటానికి అల్లాఉద్దీన్ బహమన్‌షాతో రాజకీయ స్నేహం చేశాడు. కాని ఈ స్నేహం ఎక్కువ కాలం నిలబడలేదు. బహమన్‌షా కాపయ నాయకుని ఓడించి కప్పం కట్టించుకొన్నాడు. కాపయ నాయకుడు మొదటి మహమ్మద్‌షా కాలంలో కూడా మరో పర్యాయం ఓడిపోయాడు. ఈ సమయంలోనే చర్ల అనపోతా నాయుడు వరంగల్లు మీద దండెత్తాడు. ఈ పోరాటంలో కాపయనాయకుడు మరణించాడు. దీనితో ముసునూరి నాయకుల పాలన ముగిసింది.

రేచర్లవారి రాజధాని రాచకొండ. అనపోత నాయకుడు ఓరుగల్లు రాజ్యాన్ని క్రీ. శ. 1384 వరకు పాలించాడు. ఆయనకు తమ్ముడు మాదానాయుడు సహాయంచేశాడు. అనపోతానాయుని రాజ్యం గోదావరివరకి, శ్రీశైలానికి మధ్య గల తెలంగాణా ప్రాంతంలో ఉండేది. అనపోతా నాయుడు తన రాజ్యాన్ని రెండు భాగాలుగా విభజించాడు. అనపోతనాయుని అనంతరం అతనికుమారుడు కుమారసింగ నాయుడు పాలించాడు. ఈయన కాలంలో బహమనీ సుల్తానులతో మైత్రి, రెడ్డిరాజులతోను విజయనగర రాజులతోను శత్రుత్వం ఏర్పడింది. తరువాత ఈయనకుమారుడు రెండో తనాయుడు, తరువాత ఈయన సోదరుడు మాదా నాయుడు పరిపాలించారు. ఈ మాదానాయుని కాలంలో విజయనగరంవారితో స్నేహం. బహమనీవారితో శత్రుత్వం కలిగింది. మాదానాయుడు బహమనీసుల్తాన్‌తో జరిగిన యుద్ధంలో అధికభాగాన్ని కోల్పోయాడు. ఈ సమయంలో దేవరకొండలో లింగమనాయుడు పాలించాడు. పూర్వం బహమనీ సుల్తానులు ఆక్రమించిన భాగాలు తిరిగి పద్మనాయకుల స్వాధీనం అయ్యాయి. కానీ అనతికాలంలోనే రాచకొండతో సహా ఈ భాగాలన్నిటిని బహమనీసుల్తానులు స్వాధీనం చేసి కొన్నారు. దీనితో సింగమనాయుడు నిస్సహాయుడై గజపతుల సహాయాన్ని



BRAOU

కోరాడు. కాని బహమనీసుల్తాన్ గజపతులను ఓడించి ఆ ప్రాంతానికి తన తమ్ముని రాజప్రతినిధిగా నియమించాడు. మహమనీసుల్తాన్ హుమాయూన్‌కాలంలో పద్మనాయక ప్రభువు తమ భాగాలను స్వాధీనం చేసికొనే ప్రయత్నాలు చేశాడు. షుల్లాను దేవరకొండను ముట్టడించాడు. పద్మనాయక ప్రభువు గజపతుల సహాయంతో బహమనీ సుల్తాన్‌ను ఓడించాడు. బహమనీసుల్తాను నిజాంషా తిరిగి పద్మనాయకులపై దాడి చేశాడు. ఈ పర్యాయం పద్మనాయక ప్రభువులు ఓడిపోయారు. దీనితో పద్మనాయకరాజ్యం అంతరించింది.

నెల్లూరు సింహాచలాల మధ్య గల ప్రాంతాన్ని పాలించినవారు రెడ్డిరాజులు. వీరు ఆంధ్రభాషా సంస్కృతులకు మెరుగులు దిద్దారు. కొండవీటి రెడ్డిరాజ్య స్థాపకుడు ప్రోలయ వేమారెడ్డి. ఈయన రాజ్యాం కృష్ణానది, శ్రీశైలం, అహోబిలక్షేత్రం, కందుకూరి సీమ, తూర్పు తీరాల మధ్య వ్యాపించింది. ఈయన ధరణికోట, చందోలు, వినుకొండ, బెల్లంకొండ, కొండవీడు కందుకూరు, కొండపల్లి దుర్గాలను నిర్మించాడు. ఈయన రాజధాని అద్దంకి. ఈయన అన్న మాచారెడ్డి చందోలు దుర్గాన్ని నిర్మించాడు. ఈయన రాజధాని అద్దంకి. మాచారెడ్డి చందోలుదుర్గానికి, తమ్ముడు మల్లారెడ్డి కందుకూరుకు ప్రభువులు అయ్యామల్లారెడ్డి "సర్వ సైన్యాధ్యక్షుడు" కూడ. ఈయన అనంతరం కుమారుడు అనపోతారెడ్డి సింహాసనాన్ని అధిష్ఠించాడు. ఈయన కాలంలోనే కోనహైహయులు, కోరుకొండ - రాజమహేంద్రవర ముమ్మడినాయకుడు, కొప్పుల (పిఠాపురం) వారు సామంతులయ్యారు. కృష్ణా, గోదావరి మండలాలలోని క్షత్రియులు ఏరువ చోడ భక్తిరాజు కూటమిగా ఏర్పడి అనపోతారెడ్డిని ఓడించారు. అనంతరం ఈయనకు పద్మనాయక ప్రభువులలో యుద్ధం జరిగింది. పద్మనాయకులు శ్రీశైల ప్రాంతాన్ని ఆక్రమించారు. ఈ సమయంలోనే బహమనీసుల్తాన్‌కూడ దండెత్తాడు; కాని ఓడిపోయిడు. ఈయనకాలంలోనే కొండవీడు రాజధాని అయింది. తరవాత అనవేమారెడ్డి పాలించాడు. ఈయన కాలంలో శ్రీశైలం తిరిగి రెడ్డిరాజుల వశమైంది. పిదప కుమారగిరి పాలించాడు. చందోలు పాలించిన కాటయవేముడు కుమారగిరిని ప్రతిఘటించాడు. ఈ సమయంలోనే శ్రీశైల ప్రాంతాన్ని విజయనగరరాజులు స్వాధీనపరచుకొన్నారు. రేచర్లనాయకులు కళింగ ప్రాంతంపై దండెత్తి బోడపూడి మొదలైన దుర్గాలను వశపర్చుకొన్నారు. కుమారగిరి తన బావమరిది కాటయనాయకుని సహాయంతో వినుకొండ, త్రిపురాంతక ప్రాంతాలను స్వాధీనపరచుకొన్నాడు. శ్రీశైల ప్రాంతం రాయల అధీనంలోనే ఉంది. కుమారగిరి కళింగదండయాత్రకు కాటయ వేముని పంపాడు. ఈ యుద్ధయాత్రలో యువరాజు అనపోతారెడ్డి కూడ పాల్గొన్నాడు. ఈ ప్రాంతానికి యువరాజును రాజప్రతినిధిగా నియమించాడు. దీనికి రాజదాని రాజమహేంద్రవరం. మిగిలిన ప్రాంతాలకు విశ్వసపాత్రులైన సామంతులను నియమించాడు. ఇంతలోనే అనపోతారెడ్డి మరణించాడు. ఈ భాగాన్ని కుమారగిరి రెడ్డి కాటయవేమునకు ఇచ్చాడు. దీనివల్ల రెడ్డి రాజ్యంలో అంతర్యుద్ధం కలిగింది. ఈ అంతర్యుద్ధంలో పెదకోమటి వేమారెడ్డి కొండవీటిని ఆక్రమించాడు. కుమారగిరిని రాజధాని నుండి పారద్రోలాడు. కుమారగిరి వ్యాధిగ్రస్తుడై మరణించాడు. కాటయ వేమారెడ్డి కొండవీటిపై దండెత్తాడు. కాని ఫలితం లేకపోయింది. విజయనగరరాజులు ఆక్రమించిన ధారాలను కోమటి వేముడు స్వాధీనం చేసికొన్నాడు. కోమటి వేమారెడ్డి కొండవీడు, రాజమహేంద్రవర రాజ్యలను కలిపివేయటానికి ప్రయత్నించాడు. ఈ యుద్ధాలలోనే కాటయ వేముడు మరణించాడు. కాని విజయనగర ప్రభువుల సహాయంతో రాజమహేంద్రవర రాజ్యం సుస్థిరంగా నిలబడింది. పద్మనాయక ప్రభువులతో జరిగిన యుద్ధాలలో పెదకోమటి వేమారెడ్డి మరణించాడు. పిదప ఈయనకుమారుడు రాచవేమారెడ్డి పాలించాడు. ఈయన "పురిటి సుంకం" మొదలైన పన్నులు విధించి ప్రజాదరణ కోల్పోయాడు. ఈయనను బలిజనాయకుడు వధించినట్లు కొండవీడు కైఫీయత్తువల్ల తెలుస్తుంది. ఈయనతో కొండవీటి రెడ్డి రాజ్యం అస్తమించింది.

రాజమహేంద్రవరాన్ని కాటయ వేముడు, రెండో కుమారగిరి పాలించారు. ఈయన అకాలమరణాన్ని పొందాడు. ఈయన తరవాత వీరభద్రారెడ్డి సింహాసనమెక్కాడు. ఈయన కాలంలోనే అంతర్యుద్ధం జరిగింది. దీనికి మూడో కుమారగిరిరెడ్డి, మూడో అనపోతారెడ్డి కారకులు. చివరకు వీరభద్రారెడ్డి విజయాన్ని పొందాడు. అన్నగారైన వేమారెడ్డి సర్వాధికారాలు వహించాడు. తరువాత కళింగంలో జరిగిన మార్పులవల్ల రాజమహేంద్రవర రాజ్యాంగం గజపతుల రాజ్యంలో అంతర్భాగమైంది.

ఆత్మకూరు, ఉదయగిరి, కనిగిరి పాటించిన మరో రెడ్డి వంశానికి మూలపురుషుడు మల్లారెడ్డి. ఈయన పౌత్రుడు శ్రీగిరి కాలంలో కందుకూరు వరకు రాజ్యం విస్తరించింది. తరువాత వీరు పొత్తపి పులుగువాడులను ఆక్రమించారు. ఈ వంశస్థుడు రెండవకోమటి రెడ్డి తీరాంధ్రాన్ని కూడ ఆక్రమించాడు. కాని పెదకోమటి

వేముడు తీరాంధ్రాన్ని తిరిగి స్వాధీనం చేసికొన్నాడు. చివరకు వీరు విజయనగర ప్రభువులు సామంతు లయ్యారు.

హిందూ మత సంస్కృతులకు రక్షణ కల్పించినవారు, ఈ విజయ నగరాన్ని మొదట పాలించినవారు సంగమ వంశస్థులు. ఈ వంశంలో ముఖ్యులు హరిహర రాయలు, బుక్కరాయలు, మొదటి దేవరాయలు, రెండవ దేవరాయలు. ఈయన తరవాత వారు శక్తిహీనులగుటలో గజపతులు, బహమనీయ సుల్తానులు విజయనగరాన్ని ముట్టడించారు. ఈ వంశంలో చివరివాడైన ప్రౌఢరాయల దుర్మార్గుడవటంలో సాళువ నరసింహుడు విజయనగర సామ్రాజ్యాన్ని ఆక్రమించాడు. ఈయన సామంతరాజును అదుపులో పెట్టి శాంతి భద్రతలను చక్కదిద్దాడు. తరువాత గజపతులతో జరిగిన యుద్ధంలో వారికి బందీ అయ్యాడు. ఉదయగిరిని గజపతులకిచ్చి సంధిచేసికొన్నాడు. ఈయన తరవాత తిమ్మరాజు, ఇమ్మడి నరసింహుడు పాలించారు. సాళువ నరసింహుని సేనానాయకుడు తుళువ నరసానాయకుడు. సాళువ నరసింహుడు తన కుమారులను ఈయనకు అప్పగించి మరణించాడు. తుళువ నరసా నాయకుడు వారినే అధికార స్థానంలో ఉంచి కార్యభారాన్ని వహించేవాడు. కాని సాళువ నరసింహుని రెండో కుమారుడు ఇమ్మడి నరసింహుడు తుళువ నరసా నాయకుని పదవి నుంచి తొలగించాడు. నరసా నాయకుడు విజయనగరంపై దండెత్తి ఇమ్మడి నరసింహుని బందీచేసి సింహాసనాన్ని ఆక్రమించాడు. దీనితో తుళువ వంశ పాలన ప్రారంభమైంది. ఈయన విజయనగర రాజ్యానికి సుస్థిరత కల్పించాడు. పిదప ఈయన కుమారుడు వీరనరసింహుడు పాలకుడయ్యాడు. వెంటనే పెనుగొండలో బందీగా ఉన్న ఇమ్మడి నరసింహుని హత్య చేయించాడు. దీనితో సాళువ వంశం అంతరించింది. ఈ వీరనరసింహుడు ఐదు సంవత్సరాలు పాలించాడు. ఈయన కాలం యుద్ధంతోనే గడిచిపోయింది. ఈతనికి యుద్ధాలలో ఆరవీటి వంశస్థులు సహాయం చేశారు. కందనవోలు, ఆదోని పాలనను వారికి ఇచ్చాడు. ఈయన తరవాత శ్రీకృష్ణదేవరాయలు సింహాసనాన్ని అధిష్ఠించాడు. ఈయన కాలంలో విజయనగర సామ్రాజ్యం నలువైపులకి వ్యాపించింది. ఇటు గజపతులతోను, బహమనీ సుల్తానులతోను పోరాడుతూనే దక్షిణదేశంలో కూడ తన పాలనను వ్యాపింపచేశాడు. ఈయన అనంతరం విజయనగరంలో అంతఃకలహాలు ఏర్పడ్డాయి. ఈయనకు పిదప అచ్యుతదేవరాయలు, సదాశివ రాయలు పాలించారు. శ్రీకృష్ణదేవరాయల అల్లుడు అళియ రామరాయలు రాజ్యకార్యాలను నిర్వహించేవాడు. రాజనీతి చతురుడు. ఈయన కాలంలోనే తళ్ళికోట యుద్ధం జరిగింది. బహమనీ సుల్తానులు విజయనగరాన్ని సమూలంగా ధ్వంసం చేశారు. సదాశివరాయలతో తుళువ వంశం నశించింది. జీర్ణ విజయనగర రాజ్యాన్ని అరవీటి వంశస్థులు పెనుగొండ రాజధానిగా పాలించారు. కాని అంతఃకలహాలవల్ల సుస్థిర రాజ్యాన్ని ఏర్పరచలేక పోయారు.

తూర్పు పశ్చిమ సముద్రాల వరకు బహమనీ రాజ్యం వ్యాపించింది. రాజ్య స్థాపకుడు అల్లాఉద్దీన్ బహమన్‌షా. ఈయన అనంతరం మొదటి మహమ్మద్‌షా. ముజాహిద్‌షా పాలించాడు. ఈయనను చంపించి పినతండ్రి రాజ్యానికి వచ్చాడు. ఈయన తరువాత రెండో మహమ్మద్‌షా, ఈయన కుమారులిరువురు పరిపాలించారు. పిదప ఫిరోజ్‌షా, మొదటి అహమ్మద్‌షా, రెండో అహమ్మద్‌షా, హుమాయూన్ పాలించారు. ఈయనకు పిదప మూడో అహమ్మదుషా పాలించారు. ఈయన కాలంలోనే బహమనీ రాజ్యం బాగా విస్తరించింది ఈయన తరవాత మహమూద్‌షా పాలించాడు. తరువాత బహమనీ రాజ్యం ఐదు చిన్న రాజ్యాలయ్యాయి. వీనిలో గోల్కొండను పాలించినవారు కుతుబ్‌షాహీ వంశస్థులు. వీరు ఆంధ్రదేశాన్ని సమైక్యం చేయ ప్రయత్నించారు. సుల్తాన్ కులీ అనే ఆయన గోల్కొండ రాజ్యాన్ని స్థాపించాడు. ఈయన కుమారుడు జంషీద్ తండ్రిని చంపి సింహాసనాన్ని అధిష్టించాడు. ఈయన తరువాత రాజ్యంలో అంతఃకలహాలు ఏర్పడ్డాయి. ఈ అంతఃకలహాల తరువాత ఇబ్రహీం కుతుబ్ ఉల్‌ముల్క్ పట్టాభిషిక్తుడయ్యాడు. ఈయన కాలంలోనే కొండవీడు, వినుకొండ, కంభం మొదలైన ప్రాంతాలెన్నో గోల్కొండ ప్రభుత్వంలోనికి వచ్చాయి. పిదప మహమ్మద్ కులీ కుతుబ్‌షా పాలించాడు. ఈయన హైదరాబాదు నగరాన్ని నిర్మించాడు. ఈ కాలంలోనే పాశ్చాత్య వర్తకులు ఆంధ్రదేశంలో ప్రవేశించారు. మచిలీపట్టణం, నిజాం పట్టణం, పులికాట్‌లలో డచ్చివారు ప్రవేశించారు. ఈయన మొగలాయిలతో మైత్రి పాటించాడు. గోల్కొండ రాజ్యాన్ని సంస్కృతికి నిలయంగా చెప్పవచ్చు.

ఈ విధంగా ఆరు శతాబ్దాలకాలంలో ఆంధ్రదేశపు రాజకీయ రంగంపై ఎన్నో రాజవంశాలు తమ పాత్రని నిర్వహించాయి. విజయనగర ప్రభువుల దగ్గర అపారమైన సైనిక బలం ఉన్నప్పటికీ బహమనీ సుల్తానులతో యుద్ధాలలో ఓడిపోయేవారు. విజయనగర సైన్యంలోని అశ్వధానుష్క బలాల బలహీనతయే దీనికి కారణం.



BRAOU

దీనిని గ్రహించిన రెండో దేవరాయలు ఈ లోపాన్ని సవరించాడు. మతాన్ని రక్షించడమనే కారణంతో అనేక యుద్ధాలు జరిగాయి. కానీ తమ రాజ్యవిస్తరణ ప్రయోజనలకు అనుకూలంగా ఉంటుందనుకొన్నపుడు మతాన్ని అటు హిందూరాజులు కానీ, ఇటు ముస్లింరాజులు కానీ పట్టించుకోలేదు. ఇందుకు ఉదాహరణగా బహమనీ సుల్తానులకు రెడ్డి ప్రభువులకు, బహమనీ సుల్తానులకు విజయనగర ప్రభువులకు ఏర్పడ్డ రాజకీయ మైత్రిని చెప్పవచ్చు. తాత్కాలికమే అయినా అది రాజకీయ మైత్రి.

## 23.3 పాలన వ్యవస్థ

తూర్పు చాళుక్య ప్రభువు రాజరాజనరేంద్రుని కాలంలో 'పంచ ప్రదాను' లు ఉండేవారని కందంపూడి శాసనం వల్ల తెలుస్తుంది.

తూర్పు చాళుక్యుల పరిపాలనపై చోళుల ప్రభావం కనిపిస్తుంది. గ్రామ పరిపాలన అయిదు విభాగాల వల్ల జరుగుతుందని తెలుస్తుంది. ఇవి : "1. సంవత్సర ఫలిత పరిశీలనం 2. చెరువుల పరిశీలనం 3. తోటల పరిశీలనం 4. న్యాయ విచారణ పరిశీలనం 5. ధర్మాదాయ పరిశీలనం" ఈ అయిదింటిని పరిశీలించడానికి ఆరో విభాగం ఉండేది. ఇది చోళుల పరిపాలన వ్యవస్థ వల్ల కలిగిన విభాగమే.

రాజరాజనరేంద్రుని తరువాత చాళుక్యులు వేంగీ మండలాన్ని పాలించారు. వీరు ఈ ప్రాంతాన్ని రాష్ట్రాలుగా విభజించారు. సామంత ప్రభువులలో తరతమ భేదాలు ఉండేవి. సామంతులు, మండలేశ్వరులు, మహామండలేశ్వరులు అనే విభాగం ఉండేది.

వెలనాటి చోడుల కాలంలో "ప్రధానమంత్రి, ఇతర మంత్రులు, సేనాధిపతి, కోశాధ్యక్షుడు, చక్రవర్తి ప్రతినిధి" తో కలిసి పరిపాలన మండలి ఏర్పడేది. కాలక్రమంలో రాజాధ్యక్షుడు, సంధివిగ్రహిముఖ్యుడు, సమస్త సేనాధిపతి, ధనాధ్యక్షుడు, కోశాధికారి, భండారి అనేవారు ఏర్పడ్డారు.

నేటి రాయలసీమ ప్రాంతం పదకొండు పన్నెండు శతాబ్దాలలో కల్యాణ చాళుక్యుల అధీనంలో ఉండేది వారి పాలననో మొదటి విభాగం 'రాష్ట్రం/మండలం' తరువాత విషయం, నాడు, కంపన, ఠాణా అనేవి ఉండేవి.

కాకతీయులు పరిపాలనా సౌలభ్యం కోసం దేశాన్ని 'నాడు' లుగ విభజించారు. ఈ నాడులను 'విషయం, మండలం' అనేవారు. రేనాడు పాకనాడు, కమ్మనాడు మొదలైనవి. తరవాత విభాగం 'స్థల' అనేవారు. పింగళి స్థల, గంగాపుర స్థల మొదలైనవి. ఈ 'స్థల' అనే కొన్ని చోట్ల 'సీమ' లు అనేవారు. కోనసీమ, కోరుకొండ సీమ మొదలైనవి. కొన్ని చోట్ల 'కొట్టం' అనేవారు. పులాల కొట్టం మొదలైనవి. మరి కొన్ని చోట్ల 'వాడి' అనే వారు నేతవాడి మొదలైనవి.

రాష్ట్రాలకు, ఇతర విభాగాలకు అధికారులు ఉండేవారు. రాజ్యానికి అధిపతి రాజు ఈయన 'సర్వసైన్యాధ్యక్షుడు'. 'న్యాయాధిపతి'. ఈ రాజుకు సహాయపడటానికి 'మంత్రి మండలి' ఉండేది. ఈ మంత్రిమండలికి అధ్యక్షుడు 'మహాప్రధాని'. ఆనాడు ప్రభుత్వోద్యోగులను 'భట్టారకులు' అనేవారు. వీరు "భట్టారక నియోగాధిపతి" పర్యవేక్షణలో పని చేసేవారు. కరణం, తలారి, సుంకాధికారి, బోయ బంటు, తీర్పరి, దండనాయకుడు, గజసాహిణి, అశ్వసాహిణి, పడాలు సేనాపతి. సకల సేనాధిపతి, మండలేశ్వర, రాజ్యభండారి, సర్వాధికారి, రాజ్యాధ్యక్షుడు, శాసనాధికారి అంతఃపురాధ్యక్షుడు, మంత్రి/ప్రగ్గడ. సంధి విగ్రహి, తంత్రపాలుడు మొదలైన ఉద్యోగులు ఉండేవారు.

రాజోద్యోగులకిచ్చే భూములను 'నాయంకరం' అనేవారు. వీనినుంచి వచ్చే పన్ను ఆ ఉద్యోగికి జీతం. అంటే ఈ నాయంకరాన్ని రాజసేవలో ఉన్నంతకాలమే అనుభవించవచ్చు. ఈ నాయంకరాలు మూడు విధాలు. 1. చేసిన సేవకు మెచ్చి ఇచ్చినవి, 2. యుద్ధంలో ఓడిపోయినా మిగిల్చుకొన్నవి, 3. ఉన్నత పదవులకు ఎదిగి సంపాదించినవి (ఆంధ్రుల సంస్కృతి చరిత్ర, పుట 14).

కాకతీయులు న్యాయనిర్ణయంలో సంప్రదాయాన్నే అనుసరించారు. తగాదాలను పరిష్కరించటంలో సహాయపడటానికి "ప్రాడ్వివాకుడు." ఉండేవాడు. గ్రామాలలోని తగాదాలను తీర్చటానికి ప్రత్యేక ఉద్యోగులను



BRAOU

నియమించేవారు. ప్రత్యేక నేరాలను విచారించటానికి "ధర్మాసనాలు" ఏర్పాటు చేసేవారు. అష్టాదశ వర్ణాలవారికి "సమయసభ" లు ఉండేవి. ఈ సమయసభలు ఆయా వర్ణాలకు చేసే నేరాలను విచారించి శిక్షించేవి నాడు శిక్షలు కఠినంగా ఉండేవి. బీజచ్ఛేదన, కుక్షిచ్ఛేదన, శిరచ్ఛేదన శిక్షలుండేవి.

రాజుకు భూమి శిస్తు ముఖ్య ఆదాయం. పంటలో రాజుభాగం వసూలు చేసేవారు. ఈ పన్నులను వస్తురూపంలోను ధనరూపంలోను వసూలుచేసేవారు పండ్లమీద వేసే పన్నును ధనరూపంలో వసూలుచేసేవారు. బందెల ఆయం, తలారి పన్ను, ఇల్లరి, పుల్లరి మొదలైనవి వసూలు చేసేవారు. సుంకం, వడ్డెరావుల, అంతరాయ సిద్ధాయం మొదలైన సుంకాలుండేవి. ఉప్పు అమ్మకం మీద పన్ను ఉండేదని శాసనాల వల్ల తెలుస్తుంది. దేవకార్యాలకోసం పన్ను వసూలు చేసేవారు. దీనిని 'మగము' అనేవారు. 'సింగినాదం పన్ను' ప్రమాదం కలిగినపుడు గ్రామస్థుల్ని హెచ్చరించటానికై ఎత్తయిన ప్రదేశంలో నిల్చుని బాకా పట్టేవాని కోసం వసూలు చేసేపన్ను (ఆంధ్రుల సంస్కృతి - చరిత్ర, రెండోభాగం, పుట, 34). "దొగరాచపన్ను ; సంధి విగ్రహి పన్ను, పడెవాలపన్ను, పడియేరపన్ను" ఉండేవి. సరకుల్నిగాని పశువులని గాని అమ్మితే వాటిపై సుంకం ఉండేది. దీనిని "అమ్మబడి సుంకం" అనేవారు. వస్తువులను అమ్మగా వచ్చిన ఆదాయంపై పన్ను ఉండుది. దీనిని "అడ్డకట్ట పన్ను" అనేవారు. గానుగల మీద, ఎద్దుల మీద, బళ్ళ మీద పన్ను ఉండేది. బెల్లం వండినా, నూనె ఆడినా పన్ను వేసేవారు అమ్మకానికి వచ్చిన ధాన్యం మీద ముద్ర వేసేవారు. దీనికి పన్ను ఉండేది. దీనిని "ముద్రపన్ను" అనేవారు. (ఆంధ్రుల సంస్కృతి - చరిత్ర, రెండో భాగం, పుట, 34) చివరకు రాజుకు ఏదైనా దరకాస్తు పెట్టుకుంటే పన్ను ఉండేది. ఇవికాక రాజులు విధించే పన్నులు ఇంకా ఎన్నో ఉంటాయి. వీటి అన్నిటివల్ల ప్రభుత్వానికి ఆదాయం లభించేది. ప్రభువులకే కాక దేవాలయాలకు కూడ ఆనాటివారు పన్నులు చెల్లించవలసి ఉంది. ఈ పన్నును 'వృత్తిపన్ను' అనేవారు. దేవునికి ఇచ్చే తర పన్నులను 'కిరుదెరె' అనేవారు.

కాకతీయుల అనంతరం రాజ్యపాలన ఏ విధంగా ఉండేదీ చెప్పటానికి నాటి సాహిత్యమే ఆధారం. ఆనాడు రాజుకు సహాయపడటానికి "మంత్రిమండలి" ఉండేది. రాష్ట్రాధికారులు, సైన్యాధికారులు, కవిలె సంప్రతులు (గణకులు) ఉండేవారని సకల నీతిసమ్మతం వల్ల తెలుస్తుంది. "ప్రాయసాంద్రుడు" ఉండేవారు. "సుంకర్లు", "సుంకాధికారులు" ఉండేవారు. రెడ్డి, గ్రామకరణం మొదలైన గ్రామసేవకులు ఉండేవారు.

రెడ్డిరాజుల కాలంలో సీమ ముఖ్య విభాగం. గురజాలసీమ, బెల్లంకొండసీమ, మొదలైనవి. ప్రతి సీమలోను 'నాయంకరా' లుండేవి. నాడు స్థలం, గ్రామం అని విభజించారు. గ్రామం నాటి పాలనకు పునాది.

ఆనాటి న్యాయవ్యవస్థ కూడ ప్రాచీన పద్ధతిలోనే ఉండేది. విచారణ చేయటానికి ధర్మాసనం ఉండేది. నేరస్థులను విచారించి దోషులకు తగిన శిక్షలు విధించేవారు. దేశ ద్రోహం చేసిన వారికి శిరఃఖండనం శిక్ష (ఆంధ్రసాహిత్యము - సాంఘిక జీవన ప్రతిఫలము, పుట, 127). దోషి కాలు చేతులను ఖండించటం, గానుగలో ఉంచి బాధించటం, నిప్పుతో కాల్చటం వంటి శిక్షలను విధించేవారు (ఆంధ్ర సాహిత్యము - సాంఘిక జీవన ప్రతిఫలనము, పుట,127).

పన్నులు చెల్లించకపోయినా, అప్పులు ఎగగొట్టినా శిక్షలు చాల కఠినంగా ఉండేవి. కాళ్ళు చేతులు కట్టేసి చావబాదడం. వీధులలో పడేసి ఈడవడం, పొగడదండచే బాధించడం వంటి శిక్షలు విధించేవారు. పొగడదండను గురించి శ్రీనాథుని మాటలిట స్మరణీయం.

"కవిరాజు కంఠంబు కౌగిలించెనుగదా పురవీధి నెదురెండ బొగడదండ
ఆంధ్రనైషధకర్త యంఘ్రియుగ్మంబున దగిలియుండెనుగదా నిగళయుగము.
వీరభద్రారెడ్డి విద్వాంసు ముంజేత వియ్యమందెనుగదా వెదురుగొడియ
సార్వభౌముని భుజాస్తంభమెక్కెనుగదా నగరి వాకిటనుండు నల్లగుండు

కృష్ణవేణమ్మ గొనిపోయె నింతఫలము
బిలబిలాక్షులు దినిపోయె దిలలు పెసలు
బొడ్డుపల్లెను గొడ్డేరి మోసపోతి
నెట్లు చెల్లింతు డంకంబు లేడునూర్లు".

BRAOU

విజయనగర రాజులు సామ్రాజ్యాన్ని 'రాజ్యా'లుగా విభజించారు. కొండవీడు రాజ్యం, పెనుగొండ రాజ్యం మొదలైనవి. ఈ రాజ్యాన్ని అనేక సీమలుగా విభజించారు. ఈ సీమలను "స్థలా"లుగా విభజించారు. ఈ స్థలాలను గ్రామాలుగా విభజించారు.

రాజ్యానికి అధిపతి దుర్గనాయకుడు. ఈయన రాజధానిలో ఉంటాడు. అందుచేత ఈయన పాలనావ్యవహారాలను ఈయన ప్రతినిధి పర్యవేక్షిస్తాడు. ఈ ప్రతినిధిని "కార్యకర్త" అంటారు. ఈ దుర్గనాయకునకు జీతానికి బదులుగా "అమర నాయకం" గా కొన్ని గ్రామాలను ఇచ్చేవారు. దీనికి ప్రతిఫలంగా ఈ దుర్గనాయకుడు చక్రవర్తికోసం నిర్దిష్ట సంఖ్యలో సైన్యాన్ని పోషించాలి. ఈ సైన్యాన్ని పోషించకపోతే చక్రవర్తి ఈయనకు ఇచ్చిన గ్రామాలను తీసివేసికొంటాడు.

సీమను పాలించే అధికారిని "హెరుసత్యగార్" అంటారు. ఈయనను దుర్గనాయకుడు గాని కార్యకర్తగాని నియమిస్తారు.

స్థలానికి స్థలకరణం ఉంటాడు. ఈయన గ్రామంలోని లెక్కల బాధ్యతలను నిర్వహించటమే కాకుండా స్థానిక తగవులను కూడ విచారిస్తాడు.

ఆనాడు గ్రామాలని మూడు తరహాలుగా విభజించారు. అవి : భండారవాడ గ్రామాలు, అమర గ్రామాలు, మాన్య గ్రామాలు. గ్రామాల పాలన సాగించటానికి గ్రామ సభల స్వరూపం మారిపోయింది. గ్రామవ్యవహారాలను పరిష్కరించటానికి మహాజనుల సభ ఉండేది. ఈ సభలకు బదులుగా కరణం, గౌడ, తలారి గ్రామ పరిపాలన చూసేవారు (ఆంధ్రుల సంస్కృతి – చరిత్ర, రెండో భాగం, పుట, 194) కాని అగ్రహారాలలో మాత్రం గ్రామసభ గ్రామ వ్యవహారాలను చూస్తుంది.

కరణం, తలారి మొదలైన ప్రభుత్వోద్యోగులకు ఆదాయం రెండు రకాలుగా లభించేది. అది – 1. బూయం (భూమిపై వచ్చే ఆదాయం) 2. అర్థాయం (ధనరూప ఆదాయం) ఈ విధంగా ఇచ్చే భూములను "ఇనాములు, భటవృత్తులు" అనేవారు.

వీరుకాక రాచకరణాలు, రాజశ్రేష్ఠులు ఉండేవారు. నాణాలు ముద్రించటానికి 'టంకసాల' ఉండేది. సామంతులు, పాలెగాళ్ళు ఉండేవారు. పాలెగాళ్ళు అంటే చిన్న సేనా నాయకులు. శాంతి భద్రతల బాధ్యత వీరిపైన ఉండేది. వీరి విధి నిర్వహణకు గాను శిస్తు మీద హక్కును ఇచ్చేవారు.

ప్రభుత్వ ఆదాయానికి భూమార్గం పన్నులు, సామంత ప్రభువులిచ్చే కప్పాలు, సాంప్రదాయికంగా చెల్లించే కట్నాలు మొదలైనవి. ఈ పన్నులలో ముఖ్యమైనవి భూమిశిస్తు. 'నీలాంబర (మాగాణి), కాండాంబర (మెట్ట) పొలాలపై పన్నులలో తేడాలు ఉండేవి. సువర్ణాదాయాన్ని 'సిద్దాయం' అనే వారు. ఇంకా పుల్లరి, కొండగుబ్బ, వృత్తి పన్ను, బిచ్చగాండ్రపై విధించే 'గుణాగణాచారి పన్ను' (ఆంధ్రుల చరిత్ర, పుట 415) మంగలి పన్ను, గానుగరి, చక్రకానిక, ఈడుగ సుంకం, ఉప్పరి సద్దాయం, సంపత్తి పన్ను, వాణిజ్య సుంకాలు నిర్వహించేందుకు పన్నులు వసూలు చేసేవారు. 'దన్నాయక స్వామ్యం', 'దుర్గ స్వామ్యం', 'కావలి కానిక' అనే సైనిక పన్నులు ఉండేవి. 'గిడి కల్యాణం', 'కల్యాణకానికె' అనే వివాహ సుంకాలు ఉండేవి.

న్యాయస్థానాలలో తగవులను పరిష్కరించేవారు. వీటిని ధర్మాసనాలు అనేవారు. రాష్ట్రాలలో రాష్ట్రాధిపతికి, అమరనాయకులకు స్థలాలలోను, సీమలలోను న్యాయవిచారణాధికారాలు ఉన్నాయి. గ్రామాలలో దొంగతనం జరిగితే రెడ్డికి ఫిర్యాదు చేయాలి. సాక్షుల్ని విచారించి న్యాయం చెప్పేవారు. మానవులిచ్చే సాక్ష్యాలు కాక "దివ్య" లు ఉండేవి. వీటివల్ల న్యాయాన్ని నిర్ణయించేవారు. అప్పుతీర్చని వారిని పొగడదండలతో శిక్షించేవారు. దేశద్రోహ రాజద్రోహాలకు మరణమే శిక్ష. బ్రాహ్మణవధ నిషేధించారు. కాబట్టి కళ్ళుపొడిచి దృష్టిలేకుండా చేసేవారు. లేదా యావజ్జీవ కారాగారవాసం విధించేవారు.

నేరాలు జరగకుండా, శాంతిని రక్షించటానికి ప్రభుత్వం మిక్కిలి జాగ్రత్తపడేది. తలారి, కావలివారు ఉండేవారు. రాజధాని నగరంలోను ముఖ్యపట్టణాలలోను రక్షక భటులు ఉండేవారు. తలార్లు రాత్రి సమయాలలో దివిటీలు పట్టుకొని కాపలాకాసేవారు.



BRAOU

## 23.4.0 ఆర్థిక పరిస్థితులు

ఈ దశలోని వ్యవసాయం, వాణిజ్యం, పరిశ్రమను గురించి ఈ ఉపభాగంలో వివరించాము, పరిశీలించండి.

### 23.4.1 వ్యవసాయం

కాకతీయుల కాలంలో ఆంధ్రదేశంలో వ్యవసాయమే ముఖ్య జీవనాధారం. వ్యవసాయాభివృద్ధికి ప్రజోపయోగానికి నీటి అవసరాన్ని గుర్తించిన ఆనాటి ప్రభువులు అనేక చెరువులు, కాలువలు త్రవ్వించారు. దీనివల్ల నీటి పారుదల సౌకర్యం ఏర్పడింది.

ఆనాడు భూసారాన్ని అనుసరించి భూముల్ని కొలిచి, తరగతులుగా నిర్ణయించి పన్ను నిర్ణయించేవారు. అడవి ప్రాంతాలను బాగుచేసి వ్యవసాయానికి ఉపయోగించేవారు. ఇటువంటి భూములకు కొన్ని సంవత్సరాల వరకు పన్నులు చెల్లించనక్కరలేకుండా మినహాయింపు ఇచ్చేవారు. వ్యవసాయం అభివృద్ధి చెందటానికి చెరువులు నిర్మించారు. కాకతీయ ప్రభువులు తటాక నిర్మాణానికి పూనుకున్నారు. ఆనాటివారు చెరువులను సముద్రాలు, సాగరాలు నిర్మించినట్లు శాసనాలలో చెప్పేవారు. "గణపసముద్రం, ప్రోల సముద్రం, నాగ సముద్రం" మొదలైనవి అవి.

ఏయే భూములలో ఎన్ని పంటలు వెయ్యాలనేది కూడ నిర్ణయించేవారు. ఈ నిర్ణయం భూసారాన్ని బట్టి నీటి సౌకర్యాన్నిబట్టి చేసేవారు. ఆనాడు భూములను మెట్ట, పల్లపు భూములుగా విభజించారు. మెట్టభూములను నాడు వెలిచేను అనేవారు. పత్తి, నువ్వులు, పప్పు ధాన్యాలు మొదలైన పంటలు ఈ భూములలో పండుతాయి.

వ్యవసాయం బాగా పెరగటంచేత వ్యవసాయశాస్త్రం కూడ వచ్చింది. దీనిని యెలమంచిలి ప్రభువైన మూడో ఉపేంద్రుని ఆస్థానకవి రాశాడు.

పదమూడో శతాబ్ది నాటికి అనంతపురం జిల్లాలో వ్యవసాయదారుల సంఘమొకటి ఉంది. దీనిని "చిత్రమేలి" అనేవారు (ఆంధ్రుల సంస్కృతి - చరిత్ర, రెండో భాగం పుట, 26).

ఆనాడు వరి, గోధుమ, కొర్రలు, సజ్జలు, పెసలు, మినుము దినుసులు, చెరుకు, ఉల్లి, అల్లం, పసుపు పండేవి. కొబ్బరి, జామ, మామిడి, అరటి ఫలించేవి. రెడ్డిరాజుల కాలంలో వైశాఖమాసంలో ఒక పంట, కార్తీకమాసంలో ఒకపంట వచ్చేది. వాల కాలవల కింద రెండుమూడు పంటలు కూడ పండేవి. నూతినీటితోనూ, చెరువుల నీళ్ల కూడ వ్యవసాయం జరిగేది. రాచవేమారెడ్డి జగనబ్బ గండ కాలువను తవ్వించాడు. ఆనాడు మెట్టభూములలో మెట్ట పంటలు, నీటి పారుదల సదుపాయాలున్న చోట చెరకు, తమలపాకు, పోక, మామిడి, కొబ్బరి, పసుపు పండేవి.

ఆనాడు వ్యవసాయంతో పాటు పశుపోషణ కూడ జరిగింది.

ఆనాడు "జల్టీ" పద్ధతి ఉండేది. "పంట మీద రైతు అప్పు తెచ్చుకొనే పద్ధతి ఇది. ఆ పంటను బజారు ధర కన్న తక్కువకు రుణదాతలకే అమ్మాలి" (ఆంధ్రుల సంస్కృతి - చరిత్ర ,రెండో భాగం, పుట 91).

విజయనగర ప్రభువులు కూడ నీటి పారుదల మీద మిక్కిలి శ్రద్ధను చూపారు. విజయనగర ప్రభువులు, సామంతులు చెరువులు, కాలవలు, నూతులు త్రవ్వించారు. వీటి నిర్మాణంలో పోర్చుగీసు వారి సహాయం కూడ తీసుకునేవారు. వీటిని నిర్వహించే బాధ్యత విషయంలో కూడ జాగ్రత్త వహించేవారు. ఈ విధంగా నిర్వహించటానికి "దశబంధ ఈనాములేక కట్టుకొడగ" ఇచ్చేవారు. (ఆంధ్రుల సంస్కృతి - చరిత్ర రెండో భాగం, పుట 208) ఈ పద్ధతి క్రీ. శ. 1875 వరకు రాయలసీమలో అమలులో ఉండేది.

విజయనగర ప్రభువుల కాలంలో బంజరు భూములను వ్యవసాయానికి అనువుగా చేయటానికి ప్రభుత్వ సహాయం లభించేది. కరువు కాటకాలు వచ్చినపుడు పన్నులు రాయితీలు ఇచ్చేవారు. ఈ భూములకు సంబంధించి ప్రతి గ్రామంలో ఒక లెక్క ఉండేది. దానిని "కవిత" అంటారు. గ్రామం ఆయకట్టు, రైతుల వ్యక్తిగత స్వాధీనంలో ఉన్న భూముల వైశాల్యం వివరాలు, పన్నుల మినహాయింపులు మొదలైనవి ఈ లెక్కలో ఉంటాయి.



BRAOU

విలువ ఉండని పంటలపై పన్ను ధన రూపంలోను, మిగతా పంటలపై పన్నులను వస్తురూపంలోని వసూలు చేసేవారు.

గడ్డిబీళ్ళపైన, అడవులపైన ప్రభుత్వానికి మంచి ఆదాయం లభించేది. గొల్లలు పెంచే గొర్రెలు, మేకల మందలు వ్యవసాయానికి ఉపయోగించేవి. పశువుల మేత కొరకు ఉపయోగించే అడవులు బీళ్ళ మీద పుల్లరి వసూలు చేసేవారు. అడవులలో కలప, కర్ర కొట్టుకొనేందుకు పన్నులు వసూలు చేసేవారు.

బహమనీ రాజులు ముస్లిం న్యాయశాస్త్రం ప్రకారం భూమి మీద రైతుకి హక్కు ఉన్నట్లు అంగీకరించారు. పన్నులను ఎక్కువగా వేసేవారు. వీరి. కాలంలో కూడ భూముల్ని కొలిచి రైతులకు భూమిని స్థిరపరచే వారు. వీరు ఎక్కువగా యుద్ధాలతో గడపడం చేత నీటి పారుదల సౌకర్యాలను కొత్తగా ఏర్పరచలేదు. సరికదా ఉన్నవాటిని మరమ్మతు చేయించలేదు. దీనికి తోడు ఈ కాలంలో కరువులు కూడ వచ్చేవి. అందుచేత వ్యవసాయం అంతగా అభివృద్ధి చెందలేదని భావింపవచ్చు.

**23.4.2 పరిశ్రమలు**

కాకతీయుల కాలంలో ప్రతి పరిశ్రమ చేతి పరిశ్రమగా రాణించింది. ప్రాచీన కాలం నుంచి ఆంధ్రదేశం 'దువ్వలువ'లకు 'కలంకారీ' చీరలకు ప్రసిద్ధి. పాల్కురికి సోమనాథుడు పండితారాధ్య చరిత్రలో ఎన్నో రకాల వస్త్రాలను పేర్కొన్నాడు.

పంచలోహాలతో పలువిధాలైన వస్తువులు తయారయ్యేవి. దేవాలయాల్లో పళ్ళేరం, గంటలు పిడిగంటలు, కంచుకర దీపికలు మొదలైనవి పేర్కొనవచ్చు. త్రిపురాంతకంలోని పంచలోహాల స్తంభాన్ని గూర్చిన ప్రసక్తి పల్నాటి వీరచరిత్రలో కన్పిస్తుంది.

ఆనాడు వడ్రంగం మిక్కిలి ప్రసిద్ధి చెందింది. ఆనాటి వడ్రంగులు పట్టెమంచెం, సకినెల మంచం, దోమతెర మంచం, పంజు మంచం, ఉయ్యాలపట్టె మంచం, గంటల ఉయ్యాల, నిలువుటద్దాలు, బల్లాని పెట్టెలు మొదలైనవి చెయ్యటమే కాక నాగళ్ళు, బండి చక్రాలు వ్యవసాయ పరికరాలు కూడ తయారు చేసేవారు. ఇవే కాక బల్లేలు, కత్తులు బాణాలు మొదలైన యుద్ధ పరికరాలు కూడ తయారు చేసేవారు.

BRAOU

ఆనాడు ఉప్పు పరిశ్రమ ఉండేది. ఉప్పును సముద్రపు నీటి నుంచి తయారుచేసే వారు. దీనివల్ల ప్రభుత్వానికి ఆదాయం లభించేది. ఉప్పుచేలను గుత్తకు ఇచ్చేవారు. ఇది సముద్రతీరంలో ఉన్నవారికి, దేశం మధ్య భాగంలో ఉన్నవారికి జీవనోపాధి కలిగించేది.

రెడ్డిరాజుల కాలంలో నేతపరిశ్రమ నైపుణ్యాన్ని పొందింది. ఈ విసయం ఆనాటి శ్రీనాథుని కావ్యాలవల్ల తెలుస్తుంది. కలంకారీపని, అద్దకంపని బాగా అభివృద్ధి చెందాయి. ఇనుము పరిశ్రమ బాగా అభివృద్ధి చెందింది.

ఆనాడు చేనేత పరిశ్రమ మిక్కిలి ప్రసిద్ధిపొందింది. "అలవకొండస్థల 12 గ్రామాలలో మొత్తం 453 మగ్గాలున్నాయనీ, వానిలో 411 మగ్గాలు రంగుబట్టలు నేస్తాయనీ" తెలుస్తుంది. (ఆంధ్రుల సంస్కృతి – చరిత్ర, రెండో భాగం, పుట 221). ఈ మగ్గాల మీద పన్ను విధించేవారు. ఈ పన్నును 'మగ్గరి' అనేవారు.

చెరకునుంచి బెల్లం, పంచదార తయారుచేసేవారు. తాటికల్లు నుంచి బెల్లం తయారు చేసేవారు. కాకిరాయి నుంచి ఇనుము కరిగించి వ్యవసాయపు పనిముట్లు, యుద్ధ పరికరాలు నిత్యావసర వస్తువులు తయారు చేసేవారు.

నూనె పరిశ్రమ ఉండేది. నూనె గానుగలు ఉండేవి. ఈ గానుగలపై పన్ను విధించేవారు. ఈ పన్నును 'గానుగరి' అనేవారు (ఆంధ్రుల సంస్కృతి – చరిత్ర, రెండో భాగం, పుట 223).

విజయనగర సామ్రాజ్యంలో రత్నాలగనులు ఉండేవి. బంగారం దొరికేది. కర్నూలులోను, అనంతపురం జిల్లాలోని వజ్రకరూరులోను రత్నాలు దొరికేవి.

### 23.4.3 వాణిజ్యం

కాకతీయుల కాలంలో దేశీయ వ్యాపారం బండ్లమీద జరిగేది. కొన్ని పెద్ద గ్రామాలలో నిర్ణీతమైన రోజులలో సంతలు జరిగేవి. దేవతా ఉత్సవాలలో కూడ వర్తకం జరిగేది. ఈ కారణం చేతనే కాబోలు యాత్రామార్గాలు, వర్తకమార్గాలు ఒకటిగా ఉండేవి.

ఆనాటి శాసనాల వల్ల కొన్ని పన్నులు తెలుస్తున్నాయి. క్రీ. శ. 1269 నాటి మోటుపల్లి శాసనం వల్ల ఈ విషయాలను తెలిసికోవచ్చు. పళ్ళు, ధాన్యం మొదలైన వస్తువులకు ఉపయోగించే ప్రమాణం "బండెడు". ఉప్పు, ధాన్యం మొదలైన దానికి ప్రమాణం "పరికె" ఈ విధంగా కొలతలు, బరువులు, విలువలు చెప్పడానికి ఇతర మానాలు కూడ వాడేవారు.

కాకతీయ గణపతిదేవుడు సముద్రాంతర దేశాలతో వ్యాపారం చేసేవారికి రక్షణ కల్పించి, ఎగుమతి దిగుమతులపై సుంకాలు నిర్ణయించాడు. దీనివల్ల మోటుపల్లి, మచిలీపట్నం, కృష్ణపట్నం రేవులనుండి విదేశీ వ్యాపారం బాగా జరిగేది.

ఆనాడు చందనం, హారతికర్పూరం, ముత్యాలు, మిరియాలు, పోకలు, దంతం, పగడాలు, అత్తరులు విదేశాలకు ఎగుమతి అయ్యేవి.

ఆ కాలంలో బర్మా, సింహళం, చైనా, అరేబియా, పర్షియా, ఈజిప్టుదేశాలతో వర్తక సంబంధాలుండేవి. కాకతీయ ప్రభువు గణపతిదేవుని కాలంలో విదేశీయులు గృహాలు నిర్మించుకొని, ఇచ్చట నివసించేవారని తెలుస్తుంది. కాకతీయుల పాలన అంతంకావటంతో అరబ్బుల వాణిజ్యం క్షీణించింది.

ప్రాచీన కాలంనుంచి వస్తున్న వర్తక శ్రేణులు ఆనాడు కూడ ఉన్నాయి. తేవీలకు జిల్లాలోను, పట్టణాల లోను, గ్రామాలలోను శాఖలుండేవి. ఇవన్నీ కలిసి పెద్ద శ్రేణి అయ్యింది. ఈ శ్రేణిని "సర్వదేశీయ, సహస్రతెలికె" అని వ్యవహరించేవారు. "వీరబలంజధర్మ ప్రవర్తకుల" సంఘం ఒకటి. పెనుగొండ ప్రధాన స్థానంగాగల వైశ్యుల శ్రేణి ఒకటి. వీరిని "నగర లేక నకరము" లు అంటారు. ఈ వర్తక శ్రేణులవారు దేవాలయాలకు ధర్మసంస్థలకు విరాళాలిచ్చేవారు. ఈ శ్రేణులు ప్రభుత్వానికి నిర్ణీత మొత్తంలో పన్ను చెల్లించేవారు. ప్రజల నుండి తాము పన్ను వసూలుచేసికొనేవారు. అందుచేత వీరిని "సుంకగుత్తకాండ్రు" అంటారు.

రెడ్డిరాజుల కాలంలో విదేశ వ్యాపారం సాగింది. విదేశ వాణిజ్యానికి, వర్తకులకు రక్షణ కల్పిస్తూ ప్రోలయ వేమారెడ్డి సోదరుడు అనవోతారెడ్డి మోటుపల్లిలో ఒక శాసనం చేయించాడు. ఆ కాలంలో చీని, సింహళం, పంజార, హురుమంజి, గోవా, యాంప, బోట, తరుణాసీరి, తవాయి, రమణ అను ప్రదేశాలతో వ్యాపార సంబంధాలుండినట్లు శ్రీనాథుని కావ్యాలవల్ల తెలుస్తుంది.

విజయనగర రాజుల కాలంలో విదేశీవ్యాపారం బాగా జరిగేదని విదేశయాత్రికులగు సీజర్, ఫ్రెడరిక్, బార్బోసా మొదలైన వారి రాతలవల్ల తెలుస్తుంది. మలాకా, పెగూ, సుమత్రాలకు నూలుబట్టలు, రాగి, పాదరసం, సిందూరం, గులాబి అత్తరువు ఎగుమతి అయ్యేవి. విజయనగర ప్రభువులు విదేశీ వాణిజ్యాన్ని పోర్చుగీసువారి స్వాధీనం చేశారు. అందుచేత విజయనగర పతనంతో పోర్చుగీసువారి వర్తక ప్రాభవం కూడ అంతమైంది.

దేశంలోని వర్తకం విదేశీయుల చేతిలో ఉండేది. వీరు విలువైన సరకులను కూడ అమ్మేవారు. స్థానికంగా తయారయ్యే వస్తువులను అమ్మే వర్తకులకు పన్నులు రాయితీ కలిగించేవారు. (ఆంధ్రుల సంస్కృతి - చరిత్ర, రెండవ భాగం, పుట - 220). ఇట్టి వర్తకులు 'వెంపటిగె' గ్రామంలో పేటను నిర్మించుకొనినట్లు, ఆ పేటలో నివసించే వారికి సౌకర్యాలు కలిగించినట్లు క్రీ.శ.1524 నాటి శాసనం వల్ల తెలుస్తుంది.

విజయనగర రాజుల కాలంలో నాణాలను ముద్రించటానికి "టంకసాల" ఉండేది. "వరహా", "పర్తబ్", "తారె", "జిట్టల్". ఇందులో తారె వెండి నాణెం. జిట్టల్ అనేది రాగి నాణెం. గద్యానం అనేది ఒక నాణెం. దీనినే వరహా అంటారు. "ప్రతాప" "పద్గానా", "హొన్ను", "మాత" అనేది ఒక నాణెం. 'పణ' అనేది ఒక నాణెం. "హాగ" అనేది ఒక నాణెం.



BRAOU

## 23.5.0 సామాజిక జీవనం

ఈ దశలోని వర్ణవ్యవస్థ, విద్య, సాహిత్యం, వేడుకలు, వినోదాలు, మతం ఆచార్య వ్యవహారాలను గురించి వివరించాము. చదవండి.

### 23.5.1 వర్ణవ్యవస్థ

కాకతీయుల కాలంలో ప్రతి వర్ణానికి కొన్ని ధర్మాలను విధించారు. ఆ ధర్మాలను త్యజించిన వానిని కుల బాహ్యునిగ పరిగణించేవారు. ఆనాడు వర్ణ మిశ్రమం జరిగింది. దీనిని వర్ణ సాంకర్యంగా అగ్రవర్ణాల వారు భావించారు. దీనికి సాక్ష్యంగా ఎర్రాప్రెగ్గడ భారతంలో అమూల్యమైన ఈ పద్యం కన్పిస్తుంది.

"వైరమున నశేషవర్ణులు నన్యోన్య - పీడసేయుచును విభిన్న బుద్ధి
నొక్కడొక్కడు మేరనుండక వర్ణసం - కరము సేయగలరు కలియుగమున". (ఆం. భా. అరణ్య. ప. 288)

ప్రాచీన కాలంనాటి వర్ణవ్యవస్థ విజయనగర ప్రభువుల కాలంలో కొనసాగుతున్నప్పటికి దానిలో బిగువు సడలింది. ప్రతి వర్ణంలోను శాఖలు, ఉపశాఖలు కలిగాయి. ఏ వర్ణం వారు కూడ తమ సంప్రదాయ విధులను నిర్దిష్టంగా ఆచరించలేదు. బ్రాహ్మణులలో లౌకిక కార్యాలను నిర్వర్తించే సామాన్య పురోహితులు కూడ ఉండేవారు. వెలివేసిన బ్రాహ్మణునికి ప్రాయశ్చిత్తం కావించిన పిదప వానితో పంక్తి భోజనం చేసేవారు. తన్మూలకంగా ధనాన్ని కూడ సంపాదించారు. సూర్య చంద్ర గ్రహణ సమయాలలో చేసిన జపతపాల ఫలితాలను ధనవంతులకు ధార పోసి ధనాన్ని సంపాదించేవారు. బ్రాహ్మణార్థానికి వెళ్ళి పొట్టనింపుకొనేవారు. తమ పేరు ప్రఖ్యాతులను పెంచు కోవటానికి అబద్ధాలు ఆడేవారు. ఈ విషయాలను చాలా వివరంగా ఆముక్తమాల్యదకర్త రాశాడు. ఉన్నత ప్రమాణా లతో జీవితాన్ని గడిపిన బ్రాహ్మణుడి కాలంలో ఎంత పతనమైందీ స్పష్టమవుతుంది. (ఆంధ్ర సాహిత్యము - సాంఘిక జీవన ప్రతిఫలనము, పుట 206). విజయనగర రాజుల కాలంలో క్షత్రియుల ప్రసక్తి అంతగా కన్పించదు. శూద్రులలో అనేక కులాలు ఉండేవి. రెడ్లు, కమ్మవారు, వెలమలు మొదలైనవారు. ఏ కులం వారి నిబంధనలు ఆ కులంవారివే. సమాజంలోని అస్పృశ్యుల్ని "పంచము" లనేవారు. వీరిచేత వెట్టి చేయించేవారు.

### 23.5.2 విద్యలు, కళలు

కాకతీయుల కాలంనాటి శాసనాలలో వేదవేదాంగవిదులు, పురాణేతిహాసజ్ఞులు, గణిత, వ్యాకరణ, జ్యోతిష, ఆయుర్వేద నిధుల ప్రసక్తి కన్పిస్తుంది. వారి కాలంలో వేదపాఠశాలలు ఉండేవి. వారి శాసనాలలో విద్యామంటపాల ప్రసక్తి కన్పిస్తుంది. కాకతీయ ప్రభువు ప్రతాపరుద్రుని ఖండపల్లి శాసనంలో "ఘటికాశాసను"ల ప్రసక్తి కన్పిస్తుంది.

రెడ్డి, పద్మనాయకరాజుల కాలంలో మహాపండితులు అనేకులు ఉండేవారు. రెడ్డి రాజులు పద్మనాయక ప్రభువులు స్వయంగా విద్వాంసులు. వేదాంగాలు, పురాణేతిహాసాలు, రాజనీతిశాస్త్రం, అశ్వశాస్త్రం మొదలైన విద్యలను ఎన్నింటినో ఆనాటి ప్రభువులు అభ్యసించే వారు. నిలసన శాసనంలో షడ్దర్శనాలు, శబ్ద మీమాంస జ్యోతిష, ఆయుర్వేదాలలో కృషి చేసిన వారి ప్రసక్తి కన్పిస్తుంది. ఆనాడు వివిధ రకాల "లిపు"లను నేర్చిన వారు ఉండేవారు.

విజయనగర రాజుల కాలంలో అగ్రహారాల్లోను, దేవాలయాలలోను, మఠాలలోను విద్యాబోధన జరుగు చున్నట్లు తెలుస్తుంది. ఈ విద్యాసంస్థలకు ఆనాటి ప్రభువులు అగ్రహారాలిచ్చి పోషించేవారు. వేద వేదాంగాలు, తర్క వ్యాకరణ జ్యోతిష ఆయుర్వేదాలు, న్యాయమీమాంస దర్శనాలు మొదలైనవాని అధ్యయనం పూర్వంవలెనే సాగింది. ఆనాడు విద్యా పరీక్షలు జరిగేవి. యోగ్యతాపత్రాలను ఇచ్చేవారు. ఆనాడు పుస్తక భాండాగారాలు ఉండేవి. పుస్తక భాండాగార అధికారి ఉండేవాడు. ఇట్టి ఉద్యోగినే ఒకనిని రెండో బుక్కరాయలు సన్మానించినట్లు తెలుస్తుంది.

మధ్యకాలీన దశ-1 లోని సాహిత్య చరిత్రను మీరు 12వ భాగంలో తెలుసుకున్నారు. ఆ చరిత్రను ఇక్కడ స్మృతికి తెచ్చుకొండి.

కాకతీయుల కాలంలో మార్గ దేశి పద్ధతి నాట్యాలు జరిపేవారు. ఈ నాట్యాలు దేవాలయాలలోను, వివాహాది సమయాలలోను చేసేవారు. ఈ నాట్యకత్తెలు సంప్రదాయ బద్ధంగా నాట్యాన్ని నేర్పేవారు. ఆనాటి



BRAOU

నాట్యభంగిమలు, వాద్యాలప్రసక్తి – రామప్ప, పానగల్లు, పిల్లలమర్రి, చేబ్రోలు మొదలైన శాసనాలలో కన్పిస్తుంది. దేవాలయ శాసనాలలో నట్టువరాండ్రతోపాటు నట్టువగాండ్రప్రసక్తికూడ ఉంది. ఆనాడు 'జలకరండము' అనే వాద్య విశేషం ఉండేది. పేరణి, రాసకం, చిందు, కందుకం, కోలాటం, మొదలైన జానపద నృత్యాలు దేశి నాట్యంలో కన్పిస్తాయి. ఆనాడు నాటక కళ కూడా అభివృద్ధి చెందింది. శివలీలలు, పల్నాటి వీరగాథలు, ఆనాడు నాటకాలుగా ప్రదర్శించేవారని బసవపురాణం వల్ల తెలుస్తుంది. ఆనాడు నటులు గుంపుగా ఏర్పడేవారని క్రీడాభిరామం వల్ల తెలుస్తుంది.

రెడ్డిరాజుల కాలంలో సంగీత చింతామణి వంటి గ్రంథాలు వెలువడ్డాయి. పెదకోమటి వేమారెడ్డి, కాటయ వేమారెడ్డి, వీరభద్రారెడ్డి, రేచర్ల నాయకులు రెండో సింగన, సింగయ నాయకుడు (కోరుకొండ ముమ్మడి నాయకుని సోదరుడు) మొదలైనవారు సంగీత విద్యాంసులు, సంగీత శాస్త్రి గ్రంథకర్తలు. సులాది గీతాలు, జాజిగీతాలు ఆనాడుండేవని రుక్మాంగద చరిత్ర, సింహాసన ద్వాత్రింశంకల వల్ల తెలుస్తుంది. ఇంకా తుమ్మెదపదాలు, ప్రభాతపదాలు, గొబ్బిపదాలు మొదలైనవి వ్యవహారంలో ఉండేవి. ఆనాటి శాసనాలలో మురజ, అవజ, కాహళ, మొదలైన వాద్యాల ప్రసక్తి ఉంది. సంగీతం నృత్యం కలిసి ఉండేవి. ఆనాటి "లకుమ" అనే నర్తకి గీత భావాన్ని అనేక రీతులలో వ్యక్తం చేసేది. పెదకోమటి వేమారెడ్డి, వామన భట్టబాణుడు రాసిన నాటకాలను వసంతోత్సవాలలో ప్రదర్శించేవారు. గొండ్లి, బిందు మొదలైన దేశి నాట్యాలు నాటి కావ్యాలలో కన్పిస్తాయి. "పారాశిక నర్తనం" గూర్చి పెదకోమటి వేమారెడ్డి తన సంగీత చింతామణిలో ప్రస్తావించాడు.

విజయనగర రాజుల రాజభవనాలలో నృత్య శాలలు ఉండేవి. సంస్కృత నాటకాలను ప్రదర్శించే నాట్యశాలల ప్రసక్తి వసుచరిత్రలో కన్పిస్తుంది. యక్షగానాలుండేవి. ఈ యక్షగానాలను ప్రదర్శించే కొందరు నటులపేర్లు ఆనాటి శాసనాలలో కన్పిస్తాయి. ఆనాడు తోలు బొమ్మలాటలు ఆడేవారు. ఆ కాలంలో నాట్య పోటీలు జరిగేవి. దేవాలయాలలో నాట్య ప్రదర్శనలు జరిగేవి. కిన్నెర, వీణ, భేరి, దుందుభి మొదలైన వాద్యాలు ఉండేవి. సంకీర్తన కర్త అన్నమాచార్యుడు ఈ కాలానికి చెందినవాడే. రామాయణ రామయామాత్యుడు అనే ఆయన 'స్వరమేళాకళానిధి' అనే శాస్త్రిగ్రంథాన్ని రాసాడు.

కాకతీయుల కాలంలో శిల్పకళ అభివృద్ధి చెందింది. పాలం పేటలోని రామప్ప దేవాలయం, ఆలంపురం, అహోబిలం, కాళేశ్వరం, మంతని దేవాలయాల శిల్పాలలో కాకతీయ శిల్పకళా పద్ధతి కన్పిస్తుంది. ఆనాటి దేవాలయాలు సుందర శిల్పవిన్యాసాలకు నిదర్శనాలు. పాలంపేట దేవాలయం కాకతీయుల కాలంలో మొట్టమొదటగా చెప్పదగింది. ఎత్తైన అధిష్ఠానం మీద నాలుగంతస్తుల విమానంతో చాలా గంభీరంగా ఉంటుంది. (ఆంధ్రుల చరిత్ర, పుట – 291).

BRAOU

ఆ కాలం నాటి సాహిత్యం వల్ల మాత్రమే చిత్రలేఖనం గూర్చి తెలుస్తుంది. "గచ్చు చేసిన చిత్రంపు గద్దెపలక వ్రాసినారదె చూడరా" అని క్రీడాభిరామంలో ఉంది. రెడ్డిరాజుల కాలంలో గోడలమీద చిత్రాలు లిఖించేవారు. వేశ్యల పడక గదులలో గోడలమీద చిత్రాలు ఉండేవని షోడశ కుమార చరిత్రలో ఉంది. తెలుగు భాగవతకర్త చిత్రలేఖన క్రియను గూర్చి చెప్పాడు.

ఆనాటివారు బొమ్మను తూలికతో గీసేవారు. ఈ తూలిక మూడు రకాలు : "తూలిక" (తూలిగ అనికూడా పిలిచేవారు). 'వర్తిక', "లేఖిని". ఆనాటి దేవాలయాలలో కూడ చిత్రకళ సాక్షాత్కరిస్తుంది. అనవేమా రెడ్డి శ్రీశైల దేవాలయపు ప్రాకారాలపై శివభక్తుల జీవిత విశేషాలను చెక్కించాడు. ఆనాటి దేవాలయాలలో శిల్పకళా వైశిష్ట్యం కూడ కన్పిస్తుంది.

విజయనగరరాజుల కాలంలో శిల్పానికి మిక్కిలి ఆదరణ లభించింది. కోలాట నృత్యాలను గోడలపై చిత్రించేవారు. "దివాన్ ఖానా" అనేదానిని మహమ్మదీయ వాస్తుశాస్త్రి ప్రకారం నిర్మించారు. ఎన్నో గజశాలలను మహమ్మదీయ శిల్పసంప్రదాయాన్ని అనుసరించే నిర్మించారు. ఒకే రాతితో మలచిన 22 అడుగుల నృసింహ విగ్రహం హంపీ శిథిలాలలో కన్పిస్తుంది. లేపాక్షి దేవాలయం విజయనగర శిల్పకళా ప్రతిభకు నిదర్శనం. పెనుగొండలో ఉన్న "షేర్‌ఖాన్ మసీదు" ఒక సుందర నిర్మాణం. పోర్చుగీసు చిత్రకళ ప్రభావం విజయనగర ప్రభువులపై ప్రసరించింది. ఆనాడు రామాయణ భారతాది కథలను చిత్రాలుగా గోడమీద చిత్రించుకొనేవారు. వేశ్యల పడకగదులలో రతిబంధ చిత్రాలు ఉండేవని రాధామాధవం, శ్రీ కాళహస్తీశ్వర మహాత్మ్యం వంటి కావ్యాలవల్ల తెలుస్తుంది. ఆనాటి రాజభవనాలలో చిత్రశాలలు కూడ ఉండేవి.

### 23.5.3 వేడుకలు – వినోదాలు

గృహప్రాంగణాలలో ముగ్గులను వేయటం తెలుగుదేశంలోని సంప్రదాయం. ఈ ముగ్గులనే రంగవల్లులు అంటారు. పాండుకుమారుల ఆగమనంవల్ల సంతోషస్వాంతులైన వారణాసి పౌరులు సౌధ ప్రాంగణాలలో కర్పూరపు రంగవల్లులను తీర్చిదిద్దినట్లు ఆంధ్ర మహాభారతంలో నన్నయ

> "అంగణంబుల నొప్పె గర్పూర రంగవల్లు
> లంగనలు గయ సేసి యుత్తుంగ హర్మ్య
> తలము లెక్కిరి తత్పురీ విలసనంబు
> జూచు వేడ్క పాండు కుమారుల జూడు వేడ్క." (ఆది – ఆ 6 – ప. 149)

అని చెప్పారు. మూలంలో పౌరులు గృహాలను అలంకరించినట్లు మాత్రమే ఉంది. కాబట్టి ఇది ఆ కాలంనాటి వేడుక అని భావించవచ్చు.

ఆనాటి స్త్రీలు కొందరు పెదవులకు "వన్ను" పూన్చటం ఒక వినోదం. వన్ను అనగా రంగు. ఆనాటివారు పెదవులకు రంగు వేసికొనెడివారు. ఈ విషయం నన్నెచోడుడు కుమార సంభవంలో చెప్పాడు.

ఆనాడు తిరునాళ్ళు, జాతరలు విస్తారంగా జరుగుతుండేవి. ఇవి ప్రజలకు మానసిక వికాసాన్ని, ఉత్సాహాన్ని కలిగిస్తాయి. ఇటువంటి స్థలాలలో జనసంచారం ఎక్కువగా ఉంటుంది. తిరునాళ్ళు యువజనుల స్వేచ్ఛాసంచారానికి అనువైన ప్రదేశం. ఆనాటి తిరునాళ్ళలో శ్రీకాకుళపు తిరునాళ్ళు మిక్కిలి ప్రసిద్ధి చెందాయి. ఈ తిరునాళ్ళ ప్రస్తావన క్రీడాభిరామంలో ఉంది.

వీరకృత్యాలను వర్ణించే కథలను, పదాలను పాడుకోవటం వినోదమని శ్రీనాథుడు క్రీడాభిరామంలో వర్ణించాడు.

ఆనాడు ప్రదర్శనలకు అనువైన నాటకశాలలు ఉండేవి ధనవంతులకు ప్రత్యేక నాటకశాలలు ఉండేవి ఇటువంటి నాటకశాలల ప్రసక్తి జక్కన విక్రమార్క చరిత్రలో కన్పిస్తుంది. వేశ్యాంగన మాచలదేవి జీవితం నాటకంగా ప్రదర్శించినట్లు క్రీడాభిరామం వల్ల తెలుస్తుంది.

BRAOU

ఆనాటి గొరగ యువతులు తమ నేర్పరితనంతో ప్రజలను ఆకట్టుకొనేవారు. ఒక నట్టువరాలు వెనుకకు వంగి నీటిలోని ముక్కరను వెలికి తీసుకొని ధరించటమే కాకుండా నల్లపూసలను ఏరి అతివేగంగా, మాలగా కూర్చిన విషయం క్రీడాభిరామం వల్ల తెలుస్తుంది.

ఆ కాలంలో కోళ్ళ పందాలు విశేషంగా ప్రచారంలో ఉన్నట్లు క్రీడాభిరామం వల్ల తెలుస్తుంది.

ఆలయాలలో వాద్యసంగీత గోష్ఠులు జరిగేవి. ఈ వాద్యగాండ్రకు కావలసిన వసతులను ఏర్పరచేవారు. ఇంకా ముర, ఆవజ, కాహళ, వీరమద్దెల, మద్దెల మొదలైన వాద్య విశేషాలను పల్నాటి వీరచరిత్ర ప్రస్తావించింది.

ఆ కాలంలో స్త్రీ పురుషులు, అంజి, సాగటాలు, అచ్చన గాయలు, ఓమన గుంటలు, పులిజూదం ఆడుకొనేవారని భోజరాజీయం, సింహాసన ద్వాత్రింశిక కావ్యాలవల్ల తెలుస్తుంది.

ఆనాడు వివాహ సమయంలో స్త్రీపురుషులందరు ఒకటిగా కూర్చుని వేడుకగా భోజనం చేయటాన్ని బువ్వం అంటారు. దీని ప్రసక్తి పారిజాతాపహరణంలో కన్పిస్తుంది.

ఆనాడు వివాహసమయాలలోను, ఉత్సవసమయాలలోను నృత్య సంగీత ప్రదర్శనాలను ఏర్పాటు చేసేవారు. ఈ ప్రదర్శనలను కళావంతులు ఇచ్చేవారు. వీటిని "మేళం" అంటారు. దీని ప్రసక్తి ఆముక్తమాల్యదలో కన్పిస్తుంది. ఉత్సవాలలోను, వివాహసమయాలలోను కూచిపూడి వారు భామా వేషాన్ని ప్రదర్శించేవారని రామాభ్యుదయం వల్ల తెలుస్తుంది.



ఆనాటి వారికి ఊయెలను వాడటం ఒక వేడుక.

**23.5.4 మతం**

కాకతీయుల కాలంలో వీరశైవం ఎక్కువగా వ్యాపించింది. వీరశైవులు ఇతర మతాలను నిర్మూలించినట్లు పాల్కురికి సోమనాథుని రచనల వల్ల తెలుస్తుంది.

కాకతీయ ప్రభువు రుద్రుడు శైవాన్ని ఆదరించాడు. గణపతిదేవుడు రుద్రమాంబల కాలంలో శైవంలో కాలాముఖులు, పాశుపతులు, కాపాలికులు మొదలైన శాఖలున్నట్లు త్రిపురాంతకం, మార్కాపురం శాసనాల వల్ల తెలుస్తుంది. ద్రాక్షారామం, మందడం, త్రిపురాంతకం, శ్రీశైలం, పుష్పగిరి మొదలైన స్థలాలలో గోళకీ మఠాలను నిర్మించారు. కాకతీయులు శైవ మతాభిమానులైనప్పటికీ వైష్ణవాన్ని కూడ ఆదరించారు. నెల్లూరు, నందలూరు, తిరుపతి, మాచర్ల, బాపట్ల, మంగళగిరి, శ్రీకాకుళం, సింహాచలం, శ్రీకూర్మం మొదలైనవి వైష్ణవ క్షేత్రాలుగా ప్రసిద్ధికెక్కాయి.

హరిహరులకు అభేదం కల్పించి వైదిక మతాన్ని ప్రచారం చేయాలనే తలపు కొందరికి కలిగింది. తిక్కన ప్రభావం వల్ల గణపతిదేవ చక్రవర్తి వైదిక మతాభిమాని అయ్యాడు. కాకతి రుద్రుడు, గణపతిదేవ చక్రవర్తి "చాతుర్వర్ణ్య సముద్ధరణ" బిరుదం వహించారు. వీరశైవులు, వీర వైష్ణవులు చేసిన కులనిర్మూలన ప్రయత్నాలు కాకతీయుల కాలంలో సఫలం కాలేదు. ఆ కాలంలో బహుదేవతారాధన ఎక్కువయ్యింది. జైన ఆచారాలు వైదిక మతంలోకి వ్యాపించాయి. జైనదేవతలు వైదిక మత దేవతలయ్యారు.

ఆ కాలంలో జంతువులను బలియివ్వటం, ఆత్మబలిదానం కావించటం ఉంది. గండకత్తెరలో తలలు కత్తిరించుకొనేవారు. ఆనాడు భక్తి ప్రాముఖ్యం పొందటంతో దేవాలయం మతానికి కేంద్రస్థానం అయింది. దేవాలయాన్ని సప్త సంతానాలలో ఒకటిగా పరిగణించారు. దేవాలయాలలో ఉత్సవాలు జరిగేవి.

జైనమతం ఆకాలంనాటి శైవుల విజృంభణకు ఆగలేకపోయింది. జైనమతం పరివ్రాజకులకు పంచమహావ్రతాలను, సామాన్య గృహస్థులకు నియమాలను నిర్దేశించింది. సామాన్య గృహస్థులు ఈ నియమాలను పాటించకపోయినప్పటికీ జినేశ్వరునిపై విశ్వాసముంచితే చాలు. ఈ జైనమతాన్ని అధికారవర్గాలవారు, ధనవంతులు ఆదరించారు. శైవం సామాన్య ప్రజల ఆదరణ పొందింది. మల్లికార్జున పండితారాధ్యుడు ఎందరో జైన బౌద్ధ పండితుల్ని ఓడించాడు. ఈవిధంగా ఆకాలపు వైదిక మతం సమాజగతిని మార్చింది.

రెడ్డిరాజుల కాలంనాటికి ముస్లిముల ప్రభావం విస్తరించింది. ఈ ప్రభావం నుంచి వైదిక మతాన్నీ, సంస్కృతినీ రక్షించాలనే దీక్ష నాటి ప్రభువులలో కలిగింది. అగ్రహారాలను ముస్లిములు వెనక్కి తీసుకున్నారు. నాటి ప్రభువులు వాటిని యజమానులకు పునరుద్ధరించారు. ఆకాలంలో శైవానికి ప్రజల ఆదరణ లభించింది. ఆనాటివారు ఆచరించిన వానిలో భైరవీ తంత్రం ఒకటి. ఇది వామ చార సంబంధమైన తాంత్రికపూజ. ఈ భైరవీపూజ ప్రసక్తి జక్కన శ్రీనాథుల రచనలలో కన్పిస్తుంది. "చంపుడుగుడి" సింహాసన ద్వాత్రింశికలో కన్పిస్తుంది. ఇదికాక "భృగుపాతం జరపటం" గురించి పండితారాధ్యచరిత్ర వల్ల తెలుస్తుంది.

రెడ్డిరాజులు వైష్ణవాన్ని ఆదరించారు. రెడ్డిరాజులు అహోబిలం, సింహాచలం వంటి వైష్ణవక్షేత్రాలకు దానాలు చేసేవారు. కుమారగిరి, కాటయవేములు వైష్ణవ మతాభిమానులు. పద్మనాయక ప్రభువులలో సర్వజ్ఞ సింగమనేనులు వైష్ణవ మతం స్వీకరించారు. సింగమనేని కోరికపై వేదాంత దేశికుడు తత్త్వసందేశం, రహస్యసందేశం మొదలైన గ్రంథాలను రచించాడు. శైవవైష్ణవాల మధ్య వివాదాలు సంఘర్షణలు జరుగుతుండేవి. పద్మనాయక ప్రభువుల ఆస్థానంలో శాకల్య మల్లభట్టుకు పరాశరభట్టుకు మధ్య వివాదం జరిగింది. ఈ వివాదాలను చూసిన నాచన సోమన –

"పరివాదాస్పద వాదమోద మదిరాపానంబుచే మత్తులై

హరిమేలంచు హరుండు మేలనుచు........" (ఉ హ ఆ 2 - ప. 68). సంఘర్షణ కలిగిస్తారని విచారించాడు.

విజయనగర ప్రభువులలో సంగమ వంశీయుల కులదైవం విరూపాక్షుడు హరిహర రాయల కాలంనాటికి వీరశైవం తీవ్రత తగ్గింది. శృంగేరీ మఠాధిపతి విద్యాతీర్థుల ఆశీస్సులు పొందాడు. బుక్కరాయలు విద్యారణ్యుల

ఆశీస్సులు పొందాడు. బుక్కరాయల మంత్రిమాధవాచార్యులు, ఆయన సోదరుడు సాయణాచార్యులు వేదాలకు స్మృతులకు భాష్యాలు రాశారు.

విజయనగర సామ్రాజ్యాధిపతులు "వేదమార్గ ప్రతిష్ఠాపనాచార్యులు". విజయనగర సామ్రాజ్య ఆశయం హిందూమతాన్ని, భారతీయ సంస్కృతిని కాపాడటమే. అయినప్పటికీ వారు జైన, ఇస్లాం, క్రైస్తవమతాలను కూడ పోషించారు. వైష్ణవులు జైనులను బాధపెడితే, బుక్కరాయలు ఆ మతస్థుల మధ్య మైత్రిని కుదిర్చాడు. రెండో దేవరాయలు ముస్లింలను తన సైన్యంలోనికి తీసుకోవటమేకాక, ప్రార్థన చేసికొనటానికి వారికి సౌకర్యంకూడ కలిగించాడు. ముస్లింసర్దారులకు జాగీర్లు ఇచ్చారు. శ్రీకృష్ణదేవరాయలు వైష్ణవ మతానుయాయి. కాబట్టి ఆముక్తమాల్యదలో వైష్ణవ ఆధిక్యాన్ని స్థాపించటానికి పూనుకొన్నాడు. అయినప్పటికీ విరూపాక్షునకు స్వర్ణకిరీటానికి కానుకలు ఇచ్చాడు. విరూపాక్ష దేవాలయాన్ని పునర్నిర్మించాడు. తిరుపతి, సింహాచలం, అహోబిలం, శ్రీకాళహస్తి, శ్రీశైలం, అమరావతి మొదలైన వైష్ణవ దైవ క్షేత్రాలను దర్శించాడు. తనకుగల మత సహనాన్ని తెలిపాడు. వీరశైవుడు శాంత లింగప్ప అనే సామంతుడు జైనులను హింసిస్తే వెలుగోటిగని తిమ్మనాయని పంపి, ఆతనిని శిక్షించాడు. ఏది ఏమైనా విజయనగర ప్రభువులు మత సహనం పాటించి ప్రజలను ఆదరించారు.

### 23.5.5 ఆచార వ్యవహారాలు

ఆబోతుకు అచ్చువేసి స్వేచ్ఛగా వదలటం ఆంధ్రదేశంలో సంప్రదాయం. పులస్త్యుడు భీష్మునికి చెప్పినట్లుగా నారదుడు ధర్మరాజునకు ఉత్తమగతులు కలిగే విధానాలను గూర్చి చెబుతూ పితృదేవతలు "శ్వేతమైన యాబోతు విడుచునోయనియును" (అరణ్య - ఆ 2, ప. 235) చూస్తారని తెల్పాడు. ఇది అమూలకం. ఇది నన్నయనాటి నుండీ ఉన్న ఆచారమని భావించవచ్చు.

ఆ కాలంలో వీరతాంబూలాన్ని గ్రహించటం ఆచారం. ఒక మహత్తర కార్యాన్ని ఆరంభించేటప్పుడు కాని, యుద్ధానికి వెళ్ళే పూర్వంగాని వీరతాంబూలాన్ని గ్రహించటం జరిగేది. ఈ విషయం నన్నెచోడుని కుమారసంభవంలో "నాకుందగిన వెలసంబుగంటి దివ్యంబు మె కొంటి దాంబూలంబు దయసేయుము" (ఆ 4-ప 54) అనీ, బసవపురాణంలో "వీరతాంబూలంబు గొనుడు" (ఆ 7 - పుట 208) అనీ ఉంది. ఈ విషయం తిక్కన విరాటపర్వంలో కూడ ఉంది.

వరుని పక్షంవారు కన్యనిమ్మని అడుగుటానికి మధ్యవర్తులను పంపటం, కన్యాదాత అంగీకరించిన పిదప అగ్నిసాక్షిగ వివాహం జరపటం, ఆనాటి సంప్రదాయం అని నన్నెచోడుని కుమారసంభవం వల్ల తెలుస్తుంది.

ఆనాడు "ఉంకువఓలి" ఇచ్చే సంప్రదాయం వ్యవహారంలో ఉంది. పార్వతి తండ్రి హిమవంతుడు సప్తర్షులతో ఉంకువనుగూర్చి ప్రస్తావించటం నన్నెచోడుని కుమారసంభవంలో కన్పిస్తుంది.

వివాహసమయంలో వరునికి ఎదురుసన్నాహాలు చేయటం, వివాహం జరిగేటప్పుడు వధూవరుల మధ్య తెర ఉంచటం, సుమూహూర్త సమయంలో తెర ఎత్తటం, వధూవరులు తలంబ్రాలు పోసికోవటం తెలుగువారి ఆచారాలే. అమూలకాలైనప్పటికీ తిక్కన భారతంలో ఈ విషయాలు చెప్పాడు.

ఆ కాలంలో విజేత ఓడినవాని బిరుదాలను గ్రహించటమేకాక వాని ప్రతిమను చేయించి కాలియందెకు పొదిగించుకొనేవాడు. దీనినే 'బొమ్మ పెట్టుట' అంటారు. ఈ విషయం కాశీఖండంలోని, పల్నాటి వీరచరిత్ర లోను, విక్రమార్క చరిత్రలోను కన్పిస్తుంది. ఇది ఆనాటి రాజ సంప్రదాయం. "రణము కుడుపు" అనే సంప్ర దాయం ఉండినట్లు వెలుగోటివారి వంశ చరిత్రవల్ల తెలుస్తుంది. ఇది చాల భయంకరమైన ఆచారం. యుద్ధంలో ఓడిపోయిన రాజుల్ని రాతి గానుగల్లో ఆడించి వారి రక్తాన్ని పట్టుకొంటారు. ఆ రక్తాన్ని వారి కపాలంలోనే వండే వారు. దీనినే "రణము కూడు" అంటారు. అర్ధరాత్రి సమయంలో దిగంబరులై జుట్టు విరబోసికొని రణము కూడు నెత్తిమీద పెట్టుకొని శాకినీ మొదలైనవాటికి నైవేద్యం పెడతారు. ఇది ఆగమ విహిత కర్మగా వెలుగోటి వారి వంశ చరిత్రలో చెప్పారు. (ఆంధ్రుల సంస్కృతి - చరిత్ర, పుట - 88).

ఆ కాలంలో పూటకూటి ఇండ్లు ఉండేవి. పూటకూటి ఇండ్లలో ఒక రూకకు నాలుగు కూరలు, కర్పూరపు అరటిపండుతో భోజనం లభించినట్లు క్రీడాభిరామంవల్ల తెలుస్తుంది. ఆముక్తమాల్యదలో "అక్కవాడ"ల ప్రసక్తి కన్పిస్తుంది.

BRAOU

దోష నివారణకు తాయెత్తులను ఉపయోగించటం, దృష్టి దోషనివారణకు 'దిష్టి' తీయటం, "పంచవన్నెల కూడు" ను దిగదుడిచి పారవేయటం ఉండేది. ఈ విషయాలు సింహాసన ద్వాత్రింశికలోను, పల్నాటి వీరచరిత్రలోను కన్పిస్తాయి.

ఆ కాలంలో ప్రమాణాలు చేయటం ఉండేది. సాక్ష్యాలు లేని తగవులమీద విచారించవలసి వచ్చినపుడు ప్రమాణాలు చేయించటం జరిగేది. ఇట్టి ప్రమాణ విధానాలలో "మడ్డుపట్టటం" ఒకటి. మడ్డు అనగా ఎర్రగా కాలిన ఒక ఇనుప వస్తువు. ఎర్రగా కాలిన ఇనుప వస్తువును పట్టుకొని ప్రమాణం చేయటాన్ని మడ్డు పట్టటం అంటారు. దీని ప్రస్తావన సింహాసన ద్వాత్రింశికలో ఉంది. ప్రమాణం చేసేవానిని దేవతా విగ్రహం ఎదుట దోషం చేయలేదని చెప్పించి ఎర్రగా కాలిన ఇనుపవస్తువును నాలుకతో స్పృశింపజేసేవారు. ఎట్టి హాని కలుగకపోతే అతడు నిర్దోషిగా అనేవారు. కాలుతున్న ఇనుప వస్తువును దేవతావిగ్రహం వద్దకు తీసుకొని పొమ్మనేవారు. దీనివల్ల అతనికి ఏ విధమైన గాయం ఏర్పడకపోతే అతనిని నిర్దోషిగా భావించేవారు. ఇది రెండో పద్ధతి. బాగా కాగుతున్న వెన్నపాత్రలో చేతివేళ్ళను పెట్టమనేవారు. వెంటనే ఆ చేతిని గుడ్డతోకట్టి మూడోరోజున విప్పి చూసేవారు. అతనికి ఎట్టి గాయం కలగకపోతే నిర్దోషిగా భావించేవారు. ఇది మూడో పద్ధతి. ఈ ప్రమాణపు విధానం ఆనాటి సాహిత్యంలోనే కాక విదేశీయుల రాతలలోకూడా కన్పిస్తుంది.

ఆనాడు తాళపత్రాలతో పాటు కాగితం కూడా వ్యవహారంలో ఉన్నట్లు తెలుస్తుంది.

ఆకాలంలో ఋణపత్రాలను రాసి ఋణాలను తీసికోవటం ఉండేది. ఈ పత్రాలపై సాక్షులు కూడా చేవ్రాలు చేసేవారు. ఈ విషయం పాండురంగ మాహాత్మ్యంలో -

"వడతి ముఖాంశు నిష్కములు భాసురస్వర్ణ లలాటపత్రకం
బిడి ఋణలీల గైకొనియె నిందుడు నద్దము సాక్షిగాక" (ఆ. 3 - ప. 199) అని ఉంది.

ఆ కాలంలో బాలెంత తాంబూలాన్ని వేసికోవటం, వాత హరణార్థం కనకఝుమ్మలి పూసలను ధరించటం ఉండేదని శ్రీ కాళహస్తి మహాత్మ్యం వల్ల తెలుస్తుంది. ఇంతేకాదు, ప్రసవకాలం నుండి శిశువుకు దంతాలు వచ్చే వరకు భార్యభర్తల కలయికను నిషేధించారు. ఈ ప్రస్తావన ఆముక్తమాల్యదలో ఉంది.

ఆ కాలంలో కన్యావిక్రయం ఉండేదని రుక్మాంగద చరిత్రలోని "అసిత పత్రముల యందు ద్రోయగ వేరు, విలపింప గన్యకా విక్రయులను" (ఆ. 2 - ప. 22) అనే మాటలవల్ల తెలుస్తుంది.

అధికారంలో ఉన్న వ్యక్తిని ఆరాధించటం, అతని అధికారం పోగానే అతని దుర్గుణాలను వెలికి తీయటం అనే విషయాన్ని తెనాలి రామకృష్ణుడు పాండురంగ మహాత్మ్యంలో ప్రస్తావించాడు.

## అవగాహన ప్రశ్న

మధ్యయుగంలోని తెలుగువాడి ఆచార్య వ్యవహారాలను పరిశీలించండి.

## 23.6 సారాంశం

ఈ భాగంలో ఈ కింది అంశాలను మీరు అధ్యయనం చేశారు.

- మధ్యకాలీనదశ – I (క్రీ.శ. 1000-1600) లో తూర్పు చాళుక్య ప్రభువు శక్తివర్మ పాలననుండి విజయనగర సామ్రాజ్య పతనం వరకుగల కాలంలోని తెలుగు సంస్కృతిలోని ముఖ్య విషయాలు ఈ భాగంలో ఉన్నాయి.

- ఈదశలో మొత్తం మీద విభిన్న సంస్కృతులు, పాలనారీతులు, ఆనువంశిక ప్రవృత్తులు గల వెలనాటి చోళులు, చాగివారు, కోటవారు, హైహయులు, తెలుగుచోడరాజులు, కమ్మ నాయకులు, రెడ్డిరాజులు, కాకతీయులు, విజయనగర రాజులు, బహమనీ సుల్తానులు ఆంధ్ర దేశాన్ని పరిపాలించారు. వీరందరి నడుమ విజయనగర పాలనలో ఆంధ్రదేశం భౌగోళికంగా, సాంస్కృతికంగా అత్యున్నత దశపొంది 'స్వర్ణయుగాన్ని' చవిచూసింది. కాకతీయుల కాలం కూడా కళలకూ, సాహిత్యానికీ, సంస్కృతికీ కాణాచి. రెడ్డి రాజుల యుగంలోని మహాకవి శ్రీనాథుడు.

- బహమనీ సుల్తానుల్లోని కుతుబ్ షాహీ వంశానికి చెందిన సుల్తాన్ కులీ గోల్కొండ సామ్రాజ్యాన్ని నెలకొల్పి ఆంధ్రదేశాన్ని సమైక్యం చేయడానికి ప్రయత్నించాడు. గోల్కొండ పాలకులు మత సమైక్యతకూ, సాహితీ సమైక్యతకూ, సంస్కృతీ సంకీర్ణతకూ కృషిచేశారు.

- ఈ దశలోని సంస్కృతి హైందవ, హైందవేతర సంకీర్ణ సంస్కృతిగా సాగిపోయింది.

- కాకతీయులూ, విజయనగరరాజులూ, దేశంలో వ్యవసాయాభివృద్ధికీ, నీటిపారుదల, చెరువుల తవ్వకం వంటివాటికీ ఎంతో కృషి చేశారు. బహమనీ సుల్తానుల కాలంలో రైతుకు భూమిహక్కు ఏర్పడింది.

- వడ్రంగం, కలంకారీ, కమ్మరిపని, నేత, బంగారుపని, శిల్పం, చిత్రలేఖనం, నాట్యంవంటి కళలు అభివృద్ధి చెందాయి. కాకతీయులకాలంలో, రెడ్డిరాజుల కాలంలో, విజయనగర పాలనలో దేశ విదేశ వ్యాపార వాణిజ్యాలు నేలమీద, నీటి మీదా ఉధృతంగా సాగాయి. విజయనగరరాజులు నాణాల ముద్రణకు టంకసాల నెలకొల్పారు.

- విజయనగర రాజుల వరకూ ప్రాచీన వర్ణవ్యవస్థ కొనసాగి, ఈదశలో కొంత బిగువు సడలి, శాఖోప శాఖలుగా చీలిపోయింది. వృత్తి విద్యలు వర్ణవ్యవస్థను పాటించడం తగ్గింది.

- వేదవేదాంగాలు, పురాణేతిహాసాలు, జ్యోతిష్యం, న్యాయవైశేషికాలూ, లలితకళా విద్యలూ, పాలనకుసంబంధించిన శిక్షణా కాకతీయుల, రెడ్డిరాజులు, పద్మనాయకులు, విజయనగర రాజుల కాలంలో ఎంతో అభివృద్ధిపొందాయి. వేడుకలు, వినోదాలు అపరిమితంగా సాగేవి.

- కాకతీయులకాలంలో జైనమతం పరాజయంపొంది, వీరశైవం విజృంభించింది. ఆ కాలంలోనే తిక్కన హరిహరాద్వైతాన్ని స్థాపించాడు. ఈ మార్పులన్నిటికీ అనుగుణంగా ఆచార వ్యవహారాలు కొనసాగాయి.

## అవగాహన ప్రశ్నకు జవాబు

మధ్యయుగంలో వరుని పక్షంవారు కన్యనిమ్మని అడగటానికి మధ్యవర్తులను పంపటం, కన్యాదాత అంగీకరించటం జరిగిన తరువాతనే వివాహం జరిగేది. ఉంకువ నిచ్చే సంప్రదాయం ఉండేది. ఈ ఉంకువనే "ఓలి" అని కూడా అనేవారు. ఈ విషయాలు నన్నెచోడుని కుమారసంభవంలోను తిక్కన నిర్వచనోత్తర రామాయణంలోను కన్పిస్తాయి.

వివాహసమయంలో వరునికి ఎదురు సన్నాహాలు చేయటం. వధూవరులకు మధ్య ఉన్న తెరను సుమూహూర్త సమయంలో తొలగించటం. తలంబ్రాలు పోసికోవటం తెలుగువారి ఆచారం. ఆమూలకాలెనప్పటికీ ఈ దేశీయాచారాలను తిక్కన ఆంధ్రమహాభారతంలో వర్ణించారు.



BRAOU

సాక్ష్యాలు లేని తగవులను పరిష్కరించవలసి వచ్చినపుడు ప్రమాణాలు చేయించేవారు. ప్రమాణ విధానాలలో "మడ్డుపట్టటం" ఒకటి. ఎర్రగా కాలిన ఇనుప వస్తువును పట్టుకొని ప్రమాణం చేయటాన్ని మడ్డుపట్టటం అంటారు. ప్రమాణం చేసినవానిని దేవుని ఎదుట నిలిపి తప్పులు చేయలేదనిపిస్తారు. తరువాత ఎర్రగా కాలిన ఇనుపవస్తువును నాలుకతో స్పృశింప చేసేవారు. ఏ హాని కలుగకపోతే అతనిని నిర్దోషిగా నిర్ణయించేవారు. ఇది ఒక పద్ధతి. ప్రమాణం చేసేవారిని దేవతావిగ్రహం వద్దకు ఎర్రగా కాగిన ఇనుప వస్తువును తీసికొని పొమ్మనేవారు. దీనివల్ల అతనికి ఏ విధమైన హాని కలుగకపోతే అతనిని నిర్దోషిగా నిర్ణయించేవారు. ఇది రెండో పద్ధతి. బాగా కాగుతున్న వెన్నపాత్రలో ప్రమాణం చేసినవానిని వేళ్ళను పెట్టమని వెంటనే కట్టుకట్టేవారు. మూడో రోజున విప్పి చూస్తే ఎట్టిగాయం లేకపోతే అతనిని నిర్దోషిగా నిర్ణయించేవారు. ఇది మూడో పద్ధతి. ఈ మడ్డువట్టు విధానం గూర్చి సింహాసన ద్వాత్రింశికలో ఉంది. ఈ విధంగా ప్రమాణంచేసే ఆచారం ఉన్నట్లు నాటి విదేశీయుల రాతలవల్ల కూడా తెలుస్తుంది.

ఒక గొప్ప కార్యాన్ని ఆరంభించేటప్పుడు కాని, యుద్ధానికి పోయేటప్పుడు గాని వీరతాంబూలాన్నివ్వటం ఆచారం. ఈ వీరతాంబూలపు ప్రసక్తి కుమారసంభవం, బసవపురాణం, ఆంధ్రమహాభారతం మొదలైన వాటిలో కన్పిస్తుంది.

ఆ కాలంలో విజేత ఓడినవాని బిరుదాలను గ్రహించటమేకాక, వాని ప్రతిమను చేయించి తన కాలిఅందెకు పొదిగించుకొనే ఆచారం వాడుకలో ఉంది. దీనినే "బొమ్మ పెట్టుట" అంటారు. ఇది ఆనాటి రాజ సంప్రదాయం. ఈ విషయం కాశీఖండం, పల్నాటి వీరచరిత్ర, విక్రమార్క చరిత్రలలో కన్పిస్తుంది.

ఆనాడు "రణము కుడుపు" అనే సంప్రదాయం ఒకటి వాడుకలో ఉన్నట్లు వెలుగోటి వారి వంశచరిత్ర వల్ల తెలుస్తుంది.

ఆకాలంలో ఋణపత్రాలను రాసి అప్పులు చేసికొనేవారు. ఈ ఋణ పత్రాలపై సాక్షులు కూడా సంతకాలు చేసేవారని పాండురంగ మహాత్మ్యం వల్ల తెలుస్తుంది.

### చదవదగిన పుస్తకాలు

ఈ ఖండంలోని చివరి భాగంలో చూడండి.

### మాదిరి పరీక్షా ప్రశ్నలు

I. కింది ప్రశ్నలకు 30 వాక్యాలకు మించకుండా సమాధానాలు రాయండి.

1. మధ్యయుగం తొలిదశనాటి వేడుకలు, వినోదాలు పరిశీలించండి.
2. మధ్యయుగంలోని సామాజిక వ్యవస్థను సంగ్రహంగా పరిచయం చేయండి.
3. మధ్యయుగం తొలిదశలోని ఆర్థికపరిస్థితులను సంగ్రహంగా వివరించండి.

II. కింది ప్రశ్నలకు 10 వాక్యాలు మించకుండా సమాధానాలు రాయండి.

1. మధ్యయుగం తొలిదశలోని వర్ణవ్యవస్థను వివరించండి.
2. మధ్యయుగం తొలిదశలోని విద్యలు, సాహిత్యం, కళలు గురించి తెల్పండి.
3. మధ్యయుగం తొలిదశలోని మతపరిస్థితులపై వ్యాఖ్యానించండి.

BRAOU

BRAOU

# భాగం - 24 తెలుగు సంస్కృతి మధ్యకాలీనదశ II (క్రీ.శ. 1600-1800)

విషయక్రమం

24.0 లక్ష్యాలు
24.1 పరిచయం
24.2.0 రాజకీయ చరిత్ర
    24.2.1 గోల్కొండ రాజ్యం మొగలాయి సుబాగా మార్పు
    24.2.2 డచ్, ఫ్రెంచి, ఇంగ్లీషు వాళ్ల రాక
24.3 పాలనా వ్యవస్థ
24.4.0 ఆర్థిక పరిస్థితులు
    24.4.1 వ్యవసాయం
    24.4.2 పరిశ్రమలు
    24.4.3 వాణిజ్యం
24.5.0 సామాజిక జీవనం
    24.5.1 వర్ణ వ్యవస్థ
    24.5.2 విద్యలు, కళలు
    24.5.3 వేడుకలు, వినోదాలు
    24.5.4 మతం
    25.5.5 ఆచార వ్యవహారాలు
**అవగాహన ప్రశ్న**
24.6 సారాంశం
**అవగాహన ప్రశ్నకు జవాబు**
చదవదగిన పుస్తకాలు
మాదిరి పరీక్షా ప్రశ్నలు

BRAOU

## 24.0 లక్ష్యాలు

క్రీ.శ. 1600 నుండి 1800 దాకా అంటే, గోల్కొండ సుల్తాన్ మహమ్మద్ కులీ కుతుబ్‌షా కాలం నుంచి ఆంధ్రప్రాంతం మొగలాయి రాజ్యంలో సుబా అయి, తర్వాత బ్రిటిష్ వాళ్ల అధీనంలోకి వచ్చేంతవరకు సంభవించిన తెలుగు సంస్కృతి పరిణామాలను ఈ భాగం చదివాక మీరు విశ్లేషించగలుగుతారు.

## 24.1 పరిచయం

ఈ దశలో పెక్కు పరిణామాలు సంభవించాయి. ప్రధానంగా డచ్, ఫ్రెంచి, ఇంగ్లీషు సామ్ర ఆంధ్ర రాజకీయ రంగంలో ప్రవేశించటమే కాకుండా వారి భాషా సాహిత్య సంస్కృతుల ప్రత్యక్షంగానో పరోక్షంగానో దోహదం చేశారు. క్రీ.శ. 1600 నుండి 1800 దాకా నడచిన ఆ చరిత్రగతమైన పరిణామాలను ఈ భాగంలో మీరు తెలుసుకుంటారు.

## 24.2.0 రాజకీయ చరిత్ర

మహమ్మద్ కులీ కుతుబ్‌షా తరువాత అబ్దుల్లా కుతుబ్‌షా (1626-1672) సింహా ఈతడు బాలుడు కాబట్టి అతని తల్లి పరిపాలించింది. షాజహాన్ మొగలాయి సింహాసనా ప్రాంతాన్ని తన సామ్రాజ్యంలో కలిపివేయాలనుకొన్నాడు. చివరకు క్రీ.శ. 1635 మొగలాయి సామంతుడైనాడు (Brief History of Andhra Pradesh–Md. Abdul W

మహమ్మద్ సయ్యద్ 'మీర్‌జుమ్లా' అయిన తరువాత గోల్కొండ రాజ్యం విస్తరించింది. కాని ఈతడు సుల్తానుతో విభేదించి గోల్కొండను ఆక్రమించవలసిందిగా మొగలాయిలను ఆహ్వానించాడు. ఈ యుద్ధంవల్ల గోల్కొండ సుల్తాను కోటి రూపాయలను మొగలాయిలకు చెల్లించి సంధి చేసికొన్నాడు. తూర్పుతీరంలో వర్తకం చేసికొనేందుకు ఆంగ్లేయులకు అనుమతియిస్తూ అబ్దుల్లా కుతుబ్‌షా 'బంగారు ఫర్మానా' ఇచ్చాడు. ఆనాటికే ఫ్రెంచి, డచ్చి వాణిజ్య సంఘాలున్నాయి.

### 24.2.1 గోల్కొండ రాజ్యం మొగలాయి సుబాగా మార్పు

అబ్దుల్లా కుతుబ్‌షా అనంతరం ఆయన మూడో అల్లుడు అబ్దుల్ హసన్ రాజ్యానికి వచ్చాడు. ఈయననే 'తానాషా' అంటారు. ఈయన శివాజీతో ఒక ఒడంబడికను కుదుర్చుకొన్నాడు. అక్కన్న మాదన్న సోదరులను మంత్రులుగా నియమించుకొన్నాడు. దీనివల్ల ఔరంగజేబుతో విరోధం ఏర్పడింది. క్రీ.శ. 1687 లో ఔరంగజేబు స్వయంగా గోల్కొండను ముట్టడించాడు. స్వార్థపరుల సహాయంతోనూ, కుతంత్రాలతోనూ తానాషాను బంధించాడు. తానాషా మొగలాయీల బందీగానే మరణించాడు. గోల్కొండ రాజ్యం మొగలాయి రాజ్యంలో ఒక సుబా అయింది. దీనితో కుతుబ్‌షాహీల పరిపాలన అంతరించింది. ఔరంగజేబు తన కుమారుని ఈ ప్రాంతపు రాజప్రతినిధిగా నియమించాడు.

### 24.2.2 డచ్, ఫ్రెంచి, ఇంగ్లీషువాళ్ల రాక

ఔరంగజేబు అనంతరం సామ్రాజ్యంలోని అంతఃకలహాలను ఆధారం చేసికొని దక్షిణ దేశపు సుబేదారుగా ఉన్న "నిజామ్ - ఉల్ - ముల్క్ ఆసఫ్‌జా" స్వాతంత్ర్యాన్ని ప్రకటించుకొన్నాడు. ఈతని రాజ్యం పూర్వపు గోల్కొండకు ప్రతిబింబం క్రీ.శ. 1748 లో ఆసఫ్‌జా మరణించాడు. ఈయన తరువాత అంతఃకలహాలు ఏర్పడ్డాయి. ఈ అంతఃకలహాలలో ఫ్రెంచి గవర్నరు డూప్లే జోక్యం కల్పించుకొని 'ముజఫర్ జంగ్' (ఆసఫ్‌జా మనుమడు) ని 'నిజాము' గ చేశాడు. ఆరువారాల తరువాత ఈతనిని హత్య చేశారు. ఈతని తరువాత ఫ్రెంచివారి సాయంతో ఆసఫ్‌జా మూడో కుమారుడు 'సలాబత్ జంగ్' రాజు అయ్యాడు. దీనివల్ల ముస్తాఫానగర్, ఏలూరు, రాజమహేంద్రవరం, శ్రీకాకుళం సర్కారులు ఫ్రెంచివారికి లభించాయి. ఈ విధంగా ఫ్రెంచివారు బలవంతులు కావటం చూడలేని ఆంగ్లేయులు ఆనందగజపతి సహాయంతో ఫ్రెంచివారిని ఓడించారు. ఆంగ్లేయుల విజయాలను చూచిన నిజాం సలాబత్ జంగ్ ఆంగ్లేయులతో సంధి చేసికొన్నాడు. ఆ కాలంలో ఫ్రెంచివారి ప్రాబల్యం తగ్గింది. క్రీ.శ. 1762 లో సలాబత్ జంగ్‌ను పదవీభ్రష్టుని గావించి ఆతని సోదరుడు నవాబు నిజాం ఆలీఖాన్ రాజ్యానికి వచ్చాడు. దీనివల్ల ఫ్రెంచివారి ఆధీనంలో ఉన్న ఉత్తర సర్కారులు ఆంగ్లేయుల స్వాధీనం అయ్యాయి. నిజాం ఆలీఖాన్ గుంటూరు సర్కారును కూడా ఆంగ్లేయులకు ఇచ్చాడు. ఈయన కుమారుడు "ఆలీజా" తండ్రిపై తిరుగుబాటు చేశాడు. కాని ఆలీజాను ఓడించి బంధించి తీసికొని వస్తుండగా, అతడు విషం తాగి మరణించాడు. నిజామునకు పక్షవాతం వచ్చింది. క్రీ.శ. 1803 లో మరణించాడు.

ఆ కాలంలో ఆంధ్రదేశం కొంతకాలం మొగలాయిల అధికారంలోను, ఫ్రెంచి వారి అదుపాజ్ఞలలోను ఉంది. తరవాత ఆంగ్లేయుల పాలనలోనికి చాల భాగం వచ్చింది. అంతే కాకుండా తెలుగుగడ్డ రెండు భాగాలుగా విడిపోయి ఒక భాగం ఆంగ్లేయుల పాలనలోను, మరియొక భాగం నైజాం ఆధీనంలోను ఉండటం జరిగింది. నిజాం ఆలీఖాన్ నుండి కౌలుకి తీసుకొన్న ఉత్తర సర్కారులలో కొంత భాగాన్ని ఆంగ్లేయులు తమ మిత్రులకు కౌలుకి ఇచ్చేవారు. ఈ ప్రాంతాలలో ఉన్న స్థానిక పాలకులు కౌలుదారులకే కప్పాలు చెల్లించవలసి ఉండేది. క్రీ.శ. 1769 లో ఈ పద్ధతిని రద్దుకావించారు. ఈ విధానంవల్ల పన్నులు సరిగా వసూలు కాలేదు. బకాయిలు పెరిగిపోయాయి. దీనివల్ల ఆంగ్లేయులకు నష్టం వచ్చింది. అందుచేత "శాశ్వత కరనిర్ణయ పద్ధతి" (Permanent Revenue Settlement) ని ఆంగ్లేయులు ప్రవేశపెట్టారు. ఈ సమయంలోనే ఆంగ్లేయులు పాత జమీన్‌దారుల అధికారాన్ని స్థిరపర్చారు. మిగిలిన వానిని వేలంవేసి అధికంగా పాటపాడిన వారికి ఇచ్చేవారు. ఈ వ్యవస్థ క్రీ.శ. 1802 నుంచి అమలులోనికి వచ్చింది.

---

## 1.3 పాలన వ్యవస్థ

గోల్కొండ రాజ్యాన్ని 6 రాష్ట్రాలుగా విభజించారు. రాష్ట్రాన్ని 'తరఫ్' అని వ్యవహరించేవారు. ఈ ...ను పాలించేవారిని 'తరఫ్‌దార్' అనేవారు. గోల్కొండ రాజ్యం మొగలాయి సామ్రాజ్యంలో అంతర్భాగమైన ...ర్కారు, పరగణా అనే విభజన జరిగింది. గోల్కొండ సుల్తాన్ సర్వాధికారి. ఈయన తాను దేవుని

BRAOU

ప్రతిరూపం అని భావించేవాడు. కాబట్టి ఈయనే శాసనకర్త, న్యాయాధికారి, సర్వసైన్యాధికారి కూడ. ఈయనకు మజ్లిస్-ఇ-కింగాష్ అనే సలహా సంఘం ఉండేది. (ఆంధ్రుల సంస్కృతి - చరిత్ర, రెండో భాగం, పుట 279) దీనిలో మంత్రులు, అమీరులు సభ్యులుగా ఉండేవారు. మంత్రులలో ముఖ్యుని 'మీర్ జుమ్లా' అంటారు. ఈయన తరువాత 'ఇమల్ ముల్క్' ఉంటాడు. ఈయన సైనిక వ్యవహారాలు చూస్తాడు. వీరుకాక ఇంకా ఖజన్‌దార్ (కోశాధికారి), మజుందార్ (గణాంక శాఖాధికారి), "నాజిర్, దబీర్, షురూనవిస్" (ప్రభుత్వ పత్రాలను భద్రపర్చేవాడు), "కొత్వాలు, హవల్దారు, సర్ఖేల్" మొదలైన అధికారులు ఉండేవారు. (పైది - పుట 279) ఈ మజ్లిస్-ఇ-కింగాష్ అబుల్ హసన్ కాలంలో మజ్లిస్-ఇ-దివాన్‌దారీగా పనిచేసింది.

ఆ కాలంలో 38 సర్కారు (జిల్లా) లు ఉండేవి. సర్కారులను "సీమ"లు అనేవారు. వీటిని "పరగణాలు" (తాలూకా)గ విభజించారు. సర్కారు పరగణాల అధికార్లను ఫౌజుదార్లని పిలిచేవారు. వీరికి సహాయం చేయుటానికి "హవల్దారులు" ఉండేవారు.

కుతుబ్‌షాహీల కాలంలో దేశపాండే, ఠాణేదార్, దేశ్‌ముఖ్, మజుందార్, తల్‌కర్ని, కుల్‌కర్ని మొదలైనవారు ఉండేవారు.

ఈ విభాగాలు కాకుండా చాలా జాగీర్లు ఉండేవి. ఈ జాగీర్దారులు ప్రభువుకు అవసరమైనప్పుడు సైన్యాన్ని సమకూర్చవలసి ఉంటుంది. సుల్తానుకు సమకూర్చే సైనిక సంఖ్యను బట్టి జాగీర్దారుల స్థాయిని నిర్ణయించేవారు.

గ్రామ పంచాయతులే గ్రామపాలన చేసేవి. గ్రామాలలో వంశ పారంపర్య హక్కు కలిగిన అగ్రహారాలుండేవి. వీటినే 'మిరాశీ' లు అంటారు. వీటి హక్కుదారులను "మిరాశీదారులు" అనేవారు. ఇటువంటి హక్కులు గల పన్నెండుగురు "ఆయన గార్లు" కుతుబ్‌షాహీ ఫర్మానాలలో కన్పిస్తారు. వీరు - 'పటేల్, కుల్‌కర్ని' (మునసబు కరణం) చౌద్రి, (వర్తకుల పెద్ద) పోతేదార్, (నాణాల మారకందారు), దేశపాండ్య (జిల్లా గణకుడు), నహాని (మంగలి), సారిత్ (చాకలి), గురువు (పూజారి), సుతార్ (వడ్రంగి), కుంబార్ (కుమ్మరి), వేశహార (ద్వారపాలకుడు), జోషి (జ్యోతిష్కుడు), వతన్‌దార్లు, మిరాశీదార్లు, కలిసి "గోసభ" గా ఏర్పడేవారు. (ఆంధ్రుల సంస్కృతి-చరిత్ర, రెండోభాగం, పుట - 285).

కుతుబ్‌షాహీ సుల్తానులు హిందువుల తగవులలో జోక్యం చేసేవారు కారు. కుల సంఘానికిగాని, బ్రాహ్మణ సభకు గాని ఈ తగవులను పరిష్కరించటానికి అప్పగించేవారు. ఆనాటి న్యాయ వ్యవస్థలో అనేక అంతరువులు ఉండేవి. సుల్తాన్ సర్వస్వతంత్రుడు అయిన న్యాయాధికారి. ఈయన తరువాత "షరియత్ పంచ్" ఉండేవాడు. ఈయన ప్రధాన న్యాయమూర్తి. ఈయన సలహామండలి సభ్యుడు. తరువాత న్యాయాధికారి 'కాజీ'. ప్రతి పరగణాలోను కాజీ, హవల్దార్, మజ్లిస్ ఉంటారు. గోసభ సహాయంతో న్యాయ విచారణ సాగించే న్యాయాధికారులలో ఆఖరివాడు "ఠాణేదారు".

సుల్తాన్‌కు విచారణ సహాయంలో హిందూ ముస్లిం పండితుల సహాయం లభించేది. కులీకుతుబ్‌షా "దార్‌మహల్" ను, సుల్తాన్ అహమ్మద్ "అమన్‌మహల్"ను న్యాయ విచారణ సాగించటానికే నిర్మించారు.

ఆనాడు దోషులకు విధించే శిక్షలు కూడా కఠినంగా ఉండేవి. దొంగతనం చేసిన వాని రెండు చేతుల నరకటం దొంగకు శిక్ష. ప్రభుత్వంపై తిరుగుబాటు చేసిన వారికి, ద్రోహులకు మరణం శిక్ష, గాడి ఊరేగించటం వంటి శిక్షలు అనేకం అమలులో ఉండేవి.

కుతుబ్‌షాహీ సుల్తానుల అనంతరం కొన్నాళ్ళు న్యాయ వ్యవస్థ ఛిన్నా భిన్నం అయింది.

మొగలాయిల కాలంలో దక్కన్ ప్రతినిధియైన "నిజామ్-ఉల్-ముల్క్" ఆసఫ్‌జా పాలకుడు. ప్రజా సంక్షేమాన్ని కోరేవాడు. కాబట్టి సుస్థిరం, సమర్థవంతం అయిన పరిపాల ఈయన తన రాజ్యాన్ని ఆరు సుబాలుగా విభజించాడు. ఇందులో హైదరాబాద్ సుబా ఒకటి. ఇది జిల్లాలతో కూడింది. సుల్తానే స్వయంగా హైద్రాబాదు సుబాని పాలించేవాడు. "రిసలా-ఇ- (Risala-I-Darbar-I-Asafi) అనే గ్రంథం నిజామ్-ఉల్-ముల్క్ పరిపాలన నియమాలను నిర్వాహణ హక్కులను గురించి, కార్యనిర్వాహణ పద్ధతిని గురించి వివరిస్తుంది. (Brief Pradesh, Page – 48).

BRAOU

సుబాలలో పరిపాలన నిర్వహించటానికి "దప్తర్-ఇ-దివానీ, దప్తర్-ఇ-మానో" అనేవారు ఉండేవారు. వీరు జాగీర్లు, దాన పత్రాలు, సైన్య విషయాలకు సంబంధించిన వాటిని చూచేవారు. దప్తర్-ఇ-ఇస్తాద్ సనదులకు నకలు ప్రతులను తయారుచేసి భద్రపరచేవారు. దారుల్ ఇన్షా (Darul Insha) సుల్తాన్, మంత్రుల ఉత్తర ప్రత్యుత్తరాలను చూసేవారు.

ప్రభుత్వయంత్రాంగంలో ముఖ్యమైన వ్యక్తి "దివాన్" ఈయన వల్లనే ప్రభుత్వ కార్యాలు సాగేవి. మొట్టమొదటి నిజామ్-ఉల్-ముల్క్ ప్రధానులు అన్వరుల్లా, పురాన్ చంద్ అనేవారు. ఇంకా షానవాజ్ఖాన్, రఘునాథదాస్, సయ్యద్ లష్కర్ఖాన్ మొదలైనవారు.

నిజాం అలీఖాన్ కాలంలో 'పైగా' (Paigah) అనే సైనిక వ్యవస్థ ఉండేది. దీనిని కేవలం సుల్తాన్ రక్షణకోసం ఏర్పరచారు. ఈ సైన్యాధికారికి "షంసుల్ ఉమరా" అనే బిరుదు ఉంది. ఈయన కాలంలో పేష్కరు పదవి కూడా ఉంది.

మంత్రి, పేష్కరు, కాజీ, కొత్వాలు మొదలైన అధికారులు మన్సబ్దారులు, పైగా ఉద్యోగులు, జమీందార్లు మొదలైన సైనికోద్యోగులు ఆనాటి పాలనవ్యవస్థలో ఉండేవారు. ఇందులో పైగా ఉద్యోగులకు ఎవరి అనుమతి లేకుండానే సుల్తాన్ దగ్గరకు వెళ్ళే అధికారం ఉండేది.

ఆనాడు కూడ గ్రామమే పరిపాలన వ్యవస్థలో మొదటి మెట్టు. పటేల్, పట్వారీలు గ్రామాధికార్లు. వీరు నిజాము హక్కులను రక్షించేవారు.

వీరి కాలంలో న్యాయపాలన ముస్లిం ధర్మశాస్త్రం అనుసరించి జరిగేది. (Brief History of Andhra Pradesh, Page 56) అధికారులను శిక్షించటానికి, ఉద్యోగంనుంచి తొలగించటానికి, ఉద్యోగులను నియమించడానికి, బిరుదులు ఇవ్వటానికి, భూమిని దానం చేయటానికి నిజాం-ఉల్-ముల్క్కే అధికారం ఉండేది.

ఇతర ప్రభువుల కొలువులోని దైనందిన వ్యవహారాలను నిజాముకు తెలియచేయటానికి "హైబత్రావు గోపాల్" అనే ఆయన ఉండేవాడు.

దస్తరదార్లు భూమిశిస్తు నిర్ణయించటానికి ఒక ప్రత్యేక శాఖను ఏర్పరచారు. వీరు కాక ఎంతోమంది "ముతాసద్దీ" లు ఉండేవారు.

ఈ విధంగా కాలానుగుణంగా పరిపాలన వ్యవస్థ కూడా మారింది.

BRAOU

## 24.4.0 ఆర్థిక పరిస్థితులు

ఈ కాలంలో వ్యవసాయం నుంచి ఒక కొత్తవర్గం (భూస్వాములు, జమీందారులు) ఏర్పడ్డాయి. రైతులకు పన్నుల భారం ఏమీ తగ్గలేదు. పరిశ్రమ వృత్తులు అభివృద్ధి చెందాయి కానీ వాణిజ్యం కుంటుపడింది.

### 24.4.1 వ్యవసాయం

ఈ మలిదశలో వ్యవసాయదారునిదే భూమి హక్కు. ఈ భూమిని సుల్తాన్ అనుమతితో తీసికోవాలి. ఈ భూమిమీద పన్ను విధించే హక్కు సుల్తానుదే. భూమిని సాగు చేయకపోయినా, పన్ను కట్టకపోయినా సుల్తాన్ భూమిని స్వాధీనం చేసికొనవచ్చును. కాని భూమిమీద హక్కు మాత్రం వంశపారంపర్యం. ఎప్పుడైనా ఎవ్వరైనా భూమి వదలి వెళ్ళినప్పటికీ పన్నులు పూర్తిగా చెల్లిస్తే వ్యవసాయం చేసికొనేవీలు ఉండేది.

ఈ దశలో భూమిపైన పన్ను వసూలు చేసేవారు తయారయ్యారు. దీనివల్ల భూస్వాములు, జమీందారులు అనే నూతన వర్గం ఒకటి ఏర్పడింది.

ఆనాడు వ్యవసాయదారులపై పన్నులభారం ఎక్కువగా ఉండేది. వ్యవసాయదారులు పన్నులు చెల్లించక పోతే, దానిని తిరుగుబాటుగా పరిగణించేవారు. పన్నులు కట్టటం కోసం భార్యాపిల్లల్ని అమ్మడం జరిగేది (ఆంధ్రుల సంస్కృతి - చరిత్ర, రెండోభాగం, పుట - 289).

ఈ దశలో భూమిని, ఫలసాయాన్ని బట్టి వర్గీకరించారు. వ్యవసాయదారుని శక్తి సామర్థ్యాలను బట్టి, గ్రామ సలహాను అనుసరించి భూమిని పంచేవారు. ఇది పూర్వం నుంచి ఉన్న విధానమే కాని కొత్తది కాదు.

# భాగం - 24 తెలుగు సంస్కృతి మధ్యకాలీనదశ II
# (క్రీ.శ. 1600–1800)

## విషయక్రమం

24.0 లక్ష్యాలు
24.1 పరిచయం
24.2.0 రాజకీయ చరిత్ర
 24.2.1 గోల్కొండ రాజ్యం మొగలాయి సుబాగా మార్పు
 24.2.2 డచ్, ఫ్రెంచి, ఇంగ్లీషు వాళ్ల రాక
24.3 హిలవా వ్యవస్థ
24.4.0 ఆర్థిక పరిస్థితులు
 24.4.1 వ్యవసాయం
 24.4.2 పరిశ్రమలు
 24.4.3 వాణిజ్యం
24.5.0 సామాజిక జీవనం
 24.5.1 వర్ణ వ్యవస్థ
 24.5.2 విద్యలు, కళలు
 24.5.3 వేడుకలు, వినోదాలు
 24.5.4 మతం
 25.5.5 ఆచార వ్యవహారాలు
**అవగాహన ప్రశ్న**
24.6 సారాంశం
**అవగాహన ప్రశ్నకు జవాబు**
చదవదగిన పుస్తకాలు
మాదిరి పరీక్షా ప్రశ్నలు

BRAOU

## 24.0 లక్ష్యాలు

క్రీ.శ. 1600 నుండి 1800 దాకా అంటే, గోల్కొండ సుల్తాన్ మహమ్మద్ కులీ కుతుబ్‌షా కాలం నుంచి ఆంధ్రప్రాంతం మొగలాయి రాజ్యంలో సుబా అయి, తర్వాత బ్రిటిష్ వాళ్ల అధీనంలోకి వచ్చేంతవరకు సంభవించిన తెలుగు సంస్కృతి పరిణామాలను ఈ భాగం చదివాక మీరు విశ్లేషించగలుగుతారు.

## 24.1 పరిచయం

ఈ దశలో పెక్కు పరిణామాలు సంభవించాయి. ప్రధానంగా డచ్, ఫ్రెంచి, ఇంగ్లీషు సామ్రాజ్యవాదులు ఆంధ్ర రాజకీయ రంగంలో ప్రవేశించటమే కాకుండా వారి భాషా సాహిత్య సంస్కృతుల పరిణామానికి ప్రత్యక్షంగానో పరోక్షంగానో దోహదం చేశారు. క్రీ.శ. 1600 నుండి 1800 దాకా నడచిన ఆంధ్ర సంస్కృతీ చరిత్రగతమైన పరిణామాలను ఈ భాగంలో మీరు తెలుసుకుంటారు.

## 24.2.0 రాజకీయ చరిత్ర

మహమ్మద్ కులీ కుతుబ్‌షా తరువాత అబ్దుల్లా కుతుబ్‌షా (1626-1672) సింహాసనాన్ని అధిష్ఠించాడు. ఈతడు బాలుడు కాబట్టి అతని తల్లి పరిపాలించింది. షాజహాన్ మొగలాయి సింహాసనాన్ని అధిష్ఠించగానే దక్షిణ ప్రాంతాన్ని తన సామ్రాజ్యంలో కలిపివేయాలనుకొన్నాడు. చివరకు క్రీ.శ. 1635 లో గోల్కొండ ప్రభువు మొగలాయి సామంతుడైనాడు (Brief History of Andhra Pradesh–Md. Abdul Waheed Khan Page-26).

మహమ్మద్ సయ్యద్ 'మీర్‌జుమ్లా' అయిన తరువాత గోల్కొండ రాజ్యం విస్తరించింది. కాని ఈతడు సుల్తానుతో విభేదించి గోల్కొండను ఆక్రమించవలసిందిగా మొగలాయిలను ఆహ్వానించాడు. ఈ యుద్ధంవల్ల గోల్కొండ సుల్తాను కోటి రూపాయలను మొగలాయిలకు చెల్లించి సంధి చేసికొన్నాడు. తూర్పుతీరంలో వర్తకం చేసికొనేందుకు ఆంగ్లేయులకు అనుమతియిస్తూ అబ్దుల్లా కుతుబ్‌షా 'బంగారు ఫర్మానా' ఇచ్చాడు. ఆనాటికే ఫ్రెంచి, డచ్చి వాణిజ్య సంఘాలున్నాయి.

### 24.2.1 గోల్కొండ రాజ్యం మొగలాయి సుబాగా మార్పు

అబ్దుల్లా కుతుబ్‌షా అనంతరం ఆయన మూడో అల్లుడు అబ్దుల్ హసన్ రాజ్యానికి వచ్చాడు. ఈయననే 'తానాషా' అంటారు. ఈయన శివాజీతో ఒక ఒడంబడికను కుదుర్చుకొన్నాడు. అక్కన్న మాదన్న సోదరులను మంత్రులుగా నియమించుకొన్నాడు. దీనివల్ల ఔరంగజేబుతో విరోధం ఏర్పడింది. క్రీ.శ. 1687 లో ఔరంగజేబు స్వయంగా గోల్కొండను ముట్టడించాడు. స్వార్థపరుల సహాయంతోనూ, కుతంత్రాలతోనూ తానాషాను బంధించాడు. తానాషా మొగలాయీల బందీగానే మరణించాడు. గోల్కొండ రాజ్యం మొగలాయి రాజ్యంలో ఒక సుబా అయింది. దీనితో కుతుబ్‌షాహీల పరిపాలన అంతరించింది. ఔరంగజేబు తన కుమారుని ఈ ప్రాంతపు రాజప్రతినిధిగా నియమించాడు.

### 24.2.2 డచ్, ఫ్రెంచి, ఇంగ్లీషువాళ్ల రాక

ఔరంగజేబు అనంతరం సామ్రాజ్యంలోని అంతఃకలహాలను ఆధారం చేసికొని దక్షిణ దేశపు సుబేదారుగా ఉన్న "నిజామ్ - ఉల్ - ముల్క్ ఆసఫ్‌జా" స్వాతంత్ర్యాన్ని ప్రకటించుకొన్నాడు. ఈతని రాజ్యం పూర్వపు గోల్కొండకు ప్రతిబింబం క్రీ.శ. 1748 లో ఆసఫ్‌జా మరణించాడు. ఈయన తరువాత అంతఃకలహాలు ఏర్పడ్డాయి. ఈ అంతఃకలహాలలో ఫ్రెంచి గవర్నరు డూప్లే జోక్యం కల్పించుకొని 'ముజఫర్ జంగ్' (ఆసఫ్‌జా మనుమడు) ని 'నిజాము' గ చేశాడు. ఆరువారాల తరువాత ఈతనిని హత్య చేశారు. ఈతని తరువాత ఫ్రెంచివారి సాయంతో అసఫ్‌జా మూడో కుమారుడు 'సలాబత్ జంగ్' రాజు అయ్యాడు. దీనివల్ల ముస్తాఫానగర్, ఏలూరు, రాజమహేంద్రవరం, శ్రీకాకుళం సర్కారులు ఫ్రెంచివారికి లభించాయి. ఈ విధంగా ఫ్రెంచివారు బలవంతులౌ కావటం చూడలేని ఆంగ్లేయులు ఆనందగజపతి సహాయంతో ఫ్రెంచివారిని ఓడించారు. ఆంగ్లేయుల విజయాలను చూచిన నిజాం సలాబత్ జంగ్ ఆంగ్లేయులతో సంధి చేసికొన్నాడు. ఆ కాలంలో ఫ్రెంచివారి ప్రాబల్యం తగ్గింది. క్రీ.శ. 1762 లో సలాబత్ జంగ్‌ను పదవీభ్రష్టుని గావించి అతని సోదరుడు నవాబు నిజాం ఆలీఖాన్ రాజ్యానికి వచ్చాడు. దీనివల్ల ఫ్రెంచివారి ఆధీనంలో ఉన్న ఉత్తర సర్కారులు ఆంగ్లేయుల స్వాధీనం అయ్యాయి. నిజాం ఆలీఖాన్ గుంటూరు సర్కారును కూడా ఆంగ్లేయులకు ఇచ్చాడు. ఈయన కుమారుడు "ఆలీజా" తండ్రిపై తిరుగుబాటు చేశాడు. కాని ఆలీజాను ఓడించి బంధించి తీసికొని వస్తుండగా, అతడు విషం తాగి మరణించాడు. నిజాముకు పక్షవాతం వచ్చింది. క్రీ.శ. 1803 లో మరణించాడు.

ఆ కాలంలో ఆంధ్రదేశం కొంతకాలం మొగలాయిల అధికారంలోను, ఫ్రెంచి వారి అదుపాజ్ఞలలోను ఉంది. తరవాత ఆంగ్లేయుల పాలనలోనికి చాల భాగం వచ్చింది. అంతే కాకుండా తెలుగుగడ్డ రెండు భాగాలుగా విడిపోయి ఒక భాగం ఆంగ్లేయుల పాలనలోను, మరియొక భాగం నైజాం ఆధీనంలోను ఉండటం జరిగింది. నిజాం ఆలీఖాన్ నుండి కౌలుకి తీసుకొన్న ఉత్తర సర్కారులలో కొంత భాగాన్ని ఆంగ్లేయులు తమ మిత్రులకు కౌలుకి ఇచ్చేవారు. ఈ ప్రాంతాలలో ఉన్న స్థానిక పాలకులు కౌలుదారులకే కప్పాలు చెల్లింపవలసి ఉండేది. క్రీ.శ. 1769 లో ఈ పద్ధతిని రద్దుకావించారు. ఈ విధానంవల్ల పన్నులు సరిగా వసూలు కాలేదు. బకాయిలు పెరిగిపోయాయి. దీనివల్ల ఆంగ్లేయులకు నష్టం వచ్చింది. అందుచేత "శాశ్వత కరనిర్ణయ పద్ధతి" (Permanent Revenue Settlement) ని ఆంగ్లేయులు ప్రవేశపెట్టారు. ఈ సమయంలోనే ఆంగ్లేయులు పాత జమీన్‌దారుల అధికారాన్ని స్థిరపర్చారు. మిగిలిన వానిని వేలంవేసి అధికంగా పాటపాడిన వారికి ఇచ్చేవారు. ఈ వ్యవస్థ క్రీ.శ. 1802 నుంచి అమలులోనికి వచ్చింది.

## 24.3 పాలన వ్యవస్థ

గోల్కొండ రాజ్యాన్ని 6 రాష్ట్రాలుగా విభజించారు. రాష్ట్రాన్ని 'తరఫ్' అని వ్యవహరించేవారు. ఈ తరఫ్‌లను పాలించేవారిని 'తరఫ్‌దార్' అనేవారు. గోల్కొండ రాజ్యం మొగలాయి సామ్రాజ్యంలో అంతర్భాగమైన తరవాత సర్కారు, పరగణా అనే విభజన జరిగింది. గోల్కొండ సుల్తాన్ సర్వాధికారి. ఈయన తాను దేవుని

BRAOU

సుబాలలో పరిపాలన నిర్వహించటానికి "దఫ్తర్-ఇ-దివానీ, దఫ్తర్-ఇ-మానొ అనేవారు ఉండేవారు. వీరు జాగీర్లు, దాన పత్రాలు, సైన్య విషయాలకు సంబంధించిన వాటిని చూచేవారు. దఫ్తర్-ఇ-ఇస్తాద్ సనదులకు నకలు ప్రతులను తయారుచేసి భద్రపరచేవారు. దారుల్ ఇన్షా (Darul Insha) సుల్తాన్, మంత్రుల ఉత్తర ప్రత్యుత్తరాలను చూసేవారు.

ప్రభుత్వయంత్రాంగంలో ముఖ్యమైన వ్యక్తి "దివానొ ఈయన వల్లనే ప్రభుత్వ కార్యాలు సాగేవి. మొట్టమొదటి నిజామ్-ఉల్-ముల్క్ ప్రధానులు అన్వరుల్లా, పురాన్ చంద్ అనేవారు. ఇంకా షానవాజ్ఖాన్, రఘునాథదాస్, సయ్యద్ లష్కర్ఖాన్ మొదలైనవారు.

నిజాం అలీఖాన్ కాలంలో 'పైగా' (Paigah) అనే సైనిక వ్యవస్థ ఉండేది. దీనిని కేవలం సుల్తాన్ రక్షణకోసం ఏర్పరచారు. ఈ సైన్యాధికారికి "షంసున్ ఉమరా" అనే బిరుదు ఉంది. ఈయన కాలంలో పేష్కరు పదవి కూడా ఉంది.

మంత్రి, పేష్కరు, కాజీ, కొత్వాలు మొదలైన అధికారులు మన్సబ్దారులు, పైగా ఉద్యోగులు, జమీందార్లు మొదలైన సైనికోద్యోగులు ఆనాటి పాలనవ్యవస్థలో ఉండేవారు. ఇందులో పైగా ఉద్యోగులకు ఎవరి అనుమతి లేకుండానే సుల్తాన్ దగ్గరకు వెళ్ళే అధికారం ఉండేది.

ఆనాడు కూడ గ్రామమే పరిపాలన వ్యవస్థలో మొదటి మెట్టు. పటేల్, పట్వారీలు గ్రామాధికార్లు. వీరు నిజాము హక్కులను రక్షించేవారు.

వీరి కాలంలో న్యాయపాలన ముస్లిం ధర్మశాస్త్రం అనుసరించి జరిగేది. (Brief History of Andhra Pradesh, Page 56) అధికారులను శిక్షించటానికి, ఉద్యోగంనుంచి తొలగించటానికి, ఉద్యోగులను నియమించడానికి, బిరుదులు ఇవ్వటానికి, భూమిని దానం చేయటానికి నిజాం-ఉల్-ముల్క్కే అధికారం ఉండేది.

ఇతర ప్రభువుల కొలువులోని దైనందిన వ్యవహారాలను నిజాముకు తెలియచేయటానికి "హై బత్రావు గోపాల్" అనే ఆయన ఉండేవాడు.

దస్తరదార్లు భూమిశిస్తు నిర్ణయించటానికి ఒక ప్రత్యేక శాఖను ఏర్పరచారు. వీరు కాక ఎంతోమంది "ముతాసద్దీ" లు ఉండేవారు.

ఈ విధంగా కాలానుగుణంగా పరిపాలనా వ్యవస్థ కూడా మారింది.

## 24.4.0 ఆర్థిక పరిస్థితులు

ఈ కాలంలో వ్యవసాయం నుంచి ఒక కొత్తవర్గం (భూస్వాములు, జమీందారులు) ఏర్పడ్డాయి. రైతులకు పన్నుల భారం ఏమీ తగ్గలేదు. పరిశ్రమ వృత్తులు అభివృద్ధి చెందాయి కానీ వాణిజ్యం కుంటుపడింది.

### 24.4.1 వ్యవసాయం

ఈ మలిదశలో వ్యవసాయదారునిదే భూమి హక్కు. ఈ భూమిని సుల్తాన్ అనుమతితో తీసికోవాలి. ఈ భూమిమీద పన్ను విధించే హక్కు సుల్తానుదే. భూమిని సాగు చేయకపోయినా, పన్ను కట్టకపోయినా సుల్తాన్ భూమిని స్వాధీనం చేసికొనవచ్చును. కాని భూమిమీద హక్కు మాత్రం వంశపారంపర్యం. ఎప్పుడైనా ఎవ్వరైనా భూమి వదలి వెళ్ళినప్పటికీ పన్నులు పూర్తిగా చెల్లిస్తే వ్యవసాయం చేసికొనేవీలు ఉండేది.

ఈ దశలో భూమిపైన పన్ను వసూలు చేసేవారు తయారయ్యారు. దీనివల్ల భూస్వాములు, జమీందారులు అనే నూతన వర్గం ఒకటి ఏర్పడింది.

ఆనాడు వ్యవసాయదారులపై పన్నులభారం ఎక్కువగా ఉండేది. వ్యవసాయదారులు పన్నులు చెల్లించక పోతే, దానిని తిరుగుబాటుగా పరిగణించేవారు. పన్నులు కట్టటం కోసం భార్యాపిల్లల్ని అమ్మడం జరిగేది (ఆంధ్రుల సంస్కృతి - చరిత్ర, రెండోభాగం, పుట - 289).

ఈ దశలో భూమిని, ఫలసాయాన్ని బట్టి వర్గీకరించారు. వ్యవసాయదారుని శక్తి సామర్థ్యాలను బట్టి, గ్రామ పెద్దల సలహాను అనుసరించి భూమిని పంచేవారు. ఇది పూర్వం నుంచి ఉన్న విధానమే కాని కొత్తది కాదు.



BRAOU

ప్రతిరూపం అని భావించేవాడు. కాబట్టి ఈయనే శాసనకర్త, న్యాయాధికారి, సర్వసైన్యాధికారి కూడ. ఈయనకు మజ్లిస్–ఇ–కింగాష్ అనే సలహా సంఘం ఉండేది. (ఆంధ్రుల సంస్కృతి – చరిత్ర, రెండో భాగం, పుట 279) దీనిలో మంత్రులు, అమీరులు సభ్యులుగా ఉండేవారు. మంత్రులలో ముఖ్యుని 'మీర్ జుమ్లా' అంటారు. ఈయన తరువాత 'ఇమల్ ముల్క్' ఉంటాడు. ఈయన సైనిక వ్యవహారాలు చూస్తాడు. వీరుకాక ఇంకా ఖజన్‌దార్ (కోశాధికారి), మజుందార్ (గణాంక శాఖాధికారి), "నాజిర్, దబీర్, మరూనలిస్" (ప్రభుత్వ పత్రాలను భద్రపర్చేవాడు), "కొత్వాలు, హవల్దారు, సర్‌ఖేల్" మొదలైన అధికారులు ఉండేవారు. (పైది – పుట 279) ఈ మజ్లిస్–ఇ–కింగాష్ అబుల్ హసన్ కాలంలో మజ్లిస్–ఇ–దివాన్‌దారీగా పనిచేసింది.

ఆ కాలంలో 38 సర్కారు (జిల్లా) లు ఉండేవి. సర్కారులను "సీమ"లు అనేవారు. వీటిని "పరగణాలు" (తాలూకా)గ విభజించారు. సర్కారు పరగణాల అధికార్లను ఫౌజుదార్లని పిలిచేవారు. వీరికి సహాయం చేయటానికి "హవల్దారులు" ఉండేవారు.

కుతుబ్‌షాహీల కాలంలో దేశపాండే, థాణేదార్, దేశ్‌ముఖ్, మజుందార్, తల్‌కర్ని, కుల్‌కర్ని మొదలైనవారు ఉండేవారు.

ఈ విభాగాలు కాకుండా చాలా జాగీర్లు ఉండేవి. ఈ జాగీర్దారులు ప్రభువుకు అవసరమైనప్పుడు సైన్యాన్ని సమకూర్చవలసి ఉంటుంది. సుల్తానుకు సమకూర్చే సైనిక సంఖ్యను బట్టి జాగీర్దారుల స్థాయిని నిర్ణయించేవారు.

గ్రామ పంచాయతులే గ్రామపాలన చేసేవి. గ్రామాలలో వంశ పారంపర్య హక్కు కలిగిన అగ్రహారాలుండేవి. వీటినే 'మిరాశీ' లు అంటారు. వీటి హక్కుదారులను "మిరాశిదారులు" అనేవారు. ఇటువంటి హక్కులు గల పన్నెండుగురు "ఆయన గార్లు" కుతుబ్‌షాహీ ఫర్మానాలలో కన్పిస్తారు. వీరు – 'పటేల్, కుల్‌కర్ని' (మునసబు కరణం) చౌద్రి, (వర్తకుల పెద్ద) పోతేదార్, (నాణాల పూరకందారు), దేశపాండ్య (జిల్లా గణకుడు), నహాని (మంగలి), సారిత్ (చాకలి), గురువు (పూజారి), సుతార్ (వడ్రంగి), కుంబార్ (కుమ్మరి), వేశహార (ద్వారపాలకుడు), జోషి (జ్యోతిష్కుడు), వతన్‌దార్లు, మిరాశీదార్లు, కలిపి "గ[illegible]" గా ఏర్పడేవారు. (ఆంధ్రుల సంస్కృతి–చరిత్ర, రెండోభాగం, పుట – 285).

కుతుబ్‌షాహీ సుల్తానులు హిందువుల తగవులలో జోక్యం చేసుకొనేవారు కారు. కుల సంఘానికిగాని, బ్రాహ్మణ సభకు గాని ఈ తగవులను పరిష్కరించటానికి అప్పగించేవారు. ఆనాటి న్యాయ వ్యవస్థలో అనేక అంతరువులు ఉండేవి. సుల్తాన్ సర్వస్వతంత్రుడు అయిన న్యాయాధికారి. ఈయన తరువాత "షరియత్ పంనా" ఉండేవాడు. ఈయన ప్రధాన న్యాయమూర్తి. ఈయన మంత్రిమండలి సభ్యుడు. తరువాత న్యాయాధికారి 'కాజీ'. ప్రతి పరగణాలోను కాజీ, హవల్దార్, మజ్లిస్ ఉంటారు. కోర్సభ సహాయంతో న్యాయ విచారణ సాగించే న్యాయాధికారులలో ఆఖరివాడు "ఠాణేదారు".

సుల్తాన్‌కు విచారణ సహాయంలో హిందూ ముస్లిం పండితుల సహాయం లభించేది. కులీకుతుబ్‌షా "దార్‌మహల్" ను, సుల్తాన్ అహమ్మద్ "అమన్‌మహల్"ను న్యాయ విచారణ సాగించటానికే నిర్మించారు.

ఆనాడు దోషులకు విధించే శిక్షలు కూడా కఠినంగా ఉండేవి. దొంగతనం చేసిన వాని రెండు చేతులను నరకటం దొంగకు శిక్ష. ప్రభుత్వంపై తిరుగుబాటు చేసిన వారికి, ద్రోహులకు మరణం శిక్ష, గాడిద మీద ఊరేగించటం వంటి శిక్షలు అనేకం అమలులో ఉండేవి.

కుతుబ్‌షాహీ సుల్తానుల అనంతరం కొన్నాళ్ళు న్యాయ వ్యవస్థ చిన్నా భిన్నం అయింది.

మొగలాయిల కాలంలో దక్కన్ ప్రతినిధియైన "నిజామ్–ఉల్–ముల్క్" ఆసఫ్‌జా– సమర్థుడయిన పాలకుడు. ప్రజా సంక్షేమాన్ని కోరేవాడు. కాబట్టి సుస్థిరం, సమర్థవంతం అయిన పరిపాలన సాగించాడు. ఈయన తన రాజ్యాన్ని ఆరు సుబాలుగా విభజించాడు. ఇందులో హైదరాబాద్ సుబా ఒకటి. ఇది ముప్పై ఎనిమిది జిల్లాలతో కూడింది. సుల్తానే స్వయంగా హైద్రాబాదు సుబాని పాలించేవాడు. "రిసలా–ఇ–దర్బార్–ఇ–ఆసఫీ" (Risala–I–Darbar–I–Asafi) అనే గ్రంథం నిజామ్–ఉల్–ముల్క్ పరిపాలన నియమాలను, ఇందులోని కార్య నిర్వాహణ హక్కులను గురించి, కార్యనిర్వాహణ పద్ధతిని గురించి వివరిస్తుంది. (Brief History of Andhra Pradesh, Page – 48).

... 28

BRAOU

'పాలు పద్ధతి' మీద వ్యవసాయం చేసే విధానం కూడా ఆనాడు ఉండేది. ప్రభుత్వం ఖర్చులను భరిస్తే రైతుకు పాలు భాగం లభిస్తుంది. వ్యవసాయదారుడు ఖర్చులు భరిస్తే సగభాగం లభించేది.

కుతుబ్‌షాహి ప్రభువులు అనేక చెరువులు మరమ్మత్తు చేశారు. కాలువలు త్రవ్వించారు. మహమ్మద్ కుతుబ్‌షా తల్లి హైదరాబాదు నగరంలోని 'మాసాబ్ చెరువు'ను త్రవించింది. మహమ్మద్ కులీ కుతుబ్‌షా ధర్మప్రీతికై ఓబులసాని అనే ఆవిడ ఒక చెరువు త్రవ్వించింది. ఇంకా అనేకులు ఈ విధంగానే చెరువులు త్రవ్వించారు. మరమ్మత్తులు చేయించారు.

కరువు కాటకాలు వచ్చినప్పుడు, పరిస్థితులు అనువుగా లేనప్పుడు పన్నులు రాయితీలు ఇచ్చేవారు. పన్నులు కొన్ని వాయిదాలలో చెల్లించే సౌకర్యం కల్పించేవారు. కొన్ని పన్నులను పూర్తిగా రద్దు చేసేవారు.

పూర్వ కాలంలో దానగ్రహీతలకు అగ్రహారాలపైన సర్వహక్కులు లభించేవి కాని ఈ కాలంలో అగ్రహారాలను వంశపారంపర్యంగా అనుభవించవచ్చును. కాని వాటిని అమ్మేహక్కు మాత్రం లేదు

ఆ కాలంలో భూమి సరిహద్దు తగాదాలు వచ్చేవి. ఈ తగాదాలను పరిష్కరించటం కోసం భూములను తిరిగి కొలిచే వారని నాటి శాసనాలవల్ల తెలుస్తుంది.

### 24.4.2 పరిశ్రమలు

వజ్రాల పరిశ్రమ ఆంధ్రులకు పేరుతెచ్చిన పరిశ్రమ. కృష్ణానదీతీరంలో కోళ్ళూరు, పరిటాల, రామళ్ళకోట, వజ్రకరూరు గనులు ప్రసిద్ధికెక్కాయి. ఆనాడు గోల్కొండ వజ్రాలు ప్రపంచఖ్యాతిని పొందాయి.

ప్రభువుకు మాత్రమే వజ్రాల గనులను తవ్వించే అధికారం ఉండేది. కొన్నిచోట్ల మాత్రం గనులుండే ప్రదేశాన్ని వేలం వేసి, ఎక్కువ మొత్తం పాడినవారికి ఇచ్చేవారు. కొన్నిచోట్ల గనులను కౌలుకు ఇచ్చేవారు. ఈ రెండింటివల్ల ఆనాటి ప్రభుత్వానికి మంచి ఆదాయం లభించేది. పనివారు గని దగ్గర నివసించాలి. అందువల్ల ఆహార వస్తువులను అక్కడే కొనవలసి వచ్చేది. ఈ వస్తువుల మీద పన్నులు విధించేవారు. ఈ విధంగా కూడా ప్రభుత్వానికి ఆదాయం లభించేది.

ఆనాడు "ఓడల నిర్మాణం" ఒక ముఖ్య పరిశ్రమ. మాధవాయిపాలెం (నర్సాపురం) వద్ద ఓడల నిర్మాణం జరిగేది. బలమైన కర్ర, ఇనుముతో పెద్ద పెద్ద ఓడలను నిర్మించేవారు. ఓడలకు అవసరమైన ఇనుప పనిముట్లను మిక్కిలి నైపుణ్యంతో తయారుచేసేవారు. పోర్చుగీసు, ఆంగ్లేయ వర్తకులు తమకు కావలసిన ఓడలను పడవలను అక్కడనే తయారు చేయించుకొనేవారు.

ఇనుము, ఉక్కు పరిశ్రమ మిక్కిలి పేరు పొందింది. ఆనాటి కమ్మరివాండ్రు ఇనుపవస్తువులు తయారు చేయటంలో నిపుణులు. నిర్మల్, ఇందూరులు ఆయుధ పరిశ్రమకు కేంద్రాలు అయ్యాయి. ఇనుము గోల్కొండ నుండి పర్షియాకు ఎగుమతి అయ్యేది.

ఆనాడు నేతపని పరిశ్రమగా అభివృద్ధి చెందింది. వీరి వస్త్రాలు దేశ విదేశాలలో ప్రసిద్ధి కెక్కాయి. అద్దకం వస్త్రాలు విదేశీయులను ఎక్కువగా ఆకర్షించాయి. ఇవికాక కలంకారీ వస్త్రాలు ఉండేవి. ఇవి పాలకొల్లు, మచిలీపట్టణం, నిజాం పట్టణ ప్రాంతాలలో తయారయ్యేవి. ఈ వస్త్రాలను డచ్, ఫ్రెంచి, ఆంగ్లేయ వర్తకులు విదేశాలకు ఎగుమతి చేసేవారు.

ఆ కాలంలో ఉప్పు, పంచదార, నగకట్టు పరిశ్రమలు ఉండేవి. ఈ పరిశ్రమలపై ఆధారపడి జీవించేవారు ఎక్కువగా ఉండేవారు. ఈ వృత్తి పనులను ప్రవేశపెట్టినవారు మహమ్మదీయులు. మహమ్మదీయ ప్రభువులు ఈ పనులను ప్రోత్సహించారు (ఆంధ్రుల సంస్కృతి - చరిత్ర, రెండో భాగం పుట - 301).

### 24.4.3 వాణిజ్యం

ఆనాడు వర్తక వాణిజ్యాలు బాగా అభివృద్ధి చెందాయి. మచిలీపట్టణం దగ్గర 'పలంపోర్ వస్త్రాలు' శ్రీకాకుళం ప్రాంతంలో 'మస్లిన్ వస్త్రాలు', బరంపురంలో 'సిల్కు వస్త్రాలు', ఏలూరులో 'ఉన్నితో చేసిన తివాచీలు' తయారయ్యేవి. వీనిని యూరప్‌కు ఎగుమతి చేసేవారు. అద్దకం, కలంకారీ వస్త్రాలను కూడా ఆంగ్లేయ

వర్తకులు యూరప్‌కు ఎగుమతి చేసేవారు. వస్తువులు ఉత్పత్తి అయ్యే కేంద్రాలనుంచి వర్తకం ఎక్కువగా జరిగేది. ఆనాడు వాణిజ్య కేంద్రాలను రేవు పట్టణాలను సమన్వయం చేస్తూ మార్గాలు ఉండేవి. కొండపల్లి నుండి మచిలీ పట్టణానికి హైదరాబాదు నుండి సూరత్‌కు బెజవాడ నుండి కొండవీడు, గండికోటల మీదుగా చెన్నపట్టణానికి పోయే మార్గాలు ముఖ్యమైనవి. మచిలీపట్టణం, పులికాట్, చెన్నపట్టణం ఆనాటి ప్రధానరేవులు. ఈ రేవుల నుండి అరేబియా టర్కీ, పర్షియా, యూరపు, మలయా మొదలైన దేశాలతో వ్యాపారం జరిగేది.

ఫ్రెంచి ఇంగ్లీషు వర్తక సంఘాలవారు రేవు పట్టణాలను కౌలుకు తీసుకొని గిడ్డంగులను నిర్మించుకొని వర్తకం చేసేవారు. దీనివల్ల విదేశీవాణిజ్యం పెరిగింది. కాని ఈ వాణిజ్యంపై ఆంధ్రుల అదుపు తప్పటమే కాక ఈ వ్యాపారం పూర్తిగా విదేశీయుల స్వాధీనమైంది.

వాణిజ్యం మీద విధించే పన్ను ప్రభుత్వానికి ప్రధాన ఆదాయం. ఎగుమతులు దిగుమతులపై మూడుంబావు శాతం సుంకం విధించేవారు. పులికాట్ రేవులో మాత్రం రెండు శాతమే సుంకం. రేవులో లంగరు వేసిన ప్రతినౌక 15 హొన్నులు చెల్లించాలి (ఆంధ్రుల చరిత్ర, పుట 478).

ధాన్యం, ఉప్పు మొదలయినవాని వ్యాపారం అసాధారణంగానే సాగింది. వీటి రవాణా మీద, పన్నులు విధించేవారు.

ఆనాడు పన్నులు ఎక్కువగా ఉండేవి. ఈ పన్నులు వసూలు చేసే అధికారులు అవినీతిపరులై ధనార్జనకు పూనుకొనేవారు. ఈ లంచగొండితనం వల్ల ఆనాడు వాణిజ్యం అభివృద్ధి చెందలేదు.

## 25.5.0 సామాజిక జీవనం

ఆనాటి సామాజిక జీవనంలో సంక్లిష్టమైన మార్పులు ఎన్నో చోటు చేసుకున్నాయి. ఈ మార్పుల్లో ధనాంశాలున్నాయి. రుణాంశాలూ కొన్ని లేకపోలేదు. హిందూ ముస్లిం జీవన విధానాలలో చాలా అంశాలలో ఒక పరస్పర ప్రభావం, అన్యోన్యత కన్పిస్తాయి.

### 24.5.1 వర్ణ వ్యవస్థ

వర్ణ వ్యవస్థ ఎన్నో మార్పులకు గురైంది. బ్రహ్మక్షత్రియ వైశ్య శూద్రులనే నాలుగు కులాలు పైకి ఉన్నప్పటికీ, వృత్తి కారణాల వల్లనో అన్యకారణాలవల్లనో ఎన్నో ఉపకులాలు పుట్టుకొచ్చాయి. బ్రాహ్మణులు మహమ్మదీయ ప్రభువుల దగ్గర ఉద్యోగాలు చేసేవారు. వీరు పన్ను గుత్తదారులుగాను, వడ్డీ వ్యాపారులుగాను ఉండేవారు. విద్యావేత్తలుగా ఎక్కువమంది ఉండేవారు. బ్రాహ్మణులు పంచాంగాన్ని వినిపించటంవల్ల, భిక్షాటనం చేయటంవల్ల, ఆశీర్వచన మంత్రాక్షతలనుంచటంవల్ల, గ్రహణ సంక్రమణ సమయాలలో దానాలను స్వీకరించటంవల్ల, తీర్థక్షేత్రాలలో మంత్ర పూత స్నానాలు చేయించటం వల్ల, గ్రహశాంతి జపాలు చేయించటంవల్ల, శవవాహకులుగా ఉండడంవల్ల, జీవనము గడిపేవారని హంసవింశతి కావ్యం వల్ల తెలుస్తుంది. (ఆంధ్ర సాహిత్యం - సాంఘిక జీవన ప్రతిఫలము, పుట-309). ఆనాటికి వేదాలపై ఆదరణ తగ్గింది.

వైశ్యులు వర్తకం చేసేవారు. వీరు దేశంలోని అన్ని భాగాలలోను సంచరిస్తూ వస్త్రాలు మొదలైన వానిని కొని, తిరిగి వాటిని విదేశీయులకు అమ్మేవారు. వీటినే కాకుండా బియ్యం, పప్పుధాన్యాలు, బెల్లం, నెయ్యి, నూనె మొదలైన వాటిని అమ్మేవారు.

ఆ కాలం నాటి శూద్రులు ప్రధానంగా వ్యవసాయదారులు. కొద్దిమంది ప్రభువుల వద్ద సేవకులుగా సైనికులుగా పనిచేసేవారు. కమ్మ, కాపు, వెలమ, రెడ్డి, పట్ర, గొల్ల, బలిజ, కుమ్మర, బెస్త, వడసాలె, సాలె, సాతాని, కటిక, జెట్టి, జాండ్ర, తొగట, గాండ్ల, వెంకరి, పలగండలు, చిప్పెడివారు, అగసాల, అణికారి, బోయ, ఎరుక, చెంచు, యేనాది, ఈడిగ, మేదర, ఒడ్డె, ఉప్పర మొదలైన కులాల ప్రసక్తి హంసవింశతిలో కన్పిస్తుంది (పై పుస్తకంలోనే, పుట-308). ఈ విభేదాలేకాక కాపులలో పంట, మోటాటి, పెడగంటి, పాకనాటి, కొండ, కొణిదె మొదలైన భేదాలుండేవి.

ఆనాటి సంఘంలో దేవదాసీలకు మంచి పలుకుబడి ఉండేది. వీరు ధనవంతులు. వేశ్యలకు ప్రభువర్గంతో సాన్నిహిత్యం ఉండేది. వీరు దర్బారులో ప్రతి శుక్రవారం నృత్యం చేయాలనే నియమం ఉండేది.

ఆ కాలపు సమాజంలో మహమ్మదీయులు ప్రాచుర్యం వహించారు. వీరిలో షియా, సున్నీ భేదాలుండేవి,

### 24.5.2 విద్య, కళలు

ఆ కాలంలో కొందరు హిందువులు పర్షియన్ భాష నేర్చుకొనేవారు. అలాగే కొందరు మహమ్మదీయులు సంస్కృతాంధ్ర భాషలలో పాండిత్యం సంపాదించేవారు. కుతుబ్‌షాహీలకు ఉర్దూభాషవల్ల కీర్తి లభించింది. కుతుబ్‌షాహీల కాలంనాటికి ఈ భాష "దక్కన్ ఉర్దూ" గా (దఖినీ) అభివృద్ధి చెందింది.

మహమ్మద్ కులీకుతుబ్‌షా మంచి కవి. ఆయన హిందువుల పండగులను మహమ్మదీయుల పండగులను ఇతివృత్తంగా గ్రహించి కవితలు రాసేవాడు. ఆయన ఆస్థానంలో "వజీహి, అహమ్మద్" అనే ఉర్దూ కవులు ఉండేవారు. వజీహి "లైలా మజ్నూ" అనే సుప్రసిద్ధ ఉర్దూ కావ్యాన్ని రాశాడు. "మాలీకుషో-రాయా గగవాసీ, ఇబ్నే-ఎ-నిషాతీ" మొదలైన ఉర్దూకవులు ఆనాడు ఉండేవారు.

కుతుబ్‌షాహీల కాలంలో పర్షియన్ రాజభాష. అయినప్పటికీ తెలుగు బాగా అభివృద్ధి చెందింది. వీరి కాలంలోనే కందుకూరి రుద్రకవి నిరంకుశోపాఖ్యానం, సారంగు తమ్మయ్య వైజయంతీ విలాసం, పొన్నెగంటి తెలగనార్యుడు యయాతి చరిత్ర, అద్దంకి గంగాధరుడు తపతీ సంవరణోపాఖ్యానం, సింగరాచార్యుడు దశరథరాజనందన చరిత్ర, కంచర్ల గోపన్న దాశరథీ శతకం రచించారు. క్షేత్రయ్య ఎన్నో పదకీర్తనలు రాశాడు. వీటిలో 1500 పదాలను అబ్దుల్లా కుతుబ్‌షాకు అంకితమిచ్చాడు.

పిఠాపురం సంస్థానంలో వక్కలంక వీరభద్రకవి 'వాసవదత్త పరిణయం' కవిసార్వభౌమ కూచిమంచి తిమ్మకవి 'రసికజన మనోభిరామం' మొదలైనవానిని, కూచిమంచి జగ్గకవి 'సుభద్రా పరిణయం' పిండిప్రోలు లక్ష్మణకవి 'రావణ దమ్మీయం లేక లంకా విజయం' మొదలైన కావ్యాలు వచ్చాయి. పెద్దాపురం సంస్థానంలో వెణుతురుపల్లి విశ్వనాథకవి 'శేషధర్మములు' ఏనుగు పెద లక్ష్మణ కవి 'ద్రౌపదీ పరిణయం, తుల్యా మాహాత్మ్యం, ధ్రువచరిత్రం', ఏనుగు లక్ష్మణకవి "రామ విలాసం, జాహ్నవీ మహాత్మ్యం, నృసింహ దండకం, రామేశ్వర మాహాత్మ్యం, విశ్వామిత్ర చరిత్రం, విశ్వేశ్వరోదాహరణం, సుభాషిత రత్నావళి, గీర్వాణ సూర్యశతకం" మొదలైనవి. బొబ్బిలి సంస్థానంలో బాలకవి కొన్ని శతకాలను 'భల్లాణి చరిత్రం, విమలాంగి పరిణయం' వంటి ప్రబంధాలు, కొటికెంపూడి వేంకటకృష్ణ సోమయాజి 'తారక బ్రహ్మం, శిబి చరిత్రం, ప్రబంధ చంద్రోదయం, మేఘ సందేశం, శ్వేతాచల మహాత్మ్యం' మొదలైనవి. విజయనగర సంస్థానంలో పూసపాటి తమ్మభూపాలుడు 'శ్రీకృష్ణ విజయ ప్రబంధ'మును పెనుమళ్ళ సోమనామాత్యుడు 'సీమంతిని కాల్యాణ ప్రబంధము' పూసపాటి వేంకటపతిరాజు 'ఉషాభ్యుదయం', గోగులపాటి కూర్మనాథ కవి 'ఏకాంతసేవ' అనే గేయ ప్రబంధము, మృత్యుంజయ విలాసం' అనే యక్షగాన ప్రబంధము, లక్ష్మీనారాయణ సంవాదం, సుందరీమణి శతకం, సింహాద్రి నారసింహ శతకం, విజయ రామ శతకం', ఆడిదం సూరకవి సుకవి జనరంజనం, ఆంధ్ర చంద్రాలోకం, కవి సంశయ విచ్ఛేదం, రామలింగేశ శతకం' మొదలైనవి ఆ కాలంలో వెలువడ్డాయి. ఇంకా ఇతర సంస్థానాలలో ఉన్న కవులు ఎందరో ఉత్తమ కావ్యాలను వెలయించారు. ఆ కాలంలో అచ్చ తెనుగు కావ్యాలు రావటం ప్రత్యేకంగా చెప్పుకోదగ్గ విశేషం. ఆనాటి పదాలలో, కవితలలో అతివేల శృంగారం కన్పిస్తుంది. కంచర్ల గోపన్న రచనలలో భక్తితత్వం కన్పిస్తుంది. (సాహిత్య చరిత్రలోని ఈదశలోని కవులూ రచనలను గురించీ సాహిత్య ధోరణులను గురించీ మీరు వివరంగా తెలుసు కొంటారు.)

హిందూ మహమ్మదీయ వాస్తు విజ్ఞాన ధోరణులు ఆ కాలంలో సమ్మిళితం అయ్యాయి. గోల్కొండలో సుల్తాన్ కులీ నిర్మించిన భవనాలు హిందూ పర్షియన్ పఠాన్ నిర్మాణ రీతులలో కలసి ఉన్నాయి. హైద్రాబాదు లోని చార్మినారు, చార్‌కమాన్ చెప్పదగినవి. అక్కన్న మాదన్నలు గోల్కొండ ప్రభువుల విశ్వాసం పొందినంత కాలంలో ఎన్నో దేవాలయాలు నిర్మాణం జరిగింది. కుతుబ్-ఉల్-ముల్క్ కాలంలో హిందూ పర్షియన్, పఠాన్ సంప్రదాయాలతో కలిసిన మిశ్రమ శైలి ఏర్పడింది. "ఈ శైలిలో గుమ్మటాలు కమానులు మినార్మెట్లు వైదేశికం, పక్షి, పుష్పలతాది అలంకారాలు భారతీయం" (ఆంధ్రుల చరిత్ర, పుట-481).

ఆనాటి చిత్రలేఖనంలో హిందూ పారశీక సంప్రదాయ సమ్మేళనం కన్పిస్తుంది. కొంతవరకు పాశ్చాత్య సంప్రదాయ ప్రభావం కూడా కన్పిస్తుంది. 'తారిఫ్ హుస్సేన్ షాహా దేషాహిదక్కన్' అనే గ్రంథంలో 14 సూక్ష్మ చిత్రాలు కన్పిస్తాయి.

గోల్కొండ ప్రభువులు అబ్దుల్లా, అబుల్ హసన్‌ల పెద్ద ప్రతిమా చిత్రాలున్నాయి. ఆనాటి రాజులు, సామంతులు, యోగులు, స్త్రీలు, చిత్రపటాలలో అజంతా ఛాయలు కన్పిస్తాయి.

BRAOU

ఆ కాలంలో నృత్యానికీ, సంగీతానికి ఆదరణ లభించింది. గోల్కొండ ప్రభువుల కొలువులలోను, దేవాలయాలలోను, వివాహాది సమయాలలోను నృత్య ప్రదర్శనలు జరిగేవి. కూచిపూడి భాగవతులు నాటక ప్రదర్శనలలో మిక్కిలి పేరు పొందారు. వీరు 'తానాషా' నుండి కూచిపూడి అగ్రహారాన్ని పొందారు. మృదంగం, వేణువు సహకార వాద్యాలుగా ఉండేవి.

ఈ విధంగా ఆకాలంలో వివిధ కళలు అభివృద్ధి చెందాయి. ఇవి విభిన్న సంస్కృతుల పరస్పర సమ్మేళనానికి సహకరించాయి.

**24.5.3 వినోదాలు – వేడుకలు**

ప్రాచీన కాలం నుంచి జరిగే జాతరలు ఆ కాలంలో కూడా జరుగుతున్నాయి. ఈ జాతర కాలం ప్రజలకు మిక్కిలి సంతోషాన్ని కలిగిస్తుంది. ఈ జాతరలలో రంగుల రాట్నం, పంబల వాండ్ల కథలు మొదలైన ఎన్నో వినోదాలుండేవి. అవనికొండలో జరిగిన గంగజాతర చంద్రశేఖర శతకంలో కన్పిస్తుంది. (ఆంధ్ర సాహిత్యము – సాంఘిక జీవన ప్రతిఫలము)

ప్రజా జీవనంలో పండుగలు ముఖ్యమైనవి. ఆంధ్రదేశంలో మొట్టమొదట చెప్పవలసిన పండుగ సంక్రాంతి. ఈ పండుగ వచ్చే సమయానికి కోతలు పూర్తి అయి పంట చేతి వస్తుంది. దగ్గర సొమ్ము ఉండటం చేత కావలసిన వస్తువులను కొనేవారు. ఈ పండుగను గూర్చి శుకసప్తతిలో కవి చెప్పాడు.

లక్ష్మీదేవి పండుగ శరత్కాలంలో వస్తుంది. ఈ పండుగ వేశ్యలు చేసికొంటారు. ఆనాడు విటులు వేశ్యలకు అనేకాలైన బహుమతులు ఇచ్చేవారు. వీటినే పండుగ దండుగలు అనేవారు. ఈ విధంగా ఇచ్చే బహుమతులలో మేకలు కూడా ఉండేవి. ఈ విషయాలు వైజయంతీ విలాసం వల్ల తెలుస్తాయి.

ఆనాటి పండుగలలో మరొకటి నాగుల చవితి. ఈ నాగుల చవితిని స్త్రీలు మిక్కిలి వేడుకతో ఆచరిస్తారు. "సన్ననూగారంట గలిగిన నాగుల చౌతి వ్రతములుండేరయ్యామి" (క్షేత్రయ్య పదం – 66).

ఆ కాలంలో వివాహ సమయంలో గాని, భోజన సమయంలో కాని పాటలు పాడటం ఒక వేడుక అని వేంకటాచల మహాత్మ్యం వల్ల తెలుస్తుంది. కూడు, నెయ్యిలేని ఆహారం గడ్డి అని కొందరు భావించేవారు. ఈ విషయాన్ని గూర్చి వేమన్న :

"నేయి లేని కూడు నీచునాకసవద
కూరలేని తిండి కుక్క తిండి" అని చెప్పాడు.

తాంబూలం సేవనం అంటే మిక్కిలి ప్రీతి. ఈ తాంబూలంలో లేత తమల పాకులు, కర్పూరం, కొత్త సున్న ముఖ్యమని రసిక జన మనోభిరామం వల్ల తెలుస్తుంది.

మేఖల, అంగదలు, మణిహారాలు, రావిరేకులు, పాపట బొట్టు, జడ బిళ్ళలు, కడియాలు, పగడాల పేరులు, ముక్కునత్తు, గజ్జెలు, తాయెతు కుప్పె, రాగిడి బిళ్ళ, సూర్య చంద్రవంకలు, కుతి కంట్లు, గుండ్ల పేరు, సరిగె కంకణాలు, కమ్మలు, సంది దండలు, ఉంగరాలు, బొబ్బిలి కాయలు, గిలుకు మెట్టెలు మొదలైన ఆభరణాలు వాడుకలో ఉండేవి.

పగడపు కోళ్ళతో చేసిన హొంబట్టు పట్టె మంచం, దోమతెరలు, ముత్యాల జాలీలు, తూగుటుయ్యేల, తాంబూలపు బరిణె, రుద్రవీణ, నెత్తంపు పలక, పట్టివేళ్ళ వీసనక్రలు, చిలుక పంజరాలు, గద్దె పీటలు, దీపపు స్తంభాలు మొదలైనవి – కొందరి శయ్యామందిరాలలో ఉండేవి. ఇవి ఆనాటి సంపన్నుల – విలాస జీవితానికి ఉదాహరణ.

సోగటాలు, కోడిపందాలు మొదలైన ఆటలు, ఆహారపదార్థాలను పోటీపడి తినటం మొదలైన పందాలు అధికంగా ఉండేవి. ఈ విషయం వైజయంతీ విలాసం వల్ల తెలుస్తుంది.

చిత్రలేఖనం, నాట్య కళలలో మిక్కిలి అభిరుచి ఉండేది. అందువల్లనే నాట్యంలో దండలాస్యం, పేరణి, భాండికం, రాసకం, చర్చరీ, కోలాటం, కుండలీ, చిత్రపద్ధతి మొదలైన విశేషాలెన్నో ప్రచారంలోకి వచ్చాయి.

ఆ కాలంలో దొమ్మరివాండ్ర విద్యలు సామాన్య ప్రజలకు మిక్కిలి వేడుకను కలిగించేవి. జంగాలు, పిచ్చుగుంట్లు మొదలైనవారు చెప్పే పల్నాటివీర చరిత్ర, పాండవుల కథ, మొదలైన వీరగాథలు, దాసరులు ఆడే నాటకాలు, భాగోతుల భాగవత కథలు, వీధి నాటకాలు మిక్కిలి ఆనందాన్నిచ్చేవి. తోలుబొమ్మలాటలు, విప్రవినోదులు, ఆనాటి వారికి వేడుక కలిగించేవారు. ఆనాడు జాతికర్త, దొమ్మరి, డొమిణి, బొమ్మలాటవారు, ఇంద్రజాలికులు, మహేంద్రజాలికులు, జంగాలు, తెరనాటకపు జంగాలు, సివసత్తులు, పరిహాసకులు, కొమ్మరి వానళ్ళు మొదలైనవారు వేడుక కలిగించినవారే. (ఆంధ్ర సాహిత్యము – సాంఘిక జీవన ప్రతిఫలము – పుట 336)

ఆనాడు గుడిగుడి గుంచం, తూరన తుంకాలు, దాగిలి మూతలు, తనుబిల్లి యాలంకి, గుప్పట, గురుగింజ, కొండకోతి, చిక్కణబిల్లి, గీరన గింజ, బొంగరాలాట, చాకిమూట, గోబిళ్ళు, బంతియాట, వెన్నెల కుప్పలు, గచ్చకాయలు, గంగెద్దులాటలు, గిలక లాటలు, కోలాటం, పులిజూదం, చదరంగం, ఓమన గుంటలు మొదలైన ఆటలు ఉండేవి. (పై పుస్తకంలోనే, పుట. 338).

### 24.5.4 మతం

ఆ కాలంలో వైదిక మతం వ్యాప్తిలో ఉంది. కుతుబ్‌షాహీ ప్రభువులు, సామంతులు, ప్రభుత్వోద్యోగులు దేవాలయాలు కట్టించారు. వాటికి దానాలిచ్చారు. తానాషా భద్రాచలానికి శంకరగిరి, పాల్వంచలను దానం చేశాడు. మహమ్మద్ కులీ సేనాపతి కూర్మనాథ దేవాలయానికి శ్రీకూర్మం గ్రామాన్ని దానం చేశాడు. అయితే పరమత అసహనం కూడా లేకపోలేదు. గోగులపాటి కూర్మనాథుడు సింహాద్రి నరసింహ శతకంలో పొట్నూరి కోదండ రామమూర్తి, భీమలింగిలోని గోపాలమూర్తి, జామిలోని జనార్దనస్వామి, చోడవరంలోని కేశవరాయ మూర్తి మొదలైన దేవతలను ముస్లిములు పరాభవించినట్లు చెప్పాడు. శైవులు, వైష్ణవులు ఒకరిని ఒకరు విమర్శించుకొనేవారు.

ఆ కాలంలో శైవ వైష్ణవ మతాలు రెండూ పతనావస్థలో ఉన్నాయి. ఈ మతాలు అవినీతికి స్థానం అయ్యాయి. శైవమతంలోని బసివిరాండ్ర వ్యవస్థ, వైష్ణవంలో దేవదాసి వ్యవస్థ విజృంభించాయి.

కుతుబ్‌షాహీ ప్రభువులు, తరువాతి పాలకులు మత సహనాన్ని ప్రదర్శించారు. హిందువులు మత స్వాతంత్ర్యాన్ని అనుభవించారు. హిందూ మహమ్మదీయులిరువురినీ ప్రభుత్వ ఉన్నతోద్యోగాలలో నియమించేవారు. హిందువులైన అక్కన్న, మాదన్నలను ఉన్నతోద్యోగులుగా నియమించారు.

కుతుబ్ షాహి ప్రభువులు హిందూమతం పట్ల సహన భావాన్ని ప్రదర్శించినా, వారి అభిమానం ఇస్లాంమతం మీదనే ఉండేది. వినుకొండ, కంభం, శ్రీకాకుళం, హైదరాబాదు మొదలైన చోట్ల మశీదులు కట్టించారు. వాటి నిర్వహణకోసం భూములు, ఇళ్ళు మొదలైనవి దానం చేశారు. పూనమల్లి మశీదులో తెలుగుభాషలో ఒక శాసనం వేస్తూ అందులో "అందరూ మశీదును కాపాడాలి. ఇలా చేసినవారికి షోడశదానాలు చేసినంత పుణ్యం, నష్టం కలిగించినవారికి కాశీలో గోవును చంపినంత పాపం" అని రాశారు. (ఆంధ్రుల సంస్కృతి – చరిత్ర, రెండో భాగం – పుట. 303).

ఆ కాలంలో నిర్మించిన మశీదులపైన హిందువుల ప్రభావం కనిపిస్తుంది. హిందువులు ఉపయోగించే పూర్ణకుంభాన్ని మశీదులలో కూడా ఉపయోగించారు. "ఏనుగు ముఖాలను జాజుపీఠంగా ఉపయోగించడం హిందువుల అలవాటు. దానిని ఈ మశీదులో అధికంగా వాడేరు" (పై పుస్తకంలోనే పుట. 202).

ఆనాడు సామాన్యులైన ముస్లిములు హిందూ ఆలయాలను, హిందువులు మశీదులను దర్శించేవారు. ఒకరి పండుగలలో మరొకరు పాల్గొనేవారు.

మొహరమ్ పండుగను గూర్చిన తెలుగు పాటలు ఉన్నాయి. ఈ పాటలు ఆనాటి హిందూ ముస్లిముల సమైక్య భావనను వ్యక్తీకరిస్తాయి. రమ్‌జాన్ పండుగ దీపావళిలా, నౌరోజ్ వసంతోత్సవంలా ఉంటాయి. ఈ రెండు పండుగలు వసంతర్తువులోనే వస్తాయి.

### 24.5.5 ఆచార వ్యవహారాలు

ప్రాచీన కాలం నాటి వివాహ వ్యవస్థ ఆకాలంలో కూడా ఉంది. ఆ కాలంలో శుభ పత్రికను రాసే ఆచారం ఉండేది. వివాహానికి సుముహూర్తాన్ని నిర్ణయించిన పిదప లగ్న పత్రికలను రాసేవారు. ఈ శుభ పత్రికల విషయం

BRAOU

వేంకటాచల మహాత్మ్యం వల్ల తెలుస్తుంది. మంగళ స్నానానికి పూర్వం వధూవరుల కాలిగోళ్ళు తీసే ఆచారం కొన్ని వర్గాలలో ఉన్నట్లు నీలాసుందరీ పరిణయం వల్ల తెలుస్తుంది. తలంబ్రాలు పోసికొనటం, తాళి గట్టడం మొదలయిన ఆచారాలు ఆ కాలంలో కూడా కొనసాగాయి.

ఆనాటి వారికి శకునాలలోను, సాముద్రిక జ్యోతిష్యాలలోను విశ్వాసం ఉండేది. ఏదైనా కీడు కలిగినపుడు భూతాలకు శాంతి చేయడం, ఎరుకల సానిచేత సోదె చెప్పించుకోవటం నాటివారు చేసేవారు. ఈ సోదెను గూర్చి వెంకటాచల మహాత్మ్యంలో :

"పసిడి చేటలోని పండు ముత్తెంబులా
గద్దె పాలతిసూచి కరముసాచి
మొత్తములను బిసికి మూడురాసులు చేసి
మధ్యరాశియందు మనసు నిల్పి" (ఆ 5. - ప 23) అని ఉంది.

ఈ సోదె చెప్పించుకోవటం నేటికీ ఉంది. (ఆంధ్రసాహిత్యం - సాంఘిక జీవన ప్రతిఫలము - పుట. 341).

సొమ్ము చేతిలో వేసినట్లయితే ఎవ్వరి వద్దనైనా తీసుకోవటం, వారికి రుణపత్రం (ప్రామిసరీనోటు/బాండు) రాసి, సాక్షి సంతకం చేయించి ఇచ్చేవారు. అంటే వడ్డీ వ్యాపారం అమలులో ఉండేదన్న మాట. ఆనాడు రుణ పత్రాలను చెట్టు బెరడుపై ఒక విధమైన పసరుతో రాసేవారు. ఈ ఋణపత్రాన్ని రాసే విధానం గురించి వేంకటాచల మహాత్మ్యంలో -

"శ్రీకరలీల స్వస్తశ్రీ జయాభ్యుద
యాష్టాదశ ద్వాపరాంతమందు
గల కలినాది వేంకట నాయుడు ధన
పతి కొసంగిన వడ్డీ పత్రమెట్ల
యనిన నావై వాహమునకు నీచేనప్పు
గొనిన టెంకిలును గోటి సంఖ్య
లిని జతుర్దశ లక్షలందు ...
ప్రతి వత్సరంబును బరగ ...
కలియుగాంతము నందునం గాను వీస
మించ కొంగి దీర్చివేయుదు మొనసి దీని
కుజుడు శంభుడు మరియు హిమాంశు డినుకు
సాక్షులు నిజంబు వృక్షరాజంబు సాక్షి"
"ఇట్లు నా యిష్టమున వ్రాసియిచ్చినట్టి
స్వకర లిఖితం బటంచును వనజభవుడు
చదివి వినిపించి పార్వతీశ్వరుని చేత
నిల్చి చూడు మటంచును మెచ్చజెప్పి"

(ఆ. 5-ప. 160, 161) అని ఉంది.

పురుషులను తమ వశవర్తులను చేసికొనేందుకు మందులను ఉపయోగించేవారు. ఈ మరుల మందుల వికటించి ప్రాణహాని కూడా కలిగించేవని వేమన మాటల వల్ల తెలుస్తుంది.

మాదక పదార్థాలను సేవించే అలవాటు ఆ కాలంలో ఉన్నట్లు చంద్రరేఖావిలాపం వల్ల తెలుస్తుంది.

ఆనాటి ధనవంతులు సత్రాలు కట్టించేవారు. చలివేంద్రాలు పెట్టించేవారు.



BRAOU

## అవగాహన ప్రశ్న

క్రీ.పు. 1600–1800 మధ్యకాలం నాటి ఆచార వ్యవహారాలను పరిశీలించండి.

## 24.6 సారాంశం

ఈ భాగంలో కింది అంశాలను మీరు తెలుసుకున్నారు.

- మధ్యకాలీన దశ (1600–1800) లో గోల్కొండ రాజ్యం మొగలాయీ సుబాగా మారింది. ఆ తర్వాత క్రమంగా ఆసఫ్‌జాహీ వంశానికి చెందిన నిజాం పాలనలోకి వచ్చింది. వలసవాదులైన ఫ్రెంచి, డచ్చి, ఆంగ్లేయులు స్థావరాలు ఏర్పరచుకున్నారు.
- బహమనీ సుల్తానుల కాలంలోనే ఆంధ్రదేశంలో ప్రారంభమైన సంకీర్ణ సంస్కృతి, పాశ్చాత్యుల రాకతో, ఆంగ్లేయ పరిపాలనతో వారి భాషా సాహిత్య సంస్కృతుల ప్రభావంతో ఒక విశిష్ట సంస్కృతిగా రూపొంది, పాత లక్షణాలన్నిటతో పాటు సాంకేతికాభివృద్ధి వైపూ పయనించింది. సాహిత్యం కొత్త ప్రక్రియలను సంతరించుకోవడం మొదలుపెట్టింది.

## అవగాహన ప్రశ్నకు జవాబు

ప్రాచీన కాలంలోని వివాహ వ్యవస్థ ఈ కాలంలో కూడా ఉంది. ఆ కాలంలో శుభపత్రికలను రాసే ఆచారం ఉండేది. వివాహానికి సుమూహూర్తాన్ని నిర్ణయించి లగ్న పత్రికలను రాసేవారు ఈ విషయం వేంకటాచల మాహాత్మ్యంలో "రెండు శుభ పత్రికలు లిఖించి" అని ఉంది. మంగళస్నానానికి పూర్వ కాలిగోళ్ళు తీసే ఆచారం కొందరిలో ఉంది. తలంబ్రాలు పోసికోవడం, తాళి కట్టటం మొదలైనవి ఈ కాలంలో కూడా ఉన్నాయి.

ఆనాటి వారు శకునాలను చూచేవారు. జ్యోతిష సాముద్రికాలను విశ్వసించేవారు. భూతాలకు శాంతి చేయటం, ఎరుకలసానిచేత సోదె చెప్పించుకోవటం చేసేవారని వేంకటాచల మాహాత్మ్యం మొదలైన కావ్యాల వల్ల తెలుస్తుంది.

ఆనాడు అప్పుతీసి కోవటం, రుణ పత్రాలను రాయటం జరిగేది. ఈ రుణ పత్రాలపై సాక్షి సంతకం చేసే పద్ధతి ఆనాటిలాగా ఈనాడు కూడా ఉంది. ఈ రుణపత్రాలను గురించి, అవిరాసే సద్దతులను గురించి



BRAOU

వేంకటాచల మాహాత్మ్యం వల్ల తెలుస్తుంది. దీనిని బట్టి వడ్డీ వ్యాపారం అమలులో ఉండేదని తెలుస్తుంది. పురుషులను వశపర్చుకోవటానికి మత్తు మందులు వాడేవారు. ఇవి వికటించినపుడు ప్రాణహాని కలిగేది. ఆనాటి వారు మాదక పదార్థాలను సేవించేవారని చంద్రరేఖా విలాపం మొదలైన కావ్యాల వల్ల తెలుస్తుంది. ఆనాటి వారు దేవాలయాలకు దానాలు చేసేవారు. సత్రాలు నిర్మించేవారు. చలివేంద్రాలు పెట్టేవారు.

## చదవదగిన పుస్తకాలు

ఈ ఖండం చివరి భాగంలో చూడండి.

## మాదిరి పరీక్షా ప్రశ్నలు

I. కింది ప్రశ్నలకు 30 వాక్యాలకు మించకుండా సమాధానాలు రాయండి.

1. మధ్యయుగం మలిదశలోని రాజకీయ పరిస్థితులను పరిశీలించడం.
2. మధ్యయుగం మలిదశలోని పరిపాలన వ్యవస్థను వివరించండి.

II. కింది ప్రశ్నలకు 10 వాక్యాలు మించకుండా సమాధానాలు రాయండి.

1. మధ్యయుగం మలిదశలోని వినోదాలు, వేడుకలు తెల్పండి.
2. మధ్యయుగం మలిదశలోని మతంపై వ్యాఖ్యానించండి.

BRAOU

# భాగం – 25 తెలుగు సంస్కృతి ఆధునికదశ (క్రీ.శ.1800 – నేటి దాకా)

## విషయక్రమం


25.0 లక్ష్యాలు

25.1 పరిచయం

25.2.0 పాలనా వ్యవస్థ

- 25.2.1 అధికార యంత్రాంగం
- 25.2.2 న్యాయ యంత్రాంగం
- 25.2.3 సైనిక యంత్రాంగం
- 25.2.4 ప్రజాహిత కార్యాలు

25.3.0 ఆర్థిక పరిస్థితులు

- 25.3.1 వ్యవసాయం
- 25.3.2 శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానం
- 25.3.3 వృత్తులు, గ్రామీణ వ్యవస్థ
- 25.3.4 వర్తక వాణిజ్యాలు

25.4.0 సామాజిక జీవనం

- 25.4.1 కుల వ్యవస్థ
- 25.4.2 కుటుంబ వ్యవస్థ
- 25.4.3 సంఘ సంస్కారం
- 25.4.4 విద్యలు, కళలు
- 25.4.5 వేడుకలు వినోదాలు
- 25.4.6 మతం
- 25.4.7 ఆచార వ్యవహారాలు

అవగాహన ప్రశ్న

25.5 సారాంశం

అవగాహన ప్రశ్నకు జవాబు

చదవదగిన పుస్తకాలు

మాదిరి పరీక్షా ప్రశ్నలు


## 25.0 లక్ష్యాలు

ఆధునిక దశలోని పాశ్చాత్య, ప్రాచ్య సంస్కృతుల సంసర్గాన్ని విశ్లేషించటమే కాకుండా ఈ దశలో తలెత్తిన రాజకీయ, సామాజిక సాంస్కృతిక వికాసాన్ని ఈ భాగం చదివాక మీరు వివరించగలుగుతారు. తెలుగు సంస్కృతి మీద పనిచేసిన వివిధ శక్తుల స్వరూపాన్ని వింగడించుకుని క్రీ.శ. 1800 నుండి 1980 ప్రాంతాల వరకూ ఆంధ్ర సంస్కృతిలో వచ్చిన పరిణామాలను మీరు వివరించగలుగుతారు.

## 25.1 పరిచయం

ఆంధ్రదేశ ఆధునిక చరిత్రలో ఈ దశలో గణనీయమైన పరిణామాలు సంభవించాయి. వాటినిక్కడ స్థూలంగా పరిచయం చేసుకుందాం. పాశ్చాత్య వాణిజ్య సంఘాల మధ్య ఏర్పడిన పోటిలో నెగ్గిన ఇంగ్లీషు కంపెనీ వారు 1766 నాటికి ఉత్తర సర్కారులపై ఆధిపత్యాన్ని సంపాదించారు. సామ్రాజ్యవాదియైన అప్పటి గవర్నర్



BRAOU

జనరల్ వెల్లస్లీ ప్రవేశపెట్టిన సైన్యసహకార పద్ధతిని ఒప్పుకున్న నిజాము 1800 లో తన రాష్ట్రంలోని కడప, కర్నూలు, బళ్లారి, అనంతపురం ప్రాంతాల్ని బ్రిటిషువారికి దత్తం చేయవలసి వచ్చింది. 1802లో కర్ణాటక నవాబును ఓడించిన కంపెనీ సైన్యాలు చిత్తూరు, నెల్లూరు జిల్లాలను ఆక్రమించాయి. 1802 నాటికి నిజాం పాలనలోని తెలంగాణా ప్రాంతం తప్ప మిగిలిన ఆంధ్ర దేశమంతా ఇంగ్లీషు కంపెనీ వారి ఆధీనంలో వచ్చింది. 1857లో ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామంగా పరిగణింపబడే సిపాయిల తిరుగుబాటు వల్ల భారతదేశంలో కంపెనీ పరిపాలన రద్దయి బ్రిటిషు సార్వభౌమాధికారం నెలకొంది. 1858 నవంబరు ఒకటవ తేదీన విక్టోరియా మహారాణి నూతన ప్రభుత్వ విధానాల్ని గూర్చి అధికారమైన సిద్ధాంత ప్రకటనను జారీ చేసింది.

19వ శతాబ్దిలో బ్రిటిష్ వలస విధానం పారిశ్రామిక విప్లవం భారతదేశ ఆర్థిక పరిస్థితిని దెబ్బతీసింది. ఈ శతాబ్దిలో దేశంలో పాశ్చాత్య విద్యా విధానం అమలు జరుపబడింది. పాశ్చాత్య నాగరికతా సంస్కృతులు, పాశ్చాత్య భావధార విద్యాధికులపై ప్రభావాన్ని కనబరచాయి. ఈ కాలంలో దేశంలో నెలకొల్పబడిన రైలుమార్గాలు, పోస్టు టెలిగ్రాఫ్ వ్యవస్థ, బ్రిటిష్‌వారు ప్రవేశ పెట్టిన నూతన పరిపాలనా వ్యవస్థ ప్రజల జీవన విధానాన్ని ప్రభావితం చేశాయి. ఈ పరిణామాలు ప్రాచ్య పాశ్చాత్య సంస్కృతుల సంఘర్షణకు దారి తీశాయి.

19వ శతాబ్ది మధ్యకాలంలో ప్రజల్లో మొగ్గ తొడిగిన రాజకీయ చైతన్యం 20వ శతాబ్ది ప్రారంభానికి వికసించింది. దేశమంతటా అమల్లో ఉండిన ఒకే విధమైన పాలనా వ్యవస్థ, విద్యా విధానం, రవాణా సౌకర్యాలు, ప్రచార సాధనాలు మొదలైన వాటివల్ల దేశం నలుమూలలా ఉన్న ప్రజలలో తాము భారతీయులం అనే భావం మొలకెత్తింది. రాజకీయ సమైక్యం (Political Integration) సాధింపబడిన ఈ కాలంలో భావసమైక్యం (Emotional Integration) వెల్లి విరిసింది. 1885లో రూపురేఖల్ని దిద్దుకొన్న జాతీయ కాంగ్రెస్ వివిధ ప్రాంతాలకు చెందిన భారతీయుల్లో పొంగి పొరలిన జాతీయ భావతరంగాల్ని ఒక నవ్యమైన మార్గానికి మళ్లించింది వంగ రాష్ట్ర విభజన (1905), తర్వాత దేశంలో తల ఎత్తిన వందేమాతరం, హోంరూల్ (స్వపరిపాలన) ఉద్యమాలు, గాంధీజీ సారథ్యంలో సాగిన జాతీయోద్యమంలో అంతర్భాగమైన సహాయనిరాకరణోద్యమం, ఉప్పు సత్యాగ్రహం, సర్వరాజ్యోద్యమం, క్విట్ ఇండియా ఉద్యమం ఆంధ్రదేశం మీద ప్రభావాన్ని కనబరిచాయి. జాతీయ జీవన స్రవంతితోబాటు సాగిపోయిన ఆంధ్రులు జాతీయోద్యమంలోని వివిధ ఘట్టాలలో ముందంజ వేశారు.

ఆంధ్రులీకాలంలో తమ ప్రత్యేకతను నిలబెట్టుకోవడానికి కూడా కృషి చేయడం గుర్తింపదగిన ఒక ముఖ్యాంశం. గోల్కొండ సామ్రాజ్య పతనానంతరం సంభవించిన రాజకీయ పరిణామాల వల్ల తెలుగు ప్రాంతం ఏ విధంగా విచ్ఛిన్నమైందో, తెలుగువారు ఏ విధంగా చెల్లాచెదరయ్యారో వెనుకటి భాగాలలో మనం గమనించి ఉన్నాం. కంపెనీవారు పరిపాలనా సౌలభ్యాన్ని దృష్టిలో ఉంచుకొని ఆంధ్రప్రాంతంలోని సర్కారుల్ని, దత్తమండలాల్ని భిన్న భాషలకు సంస్కృతులకు ఆలవాలమైన మద్రాసు ప్రెసిడెన్సీలో చేర్చారు. ఒక సిద్ధాంతాన్ని అనుసరించిగాని, ఒక సూత్రాన్ని పాటించిగాని ఈ విలీనం జరగలేదు. ఈ కాలంలోనే తెలంగాణా ప్రాంతంలోని తెలుగువారే మరాఠ్వాడా కర్ణాటక ప్రాంతాలలో సమ్మిళితమైన నిజాం రాష్ట్రంలో ఉండిపోవలసి వచ్చింది. మద్రాసు ప్రెసిడెన్సీలోను, నిజాం రాష్ట్రంలోను తెలుగు ప్రాంతాలు అత్యధిక భాగాలుగా ఉండేవి. ఈ రాష్ట్రాల్లోని ఈ రాష్ట్రాల్లోని జనాభా మిగిలిన భాషల్ని వ్యవహరించే వారికంటే తెలుగువారి శాతమే అధికంగా ఉండేది. సనా మద్రాసు ప్రెసిడెన్సీలోను, నిజాం రాష్ట్రంలోనూ ఉన్న తెలుగువారు భిన్నమైన కారణాలవల్ల రాజకీయంగా, ఆర్థికంగా విద్యా విషయకంగా, సాంస్కృతికంగా ముందంజ వేయలేకపోయారు. భిన్న భాషా సంస్కృతుల సంపర్గంలో ఇటువంటి వాతావరణం తమ జాతి పురోభివృద్ధి వికాసానికి ప్రతికూలమనే భావం ఆంధ్రులలో ప్రాదుర్భవించింది. అది ప్రత్యేకాంధ్ర రాష్ట్ర నిర్మాణవాంఛకు పాదులు తీసింది. దీని పర్యవసానంగానే ఆంధ్ర ప్రాంతంలో 'ఆంధ్ర మహాసభ' (1913), తెలంగాణా ప్రాంతంలో 'ఆంధ్ర జన సంఘం' (1922) అవతరించాయి. ఆంధ్ర పత్రిక, గోల్కొండ పత్రిక వంటి ప్రచురణ సంస్థలు; శ్రీకృష్ణ దేవరాయాంధ్ర భాషా నిలయం వంటి గ్రంథాలయాలు ఆంధ్రోద్యమానికి స్ఫూర్తిని కలిగించాయి.

స్వాతంత్ర్యానంతరం ఆంధ్ర తెలంగాణా ప్రాంతాల్లో సంభవించిన రాజకీయ పరిణామాలు దేశం మొత్తం మీద ప్రభావాన్ని కనబరచాయి. స్వాతంత్ర్యం వచ్చాక ఆంధ్ర రాయలసీమ ప్రాంతాలు ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో; తెలంగాణా ప్రాంతం అప్పటి భారత యూనియన్‌లో సంలీనం కాని నిజాం రాష్ట్రంలో ఉండిపోయాయి. 1948 ఫిబ్రవరిలో ప్రకటితమైన భారత రాజ్యాంగపు ముసాయిదాలో ప్రత్యేకాంధ్రరాష్ట్రం లేదు. స్వాతంత్ర్యానంతరం ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటవుతుందని ఆశించిన ఆంధ్రులు నిరాశచెందారు. ప్రజాభిప్రాయ



BRAOU

నికి విరుద్ధంగా అప్పటి నిజాము అవలంబించిన వైఖరి తెలంగాణాను కుంపటిగా మార్చింది. ఈ పరిణామాన్ని కొంత వివరంగా తెలుసుకుందాం.

భాషా సంయుక్త రాష్ట్రాల ఏర్పాటు విషయంగా కేంద్ర ప్రభుత్వం నియమించిన ధార్ కమీషన్ జె.వి.పి. కమిటీ (జవహర్‌లాల్ నెహ్రూ, వల్లభాయ్ పటేల్, పట్టాభి సీతారామయ్య) ల నివేదికలు ఆంధ్రులకు ఆశాభంగం కలిగించాయి. "ఆస్తుల విభజన సంఘ" (Partition Committee) సభ్యుల్లో మద్రాసు నగరంపై ఆంధ్రుల హక్కు విషయంగా తలెత్తిన అభిప్రాయ భేదాలు, అప్పటి కాంగ్రెసు పార్టీలోని ముఠా రాజకీయాలు ప్రత్యేకాంధ్ర రాష్ట్ర ఏర్పాటును వాయిదా పడేటట్లు చేశాయి. ఈ పరిణామాలవల్ల ప్రత్యేకాంధ్ర రాష్ట్ర సాధనకోసం స్వామీ సీతారాం (పుర్వాశ్రమంలో గొల్లపూడి సీతారామశాస్త్రి) 1951 ఆగష్టు 15వ తేదీన గాంధేయ మార్గంలో ఆమరణ నిరాహార దీక్షను ప్రారంభించారు. ఆచార్య వినోబా భావే, జవహర్‌లాల్ నెహ్రూ కోర్కె మేరకు ఆయన 35 రోజుల తర్వాత దీక్షను విరమించారు. దీని తర్వాతకూడా కేంద్ర ప్రభుత్వం ఆంధ్ర రాష్ట్ర నిర్మాణాన్ని గూర్చి సత్వర చర్యలు తీసుకోలేదు. ఈ పరిస్థితుల్లో ప్రముఖ గాంధేయవాది పొట్టి శ్రీరాములు 1952 అక్టోబరు 19వ తేదీన మద్రాసులోని మహర్షి బులుసు సాంబమూర్తి గృహంలో ఆమరణ నిరాహార దీక్ష ప్రారంభించారు. 58 రోజుల నిరసన తర్వాత ఆయన 1952 డిశంబరు 15 వ తేదీన కన్నుమూశారు. పొట్టి శ్రీరాములు ఆత్మాహుతితో ఆంధ్రజాతి క్రుద్ధమైంది. "కట్టుతెగి గట్టులుతెగి – పట్టపగలు ప్రజాకోటి, విద్యుత్‌లా పొంగిందోయ్ పొంగి పొంగి పొరలిందోయ్" అని ఆనాడు ఆంధ్రజాతి కనబరచిన ఉద్రేకాన్ని "ప్రభుత్వం లేని నాలుగు గంటలు" అనే గేయంలో రెంటాల చిత్రించారు. 1952 డిశంబరు 19వ తేదీన లోక్‌సభలో అప్పటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ మద్రాసు మినహా వివాదాస్పదం కాని తెలుగు జిల్లాలతో ప్రత్యేకాంధ్ర రాష్ట్రాన్ని ఏర్పాటు చేయడానికి భారత ప్రభుత్వం నిర్ణయించిందని ప్రకటన చేశారు. దీని తర్వాత రాయలసీమ నాయకులు రాష్ట్ర రాజధానిని 'శ్రీబాగ్ ఒప్పందం' ప్రకారం రాయలసీమ ప్రాంతంలో ఏర్పాటుచేయాలని పట్టుపట్టారు. ఈ సందర్భంగా రాజకీయ పార్టీలు ఆంధ్ర సంస్కృతి వికాసానికి బాటలు వేశాయి. గాడిచర్ల హరిసర్వోత్తమ రావుగారి గ్రంథాలయోద్యమం తెలుగుభాషా సాహిత్య సంస్కృతుల ప్రచారానికి దారితీసింది.

ఈ విధంగా ఆంధ్రులు దేశసమైక్యానికి పాటుపడుతూ జాతీయ జీవన స్రవంతిలో భాగస్వాములవుతూ – ఒక భాషను వ్యవహరించే ఒక ప్రాంతానికి చెందిన ప్రజలు అన్ని రంగాల్లోను అభివృద్ధిని సాధించడం అనే ప్రాతిపదిక మీద భాషా ప్రయుక్త రాష్ట్ర నిర్మాణం జరగాలనే అభిప్రాయాన్ని స్వాతంత్ర్యానికి పూర్వమే వ్యక్తం చేసి, దాని కోసం ఒక ఉద్యమాన్ని లేవదీశారు. ఇది ఆంధ్ర సంస్కృతి వికాసానికి దోహదం చేసింది.

BRAOU

## 25.2.0 పాలనా వ్యవస్థ

వర్తక నిమిత్తమై వచ్చిన ఇంగ్లీషు కంపెనీవారు 1766 నాటికి ఉత్తర సర్కారుల మీద 1802 నాటికి రాయలసీమ, నెల్లూరు జిల్లాల మీద ఆధిపత్యాన్ని సంపాదించారు. కొత్తగా తమ ఆధీనంలోకి వచ్చిన ఉత్తర సర్కారుల్ని వారు విశాఖపట్టణం, మచిలీపట్టణాలలోని గిడ్డంగి అధికారుల పర్యవేక్షణలోకి తెచ్చారు. పరిపాలనానుభవం లేని స్వార్థపరులైన గిడ్డంగి అధికారుల పాలన సమర్థంగా లేకపోయింది. వారిపై అజమాయిషీ చేయడానికి 1786లో మద్రాసులో 'బోర్డ్ ఆఫ్ రెవిన్యూ' అనే సంస్థను స్థాపించారు. దీనివల్ల కూడా ఆశించిన మేరకు ఫలితం కలగలేదు. 1849లో ఈ విధానం రద్దుచేసి కలెక్టర్ల పాలన ప్రవేశ పెట్టారు.

### 25.2.1 అధికార యంత్రాంగం

పరిపాలనా సౌలభ్యం కోసం కంపెనీవారు ఉత్తర సర్కారుల్ని, గంజాం (ఇప్పటి ఒరిస్సా రాష్ట్రంలోనిది), విశాఖపట్టణం, గోదావరి, కృష్ణ, నెల్లూరు జిల్లాలుగా విభజించారు. అనంతపురం కేంద్రంగా ఒక జిల్లాగా రాయలసీమ ప్రాంతాన్ని 1808లో బళ్ళారి, కడప జిల్లాలుగా విభజించారు. తర్వాతి కాలంలో కర్నూలు (1858), అనంతపూరు (1882),చిత్తూరు (1911) జిల్లాలు ఏర్పాటయ్యాయి. ఆ విధంగా ఏర్పాటైన జిల్లా పాలన యంత్రాంగానికి కలెక్టరు ముఖ్య అధికారిగా ఉండేవాడు. కంపెనీ పరిపాలనలో ప్రభుత్వానికి భూమి శిస్తు ద్వారా లభించే ఆదాయమే ప్రధానంగా ఉండేది. అందువల్ల శిస్తు వసూలు చేయడమే వారి ముఖ్య బాధ్యతగా ఉండేది. కంపెనీ డైరక్టర్ల అధికారాలు మారుతూ వచ్చాయి. శిస్తువసూలు చేయడానికి వీలుగా వీరికి శాంతి భద్రతల్ని కాపాడే మేజిస్ట్రేటు, పోలీసు అధికారాలు కూడా సంక్రమించాయి. సివిల్ న్యాయపాలనకు సంబంధించిన కొన్ని అధికారాలు మాత్రం జిల్లా జడ్జి పరమయ్యాయి. సివిల్ న్యాయపాలనకు సంబంధించిన

కొన్ని అధికారాలు మాత్రం జిల్లా జడ్జి పరమయ్యాయి. అలజడులు, తిరుగుబాట్లు సంభవించినప్పుడు ఆయా ప్రాంతాల్లో శాంతి భద్రతల్ని పునరుద్ధరించి, సాధారణ పరిస్థితి నెలకొనేలా చేయడానికి ప్రత్యేక కమీషనర్ల నియామకం జరిగేది. వారికి కలెక్టర్ల కంటే విశేషాధికారాలుండేవి. 1800 ప్రాంతంలో ఉత్తర సర్కారుల్లో పొడ సూపిన తిరుగుబాట్లను అణచడానికి కంపెనీ వారు జార్జి రసెల్‌ను ప్రత్యేక కమిషనర్‌గా నియమించారు.

దేశ ప్రజలు మనోభావాల్ని, వ్యవసాయ రంగంలోని సాధకబాధకాల్ని తెలుసుకోలేని కంపెనీ డైరక్టర్లు భూమి శిస్తును వసూలుచేయడంలో చేసిన ప్రయోగాలు రైతుల్ని కడగండ్లపాలు చేశాయి. 1802–4 సంవత్సరాల నాటికి సర్కారు ప్రాంతంలోని జమీందారీ భూములకు, హవేలీ భూములకు వర్తింపచేసిన శాశ్వత భూమిశిస్తు విధానం అవాంఛనీయ పరిణామాలకు దారితీసింది. అది భూమిపై ఆస్తిహక్కును సంపాదించుకొని నిర్ణీతమైన పేష్కస్‌ను ప్రభుత్వానికి చెల్లించే ప్రొప్రైటర్లు, జమీందార్లు అనే ఒక మధ్యవర్తి వర్గం బలపరచటానికి కారణమైంది.

నిజాం పాలనలోని తెలంగాణా ప్రాంతంలో జమీందారీ వ్యవస్థ బలపడింది. ఆనాడు సేద్యానికి యోగ్యమైన భూముల్లో సగభాగం జాగీరుదార్ల చేతుల్లో ఉండేవి. పోలీసు, న్యాయాధికారులు కలిగినవారు స్థానిక నియంతలుగా అధికారాన్ని చెలాయించేవారు. నిజాం రాజ్యపాలనలో గ్రామాధికార్ల వ్యవస్థ బలపడింది. గ్రామాధికారులైన పటేల్, పట్వారీలు రైతుల్ని దోచుకునేవారు. నిజాం రాష్ట్రంలో అధికార యంత్రాంగానికి సంబంధించిన నియామకాలు స్థానికుల్లో అసంతృప్తిని రేకెత్తించాయి. ఉత్తర భారతం నుండి ప్రవాసం వచ్చిన ముస్లిములను ఎక్కువగా ఉన్నత పదవుల్లో నియమించేవాళ్ళు, స్థానికులలో ప్రబలిన ఈ అసంతృప్తి మీర్ మహమ్మద్ ఆలీ కాలంలో ముల్కీ (స్థానికులు), గైర్ ముల్కీ (స్థానికేతరులు) అనే ఉద్యమం పరిణమించింది.

ఈ దశలో గుర్తించదగిన మరో ముఖ్య విషయం అధికార యంత్రాంగ విస్తరణ, కంపెనీ పాలనరద్దయి బ్రిటీష్ పాలన ప్రారంభమైనదశలో పాలనాయంత్రాంగంలో కొత్త శాఖల నిర్మాణం అవసరమైంది. కీలకమైన రెవిన్యూశాఖకు తోడుగా పబ్లిక్‌వర్క్స్, పోలీసు విద్య, ఆరోగ్య, వ్యవసాయ, సహకార, అటవీశాఖలు ఏర్పాటయ్యాయి. ఆయా శాఖల ఏర్పాటుతో ప్రభుత్వ ఉద్యోగుల సంఖ్య గణనీయంగా పెరిగింది. కాని చట్ట నిర్మాణ విషయంలోను, విధాన నిర్ణయంలోను భారతీయులకు తగిన ప్రాతినిధ్యం ఉండేదికాదు. పరిపాలనా విధానాల్ని అమలు జరిపే ఉన్నతోద్యోగివర్గం (బ్యూరోక్రసీ) లో భారతీయులకు నామమాత్రపు ప్రాతినిధ్యం కూడా ఉండేదికాదు. ప్రాచీన గ్రీకు లాటిన్ భాషాసాహిత్యాల పాండిత్యం ప్రాతిపదికగా ఇంగ్లీషు మాధ్యమంలో నిర్వహించబడే ఐ.సి.ఎస్. పరీక్షలకు వయోపరిమితి తగ్గించి బ్రిటీష్‌వారు అధికారయంత్రాంగంలో భారతీయుల ప్రవేశాన్ని అరికట్టడానికి ప్రయత్నించేవారు. 1861లో 'చెన్నపట్టణ స్వదేశీ సంఘం' ప్రభుత్వానికి సమర్పించిన మహజరు రెవిన్యూ, పబ్లిక్ వర్క్స్ శాఖలలోని అసమర్థతను, అవినీతిని ఎత్తిచూపింది. బ్రిటిష్ జాతీయులకు మాత్రమే అవకాశాన్ని కల్పించే ఐ.సి.ఎస్., పదవులన్ని రద్దు చేయమని ప్రభుత్వాన్ని కోరింది.

ప్రభుత్వయంత్రాంగ నిర్వహణకు దిగువస్థాయిలో అవసరమైన గుమాస్తా ఉద్యోగాలకు ఈ కాలంలో అవసరం ఏర్పడింది. ఇతరత్రా అవకాశాల్లేని ఆంగ్ల విద్యాభ్యాసం చేసిన భారతీయులు ప్రభుత్వ ఉద్యోగాలకు ఎగబడ్డారు. బ్రిటిష్‌వారు రూపొందించిన విద్యావిధానం ఈ అవసరాన్ని చాలవరకు తీర్చగలిగింది.

బ్రిటిష్ సామ్రాజ్య చరిత్రలో మొదటి ఘట్టమైన కంపెనీ పరిపాలనలో పాలన యంత్రాంగం పటిష్టంగా ఉండేదికాదు. 1958 తర్వాతి కొన్ని పరిణామాలు, బ్రిటిష్‌వారి ఆలోచనా సరళిలో కలిగినమార్పు, దేశీయుల్లో మొగ్గలు తొడిగి చైతన్యమై విరిసి పాలన యంత్రాంగంలో కొన్ని మార్పుల్ని తెచ్చిపెట్టాయి. అధికార యంత్రాంగంలో కీలకమైన పదవుల్ని నిర్వహించడానికి అర్హతనుచేకూర్చే ఐ.సి.ఎస్. పరీక్షలకు కూర్చునే అవకాశం భారతీయులకు కలిగింది. 1918 తర్వాత ప్రభుత్వసర్వీసులో భారతీయుల నియామకం జరిగింది.

పరిపాలనలో ప్రజలకు కొంతవరకైనా ప్రాతినిధ్యాన్ని కల్పించి చట్ట నిర్మాణం చేయవలసిన అవసరాన్ని ఈ కాలంలో బ్రిటిష్‌వారు గుర్తించారు. 1861, 1892, 1909 సంవత్సరాల్లో రూపొందించబడిన కౌన్సిల్ చట్టాల ఫలితంగా రాష్ట్రాలలో శాసనసభల నిర్మాణం జరిగింది. 1919, 1935 సంవత్సరాల్లో బ్రిటిష్ పార్లమెంటు ఆమోదించిన గవర్నమెంటు ఆఫ్ ఇండియా చట్టం వల్ల రాష్ట్రపరిపాలనా స్వభావంలో మార్పులు కలిగాయి. శాసన సభలకు ప్రతినిధుల్ని ఎన్నుకొనడానికి సంక్రమించిన హక్కువల్ల ప్రజలు పరిపాలనలో పాల్గొనే అవకాశం మొదటిసారిగా కలిగింది.

BRAOU

ఆయా ప్రాంతాలకు చెందిన పౌరుల సాయంతో స్థానిక అవసరాన్ని తీర్చుడానికి, ప్రజలనుండి కొన్ని పన్నుల్ని సులభంగా వసూలు చేయడానికి బ్రిటిష్ వారు ప్రవేశపెట్టిన స్థానిక పరిపాలనవల్ల గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయివరకు పరిపాలనా యంత్రాంగంలో మార్పులు కలిగాయి. 1871నాటి లోకల్ ఫండ్స్ చట్టం, తర్వాత చేసిన మరికొన్ని చట్టాలవల్ల జిల్లా బోర్డులు (నేటి జిల్లా పరిషత్‌లు) ఏర్పడినాయి. బ్రిటిష్‌వారు స్థానిక పరిపాలనను ప్రవేశపెట్టి మొదటిదశలో గ్రామాల ప్రాముఖ్యాన్ని, గ్రామ పంచాయితీల అవసరాన్ని గుర్తించలేదు. 1820 నాటి మరొక చట్టంలో ఈ లోపాన్ని సవరించి గ్రామ పంచాయితీల ఏర్పాటుకు అవకాశం కల్పించారు. 1865 చట్టం ఫలితంగా ఆంధ్రదేశంలోని ప్రధాన పట్టణాలు మునిసిపాలిటీల పరిధిలోకి వచ్చాయి. 1847 నాటికి ఆంధ్రదేశంలో 25 మునిసిపాలిటీలు ఉండేవి. ప్రభుత్వం మొదట అధికారుల్నే ఈ మునిసిపాలిటీల్లో, జిల్లా బోర్డుల్లో సభ్యుల్నిగాను, అధ్యక్షుల్నిగాను నియమించటం జరిగేది. అధికారుల ప్రాబల్యంవల్ల వాటి స్థాపనోద్దేశం దెబ్బతిన్నది, రాజకీయనాయకుల, ప్రజల విజ్ఞప్తుల ఫలితంగా ఈ లోపాన్ని గుర్తించిన ప్రభుత్వం ఆయా పదవుల్లో అనధికారుల్ని నియమించింది. కౌన్సిలు, బోర్డు సభ్యులే ఎన్నుకొనే పద్ధతి క్రమంగా అమల్లోకి వచ్చింది.

బ్రిటిష్‌వారు అధికార యంత్రాంగంలో దశలవారిగా మార్పులుచేసి జిల్లాస్థాయిలో కలెక్టరుతో బాటు ఆయా శాఖలకు కొన్ని అధికారాలు బదలాయించారు. పాలనపరంగా చేసిన కొన్ని సంస్కరణల వల్ల అధికార యంత్రాంగంలో కీలకమైన పదవుల్ని నిర్వహించే వారి పెత్తనం కొంతవరకు తగ్గింది. పరిపాలనతో ప్రజలకు కొంతవరకు ప్రత్యక్ష సంబంధం ఏర్పడింది. బ్రిటిష్ రాజ్యపాలన చివరి దశలో కలిగిన ఫలితాల్లోకెల్లా ఇదే ముఖ్యమైంది.

స్వాతంత్ర్యానంతరం భారతదేశంలో ప్రజాస్వామ్య వ్యవస్థ నెలకొన్నది. యూనిటరీ పరిపాలన విధానం అమల్లోకి వచ్చింది. ఈ విధానంవల్ల దేశరక్షణ, విదేశ వ్యవహారాలు, రేడియో, తంతితపాలా, రైల్వేలు మొదలైన శాఖలు కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోకి వచ్చాయి. వ్యవసాయం, పంచాయితీరాజ్, వైద్యం, విద్య మొదలైన శాఖలు, ఆయా రాష్ట్ర ప్రభుత్వాల నిర్వహణలోకి వచ్చాయి. దీని ఫలితంగా అధికార యంత్రాంగంలో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమీషన్ నిర్వహించే ఐ.ఏ.ఎస్., ఐ.పి.ఎస్., ఐ.ఎఫ్.ఎస్., వంటి పోటీ పరీక్షల ద్వారా కేంద్ర సర్వీసులలో ఉద్యోగులుగా నియమితులవుతున్నారు. బ్రిటిష్ పరిపాలనలో ప్రాచీన గ్రీకు, లాటిన్ భాషాసాహిత్యాల పరిజ్ఞానాన్ని ఆంగ్లమాధ్యమంలో పరీక్షించే ఐ.సి.ఎస్. పదవుల స్థానంలో నేడు ఆంగ్లంలోను, భారత రాజ్యాంగం గుర్తించిన కొన్ని ప్రాంతీయభాషల్లోను నిర్వహించే ఐ.ఏ.ఎస్., వంటి పదవులు ఏర్పడ్డాయి. ఆయా రాష్ట్రాలలోని 'పబ్లిక్ సర్వీస్ కమీషన్' ద్వారా రాష్ట్రాలలోని వివిధ శాఖలలో ఉద్యోగుల నియామకం జరుగుతోంది.

BRAOU

బ్రిటిష్ పాలనలో సోపాన విధానం (Hierarchical system) అనుసరించి అధికారులే ఎక్కువగా పెత్తనం చెలాయించేవారు. స్వాతంత్ర్యానంతరం దేశంలో నెలకొన్న ప్రజాసామ్య వ్యవస్థ, అధికార వికేంద్రీకరణలో భాగంగా ప్రవేశపెట్టబడిన పంచాయితీరాజ్ వ్యవస్థ మొదలైనవాటివల్ల పరిపాలనలో అధికార పెత్తనం తగ్గింది. రాష్ట్ర స్థాయిలో మంత్రిమండలి, జిల్లాస్థాయిలో జిల్లాపరిషత్ సభ్యులు ప్రజాసంక్షేమానికి సంబంధించిన విధాన నిర్ణయాన్ని చేస్తున్నారు. సచివాలయం (Secretariate) లోని కార్యదర్శులు, రెవిన్యూ బోర్డు సభ్యులు, జిల్లా కలెక్టరు మొదలైన ఉన్నతోద్యోగులకు వాటిని అమలు జరిపే బాధ్యత సంక్రమించింది. ఈ పరిణామాలవల్ల నేడు ఉన్నతోద్యోగులు, కార్యనిర్వహణాధికారులు (Executive officers) గా పరిణమించారు. 1959 నాటి పంచాయితీ చట్టాన్ని అనుసరించి దేశంలోనే ప్రథమంగా ఆంధ్రప్రదేశ్‌లో మూడంతస్తులతో కూడిన పంచాయతీరాజ్ వ్యవస్థ (3-Tier system) ఏర్పాటయింది. దీని ఫలితంగా గ్రామస్థాయినుండి జిల్లాస్థాయివరకు జరిగే పరిపాలనలో ప్రజాప్రతినిధులకు ఎక్కువ ప్రాతినిధ్యం లభించింది.

ప్రభుత్వానికి ఆదాయం సమకూర్చే ఆర్థికవనరుల్లో కలిగినమార్పు, పాలనాపరంగా ప్రభుత్వం చేసిన సంస్కరణలు, ప్రయోగాలు, అధికార యంత్రాంగంపై ప్రభావాన్ని కనబరచాయి. బ్రిటిష్‌పాలనలో భూమి శిస్తు ద్వారా లభించే ఆదాయమే ఎక్కువ మొత్తంలో ఉండేది. శిస్తు వసూలు చేయడమే కలెక్టర్ల ముఖ్య బాధ్యతగా ఉండేది. నేడు భూమిశిస్తు ద్వారా లభించే ఆదాయం అత్యల్పం. ప్రణాళికా బద్ధమైన సంక్షేమ కార్యక్రమాల్ని అమలుజరపడం, జిల్లాలోని వివిధశాఖల పనితీరును పర్యవేక్షించి సమన్వయపరచటం వంటి బాధ్యతలు నేడు కలెక్టర్లకు సంక్రమించాయి. బ్రిటిష్ కాలం నుండి రెవిన్యూగ్రామాలు, ఫిర్కాలు, తాలూకాలు రెవిన్యూపాలనకు ...

ప్రాతిపదికగా ఉండేవి. గ్రామస్థాయిలో గ్రామాధికారులు 'జమాబంది, మొదలైన విషయాల్లో రెవిన్యూ అధికారులకు తోడ్పడేవారు. ప్రభుత్వం అమలు జరిపే సంక్షేమ పథకాలు ప్రజలకు అందుబాటులో ఉండాలనే ఉద్దేశంతో, అధికార వికేంద్రీకరణలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం మే 1986లో రెవిన్యూ ఫిర్కాలు, తాలూకాల స్థానంలో రెవిన్యూ మండలాల్ని ఏర్పాటు చేసింది. జనవరి 1984లో గ్రామాధికారుల వ్యవస్థను రద్దుచేసింది.

రాష్ట్రావతరణ తర్వాత జరిగిన కొన్ని ఆందోళనలు, రాజకీయ పరిణామాలు అధికార యంత్రాంగంపై ప్రభావాన్ని కనబరచాయి. 1969-73 సంవత్సరాల మధ్యకాలంలో రాష్ట్రంలో తల ఎత్తిన 'ప్రత్యేక తెలంగాణా', 'జై ఆంధ్ర' ఉద్యమాల పర్యవసానంగా 'ఆరుసూత్రాల పథకం' (Six point Formula) రూపొందింది. దీని ఫలితంగా రాష్ట్రంలో ప్రాంతీయ విధానం ప్రకారం చిన్న ఉద్యోగాలు భర్తీచేయటం జరుగుతోంది.

### 25.2.2 న్యాయ యంత్రాంగం

1800 నాటికి కంపెనీపాలనలోని న్యాయవ్యవస్థలో భారతీయ సంప్రదాయం అంతరించింది. దేశంలో దశలవారీగా నెలకొల్పిన న్యాయస్థానాల్లో బ్రిటిష్ సంప్రదాయం చోటుచేసుకొంది. దీని ఫలితంగా 1818 నాటికి దశల వారీగాను, తరగతుల వారీగాను కోర్టులు నెలకొల్పారు. ప్రతి జిల్లాకు ఒక జడ్జి న్యాయాధికారిగా నియుక్తుడయినాడు. జిల్లా జడ్జి ఇచ్చే తీర్పులపైన అపీలు చేసుకోవడానికి కొన్ని ప్రావిన్షియల్ కోర్టులు సివిల్ వ్యవహారాలు పరిష్కారం కోసం 'సదర్ అదాలత్' కోర్టులు, క్రిమినల్ వ్యాజ్యాల పరిష్కారం కోసం 'సదర్‌ఫౌజ్ వారి అదాలత్' కోర్టులు వెలిశాయి. చిన్న మొత్తాల్ని గూర్చిన వ్యాజ్యాల పరిష్కారంకోసం జిల్లా జడ్జికింద సదర్ అమీన్ కోర్టులను, డిస్ట్రిక్ట్ మున్సిఫ్ కోర్టులను, గ్రామాధికారుల కోర్టులను స్థాపించారు.

కంపెనీపాలన ప్రారంభంలో న్యాయశాఖ అనర్హులు అవినీతిపరులు ఐన అధికారులకు ఆలయంగా ఉండేది. ఆ రోజుల్లో రెవిన్యూశాఖలో శక్తిసామర్థ్యాన్ని నిరూపించుకోలేని ఉద్యోగులకిది పునరావాసాన్ని కల్పించే శాఖగా ఉండేది. 1814లో న్యాయసంఘాధ్యక్షునిగా భారతదేశానికి వచ్చిన సర్‌థామస్‌మన్రో మద్రాసు ప్రెసిడెన్సీలోని న్యాయనిర్వహక విధానాన్ని పునర్వ్యవస్థీకరించి మెరుగుపరచడానికి కృషి చేశాడు. ఆయన సిఫారసుల ఫలితంగానే మద్రాసులోని కొందరు ఆంధ్రులకు పౌర న్యాయ నిర్వహణకు సంబంధించిన బాధ్యతాయుతమైన పదవులు లభించాయి.

బ్రిటిష్ పరిపాలనలో ఇతర శాఖలలాగా న్యాయశాఖనుకూడా పునర్వ్యవస్థీకరించారు. దీని ఫలితంగా దేశం మొత్తం మీద ఒకే విధమైన న్యాయవ్యవస్థ ఏర్పాటయింది. ప్రజలకు ఒకే రకమైన న్యాయవిధానం సంక్రమించింది. 1861 నాటి పార్లమెంటు చట్టంద్వారా సదర్ దివానీ అదాలత్ వంటి కోర్టులు రద్దు అయ్యాయి. దీని ఫలితంగా మద్రాసులో ఒక హైకోర్టును నెలకొల్పారు. ఆంధ్రప్రాంతానికి కంతటికీ అదే అపీలు కోర్టు మున్సిఫ్ కోర్టు జిల్లా కోర్టులు మొదలైన కింది కోర్టులు ఈ హైకోర్టు పరిధిలోకి వచ్చాయి.

కోర్టు వ్యవహారాల్లో పర్షియన్, అరబిక్, ఉర్దూ, ఆంగ్లం, తెలుగు పదాల కలయికతో కూడిన భాష చెలామణిలో ఉండేది. ఆంధ్రదేశంలో మండల న్యాయాధికారిగా పనిచేసి తెలుగుభాషకు ఎనలేని సేవచేసిన సి.పి.బ్రౌన్ ఈ మిశ్రభాషా ప్రాముఖ్యాన్ని గుర్తించి ఒక మిశ్రభాషానిఘంటువును (A Dictionary ofthe mixed Dialect and Foreign Words Use in Telugu - 1864) రూపొందించాడు. కొందరు స్వీకరించిన అర్జీలనుబట్టి కూడా (నీలగిరి చరిత్ర - 1864) ఆనాడు వ్యవహారంలో ఉండిన మిశ్ర భాషా స్వరూపాన్ని మనం కొంతవరకు గుర్తించవచ్చు.

నిజాం రాష్ట్రంలో దివాన్‌గా పనిచేసిన సాలార్‌జంగ్ కాలంలో పాలనారంగాలు ఎన్నో సంస్కరణలు అమలు జరిగాయి. ఆయన హయాములో న్యాయశాఖను పటిష్టంచేసే చర్యల్లో భాగంగా జిల్లా స్థాయిలో మున్సిఫ్‌లు, మీర్ అదిల్‌లు నియమింపబడినాయి. వీరు హైదరాబాద్‌లో నెలకొల్పిన 'మహ్‌కామ ఎ. సదర్' అనే హైకోర్టు అజమాయిషిలో పనిచేసేవారు. హైదరాబాదు నగరంలో సివిల్ వ్యవహారాలకోసం 'దివానీ అదాలత్', క్రిమినల్ కేసుల పరిష్కారం కోసం 'ఫౌజ్‌దారీ అదాలత్' అనే కోర్టులు నెలకొల్పారు. ఈకాలంలో వివిధ కోర్టుల్లోని పనితీరును పర్యవేక్షించడానికి, సమన్వయపరచడానికి ప్రధానమంత్రి పర్యవేక్షణలో న్యాయశాఖకు సంబంధించిన ఒక సెక్రటేరియట్ కూడా ఉండేది. ఆనాడు ప్రధాన న్యాయాధిపతిని నాజిమ్ అని వ్యవహరించేవారు. సాలార్‌జంగ్ హయాంలో నిజాం రాష్ట్రంలో అంగవిచ్ఛేదన శిక్షను రద్దుచేశారు.

BRAOU

దేశం మొత్తం మీద ఒకే విధమైన న్యాయస్థానాలు ఏర్పడ్డాయి. వాటిల్లో ఒకే రకమైన న్యాయవిచారణ పద్ధతులు అమల్లోకి వచ్చాయి. బ్రిటిష్‌వారు 'Rule of the law' ద్వారా న్యాయవ్యవస్థకు సంబంధించిన ఒక ఆధునిక దృక్పథాన్ని ప్రవేశపెట్టారు. ఈ విధానంలో కులమతవర్గ విచక్షణకు తావులేకుండా ప్రజలందరికి చట్టాన్ని ఒకే విధంగా వర్తింప చేయడం జరిగింది.

బ్రిటిష్‌వారు అమలుజరిపిన న్యాయవ్యవస్థలో ప్రారంభంలో కొన్ని లోటుపాట్లు కన్పించినా ఈ కాలంలో ప్రజలు దానికి అలవాటు పడినారు. కోర్టులో ఒక పట్టాన పరిష్కారం కాని వ్యాజ్యాలు, కోర్టుఫీజులు, వకీళ్లను పెట్టుకోవడం, సాక్షుల విచారణకయ్యే ఖర్చుల్ని భరించడం మొదలైన వాటివల్ల ఈ కాలంలో సామాన్యుడికి న్యాయం ఖరీదు తలకుమించిన భారంగా పరిణమించింది. ఈ వ్యవస్థలో ఆచరణరీత్యా ఉత్పన్నమైన కొన్ని లోపాలు ఉన్నా బ్రిటీషువారు ప్రవేశపెట్టిన న్యాయ యంత్రాంగం ద్వారా సమాజంలో తర తమ భేదాలకు అతీతమైన ప్రతిపత్తి ప్రతి పౌరుడికీ లభిస్తుందనే విశ్వాసం సామాన్య ప్రజలలో కూడా కలిగింది. బ్రిటిష్ న్యాయ విధానం వల్ల కలిగిన ముఖ్య ప్రయోజనం ఇదే.

బ్రిటిష్‌వారు కల్పించిన న్యాయయంత్రాంగం వల్ల ఈ కాలంలో ప్లీడరు వృత్తికి ప్రోత్సాహం లభించింది. ఇంగ్లండులో బారిష్టరు పట్టాన్ని పొంది ప్లీడరు వృత్తిని చేబట్టిన ప్రకాశంపంతులు వంటి ప్రముఖులు న్యాయవాద వృత్తిలోనేగాక రాజకీయ రంగంలోకూడా ముఖ్యపాత్రను నిర్వహించారు. దేశ భక్త కొండా వెంకటప్పయ్య ఉన్నవ లక్ష్మీనారాయణ, గొల్లపూడి సీతారామశాస్త్రి వంటివారు ఇందుకు నిదర్శనం. ఆ రోజుల్లో జాతీయోద్యమంలో పాల్గొన్న సత్యాగ్రహులపై బ్రిటిష్ వారు అనుసరించిన దమననీతిలో భాగంగా అమలుజరిపిన కొన్ని చట్టాలు ప్రజలకు చాలా అసంతృప్తి కలిగించాయి. క్రిమినల్ ప్రొసీజర్ కోడ్‌లోని 144వ సెక్షన్ అలాంటిదే. ఈ చట్టాల్ని నిరసిస్తూ గరిమెళ్ళ సత్యనారాయణ "నూటనలుబది నాల్గు నోటికి తగిలించి మాటలాడవద్దంటాడు, మమ్ము పాటపాడవద్దంటాడు" అని ఎలుగెత్తి పాడడం జరిగింది.

1950 జనవరి 26వ తేదీన భారతదేశం రిపబ్లిక్‌గా అవతరించింది. అప్పటి నుండి నూతన రాజ్యాంగం అమల్లోకి వచ్చింది. దేశమంతటా ఒకే విధమైన న్యాయ వ్యవస్థ నెలకొన్నది. దేశ న్యాయస్థానాలలో భారతీయ శిక్షాస్మృతిని (Indian Penal Code) అనుసరించి న్యాయవిచారణ, దండనలు అమలు జరుగుతున్నాయి. భారత న్యాయవ్యవస్థలో సుప్రీంకోర్టు అత్యున్నత న్యాయస్థానం. న్యాయ యంత్రాంగంలో ప్రధాన న్యాయమూర్తి (Chief Justice) అత్యున్నత న్యాయాధికారి.

1954 లో ఆంధ్రరాష్ట్ర శాసన సభ తీర్మానం ననుసరించి గుంటూరులో హైకోర్టు నెలకొన్నది. 1956 నవంబరులో ఆంధ్రప్రదేశ్ అవతరణతో ఆంధ్ర హైకోర్టు హైదరాబాద్ హైకోర్టులు విలీనమయినాయి. హైదరాబాద్‌లో ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఏర్పాటయింది. రాష్ట్ర న్యాయవ్యవస్థలో ఇది అత్యున్నత అధికార సంస్థ. రాష్ట్రంలోని కింది కోర్టులపై దీనికి అధికారం, అజమాయిషీ ఉన్నాయి. జిల్లా కోర్టుల నుండి సివిల్ క్రిమినల్ వ్యవహారాలకు సంబంధించిన అప్పీళ్ళను స్వీకరించడం, రాజ్యాంగంలోని అధికరణాలకు వివరణలివ్వడం, ప్రజా ప్రాతినిధ్య చట్టం కింద ఎన్నికల దావాల్ని పరిష్కరించడం, రిట్ ఉత్తర్వులను ఇవ్వడంలాంటి ముఖ్య అధికారాలు హైకోర్టుకున్నాయి.

జిల్లాస్థాయిలో డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ కోర్టు ఉన్నత న్యాయస్థానం. జిల్లా జడ్జి ఉన్నత న్యాయాధికారి. జిల్లా కోర్టులతోపాటు అదనపు కోర్టులు, సబ్ కోర్టులు సివిల్ క్రిమినల్ వ్యాజ్యాలను విచారిస్తాయి. కింద స్థాయిలో మున్సిఫ్ మేజిస్ట్రేట్ కోర్టులు, మేజిస్ట్రేట్ కోర్టులు ఏర్పడినాయి. క్రిమినల్ వ్యవహారాలకు సంబంధించి కొన్ని అధికారాలు రెవిన్యూ అధికారులకు సంక్రమించాయి. జిల్లా అధికార యంత్రాంగానికి సారథ్యం వహించే కలెక్టరు జిల్లా మేజిస్ట్రేట్ కూడా. న్యాయఅతిక్రమణల్లోని వైవిధ్యం, ప్రజల దైనిక జీవనం యంత్రాలతో ముడిపడడం మొదలైన కారణాలవల్ల నేడు కొన్ని కేసుల పరిష్కారానికి ప్రత్యేక కోర్టు అవసరం కలిగింది. రైల్వేలు, మోటారు వాహనాలు, మ్యునిసిపాలిటీలు, ఫ్యాక్టరీలు, కార్మిక చట్టాలు మొదలైనవాటికి సంబంధించిన వ్యాజాల పరిష్కారం కోసం హైదరాబాద్ వంటి నగరాల్లో ప్రత్యేక న్యాయస్థానాలు వెలిశాయి. భారత రాజ్యాంగం కల్పించే సాంఘిక న్యాయం అందరికీ అందుబాటులో ఉండాలనే లక్ష్యంతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం దేశంలోనే ప్రథమంగా సంచార న్యాయస్థానాల్ని ఏర్పాటు చేసింది. భారతీయ శిక్షాస్మృతి 1855 సంవత్సరం నాటి పౌరహక్కుల చట్టం, దరిమిలా 1976లో దానికి చేసిన సవరణల్ని అనుసరించి ఈ సంచార న్యాయస్థానాలు దళితవర్గాల ప్రజలపై జరిగే



BRAOU

అకృత్యాల్ని విచారించి శిక్షలు విధిస్తాయి. తూర్పు పశ్చిమ గోదావరి, చిత్తూరు, మహబూబ్‌నగర్, కడప, మెదక్, శ్రీకాకుళం జిల్లాల్లో ఇవి పనిచేస్తున్నాయి.

ఆంధ్ర రాష్ట్ర అవతరణ తరువాత సంభవించిన కొన్ని రాజకీయ పరిణామాలు, ఉద్యమాలు ఆంధ్రప్రదేశ్ న్యాయవ్యవస్థపై పరోక్ష ప్రభావాన్ని కనబరచాయి. 1969-76 సంవత్సరాల మధ్యకాలంలో రాష్ట్రంలో తల ఎత్తిన ఉద్యమాల ఫలితంగా అన్ని ప్రాంతాల ప్రజలకు ఆమోదయోగ్యంగా అప్పటి ప్రధానమంత్రి శ్రీమతి ఇందిరాగాంధీ పార్లమెంటులో ఆరు సూత్రాల పథకాన్ని ప్రకటించారు. దీని పర్యవసానంగా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన ఉద్యోగుల సర్వీసులను క్రమబద్ధం చేయడానికి, వ్యాజ్యాలను పరిష్కరించడానికి 1976 జూలైలో 'ఆంధ్రప్రదేశ్ అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్' ఏర్పాటయింది. 1983లో తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రభుత్వంలో బాధ్యత వహిస్తున్న అధికారుల్లోను అనధికారుల్లోను అవినీతిని అరికట్ట డానికి కొన్ని చర్యల్ని తీసుకొన్నది. ఈ చర్యలలో భాగంగా 1983 ఫిబ్రవరిలో ధర్మ మహామాత్ర, 1983 నవంబర్‌లో 'లోక్ ఆయుక్త' వ్యవస్థలు ఏర్పాటయినాయి.

### 25.2.3 సైనిక యంత్రాంగం

పాశ్చాత్య వాణిజ్య సంఘాలు ప్రారంభంలో తమ వర్తక స్థావరాల్లోని గిడ్డంగుల రక్షణకోసం సైనికుల్ని సమకూర్చుకోవడం జరిగింది. అవి క్రమంగా సుశిక్షితమైన సైనిక పటాలాల్ని ఆధునిక యుద్ధసామగ్రిని సమకూర్చుకొని తమ కార్యకలాపాల్ని రాజకీయరంగానికి విస్తరింపజేసాయి. స్థానిక ప్రభువుల అంతఃకలహాల్ని ఆసరాగా తీసుకొని అవి రాజకీయాల్లోకి తలదూర్చి వారి మీద పెత్తనం చెలాయించేంతటి ప్రాబల్యం సంపాదించాయి. ఆంధ్రదేశం మీద ఆధిపత్యం సంపాదించడానికి పాశ్చాత్య వాణిజ్య సంఘాలు ఇలాంటి వ్యూహాన్నే అవలంబించాయి. ఈ రకమైన రాజకీయపు ఎత్తుగడలో ఇంగ్లీషు కంపెనీవారు పూర్తి విజయాన్ని సాధించడానికి వారి సైనిక యంత్రాంగం తోడ్పడింది.

కంపెనీ సైన్యంలో భారత జాతీయులే అధిక సంఖ్యలో ఉండేవారు. సువిశాలమైన భారతదేశాన్ని తమ ఆధీనంలోకి తెచ్చుకోవడానికి అవసరమైనంత మందిని బ్రిటిష్ సమకూర్చి పెట్టలేకపోవడం వల్ల, అధిక ఖర్చుతో కూడినపని అయినందువల్ల ఇంగ్లీషువారు భారత జాతీయుల్నే అధికసంఖ్యలో సిపాయిలుగా చేర్చుకొనేవారు. ఉన్నత పదవుల్లో మాత్రం బ్రిటిష్ జాతీయులే నియమితులయ్యేవారు. కంపెనీ సైన్యంలో అంతర్భాగమైన భారతీయ సిపాయీలు మొదట యూనిఫారం, ఆయుధాలు మొదలైన విషయాల్లో తమ ప్రాంతానికి సంబంధించిన ప్రత్యేకతను పాటించేవారు. రాబర్ట్ క్లైవ్ ఈ దేశీయ సైన్యాల్ని పటాలాలుగా వ్యవస్థీకరించి ఆంగ్ల సైనికులకులాగా ఒకే విధమైన యూనిఫారాన్ని, ఆయుధాల్ని నిర్ణయించాడు. మొట్టమొదటిసారిగా యూరోపియన్ పద్ధతిలో శిక్షితమైన పటాలాల్లో తెలుగువారు ఎక్కువగా ఉండేవారు. వారిని 'తెలంగీ' అనేవారు ఇప్పటికీ ఉత్తర హిందూస్థానంలో సుశిక్షిత సైనికుడికి తెలంగీ అనే వ్యవహారం. బెంగాలు, బొంబాయి, మద్రాసు ప్రెసిడెన్సీలలోని కంపెనీ సైనిక పటాలాలు ఆయా సైనికాధికారుల అధికారానికి లోబడి ఉండేవి. 18వ శతాబ్ది మధ్యకాలానికి అవి సువ్యవస్థితమై మేజర్ స్ట్రింగర్ అధికార పర్యవేక్షణలోకి వచ్చాయి. ఆయన ఆధునిక భారతదేశ సైనిక నిర్మాతగా ప్రసిద్ధుడయ్యాడు.

1800 నాటికి ఒక మద్రాసు ప్రెసిడెన్సీలోనే కంపెనీ సైనిక బలం 11 రెజిమెంట్లకు పెరిగింది. ఈ సైన్యాల నిర్వహణకు అవసరమైన ఖర్చుల్ని సమకూర్చడానికి కంపెనీవారు నూతన మార్గాలు అన్వేషించవలసి వచ్చింది. సామ్రాజ్యవాది ఐన అప్పటి గవర్నర్ జనరల్ వెల్లస్లీ ప్రవేశపెట్టిన "సైన్య సహకార పద్ధతి" సైనిక పటాలాల వ్యయాన్ని రాబట్టుకోవడానికే గాక కంపెనీవారి అధికార విస్తరణకు కూడా దోహదం చేసింది. ఈ ఒడంబడికకు తలవొగ్గిన స్వదేశీ ప్రభువులకది తలకుమించిన భారంగా పరిణమించింది. 1800 లో ఈ సైన్య సహకార పద్ధతిని అంగీకరించిన మొదటి స్వదేశీ ప్రభువైన నిజాము తన రాష్ట్రంలోని కడప, కర్నూలు, బళ్ళారి, అనంతపురం ప్రాంతాల్ని ఇంగ్లీషు వారికి దత్తం చేయవలసి వచ్చింది.

1857 నాటి సిపాయిల తిరుగుబాటు కొన్ని పరిణామాలకు దారితీసింది. దీని ఫలితంగా భారతీయ సైనిక యంత్రాంగం పునర్వ్యవస్థీకృతమయింది. సైన్యంలో బ్రిటిష్ జాతీయుల సంఖ్య పెరిగింది. శతఘ్ని దళాలు పూర్తిగా బ్రిటిష్ జాతీయుల ఆధీనంలోకి వచ్చాయి. సైనిక దళాల్లో ఒక మతానికి, భాషకు, ప్రాంతానికి చెందిన సిపాయిల కేంద్రీకరణను తగ్గించి తిరుగుబాటు అవకాశాల్ని సన్నగిల్లేటట్లు చేశారు. 1857 తిరుగుబాటులో తమ

BRAOU

పట్ల విధేయతను కనబరచిన కొన్ని జాతుల వారిని అధికసంఖ్యలో సైన్యంలోకి తీసుకొన్నారు. ముఖ్యమైన స్థావరాల్లో భారతీయ సిపాయీలను అదుపులో ఉంచడానికి ఒక నిర్దిష్ట సంఖ్యలో ఆంగ్ల సైన్యాన్ని రూపొందించి ప్రత్యేకంగా నిలిపి ఉంచారు.

నిజాం రాష్ట్రంలో సైనిక యంత్రాంగం పటిష్టమై ఉండేదికాదు. నిజాము, దివాన్, షంషుల్ ఉమ్రాల ఆధీనంలో ప్రత్యేక దళాలు ఉండేవి. ఈస్టిండియా కంపెనీవారి సైనిక సహాయాన్ని పొందడానికి నిజాం రాష్ట్ర పాలకులు చేసిన ప్రయత్నాలు ఆత్మహత్యా సదృశాలయ్యాయి. 1766 లోను, 1768లోను కంపెనీ వారితో నిజాం ఆలీఖాన్ కుదుర్చుకొన్న ఒప్పందాలు ఉత్తర సర్కారులపై కంపెనీవారి అధికారాన్ని స్థిరీకరించాయి. వెల్లస్లీ ప్రవేశపెట్టిన సైన్య సహకార పద్ధతిని అంగీకరించిన అతడు కడప, బళ్ళారి, కర్నూలు, అనంతపూరు మండలాల్ని కంపెనీవారికి దత్తంచేయవలసి వచ్చింది. నిజాం రాష్ట్రంలో సన్నగిల్లిన శాంతిభద్రతల్ని పునరుద్ధరించే మిషతో కంపెనీవారు హైదరాబాదులో ఏర్పాటు చేసిన కంటింజంట్ సైన్యాల ఖర్చు విషయంగా మూడవ నిజాము కంపెనీవారికి పెద్ద మొత్తం బకాయి పడినాడు.ఈ కారణం వల్లనే 1853లో బీరార్, ఉస్మానాబాద్, రాయచూర్ జిల్లాల్ని నిజాము కోల్పోవలసి వచ్చింది. ఆంధ్ర దేశంలోని అత్యధిక భాగం కంపెనీవారి ఆధిపత్యంలోకి రావడానికి నిజాం రాష్ట్ర సైనిక యంత్రాంగంలోని లోపాలు దోహదం చేశాయి.

బ్రిటిష్ పరిపాలనలో సుశిక్షితమైన సైనిక పటాలాలు అంతరంగికమైన తిరుగుబాట్లను అణచడం, స్వదేశీ సంస్థానాధీశుల్ని అదుపులో ఉంచడం, విదేశీ దాడుల నుండి బ్రిటిష్ సార్వభౌమాధికారాన్ని రక్షించడం అనేమూడు ప్రయోజనాల్ని నెరవేర్చాయి. బ్రిటిష్ సైన్యంలో భారత జాతీయులే అధిక సంఖ్యలో ఉండినా 1914 వరకు వారి హోదా సుబేదారు పదవిని మించలేదు. సైన్యంలో రాయల్ కమిషన్ద్వారా ఉన్నత పదవుల్లో బ్రిటిష్ జాతీయులే నియమింపబడేవారు. ఇది భారతీయులకు అందుబాటులో ఉండేదికాదు. వైస్రాయి కమీషన్ ద్వారా సైన్యంలో నియమితులైన భారతీయులకు పరిమితమైన హోదా మాత్రమే లభించేది. సైన్యంలో భారతీయులకు తగిన ప్రాతినిధ్యాన్ని కోరుతూ భారతీయ సైనికాధికారులకు శిక్షణావకాశాల్ని కల్పించడానికి ప్రత్యేకంగా ఒక సైనిక కళాశాలను నెలకొల్పాలని దివాన్ బహదూర్ వెంకటపతి రాజు మొదలైనవారు కేంద్ర అసెంబ్లీలో తీర్మానాల్ని ప్రవేశపెట్టారు. 1925 నాటి స్కీన్ కమిటీ సైన్యంలో భారతీయులకు తగిన ప్రాతినిధ్యాన్ని కల్పించాలని చేసిన సూచనల్ని ప్రభుత్వం పాక్షికంగా ఆమోదించింది. దీని ఫలితంగా డెహ్రాడూన్లో ప్రిన్స్ ఆఫ్ వేల్స్రాయల్ ఇండియన్ మిలటరీ కాలేజిని నెలకొల్పడానికి ప్రభుత్వం అంగీకరించింది. 1934 నాటి భారతీయ సైనికశాసనం ఇండియన్ మిలటరీ అకాడమీ ద్వారా నియమితులైన భారతీయ సైనికాధికారులకు ఇండియన్ కమిషన్డ్ ఆఫీసర్లుగా చట్టపరమైన గుర్తింపునిచ్చింది.

బ్రిటన్ తన సామ్రాజ్యవాద ప్రయోజనాల్ని నెరవేర్చుకోవడం కోసం ఈ కాలంలో యుద్ధాలలో పాల్గొన్నది. మొదటి ప్రపంచ యుద్ధ ఫలితంగా ఏర్పడిన ఆర్థిక మాంద్యం వంటి కారణాలవల్ల ఈ కాలంలో కొన్ని వేల ఆంధ్ర కుటుంబాలు బర్మా, మలయా, సింగపూర్ మొదలైన దేశాలకు వలస వెళ్ళాయి. ఆంధ్ర సంస్కృతి పరిణామంలో ఆయా దేశాలలో స్థిరపడిన ప్రవాసాంధ్రులు కూడా ముఖ్య పాత్రను వహించారు.

ఈ కాలంలోనే బ్రిటిష్ సైనిక యంత్రాంగానికి ఒక సవాలుగా గోదావరి, విశాఖపట్నం ఏజన్సీ ప్రాంతాల్లోని ప్రజల్ని కూడగట్టుకొని అల్లూరి సీతారామరాజు 1922-24 ప్రాంతాలలో బ్రిటిష్ ప్రభుత్వంపై తిరుగుబాటు చేశాడు. ఆధునిక ఆంధ్రదేశ చరిత్రలో ఇది రంప (చోడవరం) విప్లవంగా ప్రసిద్ధమైంది. జాతీయ కాంగ్రెస్ నాయకుల అహింసావాద పద్ధతులతో విభేదించిన సుభాష్ చంద్రబోస్ 1945 ప్రాంతాల్లో 'ఆజాద్ హింద్ ఫౌజ్' ను ఏర్పాటు చేసి బ్రిటిష్ సైనిక శక్తిని ప్రతిఘటించాడు. ప్రజాభిప్రాయంతో ప్రమేయం లేకుండా ద్వితీయ ప్రపంచ యుద్ధంలో పాల్గొన్న బ్రిటిష్ ప్రభుత్వం యుద్ధప్రచార శాఖను ప్రత్యేకంగా నెలకొల్పింది. ఆ రోజుల్లో యుద్ధ ప్రచార శాఖలో పనిచేసిన కొందరు కవులు జర్మన్ జపాను దేశాల్ని నిరసిస్తూ బ్రిటన్ విధానాల్ని సమర్థిస్తూ పాటల్ని, బుర్రకథల్ని రచించి ప్రచారం చేశారు. వాటిని గ్రామఫోను రికార్డులుగా కూడా విడుదల చేశారు.

స్వదేశీ సంస్థానాల్లో నియమితులైన రాజ ప్రతినిధుల (Residents) ఆధీనంలోని సైన్యాలు ఆయా సంస్థానాల ఆంతరంగిక వ్యవహారాల్లో జోక్యం కలిగించు కోవడంలో తోడ్పడినాయి. నిజాం రాష్ట్రంలోని రాజ ప్రతినిధులు నిర్వహించిన పాత్రను, దానివల్ల కలిగిన ఫలితాన్ని మనం వెనుకటి భాగంలో గమనించి ఉన్నాం.



BRAOU

### 25.2.4 ప్రజాహిత కార్యాలు

కంపెనీపాలన ప్రారంభంలో డైరక్టర్లు అనుసరించిన విధానాలు ప్రజల ప్రయోజనాల్ని దెబ్బతీశాయి. కొత్తగా తమ అధీనంలోకి వచ్చిన ప్రాంతాల నుండి పాలితుల కష్టసుఖాలతో ప్రమేయం లేకుండా ఎక్కువ మొత్తాన్ని రాబట్టుకోవడానికే వారు కృషి చేశారు. దీనికి తోడు అధికార యంత్రాంగంలోని ఉన్నతాధికారులు చాలా వరకు ప్రజల అవసరాల్ని, మనోభావాల్ని అర్థం చేసుకోలేక పోయారు. ఆనాడు ప్రజాసంక్షేమం కోసం పాటుపడిన అధికారుల సంఖ్య చాలా తక్కువ. రాయలసీమ జిల్లాల స్పెషల్ కలెక్టర్‌గా పనిచేసిన సర్ థామస్ మన్రో, న్యాయశాఖలో ఉద్యోగాన్ని నిర్వహించిన సి.పి.బ్రౌన్, ఇంజనీరింగ్ శాఖలో పనిచేసిన సర్ ఆర్థర్ కాటన్ వంటి కొద్దిమంది అధికారులు మాత్రమే ప్రజాహిత కార్యాల్ని అమలు జరపడంలో ఆసక్తిని కనబరచారు.

ఒక సాధారణ సైనికునిగా కంపెనీ సైన్యంలో ప్రవేశించిన మన్రో తన శక్తి యుక్తులవల్ల శిరపాలనాధికారిగా, రాయలసీమ జిల్లాల స్పెషల్ కలెక్టర్‌గా, న్యాయసంఘాధ్యక్షునిగా, మద్రాసు గవర్నరుగా వివిధ పదవుల్ని అలంకరించాడు. రాయలసీమ జిల్లాల్లో రైత్వారీశిస్తు వసూలు పద్ధతిని అమలు జరపడంలోను, పాలెగార్ల తిరుగుబాటును అణచివేయడంలోను ఆయన ముఖ్యపాత్ర నిర్వహించాడు. రాయలసీమలో ఇప్పటికీ అక్కడక్కడా విన్పించే "మన్రోఅయ్య" అనే పేరు ప్రజాసంక్షేమానికై తన జీవితాన్ని అంకితం చేసిన అతడిపట్ల ప్రజలకున్న అభిమానాన్ని సూచిస్తోంది.

కంపెనీ పాలనలో దేశం మొత్తానికి గాని, ఆంధ్రదేశానికిగాని ప్రయోజనకరాలైన పనులేవీ పెద్ద ఎత్తున జరగలేదు. 19వ శతాబ్దం మధ్యకాలం వరకు గోదావరి, కృష్ణవంటి మహానదులకు ఆనకట్టలు కట్టి నీటి పారుదల సౌకర్యాల్ని కల్పించడానికి ప్రయత్నాలు జరగలేదు. దక్షిణ భారతంలో నీటి పారుదల సౌకర్యాల్ని అభివృద్ధి పరచడానికి నియమితుడైన సర్ ఆర్థర్ థామస్ కాటన్ (1803 – 99) కార్యదీక్షవల్ల ఆంధ్ర దేశంలోని గోదావరి కృష్ణా డెల్టా ప్రాంతాల స్వరూపం పూర్తిగా మారిపోయింది. ఆయన కృషి ఫలితంగా 1853లో గోదావరి నదిపై ధవళేశ్వరం వద్ద ఆనకట్ట నిర్మాణం పూర్తయింది. 1852-55 సంవత్సరాల్లో కేప్టన్ ఓర్ పర్యవేక్షణలో విజయవాడ వద్ద కృష్ణానదిపై ఆనకట్ట నిర్మాణం జరిగింది. ఆంధ్ర దేశంలో ఆధునిక నీటి పారుదల అభివృద్ధి కార్యక్రమ నిర్మాతగా సర్ ఆర్థర్ కాటన్ ఆంధ్రప్రజలకు చిరస్మరణీయుడయ్యాడు.

బ్రిటిష్ పాలనలో ఆంధ్రదేశంలో వ్యవసాయం, పరిశ్రమలు, రవాణా, విద్యమొదలైన రంగాల్లో నామ మాత్రపు అభివృద్ధి వచ్చింది. ఈ కాలంలో బ్రిటిష్ వారు భారతదేశంలో ప్రవేశపెట్టిన రైల్వేలు (1853), పోస్ట్ అండ్ టెలిగ్రాఫ్ వ్యవస్థ (1854), విశ్వవిద్యాలయాల స్థాపన (మద్రాసు విశ్వవిద్యాలయం 1857), లెజిస్లేటివ్ కౌన్సిళ్ళు (1854) ఆంధ్ర ప్రాంతంలో కూడా క్రమంగా విస్తరించి సామాజిక రాజకీయ చైతన్యానికి పునాదులు వేశాయి.

ఆసఫ్ జాహి వంశపాలనలో తెలంగాణప్రాంతం అన్ని రంగాల్లోను వెనుకబడింది. ముగ్గురు నిజాములవద్ద దివాన్‌గిరి నెరపిన సాలార్‌జంగ్ (1853-83) ప్రజా సంక్షేమ కార్యక్రమాల్ని చేపట్టి నిజాం రాష్ట్రీ ఆధునికీకరణకు ప్రయత్నం చేశాడు. అతడు పాలనపరంగా ఆర్థిక, రెవిన్యూ, విద్యా, న్యాయశాఖల్లో ఎన్నో సంస్కరణలు అమలు జరిపినాడు. రవాణా సౌకర్యాల అభివృద్ధికీ, జలాశయాల మరామ్మత్తు ద్వారా నీటిపారుదల సౌకర్యాల్ని మెరుగు పరచడానికి ఆయన కృషి చేశాడు. అందువల్లనే ఆయన 19వ శతాబ్దపు ఉత్తమ పాలకుల్లో ఒకడుగా ప్రశంసలు అందుకున్నాడు.

కంపెనీ పాలనలో కంటె బ్రిటిష్ పాలనలో పబ్లిక్ వర్క్స్ శాఖ, పోలీసు శాఖ వంటి పాత శాఖలు పటిష్టమయినాయి. వ్యవసాయ శాఖ, అటవీ శాఖ సహకారశాఖ వంటి కొత్త శాఖల ఏర్పాటు జరిగింది. ఈ చర్యలు పరిపాలనా వ్యవస్థను బలపరచడమే గాక ప్రజా జీవితాన్ని కూడా ప్రభావితం చేశాయి. బ్రిటిష్ పరిపాలనలో ప్రభుత్వ పాలనలో ప్రజలకు కొంతవరకు ప్రాతినిధ్యాన్ని కల్పించే చట్టాలు వచ్చాయి. వీటి ఫలితంగా లెజిస్లేటివ్ కౌన్సిళ్ళు, స్థానిక స్వపరిపాలన సంస్థలు ఏర్పడి ప్రజలకు నూతన రాజకీయానుభవాన్ని కలిగించాయి. బ్రిటిష్ వారు అమలు జరిపిన న్యాయ వ్యవస్థద్వారా కుల మత వర్గ విభేదాలతో నిమిత్తం లేకుండా అందరూ సమంగా న్యాయ రక్షణ పొందవచ్చనే అభిప్రాయం ప్రజల్లో బలపడింది. స్వాతంత్ర్యం వచ్చేనాటికి ఆంధ్రదేశంలోని సుమారు 20000 కి. మీ. పొడవైన రోడ్లు, 2500 కి. మీ. పొడవైన రైలు మార్గాలు. 1500 కి. మీ. పొడవైన సరకుల రవాణాకు అనువైన కాలువలు రాకపోకల సౌకర్యానికి, వర్తక వాణిజ్యాల అభివృద్ధికి దోహదం చేశాయి.

BRAOU

బ్రిటిష్ వారు దేశమంతటా ఒకే రకంగా అమలు జరిపిన విద్యావిధానం ప్రజలలో భావ సామ్యాన్ని పెంపొందించింది.

బ్రిటిష్ పరిపాలనలో దేశం బలపడడానికి కేంద్రీకృతమైన సుస్థిర ప్రభుత్వం అవసరమని మొదటిసారిగా ప్రజలు గుర్తించగలిగారు. 1857లో సంభవించిన పరిణామాల దరిమిలా బ్రిటిష్‌వారిలో చోటు చేసుకున్న పరాయి తత్వం పాలితులకు పాలకులకు మధ్య ఉండవలసిన సామరస్యాన్ని తగ్గించింది. భారతీయుల్లో స్వాతంత్ర్య కాంక్షను రగులుకొల్పింది. జాతీయోద్యమ కాలంలో అహింసాయుత పద్ధతుల్లో ఆందోళన జరిపిన సత్యాగ్రహులపై బ్రిటిష్‌వారు ప్రయోగించిన దమననీతి నిరసింపదగింది.

యూనిటరీ పరిపాలన విధానం అమల్లో ఉన్న భారతదేశంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రూపొందించి అమలు జరిపే ప్రణాళికల ఆధారంగా ఆయారాష్ట్రాల్లో అభివృద్ధి కార్యక్రమాలు అమలు జరుగుతాయి. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం. ఆంధ్రప్రదేశ్ అవతరణ నుండి రాష్ట్ర ప్రభుత్వం ప్రజాహిత కార్యాలను అమలు జరపడానికి కృషి చేస్తున్నాయి.

స్వాతంత్ర్యానంతరం నుండి ఆంధ్రప్రదేశ్ వ్యావసాయికంగా ముందంజవేస్తోంది. నాగార్జునసాగర్, శ్రీశైలం, పోచంపాడు వంటి బహుళార్థసాధక ప్రాజెక్టులు రాష్ట్రావతరణ తర్వాత వెలిశాయి. నాగార్జునసాగర్ ఆ తరహా ప్రాజెక్టులలో ప్రపంచంలోకెల్లా ఎత్తైనది. జవహర్‌లాల్ నెహ్రూ దానిని ఆధునిక దేవాలయంగా అభివర్ణించారు. సన్నకారు రైతులను ప్రోత్సహించే కృషిలో భాగంగా ప్రభుత్వం చిన్న కమతాణాపై శిస్తును రద్దుచేసింది. నిరుద్యోగులు చిన్న తరహా పరిశ్రమల్ని స్థాపించడానికి ప్రభుత్వం స్వయం ఉపాధి పథకాన్ని రూపొందించింది. పరిపాలన వికేంద్రీకరణలో భాగంగా దేశంలోనే మొదటిసారిగా ఆంధ్రప్రదేశ్‌లో మూడంతస్థులతో కూడిన పంచాయితీ రాజ్ వ్యవస్థ 1959 లో ప్రవేశ పెట్టబడింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో 18 సంవత్సరాల వారికి ఓటు హక్కును కల్పించింది. పంచాయితీ సంస్థల్లో సహకార సంస్థల్లో షెడ్యూలు కులాల వారికి, తెగల వారికి కొన్ని స్థానాల్ని కేటాయించింది. ప్రభుత్వ యంత్రాంగం సామాన్యుడి తలుపు తట్టాలనే లక్ష్యంతో ఇటీవల ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రెవిన్యూఫిర్కాలను, తాలూకాలను రద్దుచేసి మండల వ్యవస్థను ప్రవేశపెట్టింది.

బలహీనవర్గాల సంక్షేమంకోసం రాష్ట్రంలో ప్రత్యేక కార్పొరేషన్లు ఏర్పడాయి బలహీన వర్గాలకు చెందిన రెండు లక్షల కుటుంబాలను దారిద్ర్య రేఖనుండి పైకి తీసుకొని రావడానికి ఆర్థిక సహాయాన్ని అందజేశాయి, రాష్ట్రావతరణ నుండి 1983 వరకు బలహీన వర్గాలకు చెందిన 18,24,505 కుటుంబాలకు ప్రభుత్వం నివేశన స్థలాల్ని పంచిపెట్టింది. భూమిలేని నిరుపేదలకు మిగులు భూముల్ని పంచిపెట్టడానికి 1985లో ప్రభుత్వం ఒక పథకాన్ని రూపొందించింది. బలహీన వర్గాలవారికి శాశ్వతగృహనిర్మాణ పథకాన్ని రాష్ట్రప్రభుత్వం ఇటీవలి కాలంలో పెద్ద ఎత్తున చేపట్టింది. దళిత వర్గాల పట్ల జరిగే అకృత్యాల్ని నివారించడానికి 1955 నాటి పౌర హక్కుల చట్టాన్ని అనుసరించి దేశంలోనే ప్రథమంగా ఆంధ్రప్రదేశ్‌లో సంచార న్యాయస్థానాలు వెలిశాయి. వికలాంగుల సంక్షేమంకోసం రాష్ట్రంలో ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటయింది. రాష్ట్రంలో తాగునీటి సమస్యను పరిష్కరించడానికి ఇప్పటి వరకు 85,000 గొట్టపుబావులు తవ్వబడినాయి. దేశంలో మరి ఏ రాష్ట్రంలోను ఇన్ని గొట్టపు బావులు లేవు. కిలో బియ్యం రెండు రూపాయలకు అమ్మే పథకాన్ని ప్రభుత్వం రూపొందించి అమలు జరుపుతోంది. తక్కువ ఆదాయంగల 97 లక్షల పచ్చకార్డులవారు దీనివల్ల ప్రయోజనం పొందుతున్నారు.

ప్రజలు ప్రభుత్వవ్యవహారాల్ని అర్థం చేసుకోవడానికి భాష ప్రతిబంధకం కాకూడదు. ఈ దృష్టితోనే ప్రభుత్వం పరిపాలన సంస్కరణలో భాగంగా తెలుగుభాషను అధికారభాషగా చేసింది.

## 25.3.0 ఆర్థిక పరిస్థితులు

ఆంధ్రదేశంలో వ్యవసాయమే ప్రజల ప్రధానవృత్తి. గోదావరి, కృష్ణవంటి మహానదులున్నా 19వ శతాబ్ది మధ్య కాలం వరకు ఆనకట్టలు కట్టి, ఆ నదీ జలాల్ని కాలువల ద్వారా మళ్ళించి, బీడు భూముల్ని సాగులోనికి తీసుకొని రావడానికి తగిన కృషి జరుగలేదు. కంపెనీ పాలనలో స్వయం సంపూర్ణ గ్రామ వ్యవస్థ పూర్తిగా ఛిన్నాభిన్నమైంది. చెరువులు, పంట కాలవలు మొదలైన సాముదాయక ఆస్తిపాస్తుల విషయంలో గ్రామస్తుల్లో ఒకప్పుడుండిన సమిష్టి బాధ్యత సన్నగిల్లింది. కంపెనీ అధికారుల ఉదాసీనత వల్ల, నిర్వహణలోని లోపాలువల్ల

BRAOU

నీటి పారుదల సౌకర్యాలు దెబ్బతిన్నాయి. ప్రభుత్వ వైఫల్యాలకూ ప్రకృతి వైపరీత్యాలు తోడై ఆంధ్ర దేశంలో తరచుగా క్షామ పరిస్థితులు నెలకొన్నాయి.

### 25.3.1 వ్యవసాయం

కంపెనీ పాలనలో వ్యవసాయానికి సంబంధించిన పరిశోధనాధారమైన శాస్త్రి విజ్ఞానం రైతుల అందుబాటులోనికి రాలేదు. పరంపరాగతంగా రైతులు గడించిన అనుభవజ్ఞానమే ఆధారంగా ఉండేది. పంటలు, విత్తనాలు, పనిముట్లు మొదలైన వాటి విషయంలో రైతులు పాత పద్ధతుల్నే అనుసరించారు. అందువల్ల ఈ కాలంలో వ్యవసాయ ఉత్పత్తుల్లో అభివృద్ధిరాలేదు. ప్రాచీన గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు దోహదం చేసిన కొన్ని వృత్తులు కంపెనీ పాలనలో క్షీణించాయి. ఆ వృత్తుల్ని ఆశ్రయించినవారు వ్యవసాయం మీద ఆధారపడవలసి వచ్చింది. సేద్యానికి యోగ్యమైన భూములు తగినంతగా లభ్యం కాక పోవడం వల్ల చాలామంది వ్యవసాయ కూలీలుగా మారిపోవలసి వచ్చింది. రైతులు పత్తి, పొగాకు, నూనె గింజలు, జనుమువంటి వాణిజ్య పంటలపై మొగ్గు చూపడంతో వారి ఆర్థిక పరిస్థితి బాహ్య వ్యాపార స్థితిగతులతో ముడిపడడం ఆరంభమైంది. ప్రభుత్వం అనుసరించిన వాణిజ్య విధానం వల్ల రైతులు ఒక్కోసారి తీవ్ర నష్టానికి గురి అయ్యేవారు. 1861 - 65 ప్రాంతాల్లో అధిక పెట్టుబడితో పండించిన పత్తిని కొనుగోలు చేసేవాళ్ళు లేక గంజాం ప్రాంతంలో, రైతులు తీవ్ర నష్టాలకు గురి అయ్యారు. ఆర్థికంగా చితికి పోయిన వారు దక్షిణాఫ్రికా, మారిషస్, ఫిజి వంటి సుదూర ప్రాంతాలకు పోవలసి వచ్చింది.

కంపెనీపాలనలోను, బ్రిటిష్ పాలనలోను భూమిశిస్తుద్వారా లభించే ఆదాయమే ప్రధానంగా ఉండేది. శిస్తువసూలు చేయడంలో వారు చేసిన ప్రయోగాలు, అనుసరించిన పద్ధతులు రైతుల ఆర్థిక పరిస్థితిపై దెబ్బతీశాయి. 1797లో లార్డ్‌కారన్ వాలీస్ బెంగాలులో ప్రవేశపెట్టిన శాశ్వత భూమిశిస్తు విధానం 1802-4 సంవత్సరాల నాటికి ఆంధ్రదేశంలో సర్కారు జిల్లాల్లోని జమిందారీ భూములకు, హవేలీ భూములకు (మొగలుల కాలంనుండి ప్రభుత్వంవారు తమ సొంతానికి ఉంచుకొన్న భూములు) వర్తింపజేశారు. ఈ విధానంవల్ల భూమిపై ఆస్తిహక్కును సంపాదించుకొని నిర్ణీతమైన పేష్కష్‌ను (ప్రభుత్వ ఖజానాకు చెల్లించవలసిన మొత్తం) ప్రభుత్వానికి చెల్లించే జమీందార్లు, ప్రొప్రైటర్లు అనే మధ్యవర్తివర్గం బలపడింది. ఆనాడు ఆంధ్రదేశంలో సాగుబడిలో ఉండిన భూముల్లో మూడోవంతు వారి ఆధీనంలో ఉండేది. పన్నుల చెల్లింపు విషయంలో ఒక నిర్దిష్టమైన సూత్రం అంటూ లేకపోవటం వల్ల 1804 వరకూ కౌలుదారులకు చట్టపరమైన రక్షణ లేకపోవడం వల్ల రైతులు అనేక కష్టనష్టాలకు లోనయ్యారు. సర్వే సెటిల్‌మెంటువ్యవహారాలు పూర్తి చేయకపోవడం, భూసారాన్నిబట్టి, ఉత్పత్తినిబట్టి శిస్తు నిర్ణయించకపోవడం మొదలైన లోపాలవల్ల రైత్వారీ విధానం (మధ్యవర్తుల ప్రమేయం లేకుండా రైతు ప్రభుత్వ ఉద్యోగులకు శిస్తు చెల్లించే పద్ధతి) అమల్లో ఉండిన రాయలసీమ జిల్లాల్లోని రైతులు కూడా కడగండ్లకు గురి అయ్యారు. ఎక్కువ మదింపువేసిన శిస్తును చెల్లించడానికి నిరాకరించిన సందర్భాల్లో రైతులను నానాయాతనలకు గురి చేసేవారు. పన్నుల భారంతో కుంగిపోయిన రైతుల పరిస్థితి కంపెనీ పాలనలోనే మెరుగ్గా ఉండేదని 'లోకరంజని' పత్రిక (అక్టోబరు 1876) ప్రభుత్వాన్ని విమర్శించింది. ఆనాడు పన్నుల భారంతో నడుంవిరిగిన రైతుల దీనావస్థను 'నేలదున్నుదమన్న జాలతరముపన్ను, నీరుగావలెనన్న నీటిపన్ను" అని చిలకమర్తి లక్ష్మీనరసింహంగారు గోదావరి మండలసభ (1895) లో చదివిన పద్యాల్లో వ్యక్తం చేశారు.

నిజాం రాష్ట్రంలోని తెలంగాణా ప్రాంతంలో రైతుల పరిస్థితి దీనికి భిన్నంగా లేదు. వారిని పన్ను గుత్తదారుల అనేక విధాల పీడించేవారు. 1853 లో దివానుగా పదవీబాధ్యతల్ని స్వీకరించిన సాలార్‌జంగ్ రెవిన్యూశాఖలో అమలు జరిపిన సంస్కరణల వల్ల రైతుకూ ప్రభుత్వానికీ ప్రత్యక్ష సంబంధం ఏర్పడి రైతుల పరిస్థితి కొంతవరకు మెరుగైంది.

ఇరవయ్యో శతాబ్ది ప్రారంభం నాటికి వ్యవసాయరంగంలో కొంత అభివృద్ధి జరిగింది. రాష్ట్రంలోని వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో కొత్త రకపు వంగడాలు. పనిముట్లు మొదలైన వాటిని గూర్చి పరిశోధనలు జరిగాయి. దీని ఫలితంగా పరిశోధనాధారమైన శాస్త్రి విజ్ఞానం కొంతవరకు రైతుల అందుబాటులోకి వచ్చింది. సర్వే సెటిల్‌మెంటు వ్యవహారాలు పూర్తి అయినందువల్ల, కౌలుదారులకు కొంత వరకు చట్టపరమైన రక్షణలు లభించినందువల్ల భూముల విషయంలో ఏర్పడి ఉండిన అనిశ్చిత పరిస్థితి తొలగిపోయింది.



BRAOU

బ్రిటిష్ పాలనలో గ్రామీణ పరిశ్రమలు దెబ్బతిన్నందువల్ల ఉపాధి కోల్పోయిన వారు వ్యవసాయరంగం మీద ఆధారపడవలసిన పరిస్థితి ఏర్పడింది. నీటి పారుదల సౌకర్యాలు మెరుగైనందువల్ల అదివరకు బీడుగా ఉండిన భూములు సాగులోకి వచ్చాయి. ఈ కాలంలో 24 లక్షల ఎకరాల భూమి సాగులోకి వచ్చింది. అయినా వ్యవసాయం చేయదలచిన చాలా మందికి భూములు లభ్యంకాలేదు. అందువల్ల వారు వ్యవసాయ కూలీలుగా మారిపోయారు.

ఈ కాలంలో రైతులు పండించే పంటల్లో కూడా మార్పు వచ్చింది. ఇతర ప్రాంతాలకు, విదేశాలకు ఎగుమతి చేసి లాభాల్ని గడించడానికి వీలున్న పత్తి, పొగాకు, జనుము, నూనె గింజల వంటి వాణిజ్య పంటలకు ప్రాధాన్యం వచ్చింది. రవాణా సౌకర్యాల అభివృద్ధి దీనికి దోహదం చేసింది. దీని వల్ల రైతుల ఆర్థిక పరిస్థితి బాహ్య వ్యాపార స్థితిగతులపై ముడిపడడం ఆరంభమైంది. పంట కాలువల ద్వారా నీటి పారుదల సౌకర్యాలున్న భూముల్లో రైతులు రెండు మూడు పంటల్ని పండించడం ప్రారంభించారు. రైతులకు పంటల పెట్టుబడికి కావలసిన సౌకర్యాల్ని కల్పించడానికి సహకార సంఘాలు ఏర్పడ్డాయి.

బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా జాతీయ కాంగ్రెస్ అధ్వర్యంలో గాంధీజీ ప్రారంభించిన సత్యాగ్రహోద్యమం రైతు వర్గాన్ని చైతన్యవంతం చేసింది. పలనాడులో ప్రజలు జరిపిన పుల్లరి సత్యాగ్రహం (1921), పెదనందిపాడు ప్రాంతంలో రైతులు సాగించిన పన్నుల సహాయ నిరాకరణోద్యమం (1922) ప్రభుత్వ విధానాల్ని రైతులు సంఘటితమైన ఏవిధంగా ప్రతిఘటించిందీ తెలియజేస్తున్నాయి. రైతుల్లో కలిగిన ఈ జాగృతి వల్లనే 1923లో గుంటూరు, కృష్ణా, పశ్చిమగోదావరి జిల్లాలలో రైతు సంఘాలు ఏర్పడినాయి. రైతాంగంలో వెల్లివిరిసిన ఈ ఉత్సాహం తర్వాతి కాలంలో జమీందారీ విధానం రద్దు కావాలనే ఆందోళన ఉద్యమ రూపాన్ని పొందేలా చేసింది.

సంస్థానాధీశులు, జాగీర్‌దార్‌లు, దేశ్‌ముఖ్‌లు, దేశ్‌పాండేల వంటి దళారీ వర్గానికి, నాగు, నజరాన, బగేలా, వెట్టిచాకిరి వంటి దురాచారాలకు చిక్కిన తెలంగాణా ప్రాంతం రైతులు అనేక కష్ట నష్టాలకు గురి అయినారు. 1946-48 ప్రాంతాల్లో కమ్యూనిష్టుల అధ్వర్యంలో సాగిన, తెలంగాణా సాయుధ పోరాటం రైతు కూలీలను సంఘటిత పరచడంలోను, వారిని భూస్వాముల కబంధహస్తాల నుండి విముక్తం చేయడంలోను, ముఖ్య పాత్రను నిర్వహించింది. ఈ చారిత్రాత్మక పోరాటం ప్రప్రథమంగా భూసంస్కరణల ఆవశ్యకతను యావద్భారతదేశం గుర్తించేలా చేసింది.

వ్యవసాయ ప్రధానమైన ఆంధ్రప్రదేశ్‌లో 1982-83 నాటికి 127.69 లక్షల హెక్టార్ల భూమి సాగులోకి వచ్చింది. భారీ, మధ్యతరహా నీటిపారుదల ప్రాజెక్టులు, చెరువులు, గొట్టపుబావులు మొదలైన నీటివనరులవల్ల సుమారు 50 లక్షల ఎకరాలకు నీటిపారుదల సౌకర్యం లభించింది. రాష్ట్రజనాభాలో సుమారు 70 శాతం మంది వ్యవసాయ రంగంపైనే ఆధారపడి వున్నారు.

ఇరవయ్యో శతాబ్ది ద్వితీయార్థంలో హరిత విప్లవం (Green Revolution) గుర్తింపదగిన విశేషం. ఈ కాలంలో అధిక దిగుబడినిచ్చే వంగడాలు, పంటల తెగుళ్ల నివారణ, రసాయనిక ఎరువులు, వ్యవసాయ పనిముట్లు మొదలైనవాటికి సంబంధించి ప్రపంచ వ్యాప్తంగా పరిశోధనలు జరిగాయి. వీటి ఫలితాలు ఆంధ్రప్రదేశ్ వ్యవసాయరంగంపై ప్రభావాన్ని కనబరచాయి. 1964లో రాష్ట్రంలో రాజేంద్రనగర్ (హైదరాబాద్)లో ఏర్పాటైన వ్యవసాయ విశ్వవిద్యాలయం రైతులకు ఆధునిక వ్యవసాయ పద్ధతులను గూర్చి తెలియజేయడంలో ముందంజ వేసింది. హెచ్చుదిగుబడినిచ్చే వంగడాల్ని రూపొందించడంలో ఇది కృషి చేస్తోంది. ఈ విశ్వవిద్యాలయంవారు రూపొందించే 'వ్యవసాయ పంచాంగం' వంటి కార్యక్రమాలు ఆకాశవాణి, దూరదర్శన్‌ల ద్వారా రైతుల్ని ఆకట్టుకొంటున్నాయి. దీనికి తోడు రాష్ట్ర ప్రభుత్వ అధ్వర్యంలోని 'విత్తనాల అభివృద్ధి సంస్థ' (Seed Development Corporation), 'వ్యవసాయ పరిశ్రమల సంస్థ' (Agro-Industries Corporation) లు రైతులకు మేలిరకమైన విత్తనాల్ని, వ్యవసాయ పనిముట్లను అందుబాటులోకి తెస్తున్నాయి.

హెచ్చు దిగుబడి వంగడాల్ని వినియోగించడంలోను, నూతన వ్యవసాయ పద్ధతుల్ని అనుసరించడంలోను, రసాయనిక ఎరువుల్ని ఉపయోగించడంలోను ఆంధ్రప్రదేశ్ రైతులు ఈ కాలంలో ముందంజ వేశారు. 1928 లో భారతదేశంలో వ్యవసాయరంగ పరిస్థితిని పరిశీలించిన 'రాయల్ కమిషన్' ఆంధ్రదేశంలో అనేక ప్రాంతాల్లో వ్యవసాయ పద్ధతులు అభివృద్ధిచెందాయనీ డెల్టా జిల్లా రైతులు వరిపైరును సాగుచేయడంలో నైపుణ్యం కలిగిన వారనీ తెలియజేసింది. 1965 లో భారతదేశంలోనే మొదటిసారిగా

టి.ఎన్.1' వంటి హెచ్చు దిగుబడి నిచ్చే వరి వంగడాల్ని ప్రవేశ పెట్టడంలో రాష్ట్రంలోని రైతులు చొరవ చూపారు. నేడు భారతదేశంలో బియ్యాన్ని ఉత్పత్తిచేసే రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్‌ది రెండోస్థానం. ఇరుగుపొరుగు రాష్ట్రాలవారు 'నెల్లూరు బియ్యాని' కి బాగా అలవాటుపడ్డారు. అలాగే వాణిజ్య పంటల్లో ఎన్నదగిన పొగాకును పండించడంలో కూడా ఆంధ్రప్రదేశ్ అగ్రస్థానంలో ఉంది. ప్రకాశం, గుంటూరు జిల్లాల్లోని రైతులు పండించే శ్రేష్టమైన వర్జీనియా పొగాకుకు అంతర్జాతీయ విపణిలో మంచి గిరాకీ ఉంది.

కేంద్ర ప్రభుత్వం రూపొందిస్తున్న పంచవర్ష ప్రణాళికలు. ఆయా రాష్ట్రప్రభుత్వాలు తయారుచేస్తున్న వార్షిక ప్రణాళికలు వ్యవసాయాభివృద్ధికి అంతో యింతో దోహదం చేస్తున్నాయి. రాష్ట్రంలోని చిన్న రైతుల, సన్నకారు రైతుల, ఆధీనంలోని చీలికలు పేలికలుగా ఉన్న చిన్న చిన్న కమతాలు ఆధునిక వ్యవసాయ పద్ధతులకు యోగ్యంగాలేవు. బక్కచిక్కిన ఈ రైతుల ఆర్థిక పరిస్థితిని మెరుగుపరచడానికి "సన్నకారు రైతులు, వ్యవసాయ కార్మికుల అభివృద్ధి సంస్థ' (Marginal Farmers and Agricultural Labourerment Agency) చిన్న రైతుల సహాయసంస్థ (Small Farmers development agency) వంటి సంస్థలు కేంద్రప్రభుత్వసాయంతో రాష్ట్రంలో నెలకొన్నాయి. చిన్న కమతాలకు యోగ్యమైన వ్యవసాయ పద్ధతుల్ని ప్రోత్సహించడంలో, పాడిపరిశ్రమలో, గొర్రెల పెంపకంలో, కోళ్లపెంపకంలో, పండ్లతోటల పెంపకంలో, గ్రామీణ చేతివృత్తులు మొదలైన ఉప వృత్తులకు అవసరమైన పరపతి సౌకర్యాల్ని కలిగించి పేద రైతుల ఆదాయాన్ని మెరుగుపరచడంలో ఈ సంస్థలు కృషిచేస్తున్నాయి. సహకార పరపతి సంఘాలు, గ్రామీణబ్యాంకులు ఇందుకు దోహదం చేస్తున్నాయి.

ఈ శతాబ్దిలో అంతర్జాతీయ రాజకీయ పరిణామాలు; దేశంలోను, రాష్ట్రంలోను సంభవించిన కొన్ని పరిణామాలు రైతాంగాన్ని రైతుకూలీలను జాగృతం చేశాయి. సామాన్యుడికి సాంఘిక న్యాయాన్ని, ఆర్థిక న్యాయాన్ని అందజేసే చర్యల్లో భాగంగా జమీందారీ భూములు, ఈనాము భూములు, ఏజన్సీ ప్రాంతాల్లోని ఎస్టేట్లు, ముఠాలు, కౌల్దారీ వ్యవసాయ భూములు, దేవాదాయ ధర్మాదాయ వక్ఫ్ భూములు మొదలైన వాటికి సంబంధించి కొన్ని చట్టాలు వచ్చాయి. ఈ చట్టాల్లో కొన్ని లోపాల్ని పురస్కరించుకొని కొన్ని రాజకీయ పార్టీల వారు అఖిల భారత రైతు సంఘంవారు 1969-70 ప్రాంతాల్లో దేశ వ్యాప్తంగా భూ ఆక్రమణ పోరాటాలు సాగించారు. కాంగ్రెస్ పార్టీ చీలిక తర్వాత 1969 లో బొంబాయిలో జరిగిన కాంగ్రెస్ (ఐ) సమావేశం తీవ్ర భూసంస్కరణల్ని అమలు జరపడానికి తీర్మానం చేసింది. దీని తర్వాత రాష్ట్రాల ముఖ్య మంత్రుల సమావేశాల్లో జరిగిన చర్చల ఫలితంగా 'జాతీయ వ్యవసాయ సంస్కరణల కమీషన్' ఏర్పాటయింది. ఈ కమీషన్ సూచించిన మార్గదర్శక సూత్రాలు ప్రాతిపదికగా రాష్ట్రాల్లో భూగరిష్ఠ పరిమితి చట్టాలు అమలు జరిగాయి. ఆంధ్రప్రదేశ్‌లో ఈ చట్టం 1975 జనవరి 1వ తేదీ నుండి అమల్లోకి వచ్చింది. ఈ చట్టం వల్ల లభ్యమైన మిగులు భూముల్ని, బంజరు భూముల్ని భూమిలేనివారికి పంచిపెట్టడం. జరుగుతోంది. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చాక కొన్ని సంవత్సరాలుగా అపరిష్కృతంగాను, వివాదాస్పదంగాను ఉండిన 'చల్లపల్లి భూముల' ను మే 1985 లో భూమిలేని పేదలకు పంచడం జరిగింది.

BRAOU

### 25.3.2 శాస్త్రి సాంకేతిక పరిజ్ఞానం

ఆంధ్రదేశం సుదీర్ఘమైన సముద్రతీరం, సారవంతమైన భూములు, గోదావరి కృష్ణలవంటి మహానదులు, పుష్కలమైన అడవీ సంపద, భూగర్భ నిక్షేపాలవంటి ప్రకృతి వనరులతో సుసంపన్నమైంది. 18వ శతాబ్దిలో ఇంగ్లండులో సంభవించిన పారిశ్రామిక విప్లవంవల్ల కంపెనీవారి వాణిజ్యవిధానంలో గణనీయమైన మార్పు వచ్చింది. బ్రిటన్‌లోని పరిశ్రమల అవసరాలకు, బ్రిటిష్‌వారి ప్రయోజనాలకు అనుకూలంగా మలచిన ఆ విధానం భారతదేశాన్ని ముడివస్తువుల సరఫరాదారునిగాను, బ్రిటిష్ యంత్రోత్పత్తులకు వాడకందారుగాను మార్చివేసింది. 1813 దరిమిలా ఏర్పడిన ఈ పరిస్థితులవల్ల భారతదేశంలోని వస్తుసంపద కొల్లపోయింది. ముడిప్రత్తి, సిల్కు, నీలిమందు మొదలైనవాటిని భారీఎత్తున బ్రిటిష్ పరిశ్రమల అవసరాలకోసం ఎగుమతి చేశారు. భారతీయ ఉత్పత్తులపై బ్రిటనులో దిగుమతి సుంకాల్ని ఎక్కువగా విధించడం మొదలైన వాణిజ్య విధానాలు చేనేత మొదలైన దేశీయవృత్తుల క్షీణతకు కారణాలయ్యాయి. ఆయా వృత్తుల్ని ఆశ్రయించి ఉండిన నిపుణులైన పనివారు క్రమంగా ఉపాధికోల్పోయారు.

18, 19 శతాబ్దాల్లో యూరపు దేశాలు వైజ్ఞానికంగా పురోగమించాయి. ఈ శాస్త్రి వైజ్ఞానిక ప్రగతిని పరిశ్రమల్లో వినియోగించుకోవడంద్వారా అవి గొప్ప ఉత్పాదకశక్తిని సాధించాయి. ఇది యూరపుదేశాల

రూపురేఖల్నే మార్చివేసింది. విజ్ఞాన తాత్వికరంగాల్లో ఒకప్పుడు ప్రపంచదేశాలకు మార్గదర్శకంగా ఉండిన భారతదేశం ఈ కాలంలో భౌతిక, సామాజిక శాస్త్రాల్లో యూరపుదేశాలకంటె ఎంతో వెనుకబడిపోయింది. బ్రిటిష్‌వారు రూపొందించిన వలస విధానం, సంప్రదాయవాదులైన కొంతమంది రాజకీయ పక్షాలకు చెందిన నాయకుల, అధికారుల సంకుచిత దృక్పథంవల్ల భారతదేశంలో ఆధునిక శాస్త్రీ విజ్ఞాన అధ్యయనానికిగాని, ఆధునికీకరణకుగాని తగిన ప్రయత్నాలు జరగలేదు.

1820 తర్వాత బ్రిటనులో సంస్కరణాభిలాషులైన 'విగ్' రాజకీయ పక్షంవారు అధికారంలోకి రావడంతో భారతదేశంలో ఆధునిక శాస్త్రీ సాంకేతిక విజ్ఞాన వ్యాప్తికి అవకాశం కలిగింది. దీనికి కొంతమంది కంపెనీ అధికారులు కూడా దోహదం చేసారు. రైల్వేల నిర్మాణం (1853), పోస్ట్ అంటే టెలిగ్రాఫ్ వ్యవస్థ ప్రారంభం (1854), విద్యావిధానాన్ని గూర్చి వెలువడిన అధికార ప్రకటన (1857) మొదలైన చర్యలు దేశంలో శాస్త్రసాంకేతిక విజ్ఞాన వ్యాప్తికి కొత్త పుంతలు తొక్కాయి.

18, 19 శతాబ్దాల్లో యూరప్ దేశాలు వైజ్ఞానిక ప్రగతిని పరిశ్రమల్లో వినియోగించుకోవడం ద్వారా గొప్ప ఉత్పాదక శక్తిని సాధించాయి. పారిశ్రామికాభివృద్ధికి ముఖ్యాధారమైన ఖనిజ సంపదకోసం బ్రిటిష్ వారు ఈ కాలంలో తమ వలస దేశాల అన్వేషణ సాగించారు. దీని పర్యవసానంగా ఆంధ్రదేశంలో భూగర్భ పరిశోధనలు జరిగాయి. సహజ వనరులలో కెల్లా కీలకంగా పరిగణింపబడే ఖనిజ సంపద ఆంధ్రదేశంలో పుష్కలంగా ఉన్నట్లు ఈ కాలంలో జరిగిన పరిశోధనలు వెల్లడించాయి. బొగ్గు, మాంగనీసు, అభ్రకం, సున్నపురాయి, రాతి నార వంటి ఖనిజాల తవ్వకం ఈ కాలంలో ఆరంభమైంది. ఈ వస్తు సంపద పారిశ్రామిక రంగంలో అప్పుడే కాలుమోపిన రాష్ట్ర అవసరాల కంటే బ్రిటన్ వంటి విదేశాలకే ఎక్కువగా వినియోగింపబడింది.

పారిశ్రామిక ప్రగతికి ముఖ్యావసరమైన బొగ్గు ఉత్పత్తి ఆంధ్రదేశంలో 19వ శతాబ్ది చివర ప్రారంభమైంది. స్థానికుల ఆచూకీని పురస్కరించుకొని ఖమ్మం జిల్లా ఎల్లందు పరిసర ప్రాంతాల్లో భారత భూగర్భశాఖకు చెందిన డాక్టర్ కింగ్ పరిశోధనలు జరిపి అక్కడ బొగ్గు నిక్షేపాలున్నట్లు నిర్ధారించారు. 1889లో అక్కడ ప్రారంభించబడిన ప్రధానమైన బొగ్గు గనికి వారి పేరే పెట్టారు. ఈ కుగ్రామ పరిసరాలలో ఉద్భవించిందే నేటి 'సింగరేణి కాలరీస్'. 1921లో ప్రారంభించబడిన యిది మన రాష్ట్ర పారిశ్రామిక చరిత్రలో నూతనాధ్యాయాన్ని తెరిచింది. కొంతమంది యూరోపియన్లు స్థానిక భూస్వాముల సహకారంతో నెల్లూరు జిల్లాలో అభ్రకం కోసం అన్వేషణ జరిపారు. వారి కృషి ఫలితంగా 1887లో ఇంకుర్తి వద్ద "డి" మైనులో అభ్రకం తవ్వకం ఆరంభమైంది. దాన్ని లండన్, హాంబర్గ్ వంటి నగరాలకు ఎగుమతిచేసే వారు. ఈ శతాబ్ది ప్రారంభానికి కడప, కర్నూల్, అనంతపూరు ప్రాంతాలలో ముగ్గురాయి, రాతినార వంటి ఖనిజ నిక్షేపాలు బయటపడ్డాయి. 1925 ప్రాంతాల్లో రాతినార గనుల తవ్వకంలో విశేషమైన కృషి చేసిన కడపజిల్లాకు చెందిన కె. కిష్టప్ప 'రాతినారకిష్టప్పగా' పేరు పొందారు. ఈ విధంగా ఈ కాలంలో ఆంధ్రదేశంలో భూగర్భ నిక్షేపాల తవ్వకం ఆరంభమైంది.

20వ శతాబ్ది ప్రారంభంలో ఆంధ్రదేశంలో నెలకొన్న కొన్ని కళాశాలలు శాస్త్ర, సాంకేతిక రంగాలలో పరిశోధనకు నాంది పలికాయి. ఈ సందర్భంగా ఆంధ్రదేశంలో వైజ్ఞానిక రంగంలో విజయనగరం మహారాజా కళాశాలలో జరిగిన మౌలికమైన కృషిని తెలుసుకోవడం అవసరం. 1918లో ఈ కళాశాలలో విజయనగరం రాజా ఆర్థికసహాయంతో భౌతికశాస్త్ర విభాగంలో రీసెర్చి లేబొరేటరీ ఏర్పాటయింది. 1912లో ఈ కళాశాలలో భౌతికశాస్త్ర విభాగాధిపతిగా ఉండిన డాక్టర్ ఏ.ఎల్. నారాయణ దృగ్గోచర అల్ట్రావైలెట్ ప్రాంతాలపై పరిశోధన జరిపారు. ఈ మౌలిక పరిశోధనకు గాను వారికి 1924లో మద్రాసు విశ్వవిద్యాలయం డి.ఎస్సి., డిగ్రీని ప్రదానం చేసింది. డాక్టర్ ఆఫ్ సైన్స్ డిగ్రీని పొందిన మొదటి ఆంధ్రుడు కూడా వారే. విజయనగరం కళాశాలలో డాక్టర్ నారాయణ సహపరిశోధకులైన డాక్టర్ కె. రంగమాధవ రావు లండన్‌లోని ఇంపీరియల్ శాస్త్ర కళాశాలలో ప్రఖ్యాత అణుభౌతిక శాస్త్రవేత్త ఐన ఏ.పోలార్ పర్యవేక్షణలో డి.ఎస్సి., డిగ్రీ పొందారు. 1932లో ఆంధ్ర విశ్వవిద్యాలయ ప్రాంగణంలో నెలకొన్న జయపూర్ విక్రందేవ్‌శాస్త్ర, సాంకేతిక కళాశాల కూడా శాస్త్ర పరిశోధనలో కొత్తదారులు తొక్కింది. ప్రఖ్యాత భౌతికశాస్త్రవేత్త సర్. సి.వి. రామన్ గౌరవాచార్యులుగా పనిచేసిన ఈ కళాశాలలో వర్ణమాలా దర్శిని (Spectrascope), రామన్ ఎఫెక్టులపై విలువైన పరిశోధనలు జరిగాయి. 1947 ప్రాంతంలో ప్రఖ్యాత శాస్త్ర వేత్త సూరి భగవంతం ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఆచార్య పదవిని అధిష్టించడంతో అక్కడ కూడా శాస్త్ర సాంకేతిక రంగాలలో పరిశోధన కొత్త ఊపిరి నింపుకొంది.



BRAOU

ఇరయ్యో శతాబ్ది ప్రారంభంనుండి ప్రపంచ వ్యాప్తంగా జరిగిన పరిశోధనలు, స్వాతంత్ర్యానంతరం భారత దేశం సాధించిన వైజ్ఞానిక పురోగతి, ఆంధ్ర రాష్ట్రంలోని వస్తుసంపదపై ప్రభావాన్ని కనబరచాయి. ఈ పరిశోధనల వల్ల ఆంధ్రప్రదేశ్‌లోని భూగర్భ నిక్షేపాలు, సముద్రతీర రేఖ, అటవీ సంపద, ప్రాముఖ్యానికి వచ్చాయి. ఈ వస్తు సంపద ఇరవయ్యో శతాబ్ది ప్రారంభంలో పాశ్చాత్య దేశాల ప్రయోజనాల కోసం ఎక్కువగా కొల్లపోయింది. కాని, నేడు రాష్ట్ర, దేశ అవసరాలకిది ప్రధానంగా వినియోగపడుతోంది.

నేల బొగ్గు లభించే గోండ్వానా శిలా సముదాయం గోదావరి లోయలో పదివేల కిలోమీటర్ల వైశాల్యం ఆవరించి ఉంది. ప్రపంచంలో కెల్లా శ్రేష్ఠమైన ముగ్గురాయి (Barvters) కడప జిల్లాలోని మంగంపేట గనుల్లో లభ్యమవుతోంది. ఈ భూగర్భ నిక్షేపాలు ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక ప్రగతికి దోహదం చేస్తున్నాయి. బొగ్గు ముఖ్యాధారంగా రామగుండంలో నెలకొన్న ఎరువుల కర్మాగారం ఆ తరహా వాటిలో ప్రపంచంలో కెల్లా పెద్దది. అక్కడే థర్మల్‌విద్యుత్ కేంద్రానికి కూడా స్థాపించారు. దేశంలో స్పాంజ్ ఇనుమును తయారుచేసే ఒక కర్మాగారం ఆంధ్రప్రదేశ్‌లో (పాల్వంచ) ఉంది. కేంద్ర రంగంలోని ఇంధన సహజ వాయువుల సంస్థ (Oil and Natural Gas Commission) జరిపిన అన్వేషణ ఫలితంగా 1987లో కృష్ణా, గోదావరీ డెల్టా ప్రాంతాల్లో ఇంధన సహజ వాయువులు బయటపడ్డాయి. ఆంధ్రదేశంలోని అటవీ సంపద కాగితం, ప్లైవుడ్, రేయాన్‌ల ఉత్పత్తికి పనికి వస్తుంది. కేంద్రక్షార సముద్ర రసాయనాల పరిశోధన సంస్థ (Central Salt and Marine Chemicals Research Institute) తీరాంధ్రంలోని సముద్ర జలాల్ని గూర్చి పరిశోధనలు చేస్తోంది. దీని ఫలితంగా సముద్ర జలాల నుండి భారీఎత్తున సోడియం క్లోరైడ్, మెగ్నీషియం, బ్రోమిన్ వంటి రసాయనాల్ని అతి తక్కువ ఖర్చుతో ఉత్పత్తి చేయడానికి వీలుంది. చాలా పొడవైన కన్వేయర్ బెల్ట్ సౌకర్యమూ, లోతైన ఔటర్ హార్బరూ ఉన్న విశాఖపట్నం రేవు నేడు ఆసియా ఖండంలో కీలక ప్రాధాన్యం పొందింది. ఇది భారతనౌకాదళం తూర్పు విభాగానికి కేంద్రం.

ఆంధ్రప్రదేశ్ అవతరణ తర్వాత శాస్త్ర, సాంకేతికరంగాల్లో విరివిగా పరిశోధనలు జరుగుతున్నాయి. దేశంలో కెల్లా మొదట మన రాష్ట్రంలోనే 1963 లో సైన్సు అకాడమి ఏర్పాటయింది. భూగర్భ శాస్త్ర, అధ్యయ నానికి వివిధ లోహాల ధర్మాలను పరిశీలించడానికి హైదరాబాద్ నగరంలో ఉన్నన్ని పరిశోధక సంస్థలు దేశంలో మరెక్కడా లేవు. దేశంలో కెల్లా ప్రథమంగా కంప్యూటర్లను తయారు చేసిన ఘనత హైదరాబాద్‌లోని E.C.I.L. సంస్థకు దక్కింది. దేశంలోని అణు రియాక్టర్లకు అవసరమైన ఇంధనాన్ని తయారు చేసే అణు ఇంధన సంస్థ (Nuclear Fuel Complex) హైదరాబాద్‌లో ఉంది. భారత దేశపు మొదటి ఉపగ్రహం (Satellite) 'రోహిణి'ని శ్రీహరి కోట (నెల్లూరు జిల్లా) రాకెట్ ప్రయోగ కేంద్రం నుండి విజయవంతంగా ప్రయోగించారు. ఈ విధంగా నేడు శాస్త్ర, సాంకేతిక రంగాల్లో జరుగుతున్న పరిశోధనలవల్ల లభ్యమవుతున్న విజ్ఞానం ఆంధ్రప్రదేశ్‌లోని విస్తార వస్తుసంపద రాష్ట్రావసరాలకే గాక భారతదేశ సౌభాగ్యానికి కూడా దోహదం చేస్తున్నాయని చెప్పవచ్చు.

BRAOU

### 25.3.3 వృత్తులు – గ్రామీణ వ్యవస్థ

ఈ కాలంలో గ్రామీణ వ్యవస్థ మార్పుకు లోనైంది. స్వయంసంపూర్ణ గ్రామీణ వ్యవస్థ సడలిపోవడంతో గ్రామాలు సాంఘికంగా, ఆర్థికంగా, రాజకీయంగా బాహ్యస్థితి గతుల ప్రభావానికి లోనయ్యాయి. దేవాలయాలు, నీటి వనరులు మొదలైన సాముదాయక విషయాల పట్ల గ్రామస్థుల్లో సమిష్టి బాధ్యత అంతరించింది. 1800 నాటికి దేశం మొత్తం మీద సివిల్, క్రిమినల్ వ్యవహారాల్ని పరిష్కరించడానికి సదర్ అదాలత్, ఫౌజ్‌దారి అదాలత్ కోర్టులు నెలకొల్పడంతో గ్రామ పంచాయితీలు నామమాత్రమై పోయాయి. గ్రామస్థులు తగాదాల్ని పరిష్కరించు కోవడానికి రచ్చకెక్కవలసి వచ్చింది. ప్రాచీన గ్రామీణవ్యవస్థలో అందరిని ఒక్కటిగా కలిపి ఉంచిన అంతస్సూత్రం ఈ కాలంలో విచ్ఛిన్నమైంది.

స్వయం సంపూర్ణమైన గ్రామ వ్యవస్థలో ప్రజలకు కావలసిన వస్తువుల్ని ఉత్పత్తి చేయడానికి వివిధ వృత్తులవారు ఉండేవారు. ఆయా వృత్తుల్ని బట్టి, సామాజిక అవసరాల్ని బట్టి పన్నిద్దరు అయ్యగార్లు (రెడ్డి, కరణం, తలారి, తోటి, పురోహితుడు, బడిపంతులు, పంచాణం వాళ్ళు, కమ్మరి, వడ్రంగి, (అగ) సాలె, రజకుడు, నాయీ బ్రాహ్మణుడు, వైద్యుడు, దేవదాసి) ఉండేవారు. గ్రామీణ వ్యవస్థలో వచ్చిన మార్పులు, పాశ్చాత్య వాణిజ్య సంఘాలు నిర్వహించిన వర్తక వ్యాపారాలు 18వ శతాబ్దిలో ఇంగ్లండులో సంభవించిన పారిశ్రామిక విప్లవం మొదలైనవి ఆంధ్రదేశంలోని వివిధ వృత్తులపై ప్రభావాన్ని కనబరచాయి.

18వ శతాబ్దిలో పాశ్చాత్య కంపెనీల వర్తక వ్యాపారాలు వల్ల ఆంధ్రదేశంలో చేనేత వృత్తి ఎంతో మందికి

ఉపాధిని కల్పించింది. పెద్దాపురం సిల్కు వస్త్రాలకు, శ్రీకాకుళం చీటీలకు (సన్నని వస్త్రాలు), బందరు కలంకారీ బట్టలకు, నెల్లూరు రుమాళ్ళకు (చేతి గుడ్డలు), ఇంజరం (తూర్పుగోదావరి)లో తయారయ్యే తివాసీలకు, కర్నూలు ఆదోని ప్రాంతాల్లో తయారయ్యే రగ్గులకు కూడా మంచి మన్నన ఉండేది. సాలీలు, దేవాంగులు, సాతానులు, హరిజనులు, ముస్లిములు మొదలైనవారి వృత్తుల్ని ఆధారంగా చేసుకొని జీవించే వారు. పారిశ్రామిక విప్లవం, తదనుగుణంగా ఇంగ్లీషువారు అనుసరించిన వాణిజ్య విధానం చేనేత పరిశ్రమ సంక్షోభానికి గురి అయ్యేలా చేశాయి. దేవాంగులు, సాలీలు మొదలైన వారికి ముఖ్యవృత్తిగాను, సన్నకారు రైతులకు ఉపవృత్తిగాను ఉండిన చేనేత పరిశ్రమ అడుగంటడంతో గ్రామీణుల ఆర్థిక పరిస్థితి చితికిపోయింది. విదేశాల్లో యంత్రాల ద్వారా తయారయ్యే చౌక యినుము దిగుమతి కావడంతో దేశీయమైన ఇనుప పరిశ్రమ దెబ్బతినింది. పాశ్చాత్య దేశాల్లోని ఆవిరి ఓడల వల్ల గోదావరి ముఖద్వారంలోని కోరంగి, నరసాపురం (పశ్చిమ గోదావరి) ప్రాంతాల్లో ఓడల నిర్మాణం అంతరించింది.

19వ శతాబ్ది చివర గ్రామీణుల ఆర్థిక సౌష్ఠవానికి దోహదం చేసిన కొన్ని వృత్తులు అంతరించాయి. కొన్ని సన్నగిల్లాయి. ఆయా వృత్తుల్ని ఆశ్రయించినవారు కడుపుచేతబట్టుకొని వలస పోవడమో వ్యవసాయ కూలీలుగా మారడమో జరిగింది. ఈ పరిణామాలు గ్రామీణ వృత్తుల పతనానికి, గ్రామీణ ఆర్థికవ్యవస్థ విచ్ఛిత్తికి కారణా లయ్యాయి.

ప్రాచీన గ్రామీణ వ్యవస్థలో వ్యవసాయదారునికి భిన్నవృత్తులు వారికి మధ్య ఉండిన ఆధారాధేయ సంబంధం ఈ కాలంలో పూర్తిగా విచ్ఛిన్నమైంది. భూముల క్రయ విక్రయాలకు అవకాశం లభించినందువల్ల కులాల సమతూకం తారుమారైంది. గ్రామీణ వృత్తులు దెబ్బ తిన్నందువల్ల, విద్యార్జనావకాశాలు మెరుగైనందువల్ల, పట్టణ ప్రాంతాల్లో కొత్త వృత్తులకు ఆస్కారం కలిగినందువల్ల ఈ కాలంలో గ్రామీణ వ్యవస్థలో మార్పు వచ్చింది. దీనివల్ల కులానికి వృత్తికి మధ్య ఉండిన సంబంధం తెగిపోయింది. బ్రిటిష్‌వారు అనుసరించిన వాణిజ్య విధానం వల్ల సాంప్రదాయిక వృత్తుల్ని అనుసరిస్తూ ఉండిన ఎంతో మంది వ్యవసాయ కూలీలుగా మారిపోయారు. జనాభా పెరుగుదల వల్ల ప్రజలు కుల విషయాలకు విరుద్ధంగా జీవనోపాధికి సంబంధించి ఒక వృత్తిని అవలంబించ వలసి వచ్చింది.

బ్రిటిష్ వారు ప్రవేశ పెట్టిన స్థానిక స్వపరిపాలనలో భాగమైన గ్రామ పంచాయితీలు, రైతులకు కొంతవరకు అందుబాటులోకి వచ్చిన పరిశోధనాధారమైన శాస్త్ర విజ్ఞానం, రైతుల ఆర్థిక పరిస్థితిని మెరుగుపరచ డానికి ఏర్పడిన పరపతి సౌకర్యాలు, రైతులు పండించిన వాణిజ్య పంటలు, రవాణా సౌకర్యాలు మొదలైనవన్నీ గ్రామీణ వ్యవస్థమీద సమష్టిగా ప్రభావాన్ని కనబరచాయి. దారిద్ర్యం కర్మఫలంకాదన్న సత్యం గ్రామీణుల అనుభవంలోనికి వచ్చినందువల్ల వారి ఆలోచనాసరళిలో మార్పు వచ్చింది. గ్రామీణ వ్యవస్థమీద బాహ్య పరిస్థితుల ప్రభావం అధికమైన ఈ కాలంలో గ్రామీణులు పట్టణాలమీద ఆధారపడవలసి వచ్చింది. విద్య, వైద్యం, వ్యాపారం, వినోదం మొదలైన వాటి కోసం వారు పట్టణాలవైపు మొగ్గుచూపారు. వ్యవసాయ రంగంలోను, సాంప్రదాయకమైన వృత్తులలోను ఉపాధి లభించని గ్రామీణులు చాలా మంది ఈ కాలంలో పట్టణాలకు వలస వెళ్ళారు. గ్రామీణుల నిస్సహాయమైన ఈ పరిస్థితినే కొనకళ్ల వెంకటరత్నంగారు 'వెళ్ళిపోదామా' (పట్నాలకు) అనేపాటలో 'ఒళ్ళు పెంచిన గడ్డమీదే ఒరిగిపోయ్యే రాతలేదో, ఊరుగానీ ఊరిలో చితిపేర్చు కొమ్మని నొసటి వ్రాలో' అని దయనీయంగా చిత్రించారు.

ఈ కాలంలోనే "కమ్మరి కొలిమీ, కుమ్మరి చక్రం, జాలరిపగ్గం, సాలెల మగ్గం, శరీర కష్టం స్ఫురింప జేసే గొడ్డలి, రంపం, కొడవలి, నాగలి" మొదలైన 'సహస్రవృత్తుల సమస్త చిహ్నాలు (ప్రతిజ్ఞ - శ్రీశ్రీ)' పరిణామానికి లోనయ్యాయి.

ఆంధ్రదేశంలోని జనాభాలో ఎనభై శాతం మంది గ్రామాల్లో నివసిస్తున్నారు. ఇరుగు పొరుగు రాష్ట్రాలతో పోలిస్తే ఆంధ్రప్రదేశ్‌లో గ్రామీణ జన సాంద్రత కూడా ఎక్కువే. రాష్ట్రంలో నగరీకరణ ప్రక్రియ ఎక్కువ వేగాన్ని

అందుకో లేదన్న సంగతిని ఈ అంశాలు సూచిస్తున్నాయి. స్వాతంత్ర్యానంతరం నుండి రాష్ట్రంలో అమలు జరుగుతున్న అభివృద్ధి పథకాల ద్వారా వ్యవసాయం, రహదారులు, రవాణా, సాంఘిక వసతులు మొదలైన వాటిల్లో మార్పులు కలిగాయి. ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వ్యవస్థ నవీకరణకు తోడ్పడిన యివి గ్రామీణ సంస్కృతిపై కూడా ప్రభావాన్ని కనబరిచాయి.

ఎక్కువ మందికి చదువుకొనే అవకాశం కలగడం వల్ల కొన్ని వృత్తుల్ని ఆశ్రయించి సాంఘికంగాను, ఆర్థికంగాను వెనుకబడిన కొన్ని కులాల వారికి ప్రభుత్వం రిజర్వేషను సౌకర్యాన్ని కల్పించినందువల్ల ఈ కాలంలో గ్రామీణ వృత్తుల్లో మార్పు కలిగింది. జనాభా పెరుగుదల, భూమి కొరత, నిరుద్యోగం మొదలైన కారణాలవల్ల కూడా వృత్తికి కులానికి మధ్య ఉండిన సంబంధం తెగిపోయింది. గ్రామీణ ప్రాంతాల్లోని నిరుద్యోగులైన యువకులకు ఉపాధి కల్పించడానికి ప్రభుత్వం అమలు జరుపుతున్న 'గ్రామోదయ' వంటి పథకాల వల్ల కూడా భిన్న కులాల వారు భిన్న వృత్తుల్ని చేపట్టడానికి ఆస్కారం కలిగింది. ఒకప్పుడు గ్రామీణులకు ముఖ్య ఉపవృత్తిగా ఉండి వారి ఆర్థిక స్వాస్థ్యానికి దోహదం చేసిన చేనేత పరిశ్రమ స్థానంలో నూతన వృత్తులు చోటు చేసుకొన్నాయి. జాతీయ పాడి పరిశ్రమాభివృద్ధి సంస్థ సహకారంతో ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వం అమలు జరుపుతున్న పాలవెల్లువ పథకం గణనీయమైన ఫలితాన్ని సాధించింది. దీని ఫలితంగా ఎంతో మంది సన్నకారు రైతులు, బలహీన వర్గాల వారు పశు పోషణను ఒక ముఖ్య ఉపవృత్తిగా చేపట్టారు, అలాగే కోళ్ళ పెంపకం, చేపల పెంపకం వంటి వృత్తులు వ్యవసాయానికి అనుబంధంగా పెంపొందాయి. సన్నకారు రైతులకు, బలహీన వర్గాల వారికి ప్రభుత్వం కల్పిస్తున్న రాయితీలు, జాతీయ బ్యాంకులు అందజేస్తున్న రుణాలు ఈ నూతన వృత్తుల అభివృద్ధికి దోహదం చేస్తున్నాయి. ఒకప్పుడు నగర వాసులకు మాత్రమే అందుబాటులో ఉండిన రేడియో, ట్రాన్సిస్టరు, బాయిలరు, ఫ్యాను వంటి ఆధునిక జీవితావసర వస్తువులు రైతులకు అందుబాటులోనికి వచ్చాయి. దీని ఫలితంగా గ్రామీణుల జీవన శైలి మార్పుకు లోనైంది.

స్వాతంత్ర్యానంతరం పాలనాపరంగా ప్రభుత్వం ప్రవేశ పెట్టిన చట్టాలు, సంస్కరణలు కూడా గ్రామీణ వ్యవస్థలో మార్పుల్ని తెచ్చి పెట్టాయి. గ్రామీణ వ్యవస్థపై ప్రభావాన్ని నెరపిన జమీందారి విధానాలు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చేసిన కొన్ని చట్టాలవల్ల ఈ కాలంలో రద్దయ్యాయి. తెలంగాణా సాయుధ పోరాటం భూ సంస్కరణ, సార్వజనీన వయోజన ఓటింగ్ హక్కు మొదలైనవి గ్రామీణ వ్యవస్థలో భూకామందుల ఆధిపత్యాన్ని కొంతమేరకు తగ్గించాయి. 1959 నవంబరు ఒకటవ తేదీన ఆంధ్రప్రదేశ్ ప్రవేశ పెట్టిన పంచాయతీరాజ్ వ్యవస్థ కూడా గ్రామీణ వ్యవస్థపై ప్రభావాన్ని కనబరచింది. 1975లో కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన ఇరవై అంశాల ఆర్థిక కార్యక్రమం, ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేసిన గ్రామాధికారుల వ్యవస్థ గ్రామీణుల సాంఘిక జీవనం పై ప్రభావాన్ని కనబరచాయి. రాష్ట్రంలో పరిపాలన యంత్రాంగాన్ని వికేంద్రీకరించడంలో అతి ముఖ్యమైన చర్యగా ఇటీవల ప్రభుత్వం రెవిన్యూమండల వ్యవస్థను ఏర్పాటు చేసింది. దీని పర్యవసానంగా రాష్ట్రంలో ప్రస్తుతమున్న 1,084 ఫిర్కాలు, 305 తాలూకాలు రద్దయినాయి. 1985 మే 25వ తేదీ నుండి నాటి స్థానంలో 1,104 రెవెన్యూ మండలాలు ఏర్పాటయ్యాయి.

స్వాతంత్ర్యానంతరం ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ పారిశ్రామిక రంగాల్లో అభివృద్ధి పొందింది. ఆర్థిక సామాజిక అవసరాలకు అనుగుణంగా ప్రభుత్వ రంగంలో రాష్ట్ర ద్రవ్య సహాయ సంస్థల, స్టేట్ ట్రేడింగ్ కార్పొరేషన్, నిత్యావసర వస్తువుల పంపిణి సంస్థలు నెలకొన్నాయి. ఇవి కాక వస్తువుల పంపిణీకి సహకార రంగంలో 'జనతా బజారు' వంటి సహకార సంస్థలు రూపు దాల్చాయి. వ్యవసాయోత్పత్తుల అమ్మకం మొదలైన వాటిని క్రమబద్ధం చేయడానికి వ్యవసాయ మార్కెట్ కమిటీలు ఏర్పాటయ్యాయి. ప్రైవేటు ప్రభుత్వరంగాలకు సంబంధించిన వర్తక వాణిజ్యాల్ని, ఎగుమతి దిగుమతుల్ని సమన్వయం చేయడానికి వాణిజ్య మండలాలు కూడా ముఖ్య పాత్ర నిర్వహిస్తున్నాయి. ఆంధ్రదేశంలో వర్తక వాణిజ్యాల అభివృద్ధికి బ్యాంకులు ముఖ్య పాత్ర వహిస్తున్నాయి. ప్రముఖ కాంగ్రెస్‌వాది ఐనా డా. భోగరాజు పట్టాభిసీతారామయ్య 'ఆంధ్రాబ్యాంకు' వ్యవస్థాపకుల్లో ఒకరు. నేడు దేశంలో

BRAOU

ఉత్తర ప్రదేశ్, బీహార్‌ల తర్వాత ఆంధ్రప్రదేశ్‌లోనే 'స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా', శాఖలు ఎక్కువగా ఉన్నాయి. 1976 నాటి ప్రాంతీయ గ్రామీణ బ్యాంకుల చట్టం ప్రకారం ఆంధ్రదేశంలో కొన్ని జిల్లాలలో నెలకొల్పిన గ్రామీణ బ్యాంకులు గ్రామీణులకు పరపతి సౌకర్యాల్ని సమకూరుస్తున్నాయి.

1983లో 'ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్' వారి అంచనాల ప్రకారం వరలక్ష్మి పత్తి, వర్జీనియా పొగాకు, పసుపు, పళ్ళరసాలు, మొలాసిస్ మొదలైనవి రాష్ట్రేతర ప్రాంతాలకు, విదేశాలకు ఎక్కువగా ఎగుమతి అయ్యాయి. డైరెక్టర్ ఆఫ్ కామర్స్ అండ్ ఎక్స్‌పోర్ట్స్ వారి అంచనాల ప్రకారం 1981-82 నాటికి ఎగుమతుల విలువ 329-96 కోట్ల రూపాయలకు చేరుకొంది.

**25.3.4 వర్తక వాణిజ్యాలు**

మనకున్న సుదీర్ఘ సముద్రతీరం ఆంధ్రదేశ వర్తక వాణిజ్యాలపై ప్రభావాన్ని కనబరచింది. కోస్తా ప్రాంతంలోని అడవుల్లో లభించే శ్రేష్ఠమైన టేకు, కలప ఓడల పడవల నిర్మాణానికి కోస్తా వెంబడి విస్తారంగా ఉండే తాటి కొబ్బరి చెట్లు దొన్నెలు చేయడానికి అనువైనందువల్ల కోస్తా వ్యాపారం అభివృద్ధి చెందింది. కంపెనీ పాలన ప్రారంభంలో భూమార్గాలు నిర్లక్ష్యానికి గురికావడం, అప్పటికి రైలు మార్గాలు లేకపోవడం మొదలైన కారణాల వల్ల తీరాంధ్రదేశంలోని రేవు పట్టణాలు వర్తక వాణిజ్యాలకు ముఖ్య కేంద్రాలుగా ఉండేవి. 18వ శతాబ్దిలో పాశ్చాత్య వాణిజ్య సంఘాలు నిర్వహించిన వర్తక వాణిజ్యాల వల్ల తూర్పు తీరంలోని పులికాటు, పెద్దపల్లి (నిజాం పట్నం), మచిలీపట్నం, మాధవాయ పాలెం, నరసాపురం, జగన్నాథపురం (కాకినాడ), విశాఖపట్నం, కళింగ పట్నం రేవులు మంచి దశలో ఉండేవి. ధాన్యోత్పత్తులు, సముద్రపుటుప్పు, నీలిమందు, వజ్రాలు చేనేత వస్త్రాలు మొదలైనవి ఆయా రేవుల నుండి ఎగుమతి అయ్యేవి. తీరాంధ్రంలోని ఈ రేవులు యూరపు దేశాలతోను, భారతదేశంలోని ఇతర రేవుపట్టణాలతోను, దక్కను సుబాలోని రాష్ట్రాలతోను జరిగే వ్యాపార సబంధమైన లావాదేవీలకు, ఎగుమతి దిగుమతులకు కేంద్రాలుగా ఉండేవి.

18వ శతాబ్దిలో ఇంగ్లండులో సంభవించిన పారిశ్రామిక విప్లవం, తత్ఫలితంగా కంపెనీవారు అనుసరించిన వాణిజ్యవిధానం దేశీయ పరిశ్రమల్ని దెబ్బతీశాయి. దేశీయఉత్పత్తులు అంతర్జాతీయ విపణిలో యంత్రోత్పత్తుల పోటీకి నిలవలేకపోయాయి. ఈ కాలంలో ఆంధ్రదేశంలో తరచుగా సంభవించిన క్షామాలవల్ల ధాన్యోత్పత్తి దెబ్బ తినింది. ఒకప్పుడు యూరపు మార్కెట్లకు ఎగుమతి అవుతూ ఉండినమల్లు బట్టలు, చీటీలు, తెల్ల తానులు మొదలైన వాటి ఎగుమతులపై ఎన్నో ఆంక్షల్ని విధించడంవల్ల, మిల్లు బట్ట దిగుమతి వల్ల చేనేత పరిశ్రమ సంక్షోభానికి గురి అయింది. ఉపాధి కోల్పోయిన కొన్ని వేల మంది నేత పనివారు విదేశాలకు వలస వెళ్ళారు. ఈ కారణం వల్ల ఆంధ్రదేశంలోని వర్తక వాణిజ్యాలు, వాటికి కేంద్రంగా ఉండిన తీరాంధ్రంలోని రేవు పట్టణాలు దెబ్బ తినడం జరిగింది. ఒక్క మచిలీపట్నం రేవు నుండే సాలీనా 30 లక్షల రూపాయలకిమ్మతు మేరకు జరుగుతూ ఉండిన ఎగుమతి వ్యాపారం 1843-44 నాటికి 2,750 రూపాయలకు పడిపోయింది. ఇతర రేవు పట్టణాల్లోని ఎగుమతి వ్యాపారం కూడా మందగించింది.

కంపెనీ పాలనలో జమీందార్లు కూడా నిరంకుశంగా వ్యవహరించారు. ఆహార ధాన్యాలు, పశువులు, ఉప్పు మొదలైన వాటి మీద వారు ప్రత్యేక సుంకాన్ని విధించే వారు. ఒక పద్ధతి లేకుండా వారు పన్నుల్ని గుంజుకోవడానికి ప్రయత్నించేవారు. ఈ కాలంలో గ్రామస్థాయిలో జరిగే సంతలు వర్తక వ్యాపారాలకు కేంద్రాలుగా ఉండేవి. 19వ శతాబ్ది ప్రారంభం నాటికి వర్తక వ్యాపారాల్లో వినిమయ పద్ధతి (సరకుల మార్పిడి) అంతరించి నగదు రూపంలో క్రయ విక్రయాలు జరగడం అధికమయింది. రవాణా సౌకర్యాలు మెరుగు పడినందువల్ల సార్థవాహుల (గుంపులు కట్టిపోయే వర్తకుల) సంఖ్య తగ్గింది.

వలసదేశాల్లో తమ యంత్రోత్పత్తులు అమ్ముడుపోవటానికి ఎన్నోరాయితీలను కల్పించిన బ్రిటిష్‌వారు విదేశాల్లో తయారయ్యే వస్తువుల దిగుమతులమీద తమదేశంలో ఎన్నో ఆంక్షల్ని అధిక సుంకాల్ని విధించారు.



BRAOU

దీనివల్ల వర్తకవాణిజ్యాలలో వారికి గుత్తాధిపత్యం లభించింది. వారు భారతదేశంలో చేతివృత్తులకు అవసరమైన ముడిసరుకుల ధరల్ని విపరీతంగా పెంచి సాంప్రదాయిక వృత్తుల్ని దెబ్బతీశారు.

"సీమనుండి వచ్చినారు తెల్లవారు
వర్తకమంచు చెప్పినారు తెల్లవారు
తక్కెడ చేతపట్టినారు తెల్లవారు
తప్పుడుదోవ తొక్కినారు తెల్లవారు". (స్వరాజ్యమంత్రము -వై. కృష్ణారావు - 1921)

అని బ్రిటిష్‌వారు అనుసరించిన దోపిడీవిధానాన్ని కవులు తీవ్రంగా నిరసించారు.

ఈ కాలంలో ప్రజల అభిరుచిలో కలిగిన మార్పుకూడా దేశీయ పరిశ్రమల్ని దెబ్బతీసింది. ధనికవర్గానికి చెందినవారు జమీందారులు ఇంగ్లండు మొదలైన విదేశాలలో తయారయ్యే విలాస సామాగ్రిమీద వ్యామోహం పెంచుకొన్నారు. సామాన్య ప్రజలుకూడా విదేశాలలో తయారయ్యే పింగాణీ సామానులు, సబ్బులు ఆట వస్తువులు, వస్త్రాలు మొదలైనవాటిని కొనుగోలు చేయడంతో స్వదేశ పరిశ్రమలు మూలపడినాయి. ఈ పరిస్థితుల్లోనే గాంధీజీ విదేశీవస్తు బహిష్కరణకు పిలుపునిచ్చాడు. స్వదేశీపరిశ్రమల పునరుద్ధరణలో భాగంగా ఖద్దరు ఉత్పత్తికి ఉద్యమ స్ఫూర్తిని కలిగించాడు. ఆంధ్రదేశంలో కవికొండల వెంకటరావు వంటి కవులు ఈ ఉద్యమాన్ని పాటలద్వారా ప్రచారం చేశారు.

బ్రిటిష్ పాలన చివరిదశలో ప్రయాణ సౌకర్యాలు, రవాణా సౌకర్యాలు, సమాచార సౌకర్యాలు వృద్ధి అయ్యాయి. 1947 నాటికి ఆంధ్రదేశంలో సుమారు 20,000 కి. మీ. పొడవైన రోడ్లు, 2500 కి. మీ. పొడవైన రైలు మార్గాలు, 1500 కి. మీ. పొడవైన సరుకుల రవాణాకు అనువైన కాలువలు ఏర్పాటయ్యాయి. దీనివల్ల గ్రామీణ ప్రాంతాల్లోని ఉత్పత్తిదారులు తమ ఉత్పత్తుల్ని దూరప్రాంతాలకు ఎగుమతిచేయడానికి తమ ఉత్పత్తులకు అవసరమైన వస్తువుల్ని దిగుమతి చేసుకోవడానికి వీలు కలిగింది. ఈ కాలంలో మెరుగైన వార్తా ప్రచార సాధనాలు, బ్యాంకింగ్ సౌకర్యాలు వర్తక వాణిజ్యాల అభివృద్ధికి దోహదం చేశాయి.

BRAOU

గ్రామీణ వృత్తులు అడుగంటిన ఈ కాలంలో యంత్రసహాయంతో పని చేసిన కర్మాగారాలు నెలకొల్పబడినాయి. బళ్ళారి, అనంతపురం, గుంటూరు ప్రాంతాల్లో పత్తిగింజల ఫ్యాక్టరీలు; రాజమండ్రిలో కాగితపుమిల్లు; విజయవాడలో సిమెంటుకర్మాగారం; ఉయ్యూరు, సామర్లకోటలో పంచదార ఫ్యాక్టరీలు ఈ కాలంలో నెలకొని ఆంధ్రదేశ పారిశ్రామికాభివృద్ధికి కొంతవరకు దోహదం చేశాయి. ఈ కాలంలో ఉస్మాన్ అలీఖాన్(1911-48) పాలనలో నిజాంరాష్ట్రం పారిశ్రామిక రంగంలో కాలుమోపింది. హైదరాబాద్‌లో చార్మినార్ సిగరెట్టు ఫ్యాక్టరీ, సిర్పూరు (కాగజ్‌నగర్) లో కాగితం పరిశ్రమ, బోధన్‌లో చక్కెర కర్మాగారం, వరంగల్లులో ఆజంజాహీ బట్టలమిల్లు తెరిచారు. గద్వాల, సిద్దిపేట, నిర్మల్ ప్రాంతాలలో చేనేత కుటీర పరిశ్రమల్ని పునరుద్ధరించారు.

వ్యవసాయ పారిశ్రామిక రంగాలలో కలిగిన మార్పులవల్ల, రవాణా సౌకర్యాలు మెరుగైనందువల్ల ఈ కాలంలో విదేశీ వ్యాపార స్వరూపంలో మార్పువచ్చింది. వస్త్రాలవంటి ఉత్పత్తి చేయబడిన వస్తువుల (Manufactured goods) ఎగుమతులు తగ్గుముఖం పట్టాయి. నూనెగింజలు, పత్తి, అభ్రకం, మాంగనీసు వంటి ముడి పదార్థాల ఎగుమతులు అధికమయ్యాయి. దిగుమతులలో ఉత్పత్తి చేయబడిన వస్తువుల దామాషా ఎక్కువైంది.

స్వాతంత్ర్యానంతరం భారతదేశం వివిధ రంగాల్లో సాధించిన పురోగతి వర్తక వాణిజ్యాల అభివృద్ధికి దోహదం చేసింది. స్వాతంత్ర్యానంతరం ప్రైవేటు రంగంతోబాటు ప్రభుత్వరంగం (Public Sector) కూడా వర్తక వాణిజ్యాలపై అదుపు సంపాదించింది. రాష్ట్రావసరాల్ని, దేశావసరాల్ని దృష్టిలో ఉంచుకొని ఎగుమతి దిగుమతులకు సంబంధించిన లావాదేవీలను క్రమబద్ధం చేయడానికి కేంద్రరాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో కొన్ని ఏజెన్సీలు ఏర్పడ్డాయి.

## 25.4.0 సామాజిక జీవనం

క్రీ. శ. 1800 నుండి 1980 ల దాకా మన సామాజిక జీవనంలో వచ్చిన పరిణామాలను తెలుసుకుందాం. తెలుగువారి కులవ్యవస్థ, కుటుంబ వ్యవస్థ, సంఘ సంస్కారం, విద్యలు, కళలు, వేడుకలు వినోదాలు, మతం, ఆచార వ్యవహారాలు ఏరకమైన మార్పులకు ఈ దశలో గురి అయ్యాయో ఈ ఉప విభాగాల్లో మీరు తెలుసు కుంటారు.

### 25.4.1 కుల వ్యవస్థ

18వ శతాబ్దిలో భారతదేశంలోని మిగిలిన ప్రాంతాల్లోలాగా ఆంధ్రదేశంలోనూ సాంఘిక జీవనంలో స్తబ్దత ఏర్పడింది. పరిణామశీలమైన సమాజంలో పాత విలువలకు కొత్త విలువలకు ఘర్షణ జరిగింది. ఒక సంధి కాలంగా దీన్ని పరిగణించవచ్చు. బ్రిటిష్ పాలన స్థిరీకరింపబడిన తర్వాతనే సాంఘిక జీవన విధానంలోను, అందులో ఒక భాగమైన కుల వ్యవస్థలోను మార్పు ప్రారంభమైంది.

ఈ కాలంలో అగ్ర వర్ణాల వారు తమ ప్రతిపత్తిని, ప్రత్యేక హక్కుల్ని నిలబెట్టుకోవడానికి ప్రయత్నించారు. దీని పర్యవసానంగా అగ్రకులాల వారికి కింది కులాల వారికి నడుమ ఉన్న అంతరం పెరిగిపోయింది. కులాచారాలు కఠినంగా అమలు జరుపబడిన ఈ కాలంలో సాంఘిక జీవనంలో విధి నిషేధాలు చోటు చేసుకున్నాయి. కుల సంఘాలు, పంచాయితీలు కుల నిబంధనల్ని అమలుపరిచాయి. వాటిని అతిక్రమించిన సందర్భాల్లో జరిమానాలు, ప్రాయశ్చిత్తాలు, కులబహిష్కరణలు విధింపబడేవి. వివాహాది శుభకార్యాల్లోనూ, అశుభకార్యాల్లోను తమకు రివాజు లేని మర్యాదల్ని, గౌరవబిరుదుల్ని, వాహనాధికారాల్ని ఒక కులం వారు వాడుక చేసిన సందర్భంలో మరో కులంవారు అడ్డు చెప్పేవారు. దీనిని పురస్కరించుకొని తరచుగా కలహాలు సంభవించేవి. 18, 19 శతాబ్దాల మధ్య కాలంలో కుల మర్యాదల కారణంగా ఇటువంటి ఘర్షణలు తరచుగా జరిగాయి. 1842 ప్రాంతంలో గుంటూరు జిల్లాలో మహానాటి వారికి (వ్యవసాయిక జాతులు) పంచాణం, వారికి (శిల్పులు) జరిగిన తగాదా గద్య చింతామణిలో ఉదాహృతమైన కొన్ని అర్జీలను బట్టి తెలుస్తుంది.

క్రైస్తవ మిషనరీల ప్రచారం, పాశ్చాత్య విద్యావ్యాప్తి, రవాణా సౌకర్యాలు, పట్టణ జీవనం, గ్రామీణ వృత్తుల విచ్ఛిత్తి మొదలైన కారణాలవల్ల 19 వ శతాబ్ది చివరకు కుల వ్యవస్థలోని కట్టుబాట్లు సడలడం ప్రారంభమైంది. ఈ కాలంలో తల ఎత్తిన మత సాంఘిక సంస్కరణోద్యమాలు, కొందరు సంస్కర్తల కృషి దీనికి దోహదం చేశాయి.

పాశ్చాత్య విద్యా విధానం, క్రైస్తవ మత ప్రచారం, నూతన ఆర్థిక వ్యవస్థ, సంఘసంస్కర్తల కృషి మొదలైన అంశాలు ఈ కాలంలో భారతీయ సాంఘిక వ్యవస్థను ప్రభావితం చేశాయి. చాలా కాలంగా హైందవ సమాజంలో గూడు కట్టుకొని ఉండిన కులవ్యవస్థను గూర్చిన ప్రజల ఆలోచనా సరళిలో మార్పు పొడసూపింది. దీని ఫలితంగా పుట్టుకను బట్టి మనిషికి హెచ్చు తగ్గుల్ని అంటగట్టే, జాతి అనైక్యతకు ఊపిరి పోసే కుల వ్యవస్థను ప్రతిఘటించే శక్తులు బలాన్ని పుంజుకొన్నాయి. కులాన్ని బట్టిగాక వ్యక్తి శక్తియుక్తుల్ని బట్టి సంఘంలో ప్రతిపత్తిని పొందవచ్చుననే సత్యం ఈ కాలంలో రుజువైంది. బ్రిటిష్ వారు ప్రవేశపెట్టిన న్యాయ పాలన కూడా సాంఘిక అసమానతలను అరికట్టడానికి కొంత వరకు తోడ్పడింది.

వర్ణతారతమ్యాలకు, కుల భేదాలకు అతీతంగా రూపొందింపబడిన లౌకిక విద్యావిధానం విద్యావంతుల దృక్పథంలో కొంత మార్పు కలిగేలా చేసింది. పాశ్చాత్య సాహిత్యం, పాశ్చాత్య భావధార విద్యాధికులు నూతన సామాజిక విలువల్ని గుర్తించేలా చేశాయి. క్రైస్తవ మిషనరీల కార్యకలాపాలవల్ల దళిత వర్గాలకు చెందిన వారు కూడా విద్యావంతులైనారు. ప్రభుత్వం ఉద్యోగాల్లో కుల విచక్షణకు చోటు లేక పోవడం వల్ల అన్ని కులాల వారికి సమానావకాశాలు కలిగాయి. వర్తక వాణిజ్యాలు, పారిశ్రామికీకరణల ఫలితంగా ఒక నూతన ఆర్థిక వ్యవస్థ నెలకొనింది. అదివరకు కులానికి వృత్తికి మధ్య ఉండిన సంబంధాన్ని ఇది చాలావరకు తెగగొట్టింది.

ప్రాచ్య పాశ్చాత్య సంస్కృతుల సంఘర్షణ, సమన్వయం ఫలితంగా ఈ కాలంలో రూపుదాల్చిన బ్రహ్మ సమాజం, దివ్యజ్ఞాన సమాజం మొదలైన సంస్థలు పాశ్చాత్య భావధారలో అంతర్భాగమైన ప్రజాస్వామ్య వాదం, మానవతా వాదం మొదలైన సిద్ధాంతాలు ఈ కాలంలో కుల వ్యవస్థ నిర్మూలనకు కొంత వరకు తోడ్పడినాయి. కొందరు సంఘసంస్కర్తలు కుల వ్యవస్థను కూల దోయడానికి కృషి చేశారు. గాంధీజీ నేతృత్వంలో కొనసాగిన

BRAOU

జాతీయోద్యమం, అందులో అంతర్భాగమైన అస్పృశ్యతా నివారణ, హరిజనోద్ధరణ కార్యక్రమాలు కుల వ్యవస్థలోని లోపాల్ని బహిర్గతం చేసి ప్రజల్లో సమతా దృక్పథాన్ని కలిగించాయి.

ఈ కాలంలో సాంఘిక అసమానత తొలగిపోవాలనీ, బడుగూ గుడుగూ అందరికీ అందుబాటులో ఉండాలనీ కొందరు తెలుగు కవులు ఎలుగెత్తి చాటారు. గాంధీజీ హరిజనోద్ధరణకు కంకణ కట్టుకోకముందే గురజాడ వెంకట అప్పారావు.

"మంచి చెడ్డలు మనుజులందున
యెంచి చూడగ రెండెకులములు
మంచియన్నది మాలయైతే
మాలనే అగుదునో

(లవణరాజుకల, ఆంధ్ర భారతి - 1911)

అని కుల వ్యవస్థలోని లోపాన్ని ఎత్తి చూపాడు. త్రిపురనేని రామస్వామి చౌదరి (1886-1943) రచించిన "సూతపురాణము" హైందవ సమాజంలోని వర్ణవ్యవస్థని, కుల వ్యవస్థని సవాలు చేసింది. ఈ కాలంలో సంఘవ్యవస్థను భిన్న దృక్పథాలతో విశ్లేషించిన రెండు గొప్ప నవలలు తెలుగులో వెలువడినాయి. ప్రాచీన వర్ణాశ్రమధర్మం అనే బీటలువారిన పునాదులపై విశ్వనాథ సత్యనారాయణ నిర్మించిన నవల 'వేయిపడగలు' కులవ్యవస్థలోని శాఖా భేదాలవల్ల ఉత్పన్నమైన సాంఘిక అసమానతను, రాజకీయంగా ప్రజలకు జరిగిన అన్యాయాన్ని నిరసిస్తూ ఉన్నవ లక్ష్మీనారాయణ సృష్టించిన నవల "సంగవిజయము" అనే నామాంతరంగల 'మాలపల్లి'. సాధారణపౌరులమీద వీటి ప్రభావం స్వల్పమయినా మధ్య తరగతి విద్యావంతులను యీ భిన్న దృక్పథాలు విభజించాయి.

పారిశ్రామికీకరణ, నగరీకరణ, విద్యావ్యాప్తి, వయోజన ఓటింగ్ హక్కు, భూసంస్కరణలు, దళితవర్గాలకు ప్రభుత్వం కల్పించిన రిజర్వేషన్ సౌకర్యాలు, సాంఘిక నేరాలకు సంబంధించిన చట్టాలు మొదలైనవి ఆధునిక సమాజాన్ని ప్రభావితం చేస్తున్నాయి. రేడియో వార్తాపత్రికల వంటి ప్రచార సాధనాలు; బస్సు రైలు వంటి ప్రయాణసాధనాలు! సినిమాలు కాఫీ హోటళ్ళు మొదలైన ఆధునిక జీవితావసరాలు నేడు వివిధ కులాల మధ్య అంతరాన్ని తగ్గించి సాంఘిక సంసర్గాన్ని పెంచడానికి దోహదం చేస్తున్నాయి.

సాంఘిక అసమానతలకు ఊపిరిపోసే కులవ్యవస్థ నిర్మూలనకు నేడు ప్రభుత్వమూ, కొన్ని స్వచ్ఛంద సాంఘిక సేవాసంస్థలూ కృషి చేస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్ అవతరణ తరువాత సంఘసంస్కరణకు ఆశించిన కొందరు కుల నిర్మూలన ఉద్యమాన్ని నడిపారు. వారి కృషిఫలితంగా ఏర్పడిన ఆంధ్రప్రదేశ్ కుల నిర్మూలన సంఘం 1971 లో కుల నిర్మూలన సదస్సును నిర్వహించింది. కులాన్ని సూచించే రెడ్డి, నాయుడు, శాస్త్రి వంటి నామానుబంధాల్ని పరిహసించడం కులాల మధ్య వైవాహిక సంబంధాల్ని ప్రోత్సహించడం వంటి చర్యలద్వారా కొంతవరకు కులాల్ని నిర్మూలించవచ్చుననే ఆశయంతో వారు కృషి చేస్తున్నారు. శ్రీయుతులు జె.వీరాస్వామి, ఏటుకూరి బలరామమూర్తి, డా. అంతటి నరసింహం మొదలైనవారీ సంఘం సభ్యులు. ఈ కాలంలో గోరావంటి సంస్కరణ వాదులు కూడా వర్ణాంతర, కులాంతర వివాహాల్ని ప్రోత్సహించారు. సాంఘిక అసమానత దానివల్ల ఉత్పన్నమయ్యే సమస్యల్ని ప్రజల దృష్టికి తీసుకొని రావడానికి దేశంలోనే ప్రథమంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సాంఘిక సంక్షేమశాఖ 1972 లో రాష్ట్రస్థాయి సాంఘిక సంస్కరణ సదస్సును నిర్వహించింది. 1974 నుండి కులాంతర వివాహాలు చేసుకొన్న దంపతులకు ప్రభుత్వం నగదు బహుమతులు తదితర ప్రోత్సాహక వసతుల్ని కల్పిస్తోంది. వర్ణాంతర కులాంతర వివాహాల్ని ప్రజలు విడ్డూరంగా భావించే రోజులు పోయినా ప్రస్తుత సమాజం అటువంటి వివాహాల్ని హృదయపూర్వకంగా ఆహ్వానించడంలేదు. రంగనాయకమ్మ "బలిపీఠం, స్త్రీ" అనే నవలల్లో ఈ విషయాన్నే స్పష్టం చేశారు.

కుల వ్యవస్థ నిర్మూలనకు ప్రయత్నం జరిగిన ఈ కాలంలో కులతత్వ ధోరణి కొన్ని రంగాల్లో ప్రస్ఫుటమైంది. కులపరమైన విద్యాసంస్థలు, వ్యాపారసంస్థలు, సహకార సంఘాలు, ధర్మకర్తృత్వ సంస్థలు, వసతి గృహాలు ఈ కాలంలో నెలకొన్నాయి. స్థానిక సంస్థల ఎన్నికల్ని పురస్కరించుకొని బ్రిటిష్‌వారి కాలంలో అగ్రకులాల మధ్యపోటీ ఏర్పడింది. బ్రిటిష్‌వారు అనుసరించిన విభజించి పాలించే సిద్ధాంతం దాన్ని పోషించింది. స్వాతంత్ర్యానంతరం ప్రజాస్వామ్య రాజకీయ వ్యవస్థ నెలకొన్నది. ప్రభుత్వం కులాలమధ్య అంతరాన్ని తగ్గించ డానికి ప్రయత్నిస్తోంది. ఐనా కులవ్యవస్థ రాజకీయరంగంలో చోటుచేసుకొంది. ఈ పరిణామాలు సమాజంలోని



BRAOU

వివిధ కులాలకు చెందిన ప్రజలమధ్య సామరస్యాన్ని తగ్గించి వైషమ్యాన్ని కొంత పెంచాయి. ప్రజాస్వామ్య విధానానికి గొడ్డలి పెట్టయిన ఈ ధోరణిని బాధ్యత కలిగిన ప్రతి పౌరుడూ గ్రహించవలసిన అవసరం ఏర్పడింది. అందువల్లనే నేడు ప్రభుత్వం కులాల మధ్య తరతరాలుగా వస్తున్న సామాజిక ఆర్థిక అంతరాలను తగ్గించడానికి నూతన రాజకీయ సామాజిక ఆర్థిక విధానాల్ని రూపొందించి అమలుపరచడానికి ప్రయత్నిస్తున్నది.

### 25.4.2 కుటుంబ వ్యవస్థ

19వ శతాబ్ది ప్రారంభం నాటికీ కూడా ఆంధ్రదేశంలో పితృస్వామిక కుటుంబ వ్యవస్థ నెలకొని ఉండేది. పురుషులకు మాత్రమే వారసత్వపు హక్కును సంక్రమింపజేసే ఈ వ్యవస్థలో స్త్రీ అస్వతంత్రురాలుగా ఉండేది. కుటుంబ సభ్యుల ఉదాసీనతవల్ల, సంఘంలోని కట్టుబాట్ల వల్ల స్త్రీలు విద్యావిషయకంగా వెనుకబడి ఉండేవారు. బాల్యవివాహాలు, కన్యాశుల్కం, వరకట్నం వంటి సాంఘిక దురాచారాలు ఈ కాలంలో అమల్లో ఉండినాయి. దీని పర్యవసానంగా కొందరు బాల్యంలోనే వైధవ్యానికి లోనయ్యేవారు. ఈ శతాబ్ది ప్రారంభంలో తెలుగు వారి సాంఘిక జీవన విధానంలో ఒక భాగంగా ఉండిన ఉమ్మడి కుటుంబాలలో వితంతువుల పరిస్థితి దుర్భరంగా ఉండేది.

19వ శతాబ్ది భారతదేశ రాజకీయాలలో కొందరు హిందూ ముస్లిం మహిళలు ప్రముఖ పాత్ర వహించినా తెలుగుదేశంలో స్త్రీల ప్రతిపత్తి దయనీయంగా ఉండేది. 19వ శతాబ్దిలో తెలుగు దేశంలో ప్రచారం పొందిన బాలనాగమ్మ కథ, లక్ష్మమ్మ కథ, కామమ్మ కథ మొదలైనవి ఈ దుస్థితికి అద్దంపడుతున్నాయి. ఫకీరుజంగం వేషంలో వచ్చి బాలనాగమ్మను ఎత్తుకొని పోవడం, ఆమెకు నానాబాధలకు గురిచెయ్యడం, చివరికామె మరణించడం మొదలైన అంశాల్ని కరుణ రసోద్దీపితంగా వర్ణించే ఈ కథ ఆంధ్రప్రదేశంలోని ఇంటింటా ప్రచారం పొందింది. సహగమనాన్ని చట్టరీత్యా నిషేధించిన తర్వాత (1830) కామమ్మ అనే బెస్త కులానికి చెందిన స్త్రీ సహగమనం చేయడానికి కాకినాడ కలెక్టర్ అనుమతించకపోతే ఆమె మద్రాసువెళ్ళి పెద్ద దొరల నుండి అనుమతిని సంపాదించి అగ్ని ప్రవేశం చేయడం కామమ్మకథలోని ఇతివృత్తం. ఈ కథలు ఆనాటి సంఘంలో స్త్రీల దైన్య స్థితిని ఎత్తి చూపుతున్నాయి. 20వ శతాబ్దం మొదటి దశకంలో సి. ఆర్. రెడ్డి రాసిన 'ముసలమ్మ మరణం' ఈ దుస్థితిని వర్ణించే మొదటి ఆధునిక కావ్యం.

పాశ్చాత్య విద్య, నాగరికతా సంస్కృతుల ప్రభావం సోకిన ఈ శతాబ్ది చివర కూడా పురుషాధిపత్యంతో కూడిన సంఘంలో, ఉమ్మడి కుటుంబాల్లో స్త్రీ విద్యాగంధానికి దూరమై, దురాచారాలకు, దురన్యాయాలకు గురియై నిస్సహాయురాలిగా ఉండింది. కందుకూరి వీరేశలింగం పంతులు తన రచనల ద్వారా ఈ దురాచారాల్ని దుయ్యబట్టడం జరిగింది. 'సత్యరాజాపూర్వ దేశ యాత్రలు' అనే హేళనాత్మక నవలపూర్వ భాగం (1893) లోని 'ఆడ మళయాళము' అనే ప్రకరణంలో ఆయన ఈ విషయాల్ని వ్యంగ్యంగా విమర్శించి ఉన్నాడు. ఆయన రచించిన 'సత్యవతీ చరిత్రము' అనే నవల కూడా ఆనాటి ఉమ్మడి కుటుంబాలలో విద్యాహీనులైన స్త్రీల వల్ల కలిగే అనర్థాలు, అత్తల సాధింపులు ఆడుబిడ్డల ఆరడి మొదలైన కుటుంబ సమస్యల్ని ఆవిష్కరిస్తోంది.

BRAOU

పాశ్చాత్య విద్యావ్యాప్తి, ఆర్థికకారణాలు, సంఘసంస్కరణోద్యమాలు మొదలైన వాటి ఫలితంగా కుటుంబ వ్యవస్థ, స్త్రీపురుష సంబంధాలు మార్పుకు లోనయ్యాయి. ఆంధ్రుల సాంఘిక జీవన విధానంలో ఒకప్పుడు ప్రాముఖ్యాన్ని వహించి ఉండిన ఉమ్మడి కుటుంబ వ్యవస్థ యీ కాలంలో సడలిపోయింది. జనాభా పెరుగుదల, రెండు ప్రపంచ యుద్ధాలవల్ల ఏర్పడిన ఆర్థికమాంద్యం, కుటుంబఖర్చులు పెరగడం, జీవనోపాధికోసం సుదూర ప్రాంతాల్లో ఉద్యోగాలు చేయవలసిన అవసరం ఏర్పడడం, వర్ణాంతర వివాహాలు మొదలైన కారణాలవల్ల సమిష్టి జీవనవిధానం యీ కాలంలో భగ్నమైంది.

రాజారామమోహనరాయ్ ద్వారా భారతదేశంలో వెల్వడిన సంస్కరణోద్యమం మహిళాభ్యుదయానికి దారితీసింది. ఈ ఉద్యమస్ఫూర్తితోనే ఆంధ్రదేశంలో కందుకూరి వీరేశలింగం వంటి సంఘసంస్కర్తలు స్త్రీసంక్షేమానికి కృషి చేశారు. పాశ్చాత్యవిద్య, సంస్కృతి సంపర్కం మొదలైన అంశాలు స్త్రీ పురుష సంబంధాల్ని గూర్చి, సంఘంలో స్త్రీ ప్రతిపత్తిని గూర్చి ఆలోచింపచేశాయి. క్రమంగా సంఘంలో పురుషుడితోబాటు స్త్రీకి అర్హమైన స్థానం ఉండాలన్న భావం ప్రబలింది. దీనిఫలితంగా స్త్రీకి విద్య, వివాహం, ఉద్యోగం మొదలైన విషయాల్లో కొంతవరకు స్వేచ్ఛ లభించింది. రజస్వలానంతర వివాహాలు, స్త్రీపునర్వివాహాలు సామాన్య మయ్యాయి.

ఈ కాలంలో వెలువడిన సాహిత్యం సామాజికమైన మార్పుల్ని ప్రతిబింబింపజేసింది. హాస్యాన్ని రంగరించిన కందుకూరి వీరేశలింగం రచనలు, కారుణ్యాన్ని చిందించిన గురజాడ కృతులు స్త్రీని పీడనకు గురిచేసిన ఆనాటి సాంఘిక దురాచారాల్ని ఎత్తిచూపాయి. ఆంగ్లకాల్పనిక కవిత్వ ప్రభావంతో ఇరవయ్యో శతాబ్ది ప్రారంభంలో తెలుగులో వెలువడిన భావకవిత్వం స్త్రీపురుష సంబంధాలను ఊహాప్రణయశీలంగా కీర్తిస్తే రాయప్రోలు సుబ్బారావుగారి 'తృణకంకణము, కష్టకమల' మొదలైన ఖండకావ్యాలు స్త్రీకి శృంగారదూరమైన పూజ్యస్థానాన్ని కల్పించవలసిన అవసరాన్ని గుర్తుచేశాయి. తర్వాతకాలంలో గుడిపాటి వెంకటచలం "మైదానం, అమీనా" వంటి నవలల్లోని స్త్రీ స్వాతంత్ర్యానికి సంబంధించిన వివేచన తెలుగు దేశంలో తీవ్ర సంచలనాన్ని కలిగించింది.

పాశ్చాత్య నాగరికతా సంస్కృతులు, పారిశ్రామికీకరణ, నగరీకరణ, నిరుద్యోగం ఆర్థికమైన ఒత్తిడి మొదలైనవి ఆధునిక సమాజాన్ని ప్రభావితం చేశాయి. పరిణామశీలమైన సమాజంలో సారహీనాలైన సంప్రదాయాల్ని సంస్కరించుకోవలసిన అవసరం ఏర్పడ్డం సహజం. స్వాతంత్ర్యానంతరం కుటుంబవ్యవస్థ దానికి ప్రాతిపదిక ఐన వివాహం మొదలైన వాటికి సంబంధించిన పాత విలువలు, ఆధునిక సమాజానికి అనుగుణమైన కొత్త విలువలు ఘర్షణకు లోనయ్యాయి. నిరుద్యోగం, ఆర్థికమైన ఒత్తిడి మొదలైన కారణాలవల్ల స్వాతంత్ర్యానికి పూర్వమే సన్నగిల్లిన ఉమ్మడి కుటుంబవ్యవస్థ ఈ కాలంలో చాలా వరకు విచ్ఛిన్నమైంది. ఉద్యోగావకాశాలు, సమాజంలో ప్రబలిన వ్యాపారదృక్పథం, కుటుంబనియంత్రణ వల్ల కలిగే లాభాలు, ఆ విషయంగా జరుగుతున్న ప్రచారం మొదలైనవి కుటుంబ వ్యవస్థమీద సమిష్టిగా ప్రభావాల్ని కనబరచాయి.

**25.4.3 సంఘసంస్కారం**

18వ శతాబ్దిలో విజాతీయుల దాడులవల్ల, చిల్లర జమీందారుల దౌష్ట్యం వల్ల, గ్రామవ్యవస్థ విచ్ఛిత్తివల్ల, విజాతీయ సంపర్కం వల్ల కలిగిన పరిణామాలు సమాజంలో కల్లోలం సృష్టించాయి. గోగులపాటి కూర్మనాథ కవి 'సింహాచల నరసింహ శతకం' అడిదము సూరకవి 'రామలింగశతకం', కూచిమంచి తిమ్మకవి 'కుక్కుటేశ్వర శతకం' మొదలైన శతకాలు ఆనాటి ధర్మగ్లానిని, ప్రజాక్లేశాల్ని వ్యక్తం చేస్తున్నాయి. ఆంధ్రసృష్టిని నిలుపుకోవాలనే ఆశయం, అది నాశనమవుతుందేమో అనే ఆందోళన కలకూడదనే సంకల్పం ఈ రచనలలో ప్రస్ఫుటమయ్యాయి. 19వ శతాబ్ది ప్రారంభం వరకు ఆంధ్రదేశంలో ఈ అస్తవ్యస్త పరిస్థితి కొనసాగింది.

19వ శతాబ్ది ప్రారంభానికి ఆంధ్రదేశంపై ఇంగ్లీషు వారి ఆధిపత్యం స్థిరపడింది. పాశ్చాత్య విద్యావిధానం వల్ల పాశ్చాత్య నాగరికతా సంస్కృతుల సంపర్కం వల్ల ఈ కాలంలో ఆచార సంప్రదాయాలు, భాషా సాహిత్యాలు మొదలైన వాటికి సంబంధించిన పాత విలువలు మారిపోవడం ఆరంభమైంది. ఈ పరిణామానికి సంబంధించిన ఈ కాలంలో ప్రచ్ఛన్నంగా దర్శనమైన రూపురేఖలు ఈ శతాబ్దిలో అసంపూర్ణంగాను, ఇరవయ్యో శతాబ్ది ప్రారంభంలో స్పష్టంగాను ఆకృతిని పొంది జాతి పునరుజ్జీవనానికి కారణాలయ్యాయి.

దేశంలో నూతనంగా అమలు జరపబడిన విద్యావిధాన ఫలితంగా విద్యాధికుల్లో ఒక ప్రజాస్వామిక, లౌకిక, జాతీయ దృక్పథం రూపురేఖల్ని దిద్దుకొన్నది. ఇంగ్లీషు భాష యూరోప్ దేశాల్లోని సమకాలీన జాతీయోద్యమాల్ని గమనించడానికి, నవీన భావాల్ని వ్యాప్తిచేయడానికి, దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన విద్యావంతులలో భావసామ్యాన్ని వ్యాపింపజేయడానికి ఒక శక్తివంతమైన సాధనంగా పనిచేసింది. విద్యాధికులలో ప్రబలిన నూతన భావధారవల్ల ఈ కాలంలో ప్రాచ్యపాశ్చాత్య సంస్కృతులు సంఘర్షణకు లోనయ్యాయి. కొందరు సనాతన హైందవ సంస్కృతిని నిరసించడం మొదలు పెట్టగా, మరికొందరు కులం, మతం, వివాహం వంటి వాటిల్లో కరుడు గట్టిన దురాచారాల్ని సంస్కరించడం ద్వారా హైందవ సంస్కృతిని పునరుజ్జీవింపచేయడానికి కృషి చేశారు.

19వ శతాబ్దిలో పాశ్చాత్య విద్యా విధానం వల్ల వ్యాపించిన హేతువాదాన్ని, భౌతిక శాస్త్రి విజ్ఞానాన్ని సనాతన హైందవ మత విజ్ఞానంతో సమన్వయించి హైందవమత పునరుజ్జీవం కోసం వెలసిన మత సాంఘిక సంస్కరణోద్యమాల్లో బ్రహ్మ సమాజ ఆర్య సమాజాలు ముఖ్యమైనవి. కందుకూరి వీరేశలింగం పంతులు, రఘుపతి వెంకటరత్నం నాయుడు మొదలైన సంస్కర్తలు ఆంధ్రదేశంలో బ్రాహ్మధర్మం ప్రచారం చేశారు. మదాంబ్లావట్స్కీ, కర్నల్ అల్కాట్‌లు ప్రారంభించిన దివ్యజ్ఞాన సమాజం కూడా ఆంధ్రదేశంలోని విద్యాధికులపై ప్రభావాన్ని కనబరిచింది. ఇవి మత సాంఘిక సంస్కరణలకు తెలుగు దేశంలో పాదులుతీశాయి.



BRAOU

పాశ్చాత్య దేశాలలో పొడసూపి, రూసో మొదలైన వారు కొత్త ఊపిరి పోసిన మానవోద్యమం ఈ కాలంలో భారతదేశంలోను, ఆంధ్రదేశంలోను వ్యక్తి స్వేచ్ఛా స్వాతంత్ర్యాలకు మాత్రమే పరిమితమైంది. ఈ కారణాల వల్లనే ఆనాడు మానవ సమిష్టి ప్రయోజనాల్లో అతిముఖ్యమైన ఆకలి, దారిద్ర్యం వంటి ప్రాథమిక సమస్యలకంటే కులస్త్రీల చదువులు, సహగమనం. స్త్రీ పునర్వివాహం, కులనిర్మూలనం, భాషాసంస్కరణ వంటి సమస్యలే మేధావుల దృష్టికి వచ్చాయి. ఆనాటి విద్యాధికుల్లోను, రచనల్లోను ఈ భావ ధోరణి వ్యక్తమైంది. ఈ మానవోద్యమ ప్రభావంతోనే ఆంధ్రదేశంలో కందుకూరి వీరేశలింగం పంతులు, గిడుగు వేంకట రామమూర్తి గురజాడ వేంకట అప్పారావు మొదలైన వారు భిన్నరంగాల్లో సంఘసంస్కారానికి కృషి చేశారు.

ఇరవయ్యో శతాబ్ది ప్రారంభానికి భారతదేశంలో వ్యాప్తిని పొందిన ఆంగ్లవిద్య, పాశ్చాత్య భావధార, పత్రికలు మొదలైనవి విద్యాధికులైన దేశీయుల్లో భావసామాన్యాన్ని పెంపొందించాయి. దీని ఫలితంగానే దేశంలో ఏదో ఒక ప్రాంతంలో రూపుదాల్చిన సాంఘిక రాజకీయ మతోద్యమాలు దేశం నలుమూలలా ఉన్నా విద్యాధికుల్ని ప్రభావితంచేశాయి. భారతదేశం మొత్తంమీద సంభవించిన సాంస్కృతిక పరిణామంలో భాగమైన సంఘ సంస్కరణోద్యమానికి బ్రహ్మసమాజం ఒక వాహికగా పనిచేసిన సంగతిని, దాని ప్రభావంతో కందుకూరి వీరేశలింగం పంతులు ఆంధ్రదేశములో సంఘసంస్కరణకు చేసిన కృషిని వెనకటి భాగంలో మనం పరిశీలించి ఉన్నాం. ఆంధ్రదేశంలో బ్రాహ్మధర్మ ప్రచారానికి స్ఫూర్తిని కలిగించి రఘుపతి వెంకటరత్నం నాయుడు ప్రజల్లో విద్యాసారభాన్ని వెదజల్లడానికి, నైతిక విలువల్ని పెంపొందించడానికి, సాంఘిక దురాచారాల్ని రూపు మాపడానికి చేసిన కృషి ఈ సందర్భంగా గుర్తింపదగింది. భారతదేశంలో జాతీయ కాంగ్రెస్ స్వాతంత్ర్యోద్యమంలో ఒక భాగంగా మద్యపాన నిషేధం, హరిజనోద్ధరణ స్వదేశీవస్తువుల వాడకం వంటి నిర్మాణాత్మక కార్యక్రమాల్ని చేపట్టకముందే ఆంధ్రదేశంలో వాటినిప్రచారం చేసిన నిష్కామకర్మయోగి ఆయన పిఠాపురం రాజావారి తోడ్పాటుతో కాకినాడలో ఆయన బ్రహ్మమందిరం, అనాధశరణాలయం, విద్యాలయం మొదలైన ప్రజాహిత సంస్థల్ని నెలకొల్పి నిమ్నజాతీయుల చదువుకు, అనాథబాలికల సంరక్షణకు, పతిత స్త్రీల సముద్ధరణకు కృషిచేశారు. 1904-19 సంవత్సరాల మధ్యకాలంలో కాకినాడ పిఠాపురం రాజావారి కళాశాలలో ప్రధానా చార్యులుగా పనిచేసిన నాయుడుగారి వ్యక్తిత్వంచేత ప్రభావితులైన ఎంతోమంది యువకులు ఆయన అడుగు జాడల్లో నడిచారు.

1920 నాటికి గాంధీజీ జాతీయోద్యమానికి సారథ్యం వహించడంతో భారతదేశంలో సంఘ సంస్కర ణోద్యమము కొత్త పుంతల్ని తొక్కింది. ఈ కాలంలో అది వ్యక్తి స్వేచ్ఛా ప్రాతిపదికగా సమిష్టి మానవ కల్యాణ సాధన అనే గమ్యం వైపు మళ్ళింది. ఈ కాలంలో జాతీయోద్యమంలో పాల్గొని సంఘసంస్కరణకు కృషి చేసిన కొండా వెంకటప్పయ్య, ముట్నూరి కృష్ణారావు, భోగరాజు పట్టాభి సీతారామయ్య, అయ్యంకి వెంకట రమణయ్య, కాశీనాథుని నాగేశ్వరరావు, ఉన్నవ లక్ష్మీనారాయణ, అయ్యదేవర కాళేశ్వరరావువంటి ఆంధ్ర ప్రముఖులు కందుకూరి వీరేశలింగం పంతులు, రఘుపతి వెంకటరత్నంల చేత ప్రభావితులైనవారే. సహపంక్తి భోజనాలు, వర్ణాంతర వివాహాలు, అస్పృశ్యతా నివారణ, వయోజన విద్య, గ్రంథాలయాల స్థాపన మొదలైన కార్యక్రమాల్ని చేపట్టి వీరు సంఘసంస్కరణకు కృషిచేశారు.

సంఘసంస్కరణ రంగంలో గాంధీయదృక్పథం రూపుదాల్చిన ఈ కాలంలో తెలుగు కవులు గాంధేయ సిద్ధాంతాన్ని తమ రచనలు ద్వారా ప్రచారం చేశారు. స్వరాజ్యోద్యమంలో ఒక భాగంగా సాగిన హరిజనోద్ధరణ, అస్పృశ్యతా నివారణలకోసం ఆరాటపడినవారు దళిత వర్గాలవారి హృదయాల్ని స్పందింపచేసేటట్లుగా గుడిగంటల్ని బడిగంటల్ని వినదింపచేయాలనే అభిప్రాయాన్ని ధ్వనింపచేసే రచనల్ని చేశారు. కాటూరు వెంకటేశ్వరరావుగారి 'గుడిగంటలు' ఈ కోవకు చెందిన రచనల్లో మేలుబంతి. గాంధేయ సిద్ధాంతాలచే ప్రభావితులైన తుమ్మల సీతారామమూర్తి చౌదరి 'ధర్మజ్యోతి, ఆత్మార్పణము' అనే కృతుల్ని రచించడమేగాక "బాపూజీ ఆత్మకథ"కు తెలుగులో అక్షరరూపాన్ని కల్పించారు.

నిజాం రాష్ట్రంలో భాగ్యరెడ్డి వర్మ, సర్దార్ జమలాపురం కేశవరావు, మాడపాటి హనుమంతరావు, రావిచెట్టు రంగారావు, స్వామి రామానందతీర్థ, సురవరం ప్రతాపరెడ్డి మొదలైనవారు జోగులు (దేవదాసి), వెట్టిచాకిరి వంటి సాంఘిక దురాచారాల నిర్మూలనకు, హరిజనోద్యమానికి, మద్యపాన నిషేధానికి కృషిచేశారు. "భాగ్యనగర్, గోల్కొండ, సుజాత" వంటి వేదికలు తెలంగాణా ప్రాంతంలో సంఘసంస్కరణకు తోడ్పడినాయి.

BRAOU

స్వాతంత్ర్యానికి పూర్వం ఆంధ్రదేశంలో సంఘ సంస్కరణ ఒక ఉద్యమంగా సాగింది. గాంధీజీ ప్రభావానికి లోనైన కొందరు సంఘ సంస్కరణను జాతీయోద్యమంలో ఒక భాగంగా నిర్వహించారు. స్వాతంత్ర్యానంతరం మూఢనమ్మకాలపై, కొన్ని ప్రాచీన సంప్రదాయాలపై కొందరు తిరుగుబాటు చేశారు. కొందరు భావ విప్లవానికి కృషి చేశారు.

ఆంధ్రదేశంలో రెండో తరానికి చెందిన సంస్కర్తల్లో త్రిపురనేని రామస్వామి చౌదరి, గోపరాజు రామచంద్రరావు ఎన్నదగినవారు. రామస్వామి చౌదరిగారు పురాణాల్లో తనకు అసంగతంగా తోచిన అంశాల్ని విమర్శిస్తూ 'సూత పురాణము, శంబూకవధ' అనే గ్రంథాల్ని రచించారు. తెనాలిలో సూతాశ్రమాన్ని నెలకొల్పి అస్పృశ్యతా నివారణకు కృషి చేశారు. వివాహ విధిని తెలుగులో నిర్వహించే సంప్రదాయాన్ని నిర్వచించడానికి వీరు ఎంతో కృషి చేశారు. 1930-50 సంవత్సరాల మధ్య కాలంలో వీరు సంఘ సంస్కరణకు పాటుపడ్డారు. కులాంతర వర్ణాంతర వివాహాల్ని, సహపంక్తి భోజనాన్ని ప్రోత్సహించిన గోపరాజు రామచంద్రరావు తెలుగుదేశంలో నాస్తికోద్యమాన్ని ప్రచారం చేసినవారిలో ముఖ్యులు. పటమట (విజయవాడ)లో వారు స్థాపించిన 'నాస్తిక కేంద్రం' ఇప్పటికీ ఆంధ్రదేశంలో నాస్తికోద్యమానికి పట్టుకొమ్మగా ఉంది. లవణం తండ్రిగారి ఉద్యమాన్ని కొనసాగిస్తున్నారు. జె. వీరాస్వామి, ఏటుకూరి బలరామమూర్తి, అరిగె రామస్వామి, తాపీ ధర్మారావు మొదలైన వారు కుల నిర్మూలనను ఒక ఉద్యమంగా నడిపారు. వివాహ వ్యవస్థ, మూఢనమ్మకాలు మొదలైన వాటిని గూర్చి తాపీ ధర్మారావుగారు తన రచనల్లో విశ్లేషించారు. గుర్రం జాషువా తన రచనల్లో సాంఘిక దురన్యాయాల్ని తీవ్రంగా విమర్శించారు.

గాంధీజీ పిలుపునందుకొన్న ఆంధ్రమహిళ జాతీయోద్యమంలో ముందంజవేసింది. దువ్వూరి సుబ్బమ్మ, మాగంటి అన్నపూర్ణమ్మ, ఉన్నవ లక్ష్మీబాయమ్మ, ఆచంట రుక్మిణీదేవి, పొణకా కనకమ్మ, భారతీదేవి రంగా మొదలైనవారు ఆ రోజుల్లో ప్రముఖపాత్ర నిర్వహించారు. స్వాతంత్ర్యం తర్వాత విజ్ఞాన, ఆర్థిక, సాంఘిక రంగాల్లో పురుషుడితో బాటు సమాన హక్కుల కోసం మహిళోద్యమాలు సాగుతున్నాయి. పాశ్చాత్యదేశాల్లో మొగ్గతొడిగిన స్త్రీ విమోచనోద్యమం ప్రభావంతో స్వాతంత్ర్యం వచ్చాక కూడా వివాహం, విడాకులు, ఆస్తిహక్కు, వేతనాలు మొదలైన విషయాల్లో స్త్రీ పురుషులకు వేర్వేరు కొలబద్దలు ఉండటాన్ని వ్యతిరేకిస్తూ ఆంధ్రదేశంలో మహిళోద్యమాలు ఆందోళన సాగిస్తున్నాయి. ఉన్నవ లక్ష్మీబాయమ్మ, ఉన్నవ లక్ష్మీనారాయణ దంపతులు గుంటూరులో స్థాపించిన "శారదా నికేతన్", కనుపర్తి వరలక్ష్మమ్మ బాపట్లలో నెలకొల్పిన "స్త్రీ హితైషిణీ మండలి" మొదలైన సంస్థలు స్వాతంత్ర్యయుగోద్యమంలోను, తర్వాత కొంతకాలమూ మహిళాభ్యుదయానికి కృషి చేశాయి. ఆధునిక సమాజంలో మారుతున్న విలువలకు, అవసరాలకు ఆంధ్ర స్త్రీని సమాయత్తం చేయడానికి తర్వాతి కాలంలో వెలసిన సంస్థల్లో "ఆంధ్రమహిళాసభ" ఎన్నదగింది. శ్రీమతి దుర్గాబాయి దేశ్‌ముఖ్ సారథ్యంలో రూపొందిన ఈ సంస్థ మహిళాభ్యుదయానికి ఎనలేని కృషి చేస్తోంది. శ్రీమతి గోపాలరావు ఎక్బోటే, లక్ష్మీ రఘురాం వంటి వారు కూడా ఆంధ్రదేశంలో మహిళాభ్యుదయానికి కృషి చేసారు.

ఆర్థిక స్వాతంత్ర్యం లేకపోవడం, వేతనాలలో వ్యత్యాసం, వరకట్నం వంటి సాంఘిక దురాచారాలు, చలనచిత్రాల్లోను, వ్యాపార ప్రకటనల్లోను స్త్రీని అసభ్యంగా చిత్రించడం వంటి వాటి మీద నేడు ఆధునిక మహిళ తిరగబడుతోంది. ఈ కాలంలో స్త్రీ ప్రతిపత్తిని మెరుగుపరచడానికి ప్రభుత్వం కొన్ని చట్టాలు చేసింది. కాని, ఆచరణలో అవి విఫలమయ్యాయి. 1961 లో వచ్చిన వరకట్న నిషేధ చట్టం దీనికో ఉదాహరణ. ఐక్యరాజ్య సమితి 1975ను అంతర్జాతీయ మహిళా సంవత్సరంగా ప్రకటించింది. ఆ సందర్భంగా సంఘంలో స్త్రీ ప్రతిపత్తిని గూర్చిన సమీక్షలు, చర్చలు జరిగాయి. మల్లాది సుబ్బమ్మ, వసంతా కన్నాబిరాం వంటి వారు నేడు మహిళా విమోచనోద్యమాలు నిర్వహిస్తున్నారు. కొన్ని స్వచ్ఛంద సంస్థలు కూడా గ్రామీణ, పట్టణ, నగర ప్రాంతాల్లోని పీడిత స్త్రీల సమస్యలను గట్టిగా పట్టించుకుంటున్నాయి.

స్వాతంత్ర్యానంతరం ఆంధ్రదేశంలో సాగిన కమ్యూనిస్టు ఉద్యమం సంఘసంస్కరణోద్యమాన్ని తన కార్యక్రమంలో ఒక భాగంగా చేసుకొంది. ఆంధ్రదేశంలో సాంస్కృతిక పునరుజ్జీవనానికి కృషి చేసిన కందుకూరి వీరేశలింగం, గురజాడ అప్పారావు, గిడుగు రామమూర్తి, కొమర్రాజు లక్ష్మణరావు మొదలైన మహనీయుల వర్ధంతులను జరపడం ద్వారా వారు శాస్త్రీయ దృక్పథాన్ని ప్రజల్లో ప్రచారం చేయడానికి కృషిచేశారు. దళిత వర్గాల వారిలో ఆత్మవిశ్వాసాన్ని పాదుకొల్పి, వారి అభ్యున్నతికి ఎనలేని కృషిచేసిన డా. అంబేద్కర్ జయంతిని నేడు తెలుగుదేశంలో వాడవాడలా జరుపుకొంటున్నారు. సమాజంలో అణగారిన ఆరులకు సాంఘిక న్యాయాన్ని, ఆర్థిక న్యాయాన్ని చేకూర్చడానికి నేడు ప్రభుత్వం కూడా ప్రయత్నం చేస్తుంది.



BRAOU

## 23.4.4 విద్యలు, కళలు

కంపెనీ అధికారులు ప్రారంభంలో నూతన విద్యావ్యవస్థ నిర్మాణం విషయంలో గాని, భారతీయ విద్యా వ్యవస్థను అభివృద్ధి పరచడంలోగాని తగిన శ్రద్ధతీసుకోలేదు. ఆనాడు లోక వ్యవహారానికి, కరణీకానికి, వ్యాపారానికి, ప్రభుత్వంలో చిన్న ఉద్యోగాలకు అవసరమైన గణితం, పంచాంగం, ప్రాచీన రాజచరిత్రలు, వ్యవహారానికి అవసరమైన రాతముసాయిదాలు మొదలైన అంశాలను వీధి బడుల్లో నేర్పేవారు. అమరకోశం, పెద్దబాలశిక్ష, బాలరామాయణం, గజేంద్రమోక్షం, సుమతీశతకం, దాశరథి శతకం మొదలైన వాటిని విద్యార్థుల చేత వల్లెవేయించేవారు. ఈ బడుల్ని నిర్వహించే ఉపాధ్యాయుల పోషణ భారాన్ని ఊరి వారు సమిష్టిగా వహించేవారు. 19వ శతాబ్ది ప్రారంభం వరకు ఆంధ్రదేశం మొత్తం మీద ఈ విధమైన సాంప్రదాయిక ప్రాథమిక విద్యావిధానం వీధిబడుల రూపంలో ఒకే రీతిగా ఉండేది.

19వ శతాబ్ది ప్రారంభంలో కొందరు దేశీయులు పాశ్చాత్యులు తోడి సన్నిహితత్వం వల్ల నూతన విద్యావశ్యకతను, ఇంగ్లీషు చదువుల వల్ల కలిగే లాభాల్ని గుర్తించ గలిగారు. వారి ఆందోళన ఫలితంగా భారతదేశంలో విద్యావాప్తికిగాను సాలీన లక్ష రూపాయలకు తక్కువ కాని మొత్తాన్ని ఖర్చు పెట్టాలన్న షరతులు 1813లో ఈస్ట్ ఇండియా కంపెనీ చట్టంలో చేర్చారు. ప్రభుత్వ ఆదాయంలో కొంత మొత్తాన్ని విద్యకు కేటాయించడాన్ని చట్టరీత్యా గుర్తించడం దీనితో ప్రారంభమైంది. 1838 లో విలియం బెంటింక్ గవర్నర్ జనరల్‌గా వచ్చే వరకు ప్రభుత్వం విద్యా విధానాన్ని గూర్చిన ప్రధాన నిర్ణయాలు తీసుకోవడంగాని, విద్యా సంస్థలకు తగిన సహాయాన్ని అందించడం గాని జరగలేదు.

1833లో భారతదేశంలో అమలు జరపబడిన విద్యా విధానాన్ని రూపొందించడానికి ఏర్పాటు చేసిన సంఘంలో కొందరు ప్రాచ్య విద్యావిధానాన్ని, మరికొందరు పాశ్చాత్య విద్యావిధానాన్ని సమర్థించారు. ఈ విధంగా సంప్రదాయవాదుల (Orientalists), సంస్కరణాభిలాషుల (Anglicists) మధ్య తలఎత్తిన వివాదాన్ని పురస్కరించుకొని లార్డ్ మెకాలే వ్యక్తం చేసిన యదాస్తు (Minute of Dissent) కు అప్పటి గవర్నర్ జనరల్ బెంటింక్ 1835 లో ఆమోద ముద్రను వేయడంలో భారతీయ విద్యారంగంలో ఒక నూతన శకం ఆరంభమైంది. దీని పర్యవసానంగా దేశంలో ఇంగ్లీషు మాధ్యమం (Medium) లో విద్యా బోధన చేయడానికి పాఠశాలలు నెలకొల్పారు. 1832 లో ఇంగ్లీషు న్యాయస్థాన భాషా ప్రతిపత్తిని పొందింది. 1844 నాటికి ప్రభుత్వ ఉద్యోగాల్లో భారతీయుల నియామకానికి ఎక్కువ అవకాశాలు కలిగాయి. 1854 లో విద్యా విషయాల్ని గూర్చి కంపెనీ వారు వెలువరించిన ప్రకటన (Companies Despatch on Educational Matters), 1857లో విశ్వ విద్యాలయాల స్థాపన మొదలైనవన్నీ ఇంగ్లీషు చదువుల వ్యాప్తికి దోహదం చేశాయి.

BRAOU

19వ శతాబ్ది ఉత్తరార్థంలో ఆంధ్రదేశంలో గొప్ప భావ పరివర్తనానికి దోహదం చేసిన పాశ్చాత్య విద్యా వ్యాప్తికి క్రైస్తవ మిషనరీలు గణనీయమైన పాత్ర నిర్వహించాయి. విద్యాభిరతి కలిగిన కొందరు దేశీయుల కృషి దీనికి మరింత దోహదం చేసింది. యునైటెడ్ లూథర్ చర్చి మిషన్ వారు 1842 లో గుంటూరులో ప్రారంభించిన ఆంగ్లో వర్నాక్యులర్ స్కూల్ (నేటి ఏ.సి.కాలేజీ), చర్చి మిషనరీ సొసైటీ ఆధ్వర్యంలో రెవరెండ్ నోబెల్ 1843లో మచిలీపట్నంలో స్థాపించిన స్కూలు (నేటి నోబెల్ కాలేజీ), 1852లో అప్పటి గోదావరి జిల్లా కలెక్టరైన పెండర్‌గాస్ట్ కాకినాడలో స్థాపించిన మిడిల్ స్కూల్ (నేటి పి.ఆర్.ప్రభుత్వ కళాశాల), 1857లో విజయ నగరంలో విజయరామ గజపతి రాజు ప్రారంభించిన మిడిల్ స్కూల్ (నేటిమహారాజ కాలేజి), 1873 లో రాజమండ్రిలో ప్రభుత్వం నెలకొల్పిన సెకండ్‌గ్రేడ్ కాలేజి (1877 లో దీన్ని డిగ్రీ కాలేజి స్థాయికి పెంచారు), 1878 లో విశాఖపట్నంలో ప్రారంభమైన హిందూ కాలేజి (నేటి ఏ. వి. ఎస్. కాలేజి) ఆంధ్రదేశంలో విద్యా వ్యాప్తికి దోహదం చేశాయి.

1880 లో స్థానిక స్వపరిపాలన ఏర్పడిన తర్వాత ప్రాథమిక విద్యా నిర్వహణ చాలా వరకు పంచాయితీలు, మునిసిపాలిటీలు, తాలూకా బోర్డులు మొదలైన వాటి పరిధిలోకి వచ్చాయి. ఈ కాలంలో రెండువేల జనాభా కలిగిన గ్రామాల్లో ప్రాథమిక పాఠశాలలు, తాలూకా కేంద్రాల్లో మిడిల్ స్కూళ్లు, ముఖ్యమైన పట్టణాల్లో కాలేజీలు వెలిశాయి. తరగతుల వారీగా, ఒకే పాఠ్య ప్రణాళిక, పాఠ్యపుస్తకాలు రూపొందాయి. ఆయా దశల్ని పూర్తి చేసిన విద్యార్థులకు ప్రైమరీ, మిడిల్ స్కూల్, మెట్రిక్యులేషన్, ఎఫ్.ఏ., బి.ఏ., మొదలైన పరీక్షలు నిర్వహించేవారు. ఆ రోజుల్లో ప్రైమరీ, మిడిల్ స్కూల్ పరీక్షలు పాసైన వారికి ప్రభుత్వ ఉద్యోగాలు లభించేవి. అందువల్ల కొత్తదనం

కోసం అర్రులు చాచిన దేశీయులు ఇంగ్లీషు చదువుల కోసం పాకులాడినారు. తీయని నీటికోసం చేపలు తుళ్లిపడే విధంగా దేశీయులు ఇంగ్లీషు చదువులకోసం ఎగబడేవారని టంగుటూరి ప్రకాశం పంతులు (నా జీవిత యాత్ర - ప్రథమభాగం) ఈ పరిస్థితిని చక్కగా వ్యాఖ్యానించారు.

నిజాం పాలనలో తెలంగాణా ప్రాంతం విద్యావిషయకంగా ఎంతో వెనుకబడింది. ఆనాటి రాజ్య పాలనలో పర్షియన్ భాషకుండిన ప్రాముఖ్యాన్ని బట్టి విద్యాలయాల్లో దానికే పెద్ద పీట వేశారు. 1859లో నిజాం ప్రభుత్వం ప్రతి తాలూకాలోను, ప్రతి జిల్లా కేంద్రంలోను ఒక పర్షియన్ పాఠశాలను, ఒకదేశ భాషా పాఠశాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఇటీవలికాలం వరకు తెలంగాణా ప్రాంతంలో పర్షియన్ భాష ప్రాబల్యానికిది కారణమైంది. సమర్థమైన పరిపాలనకు విద్యావంతులైన సిబ్బంది ఆవశ్యకతను గుర్తించిన సాలార్‌జంగ్ విద్యారంగంలో కొన్ని సంస్కరణల్ని ప్రవేశపెట్టాడు. దీని ఫలితంగా హైదరాబాద్ నగరంలో ఇంగ్లీషువిద్యను బోధించే పాఠశాలలు వచ్చాయి. 1877 లో నెలకొల్పిన చాదర్ఘాటు పాఠశాల (నేటి నిజాం కాలేజి), ఉన్నత వర్గాలకు చెందినవారి పిల్లలకోసం స్థాపించిన మద్రసా ఆలియా పాఠశాల, రోమన్ క్యాథలిక్కులు నెలకొల్పిన ఆల్ సెయింట్స్ హైస్కూలు మొదలైనవి హైదరాబాద్ నగరంలో పాశ్చాత్య విద్యా వ్యాప్తికి తోడ్పడినాయి. 1883లో నిజాం రాష్ట్రానికి రెండున్నర లక్షల రూపాయల బడ్జెటు గ్రాంటుతో ప్రత్యేక విద్యాశాఖ ఏర్పడింది. ఈ చర్యలు తెలంగాణా ప్రాంతపు విద్యాభివృద్ధికి అంతగా తోడ్పడలేదు. 1901 నాటికి తెలంగాణా ప్రాంతంలో రమారమి 10 ఉన్నత పాఠశాలలు, 30 మాధ్యమిక పాఠశాలలు మాత్రమే ఉండేవి.

అరవయ్యో శతాబ్ది ప్రారంభం వరకు దేశంలో ప్రాథమిక విద్యాప్రచారం వ్యాప్తికి రాలేదు. గోపాలకృష్ణ గోఖలే వంటి నాయకుల విజ్ఞప్తుల మేరకు 1904-5 లో కేంద్రంలో ప్రత్యేకంగా విద్యాశాఖ ఏర్పాటైంది. 1920లో స్థానిక సంస్థలు ప్రాథమిక విద్యను నిర్బంధంగా అమలు జరపడానికి మద్రాసు ప్రాథమిక విద్యాశాసనం వెలువడింది. దీని ఫలితంగా రూపొందిన జిల్లా విద్యా సంఘాలు (District Educational Council) ప్రాథమిక విద్యా వ్యాప్తికి కృషి చేశాయి.

1937 లో దేశీయ పరిస్థితులకు అనుగుణమైన బేసిక్ విద్యా విధానాన్ని గాంధీజీ ప్రతిపాదించడం జరిగింది. జకీర్ హుస్సేన్ అధ్యక్షతన యీ పథకాన్ని గూర్చి 1938లో ఒక నివేదికను సమర్పించారు. ఏడేండ్ల నుండి పద్నాలుగేండ్ల వయస్సులోని పిల్లలకు నిర్బంధంగాను, ఉచితంగాను మాతృభాషలో వృత్తి ప్రాతిపదికగా ప్రాథమిక విద్యను బోధించాలనే ఈ పథకం సిఫారసులను అప్పటి విద్యావిషయక కేంద్ర సలహా సంఘం ఆమోదించింది. 1946లో యీ విధానం మద్రాసు రాష్ట్రంలో అమలుకు వచ్చింది. యీ కాలంలోనే బేసిక విద్యావిధానం గూర్చి ఉపాధ్యాయులకు తగిన శిక్షణనివ్వడానికి ఆంధ్రదేశంలో కొన్ని కేంద్రాలు ఏర్పాటయ్యాయి.

1902-11 సంవత్సరాల మధ్యకాలంలో దేశంలో పొడసూపిన సాంఘిక రాజకీయ చైతన్యం మాధ్యమిక పాఠశాలల అభివృద్ధికి దోహదం చేసింది. ఈ కాలంలో మాధ్యమిక పాఠశాలలు ప్రభుత్వోద్యోగాలకు, కళాశాలల్లో ప్రవేశానికి అర్హతను చేకూర్చేవి కాబట్టి బాగా వ్యాప్తిని పొందాయి. 1910 లో మద్రాసు ప్రభుత్వం వృత్తి విద్యకు స్థానాన్ని కల్పిస్తూ మెట్రిక్యులేషన్ పరీక్షకు మారుగా (S.S.L.C. (Secondary School Leaving Certificate) పరీక్షను ఏర్పాటు చేసింది. అప్పట్లో జనాదరణ పొందిన ఈ పరీక్షా విధానం ఇటీవలి కాలం వరకు అమల్లో ఉండింది.

భారతదేశంలో కళాశాల విద్యను పెంపొందించడానికి 1902 లో ఇండియన్ యూనివర్సిటీస్ కమిషన్ ఏర్పాటైంది. 1904 లో విశ్వ కళాపరిషత్తు చట్టం అమల్లోకి వచ్చింది. దీని ఫలితంగా పరీక్షల నిర్వహణకు పరిమితమై ఉండిన విశ్వకళాపరిషత్తులు బోధన కేంద్రాలుగా అభివృద్ధికావడానికి అవకాశం కలిగింది. ఈ చట్టానుసారంగానే సెనేటు, కార్యనిర్వాహక వర్గమైన సిండికేటు విశ్వవిద్యాలయ ముఖ్యాంగాలయ్యాయి. 1921 లో మద్రాసు రాష్ట్రంలో ద్వంద్వ ప్రభుత్వం నెలకొనింది. దీని పర్యవసానంగా ప్రభుత్వం విద్యాశాఖను మంత్రి వర్గానికి అప్పగించింది.

1902-47 సంవత్సరాల మధ్యకాలంలో సంభవించిన రాజకీయ పరిణామాలవల్ల కొందరు విద్యార్థులు ఆంగ్ల విద్యాలయాలనుండి బహిష్కృతులు కావడమో స్వచ్ఛందంగా చదువు మానడమో జరిగింది. ఇలాంటి విద్యార్థులకోసం ఆ రోజుల్లో ఆంధ్రదేశంలో జాతీయ పాఠశాలలు ఏర్పాటయ్యాయి. రాజమండ్రిలో



BRAOU

వందేమాతరం పాఠశాల, బందరులో జాతీయ కళాశాలలు ఏర్పాటయ్యాయి. రాజమండ్రిలో వందేమాతరం పాఠశాల, బందరులో జాతీయ కళాశాల ఆ విధంగా ఏర్పాటైనవే గాడిచర్ల హరిసర్వోత్తమరావు, కోపల్లె హనుమంతరావు, ముట్నూరి కృష్ణారావు మొదలైనవారు ఈ విషయంలో కృషిచేశారు. ఆంధ్రదేశంలో రాజకీయ సాంఘిక చైతన్యానికీ సాంస్కృతిక పురుజ్జీవనానికి బందరు జాతీయ కళాశాల తోడ్పడింది.

ఈకాలంలోనే భిన్న భాషా సంస్కృతుల సంసర్గంతోడి వాతావరణంలో రాజకీయంగా విద్యా విషయంగా, సాంస్కృతికంగా పురోగమించలేకపోతున్నామన్న అభిప్రాయం ఆంధ్రుల్లో బలపడింది. ఈ అసంతృప్తి ప్రత్యేకాంధ్ర రాష్ట్ర వాంఛకు కారణమైంది. ఆంధ్రోద్యమంలో భాగంగా తెలుగు జిల్లాలోని ప్రజల విద్యాభివృద్ధి కోసం ప్రత్యేక విశ్వవిద్యాలయం కావాలన్న ఆంధ్రుల కోరిక ఈకాలంలో ఆంధ్ర విశ్వవిద్యాలయ స్థాపన (1926) తో నెరవేరింది. డాక్టర్ కట్టమంచి రామలింగారెడ్డి దీనికి ప్రథమ ఉపాధ్యక్షులుగా నియమితులయ్యారు. భారత దేశంలో భాషాపరంగా వ్యవస్థితమైన మొదటి విశ్వవిశ్వవిద్యాలయం ఇదే. అసలీ విశ్వవిద్యాలయ స్థాపన తెలుగు మాధ్యమంలో స్నాతకోత్తరస్థాయి దాకా బోధించాలనే లక్ష్యంతో జరిగినా ఈ నాటికి అలా జరగలేదు. రాష్ట్రం లోని ఇతర విశ్వవిద్యాలయాలతోబాటు 1960 నుండి ఇంటర్, 1971 నుండి డిగ్రీ స్థాయిలో తెలుగు ఇక్కడ కూడా బోధన మాధ్యమమయింది. తెలుగు, ఒరియా భాషల్లో మెట్రిక్యులేషన్ స్థాయి దాకా బోధనకు, పరీక్షల నిర్వహణకు అనుమతించిన మొదటి విశ్వవిద్యాలయం కూడా ఇదే.

మీర్ ఉస్మాన్ అలీ కాలంలో హైదరాబాద్‌లో ఏర్పాటైన ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలంగాణా ప్రాంతంలో ఉన్నత విద్యా వ్యాప్తికి దోహదం చేసింది. విశ్వ విద్యాలయ స్థాయిలో ఉర్దూను బోధన భాషగా ప్రవేశ పెట్టడం ద్వారా ఇది ఒక ప్రత్యేకతను పొందింది. కాని స్వాతంత్ర్యానంతరం దేశంలోని యితర విశ్వవిద్యాలయాల ఒరవడిని అనుసరించి ఉర్దూకు బదులుగా ఇంగ్లీషును బోధనా భాషగా చేసింది. ఒక నిజాం కళాశాల మట్టుకు ఇంగ్లీషు బోధన భాషగా మద్రాసు విశ్వవిద్యాలయానికి అనుబంధంగా ఉండేది.

భారతదేశంలో జాతీయ ఆదర్శాలకు, అవసరాలకు అనుగుణంగా విద్యా విధానాన్ని తీర్చిదిద్దడానికి స్వాతంత్ర్యానంతరం నుండీ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయి. ఈ ప్రయత్నంలో భాగంగా 1948లో డాక్టర్ రాధాకృష్ణన్ అధ్యక్షతన విద్యాలయాల కమిషన్, 1952లో లక్ష్మణస్వామి మొదలియార్ అధ్యక్షతన 'సెకండరీ విద్యా కమీషన్', 1964లో కొఠారీ అధ్యక్షతన 'భారత విద్యా కమీషన్' ఏర్పాటయ్యాయి. 1953లో ఉన్నత విద్యకు సంబంధించిన కార్యకలాపాల్ని సమన్వయం చేయడానికి 'విశ్వ విద్యాలయ విరాళాల సంఘం' (University Grants Cmmission) స్థాపితమైంది. భారత రాజ్యాంగాన్ని అనుసరించి విద్య రాష్ట్ర జాబితాలో చేరినందువల్ల జాతీస్థాయిల్లో రూపొందిన పథకాల్ని రాష్ట్ర అవసరాలకు అనుగుణంగా అమలు జరిపే బాధ్యత ఆయా రాష్ట్ర ప్రభుత్వాల అధీనమైంది.

1965లో అమల్లోకి వచ్చిన జాతీయ విద్యా విధానాన్ని అనుసరించి ఆంధ్రప్రదేశ్‌లో '10 + 2 +' విద్యా విధానం అమల్లో ఉంది. ఈ పద్ధతిని అనుసరించి 10 సంవత్సరాల సెకండరీ కోర్సు తర్వాత 2 సంవత్సరాల హయ్యర్ సెకండరీ/ఇంటర్మీడియట్ కోర్సు' ఆ తర్వాత 3 సంవత్సరాల మొదటి డిగ్రీ కోర్సు లేదా ఇతర సాంకేతిక వైద్య కోర్సులు ఉంటాయి. దీని పర్యవసానంగా రాష్ట్రంలో 1969-70 విద్యా సంవత్సరం నుండి రెండేళ్ల ఇంటర్మీడియట్ కోర్సు అమల్లోకి వచ్చింది. ఆ సంవత్సరమే 'గ్విన్ కమిటీ', సిఫారసుల మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఇంటర్మీడియట్ కోర్సు స్థాయిలో ఆంగ్లంతోబాటు తెలుగునుకూడా బోధన భాషగా ప్రవేశపెట్టింది. 1971-72 విద్యా సంవత్సరంలో డిగ్రీ స్థాయిలో తెలుగును బోధనా భాషగా ప్రవేశపెట్టడం జరిగింది. రాష్ట్ర ప్రభుత్వ సూచన మేరకు రాష్ట్రంలోని కొన్ని విశ్వ విద్యాలయాలు 1985-86 విద్యా సంవత్సరం నుండి పోస్ట్ గ్రాడ్యుయేట్ స్థాయిలో చరిత్ర, రాజనీతిశాస్త్రం, ప్రభుత్వ పాలనా శాస్త్రాలనూ, 1986-87 నుంచి, అర్థ, వాణిజ్య, సమాజ శాస్త్రాలను తెలుగులో బోధించడానికి సూత్రప్రాయంగా అంగీకరించాయి. 1968లో నెలకొల్పిన 'తెలుగు అకాడమి' కళాశాల, విశ్వ విద్యాలయ స్థాయిలో అవసరమైన ప్రామాణిక పాఠ్య, పఠనీయ పుస్తకాల్ని తెలుగులో తయారుచేయడానికి కృషి చేస్తోందని మీరు 14వ భాగంలో తెలుసుకున్నారు.

ఆంధ్రరాష్ట్ర అవతరణ నుండి ప్రభుత్వం అమలు జరుపుతున్న పథకాల ద్వారా సాధారణ, సాంకేతిక, వైద్య విద్యారంగాల్లో గణనీయమైన అభివృద్ధి వచ్చింది. 1972-83 నాటికి పంచాయితీల, మునిసిపాలిటీల నిర్వహణలోను, ప్రైవేటు యాజమాన్యం కింద, ప్రభుత్వ అధ్వర్యంలోను ఉన్న **41,291** **ప్రాథమిక పాఠశాలల్లో**



BRAOU

58.61 లక్షలమంది, 5,050 మాధ్యమిక పాఠశాలల్లో 9.82 లక్షలమంది, 4,031 ఉన్నత పాఠశాలల్లో 10.05 లక్షల మంది విద్యార్థులు నమోదు అయ్యారు. అదే సంవత్సరంలో ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్యంలోని మొత్తం 567 జూనియర్ కళాశాలల్లో విద్యార్థుల సంఖ్య 2.37 లక్షలకు చేరుకొంది. 1982-83 నాటికి డిగ్రీ కళాశాలల సంఖ్య 317కు పెరిగింది.

ఆర్థిక సామాజిక కారణాలవల్ల రాష్ట్రంలో బడికి వెళ్లే ఈడుగల పిల్లలు నిర్బంధ ప్రాథమిక విద్యాపథకం కిందికి రాకపోవడం పాఠశాలల్లో నమోదైన పిల్లలు గణనీయమైన సంఖ్యలో బడి మానడం (Dropouts) జరుగుతోంది. అందువల్ల బడి పిల్లల హాజరును మెరుగుపరచడానికి, గ్రామీణ ప్రాంతాల్లో బడికివెళ్లే వయస్సు కలిగిన పిల్లలకు, షెడ్యూల్డు కులాలకు చెందిన పిల్లలకు విద్యావకాశాన్ని మెరుగుపరచడానికి ప్రభుత్వం అనేక చర్యలు తీసుకొంటోంది. 1979-80లో ప్రారంభమైన 'అనియత విద్యా కేంద్రాల' (Nonformal Education Centres) ద్వారా ఐదేళ్ళ ప్రాథమిక విద్యా పాఠ్య ప్రణాళికను రెండేళ్ళకుదించి బడిమానిన గ్రామీణ ప్రాంతాల్లోని 9-14 సంవత్సరాల మధ్య ఉన్న పిల్లలకు విద్యా బోధన జరుపుతున్నారు. 1982-83 నాటికి, 6,780 అనియత విద్యా కేంద్రాలద్వారా 1,50,000 మంది పిల్లలు ఈ పథకం పరిధిలోకి వచ్చారు. 1983లో ప్రారంభించి కొన్ని మార్పులతో అమలు జరుపుతున్న మధ్యాహ్నభోజన పథకం తాత్కాలికంగా ఆగిపోయింది. 1985-86 విద్యా సంవత్సరం నుండి బడి పిల్లలకు ఉచితంగా పాఠ్య పుస్తకాల్ని, బట్టల్ని పంపిణీచేసే పథకాలన్నిటిని యిటీవల ప్రభుత్వం సూత్రప్రాయంగా ఆమోదించింది. షెడ్యూల్డు కులాలకు, తెగలకు చెందిన విద్యార్థులకు విద్యావకాశాల్ని కల్పించడానికి విద్యాప్రమాణాల్ని మెరుగుపరచడానికి ప్రతిజిల్లాలోను బాలబాలికలకు ప్రత్యేకంగా ఆశ్రమ పాఠశాలల్ని (Residential Schools) నెలకొల్పే పథకాన్ని ప్రభుత్వం రూపొందించి అమలుజరుపుతోంది.

ప్రభుత్వం చేపట్టే అభివృద్ధి పథకాలు వాటిని ఆకళింపు చేసుకొనే ప్రజల్నిబట్టి ఫలితాల్ని ఇస్తాయి. 1981 జనాభా లెక్కల ప్రకారం ఆంధ్రప్రదేశ్‌లో అక్షరాస్యులశాతం 29.94 మాత్రమే. ప్రజాస్వామ్య విజయానికి అక్షరాస్యతకు ఉన్న సంబంధాన్ని గుర్తించిన ప్రభుత్వం సాంప్రదాయిక విద్యాభ్యాసానికి దూరమైపోయిన వయోజనులకు పనికివచ్చే విద్యను నేర్పడానికి కొన్ని పథకాల్ని రూపొందించి అమలు జరుపుతోంది. కేంద్రంలోని 'Rural Functional Literacy Project' సహకారం[illegible] ప్రభుత్వం 1979లో వయోజన విద్యా పథకాన్ని (Adult Education Programme) పెద్ద ఎత్తున చేపట్టింది. సుశిక్షితులైన కార్యకర్తలు నూతన వ్యవసాయ పద్ధతులు, కోళ్ళ పెంపకం, పారిశుధ్యం, [illegible] వ్యాధుల నివారణ, కుటుంబనియంత్రణ, పిల్లల పెంపకం మొదలైన విషయాల్ని వయోజనులకు బోధిస్తున్నారు. దీనికి నెహ్రూయువక కేంద్రాలు, జాతీయ సేవాపథకం వాలంటీర్లు, కొన్ని స్వచ్ఛందసేవా సంస్థలు కూడా సహకరిస్తున్నాయి. 1982-83 నాటికి రాష్ట్రంలోని 4,000 వయోజన కేంద్రాలద్వారా 5.[illegible]2 లక్షలమంది ఈ పథకం కిందికి వచ్చారు.

సాంప్రదాయిక విద్యార్జనకు దూరమై చదువుకోవాలన్న ఆసక్తికలవారికి అవకాశం కల్గించే ప్రయత్నంలో భాగంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం దేశంలోనే ప్రథమంగా 1983లో హైదరాబాద్‌లో సార్వత్రిక విశ్వ విద్యాలయాన్ని (A.P. Open University) నెలకొల్పింది. ఇది కనీస విద్యార్హత లేకపోయినా ప్రవేశపరీక్షలో ఉత్తీర్ణులైన వారికి అధ్యయన కేంద్రాల ద్వారా బి.ఏ; బి. ఎస్సి; వంటి డిగ్రీ కోర్సుల్ని, డిగ్రీ తర్వాత కొన్ని వృత్తి విద్యా కోర్సుల్ని పి.జి. కోర్సులను పూర్తిచేయడానికి చక్కటి అవకాశాల్ని కల్పిస్తోంది. రాష్ట్రేతర ప్రజల్నికూడా ఇది ఆకర్షిస్తోంది. మారుతున్న సామాజిక అవసరాలకు తగ్గట్టు, స్త్రీ విద్యను పెంపొందించే చర్యల్లో భాగంగా ప్రభుత్వం 1983లో తిరుపతిలో శ్రీ పద్మావతీ మహిళా విశ్వవిద్యాలయాన్ని నెలకొల్పింది. పోషణ, పత్రికా రచన, కంప్యూటర్ సైన్స్ వంటి కొత్త కోర్సుల్ని యిది ప్రవేశపెట్టింది.

ఆంధ్రదేశంలో నాగార్జునాచార్యుడు (క్రీ.పూ. 15 - క్రీ.శ. 75) స్థాపించిన విశ్వవిద్యాలయం విదేశీయుల్ని కూడా ఆకర్షించింది. నాటి వైభవాన్ని తలచుకొని కవులు 'అమరావతీ పట్టణమున బౌద్ధులు విశ్వవిద్యాలయముల స్థాపించునాడు' అని పులకితులయినారు. ఆ ప్రాచీన విద్యావైభవాన్ని తలపింపచేయడానికి ప్రభుత్వం నాగార్జుని పేరుమీదుగా 1976లో గుంటూరు సమీపంలో విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటుచేసింది. ఇందులో మహాయాన బౌద్ధానికి సంబంధించిన అంతర్జాతీయ అధ్యయన పీఠాన్ని నెలకొల్పడానికి గాను భూటాన్ రాజు ఇటీవల భూరి విరాళం అందజేశారు. ఈ విధంగానే కాకతీయ విశ్వవిద్యాలయం వరంగల్లులోనూ, శ్రీకృష్ణదేవరాయ విశ్వ విద్యాలయం అనంతపురంలోనూ ఏర్పాటయ్యాయి.



BRAOU

రాష్ట్రావతరణం తర్వాత వ్యవసాయం, వైద్యం, సాంకేతికవిద్య అభివృద్ధి చెందింది. 1964 నాటి రాష్ట్ర శాసనసభ సభాచట్టంద్వారా రాజేంద్రనగర్ (హైదరాబాద్)లో వ్యవసాయ విశ్వవిద్యాలయం స్థాపితమయింది. దీనికి అనుబంధంగా ఉన్న కళాశాలల్లో రాష్ట్ర అవసరాలకు అనుగుణంగా హార్టికల్చరల్ అగ్రికల్చరల్ ఇంజనీరింగ్, డైరిటెక్నాలజి కోర్సులు ఇటీవల ప్రారంభమయ్యాయి. 1972లో హైదరాబాద్‌లో జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విద్యాలయం ఏర్పాటయింది. వైద్యవిద్యాబోధనను మెరుగుపరచడానికి ప్రత్యేక విశ్వవిద్యాలయ ఆవశ్యకతను ప్రభుత్వం గుర్తించింది. తెలుగు సంస్కృతి పరిరక్షణకు 'తెలుగు విజ్ఞాన పీఠం' పేరిట విశ్వ విద్యాలయం స్థాపితమవుతున్నది.

ఆంధ్రప్రదేశ్ అవతరణ తర్వాత సంభవించిన రాజకీయ పరిణామాలు, రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల అభివృద్ధి సమతూకంలో లేదని లేవదీసిన కొన్ని ఉద్యమాలు విద్యారంగంపై ప్రభావాన్ని కనబరచాయి. 1973లో కేంద్ర ప్రభుత్వం ఆమోదించిన ఆరుసూత్రాల పథకం ప్రకారం నిర్ణీతనిష్పత్తిలో రాష్ట్రంలోని ఆయా ప్రాంతాలవారికి విద్యాసంస్థల్లో ప్రవేశం కల్పిస్తున్నారు. ఈ దశాబ్దిలో రాష్ట్రంలో ప్రైవేటు యాజమాన్యం కింద ఇంజనీరింగ్, పాలిటెక్నిక్, బి.ఇడి., కళాశాలలు వెలిశాయి. విరాళాల్ని వసూలు చేయడం (Capition Fees) ద్వారా ఇవి విద్యా రంగంలో వ్యాపార ధోరణిని ప్రవేశపెట్టాయి. 1983లో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చాక విరాళాల్ని వసూలు చేసే పద్ధతిని చట్టరీత్యా నిషేధించింది. ప్రవేశపరీక్షల నిర్వహణ ద్వారా ప్రభుత్వం ఆయా కోర్సుల్లో ప్రవేశాన్ని క్రమబద్ధం చేసింది. పాఠశాల, కళాశాల స్థాయిలో వృత్తివిద్యకు ప్రాధాన్యం కల్పించడం ద్వారా విద్యారంగంలో మార్పును తీసుకొని రావడానికి యిటీవల ప్రభుత్వం చర్యలు తీసుకొంటోంది.

ఆంధ్ర ప్రాంతంలో పెద్దాపురం, విజయనగరం సంస్థానాల్ని; తెలంగాణాలో నిజాము దర్బారు, గద్వాల సంస్థానాన్ని; రాయలసీమలో కర్నూలు నవాబుల ఆస్థానాన్ని అంటిపెట్టుకొని ఈకాలంలో చిత్రకళ కొంత వరకు కొన ఊపిరితో మనగలిగింది. ఆరోజుల్లో భారతదేశమంతటా అమల్లో ఉండిన మొగలు చిత్రకళారీతి ఆంధ్ర చిత్రకళపై కూడా ప్రభావం నెరపింది. కొన్ని సందర్భాలలో దాని ప్రభావం సోకని ప్రత్యేక శైలిని ఆంధ్ర చిత్రకారులు వ్యక్తంచేశారు. కర్నూలు నవాబుల్ని ఆశ్రయించిన కొందరు చిత్రకారులు కనబరచిన విచక్షణ శైలినే కర్నూలు చిత్రకళాశైలిగా (Kurnool School of Painting) ఆధునిక కళా విమర్శకులు వ్యవహరిస్తున్నారు. గద్వాల చిత్రకారులు గద్దయీకల మూలానికి ఉడుతతోక వెంట్రుకల్ని కుచ్చుగా కట్టి సన్నటి చిత్రరేఖల్ని తీర్చిదిద్దే వారు. ఇటీవలికాలం వరకు సోమనాద్రి (1760 ప్రాంతంనాటి గద్వాల ప్రభువు) వంటి చిత్రాల్ని వారారీతిగానే చిత్రించేవారు. ఈకాలంలో చిత్రకళ జానపదకళగాను, చేతిపనిగాను మారి కొంతమందికి బతుకుతెరువును కల్పించింది. బందరు కలంకారీ అద్దకంవారు రంగ్రేజీ (రంగులువేసేవాడు) వారుగా వ్యవహరింపబడినారు. ఆంధ్ర దేశంలో నేడది ఒక కులంగా కూడా నిలిచిపోయింది.

దేవాలయాలు, రాజ భవనాలవంటి గొప్ప కట్టడాల్ని చేపట్ట కలిగిన ప్రభువులు కరవైన కాలం నుంచే శిల్ప చిత్రకళలు వాస్తు కళకు దూరమైన సంగతి ప్రస్తావించడం జరిగింది. శిల్ప చిత్రకళలు కొంతవరకు జానపద కళల్ని అంటిపెట్టుకొని కొన ఊపిరితో మనగలిగాయి. ఇరవయ్యో శతాబ్దిలో ఆంధ్రదేశంలో సంభవించిన సాంస్కృతిక పునరుజ్జీవనోద్యమం చిత్రకళపై ప్రభావాన్ని కనబరచింది. ఈకాలంలో అవనీంద్రనాథ్ ఠాకుర్ నందలాల్‌బసు మొదలైన ప్రసిద్ధ రంగ చిత్రకారులు ఆంధ్ర చిత్రకారులపై తమ ముద్ర పడేలా చేశారు. రాజ మహేంద్రవరంలో ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాలుగా ఉండిన ఆస్వాల్డ్ జేమ్స్ కూల్డ్రే, బందరు జాతీయ కళాశాలలోని ప్రమోద్‌కుమార్ ఛటోపాధ్యాయ వంటి కళాభిజ్ఞులు ఆంధ్ర చిత్రకళా వికాసానికి దోహదం చేశారు.

ఆంధ్రదేశంలో లలిత కళలు పునర్వికాసాన్ని పొందిన ఈ కాలంలో ప్రాచ్య పాశ్చాత్య చిత్రకళా రీతుల సమ్మేళనం చెందాయి. పాశ్చాత్య చిత్రకళా రీతుల్ని కరతలామలకం చేసుకొన్న కొందరు చిత్రకారులు ఆంధ్ర సంప్రదాయానికి ఒరవడి పెట్టారు. వారిలో దామెర్ల రామారావు ప్రముఖుడు. ఆయన చిత్రించిన "గోదావరి కనుమ" కలకత్తాలోని అప్పటి వైస్రాయి రీడింగ్‌ను ముగ్ధుణ్ణి చేసింది. ఆయన సృజించిన మరో కళా ఖండమైన 'సిద్ధార్థుని రాగోదయము' టొరాంటో నగరంలో ఏర్పాటైన కెనెడియన్ భారతీయ చిత్రకళా ప్రదర్శనలో పలువురి ప్రశంసల్ని అందుకున్నది. ఈ కాలంలోనే అడవిబాపిరాజు, సి.ఎస్. వెంకటరావు, భగీరథి వంటి చిత్ర కారులు అద్భుత వర్ణన సమ్మేళనంతో భావలాలిత్యాన్ని, ప్రకృతి రమణీయకతను ఆవిష్కరించారు. 'దామెర్ల రాముణ్ణి సీమలో మెచ్చారని "అడవి బావడి పేరుపడలేదదింకాను పడుతుంది దొరలలో బడిన యప్పుడ'ని దుగ్గిరాల గోపాలకృష్ణయ్య ఆంధ్ర చిత్రకళకు ఒక గుర్తింపు తెచ్చిన కళాకారుల్ని ప్రశంసించారు. (ఆంధ్రరత్న చాటు ధార)



BRAOU

సంగీతం విషయంలో తెలుగుభాష దక్షిణ భారతదేశంలో వ్యాప్తిని, ప్రతిష్ఠను సంపాదించుకొనింది. 18, 19వ శతాబ్దాల్లో దక్షిణదేశంలోని తంజావూరు, మధుర, పుదుక్కోట మొదలైన రాజాస్థానాలలో తెలుగు వాగ్గేయ కారులు తమ ప్రతిభావ్యుత్పత్తుల్ని ఎలుగెత్తి చాటారు. ఈ కాలంలోనే కర్ణాటక సంగీత కళలో తెలుగుభాషకు సాంప్రదాయికంగా ఒక విశిష్ట స్థానం లభించింది. నాదోపాసకుడు, ఆధ్యాత్మిక తత్త్వవేత్త ఐన త్యాగరాజు (1767-1847) కర్ణాటక సంగీతానికి స్ఫూర్తిని, కీర్తిని కలిగించి నూతనశకాన్ని నెలకొల్పినాడు. ఆయన వెలయించిన కృతులు నేటికీ సంగీతారాధకులకు నిత్యసమారాధనగా వెలుగొందుతున్నాయి. సంగీతవిద్యకు తంజావూరు పుట్టినిల్లయినా ఈకాలంలో విజయనగరం (విశాఖపట్టణ సమీపంలోనిది) మెట్టినిల్లుగా ప్రసిద్ధిపొందింది. ఆనంద గజపతిరాజు (1850-1897) పోషణలోని ప్రసిద్ధవీణావాదన విద్వాంసుడైన వీణ వెంకటరమణదాసు లార్డ్ కర్జన్ చేత ప్రశంసింపబడి సన్మానితుడైనాడు.

ఆధునిక భిత్తి చిత్ర రచన, శిల్పం వంటి కళలు విస్మృతాలయ్యాయి. సంగీతం, నాట్యం వంటి కళలు ఆయా కళాకారుల వైయక్తిక సాధనవల్ల, జమీందారుల పోషణవల్ల వర్ధిల్లాయి. విజయనగర సంస్థానం సంగీత కళాకారులకు పట్టుగొమ్మగా ఉండేది. 19వ శతాబ్దిలో భోగం మేళాలను అంటి పెట్టుకొని, అవినీతికి దారి తీసేదిగా భావింపబడిన నాట్యకళ ఈ కాలంలో ఒక గౌరవస్థానాన్ని పొందింది. నాట్యకళా సంప్రదాయంలో ఆంధ్రులకు ఒక ప్రత్యేకతను చేకూర్చి పెట్టిన కూచిపూడి నృత్యం ఈ కాలంలో ఏకపాత్ర కేళికలుగా పరిణామాన్ని పొందింది. పురుషులకే పరిమితమై ఉండిన ఈ నాట్య సంప్రదాయాన్ని ఈ కాలంలో స్త్రీలు కూడా అభ్యసించడానికి ముందుకు వచ్చారు. చలన చిత్ర నిర్మాణానికి గట్టి పునాదులు పడిన ఈ కాలంలో సంగీతం, నాట్యం, నాటకాలు చలన చిత్రాలు మొదలైన కళారూపాలు విస్తృతి చెందడం వల్ల స్త్రీలు అధిక సంఖ్యలో కళారంగంలో ప్రవేశించి తమ కళాపాటవాన్ని నిరూపించుకొన్నారు. ఈ కాలంలో సాంఘిక సంప్రదాయాల విషయంలో ప్రజల దృక్పథంలో కలిగిన మార్పు కళారంగంలో కూడా ప్రతిఫలించింది.

వాస్తు శిల్పం, చిత్రలేఖనం, సంగీతం, నాట్యంవంటి కళలు స్వాతంత్ర్యానంతరం మార్పుకు లోనయ్యాయి. అంతర్జాతీయ ధోరణులు ఒక వంక, దేశీయ పరిస్థితులు మరోవంక వీటిపై ప్రభావాన్ని కనబరుస్తున్నాయి. జాతీయోద్యమంనాటి ఉద్వేగం నుండి, పునరుజ్జీవన దశలోని గత వైభవస్మరణనుండి బయటపడ్డ కళాకారుడు ఈకాలంలో వాస్తవ పరిస్థితుల్ని ఎదుర్కోవలసి వచ్చింది. కళా ఖండాల్ని కొనుగోలు చేసేవారి సంఖ్య తగ్గటంతో కళాకారులు జీవికకోసం తంటాలు పడవలసి వచ్చింది. అన్యవృత్తుల్ని వెతుక్కో వలసిన పరిస్థితులవల్ల ఈ కాలంలో కళాసృష్టి కొందరికి హాబీగాకూడా పరిణమించింది. కళ ఆనందంకోసం కాక సామాజిక చైతన్యానికి తోడ్పడాలనే భావం కొందరిలో ప్రబలింది. కొన్ని రాజకీయ పార్టీలవారు బుర్రకథవంటి జానపద కళారూపాల్ని సిద్ధాంతాల ప్రచారంకోసం వాడుకొంటున్నారు. ప్రభుత్వం అమలు జరుపుతున్న కుటుంబనియంత్రణ వంటి కార్యక్రమాల ప్రచారంలోకూడా ఇవి చోటు చేసుకున్నాయి. రేడియోశాఖవారు నిర్వహిస్తున్న అఖిల భారత సంగీత కార్యక్రమాలు కొన్ని సంస్థలు ఏర్పాటుచేస్తున్న వాగ్గేయకారుల ఆరాధనోత్సవాలు. ఆకాశవాణి దూరదర్శన్‌లు సమర్పించే పాశ్చాత్యనృత్య సంగీత కార్యక్రమాలు, విదేశాలనుండి వచ్చే సాంస్కృతిక బృందాలు మొదలైనవి కళారంగంపై ప్రభావాన్ని కనబరుస్తున్నాయి.

సామాజిక రంగంలో మార్పులకు, అవసరాలకు తగ్గట్టుగా భారతదేశంలోని ఇతర ప్రాంతాల్లోవలె ఆంధ్ర దేశంలోనూ వాస్తుకళలో ఆధునికరీతులు ప్రవేశించాయి. గుళ్ళూ గోపురాలు కట్టడం తగ్గిపోయింది. వాటికి బదులుగా విద్యాలయాలు, వైద్యాలయాలు, ప్రభుత్వ కార్యాలయాలు, ఆనకట్టలు కట్టే రోజులు వచ్చాయి. భవన నిర్మాణంలో రాయి, ఇటుక, సున్నం బదులుగా ఇనుము, కంకర, సిమెంటు, వాడకంలోకి వచ్చాయి. భవన నిర్మాణ శిల్పం, సరళరేఖల సాధాకృతి, కోణాలుగా తేలిన మూలలు, విశాలమైన కిటికీలు, ఆవరణ మొదలైన పాశ్చాత్య ప్రభావానికి లోనయింది. ఆధునిక చిత్రకళకూడా ఈ కాలంలో పాశ్చాత్య ప్రభావానికి లోనయింది. ఆధునిక చిత్రకళా రీతుల్లో నైరూప్య చిత్రరచన (Abstract Painting)ఎన్నదగింది. "లలితకళా అకాడమి', హైదరాబాద్‌లోని 'కళాకారులసమితి', రాజమండ్రిలోని "దామెర్లరామారావు ఆర్ట్‌గాలరి" మొదలైన సంస్థలు వ్యక్తిగత, సామాజిక చిత్రకళా ప్రదర్శనల్ని ఏర్పాటుచేసి కళాకారుల ప్రతిభా విశేషాలు వెల్లడి కావడానికి దారితీస్తున్నాయి. మాధవపెద్ది గోఖలే, కృష్ణారావువంటి ప్రసిద్ధ కళాదర్శకులు చలనచిత్ర రంగంలో కళకు ఒక గుర్తింపును తెచ్చారు. వివిధ పత్రికల విశేష సంచికలకు బాపు, వడ్డాదిపాపయ్య, చంద్ర వేస్తున్న ముఖచిత్రాలు (Cover designs) అందరినీ ఆకట్టుకొంటున్నాయి. పత్రికల ప్రోత్సాహంతో ఈనాడు అభివృద్ధి చెందిన చిత్రకళారీతుల్లో వ్యంగ్యచిత్రకళ, ప్రాచుర్యంలోకి వచ్చింది.



BRAOU

వైజ్ఞానిక ప్రగతి, అంతర్జాతీయ పరిస్థితులు, ప్రజల జీవనవిధానంలోను, అభిరుచిలోను కలిగిన మార్పు మొదలైనవి ఈ కాలంలో తెలుగువారి వేడుకలపై వినోదాలపై ప్రభావాన్ని కనబరచాయి. ఈకాలంలో ప్రధాన వినోదసాధనంగా పరిణమించిన చలనచిత్రాలు తెలుగువారికి చేరువై రాజకీయ, సాంస్కృతిక పరిణామంలో ప్రముఖపాత్ర నిర్వహించాయి. ఈకాలంలో ఆంధ్ర చలనచిత్రరంగం, నిర్మాణ ప్రదర్శన రంగాల్లో ముదంజ వేసింది.

భారతీయ నృత్యాన్ని సుసంపన్నం చేసిన ఆంధ్ర సంప్రదాయమైన కూచిపూడి నృత్యం ఈకాలంలో దేశవంలోను, విదేశాల్లోను బాగా మన్నన పొందింది వేదాంతం లక్ష్మినారాయణ శాస్త్రి), వేదాంతం సత్యనారాయణ శర్మ, యామినీ కృష్ణమూర్తి, కనకదుర్గ, శోభానాయుడు, సుమతీ కౌశల్, రాజారెడ్డి దంపతులు మొదలైన వారీ నృత్య సంప్రదాయాన్ని దేశంలో ప్రచారం చేస్తున్నారు. మద్రాసులో వెంపటి చినసత్యం నిర్వహిస్తున్న నృత్య శిక్షణ సంస్థలో ఆంధ్రేతరులుకూడా కూచిపూడి సంప్రదాయాన్ని నేర్చుకుంటున్నారు. కాకతీయుల కాలంలో బాగా ప్రచారం పొందిన "పేరిణీ శివ తాండవం" అనే దేశీయ నృత్యరీతిని నటరాజ రామకృష్ణ బాగా ప్రచారానికి తెచ్చారు. 1983లో వారు కేంద్ర అకాడమి బహుమతిని కూడా పొందారు.

దక్షిణ భారత కర్ణాటక సంగీతానికి ఆంధ్ర వాగ్గేయకారులు ఏవిధంగా స్ఫూర్తిని కలిగించారో మనం వెనకటి భాగల్లో గమనించి ఉన్నాం. మంగళంపల్లి బాలమురళీకృష్ణ, నూకల చినసత్యనారాయణ, నేదునూరి కృష్ణమూర్తి, ఓలేటి వేంకటేశ్వరులు మొదలైన వారు కర్ణాటక సంగీతంలో నేడు పేరు ప్రఖ్యాతులు పొందారు. ద్వారం వేంకటస్వామి నాయుడు (వయొలిన్), షేక్ చినమౌలా సాహెబ్ (నాదస్వరం), ఈమని శంకరశాస్త్రి), చిట్టిబాబు (వీణ) మొదలైనవారీ కాలంలో కళారంగాలలో ఆంధ్రులకు గుర్తింపును తెచ్చారు. నేడు విశేష జనాదరణ పొందుతున్న చలనచిత్రాలు సంగీతంపై ప్రభావాన్ని కనబరుస్తున్నాయి. వీటి ద్వారా ఘంటసాల వెంకటేశ్వర రావు అమర గాయకుడుగా గుర్తింపు పొందాడు. బాలసుబ్రహ్మణ్యం మంచి గాయకుడిగా ప్రఖ్యాతిపొందాడు.

ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో మద్రాసు, నిజాం రాష్ట్రంలో హైదరాబాద్ సాంస్కృతిక కేంద్రాలుగా ఉండేవి. అందువల్ల భిన్న నృత్య సంగీత సంప్రదాయాలు ఆంధ్రులకు పరిచయమయ్యాయి. హిందీ చిత్రాల ప్రదర్శనకూడా దీనికి దోహదం చేసింది. హిందుస్థానీ సంగీతం, కథక్ నృత్యం నేడు తెలుగు వారిని అలరిస్తున్నాయి. ఈ కాలంలో జానపద కళారూపాలకు కొంత ప్రోత్సాహం లభించింది. నాజర్ బుర్రకథ, ఆంధ్ర దేశంలో బాగా ప్రచారాన్ని పొందింది. ఇటీవలి కాలంలో గద్దర్ పాటలు ప్రజల్లో చైతన్యాన్ని కలిగిస్తున్నాయి.

### 25.4.5 వేడుకలు, వినోదాలు

గద్య చిత్రకవితలను త్రోసిరాజనిగేయ సాహిత్యం విరివిగా సృష్టింపబడింది. సమకాలికేతి వృత్తాన్ని ఆధారంగా తీసుకొని రచించిన వీరగాథలు జానపదులకు సన్నిహితమై వినోదం చేకూర్చాయి. ఈ జానపద సాహిత్యాన్ని దాసరులు పాటలుగా, జంగములు కథలుగా, జక్కులవాళ్లు జముకులు వేసి, గొల్లవారు గొల్లి సుద్దులుగా తెలుగుదేశంలో ప్రచారంచేసి ప్రజల్ని రంజింపజేశారు. బొబ్బిలికథ, సర్వాయి పాపని కథ (వరంగల్లు సుబావీరుడు), రాజాసోమనాద్రికథ (గద్వాల స్థాపకుడు), దేశింగురాజు కథ (చెంజీవీరుడు) మొదలైన శౌర్య కథానికాలు ప్రజల్లో బాగా వ్యాప్తిని పొందాయి.

యక్షగానాలు, వీథినాటకాలు, తోలుబొమ్మలాటలు తెలుగువారి ఆదరణకు పాత్రమయ్యాయి. లేపాక్షి, వేములపల్లి తాడిపత్రి, నెల్లూరు యక్షగాల మేళాలు ఆ రోజుల్లో ప్రసిద్ధికి వచ్చాయి. జుట్టుపోలిగాడు, కేతిగాడు బంగారక్క వంటి హాస్యపాత్రలు తోలుబొమ్మలాటల ద్వారా తెలుగువారి అభిమానాన్ని చూరగొన్నాయి.

స్వదేశీ ప్రభువుల ప్రాభవం అంతరించిన ఈకాలంలో మల్లవిద్య, గుర్రపు స్వారీ, కత్తిసాము వంటివి క్రమంగా అంతరించాయి. ఈ శతాబ్ది చివర బ్రిటిష్‌వారు ఆయుధ ప్రదర్శనల మీద విధించిన నిషేధాలు కూడా వీటిని అడుగంట చేశాయి. చదరంగం, పులిజూదం, అచ్చనగుండ్లు, వైకుంఠపాళీ వంటి ఇంటిపట్టు ఆటలు; కోతి కొమ్మచ్చి, ఉప్పాట, చెడుగుడు, కోలాటం వంటి బహిరంగ క్రీడలు తెలుగుదేశంలో బాగా వ్యాప్తిని పొందాయి. ఇప్పటికీ వినిపిస్తున్న 'ఒప్పులకుప్ప ఒయ్యారి భామ', 'చెమ్మచెక్క చేరడేసి మొగ్గ' అనే పాటలు ఒప్పులకుప్ప, చెమ్మచెక్క, తొక్కుడుబిళ్ల వంటి ఆటలు బాలికల్లో ఎంతగా ప్రచారాన్ని పొందాయో తెలియజేస్తున్నాయి.



BRAOU

సంక్రాంతి వంటి పండుగలు పబ్బాల్ని పురస్కరించుకొని తెలుగుదేశంలోని గ్రామీణ ప్రాంతాల్లో కోడి పందేలు, ఎడ్ల పందేలు మొదలైన వేడుకలీకాలంలో అమల్లో ఉండేవి. ఈ కాలంలో కోడిపందేలు పంతాలకు, పట్టింపులకు, పౌరుష ప్రతాపాల ప్రదర్శనకు దారి తీసిన సంఘటనలు తెలుగుదేశ చరిత్రలో కన్పిస్తాయి. జానపదగేయ రూపంగా ప్రచారానికి వచ్చిన 'పెద్దాపురం కోడి పుంజులకథ' దీనికి ఒక దృష్టాంతం. ఈనాటికి కొన్ని గ్రామాల్లో 'కోడి పందేల గరువు', 'గెలు పెద్దుల మాన్యం' అనే పేర్లతో సాగుతున్న స్థల వ్యవహారం ఒకప్పుడు తెలుగునాట కోడి పందేలకు ఎడ్ల పందేలకు ఉండిన ఆదరణను సూచిస్తోంది.

పండుగలు, వివాహాలు, విందులు, పేరంటం మొదలైన వేడుకల్ని పురస్కరించుకొని ఎన్నో ఆచార వ్యవహారాలు, ఆటపాటలు తెలుగుదేశంలో పరిపాటి అయ్యాయి. ఐదు రోజుల, మూడు రోజుల పెళ్ళిళ్ళు. ఆ వేడుకల్లో భాగంగా తలుపుల పాటలు, అంపకాల పాటలు అందరినీ అలరించేవి. ఈ కాలంలో వివాహం మొదలైన సందర్భాల్లో మేజువాణిలు ఆనవాయితీ అయ్యాయి. "ఈ దేశస్థులు (బందరు ప్రాంతం) తెలుగుదేశంలో ప్రచారంచేసి ప్రజల్ని రంజింపజేశారు. బొబ్బిలికథ, సర్వాయి పాపని కథ (వరంగల్లు సుబావీరుడు), రాజా సోమనాద్రికథ (గద్వాల స్థాపకుడు), దేశింగురాజు కథ (చెంజివీరుడు) మొదలైన శౌర్య కథానికాలు ప్రజల్లో బాగా వ్యాప్తి పొందాయి.

యక్షగానాలు, వీథినాటకాలు, తోలుబొమ్మలాటలు తెలుగు వారి ఆదరణకు పాత్రమయ్యాయి. లేపాక్షి, వేములపల్లి, తాడిపత్రి, నెల్లూరు యక్షగాల మేళాలు ఈ రోజుల్లో ప్రసిద్ధికి వచ్చాయి. జుట్టుపోలిగాడు, కేతిగాడు, బంగారక్క వంటి హాస్యపాత్రలు తోలుబొమ్మలాటల ద్వారా తెలుగువారి అభిమానాన్ని చూరగొన్నాయి.

ఒకప్పుడు తెలుగువారికి వినోద సాధనాలుగా ఉండిన వీధి నాటకాలు, తోలుబొమ్మలాటలు, జంగం కథలు, జముకుల కథలు మొదలైనవి యీ కాలంలో క్రమంగా ఆదరణ కోల్పోయాయి. ప్రజల అభిరుచిలో కలిగిన మార్పు వల్ల జానపద కళలవలె జానపద క్రీడలు కూడా పరిణామానికి లోనయ్యాయి. ఈ దశలోనే అవి వ్యాపార స్వరూపాన్ని సంతరించుకొన్నాయి. బ్రిటిష్ జాతీయుల తోడి సంపర్కం, పార్శీ నాటక సమాజాల ప్రదర్శనలు, పాశ్చాత్య దేశాల్లో అభివృద్ధి చెందిన చలన చిత్ర నిర్మాణ ప్రదర్శనలు తెలుగు వారిపై ప్రభావాన్ని కనబరచాయి. దీని ఫలితంగా క్రీడలు, నాటకాలు, చలన చిత్రాలు యీ కాలంలో అభివృద్ధి చెంది ప్రధాన సాధనాలుగా పరిణమించాయి.

BRAOU

వ్యాయామ విద్యా ప్రియులైన బ్రిటిష్ వారు ప్రభుత్వ పరంగా జాతీయ స్థాయిలోగాని, సాధారణ ప్రజల్లోగాని వ్యాయామ విద్యను ఒక క్రమ పద్ధతిలో ప్రచారం చేయడానికి కృషి చేయలేదు. క్రీడాభిమానులైన కొంత మంది సంస్థానాధీశులు, జమీందారులు ప్రాచ్య పాశ్చాత్య క్రీడల్ని కొంత వరకు పోషించారు. ఈ కాలంలోనే బ్రిటిష్ జాతీయులు సభ్యులైన క్లబ్బుల ద్వారా టెన్నిస్, క్రికెట్ వంటి పాశ్చాత్య క్రీడలు, సర్కస్ ప్రదర్శనలు ప్రజలకు పరిచయమయ్యాయి. ప్రాచ్య పాశ్చాత్య క్రీడల్లో ప్రావీణ్యాన్ని సంపాదించిన కొందరు ఆంధ్రులు విదేశాల్లో కూడా తమ ప్రజ్ఞా పాటవాల్ని ప్రదర్శించి ప్రశంసల్ని అందుకొన్నారు. తెలుగు వారు 'కలియుగ భీముడు' అని వ్యవహరించిన కోడి రామమూర్తి 1912లో ఇంగ్లండును పర్యటించి తన అద్భుత బలప్రదర్శన ద్వారా ప్రశంసలు చూరగొన్నాడు. 1932లో ఇంగ్లండు, భారత జట్ల మధ్య జరిగిన చారిత్రాత్మక తొలి క్రికెట్ టెస్ట్ పోటీలో కోఠారి కనకయ్య నాయుడు (సి.కె. నాయుడు) భారత జట్టుకు నాయకత్వం వహించి స్కిప్పర్‌గా తెలుగు వారికి ఎనలేని కీర్తిని గడించి పెట్టాడు. ఈ విధంగా కొంత మంది వైయక్తిక కృషి వల్ల క్రీడా రంగంలో తెలుగు వారి ప్రతిభ వెల్లడైంది.

కోకో, కబాడీ, చదరంగం వంటి దేశీయ క్రీడలు; క్రికెట్, టెన్నిస్, టేబుల్ టెన్నిస్, ఫుట్‌బాల్ వంటి పాశ్చాత్య క్రీడలు ఆంధ్రదేశంలో బాగా వ్యాప్తి పొందాయి. 1984-85 సంవత్సరాల్లో జరిగిన క్రికెట్ టెస్ట్ పోటీల్లో ప్రథమంగా పాల్గొన్న హైదరాబాద్ వ్యాస్తవ్యులు అజహరుద్దీన్ వరుసగా మూడు టెస్ట్‌పోటీల్లో వంద పరుగులు చేసి ప్రపంచ రికార్డు నెలకొల్పారు. చదరంగంలో మహమద్ హసన్, ఫరూక్ ఆలీ; లాంగ్ జంప్‌లో బందాడ వెంకట సత్యనారాయణ, వెయిట్ లిఫ్టింగ్‌లో కామినేని ఈశ్వరరావు; దండమూడి రాజగోపాల్, అథ్లటిక్స్‌లో లీలారావు మొదలైన ఆంధ్రక్రీడాకారులు జాతీయ స్థాయిలో గుర్తింపు పొందడమే గాక అంతర్జాతీయ పోటీల్లో కూడా పాల్గొన్నారు. 1958లో ఏర్పాటైన ఆంధ్రప్రదేశ్ క్రీడామండలి, ఆయా జిల్లాల్లో నెలకొన్న క్రీడా మండలులు రాష్ట్రంలో క్రీడల వ్యాప్తికి కృషి చేస్తున్నాయి.

ఇరవయ్యో శతాబ్ది ప్రారంభంలో జాలీవాలా థియేటర్, దాదాభాయి తూంతి థియేటర్ మొదలైన కొన్ని ప్రసిద్ధ పార్శీ నాటక సమాజాలు ఆంధ్రదేశంలో నాటక ప్రదర్శనల్ని నిర్వహించాయి. దీని ఫలితంగా ఆంధ్ర నాటక రంగం వ్యాపార విలువలు సంతరించుకొన్నది. రాజమండ్రి కరణమైన సత్యవోలు గున్నేశ్వరరావు, మైలవరం జమీందారైన మోతేనారాయణరావు వంటి ధనికులు నాటక సంఘాల్ని నెలకొల్పి వ్యాపార పద్ధతులపై నడిపారు. చింతామణి థియేటర్, మైలవరం బాల భారతీ నాటక సమాజం, గుంటూరు ఫస్టు కంపెనీ, సెకండ్ కంపెని వంటి నాటక సమాజాలు ఆ విధంగా ఆవిర్భవించినవే. మహారాష్ట్రలో తోలుబొమ్మలాటలోని మెలకువల్ని తెలుసుకొని తెలుగుదేశంలో సురభి గ్రామంలో మకాం వేసిన వనారస గోవింద రావు, వెంకూబాయి అనే వారు ఆ ప్రాంతపు తహసీల్దారు ప్రోత్సాహంతో ఒక సంచార నాటక సమాజాన్ని స్థాపించారు. సురభి నాటక సమాజంగా ప్రసిద్ధమైన అది తెలుగు వారికి బాగా పరిచయమైంది. ఆంధ్ర నాటక రంగంలో స్త్రీలు స్త్రీపాత్రల్ని ధరించే సంప్రదాయానికి ఒరవడి దిద్దింది కూడా వీరే. ఈ కాలంలోనే తిరుపతి వెంకటకవుల 'పాండవోద్యోగ విజయాలు', చిలకమర్తివారి 'గయోపాఖ్యానం', బలిజేపల్లివారి 'హరిశ్చంద్ర' నాటకాలు తెలుగుదేశం నలుమూలలా ప్రదర్శితమై పండుతుల్ని పామరుల్ని రంజింపజేశాయి. చలన చిత్ర నిర్మాణ ప్రదర్శనలు పుంజుకోవడంతో తెలుగుదేశంలో వ్యాపార నాటక సమాజాలు అంతరించాయి. అక్కడక్కడా తల ఎత్తిన కొన్ని ఔత్సాహిక నాటక సమాజాల ద్వారా తెలుగు నాటక రంగం కొన ఊపిరితో మనగలిగింది.

పశ్చిమ బెంగాలు, తమిళ నాడు రాష్ట్రాలలో వలె ఆంధ్రనాటక రంగం ప్రజలకు చేరువకాలేకపోయింది. కూర్మా వేణుగోపాలస్వామి సారథ్యంలో ఆంధ్ర విశ్వవిద్యాలయ నాటక కళాపరిషత్ డా. గరికపాటి రాజారావు సారథ్యంలో 'ప్రజానాట్య మండలి' ఆధునిక తెలుగు నాటక వికాసానికి స్ఫూర్తిని కలిగించాయి. యడవల్లి సూర్యనారాయణ, మాధవపెద్ది వెంకట్రామయ్య, డా. గోవిందరాజుల సుబ్బారావు, డి.వి. సుబ్బారావు వంటి రంగస్థల నటులు పేరు ప్రతిష్ఠలు పొందారు. స్త్రీ పాత్రధారణలో స్థానం నరసింహారావు అఖిలభారత ఖ్యాతి నార్జించారు. కొన్ని ప్రభుత్వ సంస్థలు స్వచ్ఛంద సంస్థలు నిర్వహించే సాంస్కృతిక కార్యక్రమాల వల్ల నేడు వీధినాటకాలు, తోలుబొమ్మలు, జడకొప్పుల నృత్యం, గిరిజనుల గాగరి, మయూర నృత్యరీతులు మొదలైన జానపద కళారూపాలు పట్టణవాసులకు పరిచయ మవుతున్నాయి.

ఇరవయ్యో శతాబ్ది ప్రారంభానికి రూపురేఖల్ని దిద్దుకొన్న చలనచిత్రాలు ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ప్రజలకు ఒక ముఖ్య వినోద సాధన మయ్యాయి. భారతదేశంలో దాదాభాయి ఫాల్కే సారథ్యంలో మొదటి మూకీ చిత్ర నిర్మాణం (హరిశ్చంద్ర - 1912) జరిగింది. అంతకు ముందే తెలుగువారైన రఘుపతి వెంకయ్యగారు 'క్రోనోమెగఫోన్' అనే యంత్రాన్ని పాశ్చాత్య దేశాల నుండి దిగుమతి చేసుకొని తెరమీద బొమ్మలు కదలడం, మాట్లాడడం వంటి వింతల్ని భారతదేశంలోని ముఖ్యపట్టణాల్లోనే గాక బర్మా, సిలోన్ వంటి దేశాల్లో కూడా ప్రదర్శించారు. దక్షిణ భారతంలో చిత్ర ప్రదర్శనశాలల నిర్మాణానికి కూడా వీరే ఆద్యులు. 1912-17 సంవత్సరాల మధ్య వీరు మద్రాసులో గెయిటీ, క్రౌన్, (గ్లోబ్ నేటి రాక్సీ) థియేటర్లను నిర్మించారు. 1920లో 'దిస్టార్ ఆఫ్ ఈస్ట్ కంపెనీ' అనే పేరుతో ఒక చలన చిత్ర నిర్మాణ సంస్థను స్థాపించి ఎన్నో మూకీ చిత్రాల్ని నిర్మించారు. దక్షిణ భారత చలన చిత్ర పితామహులైన వీరి సేవలకు గుర్తింపుగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చలన చిత్ర రంగానికి విశిష్టమైన సేవల్ని చేసిన వ్యక్తికి ప్రతిఏటా 'రఘుపతి వెంకయ్య అవార్డు'ను ప్రదానం చేస్తోంది.

1931లో తెలుగు చలన చిత్ర పరిశ్రమలో టాకీయుగం ప్రారంభమైంది. అప్పటి నుండి తెలుగు చిత్ర నిర్మాణం ఒక పరిశ్రమగా అభివృద్ధి చెంది తెలుగువారికి ఒకే ఒక ముఖ్య వినోద సాధనంగా పరిణమించింది. ఈ కాలంలోనే పి.వి.దాస్‌గారి సారథ్యంలో 'వేల్ పిక్చర్స్' హెచ్.ఎం. రెడ్డిగారి ఆధ్వర్యంలో 'రోహిణి పిక్చర్స్', బి.ఎన్. రెడ్డిగారి నేతృత్వంలో 'వాహినీ పిక్చర్స్', గూడవల్లి రామబ్రహ్మంగారి సారథ్యంలో 'సారథి ఫిలిమ్స్' అనే సంస్థలు ఆవిర్భవించి తెలుగు చలన చిత్ర నిర్మాణానికి గట్టి పునాదులు వేశాయి. ఆయా సంస్థలు నిర్మించిన "గృహలక్ష్మి, మాలపిల్ల, రైతుబిడ్డ, వందేమాతరం, సుమంగళి, వేమన" వంటి చిత్రాలు ప్రజలకు వినోదంతో బాటు సందేశాన్ని కూడా అందించాయి.

వైజ్ఞానిక ప్రగతి, అంతర్జాతీయ పరిస్థితులు, ప్రజల జీవన విధానంలోను, అభిరుచిలోను కలిగిన మార్పు మొదలైనవి ఈ కాలంలో తెలుగువారి వేడుకలపై వినోదాలపై ప్రభావాన్ని కనబరచాయి. ఈ కాలంలో ప్రధాన వినోద సాధనంగా పరిణమించిన చలన చిత్రాలు తెలుగువారికి చేరువై రాజకీయ, సాంస్కృతిక పరిణామంలో ప్రముఖ పాత్ర నిర్వహించాయి. ఈ కాలాలలో ఆంధ్ర చలనచిత్ర రంగం, నిర్మాణ ప్రదర్శన రంగాల్లో ముందంజ

వేసింది. 1984 నాటికి 2,054 చలన చిత్ర ప్రదర్శనశాలలున్న ఆంధ్రప్రదేశ్ చిత్ర నిర్మాణరంగంలో కూడా దేశంలో కెల్ల ప్రథమ స్థానం పొందింది. డా. ఎన్.టి రామారావు, "కళాప్రపూర్ణ" అక్కినేని నాగేశ్వరరావు, కీ.శే. చిత్తూరు నాగయ్య, కీ.శే. సావిత్రి, జమున, జయసుధ, జయప్రద వంటి నటీనటులు; కీ.శే ఘంటసాల వెంకటేశ్వరరావు, యస్.పి. బాలసుబ్రహ్మణ్యం; శ్రీమతి పి. సుశీల, శ్రీమతి జానకి వంటి గాయనీ గాయకులు; కీ.శే. కెవి. రెడ్డి, ఎల్.వి. ప్రసాద్, కె. విశ్వనాథ్ వంటి దర్శకులు అఖిల భారత స్థాయిలో గుర్తింపు పొందారు. ఎస్.వి. రంగారావు జకార్తాలో జరిగిన చలనచిత్రోత్సవంలో ఉత్తమ నటుడుగా బహుమతి పొందారు. బి.ఎన్ రెడ్డి, ఎల్.వి. ప్రసాద్‌లు భారతీయ చలన చిత్ర రంగానికి చేసిన సేవలకు గుర్తింపుగా 'ఫాల్కే అవార్డు' పొందారు. ఇటీవల ఎలక్ట్రానిక్ రంగంలో సాధించిన అభివృద్ధి చలన చిత్ర ప్రదర్శన రంగంలో విప్లవాత్మకమైన మార్పు తెచ్చింది. ఒకప్పుడు 'డేరాలు' ఉండిన కుగ్రామాలలో నేడు వీడియోలు వెలిశాయి. ఇవి చలన చిత్రాల్ని గ్రామీణుల ముంగిటికి తీసుకొని వెళ్ళాయి. బెంగుళూరు కోలారు, బళ్ళారి, బెర్హాంపూర్, ఖరగ్ పూర్ వంటి ఆంధ్రేతర ప్రాంతాలలో ప్రదర్శించే తెలుగుచిత్రాలు ప్రవాసాంధ్రుల్నేగాక అక్కడి ప్రేక్షకుల్ని కూడా ఆకట్టుకొంటున్నాయి.

ఇరవయ్యో శతాబ్దిలో ప్రచార వినోద సాధనాల్లో ప్రముఖంగా పరిగణింపదగిన రేడియో ఈ కాలంలో తెలుగు దేశంలో అంతగా ప్రచారానికి రాలేదు. స్వాతంత్ర్యానంతరం మాత్రమే యిది తెలుగువారికి విజ్ఞాన వినోదాల్ని పంచిపెట్టే ముఖ్యసాధనంగా పరిణమించింది.

స్వాతంత్ర్యంవచ్చాక రేడియో, ఇటీవలికాలంలో టెలివిజన్ ప్రజలకు విజ్ఞాన వినోదాల్ని చేకూర్చడంలో ముఖ్య పాత్ర వహిస్తున్నాయి. స్వాతంత్ర్యానికి పూర్వం మద్రాసు, బొంబాయి వంటి నగరాల్లో రేడియో స్టేషన్లతో, అవి రూపొందించే కార్యక్రమాలతో తెలుగు వారికి సన్నిహిత సంబంధం ఉండేది. స్వాతంత్ర్యానంతరం విజయవాడ (1948), విశాఖపట్నం, కడప (1963) పట్టణాల్లో రేడియో కేంద్రాలు ఏర్పాటయ్యాయి. 1939 నుండి దక్కను రేడియో అనే పేరుతో వ్యవహృతమైన హైదరాబాద్‌లోని రేడియో స్టేషన్ని 1950లో ఆలిండియా రేడియోశాఖ తన అధీనంలోకి తీసుకొంది. హరికథ, బుర్రకథ వంటి జానపదకళా రూపాలు; కర్ణాటక, హిందూస్థానీ సంగీత రీతులవంటి రేడియో కార్యక్రమాలు శ్రోతల్ని రంజింప చేస్తున్నాయి. రేడియో ఏర్పడ్డాక ఒక ప్రత్యేక ప్రక్రియగా రూపొందిన రేడియో నాటిక శ్రోతల్ని బాగా ఆకట్టుకుంటోంది. ఈ దశాబ్ది ప్రారంభంలో హైదరాబాద్‌లో నెలకొల్పిన టెలివిజన్ స్టేషన్, విశాఖపట్నం, విజయవాడ, తిరుపతి, వరంగల్ మొదలైనచోట్ల ఏర్పాటైన టి.వి. రిలేకేంద్రాలు తెలుగువారికి విజ్ఞాన వినోదాల్ని చేకూరుస్తున్నాయి.

### 25.4.6 మతం

ఆధునికయుగంలో ఆంధ్రదేశంలో మతం, ఆచార వ్యవహారాలు మొదలైన వాటిల్లో కొన్ని ముఖ్యమైన పరిణామాలు సంభవించాయి. వీటిలో కెల్లా ప్రధానంగా గుర్తింపదగింది క్రైస్తవ మత వ్యాప్తి, ఆంగ్ల విద్యా వ్యాప్తి ద్వారా దేశీయుల్లో పాశ్చాత్య మతాలపట్ల ఆసక్తి రేకెత్తించవచ్చుననే అభిప్రాయం, ఈ కాలంలో క్రైస్తవ మిషనరీలలో ప్రబలింది. కలకత్తాలోని స్కాచ్ మిషనరీకి చెందిన అలెగ్జాండర్ డఫ్ అనే మత బోధకుడు ఈ విధానాన్ని రూపొందించి దేశంలో మొదటి సారిగా అమలు జరిపాడు. 1814లో మచిలీపట్నానికి వచ్చిన చర్చి మిషనరీ సొసైటీకి చెందిన నోబెల్ అనే మత బోధకుడు ఆంధ్రదేశంలో ఈ తరహా మత ప్రచారానికి దారి ఏర్పరచాడు. ఆయన నేతృత్వంలో స్థాపితమైన విద్యా సంస్థ నేటి నోబెల్ కళాశాలగా అభివృద్ధి చెందింది. 1842 ప్రాంతంలో గుంటూరు కేంద్రంగా చేసుకొన్న లూథరన్‌మిషన్‌వారు, 1866లో ఒంగోలును కేంద్రంగా చేసుకొన్న అమెరికన్ బాప్టిస్ట్ మిషన్ వారు ఈ మార్గాన్నే అనుసరించారు. అగ్రకులాలకు చెందిన వారితోబాటు నిమ్న జాతీయుల్ని కూడా క్రైస్తవ మత పరిధిలోకి తీసుకొని రావడానికి వారు ప్రయత్నం చేశారు. వారి కృషి ఫలితంగా 1700 నాటికి క్రైస్తవుడే లేని ఆంధ్రదేశంలో స్వాతంత్ర్యం వచ్చే నాటికి 12 లక్షల మంది క్రైస్తవ మత పరిధిలోకి వచ్చారు.ఈ పరిణామాల వల్ల ఆంధ్రదేశంలో ముస్లిములతోబాటు క్రైస్తవులు కూడా ఒక అల్ప సంఖ్యాక మత వర్గంగా రూపొందడం జరిగింది. క్రైస్తవ మిషనరీలు స్థాపించిన విద్యా సంస్థలు, వైద్యశాలలు అన్యమతస్తులకు కూడా అటువంటి సంస్థల స్థాపన నిర్వహణల్లో మార్గదర్శకాలయ్యాయి.

భారతదేశంలో మొత్తం మీద సంభవించిన కొన్ని పరిణామాలు ఈ కాలంలో ఆంధ్రదేశంలో మత సాంఘికాచారాలపై ప్రభావాన్ని కనబరచాయి. సనాతన హైందవ మతాన్ని నిర్వీర్యం చేసిన కొన్ని ఆచారాల్ని, లోపాల్ని గుర్తించిన రాజారామమోహనరాయ్ హైందవ మత సంస్కరణలో ఒక భాగంగా బ్రహ్మ సమాజాన్ని స్థాపించాడు. బుచ్చయ్య పంతులు, దేశిరాజు బాపయ్య, కందుకూరి వీరేశలింగం, రఘుపతి వెంకటరత్నం



BRAOU

నాయుడు మొదలైన బ్రహ్మ సమాజికుల కృషి వల్ల ఆంధ్రదేశంలో బాపట్ల, మచిలీపట్నం, రాజమహేంద్రవరం, కాకినాడ మొదలైన పట్టణాలు బ్రహ్మ ధర్మానికి కేంద్రాలయ్యాయి. పరిశుద్ధమైన ఆస్తికత్వాన్ని, ఏకేశ్వరోపాసనను బోధించిన వీరు సంఘ సంస్కరణోద్యమాన్ని చేపట్టారు. ఆనాడు ఆంధ్రదేశంలో సాంఘిక ప్రతిఘటనను ఎదుర్కొని బ్రహ్మ సామాజికులు నిర్వహించిన కార్యక్రమాలు సంఘ సంస్కరణకు గట్టి పునాదులు వేశాయి. కందుకూరి వీరేశలింగం పంతులు, రఘుపతి వెంకటరత్నం నాయుడు వంటి సంస్కర్తల కృషి ఫలితంగా బాల్య వివాహాలు, విధవా వివాహాలు, వేశ్యావృత్తి మొదలైన సాంఘిక సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలకు సంబంధించి ప్రజల దృక్పథంలో కొంత మార్పు కలిగింది.

సర్వమతాలకు సాధారణమైన సత్యమే దివ్యజ్ఞానమని (There is no religion higher than truth) వాక్కు చెప్పే దివ్య జ్ఞాన సమాజం (Theosohpical Society) కూడా ఈ శతాబ్దిలో ఆంధ్రదేశంలో స్ఫుటమైన రూపురేఖల్ని దిద్దుకొన్నది. విశ్వమానవ సౌభ్రాతృత్వాన్ని బోధించే ఈ సమాజాన్ని కర్నల్ ఆల్కాట్, మదాంబ్లావట్స్కీలు 1875లో న్యూయార్కు నగరంలో స్థాపించారు. 1882లో దీని ప్రధాన కార్యస్థానం మద్రాసులోని అడయారుకు తరలించబడింది. 1882–83 సంవత్సరాల్లో కర్నల్ ఆల్కాట్ ఆంధ్రదేశం పర్యటించి కొన్ని సభల్లోను, గోష్ఠుల్లోను పాల్గొన్నాడు. దీని ఫలితంగా తీరాంధ్రదేశంలోని కొన్ని ముఖ్య పట్టణాల్లో దివ్యజ్ఞాన సమాజ శాఖలు నెలకొన్నాయి. డాక్టర్ అనీబిసెంట్ ఈ సమాజ సారథ్యాన్ని చేపట్టి జిడ్డు కృష్ణమూర్తిని చేరదీసిన తర్వాత దీనికి అఖిల ప్రపంచవ్యాప్తి, ప్రశస్తి లభించాయి. ఆంధ్రదేశంలో విద్యాధికులైన కొందరు ఈ మతం పట్ల ఆకర్షితు లయ్యారు.

హైందవ మత సంఘ సంస్కరణకు కృషి చేసిన స్వామి దయానంద సరస్వతి స్థాపించిన ఆర్య సమాజం; రామకృష్ణ పరమహంస, స్వామి వివేకానంద వంటి మహనీయుల ఉపదేశాలు, ఉపన్యాసాలు దేశీయుల్లో ఆత్మ విశ్వాసాన్ని పాదుకొల్పి, ప్రాచీన హైందవ విజ్ఞాన సంస్కృతుల పట్ల అనురక్తిని పెంపొందించాయి. ఈ విధంగా రూపురేఖల్ని దిద్దుకొన్న హైందవ జాతీయోద్యమం ఆంధ్రదేశం మీద ప్రభావాన్ని కొంత కనబరచింది.

19వ శతాబ్దిలో ప్రాచ్య పాశ్చాత్య సంస్కృతుల సంఘర్షణ ఫలితంగా భారతదేశంలో రూపు దాల్చిన ఉద్యమాలు, ప్రజల్లో పొడసూపిన నూతన భావ వికాసం ఆంధ్రదేశం మీద ప్రభావాన్ని కనబరచాయి. వాటిల్లోని సూక్ష్మ విషయాన్ని తరచి చూచిన విద్యాధికులైన ఆంధ్రులు భావ వైశాల్యాన్ని పెంచుకున్నారు. ఈ భావ వికాసం మతం, ఆచార వ్యవహారాలు మొదలైన వాటిల్లో మార్పు కలగడానికి దోహదం చేసింది.

ఆధునిక విజ్ఞాన శాస్త్రఫలితాలు, పాశ్చాత్య నాగరికతా సంస్కృతుల పరిచయం, క్రైస్తవమత ప్రచారం మొదలైనవి యీ కాలంలో హైందవమతం మీద ప్రభావాన్ని నెరిపి ప్రాచ్య పాశ్చాత్య సంస్కృతుల ఘర్షణకు దారితీశాయి. 19వ శతాబ్ది చివర ఆంధ్రదేశంలో నెలకొన్న బ్రహ్మ సమాజం, దివ్య జ్ఞాన సమాజం వంటివి 29వ శతాబ్ది ప్రారంభానికి స్ఫుటమైన రూపురేఖల్ని దిద్దుకొన్నాయి. అవి 18వ శతాబ్ది మధ్యకాలం నుండి 20వ శతాబ్ది మొదటి రెండు పాదాల వరకు ఆంధ్రదేశంలోని సంఘసంస్కర్తలు, కవులు, కళాకారులు, విద్యాధికులు అయిన వారి మీద ప్రభావాన్ని కనబరచి వారిలో ఆధునిక ధర్మ సంప్రదాయాల్ని గూర్చిన ఆలోచనల్ని రేకెత్తించాయి. కులమత వర్ణ విభేదాల్ని నిరసించిన ఇవి సంఘసంస్కరణకు ఇతోధికంగా తోడ్పడినాయి. కాని ప్రజాబాహుళ్యం మీద వీటి ప్రభావం లేదనే చెప్పాలి.

19వ శతాబ్దిలో స్పష్టమైన ఆకృతిని పొందిన యీ ఉద్యమాలు 20వ శతాబ్ది ప్రారంభంవరకు విద్యాధికుల్ని మాత్రమే ప్రభావితం చేశాయి. భారత స్వాతంత్ర్యోద్యమంలో ప్రధానపాత్రను నిర్వహించిన గాంధీజీ రాజకీయాల్లో కాలుమోపడంతో సామాన్య ప్రజల్లో చైతన్యం మొగ్గలు తొడిగింది. అస్పృశ్యతా నివారణను జాతీయోద్యమానికి ఒక అంగంగా చేసి ఆయన నిర్వహించిన ఉద్యమం దేశీయుల్లో ప్రాచీన హిందూ వర్ణ వ్యవస్థకు సంబంధించిన ఒక నూతనమైన అవగాహనను, దృక్పథాన్ని అలవడ చేసింది. ఆధునిక యుగధర్మానికి అనుగుణంగా హైందవ మతానికి, సత్యాహింసల స్థిరీకరణకు ఆయన చేసిన నూతన వ్యాఖ్యానాలు ప్రజల గుండెల్ని తాకినాయి.

పాశ్చాత్యదేశాల రాజకీయ, సామాజిక, మత, ఆర్థిక పరిస్థితులలో గణనీయమైన మార్పుల్ని కల్పించిన ఆధునిక శాస్త్ర, విజ్ఞాన ఫలితాలు విద్యాధికులైన భారతీయులమీద ప్రభావాన్ని కనబరచాయి. వారి ఆలోచనా



BRAOU

సరళిలో మార్పు కలిగేలా చేశాయి. దీని ఫలితముగా హేతువాద దృష్టితో వారు ప్రాచీన మత సంప్రదాయాల్ని సంస్కృతిని, మానవ జీవితానికి సంబంధించిన విలువల్ని అవలోకనం చేయడానికి పూనుకొన్నారు. హేతువాదంలో అంతర్భాగమైన నాస్తిక, అజ్ఞేయ (Agnosticism) వాదాల ఫలితంగా జీవితానికి సంబంధించిన విలువల్ని మతంతో ముడిపెట్టరాదన్న లౌకిక దృష్టి (Secularism) కొందరిలో ఏర్పడింది.

స్వాతంత్ర్యం వచ్చాక భారతదేశం లౌకిక రాజ్యంగా (Secular state) ప్రకటింపబడింది. ఈ పరిధిలో ఎవరిమత విశ్వాసాన్ని వారు అనుసరించడానికి, ఎవరి ఆచార వ్యవహారాల్ని వారు పాటించడానికి పూర్తి స్వేచ్ఛ ఉంది.

### 25.4.7 ఆచార వ్యవహారాలు

స్వాతంత్ర్యానంతరం హైందవ మత ఆచార వ్యవహారాల్లో ద్యోతకమైన కొన్ని పరస్పర విరుద్ధ ధోరణులు గమనించదగి ఉన్నాయి. స్వాతంత్ర్య యుగోదయం నాటి సాంఘిక మత సంస్కరణల్లో ఒక భాగంగా ఆంధ్రదేశంలో ప్రచారం పొందిన బ్రహ్మ సమాజం, దివ్యజ్ఞాన సమాజం ఈ కాలంలో సన్నగిల్లాయి. సంఘం విద్యాధికులుగా, శ్రేష్ఠులుగా, సంస్కారవంతులుగా పరిగణించే వారిలో మత సంప్రదాయాలకు సంబంధించిన భావ వైరుద్యం రెండు ధోరణులను నేడు ప్రదర్శిస్తున్నది. భగవద్గీతాదుల పారాయణం, సత్యనారాయణ వ్రతాదుల ఆచరణ, నవగ్రహారాధన వంటి శాంతి కర్మలు పాటించేవారు; హేతువాద అంతర్గతమైన నాస్తికత్వాన్ని ప్రచారం చేసే కొందరు కన్పిస్తారు. ఐతే ఈ రెండో కోవకు చెందిన వారి సంఖ్య తక్కువ. ఈ రకమైన ఉద్యమానికి గోరా (గోపరాజు రామచంద్రరావు) ఆంధ్రదేశంలో తీవ్ర కృషి చేశారు. స్వాతంత్ర్యానంతరం మత విశ్వాసాల్లో కలిగిన మార్పులలో ఎన్నదగిన మరో విశేషం, భగవంతుడి లక్షణాల్ని మానవుడికి అంటగట్టే ధోరణి (Deification of the Man). దీని ఫలితంగా మెహర్బాబా, సత్యసాయిబాబా, జిల్లెళ్ళమూడి అమ్మ, ముమ్మడివరం, బాలయోగి వంటి వారిని భగవదవతారాలుగా కొందరు ఆరాధిస్తున్నారు. ఆంధ్రదేశంలో కొన్ని చోట్ల వారికి ఆలయాలు కూడా వెలిశాయి. ఇటీవలి కాలంలో భావాతీత ధ్యానాన్ని (Transcendental meditation) బోధించే మహేష్‌యోగి భక్తులు కూడా ఆంధ్రదేశంలో బయలు దేరారు.

మత సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు మొదలైనవాటిల్లో అంతగా చదువుసంధ్యలు లేని గ్రామ ప్రాంతాల్లోని పట్టణ ప్రాంతాల్లోని పాటక జనం నాగరికుల కంటె కొంచం భిన్నంగా ప్రవర్తించడం కూడా ఈ కాలంలో కన్పించే ఒక విశేషం. ఆంధ్రదేశంలో ఆయా ప్రాంతాల్లో జరిగే కోటప్పకొండ తిరునాళ్ళు, మహంకాళి, గంగ జాతరల్ని పురస్కరించుకొని జానపద నృత్యాల్లో, భజనల్లో, కోలాటాల్లో, సమారాధనలలో వేషాలలో ఆవేశంతో కూడిన వీరి భక్తి వైఖరి వ్యక్తమవుతోంది.

## అవగాహన ప్రశ్న

తెలుగు చలన చిత్ర నిర్మాణ ప్రదర్శనల్ని వివరించి దానికి రఘుపతి వెంకయ్య ఏ విధంగా దోహదం చేశారో 30 వాక్యాల్లో తెలపండి.

BRAOU

## 25.5 సారాంశం

ఈ భాగంలో ప్రధానాంశాలను గుర్తుకు తెచ్చుకుందాం.

- ఆధునిక దశలోని పాలనావ్యవస్థ బ్రిటిష్ పాలన నుండి ఏర్పడింది. స్వాతంత్ర్యం ఏర్పడ్డాక ప్రజాస్వామ్యీకరణ ఫలితంగా ప్రజాప్రతినిధుల నిర్ణయాలను అమలు పరచే యంత్రాంగంగా ఉద్యోగవర్గం తయ్యారైంది.
- బ్రిటిష్ విధానాలు రైతుల ఆర్థిక స్థితిని దెబ్బ తీశాయి. గ్రామీణ పరిశ్రమలు దెబ్బ తిన్నాయి. ఇటీవలి హరిత విప్లవం వ్యవసాయంలో, ఉత్పత్తుల్లో గణనీయమైన మార్పులకు దోహదం చేసింది. జాతీయ అంతర్జాతీయ పరిణామాలు రైతాంగాన్ని రైతు కూలీలనూ జాగృతం చేశాయి.
- మన సామాజిక జీవనంలో పెద్ద మార్పులు సంభవించాయి. కుటుంబ వ్యవస్థ, స్త్రీపురుష సంబంధాలు, సంఘ సంస్కారం, ఉద్యమాలు మన విద్యలు, కళలు, కులం, మతం వంటి వాటిలో కూడా మార్పులకు దోహదం చేశాయి.

## అవగాహన ప్రశ్నకు జవాబు

ఇరవయ్యో శతాబ్ది ప్రారంభంలో రూపురేఖల్ని దిద్దుకొన్న చలన చిత్రాలు తెలుగు వారికి ముఖ్య వినోద సాధనంగా పరిణమించాయి. 1912లో భారతదేశంలో మూకి చిత్ర నిర్మాణము ప్రారంభమైనప్పటి నుండి తెలుగువారీ రంగంలో ముందంజ వేశారు. ఈ కాలంలో మద్రాసు ప్రెసిడెన్సీకి ముఖ్య పట్టణమైన మద్రాసు నగరం చలన చిత్ర నిర్మాణ ప్రదర్శన రంగాలకు కేంద్రమైయుంది. 1931లో టాకీయుగం ప్రారంభమైనప్పటినుండి తెలుగు నిర్మాణం ఒక పరిశ్రమగా అభివృద్ధి చెందింది. ఈ కాలంలో పి.వి. దాస్, హెచ్.ఎం. రెడ్డి, గూడవల్లి రామ బ్రహ్మం వారి సారథ్యంలో చలన చిత్ర నిర్మాణ సంస్థలు వెలిశాయి. ఆయా సంస్థలు నిర్మించిన 'గృహలక్ష్మి, మాలపిల్ల, రైతుబిడ్డ, వందేమాతరం, సుమంగళి, వేమన' వంటి చిత్రాలు తెలుగువారికి వినోదంతో బాటు చక్కటి సందేశాన్ని అందించాయి.

దక్షిణభారత చలన చిత్రరంగానికి తెలుగువారైన రఘుపతి వెంకయ్య చిరస్మరణీయమైన సేవ చేశారు. 1912లో దాదాబాయి ఫాల్కే భారతదేశంలో మొదటి మూకి చిత్రాన్ని నిర్మించారు. అంతకు ముందే వెంకయ్యగారు, "క్రోనోమెగఫోన్" అనే యంత్రాన్ని పాశ్చాత్య దేశాల నుండి దిగుమతి చేసుకొని తెరమీది బొమ్మలు కదలడం మాట్లాడడం వంటి వింతల్ని భారతదేశంలోను, విదేశాలలోను ప్రదర్శించారు. 1912-17 సంవత్సరాల మధ్య వీరు మద్రాసులో 'గెయిటి, క్రౌన్, గ్లోబ్' థియేటర్లను నిర్మించి ప్రదర్శన రంగంలో కూడా మార్గదర్శకులైనారు. 1920లో 'దిస్టార్ ఆఫ్ ఈస్ట్ కంపెనీ' అనే పేరుతో ఒక చలన చిత్ర నిర్మాణ సంస్థను స్థాపించి ఎన్నో మూకి చిత్రాల్ని నిర్మించారు. అందువల్లనే వీరు దక్షిణ భారత చలన చిత్ర పితామహులుగా కీర్తింపబడు తున్నారు. వీరి సేవలకు గుర్తింపుగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చలన చిత్ర రంగానికి విశిష్టమైన సేవ చేసిన వ్యక్తికి ప్రతి ఏటా 'రఘుపతి వెంకయ్య అవార్డు'ను ప్రదానం చేస్తోంది.

## చదవదగిన పుస్తకాలు


| | | |
|---|---|---|
| ఆంధ్రుల సంస్కృతి - చరిత్ర | : | కంబంపాటి సత్యనారాయణ |
| ఆంధ్రుల చరిత్ర - సంస్కృతి | : | ఖండవల్లి లక్ష్మీరంజనం, ఖండవల్లి బాలేందు శేఖరం |
| ఆంధ్రుల చరిత్ర | : | డా. బి.ఎస్. ఎల్. హనుమంతరావు |
| ఆంధ్రుల సాంఘిక చరిత్ర | : | సురవరం ప్రతాపరెడ్డి |
| ఆంధ్రప్రదేశ్ దర్శిని | : | విశాలాంధ్ర ప్రచురణాలయం |




BRAOU

| | | |
|---|---|---|
| ప్రాచీనదక్షిణ భారత చరిత్ర | : | డా. నండూరి రామకృష్ణమాచార్య |
| ఆంధ్రదేశ చరిత్ర ఆధునికయుగం | : | జి. వెంకటరామారావు |
| మన వాస్తుకళ | : | కొండూరి వీరరామవాచార్యులు |
| విజ్ఞాన సర్వస్వం 1, 2, 3, 4 సం. | : | తెలుగు భాషా సమితి |
| తెలుగు వాణి | : | ప్రపంచ తెలుగు మహాసభలు |
| The Age of Satavahanas | : | Dr. B.S.L. Hannamantha Rao |
| Chalukyas | : | K. A. Neelakanta Sastry |
| The Eastern Chalukyas of Vengi | : | Dr. N. Ramesan |
| Hisgory of Reedy Kingdom | : | Mallampally Somasekhara Sarma |
| Indian History and culture | : | K. Basaveshwara Rao |
| History of Modern Andhra | : | Dr. P.R. Rao |
| Book printing in India | : | Dr. J. Mangamma |
| ప్రాచీనాంధ్ర శాసనాలు | : | డా. బూదరాజు రాధాకృష్ణ |
| ప్రాఙ్నన్నయ యుగము | : | డా. దివాకర్ల వెంకటావధాని |
| తెలుగు భారషా చరిత్ర | : | డా. భద్రిరాజు కృష్ణమూర్తి (సం) |
| సమగ్రాంధ్ర సాహిత్యం (అన్ని సంపుటాలు) | : | ఆరుద్ర |
| ఆంధ్ర కవితరంగిణి | : | చాగంటి శేషయ్య |
| తెలుగు సాహిత్య సమీక్ష | : | డా. జి. నాగయ్య |
| దాక్షిణాత్య సాహిత్య సమీక్ష | : | డా. జి. నాగయ్య |
| ద్విపద వాఙ్మయము | : | డా. జి. నాగయ్య |
| పురాణ వాఙ్మయము | : | డా. జి.వి. సుబ్రహ్మణ్యం |
| ఆంధ్రవచన వాఙ్మయ్మము | : | నిడదవోలు వేంకటరావు |
| ఆంధ్ర శతక సాహిత్య వికాసము | : | డా. కె. గోపాల కృష్ణారావు |
| తంజావూరాంధ్ర సాహిత్య చరిత్ర | : | కొక్కొండ సత్యవతి |
| తంజావూరాంధ్ర నాయకరాజ చరితము | : | కురుగంటి సీతారామయ్య |
| తెలుగు భాషలో ఛందోరీతులు | : | రావూరి దొరస్వామి శర్మ |
| మహతి | : | యువభారతి ప్రచురణ |
| అభ్యుదయ (విమర్శ విశేష సంచిక) | : | తుమ్మల వెంకట్రామయ్య (సం) |
| బ్రౌన్ లేఖలు | : | బంగోరె (సం) |
| మహోదయం | : | కె.వి. రమణారెడ్డి |
| తెలుగుసాహిత్యం, మరోచూపు | : | కె.కె. రంగనాథాచార్యులు (సం) |
| తెలుగులో తొలి సమాజ కవులు | : | కె.కె. రంగనాథాచార్యులు (సం). |

BRAOU

## మాదిరి పరీక్షా ప్రశ్నలు

కింది ప్రశ్నలకు 30 వాక్యాలకు మించకుండా సమాధానాలు రాయండి.

1. 19వ శతాబ్దిలోని మత సాంఘిక ఉద్యమాల స్వరూపాన్ని తెలియజేయండి.
2. స్వాతంత్ర్యానంతరం మన రాష్ట్రంలోని గ్రామీణ వ్యవస్థలో వచ్చిన మార్పులను వివరించండి.

II. కింది ప్రశ్నలకు 10 వాక్యాలు మించకుండా సమాధానాలు రాయండి.

1. ఆధునికయుగంలోని ముద్రణ సౌకర్యాలను వివరించండి.

2. ఆధునిక దశలో విద్యారంగం సాధించిన అభివృద్ధిని సమీక్షించండి.

BRAOU

# ఖండం 6 తెలుగు భాషా సాహిత్య సంస్కృతుల సమన్వయ చరిత్ర

పరిచయం

మీరింతవరకు చదివిన ఖండాలు : 1. భారతీయ భాషా సాహిత్య సంస్కృతులు 2. తెలుగు భాషా సాహిత్య సంస్కృతుల అధ్యయన నేపథ్యం 3. తెలుగు భాషా చరిత్ర 4. తెలుగు సాహిత్య చరిత్ర 5. తెలుగు సంస్కృతి చరిత్ర. మొదటి రెండు ఖండాలు తెలుగు భాషా సాహిత్య సంస్కృతుల చరిత్ర అధ్యయనానికి పూర్వరంగంగా పరిచయం చేసినవిగా మీరు గుర్తించారు. తెలుగు ప్రాంతీయ భాషాసాహిత్య సంస్కృతుల చరిత్ర గతికి దోహదం చేసిన అంశాలను పూర్వరంగంలో మీరు తెలుసుకున్నారు. 3, 4, 5 ఖండాల్లో విడివిడిగా భాష, సాహిత్యం, సంస్కృతి పరిణామాలను మీకు పరిచయం చేసినా ఈ పాటికి మీరు రెండు ప్రధానమైన విషయాలను గుర్తించి ఉంటారు. అవి :

1. భారతదేశం భిన్నజాతులు, బహుభాషలు, విభిన్న మతాలు, వివిధ కులాలు ఉన్న సంకీర్ణ సమాజం, భారతదేశంలో ఒక ప్రాంతం – ఒక భాషాప్రయుక్త రాష్ట్రం – అయిన ఆంధ్రప్రదేశ్‌లోకూడా ఈ సంకీర్ణ లక్షణాలున్నాయి. అయితే అత్యధిక సంఖ్యాకులు మాట్లాడే భాష తెలుగు కాబట్టి, ఆ ప్రాతిపదిక మీద రాష్ట్రం ఏర్పడింది కాబట్టి, తెలుగు భాషా చరిత్రను మీకు పరిచయం చేశాము. ఆ సందర్భంలో తెలుగు భాష ఇముడ్చుకున్న ఇతర భాషాలక్షణాలను తెలిపాము. అదేవిధంగా తెలుగు సాహిత్య చరిత్ర, తెలుగు సంస్కృతి చరిత్ర విషయం కూడా.

2. భాష, సాహిత్యం, సంస్కృతి, వీటి పరిణామాలు అధ్యయన సౌలభ్యం కోసం మనం విడివిడిగా చదువుకున్నా, ఈ పరిణామాలన్నీ వేటిదారిలో అవి సాగేవి కావు. వీటి మధ్య అంతర్గత సంబంధాలున్నాయి. అందువల్ల స్థూలంగానైనా మనం భాషాసాహిత్య సంస్కృతుల స్థూల పరిణామాలను తెలుసుకోవడంవల్ల చరిత్రగతి మనకు సుబోధకమవుతుంది. ఈ ఖండంలోని ఏకైక భాగంలో, అంటే 26వ భాగంలో ఆ ప్రయత్నం జరిగింది.

BRAOU

BRAOU

# భాగం – 26 ప్రధాన పరిణామాలు

## విషయక్రమం


26.0 లక్ష్యాలు

26.1 పరిచయం

26.2.0 తెలుగు భాషా సాహిత్య సంస్కృతులు ప్రధాన పరిణామాలు

- 26.2.1 పూర్వదశ – I
- 26.2.2 పూర్వదశ – II
- 26.2.3 మధ్యకాలీన దశ – I
- 26.2.4 మధ్యకాలీన దశ – II
- 26.2.5 ఆధునిక దశ

అవగాహన ప్రశ్న – 1

26.3. సారాంశం

- చదవదగిన పుస్తకాలు
- మాదిరి పరీక్షా ప్రశ్నలు


## 26.0 లక్ష్యాలు

తెలుగు భాషా సాహిత్య సంస్కృత సమన్వయ చరిత్రలోని ప్రధాన పరిణామాలను ఈ భాగం చదివాక మీరు విశ్లేషించగలుగుతారు.

## 26.1 పరిచయం

భాషకు చరిత్ర ఉన్నట్లే, భాషద్వారా తయారైన సాహిత్యానికీ, సంస్కృతికీ చరిత్రలుంటాయని మీరు తెలుసుకున్నారు. భాష, సాహిత్యం, సంస్కృతి. సమాజంలోని ఉత్పత్తి సాధనాలమీదా, ఉత్పత్తి శక్తుల సంబంధాల మీదా ఆధారపడి ఉంటాయి. వాటి మార్పుకు కొంత దోహదంచేస్తూ ఉంటాయి. సమాజ పరిణామం అన్ని కాలాల్లోనూ సరళరేఖలా సాగిపోదు. ఎగుడుదిగుడు పద్ధతుల్లో సాగుతుంది. సమస్త మానవ శ్రమా, ప్రయత్నాలు చరిత్ర నిర్మాణానికి దోహదం చేస్తాయి (I - 1.3).

భాష, సాహిత్యం, సంస్కృతి – వీటికి అధ్యయన సౌలభ్యం కోసం విడివిడి చరిత్రలు రాసుకున్నా, వీటి మధ్య పరస్పర సంబంధాలుంటాయి. అన్యోన్య ప్రభావాలుంటాయి. భాషా విషయాన్ని ముందు పరిశీలిద్దాం. వివిధ సామాజిక దశల్లో పాలకులూ, సాహిత్యకారులూ, మతాచార్యులూ, సంస్కర్తలూ తమ తమ భావాల ప్రచారానికి పనిముట్టుగా భాషను వాడుకున్నారు. ప్రాచీనకాలంలో వేద సంస్కృతి ప్రజలకు గహనమై దూరమై కర్మకాండలకు పరిమితమైనప్పుడు ప్రాకృతభాషలద్వారా బౌద్ధజైన మతాలు తమ సిద్ధాంతాలను ప్రజల్లో వ్యాపింపచేశాయి. మధ్యయుగాలనాటి సమాజకవుల రచనలు బోధనలు ప్రజలు మాట్లాడుకునే భాషలో వచ్చాయి. రాజకీయ పెత్తనానికి, మత వ్యాప్తికి, ఆర్థిక దోపిడీకి కూడా భాష సాధనంగా ఉపయోగపడింది. బ్రిటిష్ వలసాధిపతులు ఈ విషయాన్ని రుజువుపరచారు. అట్లాగే భారతీయ సమాజంలోని కులవ్యవస్థ, కట్టుబాట్లు నియమాలవల్ల విద్య కొందరికే పరిమితమైనప్పుడు లిఖిత భాషపై కులవ్యవస్థలోని పై శ్రేణులు ఆధిపత్యాన్ని సంపాదించాయి. ఈ కారణంగా నాటి ప్రజల సంస్కృతి పూర్తిగా వెలుగులోకి రాలేకపోయింది. మౌఖిక రూపంలోనే ఉండిపోయింది. ప్రజాస్వామ్యీకరణ దశలో భాష, సాహిత్యం, సంస్కృతి అసంఖ్యాక ప్రజలకు మరింత చేరువ కావటానికి ప్రయత్నాలు జరిగాయి.



BRAOU

ఈ క్రమాన్ని పూర్వదశ ప్రథమభాగం (క్రీ.పూ.200 క్రీ. శ. 600) నుండి నేటిదాకా ఈ భాగంలో పరిశీలిద్దాం. తెలుగు భాషా సాహిత్య సంస్కృతుల పరిణామంలో ప్రధానమైన వాటిని మనం ఈ భాగంలో స్మరణ చేసుకోవటం ద్వారా మనకు ఈ క్రమం అవగాహనకు వస్తుంది.

## 26.2.0 తెలుగు భాషా సాహిత్య సంస్కృతులు... ప్రధాన పరిణామాలు

భారతదేశంలో నాలుగు వేల సంవత్సరాల నుండి భిన్న భాషలు, భిన్న జాతులు, మతాలు, కులాలు ఉంటూ రావటం వల్ల ఒక సంకీర్ణ స్వభావానికి భారతీయ సమాజం లోనైంది. భారతీయ సమాజం అందులో భాగమైన తెలుగు సమాజం కూడా ఈ సంకీర్ణ స్వభావానికి చరిత్ర పూర్వయుగం నుంచి లోనైంది.

తెలుగు ప్రజలు ఆర్య అనార్య మిశ్రజాతి ఐఉండవచ్చునని చరిత్రకారుల అభిప్రాయం. ఆంధ్రదేశ భౌగోళిక స్థితికూడా ఈ వాదాన్ని బలపరుస్తుంది. తెలుగు భాష ద్రావిడ భాషలకు చెందింది. ఇది మధ్యద్రావిడ భాష. క్రీ.పూ. 1500 నాటికి తెలుగు-కువి ఉపకుటుంబం ఏర్పడి, క్రీ. పూ. 9-5 శతాబ్దాల మధ్యకాలంలో తెలుగు ఒక ప్రత్యేక భాషగా అస్తిత్వాన్ని సంతరించుకొని ఉండాలని భాషాచరిత్రకారుల ఊహ. (10.4.0). తెలుగు ప్రత్యేక భాషగా రూపొందుతున్న తరుణంలోనే సంస్కృత ప్రాకృతాల ప్రభావం తెలుగు భాషపై పడిందనటానికి నిదర్శనాలు మనకు పూర్వయుగంలో ప్రథమ భాగంలో లభిస్తాయి. అయితే గ్రంథ రచన తెలుగులో వెలువడడానికి ఇప్పుడు మనకు లభిస్తున్న సాక్ష్యాధారాలనుబట్టి దాదాపు వెయ్యేళ్లు పైగా పట్టింది. మౌఖిక భాష నుండి లిఖిత భాషగా ఎప్పుడు మారిందో ఖచ్చితంగా మనం చెప్పలేము. కానీ క్రీ. శ. 6 వ శతాబ్ది నుంచీ తెలుగులో శాసనాలు లభిస్తున్నందువల్ల ఆ దశలో మౌఖిక సాహిత్యం ఉండి ఉంటుందని ఊహించవచ్చు. శాసనాలు ఆధారంగా నాటి సంస్కృతిని గురించి తెలుసుకోవచ్చు. ఆ కాలంలో ఇప్పటిలాగే గిరిజన భాషలు, వాటి మౌఖిక సాహిత్యాలు, తెగల సంస్కృతులు ఉండి ఉంటాయని ఊహించవచ్చు. నాటి నుండి నేటి వరకు జరిగిన ప్రధాన పరిణామాలను తెలుసుకుందాం.

### 26.2.1 పూర్వదశ – I (క్రీ. పూ. 200 – క్రీ. శ. 600)

క్రీ. పూ. 200 నుండి క్రీ. శ. 600 వరకు ఆంధ్రదేశాన్ని శాతవాహనులు, ఇక్ష్వాకులు, బృహత్పలాయనులు, ఆనందగోత్రీకులు, విష్ణుకుండినులు శాలంకాయనులు, పల్లవులు పరిపాలించారు. ఈ కాలంలో మొదటిదశలో ప్రాకృతంలోను, తర్వాతి దశలో సంస్కృతంలోను శాసనాలు కన్పిస్తాయి. ఈ శాసనాల్లోని వ్యక్తులపేర్లు, ఊళ్లపేర్లు తెలుగువారికి చెందినవి. అవి ప్రాకృత, సంస్కృత విభక్త్యంతాలుగా ఉండటం మనం గమనించవచ్చు. ఆదశలో ప్రాకృత సంస్కృతాలు పాలనాభాషలనీ లేదా విద్యావంతుల భాషలనీ మనం భావించవచ్చు. గాథాసప్తశతి వంటి ప్రాకృత గ్రంథంలో తెలుగు మాటలు కన్పిస్తున్నాయి. ఛందస్సు మన కందపద్యానికి దగ్గరగా ఉంది. పదగేయరూప కవిత్వం ఉన్నట్లు సాహిత్యాధారాలున్నాయి. ప్రాకృత సంస్కృతాలు విద్యాభ్యాసలు గానో, రాజభాషలుగానో ఉండటానికి కారణాలు బౌద్ధ జైన హిందూ మతాల ప్రాబల్యం. రాజే సర్వతంత్ర స్వతంత్రుడైన పాలనలో రాజు అనుసరించిన మత ప్రాబల్యం, ఎంపిక చేసుకున్న భాషా ప్రాబల్యం తప్పక ఉండి ఉంటుంది. మతవ్యవస్థ, వర్ణవ్యవస్థ శ్రేణిలో పురోహిత వర్గాలకున్న ప్రాధాన్య ప్రభావం కూడా ఉండి ఉంటుంది. దానశాసనాలన్నీ శ్రమణులకో, బిక్షువులకో, ఘటికులకో, సంఘారామాలకో దేవాలయాలకో బ్రాహ్మణులకో దానాలను ఉద్దేశించినవి. కాబట్టి మనం ఈ నిర్ణయానికి రావచ్చు. ఈ దశలో సంస్కృతం తెలుగు, తెలుగు సంస్కృతం భాషల మధ్య పరస్పర వినిమయం జరిగింది. అయితే తెలుగు ప్రభావం వాటిమీద కంటే, వాటి ప్రభావం తెలుగుమీద ఎక్కువ. తెలుగు భాషాసాహిత్య సంస్కృతుల మీద ఇండో ఆర్యభాషా సంస్కృతుల ప్రభావం నెమ్మదిగా పాదుకొంటున్న దశ ఇది. తెలుగు వాడకం ముందుగా పరిపాలనలో ప్రవేశించడానికి ప్రాకృతాలు, వాటిని పోషించిన బౌద్ధ జైన మతాలు పరోక్షంగా దోహదం చేసి ఉంటాయి. వ్యవసాయ ప్రధానమైన నాటి దశలో వృత్తిప్రధాన గ్రామీణ జీవనమే ప్రాముఖ్యం వహించింది.

### 26.2.2 పూర్వదశ – II (క్రీ.శ. 600 – 1000)

ఈ దశలో రాజకీయ అస్థిరత ప్రధానంగా ఉంది. రాచరిక వ్యవస్థలో రాజులకే సర్వాధికారాలుండేవి. రకరకాల పన్నులుండేవి. వర్ణశ్రేణిలో బ్రాహ్మణులది అగ్రస్థానం. వివిధ కులాలు ఉండేవి. దేవదాసి వ్యవస్థ ఉండేది. విద్యల్లో వేదాధ్యయనానికి అధిక ప్రాధాన్యం ఉండేది. తూర్పు చాళుక్య వంశపురాజులూ, బాణవైదుంబులూ,

పశ్చిమ చాళుక్యులూ రాష్ట్రకూటులూ పరస్పరం చేసుకున్న యుద్ధాలవల్ల రాజకీయ అస్థిరత ఉండేది. తూర్పు చాళుక్యులు నిలదొక్కుకొని రాజ్యం చెయ్యటంవల్ల వారు నమ్మిన విశ్వాసాలకు అనుగుణంగా తెలుగు భాషకు ఆదరణ లభించింది. వైదిక మతాభివృద్ధి క్రమక్రమంగా జరుగుతూ వచ్చింది.

ఈ కాలపు రాజులు వేయించిన తెలుగు శాసనాలలో ఒకవైపు వాడుక భాషా, మరొకవైపు పద్యరచనకనువైన విద్యావంతుల కావ్య భాషా రూపొందాయి. తర్వాత దశలో నన్నయ భారత రచనకు అనువైన భాషా సాహిత్య సాంస్కృతికనేపథ్యం తయారైంది. శాసన కవిత్వంలో సీసం, మధ్యాక్కర, కందం, తరువోజవంటి దేశి కవితా రీతులకు కొంత ప్రాధాన్యం ఉన్నా క్రమక్రమంగా సంస్కృత పదజాలం ఆధిక్యత చోటు చేసుకుంటూ వచ్చింది. వాక్య నిర్మాణక్రమంలో కూడా సంస్కృత ప్రభావం కన్పిస్తుంది. ఉదాహరణకు "ఎవణ్డేని రక్షిఞ్చు వాని ధమమ్మ్ౙను" వంటి యత్తదర్థక వాక్యాలు, "వైదుంబుళచేతం బట్టం కట్టబడియేలి" వంటి కర్మణ్యార్థక వాక్యాలూ ఉన్నాయి.

తెలుగువారి సాంస్కృతిక జీవనంలో వచ్చిన మార్పుల కారణంగా ఒకవైపు సంస్కృత సంప్రదాయానుసరణమైన మార్గకవిత్వానికీ, దేశి సంప్రదాయానుసరణమైన దేశి కవితారీతులకూ ఈ దశలో బీజాలు పడినట్లు మనం ఊహించవచ్చు.

### 26.2.3 మధ్యకాలీన దశ – II (క్రీ. శ. 1000 – 1600 వరకు)

ఈ దశలో సంస్కృత రచనా సంప్రదాయానికి చెందిన ఇతిహాస కావ్య ప్రబంధాలూ, దేశిరచనా సంప్రదాయానికి సంబంధించిన జీవిత చరిత్రలూ, శతకాలూ, వచనాలూ, పదాలూ వచ్చాయి. ఇతిహాస సంప్రదాయంలో ఆఖ్యలక్షణాలతో పాటు కావ్య లక్షణాలు చోటుచేసుకున్నాయి. ప్రధానంగా వేదాంత దృక్పథం చోటుచేసుకుంది. ప్రబంధాల్లో విద్యాధిక కేంద్రమైన రసదృష్టి ప్రాముఖ్యం వహించింది. దేశి కవిత్వంలో వర్ణవ్యతిరేక సంస్కరణ దృష్టి భక్తి కవిత్వ రూపంలో వ్యక్తమైంది: సామాజిక నిరసన కవిత్వం శతకాలూ, కీర్తనల్లో చోటుచేసుకున్నాయి. రాయవాచకం వంటి వచనరచనలు మొదలయ్యాయి. కవిత్వంలో పర్షో అరబిక్ పదాలు చోటుచేసుకున్నాయి. దీనికి కారణం వెలనాటి చోళులు మొదలుకొని రెడ్డిరాజులూ కాకతీయులూ విజయనగర రాజులూ బహమనీ సుల్తానుల వరకూ పాలన సాగించిన భిన్న సంస్కృతులకు చెందిన వివిధ హైందవ హైందవేతర పాలకులు.

వ్యవసాయంలో గతంలో కంటె కొంత అభివృద్ధి కన్పించినప్పటికీ మౌలికమైన మార్పులు చాల తక్కువగా జరిగాయి. గ్రామీణ వృత్తుల ప్రాధాన్యం పెరిగింది. హిందూమతంలోని వీరశైవ వైష్ణవాల ప్రాధాన్యానికి ఇది ఒకకారణం. రెడ్డిరాజులూ, పద్మనాయకులూ, విజయనగర రాజులూ పరిపాలించిన కాలంలో విద్యాధిక పాఠకవర్గాల్లో వచ్చిన మార్పులు ప్రబంధాలవంటి ఏకనాయకాశ్రయ వర్ణనాత్మక కావ్యాలకు క్రమంగా దారితీశాయి. స్త్రీల ప్రతిపత్తి విషయంలో భోగదృష్టే ప్రధానంగా అలవడింది.

ఇస్లాం, భాషాసంస్కృతుల ప్రభావం కారణంగా హిందూముస్లిం మతాల భావ సమన్వయం జరిగింది. శ్రీనాథుడూ, పెద్దన వంటి కవులు తమ కావ్యాల్లో 900 పర్షో అరబిక్ పదాలు వాడటమే ఇందుకు ఒక నిదర్శనం.

### 26.2.4 మధ్యకాలీన దశ – II (క్రీ. శ. 1600 – 1800)

తెలుగు భాషా సాహిత్య సంస్కృతుల వికాసంలో ఈ దశకు ప్రత్యేక ప్రాధాన్యం ఉంది. పాతప్రక్రియలు క్రమంగా క్షీణించి, కొత్త ప్రక్రియలు మొదలయ్యాయి. యక్షగానాలూ, ద్విపదలూ, వచనరచనలూ, కీర్తనలూ వంటి ప్రక్రియల ప్రాధాన్యం పెరిగాయి. ఇతివృత్తంలో పెద్దగా మార్పేమీ రాలేదు. ఐతే తిట్టు కవిత్వం, నిరసన కవిత్వం ఆనాటి సామాజిక స్థితిగతులపట్ల వ్యతిరేక రూపంలో ప్రసరించడం ఒక విశేషం. మితిమీరిన శృంగారం ప్రబంధాల రూపంలో వచ్చింది. తెలుగుజాతి, సాహిత్యం మార్పులకు సిద్ధపడుతున్న కాలంగా దీన్ని భావించవచ్చు. పర్షోఅరబిక్ పదాలతో పాటు ఫ్రెంచి డచ్ పదాలూ తెలుగులో ప్రవేశించాయి. ఇది తెలుగు వర్ణమాలలో, సంధి సమాస నిర్మాణంలో మార్పులకు దోహదం చేసింది. గోల్కొండ రాజ్యం మొగలాయీ సుబాగామారిన తర్వాత క్రమంగా ఆసఫ్ జాహీ వంశానికి చెందిన నిజాముల పాలన వలస వారులకు సహకరించడంవల్ల యూరోపియన్ భాషా సాహిత్య సంస్కృతుల ప్రభావాలకు రంగం సిద్ధమైంది. దీనికి తోడు

BRAOU

క్రీ. శ. 1780 నుండి క్రైస్తవ సాహిత్యం రావడంతో గ్రంథముద్రణకు ఆంధ్రదేశంలో అంకురార్పణ జరిగింది. ఆధునిక దశలో జరగబోతున్న పరిణామాలకు భాషా సామాజిక రంగాలు సిద్ధమయ్యాయి.

**26.2.5 ఆధునికదశ (క్రీ. శ. 1800 నుండి నేటి దాకా)**

ఈ దశ తెలుగువారి జీవితంలో అతి కీలకమైంది. వలస పాలన మూలంగా భాషా సాహిత్య సాంస్కృతిక రంగాల్లో గణనీయమైన మార్పులు వచ్చాయి. ఆంగ్ల విద్యా ప్రవేశంతోనూ, ప్రాంతీయ జాతీయ అంతర్జాతీయ సామాజిక రాజకీయ సాంస్కృతిక ఉద్యమాల ప్రభావ కారణంగానూ భారతదేశంలోనూ, మన రాష్ట్రంలోనూ సంభవించిన తదితర పరిణామాల కారణంగానూ సాహిత్యంలో అనేక నూతన ప్రక్రియల ఆవిర్భావం జరిగింది. నవల, కథానిక, నాటకం, నాటిక, వ్యాసం, పత్రికారచన తెలుగు సాహిత్యంలో చోటుచేసుకున్నాయి. కవిత్వంలో ఖండకావ్యం ఆవిర్భవించింది. వ్యక్తినిష్ఠమూ, సమాజనిష్ఠమూ ఐన సాహిత్యోద్యమాలు తలయెత్తాయి. సంస్కరణ, భావ, అభ్యుదయ, దిగంబర, విప్లవ ధోరణులు కవిత్వంలో చోటుచేసుకున్నాయి. కల్పనా సాహిత్యంలో సమాజ సంబంధమైన భావాలకు ఎన్నడూ లేనంత ప్రాధాన్యం ఏర్పడింది.

బ్రిటిష్ వలసపాలన మనదేశాన్ని ఆర్థిక దోపిడీకి గురిచేసింది. హస్త పరిశ్రమలను ధ్వంసంచేసింది. రైతుల ఆర్థిక స్థితి గతులను దిగజార్చింది. పాత సామాజిక వ్యవస్థ స్థానంలో కొత్త వ్యవస్థ రూపుదిద్దుకోవడానికి వలస పాలన అందించిన ఆధునిక విద్య , సాంకేతిక పరిజ్ఞానం ఎంతో తోడ్పడింది.

1.4.3 లో వివరించినట్లు మన భాషాసాహిత్య సంస్కృతులమీద స్థూలంగా వేదపూర్వ ఇండో ఆర్య, మతోద్యమ, ఇస్లాం యూరోపియన్ సంస్కృతుల ప్రభావం కన్పిస్తుంది. ఒక వైపు ప్రాంతీయ లక్షణాలు నిలుపుకుంటూనే అఖండమైన భారతీయ సంస్కృతిలో భాగంగా తెలుగు సంస్కృతీ వికాసం జరుగుతున్నది.

## అవగాహన ప్రశ్న

క్రీ.పూ. 200 - క్రీ. శ. 600 మధ్య కాలంనాటి తెలుగు భాషా సాహిత్య సంస్కృతుల ప్రధాన పరిణామాలను 10 వాక్యాల్లో తెల్పండి.

BRAOU

___

___

___

___

___

___

___

## 26.3 సారాంశం

ఈ భాగంలో మీరు ఈ కింది అంశాలు తెలుసుకున్నారు.

- తెలుగు భాషా సాహిత్య సంస్కృతుల పరిణామం, భారతీయ భాషా సంస్కృతుల పరిణామంలో భాగంగా సంకీర్ణంగా సాగింది.
- వివిధ దశల్లో వేదపూర్వ, ఇండో ఆర్య మతోద్యమ, ఇస్లాం యూరోపియన్ భాషా సాహిత్య సంస్కృతుల ప్రభావం మన భాషా సాహిత్య సంస్కృతుల మీద కనిపిస్తాయి.

## అవగాహన ప్రశ్నకు జవాబు

క్రీ. పూ. 200 - క్రీ. శ. 600 వరకు ఆంధ్రదేశాన్ని వివిధ పాలకులు పరిపాలించారు. ఈ దశలో ప్రాకృత సంస్కృత శాసనాలు లభిస్తాయి. వాటిలో కన్పించే తెలుగు మాటలను బట్టి తెలుగు భాష ఆనాటికే వాడుకలో ఉన్నట్టు చెప్పవచ్చు. అప్పుడు ప్రాకృత సంస్కృతాలు పాలనా భాషలనీ, లేదా విద్యావంతుల భాషలనీ భావించవచ్చు. గాధాసప్తశతిలోని ఛందస్సు మన కంద పద్యానికి దగ్గరగా ఉంది. అప్పటికే లిపి బద్ధంకాని, పదగేయరూప కవిత్వం ఉన్నట్లు సాహిత్యాధారాలున్నాయి. బౌద్ధ జైన హిందూ మతాల ప్రాబల్యం మత వ్యవస్థ, వర్ణవ్యవస్థ శ్రేణిలో పురోహిత వర్గాలకున్న ప్రాధాన్యం మనం గమనిస్తే తెలుగు భాషా సాహిత్య సంస్కృతుల మీద ఇండో ఆర్య భాషా సాహిత్య సంస్కృతుల ప్రభావం నెమ్మదిగా పాదుకొంటున్నదని చెప్పవచ్చు. తెలుగు వాడకం తర్వాత దశలో పరిపాలనలో ప్రవేశించటానికి ప్రాకృతాలూ, వాటిని పోషించిన బౌద్ధ జైనాలూ పరోక్షంగా దోహదం చేసి ఉంటాయి.

## చదవదగిన పుస్తకాలు

ఆయా విభాగాల కింద ఇచ్చిన వాటిని చదవండి.

## మాదిరి పరీక్షా ప్రశ్నలు

I. కింది ప్రశ్నకు 30 వాక్యాల్లో జవాబు రాయండి.

1. తెలుగు భాషా సాహిత్య సంస్కృతుల చరిత్రలోని ప్రధాన పరిణామాలను స్థూలంగా తెల్పండి.

II. కింది ప్రశ్నకు 10 వాక్యాల్లో జవాబు రాయండి.

1. ఆధునిక దశకు సంబంధించిన భాషాసాహిత్య సంస్కృతీ పరిణామాలను క్రోడీకరించండి.

BRAOU

BRAOU

# ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విశ్వవిద్యాలయం

బి.ఏ./బి.ఎస్.సి./బి.కాం మూడవ సంవత్సరం

## తెలుగు కోర్సు – 3 తెలుగు భాషా సాహిత్య సంస్కృతుల చరిత్ర

### నమూనా అభ్యాసాలు

### అభ్యాసం – 1

సూచనలు :

1. విద్యార్థులు పాఠ్యపుస్తకాలనుంచి యథాతథంగా జవాబులు రాయటం వల్ల సొంతంగా ఆలోచించి రాసే శక్తి దెబ్బ తింటుంది. యథాతథంగా రాయకండి.
2. స్వంత వాక్యాలలోనే జవాబులు రాయాలి.
3. ఉల్లేఖనాలు సవివరంగా సూచించాలి.
4. అభ్యాసం రాయడానికి అరఠావు కాగితాలు ఉపయోగించాలి.
5. తగినంత మార్జిన్ పరీక్షకుల సూచనల నిమిత్తం కేటాయించాలి.
6. ఈ అభ్యాసం పూర్తి చేయడానికి ఒక గంట ఉపయోగించుకోవాలి.
7. అన్ని ప్రశ్నలకు జవాబులు రాయాలి.

BRAOU

### ప్రథమ విభాగం

1. ఈ కింది ప్రశ్నలకు 30 పంక్తులలో జవాబులు రాయండి.

    1. భాష, చరిత్ర సంస్కృతి వీటిని నిర్వచించి, నిర్వచనాలను విశదీకరించండి.
    2. ఆంధ్రం, తెనుగు, తెలుగు పదాల చరిత్రను రాయండి.

### ద్వితీయ విభాగం

2. ఈ కింది ప్రశ్నకు 15 పంక్తులలో జవాబు రాయండి.

    1. సంస్కృతికి నాగరికతకు గల తేడా ఏమిటి?

BRAOU

# ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విశ్వవిద్యాలయం

బి.ఏ./బి.ఎస్.సి./బి.కాం మూడవ సంవత్సరం

## తెలుగు కోర్సు – 3 తెలుగు భాషా సాహిత్య సంస్కృతుల చరిత్ర

### నమూనా అభ్యాసాలు

### అభ్యాసం – 2

**సూచనలు :**

1. విద్యార్థులు పాఠ్యపుస్తకాలనుంచి యథాతథంగా జవాబులు రాయటం వల్ల సొంతంగా ఆలోచించి రాసే శక్తి దెబ్బ తింటుంది. యథాతథంగా రాయకండి.
2. స్వంత వాక్యాలలోనే జవాబులు రాయాలి.
3. ఉల్లేఖనాలు సవివరంగా సూచించాలి.
4. అభ్యాసం రాయడానికి అరఠావు కాగితాలు ఉపయోగించాలి.
5. తగినంత మార్జిన్ పరీక్షకుల సూచనల నిమిత్తం కేటాయించాలి.
6. ఈ అభ్యాసం పూర్తి చేయడానికి ఒక గంట ఉపయోగించుకోవాలి.
7. అన్ని ప్రశ్నలకు జవాబులు రాయాలి.

BRAOU

### ప్రథమ విభాగం

1. ఈ కింది ప్రశ్నలకు 30 పంక్తులలో జవాబులు రాయండి.

   1. వ్యావహారిక గ్రాంథిక భాషావాదాలను తెల్పండి.
   2. భాషను నవీకరించే పద్ధతులను విశదీకరించండి.

### ద్వితీయ విభాగం

2. ఈ కింది ప్రశ్నకు 15 పంక్తులలో జవాబు రాయండి.

   1. సంస్కృతంపై ద్రావిడ భాషల ప్రభావం తెల్పండి.

BRAOU

# ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విశ్వవిద్యాలయం

బి.ఏ./బి.ఎస్.సి./బి.కాం మూడవ సంవత్సరం

## తెలుగు కోర్సు – 3 తెలుగు భాషా సాహిత్య సంస్కృతుల చరిత్ర

### నమూనా అభ్యాసాలు

### అభ్యాసం – 3

సూచనలు :

1. విద్యార్థులు పాఠ్యపుస్తకాలనుంచి యథాతథంగా జవాబులు రాయటం వల్ల సొంతంగా ఆలోచించి రాసే శక్తి దెబ్బ తింటుంది. యథాతథంగా రాయకండి.
2. స్వంత వాక్యాలలోనే జవాబులు రాయాలి.
3. ఉల్లేఖనాలు సవివరంగా సూచించాలి.
4. అభ్యాసం రాయడానికి అరఠావు కాగితాలు ఉపయోగించాలి.
5. తగినంత మార్జిన్ పరీక్షకుల సూచనల నిమిత్తం కేటాయించాలి.
6. ఈ అభ్యాసం పూర్తి చేయడానికి ఒక గంట ఉపయోగించుకోవాలి.
7. అన్ని ప్రశ్నలకు జవాబులు రాయాలి.

BRAOU

### ప్రథమ విభాగం

1. ఈ కింది ప్రశ్నలకు 30 పంక్తులలో జవాబులు రాయండి.

    1. క్రీ.శ. 1000–క్రీ.శ. 1600 మధ్యకాలంలోని సాహిత్యాన్ని గురించి సంగ్రహంగా రాయండి.
    2. క్రీ.శ. 1000–క్రీ.శ. 1600 మధ్యకాలంలోని సంస్కృతిని గురించి సంగ్రహంగా రాయండి.

### ద్వితీయ విభాగం

2. ఈ కింది ప్రశ్నకు 15 పంక్తులలో జవాబు రాయండి.

    1. అభ్యుదయ కవిత్వాన్ని పరిచయం చేయండి.

BRAOU

# Andhra Pradesh Open University

FACULTY OF ARTS

B.A. B.Com. and B.Sc. III YEAR (3 YEAR DEGREE COURSE) EXAMINATION

**Model Question Paper**

TELUGU

**PART – III**

(Telugu Bhasha Sahitya and Sanskrutha Charithra)

Time 3 Hours — పరీక్ష నమూనా ప్రశ్న పత్రం — Max. Marks : 100
Minl. Marks : 35

## ప్రథమ విభాగం

ఏవైనా నాలుగు ప్రశ్నలకు 30 పంక్తులలో జవాబులు వ్రాయండి.

ప్రతి ప్రశ్నకు 15 మార్కులు. 15 × 4 = 60

1. 'భారతీయ సంస్కృతిలో భిన్నత్వంలో ఏకత్వముంది' వివరించండి.
2. 'ఆంధ్ర, తెనుగు, తెలుగు శబ్దాలను దృష్టాంతాలలో వివరించండి.
3. భారతీయ సంస్కృతిలోని సంకీర్ణ లక్షణాలు ఆ సంస్కృతిని సుసంపన్నం చేస్తున్నాయా? బలహీన పరుస్తున్నాయా చర్చించండి.
4. క్రీ.పూ. 200 – క్రీ.శ. 600 మధ్య కాలంలో జనవ్యవహారంలో తెలుగులో పాటలు పదాలు ఉండే వనటానికి ఆధారాలు ఏవి?
5. మధ్యయుగం మలిదశలోని నిరసన కవులను గురించి రాయండి.
6. క్రీ.శ. 1000–క్రీ.శ. 1600 మధ్యకాలంలోని మార్గ, దేశి పద్ధతులకు చెందిన కవితా శాఖలను సంగ్రహంగా పరిచయం చేయండి.
7. ఆంధ్రదేశం, ఆంగ్లేయుల పాలనకు లోనైనప్పటినుండి, ఆంధ్రప్రదేశ్ అవతరణ వరకు కలిగిన మార్పులు రాసి, 1956లో ఆంధ్రప్రదేశ్ అవతరణ జరిగిన తీరును గూర్చి చర్చించండి.
8. తెలుగుభాషా సాహిత్య సంస్కృతుల చరిత్రలోని ప్రధాన పరిణామాలను తెల్పండి.

BRAOU

## ద్వితీయ విభాగం

ఏవైనా ఐదు ప్రశ్నలకు 15 పంక్తుల్లో జవాబులు రాయండి.

ప్రతి ప్రశ్నకు 8 మార్కులు. $8 \times 5 = 40$

1. ద్రావిడ భాషలను పేర్కొనండి.
2. స్థానిక చరిత్రలను గురించి వివరించండి.
3. ప్రాఙ్నన్నయ యుగం భాషా విశేషాలేవి?
4. ఆర్య భాషలను పేర్కొనండి.
5. శాసనాలు ఏ విధంగా భాషా చరిత్రకు తోడ్పడతాయి?
6. సంస్కృతికి నాగరకతకు గల తేడా ఏమిటి?
7. చరిత్ర ప్రయోజనం ఏమిటి?
8. మధ్యయుగం మలిదశలోని మతంపై వ్యాఖ్యానించండి.
9. భావ కవిత్వ లక్షణాలేవి?
10. భాషను నవీకరించటమంటే ఏమిటో తెల్పండి.

BRAOU

BRAOU

BRAOU